Sri. A.S.N.M GOVERNMENT COLLEGE (A)

(NAAC Re-accredited With 'B+' Grade at 2.67 CGPA)

(Affiliated to Adikavi Nannaya University, Rajamahendravaram)

Palakol, West Godavari District – 534 260. Andhra Pradesh.

Referred Journal &
Peer Reviewed Journals

Vol : 23 | Spl. Issue | March 2026 | BHAVAVEENA |
ISSN No. 2456-4702 | RNI No. APTEL/2003/12253

భావవీణ ప్రత్యేక సంచిక

Journal of Arts, Literary,
Culture & Language Study

జాతీయ సదస్సు

24 మార్చి 2026

తెలుగు సాహిత్యం - మహిళా చైతన్యం

కన్వీనర్

డా॥. బూసి వెంకటస్వామి

M.A. (Tel)., M.A (San)., M.A (Ling)., PhD.

శాఖాధిపతి, తెలుగు విభాగం

ప్రెసిడెంట్

డా॥. టి. రాజరాజేశ్వరి

M.Sc.,M.Phil.,PhD.,

ప్రిన్సిపాల్

మాతెలుగు తల్లికి మల్లెపూదండ - మాకన్న తల్లికి మంగళారతులు

భావవీణ

(కళలు - సాహిత్య - సాంస్కృతిక భాషాధ్యయన పత్రిక)

Reffered Journal & Peer Reviewed Journals | ISSN No. : 2456-4702 | RNI No. : APTEL/2003/12253

135-14-716, Dwaraka Nagar, 12th Lane, Nagaralu, Guntur - 522 034.
Mail : bhavaveena2024@gmail.com
Cell : 99499 29674, 79890 88274.

BHAVAVEENA
(SPECIAL MAGAZINE)
Journal - Arts, Literature, Culture and Language Study

Reffered Journal & Peer Reviewed Journals
ISSN No. : 2456-4702
RNI No. : APTEL/2003/12253

ముద్రణ	:	**మార్చి - 2026**
ప్రతులు	:	**500**
వెల	:	**రూ. 15/-**
కాపీలకు	:	**డి. నెం. 135-14-716, 12వ లైన్, ద్వారకా నగర్, నగరాలు, గుంటూరు - 034.**
గమనిక	:	**ఈ సంచికలోని వ్యాసకర్తల అభిప్రాయములతో సంపాదక వర్గమునకు సంబంధం లేదు - సంపాదకవర్గం.**
ఎడిటోరియల్ చిరునామా	:	**డి. నెం. 135-14-716, 12వ లైన్, ద్వారకా నగర్, నగరాలు, గుంటూరు - 034.**
డి.టి.పి & ప్రింటింగ్	:	**తెనాలి ప్రకాష్, జి.యల్.ఎస్. గ్రాఫిక్స్ గుంటూరు జిల్లా, సెల్ : 94 94 660 509.**

మాతెలుగు తల్లికి మల్లెపూదండ - మాకన్న తల్లికి మంగళారతులు

BHAVA VEENA (భావ వీణ)

Journal of Arts, Literary, Culture & Language Study

(కళలు - సాహిత్య-సాంస్కృతిక భాషాధ్యయన పత్రిక)

Founder :
Kolla Sri Krishnarao (Late)

E-mail :
bhavaveena2024@gmail.com

7989781963
9949929674
☎ 7989088274

135-14-716, Dwaraka Nagar,
12th Lane, Nagaralu, Guntur - 522034.

Vol. 23 - Spl. Issue. 03 - March 2026 - Reffered Journal & Peer Reviewed Journals - Rs. : 15/-
| ISSN No. : 2456-4702 | RNI No. : APTEL/2003/12253 |

EDITORIAL BOARD

Honourable Editor
Dr. PITTA SANTHI
M.A.(Tel), M.Sc(Psy).,M.Ed.,M.Phil(Edu),Ph.D.

Chief Editor
Dr. PAYARDA NAGAIAH
M.A.(Tel), M.A(Pol-Sci).,M.Ed.,Ph.D.
135-14-716, Dwaraka Nagar, 12th Lane, Nagaralu, Guntur - 522034.

ADVISORY COMMITTEE

1. **Prof. K. Madhu Jyothi,** M.A., PhD.
Former Vice Chancellor,
Dravidian University, Kuppam, A.P.

2. **Prof. G. Yohan Babu,** (Rtd.) M.A., PhD.
Dept. of Telugu,
Andhra University, Visakhapatnam.

3. **Prof. C. Srirama Chandra Murthy,** M.A., PhD.
Dept. of Telugu, Faculty of Arts,
Benaras Hindu University, Varanasi, Utter Pradesh.

4. **Prof. Darla Venkateswara Rao,** M.A., M.Phil., PhD.
Dept. of Telugu, Faculty of Arts,
Hyderabad Central University, Hydetabad, Telangana.

5. **Dr. Thottempudi Sree Ganesh,** M.A., M.Phil (Computational Linguistics) (Ph.D)
Research Scientist, Centre for Applied Linguistics and Transalation Studies, Universityof Heidelberg, Germany.

6. **Dr. Busi Venkataswamy,** M.A. (Tel)., M.A (San)., M.A (Ling)., PhD.
HOD, Dept. of Telugu
Sri A.S.N.M. Govt. Degree College,
Palakollu, West Godavari Dist., A.P.

7. **Prof. T. Rama Prasad Reddy**
Dean, Faculty of Arts & Education,
Yogi Vemana University, Kadapa, Andhra Pradesh.

8. **Dr. T. Swarupa Rani,** M.Sc., M.Ed., M. Phil., Ph.D.
Principal,
St.Joseph's College of Education for Women,
Sambasivapet, Guntur, Andhra Pradesh.

ASSOCIATE EDITORS

1. **Prof. N. R. SADASIVA REDDY**, M.A.,M.Phil,PhD.
Asst. Professor,
Dept. of Telugu & Comparative Literature,
Sri Krishna Deva Raya University,
Ananthapuram, Andhra Pradesh.

2. **Prof. V.SANKARA RAO**, M.A.,M.A.,M.Phil,PhD.
HOD, Dept. of Telugu,
Madras University,
CHENNAI,
Tamilnadu.

3. **Dr. D. SESHU BABU**, M.A.,M.Phil,PhD.
Associate Professor, Dept.of Hindi,
Moulana Azad National Urdu University,
HYDERABAD, Telangana.

4. **Dr. K. Lavanya,** M.A., M.Phil., PhD.
Board of Studies Chairman,
Telangana University, Dichpally,
Nizamabad, Telangana.

5. Prof. **N.V. KRISHNA RAO,** M.A.,M.Phil,PhD.
Dept. of Telugu & O.L.,
Acharya Nagarjuna University,
Nagarjuna Nagar, Guntur District.

6. **Dr. CHINTHAM PRAVEEN KUMAR**
HOD, Dept of Telugu
University Arts & Science College (UASC),
Kakatiya University Subedari - 506001
Hanumakonda,Warangal, Telangna.

7. **Prof. J. VENKATA RAMANA,** M.A.,M.Phil,PhD.
Dept.of Modern Indian Languages,
Madhurai Kamaraj University, Madhurai,
Tamilnadu.

8. **Prof. N. Eswar Reddy,** M.A., PhD.
Dept. of Telugu,
Yogi Vemana University, Kadapa.

9. **Prof. P.R. Harinadh,** M.A., M.Ed., M.Phil,PhD.
Dept. of Telugu,
Regional Institute of Education (NCRT)
Manasa Gangothri, Mysore, Karnataka.

10. **Dr. B. Tirupathi,** M.A., PhD.
Associate Professor, Dept. of Telugu,
University of Hyderabad, Gachibowli - 46,
Hyderabad, Telangana.

11. **Dr. P. VIJAYA KUMAR**, M.A.,M.Phil,PhD.
Associate Professor, Dept. of Telugu
Central University, Gachibowli, Hyderabad,
Telangana.

12. **Dr. Mark Poloneyes,** M.A., M.Phil., PhD.
Associate Professor, Dept. of Telugu
P.G. Centre, Gadwal,
Palamuru University,
Mahabobnagar, Telangana.

LEGAL ADVISER

Pitta Sundara Babu, ***M.A., B.L.,***
Advocate, Narasapur.

DTP & PRINTING

TENALI PRAKASH, G.L.S. GRAPHICS, Guntur - 2. Cell : 94 94 660 509.

గమనిక : రచయితల అభిప్రాయములతో సంపాదక వర్గమునకు సంబంధం లేదు - **ఎడిటర్.**

Edited, Printed and Published by Dr. Pitta Santhi, Rohini Towers, 2/11 Brodipet, Guntur - 522 002,
Andhra Pradesh. Cell : 7386529274, 7989781963, E-mail : parisodhanatelugu@gmail.com.
Printed at : GLS Enterprises, Guntur - 522 002. Ph. 94 94 660 509.

శ్రీ అద్దేపల్లి సత్యనారాయణ మూర్తి ప్రభుత్వ కళాశాల

(స్వయం ప్రతిపత్తి) NAAC 'B+'

పాలకొల్లు - పశ్చిమ గోదావరి జిల్లా - ఆంధ్ర ప్రదేశ్.

తెలుగు సాహిత్యం - మహిళా చైతన్యం

జాతీయ సదస్సు

తేది : 24 మార్చి 2026

నిర్వహణ :

తెలుగు విభాగం

శ్రీ ఎ.ఎస్.ఎన్.యం ప్రభుత్వ కళాశాల

పాలకొల్లు, పశ్చిమగోదావరి జిల్లా, ఆంధ్రప్రదేశ్.

తెలుగు సాహిత్యం - మహిళా చైతన్యం

జాతీయ సదస్సు

సంపాదకవర్గం

ప్రధాన సంపాదకులు

డా॥. తిరువీధుల రాజరాజేశ్వరి

ప్రిన్సిపాల్ & సదస్సు అధ్యక్షులు

సంపాదకులు

డా॥. బూసి వెంకటస్వామి

శాఖాధిపతి, తెలుగు విభాగం & సదస్సు కన్వీనర్

సంపాదక మండలి

శ్రీ టి. కృష్ణ

వైస్ ప్రిన్సిపాల్ & సదస్సు ఆర్గనైజింగ్ సెక్రటరీ.

డా॥. యం. రామకృష్ణ

శాఖాధిపతి, జువాలజీ & సదస్సు కో-కన్వీనర్

శ్రీ కె. భద్రాచలం

శాఖాధిపతి, కంప్యూటర్ సైన్స్ విభాగం & ఐ.క్యూ. ఎ.సి. కో-ఆర్డినేటర్

శ్రీమతి వి. యామిని

శాఖాధిపతి, రసాయశాస్త్ర విభాగం & అకాడమిక్ కో-ఆర్డినేటర్

డా॥. సిహెచ్. ఉషారాణి

శాఖాధిపతి, అర్థశాస్త్ర విభాగం & స్టూడెంట్ కౌన్సిల్ కో-ఆర్డినేటర్

డా॥. డి.వి.వి. విజయలక్ష్మి

అర్థశాస్త్ర అధ్యాపకులు

శ్రీ జి.డి. శ్రీనివాసరావు

ఆంగ్ల విభాగ అధ్యాపకులు

శ్రీ ఎ. వంశీ సుబ్బరాయన్

రసాయనశాస్త్ర అధ్యాపకులు

డా॥. కె. నారాయణ భరత్ గుప్తా ఐ.ఎ.ఎస్.
కమీషనర్,
కళాశాల విద్య, మంగళగిరి.

APCCE కమిషనర్ గారి సందేశం

శ్రీ అద్దేపల్లి సత్యనారాయణమూర్తి ప్రభుత్వ కళాశాల (స్వయం ప్రతిపత్తి), పాలకొల్లు, పశ్చిమగోదావరి జిల్లా తెలుగు విభాగం ఆధ్వర్యంలో 2026 మార్చి 24న నిర్వహించ బడుతున "తెలుగు సాహిత్యం - మహిళా చైతన్యం" అనే అంశంపై ఒక రోజు జాతీయ సదస్సుకు హృదయపూర్వక అభినందనలు తెలియజేస్తున్నాను.

తెలుగు సాహిత్యం మన సంస్కృతి, సంప్రదాయాలు మరియు సమాజపు ఆలోచనలను ప్రతిబింబించే గొప్ప సాధనం. ముఖ్యంగా మహిళా చైతన్యం అనే అంశం సాహిత్యంలో ఎంతో ప్రాధాన్యత కలిగినది. ఆధునిక కాలంలో మహిళల ఆలోచనలు, స్వాతంత్ర్యం, సమానత్వం వంటి అంశాలు సాహిత్యంలో విశేషంగా ప్రతి ఫలిస్తున్నాయి.

ఇలాంటి జాతీయ సదస్సులు అధ్యాపకులు, పరిశోధకులు, విద్యార్థులకు సాహిత్యంలోని కొత్త దృక్కోణాలను తెలుసుకునే అవకాశాన్ని కల్పిస్తాయి. ఈ సదస్సు ద్వారా మహిళా చైతన్యంపై విలువైన చర్చలు జరిగి సమాజానికి ఉపయోగపడే ఆలోచనలు వెలువడతాయని ఆశిస్తున్నాను.

ఈ కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహిస్తున్న కళాశాల యాజమాన్యానికి, తెలుగు విభాగానికి మరియు నిర్వాహకులకు అభినందనలు తెలియజేస్తూ, సదస్సు ఘన విజయాన్ని సాధించాలని ఆకాంక్షిస్తున్నాను.

డా॥. చప్పిడి కృష్ణ
జాయింట్ డైరెక్టర్,
కళాశాల విద్య, మంగళగిరి.

జాయింట్ డైరెక్టర్ గారి సందేశం

శ్రీ అద్దేపల్లి సత్యనారాయణమూర్తి ప్రభుత్వ కళాశాల (స్వయం ప్రతిపత్తి), పాలకొల్లు లోని తెలుగు విభాగం ఆధ్వర్యంలో నిర్వహించబడుతున్న "తెలుగు సాహిత్యం - మహిళా చైతన్యం" అనే అంశంపై జాతీయ సదస్సు నిర్వహణ అభినందనీయం.

తెలుగు సాహిత్యం కాలానుగుణంగా సమాజంలో మార్పులను ప్రతిబింబిస్తూ వస్తోంది. ముఖ్యంగా మహిళా చైతన్యం, మహిళల హక్కులు, సమానత్వం మరియు వారి పాత్రలను సాహిత్యం ద్వారా విశ్లేషించడం అత్యంత అవసరం. ఈ సదస్సు ద్వారా పరిశోధకులు, అధ్యాపకులు మరియు విద్యార్థులు సాహిత్యంలోని మహిళా దృక్కోణాలను విశదంగా చర్చించే అవకాశం పొందుతారు.

ఇలాంటి శాస్త్రీయ వేదికలు విద్యార్థుల్లో సాహిత్య పట్ల ఆసక్తిని పెంపొందించడమే కాకుండా సమాజంలో సానుకూల మార్పులకు దోహదపడతాయి. తెలుగు సాహిత్యం భారతీయ సంస్కృతి, సంప్రదాయాలు, సామాజిక విలువలను ప్రతిబింబించే గొప్ప సాహిత్య సంపదగా నిలిచింది. కాలక్రమేణా సమాజంలో జరిగిన మార్పులు సాహిత్యంలో ప్రతిఫలిస్తూ వచ్చాయి. ముఖ్యంగా మహిళల స్థానం, వారి భావాలు, ఆలోచనలు, హక్కులు మరియు సమానత్వం వంటి అంశాలు తెలుగు సాహిత్యంలో విస్తృతంగా చర్చించబడుతున్నాయి.ప్రాచీన కాలం నుండి ఆధునిక కాలం వరకు మహిళలు సాహిత్యంలో వివిధ రూపాలలో ప్రతిబింబించారు. కొన్నిసార్లు వారు త్యాగానికి ప్రతీకలుగా కనిపిస్తే, మరికొన్ని సందర్భాల్లో సమాన హక్కుల కోసం పోరాడే శక్తిగా దర్శనమిచ్చారు. ఆధునిక తెలుగు సాహిత్యంలో మహిళా రచయితలు తమ అనుభవాలు, సమస్యలు మరియు ఆలోచనలను సాహిత్య రూపంలో వ్యక్తపరచడం ద్వారా మహిళా చైతన్యాన్ని బలపరిచారు.

ఈ నేపథ్యంలో "తెలుగు సాహిత్యం - మహిళా చైతన్యం" అనే అంశంపై జాతీయ సదస్సు నిర్వహించడం ద్వారా సాహిత్యంలో మహిళల ప్రతినిధ్యం, వారి చైతన్యం, సామాజిక అవగాహన మరియు సమానత్వ భావనలపై చర్చించడానికి ఒక వేదికను అందించడం ప్రధాన ఉద్దేశ్యం.ఈ సదస్సు ద్వారా అధ్యాపకులు, పరిశోధకులు మరియు విద్యార్థులు తెలుగు సాహిత్యంలో మహిళల పాత్రను విశ్లేషిస్తూ కొత్త పరిశోధనా దిశలను అన్వేషించే అవకాశం పొందుతారు.

డా॥. పి.వి. కృష్ణాజీ
రీజనల్ డైరెక్టర్, జోన్-II, కళాశాల విద్య,
రాజమహేంద్రవరం.

RJDCE జోన్-II గారి సందేశం

శ్రీ అద్దేపల్లి సత్యనారాయణమూర్తి ప్రభుత్వ కళాశాల (స్వయం ప్రతిపత్తి), పాలకొల్లు తెలుగు విభాగం ఆధ్వర్యంలో 2026 మార్చి 24న నిర్వహించబడుతున్న "తెలుగు సాహిత్యం మహిళా చైతన్యం" అనే అంశంపై జాతీయ సదస్సు నిర్వహించడం అభినందనీయం.

తెలుగు సాహిత్యంలో మహిళల పాత్ర, వారి భావాలు, ఆలోచనలు మరియు సామాజిక చైతన్యం విశేషంగా ప్రతిఫలించాయి. ప్రాచీన సాహిత్యం నుండి ఆధునిక సాహిత్యం వరకు మహిళా స్వరాలు సమాజంలో మార్పుకు దారి చూపాయి. ఈ నేపథ్యంలో మహిళా చైతన్యాన్ని సాహిత్యపరంగా విశ్లేషించడం చాలా ప్రాముఖ్యమైన విషయం.

ఈ జాతీయ సదస్సు ద్వారా వివిధ విశ్వవిద్యాలయాల నుండి వచ్చిన అధ్యాపకులు, పరిశోధకులు మరియు విద్యార్థులు తమ పరిశోధనా పత్రాలను సమర్పించి సాహిత్య చర్చలను మరింత సమృద్ధిగా చేయగలరని నమ్ముతున్నాను.

ఈ కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహిస్తున్న కళాశాల ప్రిన్సిపాల్ గారికి, తెలుగు విభాగ అధ్యాపకులకు మరియు నిర్వాహకులకు నా అభినందనలు తెలియజేస్తూ సదస్సు ఘన విజయాన్ని సాధించాలని కోరుకుంటున్నాను.

UNIVERSITY OF MADRAS

Re-accrediated at the "A" Grade Level by NAAC and Conferred with the "University with Potential for Excellence" status by UGC

CHENNAI

ఆచార్య విస్తాలి శంకరరావు
తెలుగు శాఖాధ్యక్షులు

ముందుమాట

సాహిత్యం సమాజానికి ప్రతిబింబంలాంటిది. కాబట్టి భూత, భవిష్యత్తు, వర్తమాన కాలాల తీరుతెన్నులను తెలుసుకోవాలంటే ఆయా కాలపు సాహిత్యాలను పరిశీలించాల్సి ఉంటుంది. ఈ సాహిత్య అధ్యయనం వలన ఆనాటి ప్రజల స్థితిగతులు అవగతం అవుతాయి. నాటి నుండి నేటి వరకు సామాజిక జీవితంలో స్త్రీల పట్ల ఈ సమాజం వ్యవహరించిన తీరు చర్చనీయాంశంగానే ఉంది. అంటే స్త్రీ సమస్యలు ఇంకా పరిష్కారం కాలేదనే అర్థం. ఆమె సమస్యలను పరిష్కరించాలంటే ఆమెకు జరిగిన అన్యాయాలను సమీక్షించుకోవాల్సిన ఎంతైనా ఉంది. దానిలోని భాగమే ఈ జాతీయ సదస్సు నిర్మాణం.

పాలకొల్లులోని శ్రీ. ఎ.ఎస్.ఎన్.ఎమ్. ప్రభుత్వ కళాశాల తెలుగు విభాగం వారు "తెలుగు సాహిత్యంలో మహిళా చైతన్యం" అనే అంశం మీద సదస్సు నిర్వహించడం ఎంతో సమంజసం. సమర్థనీయం. ఈ సదస్సులో ఎన్నో మహిళా చైతన్యానికి సంబంధించిన ఎన్నో విలువైన పరిశోధనా వ్యాసాలు వచ్చాయి. అవి ఈ సదస్సుకు ఎంతో బలాన్ని చేకూర్చాయి. ఆ వ్యాసాలన్నీ ఒక పుస్తక రూపంలో వెలువరించడం కూడా సాహసం, ఖర్చుతో కూడుకున్న పని. సాధారణంగా సదస్సులు అందరూ నిర్వహిస్తారు కానీ, ఆ సదస్సుకు వచ్చిన పరిశోధనా వ్యాసాలను ప్రత్యేక సంచికగా వెలువరించడం అనేది అసాధ్యంగా ఉంటుంది. అలాంటి గొప్ప పనిని ఈ కళాశాల తెలుగు విభాగం వారు సమర్థవంతంగా నిర్వహించడం అనేది కళాశాలకే గర్వ కారణం.

అందుకు ప్రధాన కారకులు ఈ సదస్సు కన్వినర్ డా. బూసి వెంకటస్వామి గారైతే, వారికి అండదండలుగా నిలిచిన వారు కళాశాల ప్రిన్సిపాల్ డా తిరువీధుల రాజరాజేశ్వరి గారు మరియు ఇతర కార్య నిర్వాహక వర్గం వారు అందరికీ హృదయపూర్వక అభినందనలు. ఈ సదస్సులో ఎందరో పరిశోధక మేధావులు పాల్గొనడం విశిష్టం.

ఇలాంటి విలక్షణమైన సదస్సులను మరెన్నో నిర్వహించి సామాజిక చైతన్యానికి సాహిత్యం ఒక బలమైన సాధనమని, దాని ప్రయోజనాలు పలువురు తెలుసుకునే విధంగా నిర్వహించాలని, అది పలువురికీ ఆదర్శంగా ఉండాలని కోరుకుంటూ తెలుగు విభాగం వారికి ముఖ్యంగా డా. బూసి వెంకటస్వామి గారికి ఇతర సభ్యులకు శుభాకాంక్షలు తెలియజేస్తూ...

డా॥. తిరువీధుల రాజరాజేశ్వరి
ప్రిన్సిపాల్

ధన్యవాదాలు

తెలుగు సాహిత్యం అనేది మన సంస్కృతి, సంప్రదాయాలు, భావోద్వేగాలు మరియు సామాజిక మార్పుల ప్రతిబింబం. ఆ సాహిత్యంలో మహిళా చైతన్యం ఒక శక్తివంతమైన ప్రవాహంగా రూపుదిద్దుకుంది.

మొల్ల వంటి తొలి మహిళా కవయిత్రులు తమ ప్రతిభతో సాహిత్యరంగంలో ప్రత్యేక స్థానాన్ని సంపాదించుకున్నారు. అనంతరం భండారు అచ్చమాంబ వంటి మహనీయులు మహిళా విద్య, స్వాతంత్ర్యం, సమానత్వం వంటి అంశాలను తమ రచనల ద్వారా బలంగా ప్రతిపాదించారు. అలాగే వోల్గా వంటి ఆధునిక రచయిత్రులు మహిళా ఆత్మగౌరవం, స్వీయ అవగాహన, వ్యక్తిత్వ వికాసం వంటి విషయాలను సాహిత్యంలో ప్రతిబింబింపజేశారు.

మహిళా చైతన్యం అనేది కేవలం హక్కుల సాధన మాత్రమే కాదు; అది ఆత్మవిశ్వాసం, స్వయం నిర్ణయం, సమాజంలో సమాన స్థానం సాధించడం. తెలుగు కథలు, కవిత్వం, నవలలు, నాటకాలు - ఇవన్నీ మహిళల జీవన అనుభవాలను, వారి పోరాటాలను, ఆశయాలను మన ముందుకు తీసుకొచ్చాయి.

ఈ సెమినార్ ద్వారా మనం మహిళా చైతన్యాన్ని సాహిత్య దృష్టితో విశ్లేషించి, భవిష్యత్తులో సమానత్వ సమాజ నిర్మాణానికి దోహదపడే మార్గాలను చర్చిద్దాం. విద్యార్థులు పరిశోధనాత్మక దృక్పథంతో ఈ అంశాన్ని ఆలోచించి, సమాజ మార్పుకు తమ వంతు పాత్ర పోషించాలి.

చివరిగా, ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేసిన నిర్వాహకులకు అభినందనలు తెలియజేస్తూ, ఈ సెమినార్ చర్చలు మన అందరికీ ప్రేరణగా నిలవాలని ఆకాంక్షిస్తున్నాను.

డా॥. బూసి వెంకటస్వామి
శాఖాధిపతి & సదస్సు కన్వీనర్
తెలుగు విభాగం.

సాహిత్యం అక్షరరూపం కాదు, అది ఒక సామాజిక ఆయుధం

తెలుగు సాహిత్యం సామాజిక మార్పులకు శక్తివంతమైన సాధనంగా ఉంటూ వస్తోంది. సమాజంలో సగభాగమైన మహిళల స్థితిగతులను, వారి ఆకాంక్షలను మరియు ఆత్మగౌరవ పోరాటాలను సాహిత్యం నిరంతరం ప్రతిబింబిస్తూనే ఉంది. ఈ నేపథ్యంలో, మహిళా చైతన్యం తెలుగు సాహిత్యంలో ఎలా పరిణామం చెందిందో చర్చించేందుకు మా తెలుగు విభాగం ఆధ్వర్యంలో "తెలుగు సాహిత్యం - మహిళా చైతన్యం" అనే అంశంపై ఈ జాతీయ సదస్సును నిర్వహించడం మాకు ఎంతో గర్వకారణం.

తొలి దశలో తాళ్ళపాక తిమ్మక్క, మొల్ల వంటి కవయిత్రులు తమభక్తిరచనల ద్వారా పరోక్షంగా చైతన్యాన్ని ప్రదర్శించారు. దక్షిణాంధ్రయుగంలో రంగాజమ్మ, ముద్దుపళని వంటివారు స్త్రీ సహజాతాలను ధైర్యంగా ప్రకటించి సాహిత్యంలో నూతన ఒరవడిని సృష్టించారు. 19వ శతాబ్దపు సంస్కరణోద్యమ కాలంలో కందుకూరి, గురజాడ వంటి మహానుభావుల ప్రేరణతో మహిళల విద్యావశ్యకత, బాల్యవివాహాల రద్దు వంటి అంశాలపై సాహిత్యం వెలువడింది.

1980ల తర్వాత తెలుగు సాహిత్యంలో 'స్త్రీవాదం' ఒక బలమైన ఉద్యమంగా ఉద్భవించింది. "నీలి మేఘాలు" వంటి కవితా సంకలనాలు మహిళా అస్తిత్వాన్నిచాటి చెప్పాయి. అబలలు సబలలుగా మారే క్రమంలో ఎదురైన సామాజిక, ఆర్థిక ఇబ్బందులను ఓల్గా, పి. సత్యవతి వంటి రచయిత్రులు తమ కథలు, నవలల ద్వారా సమాజం ముందుంచారు. కేవలం పట్టణ మహిళల సమస్యలే కాకుండా, గ్రామీణ మరియు అణగారిన వర్గాల మహిళల గొంతుక కూడా ఈ సాహిత్యంలో ప్రతిబింబించింది.

దళిత మరియు ముస్లిం మైనారిటీ మహిళల సాహిత్యంపై ప్రత్యేకచర్చ జరిగింది. కులం మరియు మతం అనే రెండుపొరల మధ్య నలిగిపోతున్న మహిళల వేదనను, వారి ధిక్కారస్వరాన్ని జూపాక సుభద్ర, షాజహానా వంటి వారు ఎలా చిత్రించారో మేధావులు వివరించారు. ఇది మహిళా చైతన్యంలో ఒక కొత్తకోణాన్ని ఆవిష్కరించింది.

మహిళా సాహిత్యాన్ని కేవలం 'స్త్రీల సమస్యలు'గానే చూడకుండా, అది 'మానవీయ సమస్యల' ప్రతిబింబంగా గుర్తించాలి.

ప్రాంతీయ ఉద్యమాల్లో పాల్గొన్న మహిళల వీరగాథలను మరింతగా పరిశోధించి వెలుగులోకి తీసుకురావాలి.

సాంకేతిక యుగంలో డిజిటడిల్ మీడియా ద్వారా మహిళా సాహిత్యాన్ని సామాన్య ప్రజానీకానికి చేరువ చేయాలి

సాహిత్యం అనేది కేవలం అక్షరవిన్యాసం కాదు, అది సామాజిక పునర్నిర్మాణానికి తోడ్పడే ఆయుధం. ఈ జాతీయ సదస్సు ద్వారా ఆచార్యులు, అధ్యాపకులు, ఉపాధ్యాయులు, పరిశోధక విద్యార్థులు, స్నాతకోత్తర విద్యార్థులు, తెలుగు సాహిత్యభాషాభిమానులు, మహిళా రచయిత్రులు తమరచనల ద్వారా సమాజంలోని మూఢనమ్మకాలను, అణచివేతను ప్రశ్నిస్తూనే, సమస మాజస్థాపనకు బాటలు వేస్తారని ఆశిస్తూ..... వివిధ విశ్వవిద్యాలయాల నుండి విచ్చేసిన మేధావులు, పరిశోధకులు తమ పరిశోధనా పత్రాల ద్వారా ఈసదస్సును జ్ఞానభాండాగారంగా మారుస్తారని ఆశిస్తున్నాను.

అదేవిధంగా ప్రారంభ సమావేశంలో సాంకేతిక సహాయంతో కీలకోపన్యాసం ఇచ్చిన హైదరాబాద్ కేంద్రీయ విశ్వవిద్యాలయ తెలుగు శాఖ, పూర్వఅధ్యక్షులు ఆచార్య దార్లవెంకటేశ్వరరావు గారికి, ప్రారంభ సమావేశంలో కీలకోపన్యాసం ఇచ్చిన మద్రాస్ విశ్వవిద్యాలయ తెలుగుశాఖాధిపతి ఆచార్య విస్తాలి శంకరరావు గారికి ప్రత్యేక ధన్యవాదాలు.

వివిధ విశ్వవిద్యాలయాల నుండి, కళాశాలల నుండి విచ్చేసి జాతీయ సదస్సును విజయవంతం చేసిన మిత్రులందరికీ పేరుపేరున కృతజ్ఞతలు

ఈ కార్యక్రమ నిర్వహణలో సహకరించిన కళాశాల ప్రిన్సిపాల్ శ్రీమతి తిరువీధుల రాజరాజేశ్వరి మేడం గారికి, వైస్ ప్రిన్సిపాల్ శ్రీ టి. కృష్ణ గారికి, సహచర అధ్యాపక బృందానికి, అధ్యాపకేతర సిబ్బందికి, కళాశాల యాజమాన్యానికి, విద్యార్థినీ విద్యార్థులకు నా హృదయపూర్వక ధన్యవాదాలు.

Contents (విషయ సూచిక)

1. నిశ్శబ్దం నుండి నినాదం వరకు...తెలుగు సాహిత్యంలో మహిళా చైతన్యం	- ఆచార్య దార్ల వెంకటేశ్వరరావు	1
2. తెలుగు సాహిత్యంలో మహిళా చైతన్యం	- ఆచార్య విస్తాలి శంకరరావు	6
3. స్త్రీవాద కవితోద్యమం - మహిళా చైతన్యం	- డా॥. బూసి వెంకటస్వామి - డా॥. పెండ్యాల లావణ్య	21
4. తెలుగు సాహిత్యం - దళిత కవయిత్రులు	- డా॥. వై. విజయానంద రాజు	28
5. చలం - మ్యూజింగ్స్ - స్త్రీ చైతన్యం	- డా॥. చాట్ల కిషోర్	32
6. అగ్నిశిఖల ఆలాపన : 'గురిచూసి పాడే పాట'లో స్త్రీవాద ధిక్కార స్వరాలు - ఒక సమగ్ర పరిశీలన	- పి. ఉషారాణి	37
7. రాయలసీమ అభ్యుదయ కవిత్వం - నారీ దృక్పథం	- ధర్మకారి అశోక్ బాబు	45
8. బంజారా తొలి చారిత్రక నవల 'పోర్యతార' - హీరిబాయి సాహసాలు	- ఆచార్య అజ్మీరా సిల్మా నాయక్	50
9. పెబ్బిలి హైమావతి కథలు-స్త్రీల అస్తిత్వం-పరిశీలన	- పులి చిన బాబు	55
10. తెలుగు సాహిత్యంలో మహిళా చైతన్యం	- అందె గోపికృష్ణ	59
11. తెలుగు నవల - స్త్రీ చైతన్యం	- బోణం మోహన్ గాంధీ	66
12. కన్యాశుల్కం నాటకం - స్త్రీల పాత్ర చిత్రణ - సామాజిక చైతన్యం	- కంకల మహేశ్వరి	72
13. క్రైస్తవ సాహిత్యం - మహిళా చైతన్యం	- డా. ఆర్. రీగన్	75
14. "తెలుగు నవలల్లో స్త్రీ చైతన్యం - పరిణామక్రమం, సామాజిక దృక్పథం"	- బొడ్డు భరద్వాజ	78
15. అబ్బూరి ఛాయాదేవి కథలు - స్త్రీవాద దృక్పథం	- దాసరి శ్రీలత	88
16. గురజాడ కథానికలు : మహిళా చైతన్యం	- టి. జ్యోతి	95
17. జనగామ జిల్లా విప్లవ కవిత్వంలో స్త్రీ రచయిత్రుల పాత్ర	- అలంశెట్టి పర్శరాములు	98
18. ప్రాచీన సాహిత్యం - విశిష్ట తెలుగు మహిళ - 'మహి' హృదయావిష్కరణం	- కొంపెల్ల బాల సుబ్రహ్మణ్య శర్మ	102

19. తెలంగాణ దళిత కథల్లో మహిళల సామాజిక చైతన్యం	- డా॥. సూరేపల్లి గోదావరి	112
20. అలిశెట్టి కవిత్వం - స్త్రీ చైతన్యం	- డా॥. బి. శ్రీనివాసరావు	118
21. మహాభారతంలో శకుంతలోపాఖ్యానం - స్త్రీ చైతన్యం	- డా॥. పులపర్తి శ్రీనివాసరావు	121
22. అఖండ దీపికలు నవలలో స్త్రీ చైతన్యం	- సంకు శివ	127
23. మాలతీ చందూర్ కథా సాహిత్యం-స్త్రీ వాద దృక్పథం	- చంద్రకళ దీకొండ	132
24. భావకవిత్వంలో స్త్రీకి జరిగిన అన్యాయంపై జయప్రభగారి అభిప్రాయం	- మాడుగుల శ్రీనివాస్	139
25. శ్రీమతి హైమవతీ భీమన్న - పాలేరు నుంచి పద్మశ్రీ వరకు - మహిళా చైతన్యం	- గంటి చంద్రశేఖర్	143
26. కుల, వర్గ వివక్షపై ఇనాక్ గారు ఎక్కుపెట్టిన బల్లెం - రంధి నవలలో సువ్వి	- పి. యామినీ అమ్మాజి	147
27. స్త్రీ వాద కవిత్వం - విశ్లేషణ	- డా॥. డి. లక్ష్మి నరసింహం	151
28. జల కవిత్వం - మహిళలు	- గుంటి రోహిత్ కుమార్	155
29. మాతంగి దివిటి - మహిళా చైతన్య స్ఫూర్తి	- డా॥. వి. పద్మ	162
30. కొండేపూడి నిర్మల కవిత్వంలో స్త్రీ దోపిడీ చిత్రణ : ఒక పరిశీలన	- కామళ్ల శిరీష	167
31. రచయిత్రుల నవలలు - మహిళా చైతన్యం	- డా॥. పాదిలాపు గోపాల నాయుడు	172
32. కె. సుభాషిణి అమూల్య కథలు - మహిళా చైతన్యం : సామాజిక విశ్లేషణ	- కె. వెంకటస్వామి	177
33. నలిమెల భాస్కర్ అద్దంలో గాంధారి అనువాద కథా సంకలనం స్త్రీ చైతన్యం	- కాపర్తి స్వరాజ్యం	185
34. మహాభారతంలోని శకుంతల పాత్ర స్త్రీ చైతన్యానికి ప్రతీక - ఒక పరిశీలన	- డా॥. ఆర్. సంగీత	190
35. ఆధునిక కథా సాహిత్యం - రావిశాస్త్రి రచనల్లో స్త్రీ పాత్రలు	- డా॥. ఆర్. కుసుమ కుమారి	195
36. ప్రసిద్ధ ప్రబంధాలలో స్త్రీ చైతన్యం - జాతి, వార్తా చమత్కారాలు	- వేపాడ మమత - ఆచార్య జర్రా అప్పారావు	198
37. స్త్రీ చైతన్య ప్రస్థానం	- వాడ్రేవు నాగమణి	204

38. విజయ విలాసము - ఉలూచి పాత్ర మహిళా చైతన్యం - ఒక పరిశీలన	- గొడుగులూరి గాయత్రి	208
39. భారత దేశంలో స్త్రీ వాదం - ఒక పరిశీలన	- డా॥. డి. సత్యలత	212
40. క్రైస్తవ సాహిత్యం - బైబిల్ స్త్రీల పాత్రల పరిశీలన	- గంజి కుమార్ రాజా	216
41. మినీ కవిత్వం - మహిళా చైతన్యం	- డా॥. తన్నీరు సురేశ్	220
42. 'నల్ల పొద్దు'లో దళిత బహుజనుల మహిళల అసాధారణ ప్రస్థానం	- ఎర్రోళ్ళ ఆంజనేయులు	223
43. గిరిజన జానపద విజ్ఞానంలో మహిళా చైతన్యం : ఒక సామాజిక - సాంస్కృతిక విమర్శాత్మక అధ్యయనం	- భూక్య గణేష్	232
44. కన్యాశుల్కం నాటకం:మహిళా సమస్యల ప్రతిబింబం	- డా॥. కటికతల రాజమాణిక్యం	238
45. మహాభారతంలో - మహిళా చైతన్యం	- విశాలి పేరి	242
46. స్త్రీ అంతరంగం : అచ్చమాంబ, గురజాడ కథల పరిశీలన	- బండారి శ్రీదేవి	247
47. రామాయణం - మహిళా చైతన్యం	- చాడ శ్రీనివాస్	253
48. ముక్కు తిమ్మన ప్రబంధ నాయిక - సత్యభామ పాత్రౌచిత్యం	- డా॥. లెంక సత్యనారాయణ	256
49. గురజాడ రచనలు - మహిళా చైతన్యం	- కె. సురేష్ బాబు	265
50. ఆధునిక తెలుగు కథానికల్లో మహిళా చైతన్యం	- బి. పద్మ	268
51. ఉమ్మడి నరసింహారెడ్డి "పరిష్కారం" నాటకం - స్త్రీల పాత్రల స్వభావ చిత్రణ	- సింహరాజు సంధ్యారాణి	272
52. మహాభారతంలో మహిళ పాత్రల చైతన్యం	- జి. జయశీల	275
53. బౌద్ధ ధర్మంలో మహిళలు (ధమ్మ పదం)	- డా॥. సముద్రాల ప్రిస్కిల్ల	280
54. చుండూరు సీత నవలలు - మహిళా చైతన్యం	- దేవర రాజు	284
55. శివారెడ్డి కవిత్వంలో స్త్రీ	- డా॥. సుంకర గోపాలయ్య	290
56. మహబూబ్‌నగర్ జిల్లా స్త్రీల జానపద గేయాలు పరిశీలన	- ప్రొఫెసర్. కె.అరుణబాయి	295
57. "క్రైస్తవ మిషనరీలచే మహిళాభ్యుదయం"	- డా॥. మరపట్ల రాజు	302
58. విశ్వనాథ నవలలు - మహిళా చైతన్యం	- డా॥. ఆతుకూరి వేంకటేశ్వర్లు (యోగి)	307
59. కొండేపూడి నిర్మల కవిత్వంలో మహిళా చైతన్యం	- డా॥. గుండ్లూరు వెంకటరమణ	311

60. ఆధునిక సాహిత్యంలో నాటకాల ద్వారా మహిళా చైతన్యం	- ఇమ్మడి శ్రీను	316
61. స్త్రీవాద సాహిత్యం - ప్రముఖ రచయిత్రుల పాత్ర	- ఆర్. రామకృష్ణ	321
62. అపురూప నవలా నాయికలు నేటి తరానికి ప్రతీకలు	- ఆవలకొండ అన్నపూర్ణ	325
63. స్త్రీ చైతన్యం - కాకాని నవల	- మల్లెంబాక ఉదయశ్రీ	329
64. పాకాల యశోదారెడ్డి భారతంలో స్త్రీ గ్రంథ సమీక్ష	- కప్పల అజయ్	334
65. ఆధునిక తెలుగు కవిత్వంలో-స్త్రీవాద ధిక్కార స్వరాలు	- డా॥. తరపట్ల సత్యనారాయణ	340
66. తొలితరం కోయ ఆదివాసీ కథలు-స్త్రీ అస్తిత్వ కోణాలు	- డా॥. జరుపుల రమేష్	345
67. క్రైస్తవ సాహిత్యం - మహిళా చైతన్యం - ఒక పరిశీలన	- సాదే యాకోబు	353
68. తెలంగాణ స్త్రీవాద కథలు - వస్తు రూప విశ్లేషణ	- డా॥. ధీరావత్ లక్ష్మణ్	357
69. యద్దనపూడి సులోచనారాణి నవలలు -మహిళా చైతన్యం	- డా॥. కైలా హేమబాంధవి	359
70. "భాగవతంలో ఊర్వశి - ఆత్మ సౌందర్యం"	- డా॥. కమ్ముల రవి గంగాధర శేషుకుమార్	362
71. "బందిపోట్లు" కవితలో స్త్రీవాద తాత్వికత-ఒక పరిశీలన	- వంగాల సంపత్ రెడ్డి	365
72. వేద వాఙ్మయ నారీమణి - ఆధునిక సమాజ దిక్సూచి	- డా॥. యజ్జల ప్రవీణ్ కుమార్	369
73. రాయక్కమాన్యం కథ - దళిత స్త్రీ చైతన్యం	- డా॥. ఎస్. శమంత	374
74. బౌద్ధ ధర్మం దళిత సాహిత్యం : మహిళల పాత్ర - ఒక తులనాత్మక పరిశీలన	- డా॥. పులివర్తి రమేష్	377
75. తెలుగు స్త్రీవాద కవిత్వంలో ఆస్తిత్వ పోరాటం - మహిళా చైతన్యం	- దత్తి గాయత్రి	380
76. ఓల్గా స్వేచ్ఛ నవలలోని మహిళ చైతన్యం	- కె. పావని	387
77. రామాయణంలో సీత పాత్ర మరియు ప్రాముఖ్యత	- నక్క శ్రీకర్	390
76. నీలి మేఘాలు - మహిళా చైతన్యం	- శ్రీ పేరి	392
78. "కె.విశ్వనాథ్ నిండు దంపతులు చిత్రంలో కథానాయిక పాత్ర ఔచిత్యం"	- జి. శ్రీదేవి (లేళ్ళపల్లి శ్రీదేవి రమేష్)	396
79. గోదావరి జిల్లాల మహిళా సాహితీ సౌరభం	- డా॥. కొప్పాడి శ్రీనివాసరావు	401
80. మాతృభక్తి మంజూష మణిపూసల విశ్లేషణ	- ఉమాదేవి అడ్డగూడ - ఎం. శ్రీనివాసులు	404

81. నిత్య చైతన్య స్ఫూర్తి - శకుంతల	- డా॥. శివయ్య రాజులపాటి	408
82. వర విక్రయం నాటకం - మహిళా చైతన్యం	- తంత్రవహి శ్రీరామమూర్తి	412
83. సమకాలీన తెలుగు సాహిత్యంలో మహిళా చైతన్యం	- డా॥. పాండురంగం కాళియప్ప	417
84. డా॥. తరపట్ల యజ్ఞం - మహిళా సమస్యల చిత్రణ	- జి. ఎన్. ఎల్. జి. కాత్యాయని	425
85. కొండేపూడి నిర్మల కవిత్వం - మహిళా చైతన్యం	- యమ్. శిరీష	431
86. భాగవతంలో మహిళా చైతన్యం	- సునీత ఉండవల్లి - డా॥. డి. యువశ్రీ	433
87. చల్లపల్లి స్వరూప రాణి కథల్లో-'దళిత స్త్రీ' సమస్యలు	- అన్నిక కవిత	437
88. పెద్దింటి అశోక్‌కుమార్ కథల్లో మధ్య తరగతి స్త్రీ జీవన చిత్రణ	- డా॥. ఎ. జ్యోతి	442
89. చిద్రమవుతున్న చిట్టెమ్మ ఇల్లు	- అరిగెల శ్రీకాంత్ - డా॥. ఎమ్. పద్మ గౌరి	448
90. మహిళా శక్తి ప్రతీక సత్యభామ	- తుమ్మలపల్లి వెంకటేశ్వరరావు	452
91. ప్రాచీన సాహిత్యంలో మహిళా చైతన్యం	- డా॥. వి.డి.వి. విజయలక్ష్మి	454
92. మొల్ల రామాయణం - సీత పాత్ర ఔచిత్యం	- పి. వెంకటరత్నం	456
93. మొల్ల రామాయణంలో స్త్రీ పాత్రలు - చైతన్యం	- డా॥. పులవర్తి పైడిరాజు	460
94. జానపద గిరిజన విజ్ఞానంలో మహిళా చైతన్యం - విశ్లేషణ	- వంజరి రాజేశ్వరి	468
95. నన్నయ ఆంధ్ర మహాభారతం - మహిళా సాధికారత	- గజ్జెల ప్రమీల	471
96. వెనుకబడిన వర్గాల స్త్రీవాద కవిత్వంలో మహిళా చైతన్యం : తెలంగాణలో సామాజిక అసమానతలు, ఆత్మగౌరవం మరియు విముక్తి స్వరాలు	- శాంతి ధనావత్	475
97. చిత్తూరు జిల్లా రచయిత్రుల స్త్రీ వాద కథలు - స్త్రీ జీవిత చిత్రణ	- టి. మంజుల	481
98. రసరాజు విజయభారతంలో - అమృతకౌర్ మహిళా అభ్యుదయం మరియు సామాజిక అంశాలు	- పెదపోలు శివ ప్రసాద్	487

Vol. 23 | Spl. Issue 03 | March 2026 | BHAVAVEENA | ISSN No. : 2456-4702 | RNI No. APTEL/2003/12253

RNI No. APTEL/2003/12253 | Reffered Journal & Peer Reviewed Journals | ISSN No. 2456-4702

భావవీణ

కళలు, సాహిత్య, సాంస్కృతిక భాషాధ్యయన పత్రిక

BHAVA VEENA

Journal of Arts, Literary, Culture & Language Study

నిశ్శబ్దం నుండి నినాదం వరకు... తెలుగు సాహిత్యంలో మహిళా చైతన్యం

- ఆచార్య దార్ల వెంకటేశ్వరరావు

తెలుగు శాఖ, పూర్వ అధ్యక్షులు, యూనివర్సిటీ ఆఫ్ హైదరాబాద్, హైదరాబాద్.

కం. అమ్మవు నీవే; తోడవు;
నమ్మికవై నిలుచు సగము నారివి నీవే!
కొమ్మవు కావవు;నీవే
అక్షర చైతన్య మూర్తి వౌదువు మహిళా!

అన్నట్లుగా... తెలుగు సాహిత్యంలో మహిళా చైతన్యం అనేది నేడు ఒక పరిణామశీలమైన మహా ప్రవాహం. నిన్నటి నిశ్శబ్దం నుండి నేటి నినాదం వరకు సాగిన ఈ అక్షర ప్రయాణాన్ని విశ్లేషించుకోవడమే ఈనాటి నా ఉపన్యాసంలోని ప్రధాన ఉద్దేశ్యం...

"చరిత్ర పుటల్లో నిన్నటి వరకు
స్త్రీ అంటే ఒక త్యాగం.. ఒక మౌనం!
కానీ నేడు,
అదే మౌనం అక్షరమై గర్జిస్తోంది..
చాదస్తాల చట్రాలను బద్దలు కొడుతూ
సొంత ఆకాశాన్ని తానే నిర్మించుకుంటోంది!
ఇది అణచివేతపై అక్షరం సాధించిన చైతన్య గీతం!"

ముందుగా మహిళా చైతన్యం అంటే ఏమిటో అవగాహన చేసుకుందాం....

నేను మనిషిని, నేను సమానమైన హక్కులు కలదాన్ని, నేను ఈ ప్రపంచాన్ని మార్చగలను' అనే ఒక అచంచల మైన నమ్మకం. నిర్బంధాల మధ్య కూడా నిశ్శబ్దాన్ని ఛేదించ గలననే నమ్మకమే మహిళా చైతన్యం. తన అస్తిత్వం పట్ల, తన ఆత్మాభిమానం పట్ల రాజీలేని నమ్మకాన్ని కలిగి ఉండటమే చైతన్యం. విద్య ద్వారా కలిగే జ్ఞానం స్త్రీకి తనపై తనకు నమ్మకాన్ని ఇస్తుంది. ఆ నమ్మకమే ఆమెను చైతన్య మూర్తిగా మారుస్తుంది. ఈ దృష్టితో మహిళా చైతన్యాన్ని విశ్లేషించుకోవాల్సిన అవసరం ఉంది. తెలుగు సాహిత్యం వరకునే మన ప్రస్తుత పరిధి. కనుక, తెలుగు సాహిత్యం అంటే ఒకప్పుడు కేవలం పురుష విజయ గాథలు, రాజుల విజయాలే అనుకునేవారు. కానీ, పురాణ కాలం నుండి నేటి ఆధునిక కాలం వరకు స్త్రీ తన ఉనికిని, తన చైతన్యాన్ని అక్షరబద్ధం చేస్తూనే ఉంది. 'చైతన్యం' అంటే మేల్కొనడం. తన హక్కుల పట్ల, తన వ్యక్తిత్వం పట్ల, సమాజంలో తన స్థానం పట్ల స్త్రీ పొందిన ఎరుకే ఈ చర్చకు మూలం.

తెలుగు సాహిత్యంలో మహిళా చైతన్యాన్ని మూడు ప్రధాన ఘట్టాలుగా విభజించవచ్చు. ప్రారంభ దశ (సంప్రదాయకాలం) లో తాళ్లపాక తిమ్మక్క (సుభద్రా పరిణయం), మొల్ల (రామాయణం) వంటి వారు పురుష ఆధిక్య ప్రపంచంలో తమ ప్రత్యేక ముద్ర వేశారు. ఆ కాలంలోనే వారు సొంత గొంతుకను వినిపించడం ఒక గొప్ప సాహసం. ఆ తర్వాత రెండవ దశలో నాయక రాజుల కాలంలో మధురవాణి, రంగాజమ్మ వంటి

కవయిత్రులు విద్వత్తులో పురుషులతో పోటీపడి 'మధుర కవితా' రీతులను సృష్టించారు. ఇది స్త్రీ మేధో చైతన్యానికి తొలి మెట్టు. మూడవదశ అంటే సంస్కరణోద్యమ కాలంలో కందుకూరి, గురజాడ వంటి వారు స్త్రీ విద్య, వితంతు వివాహం గురించి రాసినా, అది స్త్రీల గురించి పురుషులు చేసిన ఆలోచన. కానీ, ఇది మహిళల్లో ఆత్మవిమర్శకు దారితీసింది. అనాటి నుండే తమ అస్తిత్వాన్ని చైతన్యంగా మార్చుకోవడం ప్రారంభమైంది.

20వ శతాబ్దపు మధ్యకాలం నుండి తెలుగు సాహిత్యంలో విప్లవాత్మక మార్పులు వచ్చాయి.స్త్రీవాద కవిత్వం (1980-90లలో తెలుగు సాహిత్యంలో ఒక పెను తుపాను. "నీలి మేఘాలు" వంటి సంకలనాలు స్త్రీ శరీరం, శ్రమ, అనుభూతుల చుట్టూ ఉన్న సంకెళ్లను తెంచేశాయి. ఓల్గా, పి. సత్యవతి, విమల, కొండేపూడి నిర్మల వంటి వారు స్త్రీ దృక్కోణం నుండి ప్రపంచాన్ని చూడటం నేర్పారు. చదువుకున్న మహిళలు తమ ఆకాంక్షలను కథల్లో చిత్రించారు. అబ్బూరి ఛాయాదేవి, భానుమతి వంటి వారు మధ్యతరగతి స్త్రీ మనోభావాలను అవిష్కరించారు.

'గురిచూసి పాడే పాట' (1990) అనేది తెలుగు సాహిత్యంలో వెలువడిన తొలి స్త్రీవాద కవితా సంకలనంగా ప్రత్యేక గుర్తింపు పొందింది. 'నీలి మేఘాలు' రాకముందే స్త్రీవాద గొంతుకలను ఒకచోట చేర్చిన చారిత్రక గ్రంథం ఇది.కవయిత్రులు కేవలం భావకవిత్వపు రంగుల లోకంలో విహరించకుండా, స్త్రీ ఎదుర్కొంటున్న వాస్తవిక హింసను, సామాజిక వివక్షను ధైర్యంగా ప్రశ్నించారు. ఈ కవితల ప్రధాన లక్ష్యం స్త్రీని కేవలం ఒక 'అలంకార వస్తువు'గా చూసే పితృస్వామ్య దృక్పథాన్ని ఛేదించి, ఆమెలోని మనిషిని, ఆమె శ్రమను మరియు ఆమె ఆత్మగౌరవాన్ని సమాజానికి పరిచయం చేయడం. దీనిలో సావిత్రి గారి 'బందిపోట్లు' కవిత ఒక సంచలనం. 1984లో ఇది ఆంధ్రజ్యోతి దినపత్రికలో ప్రచురితమైంది. దీన్ని వెంటనే పాఠ్యాంశలో పెట్టారు.

"పాఠం ఒప్ప చెప్పక పోతే పెళ్ళి చేస్తాన"ని పంతులు గారన్నప్పుడే భయమేసింది.

"ఆఫీసులో నా మొగుడున్నాడు! అవసరమొచ్చినా సెలవివ్వడ"ని

అన్నయ్య అన్నప్పుడే అనుమానమేసింది

"వాడికేం? మగమహారాజ"ని ఆడా, మగా వాగినప్పుడే అర్థమైపోయింది

- "పె"ళ్లంటే "పెద్దశిక్ష" అని "స్వేచ్ఛా భక్షకుడ"ని మేం పాలిచ్చి పెంచిన జనంలో సగమే మమ్మల్ని విభజించి పాలిస్తోందని!"

ఈ కవిత ద్వారా మహిళలలో వచ్చిన చైతన్యం సామాన్యమైనది కాదు. దీని తర్వాత..తెలుగు సాహిత్యంలో 'నీలి మేఘాలు' (1993) కవితా సంకలనం మహిళా చైతన్యానికి ఒక చారిత్రక మలుపు, నిశ్శబ్దాన్ని నిరసనగా మార్చిన ఒక అక్షర విస్ఫోటనం. ఈ సంకలనం ద్వారా స్త్రీ కేవలం పురుష భావనలోని 'వస్తువు'గా కాక, తన సొంత శరీరం, శ్రమ, అనుభూతులు, అస్తిత్వంపై సర్వాధికారాలు కలిగిన'కర్త'గా తనను తాను ప్రకటించుకుంది. పితృస్వామ్య వ్యవస్థ గీసిన లక్ష్మణ రేఖలను చెరిపివేస్తూ, ఇల్లు - వంటిల్లు - సమాజం అనే పొరల్లో దాగి ఉన్న వివక్షను ఈ కవిత్వం అత్యంత ధైర్యంగా ప్రశ్నించింది. స్త్రీవాదాన్ని ఒక బలమైన సామాజిక సిద్ధాంతంగా నిలబెట్టడమే కాకుండా, స్త్రీల వేదనను ఒక రాజకీయ చైతన్యంగా మార్చి, తెలుగు కవిత్వ భాషను, దృక్కోణాన్ని సమూలంగా మార్చేసింది. ఇది కేవలం కవితల గుత్తి కాదు, తెలుగు నేల మీద స్త్రీల ఆత్మగౌరవ ప్రయాణంలో ఒక అప్రకటిత యుద్ధనౌక వంటిది.

ఈ మేధోమథనం ఆధునిక కాలంలో కథ, నవల, నాటకం వంటి ప్రక్రియల్లో విప్లవాత్మక మార్పులు తెచ్చింది. కనపర్తి వరలక్ష్మమ్మ 'శారద లేఖలు' ద్వారా సామాజిక స్పృహను కలిగించగా, ఓల్గా 'స్వేచ్ఛ' వంటి నవలలు స్త్రీ వ్యక్తిత్వాన్ని, ఆర్థిక స్వావలంబనను కొత్త కోణంలో ఆవిష్కరించాయి. పి. సత్యవతి 'ఇల్లాలు-ఇల్లెలుకమ్మ' వంటి కథల్లో స్త్రీల అదృశ్య శ్రమను ప్రశ్నించగా, నాటక రంగంలో స్త్రీల సమస్యల చుట్టూ కేంద్రీకృతమైన రచనలు వచ్చాయి. సాహిత్య విమర్శలో కూడా స్త్రీ దృక్కోణం (Female Gaze) పెరిగింది;

"మనకు తెలియని మన చరిత్ర" వంటి రచనలు పితృస్వామ్య విలువలని సాహిత్య పరంగా ఎండగట్టాయి. ఈ ప్రక్రియలన్నీ మహిళలు తమ వేదనను ఒక సామాజిక ఆవేదనగా మార్చుకోవడానికి దోహదపడ్డాయి.

నా అభిప్రాయం ప్రకారం ఈ సదస్సులో మనం చర్చించాల్సిన ముఖ్యాంశాలు (Key Points):

అదృశ్య శ్రమ గుర్తింపుగా మిగిలిపోతున్న ఇంటి పనిలో, పంటి పనిలో, వ్యవసాయ క్షేత్రాల్లో స్త్రీ పడుతున్న వెలకట్టలేని శ్రమకు సమాజంలో గుర్తింపు లేకపోవడాన్ని నేటి సాహిత్యం బలంగా ప్రశ్నిస్తోంది. స్త్రీ శ్రమ దోపిడీని అక్షరీకరించడం చైతన్యంలో ఒక ముఖ్య భాగం.

స్త్రీ శరీరంపై ఆమెకే పూర్తి హక్కు ఉండాలనే భావన ఆధునిక కవిత్వంలో ప్రధానాంశంగా మారింది. వీటినే శరీర రాజకీయం (దీశీఎఅ్రాశీశ్రీ్‌ఱఎం) అంటున్నారు. ఓల్గా అంశంపై ప్రత్యేకించి కథలు కూడా రాశారు. పితృ స్వామ్య వ్యవస్థ విధించిన ఆంక్షలను, శారీరక హింసను నిరసిస్తూ వెలువడిన రచనలు మహిళల్లో గొప్ప ఆత్మ విశ్వాసాన్ని నింపాయి. భావ కవిత్వంలో స్త్రీ ఒక సౌందర్య సాధనం అయితే తర్వాత కాలంలో స్త్రీ తన సౌందర్యాన్ని పునర్నిర్వచించుకున్న తీరులో మహిళా చైతన్యం కని పిస్తుంది. జయప్రభ వంటి కవయిత్రి దీన్ని లోతుగా అధ్యయనం చేశారు.

ఉద్యోగ రీత్యా బయటకు వస్తున్న మహిళలు ఎదుర్కొంటున్న 'రెట్టింపు భారాన్ని' (Double Burden) - అంటే అటు ఆఫీసు పని, ఇటు ఇంటి బాధ్యతలను - సాహిత్యం ప్రతిబింబిస్తోంది. ఆర్థికంగా ఎదిగినా సామాజి కంగా ఎదురయ్యే వివక్షపై పోరాటం ఇందులో కని పిస్తుంది. ఉద్యోగంతో పాటు ఇంటి పనిని కూడా చేయడం, దాని ఆర్థికంగా విలువ కట్టకపోవడం వంటి వన్నీ చర్చనీయాంశాలయ్యాయి. ఇలా ఆర్థిక స్వావలంబన - సవాళ్లు ఒక ప్రధాన కేంద్రంగా మహిళా చైతన్యం కొనసాగింది.

నల్లపొద్దు (గోగు శ్యామల) వంటి దళిత స్త్రీల చరిత్ర మహిళా చైతన్యంలో ఒక కొత్త పార్శ్వాన్ని చూపించింది. జూపాక సుభద్ర, జాజుల గౌరి, చల్లపల్లి స్వరూపరాణి, వినోదిని, మానస, మొదలైన వాళ్ళు ఈ కోణంతో కొత్త ప్రశ్నలను తెరపైకి తీసుకువచ్చారు. కేవలం లింగ వివక్ష కాకుండా, కుల వివక్షను కూడా కలిపి ఎదుర్కొంటున్న అణగారిన వర్గాల స్త్రీల గొంతుక నేడు సాహిత్యంలో కీలకంగా మారింది. వీటినన్నింటినీ మనం చర్చలోకి తీసుకురావాలి.

ఆధునిక యుగంలో సోషల్ మీడియా వేదికగా మహిళలు తమ భావాలను నిర్భయంగా పంచు కుంటున్నారు. బ్లాగులు, ఫేస్‌బుక్ కవిత్వం ద్వారా తక్షణ స్పందనలు తెలుపుతూ సాహిత్య విస్తృతిని పెంచు తున్నారు. కొండేపూడి నిర్మల, కొండవీటి సత్యవతి వంటివారు ఈ రంగంలో లోతైన ఆలోచనలను ప్రసరింప చేశారు. పత్రికలు మీడియా రంగంలో మహిళల చైతన్యానికి సంబంధించిన కోణాలను కూడా మనం చూడాలి.

అయితే, మనం చర్చించు కోవాల్సిన వాటిని కొన్ని ప్రశ్నల రూపంలో మీ ముందుంచుతాను.

1. "శతాబ్దాల తెలుగు సాహిత్యంలో స్త్రీ గురించి పురుషులు రాసిన వర్ణనలు ఎక్కువ ఉన్నాయా? లేక స్త్రీలు తమ గురించి తాము రాసుకున్న వాస్తవాలు ఎక్కువ ఉన్నాయా? మనం చదువు తున్నది స్త్రీ హృదయాన్నా లేక పురుష భావనలోని స్త్రీనా?"
2. "ప్రాచీన కావ్యాల్లో నాయికల సౌందర్యానికి ఇచ్చిన ప్రాధాన్యత, ఆధునిక సాహిత్యంలో స్త్రీ పడుతున్న 'అదృశ్య శ్రమ'కు (Invisible Work) లభిస్తోందా? అలంకారాల కింద నలిగిపోయిన ఆమె శ్రమను మన సాహిత్యం ఎంతవరకు గుర్తించింది?"
3. "స్త్రీవాద సాహిత్యం అంటే కేవలం పురుష విద్వేషం అని కొందరు భావిస్తుంటారు. కానీ, అది పురుషాధిక్యతపై పోరాటమా లేక మానవ సమా నత్వం కోసం జరుగుతున్న ఆకాంక్షా? సాహిత్యం ఈ తేడాను స్పష్టంగా చూపిస్తోందా?"
4. "మహిళా చైతన్యం అంటే కేవలం అక్షరాస్యత

కలిగిన మధ్యతరగతి మహిళల సమస్యలేనా? పొలాల్లో పని చేసే శ్రమజీవుల, కుల వివక్షను ఎదుర్కొంటున్న దళిత, బహుజన మహిళల ఆవేదన మన సాహిత్య ప్రధాన స్రవంతిలో ఎంతవరకు ప్రతిఫలిస్తోంది?"

5. "డిజిటల్ యుగంలో సోషల్ మీడియా వేదికగా వస్తున్న సాహిత్యం మహిళా చైతన్యాన్ని బలోపేతం చేస్తోందా? లేక అది కేవలం తాత్కాలిక భావోద్వేగాలకే పరిమితమవుతోందా? రేపటి తరానికి మనం అందిస్తున్న సాహిత్య వారసత్వం ఏమిటి?"

ఇవన్నీ మనం లోతుగా చర్చించుకోవాలి.

ప్రాచీన కాలం నుండి ఆధునిక యుగం వరకు తెలుగు సాహిత్యంలో మహిళా చైతన్యాన్ని ఒకే కోణంలో చూడలేము. అది కాలక్రమేణా నిశ్శబ్దం నుండి నిరసన వరకు, భక్తి నుండి భౌతిక ఉనికి వరకు పరిణామం చెందుతూ వచ్చింది. ఈ పరిణామాన్ని ఈ క్రింది దశల ద్వారా అర్థం చేసుకొనేవీలుంటుందని అనుకొంటున్నాను.

1. ప్రాచీన సాహిత్యం : పరిమితుల మధ్య ప్రతిభ

ప్రాచీన కాలంలో మహిళా చైతన్యం ప్రధానంగా భక్తి మరియు పాండిత్యం చుట్టూ తిరిగింది. తాళ్లపాక తిమ్మక్క తెలుగులో తొలి కవయిత్రిగా 'సుభద్రా పరిణయం' రాశారు. పురుషుల ఆధిపత్యం ఉన్న ఆ కాలంలో ఒక మహిళ కావ్యాన్ని రచించడమే ఒక పెద్ద చైతన్యం.

మొల్ల కుల వ్యవస్థను, అక్షర క్రమశిక్షణను సవాలు చేస్తూ "రామాయణం" రాశారు. "నేను పండితురాలిని కాకపోయినా, రామ భక్తితో రాస్తున్నాను" అనడంలో ఒక వినమ్రమైన ఆత్మవిశ్వాసం కనిపిస్తుంది. ఇది అస్తిత్వానికి తొలి అడుగు.

2. ప్రబంధ/నాయక రాజుల కాలం-శృంగారం, స్వేచ్ఛ :

ఈ కాలంలో మహిళా చైతన్యం శృంగార ప్రగతిశీలతవైపు మళ్లింది. రంగాజమ్మ, మధురవాణి అష్టభాషా కోవిదులు. రాజదర్బారుల్లో పురుషులతో సమానంగా పీఠాలు వేసుకుని కూర్చుని, వాదోపవాదాలు చేసేవారు. స్త్రీ మేధస్సుకు, కళా నైపుణ్యానికి ప్రాధాన్యత పెరిగిన దశ ఇది.

3. ఆధునిక పూర్వ దశ (సంస్కరణోద్యమం): పరోక్ష చైతన్యం

19వ శతాబ్దపు చివరలో, 20వ శతాబ్దపు ప్రారంభంలో స్త్రీల గురించి పురుషులు రాశారు. కందుకూరి వీరేశలింగం, గురజాడ అప్పారావు వంటి వారు స్త్రీ విద్య, వితంతు వివాహం గురించి పోరాడారు. 'పుత్తడి బొమ్మ పూర్ణమ్మ' వంటి రచనలు స్త్రీల కష్టాలను సమాజం దృష్టికి తీసుకెళ్లాయి. ఇది స్త్రీలలో సామాజిక స్పృహ కలగడానికి పునాది వేసింది.

4. అభ్యుదయ, దిగంబర కవిత్వ దశ: రాజకీయ చైతన్యం

స్వాతంత్ర్యానంతరం స్త్రీలు కేవలం గృహిణులుగానే కాకుండా, పోరాట యోధులుగా మారారు. తెలంగాణ సాయుధ పోరాటం వంటి సందర్భాల్లో మహిళలు రాసిన పాటలు, కథలు వారిలో గూడుకట్టుకున్న రాజకీయ చైతన్యాన్ని బయటపెట్టాయి. చదువుకున్న మహిళలు సమాజంలోని అసమానతలను ప్రశ్నించడం మొదలు పెట్టారు.

5. స్త్రీవాద ఉద్యమ కాలం (1980 నుండి నేటి వరకు): పూర్తిస్థాయి చైతన్యం

ఇది అత్యంత కీలకమైన దశ. ఇక్కడ స్త్రీ 'వస్తువు' (Object) నుండి 'కర్త' (ఏజెన్సీ)గా మారింది.

అస్తిత్వ వేదన :

తన శరీరం, తన శ్రమ, తన నిర్ణయాలపై తనకే హక్కు ఉండాలని వాదించడం మొదలైంది. సొంత గొంతుక: పురుషులు రాసిన స్త్రీ చిత్రణకు, స్త్రీలు రాసుకున్న స్వీయ చిత్రణకు ఉన్న తేడా స్పష్టమైంది. ఓల్గా, విమల, కొండేపూడి నిర్మల వంటి వారు స్త్రీవాదాన్ని ఒక బలమైన సిద్ధాంతంగా నిలబెట్టారు.

బహుళ చైతన్యం :

నేడు మహిళా చైతన్యం కేవలం లింగ వివక్షకే పరిమితం కాలేదు. దళిత స్త్రీవాదం, ముస్లిం స్త్రీవాదం, ప్రాంతీయ చైతన్యం వంటి భిన్న కోణాల్లో తన ఉనికిని చాటుకుంటోంది. ప్రాచీన సాహిత్యంలో మహిళా చైతన్యం 'అనుమతించబడిన స్వేచ్ఛ' (Permitted

Freedom) అయితే, ఆధునిక సాహిత్యంలో అది 'అప్రకటిత తిరుగుబాటు' (Undeclared Rebellion). నిన్నటి వరకు ఇతరుల కథల్లో పాత్రలుగా ఉన్న మహిళలు, నేడు తమ కథలకు తామే రచయితలుగా మారి సమాజాన్ని నడిపిస్తున్నారు. వారిని ఈ పద్యం ద్వారా ప్రశంసిస్తూ నా ప్రసంగాన్ని ముగిస్తాను.

కం. అక్షర రూపిణి మహిళా!
శిక్షణతో జగతి గెలుచు శిల్పివి నీవే!
దక్షతతో సాగగదే!
వీక్షణలో కాంతి నింపి వెలుగుము మహిళా!

ఈ సదస్సులో అతిథిగా పాల్గొనే అవకాశం కల్పించిన సదస్సు నిర్వాకులకు నా హృదయపూర్వక కృతజ్ఞతలు.

ఆధార గ్రంథ సూచిక :

1. త్రిపురనేని శ్రీనివాస్. గురిచూసి పాడే పాట (తొలి స్త్రీవాద కవితా సంకలనం). హైదరాబాద్: కవిత్వం ప్రచురణలు, 1990.
2. ఓల్గా, పి. సత్యవతి, తదితరులు (సంపా.). నీలి మేఘాలు (స్త్రీవాద కవితలు). హైదరాబాద్: స్వేచ్ఛ ప్రచురణలు, 1993.
3. జయప్రభ. మార్గాన పడ్డ పాదాలు (స్త్రీవాద విమర్శ). హైదరాబాద్: నీలి ప్రచురణలు, 1991.
4. కనకదుర్గ, డి. తెలుగు సాహిత్యం - మహిళా చైతన్య ప్రస్థానం. హైదరాబాద్: విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్, 1993. (డిజిటల్ వెర్షన్: Archive.org ద్వారా లభ్యం).

ఆంగ్ల గ్రంథాలు :

1. Beauvoir, Simone de. The Second Sex. Trans. H.M. Parshley. London: Vintage Books, 1949/ 1997.
2. lf, Virginia. A Room of Oneµs Own. London: Hogarth Press, 1929.
3. Hooks, Bell. Ainµt I a Woman? Black Women and Feminism. Boston: South End Press, 1981.
4. Friedan, Betty. The Feminine Mystique. New York: W.W. Norton & Company, 1963.
5. Walker, Alice. The Color Purple. New York: Harcourt Brace Jovanovich, 1982.
6. Lorde, Audre. Sister Outsider: Essays and Speeches. Crossing Press, 1984.

★★★

Vol. 23 | Spl. Issue 03 | March 2026 | BHAVAVEENA | ISSN No. : 2456-4702 | RNI No. APTEL/2003/12253

RNI No. APTEL/2003/12253 | Reffered Journal & Peer Reviewed Journals | ISSN No. 2456-4702

భావవీణ

కళలు, సాహిత్య, సాంస్కృతిక భాషాధ్యయన పత్రిక

BHAVA VEENA

Journal of Arts, Literary, Culture & Language Study

తెలుగు సాహిత్యంలో మహిళా చైతన్యం

- ఆచార్య ఖిస్తాల శంకరరావు

తెలుగు శాఖాధ్యక్షులు, మద్రాసు విశ్వవిద్యాలయం, చెన్నై.

పరిచయం

"ఆధునిక మహిళ చరిత్రను తిరగరాస్తుంది" మహకవి గురజాడ అంటారు.

ఈ వాక్యం చాల కీలకమైంది. ఎంత కీలకమైంది అంటే తీగలాగితే డొంక కదిలింది అంటారు కదా! అలా ఈ వాక్యన్ని సరిగ్గా అర్థం చేసుకుంటే అసలు విషయం బోధపడుతుంది.

ఈ మాటలోని "చరిత్ర తిరగరాస్తుంది" అనే మాటను పరిశీలిస్తే చరిత్రను ఎందుకు తిరగరాయాలి? అదే మహిళే ఎందుకు తిరగరాయాలి. అసలు తిరగ రాయాల్సిన అవసరం ఏమొచ్చింది? అదీ ఆధునిక మహిళ రాయవలసిన పరిస్థితి ఏమెచ్చింది. మరి ప్రాచీన కాలం లోని పరిస్థితి ఏమిటి. అసలు మహిళకు చరిత్రలో ఏం జరిగింది? అని అనేక ప్రశ్నలు వరుసగా క్యూ కడతాయి. అన్నింటి కంటే ముఖ్యంగా ఈ కళాశాల వారు "తెలుగు సాహిత్యంలో మహిళా చైతన్యం" అనే అంశమే ఎందుకు జాతీయ సదస్సు శీర్షికగా ఎంచుకుంది? అని ఈ ప్రశ్నలు అన్ని పరిశీలిస్తే చరిత్రలో మహిళకు ఏదో జరింది. కనుక ఆ మహిళే ఈ చరిత్రను తిరిగరాయాలి? అలా తిరగ రాయాలంటే ఆమెలో ఎలాంటి చైతన్యం అవసరమో? అసలు ఆమె చైతన్యం ఎలా ఉందో పరిశీలించాడమే ఈ సదస్సు ముఖ్య ఉద్దేశంగా భావిస్తాను. అదే "తెలుగు సాహిత్యంలో మహిళా చైతన్యం" అన్నారంటే సాహిత్యం సమాజానికి ప్రతిబింబం కాబట్టి ఈ కోణంలో మనం తెలుగు సాహిత్యంలో మహిళా చైతన్యం ఎలా ఉందో పరిశీలించాలి?

ప్రాచీన, వేదకాలంలో - మహిళ

కాలం ఏదైనా ఆ కాల స్వభావాన్ని, ఆకాలంలోని వ్యక్తుల మనస్తత్వాలను పరిశీలించాలి అంటే అందుకు ప్రధానమైన ఆధారం సాహిత్యమే అంటే ఆ కాలం నాటి సాహిత్యాన్ని పరిశీలిస్తే ఆ కాలం నాటి ప్రజల స్థితిగతులు తెలుస్తాయి. అది పురుషుల జీవితం అయినా, మహిళల జీవితం అయినా తెలియాలంటే ఆనాటి గ్రంథాలే ఆధారం. కాలం ఏదైనా కుటుంబానికైన, సమాజానికికైనా స్త్రీ, పురుషులు రెండు చక్రలు లాంటి వారు. ఈ కోణంలో నాటి నుండి నేటి వరకు స్త్రీ స్థితిగతులు ఏమిటి? వారిలో చైతన్యం అవశ్యకత ఏమిటో పరిశీలిద్దాం.

అత్యంత ప్రాచీన కాలం నుండి లభిస్తున్న గ్రంథాలను పరిశీలిస్తే భారతదేశంలో స్త్రీలను గౌరవించిన సందర్భలలో కనిపిస్తున్నాయి. ఉదా॥

యత్ర నార్యంతు పూజ్యంతే
రమంతే తత్ర దేవతా: - అనే సూక్తి

(దీని అర్థం ఎక్కడ స్త్రీలు పూజలందుకుంటారో అక్కడ దేవతలు వివరిస్తారు)

ఇక భారతీయులు ఈ విశ్వమంతా స్త్రీమూర్తిగాను, ఇంకా ఆమెను పరాశక్తి, ప్రకృతి, ఉషాబాల, నదీదేవత, వనలక్ష్మీ, సంధ్యాదేవి, చదువుల రాణి, అన్నపూర్ణ, రాజరాజేశ్వరిగా పేర్కొన్న సందర్భాలు అక్కడక్కడ కని పిస్తున్నాయి. ఈ వాస్తవాన్ని జె.వరలక్ష్మి "యుగ యుగా లలో భారతీయ మహిళ" అనే గ్రంథంలో వివరించారు. మొత్తానికి భారతదేశంలో క్రీస్తుకుపూర్వం అనేక శతాబ్దల క్రితమే వైదికయుగంలో స్త్రీకి సముచిత మైన స్థానం ఇచ్చినట్లు కృష్ణ యజుర్వేదంలో ఉన్నట్లు ఆమె తెలిపారు.

అధునికకాలంలో కూడా ఇల్లాలే ఇల్లు, ఇంటికి దీపం ఇల్లాలు గొప్ప వాక్యాలలో మనం వింటూనే ఉన్నాం. పై అంశాలు అన్ని పరిశీలిస్తే, స్త్రీకు అద్భుతమైన స్థానం ఉంది కదా? మరి వారి గురించి ఇప్పుడు ఏదో జరిగి పోయింది అని మాట్లాడుకోవలసిన అవసరం ఏముంది? అనిపిస్తుంది.

ఇంకా కొంచెం లోతుగా పరిశీలిస్తే వేదకాల నాటికే గార్గి, ఆత్రేయ, లోపాముద్ర మొదలయిన పేర్లు కనిపిస్తున్నాయి. అక్కడక్కడ స్త్రీ గురించి కొంచెం మంచిగా చెప్పినట్లు కనిపించినా

"పొట్ట విప్పుచూడ పురుగులుండు" అని వేమన అన్నట్లు చరిత్రలో పురుషునికి ఇచ్చిన గౌరవం స్త్రీకి ఇవ్వలేదని స్పష్టం అవుతుంది. ముఖ్యంగా సామాజిక జీవనంలో ఆమెకు తగిన గుర్తింపులేదని పరిశీలకులు గుర్తించారు. "న స్త్రీ స్వాతంత్ర్య మర్హతి" (స్వాతంత్ర్యానికి స్త్రీలు అర్హులు కాదు)

ఒక వైపు స్త్రీలను పూజించేచోట దేవతలు ఉంటా రంటూ మరోవైపు స్త్రీ స్వతంత్రంగా ఉండ కూడదని, నిరంతరరక్షణ నియంత్రణ ఉండాలని చెబుతుంది.

బాల్యంలో తండ్రి రక్షణ (పితా రక్షితి కౌమారే)
యవ్వనంలో భర్త రక్షణ (భర్త రక్షతి యౌవనే)
వృద్ధాప్యంలో కుమారురక్షణతో (సుతారక్షితి వార్ధక్యే"
స్త్రీ ఉండాలని (మనుస్మృతి 5-148, 145) లో తెలియజేస్తుంది.

వేదకాలంలోనే పుత్రసంతానం కావాలని ప్రార్థనలు, తపస్సులు చేసిన సంఘటనలు పరిశోధకులు వెలుగు తీస్తున్నారు. ఇక వేదకాలంలో వితంతువుల పరిస్థితి ప్రత్యేకంగా చెప్పనవసరంలేదు. అలాగే అసలు స్త్రీని 'కన్యాదనం' అనే పేరుతో దానం చేయగలిగిన వస్తువు లుగా మార్చేసారని సామాజిక శాస్త్రవేత్తలు అంటున్నారు. సతీసహగమన దురాచారం మహిళలను తీవ్రంగా అవ మానించిందని చెప్పకతప్పదు.

ఇంకా ముక్కుపచ్చలారని బాలికలను వృద్ధులతో వివాహాలు, దేవదాసి వ్యవస్థపోయి వెలయాండ్రగా మారడం, అలాగే బసివిరాండ్రు, జోగినీలు ఇలాంటి అంశాలు ఎన్నో మహిళాల జీవితాన్ని చిన్నా భిన్నం చేశాయని కాలక్రమంలో భారతీయ జీవనవిధానంలో స్త్రీ పట్ల ఈ సమాజం వ్యవహరించిన తీరు అత్యంత హేయంగా ఉందని సామాజికవేత్తలు స్పష్టం చేస్తున్నారని, దీనిని బట్టి ఇలా ప్రాచీన వేదకాలం నాటి సామాజిక జీవనంలో మహిళల స్థానం ఎలా ఉందో తెలుస్తుంది.

ఇక మన తెలుగు సాహిత్యంలో మహిళల పరిస్థితి ఏమిటో చూద్దాం. మనం తెలుగు సాహిత్యాన్ని ఇప్పుడు మూడు భాగాలుగా భావిస్తున్నాం.

1. ప్రాచీన సాహిత్యం
2. ఆధునిక సాహిత్యం
3.అత్యాధునిక సాహిత్యం

ఈ విభాగాలలో మహిళ స్థానం పరిశీలిద్దాం.

ప్రాచీనాంధ్ర సాహిత్యంలో మహిళలు

తెలుగు ప్రాచీన సాహిత్యాన్ని పరిశీలిస్తే దాదాపుగా ఎక్కువ భాగం అనుసృజనులు, అనువాదాలు, అను కరణలు ఎక్కువగా కనిపిస్తాయి. అవి రామాయణ, భారత భాగవతాలు, పురాణాలు, కావ్యలు, ప్రబంధాలు, నాటకాలు, శృంగార రచనలు ఇలా అనేకం కనిపిస్తాయి. వీటిలో కూడా మహిళల జీవితాన్ని పరిశీలిస్తే గొప్పతనం కోసమో, అలంకరణ కోసమో, లేదా అవకాశం, అవసరం కోసమో స్త్రీ జీవితం గొప్పగా చిత్రించినట్లు కనిపిస్తుంది. కాని స్త్రీకి తగిన గౌరవం అంతగా కనిపించదు.

ఉదా॥ రామాయణ, భారత, భాగవతాలలో వాల్మీకి స్త్రీకి సమానమైన స్థానం ఇచ్చినట్లు కనిపించదు. ఎలా

అంటే రామాయణం ఏ దేశాలలో నైనా భార్య దొరుకు తుంది గానీ సోదరుడు లభించాడు అనడం. పరిశీలిస్తే సోదరుని గొప్పతనం చెప్పడంలో అభ్యంతరం లేదు. అక్కడ భార్యను ఉదాహరణగా చూపడం అనేది ఆమె పట్ల గల చులకన భావన తెలుస్తుంది.

అలాగే సీతారాములతో లక్ష్మణుడు అరణ్యవాసం చేసిన సమయంలో ఊర్మిళాదేవి నిద్రలో ఉంది అనడంలో కవి అభిప్రాయం ఏమిటో అర్థం అవుతుంది.

భారతంలో కూడా పాండవులు ఐదుగురికి ద్రౌపది భార్య కావడంలో ఆమె ఇష్ట ఇష్టాల ప్రశక్తి లేకపోవడం వ్యాస మహర్షికి స్త్రీల పట్ల ఉన్న జీవన దృక్పథం ఎలాంటిదో తెలుపుతుంది. తెలుగు భారతానికి మూలం సంస్కృతమే కదా.

భారతంలో బహుభర్తృత్వం లేదా బహు భార్యత్వం రెండు కనిపిస్తాయి. ద్రౌపదికి పాండవులతో ఉన్న సంబంధం బహుభర్తృత్వం.

ధృతరాష్ట్రుడు గాంధారిని వివాహం ఆడే సమయంలో. ఆమెతోపాటు ఆమె చెల్లెళ్ళు మరో పదిమందిని కూడా భార్యలుగా పొందడం (5-12 ఆదిపర్వం) (సత్యవ్రతంలో, సత్యసేనము, సుదేష్టము, సంహితము, తేజోజ్యము, నికృతము, శుభము, సంభము)''

విచిత్ర వీర్యునికి ఇద్దరు భార్యలు (అంబా, అంబాలిక), అలాగే పాండురాజుకు కుంతి, మాద్రి ఇద్దరు భార్యలు.

మహాభారతంలో బహుభార్యలు లేని ఏకపత్నీవ్రతులు ఎవరున్నారు? ఎందరున్నారా? అని దివిటి పట్టి వెదక వలసివస్తుంది. అభిమన్యుడు వంటి వారు ఒకరో ఇద్దరు.

వీటని బట్టి ఆనాటి సమాజంలో ప్రబలంగా వ్యాపించిన బహు భార్యల సంబంధలకు ఇలాంటివి నిలువెత్తు సాక్ష్యలు.

ఇక తెలుగు సాహిత్యంలో శివకవియుగం, శ్రీనాథ యుగంలో అక్కడక్కడ స్త్రీ పాత్రలు ఉత్తమంగా కని పించినా అవి నామ మాత్రమే.

ప్రబంధ యుగం నాటి స్త్రీల పరిస్థితులు చెప్పే పరిస్థితికాదు. సందర్భం లేకపోయిన సందర్భాన్ని సృష్టించి స్త్రీని అలాగే ఏక వర్ణనలు చేయడంలో కవులు ప్రదర్శిం చిన బుద్ధికుశలత అంతా ఇంతా కాదు. దాని ప్రభావం ఎంత అంటే తాళ్లపాక తిమ్మక్క, మొల్ల, ముద్దుపళని, రంగాజమ్మ మొ॥ కవయిత్రులలో కూడా స్త్రీలను వర్ణించే సందర్భంలో పురుషులతో పోటిపడే వర్ణించినట్లు తెలుస్తుంది.

తెలుగులో శతక సాహిత్యానికి ప్రత్యేకత ఉంది. దానిలో కూడా కుమారి శతకం మొదలైన వాటిలో సంసారం మోక్షానికి అడ్డంకి అని, సంకెల అని ధూర్జటి కాళహస్తిశ్వర శతకంలో తెలిపారు.

''అంగన నమ్మరాదు'' వాటి మాటలు సుమతీ శతక కర్త తెలిపారు.

వేమన పద్యాలలో కూడా స్త్రీలను చిన్నబుచ్చేవి అనేకం ఉన్నాయి.

స్త్రీలను గౌరవించే విషయంలో అలంకారశాస్త్రవేత్తలది హేయమైన దృక్పథం అని కాత్యాయనీ విద్మహే తన అలంకారశాస్త్రంలో స్త్రీ అనే గ్రంథంలో తెలిపారు. స్త్రీలను వ్యభిచారానికి ప్రోత్సహంచడంలో తోడ్పడే దూతికల గురించి అలంకారశాస్త్రంలో ఉన్నట్లు స్పష్టం చేశారు.

ఇలా చెప్పకుంటూపోతే ప్రాచీనాంధ్ర సాహిత్యంలో స్త్రీల ప్రస్తావనలు విరివిగా కనిపిస్తున్నా గౌరవనీయులైన స్థానం శూన్యమేనని పరిశీలకులు, పరిశోధకులు గుర్తిం చారు.

ఆధునిక దృక్పథం నేపథ్యం

కాలం మారినప్పుడు సామాజిక స్థితిగతులు మారు తాయి. అలాగే ప్రజల ఆలోచనలు ఆనాటి విజ్ఞానానికి అనుగుణంగా మార్పుచోటుచేసుకుంటుంది. ప్రజలలో ఆధునికత వికసించడానికి విజ్ఞానశాస్త్రం, శాస్త్రవేత్తల జ్ఞానం జ్ఞానపరిపుష్టులైన మేధావుల విషయ పరిజ్ఞానం మొదలైన వాటి వలన ప్రజల ఆలోచనలో అనేక మార్పులు ఏర్పడ్డాయి. ఇదే కోణంలో మహిళల పట్ల ఆలోచించవలసిన తీరు కూడా గుర్తించడం, దానికోసం పోరటాలు చేయటం సమాజంలో మొదలైనాయి అంటే 20శతాబ్దం చివరికి సైన్సులో యుద్ధాలు ప్రారంభ

మయ్యాయి. ప్రపంచంలో కలతలకు, వివాదాలకు తెరతీశాయి.

స్త్రీవాదంలో పురుషాదిపత్యాన్ని ప్రశ్నించడమే కాకుండా పురుషధృక్పదానికే ప్రాధాన్యం కల్పించిన శాస్త్ర విజ్ఞానాన్ని తిరస్కరించారు. పలువురు స్త్రీవాదులు మతాధిపత్యాన్ని, పితృసామ్యాన్ని వ్యతిరేకిస్తూ వ్యవస్థీకృత జ్ఞాని సిద్ధాంతాలకు, హేతుతర్కాలకు ప్రాధాన్యత ఇచ్చారు.

క్రీ.శ 19శతాబ్దం నాటి నుండి సామాజిక సమస్యలను గుర్తించిన సంఘసంస్కర్తలు స్త్రీలకు జరుగుతున్న అన్యాయాలను, అవమానాలను, అణిచివేతలను సామాజికంగా, కుటుంబ పరంగా, కులపరంగా జరుగుతున్న దురాగతాలను గుర్తించారు. ఇంగ్లీషు చదువు మేధావుల ఆలోచనలలో విప్లవాత్మక మార్పులు తీసుకువచ్చింది. రాజారామమోహన్‌రాయ్, ఠాగూర్ వంటి మేధావులు సతీసహగమనాన్ని నిషేధం కోసం పోరాటాలు చేశారు.

ఈ సతీ సహగమనం కొందరు స్త్రీల మూఢత్వంలో ప్రాణాలు అర్పించేవారు కొందర అయితే, కొందరికి మత్తు ఇచ్చి బలవంతంగా మంటలలోకి తోసేశారు.

ఇక ఆంధ్రదేశంలో 1862 నాటికే స్వామినేని ముద్దు నరసింహం 'హితసూచిని' ద్వారా స్త్రీలకు జరుగుతున్న అన్యాయాలను ప్రస్తావించి స్త్రీ జనోద్ధరణకు పాటుపడ్డారు. బాల్యవివాహాలు సరికావు అని హితవు పలికారు. పునర్వివాహాలు జరపడం ధర్మ సమ్మతమని తెలిపారు. అదే సమయంలో స్త్రీలు విద్యవంతులు కావాలని స్త్రీ విద్యాభివృద్ధికి ఎంతగానో కృషిచేసినవారు కందుకూరి వీరేశలింగం పంతులుగారు, బాల్యవివాహాలు తగవని, స్త్రీ పునర్వివాహాలు సమ్మతము సనాతులతో పోరాడి మొదటి వితంతు వివాహం జరిపించారు. కన్యాశుల్కం దురాచరమని ఎలుగెత్తి చాటారు.

స్త్రీ విద్య వ్యాప్తికి తన సాహిత్యంలో ప్రముఖ స్థానాన్ని కల్పించినవారు మహాకవి గురజాడ. వీరు స్త్రీ గొప్పతనాన్ని, స్త్రీ విలువను గుర్తించి ఎన్నో రచనలు, నాటకాలు, కథలు, కవితలు ఎన్నో ఉన్నాయి. స్త్రీ ఆవశ్యకతను గుర్తించి వీరు అన్నమాట.

"ఆధునిక మహిళ చరిత్రను తిరగ రాస్తుంది" అని భవిష్యత్తులో నిర్ధారించారు. ఈ పరిణామలనే నేపథ్యాలే స్త్రీ ఆలోచనలు మార్పులు వచ్చాయి. స్త్రీ సమస్యలను ఎలుగెత్తిచాటడం మొదలుపెట్టారు.

బండారు అచ్చమాంబ 1901లో " అబలా సచ్చరిత్ర రత్నమాల' ప్రకటించి స్త్రీకి జరిగే అన్యాయాలను పేర్కొన్నారు ఆ తర్వాత 1985 తర్వాత ఎందరో కవయిత్రులు, రచయిత్రులు తమ రచనల ద్వారా ప్రకటించారు. ఎందరో మహిళలు రోడ్లెక్కి స్త్రీల హక్కులకై పోరాటాలు చేశారు.

అంతర్జాతీయ మహిళా సంవత్సరం (1975) నాటికి తెలుగులో స్త్రీవాద కవిత్వం అంతగా ప్రారంభం కాలేదు. నాయని కృష్ణకుమారి, ఊటుకూరి లక్ష్మికాంతమ్మ వంటి ఒకరిద్దరు కవయిత్రులే కనిపిస్తున్నాయి.

ఇది 1980-1990 మధ్యకాలంలో అసలైన స్త్రీవాద ఉద్యమం మొదలైనవి చరిత్రను తిరగరాసే విధంగా ప్రకంపనలు సృష్టించాయి. మహిళలను ఎంతో చైతన్యవంతం చేశారు. ఇలా వెలువడిన స్త్రీవాదం ఉద్యమలకు అనుగుణంగా స్త్రీవాద సాహిత్యం విస్తృతంగా వెలువడిన తరతరాల సాహిత్యంలో స్త్రీకే జరిగే అన్యాయాలను ఖండిస్తూ విస్తృతమైన సాహిత్యాన్ని వెలువరించి స్త్రీలలో చైతన్యాన్ని రేకెత్తించాయి. ఈ స్త్రీ వాద సాహిత్యంలో అసలైన మహిళా చైతన్యం ఆధునిక యుగం నుండి ప్రారంభమైంది అని చెప్పాలి. ఆధునిక యుగంలో ప్రక్రియ వైవిధ్యం ఎక్కువ అలాగే స్త్రీవాదంలో కూడా ఆయా ప్రక్రియలలో మహిళా చైతన్యాన్ని కలిగించే విప్లవాత్మకమైన సాహిత్యాన్ని వెలువరించారు. ఆ మహిళా చైతన్యాన్ని కలిగించిన సాహిత్యాన్ని ప్రక్రియపరంగా సంక్షిప్తంగా పరిశీలిద్దాం.

1. కవిత్వం - మహిళా చైతన్యం
2. కథలు - మహిళా చైతన్యం
3. నవలలు - మహిళా చైతన్యం
4. నాటకాలు - మహిళా చైతన్యం
5. ఇతరాలు - మహిళా చైతన్యం

కవిత్వం – మహిళా చైతన్యం

స్త్రీ వాదం ఒక ఉద్యమంగా రూపుదిద్దుకోకముందే తెలుగులో కవయిత్రులు, రచయిత్రులు ఉన్నారు. వారు తక్కువే. వారి ప్రస్తావన ఇప్పుడు అవసరం లేదు. కొత్త దృక్పథాన్ని ఆవిష్కరించిన తెలుగు స్త్రీవాద కవిత్వమే ప్రధానం.

పాశ్చాత్య దేశాలలో ఉద్యమించిన ఫెమినిజం ధోరణిలో మన దేశానికి పాకాయి. విద్యావంతురాలైన మహిళలు మహిళ విముక్తికి రచనలు చేశారు. ఇలాంటి సంఘటనలు అన్ని తెలుగులో స్త్రీవాద కవిత్వాన్ని భీజాలు అయ్యాయి. కొన్ని కవితలను పరిశీలిద్దాం.

వాణిరంగారావు "దీపం" అనే కవితాసంపుటిలోని 1977లో ప్రకటించింది. దీనిలో మహిళా చైతన్య ఛాయ కనిపిస్తుంది. ఉదా॥ "రుధిరమంధారం" అనే కవితను చూద్దాం. స్త్రీ పుష్పావతి కావడం అనే సంఘటన ఈ శీర్షిక సంకేతం.

మా పెరట్లో మందారం
ప్రవిస్తుంది రుధిరం
కన్ను చెదురుతోంది
అహం ఉద్భవించింది
అందులోనే
అభావం, అనుభూతి, అనుభవం
అన్నిటికి మూలం, మా పెరట్లో మందారం

ప్రకృతి సిద్ధమైన స్త్రీ శరీర బాధలను కవీత్వకరించే ధోరణికి వాణిరంగరావు తొలిసారి మార్గం వేశారు. రక్తస్రావం అనే స్త్రీ శరీర బాధకు కవిత్వ గౌరవం కల్పించడం ఇక్కడ నుండే ప్రారంభమైంది అని చెప్పవచ్చు.

తెలుగు స్త్రీవాద కవిత్వంలో అచ్చమైన స్త్రీ గొంతుకను పదునైనా స్వరంలో వినిపించిన కవయిత్రి రేవతి దేవి. ఆమె 1979 సంవత్సరంలో రచించిన 34 కవితాఖండికలు ఆమె మరణాంతరం 'శిలాలోలిత' పేరుతో 1981లో ఒక సంపుటిగా వెలువడింది.ఈ కవితా సంపుటి గొప్పతనం ఏమిటి అంటే

"ఆధునిక కవిత్వపు భావ ప్రకటనారీతిని ఈ సంపుటి ఒక మలుపు తిప్పింది ఒక విధంగా స్త్రీ వాద కవిత్వానికి ఈ సంపుటి నాంది పలికినట్లు తలచవచ్చు.

కడియాల రామమోహనరాయ్ – 20 శతాబ్దం తెలుగు కవిత్వం

ఈ శిలోలాలితలోని ఒక కవిత

"దిగులు
దిగులు దిగులుగా దిగులు
ఎందుకా
ఎందుకో చెప్పే వీలుంటే
దిగులెందుకు" శిలాలోలిత పుట : 16

ఎందుకో చెప్పే దిగుళ్ళు ఉంటాయికాని, ఎందోకో చెప్పలేని 'దిగుళ్లే నేటి సమాజంలో చాలా ఎక్కువ. అందుకే కవయిత్రి దిగులు గురించి ఈ విధంగా వాపోయింది దిగులంటే అందరికీ తెలుసు. కానీ దిగులు ఎందుకో ఎందరికో తెలియదు.

రేవతిదేవి కవిత్వంలో ఇటువంటి దార్శినిక సత్యాలెన్నో గోచరిస్తాయి.

మగవాళ్ళకి చాటుగానూ
ఆడవాళ్ళకి పబ్లిగ్గానూ
రుచించని మాట చెప్పనా
మగకి ఆడకి
శీలాన్ని ఆస్తినీ
సమంగా వర్తింపజేయండి పుట: 19

ఎలా అంటే ఇండ్లు, పొలాలు, డబ్బు, అధికారం, హోదా వంటివి మగవాని ఆస్తిగా, శీలం మాత్రం స్త్రీ ఆస్తిగా పరగణింపబడుతున్న వ్యవస్థలో ఆస్తిని స్త్రీలకు, శీలాన్ని పురుషులకు సమానంగా పంచాలని దృక్పథం రావాలని కొరుకుంటుంది. పురుషునితో పాటు సమానత్వం స్త్రీకి దక్కాలని రేవతి ఈ చిన్న కవితలు బలంగా చెప్పగలిగింది. ఇది స్త్రీలోని మహిళా చైతన్యంగా భావించవచ్చు.

ఈ రేవతిదేవి ఎవరో తెలియకపోవచ్చు నేమోగాని ఆమె కవిత్వం స్త్రీవాద ఉద్యమకవిత ప్రపంచానకంతటికి తెలుసు.

తెలుగులో స్త్రీవాద కవిత్వం 1980లో నుండి పురుడు పోసుకున్నప్పటికి అంత తొందరగా ఎదుగుదల కనిపించ లేదు. 1984 సంవత్సరం మార్చి 23వ తేది ఆంధ్రజ్యోతి వారపత్రికలలో 'బందిపోట్లు' అనే కవిత అచ్చయింది. ఈ కవిత రాసినవారు సావిత్రి.

కవిత చిన్నదే కాని అందులో వ్యక్తమైన భావం స్త్రీ జీవితంలోకి స్వేచ్ఛరాహిత్యమంత పద్ధతి పరిశీలించండి.

పాఠం ఒప్ప జెప్పక పోతే
పెళ్లి చేస్తానని
పంతులుగారన్నప్పుడే
భయం వేసింది
ఆఫీసులో నామొగుడున్నాడు
అవసరమున్న సెలవివ్వడాని
అన్నయ్య అన్నప్పుడే
అనుమానం వేసింది
వాడికేం మహారాజుని
ఆడా మగా వాగినప్పుడే
అర్థమైపోయింది
పెళ్లంటే పెద్దశిక్షని
మొగుడంటే స్వేచ్ఛ బిక్షుకుడని
మేం పాలిచ్చి పెంచిన జనలలో సగమే
మమ్మల్ని విభజించి పాలిస్తుంది"

చేరా. సాహిత్య మహిళావణం పుట:2

ఇందులో భయంవేసింది. అనుమానం వేసింది. అర్థమైపోయింది అనే క్రియా పదాలతో వివాహవ్యవస్థ స్త్రీ అణిచివేతకు కారణమవుతున్న వాస్తవాన్ని చాల బలంగా వ్యక్తం చేసింది.

ఓల్గా

ప్రారంభంలో విప్లవ కవితలు రాసిన ఓల్గా తర్వాత స్త్రీ సమస్యలపై దృష్టికేంద్రికరించింది. ఈమె కవితలలో మెహింది స్త్రీల విజ్ఞప్తి విశేషంగా ఉంటుంది. ఇది యదార్థ సంఘటనకు ప్రతిరూపమైన కవిత. విటుల వలన, పోలిసుల వలన నానా బాధలు పడుతున్న వేశ్యలు చేసిన విజ్ఞప్తి విశేషంగా ఉంటుంది. ఇది యదార్థ సంఘటనకు ప్రతిరూపమైన కవిత. విటులువలన, పోలిసుల వలన నానా బాధలు పడుతున్న వేశ్యలు చేసిన విజ్ఞప్తి.

"బతకడానికి నానా చావు చస్తున్న వాళ్ళం
చావడానికి మా దగ్గరకు రాకండి" అని విజ్ఞప్తి చేస్తారు.

ఈ కవిత చదివాక ఈ వ్యవస్థపై తీరుపై ఆగ్రహం కలుగుతుంది. దీన్ని మార్చాలన్న ఆవేశం కలుగుతుంది. అలాగే మరో కవయిత్రి జయప్రభ.

స్త్రీవాద కవయిత్రులలో ఈమెది శక్తివంతమైన కవిత. జరుగుతున్న అన్యాయాలపై ఈ స్పందించే తీరు స్పష్టంగా ఉంటుంది. ఉదా॥ ఒక కవిత 'పైటను తగలెయ్యాలి' అనే కవితలో ఇలా ఉంటుంది.

"పైటకొంగును చూస్తే
నాకిందుకో ప్రాతివత్యం గుర్తొకొస్తుంది
నా మీద
తరతరాల నుంచి మోపిన
అపనింద పైట
నన్ను అబలను చేసిన
పితృసామ్యపు అదృశ్యహస్తం పైటె"

"రెండు కళ్ల నుంచి -చూపులు
సూదుల్లా వచ్చి మాంసపు ముద్దలపై
విచ్చలవిడిగా తిరుగుతుంటాయి
ఇప్పుడు ఆ కళ్ళని వెంటాడడానికి
కళ్లతోనే యుద్ధం చేస్తాను"

ఆధునిక యువతుల చూపులకు పదును పెట్టుకో వలసిన అవసరం గుర్తుచేశారు.

విమల

స్త్రీని పునరుత్పత్తి పరికరంగా తలచి బాధలకు గురి చేస్తున్న పురుషస్వామ్యంపై విమల తన కవిత్వంలో శక్తి వంతమైన దాడిచేశారు. వీరి కవితలలో ' మా కలల ప్రపంచం' వంటిల్లు, వేశ్య శిశువు ప్రధానమైనవి ఉదా॥ వంటిల్లు కవితను పరిశీలిద్దాం.

ఎంత అద్భుతమైనదీ వంటిల్లు
రుచులు రుచులుగా పరిమళాల్ని వెదజల్లుతూ
మా అమ్మో నడుస్తున్న వంటగదిలా ఉంటుంది.

ఒక్కొక్కసారి ఆమె మండుతున్న పొయ్యిలాగా కూడా ఉంటుంది.

ఈ వంటింటిని తగలెయ్య
ఎంత అమానుషమైనదీ వంటగది
ఇక గిన్నెలపై ఎవరి పేర్లు వద్దు
మన పిల్లలకోసం వంటింటి వంట గదులు
కూల్చేందుకు రండి

- 'వంటిల్లు'

అలాగే మరో కవితలో
మనమంటే 34 24 35. కొలతలైన చోట
మొటిమలు మొలవడం జుట్టు రాలడం
సడుము సన్నగా లేకపోవడమే
మన నిరంతరాందోళనలైన చోట
ఎంత హింస అనుభవిస్తున్నమో కదా!

- " సౌందర్యాత్మక హింస"

ఇక దీనికి స్వస్తి చెప్పి శ్రమ సౌందర్యాన్ని మానవ విలువల్ని ప్రేమిద్దాం అంటారమే.

ఘంటసాల నిర్మల

ఈమె కవితలు తక్కువ సంఖ్యలో ఉన్నా కవితలే స్త్రీవాద భావనలకు ఎంతో అండగా నిలిచాయి. ఈమె ఒక కవిత చూద్దాం.

1988లో విజయవాడలో కొందరు స్త్రీలపై వ్యభిచారం నేరం మోపి. వారి మెడలో " నేను వ్యభిచారిని" అనే బోర్డులు తగిలించి అవమానించారు. దాని ఖండిస్తూ దీనిలో వీర్యాలవర్షం, రతిరోత, విరిగినకంటిచూపు వంటి అందమైన వారి చిత్రాలు కనిపిస్తాయి.

నిర్మల రాసిన కవిత
వేల వేల వీర్యాల వర్షల్ని
కళ్ళు మూసుకునయినా భరిస్తున్న దాన్ని
రంగులు చిట్లిన రతిరోతకు జరిస్తున్న దాన్ని
ఆవేశము అసహ్యము రెండు చేతులు
ఆగంతకుల ఆ లింగనాన్ని
ఆప్యాయిస్తు దాన్ని
చుంబననీ చీత్కారాన్ని
దోయిలించిన దాన్ని
తీరని కొర్కెల తీవ్రదాహానికి
కౌగిలి చలివేంద్రాన్ని మంజూరు చేసేదాన్ని
పావలా నుంచి పదివేల వరకు అయినా
కరకు కాసుల్ని కామంతో
తూచగలదాన్ని
కాలాన్ని మౌనంగా తుంచగలదాన్ని
కాంక్షల సర్పపరిష్యంగాల నుంచి
అన్నమనే అమృతాన్ని ఆహ్వానిస్తున్న దాన్ని
మీ కంటిచూపు - నొసట చిట్లింపు
అధమత్వానికి ఆవల
కేవలం నీచత్వానికి క్షుద్రప్రతీక

- ఎ కాల్‌గల్స్ మెలిన లాగ్

చల్లపల్లి స్వరూపరాణి

చల్లపల్లి స్వరూపరాణి కవయిత్రి, కథారచయిత్రి, కాలమిస్ట్‌గా స్త్రీవాద సాహిత్యం ఈమె ఒక ప్రత్యేకమైన బాణీ. ఎలా అంటే ఆదివాసి, దళిత స్త్రీవాద కవిత్వంలో మహిళ జీవన చిత్రణ ఎలా ఉంటుందో తెలిపారు. ఈమె రాసిన మంకెనపూవు, వేకువ పిట్లా మొ॥ కవితాసంపుటాలు ఎంతో ప్రసిద్ధం వారి ఒక కవితను చూద్దం.

దళిత స్త్రీ జీవితాన్ని చిత్రించే కవిత.

చెట్టుకొమ్మకేసిన ఊయ్యల గుడ్డలో
చంటోడు పాలకోసం గుక్క పెడుతున్న
అమె మాత్రం తలెత్తకుండా, చేనుకు
ఎరువేస్తూనే ఉంటుంది
ఆలనా పాలనాలేని ముద్దుల కూతురు
మురికి గుంటల్లో ఆడుతున్న
ఆ మట్టి చేతులు, ఏమి పట్టనట్లు
కలుపు తీస్తూనే ఉంటాయి

బిడ్డలపై మమకారం ప్రతి తల్లికి ఉంటుంది. కాని దళిత స్త్రీ పరిస్థితి వేరు, ఉయ్యాల గుడ్డ వైపు చూస్తు బిడ్డ ఏడుపు వింటున్నా ఆ పని ఆగిపోతే కూలి డబ్బులు రాకపోతే కుటుంబం ఎలా గడవాలి. పనిసరిగ్గా చేయక పోతే యజమాని తిట్టుకు భయపడి గుండె పట్టుకుని దళితతల్లి తన ప్రేమను ఏ విధంగా చంపుకుంటుందో

ఈ కవిత యదార్థ సంఘటనకు అద్దం పడుతుంది. ఈమె కవితలో 'మా యమ్మ' అనే కవిత దళిత స్త్రీ సంవేదనకు ప్రతిఫలనాలు. ముఖ్యంగా మాయమ్మ కవిత దళిత స్త్రీ జీవిత చిత్రం.

'యింట్లో పెళ్ళాంగా నిత్యావసర వస్తువై
వీధుల్లో అవహేళనల మూటలు మోసే
కులంతక్కువ గాడిదవై
అటుగోడ దెబ్బ, యిటు చెంప దెబ్బ
వెరసి గాయపడింది నీ బతుకేగదా?' అన్నప్పుడు దళిత మహిళపై జరిగే ముప్పేట దాడి,

'మాల మాదిగ ముండలంటూనే
అంటరాని వంటిని
కోరికల కొలమానాలతో కొలిచే
వూరి అరుగులను
మరుగుదొడ్లకు మల్లె ఫినాయిల్ తో కడుగుదాం
ఆ బంగారు చేత్తోనే
నిన్ను బాబుగాడి సొమ్ములా వాడుకునే
పెట్టుబడిదారీ పెనిమిటిని
సర్ఫ్‌లో నానబెట్టి పై నుండి క్రిందకి జాడిద్దాం'

అని దళిత స్త్రీ జీవితంలోని అభద్రతకూ, అంటరాని తనానికీ, దళిత స్త్రీ పై జరిగే అన్ని రకాల హింసలకూ అద్దం పట్టింది. భరిస్తూ బ్రతికి వుండడంలో నుంచి నిగ్గదీసి నిలిచి వెలగడం వరకూ సాగుతోన్న దళిత స్త్రీ జీవనగమనంలో గట్టిగా వినిపిస్తున్న స్వరం స్వరూపారాణి.

ఈ కోవలోనే వెలువడిన
పాటిబండ్ల రజని - ఎర్రజాబిల్ల ఎరీనా
అనిశెట్టి రజిత - నేనోక నల్ల మబ్బునౌతా
మహేజబిన్ - ఆకురాలు కాలం
రెంటాలకల్పన - నేను కనిపించే పదం
కె. గీత - ద్రవ భాష
మందారపు హైమావతి - నిషిద్ధాక్షరి
శీలాలోలిత (లక్ష్మి) - పంజరాన్ని నేనే, పక్షితినేనే
ఉమాదేవి - శిలా పుష్పాలు
ఘంటసాల నిర్మల - బందిపోట్లు

ఇలా చెప్పుకుంటూ పోతే పురుషాధిక్య సామాజిక వ్యవస్థ స్త్రీని ఎన్ని విధాలుగా దిగజార్చిందో స్త్రీ వాద కవితలు చూస్తేనే అర్థం అవుతుంది.

చివరిగా స్త్రీ అస్థిత్వం కోసం, ఉనికికోసం, గుర్తింపు కోసం పోరాటం చేస్తాను అని కవితను చూద్దాం.

తమ్ముడి రాగలాపన - అన్నగారి ఘీంకారం
నాన్న నొనట చెట్లింపు - ఎడతెగని అమ్మ పురమయింపు
కొండ చిలువలా నన్ను చుట్టుకున్న ఇంటిపని
పగలిన గుండెతో ఎన్నాళ్ళని నేను మాత్రం
చిర్నవ్వుల అచ్చదన కప్పుకోగలను
నన్ను నేను నిలబెట్టుకునే కలాన్ని ఇష్టపడతను
నన్ను చుట్టుకున్న పెద్దపులితో ఇక నా పోరాడం

అయితే స్త్రీవాద కవిత్వానికి అనుకూలంగా, వ్యతిరేకంగా 1192-93లో తీవ్రస్థాయిలో చర్చలు, విమర్శలు జరగాయి.

కథాసాహిత్యం - మహిళా చైతన్యం

ఆధునిక సాహిత్య ప్రక్రియలలో దాటిగా సాగుతున్న ప్రక్రియ కథ. తెలుగు సాహిత్యంలో స్త్రీవాదోద్యమం ప్రపంచీకరణ యుగానికి ముందు దశాబ్దిలో ప్రారంభ మైనట్లు అనిపించినా నిజానికి తెలుగు ఆధునిక సాహిత్యం మొదలైనప్పటి నుండే వచ్చింది. అయితే అది స్త్రీవాద ఉద్యమంగా పిలువకపోవచ్చు. కానీ స్త్రీల గురించి బలమైన సాహిత్యమే వచ్చింది.

తెలుగు కథానిక విషయానికి కొస్తే భగవంతుని సృష్టిలో కెల్లా ఉత్కృష్టమైన వస్తువు ఏది అంటే విద్యనేర్చిన స్త్రీ అని దిద్దుబాటు కథలో గురజాడ అప్పారావు అంటారు. స్త్రీని వస్తువుగా చూడడం, వస్తువు అనడం నేటి స్త్రీవాదం ప్రకారం సరైంది కాదు. అయినా అప్పటి పరిస్థితితో చదువుకు దూరమైన స్త్రీకి చదువు ఆవశ్యకతను చెబుతూ గురజాడ ఆ మాటలు అంటాడు.

బహుజన భావజల సారధి జ్యోతిరావుపూలే కూడా స్త్రీ విద్య ప్రాముఖ్యతను గుర్తించి తన భార్యను మొదటి మహిళా ఉపాధ్యాయురాలిగా చేశాడు. ప్రపంచంలో

సగాంగా ఉన్నా స్త్రీలు ప్రపంచ నిర్మాణంలో, సామాజిక అవసరాలు తీర్చడంలో, కుటుంబభారాన్ని మోయడంలో పురుషులకంటే ఎక్కువగా బాధ్యత వహిస్తున్న వారిని తక్కువగా చూడడం అనేది ప్రధానమైన సమస్య.

'భోజ్యేషుమాత, శయనేషురంబా' అని స్త్రీని వ్యక్తిత్వం లేని చూడడం ఈ దేశంలో చూస్తూనే ఉన్నాం ఇలాంటి అంశాలను ప్రశ్నిస్తూ స్త్రీవాద ఉద్యమం వచ్చింది తెలుగు సాహిత్యంలో స్త్రీ తరపున బలమైన సాహిత్యాన్ని సృష్టించే వారు చలం

స్త్రీకి శరీరం ఉంటుంది
దానికి వ్యాయామం కావాలి
స్త్రీకి మనసు ఉంటుంది
దానికి ఆలోచన కావాలి

అని స్త్రీల తరపున వకాల్తాపుచ్చుకన్న కవి చలం ఇదే తర్వాత స్త్రీ రచయితలు స్త్రీ తరపున కథలు రాయాడానికి మార్గంగా నిలిచింది. చలం కథలలో కొంత అసభ్యత ఉంటుందని కొందరు వాదించిన స్త్రీల పట్ల ఈ సమాజం ప్రవర్తిస్తున్న తీరుకు ఇలా అవసరమని భావనలో ఉంది. చలం రాసిన కథలన్ని స్త్రీవాద కథలే.

చలం తర్వాత స్త్రీవాద ఉద్యమానికి సిద్ధాంతాలు పరమైన అవగహనలో ముందుకు వెళ్లిన స్త్రీవాద ప్రతినిధి ముప్పాళ్ళ రంగనాయకమ్మ. రంగనాయకమ్మ తిరుగు బాటు తత్వాన్ని నేర్పించి, రంగనాయకమ్మ 'నేనేందుకు స్త్రీనయాను' మీటింగ్లు పెళ్లి లాంటి కథలు రాశారు. అయితే ఈ కథలు సిద్ధాంత పరమైన మార్క్సిస్టు దృష్టికోణం ఉంటుంది.

రంగనాయకమ్మ తర్వాత బలమైన స్త్రీవాద కథలు రాసి రచయిత్రి ఓల్గా. ఓల్గా రాసిన "అయోని" లాంటి కథలు, రాజకీయ కథలు స్త్రీవాద చైతన్యాన్ని ముందుకు నడిపారు.

ఆ తర్వాత సత్యవతి, అబ్బూరి ఛాయదేవి రాసిన "ఇల్లలకగానే" "బొస్సాయి బతుకులు" కుపిలిపద్మ "మసిగుడ్డ" కొండెపూడి నిర్మల కథలు స్త్రీ మహిళా చైతన్యాన్ని తట్టిలేపాయి.

స్త్రీ వాదులు స్త్రీ వాద ఉద్యమం పేరుతో అగ్రవర్ణ స్త్రీల గురించే పేర్కొన్నారని దళిత స్త్రీవాదం కావాలని జుపాక సుభద్ర, జాజుల గౌరి, గోకు శ్యామల, విమల లాంటివారు. స్త్రీవాదము లేవనేత్తిన సమస్యలతో దళిత స్త్రీ సమస్యలు లేవని అనేక దళిత స్త్రీవాద కథలు రాశారు.

అయితే దళిత బహుజన స్త్రీ దృష్టి కోణంలో నుండి మరింత బలమైన స్త్రీవాద సాహిత్యం రావల్సి ఉంది.

మహిళా చైతన్యాన్ని కలిగి ఉన్నా కొన్ని కథలను పరిశీలిద్దాం.

తెలుగు కథలు మహిలా చైతన్యం గల కథలను పరిశీలించాలంటే అది గురజాడ నుండే మొదలైంది అని చెప్పాలి. గురజాడ కవితలలోగాని, కథలలోగాని, నాటక లలో గాని స్త్రీ సమస్యలను ఎన్నింటినో ఇతివృత్తాలుగా స్వీకరించి మహిళా చైతన్యానికి శ్రీకారం చుట్టారు.ఆ తర్వాత విద్యా అందుబాటులోకి వచ్చాక విద్యావంతులైన స్త్రీలు కలం పట్టి రచయిత్రులై మానవ సంబంధల తీరు తెన్నులను, స్త్రీ పట్ల ఈ సమాజం వ్యవహరించిన తీరును ఇతివృత్తాలుగా తీసుకుని తమ రచనలలో కొత్త చైతన్యాన్ని రగిలించారు. మగవాడు ఆడవారిని అణిచివేయడాన్ని, అన్యాయం చేయడాన్ని వాళ్ళ మధ్య ఉండే మానవీయ విలువల తేడాలనీ, స్త్రీ స్వేచ్ఛ, హక్కులు స్త్రీ తిరగ బడవలసిన అవసరాన్ని శ్రమదోపిడి విధానాలను స్త్రీ రచయితలు ఎండగట్టారు. అలాంటి కొన్ని స్త్రీవాద కథలను పరిశీలిద్దాం.

ఈ కథలు కూడా మొదటి దశలో యదాస్థితిని తెలియజేయడం రెండవ దశలలో కథలలో పదును దేరడం, మూడవదశలో ఎదురు తిరిగి పోరాడే తీవ్రస్వరం వినబడుతుంది. మారుతున్న చైతన్యానికి ఈ కథలు అద్దం పడుతున్నాయి.

అలాంటి కథలలోముక్తేవి భారతిగారి కాపలా, మృణాళిని, కుక్కబతుకు, జె. భాగ్యలక్ష్మి గారి 'జపనీస్ బొమ్మ' ఫ్రీడమ్ ఎట్‌మిడ్‌నైట్, నిడదవోలు మాలతీగారి నిజానికి - పెమినిజానికి మధ్య, ఎస్.జయ రాసిన రెక్కలున్న పిల్ల'.

ఇక రెక్కలొచ్చిన స్త్రీలు జెండరు కోణం నుండి వర్ణ దృక్పథం నుండి స్త్రీల ఘర్షణలను, సంక్షోభాల్ని చిత్రిస్తూ భౌతికంగాను, మానసికంగాను, అణిచివేతకు సంబంధించిన అంశాలతో కూడిన రచనలు చేసినవి రచయిత్రులు పి.సత్యవతి, ఓల్గా, కుప్పిలిపద్మ, సుజాతరెడ్డి మొదలయినవారు.

మరికొందరు ఆఫీసుల్లో మగవారితో పాటు సమంగా పనిచేసినా గుర్తింపు లేకపోవడం. ప్రమోషన్లలో పై ఆఫీసర్లు ఆమెను లొంగదీసుకోవడానకి ప్రయత్నం చేయడం, స్త్రీ ఉద్యోగులను పురుగులుగా చూడడం ఇటువంటి తీరులు మారాలని అబ్బూరి ఛాయదేవి కర్త కర్మ క్రియ కథల్లోను, కొండెపూడి నిర్మలమ్మ ''పురుగు'' కథ మొదలయినవాటిలో కనిపిస్తాయి.

కుటుంబ సంబంధాలులైన సాంఘిక, నైతిక, రాజకీయ, మత సంబంధాలు ఏమైనా అన్ని ఆర్థిక విలువల సంబంధాలే. అందూ తెలిపే కె.రామాలక్ష్మి గారి కథ 'ఏ టిపికల్ సన్'.

అలాగే వి.వి.ఎన్. అచ్యుతవల్లి గారి ముత్యాల చెరువు, అలరాస - పుట్టిల్లు, సుజాతరెడ్డిగారి ధర్మపత్ని, వి.ప్రతిమగారి 'గంగజాతర', ఇలా ఎన్నో కథలు మహిళల సమస్యలను ఎలిగెత్తి చాటుతూ మహిళలను చైతన్యం వైపు నడిపించడంలో ఉదా॥ ఒక కథ చూద్దాం.

''రంగనాయకమ్మ - మురళివాళ్లమ్మ''

ఒక స్త్రీ స్వతంత్ర్యంగా తన కాళ్ళ మీద తను నిలబడి, ఆర్థికంగా ఎదిగి తన పిల్లలను పెంచి అత్తగా కొడుకు భార్య పట్ల చూపిన సానుభూతి ఎంతో విలక్షణంగా కనిపిస్తుంది. సాధారణంగా అత్తాకొడళ్ళలో అత్త గయ్యాళిగాను, కొడల్ని రాసి రంపాన పెట్టే వ్యక్తిగా మనకు అనేక కథలు ఉన్నాయి.

కొడలిపట్ల ప్రేమ, సానుభూతి చూపిస్తూ అత్తకొడళ్ళ సంబంధాలలో మార్పును సూచిస్తూ సమాజంలో కొత్త అత్తను ఆవిష్కరించింది.

కొడుకు పెద్దగా చదువుకుని బాగా డబ్బు సంపాదిస్తూ మరొక అమ్మాయితో వ్యవహారం నడుపుతూ ఉంటే ఈ అత్త కొడలివైపు నిలబడి అతడ్ని వదిలేయమని కొడలి పక్షాన నిలబడి పోరాడుతుంది. మనసులేని కాపురం చేయడం అనవసరమని అంటుంది.

అత్తగా స్త్రీ రూపం మారుతున్న సామాజిక విలువల్లోంచి కొత్తగా పుట్టిన దృక్పథం, కోడలకు మనిషిగా, తానొక ఆడదిగా కోడలకు అండగా నిలబడి స్త్రీ చైతన్యానికి సంకేతంగా భావించవచ్చు.

కథాసాహిత్యంలో దళితస్త్రీ కథా సాహిత్యాన్ని ప్రత్యేకంగా ప్రస్తావించాలి. దళిత స్త్రీ ఆది ఆంధ్ర ఉద్యమకాలం నుండి ఆత్మగౌరవం కోసం రచనలు చేస్తూనే ఉన్నారు. దళిత మహిళ కులదోపిడి, అంటరానితన వివక్ష, శ్రమదోపిడి, హింస, దురాచారాన్ని వారు అనుభసారాన్ని ఆధిపత్యం భావజలాన్ని ప్రశ్నిస్తూ. కథా సాహిత్యంలో గోగుశ్యామల సంపాదకత్వంలో వెలువడిన 'నల్లపొద్దు' స్త్రీల కథలలో దళిత కథా సాహిత్యానికి ఆత్మగౌరవ ముద్రను వేశాయి. ఎందరో దళిత స్త్రీలు అద్భుతమైన కథాసాహిత్యాన్ని సృష్టించారు. ముఖ్యంగా తాడినాగమ్మ, నంబూరి పరిపూర్ణ, డాక్టర్ గ్లోరియా, లలితాపీటర్, సెంటినా సరోజని, మానుకొండ జ్యోతి, గెద్దాడ కస్తూరి, గుజర్లమూడి నిర్మలారాణి, దాసరి శిరీష, బలిజేపల్లి విజయలక్ష్మి, భూషి హేమ, పుట్ల హేమలత, జాజుల గౌరి, చల్లపల్లి స్వరూపరాణి, చంద్రశ్రీ, ఎం.ఎం.వినోదిని, జుపాక సుభద్ర, మామిడి సత్యవతి, గోగు శ్యామల, ఎస్. శరత్‌జోత్స్నారాణి, బి.విజయభారతి, ఎస్.శరత్‌జోత్స్నారాణి జల్ల ఇందిర మొదలయిన రచయిత్రులు ఎందరో దళిత స్త్రీల పక్షనా నిలిచి కవితలు, కథలు, నవలలు రాశారు.

మొదటితరం చదువుకున్న దళితస్త్రీలలో ఒకరు తాడి నాగమ్మ, ఈ 'ముద్దు' కథలలో ఒక స్త్రీ వలసవాదానికి వ్యతిరేకంగా విదేశివస్తు బహిష్కరణ చేయాలని ఒక నాగరికుడ్ని కోరగా అందుకు ప్రతిఫలంగా ముద్దు' కావాలంటాడు.

విదేశీ హాలహలమునగా ఆహుతి అవుతున్న నిబోటి సోదరుణ్ణ రక్షింపనొక ముద్దీయిపలెనా అనడంతో అతనికి మూర్ఛవస్తుంది. ఈ కథ సమయస్ఫూర్తి, స్థానికత పట్ల ఆమె దృక్పథం తెలుస్తుంది.

నంబ్రాది పరిపూర్ణరాసిన 'స్మార్తి కథ

ఇందుల విమల మధ్యతరగతి స్త్రీ అయినా తన భర్త చేస్తున్న పనులు సహించలేక, అతన్ని ఎదరించలేక సతమతమవుతుంది. అయితే ఆమె వద్ద పనిచేసే మస్తానమ్మ తన భర్త చేస్తున్న ఆగడాలను ఎదిరించి బుద్ధి చెబుతుంది. మస్తానమ్మ పని విమలను ఆలోచింపజేసి చైతన్యం కలిగిస్తుంది.

జాజుల గౌరి ''మన్నుబువ్వ'' దళిత జీవితలలోని కష్టాల లోతులను తెలియజేసే కథ ఇందులో ఆకలికి తట్టుకోలేక తల్లిని అన్నం పెట్టమని అడిగితే ఆ బిడ్డను బాధ పెట్టలేక మన్నుతిని కడుపే నింపుకోవటం దళితుల దుర్భర దారిద్ర్యానికి నిలువుటద్దంగా చెప్పవచ్చు.

మామిడి సత్యవతి ''తెర తొలిగింది'' కథలో తల్లిలేని పిల్లలు పరిస్థితి ఎంత దయనీయంగా ఉంటుందో తెలుస్తుంది.

చిలుకూరి దీవెన రాసిన 'ఆటకట్టు' ఈ కథలలో క్రీడా రంగానికి సంబంధించిన వివక్షను ప్రశ్నిస్తుంది. క్రీడా రంగంలో దళితులను అణిచివేసే ప్రయత్నాలను ఎండ గడుతుంది.

జుపాక సుభద్ర దళిత స్త్రీవాద కులం, వర్ణం, పురుషాదిపత్యలతో పాటు ప్రాంతీయత ఎలా పని చేస్తుందో ఈమె కథలలో తెలుస్తుంది.

ఆ కథలలో దళిత కథ సాహిత్యంలో మాదిగ కథా సాహిత్య అనేక అంశాలను ఎలుగెత్తించింది. దళిత స్త్రీని సంస్కృతి సంప్రదాయలపేర్లుతో, తెలంగాణలో దోరల ఏలుబడిలో జోగినీ వ్యవస్థ. ఇలా అనేక దురగతులను ప్రశ్నించింది.

నవలా సాహిత్యంలో - మహిళా చైతన్యం

ఆధునిక సాహిత్యంలో నవలా సాహిత్యానికి ఒక ప్రత్యేక స్థానం ఉంది. ఎలా అంటే నవల పరిధి అన్నింటి కంటే విస్తృతంగా ఉండడం ఒక ఎత్త అయితే ఈ విస్తృత విషయ వివరణలో సమకాలీన వాస్తవిక జీవితాల్ని, ఆ జీవితంలో సంభవించే అనేకాంశాలను ఈ నవలా సాహిత్యంలో ప్రస్తావించడానికి అవకాసం ఉంటుంది. రచన చేసేవారి అవగాహనబట్టి విస్తృతమైన అధ్యయనం, విశ్లేషణలో ఒక పరిపూర్ణత సాధించే అవకాశం ఉంది.

అందుకే నవలలు ప్రధానంగా నాలుగు లక్షణాలు కనిపిస్తాయి.

1. వాస్తవికత, 2. కాల్పనికత, 3. ఊహాకల్పనా చమత్కృతి, 4. సమాహార స్వభావం.

ఈ నాలుగు లక్షణాలు ఏ నవలలో సహజంగా అమరుతాయో ఆ నవలను ఉత్తమ నవలగా భావించాల్సి ఉంటుంది. ఇక సంస్కరణ రంగంలో సామినేని ముద్దు నరసింహ నాయుడు, కందుకూరి వీరేశలింగం, రఘుపతి వెంకట రత్నం నాయుడు, ముత్తు లక్ష్మీరెడ్డి, దుర్గాబాయి మొదలైన వారితో మొదలుకుని మల్లాది సుబ్బమ్మ వరకు అనేక ఉద్యమాలు నడిపారు.

ఎన్నో సంస్థలు స్థాపించారు. ముఖ్యంగా స్త్రీ విమాన రంగంలో స్త్రీ శక్తి సంఘటన, ఆస్మిత, అన్వేషి వంటి సంస్థల ఉద్యమాలు నడిపాయి.

ఇక సాహిత్య రంగంలో గురజాడ, శ్రీపాద, చలం, కుటుంబరావు మొదలుకుని ఓల్గా వరకు స్త్రీ జాగృతి కోసం, విమోచన కోసం, ప్రతిపత్తి కోసం, స్వేచ్ఛకోసం రచనలు చేశారు.

తెలుగు సాహిత్యంలో విభిన్న మార్గాలలో కవితలు వెలువడుతున్నట్లే కథలు, నవలలు కూడా తమదైన మార్గంలో విస్తృతంగా ప్రచారంలోకి వచ్చాయి. క్రమ క్రమంగా నవలా రచన చేసే స్త్రీలు అధికంగానే ఉన్నారు.

ఒక స్త్రీ నవలా ప్రక్రియను గ్రహిస్తున్నప్పుడు ఆ స్త్రీకి ఏర్పడే అనుభూతులు తనకు తనుగా అర్థం చేసకుని, వారి మానసిక పోరాటాలు, పరస్పరం ఏర్పడుతున్న విరుద్ధభావాలు, అపార్థాలు, అవమానాలు, ఆనవాలుగా ప్రతిబింబిస్తాయి.

ఈ విశ్లేషణ సందర్భంలో రచయిత ఎదుర్కొనే విభిన్న సమస్యలు చర్చిస్తుంది. అనేక దురాచారాలను, దుండగు లను, సంప్రదాయ మూఢవిశ్వాసాలను ప్రదర్శిస్తుంది. ఈ విషయంలో అన్ని చెప్పడం కాదు. ఆ రచయిత్రి ఒక ప్రత్యేక రచనా విధానాన్ని అలవచ్చుకుంటుంది.

ఇలా ఎవరికి వారు ప్రతి నవల లోనూ ఒక సమస్యను ప్రదర్శిస్తూ ఆ సమస్యలకు చక్కటి పరిష్కార మార్గాలను చెబుతూనో లేదా ఆ సమస్యలను సమస్యలుగా మన ముందు పెడుతూ చర్చకు లేవనెత్తుతున్నారు.

కనుక నవలా సాహిత్యంలో పురుషుల కంటే భిన్నంగా ఎందుకు నవలా రచయితలు నవల సాహిత్యాన్ని తీర్చి దిద్దారు. తనకు పరిచయం ఉన్న భాషను, జాతీయాలను విరివిగా ఉపయోగిస్తూ కథను రక్తికట్టించారు. అలాగే సర్వసమాన్యంగా కనిపించే రచనా శైలిలతో చక్కని వర్ణనలు, నన్నివేశ చిత్రాలు, ఆవేశంతో కూడిన సంఘటనలు ఎంతో విమర్శనాత్మకంగా తీర్చిదిద్దారు.

నవలా సాహిత్యంలో స్త్రీ రచన ప్రస్థానం ఎలా ఎదిగింది. అంటే పాఠకులు ఈ నవలను ఆదరించడంలో ఈ నవలలు చలనచిత్రాలకు కూడా ఇతివృత్తాలుగా నిలిచాయి. ఇలా స్త్రీలు సృజించిన నవలా సాహిత్యంలో ప్రశంసనీయమైన మహిళా చైతన్యం ఉద్యమస్ఫూర్తి కనిపిస్తుంది. అలాంటి నవల రచయిత్రులను కొందరిని చూద్దాం.

1. డా॥ సి. ఆనందారామం - ఈ ప్రశ్నకు బదులేది, పదివేల గోపికలు ఒక కథ, వెలుగుబాట మొ॥నవి.
2. ఓల్గా - ఆకశంలో సగం, మాధవి, సహజ స్వేచ్ఛ
3. డి. కామేశ్వరి - అగ్నిపరీక్ష, పరాజితులు, విధివంచితులు
4. కొడూరు కౌసల్యాదేవి - ఉషస్సు, చక్రవాకం, తపోభూమి, పూజారిణి
5. మాలతీచందూర్ - భూమిపుత్రి, సద్యోగం
6. కె. రామలక్ష్మి - ఆశకు సంకెళ్ళు, దారి తప్పిన తండ్రి
7. ద్వివేదుల విశాలక్ష్మి - గోమతి, గ్రహణం విడిదింది
8. శ్రీదేవి - అనురాగ శిఖరాలు, పటిలోని నీటిపూలు, బంగారు పంజరం
9. మన్నెం శారద - చంద్రోదయం, స్టిప్ ఫాదర్
10. ఇల్లిందుల సరస్వతి - నీ చాంచను కల్మోక్ష, పిల్లి కూతుళ్ళు, రంగవల్లి
11. వాసిరెడ్డి సీతాదేవి - ఉరిత్రాడు, మానని మనసు, రాబందులు - రామచిలుక, వైతరణి, సమత
12. మాదిరెడ్డి సులోచన - అందగాడు, అద్దాలమేడ, జననీ జన్మభూమి, జీవనయాత్ర, ప్రేమలు - పిళ్ళిళ్లు
13. యద్దనపూడి సులోచనారాణి - ఆరాధన, నీరాజనం, మౌనపోరాటం, విజేత, సుకుమారి
14. తెన్నేటి హేమలత - మహానగరంలో స్త్రీ, నటి, మీగిలేఏందేమిటి, వారిజ
15. నండూరి పరిపూర్ణ - పొలిమేర (ఈ నవలలో కొలిమి దళిత స్త్రీ దృక్పథాన్ని, వారి అనుభవాలను ప్రతిబింబిస్తుంది.)
16. జూపాక సుభద్ర - దళిత స్త్రీ సమస్యలపై ఆత్మగౌరవం ప్రభలమైన నవల రాశారు.
17. దాసరి సుజాత - దళిత స్త్రీ జీవితాలను, వారి కష్టాలను తన నవలలో ఆవిష్కరించారు.

కొలకలూరి ఇనాక్, బొజ్జాతారకం, బోయి జంగయ్య, చిలుకూరి దేవపుత్ర, వేముల మల్లయ్య, జూబులగారి, దుగ్గినపల్లి ఎజ్రాశాస్త్రి మొదలైన ఎందరో రచయితలు తమ నవలలో మహిళా చైతన్యాన్ని తీర్చిదిద్దారు. కొన్ని నవలలు పరిశీలిద్దాం.

డాక్టర్ సి. ఆనందరామం

స్త్రీ ప్రాధాన్యం గల నవలలు రాశారు. ఈమె నవలల్లో స్త్రీలు పరిస్థితుల కనుగుణంగా ఎలా తలోగ్గుతూ వ్యక్తిత్వాన్ని, ఆత్మాభిమానాన్ని నిలబెట్టుకోవడానికి ప్రయత్నం చేస్తే స్త్రీ పాత్రలను సృష్టించారు.

ఉదా॥ పదివేల గోపికలు - ఒక రాధ

కట్టుకున్న భర్తే తనను వేశ్యా గృహంలో తోసేస్తాడని ఊహించలేని ఒక అమాయికురాలి జీవిత చరిత్ర. అడుగడుగునా అదే కోణంలో అడ్డుగోడలను ఎదుక్కొంటూ ఒక అనామకుని సహాయ సహకారాల వల్ల ఒక్కొక్క మెట్టుగా పైకి వచ్చి, పిల్లలకోసం జీవితాన్ని భరిస్తూ వచ్చిన స్త్రీగాథ.

ఓల్గా

పోపూరి లలితకుమారి అనే ఆమె 'ఓల్గా'. అనే కలం పేరుతో గొప్ప స్త్రీవాద రచయిత్రిగా ఎదిగారు. ఈమె నవలలోని స్త్రీ పాత్రలు అన్ని తమను గుర్తించాలనే తపన కనిపిస్తుంది.

ఉదా॥ ఆకాశంలో సగం

రెండు రాజకీయ పక్షాల మధ్య గ్రామంలో రెండు అగ్రకులాల మధ్య నలిగిపోయి, దోపిడి, దౌర్జన్యాలకు గురవుతున్న మాల ప్రజల గురించి, క్షీణించి పోతున్న గ్రామ పరిస్థితిని తీర్చిదిద్దడానికి ఒక మాలస్త్రీ చేసిన ప్రయత్నాలు ఫలితంగా పెద్ద మనుషుల దౌర్జన్యానికి బలైన ఒక అబల చరిత్ర.

ఆ మాల స్త్రీ మరణానికి స్పందించిన స్త్రీలు, వ్యక్తిత్వం లేకుండా మూలబడి ఉన్న మగవారిలో మార్పు తీసుకు రావడానికి చేసిన పోరాటమే ఈ ఆకాశంలో సగం.

స్వేచ్ఛ:

ఒక స్త్రీ తననుకున్న ఒక చిన్న స్వేచ్ఛను కూడా భర్త నుండి పొందలేక భర్తకు దూరం అయిన స్త్రీ కథ.

స్త్రీకి సమాజంలో తనపై జరిగే దౌర్జన్యాలను పది మందికి చెప్పడానికి ప్రయత్నించేయగా భర్త అడ్డు పడతాడు. ఆ చిన్న స్వేచ్ఛణు పొందలేక భర్తకు దూరమై సమాజంలో చిన్న చూపుకులోనౌతుంది.

డి. కామేశ్వరి

ఈమె అన్ని నవలల్లో స్త్రీ ప్రాధాన్యత కనిపిస్తుంది. చదువు, ఆత్మగౌరవం ఎన్నో ఉన్నా సమాజంలో గుర్తింపు లేక మానసిక శాంతిని కోల్పోయి దాని కోసం ఆరాట పడడం కనిపిస్తుంది.

ఉదా॥ పరాజితులు : సంఘం చేత వెలియబడిన స్త్రీ, ప్రేమ బంధాలకు నోచుకోక ఒక పెద్ద మనిషికి ప్రియురాలుగా ఉంటూ, కొడుకు చేతినే చీదరించబడ్డ ఒక మాతృమూర్తి ఆవేదనే ఇందులోని కథ. చివరకు తనకు పుట్టిన సంతానం కూడా బాధిస్తుందని ఈ నవలలోని అంశం. చివరికి మరణమే శరణ్యమని ఆత్మహత్య చేసుకుని పరాజితురాలయిన అబల చరిత్ర.

కోడూరు కౌసల్యాదేవి

తెలుగువారి కుటుంబ జీవితాన్ని, వ్యక్తుల వ్యక్తిత్వాలను పరిపూర్ణంగా అవపోసన పట్టిన రచయిత్రి ఈమె.

ఉదా॥ చక్రవాకం

ఆడదాని పచ్చని బ్రతుకులో చిచ్చు రగిలించేది మరొక ఆడది. అదే మాటకు ఆధారం ఈ చక్రవాకం.

ఉన్నత చదువులు చదివి ఆత్మాభిమానంతో మంచి జీవితం కోసం ఎదురు చూస్తే ఒక స్త్రీ మరో స్త్రీ ఈర్ష్యా ద్వేషాలకు బలై, అపనిందలు పాలై, ప్రేమించిన వారికి దూరమై మానసిక సంక్షభంతో చక్రవాక రాగాన్ని నిలిపి మరణిస్తుంది.

వెన్నెలను కోరే చక్రవాకం నిరంతర వెన్నెల జల్లుకు నిరీక్షిస్తున్నట్లు ఒక ఆడది మంచి బ్రతుకు కావాలని నిరీక్షిస్తుంది. దాన్ని అందుకునేది ఎప్పుడు.

మాలతీ చందూర్

స్త్రీ ప్రాధాన్యం గల నవలలు రాశారు. ఈమె నవలలో స్త్రీ పాత్రలకు ద్రవ్య సాహిత్యంతో పాటు సమయస్ఫూర్తి, వివేకజ్ఞానం ప్రత్యేక లక్షణాలుగా ఉంటాయి.

ఉదా॥ భూమిపుత్రి

బానిసత్వపు బ్రతుకు నుంచి విముక్తి పొంది, వ్యక్తిత్వాన్ని నిలుపుకోవడానికి గడవదాటి స్నేతుల సహాయంతో వివాహం చేసుకుని స్వేచ్ఛగా బ్రతకడానికి ఒక స్త్రీ చూపిన ప్రయత్న ఫలితమే ఈ నవల.

ముప్పాళ రంగనాయకమ్మ

స్త్రీ విమోచన కోసం వీరి నవలల్లో విప్లవాత్మక సందేశం కనిపిస్తుంది. నేటి సమాజంలో స్త్రీలు ఎదుర్కొంటున్న సమస్యలు, స్త్రీ అనేక మోసాలకు గురవుతుందని ఆవేదన చెందారు.

ఉదా॥ స్త్రీ

తోడబుట్టిన వారి కోసం జీవితాన్ని వెచ్చించి తన కోసం ఏమి మిగల్చుకోక, వారి చేతనే నిర్లక్ష్యం చేయబడిన నిస్వార్థ జీవితం గల స్త్రీ కథ. తను అనుకున్నది సాధించ లేని స్త్రీ కథ.

వాసిరెడ్డి సీతాదేవి

రాజకీయ, సామాజిక చైతన్యమే వీరి రచనలకు వస్తువు.

ఉదా॥ ఉరిత్రాడు

అందరు మంగళ ప్రధంగా భావించే మంగళ సూత్రం కొంత మంది స్త్రీల కంఠానికి ఉరిత్రాడుగా మారుతుందనే విషయాన్ని కరుణ అనే ఒక స్త్రీ విషాదగాధ ఈ నవల.

యద్దనపూడి సులోచనరాణి

50 దాకా నవలలు రాశారు. ఈమె నవలలో స్త్రీ పాత్రలకు ప్రాధాన్యం ఎక్కువ. స్త్రీ తన పరిమిత సమాజ పరిధిలో తన సమస్యలను ఎలా ఎదుర్కొందో ఈమె నవలల్లో కనిపిస్తుంది.

ఉదా॥ మౌనపోరాటం

ఒక స్త్రీ ఏ వ్యక్తి కోసమైతే తల్లిదండ్రులను, వేశ్యార్యాన్ని కోల్పోయిందో ఆ వ్యక్తి చివరికి తనను కాదని వెళ్లిపోయి, మరళ రావడంతో ఆమె అతన్నే మళ్లీ తన జీవితంలోకి ఆహ్వానించలేక ఒంటరి జీవిత పోరాటం ఏసిన మహిళ కథ.

నాటక సాహిత్యం - మహిళా చైతన్యం

తెలుగు సాహిత్య చరిత్రలో కథలు నవల ప్రక్రియలలో రచయిలు ఉన్నట్లుగా నాటక సాహిత్యంలో రచయిత్రులు తక్కువనే చెప్పాలి. అయితే ఉన్న కొద్ది మంది అయినా తమదైన శైలిలో స్త్రీల జీవితాలను, సామాజిక అంశాలను సృశిస్తూ స్త్రీవాద కోణంలో నాటకాలు, నాటకం రాశారు. వారిలో కొందరు....

1. మల్లాది సుబ్బమ్మ:- స్త్రీవాద నాటకాల రచనలు ప్రసిద్ధి
2. పి. సత్యవతి - జీవిత చిత్రనలో నాటకాలు రాశారు
3. వసంతకుమారి - సామాజిక చైతన్యం కలిగించే నాటకాలు రాశారు
4. కె. సత్యవతి - స్త్రీవాద దృక్పథంలో నాటకాలు, నాటకాలు రాశారు.

ఈ నాటక సాహిత్యంలో రచయిత్రులు ఎక్కువగా స్త్రీల సమస్యలను, వారి ఆత్మ విశ్వాసాలను, సామాజిక రంగంలో వారు ఎదుర్కొంటున్న సమస్యలను చిత్రించారు. సంప్రదాయాలకు భిన్నంగా స్త్రీలకు ఎదురైన సవాళ్ళను ఇతివృత్తాలుగా నాటకాలు రాశారు.

కనపర్తి వరలక్ష్మమ్మ, భనుమతి రామకృష్ణ, తళ్ళారి శకుంతల వంటివారు భక్తి, హాస్యం, మరియు స్త్రీ వాద కోణాలలో నాటక రచనలు చేశారు.

ప్రాచీన కాలం నుండి ఆధునిక కాలం వరకు ఈ రచయిత్రులు నాటక సాహిత్యాన్ని సుసంపన్నం చేశారు.

ముగింపు

తెలుగు కవిత్వం అయినా, కథ అయినా, నవల యినా, నాటకం అయినా ఆ రచనలో ప్రధానంగా కని పించేవి స్త్రీ జీవితాలు. వారు కుటుంబంగా, సామాజికంగా లింగ వివక్షపరంగా, ఆర్థిక, శారీరక దోపిడి పరంగా ఎదుర్కొంటున్న సమస్యలను రచయిత్రులు స్పష్టంగానే చిత్రించారు. అన్నిటి ఆధారంగా వారు ఆసించే అంశాలను పరిశీలిస్తే

స్త్రీ పురుషునితో పాటు సమానం. భాగస్వామ్యం ఉండాలని, అంతేకాని పూర్తిగా పురుష ద్వేషం కాదు. కవిత్వంలో కొంత పురుషులపై ద్వేషం కొంచెం ఎక్కువ స్థాయిలో కనిపించినా, కథా సాహిత్యంలోను, నవలా సాహిత్యంలోను తమ హక్కులను పరిరక్షించుకోవడానికి, చేసిన ప్రయత్న భాగంగానే స్త్రీ రచయిత్రులు రచనలు చేసినట్లు తెలుస్తుంది.

అంతేకాని పూర్తి పురుష ద్వేషం కాదు. ఆమెకు ఏర్పడ్డ బంధాల నుండి విముక్తి కావాలి. అలాగే సాంఘిక దురాచారాల నుండి స్వేచ్ఛ కావాలి. ఆమె కుటుంబానికే పరిమితం కాకుండా సామాజిక సేవలో పాల్గొనే అవకాశం ఇవ్వాలి. స్త్రీ విమోచన చాలా క్లిష్టమైనది. అతి కష్టమైనది కాబట్టి ఈ విషయంలో స్త్రీ రచయిత్రుల రచనల ఆంతర్యంగా భావించాలి.

ఆధార గ్రంథాలు

1. 20వ శతాబ్ది తెలుగు కవిత్వం - కడియాల రామమోహనరావు
2. కథానిక స్వరూపస్వభావాలు - పోరంకి దక్షిణామూర్తి
3. భూమిపుత్ర - మాలతీ చందూర్
4. వ్యాసదీపిక - పి. ఉషారాణి
5. పిడికాలు ఆలోచనలు - కొలకలూరి మధుజ్యోతి
6. సాహితీ తులసి - చాగంటి తులసి
7. నూటపదేళ్ళ తెలుగు కథ - విభిన్న ధోరణులు - కాలువ మల్లయ్య
8. సాహిత్య మహిళావర్ణం - చేరా
9. వేకువ పిట్ట - చల్లపల్లి స్వరూపరాణి

★★★

Vol. 23 | Spl. Issue 03 | March 2026 | BHAVAVEENA | ISSN No. : 2456-4702 | RNI No. APTEL/2003/12253

RNI No. APTEL/2003/12253 | Reffered Journal & Peer Reviewed Journals | ISSN No. 2456-4702

భావవీణ

కళలు, సాహిత్య సాంస్కృతిక భాషాధ్యయన పత్రిక

BHAVA VEENA

Journal of Arts, Literary, Culture & Language Study

స్త్రీవాద కవితోద్యమం - మహిళా చైతన్యం

– డా॥. బూసి వెంకటస్వామి
శాఖాధిపతి, శ్రీ ఏ యస్ యన్ యం ప్రభుత్వ కళాశాల (స్వయం ప్రతిపత్తి), పాలకొల్లు,
పశ్చిమగోదావరి జిల్లా.

– డా॥. పెండ్యాల లావణ్య
తెలుగు అధ్యాపకురాలు
ప్రభుత్వ డిగ్రీ కాలేజి, రాజోలు,
డా. బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లా

ఉపోద్ఘాతం :

అసమానతలపై అసహనమే స్త్రీవాదం. స్త్రీలు నడిపిన ఉద్యమమే స్త్రీవాద ఉద్యమం. పాశ్చాత్య సాహిత్య ప్రభావంతో తెలుగు సాహిత్యంలోకి ప్రవేశించిన ఆధునిక సాహిత్య ధోరణుల్లో స్త్రీవాద సాహిత్యం ఒకటి. స్త్రీవాద సాహిత్యం 1980 దశకం నుండి ప్రారంభమైంది. స్త్రీవాద సాహిత్యాన్ని Femibist Literature అని ఆంగ్లంలో వ్యవహరిస్తారు. స్త్రీవాద సాహిత్యం అక్షరాల కూర్పు కాదు. శతాబ్దాల తరబడి స్త్రీ అణచివేతపై సాగిన అక్షరసాయుధ పోరాటం. పితృస్వామ్య సమాజంలోని నిబంధనలను వ్యతిరేకిస్తూ, మహిళా హక్కులు, సమానత్వం, స్వేచ్ఛ వారి జీవన అనుభవాలను చిత్రించే సాహిత్యమే స్త్రీవాద సాహిత్యం.

వైదిక సంస్కృతిలో స్త్రీ :

వైదిక సంస్కృతిలో స్త్రీస్థానం ఎన్నతగినది. మాతృ స్వామిక వ్యవస్థగా గుర్తించబడింది. స్త్రీ పేరు ద్వారా బిడ్డలు గుర్తించబడేవారు. స్త్రీ అన్ని విషయాలలోను ముందుండేది. ఇల్లు ఇల్లాలు పిల్లలు అనే వలయంలో ఉండిపోకుండా భర్తకి అన్ని రకాలుగా సహాయసహకారాలు అందిస్తుండేది. వ్యవసాయాన్ని కనిపెట్టింది కూడా స్త్రీలే. అటువంటి స్త్రీస్వామ్య వ్యవస్థ యుగాలు తరాలు మారుతున్న కొద్ది తమ ఉనికిని కోల్పోయి వంటింటికి మాత్రమే పరిమితమైంది.

మధ్యయుగంలో స్త్రీ స్థానం :

వేదకాలంలో ఆడబిడ్డ పుడితే పండుగలు చేసే స్థాయి నుండి సమాజం, పుట్టేది ఆడబిడ్డని తెలిస్తే వడ్ల గింజేసి చంపేసే స్థాయికి చేరింది. అప్పట్లో పుట్టబోయేది ఆడ, మగ అనేది తెలుసుకోవటానికి ఆధునిక పరికరాలు లేవు. గర్భిణీ స్త్రీ ఒంటితీరును బట్టి పుట్టేది ఆడ, మగ అనేది తెలిసేది. పుట్టబోయేది ఆడపిల్ల అని తెలిస్తే ఆలోచించకుండా వెంటనే గర్భస్రావాలు చేసేవారు. గర్భస్రావాల సమయంలో ఎంతోమంది స్త్రీల ప్రాణాలు కోల్పోయారు. ఎన్నో భ్రూణ హత్యలు జరిగాయి. అందుకే ఆడపిల్లల నిష్పత్తి తగ్గిపోయింది. వేదకాలం నుండి ఆధునిక కాలం వరకు స్త్రీ తన మనుగడ కోసం పోరాడుతూనే ఉంది. ఎన్నో సమస్యలను ధైర్యంగా ఎదుర్కొంది. సతీసహగమనం, బాల్య వివాహాలు, భ్రూణహత్యలు, వరకట్నాలు, కన్యాశుల్కం, వరకట్నాలు వంటి సాంఘిక దురాచారాలను ఉద్యమ స్థాయిలో పోరాడి విజయం సాధించింది. ఆడది అబల కాదు సబల అని నిరూపించింది.

స్త్రీ ఉద్యమస్ఫూర్తి ప్రధాతలు :

స్త్రీ విముక్తి కోసం మొదటగా పురుషులే ఉద్యమ బాట పట్టారు. రాజారామ్‌మోహనరాయ్, కందుకూరి,

గురజాడ వంటి సంఘ సంస్కర్తలు స్త్రీ స్వేచ్ఛ, విద్య, సమానత్వాల కోసం పోరాడారు. వీరి పోరాట ఫలితంగా కన్యాశుల్కం, సతీసహగమనం, బాల్యవివాహాలు భ్రూణ హత్యలు రూపుమాపబడ్డాయి. స్త్రీలపై జరుగుతున్న సాంఘిక దురాచారాలను రూపుమాపగలగారు కాని సమానత్వాన్ని ఇవ్వలేకపోయారు. తర్వాత స్త్రీ విద్యను ప్రోత్సహించి ఉద్యోగ అవకాశాలు కల్పించారు. మగవాడితో సమానంగా ఉద్యోగ బాధ్యతలు నిర్వర్తించినా వేతన విషయంలో భేదభావం చూపించారు. వేతన విషయంలో జరిగిన ఉద్యమపోరు కారణంగా సమానత్వం లభించింది. ఆర్థికంగా సమానత్వమే లభించింది కాని వ్యక్తిగతంగా సమానత్వం రాలేదు. నేటికి స్త్రీ సమానత్వం కోసం పోరాడుతూనే ఉంది.

ఆధునిక యుగంలో స్త్రీ :

1980 దశకంలో స్త్రీవాద సాహిత్యం విస్తృతంగా వ్యాపించింది. స్త్రీవాద కవిత్వం విస్తృతంగా వ్యాప్తిలో కొచ్చింది. 1990 సంవత్సరంలో త్రిపురనేని శ్రీనివాస్ 'గురిచూసి పాడేపాట' కవితా సంకలనం ప్రచురించి దానినే 'స్త్రీవాద కవిత'లన్నారు. నాటి నుండే స్త్రీవాద కవిత్వం బలం పుంజుకుంది. అయితే స్త్రీవాద కవిత్వం పురుషుల కంటే స్త్రీలు రాస్తేనే స్త్రీవాద కవిత్వమౌతుందని, స్త్రీవాద రచయిత్రులు మాత్రమే అనుభవపూర్వకంగా పేర్కొనగలరని వాదించారు. 1993 సంవత్సరం అక్టోబరులో 'నీలి మేఘాలు' అనే భారీ స్త్రీవాద కవితా సంకలనం వెలువంది. నీలి మేఘాలు కవితా సంకలనంలో వసంత కన్నభిరాన్ రాసిన 'స్త్రీగారాయటమంటే' ఓల్గా రాసిన 'సంకెళ్ళు తెగనున్న సంగీతం' అనే వ్యాసాలు స్త్రీవాద దృక్పథాన్ని సిద్ధాంత పరిధిని వివరించారు. ఇందులో పితృస్వామ్య వ్యవస్థలో స్త్రీ అణచివేతలను, లైంగికత్వం, సంతానోత్పత్తి ఇంటి చాకిరీ అనేవి పురుషులు తమ ఆధిక్యతను చూపించేవి. వీటిని కూడా సామాజిక సమస్యలుగా గుర్తించాలని, పురుషాధిక్యత నశించాలని పేర్కొనాలి. అన్ని రంగాలలో స్త్రీ సమాన హక్కునీ, స్వేచ్ఛనీ కోరుకుంది. ఈ ఊపుతోనే లెక్కలేనన్ని స్త్రీవాద కవితలు స్త్రీ చైతన్యాన్ని జాగృతం చేశాయి.

స్త్రీవాద కవిత్వంలో కొందరి కవితలు షాక్‌ట్రీట్‌మెంట్ ఇచ్చారు. జయప్రభ, కొండేపూడి నిర్మల, ఘంటసాల నిర్మల, ఓల్గా, మందిరపు హైమావతి, రేవతి మొదలగు వారి కవితలు వివాదాలకు తెరతీశాయి. వీరి కవితల్ని వివాదాలుగా భావించి అభ్యుదయ రచయితల సంఘం 'పురుషద్వేషం పనికిరాదని, స్వేచ్ఛ పేరుతో కుటుంబ వ్యవస్థనీ, వివాహ వ్యవస్థనీ విచ్ఛిన్నం చేయకూడదని, సంతానం ప్రకృతి ధర్మమని దానికి అశ్లీల పద ప్రయోగాలు చేయకూడదని వ్యాఖ్యానించారు. లింగ వివక్షకి ప్రాధాన్యమివ్వడం కన్నా ఆర్థికస్వేచ్ఛకి సమానత్వానికి ప్రాధాన్యమివ్వాలన్నారు.

1972 సంవత్సరంలో ఓల్గా ప్రతి స్త్రీ 'ఒక నిర్మల కావాలి' అనే స్త్రీవాద కవితను వెలువరించారు.

"అందమైన దోపిడీకీ
పవిత్రమైన హింసకూ
పవిత్రమైన హింసకూ
న్యాయమైన దాస్యానికీ
బలైపోయిన నేను
భారతస్త్రీని స్త్రీని!
కానీ రేపు
నేను పతివ్రతామ తల్లినికాను
ప్రబంధ చిలకలను కాను
పంచదార చిలకను కాను
ఫ్యాషన్ పెరేడ్ బొమ్మను కాను
పసిపాపల చంపే పాపినికాను
పంచాది నిర్మల వారసురాలిని"

అనటంలో విప్లవం తిరుగుబాటును స్ఫురిస్తుంది. ఓల్గా కవితలు స్త్రీ స్వాతంత్ర్యం, ఆత్మగౌరవ, వ్యక్తిత్వ వికాసమనే అంశాల చుట్టూనే తిరుగుతాయి. ప్రతి స్త్రీ అంతర్ముఖాన్ని తెలుసుకుని, బంధాలను అధిగమించి, స్వతంత్రంగా నిలబడాలని ఈ కవిత ద్వారా సందేశ మిచ్చారు.

ప్రముఖ స్త్రీవాద రచయిత్రి సావిత్రి 'బందిపోటు' కవిత స్త్రీలలో ఆత్మవిశ్వాసాన్ని రేకెత్తించి ఆలోచనా చైతన్యాన్ని పురికొల్పింది. పురుషాధిక్య సమాజంలో స్త్రీ శ్రమను,

భావోద్వేగాలు వ్యక్తిత్వాన్ని పురుషులు సంప్రదాయాల ముసుగులో దోచుకుంటున్నారో వివరించారు. స్త్రీ తెల్లారింది మొదలు రాత్రి పడుకునే వరకు వంటగదికే పరిమితమైపోతుంది. అందరి అవసరాలు తీరుస్తూ తన ఉనికిని కోల్పోతుంది. గొడ్డు చాకిరి చేస్తున్న ఎవరు గుర్తించలేదని పేర్కొన్నారు. స్త్రీ మనోభావాలను, శ్రమను అస్తిత్వాన్ని దోచుకుంటున్న పితృస్వామ్య వ్యవస్థను ప్రశ్నిస్తూ తన ఆవేదనను

"పాఠం ఒప్పచెప్పకపోతే పెళ్ళి చేస్తానని
పంతులు గారనప్పుడే భయమేసింది
ఆఫీసులో నా మొగుడున్నాడు!
అవసరమొచ్చినా సెలవివ్వడని
అన్నయ్య అన్నప్పుడే అనుమానమేసింది
వాడికేం? మగమహారాజని
ఆడమగా అగినప్పుడే అర్థమైపోయింది.
పెళ్ళంటే పెద్దశిక్షఅని
మొగుడంటే స్వేచ్ఛా భక్షకుడని
మేం పాలిచ్చి పెంచిన జనంలో సగమే
మమ్మల్ని విభజించి పాలిస్తోందని" వ్యాఖ్యానించారు.

సావిత్రి పితృస్వామ్య వ్యవస్థలో స్త్రీ ఎదుర్కొంటున్న సామాజిక, మానసిక బంధనాలను అత్యంత శక్తివంతంగా ఎండగట్టింది ఇంట్లో భర్త ఆఫీసులో బాస్. వీళ్ళిద్దరూ స్త్రీ శ్రమను, సమయాన్ని శాసించే వారే అని కవయిత్రి వ్యంగ్యంగా పురుష అహంకారం ఏ రూపంలోనైనా స్త్రీని అణచివేస్తుందని స్పష్టం చేస్తుంది.

"మందవరపు హైమావతి మండుతున్న అగ్నిగోళం
స్త్రీల అస్తిత్వాన్ని కవిత్వరూపంలో వ్యక్తీకరించింది.
బాధ మనసును జ్వలింపచేసినప్పుడు
సమస్య హృదయాన్ని తొలిచివేసినప్పుడు
నాకలం పలుకుతుంది నిజం
ఆ నిజమే నీలికవితలైతే
నీలి కవితలే రాస్తాము మేము
నిజాలే మా కవితా వస్తువులు"

అంటూ 'నీలి కవితలే రాస్తాము' కవితలో నిగ్గు తెల్చారు. ఈమె సౌమ్యంగా కనిపించినా రాతలు మాత్రం ఫైర్‌బ్రాండ్. అక్షరాలే బుల్లెట్స్‌లా పాఠకుల్ని కదిలిస్తాయి.

"ఇద్దరు కలిసి విషం తీసుకున్నప్పుడు
ఒక్కక అమ్మాయి మాత్రమే
ఎందుకు మరణిస్తుందో
ఎప్పటికి అర్థంకాని ప్రశ్నార్థకం
సి.బి.ఐ. కూడా ఛేదించలేని రహస్యం" అంటూ మాటల తూటాలు పేల్చారు. పక్షపాత వ్యవస్థని నిల దీసింది. 'నిషిద్ధాక్షరి' కవితలో

"పక్షైనా పశువైనా
తమ పిల్లలకి తామే మరణ శిక్ష వేయవు
మరెందుకమ్మా! నా రాకకు భయపడతావు"
"మానవత్వం మంటగలసినప్పుడు
దానవత్వం చేతిలో కీలుబొమ్మలై
ఆత్మలు అమ్ముడుపోతున్నప్పుడు
కన్నతల్లులే వృద్ధాశ్రమాల
వలస పక్షులౌతారు

ఆడపిల్లలే నిషిద్ధాక్షరాలౌతార"కి తన ఆవేదనని, నిరసనని సామాజిక సమస్యని తెలియజేశారు.

జయప్రభ "చూపులు" కవితా ఖండికలో మగవాడి చూపును ఆ చూపుల భావాలను కరఖండిక నిక్కచ్చిగా పేర్కొన్నారు. ఆడది ఒంటరిగా వెళ్ళాలంటే భయం, ఎటునుండి ఏ వైపు నుండి ఏ మృగాడు వస్తాడో తన ఆకలి తీర్చుకుంటాడోనని క్షణక్షనం భయపడుతూనే ఉంటుంది. అడవిలో ఒంటరిగా వెళ్ళి తిరిగిరావచ్చేమో గాని మృగాళ్లు (మగాళ్లు) తిరిగే సమాజంలో ఆడదానికి భద్రత లేదని పేర్కొన్నారు. బస్సు, రైళ్ళు, రిక్షా; ఆటల్లో ఎక్కడకి వెళ్ళిన మగాడి ఆకలి చూపులు ప్రతీ స్త్రీకి ముళ్ళలా గుచ్చుకుంటూనే ఉంటాయి. వీటన్నింటిని తప్పించుకోవాలంటే ఎదురు తిరిగి పోరాడాలని భయంతో పారిపోకూడదని

పలాయనం పరిష్కార కాదని
విషపు చూపులనెదుర్కొనే
ముళ్ళలాంటి తీక్షణతని
కళ్ళకి నేర్పటం మొదలెట్టాను
ఇప్పుడు ఆ కళ్ళని వెంటాడటానికి

కళ్ళతోనే యుద్ధం చేస్తాను
సూటిగా రెండు క్షణాలు
కళ్ళలోకి చూడలేని పిరికి చూపులు
పాతాళంలోకి పారిపోతాయి
అప్పుడనుకుంటాను
కళ్ళకేకాదు
ఈ దేశంలోని అడదానికి
వళ్ళంతా ముళ్ళుండే రోజు
ఎప్పుడొస్తుందా అని!

స్త్రీ ఏదో జరిగిపోతుంది ఏమైపోతుందోనని భయపడుతుండే నిజంగానే తన అస్తిత్వాన్ని కోల్పోతుంది. తన ఉనికి తెలియాలంటే చూపులకు చూపులలోనే సమాధానం చెప్పాలని, ప్రతి స్త్రీకి అందంతోపాటు ఒళ్ళంతా, ముళ్ళు ఉందే ముట్టుకోవాలన్నా భయపడి చస్తారని పేర్కొన్నారు.

మందరపు హైమావతి 'లేడీస్ స్టాఫ్‌రూమ్' కవితలో

"ఇంటినుండి బయటికి వచ్చినా
ఇల్లు వెంటాడుతూనే ఉంటుంది
మళ్ళీ ఇక్కడ కుటుంబం
పునఃప్రతిష్ఠితమౌతుంది"

ఆధునిక స్త్రీ మగాడితో సమానంగా అన్ని రంగాల్లోను ముందుకు దూసుకెళుతుంది. అన్నిచోట్ల తన ప్రత్యేకతను చాటుకుంటూనే వుంది. కాని ఎంత ఎదిగినా స్త్రీ స్థానం మాత్రం పురుషుడి పాదాల వద్దనే అంటూ సమాజం కట్టుబాట్లు అనే సంకెళ్ళతో బంధిస్తుంది. స్త్రీ ఎంత సంపాదించినా తను తన సొంతానికి జీతం ఖర్చుపెట్టుకోలేని స్థితిలోనే ఉండిపోయింది. అన్ని రంగాలలోను స్త్రీల ప్రస్థానంలో అన్నిచోట్ల స్త్రీలకోసం 'లేడీస్ రూమ్స్ లేడీస్ స్టాప్‌రూమ్స్ ఏర్పాటు చేయబడ్డాయి. ఆడవాళ్ళందరు తమ సమస్యలను తోటి మహిళా స్టాఫ్‌తో చెప్పుకుంటారు. ఎన్ని రకాలుగా మాట్లాడుకున్నా తిరిగి కుటుంబమే వెంటాడుతుందని పేర్కొన్నారు.

"అసూర్యంపశ్యల యుగం నుండి
ఆధునిక కాలం వరకూ పయనించినా
అంతఃపురంనుంచి విశాల ప్రపంచంలోకి ప్రవేశించినా
నేటి చదువకున్న స్త్రీకి తప్పటంలేదు ద్విపాత్రాభినయం"

స్త్రీ ఇంటా బయటా ప్రతిరోజూ పోరాడుతూనే ఉంది. బయట ఆమే చేసే పనులు ఒంటి మీద పాకే మగాడి చూపులను దాటుకుంటూ ఇంటికి చేరితే ఆలస్యమైంది ఏమిటి అని భర్త అనుమానపు చూపులు స్త్రీ అనుభవాలకి, ఆలోచనలకి తన కవిత్వంలో చోటు కల్పించింది.

"సర్ధుకుపో ఆ నాలుగక్షరాలే
స్త్రీ జీవితాన్ని బలికోరే శాపాలు!
సర్ధుకుపో ఈ నాలుగక్షరాలే
స్త్రీని అగ్నికి ఆహుతి చేసే సాధనాలు"

యుగయుగలుగా నేను (స్త్రీ) మాత్రమే ఎందుకు సర్ధుకుపోవాలి. ఆడది ఎలా పుట్టిందో మగాడు కూడా అలానే పుట్టాడు. పుట్టే విధానంలో తేడా లేనప్పుడు మరి మరి జీవించే విధానంలో తేడా ఎందుకుంటుంది. అంటూ మహిళల ఆంతరంగిక గళాన్ని అంతర్మధనాన్ని ధిక్కారస్వరాన్ని వినిపించింది.

హైమావతి "సిలబస్ మార్చలేమా" కవితలో

"ఇప్పుడిప్పుడే అనిపిస్తోంది మాకు
ఎన్నాళ్ళు ఈ పూర్వపు పాఠాలు
మనసును గుర్తించలేని పాతకాలపు భావాలు
అందం కలిసి ఈ జీవితం సిలబస్ మార్చలేమా" అని పురుషాధిక్య సమాజాన్ని నిలదీసింది.

స్త్రీ నాన్న చాటునుండి నాసా వరకు చేరుకోగలిగింది ఈ సుదీర్ఘ ప్రయాణంలో ఎన్నో అవమానాలు ముళ్ళ చూపులు, కామాంధులు వికృత చేష్టలు దాటి గుమ్మం చేరుకోగలిగింది. కాని ఇంకా ఏదో తెలియని వెనుకబాటు తనం ప్రతి స్త్రీలోను కనిపిస్తూనే ఉంది. మనది భారతీయ సమాజం. మన దేశాన్ని భరతమాత అని పిలుస్తున్నాము. అందుకే భారతదేశంలో పుట్టిన ప్రతి స్త్రీకి ప్రత్యేకమైన స్థానం ఇవ్వబడింది. అయినా ఏదో ఒక కోణంలో స్త్రీని సమాజం చిన్నచూపు చూస్తూనే మందిని తాటికోల పద్మావతి "జీవసంతమా" కవితా ఖండికలో

నరనరాల్లో పాకిన కామాగ్ని విషజ్వాలలకు
రేపటి మొగ్గలన్నీ రాలిపోతున్నాయి
పగప్రతీకార వాంఛలకు రంగురంగుల పూలన్నీ
కామాంధులకు బలై - ముళ్ళపొదల్లో చిక్కుకుంటున్నాయి
పరిమళాన్ని కోల్పోయి రుధిరాన్ని వెదజల్లుతున్నాయి

పేర్కొన్నారు. అలాగే ప్రతి స్త్రీ ఒక సమిధలా మారి తనను తాను కాపాడుకోవాలని ఆడదానివే అయినా విపత్కర పరిస్థితుల్లో ఆడబెబ్బులి మారాలని పేర్కొన్నారు.

"ఉజ్వల కాంతిని ప్రసరించే నీ కాంతులు
లోకానికి దారిచూపే వెలుగులు
చీకటిని చీల్చుకుని చిరు దీపానికైనా
త్యాగానికి ప్రతిరూపంగా నిలిపోతావని" దీపం కవితా ఖండికలో పద్మావతి వెలుగును ప్రసాదించే దేవత గాను లోకానికి దారిచూపే వెలుగు స్త్రీ మాత్రమే ఇవ్వగలదని నొక్కి చెప్పారు.

"గృహలక్ష్మి" కవితలో ఓల్గా స్త్రీ అచేతనాన్ని పేర్కొన్నారు.

రుబ్బుడు పొత్రంతా
తల తిరుగుతూనేవున్నా
ఆలోచనల పప్పు మెదగదు
ఇంగువ వాసనలో
మునిగితేలే ముక్కు
ఊపిరి పీల్చుకోవటం మర్చిపోతుంది"

స్త్రీ తన ఉనికి చాటుకోవటానికి ఎంత ప్రయత్నించినా అది జరగని పనిలా సూన్యంలోనే ఉండిపోతుంది. ఇంటికి, వంటకి పరిమితమైన స్త్రీ పనితనం ఎదగాలన్న ఆలోచనల్ని తనకు తానుగా ఏ అధిమి కొంగుచాటున పట్టి అధఃపాతాళానికి తొక్కేసుకుంటుందని ఓల్గా పేర్కొన్నారు.

పాటిబండ్ల రజని "అబార్షన్ స్టేట్‌మెంట్" కవితలో

అయ్యో!
పాలింకి పోవటానికున్నట్లు
మనపైకి పోవటానికి
మాత్రలుంటే ఎంత బావుండు" అనటంలో స్త్రీ పితృస్వామ్య సమాజంలో ఎదుర్కొనే వివక్షను, అణచివేతను స్పష్టంగా చిత్రించింది.

జయప్రభ 'పైటను తగలేయాలి' కవితలో తన ఆగ్రహాన్ని అల్పాక్షరాలలో అనల్పార్థ రచనగా ఆవిష్కరించారు.

"నన్ను అబలని చేసిన
పితృస్వామ్యపు అదృశ్యహస్తంపైట, దోపిడీ సంస్కృతి
నా వ్యక్తిత్వాన్ని శవంగాచేసి
దానిపైన కప్పిన తెల్లదుప్పటి పైట
నేను నడిచే శవాన్ని కాకుండా ఉండాలంటే
ముందుగా పైటను తగలేయాలి"

స్త్రీవాద దృక్పథంలో పైటను కేవలం ఒక వస్త్రంగా కాకుండా పితృస్వామ్య వ్యవస్థ స్త్రీలపై చేసిన అణచివేతలకు చిహ్నంగాను, స్త్రీ స్వేచ్ఛను హరించే సాధనంగాను వర్ణించారు.

సమాజంలో పురుషాధిక్యత ఎప్పుడు ప్రత్యక్షంగా కనిపించదు. అది కట్టుబాట్లు, సంప్రదాయాల రూపంలో స్త్రీని నిరంతరం నియంత్రిస్తూనే ఉంటుంది. స్త్రీ అస్తిత్వాన్ని నొక్కి ఉంచె సంకెళ్ళను తెంచుకుని, స్వేచ్ఛా వాయువులు పీల్చాలని ప్రతి స్త్రీవాద కవియిత్రుల ఆకాంక్ష.

విమల స్త్రీల అణచివేతకు మూల కారణాలు తెలుసుకుని స్త్రీ విముక్తిని శాస్త్రీయమైన పరిష్కార మార్గాన్ని చూసించిన కవిత "వంటిల్లు" అనాదిగా స్త్రీ జీవితం వంటగదికే పరిమితమైంది. అదే విషయాన్ని విమల "మా అమ్మ, మా అమ్మమ్మ ఇంట్లో అమ్మలంతా ఇక్కడే స్త్రీలయ్యారట" అన్న ఒక్క వాక్యంలో తెలియజేశారు. స్త్రీ జీవితం వంటగదికి ఎంత పరిమితమైందో వంటగదికీ, స్త్రీకి ఆ భేదం చెప్పటం ద్వారా తెలుపుతూ "అనలు మా అమ్మే నడుస్తున్న వంటగతిలా ఉంటుందన్నారు. వంటింటి చాకిరీలో ఆమె చేతులు అరిగిపోయి ఆమె వంటింట్లో గరిటెగానో, పెనంగానో పరికరంగానో మారిపోయిందంటారు. వంటింటి చాకిరంతా స్త్రీదే. ఆ స్త్రీపై పెత్తనమంతా పురుషుడిదేనన్న విషయాన్ని

"ఈ వంటింటి సామ్రాజ్యానికి మా అమ్మో రాణి అయినా చివరకు వంటింటి గిన్నెలన్నిటిపైనా నాన్నపేరే" అని వ్యంగ్యంగా పేర్కొన్నారు.

"వేరువేరు స్వంత పాయిలను
పునాదులలో సహా తవ్వి పోద్దాం రండి" అనటంలో వంట పనిని ఇంటి పనికీ సామాజికీకరణ చేయాలనీ, దానికోసం ఇప్పుడున్న వ్యవస్థను ధ్వంసం చేయాలని పిలుపునిచ్చారు.

పూర్వకాలం నుండి స్త్రీని మాతృమూర్తిగా, ఇంటికి దీపంగానూ, త్యాగశీలిగా పరిగణిస్తూ మరొప్రక్క బానిసగా, వ్యక్తిత్వం లేని, స్వేచ్ఛలేని అజ్ఞానిగా చూస్తున్నారు.

వాణీ రంగారావు 'తివాచీ' కవిత్వం స్త్రీకి పుట్టినింట మెట్టినింట జరిగే అసమానతలను తెలియజేశారు.

'తొలిగా నువ్వు పుట్టిన ఇంటికి పిచ్చిగా ప్రేమిస్తావు.
ఎంత పిచ్చిగా అంటే
ఆ ఇంటి గోడలలో దాక్కున్న ప్రతి
ఇటుకా నాదే నన్నంతగా
ఆ ఇంటి చూరుకి వేలాడే పిచ్చుకతల్లి
తన గూటిని ప్రేమించినంతగా
నువ్వు పుట్టినప్పుడేనే తండ్రికి వేదన మొదలవుతుంది
నువ్వు పుట్టినప్పుడే నీ తల్లి గుండెకు మొదటి చిల్లుపడుతుంది"

అని అనటంలో స్త్రీ సహజస్థితిని వర్ణించారు. ఆడపిల్ల పుట్టింది మొదలు మెట్టినింటికి వెళ్ళేంతవరకు పిచ్చి ప్రేమను పెంచేసుకుంటుంది. ఆ ప్రేమను కవయిత్రి పిచ్చుక కట్టుకున్న గూడుతో సమానంగా చిత్రించారు. మగబిడ్డ పుట్టినప్పుడు తల్లిదండ్రుల కళ్లల్లో కనిపించే ఆనందం ఆడపిల్ల పుట్టినపుడు కనిపించదన్నారు. నువ్వు భూమి మీద పడగానే మొదటగానే తండ్రి ఏడుస్తాడని వ్యక్తం చేశారు.

స్త్రీవాద రచయిత్రి పార్వతి 'సిగ్గు సిగ్గు' కవితలో

'ఛ! ఏం బతుకిది
ఇంతకంటే జంతువు జన్మ నయమని
గోడ మీద గొంగళి పురుగునడిగా
కొన్నా నాలో జీవించమని
అంతటి స్తబ్ధ జీవితంనే గడపలేనంది
రోడ్డు మీద గాడిదనడిగా
అంత సహనం నాకెక్కడిదండి
పైగా అన్ని బరువు బాధ్యతలు
నేను మోయలేనంది
సిగ్గు విడిచి కుక్కనడిగా
కుక్కనే గాని మరీ
అంత విశ్వాసంతో
పడి ఉండనేనంది
ప్రేమను పంచి ప్రాణాలైనా ఇచ్చే
నీ మీదనే అత్యాచారాలు చేస్తున్న
కృతఘ్నులున్న చోట
బతకలేనంటే బతకలేనంది'

పార్వతి స్త్రీ జీవనాన్ని, స్త్రీవాద ధృక్కోణాన్ని భావ వ్యక్తీకరణ చేశారు. ఒక స్త్రీగా తన జీవన బాధలను, సమాజంలోని అసమానతలు, అన్యాయాలు ఆత్మ గౌరవాన్ని కోల్పోయే పరిస్థితులను గాఢంగా వ్యక్తపరు స్తుంది. తన జీవితం ఎంత దయనీయంగా మారి పోయిందో చెప్పటానికి జంతువుల జీవితాలతో పోల్చు తుంది. చివరికి జంతువులకంటే కూడా స్త్రీ స్థితి దిగజారి పోయిందన్నారు. ఈ కవిత ప్రబలమైన స్త్రీవాద కవిత స్త్రీ గౌరవం, స్వేచ్ఛ, భద్రలను గుర్తుచేస్తుంది.

ముగింపు :

స్త్రీవాద సాహిత్యం స్త్రీల జీవితాన్ని ప్రతిబింబిస్తుంది. స్త్రీలపై జరిగే అన్యాయాలను బయటపెట్టి, వారికి స్వేచ్ఛ, గౌరవం, సమాన హక్కులు అవసరమని స్పష్టం చేస్తుంది. స్త్రీ తన ఆలోచనలు, జీవనమార్గం, శరీరం, విద్య, ఆలోచనలను వీటన్నింటిపై స్వతంత్రంగా నిర్ణయం తీసుకునే హక్కు కలిగి ఉండడమే స్త్రీ స్వేచ్ఛకు ప్రతీక. స్త్రీవాదం ఒకటే కోరుకుంటుంది. పురుషుల అధికార స్వభావాన్ని ప్రక్కనపెట్టి ఆడ మగ తేడా లేకుండా అందరు కలిసికట్టుగా నడవాలని ఆకాంక్షిస్తుంది.

ఆధార గ్రంథాలు :

1. స్త్రీవాద ధోరణులు, సమకాలీన సాహిత్యాలు, యువభారతి, హైదరాబాద్, 1994.
2. కామేశ్వరి వై., 'స్త్రీవాద కవిత్వంలోని శిల్ప విశేషాలు', భూమిక పత్రిక, ఆగష్టు, 2010.
3. గురిచూసి పాడేపాట - స్త్రీవాద కవితలు - కవిత్వం, ప్రచురణలు - స్వతంత్ర ఆర్ట్ ప్రింటర్స్, విజయవాడ.

★★★

Vol. 23 | Spl. Issue 03 | March 2026 | BHAVAVEENA | ISSN No. : 2456-4702 | RNI No. APTEL/2003/12253

RNI No. APTEL/2003/12253 | Reffered Journal & Peer Reviewed Journals | ISSN No. 2456-4702

భావవీణ

కళలు, సాహిత్య, సాంస్కృతిక భాషాధ్యయన పత్రిక

BHAVA VEENA

Journal of Arts, Literary, Culture & Language Study

తెలుగు సాహిత్యం - దళిత కవయిత్రులు

– డా॥. వై. విజయానంద రాజు

శాఖాధిపతి, తెలుగు విభాగం, ప్రభుత్వ డిగ్రీ కాలేజి, తిరువూరు, కృష్ణా జిల్లా.

దళిత సాహిత్యం, దళిత కవి అనే పదాలు వినబడగానే అందరికీ గుర్తొచ్చే కవి గుర్రం జాషువా. ఇంకా అని ప్రశ్నించుకుంటే కుసుమ ధర్మన్న, బోయి భీమన్న లాంటి అనేక పేర్లు వినబడతాయి. అలాగే స్త్రీవాద సాహిత్యాన్ని ప్రస్తావించగానే కొండేపూడి నిర్మల, విమల ఇత్యాదులు గుర్తుకు వస్తారు. మరి దళిత సమస్య పై కవిత్వం రాసిన దళిత కవయిత్రులు ఎవరు అనే ప్రశ్నకు సమాధానం తొందరగా దొరకదు. అందువలన వారి కవిత్వం గురించి రేఖామాత్రంగా ప్రస్తావించుట ఈ వ్యాస ప్రధానోద్దేశం.

దళిత స్త్రీలలో చదువుకున్న వాళ్ళు తక్కువ. అందులోనూ కవిత్వం పట్ల అవగాహన, ఆసక్తి ఉన్న స్త్రీ మరీ తక్కువ. అందువలన వారి కలాల నుండి కవిత్వం జాలువారటం అంత తొందరగా జరుగలేదనే చెప్పాలి.

దళిత సమస్యపై స్పందించిన దళిత కవయిత్రకలలో ముందుగా పేర్కొనదగినది తెరేసా దేవదానం. ఈమె "క్రైస్తవ గీత మాలిక" "భారతగీతావళి", "ఆంధ్ర తుఫాను" "అస్పృశ్యులెవరు?" "తప్పెవరిది?" మెదలగు రచనలు చేసినట్లు తెలుస్తుంది. ఈ రచనలలో "అస్పృశ్యులెవరు?" "తప్పెవరిది?" గేయ సంపుటాలను కలిపి ముద్రించారు. ఈ పుస్తకానికి మోదుకూరి జాన్సన్ ముందు మాట రాస్తూ ఈమెను 'పంచమ స్వరం' గా కీర్తించాడు. ఉపధ్యాయురాలైన ఈమె "అస్పృశ్యులెవరు?" గేయ సంపుటిలో దళితుల్ని మాలమాదిగలుగా విడదీసిన సమాజాన్ని నిలదీసింది. దళితులను ఐక్యంగా ఉద్యమించాలంటూ హితవు పలికింది.

"మాల మాదిగలు ఏకము కాగా / మార్గములెన్నో సరళమగునుగా మంచి ఏమిటో ఎంచి చూడుమా / మనలో భేదము లేదని చాటుమా" "తప్పెవరిది?" గేయ సంపుటిలో దళితులు అస్పృశ్యులుగా మారటానికి కారణాలు అన్వేషించింది. దళితులు ఆర్థికంగా, సామాజికంగా, రాజకీయంగా ఎదగాలని ఆకాంక్షిస్తూ దళితులు పడుతున్న శ్రమను గుర్తు చేసింది.

"అంటరాని వాడను ఎగతాళి పదమేల / అంటరాని తనము పెకిలించి వేయవే
కళ్ళమంతా తిరుగుతాడు, కాళ్ళతోటి తొక్కుతాడు / మురికి చెమట కార్చుకొంటూ బస్తాలు నింపుతాడు"

పద్య, గద్యాలలో కవిత్వం చెప్పగల మరొక ప్రతిభావంతురాలు కొలకలూరి స్వరూపరాణి ఈమె "గంగావతరణ శివతాండవం", "చంద్రగ్రహణం", "ప్రబోధము" మొదలగు రచనలు చేసారు. ఇందులో "ప్రబోధము" లో హరిజనులు అనే పేరు మాకెందుకంది. మిగిలిన జాతులు దెయ్యపు బిడ్డలా అనే భావన కలిగేటట్లు నిలదీసింది.

''పేదవారికి హరిజనులనే / బిరుదు ఒకటి తగలించారు.

వారి శ్రమను దోపిడీ చేస్తునే / ఊరి వెలుపల ఉంచేశారు నాకు తెలియక అడుగుతాను / మనుషులందరూ హరిజనులుకారా''?

అంటూ హరిజనులకు ఇతర జనులకు తేడా ఎక్కడుందని నిలదీసింది. చాపు, పుట్టుకలు అందరికి ఒక్కటే కాదా? అని ప్రశ్నించింది.

ఈ విధంగా తెరేసా దేవదానం, కొలకలూరి స్వరూపరాణి మొదలగు తొలితరం దళిత కవయిత్రులు దళిత సమస్య పట్ల తమ స్పందనను వ్యక్తపరచారే తప్ప ఎక్కడ ధిక్కార స్వరం ప్రదర్శించినట్లు కన్పించదు. అయితే ఆధునిక కాలంలో కవిత్వం రాస్తున్న యువ కవయిత్రులు తమ ఆవేదనను తీవ్రస్థాయిలో ప్రదర్శించారు.

దళిత దృక్పథంతో కవిత్వం రాసిన నవయువ కవయిత్రులలో ముందుగా చెప్పుకోవలసిన కవయిత్రి చల్లపల్లి స్వరూపరాణి. ఎందుకంటే ఆమె చరిత్ర శాఖలో పిహెచ్.డి పూర్తి చేసి విశ్వవిద్యాలయంలో పనిచేస్తూ తన రచనావ్యాసాంగాలను కొనసాగిస్తున్నారు. ఆమె హైదరాబాద్ కేంద్రీయ విశ్వవిద్యాలయంలో పరిశోధన విద్యార్థినిగా ఉన్న రోజుల్లోనే "మంకెన పూవు" (పదునెక్కిన పాట) కవితను రాసారు. అందులో దళిత స్త్రీ ఇంట్లో పురుషాహంకారానికి, బయట కులాహంకారానికి గురై అనుభవించే అగచాట్లుకు అక్షరరూపం ఇచ్చింది.

"నేను ముళ్ళకంపలో చిక్కుకుని / అల్లాడుతున్న పాలపిట్టను ఎటుకదిలినా ముళ్ళన్నీ గుచ్చుకునేది నాకే / ఇవి ఈనాటి ముళ్ళుకావు తరాల నుండి నా చుట్టూ పేర్చిన / బానిస సంకెళ్ళు /అసలు. . . నా జీవితాన్ని నేనుగా జీవించిందెప్పుడు...? ఇంట్లో పురుషాహంకారం / ఒక చెంప చెళ్ళుమనిపిస్తే వీధిలో కులాధిపత్యం / రెండో చెంప పగలగొడుతుంది" అంటూ లింగ, కుల వివక్షలు గోడదెబ్బ, చెంపదెబ్బలా ఏక కాలంలో దళిత స్త్రీని ఎలా హింసిస్తాయో దమనీయంగా ఆవిష్కరించింది.

కులం, దారిద్ర్యం ఈ రెండూ కలసి దళిత స్త్రీని బలి చేశాయని ఆవేదన చెంది, దళితులపై సవతి ప్రేమను చూపించే సమాజాన్ని "వేలాడు ప్రశ్న" (చిత్తరువు) కవితలో నిలదీసింది.

"ఏనాడో ఈ దేశం / నా జాతికి విధించిన

మరణ శిక్ష గురించి ప్రశ్నిస్తున్నాను / ఈ భూమిపై మొలచిన నేరానికే వుమ్మి ముంత, తాటాకు చీపుర్లను / బతుకంతా అనుభవించిన నా తాత ముత్తాతలు / ఏ నేరం చేశారని? అడక్కుండానే ఈదేశం నీచేతకి చేపనిచ్చి / నా మెడలో పామును వదలింది అది నీకు రొట్టెనిచ్చి / నా నోట్లో రాళ్ళు కుక్కిన సవతి తల్లి"

స్త్రీ వాద కవిత్వం అగ్ర వర్ణాల సమస్యల్నే ఎత్తి చూపిస్తూ, దళిత స్త్రీ సాధక బాధలను నిర్లక్ష్యం చేస్తుందని ఆవేదన చెందుతూ "మాయమ్మ" (పదునెక్కి పాట) కవితలో "అమ్మా ! మనూళ్ళో రావిచెట్టు కింద రచ్చ బండలాగే / అక్కడ ప్రెస్ క్లబ్బులనీ, రవీంద్ర భారతిలనీ వ్యవహారాలు మాట్లాటానికుంటాయిలే... / అక్కడి బాజ్జీ హైర్ ఉద్యమాల్లో పట్టుచీరల పోరాటాల్లో / స్లీవ్స్ స్పీచ్లో నీ అద్దేపల్లి అరవయ్యో నెంబరుకోక / బిక్క మొహం వేలాడేస్తుంది. //ఆర్థిక స్వాతంత్ర్యం కావాలనీ / నోరు నొప్పి పుట్టేలా వుపన్యసించి

ఈ దేశంలో స్త్రీలపై అణచివేత నశించాలనీ / మహిళలకు లైంగిక స్వేచ్ఛ కావాలనీ చివర్లో పాపం / దళిత స్త్రీని కూడా / పైకి తీసుకెళ్ళాలని ముగిస్తారు" నిని బట్టి స్త్రీ వాదుల ఎజెండాలో దళిత స్త్రీకి ఎంత ప్రాధాన్యత ఉన్నదో పై పంక్తుల్లో కవయిత్రి వ్యంగ్యంగా వ్యక్తపరచింది.

దళిత స్త్రీ ఆవేదాన్ని, ఆవేశాన్ని, ఆక్రోశాన్ని, ఆరాటాన్ని, పోరాటాన్ని, అవమానాన్ని, శ్రమదోపిడిని జి. విజయలక్ష్మి "పని పిల్ల" (పదునెక్కిన పాట) కవితలో శక్తిమంతగా ఆవిష్కరించించి.

"కళ్ళు తెరచినప్పటి నుండి / కన్నీళ్ళే కళ్ళల్లో నింపుకున్నదాన్ని అమ్మా అమ్మాకి బదులు / దొర దొరసానీ అని ఏడ్చిందాన్ని కడుపునిండా తిన్నది కలలోనే / కులమే నా రంగు కటిక దరిద్రమే నా కొంగు / కింది మెట్టే నా బతుకు" అంటూ ఆకలి, దారిద్ర్యం, కుల వివక్ష

ఎదుర్కొంటున్న దళిత స్త్రీలు పని మనుషులుగా నలిగిపోతున్న వైనాన్ని వ్యక్తపరచారు.

అలాగే 'సవాల్' (చిత్తురువు) కవితలో దళిత స్త్రీలు పిడికిలి బిగిస్తే అగ్రవర్ణాలు పిండి బొమ్మలౌతారు అని హెచ్చరించింది ఇలా. "ఇక నుండీ బరిసె మాది బలి మీది కలం మాది కథ మీది

ఇవాల్టి సాహిత్యాధికారం రేపటి రాచకీయాధికారం దళితులదే యూనియన్ ఆఫ్ సోషలిస్ట్ ఇండియన్ రిపబ్లిక్స్ అధికారం దళిత మహిళలదేనని చేస్తున్నాం సవాల్" హెచ్చరించింది. అంటూ తమను బలహీన చేసే అగ్రవర్ణాల పట్ల దళిత స్త్రీ ఆధునిక అరుంధతి అవు తుందని హెచ్చరించింది

దళిత స్త్రీ సమాజంలో ఎన్ని రకాలుగా దోచుకో బడుతుందో తెలియపరిస్తూ సమాజాన్ని ప్రశ్నిస్తున్న కవయిత్రి దర్శి శశి నిర్మల. "నిండా చెడిందాన్ని నేనే" (పదనెక్కన పాట) కవితలో నా ఇంటోణ్ణి / ఒరేయ్ దిబ్బాయ్ అన్నావు సరే నా పిల్ల దాన్ని / నీ బిడ్డ చెయ్యి బట్టుకున్నప్పుడయినా నోరు తెరిచావా / నీవు ఎంత జెప్పు/ నేను తక్కువ దాన్నే నీవు ఎక్కువదానివే / నువ్వు నాకు చేసిందీ లేదు"/"చివరికి నిండా చెడిందాన్ని నేనే / చేతులు బిగించాల్సింది నేనే" అంటూ అగ్రకుల స్త్రీల అహం కారాన్ని నిలదీసింది. '

దళితరాలు' (పదనెక్కన పాట) కవితలో - దళితస్త్రీకి జరిగే అవమానాన్ని ఎత్తి చూపిస్తూ "ఎవరో ఒకళ్ళు నామొకం పైకి లుంగీ ఎత్తి నుంచోవాలంట/నా ఆశల ఎసరు బియ్యంలో కాకరించి ఉయ్యాలంట

నా రెండు కళ్ళల్లో ఆడుకునే అమాయకపు కోడి పిల్లల్ని/గద్దలా తన్నుకు పోవాలంట /కసిరో కొట్టో తిట్టో అవమాన పెట్టో /నాచిటికెడు సొంతతనాన్నీ గిల్లెయ్యా లంట /ఎవరో ఒకళ్ళు నా దోసిట్లో ఉచ్చబొయ్యాలంట/ ఇక నేను నోరు విప్పుతున్నా/కళ్ళు విప్పుతున్నా/ఇక ఎవరెట్టా కసరత్తులు చేస్తారో చూస్తా"/తేలుస్తానని హెచ్చ రించింది. అంటూ తిరుగు బాటుచేస్తూ, మీ అంతు/ కళ్ళు మందు జరుగుతున్న అన్ని రకాల మరణ కాండకు నేనే సాక్షినంటూ కలం గళం విప్పిన కవయిత్రి మద్దూరి విజయశ్రీ. ఈమె 'ఆలీసమ్మశాపం' (పదునెక్కిపాట) కవితలో పురాణ కాలం నుంచి ఈనాటి వరకు దళిత స్త్రీ ఎదుర్కొంటున్న అవమానాలను కళ్ళ కట్టినట్టు వర్ణించింది.

"మొన్న శ్రీరాముడి ఆనతి మేరకు / ముక్కుసెవులూ కోయించుకున్నాను నిన్న పంజాబు పోలీసుల చేతుల్లో / నిష్కారణ శోకంగా చిత్రించబడ్డాను ఇవ్వాల్టికీ / పున్నామ నరకానికీ పసుపు కుంకుమకీ మధ్య శతాబ్దాల సందేహాన్నై సంక్షోభాన్నై / అవును ఆలీశమ్మనే మాట్లాడుతున్నాను" అంటూ స్త్రీలను కూడా మనుషులుగా గుర్తించమని ఆవేదన చెందింది.

తమ శరీర అందాలను దోచేసి, కులం తక్కువని నిందించే దొంగ సర్టిఫికేట్ దళితుల్ని నిలదీసి పంచాయితీ పెట్టిస్తానని హెచ్చరించింది. "పంచాయితీ" (పదునెక్కిన పాట) కవితలో

"ఒరే మొగుడా! జాగ్రత్త! / మాటలు తిన్నగా తియ్యగా రానీయి
మా అన్నోళ్ళు గొడ్లు కోయటం నూశా / మా తమ్ముళ్ళు తోలు వలవడం నూశా

మా అయ్య తోలుతో సెప్పులు కుట్టడం నూశా" అంటూ గొడ్డుని కోసినట్లు కోస్తా, తోలువలుస్తా, తోలు వలచి చెప్పులు కుడతానని హెచ్చరించింది.

దళిత స్త్రీలపై అగ్రకుల భూస్వాములు చేస్తున్న ఆగడాలకు తెరదించవలసిన సయమం వచ్చిందని హెచ్చరించిన కవయిత్రి కర్రి విజయ కుమారి. ఆమె "గవిని దాటేరా" (మేమే) (దళిత సాహిత్య తత్వం) కవితలో

"ఊరు దాటి ఊరు గవినిదాటి
కాలు లేపి, కంచు కడియాన్ని చూపి
వాడి గడప మీదికి పోదామె" అంటూ తొటి దళిత స్త్రీలను యుద్ధోన్ముఖులను చేసింది

ఇన్ని జరిగిన పశువులా ఉండడం నేరం అని చెప్పుతూ
"కళ్ళాపికి బదులు వాడి కళ్ళంలో కాలు మడుద్దాం
బొడ్లో లిక్కిదీసి గొంతు కొయ్యకనే
వాడి తోలు వొల్చి
ఓ తరంగం తప్పెట వాయిద్దాం"

అంటూ భూస్వాముల ఆగడాలకు చరమగీతం పాడటానికి దళిత స్త్రీలను ప్రోత్సాహించింది.

వరె రాణి తన కవిత్వంలో దళితులు సామాజికంగా, ఆర్థికంగా, ఆధ్యాత్మికంగా దోపిడీ అయిన తీరును 'పదును' (పదునెక్కిన పాట) కవితలో వివరించింది.

బావులు చెరువులు తవ్విన నా దోసిట్లో నీళ్ళకు బదలు
నా కన్నీళ్ళే రాలిపడ్డాయి.
పంటలు పండించిన నా గిన్నెలో / అన్నానికి బదులు
పస్తులు నిండాయి అన్ని చోట్లు పనికొచ్చిన నేను / ఆలయ ద్వారం దగ్గరే
పాద రక్షల్లా ఆగిపోయాను.
"ఇంకా ఇట్టాగే కూర్చుంటే లాభం లేదు / నా కొడవలికి పదును పెడతా"! (??: 19)

అంటూ దళితుల్ని ఈ దుస్థితికి తెచ్చిన కుల వ్యవస్థను తుంచెయ్యడానికి కొడవలికి పదును పెడుతున్నానని నిర్భయంగా చాటింది.

తన కవిత్వానికి "ఎజెండా" పెట్టుకుంది జల్లి ఇందిరా. అవరోదాలనే కంచెలు దాటటానికి, అణచివేతకు, హక్కుల సాధనకు తన ఎజెండాలో అనేక అంశాలు పెట్టుకుంది. 'దళితస్త్రీ ఎజెండా' (చిత్తరువు) కవితలో

"ఒరే మొగుడా! జాగ్రత్త! / మాటలు తిన్నగా తియ్యగా రానీయి
మా అన్నోళ్ళు గొడ్లు కోయటం నూశా / మా తమ్ముళ్ళు తోలు వలవడం నూశా
మా అయ్య తోలుతో సెప్పులు కుట్టడం నూశా"

అంటూ గొడ్డుని కోసినట్లు కోస్తా, తోలువలుస్తా, తోలువలచి చెప్పులు కుడతానని హెచ్చరించింది.

కంచెల మీద కంచెలు వేసే రౌతుల మీద తిరుగు బాటు అంటే పక్కా భూమికోసం తిరుగుబాటు భూమి కోసం ఆకాశంలో సగం తిరుగుబాటు"

అంటూ దళిత స్త్రీని విముక్తి కోసం తిరుగుబాటు చేయమని పిలుపునిచ్చింది.

కులాన్ని కుళ్ళిన పుండుతో పొలుస్తూ డబ్ల్యు. ఎమ్. సీతాలక్ష్మి రాసిన 'పుండు' (పదునెక్కిన పాట) కవితలో పుండును అగ్ర వర్గ సమాజానికి ప్రతీకగా చెప్పింది.

"రంగుల్ని చీపురుకట్టతో ఊడ్చి / రోడ్డు కవతల పారబోయడమే ఇప్పటి నా పని / ఈ పుండుని పగల కోసి మందేసి కట్టు కట్టడమే / ఇప్పుడు నా కర్తవ్యం"

ముగింపు

ఈ విధంగా కవిత్వ రంగంలోకి ఇప్పుడిప్పుడే అడుగు పెడుతున్న దళిత స్త్రీలు తాము ఎదుర్కొంటున్న అన్ని సమస్యలనూ కవిత్వంలో వ్యక్తిపరచడానికి ప్రయత్నిస్తు న్నారు. వీరిని తగిన విధంగా ప్రోత్సహిస్తే ఇంకా విశేషంగా వారి నుండి రచనలు వస్తాయి. వీరి రచనలలో చాలా ముద్రణకు నోచుకోవటం లేదు. వాటి సంపాదించి పరిశీలిస్తే మరిన్ని విషయాలు వెల్లడి కాగలవు.

కొలకలూరి ఆశాజ్యోతి, కొలకలూరి మధుజ్యోతి, జూపాక సుభద్ర, జాజుల గౌరి, గోగు శ్యామల, యం. యం. వినోదిని, ఎండ్లూరి మానస, తుమ్మపూడి భారతి, జాలది విజయ మొదలగు దళిత కవయిత్రులు.

ఆధార గ్రంధాలు :

1. ఆనందరావు, డా. కల్లూరి, 1994 హరిజనాభ్యుదయం ఆధునికాంధ్ర కవిత్వం. చింతపల్లి: చైతన్య సాహితీ స్రవంతి ప్రచురణలు.
2. బాలస్వామి, తాడిపర్తి. 1997. చిత్తరువు (సంకలనం). విజయవాడ: ఆంధ్ర జె సూట్ సోషల్ యాక్షన్ ప్రచరణలు
3. లక్ష్మీ నరసయ్య, జి.1996. పదునెక్కిన పాట (సంకలనం) విజయవాడ: దళిత సాన ప్రచురణలు
4. విజయానందరాజు, డా.వై. తెలుగు సాహిత్యం - హరిజన రచయితల సేవ. పిహెచ్.డి. సిద్ధాంతవ్యాసం. అముద్రితం. 5. శాంసన్, డా.పిల్లి. 2000 దళిత సాహిత్యచరిత్ర. గుంటూరు: స్వీయ ప్రచురణ
6. శ్యామల, గోగుల. 2003 నల్లపొద్దు (సంకలనం) హైదరాబాద్: హైదరాబాద్. బుక్ ట్రస్ట్
7. సంజీవరావు, డా.కె (శిఖామణి). 1998. దళిత సాహిత్య తత్వం. హైదరాబాద్: లిటరరీ సర్కిల్ ప్రచురణ

★★★

Vol. 23 | Spl. Issue 03 | March 2026 | BHAVAVEENA | ISSN No. : 2456-4702 | RNI No. APTEL/2003/12253

RNI No. APTEL/2003/12253 | Reffered Journal & Peer Reviewed Journals | ISSN No. 2456-4702

భావవీణ

కళలు, సాహిత్య, సాంస్కృతిక భాషాధ్యయన పత్రిక

BHAVA VEENA

Journal of Arts, Literary, Culture & Language Study

చలం - మ్యూజింగ్స్ - స్త్రీ చైతన్యం

- డా॥. చొట్ల కిషోర్

తెలుగు శాఖ అధ్యక్షులు, కాకాని వెంకటరత్నం కళాశాల, నందిగామ, ఎన్టీఆర్ జిల్లా.

విశ్వంలో శక్తి అంతా స్త్రీ శక్తి. స్త్రీ శక్తిని అధిగమించిన శక్తి ఏదీ లేదని ఏదైనా ఉంటే అది దివ్య శక్తి అని ఆ దివ్య శక్తిని ఎరుగక స్త్రీ శక్తిని ఆరాధించి రచనలు చేసిన వాడు చలం. ప్రేమలు బగ్గమై వివాహ వ్యవస్థ చిద్రమై పోతున్న ఈ కాలంలో చలం రచనలు చదవడం ఆయన రచనలను భావనలను ఒకసారి మననం చేసుకోవడం చాలా అవసరం చలం రాస్తున్న కాలంలో ఆయన రాత లను మేధావులందరూ వ్యతిరేకించారు పవిత్రమైన వ్యవస్థలను భగ్నం చేస్తున్నాడని బాధపడిపోయి చలాన్ని హేళన చేశారు ఆయన రాతల్ని అసహ్యించుకున్నారు కానీ ఒకసారి నేటి సామాజిక వ్యవస్థలనుగమనిస్తే చలం రాతలు నిజమే అనిపిస్తుంది అవసరం అని బలంగా నమ్మాలనిపిస్తుంది. శ్రీశ్రీ విప్లవధోరణలను కృష్ణశాస్త్రి భావన ప్రపంచాన్ని వదిలేసి చాలాకాలం అయింది. ఆ కవులకి కవిత్వాలకి ఇవాళ ప్రాసంగీకత లేదనేది సుస్పష్టం ఇవాళ సమాజం మనుగడ కోసం స్త్రీ పురుష సంబంధాలు సరైన మార్గంలో ప్రయాణించడం కోసం ముఖ్యంగా ఒకరి వ్యక్తిగత ఇష్టాన్ని మరొకరు కల్మషం లేకుండా అంగీకరించటం కోసం చలం విలువలను ప్రచారం చేయడం ఒక్కటే మార్గంగా తోస్తుంది మకిలి భావాలతో బూజు పట్టిపోయిన నేటి సమాజాన్ని రక్షించుకోవడానికి చలం ఒక్కడే దిక్కు ఆయన రాతలే రక్ష. చలం తన కథల్లో నవలల్లో నాటకాల్లో, ఆయనే ప్రారంభించిన ప్రేమ లేఖలు మ్యూజింగ్స్ వంటి ప్రక్రియల్లో తన అభిప్రాయా లను నిర్మొహమాటంగా తెలియజేశాడు

చలం రచనలకు కేంద్ర బిందువు స్త్రీ. తరతరాలుగా అంధకారంలో మగ్గిపోతున్న స్త్రీలను చూసి ఆక్రోషిస్తూ, మగవాళ్ళ దురహంకారాల మూలంగా, అనుచానంగా వస్తున్న అజ్ఞానం మూలంగా చితికిపోయిన స్త్రీని ఉద్ధరించ డానికి చలం నడుం బిగించాడు. స్త్రీకి తన మీద తన శరీరం మీద జీవితం మీద హృదయం మీద సంపూర్ణ అధికారం కావాలని నినదించాడు. చలం రచనల్లో మ్యూజింగ్స్ ది ఒక ప్రత్యేకమైన స్థానం. మ్యూజింగ్స్ లో చలం స్త్రీ ఔన్నత్యాన్ని ఎలా చిత్రించాడో తెలియజేయడం ఈ పత్రం ఉద్దేశం. మ్యూజింగ్స్ రచనా కాలం 1937 నుండి 55 వరకు. ప్రారంభ దశలో పాటిబండ్ల మాధవ శర్మ సంపాదకత్వంలో వచ్చిన వీణ పత్రికలో ఇవి అచ్చయ్యాయి తర్వాత కాలంలో చాలా పత్రికల్లో వచ్చాయి. సుమారు 69 అధ్యాయాలలో చలం తన అభిప్రాయాలను ఈ మ్యూజింగ్స్ ద్వారా తెలిపాడు. తీవ్రత, ఆత్మ పరిశీలన, భావుకత్వం, తెలియని బాధతో నలిగి మూలిగే మనసు యొక్క ప్రేలాపనలు, నిరంతర ప్రశ్నలు ముఖ్యంగా అందం ఎక్కడ కనపడినా వదలలేని వివశత్వం ఇవన్నీ కలిపి చలం మ్యూజింగ్స్ అనవచ్చు. ప్రముఖ సాహితీవేత్త ఆచార్య జీవి సుబ్రహ్మణ్యం గారు

మ్యూజింగ్స్ అంటే నిశ్శబ్ద సమాధిలో నిరంతరచింతన అంటారు. చలం మానసిక సమాధిలో నుంచి సముద్ర తరంగాల లా పొంగిన ఆలోచన లు మ్యూజింగ్స్. ఇవి ఛందస్సులకు అతీతంగా చలం అంతరాత్మ ఆలపించిన అద్భుత గేయాలు. ఆయన భావవిహంగాలకు అమరిన అసాధారణమైన రెక్కలు. మ్యూజింగ్స్ గురించి అనేక నిఘంటువులు రకరకాల అర్థాలను చెప్పాయి కేమ్బ్రిడ్జి నిఘంటువులో మ్యూజింగ్స్ అనే పదానికి యువర్ థాట్స్ ఆర్ కామెంట్స్ ఆన్ సంథింగ్ యు హావ్ బీన్ థింకింగ్ అబౌట్ కేర్ఫుల్ ఫర్ లాంగ్ టైం అని అర్థం కనిపిస్తుంది.

తెలుగు సాహిత్యంలో మ్యూజింగ్స్ అనే ప్రక్రియను ప్రారంభించి అసాధారణ రీతిలో సాహితీ ప్రియులని అలరించినవాడు చలం. తదనంతర కాలంలో ఈ ప్రక్రియలో ఎవరూ రచనలు చేయకపోవడానికి కారణం అంత నిష్కర్షగా సమర్థవంతంగా నిజాయితీగా తన అంతరంతరాల్లోని భావనలను తెలియజేసే ధైర్యం లేకపోవడమే అనవచ్చు. పాఠకుల్ని ఉత్సాహంతో పరిగెత్తించగల విభిన్నమైన రచన శైలి లేకపోవడం కూడా ఒక కారణం కావచ్చు. సాహిత్యంశాలు, వ్యక్తిగత అంశాలు, మనస్తత్వశాస్త్రంశాలు, ఆధ్యాత్మిక భావనలు, సాంఘిక సంస్కరణకు సంబంధించిన భావనలు,ఇలా అనేక అంశాలపై మ్యూజింగ్స్ నడుస్తాయి.ఇవన్నీ ఒక ఎత్తు అయితే మ్యూజింగ్స్ లో స్త్రీల పట్ల తన దృక్పథాన్ని చాలా స్పష్టంగా తెలియజేయడం మరో ఎత్తు. వివాహం,స్వేచ్ఛ,ప్రేమ, పాతివ్రత్యం, సౌందర్యా పేక్ష వంటి అంశాలను స్పృశిస్తూ మహిళా చైతన్యాన్ని కాంక్షిస్తూ సుమారుగా 19 అధ్యాయాలలో వివరించాడు చలం. వ్యవస్థలో చాలా బలంగా కనిపించే అనేక అంశాలకి చలం కొత్త అర్థాలను చెప్పాడు ఈ క్రమంలో అనేక పురాతన విలువల ను పాతరేశాడు చలం. ఉదాహరణకు ఒక సందర్భంలో స్త్రీ శరీరం ఉత్త మాంసం అయిన మాట నిజమే శరీరపు కాంతి, మృదుత్వము, శృంగారం, ఆహ్లాదం ఇవన్నీ అంతకన్నా నిజాలు ఆ మాంసం సంగతే మనసులో పెట్టుకొని ఈ విలువల్ని చూడలేని మనిషి కన్నా దౌర్భాగ్యుడు మరొకడు ఉండడు, సంసారం దుఃఖ సాగరమే కానీ ఆ సాగరాలని మించిన మహా సాగరాల వంటి సుఖాలు ఉన్నాయని గుర్తు లేని మనిషి ఎంత అందుడు అంటాడు.

తరతరాలుగా స్త్రీని బానిసగా వంటింటి కుందేలుగా మార్చిన వివాహ వ్యవస్థపై తిరుగుబాటు జెండా ఎగర వేశారు చలం అనేకమంది విమర్శకులు చలం తన రచనల ద్వారా వివాహ వ్యవస్థను నాశనం చేయాలని ప్రయత్నిస్తున్నాడని విమర్శించారు దీనికి చలం తన మ్యూజింగ్స్ లో స్పష్టంగా సమాధానం చెప్పాడు వివాహం విచ్ఛిన్నం అవుతుంటే, స్త్రీ పురుషులు స్వేచ్ఛగా ప్రేమించుకుంటారంటే, నేను అందుకోసమే ప్రయత్నిస్తున్నానంటే నేను భయపడవలసింది గాని సిగ్గుపడవలసింది గాని కనిపించదు అంటాడు అయితే విషయమేమిటంటే స్త్రీ స్వేచ్ఛను ఆటంకపరిచే అవరోధాలను తొలగించినా, బంధాలకు బానిసలు అయిన స్త్రీలు బయటకు రావడం అంత తేలికగా జరగదంటాడు స్త్రీ పురుషులు ఉత్త మోహం చేతనే గాక పెళ్ళికాని , కాకపోనీ ,కొంతకాలం కలిసి జీవితం గడపడం చేత స్థిరంగా అతుక్కుపోతారంటాడు. వివాహమైనంత మాత్రాన అంతా నీతి కాదని కానంత మాత్రాన అంత అవినీతి కాదని చలం భావన... ఎంతో అభివృద్ధి చెందాయి అనుకుంటున్న పాశ్చాత్య దేశాలలో కనిపించే డేటింగ్ సంస్కృతి, సహజీవనం వంటివాటిని ఏనాడో ప్రతిపాదించాడు స్వేచ్ఛ వ్యక్తిత్వం హక్కులు ప్రాతిపదికగా ఉండే వ్యవస్థని కాంక్షించాడు చలం.సంక్షోభ స్థితికి చేరుకున్న నేటి భారతీయ వివాహ వ్యవస్థకు చక్కని పరిష్కారాన్ని చలం ఎప్పుడో చూపించాడు.

స్త్రీ పురుష సంబంధాలపై చర్చ చేస్తూ, స్త్రీ పురుషుల మధ్య ఎప్పుడు ప్రేమ అంకురిస్తుందో తెలియదు దాన్ని లోకం అర్థం చేసుకోదు లోక సంబంధమైన మర్యాదలు, కుటుంబాలు ధనము, కీర్తి ఇవే విలువలు ఇవి కాకుండా వేరే విలువలతో బతికే మనుషులు ప్రపంచానికి శత్రువులు ఉన్మత్తులు అయినారు అంటాడు. శరీర సుఖానికే బతికేవాడు నీచుడు పశువు. ఏ ఆశయానికో అన్వేషణకో కళకో జీవితాన్ని అర్పించేవాడు పిచ్చివాడు. ఇద్దరు మోహించుకున్నారన్నా, పెళ్లి కాని వాళ్ళు కలుసు

కున్నారు అన్నా కోపం. ఎందుకంటే వాళ్లు ఏదో తమకు అందని సుఖం అనుభవిస్తున్నారని భార్య భర్తల మధ్య రాని సుఖం ఆనందం, ప్రియులకు కలుగుతున్నాయని. రోజు రొటీన్గా శవాల్లా బతకకుండా ఏదైనా సుఖానికి ప్రయత్నించారా మండిపడతారు మనుషులు వాళ్ళిద్దరి మధ్య విడువలేని అభ్యంతరాలు, ఆగి చూడలేని ప్రేమ అని అంగీకరించరు. గొప్ప మోహాన్ని గాని ప్రేమని గాని చూసినప్పుడు అర్థం కాక తమకి అర్థమయ్యే కామం ధనం మదం చపలత్వం ఇట్లాంటి కారణాలు ఆరోపిస్తూ మాట్లాడుతారు. ''వాళ్ళిద్దరికీ ప్రేమ గావును'' అని అనరు ఎంత సంస్కారం ఉన్నా శృంగారం విలువ ఉన్న ఏ మనిషి నోటి నుండి ఆ మాట రాదు. చాలామంది స్త్రీలకి దేహాలతో పూర్తిగా అనుభవించడం కూడా చేతకాదు పిల్లలు కన్న గొప్పతల్లులకి శరీర వాంఛ కూడా తెలియ దంటాడు చలం. సరిగ్గా ఈ అభిప్రాయాలతోనే అంతకు ముందే చలం మైదానం రాసి తెలుగు సాహితి లోకంలో పెను తుఫాన్ సృష్టించాడు

చలం రాజేశ్వరి అమీర్ ను మీరా ను ఏకకాలంలో ప్రేమిస్తుంది. ఇద్దరినీ ఒకేసారి ప్రేమించడం లోకనీతుల దృష్ట్యా అనైతికం కావచ్చు కానీ చలం దృష్టిలో చలం నమ్మిన విశ్వాసాలు విలువల దృష్టిలో సహజమే సాధారణ దృష్టితో చూసే వాళ్ళకి, మాట్లాడే వాళ్ళకి చలం అర్థం కాలేదు అందుకే ఆయన్ని ఆడిపోసుకున్నారు. మార్చు కోండి జతలు నిరంతరం మారండి అంటాడు చలం కానీ అదెలా కుదురుతుంది? అన్నవారితో ''ఒక ప్రేమస్థితి హృదయానికి తృప్తినిచ్చి జీవితాన్ని వెలుగుతో నింపుతుంటే చివరికి విరహమే, విడిపోవడమే గొప్ప శృంగారమైతే అంతకన్నా గొప్ప ప్రపంచంలో లేదు'' అనేది చలం భావన. అలాగే ప్రేమ బంధం రసహీనమై ఎండి భారమైన రోజున ఏవో నియమాలని, సంశయాలని, వాగ్దత్తాలని వేలాడటం మూర్ఖం అంటాడు.తన రాతలు అర్థం కావడం లేదని ఎక్కడ లోపం? నేను చెప్పడంలోనా? చదవడంలోనా? అర్థం చేసుకోవడంలోనా? అని సంశయానికి లోనవుతాడు. స్త్రీ పురుష సంబంధాలలో ప్రేమ కోసం తపించాడు చలం అంతేకానీ వారిని వేరు చేయాలనుకోలేదు ఏదైనా ''ప్రేమ''కారణం కావాలన్నాడు. పడకపోతే ప్రియులు విడిపోయే స్వేచ్ఛ ఉండాలి అంటాడు .కానీ జాగ్రత్తగా అర్థం చేసుకోవాలి. ప్రియులు అంటేనే వాళ్ళ మధ్య స్వేచ్ఛ ఉంది ప్రేమని త్యజించి స్వేచ్ఛని పొందగలరా అని ప్రశ్నిస్తాడు. పైగా ''స్వేచ్ఛ లేకపోతేనేం'' అనని ప్రేమ ఏం ప్రేమ? అంటాడు స్త్రీ తన బలహీనత్వంతో ప్రేమతో శృంగారంతో చూపే బలవంతం ఏ హృదయం ఉన్నవాడు తప్పించుకోగలడు? అంటాడు. స్త్రీ చాలాసార్లు ''నన్ను మోసపుచ్చి అయినా సరే నన్ను సంతోష పెట్టు'' అని అడుగుతోంది కళ్ళతో పురుషుడు తన ప్రేమ కోసం తన నియమాల్ని ధ్వంసం చేసుకోవడానికి అయినా సిద్ధమై తన ఆత్మని తన లోపల సత్యాన్ని తన బలాన్ని ఆమె ముందు అర్పిస్తేనే స్త్రీకి ఆనందం. స్వతంత్రమైన ప్రేమలో జరిగే బానిసత్వం ఎక్కడ ఉంటుంది అని చెబుతూ ప్రేమ వీటన్నింటికీ అతీతమైందని అంటాడు.

లైంగిక స్వేచ్ఛపై కూడా చలం అభిప్రాయాలు విభిన్న మైనది. సృష్టి ఇచ్చిన కామాన్ని సబ్ లైన్ చేసుకొని మానవుడు స్వయంగా తాను సృష్టించుకున్న భూతల స్వర్గం శృంగారం అంటాడు ఏదో తింటాం, కాపరిస్తాం, కంటాం, పెంచుతాం, చస్తాం అనే మనుషులు కాకుండా ఈ లోకంలో రసాన్ని అందుకుంటామని ప్రయత్నించే ఏ మనిషికైనా శృంగారాన్ని మించిన అనుభవం లేనేలేదు ఏ మూలనైనా. అని నిర్మొహమాటంగా చెబుతాడు పైగా ఋషులు ప్రవక్తలు ఎంత నిశ్చయంతో ఆత్మానుభవంతో స్వర్గానందాలని గురించి మాట్లాడారు అంతకన్నా బలంగా తాను శృంగార అనుభవం గురించి రాస్తానంటాడు ఆత్మల్ని నాశనం చేసి ,స్వేచ్ఛ కాళ్లు విరగ్గొట్టి, కళేబరాలని కౌగిలించుకొని సుఖపడుతున్నారు ఈనాటి ప్రజలు అంటాడు కానీ కొందరు ఆత్మల్లో రసికులైన వాళ్ళని పిలిచి ఆలోచింపజేసి ముందుకు రానిచ్చి వెనక్కి భయపెట్టి ఆశపెట్టి ఆశ్చర్య పడజేసి ఈ మిస్టరీ ఏదో తెలుసుకోవాలని కుతూహలంలో చిక్కు పెట్టి ఏమీ తెలియదనే నిరాశతో మగ్గించే గుణం ఉంటుంది నరాల్ని అందంతో లాగి బాధిస్తాయి ఆ స్త్రీ సౌందర్యాలు అంటాడు. కొంతమంది స్త్రీలలో ఆకర్షణ పువ్వుల్ని చల్లని నీలపు నీటిని జ్ఞాపకం

తెస్తుంది సముద్రపు అలలు చూసిన ఆ నునుపు, ఆకాశపు నీలం చి క్కదనం, ఈ తామరుల పరిమళం,ఈ స్త్రీ శరీరాల స్నిగ్ధత్వం,మోహమాధుర్యం అన్ని ఈ హృదయంలో నిరాధారంగా అప్రమేయంగా ఇచ్చామాత్రంగా జనించి ముంచేస్తే పోనీ వాటిని కాకపోయినా ఆ సౌందర్యాన్ని కాకపోయినా అవి కల్పించే ఆనందాన్ని నేనే కల్పించు కోగలిగితే ఇంకేం కావాలి అంటాడు స్త్రీ ని ఎలా గౌర వించాలో సౌందర్యాన్ని ఎలా ఆరాధించాలి అసలు నిజమైన సౌందర్యం ఏదో చలం తెలియజేశాడు. సృష్టి సౌందర్యానికి స్త్రీ సౌందర్యానికి భేదం లేదంటాడు. ఠాగూర్ వర్ణన వలె వుడ్ హౌస్ చక్కిలిగింతల వలె మైకేల్ ఆర్లెజ్ ఉపమానాల వలె జపాన్ దేశపు రేడియో సంగీతం వలె నరాల్ని అందంతో లాగి బాదిస్తాయి ఆ స్త్రీ సౌందర్యాలు అంటాడు నిజానికి పురుష హృదయాలను ఏలిన గొప్ప స్త్రీలు సౌందర్యవంతులు కారు పురుష హృదయం దేన్ని ప్రేమిస్తుందో దేన్ని చూసి మంటను వదలలేని కీటకం వలె అయిపోతుందో ఆ గుణాల్ని ప్రదర్శించగలదు ఏమీ ప్రయత్నం లేకుండా. అయితే అందం కంటే ఆత్మ ముఖ్యం అంటాడు. ఆత్మ లేక పోతే ఎంత అందమైన వ్యర్థం ఉంటాడు మన పురాణాల్లో ప్రబంధాల్లో సౌందర్యాన్ని వర్ణించేటప్పుడు చాపలు చాటలు పువ్వులు కాడలు పుట్టలు ఉపమానాలు తీసుకొచ్చి పెట్టారు గాని ఒక్కచోట ఈ ఆత్మ తేజస్సు సంగతి ఎత్తుకోలేదు అనే విచారం వెలిబుచ్చాడు అసలు సౌందర్య భావం ప్రజలలో చచ్చింది అనేది చలం అభిప్రాయం. సౌందర్యాన్ని చూడగానే దాన్ని ఎట్లా అనుభవిద్దామా అదే ధ్యాస ఎక్కువైందని గ్రహించాడు ఆ సౌందర్యాన్ని పక్క మీదికి గదుల్లోకి గోడల మీదికి లాగి బంధించి ఎంగిలి చేసి అవతల పారేసి అనుభవించామని గొప్పలు చెప్పు కోవడంలో తృప్తి పడుతున్నారు అంటాడు అసలు సౌందర్యం మీద భక్తి ఉంటుందని కూడా మరిచి పోయారు గొప్ప కళారాధకులు కవులు కూడా. ప్రేమించే స్త్రీని కావలించుకోవడం కన్నా ముఖ్యమైన ఉద్దేశాన్ని కలిగిన మనుషులు దురదృష్టవంతులు వ్యర్థాలు పాషాణులు మృత జీవనులు అంటాడు.

ఆధ్యాత్మిక విద్య గొప్ప విద్య అని ఎవరైనా అంటే చలానికి చికాకు స్త్రీని ప్రేమించలేని మనుషులు ఆత్మ రమతో ఏమి ర మించగలరు అని ప్రశ్నిస్తాడు అలాగే అద్భుతమైన సృష్టి కార్యాన్ని అసహ్యించుకోవడం దాన్ని దాయాలని చూడటం చలానికి నచ్చదు. సృష్టించడం కన్నా ఆనందకరమైన విషయం ప్రపంచంలో లేదు ఇంకో జీవిని సృష్టించడానికి ప్రాణమిచ్చే ప్రయత్నం ఈశ్వర శక్తిని అందుకోగల్గడం అన్నమాట అట్లాంటి అనుభవం ఇంత సులభం నీచం అయిపోయింది ప్రజల చేతుల్లో అని బాధపడతాడు సృష్టిలో మనిషి తప్ప అన్ని ప్రాణులు సృష్టి కార్యాన్ని ప్రేమిస్తాయి కానీ ఈ మనుషులకే కలిగింది ఈ నీచత్వం అంటాడు.పైగా ఆ కార్యం తరువాత ద్వేషం ప్రేమలేని అసహజ ఆలింగనంలో నరాలు అలసి బాధపడటం, వివాహమనే బంధంలో సొంతమనే కాపీనంలో, పాపం చేస్తున్నామనే భయంతో పిల్లలు పుడతారనే దిగులుతో ఆనందాన్ని ఆరోగ్యాన్ని సౌందర్యాన్ని తృప్తిని శాంతిని ఈ మనుషులు ధ్వంసం చేసుకుంటు న్నారు అంటాడు. సౌందర్యానికి అందులు కావడం కన్నా సౌందర్యం మామూలైపోవడం కన్నా మృత్యువు వేరే లేదు అని నిష్కర్షగా చెబుతాడు.స్త్రీ వ్యామోహం కన్నా ఉత్తమ మైనది ఈ లోకంలో ఏముంది ఆత్మ సామ్రాజ్యం ఉంటే అది, లేకపోతే స్త్రీ సామ్రాజ్యమే అంటాడు ప్రాయకంగా చలం సౌందర్యారాధకుడు. ఒక విధంగా ఆయనది సౌందర్యోన్మత్తత లోకంలో ఎవరికీ కనిపించని సౌందర్యాన్ని, ఎవరూ ఆస్వాదించలేని సౌందర్యాన్ని చలం దర్శించగలడు ఆస్వాదించగలడు ఒక సందర్భంలో "ఇంతకీ లేని సౌందర్యాన్ని నేను చూస్తున్నానా? ఉన్న సౌందర్యానికి మీరు అందులైనారా? ఎవరు తేల్చుకోగలరు ఉంటే ఆ ఈశ్వరుడు తప్ప "అంటాడు.

చలం సృష్టించిన స్త్రీ పాత్రలన్నీ స్వేచ్ఛ విషయంలో నిర్మొహమాటంగా ప్రవర్తిస్తాయి ఆధునిక స్త్రీకి లేని ఒక స్వేచ్ఛ చలం స్త్రీలలో కనిపిస్తుంది. ఆధునిక స్త్రీ స్వేచ్ఛ విషయంలో చలానికి కొన్ని అభిప్రాయాలు ఉన్నాయి చాలామందికి స్వేచ్ఛ కావాలని ఉంటుంది కానీ సమస్య ఏంటంటే ఈ స్వేచ్ఛ తన స్త్రీకి తక్కిన పురుషులకి కూడా

వస్తుందేమోనని భయం. అందువల్లనే ఈ స్వేచ్ఛ లోకాన్ని పాడు చేస్తుందని చెప్పి తప్పించుకుంటున్నారు కానీ ఈ స్త్రీపురుషుల హృదయాలు విప్పి చూపగల యంత్రము మంత్రము ఉంటే అసలు విషయం తెలుస్తుంది పురుషులకి స్త్రీల మీద తమకి చలామణి అవుతున్న హక్కులు పోతాయని స్త్రీలకి పురుషులు పెడుతుంటే సుఖంగా బద్ధకంగా బతికే భాగ్యం వదులుకోవాల్సి వస్తుందని భయం. ఈ భయమే లేకుంటే అందరూ చలం ప్రతిపాదించే స్వేచ్ఛని నిరభ్యంతరంగా అనుభవిస్తారు అంటాడు అయినా స్త్రీకి స్వేచ్ఛను కల్పించిన సంసారాలు వదులుకొని వెళ్లేవాళ్లు ఎక్కువమంది ఉండరు అన్నది చలం అభిప్రాయం. క్రమంగా స్వేచ్ఛకు అలవాటు పడి కాలం గడిచిన కొద్దీ కొందరు బయటపడవచ్చు స్నేహం, పిల్లలు, అలవాట్లు, సుఖం, ఒకరి ఒకరు అలవాటు కావడం, సుఖదుఃఖాలు పంచుకోవడం, ఇవన్నీ కాపురాల్లో మనుషుల్ని ఆకర్షించి స్వేచ్ఛగా బంధించి ఉంచుతాయి అంటాడు ఆధునిక స్త్రీల విషయంలో కొత్తగా రెస్ట్ లెస్నెస్ వల్ల విద్య, స్వేచ్ఛలకై ఆరాటం వల్ల పూర్వపు స్త్రీలు నెమ్మదిగా కదలకుండా పొందగలిగిన ఆనందాన్ని శాంతిని ఈ నూతన స్త్రీలు వదులుకుంటున్నారేమోనని అభిప్రాయం ఉంది. చలానికి పాతివృత్యం పై విపరీతమైన అసహ్యం ఒక సందర్భంలో పాతివ్రత్యం స్వభావంలో లేని వాళ్ళు సంఘ గౌరవానికి, పురాణ బోధనల వలన, ఇంట్లో వీలు కలుగకును, పాతివృత్య నియమం పెట్టుకున్నారా... ఇంకా వాళ్లంతా ఇంటాలెరెన్స్ అవుతారు. అవినీతిని ఎంత ఖండించి క్రౌర్యం చూపుతారు ఆ పాతివృత్యం లేని వాళ్ళని ఎంత స్వభావ విరోధులుగా చూస్తారు అంటాడు. అలాగే భర్త అష్ట కష్టాలు పడితే గాని పతివ్రతగా స్త్రీ పక్వం కాదు భర్త యోగ్యుడై సంసారం సుఖంగా జరిగిపోయిన ఒక పతివ్రత కానరాదు ఈ పతివ్రతలు కొంతవరకు ఆ కష్టాల్ని కోరి కల్పించుకుంటారు పతివ్రతల మొహాలు చూస్తేనే గట్టిగా మొత్త బుద్ధి పుడుతుంది భర్తలకి దేవుళ్ళకి వాళ్ళని బాగా ఏడిపించాలని అని వేళాకోళం చేస్తాడు చలం. అయినా నిర్భాగ్యులైన ప్రస్తుత స్త్రీలలో వారి క్షుద్రత్వంలోనే బానిసత్వంలోనే దైవత్వాన్ని అధికత్వాన్ని చూసి ప్రకటించ వలసిన నా "ఫెయిత్ ఇన్ ఉమెన్ హుడ్"ని వక్రం చేసి స్త్రీ ప్రాతివృత్యాన్ని శీలాన్ని మోడెస్ట్ నీ ధ్వంసం చేయాలని చూస్తున్నానని సాగించే దుష్ట ప్రచారం అసాధారణం కాదు అంటాడు చలం.

ముగింపు

ఆత్మ నిర్మలత్వాలు, ధర్మాలు, నిజంగా శీలాలు పాడైపోతూ ఉంటే భార్యలు కూతుళ్లు తమ ఇష్టాలకు ఎదురు తిరిగి వేషాలు భాషలు ఆచారాలు నీతులు మీరుతూ ఉంటే, ఏమీ అనలేరు. వాళ్ళని ఎందుకంటే వాళ్లు లేకపోతే పూట గడవదు ఒకవేళ ఏమన్నా అందామన్నా భయం అందుకని ఆ కోపాన్ని ఉక్రోసాన్ని అసహ్యత్వాన్ని స్త్రీల స్వతంత్రాన్ని సమర్థించే వ్యాసాల మీద కథల మీద రచనల మీద చిమ్ముతారు అని తన గురించి వక్ర రాతలు దుష్ట రాతలు రాసే కుహనా అభ్యుదయ వాదుల ద్వంద్వ ప్రవర్తిని విమర్శిస్తాడు. తనను తన జీవితాన్ని ఇన్ఫ్లుయెన్స్ చేసిన స్త్రీల గురించి చెబుతూ తన తల్లి గారు, సోదరి అమ్మ ణ్ణి ఇంకో సోదరి కమల, భార్య రంగనాయకమ్మ, తన స్నేహితురాలు రత్నమ్మ, తన మేనత్త అబ్బత్త వీరే తన రచనలకు ప్రేరణగా నిలిచారంటాడు విధంగా చలం స్త్రీ చైతన్యానికి ఆలోచనలకి సంబంధించి అనేక విషయాలను చెప్పి సమాజంలో మార్పుని కోరుకుంటాడు.

ఆధార గ్రంథాలు

1. చలం మ్యూజింగ్స్

★★★

Vol. 23 | Spl. Issue 03 | March 2026 | BHAVAVEENA | ISSN No. : 2456-4702 | RNI No. APTEL/2003/12253

RNI No. APTEL/2003/12253 | Reffered Journal & Peer Reviewed Journals | ISSN No. 2456-4702

భావవీణ

కళలు, సాహిత్య, సాంస్కృతిక భాషాధ్యయన పత్రిక

BHAVA VEENA

Journal of Arts, Literary, Culture & Language Study

అగ్నిశిఖల ఆలాపన : 'గురిచూసి పాడే పాట'లో స్త్రీవాద ధిక్కార స్వరాలు - ఒక సమగ్ర పరిశీలన

- పి. ఉషారాణి

తెలుగు శాఖాధ్యక్షులు, యస్.వి.డి. ప్రభుత్వ డిగ్రీ కళాశాల, నిడదవోలు.

వ్యాస సంగ్రహం :

1990లో ప్రచురితమైన 'గురిచూసి పాడే పాట' తెలుగు స్త్రీవాద కవిత్వ చరిత్రలో ఒక ప్రబలమైన దిక్సూచి, చారిత్రక మైలురాయి. అనాదిగా పితృస్వామ్య బంధనాల్లో నలిగిపోయిన స్త్రీల ఆక్రోశాన్ని, అణచివేతను, వారి అస్తిత్వ పోరాటాన్ని అక్షరీకరించిన అద్భుత సంకలనమిది. గృహ నిర్బంధం, శ్రమ దోపిడీ, శరీర రాజకీయాలు, మాతృత్వంలోని హింస, లైంగికత తదితర ఇతివృత్తాలను అత్యంత సాహసోపేతంగా ఈ సంకలనం లోని కవయిత్రులు స్పృశించారు. ఈ పరిశోధనా పత్రం, ఈ సంపుటిలోని కవితలను ఎనిమిది విభిన్న సామాజిక, తాత్విక వర్గాలుగా విభజించి, ప్రతి కవయిత్రి సమాజం స్త్రీలపై ప్రయోగించిన అదృశ్య హింసను ఎలా ఎదిరించారో తులనాత్మకంగా, లోతుగా విశ్లేషిస్తుంది.

కీలక పదాలు :

స్త్రీవాదం, పితృస్వామ్యం, అస్తిత్వ పోరాటం, శరీర రాజకీయాలు, గృహ నిర్బంధం, పురుష చూపులు, అణచివేత, ధిక్కారం.

ఉపోద్ఘాతం :

స్త్రీవాదం ఒక సైద్ధాంతిక ఉద్యమంగా ప్రపంచ వ్యాప్తంగా ఉద్భవించినప్పటికీ, దాని మూలాలు స్త్రీ అనుభవించే దైనందిన వేదనలో, అణచివేతలో ఉన్నాయి. పాశ్చాత్య దేశాలలో ఓటు హక్కు, సమాన వేతనం కోసం మొదలైన ఈ ఉద్యమం, కాలక్రమంలో స్త్రీ శరీరం, లైంగికత, కుటుంబ వ్యవస్థపై పితృస్వామ్య ఆధిపత్యాన్ని ప్రశ్నించే స్థాయికి ఎదిగింది. "స్త్రీగా ఎవరూ పుట్టరు, స్త్రీగా మార్చబడతారు" అన్న సిమోన్ ద బోవార్ మాటలు ఈ ఉద్యమానికి మూలస్తంభాలు. భారతీయ సమాజంలో స్త్రీవాదం ఒక భిన్నమైన రూపాన్ని సంతరించుకుంది. ఇక్కడ పితృస్వామ్యం కేవలం పురుషాధిక్యతగా మాత్రమే కాకుండా కులం, మతం, సంప్రదాయం, 'పాతివ్రత్యం' అనే పవిత్ర భావనల ముసుగులో స్థిరపడింది. దేవతగా పూజిస్తూనే, వంటింటికి పరిమితం చేసే ద్వంద్వ సంస్కృతి ఇక్కడిది. ఈ సంక్లిష్టమైన వలయం నుండి బయట పడటానికి భారతీయ స్త్రీవాదం బహుముఖ పోరాటాలను చేయాల్సి వచ్చింది.

తెలుగు సాహిత్యంలో 1980ల నాటికి స్త్రీవాదం ఒక బలమైన ప్రవాహంగా రూపుదిద్దుకుంది. అప్పటివరకు ప్రబంధకన్యలుగా, కన్నీటి ధారలుగా, త్యాగమూర్తులుగా మాత్రమే కవిత్వంలో వర్ణించబడిన స్త్రీలు, తొలిసారిగా తమ స్వరాన్ని తామే వినిపించడం మొదలుపెట్టారు. అయితే, ఈ మార్పును అప్పటి ఆధిపత్య పితృస్వామ్య సాహిత్య లోకం సులభంగా అంగీకరించలేదు. పురుష కవులు, విమర్శకులు స్త్రీవాద కవిత్వాన్ని 'వంటింటి

కవిత్వం' అనీ, 'శరీరం గురించి రాస్తే బూతు' అనీ తీవ్రంగా ఎగతాళి చేశారు. ఈ అవహేళనలకు, విమర్శ లకు సమాధానంగా స్త్రీవాద కవయిత్రులు తమ కలాలను కత్తులుగా మలిచారు. తాము ఎదుర్కొంటున్న వేదనను దాచకుండా, సమాజం బహిరంగంగా మాట్లాడటానికి అనహ్యించుకునే ''ఋతుస్రావం'', ''గర్భస్రావం'', "గృహహింస", "లైంగిక దోపిడీ" వంటి అంశాలను ప్రధాన కవిత్వ వస్తువులుగా మార్చి సాహిత్యపు ముఖచిత్రాన్ని మార్చేశారు. ఈ క్రమంలో, కేవలం వస్తువును బట్టే వర్గీకరించి, విప్లవాత్మక ధోరణితో ప్రచురించబడిన సంకలనమే 'గురిచూసి పాడే పాట'. ఈ సంపుటిలోని కవితలను స్థూలంగా ఎనిమిది విభాగాలుగా వర్గీకరించి, ప్రతి కవయిత్రి ఆయా ఇతివృత్తాలను ఎలా దర్శించారో పరిశీలిస్తాను.

గృహ నిర్బంధం - శ్రమ దోపిడీ :

పితృస్వామ్యం అత్యంత విజయవంతంగా అమలు చేసిన కుట్ర 'ఇంటి పని'. ఇది స్త్రీలకు దైవదత్తమైన సహజ ధర్మంగా సమాజం నమ్మించింది. దీని వెనుక ఉన్న శ్రమ దోపిడీని కవయిత్రులు తీవ్రంగా ఎండగట్టారు. సమాజం 'గృహలక్ష్మి' అని దేవుడిలా కీర్తించే స్త్రీ ఉదయం లేచినప్పటి నుండి రాత్రి వరకు చేసే చాకిరీని వివరిస్తూ ఓల్గా అద్భుతమైన వ్యంగ్యాన్ని ప్రయోగించారు.

''అలుగ్గుడ్డల పీతిబట్టల
పరిమళంలో పునీతమవుతున్నా
జీవితం ఎందుకో ఎప్పుడూ
కాటు వాసనే వేస్తుంటుంది.'' (పేజీ 26, ఓల్గా, గృహలక్ష్మి) అని ఆమె అనడంలో ఒక గొప్ప విషాదం దాగి ఉంది. బయటికి పవిత్రమైన గృహలక్ష్మిగా కనిపిస్తున్నా, మురికి బట్టలుతికే శ్రమలో ఆమె జీవితం కాలిపోయిన 'కాటు వాసన' వేస్తుందని చెప్పడం ద్వారా గృహిణి జీవితంలోని శూన్యతను బట్టబయలు చేశారు. ఈ భావనను మరింత ముందుకు తీసుకువెళుతూ, విమల వంటగదిని కేవలం ఒక గదిగా కాకుండా స్త్రీల రక్తాన్ని పీల్చే రాకాసి గద్దగా అభివర్ణించారు.

''మన రక్తం పీల్చేసి, మన ఆశల్నీ, కలల్నీ కాజేసి
కొద్ది, కొద్దిగా జీవితాంతం పీక్కుతింటున్న
రాకాసి గద్ద ఈ వంటిల్లు.
వంటింటి సంస్కృతి; వంటింటి ముచ్చట్లు
వంటలక్కలమైన మనం,
మనం ఏమైనా మన అంతిమ కర్తవ్యం
'గరిట తిప్పటం'గా చేసిన ఈ వంటిళ్ళను
ధ్వంసం చేద్దాం రండి!" (పేజీ 29, విమల, వంటిల్లు)

అని రాస్తూ, తరం నుండి తరానికి ఈ వంటింటి సంస్కృతి ఎలా బదిలీ అవుతుందో వివరిస్తూ భవిష్యత్ తరాల పాపలను కాపాడుకోవడానికి ఈ వ్యవస్థను కూల్చేయాలని విప్లవాత్మక పిలుపునిచ్చారు. ఇదే ఇతివృత్తాన్ని వాణీ రంగారావు మరింత భిన్నమైన ప్రతీకతో చెప్పారు.

''నీవు నీడగా మారి
సంకల్పమో అసంకల్పమో కుసంకల్పమో
ఈ భ్రమణంలో సమూలంగా నీవు మాత్రం మిగలవు
మానసిక సౌందర్యం మరకలు పడి
ఆర్ద్రతలూ ఆప్యాయతలూ అవసరాలై నువ్వు
చచ్చిపోతావు'' (పేజీ 30, 31, వాణీ రంగారావు, తివాచీ)

అని ఆమె గృహిణిని ఇంటికి అలంకారంగా ఉండే, అందరి అడుగుల కింద నలిగే ఒక 'తివాచీ'తో పోల్చారు. పెళ్లయిన తర్వాత స్త్రీ తనకంటూ ఒక అస్తిత్వం లేకుండా, కేవలం ఇతరుల అవసరాలు తీర్చే వస్తువుగా మారి ఎలా అంతరించిపోతుందో ఈ కవిత కళ్లకు కడుతుంది.

శరీర రాజకీయాలు - పితృస్వామ్యపు అలంకరణల ధిక్కారం :

స్త్రీ శరీరాన్ని సమాజం ఎప్పుడూ తన ఆస్తిగా, గౌరవానికి ప్రతీకగా భావించింది. స్త్రీలు తమ శరీరాన్ని ఎలా కప్పుకోవాలి, ఎలా అలంకరించుకోవాలి అనేది పితృస్వామ్యం నిర్ణయించిన కొలమానాలే. ఈ ఆంక్షలను ధిక్కరిస్తూ జయప్రభ రాసిన కవిత అప్పటి సాహిత్య లోకంలో పెను ప్రకంపనలు సృష్టించింది.

''దోపిడీ సంస్కృతి
నా వ్యక్తిత్వాన్ని శవంగా చేసి

దానిపైన కప్పిన తెల్లదుప్పటీ పైట!
నేను నడిచే శవాన్ని కాకుండా ఉండాలంటే
ముందుగా పైటని తగలెయ్యాలి'' (పేజీ 11, జయప్రభ, పైటని తగలెయ్యాలి!) అంటూ ఆమె పైటను పాతివ్రత్యానికి సంకేతంగా కాకుండా, అబలని చేసే అదృశ్య హస్తంగా, వ్యక్తిత్వాన్ని చంపేసి కప్పిన శవపు వస్త్రంగా అభివర్ణించారు. స్త్రీ తల ఎత్తుకుని నిలబడకుండా చేసే, ఎప్పుడూ ఒక కృత్రిమ సిగ్గును ఆపాదించే ఈ ఆంక్షలను తగలబెట్టాలన్న కవయిత్రి ఆక్రోశం ఇందులో అణువణువునా ప్రతిఫలిస్తుంది. శారీరక ఆంక్షలే కాకుండా, అందం పేరుతో వ్యాపార ప్రపంచం స్త్రీల మీద రుద్దుతున్న హింసను విమల ప్రశ్నించారు.

''అందాల వ్యాపారాల్ని ద్వేషిద్దాం!
మన మనుగడకు అందం అనివార్యమైన చోట
ఈ జీవితాన్నే ద్వేషిద్దాం!
మనల్ని వెల్లవేసి, పటాల్ని తగిలించిన గోడల్ని చేసి,
మనల్ని అలంకృత గంగిరెద్దుల్ని చేసి
నిర్బంధ 'సౌందర్యాత్మక హింస'లో
గాయపరచిన చోట...''

(పేజీ 13, విమల, సౌందర్యాత్మక హింస)

అని ఆమె మార్కెట్ శక్తులు స్త్రీలను కొలతలుగా ఎలా కుదించాయో, అలంకృత గంగిరెద్దుల్లా మార్చి స్వచ్ఛందంగా తమను తాము ఎలా హింసించుకునేలా చేశాయో ఎండగట్టారు. ఈ శారీరక ఆంక్షల పుట్టుక గురించి కొండేపూడి నిర్మల తన కవితలో బాల్య దశ నుండే మొదలయ్యే అణచివేతను చిత్రీకరించారు.

''నట్టనడి వయసులో వేసవిలో
మరుగుజ్జుతనం వీడయి పాకుతుంటే
'నీకేం తెలీదు నువ్వూరుకో.'
అంటున్న స్వజనం మాటకి గతుక్కుమని
గతుక్కుమన్నట్టు కనిపించకుండా వుండేందుకు
ఏదో అంటూ వాదన పెంచుకుంటూ''

(పేజీ 6, కొండేపూడి నిర్మల, హృదయానికి బహుపచనం)

అని రజస్వల అయినప్పటి నుండి శరీరం మీద కుటుంబం, సమాజం విధించే మానసిక అదుపును, ఎదుగుతున్న పిల్లకు ఎదురయ్యే ప్రశ్నలను అత్యంత సున్నితంగా ఆవిష్కరించారు.

పురుష అహంకారపు చూపులు - లైంగిక హింస :

సమాజంలో స్త్రీ అడుగు బయటపెడితే చాలు, ఆమెను నిరంతరం వెంబడించేవి పురుష అహంకారపు చూపులు. ఆ చూపుల్లో దాగి ఉన్న లైంగిక ఉన్మాదాన్ని కవయిత్రులు తీవ్రంగా నిలదీశారు. జయప్రభ ఆధునిక పట్టణ వాతావరణంలో స్త్రీలు ఎదుర్కొనే చూపుల హింసను అక్షరీకరించారు.

''కనిపించినపుడల్లా
కంపరం పుట్టేలా
వంటి మీద
చూపులు చెదల్లా పాకుతూ ఉంటాయి
ఆ కళ్ళల్లో
లక్ష వర్ణాలున్నాయి
కానీ చూపులకి మాత్రం వర్ణవిభేదాలు లేవు''

(పేజీ 8, జయప్రభ, చూపులు)

అని జయప్రభ మగవాడి చూపును చెదలుతో పోల్చారు. చెదలు ఎంత నిశ్శబ్దంగా లోపలికల్లా తినేస్తుందో, వీధుల్లో, బస్సుల్లో ఈ విషపు చూపులు స్త్రీల శరీరాలపై అలా పాకుతూ వారిని గాయపరుస్తాయని చెప్పారు. కులం, మతం, హోదా ఏదైనా మగాడి చూపులోని చొంగకార్చే కుక్కలాంటి ఆకలి మాత్రం ఒకటేనని ఆమె విశ్లేషించారు. పట్టణాల్లో ఈ పరిస్థితి ఉంటే, గ్రామీణ భూస్వామ్య వాతావరణంలో దొరల చూపులు స్త్రీల జీవితాలను ఎలా ధ్వంసం చేస్తాయో ఒక జానపద కవిత తెలియజేస్తుంది.

''చుక్కా బొట్టు పెట్టుకోని
నూరుకింద నిలుచుంటిరో
దొరోడు చూసే చూపులకు
చుక్కాబొట్టు సున్నమాయెరో
పచ్చగాజులేసుకోని
పెరుగొయ్యా నేను బోతిరో

వాడు చూసే చూపులకు

పచ్చగాజులు పగిలిపోయెరో'' (పేజీ 58, జానపద కవిత, సంఘంలో చేరుదాం!) అంటూ ఒక పల్లెటూరి స్త్రీ వేసుకున్న బొట్టు, గాజులు భూస్వామి కామాంధపు చూపులకు ఎలా బలవుతాయో వివరించి, దానికి పరిష్కారంగా గొడ్డలి పట్టుకుని సంఘంలో చేరి దొరలను ఎదిరించాలనే చైతన్యాన్ని ఈ కవిత నూరిపోసింది. ఈ చూపుల హింస పరాకాష్టకు చేరుకుని భౌతిక దాడులుగా మారినప్పుడు ఏర్పడే రాక్షసత్వాన్ని బి. పద్మావతి నమోదు చేశారు.

''నెత్తురూ, కన్నీళ్ళూ చిమ్ముతున్న ఓ పాలబుగ్గా
ఓ మంట మండిన తరువాత
కాలిన చమురుకంపుల మధ్య
వెక్కిరింతగా నిలిచిన వీర్యపు చుక్కల్ని
ఒక ధిక్కారపు ఛీత్కరింపుతో

బహిష్ట స్రావంలా తుడిచెయ్యలేక'' (పేజీ 25, బి. పద్మావతి, గాయపడ్డ పనిముట్టు) అని దాదర్ ఎక్స్‌ప్రెస్ రైలులో జరిగిన సామూహిక అత్యాచార సంఘటన నేపథ్యంలో, స్త్రీ శరీరాన్ని కేవలం ఒక 'పనిముట్టు'గా వాడుకుని పారేసిన మృగత్వాన్ని ఆమె నిలదీశారు.

మాతృత్వం - పునరుత్పత్తి హింస:

మాతృత్వాన్ని సమాజం ఎంతో పవిత్రమైనదిగా, దైవదత్తమైనదిగా కీర్తిస్తుంది. మాతృత్వంలోని గొప్పదనం వెనుక స్త్రీ అనుభవించే శారీరక, మానసిక నరకాన్ని, ప్రాణాపాయ స్థితిని పితృస్వామ్య సాహిత్యం ఎప్పుడూ మభ్యపెడుతూనే వచ్చింది. ఆ నిశ్శబ్దాన్ని కొండేపూడి నిర్మల బద్దలు కొట్టారు.

''చావుకీ బతుక్కీ మధ్య పిసరంత గీటు లేదు
టాక్సీ చప్పుడు, స్కూటరు చప్పుడు, రిక్షా చప్పుడు, నడిచిన చప్పుడు
తలక్రిందులుగా వ్రేలాడదీసిన సెలేన్ బాటిల్లా
నిండు నెల్ల గర్భిణి

ఒక్కో బొట్టు చొప్పున మొత్తం ప్రాణం ఇచ్చుకోవడానికి వస్తోంది'' (పేజీ 35, కొండేపూడి నిర్మల, లేబర్ రూమ్) అని ప్రసవ గదిలోని దృశ్యాలను, మరణానికి బతుకుకి మధ్య సాగే ఆ పోరాటాన్ని కళ్ళకు కట్టారు. గర్భం దాల్చడం పవిత్రం అయితే, అవాంఛిత గర్భాన్ని తీసేసుకోవలసి వచ్చినప్పుడు స్త్రీ పడే మానసిక సంఘర్షణను పాటిబండ్ల రజని హృదయవిదారకంగా చిత్రించారు.

''కడివెడు కన్నీళ్ళ దుఃఖంగానూ ఉందిరా.
అయ్యో!
పాలింకి పోవడాని కున్నట్లు
మనసింకి పోవడానికీ --

మాత్రలుంటే ఎంత బావుండు!'' (పేజీ 35, పాటిబండ్ల రజని, అబార్షన్ స్టేట్మెంట్) అంటూ ఆర్థిక, సామాజిక కారణాల వల్ల గర్భస్రావం చేసుకున్న ఒక తల్లి, ఆ ప్లాస్టర్ ఆఫ్ పారిస్ ముద్దలాంటి పిండాన్ని చూసి పడే అపరాధ భావనను, తనలోని అమ్మను తానే పాతిపెట్టుకున్న వేదనను రికార్డు చేశారు. పిల్లల కోసం సర్వస్వం త్యాగం చేసిన మాతృమూర్తి చివరకు వృద్ధాప్యంలో పొందే ఒంటరితనాన్ని రావులపల్లి సునీత ఎత్తిచూపారు.

''బ్రతుకు వేగంలో...పరుగెట్టి, పరుగెట్టి
కాల చక్రంలో కస్సున నలుగుతున్నవాణ్ణి.
కడుపుకింత రాల్చి
'కృతజ్ఞత చూపించానన్న
ఆత్మవంచన - నరనరాన
జీర్ణించుకొన్నవాణ్ణి!

ముసలి అమ్మను ... తీరిక నాకెక్కడిది...?!'' (పేజీ 48, రావులపల్లి సునీత, అమ్మ అలిగింది) అని తమని కనిపెంచిన తల్లి అలిగితే, కనీసం బుజ్జగించడానికి కూడా తీరికలేకుండా బతుకు పోరాటంలో మునిగిపోయిన పిల్లల యాంత్రికతను, కృతఘ్నతను కవయిత్రి ప్రశ్నించారు.

వివాహ వ్యవస్థ - దాంపత్యంలో అస్తిత్వ శూన్యత:

వివాహం స్త్రీకి రక్షణ ఇస్తుందని, భర్త ప్రాణప్రదంగా చూసుకుంటాడని సమాజం నమ్ముతుంది. కానీ ఆ బంధంలో స్త్రీ తనకంటూ ఏ ఉనికి లేకుండా ఎలా పరాయీకరణకు గురవుతుందో ఈ కవితలు వివరిస్తాయి. సావిత్రి పెళ్లి అనే వ్యవస్థ అసలు స్వరూపాన్ని సూటిగా ప్రశ్నించారు.

"ఆఫీసులో నామొగుడున్నాడు!
అవసరమొచ్చినా సెలవివ్వడ'ని
అన్నయ్య అన్నప్పుడే అనుమానమేసింది
'వాడికేం? మగమహారాజు'ని
ఆడా, మగా వాగినప్పుడే అర్థమైపోయింది --
"పె'ళ్లంటే "పెద్దశిక్ష" అని
మొగుడ"0టే స్వేచ్ఛా భక్షకుడ"ని" (పేజీ 14, సావిత్రి, బందిపోట్లు) అని పెళ్లిని స్వేచ్ఛను హరించే బందిఖానాగా, భర్తను స్వేచ్ఛా భక్షకుడిగా కవయిత్రి నిర్వచించారు. వివాహ బంధంలోని శారీరక కలయికల్లో కూడా ప్రేమ స్థానంలో ఆర్థిక లావాదేవీల కమర్షియల్ దృక్పథం ఎలా చొరబడిందో మందరపు హైమవతి ధైర్యంగా వ్యక్తపరిచారు.

"ఇరువురి తనువులొకటైనాక
అద్వైత సిద్ధి పొందినాక
ఈ లోకాన్నే మరచిపోయిన
అమృత ఘడియలలో
అక్షర తూణీరం నుంచి
ఒక ప్రశ్నల బాణం సంధిస్తావు
"జీతమెప్పుడిస్తారు?" (పేజీ 23, మందరపు హైమవతి, సర్వ పరిష్వంగం) అంటూ వేశ్య కూడా ఆ సమయంలో అడగని ప్రశ్నను భర్త అడగడం ద్వారా, ఆ బంధం కేవలం ఒక సర్వ పరిష్వంగంగా (పాము కౌగిలి) మారిందని, అందులోంచి బయటపడలేక రాజీ పడుతూ బతుకుతున్న స్త్రీ దీనస్థితిని ఎండగట్టారు. ఇలాంటి యాంత్రికమైన సంబంధాలనే కొండేపూడి నిర్మల కూడా ప్రస్తావిస్తూ,

"పరస్పర నిందారోపణలతో
అహరహమూ మర్చిపోని అహాలతో
అపనమ్మకాలతో
బతకడమే కాదు చావడమూ మన కోసం కానట్టు" (పేజీ 19, కొండేపూడి నిర్మల, తెల్లారకట్ట కివతల...) అని భార్యాభర్తల మధ్య రాత్రులు తెల్లవారడం ఒక అవసరంగా ఎలా మారిపోయిందో వివరించారు. ఇకపోతే, ఒక మేధావి/విప్లవకారుడి భార్యగా తనకంటూ ఒక ఉనికి లేకుండా, జీవితమంతా కేవలం భర్త కోసం నిరీక్షిస్తూనే గడిచిపోయిన విషాదాన్ని వసంత కన్నబిరాన్ అద్భుతంగా ఆవిష్కరించారు.

"నేను భ్రమలలో, కపటమైన
కలల్లో బతుకుతున్నాను
నేను తీసే ఊపిరి
నేను వేసే అడుగు
నా రక్తనాళ స్పందన
అన్నీ నీ అవసరాలకోసమే ఐనపుడు
నా స్వేచ్ఛకు అర్థం ఏముంది?" (పేజీ 46, వసంత కన్నబిరాన్, నిరీక్షణ) అని ప్రశ్నిస్తూ, సమాజం దృష్టిలో భర్త ఒక గొప్ప నాయకుడు కావచ్చు, కానీ భార్యగా తన అస్తిత్వం అతని నీడలో ఎలా కరిగిపోయిందో, తన స్వేచ్ఛకు అర్థం ఎక్కడుందో నిలదీశారు.

స్త్రీ లైంగికత - కోరికలు, వాస్తవాలు:

స్త్రీలకు శారీరక వాంఛలు ఉండవని, ఉన్నా వాటిని బయటపెట్టడం సంస్కార హీనమని భావించే పితృస్వామ్య భావజాలాన్ని ఈ కవితలు పటాపంచలు చేశాయి. జయప్రభ స్పర్శ ద్వారా కలిగే ఉద్వేగాలను విశ్వవ్యాప్తంగా అన్వయిస్తూ అత్యంత సున్నితంగా అక్షరీకరించారు.

"స్పర్శ ప్రాణమై నాలో కదిలేవేళ
ఎప్పుడూ నేను ఒంటరిగానే ఉంటాను
నాలో నేనై
సమూహంలో నేనై
సమస్త విశ్వమూ నైనై
స్పర్శాను రాగాన్ని ఆలపిస్తూంటాను"
(పేజీ 16, జయప్రభ, స్పర్శానురాగాన్ని ఆలపిస్తూ)

అంటూ స్త్రీ శారీరక అనుభూతులను ఒక ప్రకృతి సహజమైన రాగంగా కీర్తించారు. ఇదే ఇతివృత్తాన్ని రేవతీదేవి మరింత ధైర్యంగా, ప్రగాఢమైన కాంక్షతో వివరించారు.

"ఈ శరీరం మూగవోయిన శతతంత్రుల రసవీణ
ఆ శతసహస్ర ప్రకంపనల వేళ్ళు మీటనిదే
ఈ సెగ చల్లారదు
ఆ శ్వాసలో శ్వాసై ఆ ప్రాణంలో ప్రాణమై"
(పేజీ 18, రేవతీదేవి, అనురాగ దగ్ధ సమాధి)

అని స్త్రీ శరీరాన్ని మూగవోయిన వీణతో పోల్చి, సరైన స్పర్శతో ఆ తంత్రులు మీటితే తప్ప శారీరక, మానసిక సెగలు చల్లారవని తమ కోరికను బహిర్గతం చేశారు. శృంగార క్షణాల అత్యున్నత దశను వర్ణించిన తర్వాత, వెంటనే ఎదురయ్యే యాంత్రికమైన వాస్తవాలను ఘంటసాల నిర్మల విశ్లేషించారు.

"రూపాల్నీ లోపాలనీ సుతారం చేసి చూపిన
వెన్నెల వెండి అద్దం వెలవెల పోతుంది
యధార్థాల యాంటీ క్లయిమాక్స్ ఎప్పటిలా
ఎదురొస్తుంది.
సమస్యలు రేగిన వ్రణాల్లా సలపరిస్తాయి"
(పేజీ 22, ఘంటసాల నిర్మల, జుగల్ బందీ)

అని అద్భుతమైన జుగల్ బందీ తర్వాత జీవితపు కఠిన వాస్తవాలు ఎలా కళ్ళముందు వాలతాయో వివరించారు.

అంచులకు నెట్టబడిన స్త్రీల బతుకుచిత్రం :

సమాజం పవిత్రత పేరుతో కొందరిని దేవతలను చేస్తే, అదే సమాజం తన వికృత కామవాంఛలు తీర్చుకోవడానికి మరికొందరిని 'వేశ్యలు'గా ముద్రవేసి అంధకారంలోకి నెట్టేసింది. ఈ అణగారిన వర్గాల బాధను కవయిత్రులు తమ గొంతుకల ద్వారా బలంగా వినిపించారు. సమాజపు ద్వంద్వ నీతిని ఘంటశాల నిర్మల తీవ్రంగా ప్రశ్నించారు.

"వికృత బీభత్సాది వివిధ రసాల్ని
రెప్పవాల్చక పీల్చిన రేగడిరేయిని
హ్లాద వేదనల మధ్య వేడి పోయిని నన్ను చూసి
అసహ్యంతో విరిగిన
మీ కంటిచూపు
నొసట చిట్లింపు"
(పేజీ 49, ఘంటశాల నిర్మల, ఎ కాల్గర్ల్స్ మొనొలాగ్)

అంటూ పురుషుల వికృత కోరికలను భరిస్తూ, వారి మానసిక రోతకు చికిత్స చేస్తూ బతుకుతున్న స్త్రీలను చూసి అదే సమాజం అసహ్యించుకోవడాన్ని నిలదీశారు. ఇదే కోవలో ఓల్గా గారు మెహందీ (వేశ్యావాటిక) స్త్రీల పక్షాన నిలబడి సమాజాన్ని సూటిగా ప్రశ్నించారు.

"మీ గృహ స్వర్గ సీమలూ
మీ మమతాలయాలూ
మీ పవిత్ర బంధాల పొదరిళ్ళూ ఉన్నాయి.
నదులూ, సముద్రాలూ
పర్వతాలూ, ఎడారులూ
ఎత్తైన మేడలూ...
ఎక్కడైనా చావొచ్చు -
మాకు మిమ్మల్ని బతికించటమే తెలుసు...
మమ్మల్ని కొట్టి, గిచ్చి, రక్కి, ముద్దాడి
మీ ఆశాంతుల్ని అలవగొట్టుకుని
మీ వికృత వాంఛాగ్నుల్ని
మా ఒడిలో చల్లార్చుకుని
ఎన్నిసార్లు తృప్తిగా తేల్చారు --"
(పేజీ 51, 52, ఓల్గా, మెహందీ స్త్రీల విజ్ఞప్తి)

అని పగటి పూట నీతులు చెప్పే పురుషులు, రాత్రి పూట తమ వికృత వాంఛలను తీర్చుకోవడానికి ఈ స్త్రీల దగ్గరకు ఎలా వస్తారో రికార్డు చేశారు.

"చావటానికి మా దగ్గరకు రాకండి
బతకటానికి నానా చావూ చస్తున్న వాళ్ళం!"
(పేజీ 52, ఓల్గా)

అన్న వారి ఆర్తనాదం సమాజపు చెంపమీద పడ్డ ఒక చెళ్లుమనే దెబ్బ.

ఆవేదన, నిరసన, విప్లవాత్మక చైతన్యం :

అణచివేత ఎక్కడ ఉంటుందో, అక్కడ ప్రతిఘటన సహజంగా ఉద్భవిస్తుంది. దశాబ్దాలుగా పేరుకుపోయిన ఆవేదన, ఒక అగ్నిపర్వతంలా బద్దలైన తీరును ఈ కవితలు ప్రతిబింబిస్తాయి. స్త్రీ యొక్క అనంతమైన సహనాన్ని, బహుముఖీన వ్యక్తిత్వాన్ని శివలెంక రాజేశ్వరీదేవి ఒక ప్రకృతి ప్రవాహంగా వర్ణించారు.

"ఎండమావినీ నేనే, తొలకరి మబ్బునీ నేనే
కలకత్తా కాళికనీ నేనే, సలాం బాంబేనీ నేనే
మదర్ థెరీసానీ నేనే, "బీస్ట్ అండ్ బ్యూటీ"నీ నేనే
పుట్టిన కేకనీ నేనే, ఆఖరి కౌగిలినీ నేనే."
(పేజీ 55, శివలెంక రాజేశ్వరీదేవి, ద్వైతం)

అంటూ స్త్రీ గంగ లాంటిదని, సృష్టి లయలన్నింటికీ ఆమె ప్రతీక అని కీర్తించారు. కానీ ఇదే మనిషి సమాజపు కుటిలత్వం ముందు విరక్తి చెందితే ఎలా ఉంటుందో ఏలూరి పార్వతి చెప్పారు.

"ప్రేమను పంచి ప్రాణాలైనా ఇచ్చే
నీ మీదనే అత్యాచారాలు చేస్తున్న
కృతఘ్నులున్న చోట
బతకలేనంటె బతకలేనంది."
(పేజీ 36, ఏలూరి పార్వతి, సిగ్గుసిగ్గు)

అని కుక్కలు, గాడిదలు కూడా ఈ కృతఘ్నులైన మనుషుల మధ్య బతకలేనని చెప్పాయంటూ సమాజపు నైతిక పతనాన్ని ఈసడించుకున్నారు. ఈ సామాజిక కుళ్ళను భరించలేక తీవ్రమైన నైరాశ్యంలోకి కూరుకు పోయిన మనఃస్థితిని శిలాలోలిత వ్యక్తపరిచారు.

"ఈ రోజు నేను సమాధిని పెళ్ళగించుకొని
చిరు ఆశల కుండీలో విరిసిన కుసుమాన్నై
తెలిరెప్పల కాంతుల్తో జ్వలిస్తోంటే --
వద్దు
ఇంకా తట్టొద్దు
నన్ను లేపొద్దు
ఈ సమాధిలోనైనా మరణించనీ."
(పేజీ 38, శిలాలోలిత, సమాధిల్లోనైనా మరణించనీ)

అంటూ భావోద్వేగాలు చచ్చిపోయి, శవంలా బతుకుతున్న తనను ఎవరూ కదిలించవద్దని ప్రాధేయ పడ్డారు. ఈ ఆవేదన ఒక స్థాయికి చేరిన తరువాత ఆత్మహత్యగా మారుతుందని సమాజం భావిస్తుంది. కానీ గృహహింసను భరించలేక చేసుకునే ఆత్మహత్య పిరికితనం కాదని రావులపల్లి సునీత వాదించారు.

"నాకూపిరి సలపనివ్వని
సామాజిక న్యాయం మీద
కాండ్రించి వూసిన ఉమ్మిలా
నా ప్రాణాన్ని ఉరి తాడులో
బిగించాను!
చాచి చరిచిన చెంపదెబ్బలా
నా మరణం, మీ విలువల్ని
గింగిరాలెత్తించాలని"
(పేజీ 53, 54, రావులపల్లి సునీత,
ఆత్మహత్య నా నిరసన!)

అని ఆత్మహత్యను ఒక భయంకర నిరసనగా, పితృస్వామ్య విలువల మీద కొట్టిన చెంపదెబ్బగా ప్రకటించారు. ఈ బాధలన్నింటినీ దాటి ఒక విప్లవ చైతన్యం వైపు స్త్రీలు అడుగులు వేయాలని ఓల్గా పిలుపునిచ్చారు.

"కానీ రేపు నేను
పతివ్రతామ తల్లిని కాను
ప్రబంధ కన్యను కాను
పంచదార చిలకని కాను
ఫాషన్ పెరేడ్ బొమ్మని కాను
పసి పాపల చంపే పాపిని కాను
పంచాది నిర్మల వారసురాలిని!"
(పేజీ 57, ఓల్గా, ప్రతి స్త్రీ ఒక నిర్మల కావాలి!)

అంటూ ఇకపై స్త్రీలు అణగారిన ప్రాణులుగా మిగిలిపోరని, శ్రీకాకుళ పోరాట యోధురాలు "పంచాది

నిర్మల'' వారసురాళ్లుగా విప్లవ పంథా పడతారని చారిత్రక హెచ్చరిక చేశారు.

ముగింపు :

1990లో 'గురిచూసి పాడే పాట' అచ్చుకావడం తెలుగు సాహిత్య చరిత్రలో ఎంతటి భూకంపం సృష్టించిందో తెలిసిందే. అప్పటివరకు నాలుగు గోడలకే పరిమితమైన స్త్రీల కన్నీళ్లు, కోరికలు, ఆక్రోశాలు ఒకేసారి అక్షర రూపం దాల్చి పితృస్వామ్యపు కోటను బద్దలు కొట్టాయి. ఈ కవితా సంకలనం సాధించిన అతిపెద్ద విజయం ఏమిటంటే, సమాజం దాచిపెట్టాలనుకున్న స్త్రీ శరీరాన్ని, ఆమె అంతర్గత అనుభవాలను ప్రధాన కవిత్వ వస్తువులుగా మార్చి, వాటికి ఒక రాజకీయ, సామాజిక ప్రాధాన్యతను తీసుకురావడం. నేటి 2026 నాటికి స్త్రీవాద సాహిత్య పరిస్థితిని గమనిస్తే, ఈ కవితా సంకలనం వేసిన బలమైన పునాదుల మీదే నేటి సాహిత్యం మరింత ఉధృతంగా విస్తరించిందని చెప్పవచ్చు. ఈరోజు స్త్రీవాదం ఒక వర్గానికో పరిమితం కాలేదు. దళిత స్త్రీవాదం, బహుజన స్త్రీవాదం, మైనారిటీ స్త్రీవాదం వంటి భిన్న కోణాలను నేటి సాహిత్యం అన్వేషిస్తోంది. డిజిటల్ యుగంలో సోషల్ మీడియా వేదికగా యువ కవయిత్రులు మరింత పదునైన, గ్లోబల్ దృక్పథంతో కూడిన కవిత్వాన్ని సృష్టిస్తున్నారు. అయినా, దశాబ్దాల క్రితం ఓల్గా, జయప్రభ, విమల, కొండేపూడి నిర్మల వంటి వారు ఎత్తిన ధిక్కార బావుటా యొక్క ఔన్నత్యం ఏనాటికీ తరగనిది. వారు అక్షరాలతో చేసిన ఆ యుద్ధం, ఎప్పటికీ తరగని స్ఫూర్తి. తెలుగు సాహిత్యంలో స్త్రీ అస్తిత్వానికి అసలైన చిరునామా ఈ స్త్రీవాద కవిత్వమే అనడంలో ఎలాంటి అతిశయోక్తి లేదు.

ఆధార గ్రంథ సూచి :

1. గురిచూసి పాడే పాట : స్త్రీవాద కవితలు : కవిత్వం ప్రచురణలు : 1990 : విజయవాడ.
2. Beauvoir, Simone de. The Second Sex. (స్త్రీవాద సిద్ధాంతాలకు ఆకరంగా స్వీకరించబడినది).
3. Woolf, Virginia. A Room of Oneμs Own. (గృహ నిర్బంధం, స్త్రీల మానసిక స్వేచ్ఛల విశ్లేషణ).

★★★

Vol. 23 | Spl. Issue 03 | March 2026 | BHAVAVEENA | ISSN No. : 2456-4702 | RNI No. APTEL/2003/12253

RNI No. APTEL/2003/12253 | Reffered Journal & Peer Reviewed Journals | ISSN No. 2456-4702

భావవీణ

కళలు, సాహిత్య, సాంస్కృతిక భాషాధ్యయన పత్రిక

BHAVA VEENA

Journal of Arts, Literary, Culture & Language Study

రాయలసీమ అభ్యుదయ కవిత్వం - నారీ దృక్పథం

- ధర్మకారి అశోక్ బాబు

పరిశోధక విద్యార్థి, తెలుగు పరిశోధన అధ్యయన విభాగం, కర్ణాటక రాష్ట్ర సార్వత్రిక విశ్వవిద్యాలయం- మైసూర్.

సారాంశం (Abstract) :

ఈ వ్యాసం రాయలసీమ ప్రాంత అభ్యుదయ కవిత్వంలో నారీ దృక్పథాన్ని ప్రస్ఫుటిస్తుంది. ఆదిమ దశలో స్త్రీ పొందిన గౌరవం - నేటి సమాజంలో స్త్రీ స్థానం, పురుషాభివృద్ధిలో స్త్రీ పాత్ర కుటుంబంలో మహిళలపై అణచివేత ధోరణి, మగవాళ్ల దౌర్జన్యాలకు బలైపోతున్న స్త్రీ, వేశ్యా జీవితంలో నీరసించిపోయిన స్త్రీ, కామంతో కళ్లు మూసుకుపోయిన మృగాల ఆగడాలు, లింగ వివక్ష, స్త్రీ సాధికారత గురించి వివిధ స్త్రీవాద రచయితలు పలు దృక్కోణాల్లో సహానుభూతిగా విషదీకరించారు. కొలుకలూరి ఇనాక్, అడిగోపుల, రేవతీ దేవి, సి. నారాయణ స్వామి, ఎన్. రామచంద్ర, ముని సుందరంలాంటి రచయితలు స్త్రీ సామాజిక మార్పులను తమ కవిత్వంలో ప్రతిబింబించారు.

ఆకాశంలో సగం, సమాజంలో సగం స్త్రీ. ప్రకృతికి ప్రతిరూపం స్త్రీ. ఆదిమదశలో స్త్రీలకి ఎక్కువ గౌరవం వుండేది. సకల జీవరాశులకు, చెట్లు చేమలకు భూమి ఆధారమైనట్లే మానవజాతి మనుగడకు, ఉత్పత్తికి మూలాధారం స్త్రీ. అందుకే స్త్రీకీ, భూమికి అభేదం పాటించారు. దీన్నే క్షేత్రభావం అంటారు. అందుకే ప్రాచీన కాలంలో భూమినీ, స్త్రీని దేవతగా భావించారు. మానవ సమాజం ఆదిమదశలో సమాజంపైన స్త్రీలకే ఆధిపత్యం వుండేది. దీన్నే మాతృస్వామికవ్యవస్థగా పిలిచేవారు. కుటుంబవ్యవస్థ స్థిరపడ్డ తర్వాత స్త్రీలు గర్భవతులుగా వున్నప్పుడు, పిల్లల్ని కని వాళ్లను పెద్దవాళ్లను చేసి వాళ్ల పనులు వాళ్లు చేసుకునే వరకు స్త్రీలు పురుషులపై ఆధారపడుతూ వచ్చారు. దాన్ని ఆధారం చేసుకుని పురుషులు సమాజాధిపత్యాన్ని స్త్రీలనుంచీ లాగేసుకున్నారు. ఇక అప్పటినుంచీ పితృస్వామ్యవ్యవస్థ ఏర్పడింది.

ఈ పురుషాధిక్య సమాజంలో స్త్రీలు రాను రాను ఇంటి బానిసలుగా మారి పోయారు. లైంగికస్వేచ్ఛను, మాట్లాడే స్వేచ్ఛను, ఆర్థికస్వేచ్ఛను కోల్పోయారు. ఇంకా మహిళలను కట్టుబానిసలుగా తయారుచేయడానికి పాతివ్రత్యం, సతీసహగమనం వంటి దుర్మార్గభావాలతో కూడిన దురాచారాలు ప్రారంభమైనాయి. అలాగే బాల్య వివాహాలు, కన్యాశుల్కాలు, వరకట్నాలు వచ్చాయి. వీటి నుంచీ స్త్రీలను బయట వేయడానికి, పురుషుడితో సమానంగా గుర్తించడానికి సంఘసంస్కర్తలు, కవులు తీవ్రప్రయత్నాలు సాగించడం ప్రారంభించారు. రాజారాం మోహన్‌రాయ్ సతీసహగమనానికి వ్యతిరేకంగా పోరాడాడు. పూలే స్త్రీవిద్య కోసం ప్రాకులాడాడు.

కందుకూరి, గురజాడలు స్త్రీ ఉద్ధరణకు రచనలు చేయ సాగారు. బాల్యవివాహాలను వ్యతిరేకించి, విధవా పునర్వి వాహాలను వీరేశలింగం ప్రోత్సహించాడు. గురజాడ పుత్తడి బొమ్మ పూర్ణమ్మగేయం, కన్యాశుల్కం నాటకంలో కన్యాశు ల్కాన్ని, బాల్యవివాహాలను వ్యతిరేకించాడు. వీరి తర్వాత శ్రీపాద, చలం, ముప్పాళ్ళ రంగనాయకమ్మ లాంటి వారు స్త్రీల స్వేచ్ఛకోసం రచనలు చేశారు. ఈ క్రమంలో అన్ని విషయాలలోను పురుషుడితో సమానంగా స్త్రీలకు హక్కులు వుండాలనీ, లైంగికస్వేచ్ఛ, వాక్ స్వాతంత్ర్యం వుండాలనీ, వివాహం పేరుతో కట్టుబానిస కాకూడదని, అన్ని రంగాలలోను స్త్రీల సాధికారికతను ఆకాంక్షిస్తూ పురుషాధిక్యత పైన తిరుగుబాటు తత్వం బయలు దేరింది. దీన్ని 'స్త్రీవాదం' అన్నారు. ఈ స్త్రీవాదం రచయిత్రులపైనే ఎక్కువగా ప్రభావితం చూపించింది. జయప్రభ, కొండేపూడి నిర్మల, కుప్పిలి పద్మ, ఓల్గా, పాటిబండ్ల రజనీ లాంటి ఎందరో కవయిత్రులు ఆ మార్గంలో కృషిచేసి, పురుషాధిక్యతపై కలం ఝళిపించారు. స్త్రీలేగాక పురుషులు కూడా స్త్రీని గౌరవిస్తూ, స్త్రీ సమస్యల పైన కవిత్వం రాస్తూ వచ్చారు. ఈ విషయంలో రాయల సీమ అభ్యుదయకవులు కూడా మినహాయింపు ఏమీ కాదు. వాళ్లు స్త్రీలపైన, స్త్రీల సమస్యల పైన విశేష కవితలు రాశారు.

డా॥ పి.నరసింహా రెడ్డి రాసిన 'భావ విహంగాలు' అనే వచనకవితాసంపుటిలోని "మహిళా నువ్వే! నువ్వే" అనే ఖండికలో మహిళలు యుగయుగాల నుంచి అణచి వేయబడటాన్ని ఎదుగుదల లేకపోవడాన్ని గూర్చి ప్రస్తావిస్తూ -

"మహిళా
యుగ యుగాల్నుంచి
నిల్చి పోయావేం?
హిమశిలగా
ఎగసి పడవేం?" అని స్త్రీని ఎగసిపడమని ఉద్బోధిం చాడు.

డా॥ పి. నరసింహా రెడ్డి రాసిన "కాలచక్రం" అనే ఖండికలో కొత్తగా పెండ్లయిన చోట అనుభవించిన నిరాశల్ని భర్త తాపానికి తాగడం వల్ల ఏర్పడే అసందర్భానికి వచ్చే కోపానికి అనుమానం వల్ల ఆస్పదం అయిన స్త్రీని గూర్చి చివరకు రైలు క్రిందపడి ఆత్మహత్య చేసుకునే సందర్భాన్ని గూర్చి ప్రస్తావిస్తూ -

"మగని తాపానికీ
తాగుడు కోపానికీ
అనుమానపు అసందర్భానికి
ఆస్పదం అయింది అన్యాయంగా" అని అన్నాడు. అనాదిగా భర్త వేధింపులకు బలైపోతున్న స్త్రీలను గూర్చి ఆయన యిక్కడ పేర్కొన్నాడు.

డా॥ పి.నరసింహా రెడ్డి "సారే జహాసే అచ్ఛా" అనే ఖండికలో స్త్రీలపై జరిపే అత్యాచారాల్ని గూర్చి ఆ తరువాత యీ సమాజంలో జీవించడానికి పడుతున్న బాధల్ని గూర్చి వివరిస్తూ -

"పట్ట పగలు కూడా
నడిరోడ్డు మీద నడిచేందుకు
జంకుతున్న 'రేప్" భయపీడితురాలు
మనందరికీ గౌరవనీయమైన ప్రియమైన
భారతదేశ స్త్రీ
తల్లి, చెల్లి, ఇల్లాలు
ఈ అరాచకానికి అంతుందా?" అని పేర్కొన్నాడు.

నూతలపాటి గంగాధరం తన "వెలుగులోనికి" అనే వచన కవితాసంపుటిలో "చెడిన కాన్వాసుపై కుదరని చిత్రాలు" అనే ఖండికలో పాతికేళ్లు నిండినా పెళ్లిగాని స్త్రీని గురించి ప్రస్తావిస్తూ -

"పాతికేళ్లు వచ్చినా
పెళ్లి భాగ్యానికి నోచుకోని
వృద్ధకన్య
స్వతంత్రమంటే నాదే అన్న
గ్రామఫోను రికార్డు వింటూ కూర్చుంది" అని పేర్కొన్నాడు.

ఎస్. మునిసుందరం తన "చీకటి దీపాలు" అనే వచన కవితాసంపుటిలోని "సగటు స్త్రీ" అనే ఖండికలో అనాదిగా మగవాళ్ల దౌర్జన్యానికి బలైపోతూ ఉన్న స్త్రీని గూర్చి ప్రస్తావిస్తూ-

"పువ్వులా దివ్వెలా
హారతికర్పూరంలా
మగమంటలో మసై పోయే
నిశ్శబ్ద చైతన్యజ్వాల
మగాడి గుండెలో తరాలుగా
నల్లకలువై నిద్రిస్తూనే ఉంది" అని పేర్కొన్నాడు.

"వేయిరాగాల వీణ" అనే తన వచన కవితా సంకలనంలో సి. నారాయణస్వామి "మంటల్లో మానవత" ఖండికలో కూడా అనాదిగా వివిధ సందర్భాల్లో బలైపోతూ ఉన్న స్త్రీని గూర్చి ప్రస్తావిస్తూ -

"బురఖాలో మొన్న
సహగమనంలో నిన్న
వరకట్నంలో నేడు
ఏమౌతుందో రేపు!
జన్మనిచ్చిన తల్లి వంశం
స్త్రీని దేవతగా చూసే
ఆరోజు ఎప్పుడు!
ఆ మూర్తిని నిమ్నంగా చూసే
ఈ కాలానికి కాలమెప్పుడు" అని పేర్కొని స్త్రీని దేవతగా చూసే రోజు ఎప్పుడొస్తుందో అని తనను తాను ప్రశ్నించుకొన్నాడు.

పాయసం సుబ్రమణ్యం తన "అంతరంగ తరంగాలు" అనే వచనకవితాసంపుటిలో "తరంగాలు" అనే ఖండికలో స్త్రీ పురుషుల సంబంధాల్ని గూర్చి చెబుతూ -

"స్త్రీకి పురుషుడు
తోడు నీడ
పురుషుడికి స్త్రీ
వెన్నెల వాడ" అని పేర్కొన్నాడు.

దాము తన 'ప్రవాహగానం' అనే వచన కవితా సంపుటిలోని 'తలక్రిందుల తనం' అనే ఖండికలో స్త్రీని ప్రేమించిన వ్యక్తి ఎలా చూసుకుంటాడో ప్రస్తావిస్తూ -

"వాడు
ఆమెను తలక్రిందులుగా
వాడు
ఆమెను
వంటింటి నిండా ప్రేమిస్తాడు" అని పేర్కొన్నాడు.

వి. ఆంజనేయులు "అశ్రువు నా పేరు " అనే వచనకవితాసంపుటిలో 'తేడా' అనే ఖండికలో సినిమాల్లో కనిపించే అనాథ స్త్రీ వేషధారిణి అయిన కథానాయిక పట్ల నిజజీవితంలో అనాథగా అడుక్కుంటూ బ్రతికే స్త్రీపట్ల సమాజం చూసే చూపుల్లోని భిన్నత్వాన్ని వివరిస్తూ -

"అభిమాన నటి తెరపై
అనాథ వేషంలో కన్పిస్తే
ప్రేక్షకుల కళ్లల్లో
హిమాలయ మంత సానుభూతి
అనాథ స్త్రీ.....బయట
అడుక్కుంటూ కన్పిస్తే
అదే ప్రేక్షకుల కళ్లల్లో
ఆకాశమంత అసహ్యం" అని పేర్కొన్నాడు.

రేవతీదేవి "శిలాలోలిత" సంపుటిలోని "స్త్రీ" ఖండికలో స్త్రీని గూర్చి స్త్రీ పురుషుడికి తల్లిగా ప్రేయసిగా శక్తి సామర్థ్యాలను, అందచందాలను, గుణగణాల్ని తెలివి తేటల్ని ప్రసాదించే వ్యక్తిగా పేర్కొంటూ -

"పురుషుడికి
అపారమైన
శక్తిసామర్థ్యాలున్నాయి
అందచందాలున్నాయి
గుణగణాలున్నాయి
తెలివితేటలున్నాయి
అవన్నీ పురుషుడికి
తల్లిగా ప్రేయసిగా
స్త్రీ ఇస్తుంది" అని అన్నాడు. అన్నీ యిచ్చి చివరికి పురుషుడి చేతిలో ఆటబొమ్మవుతుంది అని రచయిత్రి కవిత్వీకరించింది.

ఆచార్య కొలకలూరి ఇనాక్ "షరా మామూలే" సంపుటిలో "మనకేం?" అనే ఖండికలో స్త్రీ ఇంటి పనితోనూ, వంటపనితోనూ సతమతమైపోతూ చెడిపోని ఆగని గడియారం లాగా తిరిగి తిరిగి ఉండేలుబద్దలా వంగిపోయిన వైనాన్ని గూర్చి ప్రస్తావిస్తూ -

"వంటగదికి ఇంటి గదికీ
చెడని, ఆగని గడియారంలో తిరిగి
ఉండేలు బద్దలా
వంగిందో ఇల్లాలు" అని పేర్కొన్నాడు.

నిశి కవి కె.యస్.రమణ "తమోనలం" అనే వచన కవితాసంకలనంలో "పారదర్శక చిత్రం" అనే ఖండికలో వేశ్యాజీవితంలో నీరసించిపోయిన స్త్రీని గూర్చి ప్రస్తావిస్తూ-

"రాత్రి వేశ్య వాడిన పెదాలపై పక పక
హీనంగా వికసించిన నీరవచంద్రిక" అని పేర్కొన్నాడు.

కొందరు స్త్రీలు కొన్ని పరిస్థితుల వల్ల ఈ సంఘంలో వేశ్యలుగా మారుతున్నారు. వారివి హీనమైన బ్రతుకులు. అలాంటి వేశ్య వాడిన పెదాలపై వికసించే నీరవ చంద్రికలు, అనే పదప్రయోగంతో దయనీయ స్త్రీ జీవితాన్ని చెప్పారు.

ఎన్.రామచంద్ర "రక్తం చెమర్చిన కళ్లు" అనే వచన కవితాసంపుటిలోని "పురుషుల పడకలపై పార్ట్‌టైమ్ జాబ్ !!!" అనే ఖండికలో కొంతమంది స్త్రీలు విదేశాల మత్తుల్లో వేశ్యా వృత్తిలో జీవిస్తూ డాలర్ల పంటల్ని పండిస్తూ, క్లబ్బుల్లో అనాదిగా ప్రదర్శనల్ని కొనసాగిస్తూ జీవించడాన్ని నిరసిస్తూ అలాంటి స్థితికై తీసుకుపోవడానికి స్త్రీలు తమ స్త్రీ జాతి కోసం నడుం బిగించి తిరుగుబాటు బావుటా ఎగుర వేయాలని ఉద్బోధించాడు.

పాయసం సుబ్రమణ్యం, పూలికుంట పార్థసారథులు సంయుక్తంగా రాసిన "తొలి వెలుగులు" అనే వచన కవితాసంపుటిలో "కాల్‌గర్ల్" అనే ఖండికలో వేశ్యజీవితాన్ని గూర్చి, అందులో ఉన్న బాధల్ని గూర్చి వివరిస్తూ చివరకు ఆమె ఆత్మహత్య చేసుకొంటేనో అని ప్రశ్నించి దానికి సమాధానం చెప్పాల్సింది యీ సమాజమే అని పేర్కొంటూ -

"ఆకలి ఆరాటంలో
జీవనపోరాటం సలుపలేక
శీలాన్ని విక్రయానికి విక్రయిస్తూ - ఆమె"

తల్లి ప్రేమ పొందని మనిషేకాదు. ఏ జీవీ వుండదు, కల్తీలేని, నకిలీ కాని ఏకైక ప్రేమ తల్లి ప్రేమ. కాబట్టే తల్లికి సాటి ఇలలో లేదు. అలాంటి తల్లిపైనా, తల్లిప్రేమ పైనా చాలా కవితలు సీమనుండి వచ్చాయి.

మాటలు రాని శిశువు భాష అమ్మకు అర్థమైనట్లు మరెవరికీ అర్థంకాదు. శిశువు చేసే శబ్దాలను తర్జుమా చేసుకోవడం అమ్మకు సహజంగా వచ్చిన గుణం. ఊయల లూపుతూ అమ్మ పాడే పాట అమ్మను గాయనిగా నిలుపు తుంది. శిశుపోషణలో అమ్మను మించిన జ్ఞాని గానీ, అమ్మను మించిన చిత్రకారిణి గానీ మరొకరు లేరు.

ఇంటి ముంగిట బిడ్డ
ఆడుతూ పాడుతుంటే
అకస్మాత్తుగా పైకొచ్చిన
వాహనాన్ని తప్పించి
రక్షించింది అమ్మ
అమ్మ కంటే ధీరవనిత ఎవ్వరు?

అలా కంటికి రెప్పలా శిశువును రక్షించుకునే అమ్మ వయసు ఉడిగిన తర్వాత నిరాదరణకు గురైపోతోంది. అమ్మను చూసుకోవాల్సిన కొడుకులు స్వార్థపరులై అమ్మను చూసుకోవడం లేదు. అందుకే అమ్మను మించిన అనాథ ఎవ్వరూ వుండరు అంటారు కవి.

ముసలి తల్లి మూల్గులు విన్న
కొడుకు ఆగ్రహం
కట్టతెగి
'అన్నం తిని చావు' అంది
అమ్మకంటే అనాథ ఎవ్వరు?

బిడ్డల కోసం అమ్మపడే కష్టం మరొకరు పడరు. పేదరికంలో మగ్గిపోతున్న అమ్మ బిడ్డల కోసమే అడవికి వెళ్లి నానాకష్టాలు పడి కట్టెలు కొట్టుకొచ్చి వాటిని అమ్ము కొని పిల్లల ఆకలి తీరుస్తుంది.

కట్టెలమోపు అమ్ముడైతే మా కడుపుకి కలో గంజో
కాని నాడు
మా కడుపునిండా కరిగిపోని ఆకలి
అలా పిల్లల ఆకలి తీర్చే అమ్మ ఆ పిల్లల కోసం
ప్రాణాలర్పిస్తుంది.
అమ్మని మేమూ

మమ్మల్ని అమ్మ చూస్తూ
ఓదార్పు లేని మా ఏడ్పుల మధ్య
అమ్మేదో చెప్పాలని
మేమేదో అడగాలని
అడగడానికి చెప్పడానికి మధ్య
అమ్మ చూపు ఆగిపోయింది
ఇలా చివరిశ్వాస వరకు అమ్మ కుటుంబం కోసమే పోరాడుతుంటుంది, శ్రమిస్తుంటుంది.
అమ్మ మాతృప్రేమ వేరు. చివరిదశలో అమ్మ జీవించే పరిస్థితి వేరు.'అమ్మ'కు వచ్చే సమస్యలూ ఎక్కువే.

నేడు స్త్రీకి వచ్చే పెద్ద సమస్య అత్యాచారం. కామంతో కళ్లు మూసుకుపోయిన మృగాల ఆగడాలు చెప్పనలవి కానివి. వారి కామ నయనాలకు వయసు, ముసలి తేడా లేకుండాపోతోంది. అందుకే నెలలు నిండని పసిపిల్లలు మొదలు, అరవై పదులు దాటిన ముసలివాళ్లు యీ అత్యాచారాలకు గురవుతున్న వార్తలు మనం వింటూనే వున్నాం. ఇక వయసులో వున్న యువతుల గురించి చెప్పాల్సిన పని లేదు. ఒక్కోసారి వాళ్లకు ఏం జరుగుతుందో తెలుసుకునే లోపలే జరగాల్సింది జరిగిపోతూనే వుంటుంది. ఈ అంశాన్ని కవి 'ఒరలో వొదిగిన సాక్ష్యం' కవితలో చెప్పాడు.

ఉపయుక్త గ్రంథాలు

1. భావ విహంగాలు - డా॥ పి. నరసింహా రెడ్డి
2. చీకటి దీపాలు - ఎన్. ముని సుందరం
3. వేయి రాగాల వీణ - సి. నారాయణ స్వామి
4. అశ్రువు నా పేరు - వి. ఆంజనేయులు
5. శిలాలోలిత - రేవతీ దేవి
6. షరామామూలే - ఆచార్య కొలకలూరి ఇనాక్
7. రక్తం చెమర్చిన కళ్లు - ఎన్. రామచంద్ర
8. దశదిశల అమ్మ (కవిత) (రేపటి జ్ఞాపకం కవితా సంపుటం) - అడిగోపుల
9. మాతృమూర్తి (కవిత) (మట్టి మౌనం వహించదు కవితా సంపుటం) - అడిగోపుల

★★★

Vol. 23 | Spl. Issue 03 | March 2026 | BHAVAVEENA | ISSN No. : 2456-4702 | RNI No. APTEL/2003/12253

RNI No. APTEL/2003/12253 | Reffered Journal & Peer Reviewed Journals | ISSN No. 2456-4702

భావవీణ

కళలు, సాహిత్య, సాంస్కృతిక భాషాధ్యయన పత్రిక

BHAVA VEENA

Journal of Arts, Literary, Culture & Language Study

బంజారా తొలి చారిత్రక నవల 'పోర్యతార' - హీరిబాయి సాహసాలు

- ఆచార్య అజ్మీరా సిల్కా నాయక్

ప్రధానాచార్యులు, తెలంగాణ సారస్వత పరిషత్తు ప్రాచ్య కళాశాల, హైదరాబాద్-1.

ఉపోద్ఘాతం

వెయ్యి యేళ్ళ తెలుగు సాహిత్య చరిత్రలో తొలి తెలుగు చారిత్రక నవల 'పోర్యతార' అనే బంజారా నవల రావడం ఆహ్వానించదగ్గ విషయం. బంజారాలు నాగరికులకు దూరంగా తెలుగు భాషరాని, అక్షరజ్ఞానం లేని సంచారజీవులు. ఈ నవల తొలి బంజారా చారిత్రక నవలగా తెలుగులోకి రావడం చాలా ఆనందించదగ్గ విషయం. 'పోర్యతార' అంటే 'వేగుచుక్క' అని అర్థం. బంజారా భాషకు లిపి లేదు. వారు మాట్లాడే భాషను 'గోర్‌బోలి' అంటారు. లిపిలేని తమ భాషను వీరు మౌఖికంగా కాపాడుతూ వస్తున్నారు. ఆయా ప్రాంతీయ భాషలను ఆధారంగా చేసుకుని బంజారాలు వారి వారి రచనలను సాగిస్తున్నారు. ఆవిధంగా తెలుగు సాహిత్యంలో బంజారా రచయితలు వ్యాసాలు, కవితలు, కథలు రాస్తూ వస్తున్నారు. నవలా ప్రక్రియలో తొలిసారిగా ఈ నవలను రాయడం జరిగింది.

రచయిత పరిచయం

ఈ నవలను ఆమ్‌గోత్ వెంకట్ పవార్ గారు రచించారు. వీరు ఉమ్మడి పాలమూరు జిల్లా మహబూబ్ నగర్, ప్రస్తుత నాగర్‌కర్నూల్ జిల్లా, బిజినేపల్లి మండలం, కారుకొండా తాండాలో కీర్తిశేషులు శ్రీమతి & శ్రీ ఆమ్‌గోత్ మోతీబాయి, మాల్యానాయక్ గార్లకు తేది 02 జూన్ 1980వ సంవత్సరంలో జన్మించారు. వీరు వృత్తిరీత్యా ఉపాధ్యాయులు. వీరు 2016 నుండి రచనా రంగంలో ఉన్నారు. పరిశోధన, విమర్శ, కథ, కవిత్వం, నవల మొదలైన సాహిత్య ప్రక్రియల్లో తన రచనలను కొనసాగిస్తున్నారు.

నవల - పరిచయం

ఆమ్‌గోత్ వెంకట్ పవార్ రాసిన 'పోర్యతార' అనే ఈ నవల బంజారాల జీవన విధానాన్ని తెలియచేస్తుంది. గిరిజనులైన గోర్ బంజారాలను యావత్ భారత దేశంలో వివిధ పేర్లతో పిలుస్తారు. ఆంధ్రలో నుగాలీలని, తెలంగాణలో లంబాడీలని వ్యవహరిస్తారు. వీరు ఒకప్పుడు చరిత్రలో రాజ్యాలను ఏలినవారు. రాజకీయ కారణాల వల్ల అటు అరబ్బుల నుండి, ఇటు బ్రిటిషువారి నుండి అనేక ఇబ్బందులకు గురైనారు. ఈ నవలలో వీరు సంచార జీవితంలో పడే బాధలు అన్నీ ఇన్నీ కావు. వారిని ఎలా గట్టెక్కించారనే ఉపాయాలు ఈ నవలలో కనబడుతాయి. బంజారాలు తమ బ్రతుకుదెరువు కోసం ఎన్నో కష్టనష్టాలను పడినారు. జీవన సంఘర్షణ, సాంస్కృతిక సంబరాలు, ఆచార వ్యవహారాలు ఈ నవలలో ఉన్నాయి. 120 సంవత్సరాలు బ్రతికిన ఒక వీరనారి హీరిబాయి పోరాట జీవితాన్ని చారిత్రక క్రమాన్ని రచయిత సక్రమంగా ఈ నవలలో వివరించారు.

బ్రిటిషు ప్రభుత్వం వీరిపై 1871లో క్రిమినల్ ట్రైబల్

యాక్ట్ అనే ఘోరమైన చట్టాన్ని తీసుకొచ్చింది. వీరిని దారిదోపిడీదారులుగా, దొంగలుగా ముద్రవేసి అతి ఘోరంగా అణిచివేసింది. బ్రిటిషర్లు వేసిన దొంగముద్ర నుండి బయటికి రాలేక వీరవనిత అయిన హీరిబాయి, ఆనాటి పాలకులు, పెత్తందారుపై ఆకలిదాడులతో తిరుగుబాటు చేసింది. స్వాతంత్ర్యానంతరం నెహ్రూ ప్రభుత్వం ఈ యాక్ట్‌ను రద్దు చేసింది. తమ జాతి ప్రజల సమస్యను ప్రభుత్వం ద్వారా పరిష్కరించు కోవాలని హీరిబాయి తలచింది. ఆనాటి ప్రధాని శ్రీమతి ఇందిరా గాంధీని రెండుసార్లు కలిసి బంజారాలు కోల్పోయిన భూముల్ని తిరిగి ఇప్పించింది. ఈ నవలలో బంజారాల పుట్టుక నుండి మరణం వరకు వారు పడే సాధక బాధల్ని కళ్ళకు కట్టినట్లు రచయిత చూపించారు. ఇది చారిత్రక నవల.

బంజారాలు

భారతదేశంలో బంజారాలను వివిధ రకాలుగా పిలుస్తారు. సిరికి బంజారా, లదణి బంజారా, మారు బంజారా, రోమా బంజారా, సింగాడియా బంజారా, లమణ్ బంజారా, మధుర బంజారా, నావి బంజారా, ఢాడీ బంజారా, భాట్ బంజారా, సనార్ బంజారా, ఖాత్తి బంజారా, ఢాలియా బంజారా, డప్పుడియా బంజారా, గోర్ బంజారా, జిప్సి బంజారా మొదలైన పేర్లతో పిలుస్తారు.

తండాల చరిత్ర

బంజారాలు నివసించే ప్రాంతాన్ని 'తండా' అని అంటారు. తండా అంటే సమూహము లేదా గుంపు అని అర్థం. ప్రతి తండాకు ఒక నాయకుడు ఉంటాడు. ఇతను తండాకు జెండా లాంటివాడు. బంజారాలు 'ఏక్ జాత్-ఏక్ వాత్-ఏక్ సాత్' అనే నానుడిపై ఆధారపడి జీవిస్తారు. వీరు నివసించే ప్రాంతాన్ని తండా/నంగరీ అని కూడా అంటారు. బంజారాల్లో ప్రధానంగా "జాత్-గోత్-పాడా"లు ఉంటాయి. అవి ప్రధానంగా (1) ఛోజోత్ చౌహాన్-6; (2) బారాగోత్ పమార్-12; (3) సత్తాయిస్ రాథోడ్ భుక్యా-2; (4) బావన్‌పాడా వడ్త్యా-52. ప్రతి తాండాకు ఒక నాయకుడు, కార్బారీ, డావ్‌సాణ్, ఢాడీ, భాటేలు ఉంటారు. దీనినే 'పంచ్' వ్యవస్థ అంటారు. అంటే ప్రస్తుత రాజ్యంలో క్యాబినేట్ ముఖ్యమంత్రి, మంత్రి మండలి, ఇతర సలహాదారులు ఎలా ఉంటారో బంజారా సమాజంలో 'పంచ్' వ్యవస్థ ఉంటుంది. "మా తండాలో మా రాజ్యం" అనే నినాదంపై బంజారాలు నివసిస్తారు. వీరు మాట్లాడే భాషను 'గోర్‌బోలి' అంటారు. దీనికి లిపి లేదు. వీరి సంస్కృతి సంప్రదాయాలు, ఆచారాలు, వేషధారణ, ఆహారపు అలవాట్లు, వస్త్రాలంకరణ, ఆభరణాలు మొదలైనవి మిగిలిన సమాజం కంటే భిన్నంగా ఉంటుంది. వీరు ఒకప్పుడు రాజుల కాలం నుండి యుద్ధసామగ్రి, ఆహారధాన్యాలు సరఫరాదారులుగా రవాణ అంటే లదణీలు చేసారు. తండా అంతా ఉమ్మడి ఆస్తిగా భావిస్తారు. వ్యక్తిగత ఆస్తులు లేవు. కలసి మెలసి జీవిస్తారు.

పోర్యతార నవల-విశ్లేషణ

పోర్యతార అంటే తెలుగులో వేగుచుక్క అని అర్థం. వేగుచుక్క ఈ సమాజానికి రాత్రికి వీడ్కోలు చెప్పి వెలుగుకు స్వాగతం పలుకుతుంది. అంటే చీకటిని తరిమేసి వెలుగును ఆహ్వానిస్తుందని అర్థం. ఈ నవలలో బంజారా సమాజానికి హీరిబాయి వేగుచుక్క లాంటిది. హీరిబాయి కల్పి పాత్ర కాదు. వాస్తవిక మహిళ. ఈమె 14 జనవరి 1888న జన్మించింది. 06 సెప్టెంబర్ 2008 నాడు కన్ను మూసింది. అంటే దాదాపు 120 సంవత్సరాలు జీవించి, గోర్‌ధరమ్‌ను కాపాడింది. ఈ నవల ఒక చారిత్రకమైనది. ఇందులో హీరాలాల్, రమణీబాయిల పెద్ద కొడుకు రూప్లా నాయక్, వీరి భార్య మోతిబాయి. వీరి కొడుకు పేరు భీమ్లా నాయక్. ఇతని భార్య పేరు హస్లీబాయి. వీరి కుమార్తె పేరు హీరిబాయి.

ఈ నవల ప్రారంభంలో హీరాలాల్‌కు 70 సంవత్సరాల వయస్సు ఉంటుంది. హీరాలాల్ పెద్దకొడుకైన రూప్లా నాయక్ యోధుడుగా ఉంటాడు. ఈ నవలను పరిశీలిస్తే మూడు తరాల జీవితం కనబడుతుంది. 19వ శతాబ్దంలో ప్రారంభమై 21వ శతాబ్దం ప్రారంభం దాకా 200 సంవత్సరాల గోర్ బంజారాల జీవన పరిణామాలు ఈ నవలలో మనకు కనబడుతాయి. గోర్ బంజారాల

జీవితంలో వారు పుట్టినప్పటి నుండి కన్నుమూసే వరకు వారు అనుసరించే పద్ధతులు, ఆచార వ్యవహారాలు, సంస్కృతి, సంప్రదాయాలు అన్నీ కూడా ఈ నవలలో సుదీర్ఘంగా రచయిత చిత్రించారు. రాజ్యాధినేతల దశ నుండి సంచారజీవులుగా మారిపోయి, తిరిగి స్థిర నివాసులుగా మారిన క్రమాన్న ఈ నవలలో బంజారా సమాజ పరిణామాలను చక్కగా వివరించారు రచయిత.

గోర్ బంజారాలు ఏ పూటకాపూట బతికితే చాలను కునేవారు. కొన్ని తరాల వరకు తరగని ఆస్తిపాస్తులు సంపాదించుకోవాలనే నేటి స్వార్థపరులకు ఈ నవల ఒక చెంపపెట్టని చెప్పవచ్చు. బంజారాలు కరువుకాలంలో కూడా ఆహారధాన్యాలను సరఫరా చేసి జీవనం గడిపే వారు. వీరికి పశుసంపద పుష్కలంగా ఉండేది. వారిది సమిష్టి జీవన విధానం. దాదాపు 120 కుటుంబాలు ఒకేచోట జీవించే తండావాసుల కథ ఈ నవలలో కన పడుతుంది. వారు తమకు వచ్చిన ఆదాయాన్ని అందరూ సమానంగా పంచుకునేవారు. ఒకర్ని ముంచేసి ఇంకొకరు బ్రతకడం వారికి తెలియదు. ఈ నవలలో ఆడవారందరూ ప్రకృతిలో దొరికిన ఆముదపు గింజలను తెచ్చుకొని, వాటిని దంచి ఒక కుండలో ఉడకబెట్టి ఆముదపు నూనెను తయారుచేస్తారు. ఆ నూనెను అందరూ సమానంగా పంచుకుంటారు. అలాగే వారం వారం సంత నుండి తీసుకొచ్చిన డబ్బును, వస్తువులను, సామాన్లను కోశాధికారి అయిన భద్రు, మరో సభ్యుడైన పాండు ఇద్దరూ నేల మీద కుమ్మరించి అందరికి సమానంగా పంచుతారు. అంటే ఇక్కడ శ్రమ ఫలితం అందరిదనే ధర్మాన్ని బంజారా సమాజం గోర్ ధర్మాన్ని పాటిస్తుంది. నీతికి, నిజాయితీకి, ధర్మానికి, న్యాయానికి నిలువెత్తు సాక్ష్యం గోర్ బంజారా సమాజమని చెప్పవచ్చు. బంజారాల జీవితం ఏనాడు కూడా సాఫీగా సాగలేదు. నిరంతరం తమను తాము కాపాడుకోవడానికి ప్రకృతితోనూ, బయటి సమాజంలోని వారితో యుద్ధం చేస్తూనే బతకవలసి వచ్చింది. ఈ నవలలో సమర జీవితాన్ని చిత్రించారు ఆమ్‌గోత్ వెంకట్ పవార్ గారు.

గోర్‌బంజారాలకు శత్రువులు

1) బ్రిటిషు వారు పెట్టిన దుర్మార్గపు ట్రైబల్ యాక్ట్
2) పాలకవర్గం, భూస్వాములు, పెట్టుబడిదార్లు, వ్యాపారస్తులు
3) స్థానిక ఉద్యోగులు, దారిదోపిడి దొంగలు
4) ప్రకృతి, కరువు కాటకాలు, క్రూర మృగాలు, విషసర్పాలు
5) సమాజంలో ఉండే ఇతర ప్రజలు, రైతులు

నిజాయితీకి మారుపేరైన బంజారాలు ప్రతిసారి ప్రభుత్వం నుండి అన్ని అనుమతులు తీసుకుని ధాన్యం రవాణా చేస్తుండేవారు. అడిగినచోటల్లా అనుమతులు చూపిస్తూ చౌకిదార్లు ఏమైనా ఇబ్బందులు పెడితే వారికి లంచమిచ్చి ముందుకు సాగుతారు. వీరు సంతలో తమ వస్తువులను తక్కువ ధరకు అమ్ముకుని, వారికి కావలసిన వస్తువులను ఎక్కువ ధరకు కొనుక్కోవాలి. వీరి అమాయకత్వాన్ని, భాషా సమస్యలను అక్కడి ప్రాంత వ్యాపారులు దోపిడీ చేస్తారు. వీరు బిడారి లేదా లదణీ చేసే క్రమంలో ఏదైనా ఒక గ్రామంలో విడిది చేయాలంటే ఆ గ్రామ పోలీసు పటేల్, గ్రామ పటేల్‌ల అనుమతి కొరకు లంచాలు ముట్టచెప్పాలి. వీరు వ్యాపార నిమిత్తం బయలుదేరే క్రమంలో మార్గమధ్యలో దోపిడీ దొంగలు వీరిని దోచుకున్నాసరే బంజారాలు వారిని ఏమీ అనేవారు కాదు. పెద్దమనసుతో దొంగలను ఆదరించి మానవత్వాన్ని చాటుకునేవారు. దాడులను ప్రతిఘటించడంలో బంజారాలు నిరంతరం సిద్ధంగా ఉంటారు.ఈ ప్రతిఘటనలో ఆడ, మగ, చిన్నపిల్లలు కూడా వారి వారి స్థాయిల్లో పాల్గొంటారు. బంజారాలకు ప్రకృతి జ్ఞానం చాలా ఎక్కువ. జరగబోయే అపాయాన్ని శబ్దాల ద్వారా పసిగడతారు. జరగబోయే మంచిచెడులను ముందే పసిగడతారు.

పోర్యతార నవలలో 120 సంవత్సరాలు బ్రతికిన వీరనారి హీరిబాయి పోరాట తత్వాన్ని వివరంగా రచయిత చిత్రించారు. హిరిబాయిలో హీరాలాల్ పోలికలు, వారి ధైర్యసాహసాలు ఉట్టిపడుతుంటాయి. బంజారా స్త్రీలు దాదాపుగా అందరూ అందంగా ఉంటారు. సాహసాలకు

వెనక్కి తగ్గరు. నాయకత్వ లక్షణాలు బంజారా స్త్రీలలో ఎక్కువగా ఉంటాయి. ఈ నవలను పూర్తిగా చదివితే హీరిబాయి సాహసం కనబడుతుంది. రెండు పెళ్ళిళ్ళు చేసుకున్నా, భర్త చనిపోయినా సంతానంలో పిల్లలు కొంతమంది చనిపోయినా ధైర్యంగా నిలబడింది. గత్తర వల్ల భర్తతోపాటు తనవారు చనిపోయినా దిగులు చెందకుండా మొక్కవోని దిక్షతో అందరికి అంత్యక్రియలు చేసింది. పాలమూరు జిల్లా అంటేనే పలసలకు చిరు నామా. కరువు కాటకాలతో తండా జనం ఆకలితో అల మటించిన వారందరికి హీరిబాయి అన్నం పెట్టింది. తండా జనం ఏ ఆపదలో ఉన్నాసరే అక్కడ హీరిబాయి ఉండేది.

హీరిబాయి సాహసాలు

రచయిత ఈ నవలలో హీరిబాయి చేసిన నాలుగు సాహసాలను చిత్రించారు. మొదటిసారిగా హీరిబాయి ఆకలితో ఉన్న తన ప్రజలను కాపాడడం కొరకు రహదారిపై పెద్ద పెద్ద మర్రిచెట్ల పైకి ఎక్కి, వచ్చిపోయే ధాన్యపు బస్తాలతో వచ్చే లారీలపైదూకి, జొన్నల సంచుల్ని ఎత్తి కిందికి పడేసేది. రెండవ సాహసం గ్రామాలపై పడి గొర్రెలను, మేకలను ఎత్తుకొనిపోయి, తండా ప్రజలకు ఆహారాన్ని అందించేది. మూడో సాహసం గ్రామదొర బండ్లనే కొల్లగొట్టింది. నాల్గవ సాహసం గ్రామదొరకు ఎదురు తిరిగింది. ఇలా నాలుగుసార్లు తనను తాను రక్షించుకుంటూ బంజారా సమాజాన్ని రక్షించిన వీర సాహస వనిత హీరిబాయి.

ఒక బంజారా స్త్రీ పోరాట, సాహస జీవితాన్ని రచయిత మూడు తరాల బంజారాల చరిత్రను చూపించారు. హీరిబాయి తన పోరాటం ద్వారా, తన వీరసాహస మాటల ద్వారా దొరలను తనకు అనుకూలంగా మార్చు కొని, ప్రజాస్వామ్యబద్ధంగా పాలక వర్గాలను ప్రశ్నించింది. తన జాతి అభివృద్ధి కొరకు, తండాల అభివృద్ధి కొరకు అధికారులను తన దగ్గరికి రప్పించుకున్న నిజమైన సాహస వీరవనిత, వేగుచుక్క హీరిబాయి. ఆమె తన సాహస కంఠం ద్వారా అధికారులను గడగడ లాడించింది. ''తెల్లోడి, నైజామోడి, తాబేదార్లుగా మారి వాళ్ళ మోచేతి నీళ్ళు తాగుతున్నందుకే కదా దొరలు భూస్వాములుగా, పాలకులుగా, వ్యాపారులుగా నిలబడింఢ్రు. పైన పాలకులు మారినా కిందున్నోళ్ళు అట్లే పెత్తందారులుగా నిలబడుతున్నారు. రాజ్యం విదిల్చే ఎంగిలి బొక్కలకు ఎగబడే నక్కలు మనల్ని భయపెడ్తాయా? అందరికన్నా ముందు మనం తెల్లోళ్ళ మీద తిరుగుబాటు చేసినం. పుట్టుక నుండి చావుదాకా యుద్ధంలోనే ఉన్నోళ్ళం. బతుకే ఒక యుద్ధంగా బతుకుతున్నం. మనకు భయమేందిరా? భయపడినోడెవడైనా పానమున్న పీనిగినే కదా'' అని గర్జించింది హీరిబాయి. హీరిబాయి ఒక సాహసవనితగా, తిరుగుబాటుదారుగా పెత్తందార్లకు భయం కల్గేటట్లు చేసిన పోరాట విప్లవ వనితగా చెప్పవచ్చు.

దొరలు, జాగీర్దార్లు ఆమె పేరు వింటేనే గజగజ వణికి ఉచ్చలు పోసుకునేలా చేయగలిగింది హీరిబాయి. ఆమె సాహసాలు నైజాము రాజ్యంలోనేకాక మైసూరు రాజ్యం లోని కొన్ని ప్రాంతాల్లో కథలుకథలుగా చెప్పుకుంటారు. ''సింహాలైనా, పులులైనా ఆకలైనప్పుడే వేటాడుతాయి'' అంటూ ధర్మబద్ధమైన ఆకలి పోరాటం మాది అని ధైర్యంగా చెప్పగలిగింది. వీరవనిత హీరిబాయి నాగర్ కర్నూల్ జిల్లా తిమ్మాజిపేట పులులగిరి తండా బంజారా లను చైతన్యపరిచింది. ఆమె పూర్వీకులు ఈ ప్రాంతానికి వలసొచ్చిన విధానాన్ని, తండాను ఏర్పాటుచేసుకుని జీవించిన పోరాటాన్ని, స్థిరంగా నివాసాలను మార్చుకున్న తీరును రచయిత ఈ నవలలో చక్కగా చిత్రించారు.

పాలమూరు జిల్లా వీరయోధులకు నెలవు అన్నట్లుగా చరిత్రలో ఆధిపత్య కులాలకు చెందిన దొరలు, వారికి వంతపాడే అధికారులు ఈ వీరయోధులకు 'దొంగలు' అని ముద్ర వేసారు. పండుగొళ్ళ సాయన్న, మీయా సాహెబ్, బండొళ్ళ కురుమన్న, హీరిబాయి... ఇట్లా అనేకమంది తిరుగుబాటుదారుల్ని దొంగలుగా చిత్రిం చారు ఆనాటి దొరలు, పాలకులు. 1980వ దశకంలో ఒక బంజారా స్త్రీ తన ముసలితనాన్ని సైతం లెక్క చేయకుండా నాగర్ కర్నూల్ ప్రాంతం నుండి ఢిల్లీ దాకా వెళ్ళి అప్పటి ప్రధాని ఇందిరాగాంధీని కలవడమంటే అది మామూలు సాహసం కాదు.

ఈ నవలలో బంజారాల జీవితాలు ఎట్లా మొదలై నాయి, వారి జాతి గోత్రాలు, శాఖలు అన్నింటిని పూస గుచ్చినట్లు రచయిత చిత్రించాడు. ఈ నవలలో బంజారాల లదణీలు వెళ్ళే విధానాన్ని కళ్ళకు కట్టినట్లు రాసిండు. హీరిబాయి బంజారా తొలిపొద్దుగా చెప్పవచ్చు. ఆమె జీవితంలోని ప్రతి పార్శ్వాన్ని తడుముతూ, వీరోచిత సందర్భాలను వివరిస్తూ ఈ నవల ముందుకు సాగింది. 280 పేజీల్లో ఉన్న ఈ నవల ప్రతి పేజిని చదువుతుంటే కథకుడు కథను చెప్పినట్లుగా సాగింది. వీరవనిత హీరిబాయి పోరాట జీవితం, ఆ ప్రాంత ప్రజల స్థితి గతులు, తండా వ్యవస్థ జీవన విధానాన్ని చక్కగా రచయిత చిత్రించాడు. రచయిత రాసింది అంతా కూడా కొత్తేమీ కాదు. వేల సంవత్సరాలుగా చరిత్రలో రికార్డుకాని వాస్తవిక సంఘటనను సభ్యసమాజానికి చారిత్రక విషయాన్ని చూపించారు.

ముగింపు

ఈ నవల సూర్యుడు అస్తమిస్తున్న సమయంలో ప్రారంభమై సాయంకాలం హీరిబాయి మరణంతో ముగుస్తుంది. రచయిత వెంకట్ పవార్ గారు భాష ఎవరినైనా, ఏ ప్రాంతంవారినైనా హాయిగా చదివిస్తుంది. తెలంగాణ పదజాలం, గోర్ బంజారా భాషా పదాలు ఈ నవలకు ప్రాదేశిక వాస్తవికతను సంతరించి పెట్టాయి. ఇది గొప్ప చారిత్రక నేపథ్యమున్న ఐతిహాసిక నవల. తెలుగు సాహిత్యంలో గోర్‌బంజారాలపై వచ్చిన తొలి నవల ఇది. నలుగురు నడిచిన దారిలో నడిస్తే కొత్త విషయాలు తెలియడం చాలా కష్టం. అట్లా కాకుండా వెంకట్ పవార్ తానే ఒక కొత్తబాటను వేసుకొని ఈ నవలను రాసారు. తెలుగు సాహిత్యంలో తొలి బంజారా నవలా రచయితగా పేరు సంపాదించుకున్నారు.

ఆధార గ్రంథం

1) వెంకట్ పవార్; పోర్యతార (తెలుగు తొలి గోర్ బంజారా చారిత్రక నవల), తెలంగాణ సాహిత్య అకాడమి, హైదరాబాద్-2025.

★★★

Vol. 23 | Spl. Issue 03 | March 2026 | BHAVAVEENA | ISSN No. : 2456-4702 | RNI No. APTEL/2003/12253

RNI No. APTEL/2003/12253 | Reffered Journal & Peer Reviewed Journals | ISSN No. 2456-4702

భావవీణ

కళలు, సాహిత్య, సాంస్కృతిక భాషాధ్యయన పత్రిక

BHAVA VEENA

Journal of Arts, Literary, Culture & Language Study

పెబ్బిలి హైమావతి కథలు - స్త్రీల అస్తిత్వం - పరిశీలన

- పులి చిన బాబు

పరిశోధక విద్యార్థి, తెలుగు మరియు ప్రాచ్య భాషా విభాగం, ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం, గుంటూరు.

పరిచయం :

పెబ్బిలి హైమావతి నవల, కథ, కవిత్వం మొదలగు సాహితీ ప్రక్రియలలో విశిష్ట కృషి చేస్తున్న రచయిత్రి. వీరికి చిన్నతనం నుండే రచనల పట్ల ఆసక్తి కలిగింది. ఫలితంగా వీరు ఎన్నో వైవిధ్య భరితమైన, అద్భుతమైన కథానికలు, నవలలు రచించగలిగారు. సమాజంలో జరిగే చిన్న చిన్న సంఘటనలే ఇతివృత్తాలుగా స్వీకరించి రచనలు చేయడం జరిగింది. వీరి రచనలు దాదాపు అన్ని దిన, వార, మాస పత్రికలలో ముద్రితమయ్యాయి. వీరి రచనలలో ఎక్కువ భాగం కుటుంబ నేపథ్యం, భార్యాభర్తల మధ్య గల సంబంధాలు, పిల్లల పట్ల తల్లిదండ్రులు పెంచుకునే మమకారం, సామాజిక కట్టుబాట్లు సమాజంలో స్త్రీలు ఎదుర్కొనే సమస్యలు. వివాహ వ్యవస్థ, స్త్రీ పురుష సంబంధాలు, ఆర్థిక అంశాలు, సామాజిక రుగ్మతలు మొదలగు అంశాలపై రచనలు చేశారు.

హైమావతి కేవలం కుటుంబ సమస్యలే కాకుండా అనేక సమకాలీన సామాజిక సమస్యలను ఎంచుకుని వైవిధ్యమైన పాత్రల ద్వారా నేటి స్త్రీ సమాజాన్ని కళ్ళు తెరిపించిన నేటి కథా రచయిత హైమావతి.

ఆధునిక కాలంలో స్త్రీలు ఇంటా బయటా కూడా ఎన్నో సమస్యలను ఎదుర్కొంటున్నారు. స్త్రీలు విద్యావంతులైనప్పటికీ తను ఉద్యోగం చేస్తున్న ఆఫీసులో కూడా తన పై అధికారుల నుండి లేదా సహచర ఉద్యోగుల నుండి ఎన్నో సమస్యలను ఎదుర్కొంటూనే ఉన్నారు. ఇంకా ఇంట్లో విషయానికి వస్తే భర్తతోపాటు అత్త, మామలతోపాటు ఆడపడుచులు ఆరెళ్ళు తప్పడంలేదు. స్త్రీ ఎంత ఉన్నత విద్యావంతురాలైన ప్రతిభావంతురాలైన తన కుటుంబ కట్టుబాట్లు గాని, సామాజిక కట్టుబాట్లకు తలొగ్గడం వల్ల ఆమె ఎన్నో సమస్యలను ఎదుర్కొనక తప్పడం లేదు. పూర్వ స్త్రీ హక్కులు, స్త్రీ స్వేచ్ఛా, స్త్రీ చైతన్యం కోసం ఎన్నో ఉద్యమాలు చేసి విజయం సాధించినప్పటికీ స్త్రీల పట్ల వివక్షత ఏదో రూపంలో మన కళ్ళముందు కనిపిస్తూనే ఉంది.

ప్రధానాంశాలు :

నేటి స్త్రీ సమస్యలు, స్త్రీ హక్కులు, స్త్రీ స్వేచ్ఛా, స్త్రీ చైతన్యం...

పెబ్బిలి హైమావతి కథలు - స్త్రీల అస్తిత్వం :

పెబ్బిలి హైమావతి గారు తన కథలలో స్త్రీ సమస్యలను చాలా స్పష్టంగా పాఠకులకు తెలియపర్చారు. ఆమె కథలలో తను సృష్టించిన పాత్రలు నిజంగా మన కుటుంబంలో, మన కుటుంబ సభ్యుల మధ్య జరిగినంత అనుభూతి కలుగుతుంది. హైమావతి కథల్లోని స్త్రీ సమస్యలను నిశితంగా పరిశీలిద్దాం.

ఆత్మాభిమానం, ఆత్మవిశ్వాసం స్త్రీలో మెండుగా

ఉంటుంది. తన ఆశయాలను, ఆదర్శాలను నెరవేర్చు కోవాలంటే ఆమెకు ఎన్నో సమస్యలు కుటుంబ సమస్యలు కొన్ని అయితే సామాజిక కట్టుబాట్లు మరికొన్ని అలాంటి సమస్యలను అధికమించి తన లక్ష్యాన్ని నెరవేర్చుకుంది. 'అపర్ణ' కథలో అపర్ణ ఆమెకు చాలా తెలివైంది. చాలా బాగా చదువుతుంది. పదవ తరగతిలో స్కూల్ ఫస్టు వచ్చింది. ఆమె కష్టపడి చదివే డాక్టరు అవ్వాలనేది ఆమె జీవిత ఆశయం. కానీ సవతి తల్లి నీలవేణి ఆమెకు ఎన్నో ఆంక్షలు పెట్టింది. చాలా తక్కువ చేసి మాట్లాడింది. ఆడపిల్లలకు చదువెందుకు "ఈ కుంటిది చదివి ఎవర్ని ఉద్ధరించనక్కరలేదు.. మా బాబాయి కొడుకు శంకరంకు యిచ్చి పెళ్ళి చేస్తా..వాళ్ళు నన్ను ఎప్పుడే అడిగారు. దీనికి పదవ తరగతి పరీక్షలు అయ్యాక చూద్దామని నేనే వాయిదా వేశాను" ('అవర్ణ' కథా తరంగిణి కథల సంపుటి, పెబ్బిలి హైమావతి, పుట 16) అంది నీలవేణి. నేను చెప్పినోళ్ళను పెళ్ళి చేసుకుంటే ఇంట్లో ఉండనిస్తాను. లేకపోతే నీ దారి నువ్వు చూసు కోమని సవతి తల్లి అపర్ణను ఇంట్లో నుండి పంపించింది. ఆడపిల్లగా పుట్టినందుకు అపర్ణ ఎన్నో కష్టాలు పడింది. తన స్కూల్ హెడ్మాస్టారు కృష్ణప్రసాద్ గారి సహాయంతో తను డాక్టరై తన జీవిత ఆశయాలను నెరవేర్చుకుంది అపర్ణ.

నేడు స్త్రీలు ఇంటా బయటా కూడా సమస్యలను ఎదుర్కొంటున్నారు. చదువుకుని ఉన్నత ఉద్యోగంలో స్థిరపడిన స్త్రీలకు సైతం కష్టాలు తప్పడం లేదు. చదువు సంస్కారంతో పాటు ఆత్మాభిమానం ఉన్న స్త్రీలు కుటుంబ కట్టుబాట్లకు విలువనిచ్చి ఎన్నో బాధలు, కష్టాలను అనుభవిస్తున్నారు. బిడ్డల భవిష్యత్ నాశనం అవుతుందని లేదా తండ్రిలేని బిడ్డలనే ముద్ర పడుతుందని స్త్రీలు ఎన్నో చిత్రహింసలను భరిస్తూనే ఉ న్నారు. భర్త వదిలేసిన భార్యకు సంఘ:లో విలువుండదని భయపడి ఎన్నో బాధలను, కస్టాలను అనుభవిస్తున్నారు. గొప్ప చదువులు చదువుకుని ఉన్నత ఉద్యోగంలో స్థిరపడింది సుమ. చైతన్యను ప్రేమించి తన తల్లిదండ్రు లను ఎదురించి మరీ పెళ్ళి చేసుకుంది. కాని ఇంట్లో అత్తమామలు పెట్టే కష్టాలను భరించలేని స్థితిలోకి వచ్చింది "ఆత్మవిశ్వాసం జగతా" కథలో సుమ. తన భర్త చైతన్య కూడా తల్లిదండ్రుల మాటలు నమ్మి భార్యను పశువుని కొట్టనట్లు కొట్టేవాడు. ఇంట్లో పనులన్నీ చేసి, ఇద్దరు పిల్లలను సముదాయించి స్కూల్ పంపించాలి. అత్తమామలు మంచిచెడు చూసుకోవాలి. భర్తని ఆఫీసుకు సిద్ధం చేసి, తను కూడా ఆఫీసుకు వెళ్ళాలి సుమ. ఆఫీసులో పని చేసి మళ్ళీ సాయంకాలంలో ఇంట్లో పనులన్నీ తను ఒక్కతే చక్కదిద్దాలి. ప్రతి నెల ఒకటో తారీఖున జీవితం తెచ్చి అత్త చేతిలో పెట్టాలి. ఎంతో చదువుకుని ఉన్నతస్థితిలో ఉన్నా అత్త, భర్త హింసలు అనుభవిస్తుంది సుమ. ఇలాంటి దయనీయమైన పరిస్థితిని చూసిన తన స్నేహితురాలు గాయిత్రి చేసిన సహాయంతో సుమ తన భర్తను అత్తమామలను మార్చుకుంది. ఎన్నో కష్టాలను ఓపిగ్గా భరించి తన సంసారాన్ని ఆనందమయంగా చేసుకోగల్గింది సుమ.

ఆనందంగా, ఉత్సాహంగా ఉద్యోగం చేసుకునే ఆడపిల్లలను లేదా బుద్ధిగా చదువకునే ఆడ పిల్లలకు పెళ్ళి చేసి తన గుండెల మీద భారం దించుకోవాలని తల్లిదండ్రులు పెళ్ళి పేరుతో వారి జీవితాలను గందర గోళంలోకి నెట్టుకొస్తున్నారు కొంతమంది తల్లిదండ్రులు. ఆడపిల్ల పెళ్ళి విషయంలో కొంతమంది తల్లిదండ్రులు కొన్ని తప్పటడుగులు వేస్తున్నారు. పెళ్ళి కొడుకు ఉద్యోగం, ఆస్థి అంతస్థులు ఉంటే తన బిడ్డ సుఖపడు తుందని ఆశపడుతున్నారు. కాని పిల్లవాడి గుణగణాలను గాని, కుటుంబ పరిస్థితులను గాని చూడడం లేదు. అంతేకాకుండా తన వ్యక్తిగత ప్రయోజనం కోసం లేదా తన స్థాయికి తగిన సంబంధమని పెళ్ళి చేసి సమస్యలను సృష్టించి ఆడపిల్లలకు ఎన్నో బాధలు, కష్టాలకు కారకులవుతున్నారు. దురాశపరులైన తల్లిదండ్రులు. "మదిలో మోహనరాగం" కథలో లాస్య తండ్రి తనకు ఇష్టం లేకపోయినా, గౌతమ్ తో తనకు పెళ్ళి నిర్ణయించి నిశ్చితార్థం జరిపించాడు. హాయిగా ఉద్యోగం చేస్తూ ఆనందంగా కొన్ని రోజులు ఉండాలనుకుంది లాస్య. చిన్న వయస్సులోనే సంసార బాధ్యతలను మోయటానికి ఆమె

ఇష్టపడలేదు. కాని గౌతమ్ మంచి, మర్యాదలు వారి కుటుంబ పరిస్థితులను చూసి అతనినే భర్తగా తన మదిలో ముద్రించుకుంది లాస్య. ఒకరిని ఒకరు ఇష్టపడ్డారు. ఇద్దరిది సరైన జోడి అనుకున్నారు. ఇంతలో మంత్రి గారి సంబంధం రావడంతో లాస్య తండ్రి గౌతమ్ లాస్య నిశ్చితార్థం రద్దు చేసి మంత్రి గారి కొడుకు రంజిత్ తో పెళ్ళి నిర్ణయించారు. విషయం తెలుసుకున్న లాస్య "ఏమిటి నాన్నా మీరు చేసిన పని నిన్నటి దాకా గౌతమిని నా భర్త అన్నారు. ఇప్పుడెవరో దారినపోయే వాడితో పెళ్ళి ఫిక్స్ చేసి, గౌతమ్ సంబంధం రద్దు చేసుకుంటున్నామని వారికి ఫోన్ చేసి చెప్పారు. కనీసం నాకు మాట మాత్రమైనా చెప్పారా! కనీసం నా అభిప్రాయం ఏమిటో తెలుసుకోవాలనిపించలేదా మీకు" (మదిలో మోహన రాగం, కథా తరంగిణి కథల సంపుటి, పెబ్బిలి హైమావతి, పుట : 75) అని లాస్య తండ్రిని నిలదీసింది. ఈ పెళ్ళికి ఒప్పుకోలేదు మంత్రి గారిని ఒప్పించి గౌతమ్ను పెళ్ళి చేసుకుంది లాస్య.

ఆపదలో ఉన్న ఆడపిల్లను ఆదుకోవాల్సిన బంధువులే రాబంధులైనప్పుడు ఆడపిల్ల జీవితం ముఖ్యంగా తల్లిదండ్రులు లేని ఆడపిల్ల జీవితం ఎంత నకం అనుభవించాలో తలచుకుంటేనే బాధ అనిపిస్తుంది. "కంచే చేను మేస్తే" కథలో శ్రావణి అలాంటి నరకంను చవిచూసింది. శ్రావణిది మంచి పరపతి గల కుటుంబం. అక్క నీలిమను ఉన్న ఊరిలోనే అభిరామ్ కిచ్చి పెళ్ళి చేశారు. వారు ఆస్ట్రేలియాలో స్థిరపడ్డారు. కాని అనుకోని విధంగా ఆమె తల్లిదండ్రులు కారు యాక్సిడెంట్లో చనిపోయారు. దాంతో శ్రావణి ఒంటరిదైపోయింది. ఆదరించే వారు లేరు. అదీగాక అందమైన ఆడపిల్ల. ఇలాంటి ఒకరోజు వస్తుందని ఆమె ఊహించలేదు. తన చదువు పూర్తి చేసిన తరువాత తను కూడా అక్క దగ్గరకు ఆస్ట్రేలియా వెళ్ళిపోవాలనుకుంది. లేడీస్ హాస్టల్ లో చేరింది. కాని హాస్టల్ ఫుడ్ ఆమెకు సరిపడలేదు. తప్పని పరిస్థితులలో ఆమె తన బావగారి అమ్మా నాన్నలు శ్రావణికి తన ఇంట్లో ఆశ్రయం ఇచ్చారు. చాలా ప్రేమగా చూసుకుంటుంది అత్త గారు లక్ష్మీకాంతం. ఏ ఆధారంలేని ఆమెకు కాంతంగారే తల్లీతండ్రి అయ్యింది. కానీ ఆమె భర్త నాగభూషణం శ్రావణిని ఎలాగైనా మానభంగం చేయాలని ప్రయత్నించాడు. శ్రావణి ఆ కామాందుడి నుండి తప్పించుకుంది. అతని చిన్న కొడుకు శ్రావణి బావ నందగోపాల్ వాళ్ళ నాన్న బారినుండి తప్పించి హైదరాబాద్ తీసుకెళ్ళి పరీక్షలకు బాగా ప్రీపేర్ చేయించాడు. చదువు పూర్తి అయిన తరువాత ఆమెను పెళ్ళి చేసుకుని తన జీవితానికి ఒక మంచి మార్గం చూపించాడు నందగోపాల్. తల్లిదండ్రుల చాటున అల్లారు ముద్దుగా పెరిగిన ఆడపిల్ల పెళ్ళి చేసుకుని కోటి ఆశలతో అత్తగారింట్లో అడుగుపెట్టిన కొంతమంది ఆడ పిల్లలకు అడుగడుగునా కష్టాలు ఎదురైతే ఆమె ఆశలన్నీ అడియాశలు అవ్వక తప్పదు. జీవితంలో సర్వం కోల్పోయి ఆమె జీవితం మోడువారిపోయింది. "నీతోనే ఉంటాను" కథలో మాధురి జీవితంలో ఎన్నో కష్టాలు ఎదుర్కొంది. మాధురి అన్నయ్య గోపాలం స్నేహితుడు కరుణాకరన్, అతని భార్య కూతురు కావ్య పుట్టిన తరువాత చనిపోయింది. గోపాలం రెండో పెళ్ళి వాడైన తన స్నేహితుడు ఉద్యోగం చూసి తన చెల్లెలు మాధురిని కరుణాకరన్ కిచ్చి పెళ్ళి చేశాడు. కాని పెళ్లయిన దగ్గర నుండి ఆమెకు కష్టాలే. సహజంగా భర్త మంచి వాడైనప్పటికీ అత్త కాంతం, ఆడపడుచు సునంద సూటిపోటి మాటలతో ఆమె మనస్సును గాయపరుస్తున్నారు. కూతురు కావ్య ఉన్నవి లేనిపోని మాటలు చెప్పి తల్లికి దూరం చేస్తున్నారు. భర్త కరుణాకరన్ హఠాత్తుగా చనిపోవడంతో అత్త ఆడపడుచు మాధురికి నరకం చూపిస్తున్నారు. ఆస్థి పాస్తులు అన్నీ వదిలిపెట్టి భర్త ఉద్యోగం తీసికొని దూరంగా వెళ్ళిపొమ్మని చిత్రహింసలు పెట్టసాగారు. కూతురు కావ్య తన తల్లి పరిస్థితి చూసి జాలిపడింది. తల్లికి సాయ పడింది. నీతోనే ఉంటానమ్మా.. నీకు కష్టం రానివ్వనని తల్లి కష్టాలు తీర్చింది కూతురు కావ్య.

సమాజం ఆడ పిల్లల పట్ల వివక్షత చూపిస్తుంది. ఆడపిల్లగా పుట్టడమే తప్పు అన్నట్లు వ్యవహరిస్తుంది. సమాజం చూపే వివక్షతకు ఆడపిల్లలు ఎన్నో అవమానాలు, బాధలు అనుభవిస్తున్నారు. అది ఒక శాపంగా

మారింది ఆడపిల్లల పట్ల. అది సమాజ నైజం అని ఆడపిల్లలు సరిపెట్టుకుంటున్నారు. కాని కన్న తల్లి దండ్రులే ఆడపిల్లల పట్ల వివక్షతను చూపితే ఇక ఆడపిల్లల పరిస్థితి ఏమిటో అర్థంకాని పరిస్థితి. కంచె చేను మమేసిందన్న చందానా ఆడపిల్లలు తన బాధను ఎవ్వరికీ చెప్పుకోవాలి. "మీ బిడ్డనే కద నాన్నా" కథలో పద్మ పరిస్థితి కూడా అలాంటిదే. నారాయణరావు, రమణమ్మకు ఇద్దరు పిల్లలు కూతురు పద్మ, కొడుకు సునీల్. నారాయణరావుకి కొడుకు మీద అభిమానం ఎక్కువే కూతురు పద్మ అంటే చులకన భావం. పెళ్ళి చేసుకుని తన దారి తాను చూసు కుంటుందనేది అతని ఆలోచన. అందువల్ల ఆమెను చాలా తక్కువ చేసి చూసేవాడు. పద్మ బాగా కష్టపడి చదివింది. చిన్న వయస్సులోనే మంచి ఉద్యోగం సంపా దించింది కాని తండ్రిలో అంత ఆనందం కన్పించలేదు. తన మొదటి జీతం తెచ్చి తన తండ్రి చేతిలో పెట్టింది పద్మ. కాని తండ్రిలో ఆనందం కన్పించలేదు. పైగా కూతుర్ని మనస్సు బాధపడే విధంగా మాట్లాడాడు. "ఇదిగోమ్మా నీ జీతం తీసికో.. నీ దగ్గరే ఉండనివ్వమా.. ఇది నీ సంపాదన.. నీ ప్యూచర్కి పనికొస్తుంది" (మీ బిడ్డనే కద నాన్నా (కథా తరంగిణి కథల సంపుటి), పెబ్బిలి హైమావతి, పుట : 94) అన్నాడు నారాయణరావు. ఆ మాటలతో తండ్రి స్వభావాన్ని అర్థం చేసుకుంది పద్మ. తనను, తమ్ముడు సునీల్ ను వేరువేరుగా చూస్తున్నాడని అర్థం చేసుకుంది పద్మ. కొడుకుని నెత్తిమీద పెట్టుకుని చూసుకున్నందుకు తండ్రినే ఇంట్లో నుండి గెంటివేశాడు, తన తండ్రి రిటైర్మెంట్ తరువాత. ఇలాంటి పరిస్థితుల్లో తండ్రిని ఆదరించింది కూతురు పద్మ. తనను ఎంత తక్కువ చేసి చూసినా తన తండ్రిని మాత్రం ఆమె ప్రేమగా చూసుకుంది.

ముగింపు :

భారతదేశం లాంటి పురుషాధిక్య సమాజంలో స్త్రీలను ద్వితీయ శ్రేణి పౌరులుగా చిత్రించి తక్కువ చేసి చూడడం అనాదికాలం నుడి జరుగుతూనే ఉంది. స్త్రీలు సమాజంలో ఎంత ఉన్నతస్థానంలో ఉన్నప్పటికీ ఏదో రూపంలో ఏదో విధంగా స్త్రీలకు అన్యాయం జరుగుతూనే ఉంది. అలాంటి అన్యాయాలను పెబ్బిలి హైమావతి గారు బాహాటంగానే తెలియపర్చారు. వాటికి పరిష్కార మార్గాలను కూడా తెలియపర్చడం జరిగింది.

ఆధార గ్రంథాలు :

1. 'పెబ్బిలి హైమావతి కథల సంపుటి'- పెబ్బిలి హైమావతి
2. నా అంతరంగ కథనం, బుచ్చిబాబు, విశాలాంధ్ర బుక్ హౌస్, 2012
3. తెలుగు సాహిత్య సమీక్ష, ఆచార్య జి. నాగయ్య, నవ్య పరిశోధన ప్రసరణలు, 1983
4. మన నవలలు మన కథానికలు, ఆచార్య రాచపాళెం చంద్రశేఖరరెడ్డి, విశాలాంధ్ర బుక్ హౌస్, 2015
5. మన తెలుగు సాహిత్య చరిత్ర, డాక్టర్ ముదిగంటి సుజాతా రెడ్డి, తెలుగు అకాడమి హైద్రాబాద్, 2018

★★★

Vol. 23 | Spl. Issue 03 | March 2026 | BHAVAVEENA | ISSN No. : 2456-4702 | RNI No. APTEL/2003/12253

RNI No. APTEL/2003/12253 | Reffered Journal & Peer Reviewed Journals | ISSN No. 2456-4702

భావవీణ

కళలు, సాహిత్య, సాంస్కృతిక భాషాధ్యయన పత్రిక

BHAVA VEENA

Journal of Arts, Literary, Culture & Language Study

తెలుగు సాహిత్యంలో మహిళా చైతన్యం

- అందె గోపికృష్ణ

పరిశోధక విద్యార్థి, తెలుగు మరియు ప్రాచ్య భాషా విభాగం, ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం, గుంటూరు.

పరిచయం

తెలుగు సాహిత్యం కేవలం కాలక్రమాన్ని నమోదు చేసే గ్రంథం మాత్రమే కాదు; అది సమాజపు స్పందన, భావజాలాల పోరాటం మరియు సాంస్కృతిక పరిణామాల ప్రతిబింబం. ఈ ప్రయాణంలో మహిళల స్వరం, వారి అనుభవాలు, ఆకాంక్షలు, పోరాటాలు మరియు విజయాల కథనమే మహిళా చైతన్యం. ఇది కేవలం సాహిత్యంలో ఒక ఇతివృత్తం మాత్రమే కాదు; పితృస్వామ్య సమాజంలో స్త్రీ ఉనికిని, హక్కులను, స్వేచ్ఛను ప్రశ్నించే ఒక చైతన్యోద్యమం. ఆధునిక కాలంలో స్త్రీవాద సిద్ధాంతాల ప్రభావంతో ఈ భావజాలం మరింత బలపడి, పదునెక్కింది.

స్త్రీవాద చింతన సాహిత్యంలో కేవలం రచనలకే పరిమితం కాలేదు; అది ఒక ఉద్యమంగా, ఒక జీవన విధానంగా మారింది. ఈ వ్యాసం తెలుగు సాహిత్యంలో మహిళా చైతన్యం యొక్క పరిణామాన్ని, ప్రముఖ రచయిత్రుల సహకారాన్ని, స్త్రీవాద సిద్ధాంతకర్తల భావనలను, దళిత మరియు బహుజన స్త్రీవాద స్వరాలను, సాహిత్య విమర్శలోని కొత్త ఒడ్డులను మరియు భవిష్యత్తు దిశానిర్దేశాన్ని లోతుగా పరిశీలిస్తుంది.

చారిత్రక నేపథ్యం : పునరాలోచన

తెలుగు సాహిత్యంలో మహిళల స్వరం ప్రాచీన కాలం నుండే వినిపించింది. భక్తి ఉద్యమం మహిళలకు తమ భావాలను వ్యక్తపరచడానికి ఒక ముఖ్యమైన వేదికగా నిలిచింది. అయితే, ఈ కాలంలోని రచనలు ప్రధానంగా భక్తి, నీతి పరిధుల్లోనే ఉండేవి.

మొల్ల :

ఆమె రచించిన మొల్ల రామాయణం అపూర్వమైన ప్రజాదరణ పొందింది. సంస్కృతం, అవధి భాషల మేలు కలయికతో, కథనంలోని సరళత, పాత్ర చిత్రణలోని మానవీయ కోణం ఈ గ్రంథాన్ని ప్రత్యేకంగా నిలిపాయి. మొల్ల రామాయణంలో స్త్రీ పాత్రల చిత్రణలో కొంత స్వేచ్ఛను తీసుకున్నారు. ఉదాహరణకు, సీతాదేవిని కేవలం పతివ్రతామాత్రగా కాకుండా, స్వతంత్రంగా ఆలోచించే మహిళగా చిత్రించే ప్రయత్నం చేశారు. కానీ, ఆమె చిత్రణ ఇప్పటికీ సంప్రదాయ స్త్రీధర్మ పరిధిలోనే ఉండిపోయింది.

తారిగొండ వెంకమాంబ :

వీరు భక్తి సాహిత్యాన్ని అధిగమించి విష్ణు పురాణం, వెంకటాచల మాహాత్మ్యం వంటి అనేక గ్రంథాలను రచించారు. సంస్కృతంలోని పురాణాలను తెలుగులోకి అనువదించడమే కాకుండా, స్వతంత్రంగా కావ్యాలు రచించిన మొదటి మహిళా కవయిత్రులలో వీరు ఒకరు. వీరి రచనలు కేవలం భక్తికే పరిమితం కాకుండా, స్త్రీలకు సంబంధించిన నీతి, ధర్మాలను కూడా ప్రతిబింబించాయి. ఆమె రచించిన రాజయోగసారము వంటి గ్రంథాలలో

స్త్రీలకు విద్య, జ్ఞానం, ఆధ్యాత్మిక చింతన అవసరమనే భావనను బలపరిచారు.

అయితే, ఈ దశలో ఒక కీలకమైన, మరచిపోయిన స్వరాన్ని గురించి ప్రత్యేకంగా ప్రస్తావించాలి.

ముద్దుపళని : శృంగార సాహిత్యంలో స్త్రీ స్వరం

18వ శతాబ్దానికి చెందిన దేవదాసి కవయిత్రి ముద్దు పళని, తన రాధికా సాంత్వనము కావ్యంతో తెలుగు సాహిత్యంలో ఒక విప్లవాత్మక మార్పును తీసుకువచ్చారు. ఇది కృష్ణ, రాధ, ఇలాదేవి మధ్య ప్రేమ, ఈర్ష్య, వాత్సల్యాల మానవీయ కథనం. శృంగారాన్ని మాత్రమే కాకుండా, ఒక స్త్రీ తన భావోద్వేగాలను, శారీరక కోరికలను నిస్సంకోచంగా వ్యక్తం చేసిన ఈ కావ్యం, స్త్రీకి సంబంధించిన సంప్రదాయ కథనాలను పూర్తిగా బద్దలు కొట్టింది. 1911లో ప్రసిద్ధ గాయని, కళాకారిణి బెంగుళూరు నాగరత్నమ్మ ఈ గ్రంథాన్ని పునర్ముద్రించగానే, బ్రిటిష్ ప్రభుత్వం దానిని అశ్లీలంగా పేర్కొంటూ నిషేధించింది. ఈ నిషేధం 1947 వరకు కొనసాగింది. ఇది కేవలం ఒక పుస్తకం నిషేధం మాత్రమే కాదు; పితృస్వామ్య సమాజం స్త్రీ స్వేచ్ఛను, ముఖ్యంగా ఆమె లైంగికత గురించిన స్వేచ్ఛా వ్యక్తీకరణను అణచివేయడానికి చేసిన ప్రయత్నం. ముద్దుపళనిని మరచిపోవడం, తెలుగు సాహిత్య చరిత్రలో ఒక పెద్ద లోటు.

ఆధునిక యుగం : స్త్రీవాద భావజాల నిర్మాతలు

సామాజిక సంస్కరణ ఉద్యమాలు, విద్యావకాశాలు మరియు పత్రికా రంగం అభివృద్ధి ఆధునిక తెలుగు సాహిత్యంలో మహిళల భాగస్వామ్యాన్ని గణనీయంగా పెంచాయి. ఈ కాలంలో, మహిళా రచయిత్రులు తమ రచనల ద్వారా స్త్రీల ఆలోచనా స్వేచ్ఛ, ఆర్థిక స్వాతంత్ర్యం, సామాజిక సమానత్వం వంటి అంశాలను ప్రధాన వాగ్దానంగా మార్చారు.

చలం (గుడిపాటి వెంకటచలం) పితృస్వామ్యాన్ని తీవ్రంగా ప్రశ్నించి, స్త్రీ స్వేచ్ఛ గురించి రచించినప్పటికీ, ఈ ఉద్యమానికి మహిళా రచయిత్రులే ప్రధాన శక్తిగా మారారు. చలం తన రచనలలో స్త్రీ స్వేచ్ఛ గురించి గొప్పగా వాదించినప్పటికీ, ఆయన స్త్రీ పాత్రలు చివరకు పురుషుని చుట్టూనే తిరిగేవి. కానీ మహిళా రచయిత్రులు తమ రచనల్లో స్త్రీని కేంద్రంగా చేసుకొని, ఆమె దృక్పథంతో ప్రపంచాన్ని చూడటం ప్రారంభించారు.

వోల్గా (పి. లలిత కుమారి) - స్త్రీవాద చింతనకు మార్గదర్శి

తెలుగు సాహిత్యంలో స్త్రీవాద భావజాలాన్ని సిద్ధాంతీకరించడంలో, ప్రచారం చేయడంలో వోల్గా కీలక పాత్ర పోషించారు. ఈమె రచనలు, సంపాదకీయ కృషి తెలుగులో స్త్రీవాద చింతనకు కొత్త దిశానిర్దేశం చేశాయి.

స్వేచ్ఛ :

ఈ నవల తెలుగు సాహిత్యంలోనే ఒక మైలురాయి. ఇది ఒక మహిళ తన సంప్రదాయ కుటుంబాన్ని వదిలి, సామాజిక, ఆర్థిక, వ్యక్తిగత స్వేచ్ఛ కోసం చేసే ప్రయాణం యొక్క కథనం. ఇది కేవలం ఒక కల్పిత కథ కాదు; ఆధునిక తెలుగు మహిళ యొక్క ఆత్మాన్వేషణ యొక్క దస్తావేజు. ఈ నవలలో వోల్గా స్త్రీ స్వేచ్ఛ అంటే కేవలం శారీరక స్వేచ్ఛ మాత్రమే కాదు, ఆర్థిక, మానసిక, బౌద్ధిక స్వేచ్ఛ కూడా అని చాటిచెప్పారు.

మాకు గోడలు లేవు :

ఇది తెలుగులో స్త్రీవాద తత్వశాస్త్రానికి సంబంధించిన మొదటి సంకలనం. వివిధ రచయిత్రుల వ్యాసాల ద్వారా స్త్రీవాద సిద్ధాంతాలను తెలుగు పాఠకులకు పరిచయం చేసింది. ఈ పుస్తకం ద్వారా స్త్రీవాదం కేవలం పురుష ద్వేషం కాదని, అది ఒక తాత్విక, రాజకీయ, సాంస్కృతిక ఉద్యమమని స్పష్టం చేసింది.

నీలి మేఘాలు :

స్త్రీవాద కవిత్వానికి ఒక ప్రత్యేకమైన సంకలనం, దీనిని వోల్గా సంపాదకత్వం వహించారు. ఈ సంకలనంలో పలువురు మహిళా కవయిత్రుల కవితలు చోటు చేసుకున్నాయి.

విముక్త (The Liberation of Sita) :

ఈ కథా సంకలనంలో, వోల్గా రామాయణంలోని సీత, సూర్పనఖ, అహల్య, రేణుక వంటి స్త్రీ పాత్రలను తిరిగి ఊహించి, వారి పోరాటాలను, విముక్తిని ఆధునిక స్త్రీవాద దృక్పథంతో చిత్రించారు. ఈ రచనకు ఆమెకు కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు లభించింది. ఈ పుస్తకం

గురించి వోల్గా మాట్లాడుతూ, "సీతలా ఎదురు తిరగలేని స్త్రీలు ఇంకా ఎంతమంది ఉన్నారు? వారి కథలు చెప్పాలి. సీత విముక్తి చెందింది కాబట్టే రాముడు రాముడయ్యాడు. లేకపోతే అతను కేవలం ఒక రాజకుమారుడే అయి ఉండేవాడు" అని అన్నారు.

వోల్గా కేవలం రచయిత్రి మాత్రమే కాదు; ఆమె ఒక ఉద్యమకారిణి. అనేక మంది మహిళా రచయిత్రులను ప్రోత్సహించి, తెలుగు సాహిత్యంలో స్త్రీవాద భావజాలానికి బలమైన పునాది వేశారు.

రంగనాయకమ్మ : సామాజిక అసమానతల విమర్శకురాలు

రంగనాయకమ్మ రచనలు సామాజిక అసమానతలను, ముఖ్యంగా కుల మరియు లింగ వివక్షను తీవ్రంగా ప్రశ్నించాయి. ఆమె ఒక విప్లవ రచయిత్రి. ఆమె రచనలు మార్క్సిస్టు, స్త్రీవాద, దళిత దృక్పథాలతో సమాజాన్ని విశ్లేషించాయి.

రామాయణ విశవృక్షం :

ఈ గ్రంథం వాల్మీకి రామాయణాన్ని స్త్రీవాద మరియు దళిత దృక్పథాలతో విశ్లేషించింది. రామాయణాన్ని పూర్తిగా తిరగరాస్తూ, సీత, శూర్పణఖ, కైకేయి వంటి పాత్రల పట్ల సమాజం చూపించే అన్యాయాన్ని ఎత్తిచూపింది. ఇది ఒక సంప్రదాయ గ్రంథం యొక్క తీవ్రమైన, వివాదాస్పదమైన పునర్విచింతన. రంగనాయకమ్మ ఈ పుస్తకంలో "శూర్పణఖ ముక్కు ఎందుకు నరకబడింది? ఒక స్త్రీ తన కోరికను వ్యక్తం చేసింది కాబట్టి! ఇదే రామాయణం నేర్పించే పాఠం: స్త్రీ కోరికను శిక్షించాలి" అని ప్రశ్నించారు.

ఆడదాని ప్రశ్న :

ఈ పుస్తకంలో రంగనాయకమ్మ స్త్రీలపై జరిగే అన్యాయాలను, వారి దోపిడీని ఒక విప్లవ దృక్పథంతో విశ్లేషించారు. స్త్రీ స్వేచ్ఛ అనేది కేవలం వ్యక్తిగత సమస్య కాదు, అది ఒక రాజకీయ, సామాజిక సమస్య అని నొక్కి చెప్పారు.

మాలతి చౌదరి : స్త్రీవాద స్వరం యొక్క విస్తరణ

మాలతి చౌదరి స్త్రీవాద సాహిత్యానికి కొత్త కోణాలను జోడించారు. ఆమె రచనలలో స్త్రీల ఆంతరంగిక ప్రపంచం, వారి సంబంధాలు, భావోద్వేగాలు లోతుగా చిత్రీకరించబడ్డాయి.

స్త్రీ జన్మ :

ఈ నవలలో మాలతి చౌదరి ఒక స్త్రీ జీవితంలోని వివిధ దశలను, ఆమె అనుభవించే అణచివేతను, సంఘర్షణను చిత్రించారు. స్త్రీ జన్మ ఎత్తుకోవడమే ఒక శాపంగా భావించే సమాజంలో స్త్రీ తన ఉనికి కోసం చేసే పోరాటం ఈ నవలలో మనకు కనిపిస్తుంది.

చీకటి గదులు :

ఈ నవలలో ఆమె వివాహిత స్త్రీలు ఎదుర్కొనే మానసిక సంఘర్షణలను, వారి ఒంటరితనాన్ని చిత్రించారు. 'చీకటి గదులు' అనే పదం స్త్రీల మనసులోని చీకటి కోణాలకు, వారి అణచివేతకు ప్రతీకగా నిలిచింది.

స్త్రీవాద సాహిత్య విమర్శ : ఒక కొత్త శాఖ

మహిళా రచనలతో పాటు, వాటిని విశ్లేషించే, స్త్రీవాద దృక్పథంతో సాహిత్యాన్ని పునఃపఠనం చేసే ఒక కొత్త విమర్శా శాఖ కూడా అభివృద్ధి చెందింది. ఈ దిశగా అనేక మంది విమర్శకులు కీలక పాత్ర పోషించారు.

కాత్యాయని విద్మహే (కేతవరపు కాత్యాయని) :

వీరు స్త్రీవాదం, మార్క్సిజం నేపథ్యంలో సాహిత్యాన్ని విశ్లేషించే ప్రముఖ రచయిత్రి, విమర్శకురాలు. "ఆధునిక తెలుగు సాహిత్యం - స్త్రీవాద భూమిక" మరియు "సాహిత్యాకాశంలో నగం" (దీనికి కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు) వంటి రచనలు స్త్రీవాద విమర్శకు పునాది రాళ్లు.

ప్రముఖ వ్యాఖ్య :

"మహిళలను కేవలం వస్తువులుగా చిత్రించడాన్ని వ్యతిరేకించాలి. సాహిత్యంలో స్త్రీ సంక్లిష్టమైన, స్వతంత్ర వ్యక్తిత్వంగా కనిపించాలి. పురుష రచయితలు స్త్రీ పాత్రలను సృష్టించినప్పుడు, వారు తరచుగా స్త్రీని ఒక ఆదర్శంగా గాని, రాక్షసిగా గాని చిత్రించారు. స్త్రీని మామూలు మనిషిగా చూడటానికి వారు సిద్ధపడలేదు."

మరొక ముఖ్య వ్యాఖ్య :

"స్త్రీవాద విమర్శ అంటే కేవలం పురుష రచయితలను నిందించడం కాదు. అది సాహిత్యంలో అంతర్లీనంగా

ఉన్న లింగ పక్షపాతాలను, అధికార నిర్మాణాలను గుర్తించడం. స్త్రీలు ఎలా చదవాలి, ఎలా రాయాలి, ఎలా ఆలోచించాలి అనే దాన్ని కూడా పితృస్వామ్య సమాజమే నిర్ణయిస్తుంది. దాన్ని ప్రశ్నించడమే మా పని.''

డా. కిన్నెర శ్రీదేవి :

వీరు ''స్నేహిత: స్త్రీవాద వ్యాస సంపుటి'' వంటి రచనల ద్వారా స్త్రీవాద సాహిత్య విమర్శకు గణనీయమైన కృషి చేశారు. ఆమె స్త్రీవాదం అంటే కేవలం సాహిత్య విశ్లేషణ మాత్రమే కాదు, అది ఒక జీవన విధానం అని, స్త్రీలు ప్రతిరోజూ ఎదుర్కొనే సమస్యలతో ముడిపడి ఉందని నొక్కి చెప్పారు.

కొలకలూరి మధుజ్యోతి :

వీరి ''సాహిత్య వీక్షణం'' తెలుగు సాహిత్యంలో స్త్రీవాదాన్ని కేంద్రంగా చేసుకుని రచించిన విమర్శనా గ్రంథం. ఈ పుస్తకంలో ఆమె ప్రముఖ తెలుగు రచనలను స్త్రీవాద దృక్పథంతో పునఃపఠనం చేశారు.

జయప్రభ :

వీరు స్త్రీవాద కవయిత్రిగానే కాకుండా, విమర్శకు రాలిగా కూడా ప్రసిద్ధులు. ''భావ కవిత్వంలో స్త్రీ'' అనే రచనలో, ప్రముఖ పురుష కవులు తమ కవిత్వంలో స్త్రీని ఎలా చిత్రించారో విశ్లేషించి, ఆ చిత్రణలోని లోపాలను, పితృస్వామ్య దృక్పథాన్ని ఎత్తిచూపారు. ఆమె ప్రకారం, భావ కవిత్వంలో స్త్రీ ఒక ప్రతీకగా, ఒక భావనగా మిగిలి పోయింది; ఆమె నిజమైన వ్యక్తిత్వం, ఆమె సమస్యలు, ఆమె శరీరం కనిపించలేదు.

కవిత్వంలో తిరుగుబాటు : జయప్రభ నుండి నిక్తేష వరకు

స్త్రీవాద కవిత్వం తెలుగులో చాలా శక్తివంతమైన ప్రక్రియ. ఇది స్త్రీల అంతరంగిక అనుభవాలను, వారి ఆవేదనలను, కోపాన్ని, ఆశలను తీవ్రంగా వ్యక్తం చేసింది.

జయప్రభ ఈ రంగంలో ఒక అగ్రగామి. ఆమె కవిత్వం సంప్రదాయ లింగ నిబంధనలను సవాల్ చేస్తుంది. ఆమె కవిత్వంలో స్త్రీ శరీరం, స్త్రీ కామం, స్త్రీ కోపం వంటి అంశాలు నిర్భయంగా వ్యక్తమవుతాయి.

చూపులు :

ఈ కవిత స్త్రీపై సమాజం, ముఖ్యంగా పురుషులు చూసే దృష్టిని (మేల్ గేజ్) తీవ్రంగా విమర్శిస్తుంది.

''చూపులు చూపులు చూపులు
ఎప్పుడూ చూపుల దాడి
తినేటప్పుడు, తిరిగేటప్పుడు, నవ్వేటప్పుడు
చూపులు చూపులు చూపులు
ఒక్కసారి మీరు చూడకండి
మేము చూస్తాం
మేము చూడగలం
మా చూపుల ముందు మీరు తలవంచండి''

పైటను తగలెయ్యాలి :

ఈ కవితలో జయప్రభ పైటను సంప్రదాయ స్త్రీత్వానికి చిహ్నంగా భావించి, స్త్రీలు పితృస్వామ్య బంధాల నుండి విముక్తి పొందాలంటే ఈ చిహ్నాలను తొలగించుకోవాలని సూచించారు.

''పైటను తగలెయ్యాలి
కట్టుకున్న గాజులు పగలగొట్టుకోవాలి
తల నిండా పూలు రాల్చుకోవాలి
అప్పుడే నేను మిగులుతాను
నేను మిగిలితేనే స్త్రీ మిగులుతుంది''

నిక్తేష కొత్త తరం స్త్రీవాద కవయిత్రి. ఆమె కవిత్వంలో సమకాలీన స్త్రీ జీవితంలోని సంక్లిష్టతలు, గందరగోళాలు, ఆత్మాన్వేషణ కనిపిస్తాయి. ఆమె కవిత్వంలో స్త్రీ స్వేచ్ఛ కోసం ఆరాటం, ఒంటరితనం, నగర జీవితంలో స్త్రీ అనుభవాలు ప్రధాన ఇతివృత్తాలు.

''ఆడదాని రాత్రి'' కవితలో ఆమె ఒంటరి స్త్రీ నగరంలో ఎదుర్కొనే భయాన్ని, ఆత్మవిశ్వాసాన్ని ఏకకాలంలో చిత్రించారు.

కొండేపూడి నిర్మల స్త్రీవాద కవిత్వానికి మరో ముఖ్యమైన పేరు. ఆమె కవితలలో స్త్రీ అణచివేత, ప్రేమ, వాత్సల్యం, రాజకీయ చైతన్యం వంటి అంశాలు ప్రతిబింబిస్తాయి.

దళిత స్త్రీవాదం :

మహిళా చైతన్యం యొక్క మరో ముఖ్యమైన దశ దళిత స్త్రీవాదం. ఇది కులం మరియు లింగం అనే

ద్వంద్వ అణచివేతను ఎదుర్కొంటున్న దళిత మహిళల ప్రత్యేకమైన సమస్యలపై దృష్టి పెట్టింది. బహుజన స్త్రీల జీవితాలు, పోరాటాలు ఈ సాహిత్యంలో ప్రధాన ఇతివృత్తాలు.

జూపాక సుభద్ర :

ఈమె దళిత స్త్రీవాదానికి మార్గదర్శి. ఆమె కథలు, కవితలు దళిత మహిళల జీవితాల్లోని వాస్తవికతను, వారు ఎదుర్కొనే ద్వంద్వ అణచివేతను చిత్రించాయి. ఆమె ప్రకారం, "మా పోరాటం రెండు రంగాలలో సాగుతుంది. ఒకటి, పై కులాల వారి నుండి కుల అణచివేతకు వ్యతిరేకంగా. రెండు, మా స్వంత కులంలోని పురుషుల నుండి లింగ అణచివేతకు వ్యతిరేకంగా."

గోగు శ్యామల :

ఈమె కథలలో దళిత స్త్రీల జీవితాలు, వారి సంస్కృతి, వారి పోరాటాలు ప్రతిబింబిస్తాయి. ఆమె రచనలు దళిత స్త్రీలు తమ గౌరవం కోసం, గుర్తింపు కోసం చేసే పోరాటాన్ని చిత్రించాయి. ఆమె ప్రసిద్ధ కథ "కనకమ్మ" ఒక దళిత మహిళ తన భర్త చేతిలో అనుభవించే అణచివేతను, చివరికి ఆమె పొందే విముక్తిని చిత్రించింది.

జాజుల గౌరి :

ఈమె కవితలలో దళిత స్త్రీల రోజువారీ జీవితంలోని సంఘర్షణలు, వారి ఆకలి, వారి ఆశలు కనిపిస్తాయి. ఆమె కవిత్వం దళిత స్త్రీల గొంతుకగా మారింది. ఆమె ఒక కవితలో ఇలా అన్నారు:

"మా కులం ఏమిటని అడిగావు?
మా కులం పని
మా కులం పేదరికం
మా కులం మీ ఇళ్లలో చేసే పని
మా కులం మీకు కనిపించని మనుషులు"

వేముల ఎల్లమ్మ :

ఈమె రచనలు దళిత స్త్రీల జీవితంలోని విభిన్న కోణాలను వెలుగులోకి తెచ్చాయి. ఆమె కవితలు దళిత మహిళల శ్రమ, వారి శరీరం, వారి కోరికల గురించి మాట్లాడతాయి.

ఈ రచయిత్రులందరూ స్త్రీవాదం అనేది ఒకే కోణంలో చూడలేమని, అది కులం, వర్గం, లింగం యొక్క అతివ్యాప్తి ద్వారా అర్థం చేసుకోవాలని నొక్కి చెబుతారు

బహుజన స్త్రీవాదం : ఇతర పీడిత వర్గాల స్వరం

బహుజన స్త్రీవాదం అనేది కేవలం దళితులకే పరిమితం కాకుండా, ఇతర వెనుకబడిన తరగతులకు చెందిన మహిళల స్వరాన్ని కూడా ప్రతిబింబిస్తుంది. ఈ రచయిత్రులు తమ రచనల ద్వారా కులం, వర్గం, లింగం యొక్క త్రివిధ అణచివేతను ఎదుర్కొంటున్న మహిళల సమస్యలను ప్రస్తావించారు.

సుభాషిణి తన రచనల ద్వారా గిరిజన మహిళల సమస్యలను ప్రస్తావించారు. అడవుల నుండి వారు స్థానభ్రంశం చెందడం, వారి సంస్కృతి కోల్పోవడం వంటి సమస్యలను ఆమె రచనలలో చిత్రించారు.

సంస్థల పాత్ర : సాహిత్యాన్ని నిర్మించడం

మహిళా రచయిత్రులను ప్రోత్సహించడంలో, వారి రచనలను ప్రచురించడంలో కొన్ని సంస్థలు కీలక పాత్ర పోషించాయి.

అస్మిత :

ఈ సంస్థ మహిళా రచయిత్రుల సమావేశాలు, కార్యశాలలు నిర్వహించి, వారికి ఒక వేదికను కల్పించింది. స్త్రీవాద సాహిత్యాన్ని ప్రచారం చేయడంలో ఇది ముందుంది. వీరు "నీలి మేఘాలు" వంటి సంకలనాలను ప్రచురించి, స్త్రీవాద కవిత్వానికి గుర్తింపు తీసుకువచ్చారు.

ఎలమి పబ్లికేషన్స్ :

పూర్ణిమ తమ్మిరెడ్డి 2022లో ఈ స్వతంత్ర తెలుగు ప్రచురణ సంస్థను స్థాపించారు. ఇది స్త్రీవాద, సామాజిక న్యాయం అంశాలపై దృష్టి కేంద్రీకరించి, నాణ్యమైన పుస్తకాలను ప్రచురిస్తోంది. వీరు ప్రచురించిన పుస్తకాలు స్త్రీవాద సాహిత్యానికి కొత్త ఊపునిచ్చాయి.

స్త్రీ శక్తి సంఘటన :

హైదరాబాద్ పుస్తక ప్రదర్శనలో ఏర్పాటు చేసే స్త్రీ శక్తి సంఘటన వేదిక, మహిళా రచయిత్రులకు, కవయిత్రులకు, విమర్శకులకు తమ రచనలను ప్రదర్శించడానికి, చర్చించడానికి ఒక వేదికగా నిలుస్తోంది.

స్త్రీవాద పత్రికలు : చైతన్య వాహికలు

మహిళా చైతన్యాన్ని వ్యాప్తి చేయడంలో పత్రికలు కూడా కీలక పాత్ర పోషించాయి.

భారతి :

ఆధునిక తెలుగు సాహిత్యంలో భారతి పత్రిక పాత్ర చాలా గొప్పది. ఇది మహిళా రచయిత్రుల రచనలను ప్రోత్సహించింది.

గృహలక్ష్మి :

ఇది ప్రధానంగా గృహిణుల కోసం ప్రారంభించిన పత్రిక అయినప్పటికీ, తరువాతి కాలంలో స్త్రీల సమస్యలపై చర్చించడంలో ముందుండేది.

స్త్రీవాద పత్రికలు :

1980లు, 90లలో అనేక చిన్నపత్రికలు స్త్రీవాదాన్ని కేంద్రంగా చేసుకుని వెలువడ్డాయి. ఇవి స్త్రీవాద సిద్ధాంత చర్చలకు, స్త్రీవాద సాహిత్యానికి ప్రధాన వేదికలుగా నిలిచాయి.

స్త్రీవాదం - విభిన్న దృక్పథాలు: మార్క్సిస్టు, అస్తిత్వ, ఉత్తర ఆధునిక

తెలుగు స్త్రీవాద సాహిత్యంలో విభిన్న దృక్పథాలు కనిపిస్తాయి.

మార్క్సిస్టు స్త్రీవాదం :

రంగనాయకమ్మ ఈ దృక్పథానికి ప్రతినిధి. వర్గ పోరాటంతోనే స్త్రీల అణచివేత తొలగిపోతుందని ఆమె వాదించారు.

అస్తిత్వ స్త్రీవాదం :

వోల్గా రచనలలో అస్తిత్వ ప్రశ్నలు కనిపిస్తాయి. స్త్రీ తన స్వేచ్ఛ కోసం, తన ఉనికి కోసం చేసే పోరాటం ఆమె రచనల్లో ప్రధాన ఇతివృత్తం.

ఉత్తర ఆధునిక స్త్రీవాదం :

కొత్త తరం రచయిత్రులు ఉత్తర ఆధునిక దృక్పథంతో స్త్రీవాదాన్ని చూస్తున్నారు. వారి ప్రకారం, స్త్రీ అనేది ఒక స్థిరమైన గుర్తింపు కాదు; అది అనేక సత్యాలతో కూడుకున్న సంక్లిష్టమైన నిర్మాణం. నిక్షేప కవిత్వంలో ఈ ఉత్తర ఆధునిక దృక్పథం కనిపిస్తుంది.

సమకాలీన స్త్రీవాదం: కొత్త సవాళ్ళు, కొత్త అవకాశాలు

సమకాలీన తెలుగు స్త్రీవాదం కొత్త సవాళ్ళను ఎదుర్కొంటోంది. ప్రపంచీకరణ, మార్కెట్ ఆధిపత్యం, హిందుత్వ రాజకీయాలు వంటి అంశాలు స్త్రీవాద చింతనపై ప్రభావం చూపుతున్నాయి.

డిజిటల్ స్త్రీవాదం :

సోషల్ మీడియా స్త్రీవాదానికి కొత్త వేదికగా మారింది. ఫేస్‌బుక్, ట్విట్టర్, బ్లాగుల ద్వారా స్త్రీలు తమ అనుభవాలను పంచుకోవడం, స్త్రీవాద చర్చలు నిర్వహించడం సాధ్యమవుతోంది.

లైంగిక హింసపై చర్చ :

మీ టూ, నిర్భయ కేసు తర్వాత లైంగిక హింసపై చర్చ తీవ్రమైంది. అనేక మంది మహిళా రచయిత్రులు ఈ అంశంపై రచనలు చేస్తున్నారు.

ట్రాన్స్జెండర్ సమస్యలు :

ఇటీవలి కాలంలో ట్రాన్స్జెండర్ల సమస్యలు కూడా స్త్రీవాద చర్చల్లోకి వస్తున్నాయి. లింగం అనేది కేవలం స్త్రీ-పురుషులకు మాత్రమే పరిమితం కాదని, అది ఒక స్పెక్ట్రం అని కొత్త తరం రచయితలు వాదిస్తున్నారు.

ముగింపు :

తెలుగు సాహిత్యంలో మహిళా చైతన్యం అనేది ఒక నిశ్చల ప్రవాహం కాదు; అది నిరంతరం మారుతూ, కొత్త ఒడ్డులను తాకుతూ, లోతుగా ప్రవహిస్తున్న నది. 18వ శతాబ్దపు ముద్దుపళని నుండి, ఆధునిక వోల్గా, జయప్రభ, కాత్యాయని విద్మహే వరకు, దళిత స్త్రీవాద రచయిత్రుల వరకు, ప్రతి ఒక్కరూ ఈ ప్రవాహాన్ని సుసంపన్నం చేశారు.

ఈ రచయిత్రులు కేవలం సాహిత్యాన్ని సృష్టించడమే కాకుండా, సమాజంలోని అన్యాయాలను ప్రశ్నించే ఒక శక్తిగా మారారు. స్త్రీల జీవితాలను కేవలం ఒక కోణంలో చూడకుండా, వారి అనుభవాలు, సమస్యలు, ఆకాంక్షలు ఎంతో సంక్లిష్టమైనవి, బహుముఖాలు అని చాటి చెప్పారు.

స్త్రీవాద రచయిత్రి సిద్ధిఖీ మాటల్లో చెప్పాలంటే, "స్త్రీ రచన అంటే కేవలం స్త్రీల గురించి రాయడం కాదు. అది ప్రపంచాన్ని స్త్రీ దృక్పథంతో చూడడం. స్త్రీల

అనుభవాలను, వారి ఆలోచనలను, వారి కలలను మాటల్లోకి దించడం. ఇది ఒక రాజకీయ చర్య."

భవిష్యత్తులో కూడా ఈ సాహిత్య ఉద్యమం కొత్త దిశలను అన్వేషిస్తూ, సమానమైన, న్యాయమైన సమాజ నిర్మాణంలో తన పాత్రను కొనసాగిస్తుందనడంలో సందేహం లేదు. కులం, వర్గం, లింగం, లైంగికత యొక్క కొత్త కొత్త కోణాలను చేర్చుకుంటూ, ఈ ప్రవాహం మరింత విస్తరిస్తుంది. తెలుగు సాహిత్యంలో మహిళా చైతన్యం యొక్క ప్రయాణం ఇంకా ముగియలేదు; అది కొత్త అధ్యాయాల కోసం ఎదురుచూస్తోంది.

ఆధార గ్రంథాలు

1. వోల్గా, స్వేచ్ఛ, హైదరాబాద్: విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్
2. వోల్గా (సంపా.), మాకు గోడలు లేవు, హైదరాబాద్: అస్మిత పబ్లికేషన్స్
3. వోల్గా (సంపా.), నీలి మేఘాలు- స్త్రీవాద కవిత్వ సంకలనం, హైదరాబాద్: అస్మిత పబ్లికేషన్స్
4. వోల్గా, విముక్త, హైదరాబాద్: అస్మిత పబ్లికేషన్స్
5. రంగనాయకమ్మ, రామాయణ విశవృక్షం, హైదరాబాద్: స్వప్రచురణ
6. రంగనాయకమ్మ, ఆడదాని ప్రశ్న, హైదరాబాద్: స్వప్రచురణ
7. కేతవరపు కాత్యాయని విద్మహే, ఆధునిక తెలుగు సాహిత్యం- స్త్రీవాద భూమిక, హైదరాబాద్: విశాలాంధ్ర
8. కేతవరపు కాత్యాయని విద్మహే, సాహిత్యాకాశంలో సగం, న్యూ ఢిల్లీ: కేంద్ర సాహిత్య అకాడమీ
9. జయప్రభ, భావ కవిత్వంలో స్త్రీ, హైదరాబాద్: విశాలాంధ్ర పబ్లిషర్స్
10. జయప్రభ, యుద్ధోన్ముఖంగా, హైదరాబాద్: విశాలాంధ్ర
11. కొండేపూడి నిర్మల, నిర్మల కవిత్వం, హైదరాబాద్:। ప్రజాశక్తి పబ్లిషర్స్
12. జూపాక సుభద్ర, ఆకాశం కింద మట్టిపూలు, హైదరాబాద్: దళిత సాహిత్య ప్రచురణలు
13. గోగు శ్యామల, నల్లరేగడి చాళ్లు, హైదరాబాద్: అస్మిత పబ్లికేషన్స్
14. జాజుల గౌరి, మట్టివాసన కవిత్వం, హైదరాబాద్: ప్రజాశక్తి పబ్లిషర్స్
15. కిన్నెర శ్రీదేవి, స్నేహిత -- స్త్రీవాద వ్యాస సంపుటి, హైదరాబాద్: విశాలాంధ్ర.

★★★

Vol. 23 | Spl. Issue 03 | March 2026 | BHAVAVEENA | ISSN No. : 2456-4702 | RNI No. APTEL/2003/12253

RNI No. APTEL/2003/12253 | Reffered Journal & Peer Reviewed Journals | ISSN No. 2456-4702

భావవీణ

కళలు, సాహిత్య, సాంస్కృతిక భాషాధ్యయన పత్రిక

BHAVA VEENA

Journal of Arts, Literary, Culture & Language Study

తెలుగు నవల - స్త్రీ చైతన్యం

- బోణం హేతోన్ గాంధీ

పరిశోధక విద్యార్థి, తెలుగు విభాగం, ఆంధ్ర విశ్వవిద్యాలయం, విశాఖపట్నం.

ఉపోద్ఘాతం :

ఆధునిక సాహిత్య ప్రక్రియలలో ఎక్కువ పాఠక జనాదరణ పొందిన ప్రక్రియ నవల. నవలా సాహిత్యం మొట్టమొదటిసారిగా ఇటలీ దేశంలో ప్రారంభమైంది తెలుగులో నవల అనే పదం ఇంగ్లీషులోని Novel అనే పదము నుండి వచ్చింది ఇంగ్లీషులో Novel అనే పదము Novelle అనే ఇటాలియన్ పదము నుండి వచ్చింది. ప్రముఖ ఇటాలియన్ సాహితీ వేత్త బొకాషియో జివాని క్రీ.శ.1340లో డెకామెరన్ అనే పేరుతో 100 ప్రేమ కథలను ఒక సంపుటంగా రచించారు. దీనికి ఇటాలియన్ భాషలో Novelle అనే పేరు వచ్చింది. అదే ఆంగ్లంలో చీశిజవశ్రీ గా ప్రసిద్ధమయింది. తెలుగులో నవల అనే మాటను తొలిసారిగా ఉపయోగించిన వారు శ్రీ కాశీభట్ల బ్రహ్మయ్య శాస్త్రి గారు ఇతడు 1897లో వివేక చంద్రిక విమర్శనం అనే పీఠికలో నవల అనే పదాన్ని తొలిసారిగా ఉపయోగించారు. "నవాన్ విశేషాన్ లాతీ గృహ్ణాతీత నవలా" అని కొత్త విశేషాలు గలది నవల అని, నిర్వచించారు అయితే నవలను నరహరి గోపాలకృష్ణమ శెట్టిగారు నవీన ప్రబంధమని కందుకూరి వీరేశలింగం గారు వచన ప్రబంధమని పేర్కొనడం జరిగింది.

"దూకే సెలయేరు కథ అయితే గంభీరంగా పారే గోదావరి వంటిది నవల" నవల అనేసరికి వస్తు నిర్దేశంలో ప్రస్తుత జీవన స్రవంతిలో మునిగి తేలుతున్న పాత్రల మయమైనది. అట్టి తెలుగు నవల లో స్త్రీ ప్రాముఖ్యతను తెలియజేస్తూ, స్త్రీ చైతన్యం నవలల ద్వారా ఎలా కలిగిందో తెలుపుటయే మన ప్రస్తుతాంశం. ఇది సాంఘిక చైతన్యం కలిగిస్తూ, సమాజంలోని పాత్రలకు దర్పణం పడుతూ, ఆధునిక మహిళకు ఉదాహరణమవుతూ ఉంటుంది. స్త్రీల సమస్యలను ప్రతిబింబించే నవలలు నాడు వచ్చాయి. నేడు వచ్చాయి. స్త్రీ పాత్ర ఎప్పటికీ బలీయమైనదే. అట్టి స్త్రీ పాత్రను విశ్లేషించడానికి సిద్ధాంత వ్యాసమే అవసరమై ఉన్నది. ఎందుకంటే స్త్రీ మూర్తి ఈ సృష్టిలోనే ఒక విచిత్రమైన పాత్ర. స్త్రీ అంతరంగం కనుగొనడమే ఒక పెద్ద చాలెంజ్. "అనంత రహస్య తరంగాలని తనలో దాచుకున్న గంభీరమైన సముద్రం స్త్రీ హృదయం". అట్టి స్త్రీ మూర్తిని పరిపూర్ణంగా శోధించాలన్న ప్రయత్నం పాత్రలపరంగా నవల నాయక నాయకేతర స్త్రీలను విశ్లేషించడం నవల ద్వారా స్త్రీలలో కలిగే చైతన్యాన్ని విశ్లేషించడం ఈ వ్యాసం యొక్క ప్రధాన ఉద్దేశం.

విషయ ప్రతిపాదన :

తెలుగు సాహిత్యంలో కథావి భాగం చాలా పెద్దది. కథలలో కూడా స్త్రీ ప్రాధాన్యత గల ఆణిముత్యాలు అన్నదగ్గ కథలు కోకొల్లలు. కథగాని, నవల గాని స్త్రీల జీవిత సమస్యల నుడిగుండాల నుండి అనుభవాల మూలాల నుండి ఆవిర్భవించినవే..ఒక్కొక్క స్త్రీ పాత్ర

ఒక్కొక్క రకంగా మలచబడినవి. స్త్రీ తన కోసం పడే ఆరాటం, సమస్యలపై పోరాటం, ఆలోచన, ఆవేదన, అనుభవం, ఇలా ఎన్నో కోణాలలో విశ్లేషింపదగిన మూర్తిగా దర్శనమిస్తుంది. సమస్య -పరిష్కార మార్గం, మనసు-మానసిక సంఘర్షణ, జీవితం -జీవన యానం, ఇలా ఒక్కొక్క భావనకు ఒక్కొక్క ప్రతిరూపంగా అవతరించినవే ఈ స్త్రీ పాత్రలు. తల్లిగా, చెల్లిగా, భార్య గా, ప్రియురాలిగా, కూతురిగా, కోడలిగా, విద్యార్థినిగా, ఉపాధ్యాయునిగా, ఉద్యోగినిగా, కళాకారిణిగా, విధుషీమణిగా ఛాందసురాలిగా, అభ్యుదయ వాదిగా, ఇలా ఎన్నెన్నో పాత్రలు ఏ పాత్ర తీసుకున్నా అందులో వివిధ రసాలు, విభిన్న భావనలు,భౌతిక లక్షణాలుగా గోచరిస్తాయి.

స్వాతంత్ర్యానంతరం స్త్రీ ప్రాముఖ్యత :

స్వాతంత్రానంతరం సుమారు యాభై ఏండ్ల కాలం లోనే కొన్ని వందల నవలలు వచ్చాయి. వాటిని దశల వారి గా విభజించి పరిశీలిస్తే ఒక్కొక్క దశలో వెలువడిన అనేకానేకమైన నవలలో కలకాలం నిలిచిపోయే నవలలు తక్కువనే అభిప్రాయం పలువురి విమర్శకుల్లో గోచరిస్తుంది. నవల మస్తిష్కంలో ఆలోచనలో రేకెత్తించ గలగాలి. అందలి పాత్రలు సమాజాన్ని జాగృతం చేయ గలగాలి. హృదయంలో నిలిచిపోవాలి. ఒకనాడు స్త్రీల కోసం గళం విప్పి కలంసారించిన చలంతో సహా, బుచ్చిబాబు, గోపీచంద్ మొదలగువారు నవలల ద్వారా అందించినంత మనో విశ్లేషణ కు అందగల పాత్రలు తరువాత కాలంలో కొరవడినట్లు పరిశోధకులు విశ్లేషణ. అయినా 1950 -1960 సంవత్సర మధ్యకాలంలో విశ్లేషణాత్మకమైన నవలలు వచ్చాయి. 1960 - 1970 ల మధ్యకాలంలో స్త్రీ రచయితలు బాగా వెలసిన కాలం .స్త్రీ పాత్రలే ప్రధానంగా ఉంటూ రచింపబడ్డ నవలలు ఆ కాలంలోనే వెలువడ్డాయి .1970 - 1980 మధ్యకాలంలో నవల వ్యాపారప్రధానంగా వచ్చి రాజ్యమేలాయి. 1990 తర్వాత స్త్రీవాదం బాగా వేళ్ళూనుకున్న దశలో స్త్రీవాదం ప్రజ్వరిల్లి, స్త్రీ యే ప్రధాన అంశంగా నవలలు అవతరించాయి. వాటిలో మేటివి వనితావనిలో సాటిలేనివి. ఆసాటి లేని వాటిని ఉదహరిస్తూ పరిమిత పాత్రలను కొన్నింటిని ఇందు ప్రస్తావించడమైనది.

ఒక దశలో యద్దనపూడి సులోచనారాణి గారు విశాలాక్షి గారు సరస్వతి దేవి గారు వంటి రచయిత్రులతో పాటు స్త్రీ హృదయం తెలిసినవాడు, స్త్రీ కి స్వేచ్ఛ కావాలని కలలు కన్నవాడు, సృజనశీలి ,చలం వంటి గొప్ప రచయితల తర్వాత స్త్రీ ని గురించి చెప్పిన వారు, వాసిరెడ్డి సీతాదేవి ,ముప్పాళ్ళ రంగనాయకమ్మ ,డి .కామేశ్వరమ్మ మొదలైన వారు స్త్రీల వ్యక్తిత్వానికి మరింత ప్రాధాన్యత నిస్తూ కుటుంబంలో, సమాజంలో జరుగుతున్న అన్యాయాలను, చిత్రీకరిస్తూ, స్త్రీలకు బాసటగా నిలిచి నేటి మహిళను ఫోటో తీసి నవలల్లో అతికించినవారే. అరుణ కుమారి, కుప్పిలి పద్మ, కాత్యాయని వంటి రచయిత్రులు, వీరితో పాటు మరికొందరు రచయితలు మహిళల ఆత్మగౌరవాన్ని కాపాడుతూ స్త్రీ పాత్రకు పట్టం కట్టినవారే.

నానాటికి కథా సంకలనాలు ఎక్కువై నవలలు తగ్గిపోవటానికి గత రెండు దశాబ్దాలలో వచ్చిన వాటిలో మంచివి రాకపోవడానికి కారణాలు ఏమైనా వచ్చిన వారిలో సజీవంగా సాక్షాత్కరించే స్త్రీ పాత్రలు ఉన్నవి .తొలి దశలో మలిదశలో విభిన్న దృక్పథాలతో స్త్రీ పాత్రలు మలచబడినాయి. ఆధునిక స్త్రీ పాత్ర మాత్రం బలీయమైన శక్తిగా ఆవిర్భవించి ఒక ధోరణిగా బలపడిన తర్వాత ఉద్యమ స్థాయిలో బలపరుస్తూ వచ్చిన సాహిత్య ప్రక్రియలో నవలా సాహిత్యం కూడా తన వంతు బలపరిచిందని చెప్పవచ్చు.

కామేశ్వరి నవలల్లో స్త్రీ చైతన్యం :

నేటి స్త్రీ మగాడి చేతిలో కీలుబొమ్మ కాదు. నిండైన ఆత్మగౌరవం కలది. తొనిగిసలాడే ఆత్మవిశ్వాసం కలది. నేటి స్త్రీ ఒకనాటి అభిలాష, వెన్నెలలో ఆడపిల్లలు, వంటి రొమాంటిక్ పాత్రలు ఆధునిక వ్యవస్థలో కనుమరుగై, ఆకాశంలో నగమై ఉద్యమించింది. నేటి స్త్రీ ఒక ఇందిరగా, సంధ్యగా అరుణగా అవతరించి ఒక ఆశయం, ఒక పోరాటం, ఒక సమగ్రమైన స్త్రీ మూర్తిగా, మూర్తీభవించిన వారే వీరంతా... 6000 సంవత్సరాల క్రితం నాటి స్త్రీలు సర్వ స్వతంత్రులు అలా కాలం గడుస్తున్న కొలది స్త్రీ స్వాతంత్రము నాశనమయ్యే స్థితికి వచ్చింది బాలికగాని, యవ్వనవతి గాని, వృద్ధురాలు గాని,

ఆడది ఇంటి యందు స్వతంత్రంగా ఏ కార్యము చేయరాదని శాసనబద్ధమైంది. సమాజంలోని స్త్రీకి దిక్సూచి - జయంతి. ఈమె ఎన్నో శాసనాలను, కట్టుబాట్లను, ఛేదించుకొని ఈ తరం స్త్రీకి ప్రతీకగా నిలిచిన పాత్ర, జయంతి పాత్ర. "మనసున మనసై" అనే నవలలో ప్రధానంగా ఈ పాత్ర చిత్రించబడింది. ఈ నవలను డి.కామేశ్వరి గారు వ్రాశారు. కాలం మారుతుంది .కాలంతో పాటు ఆలోచనలు మారుతున్నాయి. జీవన శైలి పూర్తిగా మారిపోతున్న ఆధునిక యుగానికి ఒక నిర్దిష్టమైన ఆలోచనలతో ఒక విలక్షణమైన వ్యక్తిత్వంతో ఆవిష్కరించ బడ్డ పాత్ర జయంతి పాత్ర. బ్యాంకులో ఉద్యోగిగా ఉంటూ ఎవరేమనుకున్నా తన ఆలోచనలని ఆచరణలో పెట్టగలిగే పాత్ర. నేటి మహిళ జీవితంలో నిశ్చితా నిశ్చితాల మధ్య నలిగే పాత్ర. "మనసునమనసై" అనే నవలలో గల ఇతర పాత్రలు కూడా మారుతున్న సమాజంలో యువతుల మనోభావాలకు ప్రత్యేకంగా చెప్పవచ్చు.

డి కామేశ్వరి గారి మరో నవల "శుభోదయం" అది స్త్రీ జాతికి మహోదయం. ఇందులో మానభంగం జరిగిన స్త్రీ పాత్ర చాలా కీలకం.అయినా ఆమె ఆ బాధను, అవమానాన్ని, దిగమింగి జీవితం నాశనమైందనే బాధను వదులుకొని భవిష్యత్తును చక్కదిద్దుకోవాలనుకునే అభ్యుదయ భావంతో పయనిస్తుంది. గాయానికి మందు వేస్తే ఆ గాయం మానితే దాన్ని ఎలా మర్చిపోతామో అలా మరిచిపోయి గతం మరిచిపోతే గాని భవిష్యత్తు లేదని అనుకునే పాత్ర ఈ స్త్రీ పాత్ర.

కామేశ్వరి గారు సృష్టించిన మరో అద్భుత సృష్టి "కోరికలే గుర్రాలయితే" ఈ నవలలో మధ్యతరగతి స్త్రీలు, కోరికలను అదుపు చేసుకోకపోతే ఎదురయ్యే ప్రమాదా లను సూచిస్తూ హెచ్చరికల అనదగే పాత్రలు సృజింప బడ్డాయి. అరుణ ఆదర్శవంతమైన స్త్రీ. ఎలా ఉండాలో తెలియపరుస్తూ డాక్టర్‌గా పల్లె పల్లెకు వెళ్లి సేవలందించే ఉత్తమ స్త్రీమూర్తి. ఆధునిక కాలంలో ఎందరో యువతులు ప్రేమ పేరిట ఆకర్షణకులోనై మోసగించ బడుతున్నారు. అలాంటి వంచితులను చైతన్యవంతం చేసే ఒక నాయక. కామేశ్వరి గారి "కొత్త మలుపు" అనే నవలలలో ప్రేమించిన వ్యక్తి మోసం చేస్తే కోర్టును ఆశ్రయించి మోసగించిన వ్యక్తికి బుద్ధి తెప్పించి ఒకదారికి తెస్తుంది .ఇలా ఎన్నో స్త్రీ పాత్రలు సమాజంలోని స్త్రీ చుట్టూ తిరిగి స్త్రీలలో మనోధైర్యాన్ని శక్తిని ఆత్మస్థైర్యాన్ని ధైర్యాన్ని పెంపొందింప చేసి వారికి వారే స్వతంత్రులుగా ఉండటానికి దోహదపడుతున్నాయి..

వాసిరెడ్డి సీతాదేవి గారి "మరీచిక". "మట్టి మనిషి" "సమత". "వైతరణి" మొదలైన నవల్లో సృజింపబడ్డ స్త్రీ పాత్రలు అణిచివేయబడ్డ స్త్రీమూర్తులకు దర్పణాలుగా నిలిచినవి. సీతాదేవి రూపొందించిన మహోన్నతమైన పాత్ర "మట్టి మనిషి" లోని వరూధుని పాత్ర... మట్టిని మసి బొగ్గుగా చూసి మట్టి నుండి సమకూరిన ఐశ్వర్యాన్ని నిర్లక్ష్యం చేసి మట్టి మనిషి కష్టార్జితాన్ని తృణప్రాయంగా చూసి సంపాదనంతా మంచినీళ్లలా ఖర్చు చేసి చివరికి పతనమైన స్త్రీ వరూధిని. నైతికంగా, సామాజికంగా, ఆర్థికంగా, పతనమైంది. పతనావస్థలో చివరకు దిక్కులేని స్థితిలో మరణిస్తుంది. మట్టిని, మనిషిని, హీనంగా చూసి జీవితంలో దెబ్బతినే పాత్ర ఇది. పరాజయాలకు పతన మైన ఇలాంటి ఎందరో ఆధునిక మహిళల భావాలకు ప్రత్యేకంగా నిలిచిన పాత్ర. ఇలా వాసిరెడ్డి సీతాదేవి గారి స్త్రీ పాత్రలు సమాజానికి చైతన్య పధం లో నడిపించాయి. సీతాదేవి గారి "సమత" నవలలో అరుంధతి పాత్ర పెట్టు బడీదారి వ్యవస్థలో స్త్రీ ఎలా బానిసగా మారి పోతుందో, అలాంటి సామాజిక వ్యవస్థలో అణగారిని స్త్రీ ఎలా ఆత్మ గౌరవంతో బ్రతుకుతుందో, మన కళ్ళకు కట్టినట్లు కనిపించే పాత్ర. పితృస్వామ్య వ్యవస్థ కూడా స్త్రీని అవమానించినదే అంటూ ఈ వ్యవస్థలో స్త్రీ ఎలా అడుగడుగునా అవమానాలు పాలవుతుందో "ఉరితాడు" అనే నవలలో కరుణ పాత్ర ద్వారా తెలియజేసింది. పెట్టుబడిదారీ వ్యవస్థలో స్త్రీలు ఎలా అణిచివేయ బడుతున్నారు "మరీచిక" అనే నవలలో కళ్ళకు కట్టినట్లు కనిపిస్తాయి అణిచివేయబడ్డ స్త్రీలలో చైతన్యం ఎలా కలుగుతుంది? పిల్లి, పులిలా ఎలా విజృంభించింది? దానికి గల కారణాలు ఏమిటి ? దానికి గల ప్రేరణ

ఏమిటి? అనే విషయాలు నేటి నవలల్లో మనకు దర్శనమిస్తున్నాయి.

సమాజ గతిని మార్చే "వేకువ పూలు" :

నవలా సాహిత్యానికి చీకటి తెరలు ముసురుకుంటున్న తరుణంలో వేగుచుక్కలు పొడిచిన నవల జతిన్ కుమార్ గారి "వేకువ పూలు" స్త్రీ పురుష సంబంధాల గూర్చి సామాజిక పరివర్తనా క్రమంలో మారుతున్న యువత గూర్చి చక్కగా చిత్రించిన నవల ఇది. ఇందలి ప్రధాన పాత్రలు సమత, మరియు ఝాన్సీలు. సామాజిక ఆర్థిక రాజకీయపరమైన సమస్యలపై సమరభేరి మోగించి జీవితంలోని ఆటుపోట్లపై పోరాటం సాగించే పాత్ర సమతది. సమాజం సానుభూతిని పొందినది. సమాజ మద్దతును అందుకున్నది. సామాజిక చైతన్యం కలిగించేది సమత... సాధారణంగా విద్యార్థి దశ అంటే కలలాలపై సాగే నౌకాయానం ఆ దశలో ఆదర్శ భావాల పట్ల ఆకర్షణ ఎక్కువగా ఉంటుంది. విద్యార్థిదశలో ఉద్యమాల దిశగా పయనించాలని ఉంటుంది. కానీ నిజ జీవితానికి వచ్చే సరికి జీవిత సంఘర్షణల మధ్య ఆటుపోట్లకు తట్టుకోలేక గత ఆదర్శ భావాలు ఆవిరి అయిపోతాయి. జీవితంలో నిలుదెక్కుకోవడానికి కొత్త మార్గాల వైపు పయనించ వలసి వస్తుంది. అపమార్గాలలో సైతం జీవితం సాగుతుంది. కానీ సమత మాత్రం విద్యార్థి దశలో ఏ ఆశయం ,ఏ లక్ష్యంతో, ఉండేదో తర్వాత కూడా ఆయా ఆదర్శాలకు కట్టుబడి ఆశయాలకు ఊపిరి పోసి సమస్యలకి ఎదురు నిలిచి రాజీపడకుండా పోరాటం చేసింది. ప్రతి మనిషికి స్వప్రయోజనాలే కాదు, సామాజిక బాధ్యత కూడా ఉండాలంటూ ప్రబోధించే పాత్ర సమత పాత్ర. కష్టమైనా నష్టమైనా, మానవతా విలువలను కాపాడాలని, బలమైన వ్యక్తిత్వం కలిగిన పాత్రలో సమత అనే పాత్ర చాలా చక్కగా తీర్చిదిద్దబడింది. ఆమెతోపాటు మరో పాత్ర ఝాన్సీ ఆధునిక భావాలు కలది. తన మనసుకు తృప్తిని కలిగించే ఏ చిన్న అనుభూతికైనా స్పందించి ఆ తృప్తిని జీవితాంతం నిలుపుకోవడానికి సమాజాన్ని సైతం ఎదిరించి నిలువగలిగిన విలక్షణమైన వ్యక్తి ఝాన్సీ .ఇలా సమాజంలో మనకు తారసపడే ఎన్నో పాత్రల సమాహారం. ఈ వేకువ పూలు ...

దళిత వాదంలో స్త్రీ అభ్యుదయం :

దళిత వాదం ప్రభలిన తర్వాత కూడా దళిత స్త్రీల గూర్చి అణగారినన దళిత స్త్రీ మూర్తుల పాత్రలు నవలల్లో సాక్షాత్కరిస్తున్నాయి. వేములపల్లి ఎల్లయ్య గారి ప్రముఖ నవల "కక్క"లో కక్కడి అయ్యమ్మ పాత్ర మాదిగోల మునలమ్మని చక్కగా చూపించే పాత్ర. దళితుల అజ్ఞానాన్ని, అమాయకత్వాన్ని, ఆసరాగా తీసుకొని సమాజంలో వికృతి రూపంగా తయారయ్యే జోగిని వ్యవస్థను కూడా నవలలో చిత్రించారు .మహత్తర నవల "ఎల్లి" ఎల్లి ఎరుకల కులానికి చెందిన స్త్రీల జీవితాల్లోని కడగండ్లను కన్నీళ్లను ప్రతీకగా నిలిచిన పాత్ర. ఎల్లి రచయిత్రి అరుణ గారిచే రూపుదిద్దుకుంది. ఎల్లి తోపాటు నీలి, మాలచ్చిమి, వంటి పాత్రలు కూడా జీవితానుభవాలకు ఉదాహరణలుగా నిలిచిపోయే యానాదుల జీవితాలను ప్రతిబింబిస్తున్న యానాదుల స్త్రీ పాత్రలు ఎన్నో గోచరిస్తాయి. చాతుర్వర్ణ వ్యవస్థలో దళితులపై సాగే దాడులు గాని దాని చారిత్రక నేపథ్యంలో మాదిగల జీవితాలను, దళిత స్త్రీలపై జరిగే అన్యాయాలను కళ్ళకు కట్టినట్లు చూపించే కళ్యాణ రావు గారి "అంటరాని వసంతం".. చిలుకూరి దేవపుత్ర గారు రాసిన "అద్దంలో చందమామ" నవల విశేష ప్రజాదరణ పొందిందాయి. చిన్నోడి తల్లి పాత్ర సీతక్కలు చీకటి కోణాల్లో మగ్గిపోయే సజీవ శిల్పాలుగా కనిపిస్తారు మరో దళిత స్త్రీగా కనిపించే పాత్ర సారాజ్జెం అనగా స్వరాజ్యం. అక్షర జ్ఞానం లేక పశుతుల్యమైన జీవితానికి నిదర్శనమైన పాత్ర. అక్కినేని కుటుంబరావు గారి స్వరాజ్యం., జీవిత చదరంగంలో ఎన్ని కష్టాలు ఉన్నవో, ఎన్ని మలుపులు ఉన్నవో, చూపించే పాత్ర ఇది. నేడు దళితవాద సాహిత్యంలో కథలు, కవితలు ఎక్కువగా వస్తూ ,నవలలు తగ్గిపోయాయి, చెప్పుకోదగిన స్థాయిలో ప్రఖ్యాతి పొందిన నవలల్లో నాయకులు ఇతర స్త్రీ పాత్రలు చీకటి జీవితాలు వెలుగు కోసం పడే ఆరాట పోరాటాలు మనకు కని పిస్తాయి.

పురుషాధిక్యత పై స్త్రీ తిరుగుబాటు :

డాక్టర్ శ్రీదేవి గారి "కాలాతీత వ్యక్తులు" నవలలోని

స్త్రీ పాత్రలు మహిళల ఆత్మగౌరవాన్ని ప్రబోధించేవి. ఉద్యోగుల సమస్యలను ఆవిష్కరించేవి .మల్లాది సుబ్బమ్మ గారి "వంశాంకురం" నవల లోని పాత్రలు కూడా స్త్రీ జీవిత సమస్యలను ప్రధానంగా చూపించారు. పురుషాధిక్యత నుండి స్త్రీ విమోచనకు కృషిచేసి, ప్రభంజనంలా విరుచుకుపడి, కలంతో పోరాడిన ముప్పాళ్ళ రంగనాయకమ్మ గారి" జానకి విముక్తి " నవల అందించిన పోరాటపటిమతో స్ఫూర్తిని పొంది రంగ నాయకమ్మ వారసత్వాన్ని పుణికి పుచ్చుకొని స్త్రీ వాదాన్ని ముందుకు నడిపిస్తూ మహిళలకు బాసటగా నిలుస్తూ, ఉద్యమాలు నడిపించే నవల నాయకుల సృష్టించే ఆధునిక రచయిత ఓల్గా గారు. ఆధునిక స్త్రీ యొక్క శక్తి ఏమిటో చూపించే పాత్రను తీర్చిదిద్దారు.తొలి తెలుగు స్త్రీవాద నవలగా ఓల్గా గారి "స్వేచ్ఛ" అత్యంత ప్రజాదరణ పొందింది.సహజ, స్వేచ్ఛ, కన్నీటి కెరటాల వెల్లువ, మానవి, ఆకాశంలో సగం, వంటి నవలల్లో స్త్రీ స్వేచ్ఛ ఆత్మగౌరవాల కోసం పోరాడి తమ జీవితాలను సుఖమయం చేసుకున్న పాత్రలవి. స్వేచ్ఛ నవలా నాయక అరుణ, సంప్రదాయక మధ్యతరగతి కుటుంబాలలోని ఆడపిల్లలు పడే ఇబ్బం దులను తెలియజేస్తూ, ఆర్థికంగా ఒకరిపై ఆధారపడి ఉండరాదని మనస్తత్వం కలది. ప్రేమంటే శారీరకమైనది మాత్రమే కాదు మానసికమైనది అని వివరిస్తూ, స్త్రీ తాను పడే కష్టాలను కూడా ఇష్టాలుగా మార్చుకునేదే ప్రేమ. అని చాటి చెప్పే పాత్ర అరుణది .స్త్రీ స్వేచ్ఛ కోసం అనుక్షణం పరితపిస్తూ పత్రికలో జర్నలిస్టుగా పనిచేస్తుంది. తన పాత్ర ద్వారా మెహెందదీ స్త్రీల జీవితాన్ని పరిశీలించి వారి చీకటి జీవితాన్ని పరిశోధిస్తూ వారి జీవితం చీకటి కాకూడదని పత్రికల్లోకెక్కించాలని సాహసించే ధైర్యంగల స్త్రీ మూర్తి అరుణ. ఇలాప్రతి స్త్రీ పాత్ర సృజనాత్మక శక్తికి సామాజిక చైతన్యానికి ప్రతిబింబమే...

ముగింపు :

ఒకప్పటి ఆడది అంటే వంట ఇంటికి మాత్రమే పరిమితమని పురుషుడు ఆమె పై పెత్తనం చెలాయించే పెత్తందారనే భావం ఉండేది వారి ప్రవర్తనలు అలానే ఉండేవి. కానీ కాలం మారింది కాలంతోపాటు వైఖరులు మారుతున్నాయి. ఇంటి పనిని స్త్రీ పురుషులు ఇరువురు చూసుకోవాల్సిన అవసరం వచ్చింది. ఇద్దరిపై సమానమైన బరువు బాధ్యతలు ఉన్నవని గ్రహింపవలసి వచ్చింది. అట్టి భావనల్లో విప్లవాత్మకమైన ఆలోచన కలిగిన సంధ్య పాత్ర గీతాంజలి గారి" ఆమె అడవిని జయించింది "నవలలోని పాత్ర పేద మహిళల కోసం క్లినిక్ ప్రారంభించి మహిళా విమోచన సంస్థల తో సంబంధాలు ఏర్పరచుకునే స్త్రీ సమస్యల పరిష్కారం కోసం పాటుపడుతూ శాశ్వతంగా పోరాడుతుంది. కుప్పిలి పద్మ గారి "అహల్య" నవలలో అవధులు లేని స్వేచ్ఛను అనుభవిస్తూ పరిపూర్ణమైన జీవితం గడిపేందుకు పెళ్లి ఆటంకమని భావిస్తుంది స్వేచ్ఛ కోసం తపించే పాత్రది సంసారంలో ప్రధాన పాత్ర. శ్రీమతి ...సంసారాన్ని చక్కగా నిలబెట్టుకోవాలన్న విచ్ఛిన్నం చేసుకోవాలన్న స్త్రీయే కారణం సంసారం సరిదిద్దు కోవడానికి కూడా స్త్రీ కొన్ని చిట్కాలు అవసరమైన గ్రహిం చిన కామేశ్వరి గారు నిర్మల పాత్రను సృష్టించి జీవితం చేశారని అనే నవలలు పెళ్లంటే ఒక సర్దుబాటు అంటూ సున్నితంగా మందలింపుగా నిర్మల పాత్ర ద్వారా జీవితాన్ని చక్కదిద్దే ప్రయత్నం చేశారు. ఈ రకమైన పాత్ర సమాజానికి ఎంతో అవసరం కొడవటికంటి కుటుంబరావు గారి అనుభవం నవలలు పార్వతి బ్రాహ్మణ స్త్రీ అయి నప్పటికీ సంప్రదాయ ఆచారాలకు ఎదురు నిలబడి స్త్రీకి శిరోముండనం అవసరం లేదంటూ ఎదుర్కొంటుంది. కొడవటిగంటి వారి చదువు అనే నవలలో బిడ్డల అక్షరాస్యత కోసం పరితపించే మాతృమూర్తిగా సీతమ్మ "ప్రేమరాహిత్యం" నవలలో సుగుణ పాత్ర ఆధునిక స్త్రీకి ప్రతీక ఇలా ఎందరో నవలా నాయకులు ఉప పాత్రలు మనకు దర్శనమిచ్చాయి ఇటీవల సస్పెన్షన్ నవలల్లో" మచ్చలేని జాబిలి" అనే నవల లో నాయక కంప్యూటర్ యుగానికి చెందిన మోడ్రన్ మహిళగా అందు చక్కని సమస్యను వేధిస్తుంది అలాగే అపరాధ పరిశోధకు నవలల్లో కూడా స్త్రీ పాత్రలు లేడీ డిటెక్టివ్ గా పోలీస్ ఆఫీసర్ గా చిత్రించబడుతున్నాయి శృంగారం పేరిట నవలల్లో స్త్రీని విలాస వస్తువుగా చిత్రించేవి కూడా

ఉన్నాయి ఇట్టి పాత్రలు సమాజానికి హానికరమైనవి. యువతలో నైతికపతనానికి దారి చూపే ప్రమాదకరమైన పాత్ర పోషిస్తుంది. స్త్రీ పాత్ర సమాజంలో స్త్రీలకు ఆదర్శంగానే ఉండాలి అభ్యుదయవాదులుగా ఉండాలి. అట్టిబలమైన పాత్రలు సృష్టించగలిగినప్పుడు మాత్రమే ఆ నవల సజీవంగా పది కాలాలపాటు నిలుస్తుంది.

ఆధార గ్రంధాలు :

1. తెలుగు సాహిత్య విమర్శ - సిద్ధాంతాలు : - శ్రీ వెలమల సిమ్మన్న
2. తెలుగు నవలల్లో సామాజిక చైతన్యం :- శ్రీమతి పి.సంజీవమ్మ
3. తెలుగు నవలానుశీలనము :- శ్రీమతి ముదిగంటి సుజాతా రెడ్డి
4. ఆంధ్ర నవలా పరిణామము :- శ్రీ బొడ్డపాటి వెంకట కుటుంబ రావు.
5. తెలుగు నవలా సాహిత్యంలో మనో విశ్లేషణ :- శ్రీ కోడూరి శ్రీరామమూర్తి

★★★

Vol. 23 | Spl. Issue 03 | March 2026 | BHAVAVEENA | ISSN No. : 2456-4702 | RNI No. APTEL/2003/12253

RNI No. APTEL/2003/12253 | Reffered Journal & Peer Reviewed Journals | ISSN No. 2456-4702

భావవీణ

కళలు, సాహిత్య, సాంస్కృతిక భాషాధ్యయన పత్రిక

BHAVA VEENA

Journal of Arts, Literary, Culture & Language Study

కన్యాశుల్కం నాటకం - స్త్రీల పాత్ర చిత్రణ - సామాజిక చైతన్యం

- కంకల మహేశ్వరి

పరిశోధక విద్యార్థిని, స్నాతకోత్తర కేంద్రం, గద్వాల, మహబూబ్ నగర్ జిల్లా.

వ్యాస సంగ్రహం :

శతాబ్దాల చరిత్ర కలిగిన తెలుగు సాహిత్యంలో మహిళా చైతన్యం రచనల్లో చూపకుండా ఏ సాహిత్య ప్రక్రియ కొనసాగలేదు. పద్యం, గద్యం, వచనలతో పాటు ఆధునిక సాహిత్య ప్రక్రియలైన కథ, నవల, నాటకం మొదలైన అనేక ప్రక్రియలు ప్రధానంగా వస్తువుగానో, ఉపవస్తువుగానో మహిళ చైతన్యాలను సృష్టించినవే. స్త్రీల గురించి పాఠకులకు పరిచయం చేస్తూ తమ సామాజిక బాధ్యతను అద్భుతంగా నెరవేర్చిన కొందరు రచయితలు స్త్రీల విశిష్టతను, స్త్రీల జీవితాలను వస్తువుగా చిత్రీకరించి ఎన్నో నవలలు రాశారు. అందులో కాత్యాయినీ విద్మహే రాసిన "సంప్రదాయ సాహిత్యంలో స్త్రీలు", కందుకూరి వీరేశలింగం 1883లో స్త్రీల కొరకు "సతిహిత బోధిని". కవిత్వంలో ముఖ్యంగా ముత్యాల సరాలు, పుత్తడిబొమ్మ పూర్ణమ్మ, కన్యకా వంటి అన్నింటిలో స్త్రీ పాత్ర చైతన్యం ప్రస్ఫుటంగా కనిపిస్తుంది. కన్యాశుల్కం నాటకం ఎంతో ప్రజాధారణ పొందినది. ఈ వ్యాసంలో స్త్రీల యొక్క విశిష్టతను తెలియజేయడమే ప్రధాన ఉద్దేశం.

కీలక పదాలు : స్త్రీ విద్య ప్రాధాన్యత, మధురవాణి పాత్ర, కన్యాశుల్క నిర్మూలన, సామాజిక చైతన్యం.

స్త్రీ విద్య ప్రాధాన్యత :

నాటకంలో స్త్రీలకు చదువు చాలా అవసరం అని నిజంగా ఒక స్త్రీ చదువుకుంటే వాళ్లలో ఆత్మవిశ్వాసం ఎలా ఉంటుందో చూపిస్తుంది. ఇంట్లో ఒక స్త్రీ చదవడం వల్ల సమాజం మారిపోతుంది. గురజాడ గారు తమ రచనల్లో "స్త్రీలు చదువుకోవాలి, సమాజంలో స్త్రీలు సమాన హక్కులు పొందాలి" అని బలంగా చెప్పటం జరిగింది.

మధురవాణి పాత్ర :

ఈ నాటకంలో కన్యాశుల్కం తొలి, మలి ప్రతుల్లో పాత్రల స్వభావాల్లో వచ్చిన మార్పుల్ని సహజంగా చూడవచ్చు. నిజంగా ఈ నాటకంలో మధురవాణి పాత్ర వినగానే అందరూ ఏదేదో ఊహించుకుంటారు ఎందుకంటే ఈ నాటకంలో ఆమె పాత్ర ఒక వేశ్యగా ఉంటుంది కాబట్టి. వేశ్యలు రెండు రకాలు అవి 1) గణికలు 2) భూలోక వేశ్యలు

గణికలు :

64 కళలలో ప్రావీణ్యం సంపాదించిన స్త్రీలను గణికలు అని పిలిచేవారు. వీరు కేవలం అందం మీదనే కాకుండా తమ పాండిత్యం మరియు తెలివితేటలతో సమాజంలో ప్రత్యేక గౌరవాన్ని పొందేవారు. రాజ దర్బార్లలో, గొప్ప కవుల సభల్లో ఉండేవారు. గణికలు అంటే సాహిత్య పరంగా కళాకారిణి మరియు విదూషిమాని అర్థం.

భూలోక వేశ్యలు :

మానవ స్త్రీలు, జీవనోపాధి కోసం ఆవృత్తిని ఎంచు కుంటారు.

"మధురవాణి పాత్ర ఒక పరిశీలన-ఒక పరిశోధన పేరుతో" వ్యాసాన్ని పునఃపరిశీలన, పునఃపరిశోధన పేరుతో ఇంకొక వ్యాసాన్ని ప్రత్యేకించి మధురవాణి పాత్ర ఔచిత్యాని చెప్పడమే ప్రధాన విషయం అని ఆరుద్ర గారు పేర్కొన్నారు. మొదటి (తొలి) కన్యాశుల్కంలో మధురవాణి ఉన్న ఆ పాత్రలో జీవం లేదు. ఆమె వేష శిఖామణి కాదు. మొదటి మధురవాణి పట్ల రచయితకే సద్భావం లేదు. మొదటి మధురవాణి పాత్ర సజీవంగా లేకపోవటానికి, అప్పటికి సమాజంలో వేశ్య సమస్య పెద్దగా లేకపోవటమే.

ఈ నాటకంలో అత్యంత తెలివైన, స్వతంత్ర భావాలు కలిగిన పాత్ర. వృత్తి రీత్యా వేశ్య అయినప్పటికీ నీతి, నిజాయితీ, సమయస్ఫూర్తిని ప్రదర్శిస్తుంది. గిరీశం మోసాలను గ్రహించి, అగ్నిహోత్రవధానులు కుటుంబానికి సహాయం చేస్తుంది. స్త్రీలకు అక్షరాస్యత, వ్యక్తిత్వం ఎంత అవసరమో ఆమె పాత్ర ద్వారా గురజాడ చూపించడం విశేషం.

బుచ్చమ్మ :

అగ్నిహోత్రవధానులు కుమార్తె. బాల్యవివాహాల వల్ల నష్టపోతున్న బాలికలకు ప్రతీక. అమాయకత్వం, భయం ఆమె పాత్రలో కనిపిస్తాయి. సమాజంలోనే దురాచారాలకు చిన్నపిల్లలు ఎలా బలవుతున్నారు చూపించడానికి ఈ పాత్ర ఉపయోగపడింది.

మీనాక్షి :

అగ్నిహోత్రవధానులు భార్య. ఇంట్లో పట్టుదల కలిగిన స్త్రీ పాత్ర. భర్త నిర్ణయాలను నిలదీయకపోయినా, తనదైన రీతిలో ఇంటి వ్యవహారాలను నడుపుతుంది.

కరుణామయి :

సమాజంలోని దురాచారాలను చూసి చలించిపోయే, దయాగుణం కలిగిన పాత్ర.

మొత్తంగా కన్యాశుల్కంలోని స్త్రీ పాత్రలో కేవలం బోగ వస్తువులు కావని, వారు సమాజంలో గౌరవప్రదమైన స్థానం పొందాలని, చదువుకోవాలని, నిర్ణయాలు తీసుకునే శక్తిని కలిగి ఉండాలని గురజాడ ఈ నాటకం ద్వారా నిరూపించారు.

కన్యాశుల్కం నిర్మూలన :

కన్యాశుల్కం నిర్మూలనకు 19వ శతాబ్దం లేదా 20వ శతాబ్దం మొదట్లో సంఘసంస్కర్తలు, సామాజిక చైతన్యం ప్రధాన పాత్ర పోషించాయి.

ఆరుద్ర పేర్కొన్నట్లు 'బ్రహ్మ వివాహం' ప్రభావం గురజాడ మీద ఉన్నప్పటికీ, కందుకూరి వారు ' బ్రహ్మ వివాహాన్ని' వినోదం కోసమే కాకుండా వృద్ధ వివాహం, కన్యాశుల్కం దురాచారాల నుండి ప్రజల్ని విముక్తి క్తుల్ని చేయాలనే తలంపుతో రాయడం విశేషం. ఇక్కడ వినోదం ప్రధాన ఆశయంగాను, దురాచార నిర్మూలన ద్వితీయ ప్రాధాన్యత లోను కనిపిస్తుంది. కానీ ప్రధాన ఆశయంగా దురాచార నిర్మూలన మరియు వినోదం ద్వితీయ ప్రాధాన్యంగా గురజాడ వారు ఆశించటం ఇందులోని గమనించవలసిన అంశం.

సామాజిక చైతన్యం :

తెలుగు సమాజంలో స్థిరపడిన "డామిట్ కథ అడ్డం తిరిగింది", "తాంబూలాలు ఇచ్చేశాను ఇక తన్నుకు చావండి"వంటే చాలా వాక్యాలు ఈ నాటకంలోనివే. ఈ నాటకంలోని గిరీశం, మధురవాణి, లుబ్ధవదానులు, అగ్నిహోత్రవధానులు, రామప్ప పంతులు పాత్రలు చాలా ప్రసిద్ధి పొందాయి.

దురాచారాలపై పోరాటం:-ముఖ్యంగా బ్రాహ్మణ కుటుంబాలలో ఉన్న పిల్లలను అమ్ముకోవడం, బాల్య వివాహాలు వంటి దురాచారాలను ఈ నాటకంలో చిత్రీక రించబడింది.

భాషా విప్లవం :

గ్రాంధిక భాషలో ఉన్న సాహిత్యాన్ని సామాన్యులకు అర్థమయ్యే వాడుక భాష ,యాసలోకి మార్చి సాహిత్య అనే ప్రజలకు అర్థమయ్యే విధంగా చెప్పడం విశేషం.

స్త్రీ చైతన్యం :

వితంతువుల దుర్భర స్థితిని, స్త్రీలపై జరుగుతున్న అన్యాయాలను కళ్లకు కట్టినట్లు చూపడం్వారా

సమాజంలో వితంతు పునర్వివాహాల పట్ల సానుకూలత పెరిగేలా చేయటం ఎంతో విశిష్టమైనది.

స్త్రీల పైన నాటకంలో వాడిన సామెతలు :

"ఆడదాని బుద్ధి అపర బుద్ధి" :

తరచుగా స్త్రీలలో తక్కువ చేసి మాట్లాడటానికి ఉపయోగిస్తారు. అంటే స్త్రీలు ఆలోచించే విధానం సరిగ్గా ఉండదని లేదా ఆలస్యంగా వెలుగుతుందని నాటి పురుషాధిక్య ధోరణిని ఇది సూచిస్తుంది.

"ముండమోపికి ముడుపు కట్టినట్లు" :

విధవల పరిస్థితిని ఉద్దేశించి మాట్లాడేటప్పుడు ఇలాంటి కఠినమైన సామెతలు వాడటం విశేషం. బాల్యవివాహాల వల్ల ఏర్పడిన వితంతువుల దుస్థితిని ఇది ప్రతిబింబిస్తుంది.

"లంకలో పుట్టిన వాళ్ళందరూ రాక్షసులే" :

వేశ్యవృత్తిలో ఉన్న వారిని లేదా ఒక నిర్దిష్ట సమూహం లోని స్త్రీలందరినీ ఒకే విధంగా అనే కలిపి అనేటప్పుడు వాడడం జరిగింది.

ఉదాహరణలు :

స్త్రీల చైతన్యం కోసం నవలలు, కథలు, కవితలు, నాటకాలే కాకుండా ఎన్నో సినిమాలు ప్రజాధారణ పొందాయి. అవి

ప్రతిఘటన (1985)

కర్తవ్యం (1990)

ఒసేయ్ రాములమ్మ (1997)

అంతఃపురం(1998)

మహానటి (2014)

మిస్ ఇండియా (2020)

యశోద (2022)

మయూరి

ముగింపు :

కన్యాశుల్కం నాటకం ఎంతో ప్రజాధారణ పొందిన నాటకం. గురజాడ అప్పారావు గారు నిజంగా మనుషులు ఏ విధంగా ఉండాలో చిత్రీకరించారు. "దేశమంటే మట్టి కాదోయ్ - దేశమంటే మనుషులు" అని నిజంగా నిరూపించుకున్నారు. ఈ నాటకం యువతకు ఒక గొప్ప ఆదర్శవంతమైన నాటకంగా రూపుదిద్దుకుంది.

ఉపయుక్త గ్రంథ సూచి :

1) అప్పారావు. గురజాడ, కన్యాశుల్కం నాటకం. విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్, మొదటి కూర్పు : 1897, రెండవ కూర్పు : 1892.

2) ఆరుద్ర, గురజాడ గురుపీఠం, విజయవాడ నవోదయ పబ్లిషర్స్ 1985.

★★★

Vol. 23 | Spl. Issue 03 | March 2026 | BHAVAVEENA | ISSN No. : 2456-4702 | RNI No. APTEL/2003/12253

RNI No. APTEL/2003/12253 | Reffered Journal & Peer Reviewed Journals | ISSN No. 2456-4702

భావవీణ

కళలు, సాహిత్య, సాంస్కృతిక భాషాధ్యయన పత్రిక

BHAVA VEENA

Journal of Arts, Literary, Culture & Language Study

క్రైస్తవ సాహిత్యం - మహిళా చైతన్యం

- డా॥. ఆర్. లీగన్

తెలుగు ఉపాధ్యాయులు, బి.వి.రెడ్డి సీనియర్ సెకండరీ స్కూల్, చిత్తూరు, ఆం.ప్ర.

పరిచయం

తెలుగు సాహిత్యం అనేక శతాబ్దాలుగా అభివృద్ధి చెందుతూ విభిన్న సాహిత్య ప్రక్రియలను కలిగి ఉంది. తెలుగు ప్రజల జీవన విధానం, సంస్కృతి, ఆచారాలు, మత విశ్వాసాలు, సామాజిక పరిస్థితులు వంటి అంశాలు తెలుగు సాహిత్యంలో ప్రతిబింబిస్తాయి. ప్రాచీన కాలంలో నన్నయ్య, తిక్కన, ఎఱ్ఱన వంటి కవులు తెలుగు సాహిత్యాన్ని అభివృద్ధి చేశారు. తరువాతి కాలంలో భక్తి సాహిత్యం విస్తృతంగా అభివృద్ధి చెందింది. అన్నమయ్య, త్యాగరాజు, రామదాసు వంటి భక్త కవులు దేవునిపై విశ్వాసాన్ని కీర్తనల రూపంలో వ్యక్తపరిచారు.

ఆధునిక కాలంలో తెలుగు సాహిత్యం మరింత విస్తరించి కొత్త ధారలను సృష్టించింది. సామాజిక సాహిత్యం, దళిత సాహిత్యం, మహిళా సాహిత్యం వంటి విభిన్న ధారలతో పాటు క్రైస్తవ సాహిత్యం కూడా ఒక ప్రత్యేక ధారగా అభివృద్ధి చెందింది.

తెలుగులో క్రైస్తవ సాహిత్యం - పుట్టుక

క్రైస్తవ సాహిత్యం తెలుగు భాషలో అభివృద్ధి చెందడానికి ప్రధాన కారణం క్రైస్తవ మిషనరీల సేవ. యూరప్ దేశాల నుండి వచ్చిన మిషనరీలు బైబిల్ సందేశాన్ని భారతదేశ ప్రజలకు తెలియజేయడానికి స్థానిక భాషలను ఉపయోగించారు. ఈ నేపథ్యంలో బైబిల్ గ్రంథాలను తెలుగులోకి అనువదించడం ప్రారంభమైంది. బైబిల్ అనువాదం ద్వారా క్రైస్తవ బోధనలు ప్రజలకు సులభంగా అర్థమయ్యాయి. ఈ ప్రక్రియలో అనేక ప్రార్థనా గీతాలు, కీర్తనలు, భక్తి గేయాలు రచించబడ్డాయి. ఇవే తరువాత తెలుగు క్రైస్తవ సాహిత్యానికి పునాది అయ్యాయి.

క్రైస్తవ సాహిత్యం -వికాసం

కాలక్రమేణా తెలుగులో క్రైస్తవ సాహిత్యం విస్తృతంగా అభివృద్ధి చెందింది. ఈ సాహిత్యం ప్రధానంగా మూడు రూపాలలో కనిపిస్తుంది.

1. కీర్తనలు మరియు భక్తి గేయాలు
2. బైబిల్ అనువాదాలు మరియు వ్యాఖ్యానాలు
3. కవిత్వం మరియు గద్యరచనలు

చర్చిలలో పాడే కీర్తనలు ప్రజల్లో భక్తి భావాన్ని పెంపొందించాయి. ఈ కీర్తనల ద్వారా దేవునిపై విశ్వాసం, ప్రేమ, సేవ వంటి విలువలు ప్రజలకు తెలియజేయబడ్డాయి.

తెలుగు క్రైస్తవ కీర్తనల సంప్రదాయం

తెలుగు క్రైస్తవ సాహిత్యంలో కీర్తనలు అత్యంత ముఖ్యమైన భాగం. ఈ కీర్తనలు సంగీతంతో పాడబడుతూ ప్రజల్లో ఆధ్యాత్మిక భావాన్ని పెంపొందించాయి. కీర్తనలలో యేసు క్రీస్తు ప్రేమ, దేవుని కృప, పాప విమోచనం, ప్రార్థన వంటి అంశాలు ప్రధానంగా కనిపిస్తాయి.

క్రైస్తవ కీర్తనల సంప్రదాయం ద్వారా క్రైస్తవ సాహిత్యం ప్రజల్లో విస్తృతంగా ప్రాచుర్యం పొందింది. సులభమైన భాషలో రచించబడిన ఈ గేయాలు సాధారణ ప్రజలకు కూడా సులభంగా అర్థమయ్యాయి.

క్రైస్తవ సాహిత్యం - కవయిత్రుల పాత్ర

తెలుగు క్రైస్తవ సాహిత్య అభివృద్ధిలో మహిళా కవయిత్రుల పాత్ర ఎంతో ముఖ్యమైనది. భక్తి సాహిత్యం సాధారణంగా పురుష కవుల రచనలతో ఎక్కువగా కనిపించినప్పటికీ, క్రైస్తవ సాహిత్యంలో మహిళలు కూడా విశిష్టమైన సేవ చేశారు. మహిళా కవయిత్రులు తమ భక్తి అనుభూతులను, విశ్వాసాన్ని మరియు ఆధ్యాత్మిక భావాలను కీర్తనల రూపంలో వ్యక్తపరిచారు.

ఫిలిప్ బి. జ్ఞానరత్నమ్మ (1890-1960)

తెలుగు క్రైస్తవ సాహిత్యంలో మహిళా కవయిత్రులలో ప్రముఖ స్థానాన్ని సంపాదించిన వారిలో ఫిలిప్ బి. జ్ఞాన రత్నమ్మ ఒకరు. ఆమె భక్తి గేయాలు మరియు కీర్తనల ద్వారా క్రైస్తవ సాహిత్యానికి విశేషమైన సేవ చేశారు. చిన్ననాటి నుంచే క్రైస్తవ కుటుంబంలో పెరిగిన ఆమెకు బైబిల్ బోధనలపై లోతైన అవగాహన ఏర్పడింది. ఆధ్యాత్మిక జీవితం ఆమె రచనలకు ప్రధాన ప్రేరణగా నిలిచింది.

జ్ఞానరత్నమ్మ గారి రచనలు ప్రధానంగా భక్తి గేయాల రూపంలో కనిపిస్తాయి. ఆమె కీర్తనలు చర్చిలలో పాడబడుతూ భక్తులలో ఆధ్యాత్మిక భావాన్ని పెంపొందించాయి. ఆమె రచనలలో దేవునిపై సంపూర్ణ విశ్వాసం, యేసు క్రీస్తు ప్రేమ, ప్రార్థన మరియు రక్షణ వంటి భావాలు ప్రధానంగా కనిపిస్తాయి.

ఆమె గేయాలలో కనిపించే భావం ఇలా ఉంటుంది :

"ప్రభువా నీ కృప నాకు ఆశ్రయం
నీ ప్రేమలోనే నా జీవితం"

ఈ పంక్తులు దేవునిపై ఉన్న విశ్వాసాన్ని తెలియ జేస్తాయి. జ్ఞానరత్నమ్మ గారి రచనలు భక్తి సాహిత్యాన్ని ప్రజల్లో విస్తరించడంలో ముఖ్య పాత్ర పోషించాయి.

వేశపోగు గుల్బానమ్మ (1905-1971)

తెలుగు క్రైస్తవ సాహిత్యంలో మరో ప్రముఖ మహిళా కవయిత్రి వేశపోగు గుల్బానమ్మ. ఆమె భక్తి గేయాలు మరియు కీర్తనలు రచించి క్రైస్తవ విశ్వాసాన్ని ప్రజల్లో వ్యాప్తి చేశారు. చిన్ననాటి నుంచే సంగీతం మరియు కవిత్వంపై ఆసక్తి కలిగి ఉన్న ఆమె ఈ ఆసక్తిని భక్తి గేయాల రచనలో ఉపయోగించారు.

గుల్బానమ్మ గారి రచనల్లో దేవుని కృప, యేసు క్రీస్తు ప్రేమ, ప్రార్థన, విశ్వాసం వంటి అంశాలు ప్రధానంగా కనిపిస్తాయి. ఆమె గేయాలు చర్చిలలో పాడబడుతూ భక్తులలో ఆధ్యాత్మిక చైతన్యాన్ని పెంపొందించాయి.

ఆమె గేయాలలో కనిపించే భావం ఇలా ఉంటుంది :

"నీ కృప లేక జీవితం శూన్యం
నీ ప్రేమలోనే నాకు ఆనందం"

ఈ పంక్తులు దేవుని కృప మనిషి జీవితాన్ని ఎలా మారుస్తుందో తెలియజేస్తాయి.

కొమ్ము కృప

క్రైస్తవ సాహిత్యంలో గుర్తింపు పొందిన మహిళా కవయిత్రులలో కొమ్ము కృప ఒకరు. ఆమె రచనలు దేవుని మహిమను గానం చేసే భక్తి గేయాల రూపంలో ఉన్నాయి. ఆమె కీర్తనలలో ప్రార్థన, విశ్వాసం, దేవుని కృప వంటి అంశాలు ప్రధానంగా కనిపిస్తాయి.

కొమ్ము కృప గారి రచనలు సులభమైన భాషలో ఉండటం వల్ల ప్రజల్లో విస్తృతంగా ప్రాచుర్యం పొందాయి. ఆమె గేయాలు దేవుని నామస్మరణ ద్వారా మనిషి జీవితంలో శాంతి మరియు ఆనందం కలుగుతాయని తెలియజేస్తాయి.

ఆమె కీర్తనలలో కనిపించే భావం ఇలా ఉంటుంది :

"నీ నామమే నా ఆశ్రయం
నీ దయలోనే నాకు శాంతి"

ఈ పంక్తులు భక్తి భావాన్ని స్పష్టంగా వ్యక్తపరుస్తాయి.

కట్ట చంద్రమ్మ

తెలుగు క్రైస్తవ సాహిత్యంలో భక్తి గేయాలను రచించిన ప్రముఖ మహిళా కవయిత్రి కట్ట చంద్రమ్మ. ఆమె గేయాలు దేవునిపై విశ్వాసాన్ని బలపరచే విధంగా ఉంటాయి. ఆమె రచనలు చర్చిలలో పాడబడుతూ

భక్తులలో ఆధ్యాత్మిక చైతన్యాన్ని పెంపొందించాయి. చంద్రమ్మ గారి గేయాలలో యేసు క్రీస్తు ప్రేమ, దేవుని కృప, ప్రార్థన వంటి అంశాలు ప్రధానంగా కనిపిస్తాయి. ఆమె రచనలు భక్తులలో విశ్వాసాన్ని పెంచడమే కాకుండా ఆధ్యాత్మిక జీవనానికి మార్గదర్శకంగా నిలిచాయి.

పిల్లి విజయ చార్లెస్ -1926

ఆధునిక కాలానికి చెందిన ప్రముఖ క్రైస్తవ కవయిత్రులలో పిల్లి విజయ చార్లెస్ ఒకరు. ఆమె భక్తి గేయాలు మరియు కీర్తనలు రచించి తెలుగు క్రైస్తవ సాహిత్యానికి విశేషమైన సేవ చేశారు.

ఆమె రచనలలో దేవుని ప్రేమ, విశ్వాసం, మానవ సేవ వంటి అంశాలు కనిపిస్తాయి. ఆమె గేయాలు భక్తి భావాన్ని మాత్రమే కాకుండా మానవతా విలువలను కూడా ప్రతిబింబిస్తాయి.

పిల్లి విజయ చార్లెస్ గారి గేయాలు భక్తులలో విశ్వాసాన్ని పెంపొందించడమే కాకుండా సమాజంలో ప్రేమ, సేవ వంటి విలువలను ప్రోత్సహిస్తాయి.

ముగింపు

తెలుగు క్రైస్తవ సాహిత్యం భక్తి సాహిత్యంలో ఒక ప్రత్యేక స్థానం సంపాదించింది. ఈ సాహిత్యం ప్రధానంగా దేవునిపై విశ్వాసం, ప్రార్థన, ప్రేమ, క్షమ, సేవ వంటి మానవతా విలువలను ప్రతిబింబిస్తుంది. ఈ సాహిత్య అభివృద్ధిలో మహిళా కవయిత్రుల పాత్ర ఎంతో విశిష్టమైనది.

ఫిలిప్ బి. జ్ఞానరత్నమ్మ, వేశపోగు గుల్బానమ్మ, కొమ్ము కృప, కట్ట చంద్రమ్మ, పిల్లి విజయ చార్లెస్ వంటి కవయిత్రులు తమ కీర్తనలు మరియు గేయాల ద్వారా క్రైస్తవ భక్తి సాహిత్యాన్ని అభివృద్ధి చేశారు. వారి రచనలు భక్తి భావాన్ని మాత్రమే కాకుండా మహిళల ఆధ్యాత్మిక అనుభూతులను కూడా ప్రతిబింబిస్తాయి.

ఈ కవయిత్రుల గేయాలలో దేవునిపై విశ్వాసం మాత్రమే కాకుండా మానవ జీవితంలోని అనుభవాలు కూడా కనిపిస్తాయి. కుటుంబ జీవితం, ప్రార్థన, విశ్వాసం, సేవ వంటి అంశాలు వారి రచనలలో ప్రధానంగా కనిపిస్తాయి. ఈ విధంగా వారి రచనలు మహిళల ఆధ్యాత్మిక జీవనాన్ని ప్రతిబింబిస్తాయి.

మహిళలు కూడా సాహిత్య రంగంలో విశిష్టమైన సేవ చేయగలరని ఈ కవయిత్రులు నిరూపించారు. వారి రచనలు క్రైస్తవ భక్తి సాహిత్యాన్ని సమృద్ధిగా చేశాయి. చర్చిలలో పాడే కీర్తనల ద్వారా వారి రచనలు ప్రజల్లో విస్తృతంగా ప్రాచుర్యం పొందాయి.

అందువల్ల క్రైస్తవ సాహిత్యంలో మహిళా కవయిత్రుల పాత్రను పరిశీలించడం తెలుగు సాహిత్య అధ్యయనంలో ఒక ముఖ్యమైన అంశంగా చెప్పవచ్చు. వారి రచనలు భక్తి, విశ్వాసం, సేవ వంటి విలువలను ప్రజల్లో విస్తరించాయి. ఈ విధంగా క్రైస్తవ సాహిత్యంలో మహిళా చైతన్యం ఒక ముఖ్యమైన భావంగా నిలిచింది.

ఆధార గ్రంథాలు

1. తెలుగు సాహిత్య చరిత్ర - డా. పింగళి లక్ష్మీకాంతం - ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమీ, హైదరాబాద్ - 2001
2. ఆంధ్ర క్రైస్తవ కీర్తనలు - సంపాదకులు: ఎం. యోహాను - ఆంధ్ర క్రైస్తవ సాహిత్య మండలి, గుంటూరు - 2003
3. క్రైస్తవ కవి కుసుమాలు - రచయిత: డాక్టర్ జి. జాన్ శామ్యూల్ - ప్రచురణకర్త: క్రైస్తవ సాహిత్య ప్రచురణలు, హైదరాబాద్. - సంవత్సరం: 2005.
4. తెలుగులో క్రైస్తవ సాహిత్య పరిణామక్రమం. - రచయిత : డా. కె. దానియేలు.- ప్రచురణ: క్రైస్తవ సాహిత్య కేంద్రం, హైదరాబాద్, - 2010.
5. తెలుగులో క్రైస్తవ సాహిత్యం - రచయిత : ఆచార్య. ఆరార్. సుందరరావు - ప్రచురణ :రాయి ఫౌండేషన్, విశాఖపట్నం - 2016

★★★

Vol. 23 | Spl. Issue 03 | March 2026 | BHAVAVEENA | ISSN No. : 2456-4702 | RNI No. APTEL/2003/12253

RNI No. APTEL/2003/12253 | Reffered Journal & Peer Reviewed Journals | ISSN No. 2456-4702

భావవీణ

కళలు, సాహిత్య, సాంస్కృతిక భాషాధ్యయన పత్రిక

BHAVA VEENA

Journal of Arts, Literary, Culture & Language Study

"తెలుగు నవలల్లో స్త్రీ చైతన్యం - పరిణామక్రమం, సామాజిక దృక్పథం"

- బొడ్డు భరద్వాజ

స్కూల్ అసిస్టెంట్ - తెలుగు, ప్రాథమికోన్నత పాఠశాల అంబం (ఎడపల్లి), జిల్లా: నిజామాబాద్.

వ్యాస సంగ్రహం (Abstract):

సాహిత్యం సమాజానికి దర్పణం వంటిది. సమాజంలో వచ్చే మార్పులను, అలజడులను, ఆశలను అక్షర రూపంలో పట్టిచూపేదే నవల. తెలుగు నవలా సాహిత్యంలో 'స్త్రీ చైతన్యం' అనేది ఒక ప్రధానమైన, శక్తివంతమైన ఇతివృత్తం. కందుకూరి వీరేశలింగం గారి నుండి నేటి ఆధునిక రచయిత్రుల వరకు తెలుగు నవల స్త్రీ జీవితంలోని అనేక పార్శ్వాలను స్పృశించింది. ఒకప్పుడు కేవలం ఆదర్శ గృహిణిగా, బాధితురాలిగా చిత్రించబడిన స్త్రీ, కాలక్రమంలో తన అస్తిత్వం కోసం, హక్కుల కోసం, ఆత్మగౌరవం కోసం పోరాడే శక్తిగా ఎలా మారిందో ఈ పరిశోధన పత్రం విశ్లేషిస్తుంది. పితృస్వామ్య వ్యవస్థలో స్త్రీ పడుతున్న అంతర్మథనం, ఆర్థిక స్వాతంత్ర్యం వైపు వేస్తున్న అడుగులు, కుటుంబ వ్యవస్థలో వచ్చిన మార్పులను తెలుగు నవల ఎలా చిత్రించిందో ఇందులో చర్చించడం జరిగింది.

ఉపోద్ఘాతం (Introduction):

తెలుగు సాహిత్యం ప్రక్రియా పరంగా ఎన్నో మార్పు లకు లోనైంది. అందులో 'నవల'ది విశిష్టమైన స్థానం. సమాజంలోని సంక్లిష్టమైన సమస్యలను విస్తృతంగా చర్చించడానికి నవల ఒక బలమైన వేదిక. తెలుగు నవలా వికాసాన్ని పరిశీలిస్తే, అందులో 'స్త్రీ' కేంద్ర బిందువుగా వచ్చిన నవలలు కొకొల్లలు. అయితే, ప్రారంభ దశలో స్త్రీని చూసిన విధానానికి, ఆధునిక కాలంలో స్త్రీని చూస్తున్న విధానానికి చాలా వ్యత్యాసం ఉంది. 'చైతన్యం' అంటే కేవలం సమస్యను గుర్తించడమే కాదు, ఆ సమస్య మూలాలను ప్రశ్నించడం, పరిష్కారం దిశగా అడుగులు వేయడం. తెలుగు నవలల్లో స్త్రీ చైతన్యం మూడు దశలుగా కనిపిస్తుంది. సంస్కరణ వాదం, అభ్యుదయ వాదం, మరియు స్త్రీ వాదం (Feminism). ఈ మూడు దశల్లోనూ రచయితలు, రచయిత్రులు స్త్రీని ఒక భోగ వస్తువుగా కాకుండా, ఒక ఆలోచనా శక్తిగా నిలబెట్టడానికి చేసిన ప్రయత్నం అభినందనీయం.

భారతీయ పురాణ, ఇతిహాస సాహిత్యాన్ని పరిశీలిస్తే స్త్రీ జీవితం ఒక విచిత్రమైన వైరుధ్యాల పుట్టగా కని పిస్తుంది. ఒకవైపు ఆమెను శక్తి స్వరూపిణిగా, జ్ఞాన ప్రదాతగా (సరస్వతి), సిరి సంపదలకు అధిపతిగా (లక్ష్మి) కీర్తించారు. కానీ, వాస్తవ సామాజిక జీవనంలోకి వచ్చేసరికి ఆమెను 'మనుధర్మం' పేరిట అనేక కట్టుబాట్ల మధ్య బంధించారు. పురాణ కాలంలో స్త్రీకి స్వతంత్రమైన గుర్తింపు చాలా అరుదు. ఆమె బాల్యంలో తండ్రి చాటు బిడ్డగా, యవ్వనంలో భర్త నీడగా, వృద్ధాప్యంలో కొడుకు రక్షణలో బతకాల్సిందే. రామాయణంలో సీత పాత్రను గమనిస్తే, ఆమె జనక మహారాజు కూతురిగా, రాముని

భార్యగా మాత్రమే లోకానికి తెలుసు. ఆమె ఎంత గొప్ప సహనశీలి అయినప్పటికీ, అడవుల పాలవ్వాలన్నా, అగ్ని ప్రవేశం చేయాలన్నా, అది పురుషుడు (భర్త) తీసుకున్న నిర్ణయం మీదే ఆధారపడి ఉండేది. తన జీవితానికి సంబంధించిన అతి ముఖ్యమైన నిర్ణయాల్లో కూడా ఆమె పాత్ర శూన్యం.

నాటి సమాజంలో స్త్రీని ఒక మనిషిగా కంటే, ఒక ఆస్తిగా లేదా వస్తువుగా పరిగణించే ధోరణి ఎక్కువగా ఉండేది. రాజ్యాల మధ్య సంధి కుదుర్చుకోవడానికి, లేదా శత్రురాజుల కోపాన్ని చల్లార్చడానికి రాజకుమార్తెలను ఇచ్చి వివాహం చేయడం సర్వసాధారణం. ఇక్కడ ఆ స్త్రీ మనోభావాలకు ఎటువంటి విలువ లేదు. మహా భారతంలో మాద్రి లేదా గాంధారి వివాహాలు రాజకీయ అవసరాల కోసం జరిగినవే. ఇక సత్యహరిశ్చంద్రుడు సత్యం కోసం భార్య చంద్రమతిని కాశీలో అమ్మేస్తాడు. సత్యపాలనలో హరిశ్చంద్రుడు గొప్పవాడే కావచ్చు, కానీ భార్యను ఒక అమ్మకపు వస్తువుగా మార్చడం నాటి స్త్రీ దయనీయ స్థితికి అద్దం పడుతుంది. ధర్మరాజు ద్రౌపదిని జూదంలో ఒడ్డడం ఈ మనస్తత్వానికి పరాకాష్ట.

విద్వత్తు ఉన్నా, వంటింటికే పరిమితం :

వేద కాలంలో (పురాణాల కంటే పూర్వం) స్త్రీలకు కొంతమేర విద్యా స్వేచ్ఛ ఉండేది. గార్గి, మైత్రేయి వంటి విదుషీమణులు జనక మహారాజు సభలో యజ్ఞ వల్క్యునితో సమానంగా వాదించేవారు. కానీ పురాణ కాలానికి వచ్చేసరికి ఈ స్వేచ్ఛ నన్నగిల్లింది. స్త్రీకి "పాతివ్రత్యం" అనేదే ఏకైక విద్యగా మారింది. ఒక స్త్రీ ఎంత తెలివైనదైనా, ఆమె తెలివిని భర్తను సేవించడానికి, కుటుంబాన్ని నడపడానికే వాడాలి తప్ప, రాజ్య తంత్రాలకు లేదా శాస్త్ర చర్చలకు కాదు అనే లిఖిత నిబంధన ఉండేది.

పాతివ్రత్యం :

పురాణాల్లో స్త్రీకి అత్యున్నత లక్ష్యం 'పాతివ్రత్యం'. అనసూయ, సావిత్రి, సుమతి వంటి కథలు స్త్రీలను భర్త పట్ల అంకితభావంతో ఉండమని బోధించాయి. సావిత్రి యముడితో పోరాడి భర్త ప్రాణాలు దక్కించుకుంది. ఇది స్త్రీ సంకల్ప బలాన్ని చూపిస్తుంది. కానీ, ఇక్కడ గమనించాల్సిన విషయం ఏంటంటే, ఆమె పోరాటం తన కోసం కాదు, తన భర్త కోసం. అంటే, స్త్రీ శక్తి సామర్థ్యాలు కూడా పురుషుడి శ్రేయస్సు కోసమే వినియోగపడాలి అనే భావజాలం ఇందులో అంతర్లీనంగా ఉంది.అందరూ తలవంచి బతకలేదు. కొందరు స్త్రీలు నాటి పురుషాధిక్యతను ప్రశ్నించారు. ద్రౌపది: కురుసభలో తనను అవమానిస్తున్నప్పుడు, భర్తలు మౌనంగా ఉంటే, 'ధర్మానికి కట్టుబడి ఉండాలా? లేక అన్యాయాన్ని ఎదిరించాలా?' అని భీష్మ ద్రోణులను నిలదీసింది. ఇది నాటి సమాజంలో ఒక సంచలనం. సత్యభామ: శ్రీకృష్ణుడితో పాటు యుద్ధరంగానికి వెళ్లడమే కాక, అవసరమైనప్పుడు బాణం చేపట్టింది. స్త్రీ అబల కాదు, సబల అని నిరూపించిన అరుదైన పురాణ ఘట్టం ఇది.

మొత్తంగా చూస్తే, పురాణ కాలంలో స్త్రీ 'గడప దాటని మహారాణి'. ఆమెకు గౌరవం ఉంది, కానీ స్వేచ్ఛ లేదు. ఆమెకు పూజలు ఉన్నాయి, కానీ హక్కులు లేవు. నాటి స్త్రీ జీవితం.. త్యాగం, సహనం, మౌనం అనే మూడు స్తంభాల మీద నిర్మించబడింది.

ఈ చారిత్రక నేపథ్యమే, తర్వాతి కాలంలో కందుకూరి వీరేశలింగం, గురజాడ వంటి వారు ఆధునిక స్త్రీ స్వేచ్ఛ కోసం పోరాడటానికి, తెలుగు నవలల్లో స్త్రీ చైతన్యం ఊపిరి పోసుకోవడానికి మూలకారణమైంది.

కీలక పదాలు :

స్త్రీ చైతన్యం, అస్తిత్వ పోరాటం, పితృస్వామ్య వ్యవస్థ, తెలుగు నవలా వికాసం, స్త్రీవాద సాహిత్యం, సామాజిక వాస్తవికత, ఆర్థిక స్వలంబన, గృహ హింస, మహిళా సాధికారత, అభ్యుదయ దృక్పథం.

తొలి నాటి నవలలు :

తెలుగు నవలా ఆవిర్భావం ప్రధానంగా సాంఘిక సంస్కరణోద్యమంతో ముడిపడి ఉంది. కందుకూరి వీరేశలింగం గారు రాసిన 'రాజశేఖర చరిత్ర' (మొదటి నవలగా పరిగణించబడే వాటిలో ఒకటి) నాటి సామాజిక పరిస్థితులను ప్రతిబింబించింది. ఆ కాలంలో స్త్రీ సమస్యలంటే ప్రధానంగా, బాల్య వివాహాలు, వైధవ్యం,

చదువు లేకపోవడం. ఈ దశలో వచ్చిన నవలల్లో స్త్రీ చైతన్యం అనేది పురుషుల దృష్టి కోణం నుండి సాగింది. స్త్రీలు చదువుకోవాలి, కానీ అది మంచి గృహిణిగా మారడానికే. విధవా పునర్వివాహాలు జరగాలి, కానీ అది ఆమెకు రక్షణ కల్పించడానికే. అంటే, ఇక్కడ స్త్రీకి స్వతంత్ర ఆలోచనల కంటే, ఆమెకు సమాజం చేసిన కట్టుబాట్ల నుండి కాస్త వెసులుబాటు కల్పించడమే ప్రధాన ఉద్దేశం. చిలకమర్తి లక్ష్మీనరసింహం, ఉన్నవ లక్ష్మీనారాయణ వంటి వారు తమ నవలల్లో స్త్రీ పాత్రలకు ప్రాధాన్యతనిచ్చారు. ముఖ్యంగా ఉన్నవ వారి 'మాలపల్లి'లో స్త్రీ పాత్రలు సామాజిక పోరాటంలో భాగస్వామ్యం వహించడం ఒక ముందడుగు.

సంస్కరణ దశ : కందుకూరి 'రాజశేఖర చరిత్ర'

తెలుగు నవలా చరిత్రలో మైలురాయిగా నిలిచిన 'రాజశేఖర చరిత్ర' (1878) నాటి స్త్రీ స్థితిగతులకు దర్పణం. అయితే, ఇందులో కనిపించే స్త్రీ చైతన్యం ప్రాథమిక దశకు చెందినది. గృహిణిగా బాధ్యత: ఈ నవలలో స్త్రీకి సంబంధించిన సమస్యల ప్రస్తావన ఉన్నప్పటికీ, అది పితృస్వామ్య వ్యవస్థ గీసిన గీతల్లోనే ఉంటుంది. స్త్రీలు మూఢనమ్మకాలకు దూరంగా ఉండాలని, కనీస విజ్ఞానం కలిగి ఉండాలని కందుకూరి ఆశించారు. కానీ, ఆ చదువు ఆమెను మంచి భార్యగా, మంచి తల్లిగా తీర్చిదిద్దడానికే తప్ప, ఆమె స్వతంత్ర వ్యక్తిత్వ వికాసానికి కాదన్నది ఆనాటి సత్యం. సంరక్షణ వాదం: 'రక్షించబడాల్సిన వ్యక్తి'. ఆమె చైతన్యం పురుషుడి సంస్కరణ దృక్పథంపై ఆధారపడి ఉండేది. రాజశేఖర చరిత్రలో స్త్రీ పాత్రలు కుటుంబ గౌరవానికి ప్రతీకలు. అంటే, ఇక్కడ స్త్రీ చైతన్యం అనేది 'కుటుంబం కోసం స్త్రీ ఎలా ఉండాలి?' అనే ప్రశ్నకు సమాధానంగానే సాగింది తప్ప, 'స్త్రీ కోసం సమాజం ఎలా ఉండాలి?' అనే స్థాయికి ఇంకా ఎదగలేదు.

చలం, కొడవటిగంటి యుగం :

గుడిపాటి వెంకట చలం రాకతో తెలుగు నవల్లో స్త్రీ చైతన్యం ఒక కుదుపునకు లోనైంది. 'స్త్రీ అంటే శరీరమే కాదు, ఆమెకూ మనసు ఉంటుంది, కోరికలు ఉంటాయి' అని నినదించిన వారు చలం. అయన రాసిన 'మైదానం', 'అమీనా', 'బ్రాహ్మణీకం' వంటి నవలలు నాటి సమాజం గీసిన లక్ష్మణ రేఖలను చెరిపివేశాయి. స్త్రీకి పాతివ్రత్యం కంటే స్వేచ్ఛ ముఖ్యం, ప్రేమ ముఖ్యం అని చలం వాదించారు. ఇది తెలుగు నవలా సాహిత్యంలో ఒక విప్లవాత్మక మార్పు. అలాగే కొడవటిగంటి కుటుంబరావు గారు స్త్రీ సమస్యలను ఆర్థిక కోణం నుండి, మధ్యతరగతి కుటుంబాల నేపథ్యంలో విశ్లేషించారు. 'చదువు' నవలలో స్త్రీ విద్యావ్యాప్తి, తద్వారా వచ్చే ఆలోచనా పరిణామం అద్భుతంగా చిత్రించబడింది. స్త్రీ కేవలం వంటింటి కుందేలు కాదని, ఆమెకు సామాజిక స్పృహ ఉంటుందని ఈ దశలో నవలలు నిరూపించాయి.

అస్తిత్వ దశ :

1970ల తర్వాత తెలుగు నవల రూపురేఖలు పూర్తిగా మారిపోయాయి. అంతకు ముందు పురుష రచయితలు స్త్రీ సమస్యల గురించి రాస్తే, ఈ దశలో స్త్రీలే తమ సమస్యలను, తమ అనుభూతులను స్వయంగా రాయడం మొదలుపెట్టారు.

బలిపీఠం' (రంగనాయకమ్మ) - సంఘర్షణకు సాక్ష్యం:

రంగనాయకమ్మ గారి 'బలిపీఠం' కేవలం ఒక నవల కాదు, అది కుల వ్యవస్థపై ఎక్కుపెట్టిన అస్త్రం. ఇందులో కథనాయిక అరుణ పాత్ర ద్వారా స్త్రీ పడే మానసిక క్షోభను రచయిత్రి అత్యద్భుతంగా ఆవిష్కరించారు. దళిత వర్గానికి చెందిన భాస్కర్‌ను ప్రేమించి పెళ్లి చేసుకున్న అరుణ, అత్తగారింట ఎదుర్కొన్న అవమానాలు పాఠకులను కంటతడి పెట్టిస్తాయి. ముఖ్యంగా, ఒక సందర్భంలో భాస్కర్ న్యూనతా భావంతో అరుణను అనుమానించినప్పుడు, అరుణ పలికే సంభాషణలు స్త్రీ ఆత్మగౌరవానికి ప్రతీకగా నిలుస్తాయి. 'నేను కులాన్ని వదిలి వచ్చాను, కానీ నా వ్యక్తిత్వాన్ని కాదు' అనే అర్థం వచ్చేలా ఆమె చేసే వాదన, స్త్రీకి ఉండాల్సిన తెగువను చూపిస్తుంది. సమాజం కోసం కాకుండా, తన నమ్మకం కోసం బతికే స్త్రీగా అరుణ పాత్ర తెలుగు నవలా చరిత్రలో నిలిచిపోయింది.

'స్వేచ్ఛ' (ఓల్గా) - అస్తిత్వ ఆవేదన :

ఓల్గా గారి 'స్వేచ్ఛ' నవలలోని అరుణ (బలిపీఠం అరుణ వేరు, ఈమె వేరు) పాత్ర ఆధునిక స్త్రీకి ప్రతినిధి. ఆమె తన భర్త ప్రకాశం నుండి, ఆ తర్వాత తన కూతురు నుండి కూడా మానసిక దూరాన్ని అనుభవిస్తుంది. 'కుటుంబం అంటే ప్రేమ, ఆప్యాయతలే కాదు. అదొక శ్రమ దోపిడీ కేంద్రం' అనే కఠిన సత్యాన్ని ఈ నవల చర్చిస్తుంది. నవలలోని ఒక కీలక ఘట్టంలో అరుణ తన భర్తతో, 'నన్ను నేనుగా బతకనివ్వండి. మీ నీడగా కాదు' అని చెప్పే సందర్భం, స్త్రీ కోరుకుంటున్న 'స్వేచ్ఛ' ను సూచిస్తుంది. కేవలం భార్యగా, తల్లిగా బాధ్యతలు మోయడమేనా నా జీవితం? నాకంటూ ఒక ఉనికి లేదా? అనే ప్రశ్నలు పాఠకుడిని ఆలోచింపజేస్తాయి. చివరికి ఆమె ఒంటరిగా బతకాలని నిర్ణయించుకోవడం ద్వారా, ఒంటరితనం అంటే బలహీనత కాదు, అది ఒక శక్తి అని నిరూపిస్తుంది.

అరికెపూడి కౌసల్య, మాదిరెడ్డి సులోచన :

వీరి నవలల్లో గృహిణుల సమస్యలు ప్రధానంగా ఉంటాయి. ఉమ్మడి కుటుంబాల్లో స్త్రీలు పడే ఇబ్బందులు, భర్తను సరిదిద్దుకునే క్రమంలో వారు పడే పాట్లు, పిల్లల పెంపకం వంటి అంశాలను చాలా సహజంగా చిత్రించారు. అరికెపూడి వారి నవలల్లో స్త్రీ, సంప్రదాయాన్ని గౌరవిస్తూనే, ఎక్కడ అన్యాయం జరిగినా ప్రశ్నించే తత్వాన్ని కలిగి ఉంటుంది. విడాకులు, విడిపోవడం వంటి పెద్ద నిర్ణయాల కంటే, ఉన్న పరిస్థితుల్లోనే స్త్రీ తన గళాన్ని ఎలా వినిపించిందో వీరి నవలలు రికార్డు చేశాయి. ఇది ఒక రకంగా 'సాఫ్ట్ ఫెమినిజం' (మృదువైన స్త్రీవాదం) అని చెప్పవచ్చు.

ముదిగంటి సుజాతారెడ్డి 'తెలుగు నవలా వికాసం' :

ప్రసిద్ధ విమర్శకురాలు ముదిగంటి సుజాతారెడ్డి గారు తన 'తెలుగు నవలా వికాసం' గ్రంథంలో స్త్రీ పాత్రల చిత్రణలో వచ్చిన మార్పులను శాస్త్రీయంగా విభజించారు. ఉపదేశం నుండి అనుభూతి వైపు: కందుకూరి కాలంలో నవల ఒక 'నీతి బోధక సాధనం'గా ఉండేదని, కానీ కాలక్రమంలో అది 'జీవిత చిత్రణ'గా మారిందని సుజాతారెడ్డి గారు విశ్లేషించారు. 19వ శతాబ్దపు నవలలు స్త్రీని బయటి నుండి చూస్తే, 20వ శతాబ్దపు నవలలు స్త్రీ మనసు లోతులోకి వెళ్లాయని ఆమె పేర్కొన్నారు.

డా. సి. మృణాళిని: తెలుగు నవలా సాహిత్య విశ్లేషణ :

మృణాళిని గారు నవలలను కేవలం కథలుగా కాకుండా, అందులోని పాత్రల మానసిక ప్రవర్తన ఆధారంగా విశ్లేషించారు. సంఘటనల కంటే సంఘర్షణ ముఖ్యం:

సాధారణ విమర్శకులు నవలలోని కథను, ఇతి వృత్తాన్ని చూస్తే, మృణాళిని గారు పాత్రల అంతరంగాన్ని చూశారు. 'ఒక పాత్ర ఎందుకు అలా ప్రవర్తించింది?' అనే ప్రశ్నకు ఆమె సమాధానం వెతికారు. ఉదాహరణకు, చలం రాసిన 'మైదానం'లో రాజేశ్వరి పాత్ర కేవలం కామంతో ఇంటి నుంచి పారిపోలేదు, ఆమెలో ఉన్న అణచివేయబడిన స్వేచ్ఛాకాంక్ష, అసంతృప్తి ఆమెను అలా చేసేలా ప్రేరేపించాయని మృణాళిని విశ్లేషించారు. స్త్రీ చైతన్యం అంటే కేవలం బయటి ప్రపంచంలో పోరాడటమే కాదు, తనలో తాను జరిగే సంఘర్షణను గెలవడం అని మృణాళిని గారి అభిప్రాయం.

చలం పాత్రలపై లోతైన చూపు :

తెలుగు నవలలో స్త్రీ చైతన్యానికి చలం ఆద్యుడు. మృణాళిని గారు చలం పాత్రలను 'సిగ్మండ్ ఫ్రాయిడ్ మనోవిశ్లేషణ సిద్ధాంతాలతో పోల్చి చూశారు. చలం స్త్రీ పాత్రలు (రాజేశ్వరి, పద్మావతి వంటి వారు) సమాజం దృష్టిలో 'చెడ్డవారు' కావచ్చు.

రచయిత్రుల నవలలపై విమర్శ :

రంగనాయకమ్మ, యద్దనపూడి, వాసిరెడ్డి సీతాదేవి వంటి రచయిత్రుల నవలలను మృణాళిని గారు సామాజిక-మానసిక కోణంలో విశ్లేషించారు.

మధ్యతరగతి మనస్తత్వం :

యద్దనపూడి నులోచనారాణి నవలల్లో స్త్రీలు మోడరన్‌గా కనిపించినా, వారి ఆలోచనలు ఇంకా పాత 'సిండ్రెల్లా కాంప్లెక్స్' (రాకుమారుడి కోసం ఎదురు చూడటం) చుట్టూనే తిరుగుతున్నాయని మృణాళిని విమర్శనాత్మకంగా పరిశీలించారు. అదే సమయంలో

వాసిరెడ్డి సీతాదేవి 'మట్టి మనిషి' వంటి నవలల్లో స్త్రీ పాత్రలు పడే ఆర్థిక, మానసిక ఒత్తిడిని చాలా సహజంగా చిత్రించారని ఆమె ప్రశంసించారు.

స్త్రీ చైతన్యం - మానసిక కోణం :

మృణాళిని గారి ప్రకారం స్త్రీ చైతన్యం అంటే మగ వాడిని ద్వేషించడం కాదు. ఆమె మాటల్లో, 'పురుషాధిక్య సమాజం స్త్రీ మెదడులో నాటించిన బానిస భావజాలం నుండి ఆమె బయటపడటమే నిజమైన చైతన్యం.' బయట సమాజం మారినా, స్త్రీ తన మనసులో ఉన్న 'త్యాగ బుద్ధి', 'అపరాధ భావం' నుండి బయటపడకపోతే ఆమెకు పూర్తి స్వేచ్ఛ దక్కదని మృణాళిని గారి వాదన.

ఆధునిక నవల :

గత రెండు దశాబ్దాలుగా వస్తున్న తెలుగు నవలల్లో స్త్రీ చైతన్యం మరింత విస్తృతమైంది. ఇది కేవలం మధ్య తరగతి స్త్రీలకే పరిమితం కాకుండా, దళిత, బహుజన, ముస్లిం మైనారిటీ స్త్రీల జీవితాలను కూడా స్పృశిస్తోంది.

ఆర్థిక స్వలంబన :

నేటి నవలల్లో స్త్రీ ఉద్యోగం చేయడం ఒక అవసరంగా కాకుండా, ఒక హక్కుగా మారింది. పి. సత్యవతి, కుప్పం నిర్మల వంటి వారి రచనల్లో ఉద్యోగి నుల సమస్యలు, పని ప్రదేశంలో లైంగిక వేధింపులు, ఇంటి పని, బయటి పని వంటి అంశాలు చర్చకు వస్తున్నాయి. స్త్రీ శరీరంపై ఆమెకే హక్కు ఉండాలి అనే భావన బలంగా వ్యక్తమవుతోంది. మాతృత్వం అనేది ఒక ఎంపిక కావాలి కానీ, నిర్బంధం కాకూడదు అనే చైతన్యం కనిపిస్తోంది.

గృహ హింస :

నాలుగు గోడల మధ్య జరిగే హింసను మౌనంగా భరించే స్త్రీలు కాకుండా, ఎదురుతిరిగే స్త్రీ పాత్రలు ఇప్పుడు నవలల్లో కనిపిస్తున్నాయి. విడాకులు తీసుకోవడం అనేది ఒక వైఫల్యంగా కాకుండా, స్వేచ్ఛా జీవితానికి ఒక మార్గంగా నవలలు చూపిస్తున్నాయి.

నవలల్లో ప్రతిఫలించిన సామాజిక మార్పులు:

తెలుగు నవలల్లో స్త్రీ చైతన్యాన్ని గమనిస్తే మనకు స్పష్టంగా కనిపించే అంశం ఏమిటంటే - 'ప్రశ్నించే తత్వం'. ఒకప్పుడు సీత, సావిత్రిలే ఆదర్శం. కానీ ఆధునిక నవలలో అహల్య, శూర్పణఖ వంటి పాత్రలను కూడా పునర్నిర్వచించి, వారి కోణంలో న్యాయం ఎక్కడ ఉందని ప్రశ్నించే స్థాయికి సాహిత్యం ఎదిగింది. ఓల్గా రాసిన 'విముక్త' దీనికి చక్కని ఉదాహరణ. పురాణ స్త్రీ పాత్రల ద్వారా ఆధునిక స్త్రీకి ఒక కొత్త చూపును అందించడం ఇందులో చూడవచ్చు. అలాగే, 'రాజకీయ చైతన్యం' కూడా స్త్రీ నవలల్లో భాగమైంది. తెలంగాణ సాయుధ పోరాటం నేపథ్యం నుండి, నక్సల్బరీ ఉద్యమం వరకు స్త్రీలు పోషించిన పాత్రను అల్లం రాజయ్య, సాహు వంటి రచయితల నవలల్లో చూడవచ్చు. స్త్రీ కేవలం బాధితురాలే కాదు, పోరాట యోధురాలు కూడా అని ఈ నవలలు నిరూపించాయి.

మధ్యతరగతి స్త్రీ మనోభావాలు :

తెలుగు నవలల్లో స్త్రీవాదం అనగానే కేవలం విప్లవ భావాలే కాదు, సాధారణ మధ్యతరగతి స్త్రీల చిన్న చిన్న ఆశలు, ఆనందాలు, సర్దుకుపోయే తత్వాలను చిత్రించిన రచయిత్రులెందరో ఉన్నారు. అందులో ముఖ్యులు యద్దనపూడి సులోచనారాణి మరియు అరికెపూడి కౌసల్య. యద్దనపూడి సులోచనారాణి - రొమాంటిక్ రియలిజం: యద్దనపూడి వారి నవలలంటే ప్రేమకథలే అని పైకి అనిపించినా, వాటిలో మధ్యతరగతి స్త్రీ ఆత్మవిశ్వాసం అంతర్లీనంగా ఉంటుంది. ఉదాహరణకు 'సెక్రటరీ' నవలలో జయంతి పాత్రను పరిశీలిస్తే ఒక దిగువ మధ్యతరగతి అమ్మాయి, తన కుటుంబ బాధ్యతలను మోస్తూనే, తన బాస్ (రాజశేఖరం) అహంకారాన్ని ఎలా ఎదుర్కొంటుందో కనిపిస్తుంది. 'డబ్బు, హోదా ఉంటే సరిపోదు, మనిషికి సంస్కారం ఉండాలి' అని నిరూపించే ధీర వనితగా జయంతి కనిపిస్తుంది. యద్దనపూడి నవలల్లో స్త్రీలు ఎక్కువగా చదువుకుని, ఉద్యోగాలు చేస్తూ, కుటుంబాన్ని పోషించే 'బాధ్యతాయుతమైన' పాత్రలుగా కనిపిస్తారు. ఇది ఆ కాలంలో స్త్రీలకు ఆర్థిక స్వాతంత్ర్యంపై ఆసక్తిని రేకెత్తించింది.

తెలుగు నవలలో స్త్రీ చైతన్యం - పరిణామ క్రమం :

ముదిగంటి సుజాతారెడ్డి గారి 'తెలుగు నవలా వికాసం' మరియు కాత్యాయని విద్మహే గారి 'మహిళా

సాధికారత - సాహిత్యం' వంటి సిద్ధాంత గ్రంథల వెలుగులో విశ్లేషిస్తే, స్త్రీ అస్తిత్వం 'సంస్కరణ' దశ నుండి 'స్వయం నిర్ణయాధికారం' దిశగా ఎలా సాగిందో స్పష్టమవుతుంది.

మధ్యతరగతి స్త్రీ ఆవిర్భావం :

స్వాతంత్ర్యోద్యమ కాలం నాటికి నవలల్లో స్త్రీ పాత్ర కేవలం వంటింటికే పరిమితం కాకుండా, జాతీయోద్యమంలో పాల్గొనే స్థాయికి ఎదిగిందని ముదిగంటి వారి విశ్లేషణ ద్వారా తెలుస్తుంది. అంటే, నవల స్త్రీని సామాజిక శక్తిగా గుర్తించడం మొదలైంది.

శ్రమజీవిగా స్త్రీ :

అప్పటివరకు నవలల్లో స్త్రీ అంటే ప్రేమ, పెళ్లి, కుటుంబం అనే చట్రంలోనే ఉండేది. కానీ 'మట్టి మనిషి'లో రచయిత్రి స్త్రీని ఒక 'ఉత్పాదక శక్తి'గా చూపించారు. భూమిని నమ్ముకున్న స్త్రీకి, ఆ భూమి దూరం అవుతున్నప్పుడు కలిగే వేదన ఇందులో కనిపిస్తుంది. ప్రధాన పాత్రధారి భూమిని తల్లిగా ప్రేమిస్తే, ఆమె కొడుకు భూమిని ఒక వ్యాపార వస్తువుగా చూస్తాడు. ఇక్కడ స్త్రీ చైతన్యం అనేది సంప్రదాయ మానవీయ విలువలను కాపాడుకోవడానికి చేసే పోరాటంగా మారుతుంది. పురుషాధిక్య ప్రపంచంలో ఆర్థిక నిర్ణయాలు స్త్రీ చేతిలో లేనప్పుడు, ఆమె అస్తిత్వం ఎలా ప్రమాదంలో పడుతుందో వాసిరెడ్డి సీతాదేవి నిరూపించారు. ఇది స్త్రీ చైతన్యంలో ఒక ముందడుగు.

కాత్యాయని విద్మహే 'మహిళా సాధికారత - సాహిత్యం':

కాత్యాయని గారి విశ్లేషణ ప్రకారం, నవలల్లో స్త్రీలు కేవలం తమ బాధలను చెప్పుకోవడం దగ్గరే ఆగిపోకూడదు. నిర్ణయాధికారం దిశగా ఎదగడమే నిజమైన సాధికారత. కందుకూరి కాలంలో స్త్రీకి 'చదువు' ఇవ్వడం ఒక విప్లవం అయితే, వాసిరెడ్డి సీతాదేవి కాలానికి 'ఆర్థిక స్వేచ్ఛ' ప్రధానాంశమైంది. కాత్యాయని విద్మహే గారు ఈ పరిణామాన్ని విశ్లేషిస్తూ, 'పురుషుడు నిర్దేశించిన పద్ధతిలో కాకుండా, స్త్రీ తనకు తానుగా తన జీవితాన్ని నిర్వచించుకునే స్థాయికి సాహిత్యం ఎదగాలి' అని అభిలాషించారు. అంటే, స్త్రీని ఒక బాధితురాలిగా కాకుండా ఒక కర్తగా నవలలు చూపించాలని ఆమె వాదన.

చైతన్య స్వభావం :

ఇక్కడ చైతన్యం అంటే, మూఢనమ్మకాలను వదలడం, చదువుకోవడం. ఆమె సమాజం గీసిన గీతల్లోనే ఉంటూ, ఆ గీతలను కొంచెం వెడల్పు చేసుకునే ప్రయత్నం మాత్రమే చేసింది. విధవా వివాహం అనేది స్త్రీ శారీరక, మానసిక అవసరాల కంటే, ఆమెకు 'సామాజిక భద్రత' కల్పించే చర్యగానే నవలల్లో చిత్రించబడింది.

రెండవ దశ : వ్యక్తిత్వ వికాస చైతన్యం - 'స్త్రీ ఒక వ్యక్తి'

గుడిపాటి వెంకట చలం, కొడవటిగంటి కుటుంబ రావు వంటి వారి రాకతో (1920-1960) స్త్రీ చైతన్యంలో సమూల మార్పు వచ్చింది. చైతన్య స్వభావం: 'స్త్రీ అంటే పాతివ్రత్యం అనే సంకెళ్లను తెంచుకోవడం, ప్రేమను స్వేచ్ఛగా వ్యక్తపరచడం ఈ దశలో కనిపించే ప్రధాన లక్షణం. అప్పటివరకు స్త్రీని 'దేవత'గానో, 'బానిస'గానో చూసిన సమాజానికి, ఆమెను ఒక మామూలు 'మనిషి'గా చూపించిన దశ ఇది. కొడవటిగంటి వారి 'చదువు' నవలలో, స్త్రీకి ఆర్థిక స్వాతంత్ర్యం ఉంటేనే వ్యక్తిత్వం నిలబడుతుందనే సత్యం ఆవిష్కరించబడింది. ఇక్కడ చైతన్యం 'శరీర రాజకీయాల' వైపు మళ్లింది.

మూడవ దశ : అస్తిత్వ ఆవేదన - 'నేను ఎవరు?'

1960-1980 మధ్య కాలంలో రంగనాయకమ్మ, వాసిరెడ్డి సీతాదేవి, యద్దనపూడి, మాదిరెడ్డి వంటి రచయిత్రులు విస్తృతంగా రాశారు. మధ్యతరగతి స్త్రీ జీవితం, ఉద్యోగం, అత్తవారింటి వేధింపులు, సర్దుకు పోవడాలు. ఈ దశలో స్త్రీ చైతన్యం 'సంఘర్షణ' రూపంలో ఉంటుంది. ఆమె చదువుకుంది, ఉద్యోగం చేస్తోంది, కానీ ఇంట్లో ఇంకా పాత పెత్తనమే సాగుతోంది. ఈ వైరుధ్యాన్ని నవలలు పట్టుకున్నాయి. 'నేను ఇంటికి దీపాన్ని మాత్రమేనా? నాకంటూ ఒక జీవితం లేదా?' అనే అంతర్మథనం ఈ దశలో స్పష్టంగా కనిపిస్తుంది.

నాలుగవ దశ : స్త్రీవాద చైతన్యం:

1980ల తర్వాత ఓల్గా, పి. సత్యవతి, కుప్పం నిర్మల వంటి వారి రచనలతో స్త్రీ చైతన్యం శిఖరాగ్రానికి చేరింది.

ఇది కేవలం సమస్యలను చెప్పుకోవడం కాదు, పరిష్కారాన్ని డిమాండ్ చేయడం. కుటుంబ వ్యవస్థను, వివాహ వ్యవస్థను ప్రశ్నించడం. ఒకప్పుడు భర్తను దేవుడిగా భావించిన స్త్రీ, అతను సహచరుడిగా లేనప్పుడు ఆ బంధం నుండి బయటకు రావడాన్ని ఈ నవలలు సమర్థించాయి (ఉదా: ఓల్గా 'స్వేచ్ఛ').

ఒంటరి ప్రయాణం :

స్త్రీకి పురుషుడి తోడు లేకుండా బతకగల శక్తి ఉందని నిరూపించాయి. రాజకీయ స్పృహ: స్త్రీ కేవలం వంటింటికే పరిమితం కాదు. ఆమెకు సామాజిక, రాజకీయ అభిప్రాయాలు ఉంటాయని ఈ దశ నవలలు చాటిచెప్పాయి.

మౌనం నుండి గళం విప్పే వరకు :

పూర్వ నవలల్లో స్త్రీ పాత్రలు ఎక్కువగా మౌనంగా రోదించేవి. కానీ ఆధునిక నవలల్లో స్త్రీలు తమ అసంతృప్తిని గట్టిగా వ్యక్తం చేస్తున్నారు. తప్పును తప్పు అని చెప్పే ధైర్యంనేటి నవలల్లోని ప్రధాన చైతన్యం.

త్యాగం నుండి హక్కుల వరకు :

గతంలో 'త్యాగమయి' అనే బిరుదు కోసం స్త్రీలు తమ కోరికలను చంపుకునేవారు. నవలలు కూడా దాన్నే గొప్పగా చిత్రించేవి. కానీ నేటి నవలల్లో 'నన్ను నేను చంపుకొని, ఇతరులను సంతోషపెట్టాల్సిన అవసరం లేదు' అనే స్పష్టత వచ్చింది. త్యాగం స్థానంలో 'హక్కు' వచ్చి చేరింది. గత నవలల్లో స్త్రీ సమస్యలకు పరిష్కారం 'చావు' లేదా 'దేవుడు'గా ఉండేది. కానీ నేటి నవలల్లో స్త్రీ సమస్యలను ఎదురించి, న్యాయపరంగానో, సామాజికంగానో పోరాడి గెలుస్తోంది.

సంస్కరణ యుగం : రక్షణ కావాలి- నాయకత్వం: పురుషులు (ఉదా: వీరేశలింగం)

అభ్యుదయ యుగం : సమానత్వం కావాలి- నాయకత్వం : చలం, కొడవటిగంట

అస్తిత్వ యుగం : గుర్తింపు కావాలి- నాయకత్వం: రంగనాయకమ్మ, వాసిరెడ్డి సీతాదేవి

స్త్రీవాద యుగం : స్వేచ్ఛ, అధికారం కావాలి- నాయకత్వం : ఓల్గా, పి. సత్యవతి

'స్త్రీ ఒక బాధ్యత'- బరువుగా మారిన బతుకు :

ప్రారంభ దశ నవలల్లో (కందుకూరి కాలం) స్త్రీని సమాజం ఒక 'బాధ్యత'గా మాత్రమే చూసింది. ఈ దశలో ఆమె అనుభవించిన బాధలు వర్ణనాతీతం. పుట్టుకతోనే వివక్ష: ఆడపిల్ల పుట్టిందంటేనే కుటుంబానికి ఒక బరువు. ఆమెను ఎప్పుడు, ఎవరికి అప్పగించి 'బాధ్యత' తీర్చుకోవాలా అనేదే తండ్రి ఆలోచన. ఈ క్రమంలో ఆమె ఇష్టాయిష్టాలకు, కలలకు చోటు లేదు.

బాల్య వివాహాల నరకం: బొమ్మలతో ఆడుకోవాల్సిన వయసులో, మెడలో మూడు ముళ్లు పడితే ఆ బాలిక మనసులో రేగే తుఫానును ఎవరు అర్థం చేసుకోగలరు? వయసు మళ్ళిన వాడికిచ్చి కట్టబెట్టినప్పుడు, ఆమె అనుభవించే శారీరక, మానసిక హింసను నాటి నవలలు కళ్ళకు కట్టాయి. వైధవ్యం అనే చెరసాల: దురదృష్టవశాత్తు భర్త చనిపోతే, ఆమె బతుకు జీవచ్ఛవంలా మారేది. గుండు గీయించి, మడి కట్టించి, శుభకార్యాలకు దూరంగా ఉంచుతుంటే.. 'నేను చేసిన పాపం ఏమిటి?' అని ఆ స్త్రీ కుమిలిపోయిన వైనం గుండెలను పిండేస్తుంది. ఆమెకు కన్నీరు పెట్టే హక్కు కూడా లేని దయనీయ స్థితి ఇది.

'స్త్రీ ఒక వ్యక్తి' - శరీరం, మనసు మధ్య సంఘర్షణ :

చలం, కొడవటిగంటి వంటి వారి కాలానికి వచ్చేసరికి, స్త్రీ 'నేను కేవలం ఇంటిని శుభ్రం చేసే యంత్రాన్ని కాదు, నాకూ ఒక శరీరం ఉంది, కోరికలు ఉన్నాయి' అని గుర్తించింది. కానీ ఈ గుర్తింపు ఆమెకు కొత్త కష్టాలను తెచ్చిపెట్టింది. పురుషుడు ఎన్ని తప్పులు చేసినా చెల్లుతుంది, కానీ స్త్రీ చిన్న గీత దాటినా ఆమెను 'కులత'గా, 'పతిత'గా ముద్ర వేసే సమాజంతో ఆమె పోరాడాల్సి వచ్చింది. తన మనసును చంపుకోలేక, సమాజం గీసిన గీతను దాటలేక, ఆమె పడిన సంఘర్షణ నరకతుల్యం. ఆమె తెలివితేటలు, సృజనాత్మకత నాలుగు గోడల మధ్యే సమాధి అయ్యాయి.

'నేను ఎవరు?' - అస్తిత్వ ఆవేదన :

ఆధునిక నవలల్లో (రంగనాయకమ్మ, ఓల్గా, వాసిరెడ్డి సీతాదేవి) స్త్రీ ఆర్థికంగా నిలదొక్కుకుంది. కానీ మానసికంగా ఇంకా తీవ్రమైన ఒత్తిడిని ఎదుర్కొంటోంది.

ఈ దశలో ఆమె బాధలు మరింత నున్నితమైనవి మరియు సంక్లిష్టమైనవి. రెట్టింపు భారం: ఆధునిక స్త్రీ ఉద్యోగం చేస్తోంది, సంపాదిస్తోంది. కానీ ఇంటికి వచ్చాక మళ్ళీ గృహిణి పాత్రను యథవిధిగా పోషించాల్సిందే. ఆఫీసు ఒత్తిడి ఒకవైపు, ఇంటి బాధ్యత మరోవైపు, ఈ రెండింటి మధ్య నలిగిపోతూ, కనీసం తనకోసం తాను గడపడానికి ఒక్క క్షణం దొరకని యంత్రంలా ఆమె జీవితం మారింది.

గుర్తింపు లేని వెట్టిచాకిరి :

కుటుంబం కోసం ఆమె ఎంత చేసినా అది 'బాధ్యత' కిందే లెక్క. 'నువ్వు కొత్తగా ఏం చేశావ్? అందరూ చేసేదేగా?' అనే మాటలు ఆమెను కృంగదీస్తాయి. తన త్యాగానికి, ప్రేమకు విలువ లేనప్పుడు, 'అసలు ఈ ఇంట్లో నా స్థానం ఏమిటి? నేను కేవలం పనిమనిషినా?' అనే ప్రశ్న ఆమెను నిలువునా దహించివేస్తుంది. భర్త పక్కన ఉన్నా, పిల్లలు ఉన్నా, తన మనసును పంచుకునే వారు లేక, తన భావాలను అర్థం చేసుకునే వారు లేక ఆధునిక స్త్రీ అనుభవిస్తున్న 'ఏకాంతం' చాలా బాధాకరమైనది. అందుకే ఈ దశలో విడాకులు, లేదా ఒంటరి పోరాటం ఒక అనివార్యమైన చర్యగా మారింది.

నవలల్లోని స్త్రీ పాత్రలను కేవలం సామాజిక కోణం లోనే కాకుండా, మానసిక కోణంలో కూడా విశ్లేషించాల్సిన అవసరం ఉంది. తరతరాలుగా స్త్రీ అచేతన మనసులో పేరుకుపోయిన బానిసత్వపు ఆలోచనల నుండి విముక్తి పొందడమే నిజమైన సాధికారత. చలం నుండి ఓల్గా వరకు వచ్చిన నవలల్లో స్త్రీ పాత్రలు ఈ అంతర్లీన సంఘర్షణను అధిగమించే క్రమాన్ని మృణాళిని గారు సమర్థవంతంగా విశ్లేషించారు.

ముగింపు (Conclusion):

సాహిత్యం అనేది సమాజ గమనానికి వెలుతురునిచ్చే దివిటీ వంటిది. ఆ వెలుగులో తెలుగు నవలా సాహిత్యాన్ని పరామర్శిస్తే.. గత శతాబ్ద కాలంగా స్త్రీ చేసిన ప్రయాణం ఒక అద్భుతమైన పరిణామ క్రమం. ఇది కేవలం పాత్రల మార్పు కాదు, ఒక జాతి ఆలోచనా విధానంలో వచ్చిన మార్పు. ఒకప్పుడు 'గడప దాటడమే పాపం' అనుకున్న కాలం నుంచి, 'గగనమే నా హద్దు' అని నినదించే కాలం వరకు స్త్రీ ప్రయాణించింది. ఈ ప్రయాణంలో తెలుగు నవల ఆమెకు ఒక తోడుగా, నీడగా, ఒక్కోసారి మార్గదర్శిగా నిలిచింది. కందుకూరి వారి నవలల్లో స్త్రీకి 'గొంతు' ఇస్తే, చలం ఆమెకు 'మనసు' ఇచ్చాడు. రంగనాయకమ్మ 'ధైర్యాన్ని' ఇస్తే, ఓల్గా ఆమెకు 'దిశను' చూపించింది.

తాత్వికంగా చెప్పాలంటే, స్త్రీ చైతన్యం అనేది పురుషుడిపై గెలుపు కాదు, అది తనపై తాను సాధించిన గెలుపు. తరతరాలుగా తన రక్తంలో ఇంకిపోయిన బానిస భావజాలం నుండి, అపరాధ భావం నుండి విముక్తి పొందడమే నిజమైన స్వేచ్ఛ అని తెలుగు నవల నిరూపించింది. సంకెళ్లను తెంచుకోవడం అంటే బంధాలను ద్వేషించడం కాదు, ఆ బంధాలలో

ఉన్న అసమానతను ప్రశ్నించడం అని ఈ సాహిత్యం చాటిచెప్పింది. నేటి ఆధునిక నవలలోని స్త్రీ సీతలా కష్టాలను మౌనంగా భరించడం లేదు, అలాగని ద్రౌపదిలా ప్రతీకారం కోసం మాత్రమే చూడటం లేదు. ఆమె సావిత్రిలా సంకల్పంతో, మైత్రేయిలా జ్ఞానంతో తనదైన కొత్త దారిని వెతుక్కుంటోంది. 'నేను ఎవరి సొత్తును కాదు, నా జీవితానికి నేనే కర్తను' అనే ఎరుక కలగడమే ఈ చైతన్యానికి పరాకాష్ట.

చివరగా, తెలుగు నవలా సాహిత్యం స్త్రీని ఒక దేవతగా పీఠం ఎక్కించాల్సిన అవసరం లేదని, ఆమెను తోటి మనిషిగా గౌరవిస్తే చాలని హెచ్చరిస్తోంది. ఏ సమాజమైతే స్త్రీ కన్నీటిని కాకుండా, ఆమె కలలను అర్థం చేసుకుంటుందో, అదే నిజమైన చైతన్యవంతమైన సమాజం. ఆ దిశగా తెలుగు నవల వేసిన అడుగులు చరిత్రలో చెరిగిపోని ముద్రలు. ఈ అక్షర ప్రయాణం ఆగదు. ఇది నిత్యనూతనంగా ప్రవహించే జీవనది.

సమాజ గమనంలో స్త్రీ పాత్ర కీలకమైనదని, తెలుగు నవల ఈ గమనాన్ని, గమ్యాన్ని సరిగ్గా అర్థం చేసుకుంది. సంఘ సంస్కరణ కాలంలో వితంతు వివాహాల కోసం పరితపించిన నవల, నేడు 'లివ్-ఇన్ రిలేషన్స్, సింగిల్

పేరెంట్ వంటి ఆధునిక జీవన విధానాలను కూడా విశ్లేషించే స్థాయికి చేరింది. తెలుగు నవలల్లో స్త్రీ చైతన్యం ఒక ప్రవాహంలా సాగింది. అది ఎక్కడా ఆగిపోలేదు. మారుతున్న కాలానికి అనుగుణంగా తన రూపం మార్చుకుంటూనే ఉంది. ఇంకా గ్రామీణ ప్రాంతాల్లోని స్త్రీల అక్షరాస్యత, ఆరోగ్యం, మూఢనమ్మకాలు వంటి అంశాలపై మరింత లోతైన నవలలు రావాల్సిన అవసరం ఉంది. అయితే, ఇప్పటివరకు వచ్చిన సాహిత్యం మాత్రం స్త్రీని ఒక 'మనిషి'గా గౌరవించాలనే సందేశాన్ని బలంగా వినిపించింది. స్త్రీ విముక్తి అంటే పురుష ద్వేషం కాదు, అది ఆత్మగౌరవ ప్రకటన అని తెలుగు నవల చాటి చెప్పింది. భవిష్యత్తులోనూ సామాజిక మార్పుకు తెలుగు నవల ఒక దిక్సూచిలా పనిచేస్తుందని నిస్సందేహంగా చెప్పవచ్చు.

పాద సూచికలు (Footnotes) :

1. తొలి నవల - సంస్కరణ దృక్పథం: తెలుగులో నవలా ప్రక్రియ ఆరంభమే ఒక సామాజిక అవసరం నుండి పుట్టింది. కందుకూరి వీరేశలింగం పంతులు గారి 'రాజశేఖర చరిత్ర' (1878) కేవలం కథ చెప్పడం కోసం కాకుండా, నాటి మూఢాచారాలను, స్త్రీ అవిద్యను ఖండించడానికి ఒక ఆయుధంగా రాయబడింది.

   ఆధారం : ముదిగంటి సుజాతారెడ్డి, తెలుగు నవలా వికాసం, పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం ప్రచురణ, హైదరాబాద్, 1999, పుట సంఖ్యలు. 24-26.

2. చలం తాత్వికత - స్వేచ్ఛా ప్రతిపాదన: గుడిపాటి వెంకట చలం తన 'మైదానం' మరియు 'స్త్రీ' వంటి రచనల ద్వారా స్త్రీకి శారీరక, మానసిక స్వేచ్ఛ ఉండాలని బలంగా వాదించారు. 'పాతివ్రత్యం అనేది స్త్రీ మీద పురుషుడు విధించిన బానిసత్వపు సంకెళ్లు' అని ఆయన చేసిన వ్యాఖ్యలు నాటి సాహిత్య రంగాన్ని కుదిపేసాయి.

   ఆధారం: గుడిపాటి వెంకట చలం, స్త్రీ, అరుణా పబ్లిషింగ్ హౌస్, విజయవాడ, 1996, పుట సంఖ్య. 42.

3. మధ్యతరగతి జీవన చిత్రణ: రంగనాయకమ్మ గారి 'బలిపీఠం' నవల ప్రధానంగా కులాంతర వివాహాల వైఫల్యాలను, మధ్యతరగతి స్త్రీల గృహ హింసను చర్చించింది. ముఖ్యంగా అత్తగారి పెత్తనం స్త్రీని ఎలా మానసికంగా కృంగదీస్తుందో ఇందులో చూడవచ్చు.

   ఆధారం: రంగనాయకమ్మ, బలిపీఠం, స్వీట్ హోమ్ పబ్లికేషన్స్, విజయవాడ, 2002, పుట సంఖ్యలు. 115-118.

4. మట్టి మరియు మనిషి సంబంధం: వాసిరెడ్డి సీతాదేవి రాసిన 'మట్టి మనిషి' నవల భూమికి, స్త్రీకి ఉన్న అవినాభావ సంబంధాన్ని, పెట్టుబడిదారీ వ్యవస్థ ఆ రెంటినీ ఎలా నాశనం చేసిందో ఈ నవలలో 'వరాలమ్మ' పాత్ర ద్వారా రచయిత్రి విశ్లేషించారు.

   ఆధారం: వాసిరెడ్డి సీతాదేవి, మట్టి మనిషి, నవోదయ పబ్లిషర్స్, విజయవాడ, 1975, పుట సంఖ్యలు. 89-91.

5. స్త్రీవాద ప్రణాళిక - స్వేచ్ఛ: ఓల్గా రాసిన 'స్వేచ్ఛ' (1987) నవల తెలుగు స్త్రీవాద సాహిత్యానికి ఒక మేనిఫెస్టో లాంటిది. కుటుంబ వ్యవస్థలో స్త్రీ తన సొంత వ్యక్తిత్వాన్ని ఎలా కోల్పోతోందో, తిరిగి తనను తాను ఎలా వెతుక్కోవాలో ఈ నవలలోని ఆధారం: ఓల్గా, స్వేచ్ఛ, స్వేచ్ఛ ప్రచురణలు, హైదరాబాద్, 1987, పుట సంఖ్యలు. 132-135.

6. సాధికారత నిర్వచనం: కాత్యాయని విద్మహే తన 'మహిళా సాధికారత - సాహిత్యం' గ్రంథంలో పేర్కొన్నట్లుగా - 'సాధికారత అంటే పురుషునితో యుద్ధం చేయడం కాదు, నిర్ణయాధికారంలో సమాన వాటా కలిగి ఉండటం'. ఈ కోణం నుండే ఆధునిక నవలలు విశ్లేషించబడ్డాయి.

ఆధారం : కాత్యాయని విద్మహే, మహిళా సాధికారత - సాహిత్యం, విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్, హైదరాబాద్, 2010, పుట సంఖ్య. 18.

ఉపయుక్త గ్రంథ సూచీ : (References)

1. ఓల్గా. స్వేచ్ఛ. హైదరాబాద్: స్వేచ్ఛ ప్రచురణలు, 1987.
2. కందుకూరి వీరేశలింగం. రాజశేఖర చరిత్ర. హైదరాబాద్: విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్, (పునర్ముద్రణ) 1990.
3. గుడిపాటి వెంకట చలం. మైదానం. విజయవాడ: అరుణా పబ్లిషింగ్ హౌస్, 1927 (పునర్ముద్రణలు: 1996).
4. యద్దనపూడి సులోచనారాణి. సెక్రటరీ. విజయవాడ: క్వాలిటీ పబ్లిషర్స్, 1968.
5. రంగనాయకమ్మ. బలిపీఠం. హైదరాబాద్: స్వీట్ హోమ్ పబ్లికేషన్స్, 1962 (పునర్ముద్రణ: 2002).
6. వాసిరెడ్డి సీతాదేవి. మట్టి మనిషి. విజయవాడ: నవోదయ పబ్లిషర్స్, 1975.
7. కాత్యాయని విద్మహే. మహిళా సాధికారత - సాహిత్యం. హైదరాబాద్: విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్, 2010.
8. ముదిగంటి సుజాతారెడ్డి. తెలుగు నవలా వికాసం. హైదరాబాద్: పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం, 1999.
9. వల్లంపాటి వెంకటసుబ్బయ్య. తెలుగు నవలా పరిచయం. హైదరాబాద్: విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్, 1986.
10. మృణాళిని, సి. తెలుగు నవలా సాహిత్యం - మనోవిశ్లేషణ. హైదరాబాద్: తెలుగు అకాడమీ, 2000.

★★★

Vol. 23 | Spl. Issue 03 | March 2026 | BHAVAVEENA | ISSN No. : 2456-4702 | RNI No. APTEL/2003/12253

RNI No. APTEL/2003/12253 | Reffered Journal & Peer Reviewed Journals | ISSN No. 2456-4702

భావవీణ

కళలు, సాహిత్య, సాంస్కృతిక భాషాధ్యయన పత్రిక

BHAVA VEENA

Journal of Arts, Literary, Culture & Language Study

అబ్బూరి ఛాయాదేవి కథలు - స్త్రీవాద దృక్పథం

- దొసరి శ్రీలత

తెలుగు అతిథి అధ్యాపకులు, కరీంనగర్ మహిళా డిగ్రీ, పీజీ కళాశాల, కరీంనగర్.

తెలుగు సాహిత్యంలో స్త్రీవాద ఉద్యమం యొక్క పరిణామ క్రమంలో అబ్బూరి ఛాయాదేవి గారి రచనలు ప్రత్యేకంగా నిలుస్తాయి. ఈమె మద్దాలి వెంకట చలం, వెంకట రమణమ్మ దంపతులకు 1933 అక్టోబరు 13న రాజమహేంద్రవరంలో సాంప్రదాయ బ్రాహ్మణ కుటుంబంలో జన్మించారు. తన బాల్యమంతా ఒక సంప్రదాయపు కట్టడిలో గడిపారు. ఈ అనుభవమే ఆమెకు స్వేచ్ఛ విలువను, దానికోసం పరితపించడాన్ని నేర్పించింది. ఛాయాదేవి 1951-53 మధ్య నిజాం కళాశాల నుండి ఎం.ఏ. పొలిటికల్ సైన్స్ పూర్తి చేశారు. ఆ తరువాత లైబ్రరీ సైన్సెస్ లో డిప్లొమా కూడా తీసుకున్నారు. ఈ విద్యాభ్యాసం ఆమెకు సమాజాన్ని, సాహిత్యాన్ని లోతుగా అధ్యయనం చేసే అవకాశం కల్పించింది. ఆంగ్లసాహిత్యాన్ని కూడా ఔపోసన పట్టిన ఛాయాదేవి, తన రచనల ద్వారా స్త్రీలను వంటింటి చీకటి నుండి బయటికి తీసుకువచ్చి, విశాల ప్రపంచంలో ఏం జరుగుతోందో చూడమన్నారు.

1952లో నిజాం కాలేజి పత్రికలో ప్రచురితమైన 'అనుబంధం' అనే కథ, 1953లో కాలేజీ మాగజైన్ లో ప్రచురితమైన 'అనుభూతి' ఆమె తొలి రచనలు. 1954లో వచ్చిన 'విమర్శకులు' ఆమె మొదటి కథగా పరిగణించ బడుతుంది. అప్పటి నుంచి ఆమె కథలన్నీ స్త్రీల జీవితాల చుట్టూనే నడిచాయి. ఆమె భర్త అబ్బూరి వరద రాజేశ్వరరావు కూడా ప్రసిద్ధ రచయిత. వృత్తిరీత్యా ఛాయాదేవి న్యూఢిల్లీలోని జవహర్ లాల్ నెహ్రూ విశ్వ విద్యాలయంలో డిప్యూటీ లైబ్రేరియన్ గా పనిచేసి 1982లో స్వచ్ఛందంగా పదవీ విరమణ చేశారు.

ఛాయాదేవి గారి సాహిత్యంలో ప్రధానంగా కనిపించే అంశాలు ఇవి. అనేక కట్టడుల మధ్య పెరిగిన ఆడపిల్ల. భర్త కనుసన్నలలో నడవవలసిన భార్య. పిల్లల అధీనతలో ఉండవలసిన తల్లి. ఇలా స్త్రీ జీవితంలోని వివిధ దశలను ఆమె తన కథల్లో చిత్రించారు. ఆమె కథల్లోని స్త్రీలు తిరుగుబాటుదార్లుగా కనిపించరు. కానీ వారు నిజంగా తిరుగుబాటుదార్లే. తమ జీవితాల్లోని అణచివేతను తప్పించుకోవడానికి వారెంచుకున్న దారులు చాలా భిన్నమైనవి. 'బోన్సాయ్ బ్రతుకు' వంటి కథలు స్త్రీల పెంపకంలోని వివక్షను ప్రతీకాత్మకంగా చూపించాయి. స్వేచ్ఛగా పెరిగిన పెద్ద చెట్టు జడివానలోనూ, పెనుగాలిలోనూ పదిమందికి నీడనిస్తే, కుండీలో కుదించి పెంచిన మొక్కను జడివాన నుంచి మనమే కాపాడి లోపల పెట్టుకోవాలి. ఈ కథ ద్వారా స్త్రీల పరిస్థితిని ఆమె వివరించారు. 'ప్రయాణం', 'సుఖాంతం' వంటి కథలు గంభీరమైన సమస్యలను ఎలాంటి మెలోడ్రామా లేకుండా సూటిగా రాయడం వల్ల పాఠకుల మనసుల్లో చెరగని ముద్ర వేశాయి.

ఛాయాదేవి తనను తాను మానవతావాదిగా కన్నా స్త్రీవాదిగా చెప్పుకోవడానికే ఇష్టపడతానన్నారు. ఆమె కథలు తీవ్రంగానో, నిష్మరపూర్వకంగానో కాక, ఆర్ధత కలిగించేటట్లూ హాస్యస్ఫోరకంగానూ వ్యంగ్యపూర్వకం గానూ ఉంటాయి. ఆమెకు 1993లో వాసిరెడ్డి రంగ నాయకమ్మ సాహిత్య పురస్కారం లభించింది. 1996లో 'మృత్యుంజయ' పుస్తకానికి తెలుగు విశ్వవిద్యాలయం నుండి ఉత్తమ రచయిత్రి అవార్డు వచ్చింది. 2005లో 'తనమార్గం' కథాసంకలనానికి కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు లభించింది. 2019 జూన్ 28న ఛాయాదేవి మరణించారు. కానీ ఆమె రచనలు నేటికీ తెలుగు సాహిత్యంలో స్త్రీవాద ప్రేరణగా నిలుస్తున్నాయి. ఈ వ్యాసంలో ఛాయాదేవి గారి ఆరు కథలను - 'ప్రయాణం' (1965), 'స్పర్శ' (1989), 'తన మార్గం' (1996), 'విమర్శకులు' (1954), 'నిర్ణయం' (1993), 'బోన్సాయ్ బ్రతుకు' (1974) - పరిశీలించి, వాటిలోని సామాజిక అంశాలను, స్త్రీ పాత్రల స్వభావాలను, వారి జీవితాలను ప్రభావితం చేస్తున్న సంఘర్షణలను విశ్లేషించడం జరిగింది.

సామాజిక అంశాలు :

ఈ కథల్లో ప్రతిబింబించే మొదటి ముఖ్యమైన సామాజిక అంశం పితృస్వామ్య వ్యవస్థ. ఈ వ్యవస్థ స్త్రీ జీవితంలోని ప్రతి అంశాన్నీ నియంత్రిస్తుంది. ఛాయాదేవి గారి సాహిత్యంలో ఈ పితృస్వామ్య వ్యవస్థ పట్ల నిరసన కనిపిస్తుంది. ఆమె నిరసన పురుషుల మీద కాదు. ఈ పురుషుల్ని ఇలా ఉండమని ప్రేరేపించిన పితృసామ్య సమాజం పట్లే. "ప్రయాణం" కథలో రమ తండ్రి, తనకు ఇష్టమైన సంబంధాన్ని కుమార్తె ఎందుకు కాదన్నదనే ఆగ్రహంతో ఉంటారు. కానీ ఆయనకు కోపం రావడానికి కారణం కుమార్తె సంతోషం కంటే, తన మాట జరగ లేదనేదే. ఇది పితృస్వామ్య వ్యవస్థ యొక్క స్వరూపాన్ని స్పష్టంగా చూపిస్తుంది. రమ తన తండ్రితో ఇలా అనుకుంటుంది. "నాన్నగారూ, ఈ ఒక్క విషయంలో నన్ను అభ్యంతర పెట్టకండి. నా సుఖాన్ని కోరేవారైతే అతన్ని చేసుకోమని నన్ను బలవంత పెట్టకండి."

"స్పర్శ" కథలో తండ్రి-కూతురి మధ్య దూరం స్పష్టంగా కనిపిస్తుంది. ఎనభై ఏళ్ల వయసులో, చూపు పోయిన తండ్రి తన కూతురి చేతిని తడిమి, దగ్గరగా కూర్చోమంటారు. కానీ బాల్యం నుంచీ తండ్రి దగ్గర చనువు లేకపోవడంతో, ఆ స్పర్శ కోసం తపించినా దగ్గరగా వెళ్లలేని పరిస్థితి. ఇది పితృస్వామ్య వ్యవస్థలో తండ్రీ-కూతుళ్ల మధ్య ఉండే భావోద్వేగ దూరాన్ని చూపిస్తుంది. కథకురాలు ఇలా వ్యాఖ్యానిస్తుంది. "ఆయన పెంచిన పెంపకం అలాంటిది. నాకు అక్షరాభ్యాసం అయినప్పటి నుంచి ఆయన తన్ను క్రమశిక్షణ పేరుతోనూ, మడి, ఆచారం కారణాల వల్లనూ, చూపులతోనే అల్లంత దూరాన నిలబెట్టి మాట్లాడటం అలవాటయి, ఆయన దగ్గర చనువు తీసుకునే సాహసం హరించుకు పోయింది."

"విమర్శకులు" కథలోని శ్యామల తండ్రి కట్నం కోసం సంబంధం నిశ్చయించుకుని, తరువాత ఆ సంబంధం తప్పిపోయినప్పుడు ఆమె పరిస్థితి శోచనీయంగా ఉంటుంది. ఇది స్త్రీని ఒక వస్తువుగా చూసే సామాజిక దృక్పథాన్ని ప్రతిబింబిస్తుంది. ప్రమీల శ్యామలతో ఇలా అంటుంది. "ఆ చదువుకున్న పశువుకి డబ్బు ప్రధానంకాని నువ్వు ప్రధానం కాదని నేనప్పుడే అనుకున్నాను."

కులం మరియు వర్గం కూడా ఈ కథల్లో ముఖ్యమైన పాత్ర పోషిస్తాయి. ఛాయాదేవి గారు సమాజంలోని స్త్రీ పురుష వివక్ష గురించీ, తోటి స్త్రీలకు జరిగిన అనుభవా లను తనకు జరిగినట్లు స్పందించి రాశారు. "ప్రయాణం" కథలో రమ మూర్తిని ప్రేమించడానికి ఆమె తల్లిదండ్రుల అభ్యంతరం అతను వేరే శాఖకు చెందినవాడనే. రమ ఇలా చెప్పుకుంటుంది. "మూర్తి మన శాఖ వాడు కాదు. పైగా హోదా కూడా తక్కువేనని అమ్మకీ నాన్నగారికీ అయిష్టత. ఈ రోజుల్లో కులాలే పట్టించుకోవటం లేదు - ఇక శాఖలంటూ మూర్ఖంగా కూర్చుంటే ఎలా?"

"విమర్శకులు" కథలో విమల కలవారి బ్రాహ్మణ కుటుంబంలో పుట్టింది. రామారావు తండ్రి కోమటి కొట్టులో గుమాస్తా. విమల రామారావును ప్రేమించి పెళ్లి చేసుకోవడం సంప్రదాయ సమాజంలో ఎంత పెద్ద విప్లవమో ఈ మాటల ద్వారా అర్థమవుతుంది. "విమల కలవారి కూతురు. సంప్రదాయికమయిన బ్రాహ్మణ

కుటుంబంలో పుట్టింది. రామారావు తండ్రి కోమటి కొట్టులో గుమాస్తా.''ే ''నిర్ణయం'' కథలో అమూల్యకు వచ్చిన సంబంధాల్లో అమెరికాలో ఉండే కుర్రవాళ్ల జాతకాలు సరిపోలేదని తండ్రి చెప్పడం కుల, వర్గాల కంటే కూడా జాతకాలు, జ్యోతిష్యం వంటి సంప్రదాయ విశ్వాసాలు ఎలా స్త్రీ వివాహంలో అడ్డంకులుగా మారతాయో చూపిస్తుంది. అమూల్య తన ఉత్తరంలో ఇలా రాస్తుంది. ''ఇంతకు ముందొచ్చిన సంబంధాల్లో అమెరికాలో ఉంటున్న కుర్రవాళ్లన్నారు. కానీ వాళ్ల జాతకాలు సరిగా లేవని - అందులో ఒకరికి 'మారకం' ఉందనీ, మరొకరికి 'ద్వితీయ కళత్రయోగము' ఉందనీ కొట్టి పారేశారు నాన్నగారు.''

విద్య మరియు స్త్రీ ఈ కథల్లో కేంద్ర బిందువుగా నిలుస్తుంది. ఛాయాదేవి గారు స్వయంగా ఎం.ఏ. చదివి, లైబ్రరీ సైన్సెస్ లో డిప్లొమా తీసుకుని, ఢిల్లీలోని జవహర్ లాల్ నెహ్రూ విశ్వవిద్యాలయంలో డిప్యూటీ లైబ్రేరియన్ గా పనిచేశారు. ఈ అనుభవం ఆమె రచనల్లో ప్రతిబింబించింది. ''బోన్సాయ్ బ్రతుకు'' కథలో అక్కకు చదువు లేకపోవడం, చెల్లెలికి చదువు ఉండడం - ఇది రెండు తరాల స్త్రీల మధ్య తేడాను చూపిస్తుంది. కథకురాలు ఇలా వివరిస్తుంది. ''అక్కయ్య నాకుమల్లే చదువుకోలేదు. చదువుకోలేదంటే - దాన్ని అయిదో తరగతితోటే చదువు మానిపించేశారు మా నాన్నగారు. ఆడపిల్లకి చదువేమిటి? చాకలిపద్దు రాయగలిగితే చాలదా అనుకునే రోజులవి. ఒక దశాబ్దం తరవాత పుట్టిన నా నాటికి ఆడపిల్లకి చదువు అవసరమా అనవసరమా అనే మీమాంస తగ్గిపోయింది.'' అక్కయ్య తన కూతురి చదువు గురించి ఇలా చెప్పుకుంటుంది. ''స్కూలు ఫైనలు చదువుతోంది. దేవుడి దయవల్ల గట్టెక్కితే కాలేజీలో చేర్పించాలనే నా పట్టు. పొరుగూరు పంపించి హాస్టల్లో ఉంచటం ఆయనికి అంత ఇష్టం లేదు. అయినా ఆడదాన్ని చదువులేకుండా ఇంట్లో కూర్చోబెట్టటం నాకిష్టం లేదే.''

వృద్ధాప్యం మరియు ఒంటరితనం ''తన మార్గం'' కథలో ప్రధాన సమస్య. భర్త మరణించిన తరువాత వర్ధనమ్మ జీవితంలో ఎదుర్కొంటున్న సమస్యలు, పిల్లలతో సంబంధాలు, ఆర్థిక స్వాతంత్ర్యం వంటి అంశాలు ఇందులో చర్చించబడ్డాయి. వర్ధనమ్మ ఆలోచనలు ఇలా ఉంటాయి. ''ఇప్పుడలా కాదు. నాలుగు రకాల తోవలు కనిపిస్తున్నాయి. రెండు కొడుకులవీ, ఒకటి కూతురిదీ. నాలుగోది ఒంటరి మార్గం.''

స్త్రీ పాత్రల స్వభావం

ఛాయాదేవి గారి కథల్లోని స్త్రీ పాత్రలు తిరుగు బాటుదార్లుగా కనిపించరు. కానీ వారు నిజంగా తిరుగు బాటుదార్లే. తమ జీవితాలలోని అణచివేతను తప్పించు కోవడానికి వారెంచుకున్న దారులు చాలా భిన్నమైనవి. ''ప్రయాణం'' కథలో రమ ఒక ఆధునిక, చదువుకున్న, స్వతంత్రించాలనుకునే యువతి. ఆమె తన జీవితంలో తాను నిర్ణయాలు తీసుకోవాలనుకుంటుంది. తల్లి దండ్రులు చూపిన సంబంధాన్ని కాదని, తాను ప్రేమించిన మూర్తిని పెళ్లి చేసుకోవాలనుకుంటుంది. కానీ రాజమండ్రిలో జరిగిన ఘటన ఆమె జీవితాన్ని పూర్తిగా మార్చేస్తుంది. ఆమె అంతర్మథనం ఇలా ఉంటుంది. ''నేనిదివరకటి దాన్ని కాదిప్పుడు- శారీరకంగా గాని, మానసికంగా గాని. ఈ మార్పు నా జీవనాన్ని ఎలా తీర్చిదిద్దుతుందో తెలియదు. మూర్తి ప్రేమ నిన్నటి వరకూ సజీవరూపంలో నాఎదుట నిలిచింది. ఈరోజు బుద్బుదమై గాలిలో తేలి నానుంచి దూరమైపోతున్నట్లు తోస్తున్నది.'' ఆఖరిలో శేఖరం చేసిన ప్రతిపాదన ఆమెకు కొత్త దారి చూపిస్తుంది. అతను తనను ఒక వ్యక్తిగా గౌరవించడం, తన సహచర్యాన్ని కోరడం - ఇది ఆమెకు కొత్త అనుభూతి. ''నువ్వు నా కూడా ఉండి నాకు చేదోడు వాదోడుగా ఉండి శాస్త్రపరిశోధనలో కృషి చేస్తే మనం సాధించలేనిది ఉండదు. నీ తోడు కావాలి నాకు. జీవనసహచరులుగా ఉండటానికి ఆడపిల్లలు అనేక మంది దొరుకుతారు. కానీ నీలా ఆలోచనాశక్తి ఉన్న ఆడపిల్ల దొరకటం అరుదు.''

''ప్రయాణం'' కథలోనే సుధ రమ స్నేహితురాలు. భర్త రాజారావు దుర్వర్తనం తెలిసినా, భర్త మీద ప్రేమ,

భక్తితో సర్దుకుపోయే స్త్రీ. ఆమె తన భర్త గురించి ఇలా చెప్పుకుంటుంది. ''మాది ప్రేమ వివాహం కాదు, పెద్దవాళ్ళు చూసి చేసిన సంబంధమే. కాని ఆమాట కొస్తే మాది 'తొలిచూపులో ప్రేమ' అని చెప్పొచ్చు. నన్ను తప్ప మరెవర్నీ పెళ్ళి చూపులు చూడటానికి వెళ్ళలేదాయన.'' ఇదే కథలో స్వాములవారు ఒక ఆధ్యాత్మిక వ్యక్తి. ఛాయాదేవి గారికి జిడ్డు కృష్ణమూర్తి ఫిలాసఫీ అంటే చాలా ఇష్టం. జిడ్డు కృష్ణమూర్తి తాత్విక దృక్పథమే ఆమె జీవితాన్ని నడిపించింది. ఈ కథలోని స్వాములవారి బోధనలు ఆ ప్రభావాన్ని చూపిస్తాయి. స్వాములవారు ఇలా అంటారు. ''సమస్యల నుంచి కాదు నువ్వు పారిపోయేది నీ సమస్య లకు సంబంధించిన పరిస్థితుల నుంచి -కానీ సమస్య లెప్పుడూ నీలోనే ఉంటాయి. నీ మనస్సే నీ సమస్యల కర్మాగారం.''

''స్పర్శ'' కథలో కూతురు తండ్రితో సన్నిహితంగా ఉండాలనుకునే, కానీ బాల్యం నుంచీ అలవాటు లేక పోవడంతో దూరంగా ఉండే కుమార్తె. ఆమె అంతర్మథనం ఇలా ఉంటుంది. ''నాన్నగారికి సమీపంగా, సన్నిహితంగా కూర్చోవడం అన్నది లీలగా మిగిలిపోయిన బాల్యస్మృతి. ఇప్పుడు ఆయన నా చేతిని తన చేతుల్లోకి తీసుకుని అప్యాయంగా స్పృశిస్తూంటే నా చిన్నతనం నుంచీ ఆ స్పర్శకోసం నేను అంతరాంతరాల్లో పొందిన తపనంతా కళ్లకు కట్టినట్లై కళ్ల నీళ్లు తిరిగాయి.''

''తన మార్గం'' కథలో వర్ధనమ్మ భర్త మరణానంతరం ఒంటరిగా జీవించాలని నిర్ణయించుకున్న వృద్ధురాలు. ఆమె భర్త రాసిన విల్లు గురించి తెలుసుకున్న తరువాత తన జీవితం గురించి పునరాలోచించుకుంటుంది. ఆమె ఆలోచనలు ఇలా ఉంటాయి. ''ఇన్నాళ్ళుగా భర్త, పిల్లలూ, మనవలూ అందరూ తన వాళ్ళే కానీ, తనదంటూ ఏమీ లేదని ఇప్పుడు గాని తెలిసి రాలేదు. ఇప్పుడీ ఇల్లు తనది అనుకోగానే కొండంత బలం వచ్చినట్లుగా ఉంది వర్ధనమ్మకి.''

''విమర్శకులు'' కథలో ప్రమీల తీవ్రమైన స్త్రీవాద భావాలు కలిగిన పాత్ర. పెళ్లి అంటే అనవ్యం, స్వతంత్రంగా బతకాలనే తపన. కానీ చివరికి ఆమె ఒక ప్లీడరుకు రెండో భార్యగా జీవించాల్సి వస్తుంది. ఆమె వాదన ఇలా ఉంటుంది. ''ఎన్నో సంసారాలు చూశాను. కొత్తగా పెళ్ళి చేసుకున్నవాటిని చూశాను. ప్రేమించి పెళ్ళిచేసుకున్న వాళ్లని చూశాను. వృద్ధదంపతుల్ని చూశాను. అనేకరకాల సంసారాలను స్టడీ చేశాను. అందులో ఏ ఒక్కరూ కూడా సంసారంలో సుఖంఉందన్న ముక్క అనలేదు.''

''నిర్ణయం'' కథలో అమూల్య ఆధునిక, చదువుకున్న, ఉద్యోగం చేసే యువతి. సుధాకర్ అనే సైంటిస్టో పెళ్లి చూపులు జరిగిన తరువాత, అతని స్వభావం అర్థం కాక సందిగ్ధంలో పడుతుంది. ఆమె తన ఉత్తరంలో ఇలా రాస్తుంది. ''నేను సందిగ్ధావస్థలో ఉన్నాను. సుధాకర్ విషయంలో నిర్ణయం మమ్మీ నాకే వదిలేశానంటోంది. కానీ నేను ఎటూ నిర్ణయించుకోలేకుండా ఉన్నాను. అతను అందంగా లేడనీ, మంచి పొజిషన్లో లేడనీ కాదు. అన్నీ పైకి బాగానే ఉన్నాయి. కానీ అతనితో మాట్లాడాక ఎందుకో ఒక కచ్చితమైన నిర్ణయానికి రాలేక పోతున్నాను.''

''బోన్సాయ్ బ్రతుకు'' కథలో అక్కయ్య చదువు లేని, పల్లెటూరిలో జీవించే స్త్రీ. కానీ జీవితాన్ని లోతుగా అర్థం చేసుకున్న తెలివి ఆమెకు ఉంది. ఆమె చెల్లెలి 'బోన్సాయ్' చెట్లను చూసి ఇలా వ్యాఖ్యానిస్తుంది. ''ఆ తురాయి చెట్టు ఎంత పెద్దచెట్టు అయిందో చూడు- బయట విశాలంగా ఉన్న చోట స్వేచ్ఛగా పెరిగింది కదూ - ఎంతటి గాలి దుమారం వచ్చినా అది కించిత్తు చలించలేదు. పైగా అంతమంది జనానికి ఆశ్రయం కల్పించి వాళ్ళకి ఆసరాగా నిలిచింది. నువ్వు అపురూపంగా పెంచిన నీ బోన్సాయ్ చూడు! చూడటానికి కుదురుగా ముచ్చటగానే ఉంది సంసార పక్షపు స్త్రీలాగ. కానీ ఎంత సుకుమారమో చూడు. నువ్వు వెయ్యికళ్ళతో కాపాడాలి దాన్ని -కాస్త తుఫానుకి కూడా తట్టుకోలేదు.''

స్త్రీ స్వేచ్ఛ మరియు నిర్ణయాలు

ఈ కథలన్నింటిలో స్త్రీ పాత్రలు తమ జీవితాల్లో నిర్ణయాలు తీసుకోవడానికి ప్రయత్నిస్తాయి. కానీ సమాజం, కుటుంబం, సంప్రదాయాలు వారికి అడ్డంకులుగా నిలుస్తాయి. ఛాయాదేవి గారి కథల్లో స్వేచ్ఛకు

సంబంధించిన అనేక కోణాలను సున్నితంగా చర్చకు పెడతాయి. ''ప్రయాణం''లో రమ తల్లిదండ్రుల నిర్ణయాన్ని ఎదిరించి, తాను ప్రేమించిన వ్యక్తిని పెళ్లి చేసుకోవాలనుకుంటుంది. కానీ రాజమండ్రి ఘటన ఆమె స్వేచ్ఛను హరించేస్తుంది. చివరికి శేఖరం చేసిన ప్రతిపాదన ఆమెకు ఒక కొత్త దారి చూపిస్తుంది. అతను ఆమెను ఒక వ్యక్తిగా గౌరవించడం.

''తన మార్గం''లో వర్ధనమ్మ ఒంటరిగా జీవించాలని నిర్ణయించుకుంటుంది. పిల్లలు వచ్చి ఉండమని ఎంత చెప్పినా ఆమె తన నిర్ణయంలో స్థిరంగా ఉంటుంది. ఆమె అనుభవం ఇలా ఉంటుంది. ''చిన్నప్పుడు చెట్లెక్కేది జామకాయల కోసమూ, మామిడికాయల కోసమూ, పన్నెండేళ్ళొచ్చినా చెట్లెక్కుతోందని తల్లి చివాట్లేసేది. తండ్రి చేత కూడా చివాట్లేయించింది - 'ఇలా చేసి ఏ కాలో విరక్కొట్టుకుంటే నిన్నెవడు పెళ్ళి చేసుకుంటాడేం?' అని. తరవాత ఒక రావిచెట్టు లాంటి వాడికిచ్చి పెళ్ళి చేశారు ఆ చెట్టు నీడని బతకమని. ఇప్పుడా చెట్టు లేదు.''

''విమర్శకులు''లో ప్రమీల స్వతంత్రంగా బతకాలని తపించినా, చివరికి ఒక ప్లీడరుకు రెండో భార్యగా జీవించాల్సి వస్తుంది. ఆమె ఆదర్శాలు, సిద్ధాంతాలు అన్నీ విఫలమవుతాయి. శ్యామలకు మాత్రం కట్నం వల్ల సంబంధం తప్పి, మళ్లీ మంచి సంబంధం వస్తుంది. ఈ కథ స్త్రీ జీవితాలు ఎన్ని అనిశ్చితాలతో నిండి ఉంటాయో చూపిస్తుంది. ''నిర్ణయం''లో అమూల్య స్వయంగా తన జీవిత భాగస్వామిని ఎంచుకోవాలనుకుంటుంది. ఆమె తన ఉత్తరంలో ఇలా రాస్తుంది. ''పూర్వపురోజుల్లోనైనా పుట్టాను కాను. ఎవరో ఒకర్ని కట్టబెట్టేవారు... ఏ సంగతీ నిర్ణయించుకుని చెప్పమని తొందర పెడుతోంది అమ్మ... మీ సలహా ఏమిటి?''

''బోన్సాయ్ బ్రతుకు''లో 'బోన్సాయ్' చెట్లు స్త్రీ జీవితానికి రూపకంగా నిలుస్తాయి. పెరగాల్సినంత పెరగకుండా, విన్నరించాల్సినంత విన్నరించకుండా, కుండీలో బంధించబడిన స్త్రీ జీవితం - ఇదే ఈ కథలోని సందేశం. ఈ కథ అనేక భాషల్లోకి అనువదించబడింది. 2000 సంవత్సరంలో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం 10వ తరగతి తెలుగు వాచకంలో ఈ కథను చేర్చింది. అక్కయ్య మాటల్లో ఇలా ఉంటుంది. ''మగవాడికీ ఆడదానికీ పెంపకంలో ఉన్న తేడా వల్లనే కదుటే ఆడదాని బ్రతుక్కూడా 'బోన్సాయ్' మాదిరి అయింది!''

ఛాయాదేవి గారి కథల్లో స్త్రీలు చేసే చాకిరి, స్త్రీలకు పని చేసే చోట ఎదురయ్యే లైంగిక వేధింపులు, భర్తలకు నీడల్లా బతకాల్సిన పరిస్థితి, వీటన్నింటి మీదా తిరగబడాలనిపించే వారి మానసిక స్థితి - వీటిని చాలా నేర్పుగా పట్టుకున్నారు. ''ప్రయాణం'' కథలో రమ అనుభవించిన లైంగిక వేధింపు స్త్రీ శరీరం ఎలా అసురక్షితంగా ఉంటుందో చూపిస్తుంది. రాజారావు చేసిన పని ఆమె జీవితాన్ని పూర్తిగా మార్చేస్తుంది. ఆ ఘటన తరువాత రమ ఆలోచనలు ఇలా ఉంటాయి. ''జరిగిన సంఘటనని మనస్సు మెల్లిమెల్లిగా పునశ్చరించుకుంటోంది. 'నాకెందుకు జరిగిందిలా? నేనింత అబలనెలా అయిపోయాను?' కళ్ళనిండా నీరునిండి రెండు కనుకొలకుల్లోంచీ జారీ చెంపలూ చెవులూ తడిశాయి. కోపం, ఆవేశం, బాధ, భయం, జాలి, అసహ్యం - ఒక్కసారిగా అనుభవించాను.'' ఈ ఘటన తరువాత ఆమె మూర్తితో చెప్పాలా వద్దా అని సంఘర్షించుకుంటుంది. చివరికి చెప్పినప్పుడు మూర్తి ప్రతిక్రియ ఆమెను మరింత బాధకు గురి చేస్తుంది. ఇది సమాజంలో స్త్రీ శరీరం పట్ల ఉండే దృక్పథాన్ని ప్రతిబింబిస్తుంది. ''విమర్శకులు'' కథలో ప్రమీల వాదన ప్రకారం, వివాహం అనేది స్త్రీకి స్వేచ్ఛను ఇవ్వదు. ఆమె ఇలా అంటుంది. ''ఇప్పటివరకూ మీ నాన్న మీద ఆధారపడ్డావు. ప్రతీదానికీ నాన్న గారు విమంటారోనని భయం. ఇక పెళ్ళయాక భర్త భర్తనిమంటాడోనని భయం. ఇక నీకు 'స్వతంత్రం ఎక్కడుందే జీవితంలో? నీ కిష్టంవచ్చిన చీరకొనుక్కునేందుకు కూడా నీ కధికారం లేనప్పుడు బ్రతికి ఏం లాభం?'' ''స్పర్శ'' కథలో స్పర్శ ద్వారా వ్యక్తమయ్యే భావోద్వేగాలు స్త్రీ-పురుష సంబంధాల్లోని లోతును చూపిస్తాయి. తండ్రి స్పర్శ కోసం తపించిన కూతురు, ఆ స్పర్శ దొరికినప్పుడు పొందే ఆనందం - ఇది మానవ సంబంధాల్లో స్పర్శ యొక్క ప్రాముఖ్యతను చాటుతుంది.

ముగింపు

అబ్బూరి ఛాయాదేవి గారి కథలు ఎక్కువగా ఉత్తమ పురుషలో ఉండడం వలన అవి పాఠకులకి మరింత సన్నిహితంగా రాగలిగాయి. ఆమె కథలు వస్తువు ఎంతో గంభీరమైనదిగా పాఠకులను చుట్టూ కూర్చోబెట్టుకుని, కథ చెప్పినట్లే ఉంటాయి. కానీ చదువుకోడానికి వ్రాసినట్టు ఉండకపోవడం వాటి ప్రత్యేకత. ఆమె కథల్లోని నిరాడంబరత, చాలా సున్నితమైన వ్యంగ్యం, ఆర్ద్రత కలిగించే శైలి - ఇవన్నీ ఆమె కథలను జ్ఞాపకం ఉండిపోయేలా చేశాయి. 'ఆఖరికి అయిదు నక్షత్రాలు' కథ కూడా జరిగిన కథంతా ఒక ప్రేక్షకురాలిగా వ్యాఖ్యాన రహితంగా చెబుతారు. చివరికి ఆమె చేసిన ఒక తాత్వికమైన వ్యాఖ్య మినహాయించి ఈ కథ ఒక మంచికథగా నిలిచిపోవడానికి వస్తు గాంభీర్యంతోపాటు ఆమె శైలిలోని నిరాడంబరత, సున్నితమైన వ్యంగ్యమూ కూడా కారణాలే. ఛాయాదేవి గారికి జిడ్డు కృష్ణమూర్తి భావనలంటే ఇష్టం. స్వేచ్ఛకు సంబంధించిన అనేక కోణాలను సున్నితంగా చర్చకు పెడతాయి ఆమె కథలు. మానవ సంబంధాల్లో పరస్పర స్నేహం, ప్రేమ, గౌరవం ఉండాలని, అటువంటి లక్షణాలు లోపించడం వల్లనే సమాజంలో దోపిడీలు, అత్యాచారాలు, హత్యలు, ఆత్మహత్యలు జరుగుతున్నాయని ఆమె భావించారు.

ఈ ఆరు కథలు వివిధ కాలాల్లోని తెలుగు స్త్రీల జీవితాలను, వారి సంఘర్షణలను, వారి ఆలోచనలను చిత్రీకరించాయి. 1954 నుండి 1996 వరకు ఈ కథలు రాయబడినప్పటికీ, స్త్రీలు ఎదుర్కొంటున్న సమస్యలు చాలా వరకు ఒకేలా ఉండడం గమనార్హం. ఛాయాదేవి గారి సాహిత్యం అంతా స్త్రీ తన లోలోపలి పరాధీనతను తిరస్కరించగలిగి స్వేచ్ఛగా జీవించాలనే అంతసూత్రం చుట్టూనే నడిచింది. "విమర్శకులు" కథలోని స్త్రీల సమస్యలు - కట్నం, కులం, చదువు, స్వేచ్ఛ - ఇవన్నీ "నిర్ణయం" కథలోని అమూల్యను కూడా వేధిస్తూనే ఉన్నాయి. నాలుగు దశాబ్దాల తరువాత కూడా స్త్రీలు తమ జీవితాల్లో స్వయంగా నిర్ణయాలు తీసుకోలేకపోవడం, తల్లిదండ్రుల మాట వినాల్సి రావడం, సంప్రదాయాల బరువు మోయాల్సి రావడం - ఇది సామాజిక మార్పు యొక్క నెమ్మదిని సూచిస్తుంది.బోన్సాయ్ బ్రతుకు" కథలో అక్కయ్య చెప్పిన మాటలు - "మగవాడికీ ఆడదానికీ పెంపకంలో ఉన్న తేడా వల్లనే కదుటే ఆడదాని బ్రతుక్కూడా 'బోన్సాయ్' మాదిరి అయింది!" - ఇది ఈ ఆరు కథలకూ సారాంశంగా నిలుస్తుంది. స్త్రీలను చిన్నతనం నుంచీ ఒక నిర్దిష్టమైన అచ్చులో వేయడం, వారి ఆలోచనలను, కోరికలను, స్వేచ్ఛను అణచివేయడం - ఇదే స్త్రీ సమస్యలకు మూల కారణం. "ప్రయాణం" కథలో రమ, "తన మార్గం" కథలో వర్ధనమ్మ, "నిర్ణయం" కథలో అమూల్య - వీరంతా తమ జీవితాల్లో ఏదో ఒక రకమైన స్వేచ్ఛ కోసం, స్వంత నిర్ణయాలు తీసుకోవడం కోసం ప్రయత్నిస్తారు. కానీ సమాజం, కుటుంబం, సంప్రదాయాలు వారికి అడ్డంకులుగా నిలుస్తాయి. "స్పర్శ" కథలో తండ్రి-కూతురి మధ్య ఉన్న భావోద్వేగ దూరం, ఆ దూరాన్ని తగ్గించుకోవడానికి ఇద్దరూ చేసే ప్రయత్నం - ఇది సంబంధాల్లోని సున్నితత్వాన్ని చూపిస్తుంది.

ఈ కథలన్నీ కలిపి చదివినప్పుడు, తెలుగు స్త్రీల జీవితాలు, వారి సంఘర్షణలు, వారి ఆశలు, వారి నిరాశలు - అన్నీ స్పష్టంగా కనిపిస్తాయి. ప్రతి కథా ఒక ప్రత్యేకమైన కోణం నుండి స్త్రీ జీవితాన్ని పరిశీలిస్తుంది. ఛాయాదేవి గారు తన కథల ద్వారా స్త్రీలకు సమాన హక్కులు కావాలని పోరాటం చేసిన కలం యోధురాలు. ఆమె కథలు నేటికీ తెలుగు సాహిత్యంలో స్త్రీవాద దృక్పథానికి మార్గదర్శకాలుగా నిలుస్తున్నాయి.

ఉపయుక్త గ్రంథాలు

1. "ప్రయాణం" - జ్యోతి పత్రిక, సెప్టెంబరు-డిసెంబరు 1965
2. "స్పర్శ" - ఆంధ్రజ్యోతి సచిత్ర వారపత్రిక, 31-3-1989

3. "తన మార్గం" - ఇండియా టుడే, నవంబర్ 21-5 డిసెంబర్ 1996
4. "విమర్శకులు" - ఆంధ్రజ్యోతి, 1954
5. "నిర్ణయం" - భూమిక, జనవరి-మార్చి 1993
6. "బోన్సాయ్ బ్రతుకు" - కల్పన, సెప్టెంబరు 1974

సహాయక గ్రంథాలు

1. పి. సత్యవతి - "అబ్బూరి ఛాయాదేవి" - భూమిక పత్రిక ఆర్కైవ్స్
2. డా. కె. గీత - "అబ్బూరి ఛాయాదేవి గారి సాహిత్య అంతస్సూత్రం" - నెచ్చెలి
3. ఓల్గా - "అబ్బూరి ఛాయాదేవి: ఆమె చైతన్యరూపిణి" - బీబీసీ తెలుగు
4. వికీపీడియా - "అబ్బూరి ఛాయాదేవి"
5. పైడిమర్రి రామకృష్ణ - "కథాకిరణాలు: మన తెలుగు కథకులు" - పైడిమర్రి కమ్యూనికేషన్స్, ఖమ్మం, 2002
6. "నిండైన జీవితం" - ఈమాట, ఆగస్టు 2019

★★★

Vol. 23 | Spl. Issue 03 | March 2026 | BHAVAVEENA | ISSN No. : 2456-4702 | RNI No. APTEL/2003/12253

RNI No. APTEL/2003/12253 | Reffered Journal & Peer Reviewed Journals | ISSN No. 2456-4702

భావవీణ

కళలు, సాహిత్య, సాంస్కృతిక భాషాధ్యయన పత్రిక

BHAVA VEENA

Journal of Arts, Literary, Culture & Language Study

గురజాడ కథానికలు : మహిళా చైతన్యం

– టి. జ్యోతి

ఉపన్యాసకురాలు, తెలుగు విభాగం, రాయగడ స్వయంప్రతిపత్తి కళాశాల, రాయగడ (ఒడిశా).

దిద్దుబాటు కథానికలో సంస్కరణ భావజాలం

కథానిక ఆధునిక సాహిత్యంలో ఒక ముఖ్యమైన గద్య ప్రక్రియ. భావగాఢతతో సంక్షిప్తంగా, ఆసక్తికరంగా వ్యక్తమయ్యే అంశాలతో కథానిక నిర్మితమవుతుంది. తక్కువ పాత్రలతో, ఒకే సంఘటన లేదా ఒక ప్రధాన భావాన్ని కేంద్రంగా తీసుకుని కథనం ముందుకు సాగడం కథానికకు ప్రత్యేక లక్షణం.

తెలుగు సాహిత్యంలో కథానికా ప్రక్రియ అభివృద్ధికి ప్రముఖ పాత్ర పోషించిన రచయితలలో గురజాడ అప్పారావు గారు ముఖ్యులు. ఆయన రచించిన ''దిద్దుబాటు'' కథను తెలుగు సాహిత్యంలో తొలి ఆధునిక కథానికగా పరిగణిస్తారు. ఈ కథలో సమాజంలోని లోపాలను చూపిస్తూ, స్త్రీ చైతన్యం మరియు కుటుంబ సంబంధాలలో సంస్కరణ అవసరాన్ని రచయిత సున్నితంగా ప్రతిపాదించారు.

ఉత్తమ శిల్పము, సహజత్వము, సాంఘిక ప్రయోజనము, ఆధునికత, సజీవమైన వాడుక భాష ముఖ్యంగా స్త్రీ విద్య ప్రాముఖ్యత, అందునా స్త్రీ చైతన్యం ఈ కథానికలలో ప్రతిపాదింపబడినవి. సమాజంలోని మౌలిక అంశాలను మార్చేందుకు ప్రయత్నించిన సంఘసంస్కరణ ఉద్యమాలు మరియు ఆంగ్ల విద్య ప్రభావం వల్ల ఆధునిక తెలుగు సాహిత్యంలో అనేక మార్పులు చోటుచేసుకున్నాయి. ఈ సంస్కరణ భావజాలానికి పూర్వకాలంలోనే కొంతమంది కవులు పునాది వేశారు. శివకవులు, అన్నమయ్య, రామదాసు, వేమన, వీరబ్రహ్మం వంటి మహనీయులు తమ రచనల ద్వారా సమాజంలో సంస్కరణ భావాలను ప్రచారం చేశారు.

తరువాత కాలంలో రాజా రామ్మోహన్ రాయ్, ఈశ్వరచంద్ర విద్యాసాగర్, స్వామి వివేకానందుడు, రఘుపతి వెంకటరత్నం నాయుడు, కందుకూరి వీరేశలింగం వంటి మహనీయులు సంఘసంస్కరణ ఉద్యమాలకు నాయకత్వం వహించి సమాజంలో విద్యా వికాసం, స్త్రీ సాధికారత మరియు సామాజిక చైతన్యానికి ముఖ్యంగా స్త్రీ చైతన్యానికి నడుం బిగించారు. వారు కాంక్షించిన సంస్కరణలలో బాల్యవివాహాలపై నిరసన, విధవ వివాహాల ప్రోత్సాహం, వేశ్యావృత్తి నిర్మూలనం, స్త్రీ విద్యాభివృద్ధి, స్త్రీలకు సంపూర్ణ స్వేచ్ఛ, కన్యాశుల్కాన్ని అరికట్టడం, అస్పృశ్యత నివారణ, మద్యపాన నిషేధం, కుల-మత-వర్ణాల ఆధిపత్యాన్ని నిరసించడం, విగ్రహారాధనను ఖండించడం, మూఢభక్తికి వ్యతిరేకంగా పోరాటం చేయడం మరియు విశ్వమానవ సమైక్యతను స్థాపించడం ముఖ్య అంశాలుగా ఉన్నాయి.

చరిత్రను తిరిగి రాయాలన్న సంకల్పంతో మహిళల్లో

చైతన్యం కలిగించాలనే ఉద్దేశంతో సంఘ సంస్కరణలో స్త్రీజనాభివృద్ధిని కాంక్షిస్తూ గురజాడ అప్పారావు తన రచనలను కొనసాగించారు. గురజాడ వారి కథానికలలోని కథావస్తువును మహిళా చైతన్య దృక్కోణం నుండి పరిశీలించి అభ్యుదయ భావాలను పాఠకుల లోకానికి పరిచయం చేయడమే ఈ వ్యాసం యొక్క ముఖ్య ఉద్దేశ్యం. పురుషాధిక్య సమాజంలో స్త్రీలు మానసికంగా, శారీరకంగా అనేక విధాల దోపిడికి గురవుతున్నారు. అట్టి దోపిడిని ఎదుర్కొనేలా స్త్రీని మలచే ప్రయత్నమే గురజాడ అప్పారావుగారి కథానికలలో కనిపిస్తుంది.

"దిద్దుబాటు" కథలో కమలిని అనే పాత్ర ద్వారా స్త్రీ విద్య యొక్క ప్రాముఖ్యతను గురజాడ స్పష్టంగా తెలియజేశారు. సమాజాన్ని అప్రతిష్ట పాలు చేసే చెడు ఆచారాలను రూపుమాపి మంచి మార్గంలో నడిపించాలనే ఆలోచన ఆయన రచనలలో కనిపిస్తుంది. వ్యభిచారం ఒక వృత్తిగానూ, ఒక కుల సంప్రదాయంగానూ కొనసాగుతున్న కాలంలో వేశ్యల పట్ల సమాజంలోని కొంతమంది వర్గాలలోనూ, విద్యావంతులలోనూ ఒక విధమైన అయోమయం కనిపించేది. ఆ పరిస్థితులను గురజాడ తన కథానికలలో విమర్శాత్మకంగా చూపించి సమాజానికి ఒక కొత్త దృక్కోణాన్ని అందించారు.

వేశ్యావ్యామోహంలో పడి తప్పుదోవ పట్టిన భర్తను భార్య బుద్ధి చెప్పి దిద్దుబాటు చేసే విధంగా ఈ కథ సాగుతుంది. సామాజిక వ్యవస్థలో స్థిరపడిన వేశ్యా సంబంధం ఒక ఘనకార్యం అనే భావనను ఆయన ఖండించారు.

చైతన్యవంతురాలైన స్త్రీ తన తెలివి, వివేకంతో భర్తను మలచుకోగలదని ఈ కథలో చూపించారు.

అర్ధరాత్రి దాటిన తరువాత ఇంటికి వచ్చిన గోపాలరావు గడియారం ఒంటిగంట కొట్టే సరికి ఇంట్లోకి జాగ్రత్తగా ప్రవేశించాలనుకుంటాడు. తనలోని వేశ్యావ్యామోహాన్ని దాచిపెట్టాలని భావిస్తూ భార్యకు తెలియకుండా పనివాడు సహాయంతో ఇంట్లోకి వెళ్లాలని అనుకుంటాడు. కానీ రాముడు అక్కడ కనిపించకపోవడంతో లోపలికి వెళ్లి చూడగా భార్య మంచంపై కనిపించదు. ధైర్యం చచ్చిన గోపాలరావు చేతిలోని అగ్గిపుల్ల నేలపై పడిపోతుంది. అనేక అనుమానాలు, భయాలు అతని మనసును కలవర పెడతాయి. రాముడికీ ఆ విషయంపై స్పష్టమైన అవగాహన ఉండదు.

కుర్చీలో కూర్చున్న గోపాలరావుకు కమలిని చేతి వ్రాతతో రాసిన ఒక ఉత్తరం కనిపిస్తుంది. అందులో భర్త చెడు మార్గంలో నడుస్తున్నాడనే అనుమానం తనకు కలిగిందని, స్నేహితుల ద్వారా నిజం తెలిసిందని కమలిని పేర్కొంటుంది. అందుకే తాను పుట్టింటికి వెళ్తున్నానని తెలియజేస్తుంది. ఇక తనకు అబద్ధం చెప్పవలసిన అవసరం వుండదని రాసింది. ఈ ఉత్తరం గోపాలరావుకు ఒక గట్టి హెచ్చరికగా మారి, తన తప్పును గ్రహించేలా చేస్తుంది.

విద్యావంతురాలు, చైతన్యవంతురాలు అయిన భార్య తన భర్తను సక్రమమైన మార్గంలో పెట్టగలదని ఈ కథానిక ద్వారా గురజాడ అప్పారావు గారు సూచించారు. బాల్యవివాహాలు, విద్యా లేమి వంటి సామాజిక సమస్యలు మహిళాభివృద్ధికి నిరోధకాలు అని ఆయన స్పష్టం చేశారు. స్వతంత్ర ఆలోచనలు, భావాలు కలిగిన వ్యక్తులుగా మహిళలను తీర్చిదిద్దాల్సిన అవసరాన్ని గురజాడ ప్రతిపాదించారు. ఆయన తన కథలలో స్త్రీ పాత్రలను బలహీనంగా కాకుండా చైతన్యవంతంగా చిత్రించారు. సమస్యలను అర్థం చేసుకోవడం మాత్రమే కాకుండా, వాటికి పరిష్కార మార్గాలను అన్వేషించి యుక్తి యుక్తంగా ప్రవర్తించి, ప్రణాళికను సిద్ధం చేసుకొని కార్యాచరణ ద్వారా లక్ష్యాన్ని సాధించే వ్యక్తులుగా స్త్రీలను ఆయన తీర్చిదిద్దారు."

ఆకర్షణీయమైన అందం కలిగిన మెటిల్డా ఆత్మ గౌరవానికి, స్వతంత్ర ఆలోచనలకు ప్రతీకగా నిలుస్తుంది. మహిళా చైతన్యాన్ని ప్రత్యేక దృక్కోణంలో గురజాడ అప్పారావు గారు చిత్రించారు. భర్త ఎంత నియమాలు, కట్టుబాట్లు విధించినా ఆమె తన గృహజీవితాన్ని గుట్టుగా కొనసాగించిందే తప్ప నంసారాన్ని బట్టబయలు చేయలేదు.

పురుషాధిక్య సమాజంలో స్త్రీ సమస్యలను చిత్రిస్తూ,

ఆమెను బలహీన వ్యక్తిగా కాకుండా భావోద్వేగాలు మరియు ఆలోచనలు కలిగిన వ్యక్తిగా మెటిల్డాను ఆయన చిత్రించారు. ముసలివాడైన భర్త కారణంగా జీవితంలో సంతోషాన్ని పొందలేక, అనుమానాలతో వేధింపులకు గురవుతూ, స్వేచ్ఛకు నోచుకోక నాలుగు గోడల మధ్య మగ్గిపోతుంది. అయినప్పటికీ భర్తతోడే తన లోకం అని నమ్ముతూ, భర్త మనసులో అనుమానానికి కారణమైన రామారావును ఒక ఉత్తరం ద్వారా హెచ్చరిస్తుంది. 'మీరు మీ నేస్తులతో కలిసి నా కాపురంలో జోక్యం చేసుకోకండి; మీరు మీ తావునకు వెళితే నేనూ నా జీవితాన్ని సాగించ గలను' అని ఆమె స్పష్టం చేస్తుంది."

సమస్యకు పరిష్కార మార్గాన్ని అన్వేషించడమే కాక, దాన్ని కార్యరూపంలోకి తీసుకురావడానికి ప్రయత్నించే విద్యావతి, చైతన్యవంతురాలు మెటిల్డా పాత్రలో కనిపిస్తుంది. ఆమె సహనమూర్తిగా కూడా నిలుస్తుంది.

'సంస్కృత హృదయం' కథానికలో రంగనాథయ్యరు 'తలుపులు వేసెద్దు, నీకు పుణ్యం ఉంటుంది; కంపు చంపుకు తింటుంది' అని చెప్పిన సందర్భంలో సమాజంలోని నైతిక సత్యాన్ని రచయిత సూచించారు. సృష్టిలో అనాదిగా పాపం-పుణ్యం ఒకదాని పక్కనే మరొకటి ఉంటూనే ఉన్నాయి. చెడు పెరుగుతున్న కొద్దీ నీతి క్షీణిస్తూ ఉంటుంది. 'మాయలేని సృష్టే లేదు' అనే వాక్యం స్త్రీలోని లౌక్యం, చైతన్యం మరియు జీవిత వాస్తవాలపై ఆమెకు ఉన్న అవగాహనకు నిదర్శనంగా నిలుస్తుంది.

"గురజాడ అప్పారావు గారి రచనల్లో చైతన్యవంతమైన స్త్రీ పాత్రలు ప్రముఖంగా కనిపిస్తాయి. 'దేవుడు చేసిన మనుషుల్లారా మనుషులు చేసిన దేవుళ్లారా మీపేరేమిటి?' కథానిక స్త్రీ చైతన్యానికి మంచి నిదర్శనం. భగవంతుడు మనిషిని సృష్టించగా, మనిషి తనకు నచ్చిన విధంగా దేవుళ్లను సృష్టించుకున్నాడు అనే భావనలో ఉన్న అజ్ఞానాన్ని ఈ కథలో రచయిత ఎత్తిచూపారు. శాస్త్రులు తన ప్రసంగంలో దేవుని గొప్పతనాన్ని వివరిస్తుండగా, రామ్మూర్తి 'దేవుడు చేసిన మనుషుల్లారా మనుషులు చేసిన దేవుళ్లారా మీపేరేమిటి?' అని ప్రశ్నించడం మనుషుల అజ్ఞానానికి నిదర్శనంగా నిలుస్తుంది.

ఒకానొక సందర్భంలో మాను వెనుక నుంచి ఒక చేతిలో దీపం, మరో చేతిలో సూరకత్తి పట్టుకుని వచ్చిన నాంచారమ్మ పాత్ర మూడనమ్మకాల ఖండనకు, అజ్ఞానాంధకారాన్ని పారద్రోలే సంకల్పానికి ప్రతీకగా నిలుస్తుంది. 'రాముడే కాదు, ఏ దేవుడిపైనైనా నిజమైన నమ్మకం ఉంటే ఒక్క గుండం మాత్రమే కాదు, అన్ని కష్టాలనుండి మనం విముక్తి పొందగలం' అనే భావాన్ని ఆమె వ్యక్తం చేస్తుంది. 'నేను మా మామగారి పేరు స్మరిస్తూ గుండం తొక్కుతాను; ముసలాయనను అగ్గిలోకి తోసి పైనుంచి చూడటానికి మీరంతా వీరులా?' అని నాంచారమ్మ ప్రశ్నించిన మాటల్లో స్త్రీ చైతన్యం, సాహసం, ధైర్యం స్పష్టంగా కనిపిస్తాయి.

మతమనే మత్తులో పడిపోయి ఈర్ష్యా--అసూయలను పెంచుకున్నశైవ-వైష్ణవ మతాల మధ్య ఉన్న విభేదాలకు నాంచారమ్మ పాత్ర బోధన చేస్తుంది. అందువల్ల ఆమెను సామాజిక చైతన్యం కలిగించిన, ఆధ్యాత్మిక జ్ఞాన సంపద కలిగిన స్త్రీ పాత్రగా గురజాడ అప్పారావు గారు సృష్టించారు."

ముగింపు

మొత్తానికి స్త్రీ ఒక శక్తి, ఒక చైతన్యం. తన జీవితంలో ఎదురయ్యే సమస్యలను ధైర్యంగా ఎదుర్కొని వాటికి పరిష్కార మార్గాలను అన్వేషించడం మాత్రమే కాకుండా, వాటిని అమలు చేయడంలో కూడా తత్వ్యుక్తంగా ప్రవర్తిస్తుంది. సమాజంలో చెడు నడతలు ఉన్న వారిని సన్మార్గంలో నడిపిస్తూ, తన ఆలోచనలు, కార్యాచరణల ద్వారా ఆదర్శప్రాయంగా నిలుస్తుంది. ఇటువంటి చైతన్య వంతమైన స్త్రీలు సమాజానికి మార్గదర్శకులుగా నిలిచి, మనలో జాగరూకతను పెంపొందించడమే కాకుండా ఉన్నతమైన లక్ష్యాలను సాధించేందుకు ప్రేరణనిస్తారు. అందువల్ల మహిళా చైతన్యం వ్యక్తిగత ప్రగతికే కాకుండా సమాజ అభ్యున్నతికి కూడా ప్రధాన ఆధారంగా నిలుస్తుందని చెప్పవచ్చు.

సూచన గ్రంథాలు : 1. గురజాడ కథానికలు, విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్ విజయవాడ.

★

Vol. 23 | Spl. Issue 03 | March 2026 | BHAVAVEENA | ISSN No. : 2456-4702 | RNI No. APTEL/2003/12253

RNI No. APTEL/2003/12253 | Reffered Journal & Peer Reviewed Journals | ISSN No. 2456-4702

భావవీణ

కళలు, సాహిత్య సాంస్కృతిక భాషాధ్యయన పత్రిక

BHAVA VEENA

Journal of Arts, Literary, Culture & Language Study

జనగామ జిల్లా విప్లవ కవిత్వంలో స్త్రీ రచయిత్రుల పాత్ర

- అలంశెట్టి ధర్మరాములు

పరిశోధక విద్యార్థి, తెలంగాణ యూనివర్సిటీ, నిజామాబాద్.

పరిచయం :

సాహిత్యం సమాజానికి అద్దంలాంటిది. సమాజంలో జరుగుతున్న అన్యాయాలు, అసమానతలు, దోపిడీలు, దుర్భర పరిస్థితులను ప్రతిబింబిస్తూ ప్రజల్లో చైతన్యం కలిగించేది విప్లవ కవిత్వం. సమాజంలో మార్పును కోరుతూ, ప్రజలను ఉద్యమాలకు ప్రేరేపిస్తూ రాసే కవిత్వాన్ని విప్లవ కవిత్వం అని అంటారు. ఇది కేవలం కవితా సౌందర్యం కోసం కాదుబీ సమాజాన్ని మార్చడానికి, అన్యాయాలపై పోరాడడానికి ఒక ఆయుధంగా ఉపయోగపడే సాహిత్య రూపం.

విప్లవం అంటే మార్పు. సమాజంలో ఉన్న దోపిడీ, అసమానత, అన్యాయం వంటి పరిస్థితులను తొలగించి సమానత్వం, న్యాయం, స్వేచ్ఛ వంటి విలువలను స్థాపించడానికి జరిగే పోరాటమే విప్లవం. ఈ భావాన్ని ప్రజల్లో నాటేందుకు, వారి మనసుల్లో చైతన్యాన్ని రగిలించేందుకు రాసే కవిత్వమే విప్లవ కవిత్వం.

కీలక పదాలు :

విప్లవం, అభ్యుదయం, సమసమాజం, అణచివేత, సయుధపోరాటం, అమరులు, ఉద్యమం.

వివరణ :

అభ్యుదయ కవుల మార్గంతోనూ దిగంబర కవుల పద్ధతుల్లోనూ ఏకీభవించని కొందరు కవులు విప్లవాన్నే ఆదరిస్తూ విప్లవమే అన్ని సమస్యల్ని పరిష్కరిస్తుందని విశ్వసిస్తూ తమ కవిత్వాన్ని విప్లవ కవిత్వం అని నామకరణం చేసుకొన్నారు. 1970లో ఏర్పడ్డ విప్లవ రచయితల సంఘానికి విరసం అన్న ముద్దు పేరు పెట్టుకొన్నారు. (ఆధునికాంధ్ర కవిత్వంలో ఆత్మాశ్రయత్వం -డాॱఎస్.జి.డి. చంద్రశేఖర్ - పుట -1)

శ్రీకాకుళ గిరిజనుల అండతో జరిగిన సాయుధ రైతాంగ పోరాటమే నగ్జల్బరీ ఉద్యమంగా పరిణమించి తెలుగులో విప్లవ కవిత్వం ఆవిర్భవించడానికి దోహదం చేసింది. విప్లవ కవుల కవిత్వంలోని మూల సూత్రం అరాజికమయింది. అందువల్ల ఈ ఉద్యమానికి తెలుగు దేశంలో ఆదరణ లభించలేదు. చంపితే శవాల కంపు తప్ప మరేమీ మిగలని, విప్లవం వల్ల జాతి వినాశనమే కానీ అభ్యుదయం సిద్ధించదని దృఢ విశ్వాసం గల వారు ఈ కవిత్వ ఉద్యమానికి చేయూత ఇవ్వలేదు.

శ్రామిక వర్గ నియంతృత్వం గమ్యంగా సమసమాజం అంతిమ లక్ష్యంగా సాగే విప్లవోద్యమాన్ని నిరాఘటంగా ముందుకు సాగనీయకుండా నీరుకార్చే శక్తులు విప్లవోద్యమం లోపల బయట కూడా అభివృద్ధి చెందుతుంటాయి.

"విప్లవ కవిత్వం స్వానుభూతిచేత పుట్టవచ్చు సహానుభూతి చేతా పుట్టవచ్చు. విప్లవ పోరాటంలో గానీ

విప్లవ పోరాట కార్యక్రమాల్లో గానీ పాల్గొంటూ విప్లవ కవిత్వం రాయవచ్చు. లేక విప్లవ పోరాట వార్తలు విని దృశ్యాలు చూసి ప్రకంపితుడై రాయవచ్చు." (అభ్యుదయ కవిత్వానంతర ధోరణులు- పేర్వారం జగన్నాథం (సంపా) -పుట 23)

"కిషన్ జీ ఆప్ యహా జిందా హై" అనే కవితలో జి.కళావతి విప్లవాభివందనాలు తెలిపారు.

"ఒక విప్లవ పుష్పం
అన్యాయంగా నేలరాలిన రోజు ఇది
అమరమై ఆకాశంలో విరిసిన రోజు ఇది
....
నీవు శ్వాసించిన ఆశయాలిచట ఉన్నవి
ప్రజా వీరుడిగా నీవు ఎలుగెత్తిన నినాదాలున్నవి
నీ పాద ముద్రలు ఈ నేలపై అత్యంత పదిలంగా ఉన్నవి"

(సమాయత్త సమయం- జి.కళావతి - పుట 256, 257)

సమాజంలో ఉన్న చీడను వదిలించాలనే లక్ష్యంతో కొందరు ఉద్యమంలో చేరి ఆదర్శ జీవితాలను గడుపు తుంటారు. వారిలో కిషన్‌జీ ఒకరు 24 నవంబరు 2011 కిషన్ జీ అమరత్వం పొందిన రోజుని తలచుకుంటూ కళావతి ఈ కవితను చిత్రించారు. ప్రజా ఉద్యమంలో పీడకుల గుండెలను గడగడలాడించిన కిషన్‌జీ, అందరికీ ఆదర్శనీయుడు అంటుంది కళావతి. ఆయన బాట, మాట, సందేశం కోసం దేశమంతా ఎదురు చూసిందని, ఆయన్ని స్మరిస్తూ విప్లవాభి వందనాలు తెలుపుతుంది.

ఎందరు విప్లవకవులు సాయుధ పోరాటంలో పాల్గొన్నారో సాక్ష్య సామాగ్రి సాహిత్య విమర్శలో ఇవ్వ బడాలి. విప్లవ కవిత్వం ఇదనీ వీడే విప్లవకవని ఈ పద్ధతి చేతనే నిర్ణయించాలని నియమం పెట్టినట్లయితే సాయుధ పోరాటాన్ని ప్రోత్సహించాలి అంటే ఈ ప్రత్యేక విప్లవ కవులకే అగ్రాసనాలు వేసి కూర్చోబెట్టనక్కరలేదు. కారణం ఆ పని ఇతరులు కూడా అంతకంటే బాగానే చేస్తున్నారు.

"పోరాటాల మేలుకొలుపు" అనే కవితలో

"గడీల పాలన
తెల్లదొరల అహంకారం
స్త్రీ బానిసత్వ సంకెళ్ళు
ఆకలి కేకల దీనత్వమును
దునమాడి
నిరంకుశత్వాన్ని తెగదెంపుకున్న
పొదుపొడుపు మన అస్తిత్వం
....
నాకు అందని స్వాతంత్ర్యం
ఇంకా దాగి వుందనీ
నేల పొరల్లో చిగురించే
ఎర్రని మందరాలు
చీకటిని గెలిచిన ఉద్యమాల వేకువలో
ఆనాటి
అమర సందేశాన్ని వినిపిస్తున్నాడు"

(కవన తీగ - సాయికిరణ్- పుట-55, 56)

ఏ ఉద్యమాలైన ఒక్కటితోనే ప్రారంభం అవుతుంది. చిలికి చిలికి గాలి వాన అవుతుంది. తెలంగాణ ఉద్యమం కూడా అంతే. గడీల పాలన, నిజాం పాలన, అంతం కావడానికి విప్లవోద్యమమే కారణం. జ్ఞానోదయ రాగాన్ని ఆలపిస్తే ఎవరూ వినరు. నోరుండి అడగలేని వారికి ఆయుధమే బలం. అయినా సామాన్యుడికి న్యాయం జరగట్లేదు. స్వాతంత్ర్యం సిద్ధించలేదని నేల పొరల్లో చిగురించే ఎర్రని మందారాలు చీకటిని గెలిచిన ఉ ద్యమాల వేకువలో విప్లవ సందేశాన్ని వినిపిస్తున్నా యంటున్నాడు సాయికిరణ్.

నిరాయుధుల మీద సాయుధ దాడి, అణచివేత చర్య హక్కుల కోసం, భూమికోసం నిలబడినందుకు, ఇంద్రవెల్లి ఘటనను పరిశీలిస్తే, పూర్వపరాలను చలనంలో చూపిస్తూ అల్లం రాజయ్య ఇంద్రవెల్లి కవిత రాశారు.

"ఇంద్రవెల్లి ఆకాశం
గిరిజన మృతవీరుల రక్తంతో ప్రతిఫలిస్తున్నది
నిశ్శబ్దంగా రోదిస్తున్నది
వీస్తున్న గాలి నెత్తురు వాసన మోస్తున్నది"

(తుడుం- విరసం (సంపా) - పుట -6,9)

ఈ కవిత గిరిజనులపై గిరిజనేతరుల పీడన, దోపిడీ, ప్రభుత్వాధికారుల జులం సాగినంత కాలం అక్కడ అంతా శాంతి స్థిరపడి ఉందని ఒక స్థితి చెప్పాక ఆ గిరిజనులే పుడమి తల్లికోసం, ఆత్మరక్షణ కోసం పోరాడటం నేర్చు కున్నారు.

'అమరులారా వందనం'' అనే కవితలో పద్మ త్రిపురారి పోరుబాటలో అమరులైన వీరులను స్మరిస్తూ కవిత్వీకరించారు.

''మృతదేశ సేవకొరకు తపియించిన
సుగుణాత్ములారా
పుణ్యాత్ములారా
అమరులారా
వీరులారా
అంజలిదె మీ త్యాగమునకు
వందనాలు మీ సేవకు
....
భూమాత బంధముకు
అలుముకున్న చీకటిని
తొలిగించి ప్రగతినింప
కంకణమే కట్టుకొనీ
ప్రాణాలను ఫణము చేసి పోరాడిన
అమరులారా వందనం ఇదే మా వందనం''

(మౌనవీణ - పద్మ త్రిపురారి - పుట- 51, 52)

ఉద్యమం, పోరాటం, చైతన్యం, విముక్తి, విప్లవం, పేర్లు వేరుకావచ్చు కానీ చేసే పనిమాత్రం ఒక్కటే అన్నింటి ఆంతర్యం ఒక్కటే త్యాగం చేస్తేనే విముక్తి, తెగిస్తేనే చైతన్యం, ఎదిరిస్తేనే విప్లవం, అది మాతృభూమి కోసం కావచ్చు, శత్రువుల నుండి మనల్ని మనం కాపాడుకోవడం కావచ్చు. ఆ ప్రయత్నంలో ఎందరో బలి అయ్యారు. వారికి చావులేదు అందుకే వారు అమరలు 'మౌనవీణ'ల త్రిపురారి ఆ విప్లవ వీరులను స్మరిస్తూ చిత్రించిన కవితే అమరులారా వందనం.

"విప్లవగాలి వీచింది" కవితలో

''విప్లవ గాలి వీచింది
ఇందిరా పని గోవిందా
భూసంస్కరణలు భుకాయింపు
ధనవంతుల మెలుకొల్పు
....
విప్లవ నినాదాలు
వీధి వీధి చాటుదాం
కొండవంటి ఎర్రసేన
అండ మనకు యుండంగా
భయమెందుకు బాయినీకు
పదముందుకు వేగిరమున''

(జనగర్జన - వయ్యా సామేలు -పుట- 59, 60)

చాలా ప్రదేశాల్లో అవినీతి నాయకులకు ఎర్రజెండా చూస్తే వెన్నులో ఒణుకుపుడుతుంది. తప్పు చేద్దామన్న ఆలోచనే వారి బుర్రలోకి రాదు. అంతలా భయ పెడుతుంది ఆ చిన్న ఎర్రజెండా. చాలా ఊర్లలో గవర్న మెంటు భూమి ఉంటే ఇల్లులేని పేదలు ఆ ప్రదేశాల్లో గుడిసెలు వేసుకుని వాటిపై ఎర్రజెండాలు పెడితే తొలగించే ధైర్యం ఎవ్వరికీ లేకపోయింది. 1 జూన్ 1972లో రాసిన ఈ కవితలో ఇందిరా గాంధీ ప్రధానిగా ఉన్నప్పుడు చేసిన నంస్కరణల వల్ల చాలామంది విప్లవాన్ని ఆశ్రయించారన్నది చిత్రించారు. నిరుపేదలంతా ఒక్కటై పోరు చేశారు. భూర్జువా వ్యవస్థపై ఘోరీ కట్టి దరిద్ర్యాన్ని రూపు మాపారు. విప్లవ నినాదాలతో వీధి వీధి మారు మ్రోగిపోయిన సందర్భాన్ని గుర్తు చేశారు.

ముగింపు :

విప్లవ కవిత్వం సమాజంలో చైతన్యాన్ని కలిగించే శక్తివంతమైన సాధనం. ఇది ప్రజలను అన్యాయానికి వ్యతిరేకంగా నిలబడేలా ప్రేరేపిస్తుంది. ఇది కేవలం సాహిత్య ప్రక్రియ మాత్రమే కాదు; ఒక సామాజిక ఉద్యమం కూడా. సమాజాన్ని సమానత్వం, న్యాయం దిశగా నడిపించడంలో విప్లవ కవిత్వం కీలక పాత్ర పోషిస్తుంది. విప్లవ కవిత్వం అనేది సమాజ మార్పు కోసం పుట్టిన సాహిత్య రూపం. ఇది ప్రజల బాధలను ప్రతి బింబిస్తూ, వారికి చైతన్యం కలిగిస్తూ, సమాజాన్ని మార్పు దిశగా నడిపిస్తుంది. అందువల్ల విప్లవ కవిత్వం తెలుగు సాహిత్యంలో ఒక ముఖ్యమైన, ప్రభావవంతమైన సాహిత్య ప్రక్రియగా నిలిచింది.

ఆధార గ్రంథాలు

1. ఆధునికాంధ్ర కవిత్వంలో ఆత్మాశ్రయత్వం -డా॥ఎస్.జి.డి. చంద్రశేఖర్
2. అభ్యుదయ కవిత్వానంతర ధోరణులు- పేర్వారం జగన్నాథం (సంపా)
3. సమాయత్త సమయం- జి.కళావతి-
4. కవన తీగ - సాయికిరణ్
5. తుడుం- విరసం (సంపా)
6. మౌనవీణ - పద్మ త్రిపురారి
7. జనగర్జన - వయ్యా సామేలు

★★★

Vol. 23 | Spl. Issue 03 | March 2026 | BHAVAVEENA | ISSN No. : 2456-4702 | RNI No. APTEL/2003/12253

RNI No. APTEL/2003/12253 | Reffered Journal & Peer Reviewed Journals | ISSN No. 2456-4702

భావవీణ

కళలు, సాహిత్య, సాంస్కృతిక భాషాధ్యయన పత్రిక

BHAVA VEENA

Journal of Arts, Literary, Culture & Language Study

ప్రాచీన సాహిత్యం - విశిష్ట తెలుగు మహిళ - 'మహి' హృదయావిష్కరణం

- కొంపెల్ల బాల సుబ్రహ్మణ్య శర్మ

అధ్యక్షులు, తెలుగు-రథం, హైదరాబాద్.

"యత్రనార్యస్తు పూజ్యంతే రమంతే తత్రదేవతా: / యత్రై తాంతు నపూజ్యంతే సర్వాంతత్రీ ఫలా: క్రియా."సనాతన సంప్రదాయ సంస్కృతీ సంభూతమైన భావానాత్మక సుభాషితం. "ఆధునిక మహిళలు భారతదేశ చరిత్ర తిరగరాస్తారు. ఇది గురజాడ వారి ఆధునిక దృష్టి.

విశిష్ట తెలుగు మహిళలు - 108 మహిళా ప్రముఖుల జీవన రేఖలు అన్న గ్రంథకర్త డా. దామెర వేంకట సూర్యారావు గారి గ్రంథంలో మహిళావరణం --హృదయావిష్కరణం చేస్తూ - విశిష్ట మహిళా వర్గాన్ని 16 వర్గాలుగా విభజించారు. చారిత్రక మహిళలు - ప్రాచీన సాహిత్యం - ఆధునిక సాహిత్యం, ఇతర రంగాలలో - పత్రిక, నాటక, చలనచిత్ర, కళారంగం - హరి/బుర్ర కథ, శాస్త్ర-పాలన, తత్వ, క్రీడ, చిత్రలేఖన, నాట్య, సంగీత, ఆకాశవాణి, సేవ, రాజకీయ రంగాల విభజనతో 108 మంది (అష్టోత్తర శతమాన మహిళా ప్రముఖులపై చిరు/సంక్షిప్త వ్యాసాలను - సూక్ష్మంలో మోక్షం - స్వల్పంలో అనల్పం పరిధిలో అందించారు.

మొదటిగా - చారిత్రక మహిళా వర్గాన్ని చరిత్రకెక్కదిలేసి, నాకు ఆసక్తి, అభిరుచిని ప్రోదిచేసుకుంటున్న ప్రాచీన/ఆధునిక రంగాలలోని - ప్రాచీన సాహిత్యంలోని అష్ట మహిమూర్తి ప్రతిభావంతంగా రేఖామాత్రంగా విహంగ వీక్షణం చేసే ప్రయత్నం.

చారిత్రక మహివర్గం - ప్రతిభా - త్రివేణీ మహి - సంగమం

1. రాజరిక వ్యవస్థలో తొలి తెలుగు మహిళామంత్రి -- నాయకురాలు నాగమ్మ;
2. పల్నాటి వీర పత్ని మగువ మాంచాల;
3. తెలుగు సింహాసనంపై ఏకైక మహిళ కాకతి రుద్రమదేవి;

ఈ మహి-మహిముమ్మూర్తిమంతానికి శతసహస్ర ప్రణామాల సమర్పణతో.

ప్రాచీన సాహిత్యం - మహిళా-వరణం - అష్ట మహిమూర్తిమంత ప్రతిభావంతం

1. గంగాదేవి; 2. తాళ్ళపాక తిమ్మక్క; 3. మొల్ల; 4. బాల పాపాంబ; 5. మధురవాణి; 6. రంగాజమ్మ; 7. ముద్దుపళని; 8, తరిగొండ వెంగమాంబ

గంగాదేవి

గంగాదేవిని గంగాంబిక అని కూడా పిలుస్తారు. ఈమె 14వ శతాబ్దపు సంస్కృత భాషా పండితురాలు, కవయిత్రి. ప్రస్తుత భారతదేశంలోని విజయనగర సామ్రాజ్యానికి చెందిన యువరాణి. గంగాదేవి సంస్కృత భాషా పండితురాలు. ఓరుగల్లు నివాసి. 14 వ శతాబ్దం రెండవ ప్రతాపరుద్రుని కాలంలో అగస్త్యుడు అనే గొప్ప సంస్కృత కవి ఉండేవాడు. ఇతని మేనల్లుడు, కవి పండితుడైన

విశ్వనాథుని శిష్యురాలు గంగాదేవి. కాకతీయుల ఆడబిడ్డ, ఆంధ్రుల కోడలు. గంగాదేవి విజయనగర రాజు బుక్క రాయ I (C. 1360s-1370s) మూడవ కుమారుడు కుమార కంపన భార్య. తన భర్త కంపరాయుడు మధుర నగరాన్ని జయించిన తరువాత అతని శౌర్య సాహసములను 'వీరకంపరాయచరితమ్' అను కావ్యము ద్వారా తెలియజేసినది. వీరరస స్ఫారకమైన ఈ కావ్యము నకు "మధురావిజయం" నామాంతరము కూడా ఉంది. పద్య రచనతో పాటు, ఆమె తన భర్తతో యుద్ధంలో కూడా పోరాడింది. ఇతర మహిళలకు స్ఫూర్తినిచ్చింది.

గంగాదేవిని తెలుగు యువరాణి అని భావిస్తారు. మధుర విజయం ప్రారంభంలో గంగాదేవి తెలుగు మాట్లాడే ప్రాంతంలోని అనేక సంస్కృత కవులను ప్రశంసించింది. ముఖ్యంగా తిక్కన్నను (ఆంధ్ర మహా భారతం రచయిత తిక్కనతో గుర్తించబడింది) మెచ్చు కుంటుంది. ఇది ఆమె తెలుగు వంశానికి చెందినది అను భావానికి బలమైన సాక్ష్యంగా పరిగణించబడుతుంది. ఆమె పుట్టి, తిరిగిన నేల ప్రజల భాష తెలుగు. సంస్కృత కవయిత్రిగా పేరు పొందిన ఈమె తెలుగు కవయిత్రి కూడా. ఊటుకూరి లక్ష్మీకాంతమ్మ గంగాదేవిని, " తెలుగు నాట ఎఱ్ఱా ప్రగడ, నాచన సోమనాధుడు, రావిపాటి త్రిపురాంతకుడు, కాటయ వేమారెడ్డి, రేచర్ల సర్వజ్ఞ సింగభూపతి, కుమారగిరి వసంతరాయలు అను కవివరులీమెకు సమకాలికులు కావచ్చును". అని పేర్కొన్నారు. "రాజవంశ సంజాతయై పట్టమహిషియై సారస్వత వ్యాసంగమున దవిలియుండుటే అరుదు. అందును చతుర కావ్య నిర్మాణము చేయగలిగిన ప్రజ్ఞామతి యగుట ఇంకను నబ్బురము". అని ప్రశంసిం చారు.

మధురా విజయము మదురైలో తన భర్త ముస్లింలపై సాధించిన విజయాన్ని గంగాదేవి కవిత రూపంలో వివరిం చారు. తొమ్మిది అధ్యాయాల ఈ పద్యకావ్యం శీర్షిక మధురావిజయం. దీనిని వీరకంపరాయ చరిత్ర అని కూడా పిలుస్తారు. మధుర విజయం 1924 సంచిక - ప్రస్తావన -

శ్లో॥ మహాకవి ముభామ్భోజ మణి పంఞజరి శారికామ్
చైతన్య జలధి జ్యోత్స్నాం దేవీల వన్దే సరస్వతామల్॥

మహాకవుల ముఖ పద్మాలను రత్న పంజరాలలో విహరించే గోర్వంకై, జ్ఞాన సముద్రాన్ని ఉపొంగ చేస్తున్న కౌముదీ మహోత్సవమై అలరు సరస్వతీ దేవికి నా నమస్కారము అంటూ గంగాదేవి ప్రారంభ శ్లోకంలో రాసింది. తదుపరి వాల్మీకీ మహర్షి, కాళీదాసు, భారవి, తిక్కన, అగస్త్యుడు, విశ్వనాథుడు వంటి కవులనూ స్మరించుకుంటుంది. మధురావిజయం పీఠికతో తెలుగు కవి తిక్కనను స్తుతించింది గంగాదేవి.

శ్లో॥ ఉపహరన్ కుసుమాని మహీరుహం, కిసలయై కలితాఞలి బన్ధన:
మధుర కోకిల కూజిత భాషితో మధుర ధైన ముపాసితు మాసదతే ॥

ఈ కావ్యంలో కంప భూపాలుని సార్యభౌమునిగా వర్ణించింది. తమ భర్త కంపభూపతి శత్రురాజుల మనస్సుల్ని కంపింపజేసేలా, మలయ పర్వతం ఒక అపూర్వ చిహ్నంగా తేజరిల్లుతుంటే దక్షిణ దిశకు ప్రయాణించాడనీ, యుద్ధ సమయాన ఘాతకులైన తురుష్కులను సంహరించినపుడు రాజు తేజస్సు అనే తెల్లదనం వ్యాపించింది అని వర్ణిస్తుంది.

మధురావిజయం పత్రాలు కనుగొనబడిన తరువాత, శ్రీరంగానికి చెందిన శ్రీ కృష్ణమాచార్యులు తమిళంలో ప్రచురించారు. ఆపై అన్నామలై విశ్వవిద్యాలయం 1950లో ఆంగ్ల అనువాదాన్ని ప్రచురించింది. శి3రి ఈ కావ్యానికి తాడేపల్లి రాఘవ శాస్త్రి తెలుగు అనువాదం చేసారు. పోటుకుచ్చి సుబ్రమణ్య శాస్త్రి దీనికి వ్యాఖ్యానం రాసి గంగాదేవి అను నవల రాసారు. సల్మాన్ రష్దీ నవల విక్టరీ సిటీ యొక్క కథానాయకుడు 'పంప' కంపనకు గంగాదేవి కీలక ప్రేరణ.

తాళ్ళపాక తిమ్మక్క లేదా తాళ్ళపాక తిరుమలమ్మ

తాళ్ళపాక తిమ్మక్క లేదా తాళ్ళపాక తిరుమలమ్మ తొలి తెలుగు కవయిత్రి. వీరు తాళ్ళపాక అన్నమాచార్యుల వారి ఇల్లాలు, మొదటి భార్య. ఈమె నన్నయ భారతము

ఆధారముగా 1163 పాదాలతో సుభద్రా కల్యాణము అనే ద్విపద కావ్యము రాసినది.

ప్రథమాంధ్ర భాషా కవయిత్రి తాళ్ళపాక తిమ్మక్క. మహాకవి, వాగ్గేయకారుడు అయిన అన్నమయ్య ఇల్లాలు తిమ్మక్క అని వేటూరి ప్రభాకరశాస్త్రి గారి నిర్ణయం. ఈమె సుభద్రా కల్యాణం అనే కావ్యాన్ని రచించింది. సుభద్రా కల్యాణానికి ఆధారం నన్నయ భారతమే. నన్నయ ఆది పర్వంలో 135 గద్య పద్యాలలో విజయ విలాసం రచించాడు. అతనిని అనుసరిస్తూ తిమ్మక్క 1163 పాదాల ద్విపద కావ్యాన్ని రచించింది. కడుమంచి తేటపలుకులతో చెప్పిన పాటగా తన కావ్యాన్ని పేర్కొంది. కొన్ని కొన్ని ఘట్టాలలో నన్నయలాగానే మూలాతిక్రమణం చేసింది. అర్జునుడు తీర్థయాత్రలు చేస్తూ - అమర అహోబళంబా వెంకటాద్రి వరుస నాపై కంచి వరదుల గొలిచె-అని తిరుపతి వెంకటేశ్వరులకు అర్జునునిచేత మొక్కులం దించింది.

నన్నయ మహాభారతంలో లేని బావా మరదుల హాస్యం తిమ్మక్క సుభద్రా కల్యాణంలో నింపి రచించింది. సుభద్ర పాత్రను సమయోచితంగా తీర్చిదిద్దింది. సుభద్ర చేత ఈడుకు తగిన ఆటలు ఆడించింది. చేమకూర వెంకటకవి తన విజయ విలాసంలో తిమ్మక్కను అనుసరించాడు. సుభద్ర అర్జునుని వర్ణించిన సందర్భంలో రచించిన- ''ఎగుభుజమ్ములవాడు మృగరాజు నడుము నడచి పుచ్చుకొను నెన్నడుము గలవాడు'' - అన్న తిమ్మక్క రచనను చేమకూర వెంకటకవి - ''ఎగుభుజములవాడు మృగరాజ మధ్యంబు పుదికి పుచ్చుకొను నెన్నడుము వాడు''- అనుసరించాడు. సుభద్రా కల్యాణం స్త్రీలకోసం స్త్రీ రచించిన గ్రంథం అన్న విషయం కావ్యాన్ని చదివితే అర్థమవుతుంది. సుభద్రా కల్యాణాన్ని తిమ్మక్క రచించ లేదన్న వాదోపవాదాలు పండితలోకంలో ఉన్నాయి.

రచన 1.సుభద్రా కల్యాణం - తాళ్లపాక వంశవృక్షం

ఆతుకూరి మొల్ల

ఆతుకూరి మొల్ల, (1440-1530) 16వ శతాబ్దపు తెలుగు కవయిత్రి. తెలుగులో మొల్ల రామాయణంగా ప్రసిద్ధి చెందిన రామాయణంను రాసినది. ఈమె కుమ్మరి కుటుంబంలో జన్మించింది. మొల్ల శ్రీ కృష్ణదేవరాయలు సమయం (16వ శతాబ్దం) లోనిదని ప్రశస్తి. మొల్ల శైలి చాలా సరళమైంది, రమణీయమైంది. మొల్ల జీవించిన కాలం గురించి పరిశోధకులలో భిన్నాభిప్రాయాలున్నాయి. 'సన్నుత సుజ్ఞాన సవివేకి వాల్మీకి' దగ్గరనుండి 'తిక్కకవి రాజు భోజు' వరకూ మొల్ల నుతించింది. శ్రీకృష్ణదేవ రాయల ఆస్థానకవులలో ఒకరిని కూడా తనపద్యంలో ఆమె పేర్కొనని కారణంగా ఆమె రాయలవారి సమయానికే కవయిత్రి అయి ఉండాలని భావిస్తున్నారు. జనసామాన్యంలో ప్రచారంలో ఉన్న కథలు మొల్ల, తెనాలిరామలింగడు సమకాలీకులని వెల్లడిస్తున్నాయి. 16వ శతాబ్దికి చెందిన ఏకామ్రనాథుడనే చరిత్రకారుడు తన ప్రతాపచరిత్రలో మొల్లను పేర్కొన్నాడు. అందులో పేర్కొన్న సాంఘిక పరిస్థితులను బట్టి మొల్ల సుమారుగా సా.శ. 1581 కి ముందుగా జీవించి ఉండేదనిపిస్తున్నది. ఆమె తిక్కన సోమయాజికీ, భాస్కరునికీ, ప్రతాపరుద్రునికీ సమకాలీనురాలు కావచ్చును కూడాను. ఈమె కులావంశ సంజాత. ఇంటి పేరు ఆతుకూరివారు. కులాన్నిబట్టి కుమ్మరి మొల్ల అని వ్యవహరించబడుచున్నది. ఈమె జనకుడు కేతనపెట్టి. గ్రంథావతారికలో ఆదికవి స్మృతియందు శ్రీనాథుడిని స్మరించియుండుటచే ఈమె శ్రీనాథుని తరువాత కాలమున ఉండెడిదని తెలియు చున్నది. చరిత్ర పరిశోధకులు 1525సం. ప్రాంతమని నిర్ణయించారు. ఈమె ఆజన్మబ్రహ్మచారిణి అని చెప్పెదరు. మొల్ల స్వస్థలం కడప జిల్లా, గోపవరం మండలం, గోపవరం గ్రామం. ఈ గ్రామం కడప పట్టణానికి 56 కి.మీ దూరంలో, బద్వేలుకు 5 కిలోమీటర్ల దూరంలో ఉంది. ఈమె ఈ ప్రాంతానికి చెందినదని మొల్ల రామాయణంలోని ఈ క్రింది పద్యం ద్వారా తెలుస్తుంది.

''గావ్య సంపద క్రియలు నిఘంటువులును-గ్రామం
లేవియు నెఱ్ఱఁగ, విఖ్యాత గోప
వరపు శ్రీ కంఠమల్లేశు వరముచేత - నెఱిఁ గవిత్వంబ్నఁ
జెప్పగా నేర్చుకొంటి''

నెల్లూరు దగ్గర ఇంకో గోపవరం ఉన్నా గానీ అక్కడ శ్రీకంఠ మల్లేశ్వరస్వామి ఆలయం లేదు. మొల్ల తాను

శ్రీ కంఠ మల్లేశ్వరుని వరం చేతనే కవిత్వం నేర్చుకున్నానని స్వయంగా చెప్పింది. శ్రీరామాలయం గోపవరంలోనే ఉంది. తరతరాలుగా జనం చెప్పుకునే మొల్ల బండ ఉంది. గ్రామస్థులు ఈ బండకు పూజ చేయడం ఉంది. శ్రీ కృష్ణదేవరాయలు ఈ గోపవరంలో బస చేసినట్లుగా స్థానికులు చెప్పుకొంటూ ఉంటారు. మొల్ల పూర్వీకులు అత్మకూరుకు చెంది ఉంటారనీ, అందుకే ఆతుకూరు ఇంటిపేరు అయిందనీ కొందరి అభిప్రాయం. కుమ్మరి కులానికి చెందిన మొల్ల ఈ ప్రాంతానికి చెందినదనడానికి గోపవరం దగ్గర కుమ్మరి కులాలవారూ ఉన్నారు. మొల్ల నివసించిన ఇల్లుగా గోపవరంలో పాడుబడిన ఇల్లు ఉంది. పెద్దన, తెనాలి రామలింగడు కూడా గోపవరం వచ్చి మహా భక్తురాలైన కవయిత్రి మొల్లను దర్శించినట్లు ఆమెపై చేసిన దూషణను మన్నించవలసినదిగా ప్రాధేయ పడినట్లు చెబుతారు. వాఙ్మయ మూలాల ఆధారంగా మొల్ల స్వంతంత్ర భావాలు కలిగి ఉండేదని, చిన్న తనంలోనే తల్లిని కోల్పోగా తండ్రి కేసన శెట్టి ఈమెను గారాబంగా పెంచెనని తెలుస్తుంది. ఈమెకు తండ్రి అంటే అమిత ఇష్టం. చివరి దాకా తండ్రి ఇంటి పేరునే ఉపయోగించడం మూలాన మొల్ల పెళ్ళి చేసుకోలేదని అనుకోవచ్చు. మొల్ల రామాయణం మొల్ల రామాయణం ఆరు కాండాలలో 871 పద్యాలతో కూడుకుంది. ఈ కావ్యాన్ని మొల్ల కేవలం ఐదు రోజులలో రాసిందని ప్రతీతి. మొల్ల రచన ఆనాటి పద్ధతికి విరుద్ధంగా వాడుక భాషకు దగ్గరగా ఉంది.

మొల్ల శైలికి ఉదాహరణలు

తోయజదళాక్షి వలరాయడిటు లేచి పటుసాయకము లేర్చి ఇపుడేయగ దొడంగెన్
తోయదపథంబున నమేయరుచి తోడ నుదురాయడును మించి వడ గాయగ గడంగెన్
కోయిలలు కీరములు కూయగ నళివ్రజము లేయెడల జూచినను మ్రోయుచు చెలంగెన్
నాయెడల కృపారసము నీయకవివేకమున నీయెడల నుండుతిది న్యాయమె లతాంగీ జడలు దాలిచి తపసుల చందమునను తమ్ముడును తాను ఘోర దుర్గమ్ములందు కూరగాయలు కూడుగా కుడుచునట్టి రాముడేరీతి లంకకు రాగలండు

విశేషాలు :

తనకు శాస్త్రీయమైన కవిత్వజ్ఞానం లేదనీ, భగవద్దత్త మైన వరప్రసాదంవల్లనే కవిత్వం చెబుతున్నాననీ ఆమె అన్నది. కాని ఆమె అనేక సంస్కృత, తెలుగు పూర్వకవు లను స్తుతించిన విధం చూస్తే ఆమెకు వారి రచనలతో గణనీయమైన పరిచయం ఉండి ఉండా లనిపిస్తున్నది. తనకు పాండిత్యం లేదని మొల్ల వ్రాసినది సంస్కృతిలో భాగమైన అణకువ, విధేయత వంటి లక్షణాల కారణం గానే తప్ప వేరే కాదని స్త్రీ రచయిత్రుల చరిత్ర వ్రాసిన నిడదవోలు మాలతి భావించారు. గ్రంథావతారికను బట్టి ఈమె తక్కిన కవయిత్రులవలె గురువునొద్ద విద్య నభ్యసించలేదని, గోపవరపు శ్రీకంఠ మల్లేశుకృపను కవిత్వం చెప్పనేర్చినదనియు తెలియుచున్నది. ఈమె కావ్యలక్షణాదికముల నేమియు నెరుంగక పోయినను నన్నయ తిక్కనాది కవుల గ్రంథములను మాత్రము క్షుణ్ణముగా చదివినదని ఈమె పద్యముల తీరు నడకలను బట్టి చెప్పవచ్చును. ఈమెపై పోతన కవితా ప్రభావము ఎక్కువగాగలదు. పలికెడిది భాగవతమట, పలికించెడివాడు రామభద్రుడట... అని పోతన చెప్పిన మాదిరిగనే ఈమె రామాయణమందు చెప్పమని రామ చంద్రుడు, చెప్పించిన పలుకుమీద జెప్పెదనే నెల్లప్పుడు నిహపరసాధన, మిప్పుణ్యచరిత్ర, తప్పులెంచకుడు కవుల్ అని పల్కినది. సర్వగుణాకరుడు శ్రీరాముని చరితమును ఎందరెన్ని విధముల రచన గావించినను నవ్యతకలిగి వీనులవిందై, యమృతపు సోనలపొందై యలరారు చుండుట తానీ గ్రంథమును చేపట్టుటకు కారణమని చెప్పినది. అట్టి మహాత్ముని చరితమును కందువ మాటల్ నందముగా కూర్చి పఠితలకు శ్రోతలకు విందును గూర్తునని ముందంజ వేసింది. గ్రంథావతారిక యందు చెప్పబడిన విషయముల వల ఈమె పూర్వకవుల సంప్ర దాయమునే అనుసరించి కావ్యారంభమున అయోధ్యాపుర వర్ణనతో ప్రారంభమై, దశరథుని పుత్రకామేష్టి, శ్రీరామ చంద్రుని జననమాదిగా రావణవధానంతరము

ముగియుచున్నది. ఉత్తరరామాయణమును స్పృశించలేదు. సాధారణంగా కవులు వర్ణనాదులయందు జటిలమై, సుదీర్ఘమైన సమాసము ల నొడగూర్చితమ పాండిత్య ప్రకర్షను చూపింతురు. శబ్దాడంబరమునక ప్రాధాన్య మిచ్చిన ప్రబంధయుగమున పుట్టిన మొల్ల శబ్దాడం బరమునకు లోనుగాక యలతి యలతి పదములతోనే రచన సాగించి పేరొందినది.చిన్ని చిన్ని గీతములలో పెద్ద భావముల నిముడ్చుట ఈమె సహజ గుణము. జడలు ధరియించి తపసుల చందమునను, దమ్ముడును దాను ఘోరదురమ్ములందు కూరగాయలు కూడుగాగుడుచు నట్టి, రాముడేరీతి లంకకు రాగలడు. పదబంధముల యందు ఈమెకు చక్కని నేర్పు ఉంది.

తిక్కన వలె ఈమె పాత్రలను కండ్లకు కట్టునటుల చింత్రించ గలదు. హనుమంతుడు సముద్రమున దాటు నపుడు ఈమె ఆప్రాంతమును చూచినది గాబోలు అనిపించును, ఆసముద్రోల్లంఘన మెంత సత్యసము పేతముగా వర్ణించెనో చూడండి

మొగము బిగించి, పాదముల మొత్తముగానట
నూదిత్రొక్కి, నీ
టుగ మొగమెత్తి భీకర కఠోర రవంబున వార్చి బాహు
ల
త్యగణితలీలమాచి, వలయంబుగ వాలముద్రిప్పి
వ్రేగునన్
నగము సగంబు క్రుంగ గపినాథుడు నింగి దాటే
రివ్వునన్!!!

తెలుగులో తొలి యక్షగాన కవయిత్రి బాల పాపాంబ

తెలుగులో తొలి యక్షగాన కవయిత్రి బాల పాపాంబ. బాల పాపాంబ 16వ శతాబ్ధపు ఉత్తరార్ధంలో జీవించి వుండవచ్చని చరిత్రకారుల అంచనా. ఈవిడ తల్లి దండ్రులు కామాక్షమ్మ, వీర వసంతరాయలు. రచనలు అక్కమహాదేవి అనే యక్షగానాన్ని రచించింది. చరిత్ర పాపాంబ సుమారు 215 గద్య పద్యాలతో యక్షగానం రచించింది. కానీ, ఇది ముద్రించపడలేదు. దీని ప్రతి తిరుపతిలోని శ్రీ వెంకటేశ్వర ప్రాచ్య లిఖిత పుస్తక భాండాగారంలో ఉంది. (డి.నెం. 1834, 1835). బాల పాపాంబకి యోగశాస్త్రంలో కూడా ప్రావిణ్యం ఉంది. ఈవిడ రాసిన యక్షగానాల్లో జంపె, అట, త్రిపుల, రచ్చ రేకులు, ఏకతాళి మొదలైన తాళ ప్రధానమైన దరువులు, ద్విపదలు, వచనములు, కందం వంటి పద్యాలు, అర్ధ చంద్రికలు, జోలలు, శోభనాలు, మంగళహారతులు ఉన్నాయి.

మధురవాణి

మధురవాణి తంజావూరును పరిపాలించిన రఘునాథ నాయకుని ఆస్థానములో విదుషీమణులలో ఒకరు. శుకవాణి అని ఈమె మొదటి పేరు. సంస్కృతములో సుందర కాండ వరకు రామాయణాన్ని రచించింది. ఇది సంపూర్ణముగా లభించలేదు. 1500 శ్లోకములుగల 14 సర్గల గ్రంథము మాత్రమే లభించుచున్నది. రామాయణ సారా కావ్య తిలకము 9 సర్గాంత గద్యలలో "మధురైక ధురంధరాంధ్ర కవితా నిర్మాణ సమ్మాన్యయా" అని ఈమె చెప్పుకున్నది. ఈమె అరఘడియలో వంద శ్లోకాలు చెప్పగలదు అని, ఆరు భాషలలో కవిత్వం చెప్పగలదు అని, చిత్ర కవిత్వం ఆమెకు తెలుసునని ఆమెకు ఉన్న బిరుదులను బట్టి తెలుస్తుంది.రఘునాథ నాయకునిచే కనకాభిషేకం పొందిన మహిళ, అంతేగాక సరస్వతీ మహల్‌ని పండితవాగ్వాదంలో గెలిచి మధురనుండి తంజావూరుకు తెచ్చింది ప్రధాన రచనలు: రామాయణ కావ్యతిలకము (సంస్కృత) కుమారసంభవం (సంస్కృత) నైషదం (సంస్కృత చంపూకావ్యం)

పసుపులేటి రంగాజమ్మ

పసుపులేటి రంగాజమ్మ 17వ శతాబ్దమునకు చెందిన తెలుగు కవయిత్రి. తెలుగు సాహిత్య చరిత్రలో స్త్రీలలో మొట్టమొదట కనకాభిషేక సత్కారం పొందింది. రంగాజీ అనికూడా పిలవబడే రంగాజమ్మ, ఒక దేవదాసి కుటుంబములో పసుపులేటి వెంకటాద్రి, మంగమాంబ దంపతులకు జన్మించినది. ఈమె 1633 నుండి 1673 వరకు తంజావూరు ను పరిపాలించిన విజయరాఘవ నాయకుని భోగపత్ని, ఆయన ఆస్థానములో కవయిత్రి. రంగాజమ్మ మన్నారు దాసవిలాసము అనే కావ్యము రచించినది. ఈమె అనేక యక్షగానములను కూడా రచించినది.

ఒక చాటువు విజయరాఘవనాయకుని భార్య, తనభర్తకు ఉంపుడుకత్తెగా ఉన్న రంగాజమ్మకు, తన భర్తను తనకు వదలివేయవలసినదిగా అభ్యర్థిస్తూ, పంపిన రాయబారానికి, సమాధానము గా రంగాజమ్మ పంపినదని చెప్పబడుతున్న పద్యం

ఏవనితల్మముందలుపనేమిపనో/తమరాడువారు గారో, వలపించునేర్పెరుగరో/తమకొగిలిలోననుండగా, రావదియేమిరా/విజయరాఘవ యంచిలుదూరి బల్మిచే, దీవరకత్తెనై, పెనగి తీసుకవచ్చితినా/తలోదరీ ఒక నింద తుది దినములలో, విజయరాఘవనాయకుడు, తనకు సోదరుని వరుస అని తెలిసి, రంగాజమ్మ ఆత్మహత్యకు పాల్పడినదని ఒక కథ వాడుకలో ఉన్నది.

రచనలు

మన్నారు దాస విలాసము, ఉషా పరిణయము, రామాయణ సంగ్రము, భారత సంగ్రహము, భాగవత సంగ్రహము, మన్నారు దాస విలాసము ప్రాకృత నాటకమనబడు ఈ యక్షగానం మన్నారు దాస విలాసము రంగాజమ్మ రచించినది. దీనిని 1926లో ఆంధ్ర సాహిత్య పరిషత్తు ప్రచురించింది.

ముద్దుపళని

ముద్దుపళని (1730-1790) 18.శ. చెందిన తెలుగు కవయిత్రి. ఈమె 1739 నుండి 1763 వరకు తంజావూరు నేలిన మరాఠ నాయక వంశపు రాజు ప్రతాపసింహ యొక్క భోగపత్ని. ఈమె ప్రతాపసింహుని ఆస్థానములో నెల్లూరు శివరామకవితో పాటు ఆస్థాన కవయిత్రి కూడా. ముద్దు పళని యొక్క గురువు తిరుమల తాతాచార్యుల వంశము నకు చెందిన వీరరాఘవదేశికుడు. దేవదాసీల కుటుం బములో జన్మించిన ముద్దుపళని తల్లి పోతిబోటి, అమ్మమ్మ తంజనాయకి కూడా కవియిత్రులని, తండ్రి పేరు ముత్యాలు అని రాధికా స్వాంతనమునకు ఈమె రాసిన ప్రవేశికలో తెలుస్తున్నది. ముద్దుపళని రాసిన రాధికా సాంత్వనము ఒక గొప్ప శృంగార ప్రబంధ కావ్యము. అలిగి కోపముతో ఉన్న రాధను కృష్ణుడు బుజ్జగించడము ఈ కావ్య ఇతివృత్తము. దీనికి యిళా దేవీయము అని కూడా పేరుకలదు. చిన్ని కృష్ణునికి అంకింతమైన ఈ గ్రంథములో నాలుగు భాగములలో 584 పద్యములు ఉన్నాయి.

ఒక మచ్చుకైన ఉదాహరణ

శౌరిని బిల్వగా జనిన చక్కని కీరమదేల రాదొయే
దారిని జన్నదో నడుమ దారెనో చేరెదొలేదొ గోపికా
జారుని గాంచెనోకనదొ చక్కగ నావెతవిన్నవించెనో
సారెకులేక శౌరినుడి చక్కెరయుక్కెబుఅ మెక్కి
చిక్కెనో - రాధికా సాంత్వనము

ముద్దుపళని గొప్ప విష్ణు భక్తురాలు. ఈమె గోదాదేవి రచించిన తిరుప్పావై లోని 30 పాశురాలలో పదింటిని తెలుగులోకి అనువదించి సప్తపది అని నామకరణము చేసినది. వైష్ణవులు ధనుర్మాసములో సప్తపదిని పఠిస్తారు.

తరిగొండ వెంగమాంబ

తరిగొండ వెంగమాంబ 18 వ శతాబ్దానికి చెందిన తెలుగు కవయిత్రి, తిరుమల వేంకటేశ్వర స్వామి భక్తురాలు. వేంకటాచల మాహాత్మ్యము, ద్విపద భాగవతం వంటి ఆధ్యాత్మిక కావ్యాలు రచించింది. వెంగమాంబ చిత్తూరు జిల్లా, గుర్రంకొండ మండలంలోని తరిగొండ గ్రామంలో వాసిష్ఠ గోత్రీకుడైన కానాల మంగమాంబా, కృష్ణయా మాత్య అను నందవరీక దంపతులకు 1730లో జన్మించింది. [1] వెంగమాంబ బాల్యంలో తన తోటి పిల్లల్లాగా ఆటలాడుకోక ఏకాంతంగా కూర్చొని భక్తి పారవశ్యంలో మునిగి తేలేది. ఆ చిరు ప్రాయంలోనే అనేక భక్తి పాటలను కూర్చి మధురంగా గానం చేసేది. తండ్రి ఆమె భక్తిశ్రద్ధలను గమనించి ఆమె నైపుణ్యాన్ని సానబెట్టుటకు సుబ్రహ్మణ్య దీక్షితులు అనే గురువు వద్దకు శిక్షణకు పంపాడు. దీక్షితులు ఆమె ప్రతిభను గుర్తించి తనకు తెలిసిన పరిజ్ఞానమంతా వెంగమాంబకు బోధిం చాడు. అనతి కాలంలోనే వెంగమాంబ ప్రశస్తి నలుమూలల పాకడంతో తండ్రి ఆమె విద్యాభ్యాసాన్ని మాన్పించి తగిన వరుని కోసం వెతకడం ప్రారంభించాడు. ఇంటి పనులలో సహాయం చేయమని తల్లి చెప్పినపుడు తన సేవ భగవంతునికే అర్పణమని వెంగమాంబ తిరస్కరించింది. అనేక మంది వరులు ఆమెను చూచి చాలా అందంగా ఉన్నదనో, చాలా తెలివైనదనో నెపాలతో పెళ్లి చేసు

కొనుటకు సమ్మతించలేదు. చివరకు ఇంజేటి వెంకటాచలప్ప వెంగమాంబను చూసి ముగ్ధుడై ప్రేమలో పడి ఆమెను వివాహమాడుటకు అంగీకరించాడు. తండ్రి వివాహం జరిపించాడు. వివాహానంతరం వెంకటాచలప్ప ఆమె భక్తి మౌఢ్యాన్ని వదిలించే ప్రయత్నం చేసాడు, కానీ వెంగమాంబ అతనిని దగ్గరికి రానివ్వలేదు.

ఈమె తిరుమలలో ఆలయానికి ఉత్తరాన 15 కి.మీ. దూరాన దట్టమైన అడవులలో తుంబురు కోన వద్ద యోగాభ్యాసం చేస్తూ గడపినట్లు తెలుస్తుంది. ఈమెకు వేంకటేశ్వరుడు కలలో కనిపిస్తూ ఉంటాడని అనేవారు. తిరుమలలో ఉత్తర వీధిలో, ఉత్తర దిశలో ఉన్న వనంలో (ప్రస్తుతం ఉన్న ఒక పాఠశాలలో) ఈమె సమాధి ఇప్పటికీ ఉంది. ఈమె ప్రతిరాత్రి ఊరేగింపుగా తన ఇంటి ముంగిటికి వచ్చే భోగ శ్రీనివాసమూర్తికి వెండి పళ్ళెంలో ముత్యాల హారతి ఇస్తూ ఉండేదట. ఇందుకోసం ఒక్కొక్క దినం నగిషీలు చెక్కబడిన వెండిపళ్ళెంలో ఒక్కొక్క దశావతార ఘట్టాన్ని సమర్పించేదట. ఈ విషయం సా.శ. 1890లో ఈస్ట్ ఇండియా కంపెనీవారు తయారు చేసిన కైంకర్య పట్టీ వలన తెలుస్తుంది.ళి2రి ఈమె తన జీవితాంతం శ్రీవేంకటేశ్వరుణ్ణి ఆరాధించింది. చివరకు సా.శ.1817 ఈశ్వర సంవత్సరం శ్రావణ శుద్ధ నవమినాడు తరిగొండ వెంగమాంబ వేంకటేశ్వరస్వామిని స్మరిస్తూ సజీవ సమాధి చెందింది.

రచనలు

వెంగమాంబ రచనలన్నీ వేదాంతం, భక్తి ప్రధానమైనవే. ఈమె రచనలలో ముఖ్యమైనవి.పద్య కావ్యాలు : వేంకటాచల మహాత్మ్యం, అష్టాంగ యోగసారం.ద్విపద కావ్యాలు : ద్విపద భాగవతం (ద్వాదశ స్కంధము) రమా పరిణయం, రాజయోగామృత సారం, వాశిష్ఠ రామాయణం. శతకాలు : శ్రీకృష్ణ మంజరి, తరిగొండ నృసింహ శతకం.యక్షగానాలు: నృసింహ విలాసం శిలీలా విలాసం బాలకృష్ణ నాటకం విష్ణు పారిజాతం రుక్మిణీ నాటకంగోపీ నాటకం లి చెంచు నాటకం ముక్తి కాంతా విలాసం జలక్రీడా విలాసం. తత్వ కీర్తనలు.

రచనా వైశిష్ట్యం సాహిత్యంలో మెలకువలు, రహస్యాలు తెలియకనే, అలంకార వ్యాకరణాది శాస్త్రాలు చదవకనే, కేవలం తన ఇష్టదైవం తరిగొండ నృసింహ స్వామి దయ వల్లనే తనకు కవిత్వం చెప్పడం వచ్చిందని, తన కృతి వేంకటాచలమాహాత్మ్యం అవతారికలో వేంకమాంబ ఇలా అంది.

నా చిననాట నోనామాలు నైన నా
చార్యుల చెంతనే జదువలేదు
పరుగు ఛందస్సులో బది బద్యములనైన
నిక్కంబుగా నేను నేరలేదు
లలికావ్యనాటకాలంకారశాస్త్రము
ల్వీనులనైనను వినగలేదు
పూర్వేతిహాస విస్ఫురితాంధ్రసత్కృతు
ల్శోధించి వరుసగ జూడలేదు
చేరి తరికుండపురి నారసింహదేవు
డాన తిచ్చిన రీతిగ నే నిమిత్త
మాత్రమున బల్కుదును స్వసామర్థ్యమివ్వ
దరయ నించుక యేని నా యందు లేదు.

కావ్యరచనలో పూర్వకవులు తొక్కని దారి లేదు. చెప్పని భావాలు లేవు కదా. నువ్వు కొత్తగా చెప్పేదేముందని ఇప్పుడు కావ్యం రచించావు? ప్రాచీనుల కన్న నీ గొప్ప తనం ఏమిటి? అనేప్రశ్నకు, తల్లితండ్రులకు, చిన్నపిల్లల జిలిబిలి పలుకులు ముద్దుగొల్పుతూ ఉంటాయని తరిగొండ వేంకమాంబ పండితులను, ప్రజలను ఇలా వేడుకుని, తన కావ్యాన్ని రుచి చూపింది.

పండితాగ్రగణ్యులార ప్రజలారా నా
బాలభాష కసూయపడక వినుడు
తల్లిదండ్రులు చిన్నపిల్లల పల్కుల
కానంద మొందెడునట్టు యిందు
మీరు నా తప్పొప్పు లేరీతిగానైన
గేలి సేయక చిత్తగింపవలయు
నాంధ్రగీర్వాణ మహాకృతులుండగా
నిప్పుడీ కృతి వినవేల యనగ
భక్ష్యములు మెక్కి యావల బచ్చడియును
నంజుకొనిన విధంబున నా ప్రబంధ
మాలకింతు రటంచు బేరాస చేత
నేను రచియింతు దాని మన్నించి గనుడు.

పండితులను, ప్రజలను, తన కావ్యాలను స్థాలీపులా కన్యాయంగా స్వీకరించి తనని ఉద్ధరించమని వేడు కొనడంలో, వెంగమాంబ వినయశీలం స్పష్టమవుతూంది. రచన తర్వాత లక్షణం పుడుతుంది. కవి సమాజజీవి. శాస్త్రాలన్నీ సమాజజీవితం నుంచే పుడతాయి. శాస్త్రాన్ని అభ్యసించకపోయినా జీవితానుభవం ఉంటుంది కాబట్టి శాస్త్రవిషయాలు, అనుభవ విషయాలు సహజంగానే రచనలో చోటు చేసుకుంటాయి.

వేంకమాంబ గంభీరమైన యోగరహస్యాలను సరళ సుందరమైన భావమధురమైన శైలిలో వివరించింది. లలితమైన శృంగార భావనలను కూడా రమణీయశైలిలో చెప్పింది. యోగతత్వ విషయాలను ఎంతో విజ్ఞానప్రదంగా చెప్పింది. ప్రణయకోపాలను, సవతి మాత్సర్యాలను, నర్మగర్భసంభాషణలను, స్త్రీల ఎత్తిపొడుపు మాటలను, శ్రీకృష్ణుని శృంగారలీలలను, సహజంగా, రసవత్తరంగా, హృదయానికి హత్తుకునేలా చెప్పింది. ఆమె ఆత్మ విశ్వాసంతో మధురభక్తి కాక, జ్ఞానాత్మకమైన యోగభక్తితో, పాండిత్యాన్ని ప్రదర్శిస్తూ రచనలు చేసింది. ఈమె పాడుకోడానికి వీలైన సింగారపు పాటలు, నలుగు పాటలు, ఆరగింపు పాటలు, నిద్ర పుచ్చే పాటలు, మంగళ హారతి పాటలు వ్రాసి, తన రచనలను సంగీతసాహిత్య సమ్మేళనాలుగా రూపొందించింది.

తరికొండ వేంకమాంబ రచించిన శ్రీకృష్ణమంజరి చాలా ప్రశస్తమైన స్తుతికావ్యం. దీనిని వావిలికొలను సుబ్బారావు (“ఆంధ్ర వాల్మీకి” వాసుదాస స్వామి) తమ భక్తిసంజీవని అనే పత్రికలో జనవరి 1929 సంచికలో ప్రచురిస్తూ, ఈమెను మహాయోగిని, భక్తురాలు, కవయిత్రిగా పేర్కొన్నాడు.

శ్రీ వెంకటేశ! నా చిత్తంబు నందు
నీ పాదయుగళంబు నిల్పవే కృష్ణ
నన్నేల తరిగొండ నరహరాకృతిని

బ్రత్యక్షమై నన్ను బాలింపు కృష్ణ! అని ఈ స్తుతిమంజరి కావ్యం మొదలై చివరలో ఈమె తల్లిదండ్రులు కానాల మంగమాంబ, కృష్ణయామాత్యుడు అని చెప్పడం జరుగుతుంది.

సంస్కృత వరాహ, భవిష్యోత్తర, పద్మపురాణాలలోని వేంకటాచల మహాత్యం ప్రశంసలు ఆధారంగా, వేంక మాంబ, ‘వేంకటాచల మాహాత్మ్యం’ రచించింది. దీనిలో పద్మావతీశ్రీనివాసుల వివాహ వృత్తాంతాన్ని ఎంతో రమణీయంగా రూపొందించింది. .స్త్రీ హృదయాంత రాళాలలోని సున్నితభావాలను, ఆత్మాభిమానాన్ని, ఆత్మ గోపనాన్ని వేంకమాంబ అత్యంతమార్దవంగా, మార్మికతతో, చాకచక్యంతో, సరసంగా చిత్రించింది. శ్రీనివాసుని ద్వితీయవివాహసందర్భంలో లక్ష్మీదేవి అనుభవించిన బాధను ఆమె సమర్థంగా వర్ణించింది. ఇది వెంకటగిరి క్షేత్రమహాత్యం వర్ణించే కావ్యం.

వేంకమాంబ తాను భాగవతం ద్వాదశస్కంధాలను ద్విపదకావ్యాలుగా రచించినట్టు, వేంకటాచల మాహాత్మ్యంలోని ఒక పదంలో చెప్పుకొంది.

ఈ ద్విపద భాగవతంలో, తత్వార్థాలను పామరులకు కూడా సరళసుబోధకం చేయడానికి, వేంకమాంబ తేటతెలుగు పదాలను ప్రయోగించి సంక్షిప్తసుందరం గావించినట్టు, ఈ ద్విపద పంక్తులను బట్టి తెలుస్తున్నది.

వేశ్యాంగన ముద్దుపళని వ్రాసిన రాధికా సాంత్వనము అనే శృంగారప్రబంధంలో వలె, మితిమీరిన శృంగార వర్ణనలు చేయక, కులాంగన అయిన వేంకమాంబ శృంగారం పేర అసభ్యవర్ణనలు చేయలేనని వేంకటేశ్వర మాహాత్మ్యంలో శ్రీకృష్ణునికి, అనగా కలియుగప్రత్యక్షదైవం వేంకటేశ్వరస్వామికి ఇలా విన్నవించుకోవడం సమంజసంగానే ఉంది.

శృంగారాకృతి తోడ పచ్చి పదముల్ శృంగారసారంబు తో
డం గూఢంబుగ జెప్పు నీవనగ నట్లే చెప్పలేనన్న నన్
ముంగోపంబున జూచి లేచి యటనే మ్రొక్కంగ మన్నించి
తచ్ఛృంగారోక్తులు తానె పల్కికొను నా శ్రీకృష్ణుని సేవించెదన్.

వేంగమాంబ తన కావ్యంలో పచ్చి శృంగారవర్ణనలు చేయలేదు సరి కదా, అక్కడక్కడ సందర్భోచితంగా వెలువడిన శృంగార పద్యాలు కూడా కృతిపతి శ్రీకృష్ణుని

చమత్కారాలే అని లోకానికి చెప్పినట్టు తెలిస్తున్నది. ఎరుకసాని పాత్రను వేంకటాచలమాహాత్మ్యం కావ్యంలో ప్రవేశపెట్టి పాత్రోచితభాషగా సోదిభాషను ప్రయోగించి, నాటకీయతను, రమణీయతను కలిగించింది వేంకమాంబ

అవ్వోయవ్వ నీ తలంచిన తలంపు మేలవుతాదంట. దేవుళ్లు పలుకుసుండారు. తలచిన తలపేమంటివా, సెప్పెద విను దయితమ్మ! ఆ నల్లనయ్య యే దిక్కు నుండి వచ్చినాడంటావా? తల్లి ఇదిగో ఈ మూల నుండి వచ్చాడే....

తరిగొండ వేంగమాంబ శైలి, వేదాంతవిషయవివరణ సందర్భంలో కూడా మధురమై, వ్యావహారికానికి సన్నిహితమై ఉండటం విశేషం. ఆమె రచనలు ఆత్మ జ్ఞానానికి, ఔచిత్యానికి ఆటపట్టు. ఈమె నిర్గుణోపాసన నుంచి, సగుణోపాసులోకి దిగి మధురభక్తి సంప్రదాయాన్ని గురించి ప్రబోధాత్మకమైన, భక్తిదాయకమైన, రసోప్లావిత మైన, అధ్యాత్మికచింతనాభరితమైన కమనీయకావ్యాలను రమణీయంగా రచించి, ఆంధ్రపాఠకలోకానికి అందించింది.

శ్రీమహావిష్ణువు వరాహావతారంలో హిరణ్యాక్షుని సంహరించి పాతాళాంతర్గతయైన భూమిని ఉద్ధరించిన తరువాత తన అవతారం గురించి భార్య లక్ష్మీదేవి ఏమి అడుగుతుందో, ఎలా గేలి చేస్తుందో అని తన సందేహాలను విష్ణువు గరుత్మంతునితో హాస్యంగా సంభాషించిన ఘట్టాలను ఆమె వర్ణించిన తీరు అత్యద్భుత మని విమర్శకులు శ్లాఘించారు.

వెంగమాంబ రచించిన తొమ్మిది యక్షగానాల్లో నృసింహ విలాసము, బాలకృష్ణనాటకము, రుక్మిణీ నాటకము, విష్ణుపారిజాతము, జలక్రీడా విలాసము అనే అయిదింటికి బమ్మెర పోతన భాగవతము కల్పతరువు ప్రత్యక్షంగా కథావస్తువును ప్రసాదించింది. దశమ స్కందంలోని రాసక్రీడాంశం ఆధారంగా వెంగమాంబ లేఖిని నుండి వెల్వడిన బాలకృష్ణ నాటకలో పోతన గారి ఒరవడికి చక్కని ఉదాహరణ.వెంగమాంబ రచించిన తాత్విక కావ్యాల్లో విశిష్టమైనది రాజయోగామృతసారం మిక్కిలి ప్రసస్తమైనది. భాగవత తృతీయస్కంధంలోని కర్దమ ప్రజాపతి వృత్తాంతమే ఇందలి ఇతివృత్తం.ఈ కథలోని కపిలదేవహుతి సంవాదం ఆధారంగా వెంగమ్మ ఈ ద్విపదికృతిలో స్వానుభవపూర్వకమైన రాజయోగ విజ్ఞానాన్ని ముచ్చటగా మూడుప్రకరణాల్లో వివరించింది వెంగమాంబ. వెంగమాంబ రచనలన్నింటిలో పరిమితి లోను, కవితా పరిణతిలోను ప్రథమగణ్యమైన గ్రంథం శ్రీభాగవతము. ఇది ద్విపదకావ్యము.భగవంతుని ప్రేరణయే కారణంగా తాను ఈగ్రంధాన్ని రచించినట్లు వెంగమాంబ అవతారికలో తెలిపింది. ఒకనాటి మధ్యాహ్న సమయంలో భగవానుడు భూసుర శ్రేష్ఠుని రూపంలో వచ్చి, భాగవతంలో తత్త్వార్థాలు పామరులకుసైతం బోధపడేటట్లు సంగ్రహంగాను, శ్రీహరి మహిమలను విస్తారంగాను రచించవలసినదిగా వెంగమాంబను ఆదేశించాడు.అయనే మరికొంత సేపటికి బాలకృష్ణుని రూపంలో ఆమె చెంతకు వచ్చి, భగవ్త గ్రంథాన్ని చేతికిచ్చి దీనిని ద్విపదగా రచించిమని సూచించి వెళ్ళినాడు.

వెంగమాంబకు పూర్వం తెలుగులో ద్విపదభాగవతాలు కొన్ని వెలసి ఉన్నప్పటికీ, వెంగమాంబ కృతి యొక్కటే పోతనగారి రచనను ఆమూలాగ్రం సమర్థవంతంగా అనుసరించిన ప్రఖ్యాతికి, అభక్తి గౌరవాలను నోచుకున్నది. ఇందువల్ల ఆనాటి (18వ శతాబ్దం) వెంగమాంబకు అందు బాటులో ఉన్న పోతన భాగవతిప్రతిలోని పాఠాలను గుర్తించగల పదవకాశం ఈనాడు మనకు ఆమె ద్విపది కృతి వల్ల సిద్ధిస్తూ ఉంటుంది. వెంగమాంబ పోతన రచనను యథాతథంగా ద్విపదీకరించినప్పటికీ, ఆమె అచ్చటముచ్చట కథలో కొన్ని చిన్న మార్పులు చేర్పులు చేసింది.

విశేషాలు

పలు ప్రక్రియలలో ఇన్ని గ్రంథాలు వ్రాసిన కవయిత్రులు ఆ కాలంలో లేరు. ఇటీవలే వెంగమాంబకు సంబంధించిన జీవిత విశేషాలను, రచనల వివరాలను తెలుపుతూ ఒక జాతీయ సదస్సును తిరుమల తిరుపతి దేవస్థానములు ఉద్యోగుల శిక్షణా సంస్థ డైరెక్టర్ భూమన్ ప్రారంభించాడు. ఆమె కీర్తనలకు ప్రాచుర్యం కలిగించే లక్ష్యంతో "జీవనగానం" అవే సి.డి.ని 2007లో విడుదల చేశారు.

తరిగొండ శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయంలో వెంగమాంబ ప్రతిమ తరతరాలుగా పూజలు అందు కొంటున్నది. జనవరి 1న, ఇతర పర్వదినాలలో ప్రత్యేక పూజలు జరుగుతాయ.

ఉత్తర మాడా వీధిలో నివసించే తరిగొండ వెంగ మాంబ హారతి తీసుకోనిదే బ్రహ్మోత్సవాల సమయంలో ఆమె ఇంటి ముందునుండి కదలని రథానికి గుర్తుగా ప్రతీరోజూ రాత్రి ఏకాంతసేవ అనంతరం వెంగమాంబని పాట పాడి హారతి ఇమ్మని భక్తులూ, అర్చకులూ అడిగేవారట. కాలక్రమంలో అది ఒక సేవగా స్థిరపడి పోయింది. ఈ సేవనే తరిగొండ ముత్యాల హారతి అనేవారు. వెంగమాంబ తరువాత ఆమె దత్తపుత్రిక వారసురాలయ్యింది. అదే పరంపర నేటికీ కొనసాగు తుంది.

ఆధార గ్రంథాలు

1. వుమెన్ రైటింగ్ ఇన్ ఇండియా 600 బీ.సీ. టు ద ప్రెజెంట్ - సూసీ థారూ, కే.లలిత వాల్యూం
2. నిడదవోలు, మాలతి (2013). Telugu Women Writers, 1950-1975
3. మొల్ల రామాయణము
4. మొల్ల (తెలుగు వైతాళికులు) - రచన: సి. వేదవతి - ప్రచురణ : పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం (2006)
5. 1957 భారతి మాస పత్రిక. వ్యాసము - ఆంధ్రకవయిత్రులు-మొల్ల వ్రాసినవారు నరసింహం.
6. కడప జిల్లా కవయిత్రులు - ఆతుకూరి మొల్ల
7. దామెర, వేంకట సూర్యారావు. "బాల పాపాంబ". విశిష్ట తెలుగు మహిళలు. రీమ్ పబ్లికేషన్స్.
8. నమస్తే తెలంగాణ. "తెలుగు సాహిత్య ప్రక్రియలు -- యక్షగానం
9. సప్తగిరి ఆధ్యాత్మిక మాస పత్రిక, తి.తి.దే. ప్రచురణ - జనవరి 2008 - డా. రమేశన్ వ్రాసిన ఆంగ్ల గ్రంథం ధారావాహికకు డా. కోరాడ రామకృష్ణ అనువాదం
10. తరిగొండ వేంకమాంబ, దక్షిణాది భక్తపారిజాతాలు, శ్యామప్రియ, యస్.వి.యస్.గ్రాఫిక్స్, హైదరాబాదు, 2003.
11. ఎందరో మహానుభావులు, తనికెళ్ళ భరణి
12. ఆంధ్ర వాఙ్మయ చరిత్ర -

★★★

Vol. 23 | Spl. Issue 03 | March 2026 | BHAVAVEENA | ISSN No. : 2456-4702 | RNI No. APTEL/2003/12253

RNI No. APTEL/2003/12253 | Reffered Journal & Peer Reviewed Journals | ISSN No. 2456-4702

భావవీణ

కళలు, సాహిత్య, సాంస్కృతిక భాషాధ్యయన పత్రిక

BHAVA VEENA

Journal of Arts, Literary, Culture & Language Study

తెలంగాణ దళిత కథల్లో మహిళల సామాజిక చైతన్యం

– డా॥. సూరేపల్లి గోదావరి

హైదరాబాద్.

Keywords :

కథ, కథానిక, ఆధునిక సాహిత్యం, సామాజిక చైతన్యం, వివక్షత, దళితవాదం, దవాఖాను, స్త్రీ అస్తిత్వం, అమానుష చర్య, అబార్షన్.

వ్యాససంగ్రహం :

'హితేన సహితం సాహిత్యమ్' అనీ 'సహితస్య భావః సాహిత్యమ్' అనీ అంటే సాహిత్యం హితంతో కూడినదనీ, ధర్మాది సమస్త శాస్త్ర రహస్యాలతో సహితమైనదనీ అర్థం. ప్రకృతిలో వున్న సత్యాన్ని సౌందర్యవంతంగా, ఆనంద పర్యవసానంగా చిత్రంచేది సాహిత్యం ఉపదేశప్రధానాలైన రసపోషకాలైన ప్రాచీన కావ్యనాటకాది ప్రక్రియలూ, ఆధునికాలైన నవల, నాటకం, నాటిక, వ్యాసం, కథానిక, గేయాలు సాహిత్యమనబడతాయి. సమాజమనే కేంద్ర బిందువు చుట్టూ వివిధ వ్యాసార్థాలతో గీయబడిన వృత్తం వంటిది సాహిత్యం. ఒక కాలంలో వెలుగు చూసిన ఒక జాతి సాహిత్యాన్ని చదవడం ద్వారా ఆ జాతి సామాజిక పరిస్థితుల్ని తెలుసుకోగలుగుతాం. సాహిత్యంలో ఏదో ఒక విషయం వుంటుంది. దానిని తెలిపే భాషా నిర్మాణం వుంటుంది. ఈ రెండూ కలిసి ఏదో ఒక ప్రక్రియ రూపంలో వుంటాయి. అంటే కవిత్వమో, నాటకమో, నవలో, కథో వుంటాయి. సాహిత్య వస్తువు, సాహిత్య భాష, సాహిత్య ప్రక్రియ ఈ మూడు అంశాలు మార్పులకు లోనవుతూ వుంటాయి. సాహిత్యంలో సామాజిక దృక్పథం ప్రధానంగా వుంటుంది. సామాజిక స్పృహతో రాసే రచన పాఠకులలో సామాజిక చైతన్యాన్ని పెంచుతుంది. ఈ కోవకు చెందినవే దళిత కథలు.

కథ కథ కోసం కాక, ఏదో ఒక విశేషాంశాన్ని, అర్థాన్ని సహృదయతను పాఠకుడికి అందించవలసి వుంటుంది. అంటే ప్రతి కథకు అది ప్రధాన కథ కావచ్చు. అది ఆ కథలో ఇమిడి, వ్యాపించి వుంటుంది. కథ విన్న చదివిన పాఠకుడికి ఆ కథలో ఇమిడి ఉన్న అర్థం తేటపడుతుంది. దళిత కథ హృద్యంతో ఆహ్లాదకత్వంతో వుండాలి. కొత్తదనం పుట్టిపడేలా వుండాలి. హృద్యత, కొత్తదనం రెండూ కథలో వుంటే పాఠకుడిని చైతన్యవంతుణ్ణి చేస్తుంది. అప్పుడే ఈ కథలు మనిషిలో మంచితనాన్ని పెంచుతాయి. ఈ మార్గంలో తెలంగాణ రచయిత్రులైన జూపాక సుభద్ర, గోగుశ్యామల, జాజులగౌరి వంటి వారి కథా ప్రక్రియలో రకరకాల దళిత కథలు రాశారు. వీరి దళిత కథలో స్త్రీ సామాజిక చైతన్యాన్ని వివరించడమే ఈ వ్యాస ముఖ్య ఉద్దేశ్యం.

ఉపోద్ఘాతం :

దళిత రచనా వస్తువు సమకాలికమైతే అందులో వాటి సామాజిక పరిస్థితులు మరింత ప్రస్ఫుటంగా ప్రత్యక్ష మవుతాయి. సమకాలీన జీవితమే దళిత కథలకు వస్తువు

కావాలి. దళిత కథావస్తువు వాస్తవికతకు దగ్గరగా వుండాలి. వస్తు స్వీకరణలో వైవిధ్యముండాలి. దళిత కథ ప్రధానంగా ఒక పాత్ర చుట్టూ ఒక సంఘటన చుట్టూ, ఒక భావం చుట్టూ పరివ్యాప్తంగా వుండేటట్లు రాసినవారు తెలంగాణ కథకులు. మానవ ప్రవర్తనకు అత్యంత సమీపంలో వున్న సాహిత్య ప్రక్రియ కథానిక. అందరం మనుషులమేనని, ఒకరు ఎక్కువ ఒకరు తక్కువ కాదు అని, మనకు కీడు చేసిన వారికి కూడ మేలు చేయాలని మొక్క వోని ధైర్యంతో ఎదగాలని చెప్పి ఈ కథను అత్యంత సుందరంగా తీర్చిదిద్దారు తెలంగాణ కథలు. వీటిలో స్త్రీ పాత్రల్లో వైవిధ్యాన్ని ముఖ్యంగా స్త్రీల సామాజిక చైతన్యాన్ని చక్కగా చిత్రించారు.

సామాజిక స్పహ ఉన్న కథలు చైతన్యానికి అభివృద్ధికి కారణమవుతున్నాయి. సామాజిక స్పృహ అంటే మానవ సమాజం ఒకటి ఉందన్న మాట. 'సమాజం సాహిత్యంలో ప్రతిబింబించాలని, అది సహజంగా, వాస్తవికంగా ఉండాలని అటువంటి సాహిత్యం సమాజానికి మార్గ దర్శకంగా ఉండాలని, సంఘాన్ని ప్రభావితం చేయాలని కోరుకొనే దృష్టితో సమాజ-సాహిత్య సంబంధ బాంధవ్యాలు ఇచ్చి పుచ్చు కోవటాల నేపథ్యంలో కథానికల్ని చూడాలి. దళిత రచయిత్రుల కథలన్నింటిని పరిశీలించినప్పుడు అన్ని కథలు వాస్తవికతను సంతరించుకొన్నవే, కొన్ని రచయిత యధార్థ జీవితంలో నుండి వచ్చినవి. తాను సమాజంలో ఎదుర్కొన్న పరిస్థితులను మనకు కళ్ళకు కట్టినట్లు వర్ణించారు.

మహిళ సామాజిక చైతన్యం :

కథానికలలో వస్తువు పాత్రల రూపంలోనే ఆకృతి పొందుతుంది. కథకు జీవం నింపేది పాత్రలు. పాత్ర చిత్రణ విషయంలో కథకులకు నిశిత దృష్టి చాలా అవసరం, ఒక కథ చదివినా, విన్నా అందులోని పాత్రలు మనసులో చెదరని ముద్ర వేయగలగాలి. అప్పుడే ఆ కథకు మంచి గుర్తింపు వస్తుంది. పది కాలాల పాటు పాఠకుల హృదయాలలో నిలిచిపోతుందని దళిత స్త్రీ పాత్రల ద్వారా నిరూపించడం జరిగినది.

చిన్నపాప-మన్నుబువ్వ- జాజులగౌరి :

దళిత కుటుంబాలలోని పేదరికం పిల్లల్ని ఎలా బాధిస్తుంది ప్రత్యక్ష అనుభవంతో జాజులగౌరి 'మన్ను బువ్వ' కథగా రాశారు. ఈ కథ దళిత కుటుంబాల పిల్లలు అనుభవిస్తున్న అత్యంత దయనీయ స్థితిని వ్యక్తం చేస్తుంది. ఆటల్లో వండిన మట్టినే అన్నంగా లొట్టలేసు కుంటూ తిన్నట్లుగా నటించిన చిన్నారి అనుభవం తన నిజజీవితంలో కూడా ఆకలి బాధ భరించలేక మన్ననే అన్నంగా భావిస్తూ ఆకలి తీర్చుకుంటుంది.

"మన్నుబువ్వ' కథలో ఇంట్లో తిండిఖర్చులు కూడా జరుగుబాటు లేని స్థితిలో భార్యభర్తల నడుమ గొడవలు జరుగుతూ వుంటాయి. భర్త తాగుడు కారణంగా పిల్లలకు తిండి పెట్టలేకపోతున్నానన్న ఆర్థిక, మానసిక వేదన పేద దళిత స్త్రీలది, ఈ తల్లుల ఆవేదన పురుషుడికి అర్థం కాదు.

ఈ కథలో చిన్నపాప తన ఆటల్లో వండిన మన్ను బువ్వనే మెత్తని మన్నును అన్నంగా తయారు చేసుకొని తిని నీళ్ళుతాగి పడుకుంటుంది. తల్లి ఎంతలేపినా లేవదు. ఈ కథ చదువుతుంటే.. దక్షిణాఫ్రికాలోని ఓ మారుమూల కొండప్రాంతంలోని ప్రజలు ఆహార సంపాదనలేక జల్లించిన మెత్తని మన్ననే రొట్టెలుగా తయారుచేసుకొని తిన్న డాక్యుమెంటరీ చిత్రమే కళ్ళముందు కదలాడింది. పురుషుడి సంపాదనపై ఆధారపడ్డ కుటుంబంలోని స్త్రీలు, పిల్లల మానసిక స్థితిని ఈమె చిత్రించారు. పస్తులతో వున్న ఇంట్లోకి తాగి వచ్చిన భర్తను చూసి అతని భార్య లక్ష్మికి కడుపులో కాల్తుంది తాగొద్దని ఆమె ఎంతగా చెప్తున్నా కూడా భర్త తాగడం మానలేదు. ఆమె అతని తప్పుని తెలియజేస్తున్నప్పుడు కూడా ఆమె భర్త ఆధిపత్య వైఖరితో దబాయిస్తాడే తప్ప, ఆమె బాధను అర్థంచేసుకోని వైనాన్ని అతని మాటల్లోనే ఇక్కడ గమనించొచ్చు.

మన్ను తిని ఆకలిని శాశ్వతంగా ఎలా తీర్చుకోవచ్చో తెలియచెప్పిన ఒక చిన్నపాప కథ మన్నుబువ్వ. ఆకలి చాలా చెడ్డది, మనిషిని ఏమి చెయ్యడానికైనా ఉసి కొల్పుతుంది, అందుకే అమాయకపు పసిపిల్లతో! మన్ను తిని ఆకలిని చంపుకునే ప్రయత్నం చేసేలా చేసింది,

చివరకు పాప ప్రాణాలను బలి తీసుకుంది. పేదరికంలో పుట్టడం నేరం కాకపోయినా, పేదరికం వల్ల కుటుంబం మొత్తం ఆకలితో అలమటించడం, దారుణ దృశ్యం. అటువంటి ఒక దృశ్యాన్ని పాఠకుడి ముందుంచింది 'మన్నుబువ్వ' కథ.

యాదమ్మ-దవాఖాన-జాజులగౌరి :

దళితుల పేదరికాన్ని తెలుపుతూ జాజుల గౌరి రాసిన మరో కథ దవఖాన. కథ ప్రారంభంలో "దవఖాన్ల నూకుడు బండి మీద పీనుగని ఏసుకోస్తుంటే ఒక్కసారిగా అదిరి పడింది పక్కకు జరిగింది యాదమ్మ. కొడుకు ఆరోగ్యం బాగా లేకపోతే మధ్యాహ్నం ఆసుపత్రికి వచ్చింది యాదమ్మ . శవం ఎదురు వస్తే యాదమ్మ పక్కవాళ్ళని ఎవరనీ అడుగుతుంది, కానీ కథ చివర్లో ఆ ఎదురు వచ్చిన శవం తన భర్తదే అని తెలుసుకుని గుండెలు పగిలేలా ఏడుస్తుంది. దళితుల పేదరికాన్ని, నిస్స హాయతను, ప్రేమ అనుబంధంను ఈ కథ తెలిపింది.

శ్రీలత- బల్లనే దోస్తు వూల్లే కాదు-జూపాక సుభద్ర :

జూపాక సుభద్ర రాసిన కథ బల్లనే దోస్తు వూల్లే కాదు. శిర్షికను బట్టే కథ ఇతివృత్తం మనము అర్థం చేసుకోవచ్చు. దీనిలో సువర్ణ శ్రీలత స్నేహితులు. దీనిలో సువర్ణ పద్మశాలి అమ్మాయి, శ్రీలత దళిత కుటుంబం అమ్మాయి. శ్రీలత జెండా వందనంకు డ్రస్సు అవసరం వస్తుంది. తల్లికి తెలియకుండా శ్రీలతకు డ్రెస్ తెస్తుంది సువర్ణ. ఆ తర్వాత సువర్ణ తల్లీకి విషయం తెలిసి " నీకేం బుట్టిందే.....మాదర్యోదా ముండ గా మాదిగోల్ల పిల్ల కిచ్చి మల్ల దెచ్చుడేంది అంటుంది. సువర్ణ వాళ్ళమ్మ ఆ బట్టల పై కిరోసిన్ పోసి తగల పెడుతుంది. అంటరాని తనం అమాయకపు పిల్లలను ఎట్లా వేధిస్తుందో ఈ పాత్ర ద్వారా తెలుస్తుంది.

అమ్మాయి-నీళ్ళబాయి-జాజులగౌరి :

ఒక పల్లెటూరి జీవితాన్ని, తద్వారా స్త్రీ అస్తిత్వాన్ని స్పృశించిన కథ నీళ్ళబాయి. పంటపొలాల్లో పంటకు కావాల్సిన నీటికోసం పడే పాట్లు కళ్ళకు కట్టించారు రచయిత్రి. ఆ జీవన విధానాల్లోని కష్ట-నష్టాలను, సుఖ-దుఃఖాలను ఒకతరం వెనక్కు వెళ్ళి పాఠకులు అనుభ విస్తారు. ఒక చిన్న అమ్మాయి చెప్తూ ఉన్నట్లు, ఆ అమ్మాయి గతాన్ని గుర్తు చేసుకుంటున్నట్లుగా సాగే నీళ్ళబాయి కథ స్త్రీ అస్తిత్వాన్ని చాలా చక్కగా ఆవిష్క రించింది. ఎక్కడా, ఎవరినీ నొప్పించకుండా చాపకింద నీరులా చడీ చప్పుడు లేకుండా, స్త్రీ జీవన శైలిని పాఠకుడికి అందించారు రచయిత్రి. ఆడుతూ పాడుతూ సాగే జీవితంలో, అకస్మాత్తుగా ఇక చాలు, వయసుకొచ్చావు అంటూ ఆటలకు అనకట్ట ఎందుకు ఎదురవుతుందో ఎనిమిది సంవత్సరాల అమ్మాయికి అర్థం కాని, జవాబు దొరకని ప్రశ్న. ఎనిమిది సంవత్సరాలకే బాల్యం ఛాయలు వదులుకోవలసి రావటం అన్న ఊహే కష్టంగా ఉంటుంది. అటువంటి జీవన విధానం అమలులో ఉన్న పరిస్థితులు ఇప్పటికీ కొల్లలుగా కనిపిస్తాయి. మగపిల్లలతో కలిసి ఆడుకోవడం నేరం, తలెత్తుకుని నడవడం తప్పు, నలు గురిలో గట్టిగా నవ్వడం తప్పు.... ఒకటేమిటి ఇటువంటి ఆంక్షలు లెక్కకు మించి. ఇవన్నీ ఆడపిల్లలకే ఎందుకు అన్నదే కథలోని అమ్మాయి ఆవేదన.

"నాయిన నీసు మంచిగ తింతడని వారి కోతలైనంక ఎండ్రికాయలను పట్కురమ్మని అన్నతోటి అనంగనే సుదన్న నరేందరుగాడితోటి కల్సి వరాల పొంటి ఎండ్ర కాయలు పట్కురానికి పోతుంటే మేము గూడ వస్తమని నేను సెల్లె రడీ అయ్యేతాల్లకు అన్నకు తిక్కరేగి పెండతోటి నిండివున్న తమిలేర్లు (ఇన్పడబ్బాలు) నాకొకటి సెల్లెకొకటి ఇచ్చి సుదన్న, నరేందరుగాడు దొరలలెక్క ముందు నడుస్తుంటే పనోల్లలెక్క మేము యెన్కెన్క పోతుంటిమి" ఆడపిల్లలకు, మగపిల్లలకు మధ్య తేడా అనేక సందర్భంలో పై విధంగా వ్యక్తమౌతూనే ఉండడం మనం కథలో చూస్తాం. అమ్మాయి తల్లి కూతుర్ల విషయంలో ఎటువంటి వ్యత్యాసం చూపించకపోవడం కనిపిస్తుంది, అయితే సమాజానికి భయపడక తప్పదన్న విషయాన్ని మాత్రం తన కూతుర్లతో చెప్పడంద్వారా, స్త్రీలపై సమాజంలో ఉన్న వివక్ష అర్థం అవుతుంది.

సుగుణ-కంచె-జాజులగౌరి :

ఆడపిల్లగా పుట్టడం ఎంత భయానకమైంది అన్న స్పృహను కలిగించిన కథ కంచె. కామాంధుల చేతిలో

మానభంగానికి గురై అనేక అవమానాలు పడుతున్న పాత్రగా సుగుణను రచయిత్రి తీర్చిదిద్దారు. ఒకానొక అమానుష చర్యకు గురికాబడి, దాన్ని ఎలా ఎదుర్కోవాలో తెలియక, బతుకు బరువనుకున్న ఒక అమాయకపు ఆడపిల్ల కన్నీటిగాథ ఈ కంచె కథ. వయసుతో నిమిత్తం లేకుండా ఆడదైతే చాలు అంబోతుల్లా మీద పడి కామం చల్లార్చు కునే కోవకు చెందిన కామాంధుల ఘాతకాన్ని ఆవిష్క రించింది. సమాజంలో ఇటువంటి దారుణాలకు గురి కాబడి, కామాంధుల చేతీల్లో బలి అయిన ఎందరో అమాయకపు ఆడపిల్లలను గుర్తుకు తెప్పించే సందర్భం ఈ కథ. ఆత్మహత్యకు పాల్పడిన సుగుణను అడ్డుకుని, నీ మీద ప్రేమే కానీ ద్వేషం లేదని, నువ్వు చస్తే ఇక మాకు బతుకెక్కడిదనీ, సుగుణను అక్కున చేర్చు కుంటుంది. తప్పేమీ లేని తన బిడ్డను రక్షించుకునే దిశగా నిర్ణయం తీసుకుని, అబార్షన్ చేయించదలుస్తుంది తల్లి పాచమ్మ.

ఊహించని కష్టానికి, జరిగిన నష్టానికి శరీరమంతా కంపించినా, నెమ్మదిగా తేరుకుని, సాటి స్త్రీగా, సమాజపు కుల్లును బాగా ఎరిగినదిగా, బిడ్డ మంచి భవిష్యత్తును కోరుకుని గుండె నిబ్బరంతో ముందడుగు వేయగలిగిన నిర్ణయం తీసుకోగలిగిన ఒక తల్లి కూతుళ్ల కథే కంచె.

గౌరి-నేన్-నేన్లెక్కనే-జాజులగౌరి :

కులం పేరుతో దళితులను నీచంగా, హీనంగా చూసే కోవకు చెందిన పెద్దమనుషులకు బుద్ధి చెప్పే దిశను నిర్ణయించుకుని, బుద్ధి చెప్పే ఆయుధం ఏంటో తెలుసు కుని, ముందడుగు వేసిన, ఏడెనిమిది సంవత్సరాల గౌరి ఆత్మస్థైర్యాన్ని పరిచయం చేసి, విస్మయానికి గురి చేసే కథ నేన్ నేన్లెక్కనే. పసిపిల్లలైన గౌరి, గంగ అక్కా చెల్లెల్లు. పాలం పనులు, ఇంటి పనులు చేసుకుంటూ పిల్లలను కనిపెట్టుకునుండటం కష్టంగా అనిపించి బడికి చేర్చు తుంది వీళ్ళ అమ్మ. కొన్ని రోజుల్లోనే బడికి వెళ్లిరావడానికి పిల్లలిద్దరూ బాగా అలవాటు పడతారు. ఇలా చూస్తుండ గానే మూడు సంవత్సరాలు దాటుతాయు. గౌరి మూడవ తరగతికి వస్తుంది, బాగా చదువుతుందన్న పేరు సంపా దించుకుంటుంది. దాహమేసి ఒకరోజు స్నేహితురాలింట్లో నీళ్ళు తాగటానికి వెళ్ళిన గౌరి, గంగలకు కొత్త అనుభవం ఎదురవుతుంది. మీరెవరు, ఏ కులం, ఎక్కడుంటారు అన్న ప్రశ్నలు తమపై నంధింపబడతాయి. తమ జీవితంలో మొట్ట మొదటిసారిగా ఎదురైన అటు వంటి ప్రశ్నలకు సమాధానాలు వారి దగ్గర ఉండవు. ఎక్కడినుండి వస్తున్నారో మాత్రం చెప్తారు.

ఈ కులం పిచ్చి ఉన్నవాళ్ళతో తానెలా గెలవాలో ఎరిగిన దానిలా, ఒక నిర్ణయానికి వచ్చి పట్టుదలతో చదువులో నిమగ్న మవుతుంది గౌరి. ఎప్పుడూ చదువులో మునిగివుండే కూతుర్ని చూసి, నా కూతురు బాపనోల్ల లెక్కనే చదువు తుందని తన తల్లితో అంటున్న తన తండ్రి దగ్గిరికెల్లి...." నేను ఎవల్ల లెక్క సద్వుతలే నేన్ నేనెక్కనే సద్వతున్నా" అంటూ ఎంతో ఆత్మ విశ్వాసంతో చెప్తుంది. చదువులో తానే ఎప్పుడూ ముందుంటూ, పెద్దకులాల పేరు చెప్పుకుంటూ, తనను తక్కువగా చూసిన వారిని చదువుతో దెబ్బ తీస్తుది గౌరి. మొత్తం జీవితంలో తాను ఎలా ముందుకెదగాలో కూడా నిర్ణ యించుకుంటుంది. దళిత కులంలో పుట్టి, పెరిగిన ఒక ఆడపిల్ల ఆత్మ విశ్వాసమే ఈ కథ. ఆత్మస్థైర్యమే ఆయుధంగా మరెం దరికో ఆదర్శంగా నిలిచిన గౌరి కథ.

తల్లి-దస్తకత్-జాజులగౌరి :

కులం అన్న పేరు సమాజంలో చీడ పురుగు వంటి దన్న స్పృహను కలిగించే కథ దస్తకత్. నిరుపేదలకు, పేదలకు ధన సహాయం అందచేయడం వల్ల, వారి జీవనానికి, భవిష్యత్తుకు ఒక మంచి ఆసరా కలుగు తుందన్న ఉద్దేశ్యం గొప్పదే అయినా, ఆ సహాయం అంద చేయడానికి ఎన్నుకున్న పద్ధతుల విషయంలో, సమాజం ఇంకా వెనుకబడి ఉందనిపిస్తుంది. తల్లి కొడుకు గూర్చి పడే తపనే ఈ కథలో కన్పిస్తుంది.

స్వచ్ఛంగా, కల్మషం లేకుండా, అందరూ ఒక్కటిగా కలిసి మెలిసి, ఆడుతూ పాడుతూ సాగే పసి వయ సులో.....!! నువ్వు పలానా అని 'కులం' పేరుతో కలవరం రేపి, దానిగురించి తెలుసుకోటం కోసం కొంత, తెలుసు కున్న తరువాత మరికొంత, మదనపడేలా చేసే సంస్కృతి సమాజానికి అవసరమా అన్న ప్రశ్న పాఠకుడిని కలవర

పరిచేలా చేస్తుంది దస్తకత్. వెనుక బడిన కులాల కోసం అందచేస్తున్న సహాయ నిధులు, నిజంగా వారి శ్రేయస్సు కోసమా, లేక సమాజంలో వారి స్థాయిని మొదటినుంచీ పరిచయం చేసి, వారిని ముందుకు రాకుండా చేయటం కోసమా అన్న అనుమానం కూడా ఈ కథ వ్యక్తపరుస్తుంది.

"కొడుకు సంతోషం కోసం! స్కూల్లో ఇచ్చే నలభై రూపాయల కోసం! దస్తకత్ కోసం! తల్లీ-కొడుకులు పడే తపన! ఆలోచింపచేసే విషయం. నలభై రూపాయల రోజు కూలీని వదులుకుని, మూడు రోజుల పాటు పని మానుకుని, ఒక్క దస్తకత్ కోసం ఒక తల్లి పడిన మానసిక వేదన ఈ కథలో వర్ణించబడింది. మూడురోజుల కూలీ నష్టపోవడమే కాక, సంతకం కోసం ఇరవై రూపాయల లంచం కూడా చెల్లించవలసి రావడం మరో నష్టం. ఈ కష్టానికి, నష్టానికి వారికి దక్కబోయే ప్రతిఫలం నలభై రూపాయల స్కాలర్షిప్. ఎక్కడ ఉన్నాం మనం..! ఇంకెప్పటికి ముందడుగు వేస్తుంది మన సమాజం...! ఎప్పటికి తీరతాయి బడుగు వర్గాల కష్టాలు.. (జాజుల గౌరి, దస్తకత్, పుట.35) ఇలా బదులు దొరకని ప్రశ్నల నెన్నింటినో పాఠకుడి ముందుకు తెచ్చింది దస్తకత్ కథ.

సుభద్ర-రిజెక్టెడ్ కాల్-జూపాక సుభద్ర :

దళితులను అగ్రకులాల వాళ్ళు తమ అవసరానికి ఎలా వాడుకుంటారో మరియు కుల వివక్ష బళ్ళో ఉన్నప్పుడు పెద్దయ్యాక మార్పుచెందిన విషయాన్ని ఇందులో వివరించారు. సుభద్ర పాత్రద్వారా ఆమె ఎదుర్కొంటున్న అంటరాని తనాన్ని రచయిత్రి జూపాక సుభద్ర కళ్ళకు కట్టినట్లు చిత్రించారు. చిన్నప్పుడు స్కూల్లో చదువుతున్నప్పుడు వాళ్ళ వాడలోని భాగ్యలక్ష్మి అనే కాపుకులం ఆమెను హెడ్మాస్టర్ తీసుకురమ్మంటే స్వరూప మరియు సుభద్ర ఇద్దరు భాగ్యలక్ష్మి వాళ్ళ ఇంటికి వెళ్తారు. భాగ్యలక్ష్మి స్వరూపను ఇంట్లోకి రమ్మని సుభద్రను గుమ్మంలోనికి రానియ్యదు. స్వరూపకు తినడానికి స్టీలు గ్లాసులో కారంపూసను ఇచ్చి సుభద్రకు పాతపేపర్లలో తీసుకవచ్చి ఇస్తది. ఇవన్నీ ఆమెను గుండెలో గునపం గుచ్చినట్లు ఉంటవి. బల్లెనేమో మంచిగానే మాట్లాడతది ఇంటికస్తే ఇట్ల చేస్తది మా ఇంటికి వస్తే నేనంత ప్రేమగ చూసుకుంటా అని బాధపడ్డది. ఎందుకు దేవుడా నన్నీ కులంలో బుట్టిచ్చిన్నవు గొడ్లను, బర్లను ఇండ్లల్లో కట్టేస్కుంటారు. కుక్కల్ని ఎత్తుకుంటారు మంచాలమీద పడుకోబెట్టుకుంటరు వాటికంటే హీనమా అని బాధపడ్డది.

"ఈ సారి ఇంట్లోకి అయితే రానిచ్చింది గానీ నీళ్ళు ఇచ్చే గ్లాసు పాతది సొట్టపోయింది. ఎప్పుడు ఇచ్చిన వేరే చెంబుతో తెచ్చి దాంట్లో పోసి తాగమంటుంది. కుండ కాడికి పోనియ్యదు. సొట్టపడ్డ పల్లెంలోనే అన్నం బెడ్తది ఎక్కువ పెట్టినవు తీసుకో అని గిన్నెల వెయ్యబోతె, వెయ్యనివ్వదు. మంచిగ తిను బక్క పడ్తన్నవు అంటది." (జూపాక సుభద్ర, రిజెక్టెడ్ కాల్, పుట.49) ఇలా ఏ విధంగా వివక్ష రూపాలను మార్చుకుంటదో ఆ సంగతి అంతా పూసగుచ్చినట్లు సుభద్ర పాత్ర ద్వారా ఈ కథలో వివరించారు రచయిత్రి.

ఈ కథల ద్వారా పల్లెటూళ్ళోను, పట్టణాల్లోను, ఇళ్ళల్లోను అపార్ట్మెంట్లలోను, దళితులు కుల వివక్షను ఎన్ని రకాలుగా ఎదుర్కొంటున్నారో అగ్రకులాల చేతిలో ఎన్ని రకాలుగా అవమానాలకి గురవుతున్నారో చిత్రించారు.

ముగింపు :

ఆనాదికాలం నుండి నేటి వరకు స్త్రీ వైయక్తికంగా సామాజికంగానూ, కుటుంబ పరంగానూ, లైంగికంగానూ అనేక సమస్యలతో సతమతమవుతూ ఉంది. తెలుగు సాంప్రదాయంలోనూ, సాహిత్యంలోనూ ఒకవైపు గౌరవించాలి అంటూనే అణచివేయబడిన సంఘటనలు సమాజంలో మనకు చాలానే కనిపిస్తున్నాయి. అనేక సందర్భాలలో స్త్రీలకు సంబంధించిన సంఘటనలు, సమాజం వారికి ఇస్తున్న స్థానం వంటివిఅని అనిపిస్తూ ఊపిరాడనివ్వకుండానే చేస్తున్నాయి. ఆధునిక కాలంలో కూడా స్త్రీ కేవలం సౌందర్య సాధనంగానూ, సంతాన సాధనంగానూ, పరిగణింపబడుతుంది. అయితే స్త్రీల సమస్యలను రూపుమాపడానికి ప్రపంచవ్యాప్తంగా మహిళల్లో చైతన్యం తీసుకురావడానికి ఎన్నో ఉద్యమాలు జరిగాయి. ఎందరో సంఘసంస్కర్తలు తమ వంతు కృషి చేశారు. క్రమాను సారంగా తెలుగు సాహిత్యంలో రచయితలు, కవులు స్త్రీల సమస్యలను తమ సాహితీ

వస్తువుగా తీసుకుని రచనలను రచించి పాఠకలోకానికి అందించారు. తరువాత క్రమంలో స్త్రీలు కూడా తెలుగు సాహిత్యంలో తమ అస్తిత్వాన్ని నిలుపుకొని స్త్రీల సమస్యలకు కవిత్వం, నవల, కథలు రూపంలో స్త్రీల జీవనశైలిని రూపుమాపే పని చేస్తున్నారు.

ఈ కథలలో స్త్రీ పాత్రలు సమాజం నాటిన హద్దులను దాటి తమ భావాలకు అనుగుణంగా ఒక ప్రత్యేక స్థానాన్ని ఏర్పరచుకున్నాయి. జూపాక సుభద్ర, గోగుశ్యామల, జాజులగౌరి కథల్లో ఎక్కువ స్త్రీ పాత్రలు పురుషాధిక్యంతో స్త్రీలను ఎదురించిన పాత్రలు ఎక్కువ వీటితోపాటు స్త్రీవాదంలో దళిత పాత్రలు కూడా ఉన్నాయి.

దళితులు వారికి జరుగుతున్న అన్యాయాల పట్ల, అవమానాల పట్ల, అవగాహనను కలిగి ఉండటం వాటికి ఎదురించడానికి కావాల్సిన ప్రొత్సాహాన్ని పొందడాన్ని చైతన్యంగా చెప్పవచ్చు. తెలంగాణ కథా సాహిత్యంలో వివిధ రకాలైన దళిత చైతన్యవంతమైన పాత్రలను రచయిత్రులు ఆవిష్కరించారు. ఈ మాల, మాదిగలు సమాజంలో అనర్హులుగా ఒక అవస్థ, కొలుకోలేని ఈ అవస్థల కూపంలో కూరుకుపోవడం వీళ్ళ దౌర్భాగ్య జీవితానికి నిదర్శనం. ఈ దయార్ద్ర జీవితాలను సామాజిక దృక్పథంతో, మానవతాకోణంలో ఈ ఉదంతాన్ని తను కథానికలో వివరించారు. సామాజిక కోణంలో ఉదంతాన్ని తన కథానికలో వివరించారు.

ఈ కథలన్నీ మన చైతన్య స్థాయిని పెంచి రాజ్యాధికారం దిశగా ఆలోచింపజేసి, మనల్ని మును ముందుకు నడిపిస్తాయి అనడంలో ఏమాత్రం సందేహం ఉండక్కరలేదు.

భారతదేశం భిన్నత్వంలో ఏకత్వం కలిగిన దేశం. ఇక్కడ అన్ని వర్గాల ప్రజలకు సమాన అవకాశాలు, హక్కులు ఉన్నాయి. అయిన దళితులు అనేక సమస్యలను ఎదుర్కొంటున్నారని రచయితలు తమ కథలు ద్వారా వివరించారు.

ఉపయుక్త గ్రంథ సూచికలు :

1. శ్రీనివాస్ సంగిశెట్టి, తెలంగాణ దళిత కథలు, గుడిపల్లి నిరంజన్, తెలంగాణ రచయితల సంఘం, పూలె అంబేద్కర్ అధ్యయ వేదిక, ప్రచురణ: సింగిండి 2021
2. శ్రీధర్ వెల్దండి, తెలుగుకథ ప్రాంతీయ అస్తిత్వం, (సం), తెలుగు అధ్యాన శాఖ, సిల్వర్ జూబ్లీ ప్రభుత్వ కళాశాల, కర్నూల్, 2015
3. వెంకటేశ్వరరావు,దార్ల. మాదిగ సాహిత్యంలో అంతర్భాగమే దళిత సాహిత్యం : సూర్య దినపత్రిక 16-2-2009.
4. వెంకటేశ్వర్లు పంతంగి, తెలంగాణ తెలుగుకథ (సం.), కాకతీయ విశ్వవిద్యాలయం, వరంగల్, 2011
5. కాలువ మల్లయ్య, నూట పదేళ్ళ తెలుగు కథ విభిన్న ధోరణులు, నాలుగవ ప్రపంచ తెలుగు మహాసభలు, తెలుగు అకాడమీ, 2012
6. జూపాక సుభద్ర, జాజులగౌరి, గోగుశ్యామల మొదలైన దళిత రచయిత్రుల కథాసంపుటాలు.

★★★

Vol. 23 | Spl. Issue 03 | March 2026 | BHAVAVEENA | ISSN No. : 2456-4702 | RNI No. APTEL/2003/12253

RNI No. APTEL/2003/12253 | Reffered Journal & Peer Reviewed Journals | ISSN No. 2456-4702

భావవీణ

కళలు, సాహిత్య, సాంస్కృతిక భాషాధ్యయన పత్రిక

BHAVA VEENA

Journal of Arts, Literary, Culture & Language Study

అలిశెట్టి కవిత్వం - స్త్రీ చైతన్యం

– డా॥. బి. శ్రీనివాసరావు

తెలుగు అధ్యాపకులు, ప్రభుత్వ డిగ్రీ కళాశాల, ఆముదాలవలస, శ్రీకాకుళం జిల్లా.

కవిత్వాన్ని అనేకులు పలు విధాలుగా నిర్వచించారు. 'ఎన్సైక్లోపీడియా బ్రిటానికా' కర్తలు 'సాంద్రమైన కాల్పనికా చైతన్యాన్ని కలిగించే అనుభవమే కవిత్వం' అన్నారు. భాషలోని అర్థవంతమైన పదాల ద్వారా, లయ ద్వారా, ఒక విశిష్టమైన మానసిక ఉత్తేజాన్నిచ్చే ప్రయత్నం చేస్తుంది. అయితే ఛందోబద్ధమైన కవిత్వ సూత్రాలు 'జనం మెచ్చే, జనం దగ్గరకు వెళ్లే'కవిత్వానికి అడ్డంకిగా మారాయని నియోక్లాసికల్ పొయెటిగా ముద్రపడ్డ అలగ్జాండర్ పోప్ అంటారు. ఇతను కూడా విరివిగా ఛందోబద్ధమైన కవిత్వంను రాసిన వాడే . స్వీయానుభవంతోనే ?? what - off thought was never so expressed??? (ఛందో బందోబస్తుల మూలంగా నేను మనసులో అనుకున్న భావాన్ని వ్యక్తం చేయలేకపోయాను) అని ఆనాడే చెప్పారు. 19వ శతాబ్దం మధ్యలో అవతరించిన కవిత్వపు కొత్త రూపం ఛందోరూపంపైన తిరుగుబాటు చేసింది. ఆంగ్ల, ఫ్రెంచిభాషల ప్రభావం వలన, దేశీయమైన సాంఘిక రాజకీయ పరిస్థితుల ప్రభావం వల్ల తెలుగులోనూ, ఇతర భారతీయ భాషలలోనూ సుమారు 1930 ప్రాంతంలో వచన కవిత భూమార్గం పట్టింది. ఈ రకమైన వచన కవితకు తెలుగులో శిష్లా ఉమామహేశ్వరరావు, ముద్దుకృష్ణ, కవికొండల వెంకట్రావు తదితరులు ముందుకు తీసుకు వస్తే అలిశెట్టి ప్రభాకర్ వంటి వారు చిన్న చిన్న కవితలుగా వాటిని ప్రజల హృదయాల్లోకి 'ఇంజక్ట్' చేశారు. ఒకవైపు అనుభూతి కవిత్వం, ఇంకోవైపు వ్యక్తివాద కవిత్వం పోటీలు పడుతున్న వేళ, అభ్యుదయ కవిత్వం చివరి వెలుగుతో, విప్లవ కవిత్వం యాంత్రికతతో బాధపడుతున్న సంధి సమయంలో ఎన్నెన్నో సామాజిక, వ్యక్తిగత సమస్యలు చుట్టుముట్టినా చెదరని విశ్వాసంతో 'సమాజాన్ని'తన కవితా వస్తువుగా స్వీకరించి కవిత్వం రాసిన కవి 'అలిశెట్టి ప్రభాకర్'తగినంత భావశక్తి సరైన భావజాలం నుండి దాన్ని పాఠకులకి సులభంగా చేర్చే సంక్షిప్త భాష పటిమ కలిగిన ప్రభాకర్ తన బలం తన కవిత్వమని నమ్మారు.

శతాబ్దాలుగా కవిత్వంలో, కావ్యాలలో స్త్రీ ప్రధాన వస్తువుగా వెలువడిన గ్రంథాలు అనేకానేకం. భావ, అనుభూతి కవిత్వాలు ప్రారంభంలో స్త్రీ అంగాంగ వర్ణనలను ప్రకృతిలో జోడించి సృజియించిన కవిత్వం జమీందారుల వద్ద, రాజుల 'ఘడీల వద్ద, దివానాలలోనూ విశృంఖలంగా ప్రగ్గిపోయింది. అనేక రూపాలతో వర్ధిల్లింది. సమాజంలోని తన ప్రభావాన్ని బలంగానే చూపించింది. 'నవ్విపోదురుగాక నాకేటి సిగ్గ'నే విధంగా ఉధృతంగా ప్రవహించింది. కానీ.. క్రమేపి విదేశాలలో ప్రారంభమైన స్త్రీవాదం (దీని కన్నా ముందే) చలం వంటి వారి రచనలు క్రమేపి స్త్రీకి హృదయం, మెదడున్నాయని

గుర్తు చేశాయి. చైతన్యవంతం చేశాయి. కవిత్వంలో స్త్రీ పాత్రను గురించి 'సావిత్రి' వంటి వారు ఎంతో వైవిధ్యంగా వివరించారు. ఆ వరవడిలో స్త్రీని ఎంత గౌరవంగా, ప్రేమతో, సంస్కారవంతమైన వ్యక్తిగా తీర్చిదిద్దిన కవి అలిశెట్టి ప్రభాకర్. సుప్రసిద్ధ గాయని బెర్లి లలితని పద్నాలుగు ముక్కలుగా నరికిన సందర్భంలో 'గొంతు కోస్తే /పాట ఆగదు/ అది... ముక్తకంఠం/ గొలుసు వేస్తే / పోరు నిలిచిపోదు/ అది... ప్రజాయుద్ధం' ఆయన స్పందనలోని సరళతా స్పష్టత.. తీవ్రతకు ఈ వ్యాఖ్యలు దర్పణమనే చెప్పాలి. నేల మీద పురుషులతో పాటు సగమైన స్త్రీల గురించి కవికి చాలా గౌరవం. 'వేశ్య' కవితలో "తను శవమై /ఒకరికి వశమై /తనువు పుండై / ఒకరికి పండై /ఎప్పుడూ ఎడారై /ఎందరికో ఒయాసిస్సై.." అని ఆవేదనాపూరిత అక్షరాల అంతర్లీనంలో ఓ వ్యధార్థ మైన సమాజ భాదితురాలి జీవన విధానంలోని క్లేశాలను వివరించిన తీరు విషాదకరం. మరో కవిత 'ఆమె యవ్వనం..' 'ఆమె/ బరితగించింది కాదు/ బతుక్కే ఉరి బిగించుకొని/ ఎన్నెన్నో ఆశల్ని /ఈ జీవితంలో కలుపుకున్న /ఒక్కోసారన్న ఉప్పొంగని సముద్రం/ఒక్కోసారి/ గొంతు మూగబోయిందన్నా /పాడక తప్పదు/ రోజుకో పదిమంది/ కీచకులకి స్వాగతం పలికే...' అనే వ్యాఖ్యానం ఎవరి నుద్దేశించి కవి చెబుతున్నాడో గడుసయిన పాఠకునికి తెలియనిది కాదు. 'వెలయాలు'పై అలిశెట్టి ప్రభాకర్ గారికి తీరని ఆవేదన. ఆమె బ్రతుకు పైన అక్షరాల అస్త్రాలు సంధించలేని 'ఆకలి' ఆయనది. అయినా ఆ వృత్తిలోని ఆక్రందనల వెనుక అతివల ఆరిపోతున్న దీపం వెలుగులను వివరించే ప్రయత్నం చేశారు. దాదాపు అరడజను కవితలు ఇదే అంశంతో వ్రాసారంటే ఆయన లోని అటువంటి స్త్రీల పట్ల గౌరవం, ఆవేదనలు స్పష్ట మవుతాయి. సుఖ రోగాలకు నిలయమై అభాగ్యులుగా, అనాధలుగా ఏదో ఒక రోజు నీచమైన మరణంతో తనువు చాలించుకున్న వారిపైన 'జాలి' కన్నా గౌరవప్రదమైన జరుగుబాటు వారికి అవసరమంటారు ప్రభాకర్ 'అశ్రు కావ్యం'లో కవితలో ఆమె/ కళ్ళు /ముళ్లకంచెని/ అల్లుకున్న ఆకలి తీగ/పెదవుల/ పాషాణం పై /విరిసె/ సిఫలిస్ పువ్వు / పత్ర హరితమే/ హరించిన/ బతుకు చెట్టు / ఆమె కాలాన్ని ఆశ్రయించిన అశ్రువు... ఆమె/ నెత్తుడి గాయాల సంపుటి/ రగిలే బాధల కుంపటి' అంటారు. ఏడున్నర దశాబ్దాల స్వాతంత్ర్య సంబరాలు జరుపుకున్న దేశంలో అంగుళానుకో గాంధారి సుతుడు అపర ద్రౌపదుల చీరలు లాగుతూనే ఉన్నారు. తొడలు కొడుతూనే ఉన్నారు. శరీరాన్ని తాకుతూ 'నాగరికత'నవ కీచకులు బహిరంగం గానే 'అవయువ'దోపిడీకి ఎగబడుతున్నారు. సాంకేతికాభి వృద్ధికి స్త్రీ కూడా ఒక సాధనంగా మారిపోవడం ఏ విష నాగరికత సంస్కృతులకు చిహ్నాలో కాలం చెప్పాలనే తీర్పులిస్తున్న వారున్నారు. ఇదే అంశాన్ని ఓఆరు వాక్యా లలో 'నీ ఫైవ్ స్టార్ కళ్ళ / మైకపు పొరల్లోంచి తప్ప.../ ఈ ఇరవయ్యో శతాబ్దపు వద్యశిల మీద/ ఇంకా చెరిగిపోని/ స్త్రీ హృదయ విచారకర దృశ్యమే..'అని వివరిస్తారు. ఓ ఆడదాన్ని కళ్ళు తవ్వితే కన్నీటి శిధిలాలు బయల్పడ్డా' యనే చేదు వాస్తవాన్ని విషాదంగా కన్నా వివేచన కలిగే విధంగా ఆయన వివరించిన తీరు అద్భుతం. వీటన్నిం టినీ నేపథ్యంలో స్త్రీ మూర్తులకు విముక్తి అవసరమంటా రాయన. 'విషాద సాక్షాత్కారం' కవితలో స్త్రీలలోని విషాదాంత చైతన్యపు వాయువుల అవసరాన్ని నొక్కి చెబుతారు. "కన్నీళ్ళని ఏ భాషలోకి అనువదించినా/ విషాదం మూర్తీ భవించిన స్త్రీయే/ సాక్షాత్కరిస్తుంది." ఈ కవిత చివరిలో ఆయన రాసిన ముగింపు వాక్యాలు నిజంగా పురుష సమాజాన్ని చెళ్ళున కొట్టి లేపే, ఆలోచించమని చెప్పే గొప్ప సందేశమనే అంగీకరించాలి. మరో వైపు స్త్రీలకు కూడా పరోక్షంగా ఓ 'చురక'గానే భావన చేయాలి. "ఎంత అధునాతనంగా ఎదిగినా /అశ్రుబిందువు నించి/ స్త్రీకింకా విముక్తి కలగలేదంటే /నిజంగా కన్నీరు సముద్రమై..' అంటూనే దీని విముక్తి ఆమె చేయాలనేది కూడా ఆయన విశదీకరిస్తాడు.. వర్తమాన సమాజంలో ఈ వ్యాఖ్యానానికి ఎంతవరకు 'సాధికారత' ఉందో గమనించుకోవాలి. మరొక విషయం ఆచరణ యోగ్యం కాని, అసాధారణ వ్యాఖ్యలు అలిశెట్టికి సాధ్యమేననే వారున్నారు. "ఎవరమ్మా నువు/ యిలా రా/ఈ ఆయుధాల నీడ కింద/ సేద తీర్చుకో.../ మా ఆశయాల సాధనలో మమేకమైపో/" అని 'గీతో'పదేశం చేస్తారు. ఆడవారిని

కూడా జాగ్రత్తగా ఆలోచించమంటారు. స్త్రీని స్త్రీగా ఎదగమంటారు. ఆకర్షణల వలకు ఎన్ని ముఖాలున్నాయో, ఆక్టోపస్ వంటి సమాజ ఆకర్షణలు ఎన్ని విధాలో చెబుతూ 'స్త్రీ/ శరీర సౌందర్యాన్ని /బహిర్గత పరిచేది/ ఉల్లిపొరా.../ వెండి తెర.../ చెల్లీ తల్లీ / తెలుసుకో/ తేల్చుకో../ అల్పాక్షరాలలో అనంతమైన భావాలను ప్రకటించడం ఆయన కలం సహజ గుణం. ఆయన కవిత్వపు మండిరచే 'భాస్వరం...

అలిశెట్టి ప్రభాకర్ జీవితం విషాద భరితం. ఓ వైపు ఆర్థిక సమస్యలు, మరోవైపు తనను ప్రక్కన పెట్టిన సాహితీ లోకపు రాజకీయ జలసీలు, తనను క్షీణింప జేస్తున్న క్షయ వంటివి పీడిస్తున్న తన 'భాగ్యం' తన 'భాగ్య' (భార్య) అని గర్వంగా చెబుతారు.

తెర వెనుక మృత్యువు
లీలగా కదలాడినట్టు
తెరలు తెరలుగా దగ్గు
గుండెల్ని పిండేస్తుంటే
తెగిన తీగలు
సవరించడానికన్నట్టు
తెల్లవార్లు పరిచర్యలు చేసే
నా భాగ్యమే
నా కన్నీళ్ళని తూచే
సునితత్వపు హృదయ త్రాసు
నేను
ఆమె నిశ్శబ్దపు వేదనా తరంగాన్ని
కొలిచే భారమితిని..

ఇంతకన్నా ఓ విషాదాంత జీవిత పరిష్వంగనంలో 'కరిగి'న కవి అందించే అక్షర కృతజ్ఞతలేముంటాయి.. ఆ మహాతల్లి ఔన్నత్యమును వివరించడానికి...

తల్లి నీకు వందనం... వందనం...

ఆధార గ్రంధాలు :

1. అలిశెట్టి ప్రభాకర్ కవిత - అలిశెట్టి మిత్రులు - హైదరాబాద్
2. సాహితీ సుధ - డా॥ గుమ్మన్నగారి శ్రీనివాసమూర్తి

★★★

Vol. 23 | Spl. Issue 03 | March 2026 | BHAVAVEENA | ISSN No. : 2456-4702 | RNI No. APTEL/2003/12253

RNI No. APTEL/2003/12253 | Reffered Journal & Peer Reviewed Journals | ISSN No. 2456-4702

భావవీణ

కళలు, సాహిత్య, సాంస్కృతిక భాషాధ్యయన పత్రిక

BHAVA VEENA

Journal of Arts, Literary, Culture & Language Study

మహాభారతంలో శకుంతలోపాఖ్యానం - స్త్రీ చైతన్యం

- డా॥. పులపర్తి శ్రీనివాసరావు

అతిథి అధ్యాపకులు, తెలుగుశాఖ, ఆంధ్ర విశ్వవిద్యాలయం, విశాఖపట్నం-03.

వ్యాస సంగ్రహం :

కవిత్రయ భారతం (శ్రీమదాంధ్ర మహాభారతము) తెలుగు సాహిత్యానికి నన్నయ, తిక్కన, ఎఱ్ఱన (కవిత్రయం) అందించిన 11-14 శతాబ్దాల అద్భుత కావ్యం. వ్యాస విరచిత సంస్కృత భారతాన్ని వీరు ఆంధ్రీకరించారు. నన్నయ ఆది-సభాపర్వాలు, తిక్కన విరాట-స్వర్గారోహణ పర్వాలు, ఎఱ్ఱన అరణ్యపర్వ శేషాన్ని రాశారు. ఇది ధర్మ, నీతి, మరియు మానవ సంబంధాలను తెలిపే పవిత్ర గ్రంథం. నన్నయ (ఆదికవి) మహాభారతంలోని మొదటి రెండు పర్వాలు (ఆది, సభ) మరియు అరణ్య పర్వంలో కొంత భాగాన్ని అనువదించాడు. కవిబ్రహ్మ తిక్కన విరాట పర్వం నుండి స్వర్గారోహణ పర్వం వరకు 15 పర్వాలను అనువదించారు, ఆయన నాటకీయ శైలికి ప్రసిద్ధి. ప్రబంధ పరమేశ్వరుడు అయిన ఎఱ్ఱన నన్నయ తర్వాత ఆగిపోయిన అరణ్యపర్వ శేషాన్ని పూరించి, భారతాన్ని పూర్తి చేశాడు. పంచమవేదంగా మహాభారతాన్ని భావిస్తారు. ఈ కావ్యం అనువాదమైనా, స్వతంత్ర కావ్యంగా ప్రసిద్ధి చెందింది. ఇందులో ధర్మార్థ కామ మోక్షాలు ఉన్నాయి. జీవితంలో గెలవడానికి ధర్మం, సమయస్ఫూర్తి ఎంత ముఖ్యమో ఈ కావ్యం తెలియ జేస్తుంది. నన్నయతో మొదలై ఎఱ్ఱనతో పూర్తయిన ఈ కవిత్రయ భారతం, తెలుగు భాషకు, సంస్కృతికి ఒక అమూల్యమైన రత్నం. ఇలాంటి భారతంలో నన్నయ తెనిగించిన ఆదిపర్వంలోని చతుర్థాశ్వాసంలో యావత్ స్త్రీ జాతికి అణిముత్యంగా చిత్రించబడిన శకుంతల పాత్ర అద్భుతంగా ఆవిష్కరించబడింది. ఈ శకుంతల పాత్ర ద్వారా ఆనాటి సమాజంలో చైతన్యం ఎలా ఉండేదో అర్థం చేసుకోడానికి ఒక అస్కారం ఉంది. కాబట్టి నన్నయ శకుంతల పాత్రను స్త్రీ చైతన్యానికి ప్రతీకగా ఎలా మలిచాడో పరిశీలించడమే ఈ వ్యాస ముఖ్యోద్దేశ్యం.

కీలక పదాలు :

పంచమవేదం, కవిత్రయం, నవనీతము, చైతన్యం, ఉపఖ్యానం, ధర్మార్థ కామమోక్షాలు, సామాజిక కట్టు బాట్లు, రాజనీతి మొదలైనవి.

1.0 ఉపోద్ఘాతం :

తొలినాళ్ళ తెలుగు సాహిత్యంలో స్త్రీ చైతన్యం గురించి ప్రస్తావిస్తే, ముఖ్యంగా స్త్రీ చైతన్యం అనే అంశాన్ని మూడు రకాలుగా విభజించవచ్చు. ఒక నిర్దిష్ట కాలంలో వచ్చిన స్త్రీ చైతన్యం అన్నప్పుడు ఆ కాలంలో జీవించిన రచయితల రచనల్లోని స్త్రీ పాత్రల చైతన్యమా, ఆ నిర్దిష్ట కాలంలో పుట్టిన రచయితల చైతన్యమా, ఆ నిర్దిష్ట కాలంలో పుట్టి, రచనలు చేసిన స్త్రీల చైతన్యమా అనే అంశాన్ని పరిగణనలోనికి తీసుకొని ఒక చర్చను ప్రారంభించవచ్చు. అయితే ఈ చైతన్యపు పరిధిని గురించి

మనం ఆలోచించి నప్పుడు ఆ చైతన్యపు పరిధి, ఆ చైతన్యపు స్థాయి కొన్ని అంశాలను మన ముందుకు తెస్తుంది. ఈ అంశాన్ని గురించి ఆలోచించినప్పుడు ముందుగా సంఘసంస్కరణ కాలం, ఆ కాలం కన్నా ముందుగా సమాజంలో, సాంఘిక జీవితాల్లో వచ్చిన మార్పులు, ఆ మార్పులతో పాటుగా సాహిత్యంలో ప్రతిఫలించిన చైతన్యం గురించి మనం పరిశీలించాలి. ఆ తర్వాత ఆ కాలంలో పుట్టిన రచయితలు, రచయిత్రులను గురించి తెలుసుకోవాలి. ఆ సమయంలో వచ్చిన రచయితలను పరిశీలించాలి. ఆ రచనల్లోని స్త్రీల చైతన్యాన్ని అంచనా కట్టాలి. ఈ అంచనా కట్టే క్రమంలో ఆ కాలంలో జరిగిన సామాజిక సాహిత్య ఉద్యమాలు, ఆ కాలంలో పుట్టిన రచయితలు, ఆ కాలంలో పుట్టి రచనలు చేసిన వారు, వారి రచనల్లోని సామాజికాంశాలు, సాహిత్యాంశాలు వారివారి రచనల్లోని స్త్రీ పాత్రల చైతన్యము మొదలైన అంశాలన్నిటినీ పరిగణనలోకి తీసుకోవాలి. మనం తొలితరం రచనల గురించి పరిశీలించేటప్పుడు ముఖ్యంగా సంఘసంస్కరణ ప్రభావంతో కూడిన రచనలు ఎక్కువగా కనిపిస్తాయి. సంఘసంస్కరణ ప్రభావం కందుకూరి, గురజాడ వంటి రచయితలను ఎంతగా ప్రభావితం చేసిందో కూడా అర్థమవుతుంది. ఆయా కాలపు రచయితల్లో అభ్యుదయ దృక్పథం కూడా మనకు స్పష్టంగా కనిపిస్తుంది. ఇదంతా ఆధునిక సాహిత్యం ప్రారంభంలో కనిపించిన స్త్రీ చైతన్య మూలాలు అయితే కవిత్రయ భారతం నుండి గాని పరిశీలన చేస్తే అక్కడ కనిపించే స్త్రీ చైతన్యం మరో రకంగా కనిపిస్తుంది. భాగవతంలో స్త్రీ చైతన్యం కేవలం భౌతికమైనది కాదు, అది అత్యున్నత ఆధ్యాత్మిక భక్తి (కృష్ణ చైతన్యం) మరియు ఆత్మజ్ఞానంతో కూడినది. కుంతి, ద్రౌపది, గోపికలు వంటి పాత్రల ద్వారా స్త్రీలు అంకితభావం, ధైర్యం, సామాజిక బాధ్యత మరియు సమయస్ఫూర్తితో నిలిచి, భగవంతునితో అనుసంధానమై భక్తికి ప్రతీకలుగా నిలుస్తారని భాగవతం నిరూపిస్తుంది. ప్రాచీన సాహిత్యంలో స్త్రీ చైతన్యం ప్రధానంగా భక్తి, జానపద, పురాణ పాత్రల ద్వారా వ్యక్తమైంది. సీత, సావిత్రి, ద్రౌపది వంటి పాత్రలు ఔన్నత్యాన్ని చాటగా, భక్తి సాహిత్యంలో ఆండాళ్, అక్కమహాదేవి వంటివారు సామాజిక కట్టుబాట్లను ధిక్కరించి ఆత్మచైతన్యాన్ని ప్రదర్శించారు. జానపద సాహిత్యంలో స్త్రీల కష్టసుఖాలు, స్త్రీల చైతన్యంలో వారి వ్యక్తిత్వం ప్రతిబింబించాయి. నన్నయ ఆంధ్రమహాభారతంలో స్త్రీ పాత్రలు కేవలం గృహిణులుగా కాకుండా, ధర్మం, నీతి, రాజనీతిపై స్పష్టమైన అవగాహన ఉన్న చైతన్యవంతమైన వ్యక్తిత్వాలుగా కనిపిస్తారు. శకుంతల, దేవయాని వంటి పాత్రల ద్వారా స్త్రీ ఆత్మగౌరవం, హక్కులు, తన ఆశయ సాధనలో వారి ధైర్య సాహసాలను నన్నయ అద్భుతంగా చిత్రీకరించారు. ఆ కాలంలో స్త్రీలలో చైతన్యం నింపినవారున్నారు. స్త్రీలు తమకు తాము చైతన్యం పొందినవారు ఉన్నారు. అలాంటి సందర్భాలను పరిశీలించినపుడు ఎన్నో ఇతిహాస పాత్రలు తారస పడతాయి. అలాంటి స్త్రీ చైతన్యం కలిగిన పాత్రగా శకుంతల పాత్రను చూడొచ్చు. ఈ పాత్ర విశేషాలు, ఈ పాత్రలో ఉన్న చైతన్యం, ఈ పాత్ర ద్వారా నన్నయ అందించిన చైతన్యం మొదలైన విశేషాలు ఈ వ్యాసంలో పరిశీలించడమైంది.

1.1 నన్నయ భారతంలో శకుంతలపాత్ర - స్త్రీ చైతన్యం :

శకుంతల ఆత్మగౌరవం కలిగిన స్త్రీగా కనిపిస్తుంది. దుష్యంతుడు నిరాకరించినప్పుడు, శకుంతల కేవలం విలపించకుండా, ధర్మాధర్మాలను, సత్యవాక్పరిపాలన ప్రాధాన్యతను రాజుకు వివరించడంలో ఆమె చూపిన చొరవ ఎంతో చైతన్యవంతంగా ఉంటుంది. అంతేకాదు తన కుమారుడి హక్కుల కోసం నిర్భయంగా పోరాడటం ఆమె చైతన్యానికి నిదర్శనంగా చెప్పుకోవచ్చు. స్త్రీలు కుటుంబంలోనే కాకుండా, సమాజంలో కూడా ధర్మం, నీతిని నిలబెట్టడంలో కీలక పాత్ర పోషిస్తారని నన్నయ చూపారు. ఉద్వేగాల నియంత్రణకు ప్రాధాన్యమిచ్చి నపుడే అనుకున్న లక్ష్యం సాధించగలమని ఈ పాత్ర ద్వారా తెలిపారు. అంతే కాదు నన్నయ భారతంలో స్త్రీ పాత్రలు పరిస్థితులకు అనుగుణంగా తమ ఉద్వేగాలను నియంత్రించుకుంటూ, సమయస్ఫూర్తితో వ్యవహరిస్తాయి. నన్నయ కావ్యంలో స్త్రీ కేవలం ఒక పాత్రగా కాకుండా,

తన హక్కులు, గౌరవం కోసం నిలబడే ఒక బలమైన వ్యక్తిత్వంగా ఆవిష్కరించబడింది.

మహాభారతం ఆదిపర్వం నాల్గవ ఆశ్వాసంలో ప్రధానంగా కనిపించే శకుంతలోపాఖ్యానం ద్వారా స్త్రీ చైతన్యం, ఆమె ఆత్మగౌరవం మరియు సత్యనిరతి అద్భుతంగా ఆవిష్కరించబడ్డాయి. ఈ ఆశ్వాసంలో శకుంతల పాత్ర కేవలం ఒక అబలగా కాకుండా, ధర్మం తెలిసిన తేజోమూర్తిగా, తన హక్కుల కోసం పోరాడే ధీరవనితగా కనిపిస్తుంది. దుష్యంతుడు కణ్వాశ్రమంలో శకుంతలను చూసి మోహించి, గాంధర్వ వివాహం చేసుకోమని కోరినప్పుడు, ఆమె గుడ్డిగా అంగీకరించదు. తన వల్ల పుట్టే కొడుకే తదుపరి రాజ్యానికి వారసుడు (యువరాజు) కావాలనే స్పష్టమైన షరతును విధిస్తుంది. ఇది ఆ కాలంలోనే ఒక స్త్రీకి తన సంతానం పట్ల ఉన్న దార్శనికతను, తన భవిష్యత్తుపై ఆమెకు ఉన్న స్పష్టతను తెలియజేస్తుంది.

అలాగే సత్యం కోసం ఆమె చేసిన పోరాటం ఎంతో ఆదర్శం. దుష్యంతుడు సభలో శకుంతలను గుర్తు పట్టనట్లు నటించినప్పుడు, ఆమె కుంగిపోకుండా ఎంతో ధైర్యంతో ధర్మాన్ని బోధిస్తుంది. అబద్ధం ఆడటం కంటే సత్యం ఎంత గొప్పదో వివరిస్తూ, వంద బావుల కంటే ఒక చెరువు, వంద చెరువుల కంటే ఒక యజ్ఞం, వంద యజ్ఞాల కంటే ఒక కొడుకు, వంద మంది కొడుకుల కంటే ఒక సత్య వాక్యం మిన్న అని ఆమె చేసే ప్రసంగం స్త్రీలోని గొప్ప చైతన్యానికి మరియు మేధస్సుకు నిదర్శనం.

"నూతజలపూరితంబు లగు నూతులు నూఱిటకంటెం సూనృత
వ్రత ! యొక బావి మేలు; మఱి బావలు నూఱిట కంటె నొక్క స
త్ర్కతువది మేలు; తత్ర్కతుశతంబున కంటె సుతుండు మేలు; త
త్సుత శతకంబుకంటె నొక సూనృతవాక్యము మేలు సూడగన్." (తితిదే భారతము, మొ.సం., ఆదిపర్వం, చతుర్థాశ్వాసం, పుట-378)

ఆత్మగౌరవానికి ప్రతీకగా శకుంతల పాత్రను చిత్రించారు నన్నయ. భర్త తనను తిరస్కరించినప్పుడు, శకుంతల వినయంగా వేడుకోకుండా, అతని తప్పును ఎత్తిచూపుతుంది. అంతఃకరణ శుద్ధి లేనిదే సత్యం వెల్లడి కాదని, సత్యం నిలవకపోతే సంసార వ్యవస్థే అస్తవ్యస్తం అవుతుందని ఆమె వాదిస్తుంది. అంతేకాదు మాతృత్వ చైతన్యం అంటే ఏంటో చెప్పే ప్రయత్నం చేసింది. భార్య అంటే భర్తలో సగభాగమని, సంతానం ద్వారా తండ్రి పునర్జన్మ పొందుతాడని వివరిస్తూ, తన కుమారుడైన భరతుడికి దక్కాల్సిన న్యాయం కోసం సభలో గంభీరంగా వాదిస్తుంది. శకుంతల వాదనలో ఉన్న సత్యాన్ని లోకానికి చాటడానికి చివరకు ఆకాశవాణి కూడా పలుకుతుంది. ''దుష్యంతుడా! శకుంతల చెప్పింది సత్యం, ఈ బాలుడిని గ్రహించు (భరస్వ)'' అని ఆకాశవాణి చెప్పడం ఆమె సత్య నిరతికి దక్కిన విజయంగా పేర్కొనవచ్చు.

1.2. శకుంతల విధించిన వారసత్వ షరతు వెనుక ఉన్న దూరదృష్టి :

శకుంతల దుష్యంతుడికి విధించిన వారసత్వ షరతు వెనుక ఉన్న దూరదృష్టి ఆమె ఆత్మగౌరవానికి మరియు తన సంతాన భవిష్యత్తుకు భరోసా ఇచ్చే అత్యున్నతమైన నిర్ణయంగా చెప్పుకోవచ్చు. దీని వెనుక ఉన్న ప్రధాన ఉద్దేశాలను గమనిస్తే, ముఖ్యంగా ధార్మిక, సామాజిక గుర్తింపు కోసం ప్రయత్నించినట్లు తెలుస్తుంది. గాంధర్వ వివాహం క్షత్రియులకు ధర్మబద్ధమైనదే అయినప్పటికీ, దానికి సాక్షులు ఉండరు. ఒకవేళ రాజు తనను మరిచిపోతే, పుట్టబోయే బిడ్డకు తండ్రి ఎవరో లోకానికి తెలియదు. సత్యం నిలవకపోతే సంసార వ్యవస్థే అస్తవ్యస్తమవుతుందని, దానివల్ల పుత్రుని అస్తిత్వానికే ప్రమాదం కలుగుతుందని శకుంతల ముందుగానే గ్రహించింది. అందుకే, తన కుమారుడే రాజ్యానికి వారసుడు కావాలని షరతు విధించడం ద్వారా తన సంతానానికి చట్టబద్ధతను, ఉన్నతమైన స్థానాన్ని ముందే ఖాయం చేసుకుంది. శకుంతలలో ఉన్న దూరదృష్టి ఎంత గొప్పదో ఇక్కడ వ్యక్తమవుతుంది. ఆమె ఈ రకమైన చైతన్యం ఉండబట్టే చివరకు తన కుమారుడు యువరాజు అవగలిగాడు.

అంతేకాకుండా, కణ్వ మహర్షి తన దివ్యదృష్టితో శకుంతల గర్భాన పుట్టబోయే బిడ్డ సమస్త భూమండలాన్ని పాలించే గొప్ప చక్రవర్తి అవుతాడని గుర్తిస్తాడు. శకుంతల విధించిన షరతు ఈ దైవిక సంకల్పానికి, రాజధర్మానికి అనుగుణంగా ఉంది. తన బిడ్డ కేవలం ఆశ్రమంలో పెరిగే వ్యక్తిగా కాకుండా, పురు వంశాన్ని నిలిపే వారసుడిగా ఉండాలని ఆమె ఆశించింది అని ఇక్కడ అర్థం చేసుకోవచ్చు.

షరతు వెనుక మరో దూరదృష్టి కూడా ఉంది. అది ఆత్మరక్షణతో పాటు వివేకం కలిగి ఉండటం. రాజులు రాజ్యానికి వెళ్ళిన తర్వాత మొహంలో మునిగి ఇచ్చిన మాట తప్పే అవకాశం ఉందని శకుంతల తన వివేకంతో ఆలోచించింది. భార్య అంటే భర్తలో సగభాగమని, సంతానం ద్వారా తండ్రి పునర్జన్మ పొందుతాడని ఆమె విశ్వసించింది. అందుకే, ఆశ్రమ కన్యగా ఉన్నప్పటికీ, ఒక మహారాణికి ఉండాల్సిన చైతన్యంతో తన బిడ్డ హక్కుల కోసం వివాహానికి ముందే షరతు విధించింది. ఈ విధంగా, శకుంతల విధించిన షరతు ఆమె కేవలం ఒక అబల కాదు, సత్యం, ధర్మం, తన బిడ్డ భవిష్యత్తు పట్ల స్పష్టమైన అవగాహన ఉన్న ధీరవనిత అని నిరూపించడంలో ఆమె చైతన్యమే ఆధారం.

1.3 దుష్యంతుడిని ఎదిరించేటప్పుడు శకుంతల పాటించిన ధర్మాలు :

దుష్యంతుని నిండు సభలో శకుంతల తన ఆత్మ గౌరవాన్ని కాపాడుకుంటూ, ధర్మాన్ని బోధించే క్రమంలో ప్రధానంగా కొన్ని ధర్మాలను ప్రస్తావించింది. అవి ఆమె చైతన్యానికి నిదర్శనంగా చెప్పుకోవచ్చు.

1.3.1 గార్హస్థ్య ధర్మం :

గార్హస్థ్య ధర్మంలో యజమానికి, భార్యకు, కుమారునికి, సత్యానికి ఉన్న ప్రాధాన్యతను శకుంతల రాజుకు వివరించింది. ఈ ధర్మం సక్రమంగా సాగాలంటే దంపతులకు అంతఃకరణ శుద్ధి (చిత్తశుద్ధి) అవసరమని, అది లేనిదే సత్యం వెల్లడి కాదని ఆమె వాదించింది.

1.3.2 సత్య ధర్మం :

సత్యం అన్నింటికంటే గొప్పదని శకుంతల నొక్కి చెప్పింది. సత్యం నిలవకపోతే సంసార వ్యవస్థే అస్తవ్యస్తమవుతుందని, యజమాని అసత్య దోషం వల్ల అంతమై పోతాడని హెచ్చరించింది. సత్యం గొప్పతనాన్ని వివరిస్తూ, నూరు బావుల కంటే ఒక చెరువు, నూరు చెరువుల కంటే ఒక యజ్ఞం, నూరు యజ్ఞాల కంటే ఒక పుత్రుడు, నూరు మంది పుత్రుల కంటే ఒక సత్య వాక్యం మిన్న అని ఆమె పేర్కొంది.

1.3.3 భార్య పట్ల ధర్మం :

భార్య అంటే భర్తలో సగభాగమని (అర్ధాంగి), గృహస్థుకి ఆమె అన్ని కార్యాలలో తోడుగా ఉండాలని వివరించింది. భార్య పట్ల అన్యాయంగా ప్రవర్తించడం ధర్మం కాదని రాజుకు గుర్తు చేసింది.

1.3.4 పుత్ర ధర్మం :

సంతానం ద్వారా తండ్రి పునర్జన్మ పొందుతాడని, పుత్రుడు తండ్రిని 'పున్నామ నరకం' నుండి రక్షిస్తాడని ప్రస్తావించింది. తండ్రి తన కుమారుడిని గుర్తించకపోతే ఆ బిడ్డకు సామాజిక అస్తిత్వం ఉండదని, అది గొప్ప అధర్మమని స్పష్టం చేసింది.

1.3.5 అంతఃసాక్షి ధర్మం :

మనిషి తన మనస్సాక్షిని (అంతఃకరణను) మోసం చేయలేడని, సర్వభూతాల హృదయాల్లో ఉండే పరమాత్మ మనం చేసే ప్రతి పనిని చూస్తూనే ఉంటాడని, కాబట్టి రాజు తన హృదయానికి తెలిసిన సత్యాన్ని దాచకూడదని హితవు పలికింది.

ఈ విధంగా శకుంతల సత్యధర్మనిరతి అనేది గార్హస్థ్య ధర్మానికి అమరత్వాన్ని కలిగిస్తుందని తన వాదనల ద్వారా నిరూపించడంలో ఆమెలో ఉన్న చైతన్యం ఎంత గొప్పదో అర్థం చేసుకోవచ్చు.

1.4 దుష్యంతుని తిరస్కారం-శకుంతల సమాధానం :

దుష్యంతుడు తనను ఎవరో తెలియనట్లు తిరస్కరించినప్పుడు, శకుంతల ఏమాత్రం కుంగిపోకుండా ధైర్యంతో, ధర్మబద్ధంగా ఇచ్చిన సమాధానం అత్యంత ప్రాముఖ్యత కలిగినది. ఆమె ప్రధానంగా సత్యం మరియు గార్హస్థ్య ధర్మం గురించి రాజుకు బోధించింది. శకుంతల సత్యం యొక్క విలువను వివరిస్తూ ఒక ప్రసిద్ధ పోలికను

చెప్పింది: "నూరు బావుల కంటే ఒక చెరువు, నూరు చెరువుల కంటే ఒక యజ్ఞం, నూరు యజ్ఞాల కంటే ఒక పుత్రుడు, నూరు మంది పుత్రుల కంటే ఒక సత్య వాక్యం మిన్న" అని పేర్కొంది. దీని ద్వారా సత్యం అన్ని ధర్మాల కంటే అత్యున్నతమైనదని ఆమె చాటిచెప్పింది. మనిషి తన మనస్సాక్షిని మోసం చేయలేడని, సర్వభూతాల హృదయాల్లో ఉండే పరమాత్మ మనం చేసే ప్రతి పనిని చూస్తూనే ఉంటాడని శకుంతల రాజుకు గుర్తు చేసింది. రాజు తన హృదయానికి తెలిసిన సత్యాన్ని దాచడం అధర్మమని ఆమె వాదించింది. సత్యం నిలవకపోతే సంసార వ్యవస్థే అస్తవ్యస్తమవుతుందని, ఇల్లాలు అన్యాయానికి గురవుతుందని ఆమె హెచ్చరించింది. భర్త అసత్యం పలకడం వల్ల పుట్టిన బిడ్డకు సామాజికంగా అస్తిత్వం ఉండదని, అది ఆ వంశానికే నష్టమని స్పష్టం చేసింది. అలాగే యజమాని అసత్య దోషం వల్ల అంతమై పోతాడని, చిత్తశుద్ధి లేని సత్యం ఎప్పటికీ వెల్లడి కాదని ఆమె రాజు ప్రవర్తనను ఎండగట్టింది.

ఈ విధంగా శకుంతల తన వాదనల ద్వారా సత్య ధర్మనిరతి అనేది గార్హస్థ్య ధర్మానికి అమరత్వాన్ని కలిగిస్తుందని నిరూపించింది.

1.5 శకుంతల పాత్ర-ఆధునిక స్త్రీ లక్షణాలు :

నన్నయ చిత్రించిన శకుంతల పాత్రలో నేటి కాలానికి సరిపోయే అనేక ఆధునిక లక్షణాలు కనిపిస్తాయి. ఆమెను కేవలం ఒక ఆశ్రమ కన్యగా కాకుండా, ఆత్మగౌరవం, వివేకం, సామాజిక స్పృహ కలిగిన ధీరవనితగా నన్నయ తీర్చిదిద్దారు.

1.5.1 నిర్ణయాధికారం :

దుష్యంతుడు గాంధర్వ వివాహం చేసుకోమని కోరినప్పుడు, ఆమె గుడ్డిగా లొంగిపోకుండా తన భవిష్యత్తు గురించి ఆలోచించింది. తన సంతానానికి రాజ్య వారసత్వం దక్కాలనే స్పష్టమైన షరతు విధించడం ఆమెలోని స్వతంత్ర ఆలోచనా ధోరణికి మరియు రాజ్యాధికారం పట్ల ఉన్న అవగాహనకు నిదర్శనం.

1.5.2 హక్కుల కోసం పోరాటం :

దుష్యంతుడు సభలో తనను తిరస్కరించినప్పుడు, శకుంతల కుంగిపోలేదు. ఒక ఇల్లాలుకు అన్యాయం జరిగితే సంసార వ్యవస్థే అస్తవ్యస్తమవుతుందని ఆమె గంభీరంగా హెచ్చరించింది. తన కొడుకు అస్తిత్వం కోసం ఆమె చేసిన పోరాటం నేటి న్యాయపోరాటాలకు తీసిపోని విధంగా ఉంటుంది.

1.5.3 ఆత్మగౌరవం :

భర్త తనను గుర్తించనప్పుడు, ఆమె అతనిని వేడుకోకుండా అతని అసత్య ప్రవర్తనను తప్పుబట్టింది. మనిషి తన మనస్సాక్షిని మోసం చేయలేడని, రాజుగా తన కర్తవ్యాన్ని గుర్తుంచుకోవాలని ఆమె సూటిగా వాదించింది.

1.5.4 తార్కిక విశ్లేషణ :

శకుంతల తన వాదనలో కేవలం భావోద్వేగాలను కాకుండా, ధర్మాన్ని తర్కాన్ని ఉపయోగించింది. సత్యం గొప్పతనాన్ని వివరిస్తూ ఆమె చెప్పిన "నూఱు బావుల కంటే ఒక దిగుడుబావి మేలు..." అనే పద్యం ఆమె మేధస్సును, సత్యనిరతిని చాటి చెబుతుంది.

1.5.5 మాతృత్వ చైతన్యం :

భార్య అంటే భర్తలో సగభాగమని, పుత్రుడు తండ్రికి పునర్జన్మ వంటివాడని వివరిస్తూ, కుటుంబ వ్యవస్థలో స్త్రీకి ఉండాల్సిన గౌరవప్రదమైన స్థానాన్ని ఆమె చాటిచెప్పింది.

1.5.6 నిర్భయత్వం :

మహారాజైన దుష్యంతుడి ఎదుట, నిండు సభలో తన వాదనను వినిపించడం ఆమెలోని నిర్భయత్వానికి, ఆధునిక చైతన్యానికి మచ్చుతునకగా చెప్పొచ్చు. ఈ విధంగా నన్నయ చిత్రించిన శకుంతల పాత్రలో ఆత్మవిశ్వాసం, న్యాయం కోసం పోరాడే తత్వం వ్యక్తిగత గౌరవం వంటివన్నీ ఆధునిక లక్షణాలుగా చెప్పొచ్చు. ఇవి శకుంతల పాత్రలో మెండుగా కనిపిస్తాయి.

1.6 ముగింపు :

నన్నయ గారు మహాభారతంలోని శకుంతల పాఖ్యానం ద్వారా సమాజానికి, ముఖ్యంగా కుటుంబ వ్యవస్థకు అత్యున్నతమైన, శాశ్వతమైన సందేశాన్ని ఇచ్చారు. ముఖ్యంగా గార్హస్థ్య ధర్మంలో అంతఃకరణ శుద్ధి ఉండాలని పేర్కొన్నారు. గార్హస్థ్య ధర్మం (కుటుంబ జీవితం) సక్రమంగా సాగాలంటే, ఆ ధర్మాన్ని నిర్వహించే

వ్యక్తులకు అంతఃకరణ శుద్ధి (చిత్తశుద్ధి) ఉండాలని ఈ కథ బోధిస్తుంది. మనస్సాక్షి పట్ల నిజాయితీ లేనిదే సత్యం వెల్లడి కాదని నన్నయ స్పష్టం చేశారు. అలాగే సత్యమే సర్వోన్నతం అని తెలియజేశారు. సత్యం అన్ని ధర్మాల కంటే గొప్పదని శకుంతల పాత్ర ద్వారా నన్నయ చాటి చెప్పారు. దీనిని వివరిస్తూ "నూరు మంది పుత్రుల కంటే ఒక సత్య వాక్యం మిన్న" అనే గొప్ప సందేశాన్ని సమాజానికి అందించారు. అంతేకాకుండా కుటుంబ వ్యవస్థ స్థిరత్వం కలిగి ఉండాలని హితవు పలికారు. సత్యం నిలవకపోతే సంసార వ్యవస్థే అస్తవ్యస్తమవుతుందని నన్నయ హెచ్చరించడం గమనించవచ్చు. సత్యం లేనిచోట ఇల్లాలుకు అన్యాయం జరుగుతుందని, పుత్రునికి సామాజికంగా అస్తిత్వం ఉండదని ఈ ఉపాఖ్యానం తెలియజేస్తుంది. ఒక గృహస్థు లేదా యజమాని అసత్యం పలికితే, ఆ అసత్య దోషం వల్ల అతడు అంతమైపోతాడని దుష్యంతుని ఉదంతం ద్వారా సందేశాన్ని ఇచ్చారు. అలాగే స్త్రీ గౌరవం అత్యంత ప్రధానమైన అంశమని, ఆమె చైతన్యం కలిగి ఉండటం కూడా అంతే అవసరమని హితబోధ చేయడం గమనించవచ్చు. భార్య అంటే కేవలం గృహిణి మాత్రమే కాదని, ఆమె గృహస్థాశ్రమానికి గురువు వంటిదని, ఆమె వల్లనే ధర్మం, అర్థం, కామము అనే పురుషార్థాలు సిద్ధిస్తాయని శకుంతల ద్వారా తెలియజేశారు. స్త్రీ ఆత్మగౌరవంతో, ధర్మబద్ధంగా నిలబడితే చివరకు దైవమే (ఆకాశవాణి రూపంలో) ఆమె పక్షాన నిలుస్తుందని నిరూపించారు. గార్హస్థ్య ధర్మానికి అమరత్వాన్ని కలిగించేది సత్యధర్మనిరతి మాత్రమేనని, అదే మానవుని అమరత్వానికి సాధనమని నన్నయ గారు ఈ ఉపాఖ్యానం ద్వారా సమాజానికి ప్రబోధించారు. క్లుప్తంగా చెప్పాలంటే, చిత్తశుద్ధితో కూడిన సత్యపాలన మరియు కుటుంబ విలువలను గౌరవించడమే శకుంతలోపాఖ్యానం ద్వారా నన్నయ గారు సమాజానికి ఇచ్చిన గొప్ప సందేశంగా ఈ వ్యాసం ద్వారా తెలుసుకోదగ్గ విశేషం.

ఆధార గ్రంథాలు :

1. అంతరార్థ మహాభారతము (ముక్తిసాధనా మార్గము) - వేదుల సూర్యనారాయణ శర్మ.
2. ఆధునిక తెలుగు సాహిత్యంలో విభిన్న ధోరణులు(ద్వితీయ ముద్రణ) - సంపాదకులు, కె.కె. రంగనాథాచార్యులు, ఆంధ్ర సారస్వత పరిషత్ ప్రచురణ, తిలక్‌రోడ్, హైదరాబాద్, 2005.
3. భారతవరణము (రూపకం) - తిరుమల తిరుపతి దేవస్థానములు ప్రచురణ
4. శ్రీమదాంధ్ర మహాభారతము (సరళ వ్యాఖ్యాన సహితం) - తిరుమల తిరుపతి దేవస్థానములు ప్రచురణ, 2013.

★★★

Vol. 23 | Spl. Issue 03 | March 2026 | BHAVAVEENA | ISSN No. : 2456-4702 | RNI No. APTEL/2003/12253

RNI No. APTEL/2003/12253 | Reffered Journal & Peer Reviewed Journals | ISSN No. 2456-4702

భావవీణ

కళలు, సాహిత్య, సాంస్కృతిక భాషాధ్యయన పత్రిక

BHAVA VEENA

Journal of Arts, Literary, Culture & Language Study

అఖండ దీపికలు నవలలో స్త్రీ చైతన్యం

- సంకు శివ

పరిశోధక విద్యార్థి, తెలుగు విభాగం, హైదరాబాద్ కేంద్రీయ విశ్వవిద్యాలయం, హైదరాబాద్.

ఉపోద్ఘాతం :

వావిలి కొలను రాజ్య లక్ష్మీ ఎదుట్ల గ్రామం,గోపాల పేట మండలం, వనపర్తి జిల్లా,ప్రాథమిక విద్యాభ్యాసం ఎదుట్ల,హైస్కూల్ వనపర్తి బాలికోన్నత పాఠశాల, హైదరాబాద్ ఆంధ్రసరస్వత పరిషత్ లో తెలుగు పరీక్షలో ఉత్తీర్ణత. తల్లి తండ్రులు రంగనాయకమ్మ,శేషగిరి రావు. ఆరుగురు అన్నయ్యలు, ఇద్దరు అక్కయ్యలు,ఒక చెల్లెలు.వీరు తొమ్మిది సంతానం. చిన్నప్పటి నుండి కథలంటే చాలా ఇష్టం చిన్నతనంలో వెచ్చాలని న్యూస్ పేపర్లో కట్టి దారం చుట్టి దుకాణంలో ఇచ్చేవారు అని,ఆ కాగితాలను భద్రపరచుకుని వాటిని కూడా విడవకుండా చదివే దాని అని తన పఠనాసక్తిని గురించి చెప్పారు రచయిత్రి.అనుభవం తన రచనకు ప్రేరణను తెలియ చేస్తూ ప్రముఖ రచయిత్రి పోల్కశీపల్లి శాంతదేవి. అలా నేను రాసిన మొదటి కథే మధు శ్రీ.వివాహం కాక మునుపు పోల్కశీపల్లి రాజ్యలక్షి పేరుతో మూడు నవలలు రాశాను అని ఇప్పటి వరకు పదహారు నవలలు, వందకు పైగా కథలు రాశారు.రచయిత్రి రాసిన కథలు వార, మాస పత్రికల్లో ప్రచురించబడ్డాయి.మొదటి నవల "ఆనంద కిరణాలు" బెంగుళూరు నుంచే ప్రజామత వార పత్రికలో సీరియల్ గా వచ్చింది. జీవనచక్రం, కోపం కూడా అదే పత్రికలో సీరియల్ గా వచ్చాయి. ఓ పువ్వు రాలింది అనే నవల ప్రగతి అనే వార పత్రికలో ధారవాహికంగా వచ్చింది. ఈ నవల అశేష పాఠకుల ఆదరాభిమానాలను చూర గొన్నది. ఇతర నవలలు చెదిరిన మేఘాలు,ఆశల దీపాలు, ప్రేమాపుష్పశి, ప్రేమపరిమలశీ, హృదయ సుగధం, అఖండ దీపికలు, డాక్టర్ మహిపాల్ మొదలగునవి. హైదరాబాద్ బేగంపేట విమానాశ్రయం ప్రక్కన ఉన్న చైతన్య గ్రామర్ హైస్కూల్లో 20 సంవత్సరాలు తెలుగు టీచర్ గా పని చేశారు. రచయిత్రి బ్రహ్మ లిఖితం,పూల దోసిళ్ళు,వావిలి కొలను రాజ్య లక్ష్మీ పేరుతో మడు కథ సంపుటాలు వచ్చాయి అని చెప్పవచ్చు.

బిరుదులు :

పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం ఉత్తమ రచయిత్రిగా ప్రతిభ పురస్కారం అందజేసింది.లేఖిని సాహిత్య సంస్థ నుండి మాతృశ్రీ పురస్కారం,పాలమూరు జిల్లా నుంచి మహిళ స్ఫూర్తి పురస్కారం అందుకున్నారు.

అఖండ దీపికలు నవల ఇతివృత్తం :

ఈ నవలలో 2 తరాల చరిత్ర మరియు 3 తరం కూడా ప్రారంభం అని మనకు కనిపిస్తుంది.మొదటి తరం పరమేశ్వరి మరియు అనందరావుకు ఇద్దరు కొడుకులు వాళ్ళు మొదటి వ్యక్తి సుధాకర్,రెండవ వ్యక్తి భాస్కర్ వాళ్లకు మొదటి వ్యక్తికి ఒక కూతురు పేరు మనీష,రెండవ వ్యక్తికి ఒక కొడుకు పేరు సూరి.పెద్ద కొడుకు అనా

రోగ్యంతో చనిపోతాడు. భార్య (దీపిక) బిడ్డను చది పించుటకు నానా ఇబ్బందులూ పడుతుంది.తన బిడ్డను ఉన్నత స్థాయిలో నిలబెట్టుటకు ఆమె అత్త,మామలను కూడా వదిలి విజిటింగ్ వీసాతో తెలిసిన వారితో లండన్ వెళ్లి అక్కడే ఉద్యోగం సంపాదించుకుని నెల నెల ఆ డబ్బులు ఎంతంటే ఎనిమిది వందల పౌండ్లకి పైనే కూతురు కి వేయమని లండన్ లో పరిచయం అయిన రాజేంద్రకి చెప్పేది.కాని అతను దీపికకు మాయ మాటలు చెప్పి లండన్ లో ఒక గుడి ముందు పెళ్లి చేసుకుంటాడు. రాజేంద్రకు కూడా ఇంతకు ముందే వివాహం అయినది. రాజేంద్ర పెళ్ళి అయినది అని ఇద్దరు పిల్లలు ఉన్నారు అని ఆమెతో విడాకులు కూడా తీసుకున్నా అని మాయ మాటలు చెప్పి గుడిలో దండలు మార్చుకుంటారు.కాని చివరకు రాజేంద్ర మోసం చేసాడని అతని మొదటి భార్యాతో విడాకులు తీసుకోకుండా తీసుకున్నా అని చెప్పడం అది నమ్మి దీపిక మోసం పోవటం,మరియు దీపిక నర్సుగా పని చేస్తు ఆ డబ్బులు తన కూతురు మనీష అకౌంట్‌లో వేయమని చెప్పిన ఆ డబ్బులు రాజేంద్ర ఖర్చు చేయడం. దీపిక మనీష ఎదుగుదల కోసమే ''మారిషన్'' నుంచి అత్త,మామలను తన కుంటుంబాన్ని కాదని లండన్ నగరం వచ్చి పరిచయం అయిన రాజేంద్ర ను పెళ్లి చేసుకుంటుంది.కాని రాజేంద్ర దీపికను మోసం చేసాడని గ్రహించి రాజేంద్ర తమ్ముడూ జితేంద్ర సహాయంతో ఇండియాకి టికెట్స్ బుక్ చేయుంచుకుని బాధతో ఇండియాకి వచ్చి మొదటి భర్త సుధాకర్ అనగా దీపికకు అత్త, మామలను తను లండన్ పోయి మోసపోయిన సంగతి చెప్పి ఇంకోసారి మీరు చెప్పేదే చేస్తాను అని కాళ్ల మీద పడి వేడు కుంటుంది. మామ ఆనందరావు దయతో పెద్ద మనసుతో అత్త,మామలు ఆమెను క్షమిస్తారు.అంతకు ముందే దీపిక కూతురు మనీష పెళ్లి జరిగి ఉంటది. ఈ విషయం లండన్‌లో ఉన్నపుడు తల్లికి చెప్పిన రాలేని పరిస్థితి కాని ఇండియాలో సత్యనారాయణ వ్రతం చేసేటప్పుడు వచ్చినందుకు సంతోషిస్తుంది.

సుధాకర్ తమ్ముడు భాస్కర్ భార్య పేరు ప్రేమిక కొడుకు సూరి చిన్నపిల్లవాడు. బడికి పోతాడు.ఒక రోజు ప్రేమిక వాళ్ల అమ్మ అల్లుడు ఇంటికి చెప్పకుండా వచ్చేస్తుంది. అమ్మను చూసిన ప్రేమిక ఆశ్చర్యపోతుంది. ఆమె పేరు దుర్గాంబ ఆమె ఆటో దిగుతూ ఆటో డ్రైవర్‌తో గొడవ పడుతుంది. ప్రేమిక చూసి ఆటోడ్రైవర్‌కి నచ్చచెప్పి డబ్బులు ఇచ్చి పంపుతుంది. దుర్గాంబ ఇంటి దగ్గర కొడుకు కోడలితో గొడవ పడి అల్లుడు దగ్గరకు వస్తుంది. ప్రేమిక తల్లికి కావలసినవి ఇస్తూ బాగా చూసుకుంటుంది. ప్రేమిక ఇంటి పనులు,వంట పనులు ఒక్కతే చూసుకుంటుంది తల్లి చూసుకుంటూ ఉంటుంది కాని పనులు చేయదు అని ప్రేమికకు తెలుసు.బడి నుంచి వచ్చిన సూరి అమ్మమ్మను చూసి కోపగించు కుంటాడు ఎందుకంటే వచ్చేటప్పుడు తినుబండారాలు ఏమి తీసుకురాదని.దుర్గాంబ మాత్రం ఊరికే ఉం డకుండా చుట్టూ పక్కల వారి ఇంటికి పోయి అన్నీ విషయాలు తెలుసుకుంటుంది. కాని అల్లుడు లేని సమయంలో బిడ్డను అడిగి పోతుంది. ఒక రోజు రాత్రి దుర్గాంబ అల్లుడు వింటాడని ప్రేమికను పిలిచి మెల్లిగా మీ తోటి యారలు భర్త చనిపొయాక లండన్ పొయి వేరే వ్యక్తిని పెళ్లి చేసుకున్నదట ఆ విషయం నీకు తెలియదా అని కూతురును అడుగుతుంది.కూతురు నీకెందుకు అవిషయాలు అన్ని ఆయన విన్నారంటే కోపడతారని తల్లిని తిడుతుంది.దుర్గాంబ కోడలితో గొడవపడి వచ్చిందని ప్రేమిక తమ్ముడు చెప్పి మీ దగ్గర నుంచి మా ఇంటికి వచ్చే వరకు అమ్మను ఇంతకు ముందు అమ్మలా మార్చు అక్క అని చెప్పడం.దానికి ప్రేమిక ఏమి చెయ్యాలి అని ఆలోచిస్తుంది.భాస్కర్ దంపతులు, దుర్గాంబ, సూరి కలిసి బాసరకు సరస్వతి అమ్మవారిని దర్శించుకుని వస్తారు. ఒక రోజు దుర్గాంబ హాస్పిటల్ కి తీసుకోమని చెబుతుంది. ప్రేమిక తెలిసిన డాక్టర్ దగ్గరికి తీసుకుపోయే అప్పుడే డాక్టర్ గారికి ఫోన్ చేసి వాళ్లు అమ్మ గురించి చెబుతుంది.డాక్టార్ గారు దుర్గాంబకు నీవు చాలా లావుగా ఉన్నావు కాబట్టే ఆరోగ్యం బాగోలేదు.ఇలా ఉంటే బి.పి, షుగర్, వంటి రోగాలు వస్తాయి బరువు తగ్గడానికి నీవు అన్నం తక్కువగా

తినాలి,పండ్లు తినాలి అని, వ్యాయామం చేయాలి నీవు ఏలాగైనా బరువు తగ్గాలి అని చెబుతాడు. దుర్గాంబ గారు ఆరోజు నుంచి ప్రేమికకు సహాయం చేయడం, సూరి బడికి పోయి బ్యాగ్ ను తీసుకురావడం చేసేది. ప్రేమికకు తల్లి ఇలా మారడం చూసి సంతోషించింది. చివరకు డాక్టర్ చెప్పినట్టుగానే బరువు తగ్గింది. మనిషి తలచుకుంటే ఏదైనా చేయవచ్చని చేసి చూయించింది దుర్గాంబ. ఆ తరువాత కొడుకు ఇంటికి పోయేటప్పుడు చాలా సంతోషంతో కూతురు, అల్లుడు, మనువడు సంతోషంగా దుర్గాంబను పంపిస్తారు. చివరకు మనీష,నిహర్ పెళ్లి సమయంలో కలిసి చాలా సంతోషంగా నూతన వధూ వరులతో సత్యనారాయణ వ్రతం చేసి ,ఆరోజే దీపావళి కనుక టపాసులు కాల్చు కుంటూ, బాధల నుండి విముక్తి పొందిన దీపికా, అమావాస్య లాంటి తన చీకటి జీవితంలో ఈనాడిలా వెలిగించిన అత్యద్భుతంగా ఆకర్షణీయంగా కనిపిస్తున్న తేజోపూరితమైన వెలుగుల్ని విరజిమ్ముతున్న ఈ దీపాలే.. అఖండ దీపికలై వెల్లి విరిసినట్టుగా మధురమైన అనుభూతిని పొంది ఆనందం పారవశ్యంతో మురిసి పోసాగింది దీపిక.అయ్యో పరం దామా పెళ్లి క్యాసెట్ చూద్దాం అని దుర్గాంబ అన్నప్పుడు అందరు నవ్వుతూ ఇంటి లోపలికి పోయారు.చెడుపై మంచి సాధించిన రోజునే మనం దీపావళి జరుపుకోవడం దీపిక కూడా ఇండియా వచ్చిన రోజే దీపావళి అందరితో కలిసి జరుపుకోవడం అదృష్టంగా భావించింది.ఈ నవల చివరికి సుఖాంతంగా ముగిసింది అని చెప్పవచ్చు.అలాగే హృదయ సుగంధం నవలలో కూడా తల్లి బిడ్డని చదివించుటకు లండన్ పంపితే అక్కడ కూతురు ఇంగ్లీష్ అతడిని ప్రేమించటం ఆ విషయం తల్లికి తెలిసి ఒప్పుకోక పోవటం చివరికి ఆమెనే కూతురు ఇష్ట ప్రకారమే పెళ్లిచేయటంలో కూడా స్త్రీ చైతన్యం మనకు కనిపిస్తుంది. అలాగే బ్రహ్మ లిఖితం కథల సంపుటిలో కూడా స్త్రీ చైతన్యము తెలిపే కథలే ఉంటాయి.

పాత్రలు :

పరమేశ్వరి, ఆనందరావు, సుధాకర్, భాస్కర్, దుర్గాంబ, ప్రేమిక, మనీషా, దీపిక, రాజేంద్ర, కృష్ణవేణి, వల్లభ్, జితేంద్ర, ధర్మేంద్ర, మీనాక్షి,నిహార్,సూరి.

దీపిక :

మారిషన్ లో ఉంటున్న సుధాకర్ కి,దీపిక కు ఒక బిడ్డ ఆమె పేరు మనీష.భర్త సుధాకర్ మనీష చిన్నగా ఉన్నప్పుడే చనిపోయాడు. ఆమె మనీష కోసం డబ్బులు సంపాదించాలని తెలిసిన వ్యక్తితో వీసా తీసుకుని లండన్ పోయి మొదటి బ్రెడ్ కంపెనీలో పని చేసింది.తరువాత డాక్టర్ దగ్గర బేబి సిస్టర్ గా పని చేస్తు ప్రతి నెలా మనీష అకౌంట్ లో డబ్బులు వేయమని తెలిసిన వ్యక్తి రాజేంద్రకి ఇచ్చేది. రాజేంద్ర దీపిక లండన్ లో తిరుగుతూ ఉన్నప్పుడు ఒకరికి ఒకరు దగ్గర అయి ఒక గుడిలో దండలు మార్చుకుంటారు. అప్పుడు రాజేంద్ర తనకు పెళ్లి సంగతి ,గొడవ కారణంగా విడిపోయి విడాకులు తీసుకున్నాము అని చెపుతాడు. దీపిక కూడా ఆ మాటలను నమ్మేస్తుంది. దీపిక కూడా తనకు భర్త చనిపోయాడు రాజేంద్ర జీవితంలో తోడుగా ఉంటాడు అనుకుంది.రాజేంద్ర లండన్ నగరంలో సౌతిండియా రెస్టారెంట్, హౌన్సి వైపున్న విన్సల్ ఖాజల్‌కి, బకింగ్ హామ్ ప్యాలెస్, సైన్స్ మ్యూజియం, విక్టోరియా చర్చ్, పార్లమెంటు భవనం,రంగు రంగు వెలుగులో సెంట్రల్ లండన్, లండన్ లో అతి పెద్ద ఖరీదైన షాపింగ్ మాల్ హారాడ్స్, థేమ్స్ నది మధ్యలో జెయింట్ వీల్ ఆకారంలో ఎంతో ఎత్తులో గుండ్రంగా ఉన్న లండన్ ఐ, మొదలైనవి చూపిస్తాడు. రాజేంద్ర దీపికను ఇంటికి తీసుకువచ్చాడు. రాజేంద్రకు వాళ్ల నాన్న సీతాపతి, తల్లి మీనాక్షి కి ముగ్గురు కొడుకులు మొదటివాడు రాజేంద్ర తండ్రి రాజేంద్రను బాగా చదివించాలని అతనిపై ఎన్నో ఆశలు పెట్టుకున్నాడు.కాని ఆశల్ని రాజేంద్ర అడియాశలు చేసి చదువుకోకుండా చెడు అలవాట్లకు బానిసైపోయాడు. చివరికి కారు డ్రైవింగ్ చేస్తూ వాటి మెలకువలు గ్రహించి కార్లు రిపేరింగ్ మెకానిక్ గా స్థిరపడ్డాడు.తండ్రి ఉన్నప్పుడే రాజేంద్ర కు వివాహం చేశాడు ఇద్దరు పిల్లలు ఉన్నారు. సీతాపతి ఉన్నప్పుడు అత్త,కోడలు మధ్య గొడవలు జరగకుండా సీతాపతి చూసుకునే వాడు. ఒక రోజు సడన్‌గా గుండె పోటు వచ్చి చనిపోయాడు. తరువాత అత్త, కోడలు మధ్య గడ్డి వేస్తే భగ్ మనట్లు తయారయ్యింది. రాజేంద్ర ఎంత చెప్పిన వినేవారు కాదు. అలా రాజేంద్ర, కృష్ణవేణి

విడిపోయారు అని తెలుస్తుంది. అప్పుడే దీపిక కలవడంతో దగ్గర అయ్యి గుడిలో పెళ్లి చేసుకున్నారు.

రాజేంద్ర తమ్ముళ్లు జితేంద్ర, ధర్మేంద్ర ఐటి ఇంజనీర్లు అయ్యారు.దీపికను రాజేంద్ర తల్లి తిడుతుంది తను మాత్రం అవి ఏమి పట్టించుకోకుండా ఉంటుంది. కొడుకు ఉన్నప్పుడు ఒక రకంగా లేనప్పుడు ఒక రకంగా ఉంటుంది అని దీపికా గ్రహించి రాజేంద్రకు తల్లి గురించి చెబుతుంది. ఏమి పట్టించుకోవద్దు అనే వాడు దీపిక మరిదైన ధర్మేంద్రతో తక్కువగా మాట్లాడేది ఎందుకంటే అతను కోపంగా ఉంటాడు. ఇంకో మరిది జితేంద్రతో బాగా మాట్లాడేది.నర్సుగా పని చేస్తున్న హాస్పిటల్ ముందే రాజేంద్ర మొదటి భార్య వాళ్ళు ఉంటున్నారు.ఒక సారి కృష్ణవేణి దీపికను కలిసి రాజేంద్ర తాగుడు గురించి,తాను అత్త వల్లనే విడిపోయాను అని చెపుతుంది.ఒక సారి దీపిక వంట గదిలో ఉండగా అరుపులూ వినిపించాయి. బయటకి వచ్చి చూస్తే అత్త మీనాక్షి పక్షవాతం వచ్చి ఉంటది. దీపిక గట్టిగా అరుస్తూ బెడ్ రూమ్ లో ఉన్న రాజేంద్రను తీసుకొస్తుంది. ఆ రోజే కూతురు లండన్ వస్తాఅన్నది. వేరే అతన్ని పెళ్లి చేసుకుందని మొదటి భర్త అత్త,మామలను విడిచిపోయిందని చాలా రోజులు మాట్లాడకుండ ఉన్న కూతురు మనీష కాబోయే భర్త నిహర్ తన తల్లితో మాట్లాడమని బలవంతం పెట్టి నందుకు చిన్నపుడు తల్లి చేసిన జ్ఞాపకాలను తలచుకుని ఇప్పుడు లండన్ పోయి సంపాదించేది నా కోసమే కదా అని అర్థం చేసుకుని మాట్లాడి, కాబోయే భర్త నిహర్తో లండన్ వస్తాను అని చెప్పింటది ఆరోజే రాజేంద్ర తల్లికి పక్షవాతం రావడం హాస్పిటల్ తీసుకుని పోయినప్పుడు రాజేంద్ర తమ్ముడుకి ఈ విషయం చెప్పితే నేను చూసుకుంటాను అని చెప్పడం. దీపికా, రాజేంద్ర కూతురును కలవాడానికి ఏయిర్ పోర్ట్ పోయి కూతురుని కలిసి సంతోషంగా ఒక గంట ఉంటారు.అంతలోనే రాజేంద్ర కి ఫోన్ వస్తుంది. తల్లి చనిపోయిందని అప్పుడు దీపిక కూతురుకి బాయ్ చెప్పి హాస్పిటల్ దగ్గరకి పోతారు. రాజేంద్ర తల్లి చనిపోయిన తరువాత మొదటి భార్య కొడుకు వచ్చి నగలు ఎవరికి చెప్పకుండా తీసుకొని పోతాడు కృష్ణవేణి చెప్పినట్లుగా. తల్లి మరణం తరువాత ఒకరోజు రాజేంద్ర బాగా తాగి ఇంటికి వస్తాడు.వచ్చి దీపికను కొగిలించుకోవాడానికి పోతే ఆమె కోపంతో దొబ్బుతుంది.అతను తూగుత మెట్లు దిగుతున్నప్పుడు కాలు జారి కాలు విరిగి అరుస్తాడు. ఆ ధ్వని విని దీపికా వచ్చి చూసి ఏడుస్తూ గట్టిగా అరుస్తూ ఉంటుంది. మరుదులకి ఫోన్ చేస్తే వారు వచ్చేవరకు గంట పడుతుంది అని వల్లభ్ మొదటి భార్య కొడుకుకి ఫోన్ చేస్తుంది.హస్పిటల్ కి తీసుకుపోతారు. అక్కడ రాజేంద్ర మొదటి భార్య బెడ్ పై కూర్చుని భోజనం తినిపిస్తున్న ఆ దృశ్యాన్ని చూసి దీపిక అవాకైపోతుంది. మర్యాదలు చేయడం చూసిన దీపికకు ఏమి అర్థం కావట్లేదు. కృష్ణవేణి కోపంగా నీవే మా ఆయనను కింద పడేసావా అని అడుగుతుంది.

దీపికా నేను ఎందుకు మెట్లమీద నుంచి దొబ్బుతాను రాజు అని అంటూ ఉంది. రాజు నీవు తోయకున్నా నీనుంచే కదా కింద పడ్డాను అని మొరటుగా అంటాడు. దీపికా నన్ను నేరస్తురాలిగా చేయాలి అనుకుంటున్నావా అని చెప్పి ఇంటికి బాధపడుతూ వచ్చేస్తుంది.దీపిక భర్తను ఎన్నో ప్రశ్నలు అడగాలని ఉంటుంది.కాని ఇక్కడ కృష్ణవేణి కనబడేసరికి ఆమెలోని ఆవేశం అంతా ఒక్కసారిగా అణగారిపోతుంది. జితేంద్రకి దీపికా జరిగిన విషయం చెప్పి ఏడుస్తూ ఇంటికాడనే ఉంటుంది జితేంద్ర దీపికకు చేసిన మోసాన్ని అడగడానికి మొదటి భార్య ఇంటికాడ ఉన్న అన్న దగ్గరకు పోయి నిలదీస్తాడు.కాని పిల్లలు, మొదటి భార్య, రాజేంద్ర ఒకటయ్యారు అని గ్రహించి దీపికకు చెపుతాడు. దీపిక నేను సంపాదించి నెల నెల నా కూతురు అకౌంట్‌లో వేయమని డబ్బులు ఇస్తే వేయకుండా నా డబ్బుతోనే నన్ను లండన్ నగరం అంతా తిప్పాడు. విడాకులు తీసుకోకుండా తీసుకున్నా అని, ఇప్పుడు నన్ను ఆమెను ఒకటే దగ్గర ఉండమంటే ఏలా అని చెప్పి బాధపడుతూ నేను తప్పుచేశాను అని బాధ పడుతూ నేను ఇక్కడ ఉండలేను ఏలాగైనా నాకు ఇండియా పోవడానికి పాన్ పోర్ట్ ఇప్పించు అని జితేంద్రకు చెప్పి బాధపడుతుంది.

జితేంద్ర ప్లైట్ ఎక్కించి ఇండియాకి పంపుతాడు.

దీపికకు రాజేంద్ర చాలా మోసం చేశాడు. ఇండియాకి వచ్చి తన తప్పు తెలునుకుని అత్త, మామలను క్షమించమని బ్రతిమాలుతుంది. వారు ఆమెను అర్థం చేసుకుని క్షమిస్తారు అని చెప్పవచ్చు.

మనీష :

చిన్నప్పుడే నాన్న చనిపోయాడు. మనీష కోసం డబ్బులు సంపాదించుటకు తల్లి వదిలి లండన్ పోతుంది. మనీష నానమ్మ, తాతయ్య దగ్గరే ఉండి చదువు కుంటుంది. తను కష్టపడి చదివి ఎయిర్ హోస్టెస్ గా సెలెక్ట్ అవుతుంది. ఆ విషయం తెలుసుకుని తాత చాలా సంతోషం పెడతాడు. మనీష ఈ గొప్పతనం అంతా మీదే అని తాత, నానమ్మ ఆశీస్సులు తీసుకుంటుంది. తల్లి దీపికా ఫోన్ చేసినా ఎత్తదు. ఎప్పుడైనా మనీష తల్లి గురించి అంటే సద్గుణవంతురాలు, సాత్వికురాలు ఇలా చేసింది అని మనసులో అనుకుని బాధపడేది నానమ్మ. నిహార్ కూడా జాబ్ చేస్తాడు. ట్రైనింగ్ లో పరిచయం అయ్యి ప్రేమించుకుని రెండు కుటుంబాలను ఒప్పించు కుని పెళ్లి చేసుకుంటారు. పెళ్లికి దీపికకు రావాలని ఉన్న అక్కడ కుటుంబ పరిస్థితి బాగా లేనందుకు రాలేదు. కాని ఇండియాలో సత్యనారాయణ వ్రతం చేసేటప్పుడు వచ్చింది.తను రాజేంద్ర మోసానికి అటు అత్తమామలను కుటుంబానికి దూరమై, ఇటు రాజేంద్రకూ దూరమై ఎక్కడ కాకుండా తన బ్రతుకయిందని విలపిస్తూ ఆత్మహత్య కూడా సిద్ధం అయ్యింది జితేంద్ర రావడంతో ఆ నిర్ణయం మార్చుకుంది అని చెప్పవచ్చు.చివరకు దీపిక లండన్‌లో జరిగినదంతా పీడీ కలలా మర్చిపోయి మొదటి భర్త కుటుంబంతో కలిసి తను చేసిన తప్పును తెలుసుకొని రావడంతో నవల ముగుస్తుంది.

భాషా శైలి :

దుర్గాంబ గారి ఊత పదం: అయ్యో పరంధామా! అనే పదం ఎక్కువగా వాడుతుంది. ఈ నవలలో కని పిస్తున్న కొన్ని ఇంగ్లీష్ పదాలు: ట్యూషన్, టే కిట్ ఈజీ, మై డార్లింగ్, ప్లస్ టూ, ఓ మై గాడ్, థ్రిల్లింగ్, డియర్, రిపైర్మెంట్,ఆల్ రైట్, ట్రీట్, వెరీ బ్యాడ్.

ముగింపు :

ఈ నవలలో దీపిక తన బిడ్డను ఉన్నత చదువులు చదివించుటకు,పెళ్ళి చేయుటకు డబ్బు సంపాదించాలనే ఆలోచనతో లండన్ పోయి అక్కడ దీపిక ఎదుర్కొన్న కష్టాలను,బాధను స్త్రీ యొక్క చైతన్యాన్ని తెలుపుతాయి. ఇలాంటి రచనలు నేటి సమాజానికి ఒక అనుభవంలాగా, ఆదర్శంగా ఉంటాయి. సమాజంలో జరుగుతున్న సమస్య లను మన కళ్ళకు కట్టినట్టు నవలలో చెప్పటం రచయిత్రి ప్రతిభను తెలియచేస్తుంది అని చెప్పవచ్చు.

ఉపయుక్త గ్రంథ సూచి :

1. రాజ్యలక్ష్మి,వావిలికొలను, 2014. అఖండదీపికలు, హైద్రాబాద్ :సూర్య ప్రచురణలు.
2. రాజ్యలక్ష్మి,వావిలికొలను, 2010. బ్రహ్మలిఖితం, హైదరాబాద్ : సూర్య ప్రచురణలు.
3. రాజ్యలక్ష్మి, వావిలికొలను, 2012. హృదయ సుగంధం, హైద్రాబాద్ : సూర్య ప్రచురణలు.
4. శివారెడ్డి, ఆచార్య ఎల్లూరి, 2022. వనపర్తి జిల్లా సమగ్ర స్వరూపం, హైదరాబాద్, తెలంగాణ సారస్వత పరిషత్తు.

★★★

Vol. 23 | Spl. Issue 03 | March 2026 | BHAVAVEENA | ISSN No. : 2456-4702 | RNI No. APTEL/2003/12253

RNI No. APTEL/2003/12253 | Reffered Journal & Peer Reviewed Journals | ISSN No. 2456-4702

భావవీణ

కళలు, సాహిత్య, సాంస్కృతిక భాషాధ్యయన పత్రిక

BHAVA VEENA

Journal of Arts, Literary, Culture & Language Study

మాలతీ చందూర్ కథా సాహిత్యం - స్త్రీ వాద దృక్పథం

- చంద్రకళ దీకొండ

ఉపాధ్యాయిని, కవయిత్రి మరియు రచయిత్రి, హైదరాబాద్.

ప్రముఖ రచయిత్రి,కాలమిస్ట్, సాహిత్య అకాడమీ బహుమతి గ్రహీత మాలతీ చందూర్. ఆ రోజుల్లో చాలా మందికి మాలతీ చందూర్ అంటే ఒక చూడదగిన వింత. పైగా ఆవిడ ప్రమదావనం, వంటలూ - పిండివంటలు... ప్రశ్నలూ - జవాబులు వారం వారం కనిపించేవి గానీ, ఆవిడ ఫోటో ఎక్కడా కనిపించేది కాదు. చాలామంది అభిమాన పాఠకులకు ఉత్సుకత ఉండేది, ఆమెను చూడాలని పేరును బట్టి ఉత్తరాది వాళ్లనుకునేవాళ్ళు. చందూర్ ఇంటి పేరనీ, మాలతి అనలు పేరనీ, పశ్చిమగోదావరి జిల్లా వాస్తవ్యులనీ తరువాత తెలిసాయి వివరాలు. ప్రతి పురుషుడి విజయం వెనుక ఒక స్త్రీ ఉంటుందంటారు. కానీ ఆమె విజయం వెనుక వెన్నుదన్నుగా ఉన్నవారు (ఎమ్మెస్ సుబ్బలక్ష్మి సరసన సదాశివంలా) నాగేశ్వరరావు చందూర్ గారు. ఆవిడ కథల నేపథ్యం చెప్పనట్లమే.

సమతూకమైన చక్కని సాహిత్యం అర్ధ శతాబ్దికి పైగా తెలుగు పత్రికారంగాన్ని నునంపన్నం చేసింది. ముళ్ళపూడి, రవిశాస్త్రి గార్లు సాహిత్య లోకాన్ని ఏలుతున్న రోజులవి. తెలుగు పత్రికలన్నీ మద్రాసు నుండే వెలువడేవి. దేశీ పబ్లికేషన్స్ వారు ఆవిడ వ్రాసిన లిపాపలి అనే కథాసంపుటిని అచ్చువేసారు. లజ్ కార్నర్ అనే కథ చాలా బాగుంటుంది. గోముఖ వ్యాఘ్రాలు, రుద్రాక్షలు ధరించిన తోడేళ్లు వంటి కొత్త తరహా పాత్రలతో అల్లిన కథ. సినిమాలు అర్థం చేసుకోవడానికి తమిళ భాషను నేర్చుకుని, రెండేళ్లకే అనువాద రచనలు చేసిన మేధావి మాలతీ చందూర్.

ఆమె తెలుగు అనువాదం చేసిన జయకాంతన్ నవల సిలనేరంగళ కొన్ని నమయాలలో కొందరు మనుషులు. ధారావాహికగా వెలువడి సంచలనం సృష్టించింది. ఆంధ్రప్రభలో నిరాఘాటంగా సుమారు అర్ధ శతాబ్ది పాటు జవాబులు శీర్షికను నడిపిన విదుషీమణి ఆమె.ఎన్నో రకాల నమన్యలకు ఆత్మీయంగా జవాబులిస్తూ, ఓదారుస్తూ, ధైర్యం చెప్తూ... తెలుగు వారి ఆప్తవర్గంలో చేరారు. వాటిని కొంతమంది అభిమాన పాఠకులు బైండింగులు చేసి, అపురూపంగా దాచుకునేవారు.నేడు పత్రికలలో వస్తున్న కౌన్సిలింగ్ వంటి శీర్షికలకు ఆవిడే శ్రీకారం చుట్టారు అనాడే.

ఆంగ్ల భాషలోని మంచి నవలలను పరిచయం చేసే పాతకెరటాలు అద్వితీయం. సుమారు 450 నవలలు పరిచయం చేసారామె శతాబ్ది సూరీడు, హృదయనేత్రి, శిశిరవసంతం, సద్యోగం, ఆలోచించు, రాగరక్తిమ, భూమిపుత్రి, ఏమిటీ జీవితాలు, ఏది గమనం - ఏది మార్గం, రెక్కల చుక్కలు, కాంచనమృగం, కలల వెలుగు, రేణుకాదేవి ఆత్మకథ వంటి 16 నవలలు రచించారామె.

స్నేహసౌహార్ద్రాలకు పుట్టినిల్లు చందూర్ వారి ఇల్లు.ఎందరో తెలుగు ప్రముఖులు వారి గృహాన్ని సందర్శించేవారు.

మాలతీ చందూర్ గారి గురించి కొంతమంది ప్రముఖ రచయితల అభిప్రాయాలు

ఆమె శైలి సూటిగా, సుఖంగా, డొంక తిరుగుళ్లు లేకుండా హాయిగా ఉంటుంది. అనవసర అలంకారాలు ఉండవు. హాస్యోక్తులుండవు. కథ వడివడిగా నడుస్తుంది. వ్యక్తిగతజీవితం గానీ, సాహిత్య జీవితం గానీ సంస్కార వంతంగా గడిపి, పాఠకుల మదిలో గౌరవప్రదంగా నిలబడిపోయే అదృష్టం మాలతీ చందూర్ వంటి కొద్దిమందికే సాధ్యం - **శ్రీ రమణ**

నవలా నిర్మాణము సూటిగా,స్పష్టంగా ఉండి, వ్యక్తులను, పరిస్థితులను కళ్లముందుంచుతారు. మనమే పాత్రను ఇష్టపడతామనేది మన సంస్కారంపై ఆధారపడి ఉంటుంది - **ఓల్గా**

ఆమె రచనలు స్త్రీలను ఆకట్టుకున్నాయి. ఎందరో రచనలను చేయడానికి పురికొల్పాయి. అట్లా రచయిత్రులు, రచయితలు అయినవాళ్లున్నారు. ఉత్తమ పాఠకులైనవాళ్ళు, ఉత్తమ గృహిణులు, ఉత్తమ సంస్కారం గల మహిళలుగా రూపుదిద్దుకున్నవాళ్లున్నారు **-ముదిగంటి సుజాతారెడ్డి**

స్త్రీల ఉద్యోగ రంగ, జీవితరంగ సంఘర్షణలను, సర్దుబాట్లను, స్వతంత్ర వ్యక్తిత్వ జీవన ఆకాంక్షలను, ఆత్మగౌరవ చైతన్యాన్ని ఇతివృత్తంలో భాగం చేసిన నవలలు రచించారు మాలతీ చందూర్ - **కాత్యాయనీ విద్మహే**

భావ గాంభీర్యం, సునిశిత పరిశీలన,విస్తృత పఠనం, అధ్యయనం, కాలానికంటే ముందుండే నైజం, చెప్పదలచుకొన్న విషయాన్ని సందర్భోచితంగా, వాదనా పటిమతో, సమయస్ఫూర్తితో రచించే శైలీ, నైపుణ్యం ఇవన్నీ కలగలిపితే ఆమె - **డా.శిలాలోలిత**

1950ల నుండి దాదాపు సుమారు మూడు దశాబ్దాల పాటు తెలుగువారికి సుపరిచితమైన పేరు శ్రీమతి మాలతి చందూర్. ఈమె రచయిత్రి, కాలమిస్టు, సాహిత్య అకాడమీ బహుమతి గ్రహీత. మాలతీ చందూర్ కృష్ణా జిల్లా లోని నూజివీడులో 1930 లో జ్ఞానాంబ, వెంకటేశ్వర్లు దంపతులకు జన్మించారు ఆరుగురి సంతానంలో అందరి కంటే ఆమె చిన్నది. ఊర్లో ఉయ్యూరు రాజావారి దివాణ ముండేది. దివాణం పక్కనే ఎన్.ఆర్.ఆర్. పాఠశాల ఉంది. 8వ తరగతి వరకు ఎస్.ఎన్.ఆర్ పాఠశాలలోనే చదివింది. ఆమె బాల్యంలో అధికభాగం నూజివీడులోనే గడిచింది. ఆ ఊర్లో ఎనిమిదవ తరగతి పూర్తి కాగానే చదువుకోవడానికి ఏలూరు వెళ్ళింది. అక్కడ వారి మామయ్యగారి (చందూర్) ఇంట్లో ఉండి చదువు కున్నారు. ఏలూరు లోని వట్లూరు సెయింట్ థెరిస్సా స్కూల్లో ఇంగ్లీషు మీడియంలో చేరారు. అప్పుడు చందూర్ గారి ద్వారా డి. కామేశ్వరి, ఆనందారామం, అరవిందా చారి, సక్కుబాయి వంటి వారితో పరిచయం ఏర్పడింది. ఏలూరులో వారున్న ఇంటికి దగ్గరగా 'కథావీధి' అనే సాహిత్య పత్రిక ఉండేది. అక్కడికి శ్రీశ్రీ, విశ్వనాథ సత్య నారాయణ, కృష్ణశాస్త్రి, నండూరి సుబ్బారావు, వెంకట చలం, కావలి లక్ష్మీనరసింగం మొదలైన వారు వచ్చేవారు. అప్పుడే వీరందరినీ ఆమె చూడడం జరిగింది. 1947లో ఆమె, చందూర్ గారు జి.టి. ఎక్స్ప్రెస్ ఎక్కి మద్రాసు చేరుకున్నారు. సెంట్రల్లో దిగి ఒంటెద్దు బండెక్కి జార్జిటాన్లో అద్దె ఇంటికి చేరుకున్నారు. 1947 చివర్లో ఆమె, చందూర్ గారు వివాహబంధంతో ఒక్కటయ్యారు. మద్రాసుకు వచ్చిన తరువాతే పైవేటుగా ఎస్.ఎస్.ఎల్.సి. పూర్తి చేశారు. వారు ఇంతకు మించి పెద్ద చదువులేం చదవలేదు. 1949లో వారి రచనా వ్యాసంగం ప్రారంభమైంది. అప్పట్లో రేడియోలో ఆమె రచనలను చదివి వినిపించేవారు. ఆ రోజుల్లో ఎగ్మూర్లో ఉన్న రేడియో స్టేషన్కు వెళితే ఒక సాహితీ సభకు వెళ్ళినట్లుండేది. అక్కడే ఆచంట జానకిరాం, బుచ్చిబాబు, జనమంచి రామకృష్ణ, పి.వి. రాజమన్నార్, మునిమాణిక్యం నరసింహారావు వంటి వారిని దగ్గరగా గమనించే అవకాశం కలిగింది. 1952 నుంచి రచనా వ్యాసంగంలో తీరిక లేకుండా గడిపారు. 1948 నుండి 64 వరకు పరుసవాక్కంలో అద్దె ఇంట్లో ఉండే వాళ్ళు. ఆ తరువాత ప్రస్తుతమున్న వారి ఇంట్లోకి మారారు.

అప్పటి నుండి అక్కడే ఉన్నారు. మద్రాసులో వారికి చాలా మంది మంచి స్నేహితులున్నారు.

ఆంధ్రప్రభ సచిత్ర వారపత్రికలో 1952 నుండి ఆడవారి కోసం లిప్రమదావనంలి అనే డియర్ అబ్బీ వంటి శీర్షికను క్రమము తప్పకుండ 47 సంవత్సరాలు నిర్వహించారు. ఈ శీర్షికలో వంటలు, వార్పులే కాకుండా ఇంగ్లీషు నవలలను పరిచయం చెయ్యటం, విదేశాలలో తిరిగి వచ్చిన వారి చేత వారి అనుభవాలు రాయించటం, మొదలైనవి చేస్తూ ఆడవారికి ఒక సలహాదారుగా ఉండి, వారి ప్రశ్నలకు సమాధానాలు ఇచ్చేవారు. ఈమె ప్రచురించిన వంటల పుస్తకాలు కొత్తగా పెళ్ళయిన అమ్మాయిలకు ఉపయోగకరంగా ఉండేవి.మాలతీ చందూర్ రాసే "జవాబులు" ఆడవారితో పాటు మగ వారు కూడా చదివేవారు. మాలతీ చందూర్ 'జవాబులు' శీర్షిక పేజీలను ఆరోజుల్లో వారపత్రికనుండి చించి, పోగుచేసి, పుస్తకాలుగా బైండింగులు చేసి, చాలామంది అపురూపంగా దాచుకొనేవారు. ఎందుకంటే అవి జ్ఞానాన్ని పంచి ఇచ్చే జవాబులు. తెలుగులో పాతిక దాకా మహిళా ప్రధాన నవలలు రాయటమే కాక, 300 కు పైగా ఆంగ్ల రచనలను తెలుగులోకి అనువదించారు.ఈమె అనువాదాలు జేన్ ఆస్టిన్ నుండి సమకాలీన అరుంధతీ రాయ్ ల రచనల వరకూ ఉన్నాయి. ఇవి 'పాత కెరటాలు' శీర్షికన స్వాతి మాసపత్రికలో ప్రచురించారు. నవలా రచయిత్రిగా, మహిళా వృత్తాలపై కాలమిస్టుగా అనేక పురస్కారాలు అందుకొన్నది. 70వ దశకములో కేంద్ర సెన్సారు బోర్డు సభ్యురాలిగా పనిచేసిన ఈమె, తాను చూసే తమిళ సినిమాలను అర్థం చేసుకోవటానికి తమిళ భాష నేర్చు కున్నది. నేర్చుకున్న రెండేళ్లకే అనువాదాలు ప్రారంభించి అనేక తమిళ రచనలను కూడా తెనిగించారు. మద్రాసులో స్థిరపడ్డ మాలతి చందూర్ క్యాన్సర్ వ్యాధిగ్రస్తులయి 2013 ఆగస్టు 21 న స్వర్గస్తురాలైయినారు. ఆవిడ తన పార్థివ దేహాన్ని పరిశోధనల నిమిత్తము మద్రాసు లోని శ్రీ రామచంద్ర మెడికల్ కాలేజీ అండ్ రీసర్చ్ ఇన్స్టిట్యూట్ కు దానము చేశారు.

ప్రస్తుతము ఆవిడ వ్రాసిన కథలలో ఆంధ్ర జ్యోతి సచిత్ర వార పత్రికలో ప్రచురితమైన కారుణ్యము" అనే కథను పరిచయము చేస్తాను. ఈ కథ ఒక పదేళ్ల కుర్రవాడు వాళ్ళ పక్కింటి వ్యక్తి తన పెంపుడు కుక్కపై చూపించిన నిర్లక్ష్యానికి, క్రూరత్వానికి చలించి, తన మేనత్త సహాయముతో ఆ కుక్కను కాపాడిన విధమును రచయిత్రి చక్కగా వివరించారు. ఈ కథకు టైటిల్ కారుణ్యములి అని పెట్టారు గాని, ఈ కథాంశము జీవకారుణ్యము నోరు లేని జీవాల పట్ల ఆ చిన్నపిల్లవాడిలో ఉండే దయ, జాలి, వాటికి న్యాయము చేయాలి అన్న తపన స్పష్టముగా కనిపిస్తుంది.

ఆదివారము అవటముతో టీచర్ గా పనిచేస్తున్న సుమతి తీరికగా పేపర్ చూస్తూ కూర్చున్నది. మాములుగా అయితే సుమతి మేనల్లుడు వాసు వాళ్ళ అమ్మ నూనె రాసి నలుగు పెట్టి పోసే తలంటి భయపడి తప్పించు కోవటానికి ప్రయత్నిస్తుంటాడు, కానీ ఈ రోజు వాళ్ళ మేనత్త చుట్టూ ఏదో పనికోనము తచ్చాడుతున్నాడు. ఇది గమనించిన సుమతి, బహుశా సినిమాకు వెళ్లటానికి డబ్బులకోనము తన చుట్టూ తిరుగు తున్నాడని అనుకుంది. కానీ, వాసు సుమతి దగ్గరకు వచ్చి,"అత్తా మనము ఫోన్ చేస్తే పోలీసులు వస్తారా?"అని సందేహముగా అడిగాడు సుమతి. ఒక్కసారి ఉలిక్కిపడి, "అయినా నీకు పోలీసులతో ఏంటి పని" అని అడిగింది. "100కి ఫోన్ చేస్తే పోలీసులు వస్తారా?" అని మళ్ళీ అడిగాడు. "ఫైర్ లేదా యాక్సిడెంట్ జరిగితే వస్తారు" అని సుమతి చెపుతుంది. "అయితే పోలీసులు రారా?" అని అడుగుతాడు. "దొంగతనము ఏదైనా జరిగిందా?" "అంటే దొంగతనము జరిగితే తప్ప, పోలీసులు రారా అన్యాయము జరుగుతూ ఉంటే రారా? మరి వాళ్ళను రక్షక భటులు అంటారు కదా? అన్యాయము జరిగిన చోటుకి రావాలి కదా?" అని ప్రశ్నల వర్షము వాళ్ళ మేనత్త మీద వాసు కురిపిస్తాడు. "ఇంతకీ అసలు విషయము ఏమిటో చెప్పు. పోలీసులు వచ్చి ఎవరికి సహాయము చేయాలి?" అని సుమతి అడుగుతుంది. "పోలీసులు మనుషులకు మాత్రమే సహాయము చేస్తారా? జంతువు లకు సహాయము చెయ్యరా?" అని వాసు అంటే,

సుమతికి విషయము కొద్దికొద్దిగా అర్థము అవుతుంది. వాసు ఏ జంతువునో రక్షించటానికి కంకణము కట్టు కున్నాడు. ఎవరు చెప్పినా వినడు. నేరుగా పోలీస్ స్టేషన్‌కి వెళ్లేట్టున్నాడని సుమతికి అర్థమయింది. "ఇంతకూ టామీ గురించియేనా నీ భాధ" అని సుమతి వాసును అడుగు తుంది. "అవును అత్తా! పక్కింటి మురుగేశన్ వాళ్ళు ఆ టామీ (బొచ్చుకుక్క)ని లోపలి రానివ్వటము లేదు". అదేమో గేటు దగ్గర కుయ్యో మొర్రో అంటూ ఉంటుంది. పైపెచ్చు రాళ్లతో కొడుతూ ఉన్నారు. "మనింటికి తెద్దాము" అంటే నాయనమ్మ ఒప్పుకోదు. "ఇన్నాళ్లు పెంచి,ఇప్పుడు నోరులేని జీవాన్ని తరిమేస్తున్నారు అని పోలీసులకు చెపుతాను" అని ఆవేశముగా వాసు అంటాడు.

మురుగేశన్ ఇంట్లో కాపలా కుక్క ఈ బొచ్చు కుక్క రెండూ ఉన్నాయి. రోజూ సాయంత్రము ఆ బొచ్చు కుక్క టామీ ని వెంట బెట్టుకొని షికారుకు వెళ్ళేవాడు. ప్రస్తుతము ఆ కుక్క పెద్దది అయి పోయిందని, తిండి దండగ అని బయటకు గెంటేశారు. ఇది తెలియని టామీ గేటు దగ్గర అరుస్తూ (ఏడుస్తూ) ఉంది. ఇదంతా గమనిస్తున్న వాసుకు టామీ కి సహాయము చేయాలని దృఢసంకల్పంతో ఉన్నాడు. ఆ విషయములో మేనత్తను సహాయము, సలహా అడుగుతున్నాడు వాడికి తట్టిన ఆలోచన పోలీసు సహాయము ప్రక్కవాడి గోడు పట్టించుకోని నేటి సమాజములో తన మేనల్లుడు కుక్కపట్ల చూపించే జాలికి సుమతి ఏంతో సంతోషించింది. "అత్తా పోలీసులు వచ్చి మురుగేశన్ కు బుద్ధి చెప్పి, పాపము కుక్కను రక్షించరా?" అని అమాయకంగా అడుగుతాడు. పదేళ్ల వాసు దృష్టిలో ప్రాణులు అన్నీ ఒక్కటే. పెంచుకుంటున్న "మురుగేశన్ కి ఇష్టము లేదు. అందుచేత టామీని తరిమేశాడు. అది పోలీస్ కేస్ క్రిందకు రాదు" అని సుమతి అంటే, వాసు "రేపు మురుగేశన్ ముసలివాడు అయితే వాళ్ళ పిల్లలు ఇంట్లోనించి తరిమేస్తారా?" అని లాజికల్ గా అడుగు తాడు. చివరకు అర్గ్యుమెంట్ల తరువాత సుమతి "ఫోన్ చేస్తే ఉపయోగము ఉండదు గానీ, నీవు నీ స్నేహితులు నేరుగా పోలీస్ స్టేషన్ కు వెళ్లి అక్కడ ఇన్స్పెక్టర్ కి అంతా వివరముగా చెప్పండి. ఆయన సహాయము చెయ్యక పోయినా, జీవకారుణ్యసంఘానికి చెప్పి సహాయము జరిగేటట్లు చూస్తాడు." అని సుమతి సలహా ఇచ్చింది. టెలిఫోన్ డైరెక్టరీ చూసి జీవకారుణ్య సంఘము ఆఫీసు అడ్రెస్, ఫోన్ నంబర్ చూసి, వాసు వాడి ఫ్రెండ్స్ పోలీసు స్టేషన్కి వెళ్లి, అక్కడినుండి జీవకారుణ్య సంఘము ఆఫీస్ కు వెళ్లి వారితో జరిగిన వృత్తాంతాన్ని అంతా పూసగుచ్చి నట్లు చెప్పారు. ఆ రోజు ఆదివారము అయినా, జీవ కారుణ్యము సంఘము వారు పోలీసులను వెంట బెట్టుకుని వాసు, వాడి మిత్రబృందంతో మురుగేశన్ ఇంటికి వచ్చారు. ఊహించిన ఈ పరిణామానికి మురుగేశన్ ఖంగు తిన్నాడు.

జీవకారుణ్యము సంఘం వారు "ఏ ప్రాణి నైనా హింసిస్తే, అపరాధరుసుము, జైలు శిక్ష ఉంటుంది" అని మురుగేశన్‌కు వార్నింగ్ ఇస్తారు. "మీరు ఇన్నాళ్లు పెంచుకున్న కుక్కను ఇలా గెంటి వేయటం న్యాయ సమ్మతము కాదు. మీరు పోషించలేకపోతే మాకు నెలకు వందరూపాయల చొప్పున ఇస్తే మా జీవకారుణ్య సంఘము వారే ఆ కుక్కను బ్రతికి ఉన్నంత కాలము పోషిస్తాము" అని చెప్పి మురుగేశన్ ను ఒప్పిస్తారు. గేటు తీయగానే టామీ లోపలికి మురుగేశన్ దగ్గరకు వచ్చి ప్రేమగా చుట్టూ తిరుగుతుంది. "కుక్కకు ఉన్న ప్రేమ విశ్వాసము చూడండి. మీరు అన్నము పెట్టకపోయినా, రాళ్లు వేసినా, ఎంత ప్రేమ విశ్వాసము చూపిస్తుందో!" అని పోలీస్ అంటాడు. టామీ కళ్ళలోని విశ్వాసాన్ని, ప్రేమను చుసిన మురుగేశన్, మొదటిసారిగా తానూ మనిషిగా పుట్టినందుకు, టామీని నిరాదరణగా చూచి నందుకు సిగ్గుపడి, టామీని దగ్గరకు తీసుకుంటాడు.కథ సుఖాంతం అయింది. వాసు మరియు అతని మిత్ర బృందం, వాళ్ళు సాధించిన ఘన విజయానికి సంతోషిస్తూ, వాళ్ళ ఇళ్లకు వెళ్లారు.వాసు ఇంటికి వెళ్లి,వాళ్ళ మేనత్త సుమతి ముందు కాలర్ ఎగరేసాడు.

తెలుగు ప్రమదల హృదయ నేత్రి - మాలతీ చందూర్

జగతి పత్రిక సంపాదకులుగా ఎన్.ఆర్.చందూర్, రచయిత్రిగా మాలతీ చందూర్ మద్రాసు మహానగరంలో

తెలుగు సాహిత్యం, సంస్కృతి, సామాజిక జీవితానికి దీపస్తంభాలుగా సుదీర్ఘకాలం వెలిగారు. చెన్నపట్నంలో తెలుగు సాహితీ సంస్థలకూ,సామాజిక ప్రముఖులకూ పెద్ద దిక్కుగా నిలిచారు. సంతానం లేని ఈ దంపతులు రచనలే తమ సంతానంగా, సాహితీ ప్రియులే బంధువులుగా గడిపారు.

సాహితీ వ్యాసంగానికి పునాది

1930లో కృష్ణాజిల్లా నూజివీడులో మాలతి జన్మించారు. తల్లితండ్రులైన జ్ఞానాంబ, వెంకటేశ్వర్ల ఆరుగురు సంతానంలో ఆమె చివరి వ్యక్తి. ఆమెకు ముగ్గురు అన్నయ్యలు, ఇద్దరు అక్కలు. సోదరులందరూ మరణించగా, పెద్దక్క సీతాబాయి హైదరాబాద్ లో నివసిస్తున్నారు. మద్రాసులో ఉపాధ్యాయురాలిగా పనిచేసిన రెండో అక్క శారదాంబ దీర్ఘకాలంగా అక్కడే మాలతీ చందూర్ దంపతులతోనే ఉంటున్నారు. తోడబుట్టిన వారందరికీ చిన్నదైన మాలతి అంటే ఎంతో ప్రేమ, అనురాగం. బాల్యమంతా ఎక్కువభాగం నూజివీడులోనే గడిపిన మాలతి ఎనిమిదో తరగతి వరకు అక్కడే ఎస్.ఆర్.ఆర్. ప్రాథమిక పాఠశాలలో చదివారు. ఆ తరువాత మేనమామ అయిన ఎన్.ఆర్. చందూర్ ఇంట్లో ఏలూరులో ఉండి, అక్కడ వల్లూరి సెయింట్ థెరెస్సా పాఠశాలలో ఇంగ్లీషు మీడియమ్ లో చదువుకున్నారు. తరువాతి కాలంలో మేనమామనే వివాహం చేసుకున్నారు. చదువు పూర్తికాకుండానే పెళ్ళవడం వల్ల మాలతి ప్రైవేటుగా ఎస్.ఎస్.ఎల్.సి. పూర్తి చేశారు. ఎన్.ఆర్. చందూర్ గారు స్వతహాగా కథా రచయిత. కథావీధి తదితర పత్రికలను నడిపిన చందూర్ సాహచర్యంలో మాలతి సాహితీ వ్యాసంగం వికసించి, విస్తరించింది. అక్కడే ఆనాటి సాహితీ దిగ్గజాలను ఎందరినో దగ్గర నుంచి ఆమె చూశారు. 1947లో మద్రాసుకు వచ్చిన ఈ జంట అప్పటి నుంచి ఆ నగరాన్నే తమ స్థిరనివాసం చేసుకున్నారు.

మాలతీచందూర్ గారి కథారచనలలో మనుషుల మనస్తత్వ చిత్రణ మరియు చాటిన జీవనసత్యాలు

జీవితపు విలువ కథలో జీవితపు విలువ నెలకు డెబ్భయి రూపాయలు అంటూ గారాబంగా పెరిగిన డిప్యూటీ కలెక్టర్ కూతురు,ఐదు వందల రూపాయల జీతగాడికి భార్య అయిన జయ మతకలహాల్లో భర్త, పాముకాటుకు తండ్రి చనిపోతే జయ బ్రతుకుతుంది. చావదు. తనకోసం తను బ్రతుకుతుంది. నెమ్మది నెమ్మదిగా బి.ఈ.డి. కూడా అవుతుంది అని కథను ముగిస్తూ స్త్రీ సాధికారతను ఆ కాలంలోనే చాటారు మాలతీచందూర్

నాన్న కథలో విశ్వపిత గా వర్ణిస్తూ,తాను ప్రేమించిన జానకిని పెళ్ళైనా ప్రేమిస్తూ, విధవరాలైన ఆమె కొడుకుని లోకం మాటలకు జడవకుండా పెంచిన తండ్రి ఔన్నత్యాన్ని చాటారు. పెళ్లికాకముందు జానకి హేళన చేసినందువల్ల తన ఎడమచేతి ఆరో వేలుని కోసుకుని, సెప్టిక్ అయితే, మణికట్టు దాకా తొలగించిన విషయాన్ని అతని స్నేహితుడు చెప్పేదాకా తెలియనివ్వకుండా ఉంచడం. ప్రేమ వ్యవహారంలో పడి ఐ. ఎ. ఎస్. పరీక్షకు వెళ్లనని మొండికేస్తున్న కొడుకుకి చెప్పడం. కథనం ఎంతో బాగుంటుంది. తన కొడుకు కాకపోయినా, తాను ప్రాణప్రదంగా ప్రేమించిన జానకి కొడుకు కోసం అతని తాపత్రయం హృదయాన్ని ద్రవింపజేస్తుంది. తన ప్రియురాలు దూరమైతే, యాసిడ్ దాడులు చేసే ఈ కాలపు యువత తప్పక చదవాల్సిన కథ ఇది.

డాబా ఇల్లు కథలో ఒక్కో ఇటుక పేర్చి, స్వయంగా కట్టుకున్న ఇంటికై షావుకారు దగ్గర అప్పు చేసిన పేద దంపతులు..అతనికి కాలుకు దెబ్బ తగిలి, కట్టలేకపోయిన మూడు నెలల వాయిదా వల్ల ఇంటి తాకట్టు వాకట్టు అయి,షావుకారు జప్తు చేసుకుంటే, కూలిపోయిన అతని కలల మేడ, ఆ మేడ గోడపై మేకులు కొట్టవద్దంటూ అతను చూపిన మమకారం ఎంతో హృద్యంగా,ఆర్ద్రంగా చిత్రించారు మాలతీచందూర్ ఇటువంటి ఎంతోమంది పేదల కష్టాలను, ఇటీవల లిహైడ్రాలి వారు కూల్చేస్తున్న పేదవారి కట్టడాలను కళ్ళకు కడుతుంది ఈ కథ.

షణ్ముగం కథలో తమిళం యాస కలిసిన పల్లెటూరి భాషలో ఆమె అమాయకత్వాన్ని, సహజత్వాన్ని.. మాధవి వంటి ఆధునిక మహిళల చిన్నచూపు ఆలోచనలను,

కథానాయకుని పేదపిల్లకు సహాయం ముసుగులోని అతని ద్వంద్వ ప్రవృత్తిని మనకు తేటతెల్లం చేస్తారు.

వారి సఖి కథలో కథానాయకుడు, ఒకప్పటి తాను ప్రేమించిన సఖి సుగుణను తన అర్ధాంగి వద్ద పదే, పదే పొగుడుతూ ఉన్నప్పుడు, ఆమె పడే మానసిక వేదనను తెలియజేస్తూ,అటువంటి ఎంతోమంది మహిళల వ్యధను మనకు గుర్తు చేస్తారు.అంతేకాక,వారి ఇంటికి భర్త ఆజ్ఞపై వెళ్ళినప్పుడు,ఆ మహిళ భర్త తన కొంగు పుచ్చుకున్న విషయాన్ని భర్తకు చెప్పి, మళ్లీ ఆ సుగుణ మాటెత్తకుండా నోరు మూయించడం.. చక్కని గుణపాఠం తన భర్తకు నేర్పడం చాలా బాగుంటుంది. మగవారి చేతిలో బాధలు పడే మహిళలు నేర్చుకోవాల్సిన విషయమిది.

లగ్నబలిమి కథలో ఇరువురు కథానాయకులలో నాయిక ఎవరివైపు మొగ్గుచూపుతుందోనని ఉత్కంఠను రేపుతూ.. పురుషుడు ప్రతి స్త్రీ వద్దా తన అంతరంగిక ప్రేమలు చెప్తాడా ఏమిటి? ప్రకృతి నేర్పుతుంది. పద్ధేనిమిది పైబడ్డ మగవాడికి ప్రేమించడమనేది ప్రకృతి నేర్పుతుంది. ప్రేమ లేకుండా ఉండడం అసంభవం.నిన్ను చూసేదాకా ప్రవరాఖ్యుడిలా మడికట్టుకు కూర్చున్నవాడు, నీ దగ్గరకొచ్చినా నువ్వు అతన్ని ప్రేమించలేవు అన్న ఒక్క సంభాషణతో తనను మొదటిసారి ప్రేమించే మగవాడి కోసం ఎదురుచూస్తున్న ఊగిసలాటకు తెరదించుతూ, ఆడవారి, మగవారి మనస్తత్వాలను మనకు తెలియ జేస్తారు.

కాంతమ్మ రెండో కూతురు కథలో.. అక్క చదువు ధ్యాసలో పడి, భర్తను పట్టించుకోకపోతే, చెల్లి బావకు దగ్గరై, గర్భవతి అవుతుంది. తన ఇద్దరి కూతుళ్ళ భవిష్యత్తు గురించి తపన పడే తల్లి మనోవ్యధను ఎంతో బాగా ఈ కథనంలో తెలిపారు మాలతీచందూర్

ఏనాటి జగన్నాథ్ కథలో, తన కొడుకు చిట్టి తనను వదిలి హాస్టల్ కి వెళుతూ, తనను పట్టించుకోకుండా ఇంజన్ ను పసిచాపల్యంతో చూస్తున్నప్పుడు,తాను అదే వయసులో ఉన్నప్పుడు అక్క ఇంటిలో పరిచయమైన జగన్నాథ్ తనపై పెంచుకున్న ప్రేమను, తన జడలో గుచ్చుతున్న బంగారపు నారు పోసిన స్ప్రింగ్ చేమంతి పువ్వును పట్టించుకోకుండా, అతను తెచ్చే యాపిల్స్, బిస్కెట్ లు, జాంకాయలనే చూసి సంతోషిస్తూ,తనను విడిచి వెళ్ళేటప్పుడు ఏడుస్తున్న అతనిని అక్కకు చూపించడం వంటి బాల్యచేష్టలను గుర్తుకు తెచ్చు కుంటుంది. మనం కూడా అంతే కదా.. చిన్నతనంలో జరిగిన విషయాలను గుర్తు చేసుకుంటూ...అప్పుడలా ఎందుకు ప్రవర్తించానో అనుకుంటూ ఉంటాం. అప్పుటి వయసు, జీవితానుభవం లేని పసితనం అలాంటివని ఈ కథ ద్వారా తెలియజేసారు.

రక్షించా కథలో నిష్కాగరిష్టుడైన తండ్రి,తల్లి రోగచికిత్స కోసం పట్నం వెళ్లి, వ్యసనాలతో నైతికంగా పతన మవుతుంటే చూస్తూ బాధపడే కొడుకు ఆవేదనను కళ్ళకు కడుతూ, ఆ ప్రభావం కొడుకుపై చెడుదారిలో వెళ్లేలా ఎలా ప్రోత్సహించిందో కథనంలో చూపుతారు.చివరకు తండ్రి పెళ్లి చేసుకున్న జానకి, తన సమవయస్కురాలు, అయిన ఆమెతో మోహంలో పడి, గర్భవతి అయిందని తెలిసి,మందు మింగించి, ఆమె మరణానికి కారణ భూతుడవుతాడు. మూడేళ్ళ జైలుశిక్షకు పాత్రుడౌతాడు. తీపిలో వగరుంటుంది. నీలాంటి యువకుడు పిరికి తనంతో పారిపోకూడదు అంటూ బోధించిన లాయర్ స్నేహితుడు రామని తాను రక్షించానని చెపుతాడు. స్త్రీ పురుషునిలా గాలిలో స్వేచ్ఛగా ఎగురలేదు. ఎగిరినా... ప్రకృతి స్త్రీని కఠినంగా శిక్షిస్తుంది అంటూ జానకి మాటల్లో జీవితసత్యాలను చాటి చెపుతారు.

అక్క కథలో తాను ప్రేమించిన క్లాస్మేట్ జోగారావును కాక, తండ్రి చూసిన ఫారెస్ట్ ఆఫీసర్ ని పెళ్లి చేసుకున్న విధికి తలవంచిన బుద్ధిమంతురాలులి అని నిర్వచిస్తారు. ఫారెస్ట్ ఆఫీసర్ తనను పెళ్లి చేసుకోలేదన్న అసూయతో, అత్త కూతురు సుశీ జగ్గరావుకు పెళ్లి అయిందని అబద్ధం చెబుతుంది. తన ఇంటికి జగ్గరావును, అక్కను పిలిచి, అవమానిస్తుంది. కానీ అక్క సుశీ వాళ్ళమ్మకి(అత్త) సంయమనంతో సమాధానమిస్తుంది. జరిగిన సంఘటన గురించి బాధపడుతున్న అక్కను ఓదారుస్తూ, ఆమె చెల్లి అవమానాలు భరించాలి. మనం ఆడవాళ్ళం. భూదేవి లాంటివాళ్ళం అంటుంది. ఆడవారి జీవితాల గురించి,

ప్రేమించిన హృదయాల త్యాగం గురించి ఈ ఒక్క వాక్యంలో తేల్చి చెబుతారు మాలతీచందూర్.

అచ్యుతం కథలో ప్రస్తుతం డాక్టర్ భార్య అయిన రాధ, తనను ప్రేమించిన అన్నయ్య స్నేహితుడు, చివరి దశలో తన వద్దకు వచ్చి, తన చేతిలోనే కన్ను మూయడం విషాదాంత కథనం. స్త్రీకి వివాహంతో బాల్యం అంతర్ధాన మవుతుంది. ఈ మొగాళ్ళు ఇంద్రజాలికులు. ఇన్నాళ్ళలో నిన్ను చూడటానికి రానివాడు, ఇప్పుడు తన స్వార్థం కోసం ఈ దశలో వచ్చి, నిన్ను మాయ చేస్తున్నాడులి అంటూ తన స్నేహితురాలు ఎంతగా చెప్పినా,రాధ అతనిని ఆదరించి, తన నిర్మల ప్రేమను చాటుకుంటుంది. కొంతవరకూ దేవదాసు ప్రేమకథను గుర్తుకు తెస్తుంది ఈ కథ. ఆ కాలంలోని ఆడవారి,మగవారి మనస్తత్వాలను, ప్రేమను, త్యాగాలను, ధైర్యాన్ని, విధికి తలవంచే పరిస్థితులను, సమాజ కట్టుబాట్లలో నలిగే స్త్రీల అంతరంగ ఆవేదనను తన కథలలో చిత్రించారు మాలతీచందూర్. అంతేకాక, ఆడవారి సాధికారతను, లేడీస్ క్లబ్బుల్లో ధనవంతులైన ఆడవారి ప్రవర్తనను, తోటి స్త్రీలపై ఆడవారు చూపే ఈర్ష్యాసూయలను కూడా సందర్భానుసారంగా తన కథలలో చేర్చారు.

ఆధార గ్రంథాలు :

1) నెచ్చెలి అంతర్జాల పత్రిక
2) మాలతీచందూర్ గారి కథలు
3) అంతర్జాలంలోని సమాచార సేకరణ

★★★

Vol. 23 | Spl. Issue 03 | March 2026 | BHAVAVEENA | ISSN No. : 2456-4702 | RNI No. APTEL/2003/12253

RNI No. APTEL/2003/12253 | Reffered Journal & Peer Reviewed Journals | ISSN No. 2456-4702

భావవీణ

కళలు, సాహిత్య, సాంస్కృతిక భాషాధ్యయన పత్రిక

BHAVA VEENA

Journal of Arts, Literary, Culture & Language Study

భావకవిత్వంలో స్త్రీకి జరిగిన అన్యాయంపై జయప్రభ గారి అభిప్రాయం

- మూడుగుల శ్రీనివాస్

పరిశోధక విద్యార్థి, నురవరం ప్రతాప రెడ్డి తెలుగు విశ్వవిద్యాలయం.

పరిచయం :

జయప్రభ గారు 1957 జూలై 29న భారతదేశంలోని నాగపూర్(మహారాష్ట్ర)లో జన్మించారు. తరువాత జయప్రభ గారు తెలుగు సాహిత్యంలో మాస్టర్స్ (ఎం.ఎ) చదివారు. తెలుగు సాహిత్యంలో గాఢమైన సంబంధం ఏర్పరుచుకొని ప్రముఖ తెలుగు కవయిత్రిగా ఎదిగారు. మళ్ళీ అది కాకుండ థియేటర్ ఆర్ట్స్‌లో (ఎం.ఎ) కూడా పూర్తి చేసి తరువాత హైదరాబాద్‌లోని ఉస్మానియా విశ్వ విద్యాలయంలో తెలుగు నాటక సాహిత్యంపై పిచ్.డి పట్టా పొందారు. మరి ముఖ్యంగా జయప్రభగారు తెలుగులో భావకవిత్వంలో స్త్రీ అనే అంశంపై ఎం.ఫిల్ పూర్తి చేశారు. ముందునుంచి జయప్రభగారికి కవిత్వంలో స్త్రీని పరిశీలించాలని కుతూహలం ఉండేది.

ఎం.ఫిల్ కోసం ఏ విషయం మీద పరిశోధన చెద్దామా అని తర్జనభర్జన పడుతూండగా, కవిత్వంలో స్త్రీ గురించి చేదామన్న ఆలోచన వచ్చింది. భావకవిత్వాన్ని జయప్రభ గారు చదివినప్పుడు, ఆమెకు కన్పించిన భావ కవుల స్త్రీ దృక్పథాన్ని ప్రతి యుగంలో జరిగిన స్త్రీ పై జరిగిన అన్యాయాన్ని జయప్రభగారు ఈ విధంగా చెప్పారు. 20వ శతాబ్దపు ప్రారంభంలో అంటే 1910లో తొలిసారిగా తెలుగు సాహిత్యంలో సంప్రదాయ ప్రబంధ కవితా ధోరణిపై తిరుగుబాటుగా వచ్చిన కవిత్వం - భావ కవిత్వం

నిర్వచనం :

కవి యొక్క ఒక అవిస్పష్ట వాంఛకుంరము. ఒక అంతర్నిగూఢ తాపము ఒక చిన్న కావ్యములో ఊద బడితే అది భావ కవిత్వం - విశ్వనాథ సత్యనారయణ భావ ప్రధాన కవిత్వం భావ కవిత్వం - ఇంద్రగంటి హనుమచ్ఛాస్త్రి తెలుగు సాహిత్యంలో మొదటిసారిగా ఆడదానిపట్ల ఆదర్శ ప్రేమని రాసిన ఈ భావుకవులంతా తమ మనసుల్లో ఆడదాని గురించి అదివరకే బలపడి పోయిన పాతభావల నుంచి బయటపడలేక, తమ కాలంలో కొత్తగా వచ్చిన ప్రేమతో కవిత్వం రాయాలని సరదాపడి భావకవిత్వం రాసేరు. అందుకే పాత భావాలే ప్రేమ బురధతో మళ్ళీ రాయబడ్డాయి భావకవిత్వంలో.

ప్రాచీన సాహిత్యంలో స్త్రీ గురించి జయప్రభ గారి అభిప్రాయం :

సమాజంలో స్త్రీ అనే ఆలోచనకి ఒక స్పష్టమైన, క్లిష్టమైన వ్యవస్థ ఉంది. ఈ ఆలోచన ఏర్పడిన తీరులో అనేక సామాజిక, ఆర్థిక పరిస్థితుల పాత్ర ఉంది. ఆ పాత్రలో సాహిత్యానికి ఒక ప్రత్యేకమైన ప్రాధన్యం ఉంది.

భావ కవిత్వ యుగం ఆకస్మాత్తుగా మొదలయింది కాదు. దానికి నేపధ్యంగా పురాణయుగం, ప్రబంధయుగం ఉన్నాయి. భావ కవిత్వ యుగంలో ఈ పూర్వ యుగాల

ప్రభావం పరోక్షంగానే కాకుండా, ప్రత్యక్షంగా కూడా ఉంది. క్రీ॥శ॥ 11వ శతాబ్దిలో నన్నయ్య భారతాంధ్రీకరణతో తెలుగులో లిఖితపూర్వకమైన సాహిత్య రచన మొదటి సారిగా, మనకు లభిస్తోంది. నన్నయ్య ప్రారంభించిన భారతాంధ్రీకరణని అటు తరువాత తిక్కన, ఎఱ్ఱనలు పూర్తి చేసారు. మొత్తంగా కవిత్రయం వారి భారత రచనను పరిశీలించినపుడు, వారు స్త్రీ పాత్రల పట్ల సానుభూతితో రచన చేసినట్లుగా కన్పిస్తుంది. భారతంలో స్త్రీ పాత్రలన్నీ కూడా వారి వారి ప్రత్యేక మనస్తత్వంతో, వ్యక్తిత్వంతో ప్రకాశించాయి. ద్రౌపది, అంబ, కుంతి, గాంధారి, శకుంతల, దమయంతి, దేవయాని ఇలా ఏ స్త్రీ పాత్ర అయినా తమ ప్రత్యేకతను ప్రదర్శిస్తాయి. అయితే స్త్రీ పాత్రల పట్ల వర్ణనాసక్తితో రచన చేయటం భారత కవులలో లేకపోలేదు. వివాహ విషయంలో భారత స్త్రీలలో స్వేచ్ఛ ఉన్నట్లుగా కన్పిస్తుంది. దేవయాని తన ఇష్టం మీద యయాతిని కోరి వివాహం చేసుకుంటుంది. హిడింబి భీముని వరిస్తుంది. ఉలూచి అర్జునుని పెళ్ళాడుతుంది. అలాగే తనని వదలి వెళ్ళిన నలుని జాడ తెలుసుకోవడం కోసం దమయంతి ద్వితీయ స్వయంవరానికి సిద్ధపడుతుంది. అయితే స్వయంవరం జరిగిన అన్ని చోట్లా స్త్రీ ఇష్టంమీద మాత్రమే వివాహం జరిగిందనటానికి వీలు లేదు. యుద్ధాలలో, సంధి ప్రయత్నాలలో వివాహం అనేది కూడా ఒప్పందంగా ఉండేది. ఓడిన వారి స్త్రీలు గెలిచిన వారి స్వాధీనమవటం జరిగేది. భారతంలోని స్త్రీలు విడివిడిగా తమ ప్రత్యేక వ్యక్తిత్వాలతో ప్రవర్తించినా వారంతా పతివ్రతలుగా కనబడటంలో మాత్రం ఏకత్వాన్ని కనబరచేలా రచించారు కవిత్రయం. విరి రచనలో చాలాచోట్ల పతివ్రతా ధర్మాన్ని గురించిన చర్చ ప్రత్యేకంగా, కన్పిస్తూ ఉంటుంది. ప్రత్యేకించి స్త్రీ పాత్రల ద్వారానే, ఈ దర్మ ప్రచారం చేయబడటం గమనించదగినది. భారతంలోని ప్రధాన స్త్రీ పాత్రలన్నీ ఈ ధర్మానికి ప్రతీకలుగా మలచబడ్డవే. ఎఱ్ఱన రచనలో ఎక్కువగా ఈ పాతివ్రత్య చర్చ కన్పిస్తుంది. ద్రౌపది, సత్యభామకు పతివ్రతా ధర్మాలు చెబుతుంది. మార్కండేయుడు ధర్మరాజుకి పతివ్రతా మహాత్మ్యం చెప్పిండు. తిక్కన రచనలో కూడా పార్వతి శివునికి ఈ ధర్మాలన్నీ చెబుతుంది. కవిత్రయం వారు స్త్రీ సౌందర్యాన్ని అంగాంగ చిత్రణతో కాక ఆమె ముఖ వర్చస్సుతో వర్ణించారు. నన్నయ్య శకుంతలని పయోజ దళాయతాక్షి గాను, సంకుల మిళితాళినీల సరికుంచిత కోమలకుంతల గాను వర్ణిస్తాడు.

కావ్యయుగం-స్త్రీల పై జయప్రభ గారి ఆలోచన విధానం:

కవిత్రయ యుగాన్ని దాటి కావ్యయుగానికి వచ్చేసరికి స్త్రీపట్ల దృక్పథంలో మార్పు వచ్చింది. ప్రబంధ కాలంలో ఎక్కువైపోయిన స్త్రీ అంగాంగ వర్ణనలకి కావ్యయుగంలోని కవులే నాంది పలికారు. శ్రీనాథుని శృంగార నైషధంలో హంస నలునికి దమయంతిని గురించి చెబుతూ "హాటక కలశంబుకును బాటియగు వదూటి, మెఱుగు బాలిండ్లు అంటూ దమయంతీ శరీర వర్ణన చేస్తుంది. శ్రీనాథుని దగ్గరకు వచ్చేసరికి స్త్రీ ముగ్ధగా, బేలగా మారిపోయింది. ఈ యుగానికి వచ్చేటప్పటికి స్త్రీని వర్ణించే సందర్భంలో ఆమె దేవతా స్త్రీ అయినా, మానవకాంత అయినా చివరికి సాక్షత్తు శ్రీ మహాలక్ష్మీ అయినా సరే కవుల వర్ణనలో ఆమె శరీరం మాత్రమే కొలవబడుతుంది.

ప్రబంధ యుగంలో స్త్రీ పై జయప్రభ గారి వైఖరి :

ప్రబంధ యుగానికి వచ్చేటప్పటికి ఈ కవులంతా స్త్రీని వర్ణించవలసివచ్చినప్పుడు ఆమె దేవతా స్వరూపిణి అయినా, రాజకాంత అయినా, కాపు పడతి అయినా, వెశ్య అయినా అంగాంగ వర్ణన చేయటంలో మాత్రం ఏ భేదమూ పాటించలేదు. పెద్దన దగ్గర నుంచి తెనాలి గారి వరకు అంతే ఉంది. ప్రబంధ కాలంనాటి సమాజంలో స్త్రీ కేవలం భోగవస్తువుగా మాత్రమే చూడ బడింది. బానిసలాగ ధనమిచ్చి కొనుక్కోబడింది అని తెలుస్తుంది. నాయక రాజుల కాలంలో యుద్ధాలు, కరువు కాటకాలు, అసమర్థులైన రాజు పాలన మూలంగా సమాజంలో ఒక అస్తవ్యస్త పరిస్థితి ఏర్పడింది. స్త్రీలకు సాంఘీక భద్రత కరువైంది.

ఆంగ్ల కాల్పనిక కవిత్వంలో స్త్రీ జయప్రభ గారి మాటలు:

ఫ్రెంచి విప్లవం యొక్క ప్రభావము, పారిశ్రామిక విప్లవం యొక్క పరిణామము, వాల్టేర్, రూసోల తాత్విక

బోధనలు కలిసి ఆనాటి ఆంగ్ల కవులపై తమ ప్రభావాన్ని చూపాయి. వీటి ప్రేరణతో స్వేచ్ఛ, సమానత్వము, సౌభ్రాతృత్వము ప్రాతిపదికగా ఆంగ్ల సాహిత్యంలో ఉద్భవించినదే కాల్పనిక కవిత్వం.

ఆంగ్ల కాల్పనిక కవులుగా పేరుపొందిన విలియమ్ వర్డ్‌వర్త్, శామ్యూల్ టేలర్ కాలరిడ్జ్. లార్డ్ బైరన్, పి.బి.షెల్లీ, జాన్‌కీట్స్‌ల కవిత్వంలోని స్త్రీని చాలా అద్భుతంగా వర్ణించారు. దానిలో ఒకటి వర్డ్‌వర్త్ లిరికల్ బాలడ్స్‌లో ద్రిమరియైన స్త్రీ కథని చెప్తాడు. ఇందులో నాయిక జాలరి బిడ్డ ఆవిడ ఆత్మకథ గురించి చెప్తాడు. ఈ కథలో ఆమె ఆకలితో ప్రకృతిలో కలిసిపోతుంది. కవి ఈ కావ్యానికి ముగింపుగా ఈవిధంగా అంటాడు. ''ఏడుస్తూ ముఖం తిప్పేసుకుంది. బహుశా తన కథ అయిపోయిందేమో, కన్నీరు తప్ప కథ లేదేమో అని అన్నాడంలో ఆ స్త్రీ పడిన మనోవేదన, ఆకలి కళ్ళకు కని పించినట్లుగా చెప్పాడు''. ఇలా ఆంగ్ల కాల్పనిక కవిత్వంలో స్త్రీ సమాజంలోని పలువర్గాల నుంచీ తీసుకోబడింది. ఆంగ్ల కవులకి కాల్పనిక దృక్పథ మున్న ప్పటికీ స్త్రీని చిత్రించేటప్పుడు కేవలం ప్రణయభావన మాత్రమే లేదు. అన్ని కోణాలలో చూపించారు.

ఆధునిక యుగంలో స్త్రీ జయప్రభగారి వైఖరి :

స్త్రీ పట్ల ప్రేమ అనే ఒక కొత్త భావనను చూపించిన భావకవుల రచనలని, వారి కవిత్వంలోని స్త్రీని దర్శించటానికి ముందు, భావకవుల మధ్యలో ఇమడని గురజాడనీ, భావకవితాయుగ ప్రారంభంలోని వాడే అయినప్పటికి కాల్పనికతతో కాక వాస్తవికతతో స్త్రీని చిత్రించిన ఆయన ముత్యాల సరాలని చెప్పుకోవచ్చు. స్త్రీ ని సమదృష్టితో చూసిన వాడు మాత్రం గురుజాడనే. నగలు, బంగారము మాత్రమే ప్రేమకు గుర్తని తలచే పాతకాలపు ఇల్లాలిలో నిజమైన ప్రేమతత్వం ఉంటుంది అని గురుజాడ గారు భార్యాభర్తల మధ్య ముందు కాలం కవులు కనీసంగా నైనా ఊహించని స్నేహానికి ప్రాముఖ్యత నిచ్చాడు. ''మగడు వేల్పన పాతమాటది ప్రాణ మిత్రుడ నీకు'' కళల పట్ల, జీవితం పట్ల గురజాడ అప్పారావు గారికి ఉన్న ఆదర్శం స్త్రీ పట్ల కూడా ఉంది. అది ఆయనే చెప్పుకున్నట్లుగా ఆయన కవిత్వంలో కనిపిస్తుంది. ప్రత్యేకించి బాధలకు గురి అవుతున్నా స్త్రీలను చిత్రించి గురజాడ, వారి సామాజిక స్థితిని చూపాలని, తద్వారా వారి స్థానాన్ని పైకి తీసుకురావాలని ప్రయత్నించాడు. దీనిని బట్టి గురజాడ అప్పారావు వాస్తవికవాదే అని చెప్పడంలో తప్పు కాదు..

భావకవులు వర్ణించిన ప్రేయసిని ఊహించు కోవాలంటే, ఒక మదుప్లావితగీతాన్నో, ప్రణయాలయంపు జ్యోతినో, నెలరేకనో, వెన్నెలనో, ఖేచరీ గంధర్వబాలనో, విలయసౌందర్యధాత్రినో, విశ్వగానమోహినినో, ప్రేమ జీవనవిభాత కైశికీ గీతినో, మోహినీ హాసమల్లీ ప్రపుల్ల రుచినో, శ్రీలలిత వైజయంతీ పరీమళాన్నో తొలి ప్రొద్దును నుమంచు తీవసొనవో గుర్తుచేసుకోవాలి. అంతేగాని ఆమె కంటూ ఒక రూపం ఉండదు. వాస్తవ జీవిత నుండి సమాజం నుండి, సమస్యల నుండి పలాయనగతుడైన కవి వీటిలోని వాస్తవికతను జీర్ణించుకోలేక, వీటన్నింటికీ తను అతీతుడు అనుకోని తనలో తానొక కల్పిత ప్రపంచాన్ని సృష్టించుకొని, దానికి నాయకునిగాను, తను సృష్టించుకొన్న ఊహ ప్రేయసిని నాయిక గానూ భావించు కొని చేసిన వర్ణనలే ఇవన్నీయు. ఇందులో ఆమెకు ఒక నిర్దిష్టమైన ఆకృతిగాని, వయసుగాని, పేరుకాని లేవు. అదికాక వీరు చిత్రించిన నాయికల పట్ల వీరు కన్నరిచిన ప్రణయమంతా ఏకపక్షముగా ఊహించబడినదే, ఈ కావ్యాలలోని నాయికలంతో మౌన ముద్రాంకితలే. ఊర్వశి, హృదయేశ్వరి, వత్సల, వరలక్ష్మి, వీరంతా వాస్తవ జీవితంలోంచి కవులకు ప్రేరణను ఇచ్చినావారే అని చెప్పవచు. అయినా కానీ ఆ కవుల భావనలలో కాల్పనికం గానే చెప్పబడ్డారు. కవి భావనకే ప్రాధాన్యం ఇక్కడ. భావ కవుల ప్రేయసీ సౌందర్యం కూడా ఎక్కువ భాగంకవి సమయానుకులంగా వర్ణితమైనదే అని నా అభిప్రాయం. స్త్రీ సౌందర్యమేగాని ఆమె వ్యక్తిత్వాన్ని ప్రత్యేకించి భావ కవులెవరూ బహిర్గతం చేయలేదు. అయితే స్త్రీని దర్శించేటపుడు తమ కావ్యాలలో భావకవులు కూడా ఆమెను తమసాటి మనిషిగా గుర్తించిగాని, సమాజంలోని ఆమె సమస్యలను పట్టించుకుని గాని, సమాజంలోని

ఆమె స్థానాన్ని విశ్లేంచిగాని, ఆమె యొక్క మనోభావాలకి, దృక్పథానికి విలువనిచ్చిగాని రచన చేయలేదు అని అనిపించింది. అదే విషయాన్ని ఇంకా స్పష్టంగా విశదీకరిస్తూ, వెల్చేరు నారాయణరావు గారు తమ "తెలుగులో కవితా విప్లవాల స్వరూపం"లో ఈవిధంగా చెప్పారు. "అనుభూతి ప్రధానమైన భావకవిత్వం స్త్రీ హృదయం మాత్రమే స్పృశించింది. ప్రబంధ కవిత్వానికి స్త్రీ అంటే శరీరం. భావకవిత్వానికి స్త్రీ కేవలం హృదయం. అక్కడ ఆమెకు హృదయం లేదు ఇక్కడ ఈమెకు శరీరం లేదు" అని అన్నారు. ఈ పై విధంగా జయప్రభగారు ప్రతి యుగంలో స్త్రీ యొక్క దృక్పథాని వివరించారు.

ముగింపు :

భావకవిత్వం వరకూ కవిత్వంలో చిత్రింపబడిన స్త్రీని పరిశీలిస్తే ఆమెకు అటు సమాజంలోనూ, ఇటు సాహిత్యంలోనూ సరైన గుర్తింపు ఇవ్వలేదని తెలుస్తుంది. సమాజంలో దోపిడికి గురికాబడుతున్న స్త్రీ స్థితిని సంస్కరించే ప్రయత్నం చేసింది మాత్రము శ్రీ కందుకూరి వీరేశలింగం పంతులు. అయితే ఏ ప్రయెజనాన్ని ఆశించి భావకవులు, తమ కవిత్వంలో స్త్రీ చిత్రణలో మార్పుని తీసుకువచ్చారో, ఆ ప్రయోజనం మాత్రం నెరవేరలేదు. దానికి కారణం కేవలం తమ అనుభూతులే ఆధారంగా స్త్రీని దర్శించటం చేసారు కానీ వాస్తవమైన స్త్రీని తమ కావ్యాలలో చూసించలేదు. ప్యూడల్ వ్యవస్థని దాటి రానున్న బూర్జువా సమాజానికి, అందులోని భావాలకీ దారి చూపుతూ వ్రాయబడిన భావకవిత్వం స్త్రీ యొక్క స్థానాన్ని కూడా ఆ దృక్పథంతోనే చిత్రించింది. ఇంకా ఎక్కడో గద్దర్, శివసాగర్ వంటి విప్లవ కవుల పాటలు తప్పించి, స్త్రీ జాగృతం చేయగల కవిత్వం రావటం లేదు. ఆధునిక కవిత్వంలో కొన్ని కవితా ఖండికలు స్త్రీ సమస్యల మీద వచ్చినవి ఉన్నాయి. కానీ అవి సంఖ్యలో చాలా తక్కువ. స్త్రీ పరిస్థితి ఈనాటికీ అట్టడుగునే ఉంది. ఈనాటికీ కన్యాశుల్కం పోయినా వరకట్నం ఆమెను బాదిస్తూనే ఉంది. ఆమెను ప్రబంధ కవిత్వంలో కన్నా హీనంగా సినిమాలలో ప్రదర్శిస్తున్నారు. ఇప్పటికీ స్త్రీకి ఆత్మవిశ్వాసాన్ని కల్గించి, మార్గ నిర్దేశం చేయగల రచనలు ఎక్కువగా రావటం లేదు. ఆమెను ఇంకా అబలగాను, పతివ్రతగానూ చిత్రీకరిస్తూ సాహిత్యము, సినిమాలు వస్తూనే ఉన్నాయి. సాంప్రదాయిక పరిధిలోనుంచి చూసేది కాక, సామాజిక దృక్పథంతో స్త్రీ సమస్యని విశ్లేషించ గలగాలి. ఆ కారణాలను, దానికి పరిష్కారాలను ఆమెకు కవిత్వం ద్వారానో, ఇతర సాహిత్యం ద్వారానో అందితే బాగుంటుంది. స్త్రీని ఇంకా కుటుంబ పరిధి నుంచి మాత్రమే చూసే దృష్టిని కవులు, రచయితలు మార్పు చెందితే బాగుంటుంది. ఆమెకు సమాజంలోని అన్ని రంగాలలోను సమాన అవకాశలు, స్వాతంత్ర్యము ఇవ్వాలి. ఇవన్నీ వచ్చిననాడు కానీ స్త్రీ స్థానం మారదు అనుకుంటున్నాను. అది సమాజంలోనైనా, సాహిత్యంలో నైనా. అందుకే స్త్రీ సాంఘికంగా పురోగమించటానికి వీలైన కవిత్వం ఈరోజులలో ఉన్నా స్త్రీకి రావలి అనుకుంటున్నాను. అప్పుడు మాత్రమే కవిత్వలోను, సమాజంలో, స్త్రీలకు తనదైన స్థానం లభిస్తుంది అని అనుకుంటున్నాను.

ఉపయుక్త గ్రంథాలు :

1. ఆంధ్ర మహాభారతము - సంశోధిత ప్రచురణము, ఉస్మానియా విశ్వ విద్యాలయం, హైదరాబాదు, 1972.
2. అష్టదిగ్గజములు- అష్టదిగ్గజ వర్ధంత్యుత్సవ సమితి, 1960.
3. శృంగార నైషదం - శ్రీనాధుడు.
4. గురుజాడ అప్పారావు - ముత్యాల సరాలు, ఎమ్. శేషాచలం అండ్‌కో, సికింద్రాబాదు 1972.
5. భావకవిత్వంలో స్త్రీ - జయప్రభ, చైతన్య -తేజ పబ్లికేషన్స్, మౌలాలి, హైదరాబాదు 1988.

★★★

Vol. 23 | Spl. Issue 03 | March 2026 | BHAVAVEENA | ISSN No. : 2456-4702 | RNI No. APTEL/2003/12253

RNI No. APTEL/2003/12253 | Reffered Journal & Peer Reviewed Journals | ISSN No. 2456-4702

భావవీణ

కళలు, సాహిత్య, సాంస్కృతిక భాషాధ్యయన పత్రిక

BHAVA VEENA

Journal of Arts, Literary, Culture & Language Study

శ్రీమతి హైమవతీ భీమన్న - పాలేరు నుంచి పద్మశ్రీ వరకు - మహిళా చైతన్యం

- గంటి చంద్రుశేఖర్

పొన్నమండ, రాజోలు మండలం, డా. బి ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా.

పాలేరు నుంచి పద్మ శ్రీ వరకు ఇది శ్రీమతి హైమవతీ భీమన్న రచన. భీమన్న జీవిత చరిత్ర గ్రంథం ఆవిష్కరణ మహాసభలో గ్రంథ పరిచయం చేస్తూ డాక్టర్ దివాకర్ల వెంకటావధాని ఇలా వ్యాఖ్యానించారు. పార్వతికి హైమవతీ పర్యాయ పదం అయినట్టే శివుడికి భీమన్న పర్యాయపదం. అనాడు తన సౌందర్యాన్ని వర్ణిస్తూ తన భర్త కావ్యం వ్రాసినందుకు కృతజ్ఞతగా... ఈనాడు తన భర్త జీవిత చరిత్ర ను వర్ణిస్తూ ఈ గ్రంథం వ్రాసింది హైమవతి. ఈ విధంగా తన ఋణం తీర్చుకొందన్నారు. స్వీయ చరిత్రను వ్రాయడం సర్వసాధారణ విషయం ఇందులో గొప్పతనం ఏముంది? నేటి తరం యువత ప్రశ్న! దీనికి జవాబు ఏమిటంటే పాలేరు నుంచి పద్మశ్రీ వరకూ... భీమన్న జీవిత చరిత్రను హైమవతి చాలా హృద్యంగా వ్రాసారు... మహాకవి భీమన్న చెబుతున్న సాహిత్య విశేషాలు ఆమె వింటూ కాగితాలపై వ్రాస్తూ, టేపు రికార్డ్‌లో రికార్డ్ చేస్తూ, ఆయన పుట్టిన మామిడి కుదురులో ఆణువణువునా పరిశీలిస్తూ, వారి మిత్రులను సమకాలికులను విశేషాలు అడుగుతూ, కళ్ళతో చూసినవి విన్నవి రాసినవి క్రోడికరించి... బాల కోరిక వికాస మధుకర ఉద్యోగ సంకీర్ణ నవ నవోదయ నికషోపల సంస్కృతీ విప్లవ రసా ద్వైత విద్యా విలాస గ్రంథ ప్రశంసా సర్గ లుగా వారి జీవిత క్రమాన్ని వ్రాయడం ప్రత్యేకంగా చెప్పవచ్చు.

మనిషి పెరిగే కొలదీ మనసు మొద్దు వారుతున్నది!
జాతి విరిసే కొలదీ నీతి వాడి పోతున్నది!
కనుక, ఓ కవీ!మేధావీ!జ్ఞానీ, విజ్ఞానీ!
పిరికితనం వదిలేసి, బైటకి రా!

ఇలా తన సొంత వ్యాఖ్యానాలు తో వ్రాస్తూ... 13 సర్గల్లో కూడా భీమన్న వ్రాసిన కావ్యాలు నుండి పద్యా గద్య వచన నాటకాల నుండి పద్యాలను సూక్తి విశేషాలను సందర్భను సారంగా వ్రాయడం గొప్ప విషయం.

ఉత్తమ ఉపాధ్యాయరాలు సకల కళా ప్రావీణ్యవతి, సహా ధర్మ చారిణి హైమవతీ తన భర్త పుట్టిన ఊరు మామిడి కుదురు లో ఎన్నో వ్యయ ప్రయాసలకోర్చి "పద్మభూషణ్ డాక్టర్ బోయి భీమన్న మానవ వనరుల అభివృద్ధి కేంద్రం" అనే చిరస్మరణీయ మైన భవనాన్ని రాష్ట్ర ప్రభుత్వం సహకారంతో నిర్మించారు. ఇది అసాధారణమైన విషయం... అందులో లిమహాకవి పద్మ భూషణ్ డాక్టర్ బోయి భీమన్న స్మారక గ్రంధాలయం ఏర్పాటు చేశారు. భీమన్న రచించిన ముద్రిత కావ్యాలు లోపల పుస్తక బీరువాల్లో ఉన్నై... పాఠకులు కూర్చుని చదువు కోవడానికి వీలుగా విశాలమైన హాలు.... ఆరు బయట భీమన్న కాంస్య విగ్రహం... చుట్టూరా పచ్చని పూల మొక్కల పచ్చిక ప్రాంగణం... భీమన్న మన మధ్యలో ఉన్నారనే అనిర్వచనీయమైన అనుభూతి...

ఇలాంటి సాహసోపేతమైన ఆలోచనలు ఆచరణలో పెట్టిన దాఖలాలు ఎక్కడా లేవు. ఇంత వరకూ ఏ కవి భార్య చేయలేదు కదా.

అంతేకాకుండా ఈ పద్మభూషణ్ డా. బోయి భీమన్న మానవ వనరుల అభివృద్ధి కేంద్రంలో గెయిల్ ఇండియా సంస్థ సహకారం తో గెయిల్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ స్కిల్స్, నగరం పేరుతో ఇంజినీరింగ్, డిప్లొమా, ఐ.టి.ఐ, డిగ్రీ, ఇంటర్ చదివిన యువతకు ఆటోక్యాడ్, ఇండస్ట్రియల్ ఎలక్ట్రీషియన్ మరియు వెల్డింగ్, కాల్ సెంటర్ ఎగ్జిక్యూటివ్, జనరల్ డ్యూటీ అసిస్టెంట్ (నర్సింగ్) కోర్సు లపై ఉచిత శిక్షణ నిచ్చి ఉద్యోగాలు కల్పిస్తున్నారు.

ఇక్కడ నా బలమైన ఉద్దేశ్యం ఏమిటంటే... సాహిత్యం పట్ల అభిమానం ఉంటే సరిపోదు. ఆ అభిమానాన్ని తరువాత తరాలకు అందించాలి... కవులు /కవయిత్రిలు వ్రాయగలరు. కానీ వాటిని ముద్రించ లేరు. సభల్లో ఆ కావ్య లక్ష్యాన్ని వివరించి ప్రజలకు చేరువ చెయ్యాలి. ప్రభుత్వ పాలకుల్ని మెప్పించాలి... ఇవన్నీ హైమవతి తన శాయ శక్తుల కృషి చేసి సఫళీకృతులై నారు.అందుకే ఆమె మహా సాధ్విగా చరిత్రలో ఏకైక మహిళగా నిలిచి యున్నారు.

బోయి హైమవతి జీవిత గమనం లో...ప్రతి మహిళ విజయం వెనుక పురుషుడు ఉంటాడో లేదో కానీ...! పురుషుడు ఉన్నత పురస్కారాలు సత్కారాలు వెనుక ఖచ్చితముగా స్త్రీ ఉంటుంది అనేది శ్రీమతి బోయి హైమవతి భీమన్న జీవిత గమనాన్ని పరిశీలిస్తే ఎన్నెన్నో అశ్చర్యకర సంఘటనలు మనల్ని బెరా... ఇంతటి పరిపక్వత జ్ఞానం మనోనిబ్బరం... అప్పటి కుటుంబ కట్టుబాట్లు ఆచార వ్యవహారాలు సైతం లక్ష్య సాధనలో లెక్క చేయక అంతర్వేది సముద్రతీరం దగ్గర లైట్ హౌస్ లా నిలబడి తీరు మనకు బెరా అనిపిస్తుంది. తెలుగు ప్రజలకు భీమన్న రచనలను ముద్రిస్తూ , వాటిని అందరికీ తెలిసేలా తన వంతు కృషి చేస్తున్నారు. ముఖ్యముగా భీమన్న పుట్టిన డా. బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లా మామిడికుదురులో ఆయన పేరిట నిర్మించిన మహాకవి పద్మభూషణ్ డాక్టర్ బోయి భీమన్న స్మారక గ్రంథాలయంలో వారి కావ్యాలను అందుబాటులో ఉంచుతున్నారు.

మహాకవి పద్మభూషణ్ డా. బోయి భీమన్న దళితుల కోసం వ్రాసిన కవిత్వం నన్ను ఎంతగానో ఆకట్టుకుంది. ఇందులో ప్రధానంగా వారి కవితా లక్ష్యం ఏమిటనేది ఖచ్చితంగా వ్రాసారు. ఎక్కడా డొంక తిరుగుడు ఉండదు. సమ సమాజ స్థాపనే వారి కవితల ఆశయం దళిత కవిత్వం ఆంధ్రప్రదేశ్‌లో ఓ బలమైన సాహిత్య ఉద్యమంగా కొనసాగుతూనే ఉంది. ఇది సామాజిక అసమానతల్లో మార్పుకు సాధన ప్రయత్నంగా ఆనాటి కవుల నుండి నేటి కవులు నిరంతరం కృషి చేస్తున్నారు.

ఈ నేపథ్యంలో బోయి భీమన్న కాలంలో తాను ఎదుర్కొన్న, అనుభవించిన, అనుభవాలను అక్షర రూపంలో కవితల నిప్పు రవ్వలను దళితుల హృదయల్లో రగిలించ గలిగారు.

దళిత కవిత్వం సామాన్య ప్రజల జీవితాలకు విద్య, ఆర్థిక ప్రగతి వైపు దారి చూపించాలి. జ్ఞానోదయం కలిగిం చాలి. కవిత్వం వ్రాసే కవులకు ఖచ్చితంగా కవితాలక్ష్యం ఉండి తీరాలి.పాఠకులకు స్పష్టత నివ్వాలి.ఈ విషయంలో భీమన్నకు నూరుశాతం నిబద్ధత ఉంది.

నా కవితా లక్ష్యం
చీకట్లో బ్రతికే వాళ్ళను మెప్పించడం కాదు,
వాళ్ళను తిట్టైనా, కొట్టైనా సరే
అక్కడ నుంచి లేపడం,
అరుణో దయం కేసి తరమడం
అంటూ కలం మోత మోగించారు
మహాకవి భీమన్న పాలేరు నాటకంతో

ప్రతీ ఇంట్లో చదువుకొనే వారు ఉండాలని, సమాజానికి బలమైన చైతన్య సందేశాన్ని అందించి మార్పుకు నాంది పలికారు.

పాలేరుల చేత...!?
పలకా బలపం పట్టించి
పాఠశాల బాటను నడిపించి
ప్రభుత్వ ఉద్యోగాల్ని చేపట్టించి

పాలేరు తనాన్ని రూపు మాపించి
బానిస బ్రతుకులకు బంధ విముక్తిని గావించి
పాలేరు నాటకంతో పెను సం"చలనం" సృష్టించి
పేదరికానికి ముప్పు తొలగించి
పెద్దరికానికి కనువిప్పు కలిగించి

కవి బాధ్యత ఏమిటో సమాజానికి నిరూపించి బీద ప్రజల్లో చదువు పట్ల స్ఫూర్తి రగిలించారు. అనాటి సమాజంలో సాహసోపేతమైన సాంఘిక నాటికశీ తోనే విద్యా విప్లవాన్ని, దళితుల జీవితాల్లో పెను మార్పులను తీసుకుని వచ్చారు.ఇంత కన్నా ఉదాహరణ ఏమి కావాలి మనకు. విద్యతోనే మానవుడు బలమైన ఉన్నతిని అభ్యున్నతిని ఆరోగ్యవంతమైన సమ సమాజాన్ని నిర్మించ గలడు. ఎడ్యుకేట్ అని అంబేద్కరు అన్నమాటకు అర్థం ప్రజలకు అక్షరాలు నేర్పమని కాదు. అవగాహన కలిగించ మని. ప్రపంచ దేశాల్లో ఉన్న సమస్యలన్నీ మన దేశంలో ఉన్నై. ఒక్క కుల వ్యవస్థ తప్ప. కుల వ్యవస్థ ను నిర్మూలించి దేశ సమైక్యానికీ ప్రపంచ ప్రగాతికి మార్గ దర్శకులు కావాలని, మానవ సమాజంలో దుఃఖం ఉంది. దారిద్ర్యయం ఉంది. అధర్మం ఉంది. వీటి నిర్మూలనకు కావలసింది నీతి బోధలు కాదు. నిర్మొహ మాటమైన కార్యక్రమాలు. స్వార్థ పరుల పెత్తనం నుంచి... ఓ స్వార్థ రహిత యువకులారా మీరు విడుదలై జాతిని విడిపించండని భీమన్న కోరుకున్నారు.

అచంచలమైన ఆత్మ విశ్వాసంతో తాను చెప్పాలను కున్న విషయాన్ని సూటిగా నిర్మొహమాటం లేకుండా నిక్కచ్చిగా చెప్పేవారు ఏలాంటి వర్గాలకు కట్టుబడకుండ లోపాలుంటే న్యాయ బద్ధంగా నేరుగా చెప్పే వారు. భీమన్న సమాజంలో మనుష్యుల మధ్య ఉన్న తారతమ్యాలపై, సమాజ రుగ్మతల పైన తన కలశీ తో పిడుగుల వర్షం కురిపించారే తప్ప ఎవ్వరినీ ఉద్దేశించి రాయలేదు. ఏ మతానికో ఏ కులానికో ఏ వర్గానికో చెందిన వాడు కాదు బోయి భీమన్న సమాజ రుగ్మతలపై తన కలంతో పోరాడారు తప్పా...మనుష్యులపై కాదు! మనం రాసే రచనలు సమస్యలకు పరిష్కారాలు చూపేలా ఉండాలని కవులకు ఇదే విషయాన్ని సూటిగా స్పష్టంగా చెప్పారు.

చాలా మంది కవులు కొన్ని సిద్ధాంతాలకు, పరిధులకు లోబడి సాహిత్యాన్ని వ్రాస్తారు. కానీ మన భీమన్న గారు మాత్రం కవులకు ఉండవలసిన లక్షణాలు నియమ నిబంధనలు తో పాటు సమాజం పట్ల ఉండవలసిన బాధ్యతలు తనకు తానుగా వ్రాసుకొని ఖచ్చితంగా సాహిత్యాన్ని వ్రాసి నిరూపించారు. వాటిని ఎక్కడా కూడా అతిక్రమించలేదు... అదే వారి ప్రత్యేకత

అనాటి తరం నుండి నేటి, రాబోయే తరాలకు భీమన్న దళిత కవిత్వం అజరామం. భీమన్న దాదాపుగా 70 కు పైగా రచనలు చేశారు. వీటిలో కొన్ని ముద్రితం చేశారు. ఇంకా ముద్రితం కావలసినవి ఉన్నాయి. ఇందులో పద్యం గద్యం వచనం గేయం కావ్యం ఇలా పలు ప్రక్రియల్లో ఉన్నాయి. ఆముద్రితం కానివి నేటి తరాలకు రాబోయే తరాలకు అందించాలని హైమవతి మధన పడుతున్నారు

హైమవతి గురించి చెప్పాలంటే...!

బోయి హైమవతి తూర్పుగోదావరి జిల్లా (నేడు డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లా అమలాపురం మండలంలోని పేరూరు అగ్రహారం తండ్రి కొత్తురి సుబ్బయ్య దీక్షితులు తల్లి వెంకటలక్షి దంపతులకు జన్మించారు నాన్న వృత్తిరీత్యా ఉపాధ్యాయుడు. వారికి ఏడుగురు మగ సంతానం, ఒకే ఆడపిల్ల ఆ ఆడపిల్లే మన హైమవతి. హైమవతి బాల్యం విద్యాభ్యాసం అంతా మదరాసులోనే జరిగింది ఆరోజుల్లో మదరాసు మహా నగరంలో ఏకైక తెలుగు మాధ్యమం వున్న కేసరి ఉన్నత పాఠశాలలో స్కూలు ఫైనలు వరకు చదివింది. ఆ తరువాత కాలేజీలో చేరాలనుకునే సమయానికి రాష్ట్ర విభజన కారణంగా నాన్న గారు మదరాసు నుంచి హైదరాబాదుకు మకాం మార్చడం జరిగింది.

హైమవతి మదరాసులో వున్నప్పుడూ 1948 నుంచి 1952 వరకు మదరాసు ఆకాశవాణిలో లలితసంగీత కార్యక్రమంలో పాల్గొనేవారు. చిన్నప్పటి నుంచి గాయనిగా మంచి గుర్తింపు వుంది. అలాగే 1955లో మదరాసు ఆకాశవాణి తెలుగు నాటక విభాగంలో నాటకంలో నటించారు. హైదరాబాదు వచ్చిన తరువాత హైమవతి

తానే స్వతంత్రంగా పరీక్షలకు కట్టుకొని తెలుగు సాహిత్యంలో పట్టా తీసుకున్నారు.ఆ అర్హతతో ప్రభుత్వ ఉద్యోగం సంపాదించి ఉపాధ్యాయ శిక్షణ పూర్తి చేసి ఉపాధ్యాయురాలిగా మూడు దశాబ్దాలకు పైగా సేవలం దించి రాష్ట్ర ప్రభుత్వం చేత ఉత్తమ ఉపాధ్యాయురాలినీ గా పురస్కారం అందుకున్నారు. చిన్నప్పటి నుంచీ కూడా సంగీతం సాహిత్యం సమాజసేవ వంటి రంగాలలో చురుకుగా పాల్గొనేవారు. ఆ ఒరవడి ఈ నాటికీ కొనసాగు తోంది. రచయిత్రిగా ఎక్కువగా ఏమీ వ్రాయలేదు. "హైమవతీయం" పేరిట వందకు పైగా వచన కవితలు వ్రాశారు. అవి సినీజనతలో సీరియల్ గా వచ్చేవి. సినారే గారి మెప్పు పొందడం విశేషం. రేడియో నాటకాలు సాహిత్య సభలలో ప్రసంగాలు రేడియో ప్రసంగాలు గ్రంధాలకు పరిచయ వాక్యాలు రాయడం వంటివి ఆమె జీవితంని కొన్ని ప్రధానమైన విశేషాలు. ప్రస్తుతం సాహితీ సేవ కొనసాగిస్తూ గాయనిగా కొన్ని కొన్ని కార్యక్రమాలలో పాల్గొంటూ స్వాతంత్ర సమర యోధురాలు కోన కనకదుర్గా దేవి గారి చరిత్ర వ్రాశారు.ఈ క్రమంలోనే డా బోయి భీమన్నగారి జీవిత చరిత్ర వ్రాశారు. ప్రస్తుతం రెండవ భాగం ముద్రణలో వుంది.

హైమవతి పొందిన పురస్కారాలు

మహిళారత్న, మహిళా నవరత్న, భారతమహిళా శిరోమణి ఎక్సోరే ప్రతిభా పురస్కారం, ఇందిరాగాంధీ విశిష్ట జాతీయ పురస్కారం, మదర్ ధెరీసా, మాతృదెవోభవ పురస్కారాలు, రంగారెడ్డి జిల్లా పరిషత్ వారిచే స్త్రీశక్తి, తెలుగు విశ్వ విద్యాలయం కీర్తి, మొల్ల పురస్కారాలు కూడా అందుకొన్నారు. అనంతపురం వెన్నెల ఆత్మీయ సత్కారం, ఆంధ్రప్రదేశ ప్రభుత్వం వారి లక్షరూపాయల నగదుతో గుర్రం జాషువా పురస్కారం. ఇన్స్టిట్యూట్ ఆఫ్ ఎకనామిక్స్ స్టడీస్ వారు శిక్షారతన్ అవార్డు, గ్లోబల్ పీస్ కమిటీ వారు రెండుసార్లు స్త్రీశక్తి పురస్కారం సంగీత నవరత్న రెండవ తెలుగు ప్రపంచమహాసభలలో మహా మహులసమక్షంలో కవిత చదివి సత్కారం పొందడం వంటివి వంటివి మచ్చుకు కొన్ని

హైమవతి సామాజిక సేవలు...

ఇక సమాజపరంగా పలు సేవా కార్యక్రమాల్లో పాల్గొంటున్నారు అవసరమయినప్పుడు దివ్యాంగుల సహాయార్థం తన శక్తికి తగినంతగా ఆర్థిక సహాయం అందించడం వయోధికుల సంస్థలలో కూడా వారికి ప్రోత్సాహం అందివ్వడం వంటివి చేస్తున్నారు.

హైమవతి మరో విజయం...!

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం ప్రతీ ఉగాదికి ఉత్తమ కవులకు రెండు లక్షల నగదు పురస్కారాన్ని ఇవ్వడం హైమవతి భీమన్న సాధించిన మరో విశేషం.

★★★

Vol. 23 | Spl. Issue 03 | March 2026 | BHAVAVEENA | ISSN No. : 2456-4702 | RNI No. APTEL/2003/12253

RNI No. APTEL/2003/12253 | Reffered Journal & Peer Reviewed Journals | ISSN No. 2456-4702

భావవీణ

కళలు, సాహిత్య, సాంస్కృతిక భాషాధ్యయన పత్రిక

BHAVA VEENA

Journal of Arts, Literary, Culture & Language Study

కుల, వర్గ వివక్షపై ఇనాక్ గారు ఎక్కుపెట్టిన బల్లెం - రంధి నవలలో సువ్వి

- పి. యామినీ అమ్మాజి

శాఖాధిపతి, తెలుగు విభాగం, దామచర్ల సక్కుబాయమ్మ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల, ఒంగోలు.

వ్యాస సంగ్రహం

వేజెండ్ల మాదిగపల్లె పిల్ల సువ్వి. చదువు కోవడానికి రైలు లో వెళ్ళేప్పుడు ఆడపిల్ల అందునా మాదిగపిల్ల తనతో సమానంగా చదవడమేమీటని దొర కొడుకు రాముడు గొడవ పెట్టుకొని చివరకు సువ్వి జీవితం నాశనం చేయాలనుకొని, చివరకు ఒడిపోవడాన్ని ఇనాక్ గారు అణగారిన వారి గెలుపు గా అద్భుతంగా వర్ణించారు.

కీలక పదాలు :

సువ్వి., రాముడు, వేజెండ్ల, మాదిగపిల్ల, చదువు, రంధి

ఉపోద్ఘాతం :

''వసుదైక కుటుంబం'' అనే పదం వినడానికి, అనడానికి, రాయడానికి గొప్పగా ఉంటుంది. కానీ ఆ భావన గుండె లోతుల్లో కలగడానికి "స్వార్థం", "సంకుచి తత్వం" అనే రెండు హిమాలయ పర్వతాలు అడ్డంగా ఉంటాయి. ఆ మంచు కొండలను కరిగించాలంటే నులివెచ్చని నిట్టూర్పులు, ఓదార్పులు నీతిబోధలు, లాభం లేదు. సలసల కాగే, కణకణమండే, చర చర పాకే లావా కే సాధ్యం. ఆర్థిక స్వావలంబనే ఆ లావా..

''ధనం మూలం ఇదం జగత్'', ''దుడ్డు ఉంటే రెడ్డి అనే వారు పూర్వం''. కానీ పల్లెకి వెలిపల్లె అయిన వేజెండ్లలో సామాజికంగా ఆర్థికంగా అణగదొక్కబడిన కులంలో పుట్టిన ఆడపిల్లకు ఆర్థిక స్వావలంబన ఎలా కలుగుతుంది? నిప్పునుఎవరు ముట్టినా కాలుతుంది. నీటిలో ఎవరు మునిగినా శుభ్రపరుస్తుంది. చదువు అంతే!ఎవరినైనా ఉద్ధరిస్తుంది! సామాజికంగా, ఆర్థికంగా ఎదగాలంటే చదువే మార్గం . అందుకే రంధినవలలో సువ్విచదువే ప్రధాన విషయంగా చేశారు సామాజిక కృషీవలుడు ఋషితుల్యుడుఅయినశ్రీ కొలకలూరి ఇనాక్ గారు.

రంధి నవల - నామ ఔచిత్యం

రంధి అనేపేరు కూడా ఒక అద్భుతం. రంధి అంటే విపరీతమైన, ఎడతెగని కోరిక. సువ్వికి చదువుకోవాలనే రంధి, రాముడికి సువ్విని గెలవాలనే రంధి, ఇనాక్గారికి ఊకదంపుడు ఉపన్యాసాలలోకాక మానవ హృదయాంత రాలలో నుంచి వచ్చే సామాజిక సమానత్వపురంధి. అందుకే ఈ నవల కు రంధిఅనేపేరు నూటికి నూరు శాతం పొసిగినది.

అంటరానితనం, వెలి-మానవ సమాజంలో స్వార్థ పూరిత కుట్రదారులు అమాయకుల జీవితాలపైచేసిన గాయాలు. అవి మానక, పుండుపడి పోయినప్పుడు వాటిని మాన్పేదారిచూపెట్టిన వైద్యులుశ్రీకొలకలూరి. ఆ దారిలో వచ్చే కష్టాలను అత్యంత సహజంగా కనులకు కట్టించి, హృదయాన్ని కదిలించారు, ఆలోచన రగిలించారు.

ఒక అణగారిన కులంలో పుట్టిన సువ్వి చదువు కోవాలనుకోవడం :

గుంటూరు జిల్లా వేజెండ్ల గ్రామంలో మాదిగ పల్లె లో జనాలు "మా బతుకులు" ఇంతే అనుకుంటూవివక్షకు తలవొగ్గి బతుకుతున్న కాలంలో, ఒక అబల, ఒక నల్లపూస ఒక మాదిగింటిచిన్నది చదువుకోవాలనుకుంది, చదివి ఉద్యోగం చేయాలనుకుంది. ఈ ఆలోచనే ఆనాటి కాలంలో ఒక పెను మార్పుకు సూచన. ఆడపిల్లకు చదువెందుకు అనే ఆలోచన పల్లెటూరి వారిది. అందునా మాదిగ పల్లె. కానీ కోటికి బిడ్డ మీద ఉన్న ప్రేమ కోటగోడ అంత పెద్దది. అందుకే కోటి చదువుకో మన్నాడు. తల్లిగాని, తండ్రి గాని, నానమ్మ గాని అడ్డు చెప్పలేదు కానీ ఒక మాదిగ పిల్ల చదువుకోవడం రాముడికి నచ్చలేదు.

రాముడు నాయుడు నాంచారయ్య ముద్దుల పట్టి. అతనిని గొప్ప కొరకు పట్నంలో చదివిస్తున్నాడు నాంచారయ్య. అతని పుస్తకాల సంచి,క్యారెజీ మోయ డానికి జీతగాడు, రైలువచ్చేలోపు కూర్చోవడానికి ఒక సిమెంట్ బెంచీ ఏర్పాటు చేశాడు నాంచారయ్య. డబ్బు పొగరుతో తండ్రి గారాబంతో కన్నుమిన్నుగానక రాముడు, "ఒక ఆడది, అందులోనూ మాదిగది స్కూల్ చేరడం ఏంటి" అని చికాకు పడ్డాడు, కోపం వచ్చింది. ఇక్కడ ఇనాక్ గారి ప్రతి పదం సమాజాన్ని మొహమాటం లేకుండా ఫోటోస్టాట్చేసి చూపిస్తుంది. దొరబిడ్డకి ఆడవాళ్లంటే అలుసు. అందునా "మాదిగ ఆడపిల్ల" అలుసు గాక మరేమిటి? తనతో సమానంగా పట్నం వచ్చి చదవడం ఏమిటి? అందగాడైన రాముడు జీర్ణించుకో లేక పోయాడు. అందుకే "ఏందే నీ పేరు?" అని అడిగి, "సువ్వి" అని చెప్పాక, "కాకి నలుపు మొద్దువి, నాకు కనపడకు" అని ఆజ్ఞ జారీ చేశాడు. ఇనాక్ గారు రాముని అందంగా. సువ్వినిని నల్లగా వర్ణించడంలో ఒక గొప్పదనం వుంది. కడుపునిండా తిని కంటినిండా నిద్రపోయిన వాళ్లు అందంగా నిగనిగలాడు తారు కానీ ఖాళీ కడుపుతో ఎండకు ఎండి వానకు తడిచేవాళ్ళు నల్లగా కాక ఎర్రగా ఆపిల్ పండులా ఎలా ఉంటారు? కానీ వాళ్ళ హృదయాలు మాత్రం తాటి ముంజలంత తెల్లగా స్వచ్ఛంగా ఉంటాయి. అందుకే పైకి అందంగా కనిపించే రాముడికి తనకు లొంగనిసువ్వినిచెరచాలనే కసి కలగడం అతని అసహ్యకరమైన అంతరంగానికి నిదర్శనం. ఎన్ని కష్టాలు వచ్చినా, ప్రాణం పోతున్నా, మానం పోతుందన్నా, లొంగని సువ్వి మనస్సు ఎంత అందమైనది? ఈ పరస్పర వ్యతిరేకతని. ఇనాక్ గారు చమత్కారంగా చిత్రించారు.

రాముడు ఎక్కిన పెట్టెఎక్కకుండా సువ్వికి సంవత్సరం గడిచింది.మంచి మార్కులతో ఫస్ట్ ఫారంపాస్ అయ్యేటప్పటికి సువ్వికి ధైర్యం వచ్చింది. చదువు ధైర్యాన్ని ఇస్తుంది. ఊసలాగా, పీనుగు లాగా, ఎలక తోకలాగా, సన్నగా బలహీనంగా, ఒంటూపిరితో ఉండే సువ్వి ఆత్మ విశ్వాసం వల్లనేమో నల్ల తుమ్మ మొద్దు లాచేవదీరింది. రాముడికి అతనికే తెలియకుండా ఆమెపై మనసు అయిందో ఏమో కానీ, ఆమె కులం సామాజిక స్థాయి అతడిలో కోపాన్ని, పంతాన్ని రగిలించాయి. రైలు కూసే దాక ఉండి రాముడే సువ్వి ఉండే పెట్టె ఎక్కాడు. క్రితం ఏడాది నల్ల మొద్దు అంటే ఏడ్చినసువ్విరాముడు "ఏందే నేనున్న పెట్టెలోకి ఎక్కావు "అంటే నువ్వే" అన్నది. ప్రతి తిట్టుకు తిరగబడి నువ్వేఅన్నది. రాముడు చెయ్యేత్తిఆమె గుండెలపై కొట్టాడు, సువ్వి పుస్తకాల అడ్డం పెట్టుకుంది. మగవాడు ఆడదాన్ని పై కోపం వస్తే, లైంగికంగా వేధిం చాలనుకుంటాడు. కోపం వచ్చినా, కామం కలిగినా, ఆడదానికి జరిగే పరాభవం ఒకటే. అదే మగవాడి అధికారం, అదే అలుసు. అందుకే రాముడు గుండెల పై నే కొట్టాడు. దెబ్బ తప్పించుకునే సరికి మళ్లీ కొట్ట బోయాడు ఒక ముసలతను ఆపాడు.

మరొకసారి సువ్వి రాముడుకి ఎదురు పడ్డప్పుడు పక్కనే చెందిరి ఉన్నాడు. తాను కా మించిన ఆడదాని పక్కన మరొక మగవాడిని చూసేసరికి రాముడికి అహం దెబ్బతిన్నది. "ఏందే సువ్వి నీ కాపలా కుక్క కూడా రైలు ఎక్కింది" అని గొడవ మొదలు పెట్టాడు. సువ్వి "నువ్వే" అన్నది. "వాడేమన్నా నీ మొగుడా" అన్నాడు. సువ్వి పొగరుబోతుతనం పైన పెత్తనం ఎవరికైనా ఉండడం రాముడు భరించలేకపోయాడు. సువ్వినిని కొట్టబోతుంటే, చందిరిరాముని చెయ్యి పట్టుకున్నాడు. వదిలించుకోవడం రామునివల్ల కాలేదు.

రాముడి బలం వాళ్ళ నాయన ఆస్తిలో, అంతస్తులో, అభిజాత్యంలో ఉంది. చందిరిబలంవాడిఒంట్లో ఉంది. నిజానికి రాముడు వెన్నముద్దలు మింగిన ఆరోగ్య వంతుడు. చందిరి మట్టి ముద్దలు పిసుక్కున్న బల వంతుడు. చెందినకి బలం ఉంది కాని ధైర్యం లేదు. రాముడికి ధైర్యం ఉంది కాని బలం లేదు. ఇక్కడ ఇనాక్ గారి విశ్లేషణ ఎంత చక్కగా సమాజానికి అద్దం పడుతుందో. చివరికి తన ప్రాణానికి ప్రాణమైన సువ్వి ప్రాణం మీదకు వచ్చే సరికి చెందిరిధైర్యశాలి అయ్యాడు. సువ్వి ఏమీ చేయలేని రాముడుపిరికివాడయ్యాడు. బలం గెలిచింది, అది కండ బలమే కాదు గుండె బలం నైతిక బలం.

రాముడు సువ్విమాట్లాడాలని తహతహలాడాడు. మా జీతగాళ్లఇంటిలో ఆడదికాబట్టినా సొత్తు అనుకున్నాడు. మాదిగది అన్న అలుసువల్ల అణిగిమణిగి ఉండాలని, అంటరానిది కాబట్టి తాను అంటుకుంటే తరించి పోయినట్లు లొంగిపోయి, వంగిపోయి, కాళ్ళ కాడ పడి ఉండాలని, "చూ అంటే తోక ఊపుకుంటూ వచ్చే కుక్క పిల్లలారావాలని తలపోశాడు". సువ్వినిని వాటేసుకో బోయిపడ్డాడు, తన వన్నాగం నెరవేరకపోవడంతో బూతులు తిట్టాడు, మీద చేతులు వేసింది కాక బూతులు తిట్టే టప్పటికిసువ్విసాచిచెంపదెబ్బకొట్టింది. తిరిగి కొట్టబోతే చెందిరిచెయ్యి పట్టుకుని ఆపి వేశాడు. చెందిరిన గెలవలేడు. పగతో రగిలిపోయాడు రాముడు. "మాదిగ దానితో గొడవయ్యింది అంటే నాంచారయ్య వెంటనే" రాకాసి బొగ్గు లాంటి దాని మీద బంగారం లాంటి నీకు మన సెట్టాఅయింది రా అన్నాడు... ఇనాక్ గారి పాత్రల మాటమాట వెనుక మాణిక్యాలుంటాయి. బంగారం ధర ఎక్కువ మెరిసి పోతుంది, కానీ అలంకరణకే గాని ఆకలి తీర్చలేదు. బొగ్గు నల్లనిది, గట్టిది, ఇంధనం. మండితే ఆకలి తీర్చడమే కాదు బంగారం అయినా కరగాల్సిందే. నాంచారయ్య కొడుకుతో "దాన్ని చంపాను" అంటే సెహభాస్ అనేవాణ్ణి, మానభంగం చేసావంటే "ముద్దు పెట్టుకునే వాడిని, గొడవ అయింది అన్నావు, దిగులేస్తుంది అన్నాడు. - ఇదే దొరలు తమ పిల్లలకు నేర్పే నీతి బోధ. సువ్విని, దాని కుటుంబాన్ని ఏమైనా చేస్తాను అన్నాడు. రాముడు పౌరుషం తెచ్చుకుని నేనే దాని సంగతి చూస్తాను అన్నాడు.

మరునాడు సువ్విని వెతుక్కుంటూ పోయి, గొడవ పెట్టుకుని నెత్తిపై కొట్టి, గుండెలపై గుద్దాడు రాముడు. సువ్వితాచుపాముఅయింది, పిడికిలి బిగించి తన పైకి రాబోతున్న రామునిముక్కుపై గుద్దింది. దెబ్బకు రక్తం కారసాగింది. బూతులు తిడుతూ రాముడు మళ్ళీ రాబోతుంటే జనం కలగజేసుకుని ఆపారు. ఇద్దర్నీ మందలించారు, రాముణ్ణి ఆపి, సువ్విని పోనిచ్చారు. ఒళ్లు తెలియని కోపంతో ఊగిపోతూ రాముడు "నిన్ను నెత్తురు కారేటట్టు చెరచకపోతే నా పేరు రాముడే కాదు" అని శపథం చేశాడు.

ఆత్మాభిమానం వల్ల సువ్వి ఆశయం తలకిందులైంది. బడి మానేసింది. సువ్వి తండ్రి మాదిగ పెద్దలతో కలిసి వెళ్లి నాంచారయ్య కాళ్లపై పడ్డాడు. నాంచారయ్య కొడుకుకే వత్తాసు పలికాడు. విధిలేక పెళ్లి ప్రయత్నాలు మొదలు పెట్టినా, విషయం తెలిసి ఎవరూసువ్విని చేసుకోవడానికి ముందుకు రాలేదు. సువ్విరాముడిని ఎదిరించ గలిగినవాడు, తనంటే ప్రాణం పెట్టే వాడైన చందిరిని చేసుకుంటానని అందరిని ఒప్పించింది.

తెల్లవారితే పెళ్లి అనగా బయలుకు వెళ్ళిన సువ్విని పట్టుకొని, నోట్లో గుడ్డలు కుక్కి, కాళ్లు చేతులు కట్టేసి, రాముడు బలాత్కరించబోయాడు. చేతగాక వళ్లంతా రక్కి,కొరికి, చనిపోయిందని పడేసి వెళ్ళిపోయాడు. ఆడదాన్ని లైంగికంగా అనుభవించలేని మగవాని దౌర్భల్యం ఎంత క్రూరంగా ఉంటుందో తెలియజేశారు గారు ఇనాక్ గారు.

చందిరి వెళ్లి నాంచారయ్య కాళ్లు పట్టుకున్నాడు కానీ లాభం లేకపోయింది. రాముని ధైర్యం ఉదయం పూట ఎండలా తగ్గుతుంటే, చెందిరి తెగింపు సాయంకాలం పూట ఎండలా పెరుగుతూ వచ్చింది. సువ్వి బతకాలంటే రామునికి తగిన శాస్తి చేయక తప్పదని చెందిరికి అర్థం అయింది. ఆడదాని పై అఘాయిత్యం చేయాలనుకున్న వాడికి ఆ బాధ ఎలా ఉంటుందో చూపాలి అనుకున్నాడు.

రాముడిని తెచ్చి కట్టేశాడు. అనుకున్నంతా చేసేవాడే కానీ దడుచుకొని, బట్టలు తడుపు కొనడం చూసి జాలి వేసి వదిలేశాడు.

నెత్తికెక్కిన అహం దిగి రాముడు ఓటమిని ఒప్పుకోలేక, ఆత్మహత్య చేసుకున్నాడు. నల్లగా బలంగా ఉన్న పందిని మాంసం కొరకు అందరూ ఇష్టపడతారు. కుక్కలు అయితే తరుముతాయి. కానీ పది పందులు కలిస్తే ఒక కుక్కని తరమగలవు. పందిని బలంతో ఓడించలేక ఒక కుక్క దాన్ని రైలుకి బలి చేసి తిందాం అనుకుంది. కానీ పందే కుక్కని ఎత్తి రైలు పట్టాల పైన పడవేసింది. మారుతున్న సమాజానికి ప్రతీకగా రైలు కులం పాగరు అనే కుక్కని తొక్కుకుంటూ చిద్రంచేసుకుంటూ వెళ్ళిపోయింది.

ఇనాక్ గారు కోరుకున్న అణగారిన వర్గాల వారి విజయం అది. కానీ అదొక్కటే సరిపోదు అణచివేసే వారిలో మార్పు కూడా రావాలి.

కొడుకు పోయాక కర్మకాండ సమయంలో నాంచారయ్య కు డబ్బు, హోదా, బలగం, అభిమానం గౌరవం ముందు అవి ఎందుకు పనికిరావు అని తెలిసి వచ్చింది. కొడుకు పాడెమోయడానికి కులం వాళ్ళు, బంధువులు ఎవరూ రాకపోగా, జీతగాళ్లు అయిన మాదిగ వాళ్లే దిక్కు అయ్యారు. ఒక్కగానొక్క కొడుకు చనిపోవడానికి నాంచారయ్య కారణమని అతని భార్య ముందుగా గుర్తించింది. "తీరిందా మీ రంధి" అని నిలదీసింది. తప్పు తెలుసుకున్న నాంచారయ్య వెళ్లి సువ్విని, చందిరిని ఆశీర్వదించి, చెందిరిని తన కొడుకు అన్నాడు. నాంచారయ్యలోని మార్పు, సమాజంలోని మార్పుకి సంకేతం.

సువ్వికెలిచింది- వర్గ వివక్షపై
వర్ణవివక్షపై
ఆర్థికఅసమానతపై
లింగవివక్షపై,

చందిరి అండగా ఉన్నాడు. అనుభవించడం మగతనం కాదు. ప్రేమించడం, ప్రేమించబడడం నిజమైన మగతనం అని, గొప్పతనం అని చెందిరి నిరూపించాడు. ఒక సామాజిక మార్పు కోసం అనుకోకుండా పోరాటం చేసిన సువ్వికి అండగా ఉన్న చందిరి, కోటి బూది, లింగి, యావత్తు మాదిగ పల్లె జనం ఐకమత్యానికి, సంఘ బలానికి ప్రతీకలు. ఈ సామాజిక విప్లవాగ్ని లో రాముడుమాడిమసిఅయిపోయాడు. సువ్వి సీతమ్మవలె అపవాదు అగ్ని దాటి గెలిచింది.

ముగింపు :

రంధి నవలలో సువ్వి గెలుపు అన్యాయంగా అణగ దొక్కబడిన వారి గెలుపు! తరతరాల దోపిడీపై తిరగబడిన వారి గెలుపు. ఇదే సమాజానికి నాంది. సువ్వికి జేజేలు పలుకుతూ సృష్టికర్త ఇనాక్ గారికి నీరాజనాలు ఇవ్వాలి మరి.

ఆధార గ్రంధాలు :

1. రంధి నవల - శ్రీ కోలాలకలూరి ఇనాక్.

★★★

Vol. 23 | Spl. Issue 03 | March 2026 | BHAVAVEENA | ISSN No. : 2456-4702 | RNI No. APTEL/2003/12253

RNI No. APTEL/2003/12253 | Reffered Journal & Peer Reviewed Journals | ISSN No. 2456-4702

భావవీణ

కళలు, సాహిత్య సాంస్కృతిక భాషాధ్యయన పత్రిక

BHAVA VEENA

Journal of Arts, Literary, Culture & Language Study

స్త్రీ వాద కవిత్వం - విశ్లేషణ

- డా॥. డి. లక్ష్మి నరసింహం

అసోసియేట్ ప్రొఫెసర్, ప్రభుత్వ డిగ్రీ కళాశాల, కాగజ్ నగర్.

పరిచయం

యత్ర నార్యస్తు పూజ్యంతే రమంతే తత్ర దేవతాః అని ప్రాచీన కాలంలోనే మనుస్మృతిలో పేర్కొనబడింది. అనగా స్త్రీలు ఎక్కడ పూజింపబడతారో అక్కడ దేవతలు ఉంటారని దీని అర్థం. భారతీయ సమాజంలో స్త్రీకి ఇచ్చే ప్రాధాన్యత విషయంలో తరతరాలుగా చర్చ కొనసాగుతూనే ఉంది. ఇతిహాసాలు పురాణాలు స్త్రీలకు ఇచ్చిన ప్రాధాన్యత తక్కువనే చెప్పాలి. సింధూ నాగరికత కాలంలో మాతృ స్వామ్య వ్యవస్థ అమలులో ఉన్నట్లు కొన్ని చారిత్రక ఆధారాలు పేర్కొన్నప్పటికీ ఆ కాలపు స్త్రీలకు ఇచ్చిన గుర్తింపు గురించి విస్పష్ట ఆధారాలు సరిగా అందుబాటులో లేవనే చెప్పుకోవచ్చు. ఇక సింధు నాగరికత తరువాత తొలివేద కాలంలో మాత్రం స్త్రీలకు ప్రాధాన్యత లభించినట్లు మనకు స్పష్టమైన ఆధారాలు లభ్యమవుతున్నాయి. భారతదేశ చరిత్రలో స్త్రీకి సముచితమైన స్థానాన్ని కల్పించిన యుగంగా తొలివేద కాలాన్ని (క్రీ. పూ 1500-1000) పేర్కొనవచ్చు. ఆ ఒక్క కాలంలో తప్ప మరెప్పుడు స్త్రీలకు అంతగా ప్రాధాన్యత లభించలేదని చెప్పవచ్చు. తొలివేద కాలంలో మాత్రం స్త్రీలకు సభ, సమితి లాంటి ప్రజాస్వామ్య వ్యవస్థలలో పాల్గొనే అవకాశం ఉండడంతో పాటు వారికి వేదా భ్యసనం చేసే హక్కు కూడా కల్పించినట్లు ఆధారాలు ఉన్నాయి. అపాల, విశ్వవర, ఘోష, లోపాముద్ర వంటి మహిళా ఋషులు వేదమంత్రాలను రచించడాన్ని బట్టి తొలివేద కాలంలో స్త్రీ ప్రాధాన్యత ఎక్కువనే చెప్పవచ్చు. అంతేకాకుండా ఆనాడు మహిళలకు తండ్రి ఆస్తిలో హక్కు సైతం ఉండేది. కానీ తదనంతర కాలంలో క్రమంగా సమాజంలో, కుటుంబంలో స్త్రీ యొక్క ప్రాధాన్యత తగ్గి పురుషాహంకార ధోరణి పెరిగిపోయింది. ముఖ్యంగా వివాహం విషయంలో స్త్రీలకు స్వేచ్ఛ లేకపోవడం, సతీ సహగమనం లాంటి దురాచారాలు ప్రబలడం, గుప్తుల కాలంలో దేవదాసి వ్యవస్థ లాంటి ఆచారాలు మొదలై క్రమంగా స్త్రీల పరిస్థితిని మరింతగా దిగజార్చాయి. పురాణాలు ఇతిహాసాలు స్త్రీని పురుషుడి అడుగులకు మడుగులొత్తే వస్తువుగానే చిత్రించాయి తప్ప స్త్రీకి సైతం ఒక మనసు ఉంటుందనే భావనను ప్రస్తావించకపోవడం ఇక్కడ గమనించాలి. ఇక ఆధునిక యుగం వచ్చేసరికి స్త్రీల పరిస్థితిని గురించి ఆలోచించడం, స్త్రీల హక్కుల గురించి ప్రస్తావించడం మొదలైంది.

పాశ్చాత్య దేశాలలో స్త్రీవాదం ప్రబలడం లాంటి అంశాల ఆధారంగా తెలుగు సాహిత్యంలోనూ స్త్రీవాద సాహిత్యం వెలువడటం మొదలైంది. క్రమంగా స్త్రీల సమస్యలు హక్కులను గురించి స్త్రీలే ప్రశ్నించడం ప్రారంభించారు. దీనినే సాహితీ విమర్శకులు స్త్రీవాదంగా పేర్కొన్నారు.

స్త్రీవాద సాహిత్యం - విశ్లేషణ

భారతదేశంలో 20వ శతాబ్దాన్ని ఉద్యమాల యుగం అని చెప్పవచ్చు. అనేక సాహిత్య ఉద్యమాలు ఈ కాలంలోనే మొదలు కావడం గమనించ దగ్గ విషయం. ముఖ్యంగా స్త్రీవాద సాహిత్యం తెలుగులో 20వ శతాబ్దం లోనే మొదలైందని చెప్పవచ్చు. 1985 నుండి తెలుగులో స్త్రీవాద కవిత్వం స్థిరపడింది. పాశ్చాత్య సాహిత్యంలో ఉపయోగిస్తున్న ఫెమినిజం అనే మాటకు తెలుగులో వ్యవహార నామం స్త్రీవాదం. సామాజికంగా, ఆర్థికంగా, లైంగికంగా స్త్రీలను దోపిడి నుండి విముక్తం చేసే రాజకీయ సిద్ధాంతాన్ని ఫెమినిజం అనవచ్చు. తెలుగులో రేవతి దేవి, జయప్రభ, విమల, కొండెపూడి నిర్మల, ఈశ్వరి మొదలైన వారు స్త్రీవాద కవిత్వాన్ని బలంగా వినిపించారు. స్త్రీవాద కవిత్వంలో క్రింది అంశాలపై ఆయా రచయిత్రులు తమ అభిప్రాయాలను బలంగానే వ్యక్తికరించగలిగారు. 1. వివాహ వ్యవస్థ 2. లైంగిక వివక్ష 3. మాతృత్వం 4. కుటుంబహింస 5.పురుషాధిక్యత 6. సామాజిక వివక్ష 7. ప్రపంచీకరణ మొదలైన అంశాలు కేంద్ర బిందువుగా స్త్రీవాద సాహిత్యం తెలుగులో ఆవిర్భవించింది. 1980లో రేవతి దేవి 'శిలా లోలిత' అనే కవిత సంకలనం ప్రచురించారు. ఇందులోని కవితలు చిన్నవే అయినప్పటికీ అందులో పదునైన భావాల్ని రచయిత్రి వ్యక్తం చేయడం జరిగింది. లైంగిక సంబంధాల విషయంలో స్త్రీ పురుషుల మధ్య గల ద్వంద్వనీతిని రేవతి దేవి తీవ్రంగా నిరసించడం ఈ కవితా సంకలనంలో చూడవచ్చు.

తొలి తరం స్త్రీవాదిగా రేవతి దేవిని ఎక్కువ మంది గుర్తిస్తారు. స్త్రీ అస్తిత్వానికి సంబంధించి శ్రీమతి రాసిన క్రింది కవితను పరిశీలిస్తే స్త్రీల పట్ల ఈ సమాజం అనుసరిస్తున్న వైఖరి మనం అర్థం చేసుకోవచ్చు.

"నేను అమ్మలో ఉన్నప్పుడు నేను కావాలని అమ్మ కోరుకుంటున్నట్లు నాన్నకు తెలియగానే ఏడ్చి చెంప పగలగొట్టిన నాన్న దెబ్బకి నేనెవరో నాకు తెలిసింది.

నేనొక స్త్రీని.. నేనొక నిషిద్ధ జీవిని.. మొన్నటిదాకా నా నవ్వు నిషిద్ధం.. నిన్న నా చదువు నిషిద్ధం నేడు నా బ్రతుకు కూడా నిషిద్ధమే" అంటుంది. తల్లి గర్భంలో పెరుగుతున్న శిశువు ఆడ శిశువు అని తెలియగానే అబార్షన్ చేసుకొమ్మని అత్తింటి వారు వెంటాడుతున్న వేదనలోనుండి ఇలాంటి కవిత్వం పుట్టుకొస్తుంది. బాలికల పట్ల సమాజం అనుసరిస్తున్న ధోరణిని ఈ కవిత వ్యక్తం చేస్తుంది. ఆడపిల్ల పుడితే అయ్యో అని అమ్మ లెక్కల పెదవి విరుపులు ప్రసవ వేదనను మరింతగా పెంచి స్త్రీని స్త్రీయే ద్వేషించేలా మారుస్తున్న మానవత్వం లేని సమాజం మనది. అమ్మాయి పుట్టిందని తెలిస్తే దగ్గరకు రాని అత్తింటి వారు అబ్బాయి పుడితే మాత్రం హత్తుకుపోయే దృశ్యాలు ఎన్నో మన కళ్ళ ముందే నిత్యం కదలాడుతున్న వైనం మనం చూడవచ్చు.

ఇక సావిత్రి రాసిన బందిపోట్లు కవితలో

"పాఠం అప్ప చెప్పకపోతే పెళ్లి చేస్తానని పంతులుగార న్నప్పుడే భయం వేసింది.. ఆఫీసులో నా మొగుడున్నాడు అవసరమొచ్చిన సెలవు ఇవ్వడు అని అన్నయ్య అన్నప్పుడే అనుమానం వేసింది.. పెళ్లంటే పెద్ద శిక్ష అని మొగుడంటే స్వేచ్ఛ భక్షకుడని"... అంటుంది.ఎంతో ప్రతీకాత్మకంగా సావిత్రి చెప్పిన ఈ కవిత పురుషాదిక్య సమాజాన్ని వేలెత్తి చూపుతుంది. పెళ్లయిన తర్వాత స్వేచ్ఛ అనేది ఆచూకీ లేకుండా పోతుందని ఆవేదన వ్యక్తం చేస్తుంది. ఇతిహాసాలు పురాణాలు స్త్రీకి స్వేచ్ఛ ఇచ్చింది ఎక్కడ? ఆమె సమస్యను పట్టించుకుంది ఎక్కడ? అని స్త్రీవాద కవిత్వం సూటిగానే ప్రశ్నిస్తుంది. పుట్టింటి నుండి మెట్టింట అడుగుపెట్టిన నాడే స్త్రీ తన స్వేచ్ఛ స్వాతంత్రాలను కోల్పోయి భర్త అడుగుజాడల్లో నడవాలనే సనాతన సాంప్రదాయ వ్యవస్థని స్త్రీవాద కవయిత్రులు తీవ్రంగానే నిరసిస్తారు.

మనం పాలిచ్చి పెంచిన జనంలో సగం మమ్మల్ని విభజించి పాలిస్తోందని అద్భుతంగా చెబుతుంది సావిత్రి.

స్త్రీల పట్ల వివక్ష విలయతాండవం చేస్తుందని సమాజం మమ్మల్ని విభజించి చోద్యం చూస్తుందని తన అసంతృప్తిని గట్టిగానే వ్యక్తం చేస్తుంది.

ఇక మందరపు హైమవతి రాసిన క్రింది కవితను పరిశీలించినప్పుడు వివాహం తర్వాత స్త్రీ పోషించే

బహుపాత్రాభినయం గురించి ఎంతో ప్రతీకాత్మకంగా చెబుతుంది.

కుక్కర్ విజిల్స్ లోనే మనోజ్ఞ సంగీతం వింటాను
పతి దేవుని టేబుల్ పై కాఫీ కప్పుగా
మీల్స్ కెరియర్ గా పిల్లల లంచ్ బాక్స్ లుగా బహు
పాత్రాభినయం పోటీలో నా చేతులకెప్పుడు ఫస్ట్ ప్లేజే

అంటూ ఉదయం లేచింది మొదలు పడుకు నేంతవరకు యంత్రంలా పనిచేసే స్త్రీకి విరామం లేదని భార్యగా, అమ్మగా బహు పాత్రలు పోషిస్తూ సంసార సాగరాన్ని నెట్టుకొస్తున్న స్త్రీల దైన్య స్థితిని హైమవతి ఎంతో చక్కగా చిత్రించ గలిగారు.

"అందం పోటీ అయిన చోట అందం సరుకైన చోట అందాల వ్యాపారాన్ని ద్వేషిద్దాం" అంటుంది సౌందర్యా త్మక హింస కవితలో విమల.

స్త్రీ అందాన్ని అంగాంగ సౌందర్యాన్ని కొలిచే సమాజంలో మనం ఉన్నామని నిరసిస్తుంది రచయిత్రి. ఈ కవితలో స్త్రీని అందమైన వస్తువుగా ఆట బొమ్మలా నేటి సమాజం అనుసరిస్తున్న ధోరణిని విమల ఈ కవితలో చాటి చెప్పింది. 'సౌందర్యాత్మక హింస' అంటూ శీర్షికలోనే కొత్త దనాన్ని చూపెట్టిన తీరు ఎంతో ప్రశంసనీయం. ఇక బాల్యం నుండే ఇంట్లో మగ పిల్లల్ని ఒక రకంగా అమ్మాయిలను మరోరకంగా చూసే తల్లుల్ని గురించి పేర్కొంటూ శ్రీమతి అనే రచయిత్రి ఇలా అంటుంది

"చీర ఒక అంచును గుండెల పై పదిలంగా అమర్చు కున్నట్లు అమ్మ తమ్ముని హృదయానికి హత్తుకుంటుంది కాళ్లకు అడ్డుపడే అంచులా నన్ను మాటలతో తన్నుతుంది" అంటూ చెప్పిన తీరు అమ్మాయిల పట్ల వివక్ష ఎక్కడి నుండో కాదు ఇంట్లో నుండే అదీ తల్లి నుండే తరాలుగా వస్తుందని వెల్లడి చేస్తుంది ఈ కవితలో రచయిత్రి.

ఇది అక్షరాల వాస్తవం అని చెప్పక తప్పదు. ఎందు కంటే ఇప్పటికీ ఈ ఆధునిక యుగంలోనూ అబ్బాయిని కార్పొరేట్ పాఠశాలల్లో చదివించే తల్లిదండ్రులు అమ్మాయిని మాత్రం ప్రభుత్వ పాఠశాలల్లో చదివించడం ఎన్నో కుటుంబాలలో మనం గమనించవచ్చు. స్త్రీ పురుషుల మధ్య వివక్ష బాల్యం నుండే మొదలవుతుందని రచయిత్రి ఆవేదన వ్యక్తం చేస్తుంది. ఇక రజియా బేగం రాసిన క్రింది కవితను చదివితే స్త్రీకి ఈ సమాజం ఇచ్చిన విలువ ఏ పాటిదో ఇట్టే అర్థమవుతుంది మనకు.

"బాల్యంలో చిన్న పిల్లవి నీకేం తెలుసు కూర్చో అన్నారు..యౌవనంలో ఉడుకు రక్తం నీకేం తెలీదు కూర్చో అన్నారు.

వృద్ధాప్యంలో ముసల్దానివి ఇంకేం చేస్తావ్ కూర్చో అన్నారు..

అవకాశం రానందుకు కోపంగా లేదు నాకు కూర్చుని కూర్చొని బద్ధకం వచ్చినందుకు బాధగా ఉంది"

అంటూ నిర్వేదాన్ని నిస్సహాయతను వ్యక్తం చేస్తుంది రచయిత్రి. ఇందులో వాస్తవం లేకపోలేదు ఎందుకంటే ఆధునిక సమాజంలో స్త్రీకి విలువిచ్చింది ఎప్పుడు?

పెళ్లి చూపులలో సైతం అమ్మాయి అభిప్రాయానికి ఎంతమంది తల్లిదండ్రులు విలువనిస్తున్నారో మనకు తెలిసిందే. ఆస్తులు అంతస్తులు ముఖ్యమైన చోట ఆడపిల్ల అభిప్రాయానికి విలువ ఎక్కడిది ఈ వ్యవస్థలో అంటూ రచయిత్రి గట్టిగానే ప్రశ్నిస్తారు. బాల్యం, యవ్వనం, వృద్ధాప్యం ఏ దశలోనూ స్త్రీ అభిప్రాయానికి ఇసుమంతైన విలువ నియ్యని, విలువలు లేని సమాజంలో మనం ఉన్నామని రచయిత్రి సూటిగానే తన మనోభావాలను వ్యక్తం చేస్తుంది.ఇక విమల రాసిన వంటిల్లు కవిత చదివినప్పుడు పితృస్వామ్య భావజాలం మన సమాజంలో ఎంతగా ఉందో నేరుగా గుండె లోతుల్లోకి గునపంలా దిగుతుంది. వంటింటి సామ్రాజ్యా నికి మా అమ్మే రాణి..

అయినా చివరకు వంటింటి గిన్నెలన్నింటి పైన మా నాన్న పేరే ఉంటుంది"

అంటూ పురుషాధిక్య భావజాలాన్ని కలం పోటుతో కడిగే ప్రయత్నం చేస్తుంది రచయిత్రి ఈ కవితలో. పొద్దున లేచింది మొదలు రాత్రి నిద్ర పోయే వరకు వంటింటిలో జీవితాన్ని గడిపే అమ్మను ఏ సమాజం గుర్తిస్తుంది?

అంటూ సూటిగానే ప్రశ్నించింది రచయిత్రి. వంట పాత్రలపై సైతం నాన్న పేరు ముద్రించడం వెనక తర తరాలుగా వస్తున్న పురుషాధిక్య భావజాలాన్ని ఈ కవితలో రచయిత్రి ఎండ గడుతుంది.

ముగింపు

ఈ విధంగా చూసినప్పుడు సనాతన భారతీయ సాంప్ర దాయంలో స్త్రీకి ఇచ్చిన స్థానం ఏమిటో స్త్రీవాద సాహిత్యం తేటతెల్లం చేస్తుంది. 1980 నుండి నేటి వరకు స్త్రీ వాద సాహిత్యం వెలువడుతునే ఉంది. స్త్రీల సమస్యలు, స్త్రీలు ఎదుర్కొంటున్న సమస్యల గురించి స్త్రీలే కాదు పురుషుల సైతం స్పందించిన ఉదాహరణలు చాలానే మన ముందు ఎన్నో కనబడతాయి. ముఖ్యంగా చలం లాంటి వారు స్త్రీలను ఎంతో గొప్పగా చిత్రించారు.

"స్త్రీకి శరీరం ఉంది దానికి వ్యాయామం ఇవ్వాలి. ఆమెకు మెదడు ఉంది దానికి అనుభవం ఇవ్వాలి" అంటాడు చలం. స్త్రీలు స్వేచ్ఛ స్వాతంత్రాలు సంపా దించడం కోసం గట్టిగా పాటుపడిన కీర్తి చలం గారికి దక్కుతుంది. చలం గారి సాహిత్యంలో స్త్రీకి ఒక ప్రత్యేకమైన స్థానం ఉంది. సమాజంలో సగభాగంగా ఉన్న స్త్రీకి సమున్నత గౌరవం దక్కే వరకు స్త్రీవాద సాహిత్యం వెలువడక తప్పదు. స్త్రీల సమస్యలను వెల్లడి చేయక తప్పదు.

ఉపయుక్త గ్రంథ సూచి :

1. ద్వాదశి నాగేశ్వర శాస్త్రి : తెలుగు సాహిత్య చరిత్ర, విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్, విజయవాడ-1998
2. తెలుగు సాహిత్య చరిత్ర : సుజాతా రెడ్డి ముదిగంటి తెలంగాణా సారస్వత పరిషత్తు-2015.
3. సాహితి సుధ : తెలుగు భాషా సాహిత్య వ్యాస సంకలనం, బండ్ల పబ్లికేషన్స్, హైదరాబాదు-2018
4. సిమ్మన్న వెలమల : తెలుగు సాహిత్య చరిత్ర, విశాఖ పట్నం -2011.

★★★

Vol. 23 | Spl. Issue 03 | March 2026 | BHAVAVEENA | ISSN No. : 2456-4702 | RNI No. APTEL/2003/12253

RNI No. APTEL/2003/12253 | Reffered Journal & Peer Reviewed Journals | ISSN No. 2456-4702

భావవీణ

కళలు, సాహిత్య, సాంస్కృతిక భాషాధ్యయన పత్రిక

BHAVA VEENA

Journal of Arts, Literary, Culture & Language Study

జల కవిత్వం - మహిళలు

- గుంటి రోహిత్ కుమార్

పరిశోధక విద్యార్థి, హైదరాబాద్ విశ్వవిద్యాలయం.

వ్యాస సంగ్రహం :

నీటిని వస్తువుగా తీసుకొని రాసిన కవిత్వాన్ని జల కవిత్వంగా భావించవచ్చు. ఈ పత్రంలో తాగునీళ్ల తీసుకురావడంకోసం మహిళలు పడుతున్న బాధలను కవిత్వంలో వ్యక్తీకరించినతీరును తెలుపడం ఒకభాగం, జలాన్ని సంరక్షించడం కోసం వివిధ ప్రణాళికలు, విధానాలను సామాజిక బాధ్యతలో భాగంగా కవిత్వ రూపంలో వ్యక్తీకరించిన మహిళ కవయిత్రుల యొక్క పాత్రను, వారి కవిత్వాన్ని వివిధ విభాగాలుగా చేసుకొని విశ్లేషించడం రెండో భాగం. ఈ కవిత్వాన్ని విశ్లేషణ పద్ధతిద్వారా వివరించాను. గంగ కాశీనాథ్ ప్ర.సం.పాలో వచ్చిన జలమే జగతికి బలం, బైస దేవదాసు సం.పాలో వచ్చిన నీళ్లగోస, ఎస్.నిరంజనరెడ్డి ప్ర.సం.పా లో వచ్చిన తెలంగాణ జల కవితోత్సవం అనే కవిత సంకలనాలు మొదలైన గ్రంథాలను నా వ్యాసానికి ప్రథమ, ద్వితీయ ఆకరాలుగా స్వీకరించాను. ప్రభుత్వం తీసుకున్న చర్యలతో ఒకప్పుడు తాగునీటికోసం కష్టాలు ఎదుర్కొన్న మహిళలు నేడు కొంత ఉపశమనాన్ని పొందారని చెప్పడం ఒకఅంశం అయితే, జీవకోటి భవిష్యత్ మనుగడ కొనసాగాలంటే ఇప్పటి నుంచే జల సంరక్షణ పద్ధతులను పాటించాలని, సమాజాన్ని చైతన్య పర్చడంలో భాగంగా జల సంరక్షణ ప్రణాళికలను తెలియజేస్తూ కవయిత్రులు తమ సామాజిక బాధ్యతను ప్రదర్శించారు. దీన్ని సమాజం అర్థం చేసుకొని పాటిస్తే నీటి కరువులు రావు అని తెలుపడం మరో అంశం. ఈ రెండు అంశాలను తెలియజేయడం ఈ వ్యాస0 యొక్క ప్రధాన ఉద్దేశం.

కీలక పదాలు :

జల కవిత్వం, మహిళలు, తాగునీటి గోస, ప్రభుత్వ ప్రణాళికలు, జల సంరక్షణ ప్రణాళికలు, మహిళ కవయిత్రుల పాత్ర, సమాజ చైతన్యం

ఉపోద్ఘాతం :

"ఆధునిక భారతీయ సాహిత్యంలోనూ, అందులో భాగమైన ఆధునిక తెలుగు సాహిత్యంలోను కన్నీటి సాహిత్యానికి, నీటిసాహిత్యానికి కొదవలేదు." (రాచపాళెం చంద్రశేఖర్ రెడ్డి. 168) రాయలసీమ, తెలంగాణ ప్రాంతాలలోని నీటి ఎద్దడిని తాగు, సాగునీటికి సంబంధించిన బాధలను రెండు ప్రాంతాల కవులు, రచయితలు రచనలు చేసి ఉన్నారు. కవులు అనేకమంది నీటి అవసరాలను, నీటి దోపిడీ తనాన్ని, నీటి గోసలను, నీటి ఎద్దడిని, నీటితో ప్రత్యక్ష మరియు పరోక్ష సంబంధం ఉన్న అంశాలని వస్తువుగా తీసుకుని కవిత్వం రాశారు. అలా రాసిన కవిత్వమే జలకవిత్వం. ఈ పరిశోధన పత్రంలో ప్రధానంగా తాగునీటిని తీసుకురావడంలో మహిళల కష్టాలు, వేదనలు ప్రభుత్వం చేపట్టిన చర్యలద్వారా

మహిళలకు తాగునీటి తిప్పలు తీరిన వైనాన్ని, కవులు కవిత్వంలో వ్యక్తీకరించిన తీరును చెప్పడం ఒకభాగం అయితే రెండో భాగం జల సంరక్షణలో మహిళా కవయిత్రుల పాత్రను తెలియజేయడం ఈ రెండు లక్ష్యాలను ఈ పత్రంలో వివరించడం జరిగింది.

కవిత్వంలో మహిళల తాగునీటి సమస్యల వ్యక్తీకరణ :

మహిళలు తాగునీళ్లు తీసుకురావడంకోసం ఎదుర్కొంటున్న బాధలను, గోసలను, కష్టాలను, నీటి వెదలను కవులు కవిత్వ రూపంలో వ్యక్తీకరించారు. ఈ కవిత్వాన్ని పరిశీలించినట్లైతే

"కనిపించడం లేదా!/వ్యవసాయ బావుల దారుల గుండా
స్త్రీల తలలపై ఎన్ని నీటిబిందెలో!/అగుపించడం లేదా?
ఇదిగో చూడు/బోర్లలొ నీళ్లురాక
హాండిల్ కొట్టికొట్టి కొంగుతో చెమట తుడుచుకునే/ ఎందరు పేదతల్లులో!
అటు చూడు/నీటిని అమ్ముకుంటున్న వ్యాపారి ముఖంలో ఎన్ని కళలో
ఈ గ్రీష్మంలో ఎవరి నోట విన్నా నీరు నీరు దాహం దాహం"

(డా. తిరునగరి నీళ్ల గోస, పుట : 10)

పల్లెలోని తాగునీటికోసం స్త్రీలు పడుతున్న కష్టాలను 'గ్రీష్మర్తు ఘోష' కవితలో డా.తిరునగరి వ్యక్తీకరిస్తున్నాడు. పల్లెలో ప్రధానంగా ఎండకాలంలో తాగునీటి కరువు సంభవించడంతో మహిళలు తాగునీటికోసం కొన్ని కిలోమీటర్లు నడిచి వ్యవసాయ బావులనుంచి నీటిని తెచ్చుకుంటున్నారు. ఒకపక్క ఉన్న బోర్లు ఎండిపోయాయి. ప్రతి సంవత్సరం ఎండకాలంలో తాగునీటి సమస్య వస్తుంది. ఈ పరిస్థితిని అదునుగా తీసుకొని నీటిని వ్యాపారంగా చేసుకొని అమ్ముకునే వ్యక్తులు మరోపక్క ఉన్నారని చెప్పూ, ప్రభుత్వం ఇలాంటి పరిస్థితులు చూసిచూడనట్లు ప్రదర్శించడం సరైన చర్యకాదని వెంటనే ప్రభుత్వం స్పందించి కరువు నివారణ చర్యలు చేపట్టాలని కవి ఆకాంక్షిస్తున్నాడు.

"ఇంకనూ కొన్ని పల్లెలో గుక్కెడు నీళ్ల కోసం..
మైళ్ల దూరం నెత్తిన బిందెలతో ఆడపడుచుల పరుగులు!
ఊళ్ళో చివరగా ఉన్న ఒక్కగానొక్క మంచినీటి బావి/ డొక్కెండుకు పోయి వెక్కిరిస్తోంది
వేళా పాళా లేక .../పట్టణాల్లో కునుకులేకుండా చేసే కుళాయిలు!
ఎప్పుడో గాని నోళ్లు తెరవని బోర్ల వద్ద చాంతడంతా క్యూలు!" (దాస్యం సేనాధిపతి.నీళ్ల గోస.పుట:12)

'గుక్కెడు నీళ్లకోసం' అనే కవితలో దాస్యం సేనాధిపతి పల్లె, పట్టణ ప్రజల తాగునీటి కష్టాలను వ్యక్తీకరిస్తున్నాడు. పల్లెలోఉన్న మంచినీటి బావి ఎండిపోయిన పరిస్థితి ఫలితంగా తాగునీరు లేక కొన్ని కిలోమీటర్ల దూరం నడిచి మహిళలు నెత్తిపై బిందెలలో మోసుకురావడం ఎంతో బాధాకరం. పట్టణాల్లోకూడా నీళ్లట్యాంకులు ఎప్పుడు వస్తాయో తెలియక వేచిచూసే పరిస్థితి. నీళ్లు ఎప్పుడు వస్తాయో తెలియక బోరుబావులవద్ద రోడ్డు పొడవునా క్యూలు. సాంకేతికత అభివృద్ధి చెందిన ప్రస్తుత సమాజంలో కూడా పల్లె, పట్టణాల్లో తాగునీటికొరత వున్న పరిస్థితిని కవి వ్యక్తీకరిస్తున్నాడు.

"ఉరుములు, మెరుపులు, పిడుగులతో /నిరుడు దడదడలాడుతూ వర్షించిన
ఆకాశమిపుడు మౌనం వహించింది /రోడ్లన్నీ సెల యేరులై పారాయే కానీ
మళ్ళీ నీటికటకట మామూలే .../బిడ్డను చంక నెత్తుకున్నట్లు బిందెలతో మహిళలు
సుదూర ప్రాంతలకెళ్లినపుడు అగుపించని నీటితెరలు /మొహంపై నుండి స్వేద బిందువులై
జాలువారాల్సిందే కానీ ... / నీటి బిందెలతో కబుర్లాడుకుంటూ వెళ్ళేనాటి పల్లెసౌందర్యం
మళ్ళీ ఎక్కడ కనిపిస్తుంది?"

(పొత్తూరి సుబ్బారావు.నీళ్ల గోస.పుట:21)

'కన్నీరే మాకు నేస్తం' అనే కవితలో పొత్తూరి సుబ్బారావు పల్లెలో తాగునీటి కరువు సంభవించడ0వల్ల పల్లెలో కనపడే దయనీయ పరిస్థితిని కవిత్వీకరించాడు. గత

సంవత్సరం మెరుగ్గా వర్షాలు సంభవించాయి. కాని ప్రస్తుత సంవత్సరంలో వర్షాలు కురవక తాగడానికికూడా నీళ్లులేని పరిస్థితి ఏర్పడింది. ఫలితంగా కొన్ని కిలోమీటర్లు బిడ్డను చంకలో పెట్టుకున్న మాదిరిగా బిందెలను పెట్టుకొని నడుస్తున్న మహిళలు కనపడుతున్న దుస్థితి నేటి నీటికరువుతో నెలకొంది. నీటితో కళకళలాడే ఒకప్పటి పల్లె సౌ0దర్యాన్ని తలచుకున్నారు. కాని నేటి పల్లెపరిస్థితి నీటికరువుతో దయనీయంగావుంది. ప్రధానంగా వర్షాభావ పరిస్థితులు నెలకొనడం. అంతేగాక వచ్చే వర్షపునీటిని సక్రమంగా ఉపయోగించక పోవడంకూడా కారణంగా కవి వ్యక్తీకరిస్తున్నారు. ఇవే కాక ఈ రకమైన కవితలు అనేకం ఉన్నాయి.

ప్రభుత్వ తాగు సంబంధ ప్రణాళిక కవిత్వంలో మహిళల వ్యక్తీకరణ :

తెలంగాణ రాష్ట్రంలోనే అన్ని గ్రామాల్లో, పట్టణాల్లో ఇంటింటికి స్వచ్ఛమైన రక్షిత తాగునీటిని నల్లాద్వారా అందించాలన్న లక్ష్యంతో ప్రారంభించిన పథకం మిషన్ భగీరథ. మిషన్ భగీరథకోసం రాష్ట్రంలో ఉన్న అన్ని జలాశయాల్లో 10% నీటిని కేటాయించింది. ''మిషన్ భగీరథ పూర్తయి దేశవ్యాప్తంగా గొప్ప పథకంగా ప్రశంసలు అందుకున్నది, ఎన్నో పురస్కారాలను అందుకుంది. దేశంలో వందశాతం గ్రామాలను సురక్షిత తాగునీటి సౌకర్యం కల్పించిన రాష్ట్రం తెలంగాణ అని కేంద్ర ప్రభుత్వం ప్రకటించింది.'' (శ్రీధర్ రావు దేశ్ పాండే 95) మిషన్ కాకతీయ ప్రాజెక్టుద్వారా చెరువునిండిన నీటిని శుద్ధిచేసి మిషన్ భగీరథ ప్రాజెక్టుకు జతకలిపి ఇంటింటికీ తాగునీరు పంపిన వైనాన్ని తెలుపుతూ ఈ కవితలను అల్లారు. ఆడపిల్లలకు శ్రమ తప్పించిన భరోసాగా నిల వడమే కాకుండా ఉన్నవూరికి స్థాణువై నిలిచిన చెరువును కీర్తిస్తూ కవయిత్రి ఊరి ఆనందాన్ని తన ఆనందంగా భావన చేసింది. మావూరి చెరువు అనే కవితలో

''మిషన్ భగీరథతో నల్లాలేస్తే ఇంటింటికి మొక్కింది/
ఆడపిల్ల భరోసా ఇచ్చింది ఎంత ప్రేమో
ఊళ్లలోనే ఉండి స్థాణువై నిలిచింది''

(చీదెళ్ల సీతాలక్ష్మి, జల కవితోత్సవం, పుట:65)

కవి తెలంగాణ ప్రభుత్వం చేపట్టిన మిషన్ భగీరథ ప్రాజెక్టువల్ల గతంలో మహిళలు తాగునీరు కోసం బిందెలు తీసుకోని కిలోమీటర్లు వెళ్లేవారు. ఇప్పుడు ఈ ప్రాజెక్టు ద్వారా ఇంటింటికి నల్లా నుండి నీరు రావడంతో మహిళలు ఎంతో సంతోషంగా ఉన్నారని చెప్తూ ఒకప్పుడు నీటి ఎద్దడితో ఊరు ఎలా నిరాశగా ఉండేదో, నేడు ఎలా జీవశక్తితో కళకళ లాడుతుందో అని మార్పుని కవయిత్రి తమ కవితద్వారా వ్యక్తీకరి0చింది.

నీటిబొట్టుకరువై నీరింకిన కన్నులు బరువై, తనువు తదారి, ఎండిన గొంతుకు గుక్కెడు నీళ్లకోసం చెలమల్లో గిన్నెలతో గీరిపోసినా, సేదబావిలో సుద్దనీళ్ల బుంగలు, ఖాలీ బిందెలు, వగిలిన కుండలు, ఊరిచివరి బోరింగుల్లో నీళ్ళకై కొట్టికొట్టి పులిసి పుండైన రెక్కల కష్టంతో మగ్గిన తెలంగాణ ఆడబిడ్డల వేదనను ప్రజల హర్షం అనే కవితలో

''ఎండిన గొంతుకు/గుక్కెడు నీళ్ల కోసం
కదం తొక్కిన కొత్త బాటలు/తోడిన వాగు చెలెమ ల్లోంచి
గిన్నెలతో గీరి పోసిన కన్ర నీళ్ళఛాయలు/అద్దమ్మ రాత్రులు గిరక సప్పుడు కాకుండా
చేదబావిలో సేదుకున్న సుద్దనీళ్ళ బుంగలు/ఖాళీ బిందెలు పగిలిన కుండలు బారులు తీరి
నీళ్ళరాక కోసం నల్లాలకాడ నిర్ర నీల్గిన పసిపిల్లలు/పాతాళ ఉదకం కోసం ఊరి చివర బోరింగు
రణ రంగంలో పులిసి పుండ్లై ఎండిన రెక్కలు/నిండు చూలాలిలా నీళ్ళట్యాంకర్ వచ్చినప్పుడు
ఆడపడుచులు రాణి రుద్రమలై బిందెలతో చేసిన/నీటి యుద్ధాలు ఆగుతున్నాయ్''

(అమర శ్రీ మహేందర్ అనిమోని, జలకవితోత్సవం, పుట : 136)

తెలంగాణ పల్లెలోని నీటి కరువును వ్యక్తపరుస్తూ వాగు, చెలిమె, చేద బావి, నల్లా, నీళ్ళట్యాంకర్ ఇవన్నీ నీటి కరువుకు చిహ్నాలుగా చెప్తూ నీటి కరువులో ప్రధానంగా తాగునీటి కరువు అద్దం పట్టేటట్లు చెప్తూ మహిళలను రాణి రుద్రమతో పోలుస్తూ వారు నీటికోసం యుద్ధాలు

చేశారని చెప్పడంలోనే నీటి కొరతను అర్థం చేసుకోవచ్చు. అని చెప్తూ నేడు ప్రభుత్వం తీసుకొచ్చిన మిషన్ భగీరథ పథకంద్వారా నీటికొరత ముఖ్యంగా మహిళలకు నీటికష్టాలు తీరనున్నాయన్ని కవి ఇక్కడ ఆశాభావాన్ని వ్యక్తం చేస్తున్నాడు.

"మిషన్ భగీరథ వచ్చే /ఇంటింటికి సజల జలం వచ్చే
ఇల్లాలికి బిందెలతో మోసే బాధ తప్పే"

(తిపర్తి అనిత, జల కవితోత్సవం, పుట : 345)

నేడు తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు తరువాత ప్రభుత్వం చేపట్టిన మిషన్ భగీరథద్వారా ప్రతి ఇంటికి నల్లా నీరు ఇవ్వడంతో మహిళలకు నీటిబిందెలు మోసే బాధ తప్పిందని కవయిత్రి తన సంతోషాన్ని వ్యక్తీకరిస్తుంది.

జలసంరక్షణ కవిత్వంలో మహిళా కవయిత్రుల పాత్ర :

భూమయినా, మనిషయినా తడి ఉ0టేనే వికసించేది. లోకంలోని సమస్త జీవరాశులన్నీ నీటిమీద ఆధారపడి జీవిస్తుంటాయి. నీరులేనిదే ప్రాణం నిలవది. జీవితం మిగులది. మానవుడు జీవనయానం ప్రారంభించింది నీరు లభించే ప్రాంతాల్లోనే. నది చుట్టూరా ఆవరించి నాగరికతలు, సంస్కృతులు వర్ధిల్లినయి." (వనపట్ల, సుబ్బయ్య.7) అలాంటి నీటిని సంరక్షించుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది అని కవయిత్రులు సామాజిక చైతన్యంలో భాగంగా వ్యక్తీకరించిన కవిత్వం ఇది. అందులో బాగంగా వివిధ జల సంరక్షణ ప్రణాళిలు, విధానాలను కవిత్వ రూపంలో సమాజాన్ని చైతన్యం చేయడంలో తమ వంతు బాధ్యతగా వ్యక్తీకరించారు. వాటిని పరిశీలించినట్లైతే.

ఇంకుడు గుంతల సంబంధ జల సంరక్షణ కవిత్వం :

జల సంరక్షణలో ఇంకుడుగుంతలు తవ్వడంకూడా ఒక భాగం. ప్రతి ఒక్కరూ తమ ఇంటి ఆవరణలో ఇంకుడుగుంతలు తవ్వడం ద్వారా ఇంటి వ్యర్థజలాలను, వాననీటిని అందులోకి మళ్లించడం ద్వారా భూమిలో భూగర్భ జలాలను పరోక్షంగా పెంచినవాళ్లమవుతాం. సమాజంలోని ప్రతిఒక్కరూ నీటివిలువను గుర్తించి జలసంరక్షణలో భాగంగా ఇంకుడుగుంతల నిర్మాణం చేపట్టాలని మహిళ కవయిత్రులు వారి కవితల ద్వారా సమాజాన్ని చైతన్యపర్చడంలో భాగంగా వ్యక్తీకరించిన కవిత్వం ఇది.

"హఠాత్తుగా గుర్తుకు వచ్చింది /మా అపార్ట్మెంట్లో ఇంకుడు గుంత లేదని
మహిళలం సమావేశమయి ఇంకుడుగుంత నిర్మాణా నికి నాంది పలికాం
మేము ఒక బోర్డు కూడా వ్రాసి పెట్టాము/'నీటిని పొదుపుగా వాడుకుందాం
మన జలాన్ని మనమే సంరక్షించుకుందాం/అను కోవడమే కాదు ఆచరణలో చూపిద్దాం"

(వై. సుగుణాదేవి. నీళ్లగోస.పుట:80)

ఇంకుడు గుంతల నిర్మాణం చేపట్టాలి అని చెప్పడమే కాదు చేసి చూపెట్టడం ద్వారా అందరికి ఆదర్శం అవుదామని తెలియజేస్తుంది కవయిత్రి. స్వయంగా తను వుంటున్న అపార్ట్మెంటులో నీరు చాలా వృధా అవుతుందని గమనించి తానే అక్కడి మహిళలందరి సహకారంతో ఇంకుడుగుంత నిర్మించింది. తద్వారా నీటి వృధాను అపడంతోపాటు అక్కడ నీటిని పొదుపుగా వాడాలని బోర్డుకూడా పెట్టింది. ఇలా ఏదైనా ఒక విషయాన్ని చెప్పడమే కాకుండా ఆచరణలో చూపించి అందరికి ఆదర్శంగా నిలిచింది.

భూగర్భ జల సంరక్షణ కవిత్వం: జలసంరక్షణలో భాగంగా భూగర్భజలాలను కాపాడుకోవడంద్వారా భవిష్యత్ తరాలకు నీటి కొరత లేని సమాజాన్ని అందించ వచ్చు. కాబట్టి ప్రతిఒక్కరూ వచ్చే వాననీటిని భూమిలోకి ఇంకేటట్లు ప్రతి ఇంటిలో ఏర్పాట్లు చేసుకోవాలి. తద్వారా భవిష్యత్ లో నీటి కొరత వుండదు అనే అంశాన్ని సమాజం లోకి బలంగా తీసుకువెళ్లడానికి కవయిత్రులు జల సంరక్షణలో భాగంగా ఈ రకమైన కవిత్వాన్ని వెలువరిం చారు.

"ఓ మనిషి నీలోని "మనీషి"ని/బయటకు తీసుకురా!
జల సంరక్షణకు దీక్ష బూను!/భూగర్భ జలాలు అడుగంటకముందే
జీవనదులు ఎండకముందే/సమస్త ప్రాణులు చావకముందే

ప్రతి నీటి బొట్టు ఒడిసిపట్టు''

(చిందం సునీత, నీళ్ల గోస, పుట : 28)

'ప్రకృతి పాదాలను అభిషేకించు' కవితలో జల సంరక్షణ ప్రణాళికలో భాగంగా భూగర్భ జలమట్టాన్ని పెంచడంద్వారా జల సమస్యను పరిష్కరించవచ్చునని వ్యక్తీకరిస్తున్నది. మనిషి స్వార్థంతో భువి నుండి వచ్చిన నీటిని వృధా చేయడం, కలుషితం చేయడం, పంచ భూతాలకు హాని కలిగి0చడం, చెట్లను నరకడంవంటి పనులు చేయడంతో వర్షాలు సకాలంలో కురవని పరిస్థితి ఏర్పడింది. జీవనదులు ఎండకముందే, సమస్తప్రాణులు చావకముందే మనిషి ఇప్పటికైనా తన ఆలోచనలు మార్చుకోని తనలోని మానవత్వాన్ని బయటకుతీసి భూగర్భజలాలు అడుగంటకముందే ప్రతి నీటిబొట్టును నిల్వచేయడంద్వారా భూగర్భజలాలస్థాయి పెరుగుతుంది. తద్వారా నీటికరువును నిర్మూలించడంద్వారా భవిష్యత్ లో సకల జీవకోటికి ప్రాణాపాయ ముప్పు వుండదని రచయిత్రి వ్యక్తీకరిస్తున్నారు.

జలవనరుల నిర్మాణ సంబంధ జలకవిత్వం:

జలసంరక్షణలో భాగంగా జలవనరులను సంరక్షించడం ద్వారా జలసంరక్షణ చేపట్టవచ్చును. వచ్చే వాననీటిని సరిగ్గా వినియోగించుకోవలంటే ముఖ్యంగా జలవనరులను సంరక్షించుకోవాలి. జలవనరుల సంరక్షణ ద్వారా భవిష్యత్ నీటికొరత లేని సమాజాన్ని సృష్టించవచ్చు. కావున ముఖ్యంగా కవయిత్రులు జలవనరుల మరమ్మత్తులు, ఆక్రమణలు లేని, నిరంతరం ప్రభుత్వ పర్యవేక్షణ వుండేట్లు అదేవిధంగా ప్రజల భాగస్వామ్యం కూడా ఉండాలి అని కవిత్వంద్వారా తమ సందేశాన్ని వ్యక్తీకరించారు.

''చినుకుల చిత్తడితో తడిసిన నేల/ రేపటి చెట్లకు తల్లిగా మారుతుంది
సంజీవినిలాంటి నీటిని వృధాచేయక/ బొట్టు బొట్టునూ పదిలంగా దాచుకుంటేనే
బతుకు బువ్వ గింజలు పండుతాయి/ నది నదాలన్నీ పొంగిపొర్లితేనే
మనిషికి మనుగడ వుంటుంది''

(పాతూరి అన్నపూర్ణ, నీళ్ల గోస, పుట:53)

'సంజీవిని' కవితలో జల సంరక్షణకోసం జలవనరుల నిర్మాణం, భద్రత చేపట్టడంద్వారానే మనిషి మనుగడ కొనసాగుతుంది అని వ్యక్తీకరిస్తున్నది. నీటినిల్వలు భూమిలో పెరుగటంతో పచ్చనిచెట్లకు నీరు అమృతంగా ఉపయోగపడుతుంది. ఫలితంగా మానవసమాజంకు కావలసిన ఆహారపదార్థాలు లభ్యమవడంద్వారానే మానవ మనుగడ సాధ్యమవుతుందని తెలియజేస్తూ దీనికోసం మొదటగా జలవనరుల నిర్మాణం చేసి తద్వారా జల సంరక్షణ చేపట్టాలి అని రచయిత్రి వ్యక్తీకరిస్తుంది.

''చెరువులలో జలకళ పెంచడం /నీటిసంక్షోభాన్ని అరికట్టడం
జల సంరక్షణ చేయడం/ ఇదే మన కొత్త సంవత్సర తీర్మానం
బొట్టుబొట్టును ఒడిసి పడదాం/ఇంటింటికి తిరుగుతూ
బొట్టు పెట్టి చెపుదాం..''

(శ్రీమతి వసంత లక్ష్మణ్, జలమే జగతికి బలం, పుట : 135)

కవయిత్రి 'నీటి సంక్షోభాన్ని అరికడుదాం' కవితలో నీటివనరుల సంరక్షణ చెప్తూ రానున్న నూతన సంవత్సరంలో ప్రతి ఒక్కరూ నీటిని పొదుపుగా వాడుకుంటామని, జలవనరుల సంరక్షణ చేపడుతామని, కొత్త సంవత్సరం సందర్భంగా తీర్మానించుకోవాలి. అంతేగాక ప్రతి ఊరిలోని చెరువులలో జల కళను పెంచడం, నీటి సంక్షోభం అరికట్టడమే ధ్యేయంగా ఈ నూతన సంవత్సరంలో ముందుకు వెళ్లాలని ఆకాంక్షిస్తుంది.

జల చైతన్య సంబంధ జల కవిత్వం

జల సంరక్షణ కై ప్రజల్లో చైతన్యం తీసుకు రావడానికి నేటి కవయిత్రులు నడుం బిగించారు. ఈ కవితల్లో ప్రజచైతన్యానికి సాహిత్యం ఒరవడినిస్తుందనే ఆకాంక్షతో కవయిత్రులు కింది కవితలో జలసంబంధ చైతన్యాన్ని పొందుపరిచారు.

"మేలుకో! మానవా! మేలుకో!!/ప్రకృతి ప్రకోపించక ముందే
ప్రాణకోటి అంతరించకముందే/వచ్చే వానచుక్కని ఒడిసిపట్టు
వసుధగర్భాన తిరిగినింపు/ఇంకా మించక ముందే/
పచ్చదనాన్ని పెంచుదాం/పాపవిమోచన చేసు కుందాం!"

(నాంపల్లి సుజాత, నీళ్ల గోస, పుట : 33)

'స్వయం కృతాపరాధం' కవితలో ప్రకృతి వైపరీత్యాలు జరగకముందే, ప్రాణకోటి అంతరించకముందే మనిషి తన తప్పులను తెలుసుకోవాలి. ఇప్పటికైనా వచ్చే జలాన్ని పొదుపుగా వాడుకొవడం, వృధా నీటిని నీటినిల్వలుగా మార్చడం, చెట్లతో పచ్చదనాన్ని పెంచడం చేయాలి. నీటి కారణంగా ప్రాణనష్టం జరగకముందే మనిషి పాప విమోచన చేసుకోని జల చైతన్యాన్ని గుర్తించాలని కవయిత్రి ఆకాంక్షిస్తున్నారు.

నీటిపొదుపు సంబంధ జలకవిత్వం

"నీటిని పొదుపు చేసుకోకపోతే, అందుబాటులో ఉన్న జలాన్ని సంరక్షించుకోకపోతే మనిషికి మాత్రమే కాదు ఈ ప్రకృతికి అది ఒక శాపంగా మారుతుందని, నీటి వృధా అరికట్టడంద్వారా భవిష్యత్ ను నిర్మించుకోవచ్చు." (దార్ల వెంకటేశ్వరావు.26) జల సంరక్షణలో భాగంగా భవిష్యత్ లో వచ్చే నీటికరువులను దృష్టిలో పెట్టుకొని పొదుపుగా వినియోగించుకోవాల్సిన ఆవశ్యకతను కవయిత్రులు తెలియజేస్తున్నారు

"చెప్పడం కాదు చేసి చూపిద్దాం/ఆశయం కాదు అడుగులు వేద్దాం
ఒక్కరని కాదు అందరూ ఒక్కటై/పవిత్ర మనసుతో సడలని సంకల్పంతో
భావితరాలకు తరగని సంపదగా/మానవ మనుగడకు తోడుగా
పశుపక్షాదులకు భరోసాగా/ఉన్న నీటిని పొదుపుగా వాడుదాం
రానున్న చినుకులను ఒడిసి పడుదాం...
నీటి విలువలు తెలియజేద్దాం ఒకరికి ఒకరై ఐక్యంగా సమైక్యంగా
నీటియజ్ఞాన్ని ఆచరించిచూపుదాం జగతికి సంతోషాన్ని అందిద్దాం"

(అన్నపూర్ణ, జలమే జగతికి బలం, పుట : 66)

'అందరూ ఆచరిస్తేనే' కవితలో సమాజంలోని ప్రతి ఒక్కరూ జలసంరక్షణలో భాగంగా ఉన్న నీటిని పొదుపుగా వినియోగించడంద్వారా ప్రపంచవ్యాప్తంగా జీవకోటి మనుగడకు తోడ్పడుదాం అని పిలుపునిస్తున్నది. ఈ కవితలో జల సంరక్షణ ప్రణాళికను చెప్తూ జలసంరక్షణ మాటలతో కాదు చేతలతో చూపించాలి. అందుకోసం ఒక్కరని కాదు అందరూ కలిసికట్టుగా ధృఢసంకల్పంతో పనిచేయాలి. మానవ సమాజంతోపాటు జీవజాతులకు కూడా భరోసా ఇచ్చే విధంగా భావితరాలకు తరగని సంపదగా జల లభ్యత ఉండాలి. కావున ప్రతి ఒక్కరూ సమైక్యంగా జల పొదుపు యజ్ఞాన్ని ఆచరిస్తు జగతి మనుగడకు తోడ్పడుదాం అని కవయిత్రి సందేశానిస్తున్నారు.

ఉపసంహారం

1. ఈ జల కవిత్వంలో మహిళల తాగునీటి కష్టాలను, బాధలను, గోసలను వ్యక్తీకరించిన తీరును విశ్లేషించడం జరిగింది.
2. తెలుగు రాష్ట్రాలలో తెలంగాణ ప్రభుత్వం తీసుకొచ్చిన మిషన్ భగీరథ పథకం ఫలితంగా కొంతమేర మహిళల తాగునీటి తిప్పలు తీరిన పరిస్థితిని, పథకం ప్రయోజలనాలను కవిత్వంలో వ్యక్తీకరించిన తీరును విశ్లేషి0చడం జరిగింది.
3. జలసంరక్షణ ప్రాముఖ్యతను చెప్తూ అందుకోసం చేపట్టాల్సిన ప్రణాళికలను, విధాలనాలను కవిత్వ రూపంలో కవయిత్రులు వ్యక్తీకరించిన తీరును విశ్లేషించడం జరిగింది.

4. జలసంరక్షణలో సమాజాన్ని చైతన్యం చేయడంలో ముఖ్యంగా సాహిత్యంలో మహిళా కవయిత్రుల పాత్రను అర్థం చేసుకోవడంతో పాటు సామాజిక అంశాల సంరక్షణలో మహిళా కవయిత్రుల భాగస్వామ్యాన్ని అర్థం చేసుకోవచ్చు.

5. మహిళా కవయిత్రులు వ్యక్తీకరించిన ప్రణాళికలను, విధానాలను మానవ సమాజం పాటిస్తే భవిష్యత్ లో నీటికొరతను అధిగమించవచ్చు.

ఆధార గ్రంథాలు

1. కాశీనాథ్, గంగ (ప్ర. సం.పా). జలమే జగతికిబలం.సంగారెడ్డి:సాహిత్యరంజనిసాహితీసాంస్కృతిక కళాసంస్థ. మే 2019.
2. చంద్రశేఖర్ రెడ్డి, రాచపాళెం. కొన్ని కావ్యాలు కొందరు కవులు (ప్రాచీన, ఆధునిక తెలుగు కవిత్వం మీద వ్యాసాలు). 2008.
3. దార్ల వెంకటేశ్వరావు మిసిమిమాసపత్రిక.ఫిబ్రవరి2024.
4. దేశ్ పాండే, శ్రీధర్ రావు. సాగునీటి రంగంలో తెలంగాణ పదేండ్ల ప్రస్థానం. హైదరాబాద్:తెలంగాణ వికాస సమితి, మే 2025.
5. దేవదాసు, బైస. నీళ్లగోస. హైదరాబాద్. నేటి నిజం ప్రచురణ. 2019.
6. నిరంజన్ రెడ్డి, సింగిరెడ్డి (ప్ర.సం.పా), తెలంగాణ జల కవితోత్సవం, హైదరాబాద్ : తెలంగాణ రచయితల సంఘం, తెలంగాణ వికాస సమితి. సెప్టెంబర్ 2018.
7. సుబ్బయ్య, వనపట్ల. తడి (కవిత్వం). హైదరాబాద్: తెలంగాణ వికాస సమితి. ఆగస్టు 2017.

★★★

Vol. 23 | Spl. Issue 03 | March 2026 | BHAVAVEENA | ISSN No. : 2456-4702 | RNI No. APTEL/2003/12253

RNI No. APTEL/2003/12253 | Reffered Journal & Peer Reviewed Journals | ISSN No. 2456-4702

భావవీణ

కళలు, సాహిత్య, సాంస్కృతిక భాషాధ్యయన పత్రిక

BHAVA VEENA

Journal of Arts, Literary, Culture & Language Study

మాతంగి దివిటి - మహిళా చైతన్య స్ఫూర్తి

– డా॥. వి. లక్ష్మ

స్కూల్ అసిస్టెంట్ (తెలుగు), జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాల, వినుకొండ, పల్నాడు జిల్లా.

వ్యాస సంగ్రహం :

కన్నడ దళిత స్త్రీ మొదటి ఆత్మకథ "మాతంగి దివిటి". బెంగళూరు విశ్వవిద్యాలయం సోషియాలజీ విభాగంలో పనిచేస్తున్న ఆచార్య సమతా బి. దేశమానె తన జీవితంలో జరిగిన యథార్థ సంఘటనలను అక్షరీకరిస్తూ కన్నడంలో "మాతంగి దివిటిగె" పేరుతో 2015లో పుస్తకాన్ని రచించారు. ఈ పుస్తకం కన్నడ నాట సంచలనం సృష్టించింది. చదువు మాత్రమే జీవితాలను మార్చగలదని తరాల అంతరాలను చెరిపి వేయగలదని ఆచార్య సమతా బి. దేశమానె జీవితం నిరూపించింది. ఈ పుస్తకం స్త్రీల చైతన్యానికి స్ఫూర్తిగా నిలిచింది. కన్నడంలో ప్రాచుర్యం పొందిన "మాతంగి దివిటిగె" పుస్తకాన్ని తెలుగులో "మాతంగి దివిటి" పేరుతో ఆచార్య కె. ఆశాజ్యోతి అనువదించారు. 2019లో ప్రచురించబడిన మాతంగి దివిటి పుస్తకం తెలుగునాట మహిళలకు మార్గదర్శిగా నిలిచిందని చెప్పవచ్చు. చదువు ప్రాముఖ్యతను ఈ పుస్తకం చెబుతుంది. స్త్రీ విద్య ఎంత అవసరమో ఈ పుస్తకం వివరిస్తుంది. మాతంగి దివిటి పుస్తకంలోని ఆచార్య సమతా బి. దేశమానె వారి అక్కాచెల్లెల్లు ఏడుగురు చదువు ద్వారా తమ జీవితాలను ఎలా ఆదర్శంగా తీర్చి దిద్దుకున్నారో, నేటి మహిళలకు ఎలా స్ఫూర్తిగా నిలిచారో వివరించడం ఈ వ్యాసం ప్రధాన ఉద్దేశం.

ఉపోద్ఘాతం :

ప్రాచీన భారతీయ చరిత్రలో స్త్రీలు మహోన్నతమైన స్థానాన్ని కలిగి ఉన్నారు. ఋగ్వేద కాలం నాటి సమాజంలో స్త్రీల ఆధిక్యత కొనసాగింది. ఆనాటి స్త్రీలు వేదాలను అధ్యయనం చేసేవారు. యజ్ఞ యాగాదుల్లో పాలుపంచుకోవడమే కాకుండా యుద్ధాలు కూడా చేశారని వేదాల ద్వారా అర్థం చేసుకోవచ్చు. రాను రాను సమాజంలో స్త్రీ ప్రాధాన్యత తగ్గిపోయింది. ఇంటా, బయటా స్త్రీలకు దక్కాల్సిన గౌరవం దక్కలేదు. " భారతదేశాన్ని పాలించిన గుప్తుల కాలంలో స్త్రీలకు గౌరవస్థానం లేనట్లుగానే కనిపిస్తుంది. వరాహమిహిరుడు. ఆనాటి సమాజంలో స్త్రీల దుస్థితిని చూచి, తాను రచించిన బృహత్సంహితలో స్త్రీల పట్ల తనకు గల అభిప్రాయాన్ని తెలియచెప్పాడు. స్త్రీ వంటి రత్నం ఈ సృష్టిలోనే లేదని, ఆ రత్నం గురించి విన్నా, చూచినా, స్పృశించినా, దాన్ని గురించి ఆలోచించినా ఆనందం కలుగుతుందని, పురుషుడు స్త్రీ వలననే ధర్మయుతమయిన కామ్యార్థ సిద్ధి పొందుతున్నాడని, పురుషుడు స్త్రీ వలననే పుట్టుచున్నాడని స్త్రీలను దూషించడం వలన పురుషులకు సుఖం కలుగదని తెలియచేశాడు. కాకతీయుల కాలంలో రాజ్యం పాలించిన రుద్రమదేవి. కవయిత్రి మొల్ల వంటి వారిని వ్రేళ్లతో లెక్కపెట్టవచ్చు. మధ్యయుగం నాటికి స్త్రీకి గల గౌరవ

మర్యాదలు పూర్తిగా దిగజారిపోయినట్లుగానే చెప్పవచ్చు. స్మృతులు, ధర్మశాస్త్రాలు స్త్రీలకు పతియే ప్రత్యక్ష దైవం. భర్త మాటలను ధిక్కరించిన స్త్రీని తిట్టి, కొట్టి హింసించాలని, విద్య నేర్చిన స్త్రీకి వైధవ్యం కలుగుతుందని, స్త్రీ విద్య నేర్చుకోవడానికి అర్హురాలు కాదని, వైదిక కర్మ కాండలు చేసే అధికారం లేదని, పతిని పూజించిన సతికి మోక్షం కలుగుతుందనే నియమ నిషేధాలు స్త్రీని కేవలం ఇంటికి మాత్రమే పరిమితం చేశాయి. "ఈ విధంగా అణిచివేతకు గురైన స్త్రీలు 18, 19వ శతాబ్దానికి వచ్చేసరికి సామాజికంగా తీవ్ర సమస్యలను ఎదుర్కొన్నారు. సతీ సహగమనం, బాల్యవివాహాలు, దేవదాసి వ్యవస్థ, ఆర్థిక స్వాతంత్ర్యం కొరవడటం, కట్టుబాట్లు, వివక్ష వంటి సామాజిక రుగ్మతలవలలో స్త్రీ చిక్కుబడింది. విద్యకు దూరమవడమే వీటన్నిటికీ కారణమని నాటి సంఘ సంస్కర్తలు భావించారు. విద్య ద్వారానే స్త్రీ బాధలకు విముక్తి కలుగుతుందని, సామాజిక అంతరాలు తొలగి పోతాయని మహిళా విద్య ఆవశ్యకతను గుర్తించారు. స్త్రీ విద్యకు విశేషమైన కృషిచేసిన తొలి మహిళా ఉపాధ్యాయురాలిగా సావిత్రిబాయి పూలే చరిత్రలో నిలిచి పోయారు. స్త్రీ విద్యను ప్రోత్సహించి, సమాజంలో వెనుకబడిన వర్గాల స్త్రీలకు విద్యను దగ్గర చేసి, వారిలో చైతన్యం నింపి, తన భర్త జ్యోతిరావు పూలేతో కలిసి 1848లో పూణేలో బాలికల కోసం మొదటి పాఠశాలను స్థాపించారు. నాటి సమాజంలో ఇది విప్లవాత్మకమైన మార్పు. నాటి సాహిత్యకారులు స్త్రీల పక్షాన నిలబడి తమ రచనల్లో స్త్రీ వివక్షను ప్రశ్నించారు. " ఫ్యూడల్ సమాజంలో స్త్రీలను కట్టుబాట్లు సాంప్రదాయం. పాతివ్రత్యం పేరుతో ఎలా అణచివేసేవారో, వారిలో కొందరు తిరుగుబాటు మనస్తత్వంతో సంకెళ్ళను భేదించుకోవాలని ఎంత తపనపడేవారో, సంఘర్షణకు లోనయ్యేవారో శరత్ ఎంతో హృద్యంగా చిత్రీకరించటమేగాక, ఫ్యూడల్ జీవన విధానంతో అనుసంధానించి ఆ అణచివేతను చూపారు. ప్రేమ్ చంద్ అట్టడుగు వర్గాల స్త్రీలు అణచివేతను ఎదుర్కొనే వైనాన్ని చూపించడంతో పాటు మధ్యతరగతి జీవితాన్ని కూడా తడిమారు. శ్రీపాద బ్రాహ్మణ జీవితాల్లో స్త్రీల హీనస్థితిని హృదయం ద్రవించేలా చిత్రీకరించారు. గురజాడ ఆనాటి బాల్యవివాహాలు, కన్యాశుల్కం, వేశ్యల స్థితి, విధవల దైన్యంతో పాటు స్త్రీల దుస్థితిని ఆనాటి జీవన విధానంతో కలిపి చూపుతూ ఆ పరిస్థితి మారాలనే తపన మనలో కలిగింపజేస్తారు. పుత్తడిబొమ్మ పూర్ణమ్మ, కన్యక కథలు చదువుతూ కన్నీరు కారుస్తూ పిడికిలి బిగించని స్త్రీ లేదు. చలం స్త్రీలను ప్రేమించాడు. వారి అందాన్ని ఆరాధించాడు. వారు స్వేచ్ఛగా జీవించాలనీ ఆకాంక్షించాడు. ఆనాటి ఆర్థిక జీవన విధానంతో వారి అణచివేతని విశ్లేషించి చూడలేకపోయినా స్త్రీ స్వేచ్ఛని ఆకాంక్షించే మహనీయుడిగా మిగిలిపోయాడు. గోపీచంద్ స్త్రీల విషయంలో దాదాపు ఈ కోవకే చెందుతాడు. రావిశాస్త్రి మరో సారా కథలో స్త్రీ దైన్యాన్ని చిత్రీకరిస్తే గోవులొస్తున్నాయి జాగ్రత్త, వంటి నవలల్లో శవమెత్తిన కాళికల్ని చూపించాడు. కొడవటిగంటి సౌందర్యం అంటే నిజానికి ఏమిటి అనే విషయం దగ్గర నించి వివాహవ్యవస్థ వరకు అనేక సున్నితమైన విషయాలను ప్రస్తావించారు. రంగనాయకమ్మ సూటిగా హృదయానికి తాకేలా రాయటమేగాక హాస్యం, హేళనల ద్వారా కూడా పురుషాధిక్యతను ఎత్తిచూపారు. "ఈ విధంగా స్త్రీల సమస్యలను ప్రస్తావిస్తూ సాహిత్యకారులు, సామాజిక కార్యకర్తలు, సంఘసంస్కర్తలు స్త్రీల పక్షాన నిలిచారు. విద్యకు దూరమవడమే స్త్రీల వెనుకబాటుకు ప్రధాన కారణమని అర్థం చేసుకోవచ్చు. ఇటువంటి క్రమంలో స్త్రీ విద్యకు ఎంతో ప్రాధాన్యత ఏర్పడింది. 20వ శతాబ్దం నాటికి ప్రభుత్వం స్త్రీ విద్యను ప్రోత్సహించింది. తొలి తరం విద్యావంతులైన స్త్రీల జీవితాలలో మార్పులను స్పష్టంగా గమనించవచ్చు. విద్య మాత్రమే స్త్రీల జీవితంలో వెలుగులు నింపగలదు. ఈ సూక్తికి నిదర్శనంగా మాతంగి దివిటి పుస్తకం నిలిచింది. మాతంగి దివిటి ఆత్మకథ విశ్లేషణ ద్వారా అణగారిన వర్గాల స్త్రీలకు విద్య ఎంత అవసరమో, ఉన్నత విద్యను అభ్యసించిన మహిళల జీవితాలు ఎంత గొప్ప మార్పునకు లోనవుతాయో గమనించవచ్చు. స్త్రీల జీవితాల్లో విద్య ఎటువంటి మార్పులు తీసుకొస్తుందో, ఇతరులకు స్ఫూర్తిగా ఎలా నిలుస్తుందో అర్థం చేసుకోవచ్చు.

మాతంగి దివిటి - మహిళా చైతన్య స్ఫూర్తి :

మాతంగి దివిటి - పరిచయం :

ఆచార్య సమతా బి. దేశమానె ఆత్మకథ మాతంగి దివిటి. కర్ణాటకలోని గుల్బర్గా ప్రాంతంలోని గాజీపుర ఓ మురికివాడ. అన్నార్తులు, నిరుపేదలు, రోజువారి కూలీలు అక్కడి స్థానికులు. సుమారు ఎనభై ఏళ్ల క్రితం బాబురావు, రత్నమ్మ దంపతులు అక్కడ నివాసం ఉండేవారు. దగ్గర్లోని ఓ మిల్లులో బాబురావు దినసరి కూలిగా పనిచేస్తూ, రత్నమ్మ రోడ్డు పక్కన కూరగాయల అమ్ముతూ కుటుంబాన్ని పోషించేవారు. వీరికి ఎనిమిది మంది సంతానం. వీరిలో ఏడుగురు ఆడపిల్లలు. ఈ ఏడుగురిలో ఈ పుస్తక రచయిత ఆచార్య బి. సమతా దేశమానె ఒకరు. బాబురావుకి చిన్నతనంలో చదువు కోవాలనే కోరిక ఉండేది. కానీ పేదవాడని, అంటరాని వాడని ఎవరు చదువు చెప్పలేదు. చదవంటే ఎంతో ఆసక్తి ఉన్న బాబురావు తనలా తన బిడ్డలు కాకూడదని సంకల్పించాడు. "నాకు ఏ పాఠశాలలోనూ ఎవరూ విద్య నేర్పలేదు. అస్పృశ్యుడిని అని ముట్టుకోలేదు. ఈ అవమానం, హింస, వేదన ముందు ముందు నా బిడ్డలకు కలుగకూడదు. నాకెంత కష్టం కలిగినా, హింస అనుభవించినా, బహిష్కరింపబడినా సరే నేను నా పిల్లలందరికీ విద్యను నేర్పించి వాళ్ళ ద్వారా జాంబవ ఖండంలో లక్షలాది ప్రజలకు నా బిడ్డలు విద్యాదానం చేసేట్టుగా నేను చదివిస్తాను "అని సంకల్పించాడు. అనుకున్నట్లుగానే ఎన్ని కష్టాలు ఎదురైనా తన బిడ్డల్ని చదివించాడు. వారి బిడ్డలు క్రమశిక్షణతో విద్యను అభ్యసించారు. వాళ్ళందరూ గొప్పగా చదివారు. అందరూ డాక్టరేట్ లు సాధించారు. అందరూ అత్యున్నత స్థానంలో ఉద్యోగాలు సాధించారు. వీరిలో ఒకరు పద్మశ్రీ అవార్డు కూడా అందుకున్నారు. తన కుటుంబం ఎదుర్కొన్న కష్టాలు, చదువుకోవడంలో ఎదురైన అవరోధాలు, పట్టుదల, విజయం, స్ఫూర్తి వీటన్ని కలయికతో సమతా బి. దేశమనె తన ఆత్మకథను మాతంగి దివిటి పేరుతో రచించారు.

స్త్రీ విద్య - ఆవశ్యకత :

స్త్రీ విద్య ఆవశ్యకతను బాబురావు దంపతులు తెలుసుకున్నారు. వారికి తమ ఎనిమిది మంది బిడ్డలను పోషించడమే చాలా కష్టమైన పని. ఇక చదువు చెప్పించడం దాదాపు అసాధ్యమైన పని. కానీ విద్య ద్వారానే స్త్రీల జీవితంలో మార్పు వస్తుందని బలంగా నమ్మిన బాబురావు బిడ్డలందరినీ చదివించాడు. వీరు ప్రాథమిక విద్య చదివే రోజుల్లో శివశరణప్ప మాస్టారు విద్య గురించి మరింత వివరించి వీరిని ప్రోత్సహించారు. "అమ్మా! నీ పిల్లలు బుద్ధిమంతులు. పేదరికమని, ఆడపిల్లలని , వాళ్ళు పెద్ద మనుషులైనారని బడికి పంపకుండా ఆపకు. వీరందరికీ విద్యాసంస్కారం ఉంది. గ్రహణ శక్తి ఉంది. భవిష్యత్తులో పెద్దపెద్ద ఉద్యోగాలు చేస్తారు. పేదరికం శాశ్వతం కాదు. అది పగలు రాత్రి లాగా వస్తుంది పోతుంది. పేదరికం పోవాలంటే ఈ పిల్లలు ఉద్యోగం చేయాలి." అంటూ శివశరణప్ప మాస్టారు వివరించారు. నాటి సమాజంలో స్త్రీ విద్యను ప్రోత్సహించిన సంఘ సంస్కర్తలతో పాటు ఎందరో ఉపాధ్యాయులు కూడా ఉన్నారు అనడానికి ఇది ఒక ఉదాహరణ. ఆయన బోధించిన తీరు ఆ ఆడపిల్లల్లో వారి తల్లిదండ్రుల మనసుల్లో బలంగా నాటుకు పోయింది. చిన్నప్పుడు వారి మనసుల్లో నాటిన ఆ విత్తనాలు పెరిగి పెద్దవై ఈ సమాజానికి మంచి ఫలాలను అందించాయి. అలాగే దొడ్డప్ప గారి గురించి ఈ పుస్తకంలో గొప్పగా చెప్పారు. ఆయనను అక్షరధాసోహ జ్ఞాన జ్యోతిగా అభివర్ణించారు. "దొడ్డప్పగారు కలబురిగిని అక్షర దాసోహ జ్ఞాన జ్యోతిగా చేసిన పుణ్యాత్ములు. ఆడపిల్లలకు చదువు నేర్పించని ఆ రోజులలో దొడ్డప్ప గారు తమ స్వంత టాంగాను అట్టడుగు వర్గాల అస్పృశ్యుల ఇళ్ళకు పంపి పిల్లలను బడికి తీసుకెళ్ళే ఏర్పాటు చేశారు. ఆడపిల్లల కోసమే ప్రాథమిక విద్య మొదలుకొని వాణిజ్య, విజ్ఞానశాస్త్రాలు ఇప్పటి ఐ.ఏ.ఎస్. వరకు శిక్షణ ఇప్పించే ఏర్పాటు చేశారు. వారు వేసిన మొదటి అడుగు అందరికీ విద్య లభించాలి. లింగ వివక్ష, జాతి వివక్ష లేకుండా బసవణ్ణ ప్రవచించిన సమానతను ఆకాంక్షిస్తూ అణగదొక్కబడుతున్న వర్గాన్ని ప్రేమతో పలకరిస్తూ వారికి విభూతిని నుదుటిపై మూడు వేళ్ళతో అడ్డంగా పూసేవారు. ఏ భక్తుడొచ్చినా ప్రసాదం తీసుకుని

వెళ్ళమనేవాడు. పేదలను ఎంతో ప్రేమించేవారు. భాష, రంగు, పుట్టుక మూలం, లింగ, జాతి, ధర్మ అన్నింటినీ దాటి దైవత్వం, సాత్వికత చూపించి నిజమైన జంగమునిగా దొడ్డప్ప నిలిచారు.'' అంటూ స్త్రీ విద్యా వ్యాప్తికి కృషి చేసిన దొడ్డప్ప గురించి ఈ పుస్తకంలో రచయిత వివరించారు. స్త్రీలకు విద్య అవసరమంటూ పాఠశాలలు నెలకొల్పి విద్యాదానం చేసిన సావిత్రిబాయి పూలే దంపతుల బాటలో ఆ తర్వాత ఎందరో సంస్కర్తలు నడిచారని ఈ పుస్తకం ద్వారా అర్థం చేసుకోవచ్చు. స్త్రీ విద్యా వ్యాప్తికి, విద్య ఆవశ్యకతకు పాటుపడిన వీరందరి కృషి వల్ల ఎందరో స్త్రీల జీవితాల్లో వెలుగులు నిండాయి. వీరిలో బాబూరావు దంపతుల బిడ్డలు కొందరిని అర్థ మవుతుంది.

విద్య చూపిన విజయ మార్గం :

బాబురావు దంపతుల ఏడుగురు ఆడపిల్లలు విజయలక్ష్మి, యుగాంతరి, సమత, జాగృతి, నాగరత్న, హిందుమతి, జయశ్రీ క్రమశిక్షణతో చదివారు. ఎన్ని అవాంతరాలు ఎదురైనా, ఎన్ని కష్టనష్టాలు వచ్చినా, అవమానాలు వివక్షకు గురైనా ఓర్పుతో చదివారు. మొదటిగా వీరిలోని విజయలక్ష్మికి బెంగుళూరులోని కర్ణాటక మెడికల్ కాలేజీలో ఎంబిబిఎస్ ప్రవేశం లభించింది. దీనికి వేయి రూపాయల ఫీజు కట్టాలి. ఈ డబ్బు వారిచేతిలో లేదు. ఇటువంటి క్లిష్ట పరిస్థితుల్లో తల్లి రత్నమ్మ తన మంగళ సూత్రాన్ని అమ్మి వెయ్యి రూపాయలు విజయలక్ష్మి చేతిలో పెడుతుంది. ''తాళి ఒక్కసారే కడతారు.. తిరిగి ఒక్కసారే తీస్తారు. అటువంటిది నా చదువుకై కూతురు డాక్టర్ కావాలని కలలు కన్న ఈ తల్లి ఎంతటి త్యాగశీలి..'' అనుకున్న విజయలక్ష్మి తల్లిదండ్రుల కష్టాన్ని వృధా కానివ్వలేదు. పట్టుదలతో చదివారు. ఎంబిబిఎస్ పూర్తి చేశారు. క్యాన్సర్ సర్జన్ గా ఉన్నత చదువు చదివి ఆసియా ఖండంలోనే ప్రఖ్యాతి గాంచిన బెంగళూరులోని కిడ్వాయి క్యాన్సర్ ఆసుపత్రిలో ప్రొఫెసర్ గా చేరి అదే ఆసుపత్రిలో డైరెక్టర్ గా ఎదిగారు. అత్యంత నిరుపేద కుటుంబం నుంచి??మురికివాడ నుంచి, వివక్షకు గురైన కుటుంబం నుంచి ప్రయాణం మొదలుపెట్టిన విజయలక్ష్మి కేవలం విద్య ద్వారా మాత్రమే ఈ స్థాయికి చేరుకోగలిగారు. ఆమె భారత ప్రభుత్వం నుంచి పద్మశ్రీ అవార్డును అందుకున్నారు. దీనంతటికీ చదువు మాత్రమే కారణమని చెప్పవచ్చు. విజయలక్ష్మి బాటలోనే మిగిలిన ఆరుగురు అత్యున్నత చదువులైన డాక్టరేట్లు సాధించారు. బెంగళూరు విశ్వ విద్యాలయం సమాజ శాస్త్ర విభాగంలో ఆచార్యులుగా సమత, రాయచూరులోని కృషి విశ్వవిద్యాలయం అర్థశాస్త్ర ఆచార్యులుగా జాగృతి, గుల్బర్గా ఇంజనీరింగ్ కాలేజీలో ప్రొఫెసర్ గా ఇందుమతి ఇలా అందరూ ఉన్నతమైన స్థానాలను అందుకున్నారు. ఇంతటి ఘన విజయాలు సాధించిన ఈ స్త్రీల చేతుల్లో ఉన్న ఏకైక ఆయుధం చదువు ఒక్కటే. స్త్రీలకు విద్య ఎంత అవసరమో మాతంగి దివిటి పుస్తకం చెబుతుంది. విద్య తరాన్ని మార్చగలరని బాబురావు, రత్నమ్మ దంపతుల ఆడ బిడ్డలు నిరూపించారు. ఓ మురికివాడిలో జన్మించిన వీరు విమానాలు ఎక్కి దేశ విదేశాల్లో వివిధ విశ్వవిద్యాలయాల్లో జరిగిన సదస్సుల్లో పాల్గొన్నారు. వీరి జీవితాన్ని అక్షరీకరించి మార్గదర్శిగా ఎందరో మహిళల జీవితాల్లో వెలుగులు నింపేందుకు ప్రయత్నించారు. ఇదంతా చదువు చూపించిన మార్గం. మురికివాడలో చిన్న పూరి గుడిసెలో ఆకలితో నిద్రలేని రాత్రులు గడిపిన బాబురావు ''నా బిడ్డలను చదివిస్తాను.. లక్షలాది ప్రజలకు నా బిడ్డలు విద్యను దానం చేసేవారిగా తీర్చిదిద్దాను..'' అంటూ కన్నకల నేడు నిజమైంది. ఇదంతా స్త్రీ విద్య సాధించిన ప్రగతి.

ముగింపు :

సామాజిక పరిణామ క్రమంలో స్త్రీల వెనుకబాటుకు ప్రధాన కారణం వారు విద్యకు దూరమవడమే. సమాజ పురోగతిని మహిళలు సాధించిన పురోగతి ద్వారా కొలుస్తా నని భారతరత్న డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ చెబుతారు. స్త్రీ పురోగతి సాధించాలంటే అది విద్య ద్వారా మాత్రమే సాధ్యమవుతుంది. విద్యావంతురాలైన స్త్రీ ఆర్థిక స్వాతంత్ర్యాన్ని పొందుతుంది. విద్య ద్వారా స్వయం నిర్ణయాధికారం, సామాజిక గౌరవం లభిస్తుంది. వీటిని

ప్రతిబింబించే నిజ జీవిత గాధలు మాతంగి దివిటి విశ్లేషణ ద్వారా అర్థం చేసుకోవచ్చు. ''విద్య అంటే కొండమీదున్న దేవాలయం. ఆ దేవాలయానికి వెళ్లాలంటే ఒక్కొక్క మెట్టు ఎక్కాలి. అక్కడికి ఎగిరి చేరుకోవడానికి కుదరదు. దూరంగా ఉంది ఎలా వెళ్లాలి అంటే కూడా కుదురు. ఒక్కొక్క మెట్టు ఎక్కుతూనే సాగాలి'' అంటారు రచయిత్రి సమతా బి. దేశమానె. ఒక్కొక్క మెట్టు ఎక్కి విజయ శిఖరాలను ఎలా చేరాలో మాతంగి దివిటి విశ్లేషణ ద్వారా అర్థమవుతుంది. కాబట్టి మాతంగి దివిటి - మహిళా చైతన్య స్ఫూర్తికి నిదర్శనంగా నిలుస్తుంది.

పాద సూచికలు :

1. జానపద సాహిత్యంలో స్త్రీ, డా. పి.సరస్వతి, పుట 1, 2.
2. స్త్రీవాద సాహిత్యం ఒక పరిశీలన, డా. నళిని, పుట 6, 7 (ముందుమాట)
3. మాతంగి దివిటి, ఆచార్య సమతా బి. దేశమానె (కన్నడ మూలం), ఆచార్య కె. ఆశాజ్యోతి, పుట 17
4. మాతంగి దివిటి, ఆచార్య సమతా బి. దేశమానె (కన్నడ మూలం), ఆచార్య కె. ఆశాజ్యోతి (తెలుగు సేత) పుట 55.
5. మాతంగి దివిటి, ఆచార్య సమతా బి. దేశమానె (కన్నడ మూలం), ఆచార్య కె. ఆశాజ్యోతి (తెలుగు సేత) పుట 70

ఉపయుక్త గ్రంథ సూచి :

1. డా. సరస్వతి. పి., జానపద సాహిత్యంలో స్త్రీ, తెలుగు అకాడమి, హైదరాబాద్, 1012.
2. డా. నళిని, స్త్రీవాద సాహిత్యం ఒక పరిశీలన, వందన ప్రచురణలు, హైదరాబాద్, 2010.
3. ఆచార్య సమతా బి. దేశమానె (కన్నడ మూలం), ఆచార్య కె. ఆశాజ్యోతి, (తెలుగు సేత), మాతంగి దివిటి, ద్రావిడ విశ్వవిద్యాలయం, 2019.

★★★

Vol. 23 | Spl. Issue 03 | March 2026 | BHAVAVEENA | ISSN No. : 2456-4702 | RNI No. APTEL/2003/12253

RNI No. APTEL/2003/12253 | Reffered Journal & Peer Reviewed Journals | ISSN No. 2456-4702

భావవీణ

కళలు, సాహిత్య, సాంస్కృతిక భాషాధ్యయన పత్రిక

BHAVA VEENA

Journal of Arts, Literary, Culture & Language Study

కొండేపూడి నిర్మల కవిత్వంలో స్త్రీ దోపిడీ చిత్రణ : ఒక పరిశీలన

- కామళ్ల శరీష

తెలుగు అధ్యాపకురాలు, తెలంగాణ గిరిజన సంక్షేమ మహిళా డిగ్రీ కాలేజ్, సూర్యాపేట.

తెలుగు సాహిత్యంలో స్త్రీవాద ఉద్యమ ప్రభావం 1970-80 దశకాలలో స్పష్టంగా కనిపించింది. ఈ నేపథ్యంలో కొండేపూడి నిర్మల గారి కవిత్వం ఒక ప్రత్యేక మైన స్థానాన్ని ఆక్రమించుకుంటుంది. ఆమె కవిత్వం స్త్రీలపై జరుగుతున్న దోపిడీని, అణచివేతను, అవమానాలను నిర్మొహమాటంగా బయటపెట్టింది. ఈ వ్యాసంలో కొండేపూడి నిర్మల గారి ప్రముఖ కవితలను స్త్రీ దోపిడీ కోణంలో విశ్లేషించడానికి ప్రయత్నిస్తాను.

ఉపోద్ఘాతం : స్త్రీ దోపిడీ - స్వరూపం

స్త్రీ దోపిడీ అనేది శతాబ్దాలుగా స్త్రీలపై జరుగుతున్న అణచివేతకు, అన్యాయానికి, అవమానాలకు ఒక రూపం. ఇది భౌతిక దోపిడీగానే కాకుండా, మానసిక, సామాజిక, ఆర్థిక, లైంగిక దోపిడీగా కూడా విస్తరించిఉంది. స్త్రీ శరీరం ఒక వస్తువుగా మార్చబడింది. ఆమె ఆశలు, కలలు, కోరికలు అణచివేయబడ్డాయి. ఆమె మాతృత్వం కూడా ఒక బాధ్యతగా, ఒక భారంగా మార్చబడింది. ఆమె వృత్తి, ఆమె కళ, ఆమె చదువు కూడా ఆమెకు అడ్డంకులుగా మారాయి. యుద్ధాలలో ఆమె శరీరం ఒక యుద్ధభూమిగా మార్చబడింది. కొండేపూడి నిర్మల గారి కవిత్వం ఈ దోపిడీ యొక్క వివిధ కోణాలను అద్భుతంగా చిత్రీకరించింది.

'హృదయానికి బహువచనం' కవితలో స్త్రీ శరీర దోపిడీ

'హృదయానికి బహువచనం' కవితలో కొండేపూడి నిర్మల గారు స్త్రీ శరీరంపై జరిగే దోపిడీని చిత్రీకరించారు. స్త్రీ శరీరం ఆమె స్వంతం కాకుండా, సమాజం, కుటుంబం, భర్త వంటి వారి ఆధీనంలోకి వెళ్ళిపోవడాన్ని ఈ కవిత చూపిస్తుంది.

"మరీ అంత హటాత్తుగా కాదు గానీ
చాప కింద నీరు - పన్నెండళ్ల వయసు
చెప్పకుండానే వస్తాయి
శరీరం పొడుగెక్కి, నునుపెక్కి
గాజుకుప్పెలా పారదర్శకమైన చోట"

ఈ పంక్తులు స్త్రీ యవ్వనంలోకి అడుగుపెట్టే సమయాన్ని చిత్రీకరిస్తాయి. కానీ ఈ మార్పుతోనే ఆమె శరీరంపై ఇతరుల దృష్టి మొదలవుతుంది. "దిగులు", "గుబులు" వంటి పదాలు స్త్రీ తన శరీరం పట్ల కలిగించుకునే అపరిచిత భావాన్ని, భయాన్ని సూచిస్తాయి.

"అమృతం కోసం
తలక్రిందులుగా తపస్సు చేసినప్పుడు
మాతృ గర్వంతో బరువెక్కి..."

ఈ పంక్తులు మాతృత్వం కోసం స్త్రీ చేసే తపస్సును చిత్రీకరిస్తాయి. సమాజం స్త్రీకి మాతృత్వాన్ని ఒక గౌరవంగా చూపిస్తుంది. కానీ ఈ మాతృత్వం వెనక ఉన్న శారీరక, మానసిక బాధను ఎవరూ పట్టించుకోరు. స్త్రీ తన శరీరాన్ని,

తన ఆరోగ్యాన్ని, తన స్వేచ్ఛను మాతృత్వం కోసం త్యాగం చేయవలసి వస్తుంది. ఇది ఒక రకమైన శారీరక దోపిడీ.

'తెల్లారకట్ట కివతల...' కవితలో దాంపత్య దోపిడీ

'తెల్లారకట్ట కివతల...' కవితలో దాంపత్య సంబంధాలలో స్త్రీ ఎదుర్కొనే దోపిడీ చిత్రీకరించబడింది. ఈ సంబంధాలలో స్త్రీ ఎప్పుడూ దోపిడీకి గురయ్యే పక్షంగా ఉంటుంది.

"ఇప్పుడిక్కడ నాలుగు చేతులూ చుట్టుకోడాన్ని
కొగిలింత అనక్కర్లేదు
పరస్పర నిందారోపణలతో
అహరహమూ మర్చిపోని అహాలతో
అపనమ్మకాలతో
బతకడమే కాదు చావడమూ మన కోసం కానట్టు"

దాంపత్య సంబంధంలో భౌతిక సాన్నిహిత్యం మాత్రమే మిగిలింది. ప్రేమ, అనురాగం, అవగాహన వంటివి లేవు. బదులుగా నిందారోపణలు, అహాలు, అపనమ్మకాలు మాత్రమే ఉన్నాయి. ఈ సంబంధంలో స్త్రీ తన భావాలను, తన కోరికలను త్యాగం చేయవలసి వస్తుంది. ఆమె భర్త అహానికి, అపనమ్మకాలకు ఆమె బలి అవుతుంది.

"స్విచ్చి వేసినంత చప్పునా ముఖ కవళికల్ని వెలిగించు కోలేని
సిగ్గుతోనో సిగ్గు లేకుండానో
సబ్బు నురగల, క్రీముల, పౌడరు కేకుల సంభారంతో
తలను పూడ్చి పెట్టెయ్యడం పూర్తవుతుంది కాబట్టి"

స్త్రీ తన నిజమైన భావాలను దాచి, బాహ్య అలంకరణలతో తనను తాను కప్పుకోవలసి వస్తుంది. ఆమె తన నిజస్వరూపాన్ని దాచి, సమాజం ఆశించే రూపంలో తనను తాను ప్రదర్శించుకోవలసి వస్తుంది.

'లేబర్ రూమ్' కవితలో ప్రసవ దోపిడీ

'లేబర్ రూమ్' కవితలో ప్రసవ సమయంలో స్త్రీ ఎదుర్కొనే శారీరక, మానసిక దోపిడీ చిత్రీకరించబడింది. ఈ కవితలో ప్రసవం అనే సహజ ప్రక్రియ కూడా స్త్రీకి ఒక హింసగా, ఒక దోపిడీగా ఎలా మారుతుందో చూడవచ్చు.

"ప్రపంచంలోని నరకమో
నరకంలోని ప్రపంచమో
త్రీడిలో చూస్తున్నట్టే వుంటుంది
లేబర్ రూంలో అడుగు పెడితే చాలు"

లేబర్ రూమ్ ను కవయిత్రి నరకంతో పోల్చారు. ఈ నరకం స్త్రీ మాత్రమే అనుభవించేది. ఆమె ఈ నొప్పిని, ఈ బాధను ఒంటరిగా అనుభవించవలసి వస్తుంది.

"బల్లకొక బాధల నది
కాయితప్పడవలా చివికి చీలిపోతున్న రోదనల గది
అమ్మో అయ్యో-లు కెవ్వు కెవ్వు-లు
ఇష్ అబ్బా-లు దేవుడా రక్షించు-లు
చాలా మామూలు మామూలు"

లేబర్ రూమ్ లో ప్రతి బల్ల ఒక "బాధల నది". అది "రోదనల గది". అక్కడి నుండి వచ్చే శబ్దాలన్నీ అక్కడి సిబ్బందికి "చాలా మామూలు". స్త్రీ బాధ ఇతరులకు ఒక రొటీన్ అవుతుంది. ఇది స్త్రీ శరీరంపై, ఆమె అనుభవాలపై జరిగే దోపిడీ.

'ఆక్వేరియం' కవితలో వృత్తి, మాతృత్వ దోపిడీ

'ఆక్వేరియం' కవితలో వృత్తి మరియు మాతృత్వం మధ్య సంఘర్షణలో స్త్రీ ఎదుర్కొనే దోపిడీ చిత్రీకరించ బడింది. ఒక తల్లి తన బిడ్డకు దూరంగా, ఆఫీసులో పని చేస్తున్నప్పుడు అనుభవించే మానసిక దోపిడీని ఇక్కడ చూడవచ్చు.

"ఆకలితో బాటు అమ్మనీ గుర్తు పట్టడం మొదలెట్టి నప్పుడే
నా సమస్య జటిలమైందిరా చిన్నా !"

బిడ్డ పుట్టకముందే తల్లి యొక్క ప్రతి భావోద్వేగం బిడ్డపై ప్రభావం చూపిస్తుంది. ఇది తల్లిపై ఒక అదనపు బాధ్యత. ఆమె తన భావోద్వేగాలను అణచుకోవలసి వస్తుంది. ఇది భావోద్వేగ దోపిడీ.

"రెండు కత్తులూ గాయపెట్టిన ఒరలాంటి నవ్వుతో
రెండు దిక్కులు కలిపి కట్టిన చెరలాంటి నవ్వుతో
... అమ్మను గుర్తు పట్టడం నేర్పుతున్నాను"

తల్లి తన బిడ్డకు నవ్వుతో, కానీ ఆ నవ్వు వెనక ఎంతో

బాధ ఉంటుంది. ఆ నవ్వు "రెండు కత్తులూ గాయపెట్టిన ఒర" లాంటిది. అది "రెండు దిక్కులు కలిపి కట్టిన చెర" లాంటిది. తల్లి తన బాధను దాచి, తన బిడ్డకు నవ్వుతో అమ్మను గుర్తు పట్టడం నేర్పిస్తుంది. ఇది ఆమె భావోద్వేగాలపై జరిగే దోపిడీ.

'మరణ వాంగ్మూలం' కవితలో మానసిక దోపిడీ

'మరణ వాంగ్మూలం' కవితలో స్త్రీ జీవితంలోని భయాన్ని, దానితో ఆమె చేసే పోరాటాన్ని, ఆమెపై జరిగే మానసిక దోపిడీని చిత్రీకరించారు.

"మరణ భయంలో కూడా
నీకు బ్రతుకంటేనే భయమేసిందా లేదా
బతుకుతున్న దోవంతా
మరణ యాతన కనిపించిందా లేదా!"

ఈ పంక్తులు స్త్రీ జీవితంలోని భయం యొక్క తీవ్రతను చిత్రీకరిస్తాయి. మరణ భయం కూడా ఆమెకు బ్రతుకంటే భయం కలిగించింది. ఆమె బతుకుతున్న దారి అంతా మరణ యాతన కనిపిస్తుంది. స్త్రీ జీవితం అంతా భయంతో, ఆందోళనతో నిండి ఉంటుంది. ఈ భయం ఆమెపై జరిగే దోపిడీ వలన వస్తుంది.

"కట్టుకున్న గాడిద బట్టల మోత కింద
వెలుతురాడని జననాంగం మాదిరి
... అంతా సౌండ్ ప్రూఫే"

స్త్రీ తన భావాలను, తన బాధను పూర్తిగా అణచుకోవలసి వస్తుంది. ఆమె నిరసన, ఆమె బాధ - ఇవన్నీ "సౌండ్ ప్రూఫ్" అయిపోతాయి. అంటే అవి బయటికి వినిపించవు. స్త్రీ తన బాధను వ్యక్తం చేయలేని స్థితి. ఇది ఆమె వ్యక్తిత్వంపై జరిగే దోపిడీ.

'నడిచే గాయాలు' కవితలో సామాజిక దోపిడీ

'నడిచే గాయాలు' కవితలో స్త్రీ జీవితంలోని బాధను, ఆ బాధతో ఆమె ఎలా మనుగడ సాగిస్తుందో, ఆమెపై జరిగే సామాజిక దోపిడీని చిత్రీకరించారు.

"నడిచే గాయాలు నువ్వెప్పుడైనా చూశావా?
నడవటమే కాదు
నవ్వుతాయ్
నగలు పెట్టుకుంటాయి"

"నడిచే గాయాలు" అనేది స్త్రీ జీవితానికి ఒక అద్భుతమైన ప్రతీక. స్త్రీ తన గాయాలతోనే నడుస్తుంది, నవ్వుతుంది, నగలు పెట్టుకుంటుంది. ఆమె తన గాయాలను దాచుకుంటూ, వాటిని అలంకరించుకుంటూ జీవిస్తుంది. ఇది ఆమెపై జరిగిన దోపిడీకి ఫలితం.

"తల్లీ చెల్లీ అని పిలుస్తూనే
రహస్యంగా నువుకంట కరిచిన
పరాయి అందాల తాలూకు
మాంసం ముక్కలతో పోల్చి చూస్తూంటావు"

పురుషుడు స్త్రీని "తల్లీ చెల్లీ" అని పిలుస్తూనే, ఆమెను "పరాయి అందాల మాంసం ముక్కలతో" పోల్చి చూస్తాడు. ఇది స్త్రీ పట్ల పురుష సమాజం యొక్క ద్వంద్వ వైఖరిని సూచిస్తుంది. ఒక వైపు ఆమెను గౌరవిస్తున్నట్లు నటిస్తారు, మరో వైపు ఆమెను ఒక లైంగిక వస్తువుగా చూస్తారు.

'బాధా శప్త నది' కవితలో యుద్ధ దోపిడీ

'బాధా శప్త నది' కవిత బోస్నియా యుద్ధంలో స్త్రీలపై జరిగిన అత్యాచారాలను, హింసను, దోపిడీని కేంద్రంగా చేసుకుని రచించబడింది. యుద్ధంలో స్త్రీలు ఎదుర్కొన్న లైంగిక, శారీరక, మానసిక దోపిడీ ఇక్కడ చిత్రీకరించ బడ్డాయి.

"అంచెలంచెలుగా వెన్నెముకను క్రుంగదీస్తూ
దేహం మీదికి విస్తరిస్తున్న విషజ్వర భారం మాతృత్వమే అయితే
చచ్చిపోని సిగ్గుతో అది మమ్మల్ని వెదురు బద్దలా చీల్చింది."

ఈ పంక్తులు నిర్బంధ గర్భాలను, అంటే అత్యాచారం వలన కలిగిన గర్భాలను సూచిస్తాయి. ఈ "మాతృత్వం" వారి వెన్నెముకను క్రుంగదీస్తూ, వారి దేహం మీదికి విస్తరిస్తున్న "విషజ్వర భారం" లాంటిది. అత్యాచారం వలన కలిగిన గర్భం స్త్రీకి ఒక శాపంగా మారుతుంది. ఆమె ఆ గర్భాన్ని మోయవలసి వస్తుంది. ఇది ఆమె శరీరంపై జరిగిన దోపిడీ యొక్క తీవ్ర రూపం.

"ఔను
తిరస్కారానికో వేలు చొప్పున తెగనరికిన బాధతో
అక్షరాలా వేళ్ళు లేని చేతులు మావి"

యుద్ధంలో స్త్రీల అవయవాలు తెగనరకబడ్డాయి. "తిరస్కారానికో వేలు చూపున" వారి వేళ్ళు తెగనరక బడ్డాయి. కొందరి ముక్కు చెవులు "తమాషా కోసం" పెరికారు. ఇది యుద్ధంలో స్త్రీలపై జరిగిన కిరాతకాన్ని చిత్రీకరిస్తుంది. యుద్ధంలో స్త్రీలపై జరిగిన అత్యాచారాలు ఒక వ్యూహంగా, ఒక ఆయుధంగా ఉపయోగించబడ్డాయి. ఇది స్త్రీల శరీరాలను యుద్ధభూమిగా మార్చింది.

'స్లీపింగ్ పార్టనర్' కవితలో సాహిత్య దోపిడీ

స్లీపింగ్ పార్టనర్' కవితలో స్త్రీ స్పృహను, ఆమె పోరాటాన్ని, సాహిత్యంలో స్త్రీలపై జరిగే దోపిడీని చిత్రీకరించారు.

"ఆత్మకథల్లో సైతం అహంకారం వీడని వాళ్ళే
ప్రాణప్రదమైన అనుభవాల్ని అవమానించగలరు.
... శ్రమని గ్లోరిపై చేస్తూ అంగాంగాల్ని గ్లామరైజు చేస్తూ
... మనసు ప్రసక్తి లేనందుకే మలినపడలేదని
తీర్మానిస్తారు."

పురుష రచయితలు తమ ఆత్మకథల్లో కూడా అహంకారం వీడరు. వారు స్త్రీల "ప్రాణప్రదమైన అనుభవాల్ని" అవమానించగలరు. వారు స్త్రీ శరీరాన్ని "గ్లామరైజ్" చేస్తూ, దానిని ఒక వస్తువుగా చూస్తూ, స్త్రీ మనస్సును పూర్తిగా విస్మరిస్తారు. ఇది సాహిత్యంలో స్త్రీలపై జరిగే దోపిడీ.

"అక్షరానికీ ఆత్మకీ వున్న అన్ని లింకులూ తెగ్గొట్టి
అవయవ స్ఫూర్తిగా ఆడదాన్ని చదవడం - శిక్షణ
యిస్తారు."

పురుష సమాజం స్త్రీని "అవయవ స్ఫూర్తిగా" చదవడం నేర్పిస్తుంది. అంటే స్త్రీ ఒక మనస్సు, ఒక ఆత్మ కలిగిన వ్యక్తి కాదు, కేవలం శరీర అవయవాల సమాహారం మాత్రమే అనే దృక్పథాన్ని కలిగిస్తారు.

"ఎంతగా అణచివేయ బడ్డామో
అంతగా భూమిని తన్నుకుని పై కెగసే
జలోత్సాహం ధారకడుతున్నది!"

కవిత చివరి భాగంలోని ఈ పంక్తులు స్త్రీల పోరాటం యొక్క బలాన్ని, వారి ఆత్మవిశ్వాసాన్ని సూచిస్తాయి. ఎంతగా అణచివేయబడినా, వారిలో పైకి లేచే ఉత్సాహం ఎప్పటికీ చావదు.

ముగింపు

కొండేపూడి నిర్మల గారి కవిత్వం స్త్రీలపై జరుగుతున్న దోపిడీ యొక్క వివిధ కోణాలను అద్భుతంగా చిత్రీకరించింది. ఆమె కవిత్వంలో స్త్రీ శరీర దోపిడీ, దాంపత్య దోపిడీ, ప్రసవ దోపిడీ, వృత్తి-మాతృత్వ దోపిడీ, మానసిక దోపిడీ, సామాజిక దోపిడీ, యుద్ధ దోపిడీ, సాహిత్య దోపిడీ వంటి అనేక రూపాలలో దోపిడీ చిత్రీకరించబడింది.

ఈ కవిత్వం స్త్రీలు తమ శరీరంపై, తమ మనస్సుపై, తమ జీవితాలపై తమకు ఎలాంటి నియంత్రణ లేదో చూపిస్తుంది. వారు ఎప్పుడూ ఇతరుల ఆధీనంలో, ఇతరుల నిర్ణయాలకు లోబడి జీవించవలసి వస్తుంది. వారు అనుభవించే బాధ, నొప్పి, హింస ఎవరికీ కనిపించదు. వారు తమ గాయాలతోనే నవ్వుతూ, నడుస్తూ, జీవిస్తూ ఉండవలసి వస్తుంది.

కానీ ఈ కవిత్వం చివరికి ఆశను కూడా చూపిస్తుంది. స్త్రీలు ఎంతగా అణచివేయబడినా, వారిలో పైకి లేచే ఉత్సాహం, పోరాడే శక్తి ఎప్పటికీ చావదు. వారు తమ బాధను, తమ దోపిడీని అక్షరబద్ధం చేస్తారు. వారు తమ స్వరాన్ని వినిపిస్తారు.

కొండేపూడి నిర్మల గారి కవిత్వం ఈ పోరాటానికి ఒక బలమైన స్వరం. ఇది స్త్రీల దోపిడీని బయటపెట్టడమే కాకుండా, వారి పోరాటానికి, వారి ఆత్మగౌరవానికి, వారి స్వేచ్ఛకు ఒక వేదికగా నిలుస్తుంది.

ఉపయుక్త గ్రంథాలు

1. కొండేపూడి నిర్మల, "హృదయానికి బహువచనం", ఆంధ్రప్రభ దినపత్రిక, 1993.
2. కొండేపూడి నిర్మల, "తెల్లారకట్ట కివతల...", ఆంధ్రప్రభ దినపత్రిక, 1993.
3. కొండేపూడి నిర్మల, "లేబర్ రూమ్", ఆంధ్రప్రభ దినపత్రిక, 1993.

4. కొండేపూడి నిర్మల, "అక్వేరియం", ఆంధ్రప్రభ దినపత్రిక, 1993.
5. కొండేపూడి నిర్మల, "మరణ వాంగ్మూలం", ఆంధ్రప్రభ దినపత్రిక, 1993.
6. కొండేపూడి నిర్మల, "నడిచే గాయాలు", ఆంధ్రప్రభ దినపత్రిక, 1993.
7. కొండేపూడి నిర్మల, "బాధా శప్త నది", ఆంధ్రప్రభ దినపత్రిక, 3-5-1993.
8. కొండేపూడి నిర్మల, "స్లీపింగ్ పార్టనర్", ఆంధ్రప్రభ దినపత్రిక, 1993.
9. సిమోన్ డి బోవా, "ది సెకండ్ సెక్స్", 1949.
10. కె. సత్యనారాయణ, "తెలుగు సాహిత్యంలో స్త్రీవాదం", 1995.
11. కె. సురేఖ, "స్త్రీవాదం - సిద్ధాంతం, ప్రయోగం", 1998.

★★★

Vol. 23 | Spl. Issue 03 | March 2026 | BHAVAVEENA | ISSN No. : 2456-4702 | RNI No. APTEL/2003/12253

RNI No. APTEL/2003/12253 | Reffered Journal & Peer Reviewed Journals | ISSN No. 2456-4702

భావవీణ

కళలు, సాహిత్య, సాంస్కృతిక భాషాధ్యయన పత్రిక

BHAVA VEENA

Journal of Arts, Literary, Culture & Language Study

రచయిత్రుల నవలలు - మహిళా చైతన్యం

- డా॥. పొదిలాపు గోపాల నాయుడు

లెక్చరర్ ఇన్ తెలుగు, డా॥ వి.ఎస్. కృష్ణా గవర్నమెంట్ డిగ్రీ కాలేజి, విశాఖపట్నం, ఆం॥ ప్ర॥.

ఉపోద్ఘాతం :

"ఆధునిక మహిళలు భారతదేశ చరిత్రను తిరగ రాస్తారు" అన్నారు గురజాడ. సృష్టిలో ఉన్నతరాలు స్త్రీ. ఆమె అబల అనే మాట అర్థరహితం. సామాజిక మార్పులు, అవగాహనతో ఆధునిక మహిళ ప్రగతి సాధించింది. తన శరీరం మీద, ఆలోచనల మీద తనదైన హక్కు సాధించడానికి వ్యక్తిత్వ పోరాటం మొదలు పెట్టింది. తన అనుభూతిని స్వేచ్ఛగా వ్యక్తీకరించుకోవడాన్ని సమాజం ఏ విధంగా నియంత్రిస్తోందో గుర్తించింది. స్త్రీని వ్యాపార వస్తువుగా చేసిన దుష్ట సంస్కృతిపై తిరగబడింది. స్త్రీల పట్ల విచక్షణను, స్త్రీ జీవితాన్ని చీకటిమయంగా మార్చిన వ్యవస్థని ప్రశ్నించింది. "స్త్రీ ఎప్పుడు సమాజాన్ని, రాజ్యాన్ని ప్రశ్నించడం నేర్చుకుందో అప్పుడే ఆమె కవయిత్రి అయింది. సంస్కర్త అయింది. కళాకారిణి అయింది. ఉద్యమ నేత అయింది".[1]

తెలుగు దేశంలో కందుకూరి వీరేశలింగం అనే మహా పురుషుడు అవతరించి చీకటింట్లో కిటికీలు తెరచి, సూర్యుడి వెలుగును, చంద్రుడి వెన్నెలను ప్రసరింపజేసి, దుమ్ము దులిపి, బూజు తుడిచి, మనుషుల్లో మంచిని పెంచి, మానవత్వాన్ని నిలిపాడు. మహిళల స్థితిగతులు దుస్సహంగా ఉండేవి. ఆయన తన పత్రికల ద్వారా స్త్రీల విజ్ఞాన వికాసానికి ఎంతగానో కృషిచేశాడు" అంటారు డా॥ అక్కిరాజు రమాపతిరావు.[2]

తెలుగు సాహిత్యంలో ఇప్పుడు మహిళలు ఎన్నో సుగంధ పుష్పాలు పూయిస్తున్నారు. నవలలు, కథలు, కవిత్వం, నాటకం, విమర్శ - అన్ని ప్రక్రియల్లోనూ బలంగా రాస్తున్నారు. ప్రాచీన తెలుగు సాహిత్యంలో కవయిత్రుల సంఖ్య స్వల్పమే. ఆధునిక తెలుగు సాహిత్యంలో నవలా ప్రక్రియలో రచయిత్రులు మహిళా చైతన్యాన్ని పాదుగొలిపే రచనలు విరివిగా చేశారు. చేస్తున్నారు. తొలితరంలో ఇల్లిందల సరస్వతిదేవి, నందగిరి ఇందిరాదేవి గార్లు నవలా సాహిత్యంలోనూ బాగా కృషిచేసారు.

తొలితరం నవలా రచయిత్రులు :

నవలలకు, స్త్రీలకు ఉన్న సంబంధం ముఖ్యమైనది. పాఠకుల్లో స్త్రీలు కూడా ఉంటారన్న అవగాహనతో నవలల ఇతివృత్తాల్లో క్రమానుగతంగా మార్పు కనిపిస్తోంది అంటారు కాత్యాయినీ విద్మహే.[3] స్వాతంత్ర్యానంతర తొలి దశకంలో స్వీయ అస్తిత్వంకోసం సంప్రదాయ సమాజంతో సంఘర్షించే స్థితికి ఎదిగారు. ఆ కోవకు చెందిన రచయిత్రులుగా వట్టికొండ విశాలాక్షి, డా॥ పి. శ్రీదేవి కనిపిస్తారు. విశాలాక్షి కమ్యూనిస్టు రాజకీయాల నుండి రూపొందిన దృక్పథంలో నవలలు రాసారు. ఖైదీ, భారత

నారి, యుగధర్మం, తపోభంగం, నిష్కామయోగి మొదలైన నవలలు వెలువరించారు. భర్తల అధికార ఆధిక్యతల క్రింద అనగారిపోతూ సంసారాలు సాధించిన స్త్రీలు జాతీయోద్యమంలో భాగస్వాములైన క్రమాన్ని నిష్కామయోగి నవల చిత్రించింది. పురుషుడు ఏ రాజకీయ పార్టీకి చెందినవాడైనా తన విషయంలో తాను ఎంత స్వతంత్ర్యాన్ని కోరుకుంటాడో లంతన భార్య కూడా అంత స్వేచ్ఛను కోరుకోవడం సహజమనే విషయాన్ని అంగీకరించడు. ఈ విషయాన్ని విశాలాక్షి ఎత్తిచూపారు.

ఆ కాలాతీత వ్యక్తులు నవల స్త్రీవాదం అనే ధోరణిలేని రోజుల్లో వచ్చిన స్త్రీవాద రచనగా చెప్పాలి. ఎవరి దయా దాక్షిణ్యాలను, పెత్తనాన్ని సహించని ఆత్మగౌరవ చైతన్యం గల కొత్తతరం స్త్రీలను ఈ నవలలో చూడగలం. 1957లో డా॥ శ్రీదేవి ఈ నవల రచించారు. ఆధునిక యువత జీవితాల్లో వస్తున్న, రావలిసిన మార్పులను శ్రీదేవి సక్రమంగా అర్థంచేసుకొని ఈ నవల రాసారు. ఇందులోని ఇందిర, కళ్యాణి, వసుంధర, కృష్ణమూర్తి, ప్రకాశం, డా॥ చక్రవర్తి సమాజంలో నాడు, నేడూ కనిపిస్తారు. స్త్రీ, పురుష సంబంధాలు, ఆర్థిక విషయాలు. సమాజ గమనం అన్నీ సహజంగా చిత్రించారు. పాత సమాజపు ఆంక్షలను తిరస్కరించడం, విలువలను ప్రశ్నించడం, రాజీలేని జీవిత విధానాన్ని అవలంబిచడం, కొత్త తరం స్త్రీల జీవలక్షణం అయింది. ఆధునిక స్త్రీకి పెళ్ళికి నిర్వచనం యిచ్చింది. తనకు కావలసింది ఆర్థిక భర్త కాదు. ఆ మాటకు వస్తే భర్త అనే మాటలోని సాంఘిక అర్థాన్ని అమలులో పెట్టే వ్యక్తి కూడా కాదు అన్న కళ్యాణి మాటలు గమనించ దగ్గవి. "నేను ఏ పని చేసినా కళ్ళు తెరిచి చేస్తాను. నాకూ మిగతావాళ్ళకి తేడా అదే. ఏడుస్తూ ఏదీ చెయ్యను. ఏది జరిగినా ఏడవను" అని తన తత్వాన్ని వెల్లడిస్తుంది ఇందిర. అవసరమైనప్పుడు సమాజాన్ని ధిక్కరించి తనకు ఏమి కావాలో సాధించుకున్న ఆధునిక యువతి ఇందిర. కాలానికి అతీతంగా ఆమె నడుచుకున్నట్టు అనిపించినా నవతరం స్త్రీలో ఆ విధమైన మానసిక చైతన్యం ఉండాలంటారు శ్రీదేవి. స్వతంత్ర్య వక్తిత్వంగల పాత్రలతో విలక్షణమైన నవల కాలాతీత వ్యక్తులు.

మహిళా పాఠకుల ఆత్మబంధువు :

తొలినాటి మహిళా కాలమిస్టు మాలతీచందూర్. 1952 నుంచి ఆంధ్రప్రభ వారపత్రికలో అర్ధ శతాబ్ధి పాటు "ప్రమదావనం" శీర్షికలో ప్రశ్నలకు జవాబులు ఇచ్చిన విజ్ఞానఖని ఆమె. ఆవగింజ నుంచి అంతరిక్షం వరకు ఆమె చర్చించని అంశం లేదు. మాలతీచందూర్ తొలి నవల చంపకం-చెద పురుగులు. శతాబ్ధి సూరీడు, హృదయనేత్రి, శిశిర వసంతం, సద్యోగం, ఆలోచించు, భూమిపత్రి, కాంచనమృగం మొదలైన నవలలు రాసారు. శతాబ్ధి సూరీడు, వందేళ్ళ తెలుగు మహిళా జీవితానికి దర్పణం. మాలతీచందూర్ స్రీంత స్వేచ్ఛకు ఆర్థిక స్వావలంబన అవసరమని గుర్తించారు. స్త్రీ విద్యా వశ్యకతను పరి పరి విధాల తెలియజెప్పారు. స్త్రీలపై జరుగుచున్న గృహ హింసను, లైంగిక హింసను, ఉద్యోగినులపై సహోద్యోగుల వేధింపులను తన నవలల్లో చిత్రించారు. నిస్సహాయ స్థితిలో కూడా స్త్రీ ధైర్యం కోల్పోకూడదని, పరిస్థితులను ఎదురించి నిలబడాలని సద్యోగం నవలలో ప్రబోధించారు. వీరి నవలలు పాఠకుల సంస్కారాన్ని పెంపొందిస్తాయని చెప్పవచ్చు. వీరి హృదయ నేత్రి నవలకు కేంద్ర సాహిత్య అకాడమీ బహుమతి లభించింది.

సంచలన రచయిత్రులు :

తెలుగు సాహిత్యంలో సాహసానికి, సంచనాలకు మారుపేరుగా నిలిచిన వారు లత, రంగనాయకమ్మ, తెన్నేటి హేమలత 80 వరకు నవలలు రాసారు. వ్యభిచార కూపంలో చిక్కుకున్న మహిళల దైన్యస్థితిని వర్ణిస్తూ లత రాసిన గాలిపడగలు-నీటి బుడగలు సంచలనం రేపింది. ఇదే అంశంపై రక్తపంకం మరోనవల. సమాజంలో స్త్రీ అనుభవించే కష్టాలు, పురుషాదిక్య సమాజంలో స్త్రీ, పురుష సంబంధాలు, మన వివాహ వ్యవస్థ - ఇలా అనేక అంశాలపై ఆమె విస్తృతంగా రాసారు. స్త్రీ శక్తి జీవితానికి సంఘం విధించిన కట్టుబాట్లను ఎదిరించి నిర్భయంగా నవలలు రాసారు. స్త్రీ వ్యక్తిత్వానికే కాక అనుభూతికి కూడా ప్రాధాన్యం ఇస్తూ పాత్ర చిత్రణ చేశారు. చలం నవలలులాగే ఈమె రచనల మీద కూడా సంప్రదాయ

వాదుల సామాజిక నిషేధం ఉండేది. లత ఆంధ్రప్రభ వారపత్రికలో నిర్వహించిన ఊహాగానం శీర్షిక బాగా ప్రసిద్ధమైంది. తెలుగు సాహిత్యంలో చైతన్యాన్ని తెచ్చిన మొదటి రచయిత్రిని తానేనని ఈమె ఆత్మ విశ్వాసంతో చెప్పుకున్నారు. ఈమె రచనల్లో అటు శరత్ ప్రభావం, ఇటు చలం ప్రభావం బాగా కనిపిస్తాయి. "కాలం కరచిన కడపట" నవలపై చలం ప్రభావం ఉంది. "శరత్‌లోని సిక్ మెంటాలిటీ, చలంలోని క్రూయల్టీ లేని రచయిత్రి అని ఒకప్పుడు ఇలస్ట్రేటెడ్ వీక్లీ వాఖ్యానించింది. శరత్, మొపాసా, వైల్డ్ తనకు ఇష్టమైన రచయితలు అంటారామె. వైవిధ్యంతో కూడిన ఇతివృత్తాలు తెలుసుకొని తనదైన విలక్షణ భావప్రకటనతో సమాజ స్థితిగతులకు అద్దంపట్టేలా పాఠకుల్ని తన రచనలో లీనమయ్యేలా తనదంటూ సొంత బాణీని రూపొందించుకున్నారు.

కాల్పనిక సాహిత్యాన్ని సృష్టించిన రచయిత్రులలో రంగనాయకమ్మది విలక్షణమైన స్థానం. ఈమె స్త్రీ పాత్రలు తమ మీది వివక్షను ప్రశ్నిస్తాయి. బలిపీఠం నవల ఈమెకి మంచి గుర్తింపునిచ్చింది. కులాంగర వివాహాలు ఇందులో అంశం. స్త్రీ, చదువుకున్న కమల, రచయిత్రి, కృష్ణవేణి, పేకమేడలు, కూలిన గోడలు మొదలైనవి పాఠకుల ఆదరణను పొందాయి. ఆమె మహిళల సమస్యలను ప్రస్తావించిన తీరు అభ్యుదయ కరమైనవి. దాంపత్యం హాయిగా సాగటానికి భార్యా భర్తలు ఒకరికి ఒకరు ఎలా అర్థంచేసుకోవాలో, సర్దుబాటు చేసుకోగలిగిన నేర్పు ఎలా ఉండాలో స్వీట్‌హోం నవలలో చెప్పారు. జానకి విముక్తి స్త్రీవాద నవల. స్త్రీ స్వేచ్ఛ ఏ విధంగా ఉండాలనే అంశంపై రచయిత్రి ఆలోచనలు పాఠకులను ఆలోచింపజేస్తాయి. ఈ నవలలో వెంకట్రావు పాత్ర అశక్త దుర్జనత్వానికి ప్రతీక. రంగనాయకమ్మ దృక్పథం విప్లవాత్మకమైనది. కమ్యూనిస్టు మాటలు వల్లించే చాలామంది ఇళ్లల్లో స్త్రీల పట్ల వ్యవహరించే తీరు ఎంత ఘోరంగా ఉంటుందో రంగ నాయకమ్మ ఈ నవలలో వివరించారు. అమ్మకు ఆదివారం లేదా అనే నవల పూర్తిగా ఇంటిపని గురించిన చర్చలకే ఉద్దేశించింది. గృహినులకు వారానికి ఓ రోజు శెలవు ఇవ్వాలని కొంతకాలం క్రితం ఆస్ట్రియాలో ఒక బిల్లు ప్రవేశపెట్టారు. ఇదే విధానాన్ని మన దేశంలో కూడా ప్రవేశపెట్టి గృహిణులకు వారానికి ఓ రోజు శెలవు ఇవ్వాలని రాజ్యసభలో కొందరు మహిళా సభ్యులు ఓ సారి చర్చను లేవనెత్తారు. ఈ వాదనలు ఎంత వరకు ఆచరణ సాధ్యమో రంగనాయకమ్మ తన నవలలో చర్చించారు.

మహిళా పాఠకుల ఆరాధ్య రచయిత్రులు :

1960-90 మధ్య నవలా సాహిత్యంలో మహిళా ప్రభంజనం తెలుగు నవలలకు వాణిజ్యపరమైన ఆకర్షణ కలిగించిన తొలి రచయిత్రి కోడూరు (ఆరెకపూడి) కౌసల్యాదేవి. ఆమె పేరు వినగానే పాఠకులకు, సినీ ప్రేక్షకులకు గుర్తుకు వచ్చేవి చక్రభ్రమణం నవల, డా॥ చక్రవర్తి సినిమా సంఘ జీవితాన్ని గాని, వ్యక్తి జీవితాన్ని గాని నియంత్రించే సాంఘిక శక్తుల యదార్థ స్వరూపాన్ని గమనించే శక్తి ఈమెకు తక్కువ అని, మనుషులు మంచి వారైతే, పరిస్థితులు, వ్యక్తుల మంచి తనం వల్ల అవే సర్దుబాటు అవుతాయని అవే కోవకు చెందిన పరిష్కారాలను ఆమె సూచిస్తారని పురాణం సుబ్రహ్మణ్యశర్మ విమర్శించారు. చక్రభ్రమణం నవలలో స్త్రీ ఆకాంక్షలకు, వాస్తవ జీవితానుభవాలకి మధ్య ఉన్న అఘాదాన్ని చూపించగలిగారు. శాంతినికేతన్ నవలలో కథానాయిక శాంతి తనకంటూ కొన్ని స్థిరమైన ఆలోచనలు, ఆదర్శాలు కలిగి సొంత నిర్ణయాలు తీసుకోగలిగిన వ్యక్తిత్వం ఉన్న స్త్రీ. ప్రేమనగర్‌లో కథానాయికను గొప్ప వ్యక్తిత్వం ఉన్న పాత్రగా తీర్చి దిద్దారు. వ్యాపార రంగంలో ప్రవేశించిన స్త్రీలు ఎదుర్కొనే సమస్యలను, విమర్శలను విశదీకరించిన నవల నివేదిత. ఈమె నవలల్లో కథకు కావలసిన మలుపులన్నీ వుంటాయి. పాత్రలు వాస్తవానికి దూరంగా ఉంటాయని, సమకాలీన జీవితాన్ని ప్రతి బింబించవని విమర్శలు ఉన్నాయి.

ఇవాళ టీ.వి. సీరియల్స్‌ను వందల ఎపిసోడ్స్ ఏళ్ళ తరబడి విసుగు లేకుండా చూస్తున్న ప్రేక్షకులు ఉన్నారు. ఒకప్పుడు పత్రికల్లోని ధారావాహికల పరిస్థితి అంతే.ఈ సీరియల్స్‌తో పత్రికల సర్క్యులేషన్ పెంచుకొని సగటు పాఠకులను అందునా మహిళలను కట్టి పడేసిన

రచయిత్రి యద్ధనపూడి సులోచనారాణి. ఆమె గ్లామరస్ రచియిత్రి. 75 నవలలు రాసారు. వాటిలో 17 సినిమాలుగా వచ్చాయి. పాఠకులను ఊహల్లో విహరింపజేస్తారనే విమర్శ ఉంది. ఈమె రచనల్లో సందేశం లేశమైనా కనబడగనే వర్గ చైతన్యం, వర్గ సంఘర్షన వగైరా సరుకు కావలసిన వారు ఈమె రచనల జోలికి పోయే వారు కాదని ఒక అభిప్రాయం బలంగా ఉంది. ప్రపంచంలో నూటికి తొంభైమంది ఆర్థికంగా తగాపడిన వాళ్లని, వాళ్ళ గురించే వ్రాయాలని కొందరు విమర్శకులు భావించిన రోజుల్లో ఆమె ఆ మిగిలిన వారికోసమే రాసారు. కాని అవి అసంఖ్యాక పాఠకుల్ని అలరించాయి. ఈ సెక్రటరీ నవలలో జయంతి బలమైన వ్యక్తిత్వం గల పాత్ర. మౌనపోరాటం నవల స్త్రీవాద దృక్పథానికి సన్నిహితమైనది.

విలక్షణ రచయిత్రులు వాసిరెడ్డి-మాదిరెడ్డి :

వాసిరెడ్డి సీతాదేవి తెలుగు సామాజిక జీవితంలోని అన్ని కోణాలను ప్రతిభింబించే నవలలను రాసారు. వైతరణి, మట్టిమనిషి, మరీచిక మొదలైన 40 నవలలు రాసారు. సమత నవలలో ఒక స్త్రీ సాధారణ జీవిత చట్రంలో ఏలా ఇమడలేకపోయిందో చిత్రించారు. మట్టి మనిషి నవల సాహిత్యంలో ఆమెకు చిరకీర్తినిచ్చింది. ఈ నవల పెర్ల్ బక్ రచించిన గుడ్‌ఎర్త్ నవలను గుర్తు చేస్తుంది. భూస్వామ్య వ్యవస్థలో పెట్టుబడిదారి వ్యవస్థ చొరబడడాన్ని సీతాదేవి శక్తిమంతంగా చిత్రించారు. మరీచిక నవలలో యువత కొందరు నక్సలిజం వైపు, మరి కొందరు మత్తు మందులకు ఆకర్షితులు కావడాన్ని చిత్రించారు. కొంతకాలం ఈ నవల ప్రభుత్వ నిషేదానికి గురైంది. ఆమె నవలల్లో పార్వతి, అరుంధతి, వరూధిని పాఠకులకు చిరకాలం గుర్తిండిపోతాయి.

మాదిరెడ్డి సులోచన తెలంగాణ రచయిత్రి 73 నవలలు రాసారు. మధ్య తరగతి జీవితాన్ని ఈమె నవలలు ప్రతిభింబిస్తాయి. ప్రేమలు-పెళ్ళిళ్ళు, పూల మనసులు, అంతంచూసిన అశూయ, సజీవస్మృతులు పాఠకుల ఆదరాన్ని పొందిన నవలలు. కాల్పనిక సాహిత్యమైనా, ఊహాజనిత చిత్రణకన్నా వాస్తవికతను ప్రతి బింబించడానికి ఆమె ప్రయత్నించారు. రచయిత్రుల నవలలు నేల విడిచి సాము చేస్తాయనే అభిప్రాయం ఆ రోజుల్లో బలంగా ఉండేది. అయితే మాదిరెడ్డి సులోచన చాలా వరకు సామాజిక వాస్తవిత చిత్రణకే ప్రాధాన్యం ఇచ్చారు. స్త్రీల స్థితిగతుల పట్ల ఆవేదన ప్రకటిస్తూనే అందుకు కారణమైన పురుషుల పట్ల కొంద సానుభూతిని ప్రదర్శించారు. స్త్రీకి స్త్రీయే శత్రువనే అభిప్రాయం కొన్ని నవలల్లో ఈమె వెల్లడించారు. సంప్రదాయ, సామాజిక విశ్వాసాల పరిధిలోనే మాదిరెడ్డి స్త్రీ జీవిత చిత్రణ చేశారు. ఉద్యోగినులు ఎదుర్కొంటున్న సమస్యలు శక్తిమంతంగా చిత్రించారు. ఈమె నవల ఆధారంగా తరం మారింది అనే చిత్రం వెలువడి రాష్ట్ర ప్రభుత్వ నంది పురస్కారం సొంతం చేసుకుంది.

స్త్రీవాద నవలలు :

స్త్రీ వాదానికి 160 ఏళ్ళ చరిత్ర ఉంది. పారిశ్రామిక విప్లం వల్ల, పెట్టుబడిదారి ఆర్థిన వ్యవస్థ రూపుదిద్దుకుంటూ అందుకు అనుగుణంగా ఉదార ప్రజాస్వామిక రాజకీయ భావాలు అభివృద్ధి చెందుచున్న చారిత్రిక క్రమంలో అణచివేతకు గురవుతున్న వర్గంగా స్త్రీలను గుర్తించడం జరిగింది. మానవ సమాజంలో సగభాగంగా ఉన్న స్త్రీలు పురుషుల కంటే తక్కువ సాంఘిక స్థితిలో ఉండటాన్ని ప్రశ్నిస్తూ వాళ్ళ ప్రగతిని కోరుతూ స్త్రీవాద భావన అవతరించింది. 19వ శతాబ్దం ఉత్తరార్ధానికి ఉధ్యమ రూపాన్ని తీసుకుంది. అంతర్జాతీయ మహిళా దశాబ్దిలో స్త్రీవాదం ఒక బలమైన ధోరణిగా వేళ్ళూనుకుంది.

స్త్రీ జీవితం పుట్టుక నుంచి చావు దాక సెన్సార్ అవుతూనే వుంటుంది. ఎవరైనా అదృష్టవంతులు సెన్సార్ లేకపోయినా ఎడిటింగ్ తప్పదు అంటారు ప్రముఖ స్త్రీవాద రచియిత్రి ఓల్గా. అమె అసలు పేరు పోపూరి లలిత కుమారి. ఈమె సహజ, స్వేచ్చ, కన్నీటి కెరటాల వెన్నెల, ఆకాశంలో సగం, ప్రయోగం నవలలు రచించారు. పురుషాదిక్య సమాజంలో స్త్రీల జీవితాలలో వచ్చే మార్పులను ఆమె నవలల్లో ఆవిష్కరించారు. ఆధునిక స్త్రీ సేచ్చ, స్వరూప స్వభావాలను నవలల్లో బలంగా చిత్రించారు. కుప్పిలి పద్మ మూడు పాయల జలపాతం, ఏకాంతంలో ఇద్దరు మొదలైన స్త్రీవాద నవలలు

రచించారు. ఓల్గా నవలలపై చలం, కొడవటిగంటి కుటుంబరావు ప్రభావం బాగా కనిపిస్తుంది. స్వేచ్ఛ నవల అప్పట్లో గొప్ప సంచలనం కలిగించింది. దళిత స్త్రీ సమస్యను చిత్రించిన ఆకాశంలో సగం నవలలో దళిత మహిళపై ప్రపంచీకరణ, నగరీకరణ ప్రభావం ఉంది. ఈ దోపిడీ సమాజపు మూలాలు స్త్రీల అణచివేతలో ఉన్నాయని ఆమె చెబుతారు. అయితే ఈమె రచనల్లో పురుషాధిపత్యాన్ని విమర్శించడమే తప్ప స్త్రీ విముక్తికి సందేశాన్ని వినిపించలేదనే విమర్శకూడా ఉంది. ఓల్గా స్వేచ్ఛాకాశంలో సగం నవలలు పురస్కారాలు పొందాయి. ఆమె రచనలు కొన్ని ఇంగ్లీషు, హిందీ, మరాఠీ భాషల్లోకి అనువాదమయ్యాయి. ఆమెకి వివాహ వ్యవస్థపై నమ్మకం లేదు. 1995లో బీజింగ్‌లో జరిగిన ప్రపంచ మహిళా సదస్సులో పాల్గొన్నారు. అమెరికా సంయుక్త రాష్ట్రాల్లో న్యూ జెర్సీలో జరిగిన మానవ హక్కుల సదస్సుకు హాజరయ్యారు.

మానవవాద స్త్రీ విమోచన సిద్ధాంతాన్ని కొత్తగా ప్రతిపాదించిన మల్లాది సుబ్బమ్మ గారు ఆంధ్రప్రదేశ్‌లో మహిళోద్యమం, లైంగిక విప్లవం, వివాహం, నేడూ రేపు, మతధర్మ శాసనాలు మొదలైన 50 పుస్తకాలు వెలువరించారు. నవలలు, లనేక కరపత్రాలు రాసారు. వికాసం, స్వేచ్ఛ అనే పత్రికల్ని నిర్వహించారు. స్త్రీవాద రచయిత్రులు కుటుంబ హింసకు పరాకాష్ఠకు రూపమైన సతీసహగమణ దుర్ఘటను కేంద్రంగా చేసుకొని, పుట్టినప్పటి నుండి ఇంకా చెప్పాలంటే లింగ నిర్ధారణ పరీక్ష ద్వారా పుట్టబోయే శిశువు ఆడదేనని తెలిసినప్పటినుండి స్త్రీ మీద మొదలయ్యే వేధింపుల గురించి, వరకట్నపు హత్యల గురించి, అందుకు మూలమైన పితృస్వామిక అపమ, ఆర్థిక వ్యవస్థ గురించిన ఆలోచనలను నవలా రూపంలోకి తీసుకువచ్చారు.

కుప్పిలి పద్మ గారు "మూడు పాయల జలపాతం, ఏకాంతంలో ఇద్దరు మొదలైన స్త్రీవాద నవలలు, చాలా కథలు రాసారు. గీతాంజలి గారి ఆమె అడవిని జయించింది అనే నవల, శైల కుమారి గారి వరుడు కావాలి నవల మొదలైనవి ఈ దృక్పథానికి చెందినవే. యద్ధనపూడి సులోచనారాణి "సౌగంధి" నవల కూడా ఈ మార్గంలోనే నడిచింది. ఇంకా మరి కొంతమంది భిన్న కోణాల్లో స్త్రీవాద ధోరణిని చిత్రిస్తూ నవలలు రాసారు.

ముగింపు :

ఆధునిక యుగ ఆరంభంలో స్త్రీ విద్య, దేశభక్తి, జాతీయత, దాంపత్య జీవితం వంటి అంశాలు మహిళల నవలలకు వస్తువులు కాగా అనంతర కాలంలో రచయిత్రుల ఆలోచనా పరిధి పెరిగి, అవగాహన వికసించి, సామాజిక సమస్యలపై కలం సంధించారు. ఇప్పుడు కూడా సామాజిక దృక్పథంతో మహిళా రచయిత్రుల నవలలు వెలువడుతున్నాయి.

పాద సూచికలు :

1) విశిష్ట తెలుగు మహిళలు - డా॥ దామెర వెంకట సూర్యారావు, రీమ్ పబ్లికేషన్స్, న్యూఢిల్లీ, 2015.
2) సాహితీ వ్యాసంగం (వ్యాస సంకలనం - అక్కిరాజు రమాపతిరావు, విజ్ఞాన దీపిక, హైదరాబాద్, 1994.
3) నూరేళ్ళ తెలుగు నవల - విశ్లేషణ కాత్యాయనీ విద్మహే

ఆధార గ్రంథాలు :

1) కాలాతీత వ్యక్తులు - డా॥ శ్రీదేవి, విశాలాంధ్ర పబ్లికేషన్స్
2) జానకి విముక్తి - రంగనాయకమ్మ 3) మరీచిక- వాసిరెడ్డి సీతాదేవి
4) తెలుగు సాహిత్య చరిత్ర - వెలమల సిమ్మన్న, దళిత సాహిత్య పీఠం, 2014.
5) నూరేళ్ళ తెలుగు నవల - సహవాసి పర్‌స్పెక్టివ్స్, హైదరాబాద్, 2007.
6) మన తెలుగు నవలలు - కడియాల రామ మోహన్‌రాయ్, అజోవిభో-కందాళం ఫౌండేషన్, 2012.
7) విశిష్ట తెలుగు మహిళలు - డా॥ దామెర వేంకట సూర్యారావు, రీమ్ పబ్లికేషన్స్, న్యూ డిల్లీ, 2015.
8) సాహితీ వ్యాసంగం - అక్కిరాజు రమాపతిరావు

★

Vol. 23 | Spl. Issue 03 | March 2026 | BHAVAVEENA | ISSN No. : 2456-4702 | RNI No. APTEL/2003/12253

RNI No. APTEL/2003/12253 | Reffered Journal & Peer Reviewed Journals | ISSN No. 2456-4702

భావవీణ

కళలు, సాహిత్య, సాంస్కృతిక భాషాధ్యయన పత్రిక

BHAVA VEENA

Journal of Arts, Literary, Culture & Language Study

కె. సుభాషిణి అమూల్య కథలు - మహిళా చైతన్యం : సామాజిక విశ్లేషణ

- కె. వెంకటస్వామి

పరిశోధక విద్యార్థి, తెలుగు అధ్యయనశాఖ, శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయం, తిరుపతి.

వ్యాస సంగ్రహం

ఆధునిక తెలుగు కథాసాహిత్యంలో మహిళా చైతన్యం ఒక ముఖ్యమైన చర్చా అంశంగా ఎదిగింది. సమాజంలో మహిళల స్థానం, వారి ఆత్మగౌరవం, వ్యక్తిత్వం, స్వాతంత్ర్యం వంటి అంశాలు కథాసాహిత్యంలో ప్రధానంగా ప్రతిబిం బించబడుతున్నాయి. ఈ నేపథ్యంలో కె.సుభాషిణి రచించిన కథలు ప్రత్యేకమైన స్థానం పొందాయి. ఆమె కథల్లో స్త్రీ జీవితంలోని అంతర్గత సంఘర్షణలు, కుటుంబ వ్యవస్థలోని అసమానతలు, సామాజిక నిర్మాణంలో ఉన్న లింగ వివక్ష వంటి అంశాలు స్పష్టంగా ప్రతిఫలిస్తాయి.ఈ వ్యాసంలో సుభాషిణి రచించిన జారవిడుచుకున్న రంగులు, అరుణ కోసం, అన్వేషణ, బ్రహ్మ సూత్రాలు, బ్లాక్ హోల్, లక్షణ, గాయాలు, అమూల్య వంటి కథలను పరిశీలిస్తూ మహిళా చైతన్యం ఎలా ప్రతిఫలించిందో విశ్లేషించబడింది. ఒక మహిళ తన సృజనాత్మకతను కోల్పోయి కుటుంబ జీవితంలో బంధించబడిన పరిస్థితిని గుర్తించి తిరిగి తన వ్యక్తిత్వాన్ని వెతుక్కోవడానికి ప్రయత్నిచడం. అలాగే మరొక మహిళలపై జరిగే హింసకు వ్యతిరేకంగా మహిళలలో సామూహిక చైతన్యం రావడం, స్త్రీ జీవితం మీద సామాజిక నిర్మాణాల ప్రభావాన్ని, పితృ స్వామ్య భావజాలాన్ని విమర్శిస్తూ మహిళా స్వాతంత్ర్యాన్ని, ధనవంతుల ఇళ్లలో ఉండే స్త్రీ అయినప్పటికీ ఆమె ఎదుర్కొనే ఒంటరితనాన్ని, ఆధునిక వినియోగ సంస్కృతి కుటుంబ సంబంధాలపై చూపే ప్రభావాన్ని విశ్లేషిస్తుంది.పై కథలన్నింటినీ పరిశీ లించినప్పుడు సుభాషిణి కథలు మహిళా చైతన్యాన్ని కేవలం వ్యక్తిగత సమస్యగా కాకుండా సామాజిక నిర్మాణంతో ముడిపడిన అంశంగా చిత్రించారని స్పష్ట మవుతుంది. స్త్రీ తన వ్యక్తిత్వాన్ని గుర్తించుకొని సమాజంలో సమాన స్థానం సాధించడానికి చేసే చైతన్య పోరాటాన్ని ఈ వ్యాసం విశ్లేషిస్తుంది.

కీలక పదాలు

మహిళా చైతన్యం, పితృస్వామ్యం, సామాజిక అసమానత, స్త్రీ స్వాతంత్ర్యం, కుటుంబ వ్యవస్థ, లింగ వివక్ష, వ్యక్తిత్వ అన్వేషణ, సామాజిక ప్రతిఘటన, ఆధునిక వినియోగ సంస్కృతి, స్త్రీ స్వీయ అవగాహన.

రచయిత్రి పరిచయం

ఆధునిక తెలుగు కథా సాహిత్యంలో మహిళా చైతన్యాన్ని, సామాజిక వాస్తవికతను ప్రతిబింబిస్తున్న ప్రముఖ రచయిత్రి కె.సుభాషిణి గారు ఫిబ్రవరి 2, 1968న కర్నూలు జిల్లా, కొలిమిగుండ్ల మండలం, ఇటిక్యాల గ్రామంలో జన్మించారు. వీరు వృత్తిరీత్యా గణితశాస్త్ర విభాగంలో అసోసియేట్ ప్రొఫెసర్‌గా బాధ్యతలు నిర్వ హిస్తున్నారు. ఒకవైపు విద్యా రంగంలో కొనసాగుతూనే,

మరోవైపు సమాజంలోని అసమానతలను, ముఖ్యంగా స్త్రీల అంతరంగాలను కథా వస్తువులుగా మార్చి సాహిత్య రంగంలో తనదైన ముద్ర వేశారు.సుభాషిణి గారి సాహిత్య ప్రయాణం అక్టోబర్ 2003లో 'అరుణతార' పత్రికలో ప్రచురితమైన 'కరువెవరికి' అనే కథతో ప్రారంభమైంది. ఆ తర్వాత కాలంలో అమూల్య కథల సంపుటి (2015), తండ్రికి కొడుకు బహుమతి (2016), మరియు 'బెట్టింగ్' (2020) వంటి కథలు సారంగ పత్రికలో అచ్చయ్యాయి. ముఖ్యంగా 'మర్మమెల్లా గ్రహించి ఆ తల్లీ' అనే పుస్తకంతో ఆమె కథకురాలిగా సుస్థిరమైన స్థానాన్ని పొందారు. వీరు కేవలం కథలే కాకుండా సామాజిక చిత్రణకు ప్రాధాన్యత నిస్తూ అనేక రచనలు చేశారు. వీరి రచనా శైలి మరియు వస్తు వైవిధ్యం మహిళా జీవితం, కుటుంబ వ్యవస్థ మరియు సామాజిక అసమానతలు ప్రధానాంశాలుగా కనిపిస్తాయి. మధ్యతరగతి మహిళలు ఎదుర్కొనే సామాజిక ఒత్తిడులు, ఉద్యోగ జీవితంలోని సవాళ్లు, వ్యక్తిగత ఆశయాల మధ్య నలిగిపోయే స్త్రీల వేదనలను ఆమె అత్యంత సహజంగా చిత్రించారు. 'అమూల్య' వంటి కథల సంపుటి ద్వారా ఆధునిక మహిళా అస్తిత్వ సంక్షోభాన్ని సున్నితంగా విశ్లేషించారు. ఆమె పాత్రలు మట్టి వాసనతో, సహజత్వంతో నిండి ఉంటాయి. అంతే కాకుండా సామాజిక స్పృహ మరియు ప్రాంతీయత దృక్పథంతో రాయలసీమ ప్రాంతపు సామాజిక చిత్రణకు, అక్కడి ప్రాంతీయ బాణీని వినిపించడంలో పేరుగాంచారు. కర్నూలు కథా సాహిత్యంలో ఆమె స్థానం విశిష్టమైనది. కార్పొరేట్ విద్యావ్యవస్థలోని లోపాలు, ప్రాంతీయ సమస్యలు, లింగ వివక్ష మరియు కుటుంబ వ్యవస్థలోని అసమానతలను తన కథల ద్వారా సూటిగా ప్రశ్నిస్తారు. అదే సమయంలో స్త్రీలలోని ఆత్మవిశ్వాసాన్ని ప్రోత్సహిస్తూ, సమస్యలకు పరిష్కారాలను వెతికే దిశగా వారిని చైతన్యపరుస్తారు.

సుభాషిణి కథలలో మహిళా చైతన్యం-విస్తృత విశ్లేషణ

ఆధునిక తెలుగు కథాసాహిత్యంలో మహిళా చైతన్యం వివిధ రూపాల్లో వికసిస్తుంది. సమాజంలో స్త్రీ స్థానం, కుటుంబ వ్యవస్థలోని అసమానతలు, లింగ వివక్ష, వ్యక్తిత్వ నిరాకరణ వంటి సమస్యలను కథలు చర్చించే వేదికగా మారాయి. ఈ నేపథ్యంలో కె.సుభాషిణి రచనలు ప్రత్యేక ప్రాధాన్యం పొందాయి. ఆమె కథల్లో స్త్రీ జీవితంలోని అనేక కోణాలు కనిపిస్తాయి. ముఖ్యంగా మహిళ తన వ్యక్తిత్వాన్ని గుర్తించుకోవడం, పితృస్వామ్య నిర్మాణాలను ప్రశ్నించడం, సమాజంలో తన స్థానం కోసం పోరాడడం వంటి అంశాలు స్పష్టంగా కనిపిస్తాయి. జారవిడుచుకున్న రంగులు, అరుణ కోసం, అన్వేషణ, బ్రహ్మ సూత్రాలు, లక్షణ, అమూల్య వంటి కథలను పరిశీలించినప్పుడు మహిళా చైతన్యం అనేక రూపాలలో వ్యక్తమవుతుందని గమనించవచ్చు.

వ్యక్తిత్వం-మహిళా చైతన్యం

సృజన ఒక సృజనాత్మక యువతి. ఆమె పెళ్లికి ముందు చిత్రలేఖనం చేస్తూ, పాటలు పాడుతూ, ప్రకృతిని ఆస్వా దిస్తుందించే నిర్మలమైన వ్యక్తిత్వం కలిగిన మహిళ. సృజనకు రంగులతో నిండిన ప్రపంచం ఎంతో ఇష్టం. కానీ వివాహం తర్వాత ఆమె జీవితం పూర్తిగా మారిపోయింది అనడానికి. "జారవిడుచుకున్న రంగులు" కథలో సృజన పాత్ర ద్వారా స్త్రీ వ్యక్తిత్వం ఎలా క్రమంగా నశించిపోతుందో రచయిత్రి చూపిస్తుంది. కళలు, ప్రకృతి, సృజనాత్మకతతో నిండిన యువతిగా కనిపించే సృజన పెళ్లి తర్వాత కుటుంబ జీవితం, సామాజిక కట్టుబాట్లు, ఆర్థిక జీవనశైలి వంటి కారణాల వల్ల తన అసలు వ్యక్తిత్వాన్ని క్రమంగా కోల్పోతుంది. దీనితో ఆమెకు చెట్లు, ఆకులు నలుపు తెలుపు రంగులలో కనిపించడం ఒక బలమైన ప్రతీక. అంటే ఆమె జీవితం నుంచి నిజమైన రంగులు, అంటే సృజనాత్మకత, స్వేచ్ఛ, స్వీయ ఆసక్తులు, వ్యక్తిత్వం వంటి విలువలు దూరమైపోయాయని సూచించే సంకేతం. దీనికి కారణం ఉద్యోగం వదిలేయడం, ఇంటి జీవితానికే పరి మితమవడం, ఫ్యాషన్, వంటలు, ఇంటర్నెట్ వంటి పైపై కార్యకలాపాల్లో మునిగిపోవడం వల్ల ఆమె జీవితం అసలు అర్థాన్ని కోల్పోతుంది. అయితే సుమిత్ర అనే పాత్ర ద్వారా రచయిత్రి ఒక అవగాహనను కలిగిస్తుంది. సుమిత్ర మాటల ద్వారా సృజన తనలో వచ్చిన మార్పును గ్రహిస్తుంది."ఎక్కడ

పోగొట్టుకున్నావో అక్కడే వెదుకు. దొరుకుతాయి. నీ దృష్టి కూడా మారుతుంది. కావల్సిన రంగులన్నీ నీ సొంత మవుతాయి."-1 అని చెప్పడంతో నిజమైన రంగులను వదిలేసి కేవలం మెరుపును మాత్రమే పట్టు కున్నానని ఆమె తెలుసుకుంటుంది. ఈ అవగాహననే కథలో రచయిత్రి మహిళా చైతన్యంగా చిత్రించింది. ఇక్కడ మహిళా చైతన్యం అనేది ప్రత్యక్షంగా కనిపించేదిలా కాకుండగా, అది అంతర్గతంగా తనను తాను తిరిగి గుర్తించుకోవడం సృజన తన కోల్పోయిన రంగులను వెతుక్కోవాలని నిర్ణయించుకోవడం ద్వారా తన వ్యక్తిత్వాన్ని తిరిగి నిర్మించుకునే దిశగా అడుగు వేస్తుంది. ఈ విధంగా రచయిత్రి ఆధునిక కుటుంబ వ్యవస్థలో మహిళలు తమ ఆసక్తులు, ప్రతిభలు, వదిలివేయ కుండగా, తమ వ్యక్తిత్వాన్ని కోల్పోకుండా జాగ్రత్తపడాల్సిన అవసరాన్ని ఈ కథ ద్వారా సూచిస్తుంది. మహిళా జీవితం కేవలం గృహపరిమితిలోనే కాకుండా వ్యక్తిత్వ వికాసంతో కూడి నదిగా మహిళా చైతన్యం ఉండాలని కథ తెలియజేస్తుంది. అందువల్ల "జారవిడుచుకున్న రంగులు" కథ మహిళా చైతన్యాన్ని ప్రతీకాత్మకంగా నిలుస్తుంది.

సామాజిక నిర్లక్ష్యం, హింస - మహిళల సామాజిక చైతన్యం

సమాజంలో మహిళలపై జరిగే లైంగిక హింస, సామాజిక నిర్లక్ష్యం వంటి సమస్యలను రచయిత్రి కె. సుభాషిణి రచించిన "అరుణ కోసం" కథలో మహిళా చైతన్యం సామూహిక స్పందనగా చిత్రించారు, ఈ సామూహిక స్పందనలో సామాజిక బాధ్యత మరియు అన్యాయానికి వ్యతిరేకంగా ప్రతిఘటన రూపంలో స్పష్టంగా ప్రతిఫలిస్తుంది. కథలో అరుణ అనే యువతి మీద జరిగిన దారుణ ఘటనకు స్పందిస్తూ మాధవి, లత, మహేశ్వరి వంటి మహిళలు చూపించే స్పందన ద్వారా రచయిత్రి మహిళా చైతన్యాన్ని ఆవిష్కరిస్తుంది. ఒక అమ్మాయి జీవితాన్ని చిదిమేసే హింసాత్మక ఘటనను సమా జం సాధారణ సంఘటనగా చూడకూడదని, దానికి వ్యతిరేకంగా మనుషులు కలసి నిలబడాల్సిన అవసరాన్ని కథ తెలియ జేస్తుంది. పెద్దాసుపత్రిలో అరుణకు సరైన వైద్యం అందకపోవడం, అధికార యంత్రాంగం నిర్లక్ష్యంగా వ్యవహరించడం, బాధితురాలి స్థితి పట్ల సమాజం చూపించే ఆసక్తి కేవలం చూడడానికే పరిమితం కావడం వంటి అంశాలను రచయిత్రి విమర్శాత్మకంగా చూపిస్తుంది. ఇందులో "అడుగు అడుగుకు ఆటంకాలే... ప్రతి అడుగు దగ్గరా యుద్ధం చేయాలి...."-2 ఇలాంటి నిర్లక్ష్య పరిస్థితుల్లో మాధవి, లత, మహేశ్వరి వంటి మహిళలు మౌనంగా ఉండకుండా స్పందించడం కథలో ముఖ్యమైన మహిళా చైతన్యంగా కనిపిస్తుంది. వారు అరుణ పరిస్థితిని తెలుసుకోవడం మాత్రమే కాకుండా ఆమెకు సరైన చికిత్స అందేలా చర్యలు తీసుకోవడానికి ప్రయత్నిస్తారు. డాక్టర్ల నిర్లక్ష్యాన్ని ప్రశ్నించడం, బాధితు రాలిని ప్రత్యేక వార్డుకు మార్చించే ప్రయత్నం చేయడం, ఆమెకు ఆర్థిక సహాయం సమీకరించడం వంటి చర్యల ద్వారా వారు బాధితురాలి పట్ల మానవీయ బాధ్యతను ప్రదర్శిస్తారు. అంతేకాకుండా ఈ ఘటనను ఒక వ్యక్తిగత విషాదంగా కాకుండా సామాజిక సమస్యగా భావించి విద్యార్థులను చైతన్యపరచడం, నిరసన కార్యక్రమాలను నిర్వహించడం ద్వారా మహిళలపై జరుగుతున్న హింసకు వ్యతిరేకంగా సమాజాన్ని కదిలించే ప్రయత్నం చేస్తారు. ఈ ప్రక్రియలో విద్యా ర్థులు, సామాజిక సంఘాలు, యువజన సంఘాలు కలిసి పోరాటం చేయడం ద్వారా మహిళా చైతన్యం సామూహిక రూపం దాల్చుతుంది. కథలో అరుణ కేవలం ఒక బాధితురాలిగా మాత్రమే కాకుండా సమాజాన్ని మేల్కొలిపే ప్రతీకగా నిలుస్తుంది. ఆమె కోసం జరుగుతున్న ఈ పోరాటం మహిళలపై జరిగే హింసను ఎదుర్కొనే సామాజిక బాధ్యతను గుర్తు చేస్తుంది. ఈ విధంగా "అరుణ కోసం" కథ మహిళా చైతన్యాన్ని కేవలం వ్యక్తిగత అవగాహనగా కాకుండా సామాజిక ఉద్యమంగా మారడంలో మహిళలే ప్రధాన పాత్రపోషిం చారనేది కనబడుతుంది. మహిళలపై జరిగే అన్యాయానికి వ్యతి రేకంగా మౌనం కాకుండా సంఘటితంగా స్పందించడం ద్వారానే సమాజంలో మార్పు సాధ్యమవు తుందని ఈ కథ బలంగా తెలియ జేస్తుంది.ఈ కథ ద్వారా మహిళా చైతన్యం అంటే సామూహిక ప్రతిఘటన అని చెప్పవచ్చు.

సామాజిక నిర్మాణం-మహిళా చైతన్యం

స్త్రీ జీవితాన్ని నియంత్రించే సామాజిక నిర్మాణాలను రచయిత్రి కె.సుభాషిణి రచించిన "అన్వేషణ" కథలో మహిళా చైతన్యం ఆత్మపరిశీలనగా చిత్రించింది. సామాజిక అవగాహన మరియు పితృస్వామ్య వ్యవస్థపై ప్రశ్నించే దృక్పథం కనిపించడంతో కథానాయిక తన చుట్టూ ఉన్న స్త్రీల జీవితాలను గమనిస్తూ సమాజంలో ఉన్న అసమానతలను అన్వేషించే ప్రయత్నం చేస్తుంది. ఒక సెమినార్ సందర్భంలో సుధారాణి అనే మహిళ తన పరిచయంలో 'చదువుకుంటు న్నప్పుడే పెళ్లి అయింది,పిల్ల పుట్టింది, అందుకే ఉద్యోగం ఆలస్యంగా ప్రారంభించాను' అని చెప్పడం కథానాయికలో ఒక ప్రశ్నను రేకెత్తిస్తుంది. అదే పరిస్థితి పురుషులకు ఎందుకు వర్తించదు? చదువుతుండగానే పెళ్లి అయినా, కుటుంబ బాధ్యతలు వచ్చినా పురుషులు తమ విద్యను, ఉద్యోగాన్ని కొనసాగించగలుగుతారు, కానీ స్త్రీలు మాత్రం కుటుంబ బాధ్యతల కారణంగా తమ అవకాశాలను కోల్పోవాల్సి వస్తుందనే ప్రశ్న కథానాయికలో అంతర్గతంగా ఒక చైతన్యాన్ని మేలుకొలుపుతుంది. ఈ అన్వేషణలో ఆమె ప్రభావతి, ముంతాజ్, శకుంతల వంటి వేర్వేరు వర్గాలకు చెందిన మహిళల జీవితాలను పరిశీలిస్తుంది. ప్రభావతి విద్యావంతురాలైనా పెళ్లి తర్వాత భర్త ఆదేశాల వల్ల ఉద్యోగాన్ని వదిలివేయాల్సి వచ్చిన పరిస్థితి ఒక తరం మహిళల ఆవేదనను ప్రతిబింబిస్తుంది. ముంతాజ్ చదువుకున్న మహిళ అయినా కూడా పిల్లల సంరక్షణ పేరుతో తన ఉద్యోగాన్ని వదిలివేయాల్సిన పరిస్థితి కనిపిస్తుంది. ఇక శకుంతల వంటి కార్మిక వర్గ మహిళల జీవితం మరింత కఠినంగా ఉంటుంది. తలపై పనిభారం, చంకలో పిల్ల, కుటుంబ బాధ్యతల మధ్య ఆమె జీవితం సాగు తుండే దృశ్యాలు కలసిన ఈ మూడు వర్గాల మహిళల జీవితాలను గమనించిన కథానాయికకు సమాజంలో స్త్రీలపై పడే భారాలు ఎంత లోతుగా ఉన్నాయో స్పష్టమవుతుంది. కథ చివర్లో కథానాయిక గ్రహించే విషయం ఏమిటంటే ఇది కేవలం వ్యక్తిగత బాధ కాదు, ఇది ఒక సామాజిక నిర్మాణ సమస్య. పురుషాధిక్య సమాజం తనకు అనుకూలంగా ఏర్పరచుకున్న వ్యవస్థలో మహిళలు తమ జీవితాలను కోల్పోతున్నారు. అందువల్ల "మగవాడు తనకు అనుకూలంగా, తను మాత్రమే సుఖంగా వుండటానికి తయారు చేసుకున్న ఈ లోకాన్ని స్త్రీలుగా మనమే కదా సరిదిద్దాల్సింది"-3 అనే ఈ బాధ్యత కూడా మహిళలదేనని భావించడం మహిళా చైతన్యంగా చూడవచ్చు. ఇక్కడ మహిళా చైతన్యం ఒక ఉద్యమాత్మక రూపంలో కాకుండా ఆలోచనాత్మక రూపంలో వ్యక్తమవుతుంది. స్త్రీ జీవితంలోని అన్యాయాలను గుర్తించడం, వాటి మూలాలను విశ్లేషించడం, సమాజంలో మార్పు అవసరాన్ని గ్రహించడం ద్వారా కథానాయికలో చైతన్యం పెరుగుతుంది. ఈ విధంగా "అన్వేషణ" కథ మహిళా జీవితంలోని వివిధ వాస్తవాలను విశ్లేషిస్తూ స్త్రీ చైతన్యాన్ని ఆత్మపరిశీలనాత్మకంగా ప్రతిబింబించిన కథగా నిలుస్తుంది.

పితృస్వామ్య భావజాలం-మహిళా చైతన్యం

బ్రహ్మ సృష్టించిన ప్రపంచంలో స్త్రీలకు అన్యాయం జరుగుతోందని పురుషులు తమ సమస్యలను చెప్పుకుంటూ బ్రహ్మ దగ్గరకు వెళ్లడం ద్వారా రచయిత్రి కె. సుభాషిణి రచించిన "బ్రహ్మ సూత్రాలు" కథలో మహిళా చైతన్యంను, పితృ స్వామ్య వ్యవస్థపై విమర్శగా వ్యక్త పరిచింది. పురాణ నేపథ్యాన్ని ఉపయోగిస్తూ రచయిత్రి ఆధునిక సమాజంలో మహిళలు సాధించిన స్వాతంత్ర్యం, విద్య, చట్టబద్ధ హక్కులు పురుషాధిక్య భావజాలాన్ని ఎలా కుదిపేశాయో ఈ కథ ద్వారా చూపి స్తుంది. కథలో భూలోకంలోని కొంతమంది పురుషులు బ్రహ్మదేవుని వద్దకు వెళ్లి మహిళల వల్ల తమ జీవితాలు కష్టాల్లో పడ్డాయని ఫిర్యాదు చేస్తారు. స్త్రీలు చదువుకుంటున్నారు, ఉద్యోగాలు చేస్తున్నారు, కట్నానికి వ్యతిరేకంగా నిలుస్తున్నారు, చట్టాల సహాయంతో అన్యాయానికి ప్రతిఘటిస్తున్నారు అనే అంశాలను వారు సమస్యగా వివరిస్తారు.ఈ సందర్భంలో రచయిత్రి పురుషుల ఆలోచనా విధానం మహిళల స్వాతంత్ర్యానికి అడ్డుకట్టవేయాలని ప్రయత్నించడం. ఈ సంభాషణల న్నింటినీ సరస్వతి దేవి వినిపిస్తూ సమాజంలో జరుగుతున్న మార్పులను గమనిస్తుంది. పురుషులు మహిళల స్వేచ్ఛను అణచివేయడానికి

పుస్తకాలను నిషేధించడం, మహిళా సంఘాలను అచేతనంగా చేయడం, చట్టాలను రద్దు చేయడం వంటి సూచనలు చేయడం ఆమెను తీవ్రంగా కలచివేస్తుంది. ఈ సందర్భంలో సరస్వతి పాత్ర మహిళా చైతన్యానికి ప్రతీకగా నిలుస్తుంది. దీనితో భూలోకంలో మహిళలు సాధించిన అవగాహన, జ్ఞానం, స్వాభిమానాన్ని తిరిగి అణచివే యాలని పురుషులు కుట్రలు పన్నుతున్నారని తెలిసి "వీణ వాయించుకుంటూ ఈ బ్రహ్మ లోకం లోపల వూడిగం చేసే కంటే... భూలోకానికి పోయి స్త్రీలను మరింత ధైర్యవంతులుగానూ, జ్ఞానవంతులుగానూ చేయడమే ముఖ్యము..."-4 అని భావించి సరస్వతి తిరుగుబాటుతో బ్రహ్మలోకంలోని తన స్థానాన్ని, కిరీటాన్ని వదిలి భూలోకానికి వెళ్లి స్త్రీలను మరింత జ్ఞాన వంతులుగా, ధైర్యవంతులుగా చేయాలని నిర్ణయించు కోవడం కథలో మహిళా చైతన్యానికి నిదర్శనంగా నిలుస్తుంది. ఈ కథ ద్వారా రచయిత్రి మహిళలపై జరిగే అన్యాయాన్ని ఎదుర్కోవడానికి జ్ఞానం, విద్య, చైతన్యం అత్యంత అవసరమని సూచిస్తుంది.

భావోద్వేగాలు-మహిళా చైతన్యం

స్త్రీ జీవితంలోని సంపద, అధికారాలు ఉన్నప్పటికీ స్త్రీ సంతోషంగా ఉండకపోవచ్చు అని కె. సుభాషిణి రచించిన "లక్షణ" కథలో స్త్రీ భావోద్వేగాలు, ఆశలు, వ్యక్తిత్వాల మధ్య ఉన్న సంఘర్షణను ప్రతిబింబిస్తుంది. కథలో శ్రీకృష్ణుని భార్యలలో ఒకరైన లక్షణ పాత్ర ద్వారా స్త్రీ జీవితంలోని అంతర్మథనాన్ని రచయిత్రి స్పష్టంగా చూపిస్తుంది. లక్షణకు సంపద, వైభవం, రాజసౌఖ్యం అన్నీ ఉన్నప్పటికీ ఆమె జీవితం అంతర్గతంగా ఒంటరితనంతో నిండిపోయి ఉంటుంది. భర్త ప్రేమ, అనురాగం, సహవాసం కోసం ఎదురుచూస్తూ ఆమె గడిపే ప్రతి క్షణం స్త్రీ జీవితంలోని ఒక మానసిక వేదనగా కనిపిస్తుంది. అనేక భార్యల మధ్య భర్తను పంచుకోవాల్సిన పరిస్థితి లక్షణలో అసంతృప్తిని కలిగిస్తుంది. అయితే ఈ అసంతృప్తిని వ్యక్తపరచడం కూడా ఆమెకు సులభం కాదు, ఎందుకంటే సమాజం భార్య భర్తను భగవంతునిగా భావించి సేవ చేయాల్సిన వ్యక్తిగా మాత్రమే చూడాలని ధర్మశాస్త్రాలు బోధిస్తున్నాయి. ఈ పరిస్థితిని లక్షణ ప్రశ్నించడంతో భర్తను భగవంతునిగా పూజించాలనే ధర్మాన్ని అంగీకరించి నప్పటికీ, భార్య కూడా ఒక మనిషి అనే విషయాన్ని గుర్తించాల్సిన అవసరాన్ని లక్షణ ప్రస్తావిస్తుంది. ప్రేమ, అనురాగం, సహజీవనం అనే భావాలు కూడా భార్యకు అవసరమేనని ఆమె తర్కిస్తుంది. భక్తుడు భగవంతుని పట్ల చూపే భక్తిని భార్య భర్త పట్ల చూపాలని చెప్పడం ఒక ఏకపక్ష ధర్మంగా లక్షణ భావిస్తుంది. భక్తులకు తమ భక్తిని ఇతరులతో పంచుకునే స్వేచ్ఛ ఉన్నప్పటికీ, భార్య తన భర్త ప్రేమను ఇతర స్త్రీలతో పంచుకోవాల్సిన పరిస్థితి అన్యాయమని ఆమె ప్రశ్నిస్తుంది. ఈ ప్రశ్నల ద్వారా లక్షణ తన అంతర్మనసులో ఉన్న బాధను మాత్రమే కాకుండా స్త్రీలపై విధించిన సామాజిక నియమాలను కూడా విమర్శి స్తుంది. లక్షణకు ఉన్న ఈ అవగాహన స్త్రీ జీవితంలోని అసలు సమస్యలను గుర్తించే చైతన్యంగా కనిపిస్తుంది. "భార్య భర్త ప్రేమను సవతులతో పాటు పంచుకోవ డం సాధ్యమా స్వామీ...?"-5 అని పురుషులకు ఉన్న బహు భార్యాత్వపును స్త్రీ కోణం నుండి ప్రశ్నించడం, మహిళా చైత న్యంలో ప్రత్యక్ష తిరుగుబాటుగా కాకుండా ప్రశ్నించే ధోరణిగా వ్యక్తమవుతుంది.

ఆధునిక కుటుంబ జీవితం-మహిళా చైతన్యం

ఆధునిక నాగరికత, సంస్కృతులు కుటుంబ జీవితం మీద చూపే ప్రభావాన్ని రచయిత్రి కె. సుభాషిణి రచించిన "అమూల్య" కథలో చిత్రించింది. యువతలో పెరుగు తున్న వస్తువుల మీద మోజుతో అమూల్య అనే యువతి పాత్ర ద్వారా ఆధునిక సమాజంలో పెరుగుతున్న వినియోగవాద దృక్పథాన్ని రచయిత్రి చిత్రిస్తుంది. కాలేజీలో చేరబోతున్న అమూల్య తన స్నేహితుల మాదిరిగా బ్రాండెడ్ దుస్తులు, ఫ్యాషన్ వంటి "వస్తువుల మీద క్రేజ్, మోజు, ఫోజు ఏదైనా సరే ఉంటే మాత్రం మార్కెట్ తయారు చేసే రకరకాల వస్తువులను కొనడం తోనే జీవితమంతా గడిచిపోతుంది..."-6 అలాంటప్పుడు ఈ కోరికలు ఆమె వ్యక్తిగత అవసరాల కంటే సమాజంలో తనను ఇతరుల కంటే తక్కువగా చూడకూడదనే భావనతో ముడి పడి ఉంటాయి. అయితే ఈ కోరికల

వెనుక ఉన్న కుటుంబ పరిస్థితులు, తల్లిదండ్రుల కష్టం, ఆర్థిక పరిమితులు మొదట్లో ఆమెకు స్పష్టంగా అర్థం కావు. ఇలాంటి సమయంలోనే అమూల్య తల్లి సునీత పాత్ర ద్వారా రచయిత్రి మహిళా జీవితంలోని మరో కోణాన్ని చూపిస్తుంది. కుటుంబాన్ని నడిపించడానికి, కూతురు చదువు కోడానికి తాను పడే శ్రమను, చీరల రోలింగ్ వంటి పనుల ద్వారా సంపాదించే తక్కువ ఆదాయాన్ని, ఆ డబ్బును ఎంత జాగ్రత్తగా వినియోగించుకోవాలి అనే మాటతో మహిళా ఆర్థిక చైతన్యం కనిపిస్తుంది. ఈ సంభాషణల ద్వారా అమూల్య క్రమంగా ఒక అవగాహనకు వస్తుంది. తల్లిదండ్రుల ప్రేమ అనేది వారు కోరిన ప్రతి వస్తువును కొనివ్వడంలో మాత్రమే ఉండదని, వారి కష్టాన్ని అర్థం చేసుకోవడంలోనూ ఉందని అమె గ్రహించడం కథలో మహిళా చైతన్యానికి ముఖ్యమైన సూచన. ఇక్కడ మహిళా చైతన్యం అనేది ప్రత్యక్షంగా తిరుగు బాటు చేయడం కాదు, కుటుంబ జీవితం, ఆర్థిక వాస్తవాలు, వినియోగ సంస్కృతి ప్రభావాలను అర్థం చేసుకోవడం ద్వారా ఏర్పడే ఆత్మపరిశీలన. తల్లి పాత్రలో కనిపించే బాధ్యత, కుటుంబం కోసం చేసే త్యాగం కూడా మహిళా చైతన్యానికి మరో రూపంగా నిలుస్తుంది. ఈ కథలో స్త్రీలు కేవలం కుటుంబంలో బాధ్యతలు నిర్వర్తించే వ్యక్తులుగా మాత్రమే కాకుండా, విలువలను, జీవన విధానాన్ని, సామాజిక అవగాహనను తదుపరి తరాలకు అందించే మహిళా చైతన్య వ్యక్తులుగా కూడా కనిపిస్తారు.

ప్రాంతీయ మహిళా చైతన్యం

కె.సుభాషిణి రచించిన "గాయాలు" కథలో మహిళా చైతన్యం ప్రాంతీయ అసమానతలు, సాంస్కృతిక అవమానాలు మరియు ఆత్మగౌరవ భావనల మధ్య వ్యక్తమయ్యే ప్రతిఘటనగా కనిపిస్తుంది. కథలో ప్రధాన పాత్ర అయిన ఒక తల్లి తన వ్యక్తిగత అనుభవాలు, తన కూతురి అనుభవాలు, మరియు సమాజంలో ఉన్న ప్రాంతీయ వివక్షల ద్వారా ఒక లోతైన సామాజిక చైతన్యాన్ని ప్రతిబింబిస్తుంది. చిన్ననాటి జ్ఞాపకాలలో కనిపించే జొన్నరొట్టె, గ్రామీణ జీవనశైలి, కుటుంబ సంబంధాలు వంటి అంశాలు ఆమెకు గర్వకారణాలు కాగా, అదే ఆహారం మరియు జీవన విధానాన్ని ఇతర ప్రాంతాల వారు తక్కువగా చూడటం ఆమె మనసులో గాయాలుగా మిగిలిపోతాయి. ఈ గాయాలు కేవలం వ్యక్తిగత అనుభవాలు మాత్రమే కాదు, అవి ఒక ప్రాంతం, ఒక సంస్కృతి, ఒక జీవన విధానం మీద జరిగిన అవమానాల ప్రతీకలుగా నిలుస్తాయి. హాస్టల్లో చదువుతున్న తన కూతురు కూడా అదే విధమైన చిన్నచూపును ఎదుర్కొంటున్నప్పుడు తల్లి మనసులో ఉన్న బాధ మరింతగా మేల్కొంటుంది. ఈ సందర్భంలో మహిళా చైతన్యం ఒక తల్లిగా తన కూతురికి ఆత్మగౌరవాన్ని నేర్పించే బాధ్యతగా రూపుదాలుస్తుంది. కథలో ఆఫీసు సందర్భంలో నరేష్ అనే సహోద్యోగి ప్రాంతీయ ఆహారం, సంస్కృతి, జీవన విధానం గురించి ఎగతాళి చేసినప్పుడు కథానాయిక మౌనం వహించకుండా ప్రత్యక్షంగా స్పందించి "మా వూర్లకు వచ్చి మమ్మల్నే ఏదో ఒక రకంగా వెక్కిరిస్తారు... మా మీద పెత్తనం చేసే అధికారం ఎవరు యిచ్చారు? మా వోర్పు చేతకానిత నంగా కనిపిస్తోందా...?"-7 అనే మాట మహిళా చైతన్యానికి ముఖ్యమైన సూచన. ఇక్కడ అమె స్పందన కేవలం వ్యక్తిగత ఆవేశం కాదు, అది ప్రాంతీయ గౌరవాన్ని కాపాడు కునే ధైర్యంగా కనిపిస్తుంది. అమె మాటల్లో ప్రాంతీయ సంస్కృతిని అవమానించడం నాగరికత కాదనే స్పష్టమైన సందేశం ఉంటుంది. ఈ కథలో మహిళా చైతన్యం సాంస్కృతిక స్వాభిమానంతో ముడిపడి ఉంటుంది. తన ప్రాంతపు ఆహారం, భాష, జీవన విధానం గురించి గర్వంగా నిలబడటం ద్వారా కథానాయిక తనలోని ఆత్మగౌరవాన్ని ప్రకటిస్తుంది. అదే సమయంలో ఈ చైతన్యం తన కూతురికి కూడా బలాన్ని ఇవ్వాలని అమె కోరుకుంటుంది. గతంలో తాను అనుభవించిన అవమానాలను మౌనంగా భరించినప్పటికీ, ఇప్పుడు వాటికి ప్రతిస్పందించే ధైర్యం అమెకు వచ్చింది. ఈ మార్పు మహిళా చైతన్యానికి ప్రతీకగా నిలుస్తుంది.

సామాజిక-ఆర్థిక వ్యవస్థలో మహిళా చైతన్యం

కె. సుభాషిణి రచించిన "బ్లాక్ హోల్" కథలో మహిళా చైతన్యం సామాజిక-ఆర్థిక వ్యవస్థలో దాగి ఉన్న శక్తి

సంబంధాలను బహిర్గతం చేసే విమర్శాత్మక దృష్టిగా వ్యక్తమవుతుంది. ఈ కథలో మద్యం వ్యాపారం, రాజకీయాలు, అధికార వ్యవస్థలు కలిసి సాధారణ ప్రజల జీవితాలను ఎలా ప్రభావితం చేస్తున్నాయో రచయిత్రి స్పష్టంగా చూపిస్తుంది. ముఖ్యంగా ఈ వ్యవస్థలో అత్యంత బాధితులుగా నిలిచే వారు మహిళలే అన్న విషయం కథలోని సంఘటనల ద్వారా వెలుగులోకి వస్తుంది. కథ ప్రారంభంలో మద్యం వ్యాపారస్తులు, రాజకీయ నాయకులు, అధికారం కలిగిన వర్గాలు ఒకే వేదికపై కలిసి తమ వ్యాపార ప్రయోజనాల కోసం సమావేశమవడం కనిపిస్తుంది. అక్కడ మహిళలను కేవలం పేరుకే భాగస్వాములుగా చూపిస్తారు. వారి పేర్లపై మద్యం దుకాణాలు పెట్టడం ద్వారా మహిళా సాధికారత పేరుతో ఒక మోసం జరుగుతుంది. ఇక్కడ మహిళా చైతన్యం ప్రత్యక్షంగా కనిపించకపోయినా, ఈ వ్యవస్థలో మహిళల పేరును ఉపయోగించి జరుగుతున్న దోపిడీపై రచయిత్రి చూపించే విమర్శలో అది అంతర్లీనంగా ఉంటుంది. కథలో నారాయణమ్మ వంటి సాధారణ మహిళా పాత్ర ద్వారా మద్యం సంస్కృతి కుటుంబాలను ఎలా నాశనం చేస్తుందో చూపబడుతుంది. భర్త పచ్చన్న మద్యానికి బానిసై కుటుంబాన్ని నిర్లక్ష్యం చేయడం, పిల్లల భవిష్యత్తు గురించి బాధపడుతున్న నారాయణమ్మ పరిస్థితి, అప్పుల బారిన పడిన జీవితాలతో మహిళలు ఎదుర్కొనే కఠిన వాస్తవాలను ప్రతిబింబిస్తాయి. ఆమె తన కష్టంతో సంపాదించిన డబ్బు కూడా భర్త మద్యానికి పోతుండటం ద్వారా ఆర్థిక, మానసిక, కుటుంబ హింసలతో కూడిన జీవితాన్ని అనుభవిస్తుంది. అయినప్పటికీ ఆమె కుటుంబాన్ని నిలబెట్టుకోవాలనే ప్రయత్నం చేస్తూ ఉండటం మహిళల సహనాన్ని, బాధ్యతను సూచిస్తుంది. మరోవైపు కథ చివర్లో కనిపించే మహిళా విలేకరి పాత్ర మహిళా చైతన్యానికి ప్రత్యక్ష రూపం. ఆమె ప్రభుత్వ విధానాలను ప్రశ్నిస్తూ, "ప్రజల ఆరోగ్యాల మీద మీకు దృష్టి లేదా? లిక్కర్ వలన స్త్రీలకు ఎదురయ్యే ఇబ్బందులకు ఎవరు బాధ్యులు..."-8 అని మద్యం వల్ల మహిళలకు ఎదురయ్యే సమస్యల గురించి మంత్రిని నిలదీయడంతో మహిళా చైతన్యం అనేది కేవలం వ్యక్తిగత సమస్యలకే పరిమితం కాకుండా సామాజిక వ్యవస్థపై విమర్శాత్మక దృష్టిగా మారుతుంది. ఈ కథలో మహిళలు బాధితులుగా మాత్రమే కాకుండా ప్రశ్నించే స్వరాలుగా కూడా కనిపిస్తారు.

ముగింపు

ఆధునిక తెలుగు కథా సాహిత్యంలో కె.సుభాషిణి గారి కథలు మహిళా చైతన్యాన్ని ఒక నూతన కోణంలో ఆవిష్కరించాయి. ఆమె అమూల్య కథలను సమగ్రంగా విశ్లేషించినప్పుడు, స్త్రీ చైతన్యం అనేది కేవలం అరుపులు,కేకలతో కూడిన తిరుగుబాటు కాకుండా అది నిశ్శబ్దంగా తనను తాను గుర్తించు కోవడం.'జారవిడుచుకున్న రంగులు'లో వ్యక్తిత్వ అన్వేషణ, 'అరుణ కోసం'లో సామూహిక సామాజిక బాధ్యత, 'గాయాలు'లో ప్రాంతీయ ఆత్మ గౌరవం వంటివి ఇలా ప్రతి కథలోనూ మహిళా చైతన్యం విభిన్న రూపాల్లో దర్శనమిస్తుంది. ముఖ్యంగా 'బ్లాక్ హోల్' కథ ద్వారా ప్రభుత్వం మరియు పితృస్వామ్య వ్యవస్థలు కలిసి మహిళలను ఎలా పావులుగా వాడుకుంటున్నాయో రచయిత్రి అత్యంత ధీటుగా ప్రశ్నించారు. సుభాషిణి గారి దృష్టిలో మహిళా చైతన్యం అంటే శ్రీకృష్ణుని భార్య 'లక్షణ' లాగా తన మనోభావాలను నిర్భయంగా వ్యక్తపరచడం, 'అన్వేషణ'లో లాగా సామాజిక నిర్మాణాలలోని అసమానతలను గుర్తించడం.ముగింపుగా చెప్పాలంటే, సుభాషిణి కథల్లోని స్త్రీలు బాధితులుగా మిగిలిపోవడానికి ఇష్టపడరు. వారు సమస్యల మూలాలను వెతుకుతారు, విశ్లేషిస్తారు మరియు పరిష్కారం దిశగా అడుగులు వేస్తారు. విద్య, జ్ఞానం మరియు ఆర్థిక అవగాహన ద్వారానే స్త్రీ విముక్తి సాధ్యమని ఆమె బలంగా చాటిచెప్పారు. ఈ వ్యాసం ద్వారా విశ్లేషించిన అంశాలు స్త్రీ జీవితంలోని వాస్తవాలను చూపడమే కాకుండా సమాజంలో సమానత్వం అవసరాన్ని సూచిస్తాయి. స్త్రీ తన వ్యక్తిత్వాన్ని గుర్తించుకొని స్వతంత్రంగా జీవించాలనే సందేశాన్ని ఈ కథలు అందిస్తాయి. అందువల్ల ఆమె కథలు మహిళా చైతన్య సాహిత్యంలో ప్రాముఖ్యమైన స్థానం పొందాయి.

పాదసూచికలు

1. జారవిడుచుకున్న రంగులు కథ-కె.సుభాషిణి-పుట:191
2. అరుణ కోసం కథ-కె.సుభాషిణి-పుట:178
3. అన్వేషణ కథ-కె.సుభాషిణి-పుట:148
4. బ్రహ్మ సూత్రాలు కథ-కె.సుభాషిణి-పుట:112
5. లక్షణ కథ-కె.సుభాషిణి-పుట:53
6. అమూల్య కథ-కె.సుభాషిణి-పుట:27
7. గాయాలు కథ-కె.సుభాషిణి-పుట:119
8. బ్లాక్ హోల్ కథ-కె.సుభాషిణి-పుట:136

ఆధార గ్రంథాలు

1. సుభాషిణి.కె, అమూల్య కథల సంపుటి(2015), స్ఫూర్తి ప్రచురణలు, కర్నూలు.
2. చంద్రశేఖర్ రెడ్డి,రాచపాళెం, మన నవలలు మన కథానికలు(2013), విశాలాంధ్ర పబ్లిషింగ్హౌస్, విజయవాడ.
3. జ్యోతిరాణి తోట, మహిళల జీవన విధ్వంసం-సామాజిక ఆర్థిక మూలాలు(2018). పుస్తకం.నెట్
4. యువభారతి, స్త్రీవాద ధోరణులు సమకాలీన సాహిత్యం(1994), ఆంధ్ర సారసత్వ పరిషత్, హైదరాబాద్.
5. ఓల్గా, నూరేళ్ళ చలం(1994), విశాలాంధ్ర పబ్లిషింగ్హౌస్, హైదరాబాద్.
6. కనకదుర్గ జంధ్యాల, తెలుగు సాహిత్యం మహిళా చైతన్య ప్రస్తానం(2009), తాహెర్ గ్రాఫిక్స్, కొత్తగూడెం.

★★★

Vol. 23 | Spl. Issue 03 | March 2026 | BHAVAVEENA | ISSN No. : 2456-4702 | RNI No. APTEL/2003/12253

RNI No. APTEL/2003/12253 | Reffered Journal & Peer Reviewed Journals | ISSN No. 2456-4702

భావవీణ

కళలు, సాహిత్య, సాంస్కృతిక భాషాధ్యయన పత్రిక

BHAVA VEENA

Journal of Arts, Literary, Culture & Language Study

నలిమెల భాస్కర్ అద్దంలో గాంధారి అనువాద కథా సంకలనం స్త్రీ చైతన్యం

- కాటర్ల స్వరాజ్యం

పరిశోధక విద్యార్థి, కాకతీయ విశ్వవిద్యాలయం హన్మకొండ.

వ్యాస సంగ్రహం :

అనువాద సాహిత్యంతో సమాజానికి కొత్త విషయాలు పరిచయం అవుతాయి. తెలుగులో అనువాద సాహిత్యంపై రచయితలు ప్రత్యేకశ్రద్ధ చూపుతున్నారు. 14 భాషలు నేర్చిన నలిమెల భాస్కర్ అద్దంలో గాంధారి అనువాద కథాసంకలనంలో ఆరు భాషల్లో 12 కథలున్నాయి. అద్దంలో చూసుకుంటే ఉన్నదున్నట్టుగా కనిపిస్తుంది, లోపాలను చెప్తుంది. ఈ కథల్లో స్త్రీ తనను తాను చూసుకుని, లోపాలు తెలుసుకొని, ఎలా చైతన్య పరచుకోవాలో చూపించాడు రచయిత. చైతన్యం ఎక్కడో పుట్టిది కాదు మనలో పుట్టేది. ఈ సంకలనంలోని మూడు కథలు స్త్రీ చైతన్యాన్ని స్పష్టంగా చూపించి, మారాల్సిన సమయం వచ్చినప్పుడు మహిళా మౌనంగా ఉంటే జీవితం మొత్తం శూన్యం అవుతుందని, మౌనం వీడినప్పుడు చైతన్యం మొదలవుతుందని తెలిపాడు. తెలుగు విశ్వవిద్యాలయం నుండి ఉత్తమ అనువాద సాహిత్య పురస్కారం పొందిన ఈ కథా సంకలనం రెండో ముద్రణ పొందిందంటే సమాజంపై దీని ప్రభావం ఎంతగా పడిందో చెప్పవచ్చు. మూడు కథల్లో స్త్రీ జీవితం, ఆమెలో కలగాల్సిన మార్పు నేటి కాలపు సమాజానికెలా అవసరమో చూపించాడు. ప్రతి స్త్రీకి ఈ కథా సంకలనం మార్గదర్శకం.

కీలక పదాలు :

ఆత్మహత్యా ప్రయత్నం, ఆత్మవిశ్వాసం, నాన్న దగ్గరకు, స్త్రీ చైతన్యం, కళ్ళకు గంతలు, మానసిక క్షోభ, బంగారు పంజరం, విధవ, ప్రతీకారం, సాంప్రదాయం, సమాజం, ముత్తెదువ.

ఉపోద్ఘాతం :

మహిళంటే అబల కాదు సబలని మహాభారత కాలం నుండి తెలియ వచ్చిన సత్యం. మంది కోసం తనను తాను నశింప చేసుకుని తన ఉనికిని కోల్పోతుంది. తన ఇష్టంతో సంబంధం లేకుండానే సమాజం తనపై వేస్తే, కట్టుబాట్లు దాటలేక, స్వేచ్ఛగా అభిప్రాయం చెప్పలేక, లోలోపల కృంగి చివరికి తన కథ ముగిస్తుంది. అలాంటి ఆడవాళ్ళ జీవితాలెన్నో చరిత్రలో దాగి ఉన్నాయి. సీత మండోదరి గాంధారి.... సామాజిక కట్టుబాట్లకు బలైనారు. గాంధారిని నలిమెల భాస్కర్ అద్దంలో గాంధారి కథలో కొత్తగా చూపిన తీరు ప్రతి స్త్రీకి ఆదర్శ నీయంగా ఉంటుంది. గాంధారి కథ కేవలం ఒక స్త్రీది కాదు, ప్రతి స్త్రీకి చెందినది. ఈ సంకలనంలోని మరో రెండుకథలు నల్ల మబ్బు వెండి అంచు బొమ్మకు అటువైపు వీటిలో స్త్రీ చైతన్యాన్ని సవాల్ గా చూపించాడు కవి. 20వ శతాబ్దంలో మొదలైన ఫిమేనిజం నేటికీ కొనసాగుతూనే ఉంది బహిర్గతంగా, అంతర్గతంగాను. స్త్రీ వేదన, మానసిక వాదన

కనిపిస్తుంది. భరించే వరకే బాధ, ఆ బాధ తుడిచి పెట్టినట్లయితే జీవితంలో కన్నీరంటూ రాదనే సత్యాన్ని కథలో తెలిపాడు.

నల్లమబ్బు వెండి అంచు కథ విశేషణ :

నేమిచంద్ర కన్నడ కథకు అనువాదం. ఇద్దరు స్త్రీల జీవితాలతో ముడిపడిన కథలో ఒకరు పాతకాలం సాంప్రదాయవాదైతే మరొకరు చైతన్యానికి ప్రతీక.

సంప్రదాయ శీలి మధు :

భార్య భర్తల గొడవలు ఎంత దూరమైనా వెళ్లొచ్చు. ఇద్దరిలో ఒకరికిష్టం లేకపోయినా విడిపోవాల్సిందే. రవి భార్యని వద్దనుకుని ఒక బిడ్డ పుట్టినప్పటికీ విడాకులు ఇవ్వమని అడుగుతాడు. భర్త దూరం కావడం భరించలేక చనిపోవాలనుకుంటుంది. చిన్న సమస్యకు కృంగిపోయి చావే పరిష్కారమనుకునే సామాన్య స్త్రీలకు నిదర్శనంగా చెప్పవచ్చు. భర్తను లోంగదీసుకునే ప్రయత్నంలో "నేను మాత్రం చావాలని? నా చావు ప్రయత్నం సైతం బతికేందుకు హతాశురాలనై చేసిన చివరి ప్రయత్నం! రవిని ఎలాగైనా నా దారికి తెచ్చుకోవాలని చేసిన చిట్టచివరి ప్రయత్నం" (నల్ల మబ్బు వెండి అంచు, 18) (1). భార్య భర్తలు ప్రేమతో దగ్గరవ్వాలి, బలవంతంగా ఒకరి ప్రేమను మరొకరు పొందలేరు. భర్త ప్రేమను పొందడం కోసం నిద్ర మాత్రలు మింగి చావుకు సిద్ధపడింది మధు. భర్తను భయపెట్టి తనతో ఉండేలా చేసుకోవాలనుకుంటుంది. భర్త లేకపోతే జీవితమే లేదనుకునే మామూలు స్త్రీ. విడాకులు వద్దనిపించడానికి చావంచులు చేరింది. ఈ ప్రయత్నం ఒకరకంగా ఫలించింది, మరోరకంగా బాధించింది. ఆత్మహత్య ప్రయత్నంతో రవి విడాకులు అడగడకుండా మాట్లాడడమే మానేస్తాడు. తర్వాత బయటకెళ్లి, నచ్చిన అమ్మాయితో కొత్త జీవితం ప్రారంభిస్తాడు. పురుషాధిక్య సమాజంలో స్త్రీ స్వేచ్ఛ, ప్రేమకు చోటు లేదు. చనిపోతానన్న భార్యను వదిలేసి, తన స్వార్థానికి వెళ్లిపోయిన రవి లాంటి వ్యక్తులు నేడూ కనిపిస్తారు. రవి దూరమయ్యాక మధు బలహీనురాలు అవుతుంది, ఎందుకంటే ఆమె ఒక సాధారణ గృహిణిగా ఉండిపోయింది ఇన్నాళ్లు. భర్తను మరిచి పోలేక, జీవితమంటే ఏమిటో తెలియక చైతన్యాన్ని పూర్తిగా కోల్పోయి నిచ్చలస్థితిలో ఉండి పోయింది. స్త్రీ భర్తకు నచ్చినట్టుండడం కోసం తన వ్యక్తిత్వాన్ని త్యాగం చేసినా మగాడు తన బుద్ధిని మార్చుకోడు.ఈ నేపథ్యంలో తనకన్నీ తెలిసినా తెలియనట్టుండి, కేవలం తన భర్తకి గౌరవం దక్కాలని పిల్లల దగ్గర కూడా పరాధీ నురాలు అవుతుంది.

అమ్మా ఇరాక్ ఏ ఖండంలో ఉంది
నాన్నని అడుగు వెళ్లమా!
అమ్మా ప్రోగ్రెస్ కార్డు మీద సంతకం పెట్టు
నాన్న దగ్గరికెళ్లమా!

- (నల్లమబ్బు వెండి అంచు, 23)(2).

ప్రతిదానికి నాన్న నానంటూ అతనికి కిరీటం పెట్టి, తనను తాను కోల్పోయింది. భర్తకు దూరమయ్యాక తన సొంత కాళ్ళ మీద నిలబడి జీవితాన్ని ముందుకెలా నడపాలో తెలియక బాధపడుతుంది. ఆడవాళ్లంటే ఇంటిని, బిడ్డను అన్నింటిని ఒంటి చేత్తో నడిపే ఆదిశక్తిగా ఉండాలంటారు పెద్దలు. మధు జీవితంలో మార్పు మెల్ల మెల్లగా రావడానికి కారణం శీలా మాటలు, జీవితంలోని అనుభవాలు, కష్టాలు, చీత్కారాలు. ప్రతి తల్లి తన బిడ్డ కోసం ఏదైనా చేయడానికి సిద్ధమవుతుంది ,మధు కూతురు జీవితం బాగుండాలంటే తను ఎదగాలనుకుని శీల ప్రోత్సాహంతో ఫ్యాషన్ డిజైనర్ గా ప్రయాణాన్ని మొదలు పెడుతుంది. అడుగు వెయ్యగానే విజయం రాదు, ఓపిక ఉన్నప్పుడే విజయం వరిస్తుంది. మధు జీవితంలో జరిగిందిదే. ఒకరోజు తన బిడ్డ పుట్టిన రోజుకు ఫ్రాక్ కొనడానికి షాప్ కి వెళ్లి, తన దగ్గరున్న డబ్బులకు అందమైన డ్రెస్ రాలేదు, అలాగే అక్కడున్న సేల్ గర్ల్ అవమానం చేయడంతో .ఇంటికి వచ్చి తన కూతురుకు తానే డ్రెస్ కుడుతుంది ఇది తనకు పునర్జన్మ వంటిది"శీలా ఎన్ని మార్లు సాహసాన్ని రంగరించి పోసే ప్రయత్నాలు చేసిన సఫలం కానిది ఈ ఘోర పరాభవం నాలో పట్టుదలను కల్గించింది....నా దీక్ష గెలిచింది సిండ్రెల్లా ఫ్రాక్!" (నల్లమబ్బు వెండి అంచు, 28)(3). అంతర్గత ప్రేరణతో వ్యక్తిలో వచ్చిన చైతన్యం వారిని అత్యున్నత స్థాయిలో నిలబెడుతుంది. మదులో తెలియని ఆనందం,

ఆత్మవిశ్వాసంతో వెనుదిరిగి చూసుకోకుండా జీవితంలో ముందుకు సాగింది. అప్పటివరకు జడత్వంతో సాధారణ ఇల్లాలుగా భర్త పై ఆధారపడిన మధు పూర్తిగా మారి పోయింది. నేనేం చేయగలనని అధైర్య పడిన స్త్రీ నేను చేయగలను, నేను మాత్రమే చేయగలనని పట్టుదలతో కష్టపడి ఆరు నెలల్లోనే ఒక సంపూర్ణ మహిళగా మారి పోయింది. దూరదర్శన్ లో 'వస్త్ర విన్యాసం మధు బుటిక్ మల్లీశ్వరం' పంక్తి రావడం మధు విజయానికి ప్రతీక..

చైతన్య మూర్తి శీల :

డాక్టర్‌గా ఎందరో జీవితాలను మార్చిన శీల, స్నేహితు రాలు జీవితాన్ని చైతన్యవంతం చేసి గెలిపించి, ప్రతి స్త్రీకి అంకితమిచ్చింది. ఇలాంటి ఆదర్శ భావాలు గల స్త్రీలు నేటి సమాజానికి అవసరం. బాధలో ఉన్న వారికివ్వాల్సింది ఓదార్పు కాదు, భావాజాలంలో మార్పు వచ్చే ధైర్యం. నిద్ర మాత్రలు మింగినప్పుడు "నువ్వు మళ్లీ మింగా లనుకుంటే హాయిగా మింగేసెయ్ ఈసారి నిన్ను బతికించ డానికి నేను రానులే... జీవితంలో ప్రతి సమస్యకు చావే సమాధానమనుకుంటే ఈ ప్రపంచంలో ఒక్క మానవ మాత్రుడు కూడా మిగలకపోయేవాడు తెలుసా"(నల్ల మబ్బు ఉంది అంచు, 7)(4). చావు ప్రతి సమస్యకు పరిష్కారం కాదు, అలాగని దాన్ని ఆపాలనుకోవడం లేదు. ఎందుకు చావాలనుకుంటున్నావో తెలుసుకోవాలి, జీవిత పరమార్థం తెలుసుకున్న వాడే గొప్పవాడు. ఈ మాటలు మనిషిని మనిషిగా మార్చే ప్రయత్నాలు కావు తీర్చిదిద్దడం ఆమెలో ప్రేరణను కలిగించడం. శీలకు పెళ్లి కాలేదు కాని జీవితంపై పూర్తి అవగాహన ఉంది. చదువుకున్న స్త్రీగా చైతన్యభావాలు నిండిన మహిళ "అతని వదిలేయ్ వివాహము ద్రోహము ఇలాంటి చెల్లని మాటలతో ఉన్న కాలం కాదిది ఓ తాళిబొట్టుతోను చట్టంతోనో మానవ సంబంధాల్ని కట్టి పారేయడం సాధ్యమయ్యే కాలమా? అతనికి నువ్వు అవసరం లేదనిపించాక నీకు మాత్రం అతనితో అవసరమేంటి"(నల్లమబ్బు వెండి అంచు, 21) (5). ప్రతి మాట సాంప్రదాయాన్ని కూలదోసేవి కాదు. సంబంధాలు కలిసి ఉండడానికి చట్టాలు, బంధుత్వాలు పనికిరావు. ఇద్దరు కలిసుండా లంటే ఉండా ల్సింది ప్రేమ, నమ్మకం. అది లేనప్పుడు ఏ చట్టము వారిని కలిపి ఉంచదు. నేటి కాలంలోని భార్యాభర్తల గురించి ఈ ఒక్క మాటలో తెలిసిపోతుంది. స్త్రీకి సాంప్రదాయముండాలి , స్వతంత్రాన్ని కోల్పోవాల్సిన అవసరం లేదు

అద్దంలోగాంధారి కథ విశ్లేషణ :

జయప్రకాశ మావినకుళి కన్నడం కథకు అనువాదం. స్త్రీ తనను తాను చూసుకు న్నట్లుంటుదీ కథ. భారతంలో గాంధారి ముగ్ధ, భర్త కోసం గుడ్డిదైన పతివ్రతగా నన్న యాదులు చూపించారు. నలిమెలభాస్కర్ ఈకథలో గాంధారిని చూపిన తీరు కొత్తగా ఉంటుంది. నేటికాలపు గాంధారి పరిస్థితిని స్త్రీ కోణంలో చూపాడు. ఆడపిల్లకు పెళ్లిపై కళలు, ఆశలు కాబోయే భర్త గురించి ఊహలు ఉంటాయి. గాంధారి జీవితం పంజరంలో చిలుక వంటిది. చెలికత్త వచ్చి రాకుమారి నీ వివాహం రాజకుమా రినితో నిశ్చయమైంది, అతడు పుట్టుగుడ్డి వాడన డంతో అలాగే ఉండిపోతుంది. సమాజంలో దాసికున్న స్వేచ్ఛ రాజ కుమారికి లేదని చెప్పవచ్చు" అల్లకల్లోల మైన మనసుతో దాసిని పిలవగా 'లేదు రాకుమారీ!'ఆ దాసి నిన్నరాత్రి కోటకి కాపలాదారైన భటునితో లేచిపోయిందట అని జవాబు విని ఎంత అదృష్టవంతురాలు! అని మనసులోనే అనుకుంటుంది" (అద్దంలో గాంధారి, 38)(6). గాంధారి తన మానసిక స్థితికి అందో ళన చెంది తండ్రితో మాట్లాడ దామనుకుని, చెలికత్తను పిలిచి దాసిని రమ్మనగానే ఆమె చెప్పిన సమాధానం కొంత వైరాగ్యాన్ని కలిగించడంతో ఏమి చేయలేక ఉండిపోతుంది. ఒకనాటి సమాజంలో ఉన్నత వర్గంలో స్త్రీల జీవితం ఎలా ఉండేదో గాంధారి పాత్ర నిదర్శనం. పెద్దింట్లో పుట్టిన స్త్రీలకు అన్ని సౌకర్యా లుంటాయి కాని, మనసులు తెలుసుకొని కలిసి ప్రయాణం చేసే వారుండరు. చావలేక బతకలేక ఉండే వారు.

గాంధారి పట్టుదల :

నిజానికి గాంధారి సాధారణమైన స్త్రీ కాదు, ఆమెలో ఆత్మాభిమానమెక్కువ. ఎదిరించి పోరాడకపోయినా ఆత్మవిశ్వాసాన్ని కోల్పోలేదు. కాబోయే భర్త గుడ్డివాడని

ఏడుస్తూ కూర్చోని సమాజంతో, తల్లి దండ్రులతో గొడవ పడలేదు. మరేం చేసిందని ప్రశ్నకు ఈ కథలోని సమాధానం పాఠక లోకానికే కాదు సమాజంలో ప్రతి ఒక్కరిని ఆశ్చర్యానికి గురిచేస్తుంది. గాంధారి గుడ్డిదవడానికి పతిభక్తి కారణం కాదు, ఆమెలోని చైతన్య మూర్తి కారణమైంది "నిగారించిన నా అంగాంగాల్ని అతను చూడలేకపోయిన తర్వాత అతని గుడ్డిమొహాన్ని నేనుచూడాలా శేర్ కు సవ్వా శేర్... నాధిక్కారమైన ఉండనీ... చీర చెంగు పరపరా చించి కళ్ళకి గంతలు కొట్టుకున్నాను" (అద్దంలో గాంధారి, 39)(7). గాంధారి ధైర్య వంతురాలు, పట్టుదల మనిషి. ఈ ఒక్క విషయం చాలు స్త్రీ వ్యక్తిత్వం చెప్పడానికి. ఇక్కడ ప్రతీకారమని కాదు, గుడ్డివాడిగా నువ్వు చూడనప్పుడు, కండ్లున్న నేను నిన్నుచూడను అంతే అన్నట్టుగా కళ్ళకు గంతలు కట్టింది. ఇది ఒక సాహసం, స్త్రీ శక్తికి నిదర్శనం. సమాజానికిదంతా పట్టదు ఎదుటివారేమనుకుంటున్నారు,వాళ్ళ ఆలోచనతో సంబంధం లేకుండా దానికదే ఒక నిర్ణయాన్ని తీసుకొని అందరిలో రుద్దుతుంది. గాంధారి కళ్ళకు గంతలు కట్టుకుందని రాజ గురువుకు తెలియగానే ఎందుకు చేసిందని ఆలోచనకు బదులుగా ఆమెను ఉత్తమ శీలవంతురాలని కీర్తించి ఇంకెప్పుడూ ఆమె లోకం చూడకుండా చేశాడు.

మహాభారతంలో గాంధారిని లోతుగా పరిశీలిస్తే ఆమె మానసిక వేదన తెలుస్తుంది.ఆ పరిశీలన దృష్టితోటే ఈ కథలో గాంధారిని చిత్రించాడు కవి. ద్రౌపదికి అవమానం జరిగినప్పుడు గాంధారి సభలో అందరిని తిట్టినపుడు, ఆ మాటలు ద్రౌపది తరుపున చెప్పినవి కాదు, ఆమె లోపల దాగిన కోపము మొదలైనవి "మీ వంశానికి స్త్రీలను పొట్టన పెట్టుకోవడం ఒక్కటే తెలుసు.... ఆడవాళ్ళ మనసుల్ని తెగగోసి నిర్మించే రాజభవనం పాడుబడి వెదుళ్లు మొలిచి మీరంతా అడవికి వెళ్లడం ఖాయం" (అద్దంలో గాంధారి, 42)(8). బాధనంత కోపంగా బయట పెడుతుంది. మాతృత్వాన్ని మరిచిపోయి గుడ్డిదైనా గాంధారి వల్ల కొడుకులు వ్యక్తిత్వం లేని వారయ్యారు. పాండవ, కౌరవుల మధ్య తేడాకు ఈ లోపమే కారణం. కుమారులు చనిపోయాకైన గంతలు విప్పి చూడదు, తప్పని చెప్పదు. చివరిగా దుర్యోధనుని మరణ వార్త విన్నప్పుడు, ఆమె మనసు కరిగి అతని చూడాలనుకుని, కళ్ళకు గంతలు విప్పేసరికి కొడుకు కండ్లు మూస్తాడు. ఈ చెడ్డ తల్లిని క్షమించమని మనసులోనే కోరుకుంటుంది. ఈ కథలో గాంధారి మనసు తెలుసుకుంటే, అభిప్రాయం అడిగుంటే కురువంశ చరిత్ర మరోలా ఉండేది. ఈనాటికి ఇలాంటి జీవితాలున్నాయి. మౌనంగా ఉండి మానసికంగా కుంగిపోతే జరిగేది వంశనాశనం. స్త్రీ చైతన్యవంతురాలై, కావల్సిన స్వేచ్ఛను సాధించుకొని నిస్వార్థ హృదయంతో ఆత్మగంభీరంతో ఉన్నప్పుడు ఆ వంశం, రాజ్యం బాగుంటాయి. గాంధారి కళ్ళున్న గుడ్డిదైంది, అందుకే మనసు గుడ్డిదైంది,మనోభావాలు చీకట్లో దాగాయి.

బొమ్మకు అటువైపు విశ్లేషణ :

వేంభత్తూర్ లలిత తమిళంలో రచించిన కథకు అనువాదం. ఈ కథలో చంపకం చైతన్య మూర్తి కాదు, నిద్రపోతున్న లోకానికి వెలుగునిచ్చిన కాంతి. స్త్రీల గుండె చప్పుడని చెప్పవచ్చు. ఆడదంటే మగాడి దౌర్జన్యానికి బలయ్యేది కాదు, వాడి నెదురించి బతకడంతో పాటు, చిత్రహింస పెట్టగలదని నిరూపించింది. ఎంత ప్రేమ కలిగి ఉంటుందో, అంతకు రెట్టింపు ద్వేషం కలిగి ఉండేదే స్త్రీ. వరకట్నం కోసం వేధించి, వేశ్య స్త్రీ ముందు తనను పరాభవించిన మొగుడికి సమాధానం చెప్పిన తీరు లోకానికి కనువిప్పు కలిగిస్తుంది. భర్తంటే దేవుడు, అతను బతికున్నంతకాలం మెడలో తాళిబొట్టు తీయకూడదు. హిందూ సాంప్రదాయంలో స్త్రీకి బొట్టు, గాజులు, పూలు భర్త ఆయుష్షును పెంచుతాయి. చంపకం భర్తకు బుద్ధి చెప్పడానికి వీటన్నింటినీ తీసేసింది. అది చూసి మగ ఆధిపత్యం తట్టుకోలేక పోయింది. ఆమెది తప్పని ఇలాంటి బిడ్డని ఎలా కన్నావని తండ్రిని నిలదీస్తాడు"మీ బిడ్డ వేషాన్ని వెళ్లి చూడు గుండ్రాయిలాగా నేనుండగా విధవరాలు మేకప్‌లో తెల్ల చీరలో తిరుగుతోంది" (బొమ్మకు అటువైపు, 47)(9). భర్త తనను పెట్టిన హింసకు అతని ముందే విధవగా తిరుగుతుంది. నచ్చని భర్తతో బతకడం కంటే విడిపోవడం మంచిది, కోర్టుకెళ్తే

వెంటనే విడాకులు రావు. చట్టమైనా పెద్దలైనా కలిసుండాలంటారే కాని విడిపోమ్మని చెప్పారు. ఇలాంటి మగాళ్లకు సరైన శిక్ష చంపకం వేసిందే. ఈ కాలంలోనూ భర్తలచే బాధించబడే స్త్రీలు ఉన్నారు. వీరంతా చంపకం వలె సాహసం చేయలేరు కారణం సాంప్రదాయం, కట్టుబాట్లనే గోడలు. ఈ కథలో స్త్రీ చైతన్యం పరాకాష్టకు చేరింది. చంపకం అంతటితో ఆగకుండా భర్త పని చేసే ఆఫీసులో టైపిస్ట్ ఉద్యోగంలో చేరి పక్కనే కూర్చుంది. ఈ సమాజానికి తన పని కంటే, ఇతరుల విషయంలోనే శ్రద్ధ ఎక్కువ. ఆఫీసు, వాడలో చంపకం ఆమె భర్త గురించి మాట్లాడుకోవడం మొదలుపెట్టారు. పరువు స్త్రీకే కాదు మగాడికి అవసరమే, చంపకం చేసిన పనికి అతని గౌరవం, పరువు పోవడంతో తాగి తాగి చనిపోతాడు.

మరణం పై పగ :

చంపకం భర్త బతికుండగానే కాదు చనిపోయాక పగ తీర్చుకుంటుంది. ఎలాగంటే బ్రతికున్నప్పుడు విదవగా ఉంది, చనిపోయాక ముత్తైదువుగా మారుతుంది. అతని ఆత్మ కూడా బాధపడాల్సిందే. స్త్రీకి కోపం వస్తే దానిని తగ్గించడం ఎవరివల్ల కాదని తెలుస్తుంది.

స్త్రీ చైతన్యం :

చంపకం చేసిన పనికి తండ్రి బాధపడ్డప్పుడు నేను ఇలా ఉన్నందుకే అతనిలో మార్పు వచ్చిందని గర్వంగా చెప్తుంది. అనిగిమనిగి ఉంటే ఏ వ్యక్తిలో మార్పు రాదు ఎదిరించినప్పుడే ఎదుటివాడిలో తప్పు తెలుసుకుని మార్పు రావడానికి అవకాశం ఉంటుంది. స్త్రీ క్షమించాలి కానీ చంపకం ఈ విషయంలో తగ్గదు ఎందుకంటే ఆమె మనసు బంధబారిపోయింది మగా అహంకారానికి బలైన స్త్రీగా"ప్చే లేదు నాన్న! నేను విసిగిపోయా ను . పోరా వెధవ ఇహ నుండి నేను బ్రతికేది నీ పై ప్రతీకారం తీర్చుకోవడాని కే "(బొమ్మకు అటువైపు, 52)(10). చంపకం మనసు ఎంతగా విరిగిపోయిందో తెలుస్తుంది సమాజానికి భయపడకుండా ఆమె నమ్మిన సిద్ధాంతానికి కట్టుబడి భరించలేని భర్తతో బ్రతకాల్సిన పనిలేదని కఠిన నిర్ణయం తీసుకోండి ఈ సంఘటన బాధను కలిగించడమే కాదు సమాజంలో స్త్రీ స్థితిని చైతన్యానికి కావలసిన సందేశాన్ని ఇస్తుంది.

ముగింపు :

నలిమెల భాస్కర్ ఈ కథా సంకలనంలోని మూడు కథల్లో స్త్రీ చైతన్యం కనిపిస్తుంది. అద్దంలో గాంధారి కథ ఆడవారి జీవితంపై వేరే వాళ్ళు స్వారీ చేస్తే పొందే ప్రతిఫలం ఎలా ఉంటుందో చూపిస్తే, స్త్రీ చైతన్యమైతేనే ఆమెలో కొత్త శక్తి పుట్టి, అందని తీరాలకు తీసుకెళుతుందని నల్లమబ్బు వెండి అంచు కథ చెప్పింది.సాంప్రదాయాలు, కట్టు బాట్లు దాటినంత మాత్రాన స్త్రీ చెడిపోయినట్టు కాదు, తనకు అవమానం జరిగితే భర్తైనా క్షమించదని నిరూపించిన కథ బొమ్మకు అటువైపు. అంతర్గత ప్రేరణ స్త్రీ చైతన్యానికి ప్రతీక, ఒక్కసారి చైతన్యం పొందాక మళ్లీ వెనుదిరిగి చూసుకోకుండా ముందుకు సాగిపోతుంది. ప్రతి స్త్రీ ఎలా ఉండాలో ఈ కథల ద్వారా నలమిల భాస్కర్ చూపించాడు. నేటి తరానికి ఈ కథలు మంచి సందేశాత్మకాలు.

పాద సూచికలు :

1. నల్లమబ్బు వెండి అంచు, 1,2,3,4,5. 2. అద్దంలో గాంధారి, 6,7,8 3. బొమ్మకు అటువైపు, 9,10.

ఉపయుక్త గ్రంథ సూచి :

1. అద్దంలో గాంధారి (మరో 11 అనువాద కథలు), నలిమెల భాస్కర్, నవతెలంగాణ పబ్లిషింగ్ హౌస్, హైదరాబాద్, 2016
2. మహాభారతం, మల్లోల జోస్యుల అప్పారావు, ప్రజాశక్తి డైరీ ప్రింటింగ్ ప్రెస్, విజయవాడ, 2020.
3. తెలుగు సాహిత్య చరిత్ర, డా.ద్వా.నా. శాస్త్రి, ప్రగతి పబ్లిషర్స్, శ్రీ కళాంజలి గ్రాఫిక్స్, హైదరాబాద్, 4 ముద్రణ, 2008.
4. తెలంగాణ సమగ్ర సాహిత్య చరిత్ర, ఉన్నం వెంకటేశ్వర్లు, ఉన్నం బ్రదర్స్ పబ్లికేషన్స్, కర్షక్ ఆర్ట్ ప్రింటర్స్, హైదరాబాద్, 2015
5. కథానిలయం.కాం

★

Vol. 23 | Spl. Issue 03 | March 2026 | BHAVAVEENA | ISSN No. : 2456-4702 | RNI No. APTEL/2003/12253

RNI No. APTEL/2003/12253 | Reffered Journal & Peer Reviewed Journals | ISSN No. 2456-4702

భావవీణ

కళలు, సాహిత్య, సాంస్కృతిక భాషాధ్యయన పత్రిక

BHAVA VEENA

Journal of Arts, Literary, Culture & Language Study

మహాభారతంలోని శకుంతల పాత్ర స్త్రీ చైతన్యానికి ప్రతీక - ఒక పరిశీలన

- డా॥. ఆర్. సంగీత

సహ ఆచార్యులు, ప్రభుత్వ డిగ్రీ కళాశాల (సైన్సెస్), ఆదిలాబాద్, జిల్లా : ఆదిలాబాద్, తెలంగాణ.

వ్యాస సంగ్రహం

సాహిత్యంలో ఇతిహాసాలు మన సంస్కృతి, సంప్రదాయాలు, నైతిక విలువలను ప్రతిబింబించే గొప్ప గ్రంథాలుగా నిలిచాయి. ముఖ్యంగా మహాభారతంలోని అనేక పాత్రలు సమాజానికి మార్గదర్శకంగా నిలుస్తాయి. మహాభారతంలో స్త్రీ పాత్రలు ధైర్యం, ఆత్మగౌరవం వంటి విలువలను ప్రతిబింబిస్తాయి. వాటిలో శకుంతల పాత్ర ప్రత్యేకమైన స్థానాన్ని కలిగి ఉంది. శకుంతల పాత్ర ద్వారా ప్రేమ, సత్యం, న్యాయం మరియు మాతృత్వం వంటి విలువల సమన్వయం చూడవచ్చు.

శకుంతల మహర్షి విశ్వామిత్రునికి, మేనకకు జన్మించింది. పుట్టగానే తల్లిదండ్రులు వదిలివేయడంతో కణ్వ మహర్షి ఆశ్రమంలో ఆయన కుమార్తెగా పెరుగుతుంది. వినయం, కరుణ, సహనం వంటి గుణాలను ఆశ్రమ జీవితంలో అలవర్చుకుంది. తరువాత దుష్యంత మహారాజుతో జరిగిన వివాహం ఎదురైన సంఘటనలు ఆమె వ్యక్తిత్వాన్ని, ధైర్యాన్ని మరియు ఆత్మగౌరవాన్ని మనముందు ప్రతిఫలింపచేస్తాయి.

తన కుమారుడైన భరతుని హక్కుకోసం శకుంతల రాజసభలో ధైర్యంగా మాట్లాడడం స్త్రీ చైతన్యానికి ప్రతీకగా నిలుస్తుంది. ఈ పరిశీలన ద్వారా శకుంత పాత్రలో స్త్రీ యొక్క ఆత్మగౌరవం, ధైర్యం, బాధ్యత, మాతృత్వం వంటి లక్షణాలు స్పష్టంగా కన్పిస్తాయి. అందువల్ల శకుంతల పాత్ర (మహాభారతం) సాహిత్యంలో స్త్రీ చైతన్యానికి ప్రతీకగా నిలుస్తుంది.

కీలక పదాలు (Key Words)

మహాభారతం, శకుంతల, స్త్రీ చైతన్యం, ఆత్మగౌరవం, ధైర్యం, మాతృత్వం, ధర్మం.

ఉపోద్ఘాతం

మహాభారతాన్ని రచించినది నన్నయ. 11వ శతాబ్దానికి చెందినవాడు. మహాభారతం 18 పర్వాలు గల ఇతిహాసం. పర్వము అంటే చెరుకు గణువు అని అర్థం. చెరుకు ముక్కవలనే ఇందులోని ప్రతి కథ, ప్రతి పర్వం మధురంగా ఉంటుంది. ఈ పద్దెనిమిది పర్వాలలో నన్నయ ఆదిపర్వం, సభాపర్వం, అరణ్యపర్వం (నాల్గవ ఆశ్వాసం 142వ పద్యం వరకు) రచించాడు. నేను తీసుకున్న అంశం ఆంధ్ర మహాభారతం, ఆదిపర్వం చతుర్థాశ్వాసంలో కలదు.

భారతీయ సాహిత్యంలో ఇతిహాసాలకు చాలా ప్రాముఖ్యత కలదు. ఈ ఇతిహాసాలు కేవలం కథలు మాత్రమే కాక సమాజానికి మార్గదర్శకాలు కూడా. మన సంస్కృతి, సంప్రదాయాలు, నైతికత, ధర్మం, న్యాయం, కుటుంబ విలువలు వంటి అంశాలు ఈ ఇతిహాసాల ద్వారా మనం తెలుసుకోవచ్చు. ముఖ్యంగా స్త్రీ పాత్రలు

ఈ ఇతిహాసాలలో గొప్పగా చిత్రించబడ్డాయి. ఇతిహాసాలలో స్త్రీలను కేవలం కుటుంబానికి పరిమితం చేయకుండా ఆత్మగౌరవం, ధైర్యం, నైతికత, ధర్మం వంటి విలువలను కలిగిన పాత్రలుగా తీర్చిదిద్దారు. ఈ నేపథ్యం లోనిదే శకుంతల పాత్ర కూడా. శకుంతల పాత్ర మహాభారతంలో ప్రత్యేకమైన స్థానాన్ని కలిగి ఉంది. ఆమె జీవితం ఒక సాధారణ స్త్రీ నుండి ఆత్మగౌరవం కలిగిన ధైర్యవంతురాలిగా ఎదిగిన విధానాన్ని చూపిస్తుంది.

శకుంతల కథలో ప్రేమ, ధర్మం, సత్యం, న్యాయం, మాతృత్వం వంటి విలువలు కనిపిస్తాయి. ముఖ్యంగా క్లిష్టసమయంలో ఆమె చూపించిన ధైర్యం, ముఖ్యంగా తన ఆత్మగౌరవాన్ని కాపాడుకునే క్రమంలో ఆమె చూపిన తెగువ, ధైర్యం స్త్రీ చైతన్యానికి ప్రతీకగా నిలుస్తుంది. అందువల్ల శకుంతల పాత్ర మహాభారతంలో ఆత్మగౌరవం, ధైర్యం, న్యాయం కోసం పోరాడే స్వభావాన్ని ప్రతిబింబిస్తుంది. శకుంతల పాత్ర ద్వారా స్త్రీ చైతన్యం ఎలా ప్రతిబింబించిందో పరిశీలించడం ఈ వ్యాసం యొక్క ముఖ్య ఉద్దేశ్యం.

విషయ వివరణ

శకుంతల విశ్వామిత్రునికి, మేనకలకు జన్మించిన పుత్రిక. పుట్టిన వెంటనే తల్లిదండ్రులు ఆమెను అడవిలో వదిలివేయడంతో కణ్వమహర్షి ఆ పాపను తన ఆశ్రమానికి తీసుకొని వచ్చి పెంచాడు. కణ్వమహర్షి సంరక్షణలో పెరిగిన శకుంతల వినయం, సహనం, కరుణ వంటి గుణాలను అలవర్చుకుంది. ప్రకృతి మధ్యలో పెరగడం వల్ల సాధారణ జీవితం గడిపింది.

ఒకసారి హస్తినాపురానికి రాజైన దుష్యంత మహారాజు వేటకోసం అడవికి వచ్చాడు. ఒక పుణ్యనదీ తీరంలో ఒక సుందరమైన వనాన్ని చూసాడు. ఆ వన శోభకు ముగ్ధుడై వనంలోకి ప్రవేశించాడు. కణ్వమహర్షి ఆశ్రమంలో అతని కూతురు శకుంతలను చూసి ఆకర్షితుడయ్యాడు. తన మనసులోని ప్రేమను శకుంతలకు వెల్లడించాడు. కాని శకుంతల కణ్వమహర్షి అనుమతితో వివాహం చేసుకుంటా నని చెప్పింది. శకుంతలకు ఎలాగో నచ్చచెప్పి దుష్యంతుడు ఆమెను గాంధర్వ వివాహం చేసుకున్నాడు. శకుంతల కోరగా వారిద్దరికి పుట్టిన బిడ్డను తన రాజ్యానికి యువరాజుగా పట్టాభిషేకం చేస్తానని దుష్యంతుడు శకుంతలకు మాట ఇచ్చాడు. శకుంతలను తన రాజ్యానికి తీసుకొని వెళ్లడానికి కణ్వమహర్షి వద్దకు తన మంత్రులను పంపిస్తానని చెప్పి దుష్యంతుడు వెళ్లిపోయాడు.

కొంతకాలం తర్వాత శకుంతలకు కుమారుడు జన్మించాడు. ఆశ్రమంలోని వారు అతనికి సర్వదమనుడు (భరతుడు) అని పేరు పెట్టారు. శకుంతల ఆశ్రమంలోనే తన కుమారున్ని ప్రేమతో పెంచింది. భరతుడు చిన్నప్పటి నుండే ధైర్యవంతుడిగా, శక్తివంతుడిగా ఎదిగాడు. బాలుడైన భరతుడు యువరాజుగా పట్టాభిషిక్తుడగుటకు సమయం వచ్చిందని, అదికాక వివాహమైన స్త్రీలు ఎల్లకాలం పుట్టింట్లో ఉండడం తగదని కణ్వమహర్షి తన శిష్యులను తోడిచ్చి కొడుకుతో సహా శకుంతలను దుష్యంతుని వద్దకు పంపుతాడు. శకుంతల తన కుమారునితో సహా దుష్యంతుని రాజసభలోకి అడుగు పెట్టింది. దుష్యంతుడు శకుంతలను చూసి కూడా చూడనట్లు ఉండిపోయాడు. కణ్వమహర్షి ఆశ్రమంలో దుష్యంతుడు చూపించిన ప్రేమ, అనురాగం, ఆనందం దుష్యంతునిలో కన్పించకపోయేసరికి శకుంతల తట్టుకోలేకపోయింది. మరిచిపోయినవాడికి గుర్తుచేయవచ్చు. తెలియనివాడికి తెలియచేయవచ్చు. తెలిసి కూడా తెలియనట్లు నటించేవారికి తెలపడం బ్రహ్మకు కూడా సాధ్యం కాదు. అయినా వచ్చి ఊరకనే వెళ్లరాదు. జరిగిన విషయాన్ని చెప్పి, కుమారుని చూపి అతని దృష్టికి విషయాన్ని తీసుకొని రావలెనని నిశ్చయించుకొని వేట నెపమున కణ్వాశ్రమానికి వచ్చినప్పుడు తనతో మాట్లాడిన మాటలు, ఇచ్చిన వాగ్దానాన్ని గుర్తుచేసుకోమని, పట్టాభిషేకం చేయమని చెప్పింది. దుష్యంతునికి కొలువులోకి ప్రవేశించినపుడు శకుంతల దుష్యంతుని ముఖ కవళికలను గమనించి దుష్యంతునికి తనపట్ల పూర్వపు అనురాగం లేదని గ్రహించింది. తను తెలియనట్లు నటిస్తున్నాడని అర్థం చేసుకొంది. మనుషుల ప్రవర్తనను పరిశీలించి విలువ కట్టడంలో శకుంతల సునిశిత పరిశీలనా దృష్టి ఇక్కడ వ్యక్తమైంది.

''బాలార్క తేజుడగు నీ బాలుడు నీ కొడుకు
వీనఁబౌరవకులరత్నాలంకారు
నుదారగుణాలయు యువరాజుఁజేయు మభి
షేకముతోన్''

శకుంతల తన కుమారున్ని చూపి అతను దుష్యంతుని కుమారుడని, పౌరవ వంశానికి రత్నము వంటివాడని, ఈ బాలుని యువరాజుగా పట్టాభిషిక్తుడిని చేయమని చెప్పింది. కాని దుష్యంతుడు 'ఏ నెఱుగ నిన్ను నెక్కడి దానవు మిన్నకయ యనుచితంబులు పలుకంగా నేల' నీవెవరో తెలియదు, వచ్చిన దారినే వెళ్లిపో అన్నాడు. ఈ మాటలకు శకుంతల నిశ్చేష్టిత అయ్యింది. భర్తచేత తిరస్కరింపబడిన స్త్రీ పరిస్థితి ఎలా ఉంటుందో మనం ఊహించవచ్చు. మామూలుగా స్త్రీలు ఈ మాట విన్న వెంటనే తట్టుకోలేకపోతారు. ఇక్కడ శకుంతల పరిస్థితి కూడా అలాగే ఉండింది. దుఃఖపడింది. ఆమెను ఓదార్చడానికి అక్కడ ఎవరూ లేరు. తనను తాను ఓదార్చుకోవాల్సి వచ్చింది. తన దుఃఖాన్ని తానే ఉపశమించుకొని శకుంతల దుష్యంతునితో మళ్లీ మాట్లాడడానికి సిద్ధ వడింది. తానెవరో తెలియదు అన్నప్పుడు తన కుమారునికి కూడా పితృత్వాన్ని నిరాకరించినట్లు వ్యక్త మౌతుంది. అది మరింత అవమానకరం అది ఆమె శీలమునే దెబ్బతీసే అంశం. సాధారణంగా ఆ కాలంలో స్త్రీలు పురుషుల ముందు తమ అభిప్రాయాలను చెప్పడానికి వెనుకంజ వేయడం సర్వసాధారణం. కాని శకుంతల మాత్రం తన గౌరవాన్ని కాపాడుకోవడానికి ధైర్యంగా నిలబడింది. ఆమె మాటల్లో సత్యం, ధైర్యం మరియు న్యాయం కోసం పోరాడే సంకల్పం కన్పిస్తుంది.

శకుంతల దుష్యంతుల సంబంధం వారిద్దరికి తప్ప మరెవరికి తెలియదు. దుష్యంతుని కొలువులోని వారికి అసలే తెలియదు. అది ఆసరాగా చేసుకొని ఆమె ఎవరో తెలియదని దుష్యంతుడు అనగలిగాడని శకుంతల గ్రహించింది. ఈ రకమైన దుష్యంతుడి ప్రవర్తనను నిరసిస్తూ ఆమె అన్న మాటలు పదునైనవి. 'విమల యశోనిధీ! అన్న సంబోధనలో నీవు నిర్మలమైన కీర్తికి నిధివంటివాడవు (స్వచ్ఛమైన కీర్తి కలవాడవు) ఈ రోజు నన్ను తిరస్కరిస్తున్నావు. ఇలా చేయడం నీ కీర్తికి తగదని, అది మచ్చ తెచ్చే పని అవుతుందని హెచ్చరించే అంతరార్థం దానిలో ఇమిడి ఉంది.

శకుంతలలో దుష్యంతున్ని సన్మార్గంలో మల్లించాలన్న ఆలోచన కనబడుతుంది. దుష్యంతుడిలో ధర్మచింతన కలిగించే ప్రయత్నం చేసింది. అందులో భాగంగా-

విమలయశోనిధీ! పురుషవృత్త మెఱుంగుచు నుండుఁ
జూవె వే
దములును బంచభూతములు ధర్మపు సంధ్యలు
నంతరాత్మయున్
యముడును జంద్రసూర్యులు నహంబును రాత్రియు
నన్మహాపదా
ర్థము లివియుండగా నరుడు దక్కొన నేర్చునే తన్ను
మ్రుచ్చిలన్.

అను ఈ పద్యంలో నీవంటి ధర్మాత్ములు అసత్యం పలుకుట తగదని తెలియజేసింది. మనిషి చేసే పనులకు చరాచర ప్రపంచం సాక్షిభూతంగా ఉంటుందని చెప్పింది. అలా చూస్తున్నవాటిని ప్రస్తావించింది. వేదాలు, పంచభూతాలు, ధర్మం, ఉభయసంధ్యలు, అంతరాత్మ, యముడు, సూర్యచంద్రులు, రాత్రి పగలు అనెడి మహాపదార్థాలన్నీ కూడా మనిషి ప్రవర్తనను కనిపెట్టి ఉండేవే. అది మరిచి మనిషి ప్రవర్తించడం అజ్ఞానం అని శకుంతల అభిప్రాయం. అందుచేత తనకు వివాహం నాడు ఇచ్చిన వరము దుష్యంతునికే కాక ఈ పదార్థాలన్నింటికి తెలిసిందని ఆమె నమ్మకం. అందుకే మాట నిలబెట్టుకొమ్మని ధర్మబోధ చేసింది. ఈ సందర్భంలో శకుంతల చూపిన ధైర్యం మరియు ఆత్మగౌరవం స్త్రీ చైతన్యానికి గొప్ప ఉదాహరణ. ఈ పద్యంలో శకుంతల రాజసభలో భయపడకుండా దుష్యంతున్ని ఎదిరిస్తుంది. తాను నిజమైన భార్యనని ధైర్యంగా చెపుతుంది. ఒక స్త్రీగా తన గౌరవాన్ని కాపాడుకునేందుకు ఆమె రాజును కూడా ప్రశ్నించడం ఆమె ఆత్మగౌరవాన్ని సూచిస్తుంది.

శకుంతల దుష్యంతునితో భార్య అనేది భర్తలో సగభాగమని భార్యను అవమానించడం అంటే తన ధర్మాన్ని అవమానించడం అని బోధిస్తుంది. ఇది

సమాజంలో స్త్రీ స్థానం ఎంత ముఖ్యమో తెలియచేస్తుంది. 'వెలయంగ నశ్వమేథంబులు వేయును నొక్క సత్యమును నిరుగడలందుల నిడి తూపగ సత్యము వలనన మలుసూపు గౌరవంబున పేర్మిన్' అంటూ సత్యం యొక్క ప్రాశస్త్యాన్ని స్పష్టంగా వివరించింది. తన విషయంలో దుష్యంతుడు అబద్ధం చెపుతున్నాడని గ్రహించింది. అందుకే సత్యం యొక్క ప్రాధాన్యతను వివరిస్తూ వెయ్యి అశ్వమేధ యాగాలకన్నా, పుణ్యతీర్థాలను దర్శించడంకన్నా, వేదాలను అధ్యయనం చేయడంకన్నా, సత్యమే గొప్పదని శకుంతల దుష్యంతునికి బోధ చేసింది. భర్త అబద్ధాలు చెపుతున్నాడని గ్రహించిన భార్య చేసే పనిని ఇక్కడ శకుంతల చేసింది.

భార్యాభర్తల మధ్య సంబంధాన్ని గురించి స్మృతులు, ధర్మశాస్త్రాలు ఏమి చెపుతున్నాయో సరళంగా చెప్పినపుడు శకుంతలకున్న శాస్త్ర పాండిత్య జ్ఞానము తెలుస్తుంది. కుటుంబంలో ఎలా ఉండాలో తండ్రి వద్ద నేర్చుకుంది. పెద్దల పట్ల వినయవిధేయతలతో సహనం కలిగి ఉండాలనే విషయం, మెట్టినింట్లో ఎలా ఉండాలో కూడా తండ్రివద్దే నేర్చుకుంది. ఆత్మగౌరవాన్ని నిలబెట్టుకోవడానికి అవమానం నుండి తనను తాను రక్షించుకోవడానికి శకుంతల రాజసభలో వ్యవహరించిన తీరు ఆమె వ్యక్తిత్వాన్ని దర్శింపచేస్తుంది.

తన కుమారున్ని దుష్యంతుడు తిరస్కరించినపుడు అది తన శీలానికి సంబంధించిన అంశం కాబట్టి "అంగాత్ అంగాత్ సంభవసి" అని వేదములు చెప్పుచున్నవని, పురుషుడు భార్య గర్భమున ప్రవేశించి తానే పుత్రుడై పుడుతున్నాడని, తండ్రికి పుత్రుడికి భేదము లేదనే విషయాన్ని వ్యక్తపర్చింది. అంతేకాక తన కుమారుడు తేజోవంతుడు, గుణవంతుడు, బుద్ధిమంతుడు వంశ వర్ధనుడై అశ్వమేధయాగాలు చేసి గొప్ప ప్రఖ్యాతి చెందు తాడని ఆకాశం నుండి మునులు అందరూ వినుచుండగా సరస్వతి పలికినదని, అటువంటి కుమారుని అకారణంగా తిరస్కరించడం తగదని చెప్పింది. దుష్యంతుడు కుమారుని గుర్తించకపోయినా తన కుమారుడి హక్కును కాపాడడానికి శకుంతల ధైర్యంగా నిలబడుతుంది. ఇది తల్లియొక్క బాధ్యతను తెలియజేస్తుంది.

మహాభారతంలో శకుంతల పాత్ర స్త్రీ చైతన్యానికి ప్రతీకగా నిలుస్తుంది. ఆమె పాత్ర ద్వారా స్త్రీ యొక్క ఆత్మగౌరవం, ధైర్యం, న్యాయం, సత్యం కోసం పోరాడే శక్తి వంటి అంశాలను మనం తెలుసుకోవచ్చు.

ముగింపు

- అ మహాభారతంలో శకుంతల పాత్రను గమనించినపుడు ఆమె తన గౌరవాన్ని ఎక్కడా తగ్గించుకోలేదు. అది రాజసభ ఐనా తన హక్కును అందరి ముందు ధైర్యంగా అడిగింది. ఇక్కడ శకుంతల ఆత్మగౌరవం మనకు విశదమవుతుంది.
- అ శకుంతల చిన్నప్పటి నుండి ఆశ్రమంలో పెరిగినా రాజైన దుష్యంతుని ముందు అతని సభికుల ముందు నిజాన్ని నిర్భయంగా చెప్పింది. ఇది స్త్రీలు తమ మాటను ధైర్యంగా చెప్పాలి అనే సందేశాన్నిస్తుంది.
- అ తన కుమారుడైన భరతుని హక్కుకోసం పోరాడిన విధం స్త్రీలు తమ హక్కులు మరియు కుటుంబ హక్కుల కోసం పోరాడాలని సూచిస్తుంది.
- అ శకుంతల తన కుమారున్ని ధైర్యవంతునిగా, గుణవంతునిగా తీర్చిదిద్దింది. ఇది స్త్రీ సమాజ నిర్మాణంలో ఎలాంటి ముఖ్యపాత్ర పోషిస్తుందో తెలియచేస్తుంది.

శకుంతల పాత్రలోని లక్షణాలు నేటి సమాజానికి అన్వయించుకోవచ్చు. ఈ ఆధునిక కాలంలో మహిళలు విద్య, ఉద్యోగం, రాజకీయాలు, సమాజసేవ వంటి అనేక రంగాలలో ముందుకు వస్తున్నారు. ఈ పరిస్థితుల్లో స్త్రీలు తమ హక్కులను తెలుసుకొని, సమాజంలో గౌరవంగా జీవించడానికి శకుంతల పాత్ర ప్రేరణగా నిలుస్తుంది. శకుంతల తన గౌరవాన్ని కాపాడుకోవడానికి చూపిన ధైర్యం నేటి స్త్రీలకు మార్గదర్శకంగా ఉంటుంది. సమాజంలో ఎలాంటి అన్యాయం జరిగినా దాన్ని ధైర్యంగా ఎదుర్కొని న్యాయం కోసం పోరాడాలి అనే సందేశాన్ని

శకుంతల పాత్ర వివరిస్తుంది. శకుంతల పాత్రలో కన్పించే స్త్రీ చైతన్యం, ధైర్యం, ఆత్మగౌరవం, బాధ్యత వంటి లక్షణాలు నేటి మహిళలకు ప్రేరణగా నిలుస్తాయి. అందువల్ల శకుంతల పాత్ర పురాణ కథలోని పాత్ర మాత్రమే కాకుండా ఆధునిక కాలంలో కూడా మహిళలకు మార్గదర్శకంగా నిలిచే గొప్ప పాత్రగా భావించవచ్చు.

ఉపయుక్త గ్రంథసూచి

1. సాహితీ మంజీర, తెలంగాణ రాష్ట్ర ఉన్నత విద్యామండలి, తెలుగు అకాడెమి, హిమాయత్‌నగర్, హైదరాబాద్.
2. ప్రాచీన ఆధునిక తెలుగు సాహిత్యాలు, 2018, స్కూల్ ఆఫ్ డిస్టెన్స్ లర్నింగ్ అండ్ కంటిన్యూయింగ్ ఎడ్యుకేషన్, కాకతీయ విశ్వవిద్యాలయం, వరంగల్.
3. https://archive.org.

★★★

Vol. 23 | Spl. Issue 03 | March 2026 | BHAVAVEENA | ISSN No. : 2456-4702 | RNI No. APTEL/2003/12253

RNI No. APTEL/2003/12253 | Reffered Journal & Peer Reviewed Journals | ISSN No. 2456-4702

భావవీణ

కళలు, సాహిత్య, సాంస్కృతిక భాషాధ్యయన పత్రిక

BHAVA VEENA

Journal of Arts, Literary, Culture & Language Study

ఆధునిక కథా సాహిత్యం - రావిశాస్త్రి రచనల్లో స్త్రీ పాత్రలు

- డా॥. ఆర్. కుసుమ కుమారి

తెలుగు సహాయ ఆచార్యులు (HOD), డా॥. వి.యస్.కృష్ణా ప్రభుత్వ డిగ్రీ & పి.జి.కళాశాల (స్వ), విశాఖపట్నం.

పరిచయం :

మన దోపిడీ వ్యవస్థలో స్త్రీ ఆది నుంచీ పీడితురాలిగానే ఉంది. సతీసహగమనం - కన్యాశుల్కం - వరకట్నం వంటి హింసలకు ఎప్పుడూ బలి పశువుగానే ఉంది. లైంగిక వేధింపులకూ, హింసకూ, ఎప్పుడూ బలి అయిపోతూనే ఉంది. పురుషాధిపత్యంలో అడది ఎప్పుడూ అణచివేతకు గురౌతూనే ఉంది. అయితే వరకట్నం వంటి హింసలో పురుషుని పాత్రకంటే స్త్రీ పాత్రే ఎక్కువగా ఉంది. పెట్టుబడిదారీ దోపిడీ వ్యవస్థలో స్త్రీ, పురుష సంబంధాల్లో సమానత ఉండదు. ప్రేమ అసలు ఉండనే ఉండదు. మానవీయ విలువలు ఎంత వెదికినా దొరకవు. ఆర్థిక, ఆర్థికేతర అవసరాల ఆధారంగానే సమస్త సంబంధాలు ఉంటాయి. స్త్రీల సమస్యలకు శాశ్వత పరిష్కారాలు దొరకవు. ఏవో కొన్ని సమస్యలకు తాత్కాలిక పరిష్కారాలు దొరికినట్లు కనబడుతుంది అంతే. ఇక్కడ కొన్ని కథలను పరిశీలించి చూద్దాం.

మాయ (విశాలాంధ్ర దినపత్రిక, 1961) :

సారా వ్యాపారంలో కోట్లాది కోట్లకు పడగనెత్తిన సంపన్నులు ఉన్నారు. చిదిగిపోయి శిథిలమైపోయిన ముత్తేలమ్మలు ఉన్నారు. చిదిగిపోయిన ముత్తేలమ్మ బతుకు బాధను ఈ కథానిక చిత్రించింది.

ముత్తేలమ్మ సారా వ్యాపారంలో చాలా సార్లు పట్టుబడి కోర్టుకి వెళ్ళింది. అక్కడ జరుగుతున్న మాయ అంతా ఆమెకు బాగా తెలుసు. వంద రూపాయలు, ఫీజు కింద మూర్తి అడిగినప్పుడు, ఆమె తన దీనాతిధీనమైన స్థితిని చెప్పుకుంటుంది. జీవితంలో తను కళ్ళారా చూసిందీ, కళ్ళకు కట్టినట్లు చెబుతుంది. ఇందులో ముత్తేలమ్మది ఓ సజీవ పాత్ర అనటానికి చిన్న ఉదాహరణ "ఈ నోకంలో డబ్బూ యాపారం తప్ప మరేట్నేదు డబ్బుకోసం నోకం నోకవంతా పడుచుకోంటోంది. డబ్బుకి నాను సారా అమ్ముతున్నాను. డబ్బుకి సదివిన సదువంతా నువ్వ ముతున్నావు. డబ్బుకి పోలీసోళ్ళు నాయ్యేన్నమ్ము తున్నారు. లంజెలు రోడ్లంట, రిచ్చాలంట, కార్లంట తిరిగి ఒళ్ళమ్ముకుంటున్నారు. గుళ్ళో దేవుడిదయే అమ్ము తున్నారు. నాను, మనందరం అమ్ముడుపోతున్నాం. అమ్మకం! అమ్మకం! అమ్మకం తప్ప మరేట్నేదీ లోకంలో... ఈ ఏపారంల నానేటి బావుకున్నాను? ఊరోళ్ళనీ, పోలీసోళ్ళనీ పెంచడమయింది తప్ప మరోట్నేదు. సేతల కాణిమిగల్లేదు. సారా అమ్మకానికి దిగి, తాగేవోళ్ళని సెడిపేను, నాను సెడ్డాను. అన్ని యిదాలా సెడ్డాను....".

న్యాయం-కోర్టుల్లో ప్లీడర్ల వల్ల, పోలీసుల వల్ల, కోర్టు ఉద్యోగుల వల్ల, మధ్యవర్తుల వల్ల ఏ విధంగా అమ్మి వేయబడుతుందో, అందువల్ల అందులో పేద ప్రజలు ఏవిధంగా దోచుకోబడుతున్నారో, బాధింపబడుతున్నారో,

హింసింపబడుతున్నారో, ముత్తేలమ్మ తను చూసింది. కళ్ళకు కట్టినట్లు చెప్పి, అందరికి అవగాహన కలిగించి మరి ఈ వ్యవస్థ ఎందుకు? అని రావిశాస్త్రి గారు రచనలలో ఆలోచింపజేసి చైతన్య పరుస్తారు.

మెరుపు మెరిసింది (భారతి పత్రిక, జనవరి 1951) :

దిగువ మధ్యతరగతికి చెందిన 'నీరజ' అన్న ఓ స్త్రీ జీవన చిత్రణ. ఈ కథానిక వర్షం నేపథ్యంలో వర్షంతో పాటు చిత్రించడం జరిగి, డబ్బు లేకపోవటం వల్ల ఆమె చదువు ఇంటర్మీడియట్‌తో ఆగిపోయింది. డబ్బులేక పోవటం వల్ల ఆమెకు వివాహం కాలేదు. ఆమె వయస్సు ముప్పై అయిదు సంవత్సరాలు, ఓ మోడల్ స్కూల్లో టీచరుగా పనిచేస్తుంది. కథంతా నీరజ అనే పాత్ర చుట్టూ తిరుగుతుంది. ఆమెకు పెళ్ళి కాకపోవడం వల్ల తన జీవితం ఏంకాను? అని ప్రశ్నించుకుంటుంది. వర్షంలో, చలిలో, చింకి గొడుగులో, బడి పిల్లలకు పాఠాలు చెప్పూ, చెప్పలేకపోతూ, ఆఖరికి చస్తే శవాన్ని మోసుకెళ్ళడానికి కూడా ఎవరూ ఉండరని ఆమె విషాదంలో కూరుకు పోతుంది. నలభై ఏళ్ళ వయసువాడు తీసుకెళ్ళి ఆమెను స్కూలు దగ్గర దింపినప్పుడు ఇరవై సంవత్సరాల క్రితం జరిగిన ప్రేమ విషయం గుర్తుకొస్తుంది. అతడే ఇతడేమో నని కూడా ఆశపడుతుంది. కాదని నచ్చజెప్పుకుంటుంది. ఆ దృశ్యం అంతా మనకళ్ళ ముందు బుల్లితెరలా కని పిస్తుంది. ఆమె ఒంటరితనపు జీవన విషాదంలో పాఠకుడు మమేకమైపోతాడు. రావిశాస్త్రిగారు ఏ కథ రాసినా ఒక సామాజిక సమస్య చిత్రీకరించడంలో సాహితీ విలువలను, సృజనాత్మక కళా విలువలను పాటిస్తారు.

న్యాయం (విశాలాంధ్ర, ఏప్రిల్, 1961) :

కోర్టుకి సాక్షమే కావాలి కానీ సత్యం అక్కర్లేదు. ఒకవేళ కోర్టు సత్యాన్ని తన కళ్ళతో తను చూసినా, సత్యానికి న్యాయం చేయలేదు. ఎందుకు చేయలేదంటే, అదంతే! ఎందుకంటే - పెట్టుబడీదారీ వ్యవస్థలో న్యాయవ్యవస్థలో ఆ విధంగానే పని చేయగలదు కానీ మరోలా పనిచేయ లేదు! అదే సత్యాన్ని ఈ కథ కోర్టు సాక్షిగా నిరూపించింది.

ఏ బతుకు తెరువూలేని ఓ పాతికేళ్ళ యువతి నూకరాజు ముండల కంపెనీలోకి లాగబడుతుంది. అమెరికన్ షిప్పాకటి వచ్చింది. సిబ్బంది జల్సా కోసం గుంపులు గుంపులుగా దిగిపోయారు. నూకరాజు డాలర్లు దోచుకుని ఆ యువతిని వాళ్ళకి అప్పగిస్తాడు. ఆమె చేత రకరకాల మద్యం తాగించి ఎందరో ఆమెను అనుభవించి హింసిస్తారు. ఒంటిమీద బట్టకూడా లేకుండా ఆమెను రోడ్డుమీద వదిలేస్తారు. ఆమెను పోలీసులు పట్టుకుని కేసు పెట్టి కోర్టుకు తీసుకొస్తారు. మేజిస్ట్రేటు ఆమెను ప్రశ్నిస్తాడు. ఆమె తనకు జరిగిన హింసనంతా చూపిస్తుంది. "ఒక్కరు కాదు, ఇద్దరు కాదు, ఒక్క రాత్రికి అంతమంది ఇలా కరిసేసి, రక్కేసి, రక్తం తాగేసి, ప్రాణాలు తీసేస్తే, నిన్న రాత్రి యేబాబొచ్చి అడ్డుకున్నాడు? మరింక ఈ బతుకు నన్నింక బతక నివ్వక నన్ను చంపేయండి... అంటూ విలవిల రోదిస్తూ చావుని కోరుకుంది. మేజిస్ట్రేటు చలించిపోయాడు. అయితే ఆమెను నేరస్థురాలిగా నిర్ధారించి శిక్ష వేశారు. ఇందులో రాజ్యం మొదటి నేరగాడు. వ్యాపార వర్గం రెండో నేరగాడు. దోపిడీ వర్గం మూడో నేరస్థుడు. ఇక నాల్లో వర్గం పోలీసువాళ్ళు. ఇవన్నీ దోపిడి శక్తుల నియంతృత్వ స్వభావాన్ని తెలియజేస్తాయి. ఈ కథలోని ఆడది అలా అవటానికి ప్రధాన కారణం పేదరికం, ఉపాధి రాహిత్య హింసే కారణాలుగా కనిపిస్తాయి. కాబట్టే దోపిడి శక్తులు విజృంభిస్తాయి అని ఈ కథలో రావిశాస్త్రిగారు నిరూపించారు."

జరీ అంచు తెల్ల చీర (ఆంధ్రపత్రిక వారపత్రిక, 1953):

ఆరేళ్ళ విశాలాక్షి తల్లితో కలిసి ఓ సినిమాకి వెళుతుంది. ఒకామె కట్టుకున్న వెన్నెల్లాంటి తెల్లచీర తళతళ మెరుస్తోంది. విశాలాక్షి ఆమెనూ ఆ తెల్లచీరనూ చూసి, అలాంటి చీర తనకు కొనమని తల్లిని అడుగుతుంది. ఇంట్లో ఆర్థిక ఇబ్బందుల గురించి తల్లి నచ్చచెపుతూనే ఉంటుంది. విశాలాక్షికి ఏడుపు వస్తుంది. "ఈ ఏడు నీ పెళ్ళి చెయ్యక తప్పదు కదా.... నీకు నచ్చిన చీరలు కొనకపోతే అలా అను" అని తల్లి ఓదారుస్తుంది. ఒకరోజు తండ్రి ఆమెను జరీ అంచు తెల్లచీర కొనడానికి అలా అను" అని తల్లి ఓదారుస్తుంది. ఒకరోజు తండ్రి ఆమెను జరీ అంచు తెల్లచీర కొనడానికి తనతో షాపుకి

రమ్మంటాడు. ఏ షాపులో అడిగినా, కావలసిన చీరల కనీసపు ఖరీదు ఇరవై. అతని దగ్గర ఉన్నది పన్నెండు మాత్రమే! కూతురడిగిన చీర కొనలేకపోతాడు ఆ తండ్రి. ఇరవై రెండు రూపాయలు ఖర్చు పెట్టి కూతురు కోసం ఒకే ఒక్క జరీ అంచు తెల్లచీర పది సంవత్సరాల సుధీర్ఘ కాలంలో కొనలేని దుస్థితి. మధ్యతరగతి కుటుంబ జీవనంలోని విషాదాన్నీ, ఆ విషాదంలో రాజీపడి జీవిస్తున్న నిస్సహాయ జీవన విధానాన్నీ ఈ కథానిక కళాత్మకంగా చిత్రించింది.

మగవాడు-ఆడ మనిషి (ఆంధ్రపత్రిక వారపత్రిక 1953 ఉగాది సంచిక):

స్కూల్ ఫైనల్ పాసైన మూర్తి ఉద్యోగం కోసం మద్రాసు వచ్చి మేనమామ ఇంట్లో ఉంటాడు. ఓ రోజున మైలాపూర్‌లో బస్‌స్టాండ్ దగ్గర నిలబడతాడు. ఒక విశ్వ విద్యాలయ విద్యార్థిని మూర్తిని పిలిచింది. అర్జెంటుగా పోస్ట్ చెయ్యాల్సిన ఉత్తరాన్ని మూర్తికిచ్చి పోస్ట్‌బాక్స్‌లో పడేయమని గౌరవంగా అడుగుతుంది. ఆమె చెప్పిన పని చేస్తాడు. తరువాత ఆమె పేరు మోహిని అని తెలుసు కుంటాడు. అనూహ్యంగా ఆమె పట్ల ఇష్టం, పట్టరాని సంతోషం మూర్తి మనోస్థితిని ఉల్లాసపరిచాయి. ఆమె పరిచయంతో మూర్తి ఒకప్పుడు తన మేనమామ కూతురు వరహాలుని పిలవడానికి భయపడినవాడు, ఆమెను దగ్గరగా తీసుకోవడం, బస్సు ఎక్కేటప్పుడు పదిమందిని సునాసాయంగా తోయడం, వచ్చి రానీ ఇంగ్లీషులో మాట్లాడి ఉద్యోగం తెచ్చుకోవడం, అల్లరి మూకల ఆట కట్టించడం వంటి వన్నీ మోహిని ఇచ్చిన ప్రోత్సాహం వల్లె అని తెలుసుకుంటాడు. పురుషునిలో బద్ధకంగా పడి ఉన్న శక్తులు ఉత్తేజమై పుంజుకుని మానసిక చైతన్యాన్ని కలిగించి, నిర్మాణశీల దృక్పథంలో అతణ్ణి నడుపుతాయి. సంక్లిష్టమైన మానసిక సమస్యను మిక్కిలి సరళంగా కళాత్మకంగా, కథాత్మకంగా పరిష్కార రూపంలో చిత్రించడం జరిగింది. రావిశాస్త్రిగారు ఏ కథ రాసినా సమస్యలపై విజృంభన, సమస్యలకు పరిష్కారాలు చూపించడంలో అంతే కాకుండా కొంత పాఠకుల ఆలోచనలకు ఒదిలిపెడుతూ ఆయన రచనా విధానం సాగుతుంది.

సారాంశం :

పెట్టుబడిదారీ ప్రజాస్వామ్యంలో పీడిత వర్గ స్త్రీలు దిగువ మధ్యతరగతి స్త్రీలు ఏ విధంగా పీడనకు, హింసకు బలైపోతున్నారో ఆ ప్రపంచాన్నంత అక్షరీకరించి మన కళ్ళ ముందు నిలబెడతారు ఆధునిక రచయితలు. ఏ సమస్య మీద రాసినా దాన్ని లోతుగా అధ్యయనం చేసి విశ్లేషణాత్మకంగా కళాత్మకంగా చిత్రీకరిస్తారు. పెట్టుబడిదారీ ప్రజాస్వామ్య వ్యవస్థలో స్త్రీ చిన్నచూపే చూపబడుతుంది. పురుషుడు గృహ యజమానిగా పెట్టుబడిదారుని స్థాయిలో ఉంటాడు. స్త్రీ పెట్టుబడిదారుని కింద పనిచేసే శ్రామికురాలిగా జీవిస్తుంది. సమానత్వం అనేది నిజరూపంలో ఉండదు. కొన్ని కథల్లో మధ్య తరగతి స్త్రీలు పేదరికంలో చదువులు సాగక, ఉద్యోగాలు దొరక్క, పెళ్ళిళ్ళుకాక ఏ విధంగా జీవితాన్ని నిరాశతో గడుపుతున్నారో విశ్లేషించడం జరిగింది. వ్యభిచార వ్యాపారంలో స్త్రీ జీవితాన్ని లాగిన అసలు నేరగాళ్ళు ఎవరో, మర్యాదస్తులుగా సమాజంలో తిరుగుతూనే ఉంటారు. అన్నీ వైపుల నుంచీ, అన్ని విధాలుగా దోచుకోబడిన, మోసపోయి జీవితాన్ని పోగొట్టుకున్న స్త్రీలు ఈనాటి సమాజంలో కోకొల్లలు.

పెట్టుబడిదారీ దోపిడీ వ్యవస్థకు ప్రత్యామ్నాయంగా సమ సమాజ వ్యవస్థ వచ్చినప్పుడే, చాలా వరకు శాశ్వత పరిష్కారాలు దొరుకుతాయని శాస్త్రీయంగా, చారిత్రంగా నిర్ధారించి చెప్పుకోగలం.

★★★

Vol. 23 | Spl. Issue 03 | March 2026 | BHAVAVEENA | ISSN No. : 2456-4702 | RNI No. APTEL/2003/12253

RNI No. APTEL/2003/12253 | Reffered Journal & Peer Reviewed Journals | ISSN No. 2456-4702

భావవీణ

కళలు, సాహిత్య, సాంస్కృతిక భాషాధ్యయన పత్రిక

BHAVA VEENA

Journal of Arts, Literary, Culture & Language Study

ప్రసిద్ధ ప్రబంధాలలో స్త్రీ చైతన్యం-జాతి, వార్తా చమత్కారాలు

- వేపాడ మమత
పరిశోధక విద్యార్థి, తెలుగుశాఖ,
ఆంధ్ర విశ్వకళాపరిషత్,
విశాఖపట్నం.

- ఆచార్య జర్రి అప్పారావు
పర్యవేక్షకులు, తెలుగుశాఖ,
ఆంధ్ర విశ్వకళాపరిషత్,
విశాఖపట్నం.

వ్యాస సంగ్రహం :

ప్రాచీన భారతీయ సమాజంలో స్త్రీకి ఉన్న ప్రాధాన్యం చాలా గొప్పది. సృష్టి ఆదిలోనే పరమాత్మ తన ఆనందానికి తనను తాను భార్యగా, భర్తగా అవతరింప చేసుకున్నాడని ఉపనిషత్తు చెబుతోంది. ఇద్దరిలో హెచ్చుతగ్గులు లేవు. 'స్త్యాయతి సంఘాతో భవత్యస్యాం గర్భఇతి స్త్రీ'. ఎవరిలో నైతే శుక్ల శోణితాలు కలిసి, ఒక రూపం దాల్చి, పిండంగా (గర్భంగా) మారుతాయో ఆ రూపమే స్త్రీ. శక్తి స్వరూపిణి లేనిదే శివుడు కూడా కదలలేడని శంకరాచార్యులు పేర్కొన్నారు. గృహస్థ జీవనమే గొప్పదని వేదాలు చెప్పాయి. నారీ రహితుడైన పురుషుడు పరిమళం లేని పుష్పం వంటి వాడని మన ప్రాచీలు భావించాడు. గృహస్తాశ్రమం స్వీకరించని పురుషుడు మోక్షానికి అర్హుడు కాడని చెప్పాయి. వేద సాహిత్యంలో ఋషులతోపాటు స్త్రీలు కూడా ఉన్నారు. ఋగ్వేదంలోని దశమ మండలంలో అనేక సూక్తాలు వీరి చేత రచించబడ్డాయి. అపాలా, ఘోషా, కాక్షీవతి, గౌరవీతి, సావిత్రీ, శ్రద్ధ, పౌలోమీ, సార్పరాజ్ఞీ, లోపాముద్ర వంటి వారు భారతీయ ప్రాచీన సాహిత్యంలోని ఒక భాగమయ్యారు. తొలి జ్ఞానాన్ని నిక్షిప్తం చేయడంలో వారి పాత్ర కూడా ఉందనటంలో ఎటువంటి అతిశయోక్తి లేదు. దీనిని బట్టి అనాటి కాలంలో స్త్రీకి ఎటువంటి స్థానం ఉందో అర్థమవుతుంది. అయితే అంత మహోన్నతమైన స్థితిలో నుంచి తర్వాత కాలంలో స్త్రీ పరిస్థితి పూర్తిగా మారిపోయింది. స్త్రీ కేవలం ఒక భోగ వస్తువుగా మారిపోయింది. ప్రాచీన కావ్యాలలో స్త్రీ అంగాంగ వర్ణనా వస్తువైపోయింది. ప్రబంధ సాహిత్యం అంటేనే అష్టాదశ వర్ణనలు కలిగిన కావ్యం. మరి అటువంటి కావ్యాలలో స్త్రీ గురించిన చైతన్యవంతమైన అంశాలను పట్టుకుంటూనే, ప్రసిద్ధ ప్రబంధాలలో జాతి, వార్తా చమత్కారాలను విశ్లేషించే ప్రయత్నమే ప్రస్తుత నా ఈ వ్యాస ముఖ్య ఉద్దేశం.

కీలక పదాలు :

జాతి, వార్తా, చమత్కారాలు, ప్రబంధం, అతిశయోక్తి, ఇతిహాసం, పురాణం, కాక్షీవతి, గౌరవీతి, సావిత్రీ, శ్రద్ధ, పౌలోమీ, సార్పరాజ్ఞీ, మొ...

ఉపోద్ఘాతం :

ఆదికవి నన్నయ ఆంధ్ర మహాభారతం ఇతిహాసానికి చెందినది. ఈ కావ్యంలో ద్రౌపతి పాత్రలో చైతన్యమైన అంశాలు ఉంటాయి. పాల్కురికి సోమన దేశీ కవిత్వం, శతకం వైపు మొగ్గు చూపినప్పటికీ ఇతడు రాసిన బసవ పురాణము, పండితారాధ్య చరిత్రలో సమకాలీన

అంశాలను, ప్రజల జీవనాన్ని చూపించే ప్రయత్నం చేశాడు. పాల్కురికి సోమన రచనల్లో విభిన్నమైన, శక్తివంతమైన స్త్రీ పాత్రలు అనేకం. తిక్కన సోమయాజి ఆంధ్ర మహాభారతం, నిర్వచన రామాయణాలు ఇతిహాస, పురాణాలకు సంబంధించినవి. ఎర్రన కూడా వీరి బాటలోనే నడిచాడు. శ్రీనాథ యుగ కాలానికి ప్రక్రియ వైవిధ్యంలో చాలా మార్పులు చోటు చేసుకున్నాయి. ఈ యుగంలోనే సమకాలీన సామాజిక, సాంఘిక పరిస్థితులపై కావ్యాలు రాయడం మొదలుపెట్టారు. అందుకే శ్రీనాథ యుగ కాలాన్ని చాలా ప్రత్యేకమైన సంధి కాలంగా చరిత్రకారులు కొనియాడుతారు. ఈ పరంపర రాయల యుగానికి కూడా దారితీసింది. ఈ మార్పే అత్యద్భుతమైన ప్రబంధ కావ్య రూపాన్ని దాల్చింది.

విషయం :

ప్రబంధ - శబ్ద ఉనికి :

సంస్కృత వాఙ్మయం - ప్రబంధశబ్దం గురించి పరిశీలించినట్లయితే క్రీ.పూ. ఏడవ శతాబ్దానికి చెందినదిగా భావిస్తున్న పాణిని అష్టాధ్యాయిలో ప్రబంధ శబ్దం ప్రప్రథమంగా కనిపిస్తోంది.

''నానద్యతనవత్ క్రియా ప్రబంధసామీప్యయోః'' (అ.ధ్యా, అ- 3, పాద - 3, సూ-1651).

భామహుని కావ్యాలంకారమే శ్రవ్యకావ్యాలకు సంబంధించిన మొదటి లక్షణగ్రంథం. ఇందులో పద్య కావ్యాన్ని మొట్టమొదట ప్రబంధ శబ్దంచేత పేర్కొన్నాడు.

''భావికత్వమితిప్రాహుః ప్రబంధ విషయం గుణమ్ ప్రత్యక్షా ఇవ దృశ్యంతే యత్రార్థా భూత భావినః''(కావ్యా.లం -3, శ్లో-53).

ప్రబంధ నిర్వచనం :

''పురాణముల నుండి కథను గైకొని స్వకపోల కల్పనలను విశేషముగా జేర్చి పెంచి చెప్పిన కేవలాంధ్రీకరణలు కాని రచనలు ప్రబంధములు'' (కం.వీ. పం.తు - కవు.చ, భాగము 2, పుట.43,44))

కావ్యం :

''తిదదోషా శబ్దారౌ సగుణావసంకృతీ పునః క్వాపి.'' (కా.ప్ర. ప. ఉ.పుట. 27).

అంశం వివరణ

కావ్యంలో వ్యాకరణ లేదా భావ దోషాలు ఉండకూడదు. ప్రసాదం, మాధుర్యం వంటి గుణాలు ఉండాలి. అందమైన శబ్దము (పదం), రమణీయమైన అర్థము రెండూ సమానమే. పాఠకుడికి చమత్కారాన్ని లేదా ఆనందాన్ని అందించడం ప్రధాన ప్రయోజనం. అటువంటిదే కావ్యం అనిపించుకుంటుందని మమ్మట్టిని ఉద్దేశ్యం. కావ్యానికి ఆనందం ప్రధాన ప్రయోజనం. కావ్యంలో ఆనందంతో పాటు ఉపదేశం కూడా ఉంటే మంచిది. అందుచేతనే ఆంధ్ర చింతామణి కర్త 'విశ్వశ్రేయ: కావ్యం' అన్నాడు.

జాతి, వార్తా చమత్కారాలు - విశ్లేషణ :

పరస్పర సంబంధం కలిగిన ఈ జాతి, వార్తా చమత్కారాలను ముఖ్య కవితా లక్షణాలుగా శ్రీనాథ యుగానంతర కవులు గుర్తించారు. తమ కవిత్వ లక్షణాలను వివరిస్తూ 'జాతి, వార్తా చమత్కారాల పదాలను వాడిన మొదటికవి చేయకూర వేంకటకవి.

"తారస పుష్టి మై ప్రతి పదంబున జాతియు వార్తయున్ జమ
త్కారము నర్థగౌరవము గల్గుననేక కృతుల్ ప్రసన్న గం
భీర గతిన్ రచించి మహీ మించినచో నిక శక్తు లెవ్వర
య్యా ! రఘు నాథ భూప రసికాగ్రణికిన్ జీవిసోక చెప్పఁగ్రాన్"

(విజయ విలాసము I-31).

శ్రీకృష్ణ దేవరాయలు ఆముక్తమాల్యదలో తన ఇతర రచనలను వివరిస్తూ ''పలికితుత్ప్రేక్షే పదుల జాతి పెంపెక్క రసికులౌనన మదాలస చరిత్ర ...'' (ఆ.మా. 1-13).

జాతి :

''స్వాభావికమై కృత్రియంకాని వర్ణనలు జాతి'' అని డాక్టర్ వీ. కులశేఖర రావు గారు చేయకూర కవితా వైభవంలో వివరించారు. (కు.శే. 1975 : అఱ).జాతి వార్తా చమత్కారాల గురించి మరింత లోతుగా పరిశీలన జరిపిన విమర్శకులు ఆచార్య జి.వి. సుబ్ర హ్మణ్యం. "సమాజంలో

కవి చూసిన వాస్తవాన్ని వాస్తవంగా వాఙ్మయంలో రికార్డు చేయటం. ఇది 15వ శతాబ్ది సాహిత్య చైతన్యంలోని శక్తివంతమైన ధోరణి. దీనిని తరువాత కాలంలో 'జాతి' అని పిలిచినట్లు తెలుస్తుంది. (సుబ్రహ్మణ్యం 1991:157) అంటూ దీనికి ఉదాహరణగా "చిన్నచిన్న రాళ్ళు చిల్లర దేవుళ్ళు..." అన్న శ్రీనాథుని చాటువును చూపించారు. జాతిని విపులంగా వివరిస్తూ.... అంటే " వర్ణించబడే వస్తువు యొక్క జాతిలక్షణం లేదా స్వరూప స్వభావాలు తేట పడేటట్లు సహజ సుందరంగా సాహిత్యస్ఫూర్తి కలిగేటట్లు చెప్పటం జాతి. వర్ణ్య వస్తువు సమకాలీన సమాజంలోని జీవిత వాస్తవం అయి ఉండాలి. అప్పుడే సామాజిక సాహిత్య స్పృహగా లెక్కించబడుతుంది" (సుబ్రహ్మణ్యం 1991 :157).

జాతి వివరణ :

"ఒల్లఁ బొమ్మన్నఁ బోదె! తా నుల్లసముల
నేఁప నది రక్కసియ యౌట నెగ్గె? వలచి
స్త్రీలు దలవంపఁ దాన వ చ్చె నది చాల
కాఁడుదాని బజీతు సే యంగ నగునే"

(ఆ.మా. పం.ఆ, పద్యం-51, - పుట. ఎమెస్కో. ప్ర.172)

గోదాదేవి యౌవనవతియై శ్రీరంగనాథుని వలచి, వరునిగా పొందగోరి వ్యాజస్తుతితో ఆయన గొప్పదనాన్ని వర్ణించినట్లు రాయలు చెప్తాడు. ఆ సందర్భంలో గోదాదేవి విష్ణుని దశావతారాలకు సంబంధించిన ఎన్నో పురాణ గాథలు ప్రస్తావిస్తుంది. ఆ సమయంలో గోదాదేవి రామావతారంలో రాముడు శూర్పణఖ తనను వలచి వచ్చినప్పుడు ఆమెను తిరస్కరించి తప్పు చేశాడని నిందిస్తుంది. ఆ వర్ణనమంతా చాలా చక్కగా సాగుతుంది. 'వనిత తనంత తాను వలచి వచ్చిన చుల్కన అవుతుంద'ని నేటి కాలంలో తరచు వినబడే సామెతలాంటి మాటను రాయలు ఈ సందర్భంలో మనకు గుర్తు చేశాడు. దీన్నిబట్టి గోదాదేవి బాల్యంలోనే తండ్రి ఇంట ఆయా పురాణ జ్ఞానుల నుండి ఎన్నో విశేషాలు తెలుసుకుని విద్యావంతురాలు అయ్యిందని తెలుస్తోంది. రాయలకాలంలో స్త్రీలు కూడా బ్రహ్మచర్యాశ్రమదశలో విద్యాభ్యాసం, శాస్త్రపరిశ్రమా చేసేవారనడానికి ఇది నిదర్శనం. పేరులేని పేరంటాలైన నిగమశర్మ అక్క కూడా పుట్టింట బాల్యదశలోనే ఎన్నో విద్యలు నేర్చిన సంగతి తేటతెల్లమౌతుంది. స్త్రీలకు కూడా వివాహానికి బ్రహ్మచర్యం లాంటిదశ విద్యాభ్యాసానికి తోడ్పడేదని ఊహించవచ్చు.

ఉ: "ఇష్టములైన వంటకములిట్లు భుజించి యతండు వార్చి సం
తుష్ట మనస్కఁడై తనదుతొయ్యలి విద్యము చుట్టి, యీ మహా
శిష్కఁడపోలెఁ దిన్నెపయిఁ జిర్న గవొవ్వఁగఁ గూరుచున్న చోఁ
బుష్టి నమస్తమున్ గడవి వుచ్చి తదగ్రజ పూర్ణచిత్తయై" (పాండురంగమాహాత్మ్యము 3-28)

పుట్టింటికి వచ్చిన నిగమశర్మ అక్కకు తమ కొడుకు నడవడికి విచారిస్తున్న తల్లిదండ్రులను తన చురుకైన మాటల చమత్కారంతో కొంచెం కొంచెంగా వారి విచారాన్ని తొలగించింది. అత్తమామలు మనస్సులకు నచ్చేటట్లు భక్తిశ్రద్ధలు ప్రకటిస్తున్న తమ్ముని భార్యను చూసింది. ఆమె చక్కదనము అడవి కాచిన వెన్నెలలాగా, గోడు మొక్కకు చేసిన దోహదం లాగా వ్యర్థం అయినందుకు కలత చెందింది. ఇంతలో ఎక్కడి నుండో హఠాత్తుగా ఊడిపడ్డ నిగమశర్మను కౌగలించుకోవడానికి సిద్ధపడింది. కానీ స్త్రీల నఖక్షతాలతో కఠినంగా ఉన్న అతని శరీరాన్ని చూసి వెనుకడుగేసింది. ఆమె తన మనస్సును సద్ది పుచ్చుకొంది. పోకిరివాడైన తమ్ముడిని నేర్చెన మాటలతో సీమంతపు పెండ్లికొడుకువు కమ్మని ఆశీర్వదించింది.

ఆమె తన తమ్ముని అయిష్టతను గ్రహించి మృదుత్వం ఉట్టిపడే తీయని మాటలతో 'మీబావతోపాటు భోజనం చేద్దువుగానీ క్షణంలో శాకపాకాలు తయారుచేస్తాను. ఎక్కడకు వెడతావు? అని అడుగుతుంది. తర్వాత తప్పించుకుపోకుండా కుదురుగా కూర్చోవాలని తమ్ముడి జుట్టులో పేలను తీసే నెపంతో అతన్ని ఆపుతుంది. "సాలగ్రామముల గని యందు గులకరాళ్ళు పుడతాయా" అని హితబోధ చేస్తుంది. అగ్నిసాక్షిగా పెళ్ళాడిన భార్యకు అన్యాయం చేయొద్దు అంటుంది. ఎంతో గొప్ప మానసిక

శాస్త్రవేత్తల వ్యవహరించిన ఈమె ముగ్గురు పోవడంతో లబోదిబోమని ఏడ్చింది. స్త్రీలకు పూర్వకాలంలో మంగళ సూత్రం ఎంత ప్రాముఖ్యం వహిస్తుందో ముక్కెర కూడా అంతే! అపూర్వంగా తీర్చిదిద్దిన ఈ పాత్రకు ఆ ఏడుపు దిష్టి చుక్కలా ఉందని 'పరిహాసం పవిత్ర వస్తువును కూడా గమనింపదేమో' అని రాళ్లపల్లి వారు వ్యాఖ్యానించారు. అయితే ఈ పాత్ర ఎంతో ఔనత్యంతో మానసిక శాస్త్ర పాండిత్యంతో తీర్చిదిద్దబడినా ఆమె ఏడుపులో మానవ సహజ స్వభావ చిత్రణమే గమనించదగ్గ అంశంగా కనిపిస్తుంది. ఈ విధంగా కవి తన ప్రజ్ఞావైభవంతో, సాహిత్యంలో మరపురాని అమృతమూర్తిగా నిగమశర్మఅక్క పాత్రను రూపుదిద్దాడు. ఈమె మూర్తీభవించిన ఒక ఆదర్శ గృహిణి. సదాచార సంపన్న. ధర్మానుగుణమైన కర్మనిష్ఠ కలది. కుటుంబ పరిస్థితులను బట్టి సామాన్య కుటుంబాలలో స్థితిగతులను ఈ పాత్ర ద్వారా కవితామయం చేస్తూ చక్కగా వర్ణించాడు. సమాజ సమస్యలను బలంగా అభివ్యక్తీకరించాడు. సామాజిక పరివర్తన కోసం సమాజాన్ని చైతన్యవంతులను చేసే అనేక సమస్యలను ఈ పాత్ర ద్వారా వెల్లడి చేసాడు.

వార్త :

తెలుగు గ్రంథాలలో సూర్యరాయాంధ్ర నిఘంటువులో కనిపిస్తున్న అర్థాలు : 1. ప్రసిద్ధి, వార్త కెక్కు = పేరుపడు, నపుంసక లింగంలో 'వార్తము' అనే ఈ పదాలను ఇచ్చింది. వార్త శబ్దానికి వృత్తి పరంగా నన్నయ ప్రయోగం కూడా గమనించవచ్చు.

"వార్తయందు జగము వర్తిల్లు చున్నది
యదియ లేని నాడు యఖిల జనులు
వంధకార మగ్నులగుదురు
వార్త నిర్వహింప వలయు పతికి"

(ఆ.మ.-సభా.ప. ప్ర.ఇ. 51)

ఇది ధర్మరాజుకు నారదుడు రాజనీతిని ఉపదేశించిన సందర్భంలోనిది. కనుక ఇక్కడ వార్త అంటే అర్థశాస్త్ర, మనుధర్మ శాస్త్రాలలోని అర్థాన్నే చెప్పుకోవాలి. 'వాణిజ్యం' అనే అర్థంలో వాడారు. "సామాజిక సాహిత్య స్పృహతో రచించే కవిత్వంలో ఉండవలసిన మరొక లక్షణం 'వార్త'. 'వార్త' అంటే సమకాలీన సమాజంలోని జనజీవన విధానానికి సంబంధించిన వివరణ" (జి.వి.యస్. సాహి. చ.చ. పుట. 157) 'కప్పుర భోగిమంటకము కమ్మని గోధుమ పిండివంటయున్" అనే పద్యాన్ని ఉదాహరణగా ఇచ్చారు.

వార్తా వివరణ :

భారతీయ తత్వాన్ని అనుసరించి ఆత్మ, పరమాత్మల కలయిక, ప్రకృతి పురుషుల సమ్మేళనం వంటి అంశాలకు తార్కాణంగా గోదాదేవి పాత్ర చిత్రీకరించ మానవజన్మకు పరమార్థమని పరిపూర్ణంగా విశ్వసించింది. విష్ణుభక్తి ప్రతిపాదితమైన బడింది. ఈమె కవయిత్రి, సంగీతజ్ఞురాలు, భగవంతునిపై పాటలల్లి పాడటమే భాగవతంలో పోతన తెల్పిన నవవిధ భక్తిమార్గాలలో ఈమె 'సంకీర్తనం' అనే మార్గాన్ని ఎంచుకుంది.

"తమ హృద్భాషల నఖ్యమున్, శ్రవణమున్, దాసత్వమున్, వందనా
ర్చనముల్, సేవయు, నాత్మలో నెఱుకయున్, సంకీర్తనల్, చింతనం
బను నీ తొమ్మిది భక్తి మార్గముల సర్వాత్మున్ హరిన్ నమ్మి స
జ్జనుఁడై యుండుట భద్రమంచుఁ దలఁతున్ సత్యంబు దైత్యోత్తమా" (ఆ. మా. పం. ఆ.)

ఈమె రచించిన తిరుప్పావై లోకప్రసిద్ధమైంది. ఈమె పెరిగిన వాతావరణం ఈమెను గొప్ప సంస్కారవంతురాలిగా తీర్చిదిద్దింది. ఆ భగవంతుని భర్తగా పొందడానికి ఈమె ధనుర్మాస వ్రతాన్ని ఆచరించింది. దినానికి ఒక్క గాథను ద్రావిడ భాషలో రచించింది. ఆ గాథల సంపుటమే 'తిరుప్పావై' ఈమె భక్తితత్పరతకు ఆ భగవంతుడు కూడా సంతోషిస్తాడు. ఆముక్తమాల్యద అనే కావ్యనామం ద్వారా వినూతనత్వాన్ని కృష్ణదేవరాయలు ప్రదర్శించాడు.. కావ్యానికి స్త్రీ పేరు పెట్టడం రాయలవారే చేసారు. ఆయన సమకాలంలోనూ, ముందు వెనుకల్లోనూ కావ్యనామం స్త్రీవాచకంగా తక్కువగానే కనిపిస్తుంది. సంప్రదాయం లక్ష్మిని పురుషవాచకంగా చెబుతుంది, అది కావ్య నామంలో కూడా కనిపిస్తుంది. రాయలు తన

కావ్యాన్ని సంప్రదాయ అభినివేశంతో రచించాలను కున్నాడు. కావ్యానికి స్త్రీపరమైన పేరు పెట్టి, గోదాదేవి అలౌకిక భక్తిని లౌకికంగా చెప్పటమ్లు పాత్ర చిత్రణ చేయటంలో రాయలు స్త్రీ పాత్రచిత్రణకు ఇచ్చే విలువ ఎంత గొప్పదో తెలుస్తోంది.

ఉ. "అక్కట! నా యెడన్ మిగుల సక్కఱగల్గి చరించు నెచ్చెలుల్
చిక్కి మునీంద్ర శాపహతిఁ జెందిన దురదమ రోగబాధలం
బొక్కుచు నున్న వారు వన భూములఁ, దద్దశ మాన్పవేని నా
కెక్కడి సౌఖ్యమన్నఁ దరళేక్షణఁ జూచి స్వరోచి యిట్లునున్"

(మనుచరిత్ర వావిళ్ళ వారి ప్రచురణలు, షష్టాస్వాసం, ప. 10 పు. 593)

తన స్నేహితులు రోగపీడితులై అడవులలో తిరుగుతూ ఉన్న విషయాని తెలిపి, ఆ బాధల నుండి వారిని కాపాడకపోతే తనకు మనశ్శాంతి ఉండదనీ స్నేహితులపై తనకు గల ప్రేమాభిమానాన్ని తెలిపి వారికి విముక్తిని ప్రసాదించమనీ భర్త స్వరోచిని, మనోరమ అర్థించింది.

తన స్నేహితురాళ్ళు క్షయరోగంతో బాధపడుతుంటే నిర్మలమైన ఆమె మనను కంపించిపోయింది. ఈ పద్యంలో మనోరమ పొందుతున్న హృదయ వేదన, దాని వల్లఏర్పడ్డ భయాందోళనలు ఆమెను తీవ్ర మానసిక సంక్షోభానికి గురిచేసాయి. మనోరమ సఖీ స్నేహం, స్వార్థ త్యాగం అనే ఉదాత్తగుణాలు ఈమెలో కనిపిస్తాయి. అసూయా ద్వేషాలు ఎరుగని సుగుణవతి, ఉత్తమ శీలం కలిగిన స్త్రీ. శత్రునాశన కారియైన అస్త్ర హృదయ విద్యను ఈమె తండ్రి నుండి పొంది స్వరోచికి అందిస్తుంది. ఈమె ధీర హృదయ. స్త్రీ సహజ స్వభావమైన ఈర్ష్యాసూయలను దరికి రానీయక, తదాత్తంగా ప్రవర్తిస్తుంది. భారతీయ తత్వంలోని త్రిగుణాలలో ఈమె సత్వగుణాలు కలిగినది. క్షమ, దయ, ఔదార్యం వీటి లక్షణాలు. అటువంటి మనస్తత్వం ఉన్నందు వల్లనే స్నేహితురాలైన మరో స్త్రీని తన వైవాహిక జీవితంలోకి తన పతికి మరో నతిగా, తనకు సవతిగా ఆహ్వానించగలిగింది. విభావసికి మృగ పక్షి భాష తెలుసు. కళావతికి పార్వతి దేవి పద్మిని విద్యను ప్రసాదిస్తుంది. ఆ విద్యతోబాటు నన్ను స్వీకరించు అని కోరిందామె. భగవద్గీతలో చెప్పినట్లుగా

"త్రిభిర్గుణ మయైర్భావైః ఏభిః సర్వమిదం జగత్ ।
మోహితమ్ నాభిజానాతి మాయేభ్యః పరమ వ్యవయమ్"

(భగవద్గీత, గీతాప్రెస్, గోరఖ్పూర్, అధ్యాయం-7, శ్లోకం-13)

ఈ ప్రపంచంలో సమస్త మానవాళి ఈ త్రిగుణాలను కలిగి ఉంటుంది. వీటిలో ఏదో ఒక గుణం అత్యధిక పాళ్ళు వారి ప్రవర్తనా శైలిలో వ్యక్తమౌతుంది. అప్పుడు వారిని ఆ గుణానికి చెందినవారుగా పరిగణిస్తాం.

చమత్కారం :

చాలా విధాలుగా అలంకారికుల చర్చకు కారణ భూతమైన చమత్కారం తరువాత విశ్వేశ్వరకవి చంద్రుని చేత కావ్యప్రస్థానంగా గుర్తించబడింది.

"వాగార్థౌ సచమత్కారౌ కావ్య విధో విధుః"

(చమత్కార చ్చక 1-11)

"చమత్కారస్తు విదుషా మానన్ద పరివాహకృత్
రసం రీతిం గుణం వృత్తిం పాకం శయాన్ని మల జ్ఞృతిమ్"। (చమత్కార చత్రిక 1-6).

శబ్దార్థాలను ఆశ్రయించి ఉండే చమత్కారానికి గుణ, రీతి, రస, వృత్తి, పాక, శయ్య, అలంకారాలు కారణం అవుతాయని, అవి ఏడు రకాల అని విశ్వేశ్వరుడు వివరించాడు.

చమత్కార వివరణ :

"వెలది నీ యీదంద వెలయెంత? నా దండకును
వెలబెట్ట యెవ్వని తరంబు?
కలువ తావులు గాన మలికదంబకవేణి?
కనవులు వాడకయ కలుగునె?
కడివోదు నాకిమ్ము పడతి ఈగేదంగి
నన గడివోమి ముందరికి జూడు.
జాతు లే వంబుజేక్షణ ? పద్మినులు నైత మును
నున్న యెడ జాతు లునికి యరుదె?

తే : యనుచుం దొలి నుడి నభిలాష లెనయ మూగి
పలుకుతోడనె నర్మగర్భంబు గాగ
నుత్తరము పషల్లవశ్రేణి కొనగు చలరు
లమ్ముదురు పుష్పలావిక లప్పురమున"
(వేదం. ఆ.మా. పు.ట.104)

ఆముక్తమాల్యదలో పుష్పలావికలు మాట్లాడే భాషను బట్టి, (ఆంధ్రజ్యోతి నవంబరు 1998) వ్యాసాన్నిబట్టి రాయలవారు జెప్పిన ఈ పద్యం వల్ల పూలమ్మే యువతుల్లో కనీసం కొందరిలోనైనా కన్నడాంధ్రాలతో పాటు సంస్కృతంలో (తొలినుడి) గూడ కొంతమేరకు పరిచయము ఉండేదని తెలుస్తోంది.

విటులు పూలమ్మే పిల్లను నీ 'దండ' వెల ఎంతని అడుగుతాడు. ఇక్కడ 'దండ'అంటే రెండు అర్థాలు. ఒకటి పూలదండ మరొకటి చేతి భుజకీర్తులు పెట్టుకునే చేతి భాగం. ఆమెకి ఆ విషయం అర్థమై నా దండ వెలకట్టడం నీ తరం కాదని బదులిస్తుంది. అంటే నా పొందు పొందడం అంత సులువు కాదని చాలా ఖరీదు అని చెప్తుంది.

ఆమె తెలివైనది. విటుడు తనను కలువ పూలతో పోల్చగా, ఆమె ఇలా అంటుంది: "ఓ పుణ్యాత్ముడా! తుమ్మెదల వంటి నల్లని జుట్టున్న నా దగ్గర కలువ పూల పరిమళం ఉండటంలో వింతేముంది? కలువలు వాడిపోకుండా తాజా పరిమళంతో ఉండటం సహజమే కదా!" ఇక్కడ 'వాడక' అంటే వాడిపోవడం అని, 'మర్యాద తప్పకపోవడం' అని రెండు అర్థాలు వస్తాయి. ఓ పద్మనేత్రీ! పద్మినులైన (శ్రేష్ఠమైన స్త్రీలు) మీరు ఉన్నచోట జాతి పువ్వులు (మల్లెలు/సుగుణాలు) ఉండటం ఆశ్చర్యమేమీ కాదు కదా! అని విటుడు ఆమె పద్మినీ జాతి స్త్రీ అని, అందాన్ని కలిపి పొగిడాడు. ఈ విధంగా ఆ పట్టణంలో పువ్వులు అమ్మే పడుచులు, తమ దగ్గరకు వచ్చే విటులతో పైకి పూల వ్యాపారం చేస్తున్నట్లు కనిపిస్తూనే, లోపల శృంగార రసం చిలికేలా నర్మగర్భంగా చాలా చమత్కారంగా మాట్లాడుతుంటారు.

ముగింపు :

ప్రసిద్ధ ప్రబంధాలైన పారిజాతాపహరణం, మనుచరిత్ర వసుచరిత్ర, శుక సప్తతి, హంసవింసతి వంటి కావ్యాలలో జాతి, వార్తా చమత్కారాలు ఉన్నాయి. పరిశోధన చేయ వలసిన ఆవశ్యకత ఎంతైనా ఉంది. ప్రస్తుత వ్యాస పరిధి రీత్యా ముగిస్తున్నాను.

ఉపయుక్త గ్రంథ సూచీ :

1) వేదం వెంకటరాయ శాస్త్రి,1981 - ఆముక్తమాల్యద.
2) జి.వి. సుబ్రహ్మణ్యం 1991- సాహిత్య చరిత్రలో చర్చనీయాంశాలు,. తెలుగు అకాడమీ.
3) రాచమల్లు రామచంద్రారెడ్డి 1970- సారస్వత వివేచన. విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్.
4) జయ ప్రకాష్ 2018 - పరిశోధన విధానం, నవ చేతన పబ్లిషింగ్ హౌస్.
5) కాకర్ల వేంకట రామ నరసింహము, 1965, ఆంధ్ర ప్రబంధములు : అవతరణ వికాసములు- ఆంధ్రా యూనివర్సిటీ ప్రెస్.
6) తాపీ ధర్మారావు, తాపీ.1986- విజయ విలాసము హృదయోల్లాస వ్యాఖ్య, హైదరాబాదు, విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్
7) చిన్ని కృష్ణయ్య, దేవళ్ళ.1982 - కువలయాశ్వ చరిత్ర, హైదరాబాద్, ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమీ.
8) వాల్మీకి చరిత్రము, 2008 - రఘునాధ నాయకుడు. పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం.
9) శ్రీకాళహస్తీశ్వర మాహాత్మ్యము - ధూర్జటి 2018. పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం.
10) కులశేఖర రావు, ఎం. 1975- చేమకూర కవితా వైభవం ,సికింద్రాబాద్, యువభారతి.
11) భామహుడు కావ్యాలంకారసంగ్రహం - ఆంధ్ర మహాభారతం. తి.తి.దే.
12) చమత్కార చంద్రిక విశ్వేశ్వరుడు

★

Vol. 23 | Spl. Issue 03 | March 2026 | BHAVAVEENA | ISSN No. : 2456-4702 | RNI No. APTEL/2003/12253

RNI No. APTEL/2003/12253 | Reffered Journal & Peer Reviewed Journals | ISSN No. 2456-4702

భావవీణ

కళలు, సాహిత్య, సాంస్కృతిక భాషాధ్యయన పత్రిక

BHAVA VEENA

Journal of Arts, Literary, Culture & Language Study

స్త్రీ చైతన్య ప్రస్థానం

- కొడ్రేపు నాగమణి

పరిశోధక విద్యార్థి, ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాల, ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం, రాజమహేంద్రవరం.

ప్రవేశిక :

మానవునిలో రసాస్వాదన కలిగించేది, ఆలోచింప చేసేది సాహిత్యం. సాహిత్యం యొక్క ముఖ్య ప్రయోజనం చైతన్యాన్ని కలిగించడం అని చెప్పవచ్చు. తెలుగు సాహిత్యంలో నూతన సాహిత్యంగా పేరు పొంది, విశిష్టతను సంపాదించుకున్న కవిత్వం స్త్రీవాద సాహిత్యం. పాతకాలపు పద్ధతులకు స్వస్తి చెప్తూబీ స్త్రీలలో ధైర్యాన్ని, సాధికారతను పెంపొందించినది స్త్రీవాద సాహిత్యం. మహిళలలో చైతన్యం కలిగించి, స్త్రీ అబల కాదు ‹సబల› అని నిరూపించడం ఈ కవిత్వం యొక్క ప్రధాన లక్షణం.

నేపథ్యం :

ప్రాబ్బన్నయ యుగం నుండి దాదాపు 19వ.శతాబ్ది పూర్వార్ధం వరకు మహిళలను వర్ణించే తీరును మార్చి, వారి మనసుని వ్యక్తీకరింపచేసే విధంగా చలం, రాయప్రోలు సుబ్బారావు వంటి ప్రముఖులు ఎన్నో రచనలు చేశారు. స్త్రీలను ముందుకు తీసుకువెళ్ళే విధంగా రచయితలు ఇటువంటి మార్గానికి బాట వేయటం ముదావహం.

ఉద్దేశ్యం :

‹సంగీతమపి సాహిత్యం సరస్వత్యాః స్తనద్వయం !
ఏకమాపాత మధురం అన్యదాలోచనామృతమ్?‹ !!

అని ఆర్యోక్తి.

సాహిత్యమనేది ఆలోచనలను ప్రేరేపించేది, చైతన్యాన్ని కలిగించేది. అటువంటి సాహిత్యం ద్వారా ‹మహిళా చైతన్యాన్ని‹ కలిగించిన అంశాలను పరిచయం చేసి, వాటి ప్రయోజనాలను తెలియచేయటం

ఈ పరిశోధన పత్రం యొక్క ముఖ్య ఉద్దేశ్యం.

‹కవిత్వం మనకు విలాసం కాదు
మనకు కవిత్వం సరదా పని కాదు
మన ఉనికి కోసం మనం అత్యవసరంగా కవిత రాస్తాం
కవిత్వ కాంతిపుంజాలలో మనం
మన కలల్నీ కోరికల్నీ చూస్తాం
మన మనుగడలో, మన జీవితాల్లో మార్పుల గురించిన
ఆ కలలూ కోరికలకు
ఒక భాషగా తెచ్చుకుంటాం
ఆ భాష నుంచి భావాల్నీ
ఆ భావాల నుంచి స్వత:సిద్ధ చర్యల్నీ
కవిత్వంలో ముందుకు తెస్తాం‹!

అని స్త్రీవాద కవిత్వాన్ని ముందుకు నడిపిన కవయిత్రి ఆడ్రే లార్డ్ అన్నట్టుగాబీ చైతన్యాన్ని రేకెత్తించే రచనలను చదివి, ఆకళింపు చేసుకోవడం ద్వారా నవ్య సమాజాన్ని స్థాపించుకోవచ్చు.

మహిళా చైతన్యం – స్త్రీవాద కవిత్వం:

బాల్యంలో
‹చిన్న పిల్లవి నీకేం తెల్సు కూర్చో!‹ అన్నారు
యవ్వనంలో
‹ఉడుకు రక్తం మంచీ చెడూ తెలీదు కూర్చో!‹ అన్నారు.
వృద్ధాప్యంలో
‹ముసల్దానివి ఇంకేం చేస్తావ్ కూర్చో!‹ అన్నారు.
అవకాశం రానందుకు కోపంగా లేదు నాకు
కూర్చొని కూర్చొని బద్ధకం వచ్చినందుకే బాధగా వుంది‹.

అని శ్రీమతి ఎన్. రజియా బేగం పేర్కొన్న ఈ మాటలలో ఎంతో తాత్వికత ఉంది. పుట్టక నుండి చావు దాకా తమ వారిని నడిపించేది స్త్రీనే. అటువంటి స్త్రీని ఏమీ తెలియని ఒక నిరర్థక అంశంగా కొట్టి పారేయటం కనిపిస్తుంది. అంతేకాదు మహిళ తన ఉనికిని చాటుకోకపోతే చైతన్యం కలుగకపోగా, ‹కూవన్ఠ మండూకం‹లా జీవించాల్సి వస్తుందనే విషయం అవగతమవుతుంది.

మహిళా చైతన్యం అంటే ఒక ప్రత్యేక పరిధి కలిగిన అంశం కాదు. అడుగడుగున మహిళగా తన బాధ్యతలను నిర్వహిస్తూ, తన కుటుంబాన్ని తద్వారా సమాజాన్ని మేల్కొలపటం.

కొన్ని కొన్ని కవిత్వాలను పరిశీలిస్తే మహిళకు చైతన్యం ఎందుకు కావాలో తెలుస్తుంది. ఉదాహరణకు

‹అబ్బూరి ఛాయాదేవి‹ ‹విన్నావా‹? అనే కవిత్వాన్ని
పరిశీలిస్తేబీ
‹అమ్మ అంటుందిబీ
ఆడపిల్లవి
పెళ్లి కావలసిన అబలవి
గుండెల్లో గుబులివి
నాన్న అంటాడు:
పెళ్లి కావాలా
పిచ్చి పిల్లా
పెళ్లంటే మాటలా!

తల్లిదండ్రులే ఇలా అంటే స్నేహితులు, మరి సమాజంలోని వారు ఏమంటారు? స్నేహితులు ‹ప్రేమే లక్ష్యం‹ అంటారు, సమాజం ‹గీత దాటకూడని దానివి మచ్చ పడితే మాయని దానివి‹ అంటుంది.

‹బాల్యంలో
బొమ్మకు అమ్మనయ్యానని సంతోషించాను
ఇప్పుడు
అమ్మను నేనే! బొమ్మను నేనే‹.

సర్వం తానే అయి ఉండి, మాతృత్వాన్ని అందించే మహిళ తన స్థితిని తెలియజేసే సందర్భం ఈ కవితలో గమనించవచ్చు.

‹అనేక సందిగ్ధ ఆలోచనల అనంతరం
సవాలక్ష అప్రస్తుత ప్రశ్నలకు
సమకూర్చుకున్న సమాధానాల అనంతరం
నేను ఒక నిర్ణయానికొచ్చాను
హద్దులు, సరిహద్దులు బలాదూర్
లక్ష్మణ రేఖల్ని దాటటం ఇప్పుడు అవసరం‹.

అనే మెహెజబీన్ కవిత మహిళా చైతన్యానికి పునాది అయిన కవితగా గమనించవచ్చు.

మహిళా చైతన్యం అనేది ప్రత్యేకంగా వివరించే పరిస్థితి నుండి, అది నిత్యజీవితంలో ఒక భాగంగా మారే స్థితిని చేకూర్చాలి. ప్రభుత్వాలు అందించే పథకాలు మహిళ రక్షణలో, వారి అభ్యున్నతిలో భాగమైనప్పుడు, రోజువారి జీవితంలో స్త్రీ పాత్ర ప్రధానమైనప్పుడుబీ వారిని గౌరవించి, ముందుకు నడిపించడం కూడా చైతన్యమే అవుతుంది కదా! ‹యత్ర నార్యస్తు పూజ్యంతే రమన్తే తత్ర దేవతాఃˆ అన్నారు పెద్దలు. ఆలోచించి చూస్తే, దేవతలు కొలువయ్యేచోటు స్త్రీ గౌరవం మీదే ఆధార పడిందని స్పష్టమవుతుంది.

మహిళా చైతన్యాన్ని దృష్టిలో ఉంచుకుని, స్త్రీని ‹వంటింటి కుందేలు‹గా, ఒక ‹యంత్రం‹లా, ‹బానిస‹లా భావించకుండా, తనకు కొన్ని ఇష్టాలు ఉంటాయని, ఆమె కూడా అభివృద్ధిని కోరుకుంటుందని గ్రహించి, వారి అభ్యున్నతికి పాటుపడాలి. ఒకప్పుడు

తండ్రి చాటు బిడ్డగా, భర్త చాటు భార్యగా బ్రతికిన మహిళలు నేడు అంతరిక్షాన్ని సైతం ఏలుతున్నారంటే స్త్రీ ప్రగతి ఎంత అవసరమో ఆలోచించాలి.

మహిళలను కించపరిచిన సంఘటనలను, వారి మనో భావాలను దెబ్బతీసిన ఇతిహాస కథలను గమనిస్తే, ఒక స్త్రీని బాధ పెట్టడం వల్ల ఎలాంటి పరిస్థితులు ఎదు రయ్యాయో తెలుస్తుంది. ఆమెను వ్యక్తిగా కాక ‹శక్తి›గా తలచి, గౌరవిస్తే సమాజం మరింత మెరుగుపడుతుందని భావించవచ్చు.

ప్రాచీన కాలంలో స్త్రీ శారీరక సౌందర్యానికి ప్రతీకగా చెప్పబడితే, ఆధునిక కాలంలో స్వేచ్ఛ స్వాతంత్ర్యాలు కలిగిన విశిష్ట వ్యక్తిగా, అభివృద్ధిని సాధించగలిగి, పురుష సమాజాన్ని ముందుకు నడిపించగల వ్యవస్థగా మారిందని చెప్పవచ్చు.

చలం స్త్రీ - స్త్రీ వాదం - మహిళా చైతన్యం

సాహిత్య రచన ప్రారంభంలోనే కందుకూరి వీరేశ లింగం మహిళల కోసం రచనలు చేస్తూ, పత్రికలను నడిపారు. బాల్యవివాహాలను అరికట్టి, వితంతు వివాహా లను ప్రోత్సహించి, స్త్రీలకు ఒక ప్రత్యేక జీవితాన్ని కల్పించారు. అదే బాటలో గురజాడ వారు ‹పూర్ణమ్మ›, ‹కన్యక› వంటి కవితలలో స్త్రీ జీవితాన్ని

కళ్ళకు కట్టినట్లు చూపించారు. ఇలా ఆధునిక కవులెందరో మహిళా చైతన్యానికి పునాది వేశారు. రాయప్రోలు సుబ్బారావు ‹అమలిన శృంగారం› స్త్రీ జాతిని అత్యున్నత స్థానానికి చేర్చిందని గమనించవచ్చు. ఇలా పురుషులే స్త్రీవాద కవిత్వానికి శ్రీకారం చుట్టారని తెలుస్తుంది. ఇంకా ‹చలం› స్త్రీలను, స్త్రీవాద కవిత్వాన్ని ఎంతో సుందరంగా, సరళంగా అభివర్ణించారు. స్త్రీ శరీరాన్ని కాకుండా మనసుకు పెద్దపీట వేశారు.

‹స్త్రీకి కూడా శరీరం ఉందిబీ
దానికి వ్యాయామం యివ్వాలి.
ఆమెకి మెదడు ఉందిబీ
దానికి జ్ఞానం ఇవ్వాలి.
హృదయం ఉంది
దానికి అనుభవం యివ్వాలి› అంటారు చలం.

ఈ పంక్తుల్ని గమనిస్తే, చిన్న కవితలో పెద్ద మనసుని చాటి, స్త్రీ చైతన్యాన్ని గూర్చి తెలియజేశారని స్పష్టం అవుతుంది. వీటన్నింటినీ సాధించాలంటే స్త్రీకి స్వేచ్ఛ కావాలి.

స్వేచ్ఛా పథంలోకి...
నిశ్శబ్దానికెపుడూ...
శబ్దమంటే విసుగే!
కానీ శబ్దానికే-
నిశ్శబ్దమంటే భయం!!
స్వేచ్ఛ దేనికి? దేని నుంచి...?

ఈ కవితలో మార్మికత మాటల్లో చెప్పగలిగేది కాదు. మనసుతో అర్థం చేసుకోవాలి. చలం అప్పటి రోజుల్లోనే స్త్రీ జీవితాన్ని బాగా అర్థం చేసుకున్నారు. వారికి జరిగే అన్యాయాన్ని గుర్తించారు. స్త్రీని పురుషులు వారి కోసమే జన్మించిన భోగ వస్తువుగా చూడటాన్ని నిరసించారు. అంతేకాదు ‹సవాలక్ష సందేహాలు› పుస్తకంలో స్త్రీల ఆరోగ్యం కోసం చలం చూపించిన ఆదరణ తెలుస్తుంది. చలం ‹స్త్రీ› పుస్తకం రాసి కొన్ని దశాబ్దాలు అయినప్పటికీ, ఆ పుస్తకం ముద్ర స్త్రీల మనసులపై పడింది. వారిని అడుగడుగునా కాపాడే అస్త్రంగా భాసిల్లుతున్నది.

‹స్త్రీల శరీరాల చుట్టూ అందంగా అల్లి, ప్రచారం చేస్తున్న అబద్ధాలను కనుగొన్న తర్వాత కలిగే వినోదం, వచ్చే కోపం- వీటిని మాటల్లో వర్ణించి చెప్పటం కష్టం› . కాని చలం రచనల వలన వారిలో శరీర పోషణపై శ్రద్ధ వచ్చింది అని చెప్పవచ్చు.

కుటుంబ వ్యవస్థ - చలం తిరుగుబాటు

‹కుటుంబం› అంటే వ్యక్తుల సమూహం కాదు, కొన్ని మనసుల సముదాయం. భిన్న మనస్తత్వాలున్నప్పటికీ ఏకతాటిపై నడిపించగలిగే సాధనం. అటువంటి కుటుంబ వ్యవస్థ పితృస్వామ్య వ్యవస్థగా నేటికీ వర్ధిల్లు తున్నది. అయితే ఆ కుటుంబంలోనే పిల్లలకి విలువలు నేర్పించాలి. అటువంటప్పుడు స్త్రీలను గౌరవించాలనే నైతిక విలువలను ఎందుకు పెద్దలు చెప్పరని, చలం కుటుంబ వ్యవస్థ పై తిరుగుబాటు చేసిన సందర్భాలు కనిపిస్తాయి.

సమాధానం దొరకని ప్రశ్నలు ఎన్నింటికో చలం రచనలు ఒక మార్గాన్ని చూపించాయి.

ముగింపు :

కుటుంబ వ్యవస్థ నుండే మహిళల యొక్క ప్రాధాన్యాన్ని, గొప్పతనాన్ని తెలియచేయాలి. చిన్నతనం నుండి ఆడపిల్లలకు కట్టుబాట్లు నేర్పడంతోపాటు, అవి ఎందుకు, ఏ విధంగా నేర్పవలసి వస్తుందో కూడా తెలియ జేయాలి. మార్పును తీసుకురావాలి అంటే ఆడవారు మారటం కాదు, మనుషుల ఆలోచన వైఖరి మారాలి. అప్పుడే మహిళా చైతన్యం సిద్ధిస్తుంది. చైతన్యం అంటే ప్రత్యేకంగా తీసుకువచ్చేది కాదు, మనం ఏవిధంగా ప్రవర్తించకూడదు అనే కనీస జ్ఞానాన్ని నేర్పించడం. ఇప్పుడున్న సమాజంలో మహిళలపై జరిగే అకృత్యాలు, అఘాయిత్యాలను అరికట్టడానికి ప్రభుత్వాలు అనేక కొత్త చట్టాలు చేయటం ఎంతో అభినందనీయం. ఆధునిక సాహిత్యం ద్వారా, స్త్రీవాద సాహిత్యం ద్వారా మహిళా చైతన్యాన్ని సాధించే ప్రయత్నం చేయగలమని భావిస్తూ, ఈ పరిశోధన పత్రం ద్వారా కొంతైనా చైతన్యాన్ని చేకూర్చే మార్గాలను సూచించానని ఆశిస్తున్నాను.

ఆధార గ్రంథాలు :

1. ఓల్గా - నీలి మేఘాలు, (స్త్రీవాద కవితా సంకలనం), స్వేచ్ఛ ప్రచురణలు, హైదరాబాదు.
2. ఏటుకూరు బలరామమూర్తి - చలం - స్త్రీవాదం (సంకలనం), విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్, విజ్ఞాన్ భవన్, హైదరాబాదు, నవంబరు, 1994.
3. చలం - స్త్రీ బిడ్డల శిక్షణ, ప్రియదర్శిని ప్రచురణలు, హైదరాబాదు.
4. ఓలా - నూరేళ్ల చలం(సంపాదకత్వం), (వ్యాస సంకలనం), నూరేళ్ల చలం శత జయంతి కమిటీ, నవోదయ బుక్ స్టాల్, ఆర్య సమాజ్ ఎదురు సందు, హైదరాబాదు 1994.

★★★

Vol. 23 | Spl. Issue 03 | March 2026 | BHAVAVEENA | ISSN No. : 2456-4702 | RNI No. APTEL/2003/12253

RNI No. APTEL/2003/12253 | Reffered Journal & Peer Reviewed Journals | ISSN No. 2456-4702

భావవీణ

కళలు, సాహిత్య, సాంస్కృతిక భాషాధ్యయన పత్రిక

BHAVA VEENA

Journal of Arts, Literary, Culture & Language Study

విజయ విలాసము - ఉలూచి పాత్ర మహిళా చైతన్యం - ఒక పరిశీలన

- గొడుగులూరి గాయత్రి

పరిశోధక విద్యార్థిని, తెలుగు విభాగం, హైదరాబాద్ విశ్వవిద్యాలయం, హైదరాబాద్.

వ్యాస సంగ్రహం

దక్షిణాంధ్రయుగంలో వెలసిన ఆంధ్ర ప్రబంధాల్లో విజయవిలాస కావ్యానిది అగ్ర స్థానం అని చెప్పవచ్చు. ఈ కావ్యాన్ని పరిశీలించటం ద్వారా అర్జునుడి విలాస విషయాలను మాత్రమే కాకుండా సమాజంలోని సాంస్కృతిక, సామాజిక విలువలు ఏ విధంగా ప్రతి బింబించాయి అనే విషయాలు కూడా తెలుసుకోవచ్చు. ముఖ్యంగా మహిళా పాత్రల చిత్రణలో రచయిత చూపిన దృక్పథం ప్రత్యేకమైనది. మహిళలను కేవలం గృహ పరిమితులుగా కాకుండా భావోద్వేగాలు, ఆత్మగౌరవం, నిర్ణయ సామర్థ్యం కలిగిన వ్యక్తులుగా చిత్రించారు. ఈ పత్రంలో విజయ విలాసము కావ్యంలోని ఉలూచి పాత్రలో మహిళా చైతన్యం ఎలా వ్యక్తమైందో విశ్లేషించడం ఈ వ్యాసం ప్రధాన లక్ష్యం.

విజయవిలాస కావ్యంలో ఉలూచి ధైర్యవంతురాలు, ఆత్మవిశ్వాసం గల స్త్రీగా చిత్రించబడింది. ఆమె తన భావాలను స్పష్టంగా చెప్పగల సామర్థ్యం కలిగి ఉంటుంది. సమాజంలో మహిళలు కేవలం బలహీనులు కాదని, వారు కూడా తమ ఆలోచనలతో నిర్ణయాలు తీసుకునే శక్తి కలిగి ఉంటారనే భావనను ఈ పాత్రలో మనం గ్రహించవచ్చు. ఉలూచి తన ప్రేమను వ్యక్తపరచడంలో, తన జీవిత నిర్ణయాల్లో స్వతంత్రంగా వ్యవహరిస్తుంది. ఈ విధంగా ఉలూచి పాత్రలో మహిళా స్వేచ్ఛ, ధైర్యం మరియు చైతన్యం స్పష్టంగా కనిపిస్తాయి.

కీలక పదాలు :

దక్షిణాంధ్రయుగం, మహిళా చైతన్యం, ఆత్మగౌరవం, సంకల్పశక్తి, ఉలూచి, భావవ్యక్తీకరణ స్వేచ్ఛ, ప్రాచీన సాహిత్యం.

ఉపోద్ఘాతం :

చేమకూర వేంకటకవి రచించిన విజయవిలాస ప్రబంధం తెలుగు సరస్వతికి అపూర్వ అలంకారం. విజయుడు ప్రౌఢయైన ఉలూచిని, ముగ్ధయైన చిత్రాంగదను, మధ్యనాయిక అయిన సుభద్రను వివాహమాడి సాగించిన విలాసం మూడు ఆశ్వాసాలలో వర్ణించబడిన ప్రబంధం విజయవిలాసం. విజయవిలాసం క్రీ.శ. 1614-33 మధ్యకాలంలో తంజావూరును పాలించిన రఘునాథ నాయకునకు అంకితం చేయబడింది. రసపోషణకు ఏమాత్రం లోటులేకుండా సరసమనోహరమైన వర్ణనలతో, చక్కని మనోహరమైన శబ్దాలంకారాలతో, మాట ఒడుపులతో, చమత్కారాలను గుప్పిస్తూ అందరి మనస్సులను రంజింపజేసే విధంగా కవి ఈ రచన కావించాడు. అదే విధంగా ఈ ప్రబంధంలో స్త్రీ పాత్రలకు ప్రత్యేకమైన స్థానాన్ని కల్పించాడు. ఈ కావ్యంలో స్త్రీలు కేవలం సౌందర్యానికి ప్రతీకలుగా కాకుండా భావాలు, ఆత్మ

గౌరవం, స్వతంత్ర నిర్ణయాలు కలిగిన వ్యక్తులుగా చిత్రించబడ్డారు. ఈ లక్షణాల సమాహారమే మహిళా చైతన్యంగా చెప్పవచ్చు.

'ఆడవాళ్ళు ఇలాగే ఉండాలి' అనే అభిప్రాయాన్ని సవాలు చేసేదే మహిళా చైతన్యం (పసుపులేటి రమాదేవి, 2021). స్త్రీకి సమాన హక్కులు, ఆత్మగౌరవం, స్వతంత్ర ఆలోచన, జీవిత నిర్ణయాలలో తమ అభిప్రాయాన్ని ప్రకటించడం వంటి వాటిని సూచించే భావజాలమే మహిళా చైతన్యం. ఈ భావన విజయ విలాసంలో వివిధ సందర్భాల్లో కనిపిస్తుంది.

ఉలూచి - ప్రేమలో స్వతంత్ర భావవ్యక్తీకరణ

చ. ఇటు జపియించినన్ విడుతునే నిను నే నీఁక నంచు జాహ్నవీ
తటమున సంధ్యవార్చి జపతత్పర్నఁడై తగువాని యామినీ
విటకుల శేఖరుం గొనుచు వే పురికిం జని నిల్పె నట్టె యు
న్నటులనే మాయ వచ్చువడ నల్ల భుజంగి నిజాంగణంబునన్. (ఆశ్వాసం 1, పద్యం - 73)

గంగానది తీరంలో సంధ్యావందనం చేస్తూ జపంలో నిమగ్నుడై ఉన్న అర్జునుడిని చూసిన ఉలూచి అతనిపై ప్రేమతో, తన కోరికను నెరవేర్చుకోవాలనే సంకల్పంతో మాయచేసి అతనిని తన లోకమైన భోగవతికి తీసుకెళ్లింది. ఈ సంఘటనలో ఉలూచి ఎవరి అనుమతి కోసం ఎదురు చూడకుండా స్వతంత్రంగా నిర్ణయం తీసుకోవడం ఆమె ఆత్మవిశ్వాసాన్ని తెలియజేస్తుంది. అలాగే తన ప్రేమను దాచకుండా, ధైర్యంగా కార్యరూపంలోకి తీసుకువచ్చిన విధానం ఆమె చైతన్యాన్ని ప్రతిబింబిస్తుంది. సాధారణంగా ప్రాచీన సాహిత్యంలో మహిళలు మౌనంగా ఉండే పాత్రలుగా కనిపిస్తారు. కానీ ఉలూచి మాత్రం చురుకుదనం, ధైర్యం, స్వతంత్ర భావనతో ముందడుగు వేసి తన మనసులోని ఆకాంక్షను సాధించడానికి ప్రయత్నించింది. ఈ విధంగా ఈ పద్యంలో ఉలూచి పాత్ర ద్వారా స్త్రీలోని స్వేచ్ఛ, ధైర్యం, సంకల్పశక్తి వంటి లక్షణాలు ప్రతిఫలింపజేస్తూ మహిళా చైతన్యాన్ని కవి అందంగా చిత్రించినట్లు భావించవచ్చు.

ఉలూచి - కోరికను ప్రకటించుటలో ధైర్యం

క. సరి లేని విలాసము గని
వరియిం చిటఁ దోడికొనుచు వచ్చితి ని న్నో
కురువీర! వసింపఁగ నీ
కుఱువీర దృఢాంకపాళిఁ గోరినదానన్.
(ఆశ్వాసం 1, పద్యం - 80)

ఈ పద్యంలో ఉలూచి, కురువంశ వీరుడైన అర్జునుడుతో అతని సాటి లేని సౌందర్యాన్ని చూసి తనకు అతనిపై ప్రేమ కలిగిందని చెబుతుంది. అతని దగ్గర ఉండాలని, అతని సన్నిహితాన్ని కోరుకుంటున్నట్లు తన భావం వ్యక్తం చేస్తుంది.

ఈ పద్యంలో నాగకన్య ఉలూచి, వీరుడైన అర్జునుడి అపూర్వమైన సౌందర్యాన్ని చూసి అతనిపై తనకు ప్రేమ కలిగిందని నేరుగా వ్యక్తపరుస్తుంది. "సరిలేని విలాసము గని" అని అతని సౌందర్యాన్ని ప్రశంసిస్తూ, అతనిని వరించాలనే తన కోరికను స్పష్టంగా తెలియజేస్తుంది. అతని దగ్గర నివసించాలని, అతని సన్నిహితాన్ని పొందాలని కోరుకుంటున్నట్లు ధైర్యంగా ఎలాంటి సంకోచం లేకుండా ఆమె తన మనసులోని భావాలను వెల్లడించింది.

ప్రాచీన సమాజంలో సాధారణంగా పురుషులే వివాహం వంటి ముఖ్యమైన నిర్ణయాలు తీసుకునే పరిస్థితి ఉండేది. ఆ సందర్భంలో స్త్రీలు తమ కోరికలను స్వయంగా ప్రకటించడం అరుదుగా కనిపించేది. అయితే ఉలూచి మాత్రం ఆ పరిమితులను అధిగమించి, తనకు నచ్చిన వ్యక్తిని స్వయంగా వరించాలనే సంకల్పాన్ని వ్యక్తపరుస్తుంది. ఇది ఆమె వ్యక్తిత్వంలోని ధైర్యాన్ని, స్వతంత్ర ఆలోచనను మరియు ఆత్మవిశ్వాసాన్ని తెలియజేస్తుంది.

అదేవిధంగా ఉలూచి తన ప్రేమను దాచిపెట్టకుండా, అర్జునుడి ముందే తన ఆకాంక్షను స్పష్టంగా చెప్పడం ద్వారా స్త్రీకి కూడా తన జీవిత భాగస్వామిని ఎంపిక చేసుకునే హక్కు ఉందనే భావనను సూచిస్తుంది. ఈ

విధంగా తన కోరికను ప్రకటించే ధైర్యం, తన భావాలను నిస్సంకోచంగా వ్యక్తపరచడం, స్వతంత్ర నిర్ణయశక్తి వంటి లక్షణాలు ఉలూచి పాత్రలో మహిళా చైతన్యానికి ప్రతీకలుగా నిలుస్తాయి. అందువల్ల ఈ పద్యంలో కవి ఉలూచి పాత్ర ద్వారా స్త్రీలోని ఆత్మవిశ్వాసం, భావ వ్యక్తీకరణ స్వేచ్ఛ వంటి మహిళా చైతన్య లక్షణాలను చక్కగా ఆవిష్కరించినట్లు భావించవచ్చు.

వరుడిని ఎంచుకునే స్వేచ్ఛ :

చ. ఇలపయి మత్స్యయంత్ర మొక యేటున నేసి, సమస్త రాజులన్
గెలిచిన మేలువార్త లురగీ వరగీతిక లుగ్గడింప వీ నుల నవి
చల్లగా విని, నినున్ వరియింప మనంబు గల్గి, నీ చెలువము వ్రాసి చూతు నదె చిత్తరువందు ననేక లీలలన్. (ఆశ్వాసం 1, పద్యం - 98)

ఈ పద్యంలో నాగకన్య ఉలూచి, మత్స్యయంత్రాన్ని ఒక్క దెబ్బతో పడగొట్టి సమస్త రాజులను జయించిన అర్జునుడు యొక్క పరాక్రమాన్ని గురించి వివరిస్తుంది. అతని వీరత్వాన్ని నాగకన్యలు గీతాల రూపంలో పాడుతూ ఉండగా వాటిని విని అతనిని వరించాలనే అభిలాష కలిగి, అతని సౌందర్యాన్ని ఊహించుకొని చిత్రపటంలో చిత్రించి చూసుకుంటూ ఉండేదని తన ప్రేమను గురించి అర్జునుడికి వ్యక్తపరుస్తుంది.

మత్స్యయంత్ర ఘట్టం గురించి తెలిసిన ఉలూచికి అర్జునుడికి ద్రౌపదితో వివాహం జరిగిన విషయం కూడా తెలిసే ఉంటుంది. అయినా కూడా అర్జునుడు మంచి వీరుడు, యోగ్యుడు కావున తనకి అన్నీ విధాలుగా తగిన వాడు అర్జునుడే అని నిర్ణయించుకొని అతన్ని చూడ కుండానే ఊహ ద్వారా చిత్రపటం గీసి ప్రేమిస్తుంది.

ఈ పద్యంలో ఉలూచి తన మనసులో అర్జునుడి పట్ల కలిగిన ప్రేమను స్వయంగా వెల్లడించింది. ఉలూచి తన భావాలను దాచకుండా స్పష్టంగా వ్యక్తపరచడం ఆమె ఆత్మవిశ్వాసాన్ని తెలియజేస్తుంది. ప్రాచీన కావ్యాలలో సాధారణంగా స్త్రీలు తమ మనోభావాలను గోప్యంగా ఉంచే స్వభావంతో చిత్రించబడతారు. కానీ ఉలూచి మాత్రం తన మనసులోని ఆకాంక్షను ధైర్యంగా ప్రకటిస్తూ, తనకు నచ్చిన వ్యక్తిని స్వయంగా వరించాలనే సంకల్పాన్ని వ్యక్తం చేస్తుంది. ఈ విధంగా ఉలూచి పాత్రలో కనిపించే స్వేచ్ఛా భావం, ఆత్మవిశ్వాసం, స్వతంత్ర నిర్ణయశక్తి వంటి లక్షణాలు మహిళా చైతన్యానికి ప్రతీకలుగా నిలుస్తాయి. కాబట్టి ఈ పద్యంలో కవి ఉలూచి పాత్ర ద్వారా స్త్రీలోని భావప్రకటన స్వేచ్ఛను మరియు చైతన్యాన్ని సమర్థంగా ఆవిష్కరించినట్లు భావించవచ్చు.

భావోద్వేగాల ప్రాధాన్యం :

ఉ. అంటిన ప్రేమ జాహ్నవికి నప్పుడ తోడ్కొని వచ్చి, యల్ల వా
ల్లంటి నిజేశ్వరున్ దనదు గబ్బి చనుంగవఁ జేర్చి, బాష్పముల్
కంటఁ దొరంగుచుండఁ దిరుగం దిరుగం గన్నఁగొంచ్నఁ గ్రమ్మజెన్
జంట దొజంగి నంజను వెనం జను జక్కవ పెంటియుం బలెన్. (ఆశ్వాసం 1, పద్యం - 114)

ఈ పద్యంలో విశాల నేత్రాలున్న ఉలూచి తన భర్త అయిన అర్జునుడిని కౌగిలించుకొని, కన్నీళ్లు కారుస్తూ, పదే పదే వెనక్కి తిరిగి చూస్తూ వేదనతో విడిచి వెళ్లిన దృశ్యాన్ని జతను విడిచి వెళ్తున్న చక్రవాక పక్షిలా కవి హృద్యంగా వర్ణించాడు. ఇది గాఢమైన ప్రేమ, అనుబంధం, భావోద్వేగ గాఢతను సూచిస్తుంది.

ఎన్నో ఏళ్ల నుంచి అర్జునుడి కోసం ఎదురు చూసి తనని వరించిన ఉలూచి ఒక రోజులోనే భర్తను వదిలి దూరంగా ఉండాల్సి వచ్చేందుకు ఎంతో బాధ పడు తుంది. అతని మీద ఆమెకున్న ప్రేమ అమితమైనది.

ఈ పద్యంలో ఉలూచి పాత్రలోని మహిళా చైతన్యం భావోద్వేగ గాఢత, దాంపత్య నిబద్ధత, ప్రేమాభిమానాల రూపంలో ప్రతిఫలిస్తుంది.

ఈ పద్యంలో ఉలూచి తన భర్త అర్జునుడిని గాఢమైన ప్రేమతో కౌగిలించుకొని కన్నీళ్లు కారుస్తూ అతనిని విడిచి వెళ్లే దృశ్యాన్ని కవి ఎంతో హృద్యంగా చిత్రించాడు. అర్జునుడిపై ఉన్న తన అపారమైన ప్రేమను, అనుబంధాన్ని ఆమె సంకోచం లేకుండా వ్యక్తపరుస్తుంది.

అతనిని కౌగిలించుకొని కన్నీళ్లు కారుస్తూ, పదేపదే వెనక్కి తిరిగి చూస్తూ వెళ్లడం ఆమె హృదయంలో ఉన్న గాఢమైన అనురాగాన్ని తెలియజేస్తుంది. అర్జునుడు వెళ్తే తిరిగి వస్తాడో రాడో కూడా తెలియదు, తన కొడుకు బాధ్యత తను మాత్రమే చూసుకోవాలి, ఇకపై తను ఒంటరిగా ఉండాలి. వీటిని గురించి ఉలూచి ఏ మాత్రం బాధ కానీ భయం కానీ పడలేదు. ఆ పరిస్థితులన్నీ తను చక్కబెట్టగలదు. కానీ అర్జునుడు విడిచి వెళ్తుంటే తన బాధను వ్యక్తపరుస్తూ అర్జునుడిని విడిచి వెళ్లిందే కానీ ఎలాంటి వ్యతిరేక చర్యలు చేయలేదు. ఉలూచి అర్జునుడిని విడిచి వెళ్ళే దృశ్యం భావోద్వేగ స్వభావాన్ని మాత్రమే కాకుండా తన దాంపత్య బంధంపై ఉన్న గాఢమైన నిబద్ధతను కూడా తెలియజేస్తాయి.

ఈ విధంగా ఈ పద్యంలో ఉలూచి పాత్రలో కనిపించే భావవ్యక్తీకరణ స్వేచ్ఛ, ప్రేమను నిస్సంకోచంగా వ్యక్తపరచగల స్వభావం, దాంపత్య బంధంపై ఉన్న నిబద్ధత వంటి లక్షణాలు మహిళా చైతన్యానికి ప్రతీకలుగా నిలుస్తాయి. కాబట్టి కవి ఈ సందర్భంలో ఉలూచి పాత్ర ద్వారా స్త్రీలోని భావోద్వేగ గాఢతను, ప్రేమాభిమానాలను, ఆత్మీయ అనుబంధాన్ని చక్కగా ఆవిష్కరించినట్లు భావించవచ్చు.

ఉపసంహారం :

చేమకూర వేంకటకవి రాసిన 'విజయవిలాసం' సంప్రదాయ సాహిత్యంలోని శృంగార కావ్యం మాత్రమే కాదు అది అప్పటి సామాజిక కట్టుబాట్లను దాటి ఆలోచించిన ఒక గొప్ప ప్రగతిశీల రచన. ముఖ్యంగా ఇందులో ఉలూచి పాత్ర చిత్రణ, ప్రాచీన సాహిత్యంలో స్త్రీని కేవలం అబలగా లేదా పురుషుని నీడగా చూసే ధోరణిని బద్దలు కొట్టింది అని చెప్పవచ్చు . వేంకటకవి తన శ్లేష, చమత్కృతులతో ఉలూచి పాత్రలో అద్భుతమైన మహిళా చైతన్యాన్ని నింపారు.

తన మనసులోని ప్రేమను ఏమాత్రం సంకోచం లేకుండా నిర్భయంగా ప్రకటించడం, గంగాతీరం నుండి అర్జునుడిని తన మాయాబలంతో భోగవతికి తీసుకు వెళ్లడం వంటి ఘట్టాలు ఆమెలోని పట్టుదలను, స్వతంత్ర నిర్ణయాధికారాన్ని స్పష్టంగా చూపిస్తాయి. కొన్ని వందల ఏళ్ల క్రితమే ఒక మహిళ తన జీవిత భాగస్వామిని తానే ఎంచుకోవడం, తన భావోద్వేగాలను నిస్సంకోచంగా బయటపెట్టడం వంటి అంశాలు చూస్తే నేటి ఆధునిక మహిళా చైతన్యానికి అప్పుడే పునాదులు పడ్డాయని మనకు అర్థమవుతుంది. ఉలూచి పాత్ర ద్వారా కవి స్త్రీ అంటే కేవలం సౌందర్యవతి మాత్రమే కాదు, ఆమెకు సొంత ఆత్మగౌరవం, ధైర్యం మరియు మేధోశక్తి కలిగిన ఒక సంపూర్ణ వ్యక్తిత్వం కలిగి ఉంటుందని తెలియ చేసారు. ఈ పత్రంలో తెలుగు సాహిత్యం ఎప్పుడూ కాలం కంటే ముందే ప్రయాణించిందని, వేంకటకవి సృజించిన ఉలూచి పాత్రే అందుకు సజీవ సాక్ష్యమని చెప్పవచ్చు. సమాజం పెట్టిన హద్దులను దాటి ఉలూచి ప్రదర్శించిన ఈ చైతన్యం, నేటి సామాజిక స్థితిగతులకు సైతం ఒక గొప్ప స్ఫూర్తిగా నిలుస్తుంది.

ఆధార గ్రంథాలు :

1. వెంకట కవి, చేమకూర. 2005. విజయ విలాసం. విజయవాడ: ఎమెస్కో ప్రచురణలు.
2. ధర్మారావు, తాపీ, 1968. హృదయోల్లాస వ్యాఖ్య. సికింద్రాబాదు: శివాజీ ప్రెస్.
3. నాగయ్య, జి. 2021. తెలుగు సాహిత్య సమీక్ష (రెండవ సంపుటి), హైదరాబాదు: నవ్య పరిశోధక ప్రచురణలు.
4. వెంకట రాయశాస్త్రి, వేదం. 1911. విజయవిలాసం స్వవిరచిత వ్యాఖ్య. అనంతపురం: జ్యోతిస్మతీ ముద్రాక్షరశాల.
5. రమాదేవి, పసుపులేటి. 2021. మహిళా చైతన్యంపై మాట్లాడుదాం రండి. ప్రచురణ: భూమిక.

★★★

Vol. 23 | Spl. Issue 03 | March 2026 | BHAVAVEENA | ISSN No. : 2456-4702 | RNI No. APTEL/2003/12253

RNI No. APTEL/2003/12253 | Reffered Journal & Peer Reviewed Journals | ISSN No. 2456-4702

భావవీణ

కళలు, సాహిత్య, సాంస్కృతిక భాషాధ్యయన పత్రిక

BHAVA VEENA

Journal of Arts, Literary, Culture & Language Study

భారత దేశంలో స్త్రీ వాదం - ఒక పరిశీలన

- డా॥. డి. సత్యలత

తెలుగుశాఖాధ్యక్షులు, ప్రభుత్వమోడల్ డిగ్రీ కళాశాల జగ్గంపేట.

భారత దేశంలో స్త్రీవాదం - పుట్టుక - వికాసం :

పాశ్చాత్య నాగరికత సమ్మేళనం వలన భారతీయ సంస్కృతిలో లోటుపాట్లు మేధావులు గుర్తించారు. సాంఘిక అనర్థాలు, అమానవీయ ఆచారాలు బ్రిటీష్ అధికారులకి ఆశ్చర్యం, అసహ్యం కలగచేసాయి. బ్రిటీష్ వారి రాకతోనే మనం మన సంస్కృతిలోకి తొంగి చూసు కొన్నాము. అందులో అలవాటుగా, అచారంగా మారిన అనర్థాలు గుర్తించారు. బహుభార్యాత్వం, సతీసహగమనం, దేవదాసి, శిశుహత్య, వితంతు పునర్వివాహ నిషేదం, పర్దా, అవిద్య మొదలైన వెన్నో స్త్రీలపట్ల ఉన్న అమానుషా చారాలకి వ్యతిరేకంగా ఉద్యమించ వలసిన అవశ్యకతని గుర్తించారు.

వలస పాలన స్త్రీల చైతన్యం: బ్రిటిష్ వారు భారత దేశాన్ని పరిపాలించే సమయంలో దేశానికి విముక్తి రావాలంటే దేశప్రజలంతా పోరాటంలో భాగ స్వాము లవ్వాలి. కానీ దేశ జనాభాలో సగభాగమైన స్త్రీలు, అధిక సంఖ్యాకులయిన దళితులు.వీరు అభివృద్ధికి చైతన్యానికి దూరమయ్యారు. అందువలనే సంఘ సంస్కరణోద్యమం, జాతీయోద్యమాలలో స్త్రీలని చైతన్యవంతులని చేయడం భారత స్వతంత్రోద్యమానికి అవసరమయింది. తొలి దశలో స్త్రీలను గురించి పురుషులే అలోచించారు. పురుషులే సామాజిక భాగస్వాముల అవడం వలన వాళ్లే స్త్రీల నిజస్థితిని గుర్తించారు. 1831-1838 మధ్య స్త్రీ విద్య మీదచర్చ జరిగింది. తర్వాత క్రైస్తవ బిషప్ల వలన సంస్కర్తల వలనా 1882-1901మధ్య విశ్వవిద్యా లయాల్లోకి స్త్రీలు ప్రవేశించారు. 1910-13 మధ్య గోపాల కృష్ణ గోఖలె నిర్బంద ప్రాథమిక విద్య కోసం కృషి చేసారు. 1916 లో స్త్రీల కోసం ప్రత్యేక విశ్వవిద్యాలయం ఏర్పాటు చేసారు. విద్యే చైతన్యానికి మూలకారణం. స్త్రీ విధ్యకొరకు సుమారు 1916 వరకూ స్త్రీల గురించి పురుషులే ఆలోచించారు.

ఓటు హక్కు ఉద్యమం: విద్యావంతులైన మహిళలు మొదటిసారి ఓటుహక్కు కావాలన్నారు. పురుషులు కూడా బలపరిచారు. మార్గరెట్ కజిన్స్ మద్రాసులో ఏర్పాటు చేసిన ఉమెన్స్ ఇండియన్ అసోసియేషన్ తరుపున 1917-డిశంబరు -1వ తేదిన మాంటేగ్యూచెమ్స్‌ఫర్డ్‌ను మద్రాసులో కలుసుకొని ఒక మెమొరాండం ఇచ్చారు. "స్త్రీలకు విద్యకావాలనీ, ఎక్కువ వైద్యశాలలు కావాలనీ కొందరు మహిళలు కోరారని మాంటెగ్యు తనడైరీ లో రాసుకొన్నారట. సరోజిని నాయుడు ఈ రాయభార బృందా నికి నాయకురాలు. మరొకరు బొంబాయికి చెందిన జోషి, వీరు స్త్రీలకు ఓటింగ్ హక్కు కావాలని కూడా అడిగారు. అసలు మెమొరాండం రాసిన మహిళమిసెస్ మార్గరెట్ కజిన్సు, అనిబిసెంటుకు అనుయాయులు, 1919వ

నం॥లో గవర్నమెంటు ఆఫ్ ఇండియాబిల్లు పార్లమెంటులో ప్రవేశ పెట్టబడిన తర్వాత ఉభయ శాసనసభల తరపున ఒక జాయింటు కమిటీ ఏర్పాటు చేసారు. సరోజనీనాయుడు, హీరాబాయిలు ఈ కమిటీని కలుసుకొని వివరాలు అందజేస్తూ ఓటుహక్కు ఇవ్వాలని ప్రతిపాదించారు. దాంతో జాయింటు కమిటీ కొన్ని సిఫార్సులు చేసింది. భారతీయ లెజిస్లేచర్లు స్త్రీలకి ఓటు హక్కు ఇవ్వాలనే తీర్మానించారు. మనదేశంలో అమెరికా, ఇంగ్లాడ్లలో వలె తీవ్రపోరాటం అవసరంలేకపోయింది. అమెరికాలో 72 సం!!, ఇంగ్లాడ్ 50సం॥ సుదీర్ఘ పోరాటంవలన ఓటు హక్కు సాధించారు. మనదేశంలో మహిళలకి అంత తీవ్ర పోరాటం అవసరంలేకపోయింది. పురుషులు స్త్రీల ఓటు హక్కుని వ్యతిరేకించలేదు. ఎన్నికైన లెజిస్లేచర్లు యీ ప్రతిపాదన విచారించి నిర్ణయించాలని నిర్ధారణ చేసారు. భారతీయ లెజిస్లేచర్లు స్త్రీలకి ఓటు హక్కు ఇవ్వాలనే తీర్మానించారు.

1920 లో మొట్టమొదట తిరువాస్కూరు సంస్థానంలో స్త్రీలకు ఓటు హక్కు ఇచ్చారు. 1921 లో మద్రాసులో 1922 లో బొంబాయి, 1925 బెంగాల్ రాష్ట్రంలో, 1926 పంజాబ్లో ఆఖరిగా 1929 లో బీహారులో ఇచ్చారు. 1930 నాటికి అన్ని సంస్థానాలలో ఓటు హక్కు వచ్చింది. ఆస్తి, విద్య, పన్నుచెల్లింపు, సైనిక సంబంధం... మొదలైనవాటి ప్రాతిపదికగా ఓటుహక్కు పురుషునికి ఇచ్చారు. అదే అర్హత స్త్రీలకు కూడా ఉండాలన్నారు.

శాసన సభకు ఎన్నికయ్యే హక్కు: స్త్రీలకు శాసన సభలకు ఎన్నికయ్యే హక్కు లేకపోవడంతో ఆందోళన చేసారు. ఏ శాసనసభలయితే ఓటుహక్కు యిచ్చాయో అవే స్త్రీలకు శాసనసభల్లో సభ్యులుగా ఎన్నికయ్యే హక్కు ఇవ్వాలని, అధికారం పొందాలని అలజడి లేవదీసాయి. దానిమీద పార్లమెంటు చేసిన సవరణ వలన 1920 వాటికి స్త్రీలు కూడా శాసన సభకు ఎన్నికయ్యే హక్కు లభించింది.

1926వ సంవత్సరంలో జరిగిన ఎన్నికల్లో మద్రాసు రాష్ట్రంలో శ్రీమతి కమలాడ్వే చటోపాధ్యాయ, మిసెస్ ఏంజెల్ ప్రతినిధులుగా నిలబడ్డారు. ఇద్దరూ గెలవలేదు. అయితే కమలాదేవికి ప్రత్యర్థికి సుమారు 500 ఓట్లు మాత్రమే తేడావచ్చాయి, ఆమె ఎన్నికకి ప్రజలు సుముఖత చూపారని మాత్రం తెలుస్తుంది.

మరి కొంత ఆందోళన జరిగిన మీదట శ్రీమతి ముత్తు లక్ష్మిరెడ్డిని మద్రాసు ప్రభుత్వం శాసనసభకు సభ్యురాలిగా నామినేట్ చేసింది. దేశచరిత్రలో మొదటిసారి శాసన సభలో అడుగు పెట్టిన మహిళ.

వయోజన ఓటుహక్కు: ఓటర్ల జాబితాలో స్త్రీల సంఖ్య తక్కువ మద్రాసు రాష్ట్రంలో లో 10 మంది పురుషులకు ఒక్క మహిళకి వుంటే, అస్సాంలో 114 మందికి ఒక్క మహిళకి మాత్రమే వుంది. అంటే ఓటర్ల జాబితాలో స్త్రీల సంఖ్య తక్కువ. స్త్రీలకి విద్య, ఆస్తిలేక పోవడంవలన ఓటు హక్కు కూడా లేకుండా పోయింది. బ్రిటీష్ వారే కొన్ని నియోజక వర్గాలను కేటాయించడం లాంటివి చేసినా ప్రయోజనం లేకపోయింది. 1937 వ సంవత్సరంలో సరోజిని నాయుడు వయోజనులైన ప్రతివారికీ ఓటు హక్కు ఇవ్వాలనే తీర్మానం ప్రవేశపెట్టారు.

ఉమెన్స్ ఇండియన్ అసోసియేషన్ ఆల్ ఇండియా కాన్ఫరెన్సు, నేషనల్ ఆఫ్ ఇండియా ఫర్ ఉమెన్స్ వంటి మహిళ సంస్థలు వయోజన ఓటు హక్కును సమర్థిస్తూ తీర్మానాలు చేసి, ప్రదర్శనలు జరిపి ఆందోళన చేసాయి. ఇండియన్ నేషనల్ కాంగ్రెసు కూడా ఈ డిమాండును సమర్థించింది.

1935వ చట్ట ప్రకారం గవర్నమెంట్ ఆఫ్ ఇండియా అక్టు ప్రకారం వయోజన ఓటు హక్కు ప్రవేశపెట్టారు. 1937 నాటికి రాష్ట్రాలలో కాంగ్రెస్ ప్రభుత్వాలు ఏర్పడ్డాయి.

అనేక మంది మహిళలు సభ్యులుగా ఎన్నికయ్యారు. ఉత్తర ప్రదేశ్లో విజయ లక్ష్మీపండిట్ స్థానిక స్వపరిపాలన శాఖకు మంత్రిగా నియమింపబడ్డారు. ఆరోజుల్లోనే ఆమె "హశీ దీవఘ్ఘిఎవఘ వీఱఅఱర్వతీ' అనే పుస్తకం రాసారు. స్త్రీలకు వయోజన ఓటుహక్కు రావడంతో మహిళోద్యమంలో ఒక కొత్త ఆధ్యాయ మొదలయింది. స్వాతంత్రోద్యమం, సంఘ సంస్కరణోద్యమం కమ్యూనిస్టు ఉద్యమాలు స్త్రీల ఉద్యమానికి చక్కని వేదికలయ్యాయి. 1930 ఆర్థిక సంక్షోభంలో రెండవ ప్రపంచ యుద్ధకాలంలో

కిసాన సమ్మేళనంలో కమ్యూనిస్టు స్త్రీలు అసంఖ్యాకంగా ఉద్యమించారు.

మహిళా సంస్థలు :

1917వ సంవత్సరంలో ఉమెన్స్ ఇండియన్ అసోసియేషన్ - అనిబిసెంటు నాయకత్వంలో తొలి సంస్థని అరంభించారు. ఈ సంస్థ తరపునే వీరు 'స్త్రీధర్మ' అనే పత్రికను ప్రచురించేవారు. తర్వాత 1927 నాటికి 'అఖిల భారత మహిళా సమాఖ్య (AIWC) స్థాపించారు. ఇదే మొదటి ప్రజా సంస్థ. వీరు రోషనీ అనే పత్రికను నడిపేవారు. వీరు సాంఘిక దురాచారాలయిన పర్దా, బాల్య వివాహాలు, బహుభార్యాత్వం, ఇంకా స్త్రీల ఆస్తి హక్కు వంటి వాటిపై దృష్టి కేంద్రీకరించారు. ఈ హక్కులు సంపాదించడానికి రాజకీయ జోక్యం అవసరమయింది. మొదటి రౌండ్ టేబుల్ సమావేశానికి మహిళా ప్రతినిధులను ఆహ్వానించాలని డిమాండ్ చేసినా బ్రిటీష్ ప్రభుత్వం పట్టించుకోలేదు. రెండవ రౌండ్ టేబుల్ సమావేశానికి సరోజిని నాయుడు మహిళా ప్రతినిధి కాకున్నా మహిళల వినతి పత్రాన్ని ఇచ్చారు.

పార్లమెంటులో చర్చకు రానున్నుందున పార్లమెంటు జాయింటు సెలక్ట్ కమిటీకి అభిప్రాయాలు తెలిపేందుకు ముగ్గురు సభ్యుల ప్రతినిధివర్గానికి (A.I.W.C) పంపమన్నారు. అపుడు బేగమ్ హమీనఅరీ, రాజకుమారి, ముత్తులక్ష్మిరెడ్డి లండను వెళ్లి తమ అభిప్రాయాలు తెలిపారు. అక్కడ బ్రిటీష్ మహిళల సంఘశీ మహిళల అంతర్జాతీయ అలయన్స్ ప్రతినిధులను కలుసుకొన్న తరువాత ఐక్యరాజ్య సమితి నుంచిూ.×.ఔ.జ.కి అనధికార ప్రతిపత్తి సహాయ సహకారాలు లభించాయి. నేషనల్ కౌన్సిల్ ఆఫ్ వుమెన్ 1925లో స్థాపించబడి అంతర్జాతీయ సమాఖ్యకు అనుబంధంగా మారింది.

1930 ఉప్పు సత్యాగ్రహం నాటికి అనేక మహిళా సంఘాలు ఏర్పడ్డాయి.పౌర సహాయ నిరాకరణ ఉద్యమం నిమిత్తం బెంగాల్లో 'లేడీస్ పికెటింగ్ బోర్డు' జాతీయ నారీ సంఘం, రాష్ట్రీయ మహిళా సంఘం వంటివి అనేకం వచ్చాయి.

సుభాస్ చంద్రబోస్ ఆధ్యక్షతన స్థాపించిన ఫార్వర్డ్ బ్లాక్ ప్రభావంతో విద్యార్థుల 'అఖిల భారత విద్యార్థి సమాఖ్య (S.F.I) ఏర్పడింది. 1937-38 ల మధ్య అండమాన్ ఖైదీలను విడుదల చేయాలనే ఉద్యమించారు.

1940లో లక్నోలో అఖిల భారత విద్యార్థినుల సదస్సు నిర్వహించారు. సరోజిని ముఖ్య అతిధిగా రేణుకారాయ్ అధ్యక్షతన జరిగింది. మహిళా ఉద్యమానికి సంబంధించిన సమానత్వం, విడాకులు మొదలైన అనేక సమస్యలు చర్చించారు. దీని తర్వాత యూనివర్శిటీలలో అనేక విద్యా సంస్థలలో మహిళా సంఘాలు ఆరంభమయ్యాయి.

కమ్యూనిస్ట్ పార్టీ మహిళా విమోచన ఉద్యమం ముఖ్యమైనది. బెంగాల్ కార్మిక మహిళా సంఘం స్థానిక ప్రాంతీయ శాఖలలో ''అల్ ఇండియా ఉమెన్స్ కాన్ఫరెన్స్గా జాతీయ స్థాయిలో అవతరించింది. ఇది యునైటెడ్ నేషన్స్ సలహా సంప్రదింపులు జరపగల ప్రత్యక్ష గ్యాసంస్థ. నేషనల్ కౌన్సిల్ ఆఫ్ ఉమెన్, ది ఫెడరేషన్ ఆఫ్ యూనివర్శిటీ వుమెన్ 'మొదలయినవి ఏర్పడ్డాయి. 'ఆత్మరక్షణ సమితి' పేరుతో అనేక మహిళా సమితులు ఏర్పరిచారు. ఆలిండియా డెమోక్రటి ఉమెన్స్ అసోసియేషన్ (AIDWA), నేషనల్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియన్ ఉమెన్ పేర్కొనదగినవి.

ఈ ఉద్యమాలతో పాటు ఉమ్మడిఆంధ్రాలో స్త్రీల చైతన్యం, జాతీయోధ్య మం, తెలంగాణా ఉద్యమం, శ్రీకాకుళ పోరాటం,పెమినిస్టు మహిళా చైతన్యం, సారా ఉద్యమంతో పాటు, స్త్రీవాద ధోరణులు అనగా 1 ఉదారవాద స్త్రీవాదశీ 2 రాడికల్ స్త్రీవాదశీ 3 సోషలిస్ట్ స్త్రీవాదం, 4 మార్క్ స్ట్ స్త్రీవాదం, 5 పర్యావరణ స్త్రీవాదం 6 మానవతావాద స్త్రీవాదం. భారతదేశంలో సామాజికంగా వచ్చిన స్త్రీ చైతన్య ప్రభావం సహజంగా సాహిత్యంలో కనపడుతుంది. మనదేశంలో వివిధ భాషాసాహిత్యాలపై ఈ ప్రభావం స్పష్టంగా కనిపిస్తుంది.అందువల్ల స్త్రీ, పురుషులిరువురు స్త్రీవాద సాహిత్యాన్ని సృష్టించారు.ఎన్నో ఉద్యమాల ఫలితంగా స్త్రీలు తమ ఉనికిని చాటుకున్నారు.

పరిశీలన గ్రంథాలు

1. స్త్రీవాద కథలు స్త్రీల జీవిత చిత్రన - డాక్టర్ ఏ సీతారత్నం
2. స్త్రీ విముక్తి ఉద్యమాలు - ఫాతిమా
3. స్వాతంత్ర సమరంలో ఆంధ్ర మహిళల పాత్ర - మోటూరి ఉదయం

★★★

Vol. 23 | Spl. Issue 03 | March 2026 | BHAVAVEENA | ISSN No. : 2456-4702 | RNI No. APTEL/2003/12253

RNI No. APTEL/2003/12253 | Reffered Journal & Peer Reviewed Journals | ISSN No. 2456-4702

భావవీణ

కళలు, సాహిత్య సాంస్కృతిక భాషాధ్యయన పత్రిక

BHAVA VEENA

Journal of Arts, Literary, Culture & Language Study

క్రైస్తవ సాహిత్యం - బైబిల్ స్త్రీల పాత్రల పరిశీలన

- గంజి కుమార్ రాజు

తెలుగు విభాగం, పరిశోధక విద్యార్థి, యోగి వేమనవిశ్వవిద్యాలం, కడప.

వ్యాస సారాంశం :

ఆధునిక సాహిత్య ప్రక్రియ ధోరణులు ద్వార సాహిత్యం విస్తృతమైన స్థాయిలో ప్రజలకు దగ్గర అయింది.సాహిత్యం పరమ ప్రయోజనం మానవులకు వాస్తవాలను అందించుట, మానసిక ఉల్లాసం కలి గించుట, వారి ఆలోచన విధానాన్ని శాస్త్రీయ దృక్పథంతో వృద్ధి చేయుట ముఖ్యమైనది. సాహిత్యం వివిధ యుగాల్లో వివిధ పక్రియల రూపాల్లో తనదైన ముద్ర వేసుకున్నది. భారతీయ భౌగోళిక ఆధ్యాత్మిక పరిస్థితుల దృష్ట్యా ఆయా మత గ్రంథాలు ఆధారంగా చేసుకుని వాటి నైతికతను ప్రజలకు బోధించుటకు వారి ఆధ్యాత్మిక గురువులు ఆ గ్రంథాల్లోని సాహిత్య విలువలను పాటలు, కవిత్వం, నాటకం, భజనల రూపంలో వాటి ప్రాధాన్యత వివరిస్తున్నారు.

ఈ వ్యాసం ప్రధాన ఉద్దేశ్యం బైబిల్ ప్రపంచానికి చెబుతున్న సత్యాలను వెలికితీయడం, అవి మానవుల జీవితానికి ఏ విధంగా ఉపయోగపడతాయి, ప్రపంచ వ్యాప్తంగా అత్యధికంగా మానవాళిని ప్రభావితం చేస్తున్న బైబిల్ గొప్పదనాన్ని తెలియజెప్పడం, భారతదేశంలో క్రైస్తవ్యంప్రజలకు చేసిన సేవను ముందుకు తెచ్చుట ఈ పత్రం ఉద్దేశం. ప్రధానంగా ఈ వ్యాసానికి ఎంచుకున్న పాత్రలు రూతు హన్నా మరియు ఎస్తేరు నూతన నిబంధన గ్రంథంలో ఉన్న ఎలిజబెత్ యేసు తల్లి మరియ లాజరు అక్క మరియా వంటి స్త్రీలపాత్రలు పరిశీలించి వారియొక్కగుణ గణాలు ఔదార్యాన్నివర్తమాన సమాజంలో నివసిస్తున్న మహిళా లోకానికి వారి యొక్క త్యాగాన్ని అంకిత మనసునుఅలవరచుకొని సమాజానికి కుటుంబానికి సేవచేయలాగున ఉన్నతమైన స్థాయిలో వారు నివసించడానికి వీరి పాత్రలు ఎంతో దోహదం చేస్తాయని తెలపడం ఈ అంశం యొక్క లక్ష్యంగా నిర్ణయించుకున్నాం

కీలక పదాలు :

క్రైస్తవం, బైబిల్, వెలుగు, సాహిత్యం, పాత నిబంధన, ఆత్మ సంబంధమైన శారా విశ్వాసం నమ్మకం

పరిచయం :

బైబిల్ అనే ఆంగ్ల భాష పదానికి మూలం బిబ్లియో అనే గ్రీకు భాష నుంచి వచ్చింది. బిబ్లియో అనగా పుస్తకముల సమూహం. బైబిల్ లోని మొత్తం గ్రంథాలు 66. ఇవి రెండు భాగాలుగా విభజించబడి ఉన్నాయి. ఆదికాండం మొదలుకొని మలాకీ గ్రంథం వరకు 39 పుస్తకాలను పాత నిబంధన అని, మత్తయి సువార్త నుంచి ప్రకటన గ్రంథం వరకు 27 పుస్తకాల్ని నూతన నిబంధన గ్రంథం అని పిలుస్తారు.

భారతదేశంలో క్రైస్తవం క్రీ.శ.52వ సంవత్సరంలో క్రీస్తు

శిష్యుడు అయిన సెయింట్ తోమా కేరళ రాష్ట్రంలోని మలబారు తీరం చేరుకుని అక్కడ ఒక కేరళ బ్రాహ్మణినికి క్రీస్తు సువార్తను చెప్పి కొంత కాలానికి సంఘం స్థాపించారు. మలబారు తీరం మొదలుకుని తమిళనాడులో క్రీ. శ. 72 వరకు చెన్నై సమీపంలో సెయింట్ థామస్ మౌంట్ వద్ద క్రీస్తు సువార్త నిమిత్తం తోమా హతసాక్షి అయ్యాడు. నాటి నుండి తోమా బలిదానాన్ని జ్ఞాపకం చేసుకుంటూ జూలై 3 తేదీన సెయింట్ థామస్ డేగా, భారతీయ క్రైస్తవ దినోత్సవంగా చేస్తున్నారు.

భారతీయ సాంస్కృతిక వారసత్వ సంపదలో మన గుర్తింపు కాపాడుకుంటూ ఐక్యతను పెంపొందిస్తూ క్రీ.శ.52 అపొ. తోమా ద్వార భారతదేశానికి తీసుకొని రాబడిన ప్రభువైన ఏసుక్రీస్తు సువార్తను బట్టి సంతోషించడం భారతీయ క్రైస్తవ దినోత్సవం దర్శనం.

క్రైస్తవ్యం భారతదేశానికి అదే విధంగా ఈ ఆంధ్రప్రదేశ్ కు ఎంతో సేవ చేసింది. ఒకసారి చరిత్రను పరిశీలిస్తే ఈ వాస్తవాలను ఆవిష్కరిస్తుంది. ప్రధాన జీవన స్రవంతికి దూరంగా స్మశానానికి దగ్గరగా జీవనం సాగిస్తున్న ప్రజలను వర్ణ వ్యవస్థ ఈ దేశ మూలవాసులను అంటరాని వారిగా చిత్రించి కనీసం మనుషులుగా చూడకుండా అనేకమైన అవమానాలకు గురి చేస్తూ వెట్టి చాకిరీ చేయించుకుని పశువుల కంటే హీనంగా చూశారు. నిరాధారణకు గురైన అణగారిన జాతి ప్రజలను అక్కున చేర్చుకుని వారికి చదువు, వైద్యం అందించి సమాజంలో మనుషులందరూ సమానమేనని చెబుతూ మనుషులు ఉన్నతంగా అభివృద్ధి చెందాలంటే దానికి చదువు ఒక్కటే మార్గమని ఆ చదువు ద్వారానే సమాజంలోని వ్యవస్థలను ప్రశ్నించగలరని మార్పు తేగలగరని ప్రేరణ ఇచ్చింది.

విషయ విశ్లేషణ

సంఘంలోనూ? సమాజంలోనూ కుటుంబ నిర్వహణ లోనూ స్త్రీ యొక్క పాత్ర చాలా ప్రధానమైనది. బిడ్డకు తొలి గురువుగా, తండ్రికి కూతురుగా, భర్తకు చెలియగా, సోదరుడికి అక్కగా, వివిధ బాధ్యతలను ఎంతో ఓర్పుగా భరిస్తూ వివిధ స్థాయిల్లో తన కర్తవ్యాన్నినమ్మకంగా నిర్వహించిన వీరి పాత్రలను విశ్లేషణ చేయడం వల్ల వారి యొక్క గుణ గణాలను పాటకు ప్రజలకు అందించడం ఈ వ్యాసం లక్ష్యం

హవ్వ

మానవుడు ఒంటరిగా ఉండుట మంచిది కాదని పరిశుద్ధ బైబిల్ గ్రంధం చెప్పబడింది? దేవుని తన స్వరూపంలో తన పోలికలో ఆదాముకు సాటి అయిన సహాయం కావాలని ఆదాముకుగాఢనిద్ర కలుగజేసి అతని ప్రక్కటెముకఒకటి తీసుకుని స్త్రీగా నిర్మించాడు? అప్పుడు ఆదాముఇట్లనెను

నా యెముకలలో ఒక యెముకగా
నా మాంసంలో మాంసం

ఇది నరునిలో నుండి తీయబడెను గనుక నారి అనబడును అని పలుకుతాడు??ఆదికాండము రెండవ అధ్యాయం 16 ,17 వచనాలు ఆదాము హవ్వనుదేవుడు ఒకరినొకరు సహకారులుగా కలిసి జీవించి భూమిని నిందించి ఫలించి విస్తరించమని ఆశీర్వదిస్తే ఒకానొక దినమున అపవాది చేత మోసగించబడిన అవ్వ దేవుడు తినొద్దని చెప్పిన పండును తిని దేవుని యొక్క ఆజ్ఞ మీరడం చేశారు అప్పటినుంచి ఏదేను తోటలో నుంచి గెంటి వేయబడినారు ప్రియ సహోదరులారా ఇక్కడ ఒక విషయాన్ని నేర్చుకోవాలి స్త్రీలు స్వాభావికంగా మొదటి నుంచిబలహీనులు త్వరగా మోసపోతారు కాబట్టి అపవాది ముందుగా స్త్రీ అయిన హవ్వను పడేయడానికి ప్రయత్నించి వారిపైన విజయం సాధించాడు నేటి తరంలో కూడా ఎంతోమంది స్త్రీలు పలు రకాలుగా మోసపోతూ జీవితాలను మధ్యలోనే తనువు చాలిస్తున్నారు

శార

క్రైస్తవవిశ్వాసులకు తండ్రి అయిన అబ్రహాము భార్యశార?మనుషులకు అసాధ్యమనిఅనిపించినపని కూడా దేవునికి సాధ్యమే అని శారా జీవితం వారు దేవుడు నెరవేర్చాడు? ఆమె స్త్రీ తనము గర్భం ఉడికిపోయిన తర్వాత కూడా ఆమె అబ్రహామునకు తన వందేళ్ళ వయసులో ఒక బిడ్డను కనించింది

అప్పుడు శారా దేవుడు నాకు నవ్వు కలుగజేసెను వినువారెల్ల నా విషయమై నవ్వుదురనెను మరియు శారా

పిల్లలకు స్తన్యమిచ్చునని యెవరు అబ్రహాముతో చెప్పెను నేను అతని ముసలి తన ముందు కుమారుని కంటిని గదా అనెను అదికాండం.

నమ్మకం లేని చోట నమ్మకం కలిగించగలిగిన వాడు దేవుడు?ఆయన తగిన సమయం ముందు శారగర్భము తెరిచి వారి అవమానమునకు రెట్టింపు ఘనత అనుగ్రహించాడు? మన జీవితాల్లో కూడా దేవుడు తగిన సమయం ముందుహెచ్చిస్తాడు.

రూతు

రూతు అనే స్త్రీ పాత్ర నేటి సమాజానికి నేర్పిస్తున్న ఏమనగా పరిస్థితులు అన్నీ కూడా కృంగదీస్తున్న జీవితంలో గడ్డు కాలం నడుస్తున్న ఎట్టి పరిస్థితుల్లో కూడా అత్త కోడలు విడిచి పోకూడదని అత్తనే తన తల్లిగా భావించుకుని ఆమెతోనే చివరి వరకు ప్రయాణం చేస్తానని తీసుకున్న దృఢ నిశ్చయం ఎంతో గొప్పదని భావించవచ్చు. అందుకు రూతు నా వెంబడి రావద్దని నన్ను విడిచి పెట్టమనియు నన్ను బ్రతిమాలు కొనవద్దు నీవు వెళ్లి చోటికి నేను వచ్చెదను నీ జనమే నా జనము

మరణము తప్ప మరేదైనను నిన్ను నన్ను ప్రత్యేకించిన యెడల యెహోవా నాకు ఎంత కీడు అయినా చేయను గాక అనెను రూతు గ్రంథం1 వచనాలు ప్రస్తుత సమాజంలో విచ్ఛిన్నమవుతున్న కుటుంబ వ్యవస్థకు గల కారణాలు అనేకమైనవి ఉన్నాయని చెప్పవచ్చు? కానీ తన అత్త అయినా నయోమి నన్ను విడిచిపెట్టివెళ్లి వేరొక పెళ్ళి చేసుకోమని చెప్పినప్పుడు? ఆమె దానికి ఒప్పుకొనక చావైనా బ్రతకైనా నీతోనే అని? కరువులు శ్రమల్లో నయోమితోనే కలిసి జీవించినట్టుగా రూతు పాత్ర ద్వారా నేటి తరం స్త్రీలు చూసి ఎంతో నేర్చుకోవచ్చు

హన్నా

సమాజంలో ప్రతి ఆడబిడ్డకి మాతృత్వం అనేది చాలా తీయని అనుభూతి ప్రతి స్త్రీ తన కడుపు పండాలని అమ్మ అని పిలిపించుకోవాలని ఎంతో ఆశతో ఎదురు చూస్తుంది మన సమాజంలోనూ ఆనాటి సమాజంలో కూడా బిడ్డలు లేకపోవడం బిడ్డలను కనడం ఆలస్యం అయితే ఆ స్త్రీని సమాజంలోని మనుషులందరూ గొడ్రాలనిహేళన చేస్తూ వారి హృదయాలను నొప్పిస్తారు ఇలాంటి జీవితాన్ని ఎదుర్కొంటున్న స్త్రీలకు హన్నాజీవితం నుంచి ఎంతో ఆదరణ పొందుకుంటారు హన్నాతమ జీవితంలో ఎదుర్కొంటున్న సమస్య బిడ్డలు లేకపోవడం అటువంటి పరిస్థితులు ఆమె దేవుని మందిరమునకు పోయి మనో దుఃఖముతో విచారిస్తున్న సమయంలో ప్రవక్త అయిన ఏలియా ఏల నీవు చింతిస్తున్నావని విషయాన్నితెలిసుకుని ఆమెను ఓదార్చి మరునటి సంవత్సరం తిరిగే లోపు నీ కౌగిట బిడ్డను కలిగి ఉంటావని నువ్వు క్షేమంగా వెళ్ళమని చెబుతాడు ఇశ్రాయేలు దేవుడు నీవు చేసుకున్న మనవి దయ చేయునుహన్నా పాత్ర ద్వారా నేర్చుకోవలసిన విషయం ఏమనగా విశ్వాసం పట్టుదలతో కూడిన ప్రార్థనా జీవితం తాను నమ్మినటువంటి దేవుని వద్ద మొరపెట్టుకున్న నాటినుండిదుఃఖం మానివేసింది? దేవుడు ఆమెను జ్ఞాపకం చేసుకునిమగ బిడ్డను అనుగ్రహిస్తాడు

ఎస్తేరు

ఎస్తేరు యూదా జాతికి చెందినది తన చిన్నతనంలో తల్లిదండ్రులు చనిపోగా అతని పినతండ్రి సమక్షంలో పెరుగుతుంది హమాను యూదాజాతి ప్రజలను చంపాలని కుట్రలు చేసి రాజు చేత ఆజ్ఞ ఇప్పించగా ఆ విషయాన్ని తెలుసుకున్నఎస్తేరు తన స్వజాతీయులైన యూదులను కాపాడుకోవడం కోసం ఉపవాసం ఉండి ప్రార్థించి రాజు యొద్దకు వెళ్ళుటకు తగిన సమయం కోసం ఎదురు చూస్తుంది? ఆ సమయం రాగానే ఎస్తేరు రాజుకు నేను యూదురాలును? నా ప్రజలను చంపుటకు కుట్ర చేసిన హమాను ఇక్కడనే ఉన్నాడని చెపుతుంది

హమాను ఎవరినైతే చంపుటకు ఊరి కొయ్యలను సిద్ధంచేయించాడో అదే ఉరికొయ్యమీద హమాను ఉరితీయబడ్డాడు తిరిగి ఎస్తేరు రాజు ఆజ్ఞను మార్పించి తన యూదాజాతి ప్రజలను కాపాడుకున్నట్టుగా బైబిల్ నందు చూడవచ్చు

ముగింపు

మొత్తంగా ఈ వ్యాసంలో పరిశీలించినట్లయితే, క్రైస్తవ

సాహిత్యంలో ముఖ్యంగా బైబిల్‌లో స్త్రీల పాత్రలు అత్యంత ప్రాముఖ్యమైనవి, విభిన్నమైనవి మరియు ప్రేరణాత్మకమైనవి అని స్పష్టమవుతుంది. పాత నిబంధనలోని హవ్వ, శారా, రూతు, హన్నా, ఎస్తేరు వంటి పాత్రలు మరియు నూతన నిబంధనలోని ఎలిజబెత్, మరియ, లాజరు అక్క మరియా వంటి స్త్రీల జీవన గాథలు విశ్వాసం, అంకితభావం, సహనం, ధైర్యం, త్యాగం వంటి ఉన్నతమైన గుణాలను ప్రతిబింబిస్తున్నాయి.

హవ్వ కథ మనకు జాగ్రత్త మరియు అజ్ఞానుసరణ యొక్క అవసరాన్ని తెలియజేస్తే, శారా జీవితం దేవునిపై నమ్మకం ఎంత గొప్ప ఫలితాలను ఇస్తుందో బోధిస్తుంది. రూతు పాత్ర కుటుంబ బంధాల పట్ల నిబద్ధతను, హన్నా జీవితం ప్రార్థనలో పట్టుదలను, ఎస్తేరు ధైర్యం సమాజ రక్షణలో నాయకత్వాన్ని తెలియజేస్తాయి. అలాగే నూతన నిబంధన స్త్రీలు సేవాభావం, వినయం, విశ్వాసానికి ప్రతీకలుగా నిలుస్తారు.

ఈ పాత్రలన్నింటినీ సమగ్రంగా పరిశీలించినప్పుడు, బైబిల్ స్త్రీలను కేవలం కుటుంబ పరిమితుల్లో మాత్రమే కాకుండా ఆధ్యాత్మికంగా, సామాజికంగా, నైతికంగా సమాజ నిర్మాణంలో కీలక పాత్ర వహించినవారిగా చిత్రిస్తుంది. వీరి జీవితాలు నేటి మహిళలకు ఆదర్శ ప్రాయంగా నిలిచి, కుటుంబం మరియు సమాజంలో ఉన్నత స్థాయిలో జీవించడానికి మార్గదర్శకంగా ఉంటాయి.

అదే విధంగా, ఈ విశ్లేషణ ద్వారా బైబిల్‌లోని సత్యాలు మానవ జీవనానికి ప్రయోజనకరమైన మార్గాలను చూపుతున్నాయని, క్రైస్తవ సాహిత్యం మానవ విలువలను పెంపొందించడంలో ముఖ్యమైన పాత్ర పోషిస్తున్నదని నిరూపితమవుతుంది. ముఖ్యంగా భారతీయ సందర్భంలో క్రైస్తవం అందించిన విద్య, సమానత్వం, సేవా భావం వంటి విలువలు సమాజ అభివృద్ధికి దోహదపడ్డాయి.

అందువల్ల, బైబిల్ స్త్రీల పాత్రలు కేవలం ఆధ్యాత్మిక కథలుగా కాకుండా, సమాజాన్ని నిర్మించే శక్తిగా, నైతిక విలువలకు మూలాధారంగా, మరియు నేటి మహిళా లోకానికి ప్రేరణాత్మక మార్గదర్శకాలుగా భావించవచ్చు.

ఆధార గ్రంథాలు

1. పరిశుద్ధ గ్రంథం బైబిల్, ప్రచురణ బైబిల్ సొసైటీ అఫ్ ఇండియా, బెంగుళూరు.
2. డా. జోషి లీలన్ యం, క్రైస్తవ పునాది సత్యాలు, ప్రచురణ ఇండియా దియోలాజికాల్ సెమినార్, 2021, హైదరాబాద్.
3. బైబిల్ knowleddge కామెంటరి పాత నిబంధన వ్యాఖ్యానం, ప్రచురణ గుడ్ షెఫర్డ్ బుక్స్, 2022, సికింద్రాబాద్.
4. లైఫ్ వే తెలుగు స్టడీ బైబిల్, ప్రచురణ లైఫ్ వే పబ్లిషింగ్ ఇండియా ప్రై.లి, 2017.

★★★

Vol. 23 | Spl. Issue 03 | March 2026 | BHAVAVEENA | ISSN No. : 2456-4702 | RNI No. APTEL/2003/12253

RNI No. APTEL/2003/12253 | Reffered Journal & Peer Reviewed Journals | ISSN No. 2456-4702

భావవీణ

కళలు, సాహిత్య, సాంస్కృతిక భాషాధ్యయన పత్రిక

BHAVA VEENA

Journal of Arts, Literary, Culture & Language Study

మినీ కవిత్వం - మహిళా చైతన్యం

- డా॥. తన్నీరు సురేశ్

సహాయ ఆచార్యులు (తెలుగు), ప్రభుత్వ డిగ్రీ & పీ.జీ. కళాశాల, లక్షెట్టిపేట, జిల్లా : మంచిర్యాల, తెలంగాణ.

వ్యాస సంగ్రహం :

మినీ కవిత్వం పరిచయం, స్త్రీవాదం పరిచయం స్త్రీవాద చైతన్యాన్ని పరిశీలించడం ఇందులో ప్రధాన విషయం. మినీకవిత్వం స్త్రీకి సంబంధించిన అనేక విషయాలను కవితాత్మకంగా, సందేశాత్మకంగా వ్యక్తం చేసింది. స్త్రీ తరాలుగా అనుభవించిన వేదన, వివక్ష, స్త్రీవాద చైతన్యంతో కలిగిన స్పృహను మినీకవులు గొప్పగా అభివ్యక్తం చేశారు.

కీలక పదాలు :

మినీ కవిత్వం, స్త్రీవాదం, స్త్రీ అస్తిత్వం , చైతన్యం, వివక్ష, ఆశావాదం ఆశయ సాధనలు, మినీకవులు.

పరిచయం :

మినీ కవిత అనే పేరులో రెండు భాషల పదాలు ఉన్నాయి. మినీ అనే ఇంగ్లీష్ భాషా పదం కవిత్వం అనే తెలుగు బాషా పదం. మినీకవిత అంటే చిన్నకవిత అని అర్థం. మేనీకవిత్వం 1970 సామ్.లో ప్రారంభ,అయినా ఎక్కువగా రాయబడింది 1975-85 సం. ల కాలం. ఆరోజుల్లో మినీకవిత్వానికి ఈ పేరును పెట్టినది ఆంధ్రజ్యోతి సంపాదకులు పురాణం సుబ్రమణ్య శర్మ ఆధునిక తెలుగు కవిత్వంలో సంక్షిప్తతను ప్రధాన లక్షణంగా తీసుకోని వెలువడింది మినీకవిత. మినీకవిత ప్రేరణతో తరువాతి కాలంలో అనేక లఘుకవితా రూపాలు కాలాన్ని బట్టి తెలుగు కవిత్వంలో వచ్చాయి. హైకూ , నానీ రుబాయీలు, రెక్కలు, చిటికెలు మొదలైనవి వాటిల్లో ముఖ్యమైనవి. మినీ కవితలో మహిళా చైతన్యాన్ని సమీక్షించడంఈ పరిశోధన పత్రం ఉద్దేశ్యం.

విషయ వివరణ :

స్త్రీ విద్యావతి కాకూడదు, అందంగా అలంకరించు కోకూడదు, పురుషునికి సేవలు చేసే వనరుగా మాత్రమే బ్రతకాలి అనేది పురుషాధిక్య సమాజం. ఈ విధానాన్ని బ్రేక్ చేసి స్త్రీకి స్వాతంత్ర్యం కావాలి, స్త్రీ విద్యావతి కావాలి, ఆర్థిక హక్కులు కావాలి అని ధిక్కార రూపంలో వినిపించిన గొంతుక స్త్రీవాదం. మినీకవితలో స్త్రీవాద చైతన్యం గురించి చెప్పిన మంచి కవితలు ఎన్నో ఉన్నాయి.

'ఆడదానిలా ఎందుకేడుస్తావు?' అనే మాట వాడుకలో ఉంటుంది ఏడవటం అనేది స్త్రీకి ప్రతి కాలంలోనూ తప్పనిస్థితి ఆ మాట అందులోనుండి వచ్చిందే. స్త్రీ దుఃఖాన్ని ఈ సమాజం ఎప్పుడూ అర్థం చేసుకోలేదు. ఆమెకి వివక్ష, వేదన, బానిసత్వం మాత్రమే మిగిలింది. ఇదే విషయాన్నీ ఈ మినీకవితలో చూడవచ్చు.'

"అవనితో పోలుస్తారు- ఆడదాన్ని
ఎందుకంటే- భూమ్మీద మూడొంతుల నీరు-
కొందరి ఆడ బతుకుల్లోనూ"

(వారణాసి వెంకటేశ్వర్లు)

స్త్రీకి స్వాతంత్ర్యం లేదు పురుషుడిపై ఆధారపడి పరాన్నజీవిలా బ్రతకాలి, స్త్రీ ఒక బానిస అనే పురుషాధిక్య సమాజ వాదానికి ఒక సూత్రంలా ''తల్లిదండ్రులకు బాల్యంలో/ జీవిత భాగస్వామికి /యవ్వనంలో/సంతానానికి వృద్ధాప్యంలో'' (అచ్చుల) మినీకవిత వ్యంగాత్మకంగా కనిపిస్తుంది. ఇంటిపనులన్నీ స్త్రీ మాత్రమే చెయ్యాలి అనేది కుటుంబ వ్యవస్థలో ఏర్పడిన ఒక దుస్సాంప్రదాయం. స్త్రీ ఇంటి బాధ్యతలో భాగస్వామ్యం వహించే కర్తగా కాకుండా కేవలం ఇంటి పనులు చేసే బానిసలా మారింది. ఇదే విషయాన్ని తరిగొప్పుల మూర్తి స్త్రీ కవితలో ఇలా వ్యక్తీకరించారు ''వేడిని సహిస్తూ/ వత్తిని మోస్తూ/ వెలుగునిస్తుంది- ప్రమిద/ వేదనలు భరిస్తూ/ బాధ్యతలు నిర్వర్తిస్తూ / అభిమానం పంచుతుంది - ప్రమిద'' ఇందులో స్త్రీని దీపంతో పోల్చడం జరిగింది. వేడి, వెలుగు పంచడం అనే స్వభావాలు దీపానికి స్త్రీకి సమానంగా ఉంటాయి.

స్త్రీలలో వేశ్యావృత్తిలో ఉన్నవారి పరిస్థితి మరీ దారుణం. పేదరికం వలన శరీరాన్ని అమ్ముకొని జీవిస్తుంటే ఆమెను ఆదుకోవాల్సిన సమాజం ఆ విషయం విస్మరించి ఆమెను వ్యాపార వస్తువుగా, అనందం దొరికే వస్తువుగా చూడటం ఒక విషపూరిత స్వార్థ సస్కృతి. ఆమె శరీరానికి తప్ప, ఆమె జీవితానికి విలువ ఇవ్వక పోవడం స్త్రీకి జరుగుతున్నా మరో అన్యాయం. వేశ్య మినీకవితలో అలిశెట్టి ప్రభాకర్ ఇలా చెప్తారు.

''తను శవమై- ఒకరికి వశమై
తనువు పుండై- ఒకడికి పండై
ఎప్పుడూ ఎడారై- ఎందరికో ఒయాసిస్సై ''

స్త్రీని శారీరకముగా ఆనందించి చివరికి హీనంగా చూసే సంస్కృతికి పరాకాష్ట ఈ కవిత. ''కడుపు దహించుకుపోయే పడుపుకత్తె రాక్షసరతిలో, అర్ధ నిమీళిత నేత్రాల భయంకర బాధల పాటల పల్లవి'' అనే శ్రీశ్రీ కవిత్వాన్ని అలిశెట్టి ప్రభాకర్ రాసిన పై మినీకవిత్వం గుర్తు చేస్తోంది.

స్త్రీ జీవితానికి సంబంధించి ఆమెను మరింత గాయపరిచే అంశం కట్నం. పెళ్లి కావాలంటే స్త్రీ నుండి కట్నం వసూలు చేయడం మహిళలకు మింగుడు పడని విషయం '' కళ్యాణం తలపుల- కాకర పువ్వొత్తులు/ అలా తాకగానే- ఉత్సాహంతో ఎగిసిన/ ఆ హృదయం- అంతలోనే ఉస్సురంది / కట్నం కోరలు చాచిన- చీకటి రక్కసిని / చూసి కాబోలు '' అంటూ వసుధ బసవేశ్వరరావు కట్నం విషయంలో పేద, మధ్యతరగతికి చెందిన స్త్రీలు ఎలా భయపడుతారో తెలుపుతుంది. కట్నం ఇచ్చుకోలేక ఆఆత్మహత్యలకు గురయ్యే స్త్రీలు వారి కుటుంబ సభ్యులను కాళిదాసు రాసిన మినీకవిత ద్వారా గుర్తు చేసుకోవచ్చు.

''పీటిల్లో- ప్రవహిస్తున్నది
నీరు కాదు కన్న కూతుళ్ళ
కట్నాల కానుకలకై- తల్లిదండ్రులు
కార్చే కన్నీళ్లు''

స్త్రీ గర్భం దాల్చగానే మగబిడ్డ కాదని తెలిస్తే నిర్దాక్షిణ్యంగా పిండాన్ని చంపేసే భ్రూణహత్యలను గురించి చెప్పే కవిత-

''కొడుకో -కూతురో
తెలుసుకోవడానికి కాడు
అవునో కాదో - తేల్చు కోవడానికి'' (అశోక్ కుమార్)

ఈ భ్రూణ హత్యలతో నష్టపోయేది కూడా పురుష సమాజమే అనే విషయాన్ని కూడా ప్రజలు మరచిపోతున్నారు. సృష్టికి కారణమయ్యే స్త్రీని నిరోధించడం అంటే సృష్టిని నిరోధించినట్టే కదా!

అందుకే -

''ఓ స్కానింగ్ యంత్రమా - ఎంత పనిచేసావు
నేటి తరానికి పెళ్లి కూతుళ్లు లేకుండా చేసావు'' అంటాడు స్వర్ణ దుర్గాప్రసాద్ ఒక మినీకవితలో.

స్త్రీ తలవంచుకొని ఉండాలని చెప్పడం తాళి కట్టడంతోనే మొదలవుతుందని అది స్వేచ్చా నిరోధక అస్త్రమని చెప్పే కవిత- ''తాడు అదే తాడు అధికారంతో పేనిందే / తెంచుకోవాలని చూస్తే పశువు ఉంచుకోవాలని చూస్తే స్త్రీ'' (క్రాంతి మిత్ర) పెళ్లి కాగానే ఆమె విలువ ఎలా మారుతుందో దశల వారీగా తెలిపే మినీకవిత 'ఇదీ వరుస' శీర్షికతో ఉంది చూడండి

''పెళ్ళికి ముందు ఆమె వెనుక అతను
గంపెడాశలతో పెళ్లినాడు అతనూ, ఆమె ప్రక్కప్రక్కనే

పెళ్ళైనాక అతని వెనుక ఆమె పిల్లా జెల్లలతో''
(వసుధ బసవేశ్వరరావు)

ఇలా పెళ్లి ముందు నుండి పెళ్లయి పిల్లలు పుట్టే సరికి ఎలా స్త్రీ పురుషుడి ఆధిపత్యం కిందకు వెళుతుందో దశలవారీగా ఆమె ప్రాధాన్యం కోల్పోవడం ఇందులో వర్ణించడం గమనించవచ్చు.

పురాణాల్లో, ఇతిహాసాల్లో,చరిత్రలోనూ స్త్రీని గౌరవించిన దాఖలాలు లేవు.

''శ్రీరాముడు సీతను అడవులకు పంపెను
శ్రీకృష్ణునికి పదహారు వేల మంది గోపికలు
ధర్మరాజు ద్రౌపదిని జూదములోఓడెను
సత్యహరిశ్చంద్రుడు భార్యను అమ్మివేసెను
భార్యను కష్టపెట్టనివాడు
పురాణ పురుషుడు కాదేమో!'' వీరగంధం వెంకట అప్పారావు రాసిన ఈ కవితలో పురాణాల కాలంనుండి స్త్రీకి జరిగిన అన్యాయం చెప్పబడింది.

పురుషాధిక్య సమాజం ఏర్పరిచిన సిద్ధాంతాలను ప్రశ్నించి నియమాలను ధిక్కరించి సంకెళ్లను ఛేదించి ఆధునిక కాలం స్త్రీ అభివృద్ధిని మార్గాన ప్రయాణించింది. తనకు స్వేచ్ఛగా బ్రతికే హక్కుతో పాటు తన ఆశయాలను నిర్ణయించుకొని సాధించుకునే చైతన్యాన్ని స్త్రీ పొందింది. కాలం పరంగా స్త్రీ మార్పు పొందిన పరిణామాన్ని రావి రంగారావు ఒక మినీకవితలో ఇలా వర్ణిస్తారు.

''దీపంలో మా తాతగారికి
దిగంబర సుందరి కనిపించింది
మా నాన్న గారికి పీడిత అభాగిని అగుపించింది
ఈ రోజు నాకు కళ్ళురిమే ఆదిశక్తి దర్శనమిస్తోంది
రేపు నా మనవడికి
పాలిస్తూ కన్నతల్లి ప్రత్యక్షం కావాలి.''

ఎంత బాగుంది ఈ మినీకవిత. ఇందులో ఆయా తరాలకు చెందిన పురుషులు చూసే స్త్రీకి సంబంధించిన దృష్టికోణం కనిపిస్తుంది. నిజంగా ఈనాటి కాలంలో స్త్రీవాదంలో ప్రస్తావితమవుతున్న అనేక విషయాలు సఫలమయి పురుషాధిక్య సమాజం స్థానంలో సమసమాజ భావన పెరిగి స్త్రీకి తగిన విలువ ఏర్పడితే స్త్రీ పోరాటం ముగిసినట్లే. అది జరిగిన రోజు స్త్రీ అనురాగమూర్తిగా ప్రేమను మమకారాలను పంచె కేంద్ర బిందువు అవుతుంది.

స్త్రీని పోరాట పంథా వైపు నడిచి హక్కులు సాధించుకోమని చెప్పే కవిత యాదగిరి రాసిన 'మహిళల్లారా !'

''ఇల్లు అనే లాకప్ గదిలో
భర్త అనే పోలీసు భార్యను ముద్దాయిని చేసి
సంప్రదాయాలిచ్చిన
అధికారాన్ని ఝులిపిస్తుంటే సూర్యుళ్లను గుండెల్లోకి పిలిచి
ధిక్కార గీతాన్ని విత్తండి''

ముగింపు :

ఇలా మినీకవిత్వంలో స్త్రీవాదానికి సంబంధించిన విషయాలు తరాలుగా స్త్రీ అనుభవిస్తున్న స్థితి, నష్టపోతున్న పరిస్థితులు స్వాతంత్ర్యం రావలసిన ఆవశ్యకత అందు కోసం చేయవలసిన పోరాటం పోరాటం అనంతరం స్త్రీకి లభించిన స్వేచ్ఛా సమానత్వం కవితాత్మకంగా సందేశాత్మకంగా చెప్పబడింది. పేరుకు చిన్నకవితాలే అయినా అన్ని రకాల సాహిత్య ధోరణులను మినీకవిత్వం బలంగా వ్యాప్తి చేయగలిగింది. అందులో భాగంగానే స్త్రీ చైతన్యాన్ని మినీకవిత్వం సమర్థంగా వ్యక్తీకరించింది.

ఉపయుక్త గ్రంథ సూచి :

1. మినీకవిత 2006 - డా.రావి రంగారావు (సం), 2007, సాహితీ మిత్రులు, మచిలీపట్నం.
2. వామన కవితలు - బత్తుల వీర వెంకట అప్పారావు, 2003,సాహితీ మిత్రులు, మచిలీపట్నం.
3. వెయ్యి నూట పదహార్లు- డా. రావి రంగారావు 2006, సాహితీ మిత్రులు, మచిలీపట్నం.
4. రామారావు ఎస్. వీ.- తెలుగులో సాహిత్య విమర్శ ,2007, పసిడి , హైదరాబాద్.
5. శరత్ జ్యోత్స్నా రాణి ఎస్.- స్వాతంత్ర్యానంతర తెలుగు కవిత, వస్తువు, రూపం,శిల్పం, 2003 జ్యోత్స్న కళాపీఠం, హైదరాబాద్

★

Vol. 23 | Spl. Issue 03 | March 2026 | BHAVAVEENA | ISSN No. : 2456-4702 | RNI No. APTEL/2003/12253

RNI No. APTEL/2003/12253 | Reffered Journal & Peer Reviewed Journals | ISSN No. 2456-4702

భావవీణ

కళలు, సాహిత్య, సాంస్కృతిక భాషాధ్యయన పత్రిక

BHAVA VEENA

Journal of Arts, Literary, Culture & Language Study

'నల్ల పొద్దు'లో దళిత బహుజనుల మహిళల అసాధారణ ప్రస్థానం

- ఎర్రోళ్ల ఆంజనేయులు

రీసెర్చ్ స్కాలర్ (యుజిసి ఫెలో), తెలుగు శాఖ, యూనివర్సిటీ ఆఫ్ హైదరాబాద్, హైదరాబాద్.

వ్యాస సారాంశం:

తెలుగు సాహిత్య చరిత్రలో కొన్ని శతాబ్దాల పాటు అణిచివేతకు గురైన గొంతుకలు, తమ అస్తిత్వాన్ని ఘనంగా చాటుకున్న చారిత్రక సందర్భం ఈ 'నల్ల పొద్దు' సాహిత్య సంకలనం. 1980వ దశకంలో వెల్లువెత్తిన అస్తిత్వ ఉద్యమాల స్ఫూర్తితో, 21వ శతాబ్దపు ఆరంభంలో వెలువడిన ఈ సంకలనం దళిత స్త్రీల బహుముఖీన అణచివేతను ప్రపంచానికి పరిచయం చేసింది. సాధారణ స్త్రీవాద సాహిత్యం కేవలం పితృస్వామ్యాన్ని, దళిత సాహిత్యం కేవలం కుల వివక్షను ప్రధానంగా ప్రశ్నిస్తే ఈ 'నల్ల పొద్దు'లోని రచనలు మాత్రం కులం, పితృస్వామ్యం, వర్గం, మతం మరియు ప్రాంతీయ వివక్షల సంక్లిష్టతలో నలిగిపోతున్న దళిత స్త్రీ వాస్తవ జీవితాన్ని అత్యంత నిర్దిష్టంగా ఆవిష్కరించాయి. ఆది ఆంధ్ర ఉద్యమకాలం నుండి నేటి ఆత్మగౌరవ పోరాటాల వరకు, తాడి నాగమ్మ, జాలమంగమ్మ వంటి తొలితరం పోరాట యోధుల నుండి నేటి రచయిత్రుల వరకు సాగిన ఈ ప్రయాణం కేవలం అక్షర సృజన మాత్రమే కాదు, ఇది ఒక రాజకీయ చైతన్యం. మిషనరీ విద్య, అంబేద్కర్-పూలేల తాత్వికత, మరియు కారంచేడు, చుండూరు వంటి ఉద్యమాల నేపథ్యం దళిత స్త్రీ తనను తాను నిర్వచించుకోవడానికి పునాదులు వేశాయి. ప్రధాన స్రవంతి సాహిత్యం మరుగున పరిచిన మౌఖిక సంప్రదాయాలను, అముద్రిత అనుభవాలను అక్కున చేర్చుకుంటూ, వీరాధివత్య సాహిత్య కొలమానాలను సవాల్ చేస్తూ రూపొందిన ఈ సంకలనం, దళిత బహుజన స్త్రీల సాహిత్య విముక్తి పోరాటంలో ఒక మలుపురాయిగా నిలిచింది. నల్ల పొద్దులోని దళిత బహుజన స్త్రీల జీవిత రచనల దృక్పథాలను తెలియ జేస్తూ, తెలుగు సాహిత్య మరియు సామాజిక చరిత్రలో విస్మరించబడిన దళిత బహుజన మహిళల అసాధారణ ప్రస్థానాన్ని ఈ వ్యాసం విశ్లేషిస్తుంది. అక్షరం ముక్క రాని కాలం నుండి అంతర్జాతీయ వేదికలపై గళమెత్తే వరకు సాగిన ఈ ప్రయాణంలో విద్య, రాజకీయం, సాహిత్యం మరియు సామాజిక సంస్కరణ అనే నాలుగు స్తంభాలపై దళిత అస్తిత్వ సౌధాన్ని వీరు ఎలా నిర్మించారో ఈ వ్యాసం చర్చిస్తుంది. కుల వివక్ష, పితృస్వామ్యం మరియు మతపరమైన అంక్షలను ధిక్కరించి, తమదైన 'దళిత స్త్రీవాద దృక్పథాన్ని' (Dalit Feminist Perspective) ఆవిష్కరించిన వైనాన్ని ఇక్కడ చూడవచ్చు. కేవలం బాధితులుగా కాకుండా, సమాజ గమనాన్ని మార్చిన 'కర్తలు'గా (Agents of Change) ఈ మహిళల పాత్రను ఈ వ్యాసం పునరుద్ఘాటిస్తుంది.

కీలక పదాలు :

నల్ల పొద్దు, దళిత స్త్రీవాద దృక్పథం, బహుజన

చైతన్యం, ద్వంద్వ అణిచివేత, అస్తిత్వ సాహిత్యం, రాజకీయ సాధికారత, శ్రమ సంస్కృతి, చారిత్రక విస్మరణ,.

చారిత్రక పరిణామక్రమంలో మాతృస్వామ్య వ్యవస్థ నుంచి పితృస్వామ్యానికి జరిగిన మార్పు కేవలం లింగ వివక్షకే పరిమితం కాలేదు, అది అట్టడుగు వర్గాల స్త్రీలపై 'రెట్టింపు అణచివేత'కు (Double Oppression) దారితీసింది. ఆదిమ సమాజంలో ఉత్పత్తిలో భాగ స్వామిగా, సృష్టికర్తగా గౌరవం పొందిన స్త్రీ, పితృస్వామ్య భావజాలం బలపడిన వేదకాలం నాటికి 'అబల'గా మార్చబడింది. అయితే, దళిత బహుజన దృక్పథం నుండి చూస్తే, ఈ అణచివేతలో కుల వ్యవస్థ కీలక పాత్ర పోషించింది. ఉన్నత వర్ణాల స్త్రీలకు లభించిన కనీస రక్షణ కూడా దళిత బహుజన స్త్రీలకు లభించలేదు. వీరు అటు పితృస్వామ్యంలోని ఆధిపత్యాన్ని, ఇటు వర్ణ వ్యవస్థలోని దోపిడీని ఏకకాలంలో అనుభవించారు. సాహిత్యంలో సైతం ప్రబంధ యుగపు కవులు స్త్రీని భోగవస్తువుగా చిత్రించినప్పుడు, అందులో శ్రమజీవులైన బహుజన స్త్రీల వాస్తవ జీవితాలు మరుగున పడిపోయాయి. ఆధునిక కాలంలో స్త్రీవాద ఉద్యమం కేవలం 'స్త్రీ-పురుష' సమానత్వం గురించి మాత్రమే కాక, సామాజిక అస్తిత్వం గురించి కూడా గొంతు విప్పింది. ముఖ్యంగా దళిత స్త్రీవాదం, ప్రధాన స్రవంతి స్త్రీవాదంలోని పరిమితులను ప్రశ్నిస్తూ ఉద్భవించింది. ఎవరో వచ్చి తమ విముక్తి కోసం పోరాడతారన్న భ్రమలను వీడి, 'మా అస్తిత్వం మాదే - మా గొంతుక మాదే' అని ప్రకటించడం ఒక చారిత్రక మలుపు. విద్యా, ఉద్యోగ రంగాల్లో రిజర్వేషన్ల సాధన ద్వారా ఆర్థిక స్వతంత్రతను పొందడం, రాజ్యాంగబద్ధమైన హక్కుల కోసం పోరాడటం ఇందులో ప్రధానాంశాలు. చైనా విప్లవ స్ఫూర్తితో గానీ, అంబేద్కరిజం అందించిన చైతన్యంతో గానీ, దళిత బహుజన స్త్రీలు నేడు సాహిత్యాన్ని ఒక రాజకీయ ఆయుధంగా మలుచు కున్నారు. పితృస్వామ్య సామాజిక నిర్మాణాలను కూల్చి వేస్తూ, సర్వ మానవతావాదమే లక్ష్యంగా సాగుతున్న ఈ పోరాటం నిరంతర చైతన్యంతోనే సాధ్యమని స్త్రీ వాద సాహిత్యం వస్తుంది.

ఫిలిప్ బి. జ్ఞానరత్నమ్మ (1890-1960) :

జ్ఞానరత్నమ్మ గారు కేవలం ఒక భక్తి కవయిత్రి మాత్రమే కాదు. అణగారిన వర్గాల నుండి వచ్చిన ఒక విద్యావంతురాలు, గొప్ప సంస్కర్త. 1890 మే 7న దాచేపల్లిలో ప్రముఖ కవి రెవరెండ్ బేతాళ జాన్ దంపతులకు జన్మించిన ఆమె, నాటి సామాజిక వివక్షలను అధిగమించి చదువులో రాణించడం విశేషం. తల్లి అనారోగ్యం, కుటుంబ కష్టాలను తట్టుకుంటూ మచిలీ పట్నం, మద్రాసు వంటి నగరాల్లో స్కూల్ ఫైనల్ వరకు చదివి, 1914 నాటికే సెకండరీ గ్రేడ్ టీచర్ శిక్షణ పూర్తి చేయడం బహుజన స్త్రీ సాధికారతకు ఒక తొలిమెట్టు. రెవరెండ్ ఫిలిప్ బెంజమిన్ పాల్‌ను వివాహం చేసుకున్న ఆమె, అటు టీచరుగా సేవలందిస్తూనే ఇటు లూథరన్ క్రైస్తవ స్త్రీల సామాజికాభివృద్ధికి నిరంతరం కృషి చేశారు. తన తండ్రి నుండి వారసత్వంగా అబ్బిన రచనా పాటవంతో, సంప్రదాయ వర్గాల ఆధిపత్యం ఉన్న సాహిత్య రంగంలో తనకంటూ ఒక ప్రత్యేక స్థానాన్ని నిర్మించుకున్నారు. 1921లో ఆమె చేసిన ఆంగ్ల గేయ స్వేచ్ఛానువాదం 'వైల్ ఫైటింగ్ ఫర్ మై సేవియర్ హియర్' బహుజన క్రైస్తవ సమాజంలో ఒక విప్లవాత్మక గీతంగా నిలిచిపోయింది. ప్రకృతిని దైవత్వంతో ముడిపెడుతూ ఆమె రాసిన 'అరుణోదయ ప్రార్థన', 'మంగళ గీతం' వంటివి దళిత బహుజన తాత్వికతను ప్రతిబింబిస్తాయి. 1960 నవంబర్ 9న మరణించే వరకు సాహిత్య కృషిని కొనసాగించిన ఆమెను, తెలుగు క్రైస్తవ కవయిత్రులలో అగ్రగామిగా, బహుజన సాహిత్య స్ఫూర్తిగా గుర్తించవచ్చు.

వేశపోగు గుల్బానమ్మ (1905-1971):

తెలంగాణ గడ్డపై దళిత బహుజన విద్యా, సాంస్కృతిక చైతన్యానికి ప్రతీకగా నిలిచిన వేశపోగు గుల్బానమ్మ అణగారిన వర్గాల నుండి విదేశీ విద్యనభ్యసించిన తొలి తరం మేధావి. మాల కులంలో జన్మించి, సామాజిక వివక్షలను ఛేదిస్తూ 1937లోనే అమెరికాలో ఎం.ఏ పట్టా పొందిన మొదటి దళిత క్రైస్తవ మహిళగా ఆమె చరిత్ర సృష్టించారు. పురుషాధిక్యత కలిగిన మత వ్యవస్థలో స్త్రీలు వేదికనెక్కి ప్రసంగించకూడదనే ఆంక్షలున్న కాలంలోనే

తన మేధస్సుతో పాస్టర్‌గా బాధ్యతలు నిర్వహించి పితృస్వామ్య కట్టుబాట్లను సవాలు చేశారు. 'సమర్పణ గీత రచయిత్రి'గా ప్రసిద్ధి చెందిన గుల్బానమ్మ తన కీర్తనల ద్వారా కేవలం భక్తినే గాక అనాటి సామాజిక, రాజకీయ పరిస్థితులకు అనుగుణమైన ఆత్మగౌరవ భావజాలాన్ని ప్రకటించారు. జనగాం ప్రెస్టన్ ఇన్‌స్టిట్యూట్ ప్రధానోపాధ్యాయినిగా, సొంత ఆంగ్ల మాధ్యమ పాఠశాల నిర్వాహకురాలిగా ఆమె చేసిన కృషి బహుజన విద్యార్థుల ఉద్ధరణకు పునాదులు వేసింది. తన జీవితాన్ని, మేధస్సును సమాజానికి అంకితం చేసిన గుల్బానమ్మ దళిత స్త్రీవాద మరియు సాహిత్య చరిత్రలో ఒక ధ్రువతారగా నిలిచిపోయారు. సంపూర్ణ సమర్పణము కీర్తనలో ఆమె వాడిన "సజ్జీవనము" (ఉన్నతమైన జీవనం) మరియు "శుభప్రదములగు శక్తులు" అనే పదాలు, కేవలం పరలోక భక్తి కోసమే కాకుండా, ఈ లోకంలో అణగారిన వర్గాల అభ్యున్నతికి అవసరమైన శక్తిని, జ్ఞానాన్ని కోరుకున్నట్లుగా మనం అర్థం చేసుకోవచ్చు.

తాడి నాగమ్మ (1908)

గోదావరి తీరాన బౌద్ధ చారిత్రక వైభవం గల మోరిపాలం అనే నిరుపేద మాలపల్లిలో జన్మించిన తాడి నాగమ్మ అణచివేతను అక్షరాయుధంతో ఎదిరించిన అసాధారణ బహుజన విద్యావేత్త. నాటి సనాతన కుల వివక్ష కారణంగా పాఠశాల దరిదాపులకు వెళ్లలేని స్థితిని, అధికారిక రికార్డుల్లో తన పేరును 'నాగి' అని హీనంగా రాసిన అవమానకర పరిస్థితులను ఆమె తన పట్టుదలతో అధిగమించారు. రాజమండ్రిలో శిక్షణ పూర్తి చేసుకుని రాజోలు తాలూకాలోనే తొలి దళిత ఉపాధ్యాయినిగా బాధ్యతలు చేపట్టిన నాగమ్మ, బోయి భీమన్న వంటి మహనీయులతో కలిసి పనిచేశారు. 'లేబర్ స్కూల్స్' ద్వారా అణగారిన వర్గాల పిల్లలకు అక్షర జ్ఞానాన్ని పంచడమే కాకుండా, తన ముగ్గురు పిల్లలను డాక్టర్, ఇంజనీర్, గ్రాడ్యుయేట్లుగా తీర్చిదిద్ది దళిత కుటుంబాలకు విద్యా సాధికారతే అనలైన ఆత్మగౌరవమని ఆచరణలో నిరూపించారు.

సాంఘిక సంస్కర్తగా నాగమ్మ పాత్ర విస్మరించలేనిది. గ్రామంలో మహిళా మండలిని స్థాపించి, మంత్రసానుల ద్వారా ప్రసూతి సౌకర్యాలు కల్పించడం, పేదవారికి ప్రాథమిక వైద్యం అందించడం వంటి సామాజిక సేవా కార్యక్రమాల ద్వారా ఆమె బహుజన మహిళా నాయకత్వానికి ప్రతీకగా నిలిచారు. రచయిత్రిగా ఆమె కథల్లో అస్పృశ్యతా నిర్మూలన, జాతీయత మరియు సామాజిక చైతన్యం ప్రధాన వస్తువులుగా కనిపిస్తాయి. 1939లో 'గృహలక్ష్మి' పత్రికలో ప్రచురితమైన ఆమె కథలు దళిత అస్తిత్వ స్పృహను, రాజకీయ పరిణామాలను అద్భుతంగా చిత్రించాయి. గాంధేయ మార్గంలో పయనిస్తూనే, అణగారిన వర్గాల విముక్తి కోసం రాత్రి పాఠశాలలు, లైబ్రరీలను నడుపుతూ విజ్ఞానాన్ని పంచిన తాడి నాగమ్మ, తెలుగు సాహిత్య మరియు సామాజిక చరిత్రలో ఒక ధ్రువతారగా వెలిగారు.

జాల మంగమ్మ (1909-1974) :

తెలుగునాట దళిత బహుజన మహిళా ఉద్యమ చరిత్రలో జాల మంగమ్మ ఒక అసాధారణ విప్లవమూర్తి. రాజమండ్రి కేంద్రంగా అణగారిన వర్గాల విద్యా, సామాజిక, రాజకీయ విముక్తి కోసం ఆమె సాగించిన పోరాటం బహుముఖీనమైనది. ఒకవైపు ఉపాధ్యాయురాలిగా బాధ్యతలు నిర్వహిస్తూనే, మరోవైపు మాల, మాదిగ వాడల్లో రాత్రి పాఠశాలలు నడపడం, రాజకీయ తరగతులు నిర్వహించడం ద్వారా ఆమె నిరంతర ఆచరణశీలిగా నిలిచారు. ముఖ్యంగా కుల వివక్షను ఎదుర్కోవడానికి ఆమె అనుసరించిన వ్యూహాలు అద్భుతమైనవి. ఆధిపత్య కులాలు దళితులకు క్షవరాలు చేయడానికి నిరాకరించినప్పుడు, దళిత యువకులకే ఆ వృత్తిలో శిక్షణ ఇప్పించి ప్రత్యామ్నాయ వ్యవస్థను నిర్మించడం ఆమెలోని సామాజిక ఇంజనీరింగ్‌కు నిదర్శనం. హరిజన మహిళా సంఘం ద్వారా వందలాది రాట్నాలను పంపిణీ చేసి, ఆర్థిక స్వావలంబన ద్వారా ఆత్మగౌరవాన్ని సాధించవచ్చని ఆమె నిరూపించారు.

సాహిత్య మరియు ప్రచురణ రంగాల్లో మంగమ్మ గారు చేసిన కృషి దళిత అస్తిత్వ స్పృహకు పునాది వంటిది. 'జవ గ్రంథ మండలి' ద్వారా ముద్రణకు నోచుకోని దళిత

రచనలను తెలుగులోకి తేవడమే కాకుండా, 'వీరభారతి' అనే పత్రికను నడపడం ద్వారా తెలుగులో తొలి దళిత మహిళా సంపాదకురాలిగా ఆమె చరిత్ర సృష్టించారు. తొలి తెలుగు దళిత నవలగా భావించే 'రైతు పిల్ల'కు ఆమె సంపాదకత్వం వహించడం విశేషం. గాంధేయ వాదిగా జైలు శిక్ష అనుభవించినా, అంబేద్కర్‌ను రాజమండ్రిలో సన్మానించడంలో కీలక పాత్ర పోషించినా ఆమె లక్ష్యం ఒక్కటే, అది అంటరానితన నిర్మూలన. ఇంతటి ఘన చరిత్ర ఉన్నప్పటికీ, ఆధిపత్య సామాజిక వర్గాల సాహిత్య వివక్ష కారణంగా ఆమె రచనలు, పోరాట చరిత్ర నేటికీ ప్రధాన స్రవంతి చరిత్ర పుస్తకాల్లో కనుమరుగవ్వడం బాధాకరం. మంగమ్మ గారి జీవితం కేవలం ఒక వ్యక్తి చరిత్ర కాదు, అది అణచివేతపై గెలిచిన ఒక సమష్టి బహుజన చైతన్య ప్రతీక.

టి.ఎన్. సదాలక్ష్మి (1928-2004):

తెలుగు రాజకీయ యవనికపై అత్యంత ధైర్యశాలియైన బహుజన మహిళా నాయకురాలిగా టి.ఎన్. సదాలక్ష్మి ముద్ర వేశారు. అణగారిన మాదిగ కులంలో జన్మించినా, ఆత్మగౌరవమే ఊపిరిగా సాగిన ఆమె ప్రస్థానం దళిత బహుజన రాజకీయాలకు ఒక దిక్సూచి. నాటి నిజాం కాలేజీలో విద్యను అభ్యసించి, వైద్యురాలిగా సేవ చేయాలన్న సంకల్పం ఉన్నప్పటికీ, సామాజిక పరిస్థితులు ఆమెను ప్రజాసేవ వైపు మళ్లించాయి. అంబేద్కరిజం, గాంధేయవాదాల ప్రభావంతో రాజకీయాల్లోకి వచ్చిన ఆమె, అధికారం దక్కించుకోవడం కంటే ఆ అధికారాన్ని అణగారిన వర్గాల గొంతుకగా మార్చడమే లక్ష్యంగా పెట్టుకున్నారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ తొలి మహిళా మంత్రిగా, డిప్యూటీ స్పీకర్‌గా ఆమె ప్రదర్శించిన నిబద్ధత, సాక్షాత్తూ ముఖ్యమంత్రినే నిలదీయగలిగే ఆమె నిర్భయత్వం బహుజన స్త్రీల రాజకీయ సాధికారతకు అత్యున్నత నిదర్శనం.

సదాలక్ష్మి గారు కేవలం పదవులకే పరిమితం కాకుండా, 'తెలంగాణ ప్రజానమితి' వ్యవస్థాపక కార్యదర్శిగా ప్రత్యేక తెలంగాణ ఉద్యమాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లడంలో క్రియాశీలక పాత్ర పోషించారు. తెలంగాణ వస్తేనే బహుజనుల జీవితాల్లో వెలుగు వస్తుందని ఆమె బలంగా విశ్వసించారు. అంతేకాకుండా, దళిత వర్గాల అంతర్గత రిజర్వేషన్ల కోసం సాగిన మాదిగ దండోరా ఉద్యమానికి అండగా నిలబడి, ఏబీసీడీ వర్గీకరణ ఫార్ములాను ప్రభుత్వాల ముందుంచడంలో ఆమె రాజీ లేని పోరాటం చేశారు. అస్తిత్వ పోరాటాలలో అగ్రభాగాన నిలిచినప్పటికీ, ఆధిపత్య చరిత్రకారులు ఆమె పోరాటాలను లిఖితపూర్వకంగా నమోదు చేయకపోవడం బహుజన చరిత్రపై జరుగుతున్న విస్మరణకు సంకేతం. తన ప్రసంగాలనే కరపత్రాలుగా, సంభాషణలనే వ్యాసాలుగా మలచుకున్న సదాలక్ష్మి, తరతరాల దళిత బహుజన తరాలకు ఒక అజేయమైన స్ఫూర్తి ప్రదాత.

మామిడి సత్యవతి (1941):

తెలుగు సాహిత్య రంగంలో 1960వ దశకంలోనే దళిత సమస్యలపై గళమెత్తిన అరుదైన రచయిత్రి మామిడి సత్యవతి. జనగాం గడ్డపై జన్మించిన ఆమె నాటి సామాజిక వివక్షను, అంటరానితనాన్ని కేవలం బాధితురాలిగా కాకుండా ఒక విశ్లేషకురాలిగా తన రచనల్లో ప్రతిబింబించారు. ముఖ్యంగా కునుమ ధర్మన్న 'జయభేరి', తిరుపతి భుపతి 'జైభీమ్' వంటి దళిత పత్రికల ప్రభావంతో పెరిగిన ఆమె "కోమల" అనే కలం పేరుతో అణగారిన వర్గాల గొంతుకగా నిలిచారు. "స్వతంత్ర దేశంలో అస్వతంత్రులు" వంటి ఆమె వ్యాసాలు నాటి సామాజిక వైరుధ్యాలను ఎండగట్టడమే కాకుండా దళిత బహుజన మహిళల మేధో చైతన్యానికి నిదర్శనంగా నిలుస్తాయి. పితృస్వామ్య వ్యవస్థలో దళిత స్త్రీ ఎదుర్కొనే ద్వంద్వ అణిచివేతను ఆమె తన కథా వస్తువులుగా ఎంచుకోవడం విశేషం.

సత్యవతి గారి ప్రసిద్ధ కథ "తెర తొలిగింది" స్త్రీ అస్తిత్వానికి, కుటుంబ విలువల మధ్య జరిగే సంఘర్షణకు ఒక దర్పణం. సంప్రదాయ దాంపత్యంలోని అసంతృప్తి, బయటి ఆకర్షణల వైపు మొగ్గుచూపే మనస్తత్వాలను చిత్రిస్తూనే, అంతిమంగా ఒక తల్లిగా బిడ్డల భవిష్యత్తు పట్ల ఉండే బాధ్యతను ఈ కథలో అత్యంత హృద్యంగా ఆవిష్కరించారు. రైలు ప్రయాణంలో ఒక వృద్ధురాలి

అనుభవం ద్వారా సత్యవతి గారు శశిరేఖ పాత్రలో తెచ్చిన మార్పు కేవలం ఒక వ్యక్తిగత నిర్ణయం కాదు. అది ఒక బహుజన కుటుంబ వ్యవస్థ విచ్ఛిన్నం కాకుండా కాపాడుకునే స్త్రీ నైతిక పోరాటం. వెట్టిచాకిరి, అంటరాని తనం వంటి సామాజిక ఇతివృత్తాలతో పాటు స్త్రీల అంతరంగిక సంఘర్షణలను వ్యంగ్యంతో, ఆవేశంతో కలబోసి రాసిన ఆమె సాహిత్యం నేటికీ బహుజన స్త్రీవాద అధ్యయనంలో కీలకమైనది.

డా॥. బి. విజయభారతి (1941):

తెలుగు సాహిత్య చరిత్రలో దళిత బహుజన దృక్పథానికి ఒక తాత్విక పునాదిని నిర్మించిన మేధావి డా॥ బి. విజయభారతి. పాలేరు నాటక రచయిత బోయి భీమన్న వారసురాలిగా, ఒక విద్యావంతురాలైన దళిత స్త్రీగా ఆమె ప్రస్థానం అగ్రవర్ణ ఆధిపత్యం గల అకాడమీల వివక్షను ఎదిరించి సాగింది. పూలే, అంబేద్కర్ల భావజాలాన్ని తెలుగు సమాజానికి పరిచయం చేయడమే కాకుండా హైందవ పురాణాలను దళిత కోణంలో విశ్లేషించి తాటకి, శూర్పణఖ వంటి పాత్రలను 'ఆర్య వ్యవస్థను ఎదిరించిన వీర వనితలు'గా పునర్నిర్వ చించారు. తెలుగు అకాడమీలో ఆమె ఎదుర్కొన్న కుల వివక్ష, సహాయ నిరాకరణలు దళిత మేధావులపై సాగుతున్న సామాజిక అస్పృశ్యతకు నిదర్శనం. అయి నప్పటికీ, తన ఇంటిలోని గ్రంథాలయాన్నే ఒక ఆయుధంగా మలచుకుని ప్రాచీన, ఆధునిక సాహిత్య కోశాలను అద్భుతంగా రూపొందించి, బ్రాహ్మణీయ సాహిత్య విమర్శలకు గట్టి సమాధానమిచ్చారు.

విజయభారతి గారి రచనలు కేవలం భక్తికో, భావోద్వేగానికో పరిమితం కాకుండా, ఒక సామాజిక విశ్లేషణగా సాగాయి. ఆమె రాసిన 'అంబేద్కర్ జీవిత చరిత్ర', పూలే 'గులాంగిరి' అనువాదాలు తెలుగునాట దళిత ఉద్యమకారులకు పాఠ్యగ్రంథాలుగా నిలిచాయి. "రామాయణం - భూమి పోరాటం" వంటి రచనల ద్వారా పురాణ కాలం నుండే దళితులపై సాగుతున్న అణిచి వేతను, భూమి కోసం జరిగిన పోరాటాలను వెలుగులోకి తెచ్చారు. ఆమె కవిత ''అవిశ్రాంత పయనం'లో వ్యక్తమైనట్లుగా, నెత్తిమీద బరువుతో, చెప్పులు లేని కాళ్ళతో బహుజన సమాజం సాగిస్తున్న ప్రయాణాన్ని ఆమె అక్షరీకరించారు. ఒక దళిత మహిళగా అకాడమీ డైరెక్టర్ స్థాయికి ఎదిగి, పీఠాధిపతుల ఈర్ష్యలను జయించి, తెలుగు సాహిత్య విమర్శలో దళిత స్త్రీ దృక్పథానికి (Dalit Feminist Perspective) ఆమె వేసిన పునాదులు చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోతాయి.

కవయిత్రి తిలక స్వరూపరాణి (1943):

తెలుగు సాహిత్య క్షేత్రంలో అట్టడుగు మాదిగ కులం నుండి వచ్చి, సంస్కృత ఆంధ్ర పండితులకు ధీటుగా బహుజన దృక్పథంతో రచనలు చేసిన అరుదైన విదుషీ మణి కవయిత్రి తిలక స్వరూపరాణి. పితృస్వామ్య వ్యవస్థలో స్త్రీ దాస్యానికి పునాదులు ఎక్కడ ఉన్నాయో అన్వేషిస్తూ, ఆమె రాసిన 'నన్నయ మహిళ' గ్రంథం ఒక సామాజిక విప్లవం. వేదకాలం నుండి కొనసాగుతున్న పురుషాధిక్యతను, కుల వ్యవస్థను దళిత దృష్టికోణం నుండి విశ్లేషించిన ఆమె, భారతంలోని కుంతి, ద్రౌపది, శకుంతల వంటి పాత్రలను కేవలం అణచివేతకు గురైన వారుగా కాకుండా, ఆ వ్యవస్థలోని ద్వంద్వ నీతిని ఎదిరించిన చైతన్యమూర్తులుగా చిత్రించారు. ముఖ్యంగా స్త్రీ మాతృత్వాన్ని ఒక 'మిత్'గా అభివర్ణిస్తూ, నాటి మేనక నుండి నేటి ఆధునిక మహిళల వరకు ఎదుర్కొంటున్న సామాజిక సంకెళ్ళను ఆమె అత్యంత హేతుబద్ధంగా ప్రశ్నించారు.

స్వరూపరాణి గారి సాహిత్యంలో మార్క్సిజం, అంబేద్కరిజం మరియు స్త్రీవాద భావజాలాల అద్భుత సమ్మేళనం కనిపిస్తుంది. తెలుగు సాహిత్యంలో హైకూల ప్రక్రియను ప్రవేశపెట్టిన తొలి రచయిత్రిగా గుర్తింపు పొందిన ఆమె, 'చంద్రగ్రహణం' వంటి పద్య కావ్యాల ద్వారా ఖగోళ శాస్త్రాన్ని, సామాజిక సమస్యలను ముడిపెడుతూ సరికొత్త ప్రయోగాలు చేశారు. సాంప్రదాయకంగా పురుషలింగంగా భావించే చంద్రుడిని స్త్రీలింగంగా మలిచి, పితృస్వామ్య హింసను భరించే చంద్రబింబంగా చిత్రించడం ఆమె విప్లవాత్మక శైలికి నిదర్శనం. శైవ, క్రైస్తవ మతాల మధ్య సామాజిక మైత్రిని కోరుకుంటూనే, హేతువాద దృక్పథంతో

సమాజంలోని అట్టడుగు వర్గాల స్వేచ్ఛ, సమానత్వం కోసం ఆమె కలం అలుపెరగకుండా పోరాడింది. బేతవోలు రామబ్రహ్మం వంటి పండితులచే "తొలి స్త్రీవాద రచయిత్రి"గా ప్రశంసలు పొందిన స్వరూపరాణి, బహుజన సాహిత్య చరిత్రలో ఒక అజేయమైన శక్తి.

జూపాక సుభద్ర (1962):

తెలుగు దళిత సాహిత్య, సామాజిక ఉద్యమ చరిత్రలో జూపాక సుభద్ర (1962) ఒక అలుపెరుగని గొంతుక. వరంగల్ జిల్లాలోని ఒక సామాన్యుడి ఇంట్లో 11వ సంతానంగా జన్మించి, హాస్టల్ గదుల్లో అర్ధాకలితో చదువుకుని, సచివాలయంలో ఉన్నతోద్యోగిగా ఎదిగిన ఆమె ప్రస్థానం అసాధారణమైనది. కేవలం ఉద్యోగానికే పరిమితం కాకుండా, విద్యార్థి దశలోనే విప్లవ రాజకీయాల్లో చురుగ్గా పాల్గొని జైలు జీవితాన్ని కూడా అనుభవించారు. సుభద్ర గారి ప్రత్యేకత ఏమిటంటే, ఆమె అకడమిక్ చదువులను విప్లవ కార్యాచరణతో మేళవించి, దళిత స్త్రీ దృక్పథం (Dalit Feminist Perspective) నుండి సమాజాన్ని విశ్లేషించడం. సచివాలయంలో మహిళా ఉద్యోగుల కోసం సంఘాన్ని స్థాపించి, అణగారిన వర్గాల ప్రతినిధిగా ఆమె ప్రదర్శించిన నాయకత్వ పటిమ బహుజన మహిళా సాధికారతకు ఒక గొప్ప ఉదాహరణ.

సుభద్ర గారి సాహిత్యం కేవలం అక్షర విన్యాసం కాదు, అది అణచివేతపై ఎక్కుపెట్టిన అస్త్రం. 'శుద్ధి చెయ్యాలె' వంటి కథల ద్వారా దళిత స్త్రీల శ్రమను, వారి అంతరంగిక సంఘర్షణను ఆమె అత్యంత శక్తివంతంగా చిత్రించారు. తెలంగాణ యాసలో, వ్యంగ్యం మరియు తీవ్రత కలగలిసిన ఆమె శైలి పాఠకుడిని ఆలోచింపజేస్తుంది. ముఖ్యంగా 'అంటరాని వసంతం', 'కక్క' వంటి ప్రసిద్ధ దళిత నవలలను దళిత స్త్రీ కోణం నుండి సమీక్షించి, పితృస్వామ్య మరియు కుల వ్యవస్థల ద్వంద్వ అణిచివేతను ఎండగట్టారు. "పనిపాట" వంటి అంశాలపై ఆమె చేసే ఉపన్యాసాలు ఆమెను ఒక అత్యుత్తమ వక్తగా నిలబెట్టాయి. తన అస్తిత్వాన్ని, మూలాలను మర్చిపోకుండా, అట్టడుగు వర్గాల శ్రమ సంస్కృతిని సాహిత్య గౌరవంగా మార్చిన జూపాక సుభద్ర, ఆధునిక బహుజన ఉద్యమాల్లో ఒక ధ్రువతార.

పుట్ల హేమలత (1962):

తెలుగు దళిత సాహిత్య క్షేత్రంలో ఆధ్యాత్మికత నుండి అస్తిత్వ స్పృహ వైపు సాగిన ఒక విశిష్ట ప్రయాణం పుట్ల హేమలత గారిది. క్రైస్తవ కుటుంబంలో జన్మించడం వల్ల ప్రాథమిక దశలో కుల వివక్షకు దూరంగా ఉన్నప్పటికీ, ఉన్నత విద్యలో ఎదురైన చేదు అనుభవాలు ఆమెను దళిత స్త్రీవాద దృక్పథం వైపు మళ్లించాయి. ప్రముఖ దళిత కవి ఎండ్లూరి సుధాకర్ గారి సహధర్మచారిణిగా కాకుండా, ఒక స్వతంత్ర రచయిత్రిగా ఆమె ముప్పైకి పైగా కవితలు, ఇరవై కథలు మరియు మూడు నవలలతో తనకంటూ ఒక ప్రత్యేక ముద్ర వేసుకున్నారు. అట్టడుగు దళిత స్త్రీల వేదనలను, వారి కడగండ్లను సామాజిక కోణంలో విశ్లేషించడమే కాకుండా, "నీలి మేఘాలు" వంటి ప్రతిష్టాత్మక సంకలనాల్లో భాగస్వామి కావటం ద్వారా దళిత స్త్రీవాద సాహిత్యానికి ఆమె బలమైన పునాదులు వేశారు.

హేమలత గారి సృజనలో వస్తు వైవిధ్యం అత్యంత లోతైనది. ఆమె రాసిన "పొరుగిల్లు" కవిత సమాజం విసిరేసిన ఒక అభాగ్యురాలి జీవితాన్ని, ఆకలి తీర్చుకోవడానికి ఆమె చేసే పోరాటాన్ని కళ్లకు కట్టినట్లు చూపిస్తుంది. నైతిక విలువల కంటే నిత్యావసరాలే ప్రధానమైన చోట, శీలం అనేది వాసన లేని పువ్వుగా ఎలా మారుతుందో ఆమె నిష్కర్షగా అక్షరీకరించారు. అలాగే "నూతిలో కప్ప" కథ ద్వారా దళిత బాలల జీవితాల్లోని అమాయకత్వాన్ని, వారు ఎదుర్కొనే ఆర్థిక దోపిడీని ఎంతో ఆర్ద్రంగా చిత్రించారు. రైల్వే స్టేషన్ తన లోకంగా బతికే శీనుగాడి పాత్ర ద్వారా, అట్టడుగు వర్గాల ప్రజలు బాహ్య ప్రపంచం గురించి కనే కలలను, భయాలను విశ్లేషించారు. క్రైస్తవ ఆధ్యాత్మికతతో ప్రారంభించి, సామాజిక వర్ణయుద్ధం వరకు ఆమె సాగించిన సాహిత్య ప్రస్థానం బహుజన దృక్పథానికి ఒక గొప్ప ఆస్తి.

జాజుల గౌరి (1967):

తెలుగు సాహిత్య రంగంలో తెలంగాణ అస్తిత్వాన్ని,

మాదిగ జీవిత ముద్రలను మట్టి వాసనతో అక్షరీకరించిన ధిక్కార స్వరం జాజుల గౌరి. బాల్య వివాహం వల్ల చదువు ఆగిపోయినా, పట్టుదలతో డిగ్రీ, జర్నలిజం పూర్తి చేసి తన కలం ద్వారా సామాజిక వివక్షపై యుద్ధం ప్రకటించారు. 1990ల నాటి దళిత ఆత్మగౌరవ ఉద్యమాల ప్రభావంతో ఆమె రచనలు కేవలం కవిత్వంగా కాకుండా, అణగారిన వర్గాల ఆత్మాభిమాన ప్రకటనలుగా వెలుగు చూశాయి. ముఖ్యంగా 'చాతుర్వర్ణ వ్యవస్థ' వంటి కవితల ద్వారా సామాజిక నిర్మాణంలోని లోపాలను ఎండగట్టడం, విమర్శలను ఎదుర్కొంటూనే తన సాహిత్యానికి బలాన్ని చేకూర్చుకోవడం గౌరి గారి విలక్షణ శైలి. తెలంగాణా మాండలికంలో రచనలు చేసిన తొలితరం దళిత రచయిత్రిగా ఆమె భాషాధిక్యతను సవాలు చేశారు.

ఆమె రాసిన 'మన్ను బువ్వ' కథ దళిత జీవితాల్లోని దారిద్ర్యాన్ని, కరువు భీభత్సాన్ని అత్యంత ఆర్ద్రంగా చిత్రించింది. ఆకలి తట్టుకోలేక మట్టిని బువ్వగా తిన్న పసిపాప వేదన ఆమెకు 'మట్టి రచయిత్రి' అనే సార్థక నామాన్ని తెచ్చిపెట్టింది. అలాగే 'దస్తకత్' కథలో స్కాలర్‌షిప్ కోసం ఒక దళిత కుటుంబం పడే తపనను, వ్యవస్థలోని అడ్డంకులను చిత్రించగా, 'కంచె' కథలో దళిత బాలికలు ఎదుర్కొనే లైంగిక వేధింపులను, వాటికి తల్లి చూపే విప్లవాత్మక పరిష్కారాన్ని సాహసోపేతంగా ఆవిష్కరించారు. జాజుల గౌరి గారి సాహిత్యం కేవలం వేదనను మాత్రమే కాదు, మట్టి మనుషుల పోరాట పటిమను, వారి సృజనాత్మక శక్తిని దళిత బహుజన దృక్పథంతో ప్రపంచానికి చాటిచెప్పింది.

డాక్టర్ కొలకలూరి మధుజ్యోతి (1967):

తెలుగు సాహిత్య విమర్శ మరియు పరిశోధనా రంగంలో తనదైన ముద్ర వేసిన విద్యావేత్త డాక్టర్ కొలకలూరి మధుజ్యోతి. సుప్రసిద్ధ సాహితీవేత్త కొలకలూరి ఇనాక్ గారి వారసురాలిగా, విద్యా రంగంలో స్వర్ణ పతక విజేతగా ఆమె ప్రస్థానం విశిష్టమైనది. సాహిత్య విమర్శను కేవలం అకడమిక్ అంశంగా కాకుండా సౌందర్య శాస్త్ర కోణంలో (Aesthetics) లోతుగా విశ్లేషించిన పరిశోధకురాలు. పాశ్చాత్య సౌందర్యవేత్తలైన ప్లేటో, కాంట్, హెగెల్ వంటి వారి సిద్ధాంతాలను తెలుగు కవిత్వానికి అన్వయించడంలో ఆమె చూపిన ప్రతిభ అసాధారణమైనది. భౌతిక సౌందర్యం కంటే ఆధ్యాత్మిక మరియు తాత్విక సౌందర్యానికి ప్రాధాన్యతనిస్తూ, 'సత్యం - శివం - సుందరం' అనే భావన మానవ జీవన పథ నిర్దేశం చేస్తుందని ఆమె బలంగా విశ్వసించారు.

మధుజ్యోతి గారి విశ్లేషణలో సౌందర్యం అనేది కేవలం రూపానికి సంబంధించింది కాదు, అది ఒక ఆధ్యాత్మిక అనుభూతి. దళిత మరియు స్త్రీవాద దృక్పథాలను సాహిత్య విమర్శలో భాగంగా విశ్లేషించినా, ఆమె ప్రధాన దృష్టి సౌందర్య శాస్త్రం మరియు వస్తు పరిణామంపైనే కేంద్రీకృతమైంది. బెజవాడ గోపాలరెడ్డి కవిత్వాన్ని సౌందర్య కోణంలో విశ్లేషిస్తూ ఆమె రాసిన వ్యాసాలు, తెలుగు సాహిత్యంలో విమర్శనాత్మక ప్రమాణాలను పెంచాయి. శ్రీ పద్మావతి మహిళా విశ్వవిద్యాలయంలో ఆచార్యురాలిగా పదిమందికి పైగా విద్యార్థులను పరిశోధనలో నడిపిస్తూ, తెలుగు సాహిత్య విమర్శలో దళిత బహుజన మేధో సంపత్తికి ప్రాతినిధ్యం వహిస్తున్న అరుదైన విదుషీమణి మధుజ్యోతి.

గోగు శ్యామల (1969):

తెలుగు దళిత సాహిత్య వినీలాకాశంలో మట్టి వాసనను, ఆత్మగౌరవ గొంతుకను బలంగా వినిపిస్తున్న రచయిత్రి గోగు శ్యామల. రంగారెడ్డి జిల్లా అట్టడుగు పల్లె జీవితం నుండి లా కాలేజీ వరకు ఆమె సాగించిన ప్రస్థానం అసాధారణమైనది. కేవలం అక్షరాలకే పరిమితం కాకుండా, రైతుకూలీల సమస్యలపై, మహిళా వేతనాల సమానత్వంపై క్షేత్రస్థాయిలో పోరాడిన యోధురాలు ఆమె. మార్క్సిస్ట్ విప్లవ దృక్పథంతో ప్రారంభమై, దళిత స్త్రీవాద అస్తిత్వ స్పృహ వైపు ఆమె సాగించిన పయనం తెలుగు సాహిత్యంలో ఒక నూతన ఒరవడిని సృష్టించింది. ముఖ్యంగా 'దర్బన్' ప్రపంచ సదస్సులో భారత దళిత స్త్రీల ప్రతినిధిగా ఆమె పాల్గొనడం, అంతర్జాతీయ వేదికపై కులపీడనను ఎండగట్టడం బహుజన దృక్పథానికి దక్కిన గొప్ప గౌరవం.

శ్యామల గారి సృజనాత్మకతకు 'వరద గూడును' కవిత

మరియు 'ఏనుగంత తండ్రి కన్నా యేకుల బుట్టంత తల్లి నయం' వంటి కథలు నిలువెత్తు సాక్ష్యాలు. ఆమె రచనల్లో తెలంగాణ గ్రామీణ భాష, శ్రమ సంస్కృతి ఉట్టిపడతాయి. "నా గతం అణచివేత.. వర్తమానం, భవిష్యత్తు తిరుగుబాటు" అని ఆమె ప్రకటించిన తీరు దళిత విముక్తి పోరాట పటిమను చాటుతుంది. తల్లి కుట్టే 'కుంచి' కథ ద్వారా సామాన్య దళిత స్త్రీలోని సృజనాత్మకతను, పొదుపును, ప్రేమను అత్యంత ఆర్ద్రంగా చిత్రించారు. అన్వేషి వంటి సంస్థల ద్వారా దళిత స్త్రీల సాహిత్యాన్ని వెలికితీయడంలో ఆమె పోషిస్తున్న పాత్ర, భవిష్యత్ తరాల బహుజన రచయితలకు ఒక దిక్సూచి వంటిది.

చల్లపల్లి స్వరూపరాణి (1969):

తెలుగు దళిత సాహిత్య ప్రపంచంలో దళిత క్రైస్తవ అస్తిత్వ వాదాన్ని (Dalit Christian Identity) బలంగా వినిపించిన కవయిత్రి చల్లపల్లి స్వరూపరాణి. గంటూరు జిల్లాకు చెందిన ఆమె, తన పరిశోధన మరియు సృజన ద్వారా దళిత స్త్రీలు ఎదుర్కొనే కుల, మత, పితృస్వామ్య అణిచివేతలను లోతుగా విశ్లేషించారు. 'ముగింపు' కథతో ప్రారంభమైన ఆమె ప్రయాణం, 'ఒంటి నిట్టాడి గుడిసె' కవితతో అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు పొందింది. క్రైస్తవం అండగా ఉన్నా, సామాజికంగా ఎదురయ్యే 'వెలి' వేదనను, మాలవాడల అభద్రతను ఆమె తన అక్షరాల్లో ప్రతిబింబించారు. రచయిత్రిగా తన అస్తిత్వాన్ని కేవలం అక్షరాల్లోనే కాకుండా, సామాజిక చర్చా వేదికలపై కూడా నిరూపించుకున్న ధిక్కార స్వరం స్వరూపరాణి.

ఆమె రాసిన 'ఆల్ ఇండియన్స్ ఆర్ మై బ్రదర్స్ అండ్ సిస్టర్స్' కవిత భారతీయ లౌకికవాదంలోని డొల్లతనాన్ని, మత ఉన్మాదం వల్ల దళిత క్రైస్తవులు ఎదుర్కొంటున్న హింసను కళ్లకు కడుతుంది. "ముందు మాల నుయ్యి - వెనక క్రైస్తవ గొయ్యి" అన్న పంక్తుల ద్వారా దళిత క్రైస్తవ స్త్రీ ఎదుర్కొనే ద్వంద్వ వివక్షను అత్యంత శక్తివంతంగా చిత్రించారు. అలాగే 'మరియ' కథ ద్వారా ఆధిపత్య కులాలు దళిత స్త్రీల ఉనికిని, కన్యాత్వాన్ని ఏ విధంగా ధ్వంసం చేస్తున్నాయో, ఆ బ్రాహ్మణీయ అణిచివేతను ఎండగట్టారు. అంబేడ్కర్ నీడలో తన అస్తిత్వాన్ని వెతుక్కునే ఒక బాధితురాలి ఆవేదనను, ఆశను బహుజన దృక్పథంతో విశ్లేషించిన స్వరూపరాణి రచనలు ఆధునిక తెలుగు సాహిత్యానికి దిక్సూచులు.

దనసరి అనసూయ (సీతక్క - 1971):

తెలుగు సమాజంలో ఆదివాసీ అస్తిత్వ గొంతుకను, అడవి బిడ్డల ఆవేదనను శక్తివంతంగా వినిపిస్తున్న పోరాటశీలి సీతక్క. ములుగు జిల్లాలోని కొండ దొర తెగలో జన్మించిన ఆమె విప్లవోద్యమ నేపథ్యం నుండి అట్టడుగు వర్గాల ప్రతినిధిగా ఎదిగిన తీరు స్ఫూర్తి దాయకం. కేవలం సాయుధ పోరాటానికే పరిమితం కాకుండా 'యక్షి' వంటి సంస్థల ద్వారా ఆదివాసీల భూమి హక్కుల కోసం, స్త్రీల రక్షణ కోసం ఆమె చేసిన కృషి అమోఘం. ఆదివాసీ సంస్కృతిపై జరుగుతున్న హైందవ సాంస్కృతిక సామ్రాజ్యవాదాన్ని, వలసవాద దోపిడీని అక్షరీకరిస్తూ ఆమె రాసిన వ్యాసాలు మరియు 'గురితప్పిన ఆదివాసి ఆయుధం' వంటి కవితలు ఆదివాసీ దృక్పథానికి అద్దం పడతాయి.

దనసరి అనసూయ గారి విశ్లేషణలో తెలంగాణ ఉద్యమం మరియు వలసవాదం పట్ల ఒక స్పష్టమైన ఆదివాసీ-బహుజన దృక్పథం కనిపిస్తుంది. కేవలం కోస్తా ఆంధ్ర వలసవాదాన్నే కాక, మైదాన ప్రాంత ఆదివాసీయేతర శక్తుల వల్ల అడవి బిడ్డలు ఎదుర్కొంటున్న భూ అన్యాక్రాంతాన్ని, శ్రమ దోపిడీని ఆమె నిశితంగా ఎండగట్టారు. ముఖ్యంగా ఆదివాసీ స్త్రీలపై జరుగుతున్న లైంగిక వేధింపులను, 1/70 చట్టం అమలులో వైఫల్యాలను చర్చిస్తూ నిజమైన తెలంగాణ అంటే అది ఆదివాసీల స్వయంప్రతిపత్తితో కూడిన ప్రజాస్వామిక తెలంగాణ కావాలని ఆమె ఆకాంక్షించారు. అడవిపై హక్కులను కోల్పోయి కూలీలుగా మారిన గిరిజన జీవితాల్లో వెలుగు నింపడమే లక్ష్యంగా సాగుతున్న ఆమె ప్రస్థానం ఆధునిక బహుజన సాహిత్యానికి, రాజకీయాలకు ఒక గొప్ప దిక్సూచి.

మేరి మాదిగ (1975):

తెలుగు సాహిత్యం మరియు సామాజిక ఉద్యమ రంగంలో మాదిగ అస్తిత్వ గొంతుకను యుద్ధనౌకలా

వినిపించిన ధిక్కార స్వరం మేరి మాదిగ (1975). నల్గొండ జిల్లాలోని సామాన్య మాదిగ కుటుంబంలో జన్మించిన ఆమె, చిన్ననాటి నుండి కుల వివక్షను, సామాజిక బహిష్కరణలను ఎదుర్కొంటూనే పోరాటశీలిగా ఎదిగారు. విద్యార్థి దశలోనే రాజకీయ చైతన్యాన్ని పుణికిపుచ్చుకున్న మేరి, మాదిగ దండోరా ఉద్యమంలో రాష్ట్ర స్థాయి మహిళా నాయకురాలిగా కీలక పాత్ర పోషించారు. కేవలం వేదికలపై ప్రసంగించడమే కాకుండా, తన పాటల ద్వారా వేలాది మందిని చైతన్యపరిచి, ఎ.బి.సి.డి వర్గీకరణ పోరాటంలో అగ్రభాగాన నిలిచారు. 'మేరక్క'గా పేరు పొందిన ఆమె ప్రస్థానం, అణగారిన వర్గాల మహిళా నాయకత్వానికి ఒక గొప్ప నమూనా.

మేరి మాదిగ రాసిన 'మెహతర్ చెల్లి' వంటి పాటలు దళిత బహుజన దృక్పథానికి నిలువెత్తు సాక్ష్యాలు. సమాజంలోని మురికిని శుభ్రం చేస్తూ, మనుధర్మ శాస్త్రపు అణిచివేతకు గురవుతున్న సఫాయి కర్మచారి స్త్రీల వేదనను, వారి ఆత్మగౌరవ పోరాటాన్ని ఆమె అత్యంత ఆర్ద్రంగా చిత్రించారు. ఆమె ప్రసంగాల్లో మాదిగ స్త్రీల శ్రమ శక్తిని, సృజనాత్మకతను అగ్రకులాధిపత్య ధోరణులతో పోలుస్తూ ఎండగట్టడం కనిపిస్తుంది. అరుంధతి వంటి చారిత్రక పాత్రలను దళిత దృక్పథంతో విశ్లేషిస్తూ, మాదిగ గూడెంలోని సత్యం మరియు పతివ్రతత్వాన్ని చాటిచెప్పారు. అణచివేతకు గురవుతున్న కులాల ఐక్యతను, ముఖ్యంగా స్త్రీల హక్కుల సాధనను తన జీవిత లక్ష్యంగా చేసుకున్న మేరి మాదిగ రచనలు మరియు పోరాటాలు ఆధునిక బహుజన చరిత్రలో సువర్ణాక్షరాలు.

ముగింపు:

తెలుగు నేలపై దళిత బహుజన మహిళా ఉద్యమం కేవలం ఒక వర్గానికో, ప్రాంతానికో పరిమితం కాలేదు. ఇది అక్షరం నుండి ఆయుధం వరకు, ఆధ్యాత్మికత నుండి అంబేద్కరిజం వరకు విస్తరించిన ఒక బహుముఖీన ప్రయాణం. జ్ఞానరత్నమ్మ, గుల్బానమ్మ వంటి వారు విద్యతో పునాదులు వేస్తే, జాల మంగమ్మ, టి.ఎన్. సదాలక్ష్మి వంటి వారు రాజకీయ, సామాజిక పోరాటాలతో ఆత్మగౌరవ జెండాను ఎగురవేశారు. విజయభారతి, జూపాక సుభద్ర, గోగు శ్యామల వంటి ఆధునిక తరం రచయిత్రులు దళిత స్త్రీ శ్రమను, సౌందర్యాన్ని, వేదనను 'దళిత స్త్రీవాద దృక్పథం'తో ప్రపంచానికి పరిచయం చేశారు. 'నల్ల పొద్దు'లోని రచయిత్రులందరూ ఒకే స్వరంతో వినిపించిన సందేశం "మా అస్తిత్వం మాదే - మా గొంతుక మాదే". వీరి రచనలు కేవలం బాధను మాత్రమే వ్యక్తం చేయలేదు, ఆ బాధ నుండి పుట్టిన రాజకీయ చైతన్యాన్ని, పోరాట పటిమను ప్రదర్శించాయి. పితృస్వామ్య సామాజిక నిర్మాణాలను కూల్చివేస్తూ, కుల రహిత సమాజం కోసం సాగుతున్న ఈ పోరాటంలో 'నల్ల పొద్దు' ఒక మండుతున్న సూర్యుడు. ఇది కేవలం సాహిత్యం కాదు, ఇది ఒక విముక్తి ప్రస్థానం. ఈ మహిళల చరిత్ర కేవలం గతకాలపు స్మృతి కాదు, అది వర్తమాన సామాజిక ఉద్యమాలకు ఒక చైతన్య స్రవంతి. ఆధిపత్య చరిత్రకారులు వీరిని విస్మరించినా, వీరి అక్షరాలు 'నల్ల పొద్దు' లాగా సమాజంలోని చీకట్లను చీల్చుకుంటూ ఉదయిస్తూనే ఉంటాయి. అణచివేతపై గెలిచిన ఈ సమష్టి బహుజన చైతన్యాన్ని కాపాడుకోవడమే నేటి తరం బాధ్యత.

ఆధార గ్రంథాలు :

1. శ్యామల, గోగు. నల్ల పొద్దు, హైదరాబాద్ బుక్ ట్రస్ట్, హైదరాబాద్, 2003.
2. లక్ష్మీనరసయ్య, జి. పదునెక్కిన పాట, పల్లవి పబ్లికేషన్స్, విజయవాడ, 1995.
3. రామకృష్ణ, వి. ఆంధ్రప్రదేశ్ లో సంస్కరణోద్యమాలు (1948 -1919), హైదరాబాద్ బుక్ ట్రస్ట్, హైదరాబాద్, 1986.
4. తెలుగు సాహిత్యం -- దళిత జనోద్ధరణ, యు. జి. సి. జాతీయ సదస్సులో సమర్పించిన దళిత సాహిత్య వ్యాసాలు, 1993.
5. ప్రసాద్, కలేకూరి. దళిత సాహిత్య చరిత్ర, దళిత స్త్రీ సాహిత్య పరిషత్ ప్రచురణలు, విజయవాడ, 2000.
6. మాకు గోడలు లేవు, ఫెమినిస్ట్ స్టడీ సర్కిల్, హైదరాబాద్, 1995.
7. సుందర్ రాజు, నాగప్ప గారి. మాదిగ చైతన్యం, హైదరాబాద్, 1997.
8. ఓల్గా. మహిళావరణం, వసంత కల్పన, హైదరాబాద్, 2000.

★

Vol. 23 | Spl. Issue 03 | March 2026 | BHAVAVEENA | ISSN No. : 2456-4702 | RNI No. APTEL/2003/12253

RNI No. APTEL/2003/12253 | Reffered Journal & Peer Reviewed Journals | ISSN No. 2456-4702

భావవీణ

కళలు, సాహిత్య, సాంస్కృతిక భాషాధ్యయన పత్రిక

BHAVA VEENA

Journal of Arts, Literary, Culture & Language Study

గిరిజన జానపద విజ్ఞానంలో మహిళా చైతన్యం : ఒక సామాజిక - సాంస్కృతిక విమర్శాత్మక అధ్యయనం

- భూక్య గణేష్

పరిశోధక విద్యార్థి, తెలుగు డిపార్ట్మెంట్, కాకతీయ విశ్వవిద్యాలయం.

వ్యాస సంగ్రహం:

ఈ పరిశోధన వ్యాసం తెలుగు సాహిత్యం మరియు గిరిజన జానపద విజ్ఞానంలో మహిళా చైతన్యం ఎలా ప్రతిఫలించిందో విశ్లేషిస్తుంది. మహిళా చైతన్యం అనేది కేవలం వ్యక్తిగత స్వేచ్ఛకు సంబంధించినది కాకుండా, అది సామాజిక న్యాయం, సమానత్వం, స్వీయ గౌరవం మరియు ఆత్మపరిశీలన వంటి విలువల సమాహారంగా ఉంటుంది. ఈ వ్యానంలో సాంప్రదాయ తెలుగు సాహిత్యం నుండి ఆధునిక సాహిత్యం వరకు మహిళా చైతన్యం అభివృద్ధి దిశను పరిశీలించబడింది. అదే విధంగా గిరిజన జానపద గేయాలు, కథలు, ఆచారాలు మరియు సంప్రదాయాలలో మహిళల పాత్రను విశ్లేషిస్తూ, వారి జీవిత అనుభవాలు మరియు సామాజిక స్థితిగతులను అర్థం చేసుకోవడానికి ప్రయత్నించబడింది.

తెలుగు సాహిత్యంలో మహిళలు మొదట పరిమిత పాత్రలలోనే కనిపించినప్పటికీ, క్రమంగా వారు స్వతంత్ర ఆలోచనలు, సామాజిక అవగాహన కలిగిన వ్యక్తులుగా ఎదిగారు. గిరిజన జానపద విజ్ఞానంలో మహిళలు కేవలం కుటుంబ పరిమితుల్లో కాకుండా, ఆర్థిక, సాంస్కృతిక మరియు ఆధ్యాత్మిక రంగాలలో కీలక పాత్ర పోషిస్తున్నారు. ఈ వ్యాసం సాహిత్యం మరియు జానపదం మధ్య ఉన్న సారూప్యతలు మరియు వ్యత్యాసాలను కూడా పరిశీలిస్తుంది.

మొత్తంగా ఈ అధ్యయనం మహిళా చైతన్యం ఒక నిరంతర పరిణామ ప్రక్రియ అని, అది సాంస్కృతిక సందర్భాల ఆధారంగా మారుతూ ఉంటుందని నిరూపిస్తుంది.

కీలక పదాలు :

మహిళా చైతన్యం, తెలుగు సాహిత్యం, గిరిజన జానపద విజ్ఞానం, స్త్రీవాదం, సామాజిక మార్పు, గిరిజన మహిళలు, సాంస్కృతిక అధ్యయనం

ఉపోద్ఘాతం:

మహిళా చైతన్యం అనేది సమాజంలో మహిళల స్థితిగతులను, వారి హక్కులను, అవకాశాలను మరియు స్వీయ గుర్తింపును సూచించే ఒక ముఖ్యమైన భావన. ఇది స్త్రీవాద సిద్ధాంతాల ఆధారంగా అభివృద్ధి చెందినప్పటికీ, ప్రతి సంస్కృతిలో అది వేర్వేరు రూపాలలో వ్యక్తమవుతుంది. తెలుగు సాహిత్యం మరియు గిరిజన జానపద విజ్ఞానం ఈ చైతన్యాన్ని ప్రతిబింబించే రెండు ప్రధాన రంగాలు.

తెలుగు సాహిత్యం శతాబ్దాలుగా అభివృద్ధి చెందుతూ వచ్చిన ఒక సమృద్ధమైన సంప్రదాయం. ఇందులో మహిళల పాత్ర కాలానుగుణంగా మారుతూ వచ్చింది. ప్రాచీన సాహిత్యంలో మహిళలు ప్రధానంగా గృహిణులుగా, తల్లులుగా మాత్రమే చిత్రించబడగా,

ఆధునిక సాహిత్యంలో వారు స్వతంత్ర భావనలు కలిగిన వ్యక్తులుగా, సామాజిక మార్పుకు ప్రేరణగా నిలుస్తున్నారు.

ఇంకొకవైపు, గిరిజన జానపద విజ్ఞానం అనేది మౌఖిక సంప్రదాయాల ఆధారంగా కొనసాగుతున్న జీవన విధానం. ఇందులో మహిళలు కేవలం కుటుంబ సభ్యులుగా కాకుండా, సంస్కృతి పరిరక్షకులుగా, సంప్రదాయాల వాహకులుగా ఉంటారు. వారి గేయాలు, కథలు మరియు ఆచారాలు వారి చైతన్యాన్ని ప్రతిబింబిస్తాయి. ఈ పరిశోధనలో ఈ రెండు రంగాలలో మహిళా చైతన్యం ఎలా వ్యక్తమవుతుందో విమర్శాత్మకంగా విశ్లేషించ బడుతుంది.

విషయ విశ్లేషణ:

తెలుగు సాహిత్యం మరియు గిరిజన జానపద విజ్ఞానంలో మహిళా చైతన్యం అనేది ఒక విస్తృతమైన, బహుముఖమైన అధ్యయన రంగం. ఇది కేవలం సాహిత్య పరమైన అంశం మాత్రమే కాకుండా, సామాజిక, సాంస్కృతిక, ఆర్థిక, రాజకీయ కోణాలలో కూడా విశ్లేషించాల్సిన అవసరం ఉన్న అంశం. మహిళా చైతన్యం అనేది ఒక స్థిరమైన భావన కాదు; అది కాలానుగుణంగా, పరిస్థితులనుబట్టి మారుతూ అభివృద్ధి చెందుతుంది. ఈ నేపథ్యంలో, ఈ విశ్లేషణను నాలుగు ప్రధాన కోణాలలో పరిశీలించడం అవసరం.

తెలుగు సాహిత్యంలో మహిళా చైతన్యం అభివృద్ధి:

తెలుగు సాహిత్యంలో మహిళా చైతన్యం అభివృద్ధి ఒక క్రమానుగత ప్రక్రియ. ప్రాచీన సాహిత్యం నుండి ఆధునిక సాహిత్యం వరకు మహిళల పాత్రలు, వారి ఆలోచనలు, వారి స్వీయ అవగాహనలో గణనీయమైన మార్పులు చోటు చేసుకున్నాయి.

ప్రాచీన తెలుగు సాహిత్యంలో మహిళల ప్రతిబింబం ప్రధానంగా పితృస్వామ్య విలువలకు అనుగుణంగా ఉండేది. మహిళలు గృహిణులుగా, తల్లులుగా, భర్తకు విధేయులుగా చిత్రించబడ్డారు. ఈ దశలో మహిళల వ్యక్తిత్వం కుటుంబ పరిమితుల్లోనే నిలిచిపోయింది. అయితే, కొన్ని సందర్భాల్లో సాహిత్యంలో మహిళల ధైర్యం, ఆత్మగౌరవం కూడా కనిపిస్తుంది. ఉదాహరణకు, పౌరాణిక కథల్లో కొన్ని మహిళా పాత్రలు తమ నిర్ణయాలను స్వయంగా తీసుకునే సామర్థ్యాన్ని చూపించాయి.

మధ్యయుగ సాహిత్యంలో భక్తి ఉద్యమం మహిళా చైతన్యానికి ఒక కొత్త దిశను ఇచ్చింది. భక్తి సాహిత్యంలో మహిళలు దేవునితో ప్రత్యక్ష సంబంధాన్ని ఏర్పరచు కోవడం ద్వారా తమ ఆత్మగౌరవాన్ని వ్యక్తపరిచారు. ఈ దశలో మహిళలు భక్తులుగా, ఆధ్యాత్మిక వ్యక్తులుగా ఎదిగారు. భక్తి సాహిత్యం మహిళలకు ఒక ప్రత్యామ్నాయ వేదికను అందించింది, ఇది వారికి తమ భావాలను వ్యక్తపరచడానికి సహాయపడింది.

ఆధునిక తెలుగు సాహిత్యంలో మహిళా చైతన్యం మరింత స్పష్టంగా కనిపిస్తుంది. ఈ దశలో మహిళలు కేవలం పాత్రలుగా కాకుండా, కథనాల కేంద్రంగా నిలిచారు. వారు తమ హక్కుల కోసం పోరాడే వ్యక్తులుగా, సమాజంలోని అన్యాయాలకు వ్యతిరేకంగా నిలబడే వ్యక్తులుగా చిత్రించబడ్డారు. ఆధునిక రచయితలు మహిళల అంతరంగాన్ని, వారి మానసిక స్థితిని, వారి ఆశయాలను గాఢంగా చిత్రించారు.

స్త్రీవాద సాహిత్యం ఈ దశలో ముఖ్యమైన పాత్ర పోషించింది. ఇందులో మహిళల స్వీయ గుర్తింపు, లింగ సమానత్వం, ఆర్థిక స్వాతంత్ర్యం వంటి అంశాలు ప్రధానంగా ప్రస్తావించబడ్డాయి. స్త్రీవాద దృక్కోణం ద్వారా మహిళల జీవితాన్ని విశ్లేషించడం సాహిత్యానికి ఒక కొత్త దిశను ఇచ్చింది.

గిరిజన జానపద విజ్ఞానంలో మహిళా చైతన్యం స్వరూపం:

గిరిజన జానపద విజ్ఞానం అనేది మౌఖిక సంప్ర దాయాల ద్వారా తరతరాలకు కొనసాగుతున్న జీవన విధానం. ఇందులో మహిళల పాత్ర చాలా ముఖ్యమైనది. గిరిజన సమాజంలో మహిళలు కేవలం కుటుంబ బాధ్యతలను నిర్వహించే వ్యక్తులుగా కాకుండా, సమాజ నిర్మాణంలో కీలక పాత్ర పోషిస్తారు.

గిరిజన మహిళల జీవితం ప్రకృతితో సన్నిహితంగా ఉంటుంది. వారు వ్యవసాయం, వేట, ఆహార సేకరణ వంటి కార్యకలాపాల్లో పాల్గొంటారు. ఈ నేపథ్యంలో వారి

చైతన్యం ప్రకృతితో అనుసంధానమై ఉంటుంది. గిరిజన గేయాలు, కథలు, ఆచారాలు వారి జీవిత అనుభవాలను ప్రతిబింబిస్తాయి.

గిరిజన జానపద గేయాలలో మహిళల భావోద్వేగాలు స్పష్టంగా కనిపిస్తాయి. వారు తమ ఆనందం, బాధ, ప్రేమ, విరహం, ఆవేదన వంటి భావాలను గేయాల ద్వారా వ్యక్తపరుస్తారు. ఈ గేయాలు వారి అంతరంగాన్ని అర్థం చేసుకోవడానికి ముఖ్యమైన సాధనంగా నిలుస్తాయి.

గిరిజన కథల్లో మహిళలు ధైర్యవంతులుగా, సమాజాన్ని కాపాడే వ్యక్తులుగా కనిపిస్తారు. వారు కష్టాలను ఎదుర్కొనే సామర్థ్యం కలిగినవారిగా చిత్రించబడ్డారు. ఈ కథలు మహిళల ఆత్మవిశ్వాసాన్ని, వారి చైతన్యాన్ని ప్రతిబింబిస్తాయి.

గిరిజన ఆచారాలు మరియు సంప్రదాయాలలో మహిళల పాత్ర కీలకం. వివాహం, పండుగలు, పూజలు వంటి సందర్భాలలో వారు ముఖ్య పాత్ర పోషిస్తారు. ఇది వారి సామాజిక స్థితిని సూచిస్తుంది. అయితే, కొన్ని సందర్భాల్లో గిరిజన సమాజంలో కూడా లింగ అసమానతలు కనిపిస్తాయి. అయినప్పటికీ, మహిళలు తమ స్థానం కోసం పోరాడుతూ, చైతన్యాన్ని ప్రదర్శిస్తారు.

తులనాత్మక విశ్లేషణ: సాహిత్యం జం జానపదం:

తెలుగు సాహిత్యం మరియు గిరిజన జానపద విజ్ఞానం మధ్య మహిళా చైతన్యం విషయంలో కొన్ని ముఖ్యమైన సారూప్యతలు మరియు వ్యత్యాసాలు ఉన్నాయి.

సారూప్యతలు:

రెండు రంగాలలో కూడా మహిళలు సామాజిక మార్పుకు ప్రేరణగా కనిపిస్తారు. వారి అనుభవాలు, భావనలు ప్రధానంగా ప్రతిబింబిస్తాయి. అన్యాయాలకు వ్యతిరేకంగా పోరాటం రెండు రంగాలలో కూడా కనిపిస్తుంది. మహిళల స్వీయ గౌరవం,ఆత్మగౌరవం, స్వాతంత్ర్యం వంటి విలువలు రెండు రంగాలలో కూడా ప్రతిఫలిస్తాయి.

వ్యత్యాసాలు:

తెలుగు సాహిత్యం లిఖిత సంప్రదాయంపై ఆధారపడి ఉండగా, గిరిజన జానపదం మౌఖిక సంప్రదాయం. సాహిత్యంలో వ్యక్తిగత చైతన్యంఎక్కువగా కనిపిస్తే, జానపదంలో సమూహ చైతన్యం ఎక్కువగా ఉంటుంది. గిరిజన మహిళలు ప్రకృతితో అనుసంధానమై ఉంటే, సాహిత్యంలో మహిళలు సామాజిక నిర్మాణాలతో ఎక్కువగా సంబంధం కలిగి ఉంటారు.

సాహిత్యంలో మహిళల పాత్రలు రచయితల దృక్కోణం ఆధారంగా రూపొందించబడుతాయి. అయితే, జానపదంలో మహిళల అనుభవాలు నేరుగా ప్రతిబింబిస్తాయి. ఇది జానపదాన్ని మరింత సహజంగా, జీవన్మయంగా చేస్తుంది.

సామాజిక-సాంస్కృతిక దృక్కోణం:

మహిళా చైతన్యం ఒక సామాజిక మరియు సాంస్కృతిక ప్రక్రియ. ఇది సమాజంలోని విలువలు, సంప్రదాయాలు, ఆచారాల ప్రభావంతో అభివృద్ధి చెందుతుంది. తెలుగు సాహిత్యం మరియు గిరిజన జానపదం ఈ చైతన్యాన్ని వివిధ కోణాలలో ప్రతిబింబిస్తాయి. సామాజిక మార్పు కోసం మహిళా చైతన్యం కీలకం. ఇది సమానత్వం, న్యాయం, స్వేచ్ఛ వంటి విలువలను ప్రోత్సహిస్తుంది. గిరిజన సమాజంలో మహిళలు సంస్కృతి పరిరక్షకులుగా ఉంటారు. వారు తమ సంప్రదాయాలను తరతరాలకు అందిస్తారు. మహిళా చైతన్యం విద్య, ఆర్థిక స్వాతంత్ర్యం, సామాజిక అవగాహన వంటి అంశాలపై ఆధారపడి ఉంటుంది. ఈ అంశాలు అభివృద్ధి చెందిన కొద్దీ మహిళల చైతన్యం కూడా అభివృద్ధి చెందుతుంది.

ఆధునిక పరిణామాలు మరియు సవాళ్లు:

ఆధునిక కాలంలో మహిళా చైతన్యం మరింత విస్తృతమైంది. మహిళలు విద్య, ఉద్యోగం, రాజకీయ రంగాలలో ముందుకు వస్తున్నారు. అయితే, ఇంకా కొన్ని సవాళ్లు ఉన్నాయి. లింగ వివక్ష, ఆర్థిక అసమానత, సామాజిక ఒత్తిడులు వంటి సమస్యలు ఇంకా కొనసాగుతున్నాయి.

గిరిజన మహిళలు ప్రత్యేకంగా మరిన్ని సవాళ్లను ఎదుర్కొంటున్నారు. వారి విద్యా స్థాయి తక్కువగా ఉండటం, ఆరోగ్య సమస్యలు, ఆర్థిక పరిమితులు వంటి

సమస్యలు వారి అభివృద్ధికి అడ్డంకులుగా నిలుస్తున్నాయి. అయినప్పటికీ, వారు తమ చైతన్యంతో ఈ సవాళ్లను ఎదుర్కొంటున్నారు.

మహిళా చైతన్యం: ఒక సమగ్ర దృక్కోణం:

మహిళా చైతన్యం అనేది కేవలం ఒక వ్యక్తిగత భావన కాదు; అది ఒక సామాజిక ఉద్యమం. ఇది సమాజంలో సమానత్వం, న్యాయం, స్వేచ్ఛను సాధించడానికి ఒక సాధనంగా ఉంటుంది. తెలుగు సాహిత్యం మరియు గిరిజన జానపద విజ్ఞానం ఈ చైతన్యాన్ని ప్రతిబింబించే ముఖ్యమైన వేదికలు.

ఈ రెండు రంగాల మధ్య ఉన్న పరస్పర సంబంధాన్ని అర్థం చేసుకోవడం ద్వారా మహిళా చైతన్యాన్ని మరింత లోతుగా అర్థం చేసుకోవచ్చు. ఇది సమాజంలో సానుకూల మార్పుకు దోహదపడుతుంది.

ముగింపు:

ఈ పరిశోధన ద్వారా "తెలుగు సాహిత్యం మరియు గిరిజన జానపద విజ్ఞానంలో మహిళా చైతన్యం" అనే అంశం ఒక విస్తృతమైన, బహుముఖమైన సామాజిక-సాంస్కృతిక ప్రక్రియగా అభివృద్ధి చెందిందని స్పష్టమవుతుంది. మహిళా చైతన్యం అనేది కేవలం వ్యక్తిగత అవగాహనకు మాత్రమే పరిమితమైనది కాదు; అది సమాజంలో ఉన్న అసమానతలు, అన్యాయాలు, పరిమితులను ప్రశ్నిస్తూ, సమానత్వం, స్వేచ్ఛ, ఆత్మ గౌరవం వంటి విలువలను సాధించడానికి ఒక శక్తివంతమైన సాధనంగా నిలుస్తుంది. ఈ అధ్యయనం ద్వారా తెలుగు సాహిత్యం మరియు గిరిజన జానపద విజ్ఞానం ఈ చైతన్యాన్ని వేర్వేరు కోణాలలో ప్రతిబింబిస్తున్నప్పటికీ, వాటి లక్ష్యం ఒకటే - మహిళల స్థితిగతులను మెరుగుపరచడం మరియు వారి వ్యక్తిత్వాన్ని గుర్తించడం-అని తెలుస్తుంది.

తెలుగు సాహిత్యంలో మహిళా చైతన్యం ఒక క్రమానుగత పరిణామ ప్రక్రియగా అభివృద్ధి చెందింది. ప్రాచీన సాహిత్యంలో మహిళలు ప్రధానంగా పితృస్వామ్య విలువలకు అనుగుణంగా చిత్రించబడ్డారు. వారి పాత్రలు గృహ పరిమితుల్లోనే నిలిచిపోయాయి. అయితే, ఈ దశలో కూడా కొన్ని మహిళా పాత్రలు తమ ధైర్యం, ఆత్మగౌరవం, నిబద్ధత ద్వారా ప్రత్యేకతను చాటుకున్నాయి. మధ్యయుగ సాహిత్యంలో భక్తి ఉద్యమం మహిళలకు ఒక కొత్త వేదికను అందించింది. భక్తి ద్వారా వారు తమ భావాలను వ్యక్తపరచడం ప్రారంభించారు. ఇది మహిళా చైతన్యానికి ఒక ప్రారంభ దశగా పరిగణించవచ్చు.

ఆధునిక తెలుగు సాహిత్యంలో మహిళా చైతన్యం మరింత స్పష్టంగా, శక్తివంతంగా అభివృద్ధి చెందింది. ఈ దశలో మహిళలు కేవలం కథలలో పాత్రలుగా కాకుండా, సమాజంలోని సమస్యలను ప్రశ్నించే, మార్పుకు దారితీసే వ్యక్తులుగా చిత్రించబడ్డారు. స్త్రీవాద సాహిత్యం ఈ ప్రక్రియలో ముఖ్యమైన పాత్ర పోషించింది. మహిళల స్వీయ గుర్తింపు, లింగ సమానత్వం, ఆర్థిక స్వాతంత్ర్యం వంటి అంశాలు సాహిత్యంలో ప్రధానంగా ప్రస్తావించబడ్డాయి. ఈ నేపథ్యంలో తెలుగు సాహిత్యం మహిళల అంతరంగాన్ని, వారి భావోద్వేగాలను, వారి పోరాటాలను ప్రతిబింబించే ఒక ముఖ్యమైన వేదికగా నిలిచింది.

ఇంకొకవైపు, గిరిజన జానపద విజ్ఞానం మహిళా చైతన్యాన్ని మరింత సహజమైన, జీవన్మయమైన రూపంలో ప్రతిబింబిస్తుంది. గిరిజన సమాజంలో మహిళలు కేవలం కుటుంబ బాధ్యతలను నిర్వహించే వ్యక్తులుగా కాకుండా, సమాజ నిర్మాణంలో కీలక పాత్ర పోషిస్తారు. వారు వ్యవసాయం, ఆహార సేకరణ, సంప్రదాయ పరిరక్షణ వంటి రంగాలలో చురుకుగా పాల్గొంటారు. గిరిజన గేయాలు, కథలు, ఆచారాలు వారి జీవిత అనుభవాలను, వారి భావోద్వేగాలను, వారి ఆత్మవిశ్వాసాన్ని ప్రతిబింబిస్తాయి. ఇది గిరిజన మహిళల చైతన్యాన్ని అర్థం చేసుకోవడానికి ఒక ముఖ్యమైన ఆధారంగా నిలుస్తుంది.

గిరిజన జానపదంలో మహిళా చైతన్యం వ్యక్తిగత స్థాయికి మాత్రమే పరిమితం కాకుండా, సమూహ స్థాయిలో కూడా అభివృద్ధి చెందుతుంది. ఇది గిరిజన సమాజంలోని సమూహ జీవన విధానాన్ని ప్రతిబింబిస్తుంది. మహిళలు తమ సమాజానికి ఒక అవిభాజ్య భాగంగా ఉండి, వారి సంప్రదాయాలను తరతరాలకు అందించడంలో ముఖ్య పాత్ర పోషిస్తారు. అయితే,

గిరిజన సమాజంలో కూడా కొన్ని పరిమితులు, అసమానతలు కనిపిస్తాయి. అయినప్పటికీ, మహిళలు తమ చైతన్యంతో ఈ సవాళ్లను ఎదుర్కొంటూ ముందుకు సాగుతున్నారు.

తెలుగు సాహిత్యం మరియు గిరిజన జానపద విజ్ఞానం మధ్య తులనాత్మక విశ్లేషణ ద్వారా కొన్ని ముఖ్యమైన విషయాలు స్పష్టమవుతాయి. సాహిత్యం లిఖిత సంప్రదాయంపై ఆధారపడి ఉండగా, జానపదం మౌఖిక సంప్రదాయం. సాహిత్యంలో మహిళల వ్యక్తిగత అనుభవాలు, వారి అంతరంగం ప్రధానంగా ప్రతిబింబిస్తే, జానపదంలో మహిళల సమూహ అనుభవాలు, వారి సామాజిక జీవనం ప్రధానంగా కనిపిస్తాయి. అయినప్పటికీ, ఈ రెండు రంగాలలో కూడా మహిళా చైతన్యం సమాజ మార్పుకు ఒక ముఖ్యమైన శక్తిగా నిలుస్తుంది.

మహిళా చైతన్యం ఒక స్థిరమైన భావన కాదు; అది కాలానుగుణంగా మారుతూ ఉంటుంది. ఆధునిక కాలంలో మహిళలు విద్య, ఉద్యోగం, రాజకీయ రంగాలలో ముందుకు వస్తున్నారు. ఇది వారి చైతన్యాన్ని మరింత బలపరుస్తోంది. అయితే, ఇంకా కొన్ని సవాళ్లు కొనసాగుతున్నాయి. లింగ వివక్ష, ఆర్థిక అసమానత, సామాజిక ఒత్తిడులు వంటి సమస్యలు మహిళల అభివృద్ధికి అడ్డంకులుగా నిలుస్తున్నాయి. ఈ నేపథ్యంలో మహిళా చైతన్యం ఈ సవాళ్లను ఎదుర్కొనే ఒక సాధనంగా మారుతోంది.

ఈ పరిశోధన ద్వారా మహిళా చైతన్యం సమాజంలో సానుకూల మార్పుకు దోహదపడే ఒక శక్తివంతమైన సాధనమని స్పష్టమవుతుంది. ఇది సమానత్వం, న్యాయం, స్వేచ్ఛ వంటి విలువలను ప్రోత్సహిస్తుంది. తెలుగు సాహిత్యం మరియు గిరిజన జానపద విజ్ఞానం ఈ చైతన్యాన్ని ప్రతిబింబించే ముఖ్యమైన వేదికలుగా నిలుస్తాయి. ఈ రెండు రంగాల మధ్య ఉన్న సంబంధాన్ని అర్థం చేసుకోవడం ద్వారా మహిళా చైతన్యాన్ని మరింత లోతుగా అర్థం చేసుకోవచ్చు.

భవిష్యత్తులో మహిళా చైతన్యంపై మరింత విస్తృతమైన పరిశోధనలు అవసరం. ముఖ్యంగా గిరిజన మహిళల జీవితం, వారి సమస్యలు, వారి అభివృద్ధి అవకాశాలు వంటి అంశాలపై మరింత దృష్టి పెట్టాలి. అలాగే సాహిత్యం మరియు జానపదం మధ్య ఉన్న సంబంధాన్ని మరింత లోతుగా అధ్యయనం చేయాలి. ఇది సమాజంలో మహిళల స్థితిగతులను మెరుగు పరచడానికి దోహదపడుతుంది.

మొత్తంగా, ఈ అధ్యయనం మహిళా చైతన్యం ఒక నిరంతర పరిణామ ప్రక్రియ అని, అది సమాజంలోని మార్పులను ప్రతిబింబిస్తూ, సమాజంలో సానుకూల మార్పుకు దోహదపడుతుందని నిరూపిస్తుంది. మహిళా చైతన్యం సమాజంలో సమానత్వం, న్యాయం, స్వేచ్ఛను సాధించడానికి ఒక కీలకమైన సాధనంగా నిలుస్తుంది. తెలుగు సాహిత్యం మరియు గిరిజన జానపద విజ్ఞానం ఈ చైతన్యాన్ని ప్రతిబింబించే అద్దాలుగా నిలుస్తూ, మహిళల అభివృద్ధికి మార్గదర్శకంగా ఉంటాయి.

పాద సూచికలు :

1. మహిళా చైతన్యం అనేది మహిళల స్వీయ అవగాహన, హక్కులపై అవగాహన మరియు సమానత్వం కోసం చేసే సామాజిక-మానసిక ప్రక్రియను సూచిస్తుంది.
2. పితృస్వామ్యం (Patriarchy) అనేది పురుషాధిక్యాన్ని ఆధారంగా చేసుకున్న సామాజిక వ్యవస్థ, ఇందులో మహిళలు ద్వితీయ స్థానం పొందుతారు.
3. స్త్రీవాదం (Feminism) మహిళల హక్కులు, సమానత్వం మరియు స్వేచ్ఛ కోసం పోరాడే సిద్ధాంతం మరియు ఉద్యమంగా పరిగణించబడుతుంది.
4. తెలుగు సాహిత్యం సమాజంలోని సాంస్కృతిక, సామాజిక మార్పులను ప్రతిబింబించే ఒక లిఖిత సంప్రదాయం.

5. జానపద విజ్ఞానం (Folklore) మౌఖిక సంప్రదాయాల ద్వారా తరతరాలకు సంక్రమించే జీవన అనుభవాలు, గేయాలు, కథలు మరియు ఆచారాల సమాహారం.
6. గిరిజన సమాజం ప్రకృతి ఆధారంగా జీవించే ప్రత్యేకమైన సాంస్కృతిక వ్యవస్థ కలిగిన సమూహంగా పరిగణించబడుతుంది.
7. మహిళా చైతన్యం అభివృద్ధిలో విద్య, ఆర్థిక స్వాతంత్ర్యం మరియు సామాజిక అవగాహన కీలక పాత్ర పోషిస్తాయి.

ఉపయుక్త గ్రంథసూచి:

I. తెలుగు గ్రంథాలు :

1. ఆచార్య ఎస్.వి. రామారావు. తెలుగు సాహిత్య చరిత్ర. హైదరాబాద్: విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్, 2010.
2. కొండపల్లి వీరయ్య. ఆధునిక తెలుగు సాహిత్యం. విజయవాడ: నవచైతన్య ప్రచురణలు, 2015.
3. వేమూరి వెంకటేశ్వర్లు. స్త్రీవాద సాహిత్యం -- ఒక పరిచయం. హైదరాబాద్: ప్రగతి పబ్లికేషన్స్, 2012.
4. జి. లక్ష్మీనారాయణ. తెలుగు కథా సాహిత్యం అభివృద్ధి. హైదరాబాద్: తెలుగు అకాడమీ, 2008.
5. కేతు విశ్వనాథరెడ్డి. సమకాలీన సాహిత్యం మరియు సమాజం. హైదరాబాద్: నవతెలంగాణ పబ్లికేషన్స్, 2016.

II. జానపద & గిరిజన అధ్యయన గ్రంథాలు:

6. పి. సూర్యనారాయణ. జానపద విజ్ఞానం. హైదరాబాద్: తెలుగు అకాడమీ, 2005.
7. ఎం. శేషాద్రి. గిరిజన సంస్కృతి మరియు సంప్రదాయాలు. విశాఖపట్నం: ఆంధ్ర విశ్వవిద్యాలయం ప్రచురణలు, 2011.
8. కె. బాలగోపాల్. గిరిజన జీవన విధానం. హైదరాబాద్: సామాజిక పరిశోధన కేంద్రం, 2009.
9. ఆర్. వేంకటరామయ్య. ఫోక్లోర్ స్టడీస్. హైదరాబాద్: ఓరియెంట్ లాంగ్మన్, 2003.
10. ఎన్. సుబ్బారావు. జానపద గేయాలు మరియు సంస్కృతి. విజయవాడ: జానపద ప్రచురణలు, 2014.

★★★

Vol. 23 | Spl. Issue 03 | March 2026 | BHAVAVEENA | ISSN No. : 2456-4702 | RNI No. APTEL/2003/12253

RNI No. APTEL/2003/12253 | Reffered Journal & Peer Reviewed Journals | ISSN No. 2456-4702

భావవీణ

కళలు, సాహిత్య, సాంస్కృతిక భాషాధ్యయన పత్రిక

BHAVA VEENA

Journal of Arts, Literary, Culture & Language Study

కన్యాశుల్కం నాటకం : మహిళా సమస్యల ప్రతిబింబం

– డా॥. కటికతల రాజమాణిక్యం

ఆంగ్ల అధ్యాపకురాలు, పిఠాపురం రాజా ప్రభుత్వ కళాశాల (అటానమస్), కాకినాడ.

సంగ్రహం

తెలుగు సాహిత్యంలో సామాజిక సంస్కరణలకు దారి తీసిన ప్రముఖ నాటకాలలో కన్యాశుల్కం ఒకటి. దీనిని ప్రసిద్ధ రచయిత గురజాడ అప్పారావు రచించారు. ఈ నాటకం 19వ శతాబ్దం చివరలో భారతీయ సమాజంలో ఉన్న అనేక సామాజిక సమస్యలను ప్రతిబింబిస్తుంది. ముఖ్యంగా మహిళలపై జరుగుతున్న అన్యాయాలను స్పష్టంగా చూపిస్తుంది. ఆ కాలంలో బాల్యవివాహాలు, కన్యాశుల్కం, విధవరాలుల దుస్థితి, మహిళల అణచివేత వంటి సమస్యలు విస్తృతంగా కనిపించేవి. ఈ నాటకం ద్వారా రచయిత ఈ సమస్యలను విమర్శించి సమాజంలో చైతన్యం కలిగించడానికి ప్రయత్నించారు. ఈ సెమినార్ పేపర్‌లో కన్యాశుల్కం నాటకంలో మహిళా సమస్యల ప్రతిబింబాన్ని విశ్లేషించడం ప్రధాన లక్ష్యం,

పరిచయం:

తెలుగు సాహిత్యంలో నాటకరంగానికి ప్రత్యేక స్థానం ఉంది. నాటకాలు కేవలం వినోదానికి మాత్రమే కాకుండా సమాజంలోని సమస్యలను ప్రతిబింబించే శక్తివంతమైన సాధనంగా కూడా పనిచేస్తాయి. అలాంటి సామాజిక నాటకాలలో కన్యాశుల్కం నాటకం అత్యంత ప్రముఖమైనది.

19వ శతాబ్దం చివరలో భారతీయ సమాజంలో అనేక దురాచారాలు ఉండేవి. ముఖ్యంగా మహిళల జీవితాలు అనేక కష్టాలతో నిండిపోయేవి. మహిళలకు విద్యా అవకాశాలు తక్కువగా ఉండేవి. వారి అభిప్రాయాలకు విలువ ఇవ్వబడేది కాదు. కుటుంబం మరియు సమాజంలో వారు అనేక పరిమితులతో జీవించాల్సి వచ్చేది.

గురజాడ అప్పారావు ఈ పరిస్థితులను గమనించి సమాజాన్ని సంస్కరించాలనే ఉద్దేశంతో కన్యాశుల్కం నాటకాన్ని రచించారు. ఈ నాటకం ద్వారా ఆయన బాల్య వివాహాలు, కన్యాశుల్కం వంటి దురాచారాలను తీవ్రంగా విమర్శించారు. అలాగే మహిళల జీవితాల్లో ఉన్న బాధలను, వారి అణచివేతను, సమాజంలోని కపటత్వాన్ని స్పష్టంగా చూపించారు. ఈ నాటకం తెలుగు సాహిత్యంలో మహిళా చైతన్యాన్ని పెంపొందించడంలో ముఖ్య పాత్ర పోషించింది.

అధ్యయన లక్ష్యాలు

ఈ అధ్యయనం యొక్క ముఖ్య లక్ష్యాలు:

1. కన్యాశుల్కం నాటకంలోని మహిళా సమస్యలను విశ్లేషించడం
2. ఆ కాలంలోని సామాజిక పరిస్థితులను అర్థం చేసుకోవడం
3. కన్యాశుల్కం అనే దురాచారం వల్ల మహిళల

జీవితంపై పడిన ప్రభావాన్ని పరిశీలించడం

4. నాటకంలోని మహిళా పాత్రల ద్వారా ప్రతిబింబించిన మహిళా చైతన్యాన్ని గుర్తించడం
5. సమాజ సంస్కరణలో ఈ నాటకం పాత్రను అధ్యయనం చేయడం

కన్యాశుల్కం నాటకం – సామాజిక నేపథ్యం:

కన్యాశుల్కం నాటకం రాసిన కాలంలో భారతీయ సమాజంలో అనేక అన్యాయాలు ఉండేవి. మహిళలను సమానులుగా చూడకుండా వారిని కేవలం కుటుంబానికి పరిమితం చేసే పరిస్థితి ఉండేది. బాలికలకు విద్య అవకాశాలు తక్కువగా ఉండేవి. అంతేకాకుండా కన్యాశుల్కం అనే దురాచారం కూడా విస్తృతంగా ఉండేది. కొంతమంది పెద్దవయసు గల పురుషులు చిన్న వయస్సు గల బాలికలను పెళ్లి చేసుకోవడానికి వారి తల్లిదండ్రులకు డబ్బు ఇచ్చేవారు. ఈ విధానం వల్ల బాలికల జీవితం చాలా కష్టంగా మారేది. గురజాడ అప్పారావు ఈ సమస్యలను గమనించి వాటిని సమాజానికి తెలియజేయడానికి ఈ నాటకాన్ని రచించారు.

కన్యాశుల్కం అనే దురాచారం:

కన్యాశుల్కం నాటకంలో ప్రధానంగా చూపబడిన సమస్య కన్యాశుల్కం అనే సామాజిక దురాచారం. ఈ వ్యవస్థలో వరుడు వధువు తల్లిదండ్రులకు డబ్బు ఇచ్చి పెళ్లి చేసుకునేవాడు. తల్లిదండ్రులు తమ కుమార్తెల భవిష్యత్తు గురించి ఆలోచించకుండా డబ్బు కోసం ఈ వివాహాలను అంగీకరించేవారు. ఈ విధానం వల్ల చిన్న వయస్సు గల బాలికలు పెద్దవయస్సు గల పురుషులకు పెళ్లి కావాల్సి వచ్చేది. ఇది వారి జీవితాన్ని బాధతో నింపేది. గురజాడ అప్పారావు ఈ వ్యవస్థను తీవ్రంగా విమర్శించారు.

బాల్యవివాహాల సమస్య:

బాల్యవివాహం కూడా ఆ కాలంలో పెద్ద సమస్యగా ఉండేది. చిన్న వయస్సు గల బాలికలను పెద్దవారితో వివాహం చేయడం సాధారణంగా ఉండేది. ఈ పరిస్థితి బాలికల విద్యను మరియు వ్యక్తిత్వ అభివృద్ధిని అడ్డుకుంటుంది. బాల్యవివాహం వల్ల బాలికలు చిన్న వయస్సులోనే కుటుంబ బాధ్యతలను తీసుకోవాల్సి వచ్చేది. వారి బాల్యం నశించేది. కన్యాశుల్కం నాటకం ఈ సమస్యను స్పష్టంగా చూపించి సమాజాన్ని ఆలోచింపజేసింది.

విధవరాలుల పరిస్థితి:

ఆ కాలంలో విధవరాలుల పరిస్థితి చాలా దయనీయంగా ఉండేది. భర్త మరణించిన తరువాత వారు చాలా కష్టమైన జీవితాన్ని గడపాల్సి వచ్చేది. వారికి సమాజంలో గౌరవం ఉండేది కాదు. తిరిగి వివాహం చేసుకునే అవకాశం కూడా ఉండేది కాదు. ఈ పరిస్థితి మహిళలపై ఉన్న అన్యాయాన్ని స్పష్టంగా చూపిస్తుంది. గురజాడ అప్పారావు ఈ సమస్యను కూడా నాటకంలో ప్రస్తావించారు.

మధురవాణి పాత్రలో మహిళా చైతన్యం:

కన్యాశుల్కం నాటకంలోని ప్రముఖ పాత్రలలో ఒకటి మధురవాణి. ఆమె తెలివైన, ధైర్యమైన మహిళగా చిత్రించబడింది. సమాజంలోని కపటత్వాన్ని ఆమె పాత్ర ద్వారా రచయిత చూపించారు. మధురవాణి పాత్ర మహిళల ఆత్మగౌరవాన్ని మరియు స్వతంత్ర ఆలోచనను ప్రతిబింబిస్తుంది. ఆమె పాత్ర ద్వారా రచయిత మహిళల సామర్థ్యాన్ని మరియు వారి వ్యక్తిత్వాన్ని చక్కగా చిత్రించారు.

మధురవాణి పాత్ర నిజంగా మహిళా చైతన్యానికి ఒక మిరుమిట్లు గొలిపే ఉదాహరణ. ఆయన రచించిన కన్యాశుల్కం నాటకంలో మధురవాణి పాత్ర ఒక విప్లవాత్మకమైన మహిళా పాత్ర. ఆమె స్వతంత్ర భావాలు, ధైర్యం, మరియు సామాజిక దురాచారాలపై తిరుగుబాటు మహిళా చైతన్యానికి ప్రతీకం.

మధురవాణి పాత్ర గురించి మరింత వివరంగా చెప్పాలంటే:

- స్వతంత్ర భావాలు : మధురవాణి సాంప్రదాయక స్త్రీ పాత్రలకు భిన్నంగా, తన స్వతంత్ర భావాలను ప్రదర్శిస్తుంది. ఆమె తన జీవితాన్ని తానే నిర్ణయించుకునే ధైర్యం కలిగి ఉంటుంది.

- ధైర్యం: మధురవాణి సామాజిక దురాచారాలను ఎదిరించే ధైర్యం కలిగి ఉంటుంది. ఆమె లక్ష్మీ నిమ్మని సహాయం చేసి, బాల్యవివాహాలకు వ్యతిరేకంగా పోరాడుతుంది.
- బుద్ధిమంతురాలు: మధురవాణి తెలివైనది, చతుర మైనది. ఆమె పరిస్థితులను తనకు అనుకూలంగా మార్చుకోవడంలో నిపుణురాలు.
- సామాజిక సేవ: మధురవాణి సామాజిక సేవలో ఆసక్తి కలిగి ఉంటుంది. ఆమె అసహాయ స్త్రీలకు సహాయం చేస్తుంది.

మహిళా విద్య ప్రాముఖ్యత:

ఈ నాటకం మహిళా విద్య అవసరాన్ని కూడా సూచిస్తుంది. విద్య ఉన్నప్పుడు మాత్రమే మహిళలు తమ హక్కులను తెలుసుకుని సమాజంలో గౌరవప్రదమైన స్థానం పొందగలరు. విద్య మహిళలకు ఆత్మవిశ్వాసాన్ని పెంచుతుంది. వారు తమ జీవితంపై స్వతంత్రంగా నిర్ణయాలు తీసుకునే సామర్థ్యాన్ని పొందుతారు.

మహిళల విద్య యొక్క ప్రాముఖ్యత గురించి మరింత వివరంగా చెప్పాలంటే:

- కుటుంబ అభివృద్ధి: విద్యావంతులైన మహిళలు తమ కుటుంబాన్ని బాగా చూసుకుంటారు. వారు తమ పిల్లలకు మంచి విద్యను అందిస్తారు, వారి ఆరోగ్యాన్ని చూసుకుంటారు.
- సామాజిక సేవ: విద్యావంతులైన మహిళలు సామాజిక సేవలో ఆసక్తి కలిగి ఉంటారు. వారు అసహాయులకు సహాయం చేస్తారు, సమాజంలోని సమస్యలను పరిష్కరించడానికి పాటుపడతారు.
- రాజకీయ ప్రాతినిధ్యం: విద్యావంతులైన మహిళలు రాజకీయ ప్రాతినిధ్యంలో ముందు ఉంటారు. వారు తమ హక్కులను పొంది, సమాజంలో తమ స్థానాన్ని నిలబెట్టుకుంటారు.
- సంస్కృతి పరిరక్షణ: విద్యావంతులైన మహిళలు సంస్కృతి పరిరక్షణలో ముందు ఉంటారు. వారు తమ సంస్కృతిని పిల్లలకు అందిస్తారు, సమాజం లోని సంస్కృతి విలువలను కాపాడతారు.
- ఆరోగ్యం: విద్యావంతులైన మహిళలు తమ ఆరోగ్యాన్ని చూసుకుంటారు. వారు తమ కుటుంబా నికి మంచి ఆరోగ్యాన్ని అందిస్తారు.

సమాజ సంస్కరణ అవసరం:

కన్యాశుల్కం నాటకం సమాజంలో మార్పు అవసరాన్ని బలంగా తెలియజేస్తుంది. బాల్యవివాహాలు, కన్యాశుల్కం వంటి దురాచారాలను తొలగించాల్సిన అవసరం ఉందని రచయిత సూచించారు. మహిళలకు గౌరవం, స్వేచ్ఛ, సమాన హక్కులు ఇవ్వడం సమాజ అభివృద్ధికి ఎంతో అవసరం.

మహిళలకు గౌరవం, స్వేచ్ఛ, సమానత్వ హక్కులు ఇవ్వడం వల్ల సమాజ అభివృద్ధికి దోహదపడే విధాలు మరింత వివరంగా :

మహిళల స్వావలంబన: మహిళలకు సమానత్వ హక్కులు ఇవ్వడం వల్ల వారు తమ పాదాలపై నిలబడి, తమ కలలను సాకారం చేసుకోవచ్చు.

- కుటుంబ ఆర్థికాభివృద్ధి: మహిళలు ఉద్యోగాల్లో పాల్గొనడం వల్ల కుటుంబ ఆర్థిక పరిస్థితి మెరుగుపడుతుంది.
- పిల్లల విద్యాభివృద్ధి: విద్యావంతులైన మహిళలు తమ పిల్లలకు మంచి విద్యను అందిస్తారు, వారి భవిష్యత్తును మెరుగుపరుస్తారు.
- సామాజిక న్యాయం: మహిళలకు సమానత్వ హక్కులు ఇవ్వడం వల్ల సమాజంలో సామాజిక న్యాయం నెలకొంటుంది.
- సమాజంలో శాంతి: మహిళలకు గౌరవం, స్వేచ్ఛ ఇవ్వడం వల్ల సమాజంలో శాంతి, సౌహార్ద్రత నెలకొంటుంది.
- దేశ అభివృద్ధి: మహిళల అభివృద్ధి వల్ల దేశం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందుతుంది.

మహిళలకు గౌరవం, స్వేచ్ఛ, సమానత్వ హక్కులు ఇవ్వడం వల్ల సమాజం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందుతుంది.

ముగింపు (Conclusion) :

మొత్తంగా చూస్తే కన్యాశుల్కం నాటకం తెలుగు

సాహిత్యంలో ఒక గొప్ప సామాజిక సంస్కరణ నాటకంగా నిలిచింది. గురజాడ అప్పారావు ఈ నాటకం ద్వారా ఆ కాలంలో ఉన్న మహిళా సమస్యలను స్పష్టంగా చిత్రించారు. కన్యాశుల్కం, బాల్యవివాహం, విధవరాలుల దుస్థితి, మహిళల అణచివేత వంటి సమస్యలను చూపిస్తూ సమాజంలో చైతన్యం కలిగించడానికి ప్రయత్నించారు. ఈ నాటకం మహిళల గౌరవం మరియు సమాన హక్కుల అవసరాన్ని బలంగా తెలియజేస్తుంది. అందువల్ల కన్యాశుల్కం నాటకం తెలుగు సాహిత్యంలో మహిళా చైతన్యాన్ని పెంపొందించిన గొప్ప సాహిత్య కృతిగా నిలిచింది.

కన్యాశుల్కం నాటకం తెలుగు సాహిత్యంలో మహిళా చైతన్యాన్ని పెంపొందించే విధంగా నిలుస్తుంది. ఈ నాటకం గురించి మరింత వివరంగా:

- మహిళా పాత్రల చిత్రణ: కన్యాశుల్కం నాటకంలో మధురవాణి, లక్ష్మీనిమ్మ వంటి మహిళా పాత్రలు మహిళా చైతన్యానికి ప్రతీకాలు. వారు సామాజిక దురాచారాలను ఎదిరించి, తమ హక్కులను పొందడానికి పోరాడతారు.
- బాల్యవివాహాల వ్యతిరేకం: ఈ నాటకం బాల్య వివాహాలకు వ్యతిరేకంగా పోరాడుతుంది. ఇది మహిళల జీవితాలను నాశనం చేసే ఈ దురాచారాన్ని తొలగించడానికి పిలుపునిస్తుంది.
- స్త్రీ విద్యా ప్రాముఖ్యత: కన్యాశుల్కం నాటకం స్త్రీ విద్యా ప్రాముఖ్యతను చాటి చెబుతుంది. విద్యావంతులైన మహిళలు సమాజంలో తమ స్థానాన్ని నిలబెట్టుకోవచ్చునని చూపిస్తుంది.
- సామాజిక సంస్కరణ: ఈ నాటకం సామాజిక సంస్కరణకు పిలుపునిస్తుంది. ఇది సమాజంలోని దురాచారాలను తొలగించి, సమానత్వం, స్వేచ్ఛను నెలకొల్పడానికి ప్రయత్నిస్తుంది.

కన్యాశుల్కం నాటకం తెలుగు సాహిత్యంలో మహిళా చైతన్యాన్ని పెంపొందించే ఒక మహోన్నత రచన.

సూచన గ్రంథాలు

1. కన్యాశుల్కం -- గురజాడ అప్పారావు
2. తెలుగు సాహిత్య చరిత్ర గ్రంథాలు
3. ఆధునిక తెలుగు నాటక సాహిత్యంపై విమర్శాత్మక వ్యాసాలు
4. విశ్వవిద్యాలయ తెలుగు సాహిత్య పాఠ్యపుస్తకాలు

★★★

Vol. 23 | Spl. Issue 03 | March 2026 | BHAVAVEENA | ISSN No. : 2456-4702 | RNI No. APTEL/2003/12253

RNI No. APTEL/2003/12253 | Reffered Journal & Peer Reviewed Journals | ISSN No. 2456-4702

భావవీణ

కళలు, సాహిత్య, సాంస్కృతిక భాషాధ్యయన పత్రిక

BHAVA VEENA

Journal of Arts, Literary, Culture & Language Study

మహాభారతంలో - మహిళా చైతన్యం

- విశాలి పేరి
చంద్రాపుర, బెంగుళూర్.

భారతీయ సంస్కృతిలో మహాభారతం ఒక మహా గ్రంథం మాత్రమే కాదు, సమాజ జీవన విధానాన్ని, నైతిక విలువలను, కుటుంబ సంబంధాలను ప్రతిబింబించే గొప్ప సాహిత్య సంపద. ఈ ఇతిహాసంలో రాజులు, వీరులు, ఋషులు మాత్రమే కాకుండా మహిళల పాత్ర కూడా అత్యంత ప్రభావవంతంగా కనిపిస్తుంది. ప్రాచీన భారతీయ సమాజంలో మహిళలు కేవలం గృహిణులుగా మాత్రమే కాకుండా ధైర్యం, ధర్మబోధ, ఆత్మగౌరవం, ఆలోచనా స్వాతంత్ర్యం వంటి లక్షణాలతో నిలిచినవారిగా మహాభారతం చూపిస్తుంది. అందువల్ల మహాభారతం ప్రాచీన సాహిత్యంలో మహిళా చైతన్యానికి గొప్ప ఉదాహరణగా నిలుస్తుంది.

మహాభారతం అంటే కేవలం రాజ్యకాంక్షతో జరిగిన కురుక్షేత్ర సంగ్రామం మాత్రమే కాదు, అది మానవ నైతికతకు, ధర్మానికి మరియు ముఖ్యంగా మహిళా శక్తికి అద్దం పట్టే ఒక అద్భుత కావ్యం. ఈ పురాణేతిహాసంలో ప్రతి మహిళా పాత్ర ఒక విలక్షణమైన వ్యక్తిత్వాన్ని, సమాజానికి దిక్సూచిగా నిలిచే గుణాన్ని కలిగి ఉంటుంది.

మహిళా చైతన్యం :

మహిళా చైతన్యం అంటే మహిళలు తమ గౌరవం, హక్కులు, వ్యక్తిత్వం, ఆలోచనా స్వేచ్ఛ గురించి అవగాహనతో నిలబడటం. ఇది ఆధునిక కాలంలో మాత్రమే ఉద్భవించిన భావం కాదు. ప్రాచీన సాహిత్యాల్లో కూడా మహిళలు ధైర్యంగా తమ అభిప్రాయాలు వ్యక్తం చేసిన ఉదాహరణలు ఉన్నాయి. మహాభారతంలోని మహిళా పాత్రలు దీనికి స్పష్టమైన సాక్ష్యం.

సత్యవతి:

సత్యవతి కురువంశ ధర్మపథానికి దిశానిర్దేశి. మహా భారత కథా గమనంలో సత్యవతి కేవలం ఒక పాత్ర కాదు, ఒక మహా సంకల్పం. హస్తినాపుర సింహాసనం సంక్షోభంలో ఉన్న ప్రతిసారీ, తన దూరదృష్టితో ఆ వంశాన్ని కాపాడిన మాతృమూర్తి ఆమె.

సత్యవతి ప్రయాణం సామాన్యమైనది కాదు. యమునా నది తీరాన ఒక జాలరి కన్యగా, పడవ నడుపుతూ జీవితాన్ని ప్రారంభించిన ఆమె, తన అసాధారణ వ్యక్తిత్వంతో శంతనుడి మనసును గెలుచుకుంది.

రాజ్యం అరాజకం కాకూడదని, వంశం అంతరించిపోకూడదని సత్యవతి పడిన తపన అపూర్వం. తన కుమారులు చిత్రాంగదుడు, విచిత్రవీర్యుడు అల్పాయుష్కులుగా మరణించినప్పుడు ఆమె కుంగిపోయినప్పటికీ కర్తవ్యం మరచిపోలేదు.

రాజ్యానికి వారసుడు లేని క్లిష్ట సమయంలో, తన ప్రథమ పుత్రుడైన వేదవ్యాసుడిని పిలిపించి, కోడళ్లకు సంతాన ప్రాప్తి కలిగించడం ద్వారా కురువంశాన్ని నిల

బెట్టింది. ఇది ఆమెలోని వ్యూహకర్తను, రాజ్యాధికారం పట్ల ఆమెకున్న బాధ్యతను చాటిచెబుతుంది.

రాజ్యం కోసం, వంశం కోసం అహర్నిశలు శ్రమించిన సత్యవతి, తన బాధ్యత తీరిందని భావించినప్పుడు నిశ్శబ్దంగా అడవులకు వెళ్ళిపోయింది. అధికార దాహం కంటే కర్తవ్య పాలన గొప్పదని ఆమె నిరూపించింది.

కుంతీదేవి :

భారతీయ ఇతిహాసాలలో మహాభారతం ఒక విశాలమైన జీవన గ్రంథం. ఇందులో రాజ్యపాలన, ధర్మం, నీతి, మానవ సంబంధాలు మాత్రమే కాకుండా మహిళల వ్యక్తిత్వం, వారి ధైర్యం, సహనం కూడా అత్యంత గంభీరంగా ప్రతిఫలిస్తాయి. ఆ మహోన్నత మహిళా పాత్రలలో కుంతీదేవి ఒక అద్భుతమైన వ్యక్తిత్వం. ఆమె జీవితం కేవలం ఒక రాజమాత కథ కాదు; అది ధైర్యం, త్యాగం, మాతృబలం, ధర్మ నిబద్ధతలకు ప్రతీకగా నిలిచిన ఒక ప్రేరణాత్మక గాథ.

కుంతీదేవి అసలు పేరు పృథా. ఆమె యాదవ వంశస్థుడైన శూరసేనుడి కుమార్తె. తర్వాత కుంతిభోజుడికి దత్తపుత్రికగా ఇచ్చినందువల్ల ఆమెకు "కుంతీదేవి" అనే పేరు ప్రసిద్ధి చెందింది. చిన్న వయసులోనే ఆమె జీవితంలో విధి ఎన్నో పరీక్షలు పెట్టింది.

ఒకసారి మహర్షి దుర్వాసుడు ఆమె ఇంటికి వచ్చినప్పుడు కుంతీదేవి అతనికి ఎంతో భక్తితో సేవ చేసింది. ఆమె సేవాభావానికి సంతోషించిన దుర్వాసుడు ఒక మంత్రాన్ని వరంగా ఇచ్చాడు. ఆ మంత్రంతో ఏ దేవుడిని ఆహ్వానించినా అతడు ప్రత్యక్షమై వరం ఇస్తాడని చెప్పాడు. బాల్యంలోని అమాయకత్వంతో ఆ మంత్రాన్ని పరీక్షించగా సూర్యదేవుడు ప్రత్యక్షమయ్యాడు. ఆ సంఘటన వల్ల కుంతీదేవి జీవితంలో ఒక గాఢమైన రహస్యం ఏర్పడింది... అదే కర్ణుని జననం. సమాజ భయం వల్ల తన శిశువును విడిచిపెట్టాల్సిన బాధ ఆమె జీవితంలో మొదటి గొప్ప విషాదం.

ఈ సంఘటన కుంతీదేవి మనసులో ఎంతో బాధను నింపినా, ఆమె ఆ బాధను తనలోనే దాచుకుని ధైర్యంగా జీవితం కొనసాగించింది. తర్వాత కుంతీదేవి పాండు రాజుతో వివాహం అయింది. పాండురాజుకు వచ్చిన శాపం కారణంగా ఆయనకు సంతానం కలగకపోవడం మరో కష్టాన్ని తెచ్చింది. అయితే దుర్వాసుడు ఇచ్చిన మంత్రాన్ని ఉపయోగించి కుంతీదేవి ధర్మరాజు (యుధిష్ఠిరుడు), భీముడు, అర్జునుడు అనే మహా వీరులకు జన్మనిచ్చింది. తరువాత అదే మంత్రాన్ని మాద్రికి ఇచ్చి నకులుడు, సహదేవుడు జన్మించడానికి కారణమైంది.

ఈ విధంగా పాండవుల జననంలో కుంతీదేవి పాత్ర ఎంతో కీలకం. ఆమె కేవలం తల్లిగానే కాకుండా ఒక ధైర్యవంతమైన నాయకురాలిగా కూడా నిలిచింది.

పాండురాజు మరణించాక మాద్రి కూడా అతనితో సహగమనం చేయడానికి పూనుకుంటుంది. అప్పుడు కుంతీదేవి తాను పెద్దది కాబట్టి తను సహగమనం చేస్తానంటుంది. కానీ మాద్రి "నీ పిల్లల్ని నా సొంత పిల్లలుగా చూసుకునే విశాల హృదయం నాకు లేదు, కానీ నువ్వు మాత్రం నా పిల్లల్ని నీ పిల్లలతో సమానంగా చూసుకోగలవు.. నీవు అంత గొప్పదానివి " అని అంటుంది. పాండవులు అరణ్యవాసానికి వెళ్ళేటప్పుడు కూడా ద్రౌపది దగ్గరకు వచ్చి కుంతీదేవి "సహదేవుడు అందరి కంటే చిన్నవాడు నాకు చాలా ఇష్టుడు కాస్త జాగ్రత్తగా చూసుకోమని చెబుతుంది. తన పిల్లలతో సమానంగా కాకుండా ఇంకా ఎక్కువగానే చూసుకుంది కుంతి. యక్ష ప్రశ్నలు అయ్యాక యక్షుడు "నీ తమ్ముళ్ళలో ఒక్కడినే బ్రతికిస్తాను, ఎవరు కావాలో చెప్పు " అని ధర్మరాజుని అడిగినప్పుణబ నకులుడిని బ్రతికించమని ధర్మరాజు అడుగుతాడు, అప్పుడు యక్షుడు పరాక్రమంతులైన భీమార్జునులను వదిలి నకులుడిని ఎందుకు కోరుకున్నావని అడుగగా, 'మా తల్లి కుమారులలో నేను ఉన్నాను, మాద్రి తల్లి కుమారులలో ఒకరు ఉండాలి కదా" అని అంటాడు. ఈ ధర్మం కూడా ధర్మరాజుకి కుంతీదేవి నుంచే వచ్చింది.

పాండవుల జీవితం మొదటి నుంచే కష్టాలతో నిండింది. హస్తినాపురంలో దుర్యోధనుడు చేసిన కుట్రలు, లాక్షాగృహ దహనం, అరణ్యవాసం వంటి అనేక ప్రమాదాలను వారు ఎదుర్కొన్నారు. ఈ సమయాల్లో

కుంతీదేవి తన పిల్లలకు ధైర్యాన్ని నింపింది. తన కుమారులు కష్టాల్లో ఉన్నప్పటికీ ఆమె ఎప్పుడూ ధర్మాన్ని విడిచిపెట్టవద్దని చెప్పేది. కుంతీదేవి బోధనలు పాండవుల వ్యక్తిత్వాన్ని తీర్చిదిద్దాయి. యుధిష్ఠిరుడి ధర్మబుద్ధి, అర్జునుని కర్తవ్యనిష్ఠ, భీముని ధైర్యం... ఇవన్నీ కుంతీదేవి సంస్కారాల ప్రతిఫలాలే.

పాండవులు వనవాసానికి వెళ్ళినప్పుడు తాను వస్తానని అడుగగా ధర్మరాజు వారిస్తాడు. అటువంటి సమయంలో ఆవిడ హస్తినాపురంలోనే ఉంటుంది, కానీ దృతరాష్ట్రుడి ఇంట ఉండకుండా విదురుడి ఇంట ఉంటుంది, కానీ అదే దేశంలో ఉంటూ వారు చేసిన తప్పుని వారికి ఎప్పుడూ గుర్తు చేస్తూ ఉంటుంది.

కుంతీదేవి జీవితంలో సహనం ఒక ముఖ్య లక్షణం. తన జీవితంలోని పెద్ద రహస్యం అయిన కర్ణుని విషయం చాలా సంవత్సరాలు ఆమె గుండెల్లో దాచుకుంది. మహాభారత యుద్ధానికి ముందు కర్ణుని వద్దకు వెళ్లి అతడే తన కుమారుడు అని చెప్పిన సందర్భం ఎంతో హృదయ విదారకమైనది.అయినా కూడా ఆమె ధర్మాన్ని ముందు ఉంచింది. కర్ణుడు పాండవులపై యుద్ధం చేయకుండా ఉండాలని కోరినా, అతడు తన కర్తవ్యాన్ని విడిచి పెట్టలేదు. ఆ సమయంలో కూడా కుంతీదేవి అతనికి ఆశీర్వాదం ఇచ్చి, తన మాతృహృదయాన్ని చూపించింది.

మహాభారతంలో కుంతీదేవి పాత్ర మహిళా శక్తిని, మాతృబలాన్ని ప్రతిబింబిస్తుంది. కుంతీదేవి కేవలం పాండవుల తల్లిగానే కాకుండా ధైర్యానికి, ధర్మానికి ప్రతీకగా నిలిచింది. ఎన్నో బాధలు ఎదురైనా ఆమె తన మనోధైర్యాన్ని కోల్పోలేదు. తన పిల్లలను ధర్మమార్గంలో నడిపించి మహానుభావులుగా తీర్చిదిద్దింది.అందుకే మహాభారతంలో కుంతీదేవి పాత్ర ఒక మాతృశక్తి ప్రతిరూపంగా, మహిళా చైతన్యానికి ప్రేరణగా నిలిచింది. ఆమె జీవితం మనకు ఒక సత్యాన్ని గుర్తు చేస్తుంది ధర్మం, ధైర్యం, సహనం ఉన్న చోటే నిజమైన మహత్వం ఉంటుంది.

ద్రౌపది :

మహాభారత మహాకావ్యంలో ద్రౌపది ఒక అసాధారణ మహిళా వ్యక్తిత్వం. మహాభారత ఇతిహాసంలో ద్రౌపది అనగానే మనకు ఆమె పడిన పరాభవం, ఆమె చేసిన ప్రతిజ్ఞ మాత్రమే గుర్తుకువస్తాయి. కానీ, ఆమె వ్యక్తిత్వంలో ఒక వైపు తీక్షణమైన జ్వాల ఉంటే, మరోవైపు చల్లని వెన్నెల వంటి కరుణ ఉంది. ఒక మహారాజ్ఞికి ఉండాల్సిన ఉదాత్తత, క్షమాగుణం ఆమెలో ఏ విధంగా ఉండేవో ఈ క్రింది సందర్భాలు నిరూపిస్తాయి.

ద్రౌపది స్వయంవరం కూడా ఈనాటి ఆధునిక స్వయం వరంలాంటిదే. తనకు నచ్చిన వరుణ్ని స్వయంగా ఎన్నుకునే స్వేచ్ఛ ఆమెకు అప్పటికే లభించడం, ఆ కాలంలోనే మహిళా స్వాతంత్ర్యానికి ఉన్న ప్రాముఖ్యతను స్పష్టం చేస్తుంది.

ద్యూతక్రీడలో పాండవులు తమ రాజ్యాన్ని, సంపదను కోల్పోయిన తరువాత యుధిష్ఠిరుడు ద్రౌపదిని కూడా పణంగా పెట్టాడు. ఆ సమయంలో కౌరవుల సభలోకి లాగి తీసుకొచ్చినప్పుడు ద్రౌపది మౌనంగా బాధపడలేదు. ఆమె ధైర్యంగా సభలో ఉన్న పెద్దలను ప్రశ్నించింది.

''ముందుగా తనను తాను ఓడిపోయినవాడు తరువాత నన్ను ఎలా పణంగా పెట్టగలడు?'' అనే ఆమె ప్రశ్న ధర్మం, న్యాయం, మహిళా గౌరవం గురించి లోతైన సందేహాన్ని ముందుకు తెచ్చింది.

సభలో భీష్ముడు, ద్రోణుడు వంటి మహానుభావులు ఉన్నప్పటికీ, ఆ ప్రశ్నకు స్పష్టమైన సమాధానం ఇవ్వలేక పోయారు. వారి మౌనం ఆ కాలపు సామాజిక పరిస్థితిని చూపిస్తుంది. కానీ ద్రౌపది మాత్రం తన గౌరవం కోసం నిర్భయంగా నిలబడింది. ఆమె ధైర్యం మహిళా ఆత్మ గౌరవానికి గొప్ప ఉదాహరణగా నిలిచింది.

రాజసూయ యాగం సమయంలో ద్రౌపది నిర్వహించిన పాత్ర అసాధారణమైనది. వేల సంఖ్యలో వచ్చిన అతిథులకు, అభ్యర్థులకు ఎవరికీ ఏ లోటు రాకుండా ఆమె స్వయంగా పర్యవేక్షించింది. ఆతిథ్య మర్యాదలో ఆదర్శమూర్తిగా నిలిచింది.

ఆమె చూపిన గౌరవ మర్యాదలు, ఆతిథ్య నిర్వహణ చూసి అత్తగారైన కుంతీదేవిదేవి సైతం ముగ్ధురాలైంది.

ఒక సామ్రాజ్యపు కోడలిగా తన బాధ్యతను అత్యంత వినయంతో, సమర్థతతో నిర్వర్తించి 'మహారాజ్ఞి' అనే పదానికి పరిపూర్ణ అర్థాన్ని ఇచ్చింది.

అరణ్యవాస సమయంలో సత్యభామ, శ్రీకృష్ణుడు సమేతంగా పాండవులను దర్శించేందుకు వచ్చినప్పుడు, అక్కడ ద్రౌపది దాంపత్య జీవన విధానాన్ని గమనించి ఆశ్చర్యపోతుంది. "ఏమైనా మంత్రం లేదా మందు వేశావా? నీ భర్తలు అంతా నీ మాట వినేలా ఎలా చేసావు? నేను ఒక్కరినే సరిగా అదుపులో పెట్టుకోలేకపోతున్నాను" అని సత్యభామ ప్రశ్నించగా.. దానికి ద్రౌపది ఎంతో గంభీరంగా సమాధానమిస్తుంది: "మగవారిని మంత్రాలు, మందులతో అదుపులో పెట్టుకోవాలని భావించడం తక్కువ ఆలోచన. వారికి గౌరవం ఇవ్వాలి, ప్రేమతో లాలించాలి; అప్పుడు వారు మనస్ఫూర్తిగా మనవారవు తారు" అని వివరిస్తుంది.

ఈ సంభాషణలో ద్రౌపది వ్యక్తిత్వం ప్రతిబింబిస్తుంది. ఆమెకు ఉన్న ఔన్నత్యమైన ఆలోచనలు, సంబంధాల పట్ల ఉన్న గౌరవం, సమతుల్యమైన దృష్టికోణం స్పష్టమవు తాయి.

అరణ్యవాసంలో ఉన్నప్పుడు సైంధవుడు ద్రౌపది పట్ల అత్యంత నీచంగా ప్రవర్తించాడు. అతడిని సంహరించ డానికి భీమార్జునులు సిద్ధపడినప్పుడు, ద్రౌపది తన వ్యక్తిగత కోపాన్ని పక్కన పెట్టి కుల ధర్మాన్ని ఆలోచిం చింది.

"అతడు ఎంతటి అధముడైనప్పటికీ, మన ఆడపడచు దుశ్శలకు భర్త. అతడిని చంపితే ఆమె విధవ అవుతుంది, ఆ శోకం మన కుటుంబానికే మంచిది కాదు" అని వారించింది. తనను అవమానించిన వాడిని కూడా క్షమించగలిగిన ఆమె హృదయం హిమాలయమంత ఉన్నతమైనది.

కురుక్షేత్ర యుద్ధం ముగిశాక, నిద్రపోతున్న తన ఐదుగురు కుమారులను అశ్వత్థామ కిరాతకంగా చంపి నప్పుడు ద్రౌపది గుండె నీరైపోయింది. కళ్ళముందే నిలుచున్న హంతకుడిని చంపే అవకాశం ఉన్నా, ఆమె తన విజ్ఞతను కోల్పోలేదు.

"నేను పడుతున్న పుత్రశోకం మరొక తల్లికి (కృపి.. అశ్వత్థామ తల్లి) కలగకూడదు. గురుపత్ని తన ఒక్కగా నొక్క కుమారుడిని కోల్పోయి విలపించకూడదు" అని అశ్వత్థామను ప్రాణాలతో విడిచిపెట్టమని కోరింది. పుత్రశోకంలోనూ విచక్షణ వీడలేదు.

ద్రౌపది పాత్ర మనకు ఒక గొప్ప సందేశాన్ని ఇస్తుంది.. అన్యాయం ఎక్కడ జరిగినా దాన్ని ప్రశ్నించాలి. గౌరవం కోసం ధైర్యంగా నిలబడటం ప్రతి మనిషి హక్కు. అందుకే ద్రౌపది మహాభారతంలో మాత్రమే కాదు, భారతీయ సంస్కృతిలో కూడా మహిళా చైతన్యానికి శాశ్వత ప్రతీకగా నిలిచింది.

గాంధారి:

గాంధారి ధర్మబద్ధత మరియు త్యాగనిరతి ప్రతీక. గాంధారి పాత్ర అనన్యసామాన్యమైనది. తన భర్త ధృతరాష్ట్రుడు అంధుడని తెలిసి, తానూ లోకాన్ని చూడకూడదని కళ్లకు గంతలు కట్టుకున్న ఆమె త్యాగం ఒక ఎత్తైతే, తన పుత్రులు అధర్మ మార్గంలో నడుస్తున్నప్పుడు వారిని వారించిన ఆమె ధర్మనిష్ఠ మరొక ఎత్తు.

"యతో ధర్మస్తతో జయః" అని కన్నకొడుకు ముఖం మీదే చెప్పగలిగిన ధైర్యం ఆమెది. భర్త పట్ల అనురాగం, ధర్మం పట్ల అంకితభావం రెండింటినీ సమతూకంతో పాటించిన గొప్ప వ్యక్తిత్వం ఆమెది.

సుభద్ర:

సుభద్ర స్వతంత్ర భావజాలం మరియు ధైర్యం చిహ్నం. సుభద్ర పాత్ర నేటి ఆధునిక మహిళలకు ప్రతిరూపంలా కనిపిస్తుంది. ఆమె కేవలం కృష్ణుడి సోదరిగానో, అర్జునుడి భార్యగానో పరిమితం కాలేదు.

అర్జునుడిని ప్రేమించి, అతడిని వివాహం చేసు కోవడంలో ఆమె చూపిన చొరవ, ఆ కాలంలోనే మహిళలకున్న స్వతంత్ర నిర్ణయ శక్తిని చాటిచెబుతుంది.

యుద్ధ రంగంలో అభిమన్యుడి వంటి వీరుడిని తీర్చిదిద్దిన తల్లిగా ఆమె ధైర్యం చిరస్మరణీయం.

సావిత్రి:

మహాభారతంలోని ఉపాఖ్యానంలో సావిత్రి కథ

అత్యంత స్ఫూర్తిదాయకం. మృత్యువును సైతం ఎదిరించగల సంకల్పబలం ఆమె సొంతం. యమ ధర్మరాజుతో వాదించి, తన తెలివితేటలతో, పతిభక్తితో ప్రాణాలను తిరిగి తెచ్చుకున్న ఆమె కథ, మహిళల మేధోశక్తికి మరియు ఆత్మవిశ్వాసానికి నిదర్శనం. అసాధ్యమైన దానిని సుసాధ్యం చేయడంలో మహిళా శక్తికి సాటిలేదని ఆమె నిరూపించింది. ఈ మహిళా పాత్రలు సమాజానికి దిక్సూచీలు. మహాభారతంలోని మహిళలు కేవలం గృహిణులుగా మాత్రమే కాకుండా, క్లిష్ట సమయాల్లో పురుషులకు మార్గదర్శనం చేసిన మంత్రులుగా, ధర్మాన్ని రక్షించిన వీరవనితలుగా కనిపిస్తారు.

ఆధార గ్రంథాలు :

1. వ్యాసభారత ప్రవచనాలు.

★★★

Vol. 23 | Spl. Issue 03 | March 2026 | BHAVAVEENA | ISSN No. : 2456-4702 | RNI No. APTEL/2003/12253

RNI No. APTEL/2003/12253 | Reffered Journal & Peer Reviewed Journals | ISSN No. 2456-4702

భావవీణ

కళలు, సాహిత్య, సాంస్కృతిక భాషాధ్యయన పత్రిక

BHAVA VEENA

Journal of Arts, Literary, Culture & Language Study

స్త్రీ అంతరంగం : అచ్చమాంబ, గురజాడ కథల పరిశీలన

– బండారి శ్రీదేవి

పరిశోధక విద్యార్థి, తెలంగాణ విశ్వవిద్యాలయం.

పరిచయం: స్త్రీ స్వరం వినిపించిన తొలి అడుగులు

తెలుగు సాహిత్యంలో స్త్రీ పాత్రలు ఎప్పటికీ చర్చనీయాంశమే. కానీ స్త్రీ తన స్వరంతో, తన అనుభవాలతో, తన బాధలతో కేంద్రంలోకి వచ్చిన కథలు మాత్రం చాలా తక్కువ. అలాంటి అరుదైన రెండు కథలు - బండారు అచ్చమాంబ రచించిన ''ధనత్రయోదశి'' (1902) మరియు గురజాడ అప్పారావు రచించిన ''దిద్దుబాటు''. ఈ రెండు కథలు స్త్రీని కేంద్రంగా చేసుకుని, ఆమె ఆర్థిక, సామాజిక, కుటుంబపరమైన సంఘర్షణలను చిత్రించాయి.

ఈ వ్యాసంలో ఈ రెండు కథలను స్త్రీ కోణంలో పరిశీలిస్తాను. స్త్రీకి ఆర్థిక స్వేచ్ఛ లేకపోవడం వల్ల కలిగే పరిణామాలు, కుటుంబ వ్యవస్థలో ఆమె పాత్ర, ఆమె స్వాభిమానం, ఆమె తిరుగుబాటు పద్ధతులు - ఇవన్నీ ఈ విశ్లేషణలో భాగమవుతాయి.

మొదటి భాగం: బండారు అచ్చమాంబ – తొలి తెలుగు కథా రచయిత్రి

అచ్చమాంబ జీవితం – స్వయంకృషితో విద్యావతి

బండారు అచ్చమాంబ (1874 - 1905) తొలి తెలుగు కథా రచయిత్రి. ఈమె ఆంధ్ర విజ్ఞాన సర్వస్వం కూర్చిన కొమర్రాజు వేంకట లక్ష్మణరావుకు అక్క. అచ్చమాంబ గురజాడ అప్పారావు కన్నా పదేళ్ళ ముందే 1902 నవంబరు నెలలో 'ధన త్రయోదశి' కథను 'హిందూ సుందరి' పత్రికలో ప్రచురించారు.

అచ్చమాంబ 1874లో కృష్ణా జిల్లా నందిగామ దగ్గర పెనుగంచిప్రోలులో జన్మించారు. ఆమెకు ఆరేళ్ళ వయసులోనే తండ్రి మరణించారు. పదవ ఏటనే ఆమెకు వివాహం జరిగింది. వివాహమయ్యే నాటికి అచ్చమాంబ ఏమి చదువుకోలేదు. కానీ ఆమె తమ్ముడు చదువుకునేటప్పుడు అతనితో పాటు కూర్చుని తానే చదువుకుంటూ తెలుగు, హిందీ నేర్చుకుంది. ఆమెకు ఇంగ్లీషు, గుజరాతీ భాషలలో కూడా ప్రవేశం ఉంది.

1902లో ఓరుగంటి సుందరీ రత్నమాంబతో కలిసి మచిలీపట్నంలో మొదటి మహిళా సమాజం ''బృందావన స్త్రీల సమాజం''ను స్థాపించారు. రాష్ట్రవ్యాప్తంగా పర్యటించి ఎన్నో స్త్రీల సంఘాలు ఏర్పాటు చేశారు. 1905 జనవరి 18న ముప్పై ఏళ్ళ వయసులోనే మరణించారు.

అచ్చమాంబ స్త్రీవాద భావాలు

అచ్చమాంబ స్త్రీల గురించి చాలా స్పష్టమైన భావాలు కలిగి ఉండేవారు. ఆమె ఇలా రాశారు:

''స్త్రీలు అబలలనియు, బుద్ధి హీనులనియు, వివేక శూన్యులనియు, నకల దుర్గుణములకు నివాన స్థలమనియు గొందరు నిందింతురు. స్త్రీలపయిన మోప బడిన ఈ దోషారోపణములన్నియు నబద్ధములనియు

స్త్రీలలో నత్యంత శౌర్యధైర్యవతులును, అసామాన్య విద్యావిభూషితులునూ పూర్వముండిరనియు, నిపుడున్నారు."

స్త్రీలు ఎందుకు వెనుకబడి ఉన్నారో కూడా ఆమె స్పష్టంగా చెప్పారు :

"స్త్రీ యభివృద్ధి లేకుండుటకిట్లు మగవారి పక్షపాతమే మూలం కాని మరొకటి కాదు."

ఈ మాటలు అచ్చమాంబకు స్త్రీల పట్ల ఉన్న గౌరవాన్ని, వారి సామర్థ్యాలపై ఉన్న విశ్వాసాన్ని చూపిస్తాయి.

రెండవ భాగం: గురజాడ అప్పారావు - అభ్యుదయ కవి

గురజాడ జీవితం

గురజాడ అప్పారావు (1862 - 1915) ప్రముఖ తెలుగు రచయిత, సంఘ సంస్కర్త. ఆయన తన రచనల ద్వారా సాంఘిక పరివర్తనకు ప్రయత్నించారు. గురజాడ విశాఖ జిల్లా, రాయవరంలో 1862 సెప్టెంబరు 21న జన్మించారు.

ఆయన ప్రజలందరికీ అర్థమయ్యే వాడుక భాషలో రచనలు చేశారు. వీరి 'కన్యాశుల్కము' నాటకానికి సాహితీ లోకంలో ఒక ప్రత్యేకమైన స్థానం ఉంది. అభ్యుదయ కవితా పితామహుడు అని బిరుదు పొందిన అప్పారావుకు "కవి శేఖర" అనే బిరుదు కూడా ఉంది.

స్త్రీ పట్ల ఆయన దృక్పథం

గురజాడ రచనలలో స్త్రీ పాత్రలకు ప్రత్యేక స్థానం ఉంది. 'కన్యాశుల్కము'లో మధురవాణి పాత్ర ద్వారా, 'దిద్దుబాటు'లో కమలిని పాత్ర ద్వారా ఆయన స్త్రీ స్వేచ్ఛ, స్వాతంత్ర్యం గురించి లోతైన చర్చ చేశారు. స్త్రీలు కేవలం పురుషుల అనుబంధంగా కాకుండా, స్వతంత్ర వ్యక్తిత్వం కలిగిన మానవులుగా ఉండాలనేది ఆయన భావన.

మూడవ భాగం: 'ధనత్రయోదశి' - దారిద్ర్యంలో స్త్రీ మనసు

కథ నడక

"ధనత్రయోదశి" కథ బొంబాయి నగరంలో దీపావళి పండుగ నేపథ్యంలో సాగుతుంది. నగరమంతా దీపాలతో తళతళలాడుతుండగా, ఒక చిన్న కుటీరంలో విజయ లక్ష్మమ్మ పరుల రెవికను కుట్టుకుంటూ తన భర్త రాక కోసం ఎదురుచూస్తూ ఉంటుంది. ఆమెకు ఇద్దరు పిల్లలు - రుక్మిణి, రాముడు.

ఆమె భర్త వేంకటరత్నం ఒక సాహుకారు దగ్గర గుమాస్తాగా పది రూపాయల జీతంతో పనిచేస్తుంటాడు. వీరి పూర్వీకులు గొప్ప ధనవంతులు. కానీ తండ్రి చేసిన ఋణాల వలన వేంకటరత్నం దరిద్రుడై ఉద్యోగం చేస్తూ జీవించవలసి వస్తుంది.

ధనత్రయోదశి రోజున పెద్ద గుమాస్తా కృష్ణమూర్తి వేంకటరత్నాన్ని దొంగతనానికి ప్రేరేపిస్తాడు. వేంకటరత్నం మనసులో నైతిక సంఘర్షణ జరుగుతుంది. చివరకు భార్య విజయలక్ష్మమ్మ చేసిన హితబోధతో అతను దొంగతనం చేయాలనే ఆలోచన మానుకుంటాడు. ఇదంతా సాహు కారు వేంకటసెట్టి చేసిన పరీక్ష అని తరువాత తెలుస్తుంది. సెట్టి వేంకటరత్నానికి జీతం పెంచి, విజయలక్ష్మమ్మను దేవతగా భావిస్తాడు.

విజయలక్ష్మమ్మ - స్త్రీగా ఆమె అనుభవం

విజయలక్ష్మమ్మ పాత్ర ద్వారా అచ్చమాంబ ఒక స్త్రీ యొక్క అంతరంగాన్ని చూపించారు. ఆమె దారిద్ర్యంలో ఉన్నా, తన కుటుంబాన్ని ప్రేమగా చూసుకుంటుంది. పొరుగింట పిల్లలు టపాకాయలు కాల్చుకుంటుంటే, తన పిల్లలు అడగకుండా ఉండటం చూసి ఆమెకు కలిగే బాధ:

"ఇట్టి మంచి బాలుర కోర్కెలు తీర్చుటక్కఁ దగినంత యైశ్వర్యము మనకు లేకపోయెనుగదా యని లక్ష్మమ్మకు విచారము కలిగెను."

ఇది ఒక తల్లి యొక్క మనసు. తన పిల్లల కోర్కెలు తీర్చలేకపోతున్నానే అనే బాధ ఆమెలో ఉంది. కానీ ఆ బాధను ఆమె పిల్లలపై చూపించదు. వారిని ఎప్పుడూ ప్రేమగా చూసుకుంటుంది.

విజయలక్ష్మమ్మ తన భర్తతో ఎలా మాట్లాడుతుందో చూడండి:

"నేనెన్న డైన నగలకనిగాని బట్టలకనిగాని మిమ్ముల నిబ్బంది పెట్టితినా? పిల్లలయిన దబానేదేని తెచ్చుటకై కచ్చ చేసిరా?"

ఈ మాటలు ఆమె తన స్వంత కోరికలను ఎప్పుడూ ముందుపెట్టుకోలేదని చెబుతున్నాయి. ఆమె తనను తాను కుటుంబానికి అంకితం చేసుకుంది.

ఆర్థిక లేమి - స్త్రీకి అది ఇచ్చే బాధ

దారిద్ర్యం ఒక స్త్రీని ఎలా బాధిస్తుందో అచ్చమాంబ చూపించారు. పొరుగింటి పిల్లలు విజయలక్ష్మమ్మ కొడుకు రాముని కొట్టినప్పుడు ఆమెకు కలిగే బాధ:

"నోరెఱ్ఱఁగని తన పాపని నితరులు నిష్కారణముగా దండించుటక్నఁ దమ దారిద్ర దేవతయే కారణముగదా యని తోఁచి యామె కధిక దుఃఖము కలిగెను."

ఈ ఒక్క వాక్యంలో ఎంత బాధ ఉందో! తన కొడుకును ఇతరులు కొట్టడానికి కారణం తమ దారిద్ర్యమే అని ఆమె భావిస్తుంది. ఇది ఒక తల్లికి ఎంతటి వేదనో అర్థం చేసుకోవచ్చు.

విజయలక్ష్మమ్మకు డబ్బు లేదు. కానీ ఆమెకు నైతిక బలం ఉంది. భర్త దొంగతనం చేసి డబ్బు సంపాదించడం కంటే, నిజాయితీగా జీవించడం మేలని ఆమె భావిస్తుంది. ఆమె భర్తకు ఇలా చెబుతుంది:

"సర్వ సాక్షియగు పరమేశ్వరుని మోసపుచ్చి మీరీ కార్యము చేయఁగలరా? ఇట్లు చేసిన పిదప మీ మనసైనను బూర్వమువలె స్వస్థముగా నుండునా? కష్టపడి సంపాదించుకొనిన పదిరూపాయిలను సుఖముగ్నఁ దినినటుల నీ దొంగసామ్మును దినఁగలమా?"

ఈ ప్రశ్నలు చాలా లోతైనవి. దొంగతనం చేసి తెచ్చుకున్న డబ్బుతో సుఖంగా జీవించలేమని, మనస్సాక్షి ఎప్పుడూ వేధిస్తూనే ఉంటుందని ఆమె చెప్పాలనుకుంటుంది.

భర్తతో సంబంధం - భార్యగా, మార్గదర్శినిగా

విజయలక్ష్మమ్మకు భర్తతో ఉన్న సంబంధం చాలా ప్రత్యేకమైనది. ఆమె కేవలం భార్య మాత్రమే కాదు, భర్తకు మార్గదర్శిని కూడా. భర్త తప్పు దారిలో పోతున్నప్పుడు ఆమె అడ్డుకుంటుంది. కానీ ఆ అడ్డుకోవడం కోపంతో కాదు, ప్రేమతో, హితబోధతో చేస్తుంది.

ఆమె మాటలు విన్న వేంకటరత్నం ఇలా అంటాడు:

"నీ సద్బోధవలన నా మనమునందలి యజ్ఞా నాంధకారము తొలఁగెను. నేనిఁక దుష్కార్యమెన్నటికినిఁ జేయను."

విజయలక్ష్మమ్మ చేసిన హితబోధ వలన వేంకటరత్నం తన తప్పును గ్రహించి, సన్మార్గంలో నడవడమే కాక, సెట్టిగారి ప్రశంసలను కూడా పొందుతాడు.

వేంకటరత్నం తన భార్యను చూసి ఇలా అంటాడు:

"నాదగ్గిర నీ రూపముతోఁ బ్రత్యక్ష లక్ష్మియే యుండఁగా నాకా లోహమయలక్ష్మితోఁ బ్రయోజనమేమి? నేనీ లక్ష్మినే పూజించెదను."

ఈ మాటల్లో భార్య పట్ల అతనికి ఉన్న గౌరవం కనిపిస్తుంది. సంపద కంటే సద్గుణాలు మిన్న అని అతను గ్రహిస్తాడు.

స్త్రీగా విజయలక్ష్మమ్మ సాధించిన విజయం

విజయలక్ష్మమ్మ తన పేరుకు తగ్గట్టే విజయం సాధించింది. ఆమె తన నైతిక బలంతో భర్తను దుర్మార్గం నుండి కాపాడింది. సెట్టిగారు ఆమెను దేవతగా భావించటం ద్వారా ఆమె సద్గుణాలకు గుర్తింపు లభించింది.

కానీ ఇక్కడ ఒక స్త్రీవాద ప్రశ్న ఉంది. విజయలక్ష్మమ్మ తన స్వంత కోరికల కోసం కాదు, కుటుంబం కోసమే పోరాడింది. ఆమె స్వంత గుర్తింపు కోసం కాదు, భర్త గుర్తింపు కోసమే పోరాడింది. ఇది సంప్రదాయ స్త్రీకి తగిన లక్షణమే. కానీ ఆధునిక స్త్రీవాద దృక్పథంలో, స్త్రీ తన కోసం కూడా జీవించాలి అనే భావన ఉంది.

నాల్గవ భాగం: 'దిద్దుబాటు' - తిరుగుబాటు చేసిన స్త్రీ కథ నడక

"దిద్దుబాటు" కథ గోపాలరావు, అతని భార్య కమలిని చుట్టూ తిరుగుతుంది. గోపాలరావు రాత్రుళ్ళు ఇంటికి ఆలస్యంగా వచ్చేవాడు. ఒకరోజు అర్ధరాత్రి ఇంటికి వచ్చిన అతనికి భార్య కమలిని కనిపించదు. ఆమె రాసిన లేఖ దొరుకుతుంది. ఆ లేఖలో ఆమె ఇలా రాసింది:

"పది దినములాయె. రాత్రులు నింటికి మీ రాకయే నే నెరుగను. మీటింగులక్నఁ బోవుచుంటిమంటిరి.

లోకోపకారములగు నుద్యమముల నిదుర మాని చేయుచుంటిమంటిరి. మా చెలుల వలన నిజము నేర్చితిని. నేనింట నుండుటను గదా మీరు కల్లలు పలుకవలసి వచ్చె. నేను పుట్టింటనున్న మీ స్వేచ్ఛకు నిర్బంధమును, అసత్యమునకు అవకాశము కలుగ కుండును."

లేఖ చదివిన గోపాలరావుకు తన తప్పు అర్థమవు తుంది. అతను "నేను పశువును" అంటాడు. చివరకు కమలిని మంచం క్రింద నుండి బయటకు వస్తుంది. అంతా ఆమె చేసిన పరిహాసమని తెలుస్తుంది.

కమలిని పాత్ర - స్వాభిమానంతో నిండిన స్త్రీ

కమలిని పాత్ర విజయలక్ష్మమ్మకు పూర్తి భిన్నమైనది. ఆమె విద్యావంతురాలు, స్వాభిమానం ఉన్న స్త్రీ. ఆమె తన భర్త చేస్తున్న అబద్ధాలను సహించదు. ఆమె చేసే తిరుగుబాటు చాలా స్పష్టంగా, బహిరంగంగా ఉంటుంది. **కమలిని రాసిన లేఖ ఆమె మనస్తత్వాన్ని ప్రతి బింబిస్తుంది. ఆమె భర్తకు ఇలా రాస్తుంది:**

"నేను పుట్టింటనున్న మీ స్వేచ్ఛకు నిర్బంధమును, అసత్యమునకు అవకాశము కలుగకుండును."

ఈ మాటలు చాలా లోతైనవి. తన ఉనికి వలన భర్త అబద్ధాలు చెప్పవలసి వస్తుందనే ఆమె ఆలోచన - ఇది ఆమె ఆత్మగౌరవానికి నిదర్శనం. ఆమె తనను తాను భర్త స్వేచ్ఛకు అడ్డుగా భావించడం లేదు. బదులుగా, భర్త యొక్క అబద్ధాలకు తాను కారణం కాకూడదని భావిస్తుంది.

కమలిని చేసే తిరుగుబాటు పద్ధతి కూడా చాలా ప్రత్యేకమైనది. ఆమె బహిరంగంగా భర్తను ఎదిరించడం లేదు. గొడవ పెట్టుకోవడం లేదు. ఆమె నిశ్శబ్దంగా, గౌరవంగా, తన నిర్ణయాన్ని తెలియజేస్తూ వెళ్ళిపోతుంది. ఇది ఆమె వ్యక్తిత్వానికి, విద్యకు తగినట్లుగా ఉంటుంది.

పుట్టింటి ఆధారం - స్త్రీకి అది ఇచ్చే బలం

కమలిని నిర్ణయం వెనుక ఒక ముఖ్యమైన అంశం ఉంది - ఆమెకు పుట్టింటి ఆధారం ఉంది. ఆమె "పుట్టింటికి జనియెద" అని చెప్పడం ద్వారా, ఆమెకు ఆర్థికంగా భర్తపై పూర్తిగా ఆధారపడి లేదని తెలుస్తుంది.

స్త్రీకి పుట్టింటి ఆధారం ఎంత ముఖ్యమో ఈ కథ చెప్పకనే చెబుతుంది. భర్త తప్పు చేస్తున్నా, ఆర్థికంగా పూర్తిగా ఆధారపడి ఉండే స్త్రీ అతన్ని వదిలి వెళ్ళలేదు. కానీ కమలినికి పుట్టింటి ఆధారం ఉండడం వలన, ఆమె తన స్వాభిమానాన్ని కాపాడుకోగలిగింది.

ఇది స్త్రీకి ఆర్థిక స్వేచ్ఛ ఎంత ముఖ్యమో చూపిస్తుంది. ఆర్థిక స్వేచ్ఛ ఉన్న స్త్రీ మాత్రమే తన గౌరవం కోసం పోరాడగలదు. లేకపోతే, భర్త చేసే తప్పులను సహించక తప్పదు.

భర్తతో సంబంధం - సమానత్వం కోసం ప్రయత్నం

గోపాలరావు, కమలిని సంబంధం సంప్రదాయ భార్యాభర్తల సంబంధం కాదు. గోపాలరావుకు స్త్రీ గౌరవం గురించి తెలుసు. అతను రాముడితో ఇలా అంటాడు:

"శివుఁడు పార్వతికి సగము దేహము పంచి యిచ్చాడు. ఇంగ్లీషువాఁడు భార్యను బెటర్ హాఫ్ అన్నాడు. అనగా పెళ్ళాము మొగునికన్న దొడ్డది అన్నమాట."

కానీ అతను ఆచరణలో మాత్రం ఈ విషయాన్ని పాటించలేదు. అతను రాత్రుళ్ళు ఇంటికి ఆలస్యంగా వచ్చేవాడు, అబద్ధాలు చెప్పేవాడు. కమలిని వెళ్ళిపోవడం వలన అతనికి పాఠం బాగా నేర్పింది.

లేఖ చదివిన తరువాత గోపాలరావు "నేను పశువును" అంటాడు. ఇది అతనిలో వచ్చిన మార్పును చూపిస్తుంది. అతను తన తప్పును గ్రహించి, భార్యను తిరిగి తీసుకు రావడానికి ప్రయత్నిస్తాడు.

కానీ కమలిని మంచం క్రింద దాగి ఉండడం, చివరకు నవ్వుతూ బయటకు రావడం - ఇది ఆమె చేసిన పరిహాసం. ఆమె భర్తకు పాఠం నేర్పాలనుకుంది. అతన్ని నిజంగా వదిలి వెళ్ళిపోవాలనుకోలేదు. ఇది ఆమె ప్రేమను, ఆమెకు అతనిపై ఉన్న అభిమానాన్ని చూపిస్తుంది.

ఐదవ భాగం: రెండు కథల్లోని స్త్రీలు - ఒక పోలిక

ఇద్దరి స్త్రీల మనస్తత్వం

విజయలక్ష్మమ్మ, కమలిని - ఈ ఇద్దరు స్త్రీలు వేర్వేరు కాలాలకు, వేర్వేరు సామాజిక స్థితిగతులకు చెందినవారు.

కానీ ఇద్దరికీ ఒక సామ్యం ఉంది - వారి నైతిక బలం, కుటుంబం పట్ల ఉన్న నిబద్ధత.

విజయలక్ష్మమ్మ తిరుగుబాటు అంతర్గతమైనది. ఆమె భర్తను బహిరంగంగా ఎదిరించదు. కానీ తన హితబోధతో అతని మనసును మారుస్తుంది. ఇది సంప్రదాయ స్త్రీకి తగిన పద్ధతి.

కమలిని తిరుగుబాటు బహిరంగమైనది. ఆమె లేఖ రాసి, ఇంటి నుండి వెళ్ళిపోతుంది. ఇది ఆమె భర్తకు ఒక షాక్ లాంటిది. ఇది ఆధునిక స్త్రీకి తగిన పద్ధతి.

ఆర్థిక స్థితి - స్త్రీ నిర్ణయాలపై దాని ప్రభావం

విజయలక్ష్మమ్మకు ఆర్థిక స్వేచ్ఛ లేదు. ఆమె భర్తపై పూర్తిగా ఆధారపడి ఉంది. అందుకే ఆమె తిరుగుబాటు బహిరంగంగా చేయలేదు. కానీ ఆమెకు నైతిక బలం ఉంది. ఆ బలంతో భర్తను మార్చగలిగింది.

కమలినికి పుట్టింటి ఆధారం ఉంది. ఆమెకు ఆర్థిక స్వేచ్ఛ ఉంది. అందుకే ఆమె బహిరంగంగా తిరుగుబాటు చేయగలిగింది. ఇది స్త్రీకి ఆర్థిక స్వేచ్ఛ ఎంత ముఖ్యమో చూపిస్తుంది.

ఇద్దరి స్త్రీలు - ఇద్దరి విజయం

విజయలక్ష్మమ్మ తన నైతిక బలంతో భర్తను దుర్మార్గం నుండి కాపాడింది. ఆమె సద్గుణాలకు సెట్టిగారి నుండి గుర్తింపు లభించింది. ఇది ఆమె విజయం.

కమలిని తన స్వాభిమానాన్ని కాపాడుకుంది. భర్తకు పాఠం నేర్పింది. అతనిలో మార్పు తీసుకువచ్చింది. ఇది ఆమె విజయం.

ఇద్దరు స్త్రీలు వేర్వేరు పద్ధతుల్లో తమ లక్ష్యాన్ని సాధించారు. ఇద్దరి పద్ధతులు వారి వారి పరిస్థితులకు, వ్యక్తిత్వాలకు తగినట్లుగా ఉన్నాయి.

ఆరవ భాగం: స్త్రీ కోణంలో ఈ కథల ప్రాముఖ్యత

స్త్రీకి స్వరం ఇచ్చిన కథలు

ఈ రెండు కథలు స్త్రీకి స్వరం ఇచ్చాయి. ఇవి స్త్రీల అనుభవాలను, వారి సమస్యలను, వారి ఆలోచనలను ప్రతిబింబిస్తాయి. 1902లోనే అచ్చమాంబ ఇలాంటి కథ రాయడం చాలా గొప్ప విషయం.

అచ్చమాంబ స్త్రీల గురించి ఇలా రాశారు:

"స్త్రీల బుద్ధి పురుష బుద్ధి కన్న మందమనియు, స్త్రీల మెదడు మస్తిష్కము, పురుషుల మస్తిష్కము మెదడు కన్న బలహీనమగుటచే దక్కువ తూగుననియు వ్రాయు వ్రాత పక్షపాతము కలదనుట నిర్వివాదమే."

ఈ మాటలు నేటికీ సంబంధితంగానే ఉన్నాయి. స్త్రీలు పురుషులకు తక్కువ కాదని, వారికి అవకాశాలు దొరక్క పోవడమే వారి వెనుకబాటుకు కారణమని ఆమె స్పష్టంగా చెప్పారు.

స్త్రీల స్వాభిమానం

ఈ రెండు కథలు స్త్రీల స్వాభిమానాన్ని చూపిస్తాయి. విజయలక్ష్మమ్మ దారిద్ర్యంలో కూడా తన స్వాభిమానాన్ని కోల్పోదు. భర్త దొంగతనం చేస్తే వచ్చే డబ్బు కంటే, నిజాయితీగా జీవించడం మేలని భావిస్తుంది.

కమలిని తన స్వాభిమానాన్ని కాపాడుకోవడానికి ఇంటి నుండి వెళ్ళిపోతుంది. ఆమె తన భర్త చేస్తున్న అబద్ధాలను, నిర్లక్ష్యాన్ని సహించదు. ఇది స్త్రీకి కూడా గౌరవం ముఖ్యమని చూపిస్తుంది.

కుటుంబ వ్యవస్థలో స్త్రీ పాత్ర

ఈ రెండు కథలు స్త్రీకి కుటుంబంలో ఉన్న ప్రాధాన్యతను చూపిస్తాయి. విజయలక్ష్మమ్మ లేకపోతే, వేంకటరత్నం దొంగతనం చేసి, తన జీవితాన్ని నాశనం చేసుకునేవాడు. కమలిని లేకపోతే, గోపాలరావు తన తప్పును గ్రహించి, మారే అవకాశం లేదు.

స్త్రీ కుటుంబానికి వెన్నెముక వంటిది. ఆమె నిర్ణయాలు, ఆలోచనలు, చర్యలు కుటుంబం యొక్క గతిని నిర్ణయిస్తాయి. ఈ రెండు కథలు ఈ సత్యాన్ని చాలా స్పష్టంగా చూపించాయి.

ముగింపు: స్త్రీ శక్తికి నిదర్శనం

బండారు అచ్చమాంబ రచించిన "ధనత్రయోదశి" మరియు గురజాడ అప్పారావు రచించిన "దిద్దుబాటు" కథలు తెలుగు సాహిత్యంలో స్త్రీ పాత్రలకు ప్రత్యేక స్థానాన్ని కల్పించాయి. ఈ రెండు కథలు స్త్రీకి కుటుంబంలో, సమాజంలో ఉన్న శక్తిని, ప్రభావాన్ని స్పష్టంగా చూపించాయి.

విజయలక్ష్మమ్మ దారిద్ర్యంలో కూడా తన నైతిక బలాన్ని కోల్పోకుండా, భర్తను దుర్మార్గం నుండి కాపాడింది. ఆమె తన హితబోధతో భర్త మనసును మార్చి, కుటుంబాన్ని నాశనం నుండి రక్షించింది. ఇది స్త్రీకి ఉన్న అంతర్గత శక్తిని, నైతిక దృఢత్వాన్ని చూపిస్తుంది.

కమలిని తన స్వాభిమానాన్ని కాపాడుకోవడానికి సంప్రదాయాలను ధిక్కరించి, భర్తలో మార్పు తీసుకువచ్చింది. ఆమె తిరుగుబాటు స్త్రీకి కూడా గౌరవం, స్వేచ్ఛ ఉండాలనే సందేశాన్ని ఇస్తుంది.

ఈ రెండు కథలు స్త్రీ తన నైతిక బలంతో, వివేకంతో, స్వాభిమానంతో కుటుంబాన్ని, సమాజాన్ని మార్చగలదని నిరూపించాయి. స్త్రీకి స్వేచ్ఛ, విద్య, స్వాతంత్ర్యం ఇస్తేనే సమాజం అభివృద్ధి చెందుతుందనే సందేశాన్ని ఈ కథలు నేటికీ చాటుతున్నాయి.

అచ్చమాంబ చెప్పిన మాటలు నేటికీ గుర్తుంచుకోవాలి:

"స్త్రీలకు విద్య నేర్పిన యెడలను, వారికి స్వాతంత్ర్య మోసగిన యెడలను, వారు చెడిపోవుదురనియు, బతుల నవమానించెదరనియు, గుటుంబ సౌఖ్యమును నాశనము చేసేదరనియు గొందరు మహానుభావులు వక్కాణించెదరు. ఈ యారోపణములన్నియు నిరర్థకములనియు, స్త్రీవిద్య దురాచార ప్రతీకారానుకూలమగునే కాని దురాచార ప్రవృత్త్యనుకూలము గానేరదనియు, స్త్రీ విద్యా స్వాతంత్ర్యముల వలన దేశానికి లాభమే గాని నష్టముం గలుగనేరదనియు, స్త్రీ విద్య యత్యంతా వశ్యకం."

ఉపయుక్త గ్రంథాలు

1. అచ్చమాంబ, బండారు. "ధనత్రయోదశి." హిందూ సుందరి పత్రిక, నవంబర్ 1902.
2. అప్పారావు, గురజాడ. "దిద్దుబాటు." గురజాడ కథలు, విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్, 1962.
3. అచ్చమాంబ, బండారు. "అబలా సచ్చరిత్రమాల." చింతామణి ముద్రణాలయం, 1900.
4. కాత్యాయనీ విద్మహే. "సంప్రదాయ సాహిత్యం - స్త్రీవాద దృక్పథం." 1998.
5. చిదానందం, ఐ. "స్త్రీ వాద సాహిత్య విమర్శ - ఒక పరిశీలన."
6. లక్ష్మి, డా. పి. "కవయిత్రుల కవిత్వంలో స్త్రీల మనోభావాలు."
7. వికీపీడియా సహాయకులు. "బండారు అచ్చమాంబ." వికీపీడియా.
8. వికీపీడియా సహాయకులు. "గురజాడ అప్పారావు." వికీపీడియా.

★★★

Vol. 23 | Spl. Issue 03 | March 2026 | BHAVAVEENA | ISSN No. : 2456-4702 | RNI No. APTEL/2003/12253

RNI No. APTEL/2003/12253 | Reffered Journal & Peer Reviewed Journals | ISSN No. 2456-4702

భావవీణ

కళలు, సాహిత్య, సాంస్కృతిక భాషాధ్యయన పత్రిక

BHAVA VEENA

Journal of Arts, Literary, Culture & Language Study

రామాయణం - మహిళా చైతన్యం

- చొడ శ్రీనివాస్

స్కూల్ అసిస్టెంట్ తెలుగు, మున్సిపల్ కార్పొరేషన్ హై స్కూల్, అరసవల్లి, శ్రీకాకుళం జిల్లా.

ఉపోద్ఘాతం:

ప్రాచీన భారతీయ ఇతిహాసాలలో సంస్కృత ఆది కవి వాల్మీకి విరచితమైన రామాయణం సకల జనులకు శిరోధార్యం. ప్రపంచ సాహిత్యములోనే ఆదికావ్యం రామాయణం. రాస్తున్నాను సీతాయాచరితం మహత్ "అనే పేరుతో ప్రసిద్ధి చెందిన రామాయణం ఆరుకాండలతో 24 వేల శ్లోకాలతో రాయబడినది. యత్రనార్యస్తూ పూజ్యంతే రమంతె తత్రదేవతః అన్న ఆర్యోక్తికి నిలువెత్తు టద్దముగా రామాయణంలో అనేక స్త్రీ పాత్రలు మహిళా చైతన్యానికి స్ఫూర్తిగా నిలిచాయి. ప్రతి పురుషుని వెనుక విజయానికి స్త్రీ కారకరాలు అనేది ఎంతో వాస్తవం. రామాయణంలో చైతన్య స్ఫూర్తిని నింపే కొన్ని పాత్రలలో కొన్నింటిని ఈ పరిశోధనా వ్యాసంలో వివరించడం అయినది. ముఖ్యంగా కౌసల్య, సుమిత్ర, కైక, సీత, అహల్యా, త్రిజట, మంధర, ఇలా ఎందరో స్త్రీల గురించి గురించి చెప్పవచ్చు.

విషయ వివరణ:

1. కౌసల్య :

కోసల దేశపు రాజు అయిన భానుమంతని కుమార్తె. దశరథ మహారాజు భార్య. లోక కంటకుడైన రావణా సురుని సంహరించడానికి తన గర్భమునందు సాక్షాత్తు శ్రీ మహా విష్ణువు యొక్క అంశమును మోసిన అదృష్టశీలి. తన సవతలైనట్టి సుమిత్ర, కైకే పట్ల వాత్సల్యాన్ని చూపించిన పట్టమహిషి. శ్రీరామునకు ఎన్నో సుగుణా లను నేర్పిన మాతృమూర్తి. శ్రీరామునితో''ఓ రామా ఎల్లప్పుడూ సత్పురుషులు బాటలోనే నడువు. నీ ధర్మమే నీకు రక్ష. నువ్వు చేసిన తల్లిదండ్రులు సేవ, నీ సత్య బలం నీకు రక్షగా ఉంటాయని శ్రీరామునికి హితబోధ చేసింది. ఎలాంటి బాధలు కలుగకుండా సర్వ విజయాలు చేకూరాలని శుభాశీస్సులు కూడా అందించింది. కుమారునికి కర్తవ్య నిర్వహణలో ఏ విధంగా మెలగాలో చక్కగా వివరించిన చైతన్య శీలి కౌసల్య.

2. సుమిత్ర:

దశరథు మహారాజు రెండవ భార్య. తన భర్త చేసిన పుత్రకామేష్టి యాగములో యజ్ఞ భాగమును కౌసల్య కైకేయులకు ఇచ్చెను. వారిరువురూ చిరు సగము ఈమెకు ఇచ్చరి. సుమిత్ర గర్భాన సామిత్రుడు అయినట్టి లక్ష్మణుడు మరియు శత్రుఘ్నుడు జన్మించును. సుమిత్ర తన కుమారులకు చక్కని నీతిని బోధించడమే కాక, అరణ్యవాసములో శ్రీరామునికి తోడు గా లక్ష్మణుడు వెంట వెళతాను అంటే నిరంతరం అన్నకి ఏ కష్టం కలగ కుండా కాపు కాయమని, అన్న బాటలో నడవమని, సీతమ్మ నీ తల్లిగా తలచి ముందుకు సాగమని అన్నా

వదినలకు ఏ కష్టం కలగకుండా చూడమని చెప్పిన చైతన్య సాధ్విమని సుమిత్ర.

3. కైక :

లోకములో ఈమె చెప్పుడు మాటలకు లొంగిన స్త్రీగా పరిగణించినప్పటికీ, ఈమె లేకపోతే రామాయణంలో దుష్ట రాక్షస సంహారకార్యము నెరవేరి ఉండేది కాదు. కైక యుద్ధ విజేత. వీరురాలు, సాహసి. దశరథ మహారాజు మూడో భార్య. కేకయ రాజు కుమార్తె. దవలాంగుడు అనే ముని వలన రాక్షస మాయిలకు ప్రతీకారము చేయుట నేర్చు కున్న వీరురాలు. శంబరాసునితో యుద్ధము చేయుచున్న ఇంద్రునికి సహాయముగా వెళ్లిన తన భర్త వెంట ఈమె కూడా సహాయముగా వెళ్ళను. దశరథుడు ఈమె చేసినా ఉపకారానికి సంతుష్టుడై వరాలు కోరుకోమని అడిగెను. శ్రీరామ పట్టాభిషేక సమయములో మందర చెప్పుడు మాటలకు మొదట లొంగకపోయినా మందర పరిపరి విధాలుగా దుర్బోధ చేయటం మూలంగా రెండు వరాలు కోరి రాముడు అరణ్యవాసానికి మూలమైనది. ఏది ఏమైనప్పటికీ దుష్ట రావణ సంహారం జరిగింది. లోకంలో నిందలపాలు పొందినప్పటికీ ఈమె చేసిన కార్యము లోకహితమని చెప్పవచ్చు.

4. తాటకి :

ఒక రాక్షసి. సుకేతుని కూతురు. వేయి ఎనుగులు బలము కలది. సునందునితో వివాహం అయ్యెను. తాటకి అత్యంత సౌందర్యరాశి. ఒక సందర్భంలో అగస్యుని యొక్క శాపమునకు గురి అయ్యి వికృతి రూపాన్ని పొందినది. మారీచుడు, సుభాహుడు అనే ఇరువురు కుమారులను కన్నది. విశ్వామిత్రుని యొక్క యాగము ను భంగం చేయుట కారణంగా శ్రీరాముని చేతిలో మరణించింది.

5. అహల్య :

ముద్గలుని కుమార్తె. బ్రహ్మ అహల్యను గౌతము నికి ఇచ్చి వివాహం చేసెను. ఇంద్రుడు చేసిన తప్పిదానికి శాపానికి గురి అయ్యి, భర్త మాట జవదాటకుండా గౌతముడు చెప్పినట్లే పాషాణముగా అడవిలో చాలా సంవత్సరాలు ఉంది. శ్రీరాముని పాద ధూళి తగిలి నిజరూపాన్ని పొందినది. భర్త పట్ల అత్యంత అనురాగం కలది. భర్త మాటను జవదాటని ఇల్లాలు.

6. సీత :

శ్రీరామచంద్రుని భార్య. సాక్షాత్తు లక్ష్మీ అవతారం. అయోనిజ. జనక మహారాజు భూమిని దున్నుచుండగా నాగటి చాలు లో ఒక బంగారపు పెట్టి యందు దొరికిన వేదవతి. జనక మహారాజు చేపట్టిన సీతా స్వయంవరంలో సాక్షాత్తు శ్రీరామచంద్రుడే శివధనస్సును ఎక్కిపెట్టి ఈమెను పరిణయమాడెను. శ్రీరాముడు వనవాసానికి బయలుదేరినప్పుడు నతులకు, పతులను బాసి యుండుట ధర్మము కాదని ధర్మోక్తులను పలికెను. అరణ్యవాసములో పంచవటిలో కాలాన్ని వెల్లబుచ్చిన సీత, తాను ఆగర్భ శ్రీమంతురాలు అయినప్పటికీ భర్త తోడిదే తనకు లోకమని భావించిన పరమ సాధ్విమని. కష్టకాలంలో ఉన్న ఇంటికి వచ్చిన అతిధిని గౌరవించాలి అన్న అతిధి దేవోభవ అన్న సూక్తికి నిలువెత్తు నిదర్శనం. రావణుడు అపహరించినప్పటికీ భయపడక తన మెడలోని ఆభరణాలనుఋష్యముఖ పర్వతంపై జారవిడిచి తన ఆనవాలు తెలిసేటట్టు చేసిన ధైర్య శీలి. కష్టం వచ్చినప్పుడు ధైర్యంతో ఉండాలని, తెలివి ఏమాత్రం కోల్పోకూడదు అని గుర్తు చేసిన స్త్రీ. రావణుడు ఎన్నో మాయమాటలు చెప్పి భయపెట్టినప్పటికీ భయపడక, తన భర్త ఎక్కడికి వచ్చి నిన్ను చంపి తనను తీసుకుని వెళ్తాడని నిర్భయంగా పలికిన దీరురాలు. పర పురుష వ్యామోహం గాని, పరులను కన్నెత్తి చూడనీ సాధ్విలలామా. లోక అప నందుకు తలోగ్గక భర్త చెప్పినట్లుగా అగ్ని ప్రవేశం చేసిన పరమ పునీత. పతియే ప్రత్యక్ష దైవము అని భావించిన సీత నేటి లోకానికి ఆదర్శప్రాయం. శోకము, ఆలోచన లను లేకుండా చేస్తుందని, కష్టాల్లో కూడా ధైర్యముగా ముందడుగు వేయాలని సీత పాత్ర ద్వారా తెలుసు కోవచ్చు.

7. ఊర్మిళ :

సీత పిన తండ్రి కుమార్తె. లక్ష్మణుని భార్య. భర్త మాటను జవదాటని ఇల్లాలు. భర్త సుఖం కోసం తన సుఖాన్ని త్యాగం చేసిన త్యాగమయి. లక్ష్మణుడు అన్నతో

కలిసి అరణ్యవాసాన్ని పూర్తిచేసి తిరిగి వచ్చేంతవరకు ప్రవళింపు సేవలో ఉన్న ఊర్మిళ కర్తవ్య నిర్వహణలో ఎన్ని కష్టాలు ఎదురైనప్పటికీ భర్తతోపాటు భాగం పంచుకోవాలి తప్ప వెనుకడుగు వేయరాదని సూచించిన కార్యశీలి.

8. త్రిజట :

విభీషుని కూతురు. లంకా పట్టణమునందు సీతమ్మ వారికి కావలాగా ఉండిన రాక్షసి. ఒకనాడు తన స్వప్నములో కనిపించిన విషయాలను రాక్షస స్త్రీలందరూ తెలియజేసి, సీత పరమ సాధ్వియని , ఆమెను కష్టపెట్టడం మనకు మంచిది కాదని, తనకు వచ్చిన కలలో శ్రీరామచంద్రుడు సముద్రము దాటి వచ్చినట్లుగా, రావణాసురుడు యుద్ధంలో మరణించినట్లుగా చెప్పి రాక్షస స్త్రీలను ఎట్టి పరిస్థితుల్లో సీతకి హాని కలిగించ కుండేలా జాగ్రత్తగా ఉండమని సూచించింది. రాబోయే ఆపదను ముందుగానే పసిగట్టి విషయాన్ని వివరించి చెప్పడంలో త్రిజట ఆరితేరినది.

ముంగింపు :

కాలాలు మారిన, తరాలు మారిన, ఎప్పటికీ వన్నె తరగనిది.''న భూతో న భవిష్యతి '' అన దగిన మన భారతీయ ఇతిహాసమైన రామాయణం అందరికీ ఆదర్శ గ్రంథం చిన్న,పెద్ద, ముసలి ముతక బేధం లేకుండా అందరూ చదువదగిన ఆచరణీయగ్రంథం.ఆరు కాండలు, ప్రతీ కాండలో నేటి సమాజ పరిస్థితికి దగ్గరగా చూపెడు తున్న విలువైన సమాచారం.అందుకే అందరూ రామా యణం చదవాలి.రామాయణ కాలం నాటి స్త్రీ ల చైతన్యం అర్థం చేసుకోవడానికి ప్రయత్నం చేయాలి.నేటి తరం స్త్రీలలో చైతన్యం రావాలని ఆశిద్దాం.

★★★

Vol. 23 | Spl. Issue 03 | March 2026 | BHAVAVEENA | ISSN No. : 2456-4702 | RNI No. APTEL/2003/12253

RNI No. APTEL/2003/12253 | Reffered Journal & Peer Reviewed Journals | ISSN No. 2456-4702

భావవీణ

కళలు, సాహిత్య, సాంస్కృతిక భాషాధ్యయన పత్రిక

BHAVA VEENA

Journal of Arts, Literary, Culture & Language Study

ముక్కు తిమ్మన ప్రబంధ నాయిక - సత్యభామ పాత్రౌచిత్యం

- డా॥. లెంక సత్యనారాయణ

అసోసియేట్ ప్రొఫెసర్, తెలుగు, కాకతీయ ప్రభుత్వ కళాశాల, హనుమకొండ, తెలంగాణ.

ఆంధ్ర పంచమహాకావ్యాలలో పారిజాతాపహరణం ఒకటి. పారిజాతాపహరణం కావ్య రచయిత నంది తిమ్మన. నంది తిమ్మన 16వ శతాబ్దికి చెందినవాడు. కృష్ణదేవ రాయుల ఆ స్థానంలో అష్టదిగ్గజాలలో ఒకడు. "పారి జాతాపహరణం" కావ్యాన్ని కృష్ణదేవరాయులకు అంకితం చేసెను. ఇతడు 'అరణం కవి అని లోకప్రసిద్ధి. కృష్ణదేవ రాయుల భార్య తిరుమలదేవి వెంట అరణంగా వచ్చి నాడని, కృష్ణదేవరాయులుకు, రాణి గారికి వచ్చిన అపార్థాన్ని తొలగించడానికి పారిజాతపహరణంను రాసాడని చెబుతారు. ఇతని తాతా నంది మల్లయ్య, మేనమామ ఘంటసింగన. తిమ్మన శివ భక్తుడు. నంది తిమ్మనను ముక్కు తిమ్మన అనిడూడా పిలుస్తారు. "ఈనానుడి తిమ్మన పద్యరచనా రీతిని బట్టి,శైలీ శయ్యాది సౌభాగ్యాన్ని బట్టి ఏర్పడి ఉంటుంది. పాత్రను బట్టి శైలిని మార్చడం, సామెతలు, సూక్తులు ప్రయోగించడం, సమయోచిత ఉపమానాలు ప్రయోగించడం, తెలుగు నుడికారాన్ని వాడడం, చమత్కారంగా చెప్పడం మొదలైన వాటి వల్ల ఇవి ముద్దుపలుకులు అనిపిస్తాయి[1].

నంది తిమ్మనకు ముక్కు తిమ్మన అను వేరొక నామాంతరం లోకంలో గల వాడుక.

"నానాసూనవితానవసనల నానందించు సారంగమే
షానాకృతి బూనిసర్వసుమనస్సారభ్య సంవాసియై
వూనెంబ్రేక్షణ మాలికామధుకరీ
పుంజంబులిర్వంకలన్"

"ముక్కు తిమ్మనార్యు ముద్దుపలుకు" అని ప్రాచీన పండితుల అభిప్రాయం.

వేటూరి ప్రభాకరశాస్త్రి "పురాణాలు అరణ్యాలలాంటివి ప్రబంధాలు ఉద్యనవనాల లాంటివి" అని అన్నాడు.

ప్రబంధం :

15వ శతాబ్ది నాటికి తెలుగు సాహిత్యంలో అభివృద్ధి చెందిన సాహిత్య ప్రక్రియా భేదం ప్రబంధం ప్రకృష్టమైన పదబంధమున్న కావ్యం ప్రబంధం. ప్రబంధమనగా కావ్యమనే అర్థంలో తిక్కన తాను రాసిన 15 పర్వాలను ప్రబంధ మండలి అని పేర్కొనెను. ఎఱ్ఱనకు ప్రబంధ పరమేశ్వరుడు అను బిరుదు గలదు. ఈ ప్రబంధ శబ్దానికి ప్రక్రియపరమైన ప్రబంధ శబ్దానికి భేదం ఉన్నది. నన్నెబోడుడు కుమార సంభవంలో అష్టాదశ వర్ణనలతో పాటు అనేక వర్ణనలు చేశాడు. శ్రీనాథుడు, పిల్లలమర్రి అష్టాదశ వర్ణనలో కొన్నింటిని రసరమ్యంగా వర్ణించెను. కొన్ని ప్రబంధ ప్రక్రియా లక్షణాలు లేకపోవడం వలన అవి ప్రబంధాలుగా గుర్తింపు పొందలేదు. పెద్దన రాసిన మనుచరిత్ర బహుళ ఆదరణ పొంది ప్రబంధ ప్రక్రియకు రాజాదరణ సంపాదించి పెట్టింది. ప్రబంధ లక్షణాలు,

విమర్శకుల అభిప్రాయం. పింగళి లక్ష్మీకాంతం "ప్రబంధమునకు ఏక నాయకాశ్రయత్వము, దానితో పాటు వస్తైవక్యము ప్రధాన ధర్మములు. ప్రబంధము అష్టాదశ వర్ణనాత్మకమై యుండవలెను. అందు శృంగారము ప్రధానరసం. ఆవశ్యకతను బట్టి తక్కిన రసములు గౌణము కావచ్చును. అలంకారిక శైలి ప్రబంధమునకు జీవము. ప్రబంధము భాషాంతరీకరణము కాకుడదు. స్వతంత్రరచనయై యుండవలెను. పదునారవ శతాబ్ధి ఆది నుండి వెలువడిన మనుచరిత్రాది కావ్యము లన్నింటికి పైన పేర్కొన్న లక్షణములన్నియు సమగ్రముగా పట్టినను పట్టకన్నాను, స్వతంత్ర రచనలగుటచేతను, అలంకారికశైలీ శోభితములగుటచేతను అవన్నియు ప్రబంధములగానే పరిగణింపబడినవి"[2].

దివాకర్ల వేంకటవధాని : "ధీరోదాత్త నాయకములును, శృంగార రస ప్రధానములును, పంచమాశ్వాస పరిమితములను ఐన కావ్యములు అలంకారికశైలితో వ్రాయబడినవి. వీటికే ప్రబంధములని పేరు"[3].

సి.నారాయణరెడ్డి : ప్రబంధము యొక్క లక్షణములు నాలుగు.

ఒకటి : కథానాయకుని యొక్క తృతీయ పురుషార్ధమునకు (కామమునకు) చెంది ప్రాయికముగా తద్వివాహ సంబంధియగుట.

రెండవ : శృంగారము అంగిరసముగా నుండుట.

మూడు : వర్ణన బాహుళ్యము కలిగి యుండుట

నాలుగు : రీతి ప్రాధాన్యము కలిగి యుండుట[4]

వేల్చేరు నారాయణ : "పురాణ మార్గం కథన మార్గం. ప్రబంధ మార్గం వర్ణన మార్గం. ప్రబంధానికి పురాణానికి తేడా కథనం, వర్ణన-వీటి ఎక్కువ తక్కువలలో మాత్రమే వుందనే అభిప్రాయం బలపడింది"[5].

వ్యాస సంగ్రహం:

ప్రబంధ లక్షణాలు పారిజాతాపహరణంకు అన్వయిస్తే తెలుగు పారిజాతాపహరణం తెలుగు ప్రబంధ సాహిత్య జగత్తులో ఒక ఉత్తమ కావ్యంగా నిలుస్తుంది. ఈ కావ్యంలో 5 ఆశ్వాసాలు గలవు. శృంగార రసం ప్రధాన రసం. వర్ణనా బాహుళ్యంతో కూడినది కథా నిర్వహణలో నైపుణ్యం గలదు. సత్యభామ పాత్రను తిమ్మన అత్యద్భుతంగా తీర్చిదిద్దారు. పురాణ ఇతివృత్తంను తిమ్మన తీసుకున్నప్పటికీ రచయిత కల్పనకు, వర్ణనలకు ఎక్కువ ప్రాధాన్యతనిచ్చారు. కృష్ణుడు నాయకుడు సత్యభామ నాయిక. వాని అనురాగకోపతాపాలు అద్భుతంగా వర్ణించ బడినవి. ప్రబంధానికి ముఖ్య లక్షణం వర్ణనలు. ఈ వర్ణనలు పారిజాతపహరణంలో ఎక్కువగా కన్పిస్తాయి. సత్యభామకోపం, స్వర్గలోక వర్ణన, పారిజాతవృక్షము గొప్పతనం చెప్పడం మొదలైనవి అనేకములు కలవు పాత్రల మనస్తత్వాలు చక్కగా వర్ణించబడినవి. సత్యభామ గర్వము, అలిగి సత్యభామ చేసిన కృత్యాలు, కృష్ణుడు ఆమెను శాంతిపచేయడం, పారిజాత వృక్షాన్ని స్వర్గలోకం నుండి తీసుకురావడం వరకు వివిధ దశల్లో ఆయా పాత్రల మనస్తత్వాలు చక్కగా చిత్రీకరింపబడినవి. తిమ్మన ప్రౌఢమైన శైలిని, అలంకారములను, పద్యశిల్పాన్ని, వర్ణనలను ఉపయోగించి ఈ కావ్యాన్ని ఒక మహా ప్రబంధంగా తీర్చిదిద్దారు. ముఖ్యంగా సత్యభామ పాత్ర చిత్రీకరణలో, వర్ణననలో ఉత్ప్రేక్షాలంకారాలు ఎక్కువగా కన్పిస్తాయి. ఇది పురాణ కథ అయినప్పటికీ, అప్పటి కాలానికి అనుగుణంగా రాజులు, పరిపాలకులు, ప్రజలకు మధ్య ఉండవలసిన సంబంధాలు ఎలా ఉండాలో ఈ కావ్యంలో పరోక్షంగా చెప్పబడ్డాయి. జాతిచమత్కార వార్తలు ఇందులో గలవు. ఆకాలం నాటి వింతలు, విశేషాలు, ఆచారాలు సందర్భోచితంగా వెల్లడించడం జరిగింది. పారిజాతాపహరణంలో ఆనాటి రాజమందిరాలలో కోపగృహాలు ఉండేవని చెప్పడం జరిగింది.

నారదుడు పారిజాత పుష్పాన్ని కృష్ణునకు ఇవ్వడం, ఆ సమయంలో కృష్ణుడు రుక్మిణీదేవి మందిరంలో ఉండడం, ఆ పారిజాతాన్ని కృష్ణుడు రుక్మిణికి ఇవ్వడం, దానిని తెలుసుకొని సత్య ఆగ్రహించడం, కృష్ణుడు సత్యభామను శాంతింపచేయడం, చివరకు పాదపీడనం, ఆ తరువాత కల్పవృక్షం కొరకు కృష్ణుడు దేవతలతో యుద్ధం చెయ్యడం పారిజాతవృక్షాన్ని స్వర్గం నుండి తెచ్చి సత్యభామకు ఇవ్వడం, చివరకు తులాభారంతో కథ

ముగుస్తుంది. ఇటువంటి అద్భుత కథావలస్తువు కలిగిన పారిజాతాపహరణంలో సత్యభామ పాత్ర చిత్రణను తిమ్మన ఉదాత్తంగా తీర్చిదిద్దిన తీరును చెప్పడం, ఆంధ్ర ప్రబంధ వాఙ్మయంలో పారిజాతాపహరణానికి గల ప్రాచుర్యాన్ని ప్రసిద్ధిని చెప్పడం ఈ వ్యాసం ముఖ్య ఉద్దేశ్యం.

ఉపోద్ఘాతం :

పారిజాతపహరణ కావ్య ప్రబంధ నాయిక సత్యభామ ఈమెలో నాయిక లక్షణాలు స్పష్టంగా కన్పిస్తున్నవి.

"రూపం లావణ్య సంపన్నా వినయశీల సమన్వితా
విద్యావతిచ దాక్షిణ్యానాయికా సాప్ర గీయతే":
కావ్యాలంకార సంగ్రహం

ఇవి కావ్యాలంకార సంగ్రహంలో చెప్పబడిన కావ్య నాయికా లక్షణాలు. తెలుగు సాహిత్యంలో ప్రబంధ కాలంలో నాయిక పాత్రకు ఎంతో ప్రాధాన్యత కలదు. ప్రబంధనాయిక ప్రబంధంలో కన్పించే ప్రధాన పాత్ర. రూపం, లావణ్యం (ఆకర్షణ) వినయశీలత, విద్య, దాక్షిణ్యం ప్రధాన లక్షణాలు. లోకంలో అనేక కథలలో వన్నెగాంచిన స్త్రీలలో సత్యభామ ఒకరు. సత్యభామ ఒక సమ్మోహన శక్తి. తెలుగు కవులకు ఒక బంగారు ముద్ద సత్యభామ. తెలుగులో చాలా మంది కవులు ఎవరి ప్రతిభను అనుసరించి వాళ్ళు సత్యభామ పాత్రను రసరమ్యంగా తీర్చిదిద్దారు. సత్యభామ ఒక విచిత్రమైన వ్యక్తి. ఆమె శృంగార రసాధి దేవత. ఆమె సమస్తత్వాన్ని బట్టి ఆమెతో కాపురం భర్తకు కత్తిమీద సాములాంటిది. లోకంలో కృష్ణుడు దక్షిణ నాయకుడు. అతడే సత్యభామ భర్త. కాబట్టే సత్యభామతో జీవితం శృంగారవంతంగా మలుచుకొన్నాడు. ఆ దృష్టితోనే ముక్కుతిమ్మన సత్యభాను ఇలా వర్ణించెను.

"చక్కని దాననంచునెలజవ్వని నంచుజగంబులోనబే
రెక్కిన దాననంచుబతియెంతయు నాకనురక్తు
డంచుదా
నిక్కుచు విఱ్ఱవీగుచుగణింపదుకాంతల సత్య
యింతకున్
స్రుక్కకయున్నెనీమహిమసూచిన బోటులు విన్న
వించినన్"

(1-66 పారిజాతాపహరణం)

పారిజాత పుష్పాన్ని నారదుడు కృష్ణుని ద్వారా రుక్మిణికి యిచ్చి రుక్మిణిచేత ధరింపచేస్తాడు. ఆ పారిజాత పుష్పం దివ్యమైన మహిమలు కలది. సత్యభామ సౌందర్య గర్వం కలిగినది. ఈ సౌందర్యమే కృష్ణుని తనకు అనురక్తుడగా చేస్తున్నదని, పారిజాత ప్రసూనధారణతో సత్య సౌందర్య గర్వము భంగమౌతుందని నారదుని వాక్కులు.

శ్రీ కృష్ణ సత్యభామకు విధేయుడై ప్రవర్తించాలన్నది సత్యభామ పంతం. ఇటువంటి విచిత్రమైన మనస్తత్వము కలిగిన సత్యభామ కృష్ణునకు ఎన్నో కష్టాలు కలిగించి తాను ఎన్నో వేదనలు అనుభవించింది. కృష్ణుని సత్యభామ తన చెప్పుచేతల్లో ఉంచుకోడానికి ప్రయత్నించిన ఆరాటం చూస్తే కృష్ణునిపై ఆమెకుగల ప్రేమతీవ్రత మనకు తెలుస్తుంది. కృష్ణుడు తనపట్ల అంతటి ప్రేమానురాగాలు చూపడం లేదని తెలిసినపుడు ఆమెలోగల కోపతాపాలు త్రీవ స్థాయికి చేరుకుంటాయి.

విషయ విశ్లేష :

నంది తిమ్మన పారిజాతాపహరణ ప్రబంధకావ్య నాయికగా సత్యభామను అద్భుతంగా తీర్చిదిద్దారు. "సమకాలీన సామాజిక జీవిత ప్రభావాన్ని అనుసరించి, మూలకథా రీతిని అనుసరించి, కథాగతిలో ఆయాపాత్రల ప్రయోజనాన్ని అనుసరించి, కవినేపథ్యాన్ని బట్టి పాత్ర చిత్రణ విధానం ఆధారపడి ఉంటుంది. పాత్ర కథకు శరీరం వంటిది. స్వభావం ప్రాణం వంటిది. పాత్ర చిత్రణమును ప్రత్యక్షమనియు, పరోక్షమనియు రెండు విధములుగా విభజించవచ్చును. పరోక్ష పద్ధతి అనగా పాత్రల మనోభావాలను పాత్రల ముఖమునే పలికించుట. ప్రత్యక్ష పద్ధతి అనగా కవితనంతటతానే పాత్రల గూర్చి వాటి యింగితాకార చేష్టాదులను గూర్చి పలుకుట[6].

"పాత్ర కొఱడు పారి కొయ్య బొమ్మలవలెనుండక చైతన్య సహితములై, యుండవలెయును. సచేతనత్వము నకు ముఖ్య లక్షణం వైవిధ్యము"[7].

నంది తిమ్మన సత్యభామను చైతన్యవంతమైన మహిళామూర్తిగా, చేతనత్వంతో కూడిన స్త్రీ శక్తిగా తీర్చిదిద్దారు. సత్యభామ సత్రాజిత్తు కుమార్తె. కృష్ణుని అష్టమహిషులలో ఒకతెగ ప్రసిద్ధి పొందింది. సాత్రాజితి అని పిలవబడుతుంది.

"నగ్నజిన్నామకౌసల్య ఆసీద్రాజాతిధార్మిక:
తస్యసత్యభవత్కన్యాదేవీ నాగ్నజితీనృప
(వ్యాస భాగ.10-58-32)

ఈ భాగవత శ్లోకాన్ని అనునరించి నగ్నజిత్తు తనయఅగు నాగ్నజితికి సత్య అనే పేరున్నట్లు తెలుస్తుంది. లోకవ్యవహారంలో సత్య అని పిలవబడుతుంది.

"అమెకసలు సత్యయని మాత్రమే పేరు. భామా శబ్దము స్త్రీ సామాన్యవాచి", అని యస్వీ జోగారావు చెప్పిరి[8].

సత్యభామ తల్లిపేరు మన పురణ ఇతిహాసాల్లో ఎక్కడా చెప్పలేదు. తరిగొండ వెంగమాంబ రచించిన విష్ణు పారిజాతయక్షగానంలో

"పన్ను గానిరతంబు పతిభక్తిచేత
వన్నెకెక్కిన సత్యవతియె మాతల్లి"[9] ఈ యక్షగానంలో వెంగమాంబ సత్యభామ తల్లి సత్యవతిగా పేర్కొనెను. సత్యభామ మానవ వనితగా జన్మించిననూ నిజానికి ఆమె దివ్యాంశ సంభూతురాలని పురాణ ఇతిహాసాలు తెల్పు చున్నవి. శ్రీదేవి, భూదేవులు మహావిష్ణువు భార్యలు, శ్రీదేవి రుక్మిణి, భూదేవియే సత్యగ అవతరించింది.

"తేషామవరజాకన్యారుక్మిణీ వరవర్ణినీ
కమలాంశేన సంభూతా సర్వలక్షణ సంయుతా"
(పద్మ.పు.ఉ.ఖం.ఉత్త.అ. 247-15)

సత్యజిత్తు తనకుమార్తె సత్యభామను కృష్ణునకిచ్చి వివాహంచేసెను. సత్యభామ కృష్ణుని అష్టమహిషులలో ఒకరు. రుక్మిణీ, సత్యభామ, కాళింది, జాంబవతి, మిత్రవింద, నాగ్నజితి, సులక్షణ, సుశీల" అష్టమ మహిషులు. సంస్కృత పద్మపురాణంలో చెప్పబడెను.

కార్యేషుదాసీ కరణేషుమంత్రీ, భోజ్యేషుమాతా
శయనేషురంభా,
రూపేచలక్ష్మీ క్షమయాధరిత్రీ, షట్కర్మయుక్తా
కులధర్మపత్నీ"

అని చాటువు. సత్యభామ పురాణ పాత్రగా మనకు కన్పిస్తున్నా ఆమె నాగరిక వనిత. ఆమెను అవినయం, స్వేచ్ఛా ప్రవృత్తి, నియమాలను ఉల్లంఘించేదిగా మనం భ్రమించకూడదు. తన అపూర్వ శృంగార, సౌందర్యాదులతో భగవంతుడైన కృష్ణుని ఆకర్షించి తన వశం చేసుకొనే ప్రయత్నం చేసింది. తండ్రికి తగ్గతనయ. పతిపట్లకూర్మిగల సతి. వంశోద్ధారణకు తపించిన మాతృమూర్తి. సత్యభామ అనగానే భర్త శిరస్సును ఎడమకాలితో తాడనం చేసిన వక్తిగామనకుతోస్తుంది. కాని అది అవాస్తవం. సత్యభామ కృష్ణుని భక్తురాలు. పతినే దైవంగా భావించిన పతివ్రత. శాస్త్రధర్మాలను పాటించిన కులకాంత. నందితిమ్మన సత్యభామను అభిమానవతియగు మానవతిగాను, స్వాధీన పతికగాను, మానినీలలామగాను, శృంగార రససీమగ నిరూపించెను.

పతిప్రాణ సదృశబంధువు
పతిదైవంబేడుగడయు బతిసతులకున
ప్పతియుకడుమేరదప్పిన
గతికులకాంతలకు వేఱుగలదే చెపుమా
(పారిజా - 1-96)

సత్యభామ గురువు, తల్లి, తండ్రి, దైవం, పురుషుడు, విద్యదాత ఇట్లు ఏడువిధాలైనవాడుగా తన భర్త కృష్ణునుని భావించింది. ఈ విధంగా కులకాంత ధర్మాలు పాటించు కులసతి సత్య.

"పూనుకొనిమేలుగీళ్ళకు
లోనయివిహరించువారిలోకమెఱుగదో
యానరకాసురదమనుడు
దానెఱుగడో భోజకన్యతానెఱుగదకో (1-91)

కృష్ణునకు సత్యభామ కష్టకాలంలో తన సహాయం అందించింది. పలుమార్లు కృష్ణునకు సహాయం చేసిన మంత్రిణి సత్యభామ. పారిజాతాపహరణమునకు సత్య కృష్ణులు ఇరువురు దివికేగినపుడు.

ఆరాత్రి సత్యగూడిము
ముదంబెసగవైజయంతమునమనో

భూరాజ్యసౌఖ్యనిద్రా
పరీణతనుండుచో ప్రభాతంబయ్యెన్ (4-48 పారిజ)

పారిజాతాపహరణ సత్య శృంగారంలో సాగసు తేటతెల్లమగుచున్నది.

కలకాలమొక్కగతి బూ
సలలోదారంబు మాడ్కిపతి మదిలోన్
మెలగెడు పురుషుడుగలుగుట
దొలిజన్మమునోముఫలముతోయజనేత్రా
(పారి. 1-93)

సత్యాకృష్ణుల దాంపత్యము అపూర్వమైనది. పూసలు చెదరకుండా దండగా నీలవాలంటే దారంకావాలి. అదే విధంగా ఎల్లపుడు సతిమదిలో మెలగెడు పతికలు గుటతొలి జన్మ నోముఫలితము కదా.

సత్యభామలో అభిజాత్యగర్వం కలదు. పారిజాతా పహరణం ప్రబంధంలో రుక్మిణీ, సత్యభామల నడుమ మనస్పర్ధలు రావడానికి రూపము, మగనికూర్మి, కులము కారణం. సత్య కృష్ణులు వృష్ణివంశజులు. చెలికత్తె పారిజాతపుష్ప ప్రదాన ఇతివృత్తాన్ని సత్యకుచెప్పినపుడు నారదుడు తనను తక్కువచేసి మాట్లాడినపుడు కృష్ణుడు అదివిని మౌనం వహించడం పెద్దద్రోహంగా భావించింది.

"ఏమేమీ కలహాశనుండచటికై యేతెంచియిట్లాడెనా
యామాటల్చెవిమొగ్గితావినియెనాగోపికావల్లభుండు
డే మే మాడెను రుక్మిణిసతియు నీ విం కేటికి న్దాచెదే
నీమోమోటలు మాని నీరజముఖీ నిక్కంబెఱింగింపవే"
అని సత్యభామ చింతించినది.(1-83)

"వాపల సౌందర్యవతియుమాన
వతియుమహానీయ సౌభాగ్యవతియునైన స
త్య యంతట నేమొకో శారికడకు
బోయి రాదయ్యె జెలి ప్రొద్దు వోయె ననుచు" (1-70)

రూపం, సౌందర్యం, సౌభాగ్యము, అభిమానంను అనుసరించి కృష్ణుని అష్టమహిషులలో సత్య ప్రత్యేకమైనది స్పష్టమగుచున్నది.

"మానంబెఱొడవుసతులకు
మానమేప్రాణాధికంబు మానమఖిలస
మ్మానములకుమూలంబగు
మానరహితమైన బ్రతుకు మానినికేల" (1-129)

సత్యభామకు మానమే ప్రాణము కన్నమిన్న. మానహాని జరిగినపుడు జీవించుట వ్యర్థముగా భావించింది. తన సౌందర్య, అభిజాత్య, సౌభాగ్య విషయంలలో భంగం కలిగిన భరించలేని ఆవేదన పొందింది.

అన్యోన్యతతో జీవించిన కృష్ణసత్యభామల అనురాగ జీవితానికి కొంత విఘతమును కలిగించింది. పారిజాత పుష్పం. ఆ పారిజాతపుష్పాన్ని కృష్ణుడు రుక్మిణికి ఇవ్వడం, శ్రీకృష్ణ సత్యల అన్యోన్య విఘాతానికి కారణం.

"కలలోననైన నవ్వులకైననామాట
జవదాటవెఱుచునోచంద్రవదన
యేపదార్థంబునాయెదుటబెట్టకమున్న
యోవ్వారికొసగడోయిగురుబోడి
చెలులునాతోనేమిచెప్పుదురోయని
లంచంబులిచ్చునోచంచులాక్షి
తోడిచెలియలునాతోడివంతులకురా
సయిరింపజాలడోసన్నుతాంగి
యున్నవిభుడెట్లుసేయునేయోలతాంగి
యరమరలులేనికూరిమిననగిపెనగి
కొదలుదీరని కోర్కులగూడిమాడి
కపటమెఱుగని మమతలగలిసిమెలసి" (1-94 పారి)

కలలో కూడ కృష్ణుడు తనమాటదాటడు. ఏవస్తువు తెచ్చిన తనకే మొదట ఇస్తాడని, చెలికత్తెలకు కృష్ణుడు లంచమిస్తాడని, ఇతరులు తనతో పోటీపడినపుడు వారిని సరిచేస్తాడని, అమరికలులేని ప్రేమతో కోర్కెలను తీర్చుకుంటామని కపటంలేని ప్రేమతో జీవిస్తున్నామని అటువంటి ప్రేమను తనకందించే కృష్ణ ఈ విధంగా చేస్తాడా అని చెలికత్తెల వద్ద సత్యభామ పలికినది.

"ధనమిచ్చిపుచ్చుకొన్నను
మనమునసౌర్వంగవచ్చుమగడింతులకున్
జనువిచ్చిపుచ్చుకొన్నను
మనవచ్చునేయింకనేటిమాటలుసెపుమా" (1-98)

అభిమానవంతురాలైన స్త్రీ తన భర్త ఇతరులకు చనువిచ్చి, మనసును ఇతరులకు పంచినపుడు తాను

నంహించలేదు. ఆవిషయాన్ని భరించలేదు. ఇక్క సత్యభామ పరిస్థితి సంకటస్థితిలో ఉన్నది. భర్త తన అదీనంలోనే ఉండాలని సత్యభామ ఆశ.

జలజాక్షియిది పారిజాతప్రసూనంబు
నరులకుధరియింప నరిదిసూవె
పాలోమిపార్వతిపద్మపద్మజురాణి
మునుశిరంబునదాల్తురనుదినంబు
హరిబహి:ప్రాణంబవగుటనేడెఱుగంగ
వచ్చెనీకిపుడదియిచ్చెగాన
వెలదులుపదియాఱువేవురులోనెన్న
సరిలేదుసౌభాగ్యగరిమనీకు
నీవుదాల్చినకతననీపూవునేడు
భాగ్యమువహించెనుచితోపయోగ్యవృత్తి
నీప్సితార్థంబులొడగూర్చునిదిలతాంగి
దీనిమహిమంబుచెప్పెద తెలియవినుము. (1-58)

పారిజాతపుష్పాన్ని నరులు ధరించలేరు. శ్రీకృష్ణుడంటే నీకు ఎంతో ప్రేమ. ఈ పుష్పాన్ని దేవతలు మాత్రమే ధరిస్తారు. కృష్ణుని ప్రియ భార్యలలో ఎవరూ నీకు సాటిరారు నీవలన ఈ పుష్పం మహితాన్వితమౌతుంది. సత్యభామ కనుసన్నల్లో కృష్ణుడు మెలుగుతాడని, తాను చక్కనిదని, జత్తులోతానే పేరెన్నికగన్నదనే గర్వం సత్యకు ఇక ఉండదని నారదుడు పలికినది. సత్యభామ చెలికత్తె పారిజాత పుష్ప విషయాన్ని రుక్మిణి దగ్గర చూసి విన సత్యభామకు చెప్పినప్పుడు ఆమె మనసు వ్యాకులత చెందింది.

''అనవినివ్రేటువడ్డ యురగాంగన యుంబ
లెనేయివోయభ
గ్గునదిరకొన్న భీషణహుతాశనకీలయనంగలేచిహె
చ్చినకనుదోయికెంపుదనచెక్కులకుంకుమపత్రభంగసం
జనిత నవీనకాంతివెదచల్లగ గద్గదఖిన్న కంఠియై" (1-82)

సత్యభామ అభిమానవంతురాలు. తన అభిమానం దెబ్బతిన్నప్పుడు ఆమె ఆవేశాన్ని తట్టుకోలేదు. ఇది ఒక విధంగా సత్యకు అవమానమే. ఆమె కోపావేశం అతిశయించింది. సత్యభామ మానీత్వం మూర్తిభవించిన మగువ. మానం కలిగినది మానిని. మానం అనగా ఆత్మభిమానం, ఆత్మగౌరవం, పౌరుషం, రోషం. మానము అనగా చిత్తౌనత్యమని పరిమళోల్లాసవ్యాఖ్య. తనకు స్వాధీనుడకొనే పతి తనను ఉపేక్షించడం, పరులు తనను నిందించడం, పతి వారిని వారించకపోవడం, సవతి ముందు అవమానం జరగడం ఈ విషయాలను సత్యభామ భరించలేక పోయింది. తిమ్మన సత్యభామలో ఉప్పొంగుచున్న క్రోధావేశాలను అద్భుతంగా వర్ణించాడు. "తిమ్మన ఈ సందర్భంలో సృష్టి చేసి రంగానికెక్కించిన సత్య పాత్ర మాంధ్ర ఇంగ్లీషు, హిందీ ఇత్యాదిభాషల ఒత్తిడిలో నలిగి నశించిపోక నిలిచి ఉన్నంత వరకు, ఆంధ్రునిలో ఆంధ్రత్వమున్నంత వరకు, యువతులలో సత్యాత్వము మిగిలి ఉన్నంత వరకు భరతశాస్త్రోత్కృష్ట సంప్రదాయంను సారముగా కన్నులకు మిరిమిట్లు గొలుపుతూ నర్తించును[10].

"మాసిన చీరగట్టికొని మౌనంతోడ నిరస్తభూషయై
వాసెనకట్టు గట్టినిడువాలికగస్తురిపట్టువెట్టిలో
గాసిలి చీకటింటికడకంకటిపై జలదాంత చంద్రరే
ఖాసదృశాంగియైపోరలెగాఢ మనోజవిషాదవేదనన్" (1-99)

సత్యభామ ఆభరణాలను శరీరం నుండి తీసింది. తలచుట్టు కట్టుకట్టింది. దీర్ఘమైన కస్తూరి బొట్టుపెట్టింది. మేఘముచే కప్పబడిన చంద్రరేఖవలె ఉండి మనస్సులో విషాదవేదనను అనుభవిస్తుంది.

"కృష్ణుడు పారజాతమును రుక్మిణికిచ్చుటను చూచుచున్న సత్య మొదట హర్షం ప్రకటించయు సఖియైన సుముఖి మాటల వలన ఈర్ష్యపొంది కోపగృహమున ప్రవేశించినట్లు తెలియచున్నది"[11].

"తిమ్మన సత్యభామ మానినీత్వం పోషించబడినంత సముచితంగా ఇతర కవులలో కనిపించదు. కృష్ణుడు సత్యభామ కోపగృహానికి వచ్చి ఆమెకు తాలవృంతములు తీసివిసిరినపుడు సత్యపారజాతపుష్పదివ్య వాసనలతో ముసుగుతీసినది. ఆమంచం మీద కొంచెం నిద్ర పట్టింది. కృష్ణునంటి అతనితో వచ్చిన పారిజాతపరిమళము నిద్రపోతూ ఉన్న సత్యకు కొత్తగా సువాసనగా గోచరించింది"[12]. అని తాపిధర్మారావు వాఖ్యానించిరి.

కృష్ణుడు సత్యభామను ఓదారుస్తూ "పారిజాతమును తెచ్చి నీకేలివనములో పెరటిచెట్టుగ నాటింతుననియు పెంపుగనుమని పల్కెను". సత్య మనసులో ఏదీ ఉంచుకోదు. అనవలసింది ముఖం మీద అంటుంది. సత్య కోపం తృణాగ్నివంటిది. పారిజాతపుష్పానికి బదులు చెట్టే తన ఇంటికి వస్తుందని సంతోషించి కోపాన్ని విడిచి పెట్టింది. కలహభోజనుడు సత్యభామ కృష్ణునిపై చూపిన ఆదరణను చూసి నిరుత్సాహపడ్డాడు.

"వినుడు సురేశ్వరువనపాలకులు వార్ధి
బొడమిన యాదివ్యభూరుహమున
కింద్రాణి యెవ్వతె యింద్రుడు నెవ్వడు
తోడియిందిరను గొస్తభమునెవ్వ
డధిపుడై ధరించెనతడంచేకొనుగాక
తెకతేర యిది యేమి యొకరిసొమ్మె
యిదె నాదువిభనిచే నీవదాన్యనగంబు
నోడియించుకొని యేగుచున్న దాన
బలుకు లేటికి దా వీరపత్నియేని
మీ శచీదేవి తనదు ప్రాణేశుడైన
మఘవు నిటబంపి సత్యభామా విధేయు
వలన మరలంగ గొనుటెపో వాసితనము"

(పారిజాత 4-59)

పారిజాతాన్ని తెచ్చుటకు దేవలోకానికి వెళ్ళినపుడు ఇంద్రాదులతో కృష్ణుడు యుద్ధం చేసేటప్పుడు కృష్ణ సాక్షాత్తు విష్ణువు అవతారమని పలికి తన భర్త ఔన్యత్యమును కీర్తించినది. పారిజాతం కొరకు ఇంద్ర లోకం మీదకు కృష్ణుడు వెళ్ళినపుడు, కృష్ణుడు సత్య భామకు ప్రియమైన వాడుగా కన్పించును. అపుడు సత్యభామ స్వాధీన పతిక. సత్యభామ పలికిన పలుకులు సత్య గర్వమునకు పరాకాష్ట. సత్యభామ విధేయుడు కృష్ణుడు. కృష్ణుడి పట్ల సత్యకు ఎంత విశ్వాసమో అంత గర్వం కూడా. నరకుని వదించిన వీర వనిత. నరకుని హతమార్చివాడు కృష్ణుడు. అట్టి మహావీరుడు, భగ వంతుడైన కృష్ణుడు సత్యకు భర్త. "ఈ పద్యమును పురస్కరించుకొని చూడగా సత్యగర్వోక్తులు పరికినట్లుగా కానవచ్చుచున్నది. కాని నిజము విచారింప ఆ మాట లన్నియు యథార్థ్యములే కాని అన్యము కావు"[13].

"జలజాతాసనవాసవాదిసురపూజాభాజనంబై తన
ర్చులతాంతాయుధుకన్నతండ్రి శిరమచ్చో వామ
పాదంబునం
దొలంగం ద్రోచె లతాంగి యట్లయగు నాథుల్నేరము
ల్సేయబే
రలుకం జెదినయట్టికాంత లుచితవ్యాపారము
ల్నేర్తురే"

సమస్త దేవతలు పూజించే విష్ణుమూర్తి శిరస్సును సత్యభామ తన వామపాదంతో తొలిగేటట్లు త్రోచింది. సత్యభామ ఎంతమానినియైనను ఆమెపతివ్రత. పతి మాహత్మ్యమును తెలిసింది. అట్టి అనుచితకార్యము చెయ్యదని పండితుల అభిప్రాయం "ఇక్కడ పాఠకులు తొందరపడి "తొలగన్‌ద్రోచె అన్నమాటలకు తన్నెను అనే అర్థం చెప్పకూడదు. తన్నెనని చెప్పడమే కవి ఉద్దేశమయితే తొలగన్‌తాచెనో, తొలగన్ తన్నెననో! చెప్పేవాడకదా! సత్యఇక్కడ చేసిన పనేమిటంటే తన దగ్గరకు తన్నుతాకడానికి వస్తున్న కృష్ణునితలను తనకు దూరంగా ఉండేలా తొసింది. ఇంతకు ముందు నేను మనవి చేసినట్లు ఆ కృష్ణుని సామీప్యం సహించలేక ఆ ఎడమకాలు అప్రయత్నంగానే తోసింది" తాపి ధర్మారావు అని వ్యాఖ్యానించిరి.

''నుభవదీయదానుని మనంబుననెయ్యవు
గిన్కబూనితా
చినయదినాకుమన్ననయ, చెల్వగునీ పదపల్ల
వంబుమ
త్తను పులకాగ్రకంటకవితానముదాకిన నొచ్చునంచునే
ననియెద నల్క మానవుగదాయికనైన నరాళకుంతలా"

(1-23)

సత్యభామ పై కృష్ణునకు గల ప్రేమతిశయం ఈ పద్యంలో వ్యక్తమగుచున్నది. తనను దానుడుగా చెయ్యమని కృష్ణుడు వేడుకుంటున్నాడు. ఇది సత్యభామ గొప్పతనం. భర్త యందు మాత్రమే ప్రేమకలిగినది స్వీయ. ఇక్కడ సత్యభామ స్వీయగా కన్పిస్తుంది.

కృష్ణుడు దక్షిణ నాయకుడు, అయినప్పటికీ సత్యభామపై అతనికి ప్రత్యేక అభిమానం కలదు.

నిజానికి పారిజాతాపహరణమనే ఈ ప్రబంధనామము కృష్ణ సత్యభామ స్వాధీనవల్లభుడని తెలియపరుస్తుంది. పారిజాతాపహరణానికి మూలకారణం సత్యభామ. ఈమెను తృప్తిపరచడానికి హరి పారిజాతాన్ని అపహరించాడు. పతియైన కృష్ణ సత్యకు ఎందరి అధీనుడో దీనివలన తెలుస్తుంది.

ముగింపు:

సత్యభామ పాత్రను పండిత పామర జనరంజకంగా తీర్చిదిద్దిన వారిలో ప్రముఖులు ఇద్దరు. ఒకరు సిద్ధేంద్రయోగి - భామాకలాపం, రెండవది నంది తిమ్మన - పారిజాతాపహరణం. సత్యభామ పాత్రను సమగ్రంగా చిత్రించడం ఏ ఒక్కరికి సాధ్యంకానిపని. అందుకే ఎందరో కవులు సత్యభామ పాత్రను స్వీకరించి ఆమెలోని నాయికా లక్షణాలను ఆవిష్కరిస్తూ కావ్యనాటకాది అనేక సాహిత్య ప్రక్రియలు వెలువరించారు. సత్యభామ సాధారణ స్త్రీకాదు. ఆమె సత్రాజిత్తు తనయ. పరమాత్ముడైన మదన గోపాలుని అష్టమహిషలలో మొదట ఎంతో వన్నె, వాసికెక్కిన స్త్రీమూర్తి. కవి బ్రహ్మ తిక్కన మహాభారతంలో తీర్చిదిద్దిన స్త్రీ పాత్రల తరువాత ఆంధ్రుల హృదయాల్లో సుస్థిరస్థానాన్ని అధిష్టించినపాత్ర సత్యభామ. తెలుగు సాహిత్యంలో ఎన్నో వేల స్త్రీ పాత్రలున్నప్పటికి, కృష్ణునికి పదహారవేల ఎనిమిదిమంది భార్యలునప్పటకీ ఆంధ్రుల మనస్సులో చిరస్థాయిగా నిలిచిపోయేది సత్యభామ. కృష్ణుని మదిలో అత్యంత ప్రియమందిన సత్యదే ప్రథమ స్థానం. దానికి కారణం ఆమె విలక్షణ మనస్తత్వం. మనస్తత్వశాస్త్ర రీత్యా దీనిని హిస్టీరికల్ మనస్తత్వం అంటారు. ఇది భావోద్వేగాలను తీవ్రంగా ప్రదర్శించడానికి, ఇతరుల దృష్టిని ఆకర్షించడానికి తీవ్రంగా ప్రయత్నిస్తుంది. ఆవేశం ఎక్కువగాను, ఆలోచన తక్కువగాను మొండితనం, దూకుడు స్వభావం, తొందరపాటు, రోషం, పౌరుషం, ఒక్కొక్కసారి చిన్నపిల్లల మనస్తత్వం పొగరుబోతు తనం, అలక, తన పంతం నెగ్గించుకోటానికి ముందు వెనక ఆలోచించకుండా ఎటువంటి చర్యకైనా ప్రయత్నించడం ఇవన్నీ సత్యభామలో మనకు కన్పిస్తాయి. కృష్ణునితో యుద్ధరంగానికి బయలుదేరినపుడు ఆమెకు కృష్ణునిపై ఉన్న ప్రేమ, త్యాగనిరతి తెలుస్తుంది. పారిజాతాన్ని తనకు ఇవ్వలేదనే కోపంతో భగవంతుడైన కృష్ణుని తన కాలితో తోసివేసినపుడు తనకు బాధకలిగిస్తే ఎంతకైనా తెగిస్తుందని ఆమె వ్యక్తిత్వాన్ని బట్టి తెలుస్తుంది. ఈ విధంగా సత్యభామలో ప్రేమ, త్యాగనిరతి, అనురాగం ఆత్మీయత మొదలైనవి ఎన్నో ఉన్నతాంశాలు మనకు గోచరిస్తాయి.

పాదసూచికలు:

1. తెలుగు సాహిత్య చరిత్ర ద్వానాశాస్త్రి.
2. పింగళి లక్ష్మీకాంతం, విజ్ఞాన సర్వస్వము సంపుటి-3 తెలుగు సంస్కృతి-1, పుట 603.
3. దివాకర్ల వేంకటవధాని, ఆంధ్రవాఙ్మయము-11. సంగ్రహాంధ్ర విజ్ఞాన కోశము సంపుట-1, పుట 576.
4. సి.నారాయణరెడ్డి: ఆధునికాంధ్ర కవిత్వ సంప్రదాయములు, ప్రయోగములు.
5. తెలుగు కవితా విప్లవాల స్వరూరం. వేల్చేరు నారాయణ పుట 45.
6. కె.వి.ఆర్ నరసింహం, ఆంధ్రప్రబంధం అవతరణ వికాసం, పుట 55.
7. కె.వి.ఆర్ నరసింహం, ఆంధ్రప్రబంధం అవతరణ వికాసం, పుట 34.
8. యస్వీ జోగారావు, ఆంధ్రయక్షగాన వాఙ్మయ చరిత్రపుట 32.
9. తరిగొండ వెంగమాంబ, విష్ణు పారిజాతయక్షగానం.
10. చిలుకూరి నారాయణరావు, పారిజాతపహరణము భారతి - 1941 జూలై పుట 6.

11. పి.యశోదారెడ్డి, పారిజాతాపహరణ పర్యాలోచనము పుట 78.
12. తాపి ధర్మరావు, పారిజాతాసహరణ ఫీఠిక ఆంధ్రసాహిత్య అకాడమి ప్రచురణ పుట 171.
13. పి.యశోదారెడ్డి, పారిజాతపరహరణ పర్యాలోచనము పుట. 141.

ఆధార గ్రంథాలు:

1. నంది తిమ్మన - పారిజాతపహరణము
2. లక్ష్మీకాంతము, బలిజేపల్లి - సాత్రాజితీయము (నాటకము) చంద్రికా ముద్రాక్షరశాల, గుంటూరు, 1941.
3. చిలకమర్తి లక్ష్మీనరసింహము - పారిజాతపహరణ (నాటకము) గునేశ్వరరావు బ్రదర్స్, రాజమహేంద్రవరము, 1909.
4. తరిగొండ వెంగమాంబ - విష్ణుపారిజాతము (యక్షగానము) ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమీ, 1965.
5. సిద్ధేంద్రయోగి - భామకలాపము - ఆంధ్రప్రదేశ్ సంగీత నాటక అకాడమీ, హైద్రాబాద్.
6. యస్.వి జోగారావు - సారస్వత నీరాజనము, క్వాలిటీ పబ్లికేషన్స్, విజయవాడ, 1966.
7. నారాయణచార్యులు పుట్టపర్తి - ప్రబంధనాయికలు, రాజశేఖర బుక్‌డిపో, కర్నూలు, 1981.
8. పి. యశోదారెడ్డి - పారిజాతపహరణ పర్యాలోచనము, సుధర్మా పబ్లికేషన్స్, హైద్రాబాద్, 1973

★★★

Vol. 23 | Spl. Issue 03 | March 2026 | BHAVAVEENA | ISSN No. : 2456-4702 | RNI No. APTEL/2003/12253

RNI No. APTEL/2003/12253 | Reffered Journal & Peer Reviewed Journals | ISSN No. 2456-4702

భావవీణ

కళలు, సాహిత్య, సాంస్కృతిక భాషాధ్యయన పత్రిక

BHAVA VEENA

Journal of Arts, Literary, Culture & Language Study

గురజాడ రచనలు - మహిళా చైతన్యం

- కె. సురేష్ బాబు

తెలుగు విభాగాధిపతి, ఎస్.వి.కె.పి & డా. కె .యస్.రాజు ఆర్ట్స్ & సైన్స్ కాలేజ్, వాసవి పెనుగొండ, పశ్చిమ గోదావరి జిల్లా.

పరిచయం:

గురజాడ అప్పారావు రచనలు తెలుగు సాహిత్యంలో మహిళా చైతన్యానికి, సామాజిక సంస్కరణలకు పునాదులు వేశాయి. ముఖ్యంగా 'కన్యాశుల్కం' నాటకం, 'కన్యక', 'పూర్ణమ్మ' వంటి రచనల ద్వారా బాల్య వివాహాలు, కన్యాశుల్కం, సతీసహగమనం, మరియు స్త్రీ విద్య అవశ్యకతను బలంగా వాదించారు. స్త్రీలను కేవలం భోగవస్తువులుగా కాకుండా, సమాన వ్యక్తిత్వం కలిగిన వ్యక్తులుగా గురజాడ చిత్రించారు.

తెలుగు సాహిత్యంలో సామాజిక సంస్కరణకు దారి తీసిన మహానుభావుల్లో గురజాడ అప్పారావు గారికి ప్రత్యేక మైన స్థానం ఉంది. ఆయన రచనలు కేవలం సాహిత్య సౌందర్యానికే పరిమితం కాకుండా సమాజంలో ఉన్న అన్యాయాలను వెలికితీసి ప్రజల్లో చైతన్యాన్ని కలిగించాయి. ముఖ్యంగా మహిళలపై జరుగుతున్న అన్యాయం, అసమానత్వం, మూఢనమ్మకాలను ఆయన తీవ్రంగా విమర్శించారు. మహిళల గౌరవం, స్వాతంత్ర్యం, విద్య మరియు సమాన హక్కుల గురించి గురజాడ గారు తన రచనల ద్వారా స్పష్టమైన సందేశాన్ని అందించారు. అందువల్ల ఆయన రచనల్లో మహిళా చైతన్యం ఒక ముఖ్యమైన అంశంగా నిలిచింది.

గురజాడ సాహిత్యంలో మహిళా చైతన్యం యొక్క ముఖ్య అంశాలు :

కన్యాశుల్కం - సామాజిక విప్లవం : కన్యాశుల్కం నాటకంలో మధురవాణి పాత్ర ద్వారా, సగటు వేశ్య పాత్రను దాటి, ధైర్యవంతురాలైన, వివేకవంతురాలైన మహిళగా ఆమెకు గుర్తింపు ఇచ్చారు.

స్త్రీ విద్యే విముక్తి : "స్త్రీ చదువుకుంటే కుటుంబం, సమాజం, దేశం ఎదుగుతుందని" గురజాడ బలంగా విశ్వసించారు.

స్త్రీ సమానత్వం : కన్యక, పూర్ణమ్మ వంటి పాత్రల ద్వారా స్త్రీ తన జీవితంపై నిర్ణయాలు తీసుకునే హక్కును (స్వేచ్ఛను) సమర్థించారు.

మూఢాచారాల ఖండన : బాల్య వివాహాలను నిరసిస్తూ, స్త్రీల అభ్యున్నతి కోసం తన కలం ద్వారా పోరాడారు.

గురజాడ పాత్రలు, కేవలం ప్రశ్నించడంతో ఆగిపోకుండా, వివేకంతో, వినూత్న చైతన్యంతో తమ హక్కుల కోసం నిలిచేలా చిత్రించబడ్డాయి.

మహిళాభ్యుదయం - గురజాడ దృక్కోణం

గురజాడ రచనల్లో మహిళా దృక్పథం - విద్యే విముక్తి- మహిళ చదువుకుంటే కుటుంబం, సమాజం, దేశం ఎదుగుతుందని ఆయన నమ్మకం. ''సమాజం పురోగ

మించాలి అంటే మహిళ పురోగమించాలి'' అన్నది గురజాడ శాస్త్రీయ ప్రతిపాదన . స్వేచ్ఛే శక్తి - మహిళా తన జీవితం పై నిర్ణయాలు తీసుకునే హక్కు కలిగి వుండాలి .

సమానత్వమే సమాజ నైజం -- స్త్రీ పురుషుల మధ్య సమాన హక్కులు అభివృద్ధి హేతువు ఇవి గురజాడ చెప్పిన ఆదేశ సూత్రాలు

గురజాడ అప్పారావు... ఆధునిక స్త్రీ ఆయన ప్రతినిధి

గురజాడ రచనల్లోని కమలిని, కన్యక, పూర్ణమ్మ, నాంచారమ్మ, వెంకమ్మ, మీనాక్షి, బుచ్చమ్మ లాంటి స్త్రీ పాత్రలన్నీ ప్రత్యక్షంగానో, పరోక్షంగా ప్రజల్లో చైతన్యం కలిగిస్తాయి

గురజాడ కాలంలో మహిళల స్థితి

గురజాడ గారు జీవించిన 19వ శతాబ్దం చివరి భాగంలో మరియు 20వ శతాబ్దం ప్రారంభంలో భారతదేశంలో మహిళల పరిస్థితి చాలా దయనీయంగా ఉండేది. బాల్యవివాహాలు విస్తృతంగా జరిగేవి. చిన్న పిల్లలను పెద్దవారికి పెళ్లి చేయడం సాధారణ విషయంగా మారింది. పెళ్లికి కట్నం తీసుకోవడం కూడా సమాజంలో ఒక ఆచారంగా ఉండేది. విధవలకు సమాజంలో గౌరవం లేకపోవడం, వారికి విద్యావకాశాలు లేకపోవడం వంటి సమస్యలు కూడా ఎక్కువగా ఉండేవి. మహిళలను కుటుంబానికి మాత్రమే పరిమితం చేసి వారి అభివృద్ధిని అడ్డుకోవడం జరిగేది. ఈ పరిస్థితులను గురజాడ గారు గమనించి తన రచనల ద్వారా సమాజాన్ని ప్రశ్నించారు.

గురజాడ రచనల సామాజిక దృక్పథం

గురజాడ గారి రచనల్లో సామాజిక అవగాహన చాలా స్పష్టంగా కనిపిస్తుంది. ఆయన సమాజంలో ఉన్న అసమానతలను విమర్శిస్తూ సంస్కరణల అవసరాన్ని తెలియజేశారు. మహిళలను బలహీనులుగా కాకుండా ఆత్మగౌరవం కలిగిన వ్యక్తులుగా చూపించారు. మహిళలు విద్యను అభ్యసించి సమాజంలో గౌరవంగా జీవించాలనే భావన ఆయన రచనల్లో కనిపిస్తుంది. గురజాడ గారి దృష్టిలో మహిళల అభివృద్ధి లేకుండా సమాజ అభివృద్ధి సాధ్యం కాదు. అందుకే ఆయన రచనల్లో మహిళల గౌరవాన్ని ప్రాముఖ్యంగా ప్రస్తావించారు.

కన్యాశుల్కం నాటకంలో మహిళా చైతన్యం

గురజాడ గారి అత్యంత ప్రసిద్ధ రచన కన్యాశుల్కం . ఈ నాటకం తెలుగు నాటక సాహిత్యంలో ఒక మైలురాయి. ఈ నాటకంలో గురజాడ గారు బాల్యవివాహాలు, కట్నం వంటి చెడు ఆచారాలను తీవ్రంగా విమర్శించారు.

ఈ నాటకంలోని పాత్రలు సమాజంలోని వాస్తవ పరిస్థితులను ప్రతిబింబిస్తాయి. ముఖ్యంగా మధురవాణి అనే పాత్ర మహిళా చైతన్యానికి ప్రతీకగా నిలుస్తుంది. ఆమె తెలివితేటలు, చురుకుదనం, ధైర్యం మహిళల సామర్థ్యాన్ని తెలియజేస్తాయి. సమాజంలో మహిళలు కూడా స్వతంత్రంగా ఆలోచించగలరు, నిర్ణయాలు తీసుకోగలరు అనే భావనను గురజాడ ఈ పాత్ర ద్వారా తెలియజేశారు.

మధురవాణి పాత్ర ప్రత్యేకత

మధురవాణి పాత్ర గురజాడ గారి సాహిత్యంలో అత్యంత ముఖ్యమైన మహిళా పాత్రగా చెప్పవచ్చు. ఆమె సమాజంలో ఉన్న అన్యాయాలను బహిర్గతం చేస్తుంది. తన తెలివితో అనేక సమస్యలను పరిష్కరిస్తుంది. ఈ పాత్ర ద్వారా గురజాడ గారు మహిళల సామర్థ్యాన్ని చూపించారు. మధురవాణి పాత్ర మహిళలకు స్వాభిమానం అవసరమని తెలియజేస్తుంది. ఆమె మాటలు మరియు ఆలోచనలు సమాజంలో ఉన్న పాత ఆచారాలను ప్రశ్నించే విధంగా ఉంటాయి.

గురజాడ కవిత్వంలో మహిళల గౌరవం

గురజాడ గారి కవిత్వంలో కూడా సమాజంపై ప్రేమ, సమానత్వం వంటి భావాలు కనిపిస్తాయి. ఆయన రచించిన ప్రసిద్ధ కవిత దేశమును ప్రేమించుమన్నా దేశభక్తిని మాత్రమే కాకుండా సమాజంలో సమానత్వం అవసరాన్ని కూడా తెలియజేస్తుంది. సమాజం అభివృద్ధి చెందాలంటే మహిళలు మరియు పురుషులు సమానంగా ముందుకు రావాలని గురజాడ భావించారు.

మహిళల విద్యపై గురజాడ అభిప్రాయం

గురజాడ గారు మహిళల విద్యకు ఎంతో ప్రాముఖ్యత ఇచ్చారు. ఆయన దృష్టిలో విద్య మహిళలకు

ఆత్మవిశ్వాసాన్ని కలిగిస్తుంది. విద్యావంతులైన మహిళలు సమాజంలో మార్పుకు కారణమవుతారు. కుటుంబ అభివృద్ధి మాత్రమే కాకుండా సమాజ అభివృద్ధికి కూడా మహిళల విద్య అవసరమని ఆయన నమ్మారు. అందు వల్ల మహిళలకు విద్య అందించాలి అనే సందేశాన్ని ఆయన తన రచనల ద్వారా తెలియజేశారు.

సమాజంపై గురజాడ రచనల ప్రభావం

గురజాడ రచనలు సమాజంలో చైతన్యాన్ని కలిగించాయి. ప్రజలు తమ సమాజంలోని చెడు ఆచారాలను గుర్తించేలా చేశాయి. మహిళల గౌరవం గురించి అవగాహన పెంచాయి. ఆయన రచనలు తరువాతి తరాల రచయితలకు కూడా ప్రేరణగా నిలిచాయి. సమాజంలో సంస్కరణలకు ఆయన రచనలు దారితీశాయి.

ముగింపు

మొత్తంగా చూస్తే గురజాడ అప్పారావు గారి రచనలు తెలుగు సాహిత్యంలో మాత్రమే కాకుండా సామాజిక సంస్కరణలో కూడా గొప్ప పాత్ర పోషించాయి. మహిళల గౌరవం, స్వాతంత్ర్యం, సమాన హక్కుల గురించి ఆయన స్పష్టమైన సందేశాన్ని అందించారు. ఆయన రచనలు మహిళా చైతన్యానికి గొప్ప ప్రేరణగా నిలిచాయి. సమాజంలో సమానత్వం స్థాపించడానికి ఆయన సాహిత్యం ఎంతో సహాయపడింది. అందువల్ల గురజాడ గారి రచనలు తెలుగు సాహిత్యంలో శాశ్వతమైన స్థానాన్ని సంపాదించాయి.

ఆధార గ్రంథాలు :

1. అప్పారావు గురజాడ కథానికలు - 1904 హైదరాబాదు విశాలాంధ్ర పబ్లికేషన్స్.
2. అప్పారావు గురజాడ కన్యాశుల్కం - 2011 హైదరాబాదు విశాలాంధ్ర పబ్లికేషన్స్.
3. తెలుగు సాహిత్య చరిత్ర - డా. ద్వానా శాస్త్రి
4. ప్రొఫెసర్ వెలమల సిమ్మన్న- తెలుగు సాహిత్య చరిత్ర
5. అధునిక తెలుగు సాహిత్యం - సి . నారాయణ రెడ్డి
6. తెలుగు సాహిత్య చరిత్ర - పింగళి లక్ష్మీకాంతం

★★★

Vol. 23 | Spl. Issue 03 | March 2026 | BHAVAVEENA | ISSN No. : 2456-4702 | RNI No. APTEL/2003/12253

RNI No. APTEL/2003/12253 | Reffered Journal & Peer Reviewed Journals | ISSN No. 2456-4702

భావవీణ

కళలు, సాహిత్య, సాంస్కృతిక భాషాధ్యయన పత్రిక

BHAVA VEENA

Journal of Arts, Literary, Culture & Language Study

ఆధునిక తెలుగు కథానికల్లో మహిళా చైతన్యం

- బి. పద్మ

తెలుగు విభాగం, పరిశోధక విద్యార్థి, ఉస్మానియా విశ్వవిద్యాలయం, హైదరాబాద్.

సారాంశం

ఆధునిక తెలుగు సాహిత్యంలో మహిళా చైతన్యం (Womenμs Consciousness) ఒక ముఖ్యమైన సాహిత్య ధోరణిగా అభివృద్ధి చెందింది. సమాజంలో మహిళలు ఎదుర్కొనే సామాజిక, ఆర్థిక, మానసిక మరియు శారీరక సమస్యలను ఆధునిక కథానికలు లోతుగా ప్రతిబింబిస్తాయి. పురుషాధిక్య సమాజంలో మహిళల స్థితి, వారి వ్యక్తిత్వ వికాసం, స్వాతంత్ర్య ఆలోచనలు మరియు సమానత్వం కోసం జరిగే పోరాటం వంటి అంశాలు ఆధునిక కథల్లో ప్రధానంగా కనిపిస్తాయి. ప్రత్యేకంగా ఆధునిక తెలుగు కథా సాహిత్యంలో మహిళను కేవలం కుటుంబ పరిమితుల్లో ఉన్న పాత్రగా కాకుండా, ఆలోచించే వ్యక్తిగా, తన హక్కుల కోసం పోరాడే చైతన్య వంతురాలిగా చిత్రించడం గమనించవచ్చు. ఈ కథలు మహిళల అంతర్మనసును, వారి భావోద్వేగాలను మరియు సమాజంతో ఉన్న సంఘర్షణలను సున్నితంగా ఆవిష్కరిస్తాయి.

ఆధునిక రచయితలు మహిళా సమస్యలను వాస్తవిక దృక్పథంతో విశ్లేషిస్తూ, స్త్రీ స్వాతంత్ర్యం, సమానత్వం మరియు ఆత్మగౌరవం వంటి విలువలను ప్రతిపాదించారు. అందువల్ల ఆధునిక తెలుగు కథలు మహిళా చైతన్యానికి ప్రతీకలుగా నిలుస్తాయి. ఈ వ్యాసం ఆధునిక తెలుగు కథానికలో మహిళల ప్రాముఖ్యతను మరియు మహిళా చైతన్యాన్ని సాహిత్య పరంగా విశ్లేషిస్తుంది.

కీలక పదాలు

మహిళా చైతన్యం, ఆధునిక తెలుగు సాహిత్యం, కథానిక , స్త్రీవాద దృక్పథం, మహిళా సమస్యలు, సామాజిక సమానత్వం, మహిళా స్వాతంత్ర్యం, ఆధునిక కథా సాహిత్యం

పరిచయం

తెలుగు సాహిత్య రంగంలో ఎందరో మహిళలు ప్రతిభ చూపారు. సాహిత్యం సమాజానికి అద్దం అని సాధారణంగా చెప్పబడుతుంది. అప్పటి తరంలో తాళ్లపాక తిరుమలమ్మతో మొదలై శతాబ్దాలుగా తెలుగు సాహిత్య లోకానికి వన్నె తెస్తూ.. తమ రచనలతో ఎన్నో సంస్కరణలు తీసుకొచ్చారు. మూఢ నమ్మకాలు, బాల్య వివాహాలు, మహిళలపై ఆంక్షలున్న సమయంలో తమ సాహిత్యంతో మార్పులు తీసుకొచ్చే ప్రయత్నం చేశారు. ప్రస్తుతం మహిళా రచయితలు వందల మంది ఉన్నారంటేనే తెలుగు సాహిత్యానికి అది గర్వకారణం. పద్య సాహిత్యం, వచన కవిత్వం, నవలలు, విప్లవ సాహిత్యం, కామెడీ రచనలు, కథలు ఏదైతేనేమీ అన్నిట్లోనూ తాము సైతం సత్తా చూపగలమని దూసుకెళ్తున్నారు. కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డులను అందుకుంటూ.. పత్రికలను సైతం

నడిపిస్తున్నారు. స్త్రీ వాదంలో ఒరవడి తెస్తూ, ఎన్నో అడ్డంకులు, అవమానాలూ ఎదుర్కొంటున్నా మహిళా సమస్యలపై గళం విప్పుతున్నారు. సమాజంలో జరుగుతున్న మార్పులు, సంఘర్షణలు, అసమానతలు సాహిత్యంలో ప్రతిఫలిస్తాయి. తెలుగు సాహిత్యంలో ముఖ్యంగా ఆధునిక కాలంలో కథానిక ఒక శక్తివంతమైన ప్రక్రియగా అభివృద్ధి చెందింది. కథానికలు సమాజంలోని వివిధ సమస్యలను తక్కువ పరిమాణంలోనే గాఢంగా వ్యక్తపరచగల సామర్థ్యాన్ని కలిగి ఉంటాయి.

ఆధునిక తెలుగు కథల్లో మహిళా చైతన్యం ఒక ముఖ్యమైన అంశంగా నిలిచింది. గతంలో సాహిత్యంలో మహిళను త్యాగమూర్తిగా, సహనశీలురాలిగా మాత్రమే చిత్రించేవారు. కానీ ఆధునిక కాలంలో రచయితలు కథల్లో మహిళలను కేవలం కుటుంబానికి పరిమితమైన పాత్రలుగా కాకుండా సమాజంలో తమ స్థానాన్ని గుర్తించుకునే వ్యక్తులుగా చిత్రించారు. మహిళను తన హక్కుల కోసం పోరాడే వ్యక్తిగా చూపించారు. ఇది మహిళల ఆత్మగౌరవం, సమాన హక్కులు మరియు స్వాతంత్ర్యం కోసం జరిగే మానసిక-సామాజిక పోరాటాన్ని సూచిస్తుంది. ఆధునిక తెలుగు

ప్రత్యేకంగా స్త్రీవాద ఉద్యమాల ప్రభావంతో మహిళలపై జరుగుతున్న, అత్యాచారాలు, కులవివక్ష, కుటుంబ సమస్యలు మరియు ఉద్యోగాల్లో ఎదురయ్యే వివక్ష వంటి అంశాలు కథలలో ప్రధానంగా ప్రతిబింబించాయి. అలాగే కథలలో మహిళలపై జరిగే లైంగిక హింస, అత్యాచారాలు, దళిత మహిళలపై అగ్రవర్ణ పురుషుల ఆధిపత్యం వంటి అంశాలు ప్రధానంగా ప్రతిబింబిస్తున్నాయి. ఈ కథలు కేవలం బాధను మాత్రమే చూఒకుండా మహిళల్లో ఎదుగుతున్న చైతన్యాన్ని కూడా వ్యక్తం చేస్తాయి.

పరిశోధనా లక్ష్యాలు

ఈ పరిశోధనా వ్యాసం ప్రధాన లక్ష్యాలు క్రింది విధంగా ఉన్నాయి :

1. ఆధునిక తెలుగు కథానికల్లో మహిళా చైతన్యం ఎలా ప్రతిబింబించిందో విశ్లేషించడం.
2. మహిళలపై జరుగుతున్న లైంగిక వేధింపులు మరియు అత్యాచారాల చిత్రణను అధ్యయనం చేయడం.
3. దళిత మహిళలపై కులవివక్ష మరియు అగ్రవర్ణ ఆధిపత్యాన్ని కథలలో ఎలా చూపించారో పరిశీలించడం.
4. కుటుంబ బాధ్యతలు, భర్తల నిర్లక్ష్యం మరియు వృద్ధాప్య సమస్యలను కథల్లో ఎలా ప్రతిబింబించారో విశ్లేషించడం.
5. ఉద్యోగాల్లో మహిళలు ఎదుర్కొనే లైంగిక వేధింపులు మరియు వాటిపై మహిళల పోరాటాన్ని అధ్యయనం చేయడం.

ఆధునిక తెలుగు కథానికల్లో మహిళా చైతన్యం

ఆధునిక తెలుగు కథాసాహిత్యంలో మహిళా చైతన్యం స్త్రీవాద భావజాలంతో ముడిపడి ఉంది. మహిళలు ఎదుర్కొనే సామాజిక అసమానతలను ప్రశ్నిస్తూ కథలు ఒక విమర్శాత్మక దృక్పథాన్ని ప్రతిపాదించాయి. ఈ సందర్భంలో చలం వంటి రచయితలు మహిళా స్వాతంత్ర్యాన్ని బలంగా ప్రతిపాదించారు. చలం రచనల్లో మహిళల భావోద్వేగాలు, వారి వ్యక్తిత్వ వికాసం మరియు పురుషాధిక్య సమాజంతో ఉన్న సంఘర్షణలు ప్రధానంగా కనిపిస్తాయి. ఆయన రచనల్లో మహిళను స్వతంత్ర వ్యక్తిగా చిత్రించడం ఆధునిక సాహిత్యంలో ఒక విప్లవాత్మక మార్పుగా భావించబడుతుంది.

స్త్రీ వాద గళాన్ని బలంగా వినిపించిన రచయితల్లో ఓల్గా. ఈమె అసలు పేరు పోపూరి లలితకుమారి. మొదట పైగంబర కవిత్వంతో సాహిత్య ప్రపంచంలోకి అడుగు పెట్టి, వచనంలో స్థిరపడి, స్త్రీ వాద సాహిత్యంలో సహజ, స్వేచ్ఛ, మానవి, కన్నీటి కెరటాల వెన్నెల, ఆకాశంలో సగం, గులాబీలు వంటి నవలలు రాశారు. రాజకీయ కథలు, ప్రయోగం, భిన్న సందర్భాలు, మృణ్మయనాదం, విముక్త (కథాసంపుటి) ఆమె కథా సంకలనాలు. సామాన్యుల సాహసం, భూమి పుత్రిక మిస్సింగ్, మూడుతరాలు, పుట్టని బిడ్డకు తల్లి ఉత్తరం, ఉరికొయ్య అంచున, నేనూ సావిత్రిబాయిని, అక్షర యుద్ధాలు వంటి నువాదాలూ చేశారు. అత్యంత పేరుగాంచిన 'విముక్త' రచన.

ఆధునిక స్త్రీ వాద రచయితల్లో చెప్పుకోవాల్సిన పేరు కుప్పిలి పద్మ. ఆధునిక మహిళల సమస్యలను, ప్రపంచీకరణ పరిణామాలను, మానవ సంబంధాల మధ్య సంఘర్షణను తనదైన కోణంలో విశ్లేశించి ఎన్నో కథా సంపుటాలు రచించారు. ప్రస్తుత రోజుల్లో ఆధునిక మహిళ ఎదుర్కొంటున్న లైంగిక వేధింపుల సమస్యలో వచ్చిన మీటూ ఉద్యమంలో భాగంగా, "మీటూ" అనే కథల పుస్తకాన్ని రచించారు. "మనం ప్రపంచం కోసం మాట్లాడితే ప్రపంచం మన కోసం మాట్లాడుతుంది" అంటారు కుప్పిలి పద్మ. కథా స్రవంతి, ఎల్లో రిబ్బన్, కుప్పిలి పద్మ కథలు, పొగమంచు అడివి వంటి పుస్తకాలు రచించారు.

మహిళా రచయితల్లో ప్రత్యేకించి చెప్పుకోవాల్సిన వారిలో ప్రముఖులు పి.సత్యవతి. కథలు, వ్యాసాలు, నవలలు, అనువాదాలు ఇలా ఒక్కటేమిటి.. ఏది రాసినా స్త్రీ జీవితాన్ని అద్దంలా చూపించటమే ధ్యేయంగా ఈమె రచనలు ఉంటాయి. ఆధునిక స్త్రీ వాద సాహిత్యంలో వీరిది ప్రత్యేక ఒరవడి. స్త్రీల జీవితాన్ని హింసామయం చేస్తున్న వ్యవస్థలను విమర్శించేలా ఈమె రచనా విధానం ఉంటుంది. ఇల్లలకగానే, సూపర్ మాం సిండ్రోం, దమయంతి కూతురు, గాంధారి రాగం వంటివి స్త్రీ వాదం వినిపించే వీరి ప్రముఖ రచనలు. "యాన్ ఆటో బయోగ్రఫీ ఆఫ్ అ ట్రాన్స్ జెండర్" పుస్తక అనువాదానికి గానూ, వీరికి కేంద్ర సాహిత్య అకాడమీ పురస్కారం లభించింది. విజయ బండారు, జ్యోతి వలబోజు, పి. జ్యోతి, సుజాత వేల్పూరి, మానస ఎండ్లూరి, చైతన్య పింగళి, స్వర్ణ కిలారి, ఎండపల్లి భారతి, అపర్ణ తోట, అరుణ పప్పు, ఊహ, షాజహానా, నస్రీన్, రుబీనా పర్వీన్, వినోదిని ఇంకా ఎందరెందరో ఈ తరం మహిళా రచయితలు పత్రికా సంపాదకులుగా, ఉద్యమకారిణులుగా, వ్యాసకర్తలుగా, పుస్తక రచయితలుగా, స్త్రీ వాద రచయితలుగా, సినీ పాటల రచయితలుగా రాణిస్తున్నారు. 'ఆడదానికి ఆడదే శత్రువు' అనే మాటను రీప్లేస్ చేసి "సిస్టర్ హుడ్" అంటూ, ఒకరి కోసం ఒకరు నిలుస్తూ, సమస్యల మీద ఒక్కరుగా కలిసి పోరాటం చేస్తూ, చర్చావేదికలను నిర్వహిస్తున్నారు.

లైంగిక వేధింపులు మరియు అత్యాచారాల ప్రతిబింబం

ఆధునిక తెలుగు కథల్లో మహిళలపై జరుగుతున్న లైంగిక హింసను గాఢంగా చిత్రించారు. సమాజంలో మహిళలు ఎదుర్కొనే ఈ సమస్యలను కథలు వాస్తవికంగా ప్రతిబింబించాయి. కొన్ని కథల్లో కుటుంబ సభ్యుల నుంచే మహిళలు ఎదుర్కొనే హింసను చూపించగా, మరికొన్ని కథల్లో సామాజిక వ్యవస్థలో ఉన్న పురుషాధిక్య ధోరణిని విమర్శించారు. అత్యాచారం ఒక వ్యక్తిగత నేరం మాత్రమే కాకుండా ఒక సామాజిక సమస్యగా కథలు చూపిస్తాయి.

ఈ కథల ద్వారా రచయితలు సమాజంలో ఉన్న అన్యాయాన్ని ప్రశ్నిస్తూ మహిళల ఆత్మగౌరవాన్ని కాపాడే అవసరాన్ని నూచించారు. భారతీయ సమాజంలో కులవ్యవస్థ ఒక ప్రధాన సామాజిక నిర్మాణం. ఈ వ్యవస్థ కారణంగా దళిత మహిళలు ద్వంద్వ అణచివేతను ఎదుర్కొంటారు. కొన్ని ఆధునిక కథల్లో అగ్రవర్ణ పురుషులు దళిత మహిళలను మోసం చేయడం, వారి సామాజిక బలహీనతను దుర్వినియోగం చేయడం వంటి సంఘటనలు చూపబడ్డాయి. కోడవటిగంటి కుటుంబ రావు వంటి రచయితలు సమాజంలోని కుల అసమానతలను తమ కథలలో విమర్శాత్మకంగా చిత్రించారు. ఈ కథలు కులవ్యవస్థలో ఉన్న అన్యాయాన్ని స్పష్టంగా చూపిస్తాయి.

కుటుంబ బాధ్యతలు మరియు భర్తల నిర్లక్ష్యం

మహిళల జీవితంలో కుటుంబ బాధ్యతలు ముఖ్యమైన పాత్ర పోషిస్తాయి. ఆధునిక కథల్లో మహిళలు కుటుంబాన్ని నిలబెట్టే కేంద్రబిందువులుగా కనిపిస్తారు.

అబ్బూరి చయాదేవి కథలలో మహిళల అంతర్మనసు మరియు కుటుంబ జీవితంలో ఉన్న సంఘర్షణలు సున్నితంగా ప్రతిబింబించాయి. భర్తల నిర్లక్ష్యం, కుటుంబ బాధ్యతల భారాన్ని మహిళలు ఒంటరిగా మోసే పరిస్థితులు ఈ కథల్లో కనిపిస్తాయి.

ఉద్యోగాల్లో మహిళలు ఎదుర్కొనే లైంగిక వేధింపులు

ఆధునిక సమాజంలో మహిళలు ఉద్యోగాల్లో కూడా అనేక సమస్యలను ఎదుర్కొంటున్నారు. ఉద్యోగ స్థలాల్లో

పురుషాధిక్య ధోరణి కారణంగా మహిళలు లైంగిక వేధింపులకు గురవుతారు. వోల్గా వంటి రచయితలు మహిళల ఆత్మగౌరవాన్ని మరియు స్వాతంత్ర్యాన్ని తమ కథలలో ప్రతిపాదించారు. మహిళలు ఈ పరిస్థితులకు ఎదురొడ్డి నిలబడి తమ హక్కుల కోసం పోరాడే వ్యక్తులుగా చిత్రించబడ్డారు.

మహిళల పోరాటం మరియు చైతన్యం

ఆధునిక తెలుగు కథల్లో ముఖ్యంగా మహిళల పోరాటం ప్రధానాంశంగా కనిపిస్తుంది. మహిళలు తమ హక్కుల కోసం పోరాడుతూ సమాజంలో సమానత్వాన్ని కోరుకుంటారు. ఈ కథలు మహిళలను బలహీనులుగా కాకుండా చైతన్యవంతులుగా చిత్రిస్తూ సమాజంలో మార్పును ప్రేరేపించే ప్రయత్నం చేస్తాయి.

వృద్ధాప్య సమస్యలు

మహిళల జీవితంలో వృద్ధాప్యం ఒక ముఖ్యమైన దశ. ఆధునిక కథల్లో వృద్ధ మహిళల ఒంటరితనం, కుటుంబ నిర్లక్ష్యం మరియు ఆర్థిక సమస్యలు ప్రతిబింబించాయి. కొన్ని కథల్లో వృద్ధ మహిళలు తమ గత జీవితాన్ని తిరిగి పరిశీలిస్తూ, సమాజంలో తమ స్థానాన్ని ప్రశ్నించే పాత్రలుగా కనిపిస్తారు.

ముగింపు (Conclusion)

ఆధునిక తెలుగు కథాసాహిత్యం మహిళల జీవితాన్ని సమగ్రంగా ప్రతిబింబించింది. మహిళలపై జరుగుతున్న లైంగిక వేధింపులు, అత్యాచారాలు, కులవివక్ష, కుటుంబ సమస్యలు మరియు ఉద్యోగాల్లో ఎదుర్కొనే వివక్ష వంటి అంశాలను కథలు స్పష్టంగా చిత్రించాయి. చలం, కోడవటిగంటి కుటుంబరావు, అబ్బూరి చయాదేవి మరియు వోల్గా వంటి రచయితలు మహిళల సమస్యలను వాస్తవిక దృక్పథంతో చిత్రిస్తూ స్త్రీవాద చైతన్యాన్ని సాహిత్యంలో బలపరిచారు. ఈ కథలు మహిళల బాధలను మాత్రమే కాకుండా వారి పోరాటాన్ని కూడా ప్రతిబింబించాయి. అందువల్ల ఆధునిక తెలుగు కథానికలు మహిళా చైతన్యానికి ఒక ముఖ్యమైన వేదికగా నిలిచాయి.

ఉపయుక్త గ్రంథాలు

1. పెళ్లానికి ప్రేమలేఖ (కథలు) రంగనాయకమ్మ, విశాలాంధ్ర ప్రెస్, హైదరాబాద్.
2. అత్తగారి కథలు, ఇంటి పిల్లలు, భానుమతీ రామకృష్ణ, నవోదయ పబ్లిషర్స్, గుంటూరు; తెలుగు అకాడమి.
3. కల్పవృక్షం (కథలు) వాసిరెడ్డి సీతాదేవి, విశాలాంధ్ర ప్రెస్, హైదరాబాద్; ఎమెస్కో పబ్లిషింగ్ హౌస్.
4. ఓల్గా. విముక్తి. హైదరాబాద్: విశాలాంధ్ర ప్రెస్.
5. అబ్బూరి చాయాదేవి. కథలు. హైదరాబాద్: తెలుగు అకాడమి.
6. చలం. స్త్రీ. హైదరాబాద్: విశాలాంధ్ర ప్రెస్.
7. కొడవటిగంటి కుటుంబరావు. కథలు. హైదరాబాద్: విశాలాంధ్ర ప్రెస్.

★★★

Vol. 23 | Spl. Issue 03 | March 2026 | BHAVAVEENA | ISSN No. : 2456-4702 | RNI No. APTEL/2003/12253

RNI No. APTEL/2003/12253 | Reffered Journal & Peer Reviewed Journals | ISSN No. 2456-4702

భావవీణ

కళలు, సాహిత్య, సాంస్కృతిక భాషాధ్యయన పత్రిక

BHAVA VEENA

Journal of Arts, Literary, Culture & Language Study

ఉమ్మడి నరసింహారెడ్డి "పరిష్కారం" నాటకం - స్త్రీల పాత్రల స్వభావ చిత్రణ

- సింతోరాజు సంధ్యారాణి

తెలుగు అధ్యాపకురాలు, తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల మహిళా డిగ్రీ కళాశాల, సిరిసిల్ల.

ఉపోద్ఘాతం:

ఆంగ్ల సాహిత్య ప్రభావంతో తెలుగు సాహిత్యానికి పరిచయమైన ప్రక్రియ నాటకం. దీనికి నర్తనం, ప్రవర్తనం, అనే అర్థాలున్నాయి. తెలుగు సాహిత్య ప్రక్రియలో నాటక సాహిత్యానికి అత్యున్నత స్థానం ఉన్నది. నాటకం దృశ్య ప్రధానమైనది. కనుకనే దీనిని సర్వ కళల సమాహారంగా చెబుతారు. సంగీతం, నృత్యం, అభినయం, ఆహార్యం మొదలైనవన్నీ దీనిలో భాగంగా ఉంటాయి. నాటకంలో ఉండే ఆయా పాత్రలలోకి రచయిత పరకాయ ప్రవేశం చేసి ఆ పాత్రల స్వభావాన్ని సన్నివేశానికి తగ్గట్టుగా మలచి సంభాషణ రూపంలో ప్రదర్శింపజేస్తాడు. ఆ విధంగా ప్రదర్శింపబడిన నాటకం సహృదయుని మనస్సుకు చేరి రసావిష్కరణ జరుగుతుంది. ఆయా పాత్రలతో తనను ఊహించుకొని తన్మయత్వాన్ని పొందుతాడు. నాటకం యొక్క ప్రధాన ఉద్దేశ్యం సామాజిక ప్రయోజనం. నాటకాన్ని ప్రదర్శించాలంటే దానికి కొన్ని లక్షణాలు ఉన్నాయి. నాటకంలో ప్రధానంగా పూర్వరంగం, నాంది, ప్రస్తావన, అంకం, అర్థోపక్షేపకాలు, అర్థ ప్రకృతులు, కార్యావస్థలు, పంచసంధులు, వృత్తులు, చివరగా భరత వాక్యం ఇవన్నీ కూడా నాటక లక్షణాలుగా చెబుతారు. వీటన్నింటి కలయిక వల్ల నాటకం ఎంతో రసవత్తరంగా మారి సహృదయుడిలో రసానుభూతిని కలిగిస్తుంది. ప్రస్తుత నాటకం 'పరిష్కారం' ఈ నాటకం సమాజాన్ని ఆలోచింపజేసేదిగా కొనసాగుతూ సమాజంలో మానవుడి స్థానం ఎక్కడ అనే ప్రశ్నను కవి మన ఊహకే వదిలేశాడు. దిగజారిపోతున్న మానవ సంబంధాలను, వివాహ వ్యవస్థను తన నాటకం ద్వారా ఒక చిన్న పరిష్కారం చూపే ప్రయత్నం చేశారు ఉమ్మడి నరసింహారెడ్డి.

కీలక పదాలు :

వరకట్నం, దురాచారం, కన్యాశుల్కం, అతలాకుతలం, బలిపశువులు.

నాటక సంక్షిప్తి:

పరిష్కారం నాటకం గమనిస్తే దీనిలో వరకట్నం ప్రధానమైన వస్తువుగా కనిపిస్తుంది. వరకట్నం సమస్యతో బలపుతున్న ఒక స్త్రీ అరుపులతో ఈ నాటకం ప్రారంభమవుతుంది. ఈ నాటకంలో అంతరనాటకాలు కూడా అక్కడక్కడా కనిపిస్తాయి. మాధవరావు ఒక కుటుంబ యజమాని అతనికి ఇద్దరు కూతుళ్ళు ఒక కొడుకు ఉంటారు. పెద్ద కూతురు రాజేశ్వరికి 50 వేల రూపాయల వరకట్నం ఇచ్చి గణంగా వివాహం చేస్తాడు. కానీ ఆమె భర్త తాగుడుకు బానిసై అదనపు కట్నం కోసం భార్యను హింసిస్తాడు. దానితో మాధవరావు పెద్ద కూతురు సంసారం చక్కబెట్టలేక చిన్న కూతురు వివాహం చేయలేక సతమతమవుతాడు. పెళ్ళిళ్ళ పేరయ్య పగడాల పాపయ్యగారి

సంబంధాన్ని తెస్తాడు. పాపయ్య వరకట్నం కోసం కుమారుడి వివాహానికి సిద్ధపడతాడు. కానీ పాపయ్య కొడుకు వేణు ఆదర్శ వివాహం చేసుకోవాలనుకుంటాడు. ఆ ఇష్టంతోనే మాధవరావు రెండో కూతురు కళ్యాణిని వివాహం చేసుకుంటాడు. ఆ వివాహం ఇష్టంలేని వేణు తల్లిదండ్రులు కోడలిని మచ్చిక చేసుకొని వియ్యంకుని వద్ద నుండి ఎలాగైనా కట్నం డబ్బు వసూలు చేయాలని అనుకుంటారు. కానీ కళ్యాణి చదువుకున్నది గడుసరి కనుక వారి ప్రయత్నాలు ఫలించలేదు. చివరకు కోడలిని చంపి ఎక్కువ వరకట్నం ఇచ్చే సంబంధాన్ని చేయాలను కుంటారు. కొడుకు లేని సమయం చూసి కళ్యాణిని చంపడానికి పన్నాగం పన్నుతారు. కిరోసిన్ పోసి చంపే ప్రయత్నం చేస్తుండగా అంతలో వేణు వచ్చి కళ్యాణిని కాపాడి తన తల్లిదండ్రులను అసహ్యించుకొని వారికి కొడుకుగా పుట్టినందుకు సిగ్గుపడుతున్నానని చెప్పి వరకట్నం దురాచారం నశించాలి అనే నినాదంతో అక్కడి నుండి నిష్క్రమిస్తాడు. దీనితో ఈ నాటకం ముగుస్తుంది.

వరకట్న సమస్య:

సమాజాన్ని పట్టి పీడిస్తున్న సమస్యలలో వరకట్న సమస్య ఒకటి. ఒకప్పుడు కన్యాశుల్కం సమాజాన్ని అతలాకుతలం చేసింది. పేదవారైన ఆడపిల్ల తల్లిదండ్రులకు డబ్బు ఆశ చూపించి ధనవంతులైన ముసలి వాళ్ళు ముక్కుపచ్చలారని పసిపిల్లలను బలిపశువులుగా చేసి వివాహం చేసుకునేవారు. తర్వాత కొద్ది రోజులకే ఆ ముసలి భర్త చనిపోతే చిన్న వయసులోనే బాల్ వితంతువుగా మారేవారు. ఆనాటి సమాజంలో గురజాడ, కందుకూరి, రాజారామ్మోహనరాయ్ మొదలైనవాళ్ళు సమాజం వైపు నిలబడి సుదీర్ఘమైన పోరాటం చేశారు. దాని ఫలితంగా కన్యాశుల్కం నశించినా దాని స్థానంలో వరశుల్కం వచ్చి సమస్యగా మారింది. ప్రస్తుత నాటకంలో కవి వరకట్న సమస్యను ప్రధాన కేంద్రంగా చేసుకొని ఈ నాటకాన్ని రాశాడు. మాధవరావు తన కూతుళ్ళ వివాహానికి వరకట్నం ఇచ్చే విషయంలో అతను పడ్డ కష్టాలను కళ్ళకు కట్టినట్టు చూపించాడు. ఆడపిల్లలను కన్న నేరానికి సమాజంలో తలెత్తుకోలేక పోతున్నానని బాధపడుతూ ఎక్కువ కట్నం ఇచ్చుకోలేక మొదటి కూతురిని పోగొట్టుకుంటాడు. రెండో కూతురు కళ్యాణి పైసా కూడా కట్నం లేకుండా వివాహం చేసుకున్నందుకు అత్తా మామలు హింసించి చివరకు చంపడానికి కూడా ప్రయత్నిస్తారు. అంటే ఈ సమాజంలో కట్నం ఎక్కువ తెచ్చేవారినే ప్రేమ ఆప్యాయతలతో చూస్తుందని ఈ నాటకం ద్వారా తెలుస్తుంది. వరకట్నమనే అంధకారంలో పడి ఎందరో అబలలు బలవుతున్నారు. మన ప్రభుత్వాలు ఎన్ని చట్టాలు చేసినా వరకట్న సమస్యను పూర్తిగా తొలగించ లేకపోతున్నారు. ఈ సమస్య పేదవారీ పాలిట శాపంగా మారింది.

స్త్రీల అణచివేత:

నేటి సమాజంలో స్త్రీలు అన్నిరంగాలలో తమదైన ప్రతిభను కనబరుస్తున్నారు. పురుషునితో సమానంగా... అన్ని రకాల హక్కులను పొందుతున్నారు. అయినా కూడా ఏదో ఒక రూపంలో స్త్రీలు సమాజం నుండి కొంత అణచివేతకు గురవుతున్నారు. ప్రపంచీకరణ ప్రభావం వల్ల స్త్రీలు అన్ని రంగాలలో దూసుకుపోతున్నా, సమాజం నుండి ఎదురయ్యే వ్యతిరేకతను పూర్తిగా అధిగమించ లేకపోతున్నారు. ఆ వ్యతిరేకత వివిధ రూపాల్లో ఉన్నప్పటికీ దానిని అధిగమించాల్సిన అవసరం ఉంది. ప్రస్తుత నాటకంలో కూడా కళ్యాణి, రాజేశ్వరిలు వరకట్న సమస్యతో అనేక ఇబ్బందులు పడతారు. కళ్యాణి కాస్త సాహసించి ఆదర్శ వివాహం చేసుకున్నా అత్తామామల రూపంలో మరో సమస్య వచ్చింది. ఇది ఒక చిన్న నాటకమైనప్పటికీ దీనిలో ఒక సమాజపు రహస్యమే దాగివుంది. పురుష ప్రపంచం స్త్రీలను తక్కువ చేసి పిల్లలను కనే ఒక యంత్రంలా, కేవలం శారీరక సుఖం ఇవ్వడాని కోసమే అన్నట్లుగా పరిగణిస్తున్నారు. పుట్టిన ఆడపిల్లలను పురిట్లోనే చంపి పారేస్తున్నారు. ఇప్పటికీ మనకు ఆ శిశు కళేబరాలు చెత్తకుండీలలో దర్శనమిస్తూనే ఉన్నాయి. ఈ విధంగా స్త్రీలు ఏదో ఒక కోణంలో అణచివేయబడుతూనే ఉన్నారు.

పాత్రల స్వభావ చిత్రణ :

ఈ నాటకంలోని పాత్రలు ఒక్కొక్కరు ఒక్కో స్వభావాన్ని కలిగి ఉంటారు. నేటి సమాజంలో మనకు

కనిపించే వివిధ రకాల మనుషుల వ్యక్తిత్వం ఈ నాటకంలో కనిపిస్తుంది. మాధవరావు పాత్రను గమనిస్తే సాధారణంగా ప్రతి తండ్రి తన పిల్లలు అత్తగారింట్లో సుఖంగా ఉండాలని కోరుకుంటాడు. అదే ప్రయత్నం చేసిన మాధవరావు సమాజం ముందు ఓడిపోయి చివరకు కూతురిని కోల్పోయి నిస్సహాయ స్థితిలో ఉంటాడు. మాధవరావు కొడుకు పాణి ఆధునిక భావజాలం కల్గిన వ్యక్తి. సమాజంలో జరిగే అన్యాయాలను నాటక రూపంలో ప్రదర్శించి ప్రజలను ఆలోచింపజేస్తాడు. మాధవరావు కూతురు కళ్యాణి కూడా తన అక్కయ్యకు జరిగిన అన్యాయం తన విషయంలో జరగకూడదని ఆలోచించి తనను చేసుకునేవాడు వరకట్నం తీసుకోకూడదని ముక్కుసూటిగా సమాధానం చెబుతుంది. తను అనుకున్న మాట మీద నిలబడి ఆదర్శ వివాహం చేసుకుంది. కళ్యాణి భర్త వేణు కూడా అవే ఆదర్శ భావాలు కల్గిన వ్యక్తి. ఇక వేణు తల్లిదండ్రులు పాపయ్య, శాంతమ్మలు కట్నం కోసం ఆశపడి కన్న కూతురిలా చూసుకోవాల్సిన కోడలిని హింసిస్తూ చంపడానికి ప్రయత్నిస్తారు. ఇలాంటి వారిని సమాజంలో ఇప్పటికీ మనం చూస్తూనే ఉన్నాం. ఇక చివరగా శుభముహూర్తాల సుబ్బయ్య పెళ్ళిళ్ళ పేరయ్యగా ప్రతి నాటకంలో మనకు దర్శనమిస్తాడు. ఈ విధంగా నాటకంలో కనిపిస్తున్న ప్రతి పాత్ర సమాజంలో అక్కడక్కడా తారస పడుతూనే ఉంటాయి.

ముగింపు:

వాస్తవానికి సుఖదుఃఖాల అనుభూతులను కళ్ళకు కట్టినట్టు, ఉన్నది ఉన్నట్లు చిత్రించి చూపించేది నాటకం. అనేక రూపాల్లో, పాత్రలలో నటీనటులు చిత్ర విచిత్ర విన్యాసాలు చేస్తుంటారు. ఆయా సన్నివేశాలకు తగ్గట్టుగా పాత్రభినయం చేస్తూ సహృదయుల మనస్సులో చిర స్థాయిగా నిలిచిపోతారు. కవి దృష్టికి అందని...వస్తువుగాని, పాత్రగాని ఉండదు. పరిష్కారం అనే నాటకం వరకట్న నేపథ్యం నుండి రాయబడింది. వరకట్నం లేని సమాజాన్ని కవి కోరుకుంటూనే స్త్రీలకు కావాల్సిన రక్షణని గుర్తు చేస్తున్నాడు. సమాజంపై ప్రతి వ్యక్తికి గౌరవం ఉండాలని చెబుతూనే ఆ సమాజంలో జరిగే అన్యాయాలను తమదైన దృష్టి కోణం నుండి పరిష్కరించాలనేది ఈ నాటకం ప్రధాన ఉద్దేశ్యంగా చెప్పవచ్చు.

ఉపయుక్త గ్రంథసూచి:

1. గంగప్ప, ఎస్. 1985. "తెలుగు నాటకం". గుంటూరు: శశి ప్రచురణలు.
2. నరసింహారెడ్డి, ఉమ్మడి. 1985. "పరిష్కారం నాటకం". హైదరాబాద్: తెలుగు విజ్ఞాన పీఠం ప్రచురణలు.
3. రాజారాం, చిన్నం. 2015. "తెలుగు భాషా సాహిత్యం - సామాజికత" (సంపా.). తిరుపతి: చిన్నం పబ్లికేషన్స్.
4. వీరస్వామినాయుడు, ఎస్. 1984. "నాటకలోకము". తిరుపతి: సాధనా పబ్లికేషన్.
5. శ్రీనివాసరావు, కోలాచలం. 1977. "నాటక సాహిత్య సమాలోచనము". విజయవాడ: నవోదయ పబ్లిషర్స్.

★★★

Vol. 23 | Spl. Issue 03 | March 2026 | BHAVAVEENA | ISSN No. : 2456-4702 | RNI No. APTEL/2003/12253

RNI No. APTEL/2003/12253 | Reffered Journal & Peer Reviewed Journals | ISSN No. 2456-4702

భావవీణ

కళలు, సాహిత్య, సాంస్కృతిక భాషాధ్యయన పత్రిక

BHAVA VEENA

Journal of Arts, Literary, Culture & Language Study

మహాభారతంలో మహిళ పాత్రల చైతన్యం

– జి. జయశీల

పరిశోధక విద్యార్థి, భారతీయ ఇంజనీరింగ్ సైన్సు అండ్ టెక్నాలజీ ఇన్నోవేషన్ యూనివర్సిటీ, సత్యసాయి జిల్లా, ఆంధ్రప్రదేశ్.

వ్యాస సంగ్రహం :

మహాభారతం భారతీయ ఇతిహాసాలలో అత్యంత ప్రాముఖ్యమైన గ్రంథం ఇందులో పురుష పాత్రలతో పాటు మహిళా పాత్రలు కూడా కథ ను ముందుకు నడిపించడం ముఖ్యమైన పాత్ర పోషించాయి మహా భారతంలోని మహిళ పాత్ర ద్వారా ధైర్యం, ఆత్మగౌరవం, త్యాగం, జ్ఞానం వంటి గుణాలు స్పష్టంగా కనిపిస్తాయి ఈ పాత్రల చైతన్యం సమాజంలో మహిళల స్థానం మరియు వారి ప్రభావాన్ని తెలియజేస్తుంది మహా భారతంలో ముఖ్యమైన మహిళా పాత్రలలో గంగ, సత్యవతి, అంబాలిక, గాంధారి వంటి వారు ప్రముఖులు ఇంటి తన ధైర్యం మరియు సహనంతో పాండవులను కష్టకాలంలో కూడా ధర్మమార్గంలో నడిపించింది గాంధారి తన భర్త దృతరాష్ట్రుడు పట్ల విశ్వాసంతో జీవితాంతం కళ్లకు గంతలు పట్టుకుని జీవించడం ద్వారా తన భర్త భక్తిని చూపించింది.

ద్రౌపతి మహాభారతంలో అత్యంత చైతన్యవంతమైన మహిళా పాత్రగా కనిపిస్తుంది సభలో జరిగిన అవమానాన్ని ధైర్యంగా ఎదిరించి న్యాయం కోసం ప్రశ్నించిన ధైర్య స్వభావం అని వ్యక్తిత్వాన్ని ప్రతిబింబిస్తుంది ఆమె ఆత్మ గౌరవం మరియు న్యాయం కోసం చేసిన పోరాటం మహాభారత యుద్ధానికి కూడా ఒక కారణంగా చెప్ప బడుతుంది.

సత్యవతి తన తెలివితేటలు మరియు దూర దృష్టితో హస్తినపుర రాజ్య పరిపాల నలో ప్రభవం చూపింది అలాగే సుభద్ర కూడా ధైర్య సాహసాలతో కూడిన పాత్రగా నిలిచింది ఈ మహిళా పాత్రలు కేవలం కుటుంబం లోని కాకుండా సమాజం మీద కూడా ప్రభావం చూపించాయి.

అందువల్ల మహాభారతంలో మహిళా పాత్రలు బలహీనంగా కాకుండా చైతన్యవంతమైనవిగా చిత్రించ బడ్డాయి వారి ధైర్యం నా నం ఆత్మ గౌరవం మహాభారత కథకు ముఖ్యమైన బలం ఈ పాత్రలు సమాజంలో మహిళల ప్రాధాన్యతను మరియు వారి చైతన్యాన్ని స్పష్టంగా తెలియజేస్తాయి

కీలక పదాలు :

దూరదృష్టి, చైతన్యం, ఆత్మగౌరవం, ధైర్యం, త్యాగం

ఉపోద్ఘాతం :

భారతీయ ఇతిహాసాలలో మహాభారతం ఒక ప్రముఖ మైన గ్రంథం. వ్యాస మహర్షి రచించిన ఈ మహాకావ్యం కేవలం యుద్ధ కథ మాత్రమే కాకుండా సమాజ జీవన విధానం, ధర్మం, నైతిక విలువలు, మానవ సంబంధాలు వంటి అనేక అంశాలను ప్రతిబింబిస్తుంది. మహా భారతంలో ఈ మహిళా పాత్రలు తమ ధైర్యం, ఆత్మ గౌరవం, జ్ఞానం మరియు త్యాగంతో సమాజానికి మార్గదర్శకులుగా నిలిచాయి. గంగ ,కుంతి, గాంధారి,

ద్రౌపది, సత్యవతి వంటి మహిళలు తమ వ్యక్తిత్వం మరియు చైతన్యంతో మహాభారత కథలో ప్రత్యేక స్థానం పొందారు.అందువల్ల మహాభారతంలోని మహిళా పాత్రల చైతన్యం గురించి అధ్యయనం చేయడం ద్వారా ఆ కాలంలోని సమాజంలో మహిళల స్థానం, వారి పాత్ర మరియు వారి ప్రభావాన్ని స్పష్టంగా తెలుసుకోవచ్చు.

విషయ విశ్లేషణ :

గంగ :

సృష్టికర్త ఉన్న అత్యంత పవిత్రమైన బ్రహ్మ మహా సభలో ఇక్ష్వాకు అంశానికి చెందిన మహాభీష్ముడు వచ్చాడు అదే సమయంలో పవిత్రమైన గంగాదేవి కూడా మానవ రూపంలో అక్కడకు వచ్చింది అప్పుడు హఠాత్తుగా వీచిన గాలికి గంగాదేవి పైట చెంగు జారిపోయింది అప్పుడు మహాసభలో అందరూ తలదించుకొని ఉంటారు కానీ మహాబీరు మాత్రం ఆ క్షణం తనను తాను మర్చిపోయి గంగాదేవి అందానికి ముక్తుడై అలాగే చూస్తూ ఉండిపోతాడు గంగాదేవి కూడా ఆ చూపుకు కట్టుబడి పోతుంది అదంతా గమనించిన బ్రహ్మ దేవుడు అత్యంత అబ్రహంకు లోనై పవిత్రమైన బ్రహ్మ సభలో చోటు లేదు ఎవరికోసమైతే మీరు ధర్మాన్ని మర్చిపోయరో వారి వల్లనే మీకు భూలోకంలో దుఃఖం కలగాలి అని శపించాడు ఆ శాపమే మహాభారత ఇతిహాసానికి తొలి అడుగు మహాబీరు కురువంశంలో శాంతనుడిగా గంగాదేవి అతని భార్యగా పుట్టింది

వశిష్టుడి శాపానికి బలైన అష్టవసువులు భూమికి దిగివస్తున్న గంగాదేవిని కలిసి తల్లి మేము ఏ మానవ గర్వములో ఎక్కువ కాలము ఉండలేము నువ్వు శాంతనుడిని పెళ్లి చేసుకో మేము నీ కడుపులో బిడ్డలుగా పుడతాము పుట్టిన వెంటనే మాకు గంగలో పారేసి మాకు ఈ మానవ జన్మ నుంచి విముక్తి ప్రసాదించు కానీ 8వ వాడిని బ్రతికించాలి అని షరతుతో కాలం గడిచింది ఒకరోజు శాంతనుడు గంగా తీరంలో విహరిస్తున్నప్పుడు సరిగ్గా అదే సమయంలో అలల మధ్య నుండి అద్భుత సౌందర్యరాశి గంగా నడుచుకుంటూ వచ్చింది శాంత నూడిని గంగాదేవి మూడు షరతులతో వివాహం చేసుకుంది 1.నేను ఎవరిని నా కులం ఏమిటి? నా పేరు ఏంటి అడగకూడదు 2.నేను ఏం పని చేసిన అది మంచిదా చెడ్డదా అని అడగకూడదు 3.నాకు ఎప్పుడూ ఎదురు చెప్పకూడదు ఏ రోజైతే నువ్వు నాకు ఎందుకు అని ప్రశ్నిస్తావో నా పనికి అడ్డుపడతావు ఆ క్షణమే నిన్ను వదిలేసి వెళ్ళిపోతానని అన్నది అదేవిధంగా ఏడుగురు పుత్రులను గంగాదేవి జన్మనిచ్చి గంగలో పడి వేసి పోతుంది కానీ ఎనిమిదవ పుత్రుడు సమయంలో మాత్రం శాంతనుడు గంగాదేవిని ప్రశ్నిస్తాడు అప్పుడు గంగాదేవి తన బిడ్డకు గొప్ప గురువుల దగ్గర విద్యను నేర్పించి నీకు అప్పజెప్తాను అని అక్కడి నుంచి వెళ్ళిపోతుంది.

సత్యవతి :

మహాభారతంలో సత్యవతి (మత్స్యగంధి) కీలక పాత్రసత్యవతి అద్రికుడు అనే చేప కడుపున జన్మించింది. దశరాజు (దశమ రాజు) పెంచిన ఈమె శరీరం నుంచి చేప వాసన (మత్స్యగంధ) వచ్చేది.

పరాశరుని అనుగ్రహం :

పరాశర మహర్షి పడవలో ప్రయాణిస్తున్నప్పుడు ఆమెను ఇష్టపడతాడు. ఆమె వాసనను రూపుమాపి 'యోజన గంధి'గా (యోజనం దూరం వాసన వెదజల్లేది) మార్చి, ఒక కుమారుని ప్రసాదిస్తాడు. అయనే వ్యాసమహర్షి (వేదవ్యాసుడు).

శంతనుని వివాహం :

మత్స్యగంధిగా ఉన్న ఆమె, యోజనగంధిగా మారి, హస్తినాపుర రాజు శంతనుని కట్టిపడేసింది. ఈమెను పెళ్ళి చేసుకోవడం కోసం శంతనుడు, ఆమె తండ్రి (దశరాజు) కోరిక మేరకు, తన మొదటి భార్య గంగ కుమారుడైన భీష్మునికి రాజ్యాధికారాన్ని వదులుకున్నాడు.

కురువంశ వారసులు :

శంతనుడు, సత్యవతిల వివాహం తర్వాత, వీరికి చిత్రంగదుడు, విచిత్రవీర్యుడు జన్మించారు. శంతనుని మరణం తర్వాత విచిత్రవీర్యుడు రాజయ్యాడు.

వ్యాసుని పాత్ర :

విచిత్రవీర్యుడు సంతానం లేకుండా మరణించడంతో, కురువంశాన్ని కాపాడటానికి సత్యవతి తన

మొదటి కుమారుడైన వేదవ్యాసుని (నియోగం ద్వారా) పిలిపించి, అంబిక, అంబాలికల ద్వారా ధృతరాష్ట్ర, పాండురాజులకు జన్మనిచ్చింది.

అంబ :

హోత్రవాహనుడు అనే కాశీరాజు పెద్ద కూతురు అంబ. ఈమెకు అంబిక, అంబాలిక అని ఇద్దరు చెల్లెళ్ళు ఉన్నారు. అంబ సాళ్వుడిని ప్రేమించి అతననే పెళ్ళి చేసుకోవాలనుకుంది. కానీ, భీష్ముడు తన తమ్ములకు పెళ్ళి చేయడానికి ఈ సోదరీమణులు ముగ్గురినీ స్వయంవరం వేళ తీసుకెళ్ళిపోయాడు. అప్పుడు భీష్ముడితో అంబ తన కథ చెప్పి తనని సాళ్వుడి వద్దకు పంపమని కోరింది. భీష్ముడు ఒప్పుకుని ఆమెని పంపేశాడు. కానీ, అక్కడ సాళ్వుడు భీష్ముడు వదిలేసిన అంబని స్వీకరించడానికి ఇష్టపడకపోవడంతో ఆమె తన కష్టాలకి భీష్ముడే కారణమని అతన్ని యుద్ధంలో ఓడించడానికి తపస్సు చేసింది. శివుడు ప్రత్యక్షమై ఆమెకి రాబోయే జన్మలో ద్రుపదరాజుకు శిఖండి అను కుమార్తె గా పుట్టి భీష్మునికి మరణం కలిగిస్తావని వరమిచ్చాడు. దానితో అంబ వెంటనే చితిపేర్చి శరీరము దహించుకుంది

అంబాలిక, అంబిక :

అంబాలిక, అంబిక మహాభారతంలోని పాత్రలు. వీరు ఇరువురు విచిత్ర వీర్యుని భార్యలు. అంబాలిక పాండు రాజు తల్లి. అంబ ధృతరాష్టుడి తల్లి అంబాలిక , అంబిక కాశీరాజు కుమార్తెలు అంబ, అంబాలిక, అంబిక అక్క చెల్లెళ్ళు. వీరి వివాహం కోసం కాశీరాజు స్వయంవరం ప్రకటించగా అనేకమంది రాజులు పోటీపడ్డారు, వారందరినీ భీష్ముడు ఓడించి, యువరాణులు ముగ్గురినీ ఎత్తుకు వెళ్ళాడు.

అంబ సాళ్వరాజును ప్రేమించానని చెప్పడంతో భీష్ముడు ఆమెను అతడి వద్దకు పంపించేసాడు. అంబిక, అంబాలికలను తన తమ్ముడైన విచిత్రవీర్యునికిచ్చి వివాహం చేసాడు.

విచిత్ర వీర్యుడు క్షయరోగంతో నిస్సంతుగా మరణించాడు. వంశవృద్ధి కోసమని అతడి తల్లి సత్యవతి తన తొలిపుత్రుడైన వ్యాసుని కోరింది.

అంబిక, అంబాలికలకు సంతానాన్ని ప్రసాదించేందుకు అతడు అంగీకరించాడు.అంబాలిక వ్యాసుని చూడడంతోనే భయంతో తెల్లబారింది. ఆ కారణాన ఆమెకు, పాండురోగం కారణాన తెల్లబారిపోయిన చర్మంతో పాండురాజు పుట్టాడు.

అంబిక వ్యాసుని వికారాకారం చూడలేక కళ్ళు మూసుకుంది. ఆ కారణాన వ్యాసుడు ఆమెకు, పుట్టుగుడ్డియైన ధృతరాష్ట్రుని ప్రసాదించాడు.

గాంధారి :

గాంధార రాజు సుబలుడికి, సుధర్మ కు గాంధారి జన్మించింది. మాతి అవతారంగా పరిగణించబడుతున్న గాంధారి తన ధర్మ స్వభావంతో పేరొందింది. కురు రాజ్యానికి పెద్ద యువరాజు ధృతరాష్ట్రుడితో గాంధారి వివాహం ఏర్పాటు చేయబడింది. అందమైన, ధర్మవంతురాలైన స్త్రీగా, అంకితభావంతో ఉన్న భార్యగా మహాభారతంలో చిత్రీకరించబడింది. భీష్ముడు వివాహం జరిపించాడు. తన భర్త అంధుడిగా జన్మించాడని తెలుసుకున్నప్పుడు, ఆమె కూడా తన భర్తలా ఉండటానికి తన కళ్ళకు గంతలు కట్టుకోవాలని నిర్ణయించుకుంది . తనకు తాను కళ్ళకు గంతలు కట్టుకోవడం ప్రేమకు సంకేతంగా చిత్రీకరించబడింది.

వివాహానికి పూర్వం గాంధారి తపస్సు ద్వారా శివుడిని ప్రసన్నం చేసుకొని 100 మంది పిల్లలను పుట్టడానికి వరం పొందింది. భీష్ముడు గాంధారిని కురు రాజ్యానికి పెద్ద కోడలిగా చేసుకోవడానికి ప్రధాన కారణాలలో ఈ వరం కూడా ఒక కారణం అని చెప్పబడింది.

తన భర్త పట్ల గాంధారి భక్తిని చూసిన వేద వ్యాసుడు 100మంది కుమారులు పుట్టడానికి వరం ఇచ్చాడు. గాంధారి గర్భవతి అవుతుంది, కాని 2 సంవత్సరాలు అయినా కాని ప్రసవం కాదు. ధృతరాష్ట్రుడి తమ్ముడు పాండురాజు భార్య కుంతి పాండవులలో పెద్దవాడికి జన్మనిచ్చిందని విన్న గాంధారి, నిరాశ నిస్సహాయతతో కడుపుపై కొట్టుకుంటుంది. ఫలితంగా బూడిదరంగులో ఒక ముద్ద పుడుతుంది. వేదవ్యాసుడు దీనిని 101 భాగాలుగా విభజించి, మట్టికుండలలో నిల్వచేసి మరో

2 సంవత్సరాలు దాచిపెడతాడు. అలా వారిలో మొదట దుర్యోధనుడు జన్మించగా, తరువాత 99మంది సోదరులు, ఒక సోదరి దుశ్శల జన్మిస్తుంది.

మహాభారత యుద్ధం తరువాత శ్రీకృష్ణుడి వంశం, ఆయన పిల్లలు, యాదవులు నశిస్తారని గాంధారి కృష్ణుడిని శపించింది. శ్రీకృష్ణుడు శాపమును సంతోషంగా అంగీకరించాడు.

యుద్ధం ముగిసిన 15 సంవత్సరాల తరువాత గాంధారి తన భర్త ధృతరాష్ట్రుడు, బావమరిది విదుర, మరదలు కుంతిలతో కలిసి తపస్సు కోసం హస్తినాపూరం నుండి బయలుదేరింది. హిమాలయాలలో ధృతరాష్ట్ర, విదుర, కుంతిలతో పాటు అటవీ అగ్నిప్రమాదంలో గాంధారి కూడా మరణించి మోక్షాన్ని పొందింది.

కుంతి దేవి :

మహాభారతంలో కుంతీదేవి త్యాగం, ధైర్యం మరియు ధర్మానికి నిలువెత్తు రూపం.అసలు పేరు పృథ. శూరసేనుని కుమార్తె, వసుదేవుని సోదరి. కుంతిభోజుడు దత్తత తీసుకోవడం వల్ల 'కుంతి'గా పిలవబడింది. దుర్వాస మహర్షిని సేవించి, దేవుళ్ళను ప్రసన్నం చేసుకునే మంత్రాన్ని పొందింది.

కర్ణుడి జననం :

చిన్నతనంలోనే మంత్ర శక్తిని పరీక్షించగా సూర్యుని వల్ల కర్ణుడు జన్మించాడు. అపవాదుకు భయపడి, కుంతి కర్ణుణ్ణి నదిలో వదిలివేసింది.

వివాహం :

పాండురాజుతో వివాహం జరిగింది.

పాండవుల జననం :

పాండురాజుకు శాపం వల్ల, కుంతి దుర్వాస మంత్రాన్ని ఉపయోగించి యముడు (యుధిష్ఠిరుడు), వాయువు (భీముడు), ఇంద్రుని (అర్జునుడు) ద్వారా పాండవులను కన్నది. మాద్రికి కూడా ఈ మంత్రాన్ని ఇచ్చి అశ్విని దేవతల ద్వారా నకులుడు, సహదేవులను కనేలా సహాయపడింది.

కష్టాలు మరియు త్యాగం :

పాండురాజు మరణం తర్వాత, కుంతి తన ఐదుగురు కొడుకులను తీసుకుని హస్తినాపురానికి వచ్చింది. కౌరవుల కుట్రలను, లాక్షాగృహ దహనం వంటి ప్రమాదాలను ఎదుర్కొని పాండవులను కాపాడింది.

మహాభారత యుద్ధం తర్వాత ధృతరాష్ట్రుడు, గాంధారితో కలిసి వానప్రస్థానికి వెళ్ళింది, అక్కడ అడవిలో సంభవించిన అగ్నిప్రమాదంలో ప్రాణాలు విడిచింది.

మాద్రి :

మద్రా దేశపు రాజ్యానికి రాజకుమారి మరియు శల్యుని సోదరి పాండురాజు యొక్క రెండవ భార్య పాండురాజుకు వచ్చిన శాపం కారణంగా పిల్లలు పుట్టకపోవడంతో కుంతిత ఇచ్చిన మంత్రంతో నకులను సహదేవులను జన్మనిచ్చింది పాండురాజుకు వచ్చిన శాపం కారణంగా అతను మాద్రితో ఉన్నప్పుడు మరణిస్తాడు ఆ తర్వాత మాద్రి పాండురాజు స్థితిలో సహగమనం చేసి మరణిస్తుంది

ద్రౌపతి :

మహాభారతంలో అత్యంత కీలకమైన మహిళా పాత్ర ద్రౌపది. పాంచాల దేశపు రాజు ద్రుపదుడు, ద్రోణాచార్యుని ఓడించడానికి చేసిన యజ్ఞం నుండి ద్రౌపది, దృష్టద్యుమ్నులు జన్మించారు. ఆమెను కృష్ణ, యజ్ఞసేని, పాంచాలి అని కూడా పిలుస్తారు.

వివాహం :

అర్జునుడు మత్స్య యంత్రాన్ని ఛేదించి, ద్రౌపది స్వయంవరంలో విజయం సాధించాడు. కుంతీదేవి మాట ప్రకారం, ఆమె ఐదుగురు పాండవులకు భార్య అయ్యింది

వస్త్రాపహరణం :

మాయా జూదంలో పాండవులు ఓడిపోయిన తర్వాత, దుర్యోధన, దుశ్శాసనులు ద్రౌపదిని నిండు సభలో అవమానించారు. అప్పుడు శ్రీకృష్ణుడు ఆమెకు అక్షయ వస్త్రాన్ని ప్రసాదించి, ఆమె గౌరవాన్ని కాపాడాడు

వనవాసం-జ్ఞాతవాసం :

13 ఏళ్ల అజ్ఞాతవాసంలో ఆమె పడిన కష్టాలు కురుక్షేత్ర యుద్ధానికి దారితీశాయి. కిచకుని సంహారం ఆమె తెగువకు నిదర్శనం.

యుద్ధం తర్వాత :

కురుక్షేత్ర యుద్ధంలో తన ఐదుగురు కుమారులను

(ఉపపాండవులు) అశ్వత్థామ్ముడు సంహరించినప్పుడు, ఆమె కన్నీరు మున్నీరైంది.

వ్యక్తిత్వం :

ద్రౌపది ఆత్మగౌరవం, పట్టుదల కలిగిన స్త్రీ. పాండవులను ధర్మ మార్గంలో నడిపించడంలో కీలక పాత్ర పోషించింది

సుభద్ర :

సుభద్ర మహాభారతంలో కృష్ణుడి సోదరి, అర్జునుడి భార్య మరియు అభిమన్యుడి తల్లి. ఈమె వసుదేవుడు-రోహిణీల కుమార్తె, బలరాముడికి చెల్లెలు. సుభద్ర పాత్ర మహాభారతం మరియు భాగవత పురాణాలలో ప్రముఖమైనది.

సుభద్ర జీవిత విశేషాలు:

జననం :

వసుదేవుడు మరియు రోహిణిలకు జన్మించింది.

వివాహం :

అర్జునుడు సుభద్రను ప్రేమించి, కృష్ణుడి సలహాతో ద్వారక నుండి అపహరించి (లేదా గంధర్వ వివాహం చేసుకుని) వివాహం చేసుకున్నాడు.

సంతానం :

అర్జున-సుభద్రల కుమారుడు అభిమన్యుడు, కురుక్షేత్ర యుద్ధంలో కీలక పాత్ర పోషించాడు.

ఉత్తర :

మహాభారతంలో ఉత్తర, మత్స్య దేశపు రాజు విరాటుడు మరియు రాణి సుధేష్ణల కుమార్తె.పాండవులు విరాటరాజు కొలువులో అజ్ఞాతవాసం చేస్తున్నప్పుడు, బృహన్నల రూపంలో ఉన్న అర్జునుడు ఉత్తరకు నాట్యం, సంగీతం నేర్పించాడు.

వివాహం :

కురుక్షేత్ర యుద్ధానికి ముందు, అర్జునుడి అభ్యర్థన మేరకు ఉత్తరను అభిమన్యునికి ఇచ్చి వివాహం జరిపించారు.

అభిమన్యుని మరణం & ఉత్తర గర్భం:

చక్రవ్యూహంలో అభిమన్యుడు మరణించే సమయానికి ఉత్తర గర్భవతి.

పరీక్షిత్తు జననం :

అశ్వత్థామ ప్రయోగించిన బ్రహ్మాస్త్రం వల్ల చనిపోయిన శిశువును, శ్రీకృష్ణుడు తన యోగశక్తితో బ్రతికించాడు. ఆ శిశువే కురువంశానికి వారసుడైన పరీక్షిత్తు.

భూమిక :

ఉత్తర పాండవ వంశ వారసత్వాన్ని కాపాడిన అత్యంత ముఖ్యమైన పాత్రగా కురుక్షేత్ర యుద్ధం తర్వాత పాండవ వంశాన్ని నిలిపిన పరీక్షిత్తుకు తల్లిగా చరిత్రలో నిలిచింది.

ముగింపు :

1. మహాభారతంలో మహిళ పాత్రలు చైతన్యానికి ఆత్మస్థైర్యానికి ప్రతీకలుగా నిలిచాయి
2. మహిళా పాత్రలు కథలో కీలకమైన పాత్ర పోషించాయి
3. ధర్మం న్యాయం ఆత్మగౌరవం న్యాయకత్వం వంటి విలువలను ప్రతిభమిస్తూ సమాజంలో మహిళల ప్రాముఖ్యతను తెలియజేశాయి
4. ఈ పాత్రలు భారతీయ సాహిత్యంలో మహిళా చైతన్యానికి నిదర్శనంగా నిలిచాయి.

పాద సూచికలు :

1. చక్రవ్యూహం - శత్రువులను చుట్టుముట్టేలా ఏర్పాటు చేసిన ప్రత్యేక యుద్ధ వ్యూహం
2. అజ్ఞాతవాసం-ఎవరికి తెలియకుండా గుప్తంగా ఉండే జీవనం యోగశక్తి-యోగా సాధన వల్ల కలిగే ఆధ్యాత్మిక శక్తి
3. గాంధర్వ వివాహం - పెద్దల అనుమతి లేకుండా పరస్పర ప్రేమతో జరిగే వివాహం
5. అంకిత భావం - ఏదైనా పని పట్ల సంపూర్ణ నిబద్ధతతో ఉండే మనసు

ఆధార గ్రంథాలు :

1. శ్రీమత్ ఆంధ్ర మహా భారతం, ప్రచురణ : ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమీ, ముద్రణ సంవత్సరం :1970
2. అంతర్జాలం

★

Vol. 23 | Spl. Issue 03 | March 2026 | BHAVAVEENA | ISSN No. : 2456-4702 | RNI No. APTEL/2003/12253

RNI No. APTEL/2003/12253 | Reffered Journal & Peer Reviewed Journals | ISSN No. 2456-4702

భావవీణ

కళలు, సాహిత్య, సాంస్కృతిక భాషాధ్యయన పత్రిక

BHAVA VEENA

Journal of Arts, Literary, Culture & Language Study

బౌద్ధ ధర్మంలో మహిళలు (ధమ్మ పదం)

– డా॥. సముద్రాల ప్రిన్సిల్ల

అధ్యాపకులు, తెలుగు విభాగం, ప్రభుత్వ కళాశాల (స్వ), రాజమహేంద్రవరం.

ఉపోద్ఘాతం:

సుత్తపిటకములోని ఐదవ భాగంలో, ఖుద్దకని కాయములో ధమ్మపదము, కతివృత్తకము, థేరగాథ, థేరీగాథ, జాతకములు, బుద్ధ వంశము, చరియాపిటకము ఇలా పదహారు ఖండాలున్నాయి. వీటిల్లో ధమ్మపదము ధర్మమార్గాన్ని బోధిస్తుంది. ధమ్మపదంలోనూ థేరీగాథల్లోనూ మహిళలూ, వారి కవిత్వ నైపుణ్యం, గాధలూ కన్పిస్తాయి. ఇవి ఆ కాలంనాటి మహిళల సాహిత్య కోణం మాత్రమే కాకుండా వారి సామర్థ్యాన్ని సాహిత్యానికి, సామాజిక వ్యవస్థకి, చారిత్రక ఉపయోగార్థం నేటికి నిదర్శనంగా కనిపిస్తున్నాయి.

ఆ మహిళల్లో రాజవంశీయులు అయినటువంటి మహాపజాపతి గౌతమి, రూపనంద, క్షేమ వంటి వారు, సామాన్య గృహిణులు అయినటువంటి ధమ్మదిన్న, కిసా గౌతమి, పటాచార వంటి వారు, పూర్వ గణికలు అయినటువంటి అంబపాలి, విమల, సిరిమా (సహచరి) వంటి వారు, వృద్ధ భిక్కుణీలు అయినటువంటి బహుపుత్రికా ధేరి వంటి వారు కన్పిస్తారు. థేరీగాథలో దాదాపు 73 మంది భిక్కుణీలు వారి గాథలు వారి అనుభవాలు, ఉన్నాయి. ఆ గాథలలో సాంఘిక కట్టుబాట్లు, కష్టాల నుంచి విముక్తి పొంది, వారు పొందిన ప్రశాంతతకు సంబంధించిన అంశాలు కన్పిస్తాయి. బౌద్ధ సంప్రదాయం ప్రకారం, ఆ గాథలు బుద్ధుని కాలం నాటివి కాగా, ఆధునిక చారిత్రకుల ప్రకారం, కొన్ని క్రీ.పూ. మూడవ శతాబ్దం చివరి నాటివిగా గుర్తించబడ్డాయి.

వ్యాస ఆవశ్యకత:

ధమ్మ పదంలోనూ, థేరీగాథలోనూ పేర్కొనబడిన మహిళల గురించి ఈ వ్యాస పరిశీలన అంశం. వారు తమ నిర్వాణ మార్గంలో ఎదుర్కొన్న సవాళ్లు, పొందిన విముక్తిని గాథల రూపంలో నిక్షిప్తం చేశారు. ఇంటిలో బానిసతనం, వంటగదికి పరిమితమవ్వడం, పిల్లలను పెంచడంలో ఒత్తిడి, సమాజంలో చిన్నచూపు, భర్త బిడ్డల వియోగం, ఒంటరి మహిళలుగా, మానసిక శారీరక ఒత్తిడికి గురవడం, అయినా జీవితాన్ని విజయపథంలో లీడ్ చెయ్యగలగడం, సమాజ నిర్మాతలుగా వారి పాత్రను గుర్తుచేసే అంశాలు తెలుసుకోవాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉంది.

వ్యాస వివరణ :

ఈ వ్యాసంలో ముఖ్యమైన ఐదు మంది మహిళల ప్రస్తావనలు చూడవచ్చు.

విశాఖ :

ఉపాసికలలో అగ్రగణ్యురాలు. ఈమె సామాజిక ధార్మిక కార్యక్రమాలు నిర్వహించడం తన నాయకత్వ లక్షణాలకు నిదర్శనం. ధమ్మపదంలోని పుప్పు వర్గంలో

53వ గాథలో రకరకాల పూలను అల్లి మాలగా చేసినట్టుగా మంచిపనులు, దానధర్మాలు చేసి జీవితాన్ని కొనసాగించాలని తన గాథలో పేర్కొంది. శ్రావస్తి నగరంలో 'పూర్వారామాన్ని' నిర్మించినట్లుగా, వర్షాకాలంలో భిక్కులకు వస్త్రాలు, రోగులకు ఔషధాలు, భిక్కుణీలకు స్నానపు వస్త్రాలు అందించినట్లుగా తెలుస్తుంది. 'మిగారమాత' గా ప్రసిద్ధి చెందింది.(1)

కాళియాక్షిణి

జేతవన ఆరాధంలో నివసించిన కాళియాక్షిణి గురించి ధమ్మపదంలోని 'యమక వర్గం'లోని 5వ గాథలో ప్రస్తావించబడింది. స్త్రీల మధ్య పరస్పరం ఉండే వైరం, అసూయ వంటి భావనల నుండి పరివర్తనతో జీవించిన అంశం కన్పిస్తుంది. పగను వైరాన్ని ప్రేమ క్షమాతోనే జయించాలని తెలియజేస్తుంది.(2)

"న హి వేరేన వేరానీ, సమ్మంతీధ కుదాచనం।
అవేరేన చ సమ్మంతీ, ఏస ధమ్మో సనంతనో ॥"

రాణి సామావతి :

కౌశాంబిలోని ఘోషితారామంలో రాణి సామావతి చరిత్ర బౌద్ధ సాహిత్యంలో అత్యంత స్ఫూర్తిదాయకమైనదిగా కన్పిస్తుంది. ఈమె కౌశాంబి రాజు అయిన ఉదయనకు భార్య. ఆమెకు బౌద్ధ ధర్మం పట్ల ఆసక్తి కలగడానికి ఆమె పరిచారిక ఖుజ్జుత్తర కారణం. ఖుజ్జుత్తర ప్రతిరోజూ బుద్ధుని ప్రసంగాలు విని వచ్చి, రాణికి, ఆమె అంతఃపుర స్త్రీలకు తిరిగి చెప్పేది. రాణి బుద్ధుని బోధనలను విని, తీవ్రంగా ప్రభావితమై బౌద్ధ ధర్మాన్ని స్వీకరించింది. ఆమె అంతఃపురంలోనే ఉంటూ 500 మంది చెలికత్తెలతో కలిసి ప్రతిరోజూ ధ్యానం, ధర్మశ్రవణం చేసేది. శత్రువుల పట్ల కూడా కరుణ చూపడం అనే బౌద్ధ సూత్రానికి ఆమె ఒక నిలువెత్తు సాక్ష్యంగా మారింది రాణి సామావతి. ఘోషితారామం ప్రముఖ ఆరామం, ఆధ్యాత్మిక కేంద్రం.(3)

సుమనాదేవి :

సుమనాదేవి ఎవరో కాదు, విశాఖ (మిగారమాత) చిన్న కుమార్తె. ఈమె 43వ ధమ్మపద గాథలో తల్లిదండ్రులు గానీ, బంధుమిత్రులు గానీ మనకు చేయలేని మేలును, సరిగ్గా శిక్షణ కలిగిన మనస్సు మనకు చేస్తుందని, ఒక వ్యక్తి యొక్క సన్మార్గంలో ఉన్న మనస్సు అతనికి అత్యున్నతమైన శ్రేయస్సును కలిగిస్తుంది అని తన గాథలోగా పేర్కొంది.(4)

"న తం మాతా పితా కయిరా, అఞ్ఞే వాపి చ ఞాతకా।
సమ్మాపణిహితం చిత్తం, సేయ్యసో నం తతో కరే ॥"

కుటుంబ వ్యవస్థలో పురుషుల కంటే స్త్రీలు ఉన్నతమైన ఆధ్యాత్మిక స్థితిని సాధించగలరని సుమనా దేవి నిరూపించడం ద్వారా బౌద్ధం ఆనాడే లింగ వివక్ష లేని మేధో సమానత్వాన్ని చాటిచెప్పింది. మరణశయ్యపై ఉండి కూడా అప్రమత్తతతో తండ్రిని 'ధమ్మ క్రమం'లో సంబోధించిన తీరు, సంస్కరించబడిన మనస్సు (చిత్తశుద్ధి) మరణ భయాన్ని ఎలా అధిగమిస్తుందో స్పష్టం చేస్తుంది. విద్యావంతురాలైన గృహస్థ మహిళ తన ఆధ్యాత్మిక సాధన ద్వారా కుటుంబ సభ్యులందరిపై సాత్విక ప్రభావాన్ని చూపిస్తూ, సమాజానికి ఆదర్శ ప్రాయమైన దిక్సూచిగా నిలుస్తుందని తెలుస్తుంది.

ఉత్పలవర్ణ :

బౌద్ధ సాహిత్యంలో ఉత్పలవర్ణ అత్యంత శక్తివంతురాలైన ప్రజ్ఞాశాలి అయిన భిక్కుణీగా గుర్తింపు కలిగిన స్త్రీ. ఆమె బుద్ధుని ఇద్దరు అగ్ర శిష్యురాండ్రలో ఒకరు. మరొకరు ఖేమ. ఉత్పలవర్ణ కథ ఒక విప్లవాత్మకమైన ఘట్టం. అందం, అహంకారం, అవమానం వీటన్నింటినీ అధిగమించి ఒక స్త్రీ తన మేధస్సుతో ఎలా 'అర్హత' స్థితిని పొందవచ్చో ఆమె జీవితం నిరూపిస్తుంది. సహస్ర వర్గంలోని 103వ గాథలో యుద్ధరంగంలో వేలమంది శత్రువులను జయించిన వాడికంటే, తనను తాను జయించిన వాడే నిజమైన విజేత. అతడే యుద్ధవీరులలో అగ్రగణ్యుడు అని పేర్కొంది.

"యో సహస్సం సహస్సేన, సంగ్రామే మానుసే జినే।
ఏకంచ జేయ్యమత్తానం, స వే సంగ్రామజుత్తమో ॥"(5)

ముగింపు :

జేతవనంలో విశాఖ తన మామను అత్తవారింటిని కోడలిగా కాకుండా కూతురిలా చూసుకుని మాతగా ప్రసిద్ధి

చెందడం నేటి కాలంలోనూ మెట్టినింటి వారిని బాధ్యత నిర్వర్తించే మహిళలకు నిదర్శనంగా కనిపిస్తుంది. బహు భార్యత్వం, సవతి పోరు, పిల్లల పెంపకం స్త్రీలపైనే బాధ్యత ఉండడం, వంటి జీవన విధానం క్రీస్తుపూర్వం నాటికే ఉన్నట్లు గుర్తించవచ్చు. ఆడదానికి ఆడదే శత్రువు అన్న విధంగా రాజరిక వ్యవస్థలోనూ స్త్రీలు తమ తోటివారి చావుని కోరే వరిస్థితులకు సాక్ష్యార్ధాలు రాణి సామావతులు. ఒంటరిగా ధ్యానం చేస్తున్న ఉత్పలవర్ణపై దాడి చేయడం అవమానించడం స్త్రీలపై జరిగే ఘోరాలకు నిదర్శనం.

పాదసూచీలు:

1) బుద్ధుడు శ్రావస్తిలో ఉన్నప్పుడు జేతవనంతో పాటు సమానంగా పూర్వారామంలో కూడా విడిది చేసేవారు. విశాఖ కేవలం భవనాన్ని నిర్మించి వదిలేయలేదు. ఆమె భిక్కు, భిక్కుణీ సంఘాల అవసరాలను గుర్తించి బుద్ధుని నుండి ఎనిమిది ప్రత్యేక వరాలను (అనుమతులను) పొందింది. వర్షాకాలంలో భిక్కులకు వస్త్రాలు అందించడం. కొత్తగా వచ్చే భిక్కులకు భోజనం ఏర్పాటు చేయడం. ప్రయాణం చేసే భిక్కులకు ఆహారం ఇవ్వడం. అనారోగ్యంతో ఉన్న భిక్కులకు ఔషధాలు, ఆహారం అందించడం. రోగులకు సేవ చేసే వారికి ఆహారం ఇవ్వడం. భిక్కుణీలకు స్నానపు వస్త్రాలు అందించడం. ఇది బౌద్ధ సంఘం పట్ల ఆమెకు ఉన్న పరిపాలనా దక్షతను మరియు స్త్రీల గౌరవం పట్ల ఆమెకున్న శ్రద్ధను చూపిస్తుంది. ధమ్మపదంలో విశాఖ ధమ్మపదంలోని అనేక గాథలు విశాఖ జీవితంలోని సంఘటనల ఆధారంగా పుట్టాయి. ఆమె తన అత్తమామలను అన్య మతాల నుండి బౌద్ధ మార్గంలోకి మళ్ళించింది. అందుకే ఆమెను గౌరవార్థం 'మిగారమాత' (మిగారుడికి తల్లి వంటిది) అని పిలుస్తారు. కుటుంబ వ్యవస్థలో స్త్రీ ఒక మార్పు తెచ్చే శక్తిగా ఎలా ఉండవచ్చో ఆమె జీవితం నిరూపిస్తుంది.

2) ఒక గృహస్థునికి ఇద్దరు భార్యలు ఉంటారు. పెద్ద భార్యకు సంతానం కలగకపోవడంతో, ఆమె అసూయతో చిన్న భార్య గర్భవతి అయిన ప్రతిసారీ ఏదో ఒక మందు కలిపి గర్భస్రావం అయ్యేలా చేస్తుంది. మూడవసారి చిన్న భార్య చనిపోతూ, వచ్చే జన్మలో పెద్ద భార్యను, ఆమె బిడ్డలను చంపాలని ప్రతిజ్ఞ చేస్తుంది. వీరిద్దరూ అనేక జన్మల పాటు ఒకరినొకరు చంపుకుంటూ వస్తారు ఒక జన్మలో కోడి-పిల్లిగా, మరొక జన్మలో లేడి-పులిగా, చివరకు ఒకరు యక్షిణిగా, మరొకరు శ్రావస్తిలో ఒక కులీన స్త్రీగా జన్మిస్తారు. యక్షిణి ఆ స్త్రీ బిడ్డను చంపడానికి వెంటాడుతుండగా, ఆ స్త్రీ ప్రాణభయంతో జేతవన ఆరాధానికి పరుగెత్తి, బుద్ధుని పాదాల చెంత తన బిడ్డను ఉంచుతుంది. బుద్ధుడు వారిద్దరినీ పిలిపించి, వారి పూర్వజన్మల వైరాన్ని గుర్తుచేస్తారు. బుద్ధుడు ఆ యక్షిణిని ఆ స్త్రీ ఇంటి వద్దే ఉండి, పంటలను మరియు కుటుంబాన్ని కాపాడే 'రక్షక దేవత'గా ఉండమని కోరతారు. ఇది ఒకప్పటి శత్రువులను సమాజంలో గౌరవప్రదమైన స్థానంలో ఎలా విలీనం చేయవచ్చో తెలియజేస్తుంది.

3) రాజప్రాసాదంలో ఉన్న సామావతి మరియు ఇతర స్త్రీలు బయటకు వెళ్ళే అవకాశం లేనప్పుడు, వారు తమ అంతఃపుర కిటికీల ద్వారా ఘోషితారామం వైపు చూస్తూ బుద్ధుని ధ్యానించేవారు. రాణి సామావతి తన అంతఃపురాన్నే ఒక ధ్యాన మందిరంగా మార్చుకుంది. చివరకు మాగంధియ కుట్ర పన్ని సామావతి ఉన్న అంతఃపురానికి నిప్పు పెట్టించింది. మంటలు చుట్టుముట్టినప్పుడు కూడా సామావతి భయపడకుండా, తనతో ఉన్న 500 మంది స్త్రీలను ధ్యానం చేయమని కోరింది. "శరీరాలు నశించినా, మీ మనస్సులను మైత్రితో నింపండి" అని బోధించింది. వారు ఏ విధమైన కోపం లేకుండా ఆధ్యాత్మిక ప్రశాంతతతో మరణించారు. అప్పట్లో స్త్రీలు కేవలం గృహహింసకు లేదా కుట్రలకు బాధితులుగా ఉండకుండా, ఆధ్యాత్మికంగా ఎంతటి ఉన్నత శిఖరాలను అధిరోహించారో సామావతి నిరూపించింది.

4) సుమనాదేవి ఆధ్యాత్మిక స్థితిలో ఉన్నత స్థాయికి చేరుకున్నది. అనాథపిండకుడు బుద్ధుని పరమ భక్తుడు. ఆయన ముగ్గురు కుమార్తెలు - మహా సుమన, చూళ సుమన మరియు సుమనాదేవి. వీరిలో చిన్న కుమార్తె అయిన సుమనాదేవి అత్యంత ప్రతిభావంతురాలు. బుద్ధుని బోధనలను శ్రద్ధగా విని, ఆమె చిన్న వయసులోనే 'సకదాగామి' స్థితిని పొందింది. ఇది ఆమె అక్కలు పొందిన 'సోతాపన్న' స్థితి కంటే ఉన్నతమైనది.చివరికి తీవ్ర అనారోగ్యం బారిన పడి మరణిస్తుంది.

5) ఉత్పలవర్ణ తన అందం వల్ల అనేక ఇబ్బందులు పడి, చివరకు వైరాగ్యాన్ని పొంది బుద్ధుని శరణు వేడింది. ఉత్పలవర్ణ ఒకసారి అడవిలో ఒంటరిగా ధ్యానం చేసుకుంటున్నప్పుడు, ఆమె పూర్వ ఆశ్రమపు బంధువు ఆమెపై దాడి చేసి ఆమెను అవమానించాడు. ఈ సంఘటన బౌద్ధ సంఘంలో పెద్ద సంచలనం సృష్టించింది. ఈ ఉదంతం తర్వాతే బుద్ధుడు "భిక్కుణీలు ఒంటరిగా అడవుల్లో నివసించకూడదు" అనే నిబంధనను విధించారు. దీని ఫలితంగానే శ్రావస్తి వంటి నగరాల సమీపంలో, జేతవనానికి దగ్గరగా భిక్కుణీల కోసం ప్రత్యేక ఆరామాలు నిర్మించబడ్డాయి. ఇది స్త్రీల రక్షణ కోసం బౌద్ధ సంఘం తీసుకున్న ఒక సామాజిక నిర్ణయం.

ఆధారగ్రంథాలు:

1. https://www.dcu.ie/sites/default/files/students/mindfulness_ based_ stress_ reduction_handbook.pdf
2. ధమ్మ పదము - బుద్ధ గీత: చర్ల గణపతి శాస్త్రి, 1995, డిజిటల్ లైబ్రరీ.
3. ధమ్మ పదం - రత్నాకరం బాలరాజు, 1994, డిజిటల్ లైబ్రరీ.
4. బౌద్ధ దర్శనం - కత్తి పద్మారావు, లోకాయుత ప్రచురణలు.
5. THE DHAMMAPADAN The Buddhaμs Path to Freedom,Translated from the Pli, by Acharya Buddharakkhita, Introduction by Bhikkhu Bodhi, Buddhist Publication Society, First BPS edition 1985. (5&6-29to 31)
6. ధమ్మ పదం - మోక్షానంద స్వామి (అనువాదం) 1983, డిజిటల్ లైబ్రరీ.
7. Therigatha: Poems Of The First Buddhist Women: by Vimalkirti Publication date 2015 Topics Therigatha, Theragatha, Buddhism, Tripitaka, khuddakanikaya, atthakatha, sutta pital, pali Collection folkscanomy_religion_tripitakan folkscanomy_religionn folkscanomy Language English.
8. Dhammapada Atthakatha (Book 13, Story 9):
9. Jataka Stories (Mahapaduma Jataka)
10. Dhammapada Atthakatha (Book 17, Story 1)
11. విశ్వసాహితి తెలుగు విజ్ఞాన సమితి: The Psalms of the Sisters - Mrs. Rhys Davids (C.A.F. Rhys Davids) : 1909.
12. The First Buddhist Women: Translations and Commentary on the Therigatha -- Susan Murcott:

★★★

Vol. 23 | Spl. Issue 03 | March 2026 | BHAVAVEENA | ISSN No. : 2456-4702 | RNI No. APTEL/2003/12253

RNI No. APTEL/2003/12253 | Reffered Journal & Peer Reviewed Journals | ISSN No. 2456-4702

భావవీణ

కళలు, సాహిత్య, సాంస్కృతిక భాషాధ్యయన పత్రిక

BHAVA VEENA

Journal of Arts, Literary, Culture & Language Study

చుండూరు సీత నవలలు - మహిళా చైతన్యం

- దేవర రాజు

పరిశోధక విద్యార్థి, హైదరాబాదు విశ్వవిద్యాలయం, హైదరాబాదు.

పరిచయం

"పెమినిజం అనే మాటకు తెలుగులో వ్యవహార నామం స్త్రీవాదం. స్త్రీవాదానికి 150 ఏళ్ల చరిత్ర వుంది. పారిశ్రామిక విప్లవం వల్ల పెట్టుబడిదారీ ఆర్థిక వ్యవస్థ రూపుదిద్దుకొంటూ అందుకు అనుగుణంగా ఉదార ప్రజాస్వామిక రాజకీయ భావాలు అభివృద్ధి చెందుతున్న చారిత్రక క్రమంలో అణచివేతకు గురవుతున్న వర్గంగా స్త్రీలను కూడా గుర్తించడం జరిగింది. మానవ సమాజంలో సగభాగంగా ఉన్న స్త్రీలు పురుషుల కంటే తక్కువ సాంఘిక స్థితిలో వుండటాన్ని ప్రశ్నిస్తూ వాళ్ళ అభ్యుదయాన్ని, విముక్తిని వాంఛిస్తూ వచ్చిన స్త్రీవాద భావన పందొమ్మిదవ శతాబ్ది ఉత్తరార్ధానికి ఉద్యమరూపాన్ని తీసుకొని విస్తరించింది." (స్త్రీవాద ధోరణులు : సమకాలీన సాహిత్యం. రచయిత- కాత్యాయని విద్మహే. యువ భారతి సాహితీ సాంస్కృతిక సంస్థ. పు. 75)

"అణచివేత ఉన్నచోట మర్షణ, ప్రతిఘటన ఏదో ఒకస్థాయిలో ఏదో ఒకరూపంలో తప్పక ఉంటుంది. గర్భవతి అని కూడా దాక్షణ్యం చూపకుండా అపనింద నెపంతో సీతని అడవి పాట్టేసిన రాముడితో తిరిగి జీవించలేకనే సీత లవకుశల్ని కని, పెంచి రాముడికి అప్పగించి మట్టిలో కలిసిపోయింది. కుటుంబ చాకిరీ, అణచివేత నుంచి స్వేచ్ఛను వెతుక్కునే వైయుక్తికే నిరసన పలాయన ప్రయత్నమే మీరాబాయి, సతీ సక్కుబాయి వంటివారు భక్తిని ఆశ్రయించడం. ఈ వైయక్తిక నిరసన పలాయన పరిణామాల స్థితి నుంచి అసమానతనీ, అణచివేతనీ, ఆధిపత్యాన్ని, హింసనీ సమిష్టిగా ప్రశ్నించే, ఎదిరించే సంఘటిత స్త్రీ చైతన్యం 19 వ శతాబ్ది నుంచి మాత్రమే ఆరంభమయింది." (రత్నమాల, ఎం. దాక్షిణ్య వాదం నుంచి దండకారణ్యం దాక భారత మహిళా ఉద్యమం. పు. 125, 126)

"ఒక జాతిలో స్త్రీలు ఏ మేరకు అభివృద్ధి సాధించారనే దాన్నిబట్టే నేను ఆ జాతి పురోగమనాన్ని గుర్తిస్తాను. ఒక జాతిలో స్త్రీ స్థానం, స్థితి, హోదా ఆ జాతి సాధించిన పురోభివృద్ధికి కొలమానం' అన్నారు డాక్టర్ అంబేద్కర్. 'మహిళా సంఘాలు అత్యంతావశ్యకమని నేను గట్టిగా నమ్ముతున్నాను' అని కూడా ఆయన అన్నారు. (1942 జూలై 20వ తేదిన నాగపూర్ లో జరిగిన అఖిలభారత దళిత మహిళా సదస్సులో అంబేద్కర్ ఉపన్యాసం నుంచి)" (రత్నమాల, ఎం. దాక్షిణ్యవాదం నుంచి దండకారణ్యం దాక భారత మహిళా ఉద్యమం. పు. 73)

మహిళలు పురుషులతో సమానంగా చూడబడక పోవడంతో తిరుగుబాటు మొదలైంది. ప్రశ్నించే తత్వం మహిళలలో ఏర్పడింది. తద్వారా ఎన్నో రకాల మహిళా ఉద్యమాలకు దారి తీసింది. మహిళా సంఘాల

ఏర్పాటుకు మార్గం ఏర్పడింది. మహిళా సమస్యలను లేవనెత్తి మాట్లాడగలిగే పురుషులు, స్త్రీ నాయకత్వం మహిళల్లో చైతన్యం తీసుకువచ్చే ప్రయత్నాలు మొదలు పెట్టారు. వివిధ రంగాలలో వివిధ రూపాలలో ప్రత్యక్ష్యంగా, పరోక్షంగా మహిళలు చైతన్యం అవుతూ వస్తున్నారు. అదేవిధంగా సాహిత్యం కూడా ఒక సాధనంగా పనిచేసింది. వంటింటికే పరిమితం అయ్యాలని ఇంట్లో వారినుండి అంటే పురుషుల నుండి ఆజమాయిషీ ఉండేది. కానీ నేటి కాలంలో రంగాలలో ముందంజలో ఉంటూ వస్తున్నారు. అదేవిధంగా సమాజంలోని రుగ్మత లను, మహిళల అణచివేతను మరియు ఇతర అనేక సమస్యలను, అన్ని సాహిత్య ప్రక్రియల్లో ప్రశ్నిస్తూ పురుషులతో సమానంగా సాహితీ వనంలో మహిళలు తమదైన ముద్రను వేస్తున్నారు. తెలుగు సాహిత్యంలో మహిళా చైతన్యం కోసం అనేకమంది రచయితలు తమ సృజనను వెలువరిన్తూ వచ్చారు. అందులో ఒకరు చుండూరు సీత.

చుండూరు సీత సెప్టెంబర్ 1954 లో వరంగల్ జిల్లా తాలుకా వర్ధన్నపేట ఇల్లందు గ్రామంలో జన్మించారు. వీరి తండ్రి శ్రీ అండ్లూరి అయోధ్య రామకవి. ఆమె ప్రాథమిక విద్యాభ్యాసం ఇల్లందు గ్రామం వర్ధన్నపేట తాలుకా ఉమ్మడి వరంగల్ జిల్లాలో పూర్తి చేసింది. ఉన్నత విద్యాభ్యాసం కూడా పూర్తి చేసుకుంది. ఆ కాలంలో ఉమ్మడి కుటుంబాలుగా ఉన్నందున పదవ తరగతిలోనే చుండూరు భాస్కరరావు గారితో 1977 లో వివాహం జరిగింది. ఆ రోజుల్లోనే ధనవంతుల కుటుంబంగా స్థిరపడిపోయారు. వీరికి ముగ్గురు మగపిల్లలు. అందరు ఉన్నత విద్య పారెన్ లో చదివి భారతదేశంలో స్థిరపడ్డారు.

చుండూరు సీత ఆరవ తరగతిలోనే పాటలు బాగా రాసారు, పాడారు. కథలు ఏడవ తరగతిలోనే చిన్న చిన్న నాటకాలు పడవ తరగతిలో కూడా రాసారు. పదిలో చదువు ఆగిన పద పదమున సాహితీ పిపాస నేటి వరకు సాగుతూనే ఉంది. అప్పుడప్పుడు ఎవరో ఒకరు తెలుగు సాహిత్యాన్ని సమాజంలోని కొందరికైనా మేలు జరగాలి అనే మాటలు మనిషిని కదిలించగా 15 నవలలు, 30 కి పైగా కథలు ప్రచురితమయ్యాయి. గరికపాటి వారి అవధానాలు, కావ్యపఠనం ఆసక్తి కవిత్రయం, పోతనల పద్యాలను భాగవత శ్లోకాలను పిల్లలకు నేర్పించిన ఇష్టమైన పనిగా పెట్టుకున్నారు. ఉత్పలమాల పద్యాలు రాయడం సరదా. కథ అంటే కేవలం కల్పనాన్ని కాదని, అంతర్లీనంగా స్పందన కలిగిస్తుందని నమ్ముతారు. చదివింది పదో తరగతి వరకు అయినా, సాహిత్యాన్ని అవపోనన చేసారు. 1981 మే నుండి రచనలు ప్రచురించబడటం మొదలైంది. ఆమె రాసిన నవలలోని స్త్రీ చైతన్యాన్ని విశ్లేషించడమే ఈ పరిశోధన పత్ర ఉద్దేశ్యం.

పాలనాపరమైన విషయాలలో రాణి-మహిళా చైతన్యం

మానవ సమాజంలో పురుష రాజుల వలే పాలించిన పాలకులుగా స్త్రీలు కూడా మనకు తక్కువే కనిపించిన సమాజంపై ప్రభావం వేసిన రాణులు కూడా ఉన్నారు. అదేవిధంగా చుండూరు సీత రాసిన 'సారంగి' నవలలో పాలించకపోయినా పరిచారికల రూపంలో అంతరంగికలు రాణి దగ్గర ఉంటారు. రాణి ఏం కావాలో చూస్తూ, రాజ్యంలో రాజుకు, రాజ్యానికి ఏమైనా ఆపద విషయా లను తమ ప్రత్యేక గుడాచారుల దగ్గర నుండి తెలుసు కొని, శత్రువులను అక్కడికక్కడే సంహరిస్తారు. "రాజుగారు విచ్చేసినప్పుడు రాణిగారి అంతఃపుర ప్రత్యేక పరిచారికలు చేసే హడావిడి అంతా ఇంతా కాదు. చతురిక, చాతుర్య వీళ్ల పేర్లు. వీళ్ళని పరిచారికలు అనేకంటే రాణిగారి ఆంత రంగికులు అనవచ్చు. రాజుగారికి ప్రత్యేక సలహాదారులు, ఆంతరంగికులు ఉన్నట్టే రాణిగారికి కూడా ఉంటారు. ఈ విద్యుల్లతాదేవికి ఓ రహస్య పరివారమే ఉంది. అందరూ స్త్రీలే. అన్ని విద్యలూ నేర్చినవారు. గూఢా చారులు. లేఖకులు, వార్తా వాహకులు. చతురత కలిగిన వారు. చదరంగం ఆడేవారూ. ఎత్తుకు పై ఎత్తు వేసే రాజజీయ కోవిదులు, వేదాలు చదివిన వారూ, వాక్పటిమ కలిగిన వారూ, చివరకు రాజుగారి మెప్పుపొంది సైన్యంలో చేరినవారు కూడా ఉన్నారు. ఐతే వారి రాణిగారి సైన్యం అని ఆయన ఎరుగడు. కేవలం స్త్రీ సైనికులని మాత్రమే తెలుసంతే." (సీత, చుండూరు. సారంగి. 20). ఈ

వ్యవస్థను అంతా పైన చెప్పిన చతురిక, చాతుర్యలు నడుపుతుంటారు. వీరిని రాణిగారి తండ్రి కూతురికి అరణంగా ఇస్తాడు. చాలా తెలివితేటలు కలిగిన ఈ ఇద్దరు ఆడపిల్లల్ని చిన్నతనంలోనే కోటకి తెప్పించి ఎంతో శిక్షణ ఇప్పిస్తాడు రాణిగారి తండ్రి. వాళ్లకు రాణి విద్య ఉండదు. నేర్చుకోని కళ లేదు. సమస్య రాణిగారిని చేరేలోపే పరిష్కారం జరిగిపోతుంటుంది. అంటే ఎంత రహస్యంగా ఉంటారో దీన్ని బట్టి అర్థం చేసుకోవచ్చు.

దాంతో రాణి ఆశ్చర్యపడి ఆ విషయం నాకు చెప్పలేదేం అని రాణి అంటుంది. దానికి సమాధానంగా వారు ప్రతి చిన్న విషయం మీతో చెప్పడం మా పని కాదు. మీకు ఆపద వచ్చినప్పుడు, వస్తున్నప్పుడు మిమ్మల్ని దాని నుండి రక్షించడమే మా పని అని చెప్తారు. రాణి మరేమీ మాట్లాడకుండా రెండు చేతులతో ఇద్దరినీ ఒకేసారి దగ్గరకు లాక్కొని కౌగిలించుకుంటుంది. కన్నీళ్ళు కారుస్తుంది. రాణి, పరిచారికలను చాలా చైతన్య వంతమైన పాత్రలుగా రచయిత్రి చిత్రించి స్త్రీలను ఆలోచింపజేశారు.

నాయకత్వం, విద్యలు, కళలు - మహిళా చైతన్యం

రాచరికంలో రాజు భార్యలు, కూతురులైన స్త్రీలు చాలావరకు రాజమందిరాల్లోనే ఉండేవారు. అయినా శత్రు రాజులతో పోరాడుతూ తమ పోరాట పటిమను కనబరిచిన రాణులు లేకపోలేదు. కాని రాజులతో సంబంధం లేకుండా గిరిజనుల వలే అడవుల్లో ఉండే స్త్రీలు కూడా వీరత్వం చూపి శత్రువులపై చాకచక్యంగా పోరాటం చేసే స్త్రీలు కూడా కనిపిస్తారు. కాని వెలుగులోకి రారు. అటువంటి స్త్రీ వీరనారి అయిన 'సారంగి' పాత్ర చుండూరు సీత రాసిన 'సారంగి నవలలో మనకు కనిపిస్తుంది. ఆమె తెగువ ధైర్యం రాజు గారి దగ్గరకు వెళ్ళినప్పుడు రాణి మనసులో అనుకునే సందర్భం చూడవచ్చు.

సారంగి రుద్ర అనే రాజు రాజ్యంలోని ఒక గూడెపు మనిషి. కాని ఆమె సాధారణ మనిషి కాదు. అనేక విద్యలు నేర్చుకుంటుంది. "రాణి ఆలోచనలు మరోలా ఉన్నాయి. సారంగి ఎంత అందంగా ఉంది. ఆమెను గురించి జనం కథలు, కథలుగా చెప్పుకుంటూ ఉంటే ఏమిటో ఈ జనం అనుకుంది. కాని ఆ మాట, వాక్పటిమ, ధైర్యం, చొరవ, దేశభక్తి, ఓక స్త్రీలో అవన్నీ ఎలా సాధ్యం? ఆమె సభకు వచ్చినప్పుడు సభలోని వారంతా ఆమెను దేవతను చూసినట్టు చూసారు. ఆబగా, ఆశగా, ఆకాంక్షతో చూడటం గమనించింది తను. ఇవన్నీ ఆమెకు తెలుస్తూనే ఉంది. ఎ స్త్రీకైనా ఓ పురుషుడు తనని గుచ్చి గుచ్చి చూస్తూ ఉంటే ఆ విషయం ఆమెకు వెంటనే తెలిసిపోతుంది. అలాంటిది ఆమెను ఎన్నో జతల కళ్ళు చూస్తున్నాయని, ఆమెకు తెలుసు. చూడబోతాయని తెలిసినా ఆమె వచ్చేసింది. ఎంతటి దేశభక్తి. ఈ స్థాయిలో ఓ స్త్రీకి రాజభక్తి, ఆరాధాన ఉండటం అబ్బురమే కదా? తనెందుకు అలా లేదు? రాచ పుట్టుక పుట్టి పిరికిదనం అలవరుచుకున్నది. ఎందుకంటే భవిష్యత్తుకు సంబంధించిన ఎన్నో భయాలు తనని కట్టేశాయి. ఇలా చేస్తే ఏమౌపుతుందోననే శంకలు తనకి చాలా కలుగుతాయి." (సీత, చుండూరు. సారంగి. 82, 83)

రాణి భర్త రాజు స్త్రీలోలుడు రాయబారానికి వచ్చిన సారంగి అందంగా ఉండేసరికి తన భర్తను ఆమె కూడా మోహిస్తుందేమోనని అనుకున్న రాణి భయం తీరింది. ఒక స్త్రీ గురించి మరో స్త్రీ అనుకున్న విధంగా కాకుండా భిన్నంగా ఉండటమే గాక అనేక విద్యలు వచ్చిన వీరనారిగా కన్పించడం విశేషం.

సారంగి రుద్రతో పాటు మహారాజు, సైన్యం రవి కాంతుడి దగ్గరకు వెళ్తారు. ఎప్పుడంటే రుద్రకు, రవి కాంతుడు శత్రుత్వం వీడి ఒకటవుతారు. ఆ సమయంలో రుద్ర సైన్యంతో సహా రవికాంతుడి పాప పుట్టినరోజు సందర్భంగా అక్కడకు వెళ్తారు. అక్కడ శత్రువులు నడిరాత్రివేళ దాడులకు పూనుకొని వస్తారు. ఆ విషయాన్ని పసిగట్టిన సారంగి వారిని ఎలా ఎదుర్కొని తిప్పికొట్టిందో చూడవచ్చు.

"చక చక ఆ వస్తువులను అటు ఇటు సవరించి, తిప్పి చిన్న విల్లులా చేసింది. రాతి దిబ్బమీద పడుకుని కిందకు చూస్తోంది. మనిషి అలికిడి కాగానే క్రిందకు వంగి చిరుకాంతితో చూసి ఆ అలికిడికి తనున్న చోటుకి రాగానే

'కీ' మని ఓ రాత్రి పక్షిలా కూసింది. అక్కడ నడుస్తున్న శబ్దమేగాని అనుకూల శబ్దాలు లేవు. అంతే తన చిన్న విల్లు నుండి బాణం సందించి విడిచింది. ఆ రాళ్ళ దిబ్బ దాటి యాభై అడుగుల దూరంలో మొదటి వాడిని, నలభై ముప్పై ఇరవై పది అడుగుల దూరంలో ఐదుగురిని పడగొట్టింది." (సీత, చుండూరు. సారంగి. 119)

రాజ మందిరానికి దూరంగా అడవిలో నివాసం ఉండే గిరిజన స్త్రీ తన విలు విద్యలను శత్రులపై ప్రదర్శించిందంటే ఆమె గొప్ప పోరాట యోధురాలని చెప్పవచ్చు. ఆమె తన నాట్యం ద్వారా కూడా ప్రదర్శన ఇచ్చి ప్రేక్షకులను ముగ్ధులను చేస్తుంది.

సమయస్ఫూర్తి- స్త్రీ చైతన్యం

స్త్రీ అంటే కేవలం వంటింటికే పరిమితం కాకుండా అవకాశం, పరిస్థితులు అనుకూలిస్తే ఏదైనా సాధించగలరు. సామాజికంగా ఎంత అనగదొక్కబడిన క్రమక్రమంగా పైకి దూసుకు వస్తున్నారు స్త్రీలు. ఇటు కుటుంబాన్ని చక్కబెడుతూనే అటు సమాజంలో తనవంతు పాత్ర మాత్రమే కాకుండా కొన్ని సందర్భాలలో అన్నీ తానై నడిపిస్తున్న సందర్భాలు మనం అనేకం చూస్తున్నాం. అలాంటి స్త్రీ 'సారంగి' నవలలో సారంగి పాత్ర కనిపిస్తుంది.

"తను తెచ్చిన నగలు, చీరలు, చీనాంబరాలు ఎంత బాగున్నాయి? అసలు అవన్నీ ఎందుకు తెచ్చింది? తల్లి, తండ్రి, గురువు, పెద్దలు, దేవుడు, రాజు వీళ్ళంతా ఆమె దృష్టిలో సమానాలా? అంటే తన భర్త కూడా ఆమె తల్లిదండ్రులతో సమానం. ఔనా? భావన ఎంత బాగుంది? ఇది నన్ను నేను సముదాయించుకోవడానికి ఆమెకి లేని భావనని నేను కల్పించుకుంటున్నానా? లేదంటే ఆమె ఆలోచన అదే అని నాతో నిజంగానే చెప్పిందా? ఎటూ తేల్చుకోలేక నందిగ్ధావస్థలో ఉండిపోయింది." (సీత, చుండూరు. సారంగి. 60)

రుద్రరాజు అడవికి వేటకు వెళ్ళినప్పుడు సారంగి అందం, ప్రతిభను, తెలివి తేటలను చూసి ప్రేమిస్తాడు. అలా రాజు తనను ప్రేమించడం ఇష్టం లేని సారంగి తనదండ్రులకు చెప్పి వాపోతుంది. రాజు తనను ప్రేమించడమేమిటి? తాను గౌవంగా, హుందాగా ఉండాలి కదా అని అనుకుంటుంది. చివరకు రాజు నుండి పిలుపు వస్తుంది. ఆమె అక్కడకు పైన తనలో తాను రాణి మనసులో అనుకున్న సంభాషణను బట్టి చూస్తే అర్థం అవుతుంది. రాణి సారంగిపై మనసుపడి ఉంటాడని గత కారణాల వల్ల అర్థం చేసుకుంటుంది. అందుకోసమే ఇంత అందమైన అమ్మాయిపై మనసు పడకుండా ఉంటాడా? అనే సందేహంతో రాణి ఉంటుంది. సారంగి తెచ్చిన ఇలాంటి బహుమతులను గౌరవంగా భావించే పెద్దల వద్దకే తీసుకువస్తారు. సారంగి ఒకవేళ రాజు మనసు పడినా సారంగి పడలేదేమో, రాజును తండ్రి లాగా భావించిందేమో అనే సందేహం రాణికి వచ్చేలాగా సమయస్ఫూర్తితో వ్యవహరించి తన వ్యక్తిత్వాన్ని కాపాడుకుందని చెప్పవచ్చు.

'నువ్వు కోరగానే నీ పాదాల చెంత వలలేదామే. ఒక సామాన్య అడవి జాతి స్త్రీలో ఇంతటి పట్టుదల, పౌరుషం నీకు మింగుడు పడకుండా ఉంది. ఒకసారి ఆమెను తినేసేట్టు చూస్తేనే ఇంత చేసింది. నువ్వు మరికొంచెం ముందుకు వెళితే ఏం చేస్తుందోననే అనుమానం నీలో కలిగిందని' తనకు తానూ అనుకుంటాడు. గెలుపు ఎవరిదో, ఓటమి ఎవరిదో కాలమే తేలుస్తుంది. అంత వరకు తన తన చేసుకోవాలని, అంతవరకు స్థిత ప్రజ్ఞత కలిగి ఉండాలని, మానసిక సమతుల్యత చేసుకోవడం తన పని అని అనుకుంటాడు. అంటే ఎవరి దగ్గర ఎలా వ్యవహరించాలో, విజ్ఞత కలిగి ఉండాలో, గౌరవం కలిగి ఉండాలో ఒక అడవిబిడ్డ చూపించిన సమయస్ఫూర్తి దీనిని బట్టి మనకు అర్థం అవుతుంది.

మరో సందర్భంలో కూడా చాలా చాకచక్యంగా వ్యవహరించింది. రుద్ర రాజు తరపున రవికాంతుడి రాజు దగ్గరకి రాయభారంగా వెళ్ళినప్పుడు ఆ రాజ్యంలో సమయస్ఫూర్తితో రాయభారం నడుపుతుంది.

సారంగి తన రాజు గురించిన చెడు అభిప్రాయాలను గురించి మా రాజు గురించి మీ రాజ్యంలో కూడా అలా వదంతులు పుట్టి ఉండవచ్చు. కనుక ఏది నిజం, ఏది అబద్దం అనే వాటిని సరిచూసుకోవాల్సి ఉంటుంది. దీనికి

మా రాజు కూడా మినహాయింపు కాదు. ఈ వార్తలను నమ్మారు. ఇవన్నింటిని ప్రచారం చేసి, లాభపడుతున్నది ఎవరు? అని ఆ రవికాంతుడి దగ్గర సమయస్ఫూర్తితో వ్యవహరిస్తుంది.

చదువు, సంస్కారం, సమాజసేవ-మహిళా చైతన్యం

చుండూరు సీత రాసిన 'నక్షత్ర వర్షం' నవలలో ధూర్జటి ఉన్నత భావాలు గల సంస్కర్త. అతను భర్త లేని స్త్రీ(పార్వతి)ని వివాహమాడి, అతడి కుమారుడిని దత్తత తీసుకొని ఆమెను చైతన్యవంతంగా తీర్చిదిద్దుతాడు. పార్వతి ధూర్జటి సహవాసంతో సమాజాన్ని అర్థం చేసుకొని ప్రజలకు సహాయసహకారాలు అందిస్తూ ఉంటుంది. ఆ క్రమంలో ఊరికి ప్రెసిడెంట్‌గా మహిళలకు రిజర్వ్ కావడంతో పార్వతిని గమనించిన యంత్రాంగం ఆమెను ప్రెసిడెంట్ అభ్యర్థిగా ప్రకటిస్తుంది. గ్రామ ప్రజలు కూడా ఏకగ్రీవంగా ఆమోదిస్తారు. గొడవలు జరిగినప్పుడు చాకచక్యంగా వ్యవహరించి ముందుకు నడుస్తుంది. అప్పటివరకు చదువులేని ఆమె భర్త సహకారంతో కొంత నేర్చుకొని, స్వయంకృషితో, పట్టుదలతో నేర్చుకొని పద్యాలు పాడటం, తర్వాత ఇతర స్త్రీలకు సైతం నేర్పించడం వంటివి చేస్తుంది.

బానిసత్వం-మహిళా చైతన్యం

చుండూరు సీత రాసిన 'వేలానికో వెఱ్ఱివాడు' నవలలో స్త్రీ చైతన్యాన్ని చూడవచ్చు. తన మేనబావను వేలం నుండి కాపాడి తన తెలివిని ప్రదర్శించి, అతడు బావ అని తెలియకుండానే అతని మేధో శక్తిని గమనించి ప్రేమలో పడవేసిన పాత్ర శోభ. తన తండ్రి రాజారావ్. రాజారావ్ చెల్లెలు సుగుణ కుమారుడైన మూర్తిని వేలం వేస్తారు. ఆ వేలం వేసిన వారు అతని బాబాయి పట్టాభిరామయ్య. ఎందుకంటే అతని దగ్గర వీళ్ళు అప్పు తీసుకున్నారు. కనుక వాటిని తీర్చడానికి ఇతన్ని వేలం వేయాల్సి వస్తుంది. వేలం కోసం పేపరు ప్రకటన కూడా ఇచ్చారు. అదీ మూర్తి అంగీకారంతోనే. ఆ సమయంలో శోభ అక్కడికి చేరుకుంటుంది. అప్పుడే వేలం ప్రారంభంవుతుంది. ఆ వేలంలో శోభ పాల్గొని నలభై వేలకు దక్కించుకుంటుంది. తన దగ్గర ఉన్న రాళ్ళ నక్లెస్ ఇచ్చి అతన్ని తీసుకెళ్తుంది. ఆమె ప్రధాన ఉద్దేశం ఏమిటంటే ఒక వ్యక్తిని వేలం వేయటం ఏమిటి? ఒకవేళ వేస్తే నేనే కొని అతన్ని కాపాడతానని అంటుంది. అదేవిధంగా తన తండ్రి రాజారావ్ కు ఉన్న కంపెనీలో డిగ్రీ చేసిన తెలివైన వాడు కావాలని తండ్రి చెప్పడంతో గుర్తు వచ్చి ఉపయోగ పడతాడు అని అనుకుంటుంది. పట్టాభిరామయ్య షరతులతో కూడిన బాండ్ పేపర్లు రాపిచ్చుకుంటాడు. ఇతను తెలివైన వాడు అని శోభకు తెలుసు. వీరిద్దరూ ఒకే కళాశాలలో చదువుకునేవారు. మూర్తి శోభను ఆటపట్టిస్తుండేవాడు. ధనవంతులు అంటే అతనికి ఎక్కువగా ఇష్టం ఉండేది కాదు. కానీ ఇతను మేనత్త కొడుకు అని అస్సలే తెలియదు శోభకు.

మూర్తిని వేలం పాటలో కొని ఇంటికి తీసుకువస్తుంది. రాజారావ్ సంతోషిస్తాడు. మంచివాడినే తీసుకువచ్చింది అని కూతురు మీద నమ్మకం ఎక్కువ. అతడిని కంపెనీ బాధ్యతలలో భాగం చేస్తాడు. ఆ కంపెని విమాన విడిభాగాలను తయారుచేసేది. అతనికి అనేక పరీక్షలు పెడతాడు రాజారావ్. అతడు అన్నింటిని తట్టుకొని నిలబడతాడు. చివరకు మేనేజర్ వరకు ఎదుగుతాడు మూర్తి. చివరకు అతడిని ప్రేమించి పెళ్లి చేసుకుంటుంది. స్త్రీ చైతన్యవంతంగా ఆలోచించి ఒక మంచి మనిషిని బానిసగా మారకుండా వేలంలో కొని మరి తెచ్చుకుని ప్రేమించిన స్త్రీ పాత్రను చుండూరు సీత చిత్రించారు.

డాక్టర్, ధైర్యవంతురాలు - స్త్రీ చైతన్యం

చుండూరు సీత రాసిన అక్షరాలు అరువీయండి మొదటి, రెండవ భాగాలలో మహిళల చైత్తన్యాన్ని చూడవచ్చు. ఈ నవలలో ఊహా, స్వాహాలు అక్కా చెల్లెళ్ళు. కష్టపడి చదువుకుంటారు. అక్క ఊహ డాక్టర్ వృత్తి చేపడుతుంది. చెల్లెలు స్వాహాకు గుర్రపు స్వారీ అంటే చాలా ఇష్టం. వీరిరువురు అనామకుడిగా ఉంటూ ఎన్నారు గ్రామ ప్రజలకు ఇళ్ళు కట్టిస్తూ ఉంటాడు. అక్కడ వందల ఇళ్ళు కట్టబడుతూ ఉంటాయి. అక్కడ వీరు తమ తమ పాత్రలను పోషిస్తూ ఆ ప్రాంత అభివృద్ధికి దోహదపడతారు. తన వృత్తిని ఊహ చేస్తూ అక్కడి వారికి ఉత్తమమైన వైద్యాన్ని అందిస్తూ ఉంటుంది. స్వాహా

అక్కడ పనిచేసే వారికి అన్నం వండిపెట్టడం, మంచి చెడ్డలు చూస్తూ సేవ చేయడం చేస్తూ ఉంటుంది. చివరకు సందర్భం వచ్చినప్పుడు ఆ ఇళ్ళ పత్రాలు కాపాడటంలో వారికి తన గుర్రపు స్వారీ ద్వారా ఆదుకుంటుంది. కొండల్లో దాచిన ఆ పత్రాలను సాహసోపేతంగా తెచ్చి ఇచ్చి ప్రాణాలను విడుస్తుంది. అంటే ఈ రెండు పాత్రల ద్వారా మహిళా చైతన్యాన్ని అద్భుతంగ చిత్రించారు రచయిత్రి.

ముగింపు

మహిళ నేటి సమాజంలో నిలదొక్కుకునే ప్రయత్నం చేస్తూనే ఉంది. గతంతో పోలిస్తే చాలా రెట్లు ఉత్తమంగా, గౌరవంగా బతకగలుగుతుంది. అటువంటి అవకాశాలను రాజ్యాంగం, ప్రభుత్వాలు కనిపిస్తున్నాయి. అయినప్పటికీ స్త్రీలపై అనేక దారుణాలను మనం గమనిస్తున్నాం. ఎన్నో సవాళ్ళను సైతం ఎదుర్కొంటూ పురుష ఆధిపత్య సమాజంలో మనగలుగుతుంది. తనకు తాను చైతన్య మవుతూ ముందుకు సాగుతుంది. అటువంటి అంశాలను తన నవలా సాహిత్యంలో చుండూరు సీత పాలనా పరమైన, చక్కని సమయస్ఫూర్తి, నాయకత్వ లక్షణాలు, సమాజసేవ మొదలైన చైతన్యవంతమైన లక్షణాలు కలిగిన పాత్రలను చిత్రించి మహిళా లోకాన్ని మేల్కొలిపే ప్రయత్నం చేస్తూ ఉంది.

ఆధార గ్రంథాలు:

1. రత్నమాల, ఎం. దాక్షిణ్యవాదం నుంచి దండకారణ్యం దాక భారత మహిళా ఉద్యమం. 2014. హైదరాబాద్: నూతన ప్రచురణలు.
2. సీత, చుండూరు. 2020. నక్షత్ర వర్షం. హైదరాబాదు: చతుర.
3. సీత, చుండూరు. 2022. సారంగి. స్వీయ ప్రచురణ.
4. సీత, చుండూరు. అక్షరాలూ అరువీయండి-1. 1986. మద్రాసు: విజయ గ్రాపిక్స్.
5. సీత, చుండూరు. అక్షరాలూ అరువీయండి-2. 1987. మద్రాసు: విజయ గ్రాపిక్స్.
6. స్త్రీవాద ధోరణులు : సమకాలీన సాహిత్యం. యువ భారతి సాహితీ సాంస్కృతిక సంస్థ. 1994, హైదరాబాద్: యువభారతి.

★★★

Vol. 23 | Spl. Issue 03 | March 2026 | BHAVAVEENA | ISSN No. : 2456-4702 | RNI No. APTEL/2003/12253

RNI No. APTEL/2003/12253 | Reffered Journal & Peer Reviewed Journals | ISSN No. 2456-4702

భావవీణ

కళలు, సాహిత్య, సాంస్కృతిక భాషాధ్యయన పత్రిక

BHAVA VEENA

Journal of Arts, Literary, Culture & Language Study

శివారెడ్డి కవిత్వంలో స్త్రీ

- డా॥. సుంకర గోపాలయ్య

తెలుగు శాఖాధ్యక్షులు, డి.ఆర్.జి. ప్రభుత్వ డిగ్రీ కళాశాల, తాడేపల్లిగూడెం.

ప్రవేశిక:

మానవ నాగరికత పరిణామ క్రమంలో సమాజంలో స్త్రీల స్థితిగతులు అనేక మలుపులు తిరిగాయి. అనాదిగా స్త్రీ శక్తికి, సహనానికి నిలువుటద్దంగా నిలుస్తూ వస్తోంది. ప్రాచీన కాలంలో, ముఖ్యంగా వేద కాలంలో స్త్రీలకు అత్యున్నత గౌరవం, స్వేచ్ఛ ఉండేవి. విద్యార్జనలోనూ, సామాజిక నిర్ణయాల్లోనూ వారు చురుకైన పాత్ర పోషించే వారు. అయితే, మధ్యయుగ కాలానికి వచ్చేసరికి సామాజిక కట్టుబాట్లు, పరదా పద్ధతి, సతీసహగమనం వంటి దురాచారాల వల్ల స్త్రీల స్వేచ్ఛ హరించుకుపోయింది. వారు కేవలం ఇంటి నాలుగు గోడలకే పరిమితమై, పురుషాధిక్యత నీడలో బతకాల్సిన పరిస్థితి ఏర్పడింది.నేటి ఆధునిక కాలంలో దృశ్యం మారుతోంది. విద్య, సాంకేతిక అందించిన చైతన్యంతో మహిళలు తమ సంకెళ్లను తెంచుకుంటున్నారు. వంటింటి కుందేలు స్థాయి నుండి అంతరిక్ష పరిశోధనల వరకు, రాజకీయాల నుండి వ్యాపార సామ్రాజ్యాల వరకు నేడు స్త్రీలు అడుగుపెట్టని రంగం లేదు. ఒకప్పుడు అబలగా ముద్రపడిన మహిళ, నేడు ఆత్మవిశ్వాసంతో లిలి'సబల'లిలిగా మారి పురుషులతో సమానంగా సామాజిక అభివృద్ధిలో భాగస్వామి అవుతోంది. అయినప్పటికీ, భద్రత మరియు సమాన అవకాశాల విషయంలో నేటికీ కొన్ని సవాళ్లు ఎదురవుతూనే ఉన్నాయి, వాటిని అధిగమించినప్పుడే సంపూర్ణ మహిళా సాధికారత సాధ్యమవుతుంది. మహిళల చైతన్యం, వారి ఆలోచనల్లో రావలసిన మార్పుల గురించి, స్త్రీల పట్ల సమాజంలో రావాల్సిన ఆలోచనల గురించి ఎంతోమంది సాహితీవేత్తలు తమ రచనల్లో ప్రతిఫలింప చేశారు.

పరిశోధన పత్ర నేపథ్యం:

కవుల రచనల్లో ఒక దృక్పథం ఉంటుంది. అనేకమంది స్త్రీలు పురుషాధిక్యతను ప్రశ్నించారు. స్త్రీవాద కవిత్వంగా 1980 నుంచి సాహిత్యంలో కవిత్వం ,రచనలు వెలువడ్డాయి. కానీ రచనలు చేసిన పురుషులు కూడా కొంతమంది స్త్రీవాదాన్ని బలపరుస్తూ కవిత్వం రాశారు. పురుషుల దృష్టి కోణంలో రావాల్సిన మార్పుల గురించి సాహిత్యంలో చూపారు. ఈ వ్యాసంలో సరస్వతీ సమ్మాన్ను అవార్డు గ్రహీత కె. శివారెడ్డి గారి కవిత్వంలో మహిళ చైతన్యాన్ని గురించి చర్చిస్తాను. తెలుగు కవిత్వంలో ఆయన రాసినంత విస్తృతంగా స్త్రీ కేంద్రకంగా కవితలు మరెవరు రాయలేదని చెప్పవచ్చు. శిశువుగా ,బాలికగా, యువతిగా, ఒక ధరగా మాతృమూర్తిగా, సమాజంలోంచి ఎదురయ్యే అవమానాలను అనుమానాలను, తన మీద జరిగే మానసిక, భౌతిక దాడులను అలాగే స్త్రీ జీవితంలోని అనేక దశలను, స్త్రీలు ఎదుర్కొనే పక్షపాతాలను స్త్రీ పురుష సంబంధాల్లోని సమస్యలను, సంఘర్షణను శివారెడ్డి

ఆవిష్కరించారు. వాస్తవాలు మాట్లాడారు. పురుషాధిక్యతను నిరసించారు. స్త్రీల గొప్పతనాన్ని సమాజం చూడాల్సిన చూపును ఇచ్చారు. ఆయన రచించిన అట్లాంటి కవితలన్నీ కలిపి ఆమె ఎవరైతే మాత్రం అనే సంకలనాన్ని గుడిపాటి వెన్నా శివరామకృష్ణ గారు సంపాదకులుగా ప్రచురించారు. ఆందోళన మహిళా చైతన్యాన్ని గురించి వివరించడమే ఈ వ్యాసం ఉద్దేశం.

సాంకేతిక పదాలు:

స్త్రీవాదం- కె .శివారెడ్డి- పురుషాధిక్యత- ఆమె ఎవరైతే మాత్రం. -మహిళా చైతన్యం-జెండర్-లింగ వివక్షత

కె. శివారెడ్డి గారి పరిచయం:

ఆధునిక తెలుగు కవిత్వంలో విలక్షణమైన ముద్ర వేసిన మహాకవి కె. శివారెడ్డి. 1943లో గుంటూరు జిల్లాలో జన్మించిన ఆయన, తన కవిత్వంతో సామాజిక చైతన్యాన్ని రగిలించిన ప్రజా కవి. వృత్తిరీత్యా ఆంగ్ల అధ్యాపకుడై నప్పటికీ, ప్రవృత్తిరీత్యా సమాజంలోని అణచివేతను, అన్యాయాన్ని ఎదిరించే కలం పట్టిన విప్లవవాది. ఆయన రాసిన 'మోహనా! ఓ మోహనా!' అనే కవితా సంపుటికి గానూ 1990లో ప్రతిష్ఠాత్మకమైన కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు లభించింది. శివారెడ్డి గారి కవిత్వం కేవలం భావోద్వేగాల సమాహారం మాత్రమే కాదు, అది సామాజిక వాస్తవికతకు అద్దం పడుతూ, సామాన్యుడి గొంతుకగా వినిపిస్తుంది. 'రక్తం సూర్యుడు', 'అజేయం, కొంచం స్వేచ్ఛకావాలి, వృత్తలేఖిని, పక్కకి ఒత్తిగిల్లితే వంటి అనేక రచనల ద్వారా ఆయన తెలుగు సాహిత్య రంగాన్ని సుసంపన్నం చేశారు. అక్షరాన్ని ఆయుధంగా మార్చి, మానవతావాదాన్ని చాటిచెప్పిన ఆయన నేటి తరం కవులకు ఒక గొప్ప మార్గదర్శి.

శివారెడ్డి కవిత్వంలో స్త్రీ చిత్రణ: ఒక సమగ్ర విశ్లేషణ

ఆధునిక తెలుగు సాహిత్య రంగంలో కె. శివారెడ్డి ఒక ధ్రువతార. ఆయన కవిత్వం సమాజంలోని అణచివేతకు వ్యతిరేకంగా వినిపించే గొంతుక. ముఖ్యంగా స్త్రీల పట్ల సమాజం ప్రదర్శించే వివక్షను, వారి అంతరంగ మథనాన్ని, వారు ఎదుర్కొంటున్న సవాళ్లను శివారెడ్డి గారు అత్యంత శక్తివంతంగా తన కవిత్వంలో చిత్రించారు. ఆయన కవిత్వంలో స్త్రీ కేవలం ఒక పాత్ర కాదు, ఒక చైతన్య స్రవంతి.

స్త్రీ అస్తిత్వం, స్వేచ్ఛా కాంక్ష

శివారెడ్డి గారి కవిత్వంలో స్త్రీ తన ఉనికిని తాను చాటుకోవాలని తపిస్తుంది. సమాజం గీసిన గిరి దాట కూడదనే ఆంక్షలను ఆమె ధిక్కరిస్తుంది. స్త్రీని కేవలం గృహకృత్యాలకు, పురుషుడి అదుపాజ్ఞలకు పరిమితం చేసే వ్యవస్థను ఆయన నిలదీశారు.

"గోడల్ని బద్దలు కొట్టి నీతిగా కనబడే దుర్నీతి విరగ్గొట్టి
తన ఉనికిని తనే సాధించుకుని
తన స్వేచ్ఛని తనే నిర్ణయించుకుని...
ముఖమ్మీద గుద్దినట్టు తననుకున్నట్టు తను బతకటానికి బయల్దేరితేనే నేరం"

ఈ వాక్యాలు స్త్రీ తన సొంత నిర్ణయాలు తీసుకోవడాన్ని సమాజం ఎలా తప్పుబడుతుందో స్పష్టం చేస్తాయి. ఆమెను "ముగ్గుల వలయాలు", "మసిగుడ్డ జీవితాలు" వంటి సంకెళ్లలో బంధించాలనే పితృస్వామ్య ధోరణిని కవి తీవ్రంగా నిరసించారు.

సామాజిక బహిష్కరణ - వ్యవస్థాగత వైఫల్యం

స్త్రీ పట్ల సమాజం ఎంత క్రూరంగా ప్రవర్తిస్తుందో శివారెడ్డి గారు తన కవిత్వంలో హృదయవిదారకంగా చిత్రించారు. కుటుంబ వ్యవస్థలో ఆమెకు రక్షణ లేక పోవడాన్ని, ముఖ్యంగా ఇద్దరు బిడ్డల తల్లిని కూడా కనికరం లేకుండా ఇంటి నుండి వెలివేయడాన్ని ఆయన ప్రశ్నించారు.

"బయటికి తోసేశారు
ఇద్దరు పిల్లల తల్లిని,
ఏడుస్తున్న చిన్నపిల్లణ్ణి బలవంతాన లాగేసి,
మొగుడూ, అత్తా, మామా ఆమెను బయటికి తోసేశారు"

ఈ చిత్రణ చదువుతుంటే సమాజంలోని అమాన వీయత మన కళ్లకు కట్టినట్లు కనిపిస్తుంది. వేల ఏళ్లు గడిచినా, "శ్రీరాముడి కాలం నుంచి ఇప్పటిదాకా ఆమె అలానే" ఉండిపోవడం అనేది మన సామాజిక ప్రగతిలోని వెలితిని ఎత్తిచూపుతుంది.

మాతృత్వం: ఒక నూతన స్వప్నం

శివారెడ్డి కవిత్వంలో స్త్రీ కేవలం బాధితురాలు మాత్రమే కాదు, ఆమె ఒక సృష్టికర్త కూడా. మాతృత్వం లోని కష్టాన్ని వర్ణిస్తూనే, ఆమె కడుపులో పెరుగుతున్న జీవం ఒక కొత్త ప్రపంచానికి పునాది అని ఆయన విశ్వ సించారు.

"ఆమె దేహం చుట్టూ రకరకాల రంగురంగుల
సీతాకోక చిలుకలు మూగుతున్నాయి.
పొట్ట తడుముకునే ఆ చిట్టితల్లి పాటల్లో
ఒక యుద్ధముంది, ఒక స్వర్గముంది ఒక దేశముంది."

గర్భవతిగా ఉన్న స్త్రీ పడే శారీరక బాధను వర్ణిస్తూనే ('నడవటం కూడా కష్టమైపోయింది'), ఆమె కళ్లలోని ఆశలను "మరో స్వప్నం"గా ఆయన అభివర్ణించారు. ఆ పుట్టబోయే బిడ్డ ఒక దేశానికి, ఒక యుద్ధానికి ప్రతి రూపమని అనడం ద్వారా మాతృత్వానికి ఒక సామాజిక బాధ్యతను కల్పించారు.

నిశ్శబ్ద పోరాటం, నిరీక్షణ

సమాజం స్త్రీని ఒక వస్తువులా చూసినా, ఆమె తన సహనాన్ని కోల్పోకుండా నిరీక్షిస్తుందని శివారెడ్డి గారు భావించారు. కాలచక్రం తిరుగుతున్నా ఆమె స్థితిలో మార్పు లేకపోవడంపై ఆయన ఆవేదన వ్యక్తం చేశారు.

"ఆమె అట్లానే పడుకుంది
మునగడ దీసుకుని కుక్కపిల్లలా-
ఆమె మీద నుంచి ఎండాకాలాలు పోవచ్చు,
వానాకాలాలు పోవచ్చు..."

కాలం మారినా ఆమె కష్టాలు మారడం లేదని చెబుతూనే, చివరకు "ఆలస్యంగా వచ్చిన వసంతకాలం ఆమె కాళ్ల దగ్గరే కూచుంది" అని అనడం ద్వారా ఆమెకు ఏదో ఒకరోజు న్యాయం జరుగుతుందనే ఆశను కవి కలిగించారు. స్త్రీని ఒక "సుదీర్ఘ స్వప్నం"గా చూడటం శివారెడ్డి గారి ప్రత్యేకత.కె. శివారెడ్డి గారి కవిత్వంలో స్త్రీ చిత్రం బహుముఖీనమైనది. ఆమె దుఃఖిస్తుంది, పోరాడుతుంది, నిరీక్షిస్తుంది మరియు సృష్టిస్తుంది. ఖాజాబి, మరియమ్మ, కామేశ్వరి వంటి పేర్లు ఏవైనా, వారు ఎదుర్కొనే సమస్యలు ఒక్కటేనని ఆయన చాటి చెప్పారు. సంప్రదాయాల బూజును వదిలించుకుని, పురాణ కాలపు 'ఊర్వశి' వలె సాహసంతో స్వేచ్ఛను కోరుకునే స్త్రీలకే ఆయన జేజేలు పలికారు.

సమాజం గీసిన గిరిని దాటి, తన ఆశలను, ఆకాంక్షలను నెరవేర్చుకునే దిశగా అడుగులు వేస్తున్న ప్రతి స్త్రీమూర్తికి శివారెడ్డి గారి కవిత్వం ఒక గొప్ప వెన్నుదన్ను. స్త్రీ సాధికారతకు, ఆమె ఆత్మగౌరవానికి ఆయన కవిత్వం ఒక అక్షర రూపం.

స్త్రీ వేదనలు - కవి భాగస్వామ్యం

ఆ కన్నీళ్లు నావే అనే కవితలో శివారెడ్డి గారు స్త్రీ పట్ల తనకున్న అపారమైన సానుభూతిని, ఆమె వేదనలో తన భాగస్వామ్యాన్ని అత్యంత శక్తివంతంగా వ్యక్తీకరించారు. "ఆమె ఎవరైతే ఏం / ఆ కన్నీళ్ళు నావే / ఆ ఆవేదన నాదే" అని ప్రకటించడం ద్వారా కవి, ప్రపంచంలోని ప్రతి స్త్రీ పడే కష్టాన్ని తన సొంత వేదనగా స్వీకరించారు. ఆమె ఏ దేశంలో, ఏ భూమ్మీద పుట్టినా, ఆమె పడే బాధ తన కళ్ళల్లో మలుపులు తిరుగుతోందని ఆయన ఆవేదన చెందారు. సమాజంలో స్త్రీ ఎదుర్కొంటున్న భయానక పరిస్థితులను వర్ణిస్తూ, "ఆమె అర్ధరాత్రిని / వెంటేసుకు పోతోంది / ఆమె చితుల్ని / వంటి నిండా పేర్చుకు బతుకుతోంది" అని అనడం ద్వారా ఆమె నిరంతరం మృత్యువుతో, భయంతో పోరాడుతోందని కవి చిత్రించారు. లోకం ఆమెకు చేస్తున్న గాయాలను "ఆమె వంటి నిండా / మనిషి కాట్లు / ఆమె గుండె నిండా / ఆకలి గునపం తూట్లు" అని అభివర్ణించడం ద్వారా పితృస్వామ్య వ్యవస్థలోని క్రూరత్వాన్ని ఎండగట్టారు. చివరగా, ఆమె అస్తిత్వం తన ఆలోచనలకు ఒక అద్దం వంటిదని, "నా లోపలి అద్దం మీద చెరగని ముద్ర / ఆమె ఆనవాళ్ళు / నా అక్షరాల్నిండా ప్రత్యక్షం" అని పేర్కొంటూ, తన కవిత్వమంతా ఆమె కన్నీటి సాక్షిగా పుట్టిందని శివారెడ్డి గారు హృద్యంగా విశ్లేషించారు.

మోహనా! ఓ మోహనా!: వ్యవస్థీకృత క్రూరత్వంలో నలిగిన స్త్రీమూర్తి ఆర్తనాదం:

ఈ కవితలో కె. శివారెడ్డి గారు 'మోహన' అనే ఒక ప్రతీక ద్వారా సమాజంలో స్త్రీ అస్తిత్వం ఎలా విచ్ఛిన్నం అవుతుందో అత్యంత శక్తివంతంగా చిత్రించారు. కవికి మోహన కేవలం ఒక వ్యక్తి కాదు, ఆమె "ఆకాశం కింద పక్షిలానో, ఆకు సందుల్లో నర్తించే కిరణపుంజంలానో" ప్రకృతిలోని ప్రతి అణువులో దర్శనమిచ్చే ఒక చైతన్యం. అయితే, ఈ చైతన్యం పితృస్వామ్య వ్యవస్థలో "రక్తమయమైన వేళ్లతో, సూర్యాస్తమయాల వంటి కళ్లతో" నిరంతరం వేదనను అనుభవిస్తోందని కవి ఆవేదన చెందారు. "దేహాన్నిచ్చి జీవితాన్ని కొనుక్కున్నావు" అని అనడం ద్వారా, స్త్రీ తన ఉనికిని కాపాడుకోవడానికి ఎంతటి వెల చెల్లిస్తోందో ఆయన ఎత్తిచూపారు. ముఖ్యంగా ఆధునిక సమాజంలోని వ్యాపార ధోరణిని విమర్శిస్తూ, "అందాన్ని అనాకారిగా తయారుచేసే క్రూరత్వం... ప్రతిదాన్నీ వస్తువు కింద మార్చి అమ్ముకునే క్రూరత్వం" ఆమె వ్యక్తిత్వాన్ని ఎలా పార్సిల్ చేసి విదేశాలకు ఎగుమతి చేస్తోందో నిలదీశారు. బతుకును ఒక బండ బరువుగా, ఒక పాపకార్యంగా మార్చిన ఈ వ్యవస్థలో "బతుకు మోహనా! బతుకు!" అని కవి ఇచ్చిన పిలుపులో జాలితో కూడిన ఒక నిశితమైన వ్యంగ్యం కనిపిస్తుంది. చివరగా, ఏ ఆడపిల్లని చూసినా రాత్రికీ పగటికీ మధ్య కొట్టుకుంటున్న తెరలా మోహన గుర్తొస్తుందని చెప్పడం ద్వారా, స్త్రీలు అనుభవిస్తున్న ఈ సుదీర్ఘ అజ్ఞాతవాసం మరియు అణచివేత పట్ల కవి తన సంఘీభావాన్ని ప్రకటించారు. శివారెడ్డి కవిత్వంలో స్త్రీ చిత్రాణ ఆధారంగా ఈ పరిశోధనా పత్రములో గుర్తించిన అంశాలు

వస్తువుగా చూడటంపై తిరుగుబాటు :

స్త్రీని కేవలం ఒక అందమైన వస్తువుగా లేదా అమ్మకపు సరుకుగా మార్చే వ్యాపార ధోరణిని (మోహనా కవితలోలా) నిరసిస్తూ, ఆమెను ఒక 'ఉన్నతమైన వ్యక్తిత్వం' కలిగిన ప్రాణిగా చిత్రించడం ఇందులో కనిపిస్తుంది.

అస్తిత్వ ప్రకటన :

సమాజం గీసిన 'ముగ్గుల వలయాలు', 'మసిగుడ్డ జీవితాల' నుంచి బయటపడి, తన స్వేచ్ఛను తనే నిర్ణయించుకుని, "తననుకున్నట్టు తను బతకటం" అనేది ఒక ప్రాథమిక హక్కు అని చాటిచెప్పడం.

చారిత్రక నిరంతరత :

స్త్రీ అణచివేత అనేది కేవలం నేటి సమస్య కాదని, "శ్రీరాముడి కాలం నుంచి ఇప్పటిదాకా" ఆమె స్థితిలో మౌలికమైన మార్పు రాలేదని చెప్పడం ద్వారా వ్యవస్థాగత మైన లోపాన్ని ఎత్తిచూపడం.

మాతృత్వానికి సామాజిక కోణం: మాతృత్వాన్ని కేవలం ఒక శారీరక ప్రక్రియగా కాకుండా, పుట్టబోయే బిడ్డలో "ఒక యుద్ధం, ఒక స్వర్గం, ఒక దేశం" ఉందని అనడం ద్వారా, స్త్రీని ఒక కొత్త సమాజ సృష్టికర్తగా మరియు చారిత్రక వారధిగా గుర్తించడం.

కవి ఆత్మలో స్త్రీ వేదన: స్త్రీ పడే కష్టాన్ని కేవలం సానుభూతితో చూడకుండా, "ఆ కన్నీళ్లు నావే.. ఆ ఆవేదన నాదే" అని ప్రకటించడం ద్వారా, స్త్రీ వేదనను కవి తన సొంత అస్తిత్వంలో భాగంగా మార్చుకోవడం (Internalization of Pain).

విధ్వంసం నుంచి వికాసం :

సంప్రదాయాల బూజును, నీతిగా కనబడే దుర్నీతిని బద్దలు కొట్టినప్పుడే స్త్రీకి నిజమైన చైతన్యం కలుగుతుందని, ఆ సాహసమే ఆమెకు 'జేజేలు' పలికిస్తుందని కవి ప్రబోధించడం.

ముగింపు :

శివారెడ్డి గారి అక్షరాల్లో స్త్రీ కేవలం బాధితురాలు కాదు, పాతకాలపు విలువలను ధిక్కరించి తన అస్తిత్వాన్ని తానే నిర్వచించుకునే ఒక సామాజిక విస్ఫోటనం. 'మోహన' వంటి ప్రతీకల ద్వారా ఆమెపై జరుగుతున్న వస్తువుకరణను ఎండగడుతూనే, ఆమెలోని నిశ్శబ్ద పోరాటాన్ని కవి ఒక బహిరంగ గర్జనగా మలిచారు. కన్నీళ్లను అగ్నిధారలుగా మార్చి స్త్రీ స్వేచ్ఛకు దిక్సూచిగా నిలిచిన ఆయన కవిత్వం, అణిచివేయబడిన ప్రతి గొంతుకలోనూ ఆత్మగౌరవ జ్వాలను రగిలిస్తుంది. చివరకు, తన కలను తానే నిర్మించుకుని లోకాన్ని నడిపించే సబలగా ఆమెను చిత్రించడం ద్వారా, ఆయన కవిత్వం స్త్రీవాద చైతన్యానికి ఒక శిఖరంగా నిలుస్తుంది.

ఆధార గ్రంధాలు :

1. ఆమె ఎవరైతే మాత్రం శివారెడ్డి కవిత్వం -పాలపిట్ట బుక్స్ హైదరాబాద్- సంపాదకులు: గుడిపాటి పెన్నా శివరామకృష్ణ-
2. నీలి మేఘాలు- స్త్రీవాద కవితా సంకలనం
3. తెలుగులో కవిత్వోద్యమాలు- తెలుగు అకాడమీ ప్రచురణ
4. స్త్రీవాద వివాదాలు- డాక్టర్ ఎస్ .వి సత్యనారాయణ(సం)

★★★

Vol. 23 | Spl. Issue 03 | March 2026 | BHAVAVEENA | ISSN No. : 2456-4702 | RNI No. APTEL/2003/12253

RNI No. APTEL/2003/12253 | Reffered Journal & Peer Reviewed Journals | ISSN No. 2456-4702

భావవీణ

కళలు, సాహిత్య, సాంస్కృతిక భాషాధ్యయన పత్రిక

BHAVA VEENA

Journal of Arts, Literary, Culture & Language Study

మహాబూబ్‌నగర్ జిల్లా స్త్రీల జానపద గేయాలు పరిశీలన

- ప్రొఫెసర్. కె. అరుణబాయి

ప్రిన్సిపాల్, ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల, సంగారెడ్డి.

Keywords :

జానపదం, జానపదగేయం, స్త్రీలపాటలు, వాగ్గేయ కారులు, కళారూపాలు, ఒగ్గుకథ, తోలుబొమ్మలాట, కడలి, సుక్కబొట్టు, గొడ్రాలు, ప్రపంచీకరణ.

వ్యాససంగ్రహం :

మహబూబ్‌నగర్ జిల్లా శ్రామికులకే కాదు, కవులకు పండితులకకూ పుట్టినిల్లు, చరిత్ర పరంగా సాహిత్యపరంగా వనరుల పరంగా సంపన్నమైన జిల్లా, అయినా పాలకుల వివక్షవల్ల కాలవైపరిత్యం వల్ల వెనుబడి పొయింది. సంస్థానాలకు సాహిత్యానికి నెలవుగా ఉన్న చరిత్రను ప్రధాన స్రవంతి తెలగు చరిత్ర పట్టించుకోలేదు. పద సంకీర్తన చరిత్ర ప్రారంభమైయింది ఈ జిల్లా నుండియే తెలుగులో తొలి సంకీర్తన కవిగా గుర్తింపుపొందిన సింహగిరి కృష్ణమాచార్యులు ఈ జిల్లా వాసియే. కాకునూరి అప్పకవి కూడా ఈ జిల్లాకు చెందినవాడే. దాస త్రయంగా పేర్కొనబడిన వారు రాకమచర్ల వేంకటదాసు వేపూరి హనుమద్దాసు, మన్నెంకొండ హనుమద్దాసు. వీరి కీర్తనలు ఇప్పటి తెలంగాణ రాష్ట్రమంతా మారుమ్రోగుచున్నాయి. డా॥.పి.భాస్కరయోగి పాలమూరు వాగ్గేయ కారులు అనే గ్రంథంలో 167 మందిని అక్షరబద్ధం చేయడం హర్షణీయం.

పూర్వకాలంలో వెలువడిన సాహిత్యమంతా ప్రభువుల చేత గౌరవింపబడింది. పాటల ప్రపంచంలో జానపద గేయం తెలియని, ఆస్వదించని, ఆ పాటల మాధుర్యాన్ని అనుభవించని మనిషి ఉండడు. ఎందుకంటే ఈ లోకంలోకి అడుగు పెట్టిన ప్రతిబిడ్డ తన తల్లి పొత్తిళ్ళలో వింటూ హాయిగా నిద్రపోయే పాట లాలి పాట. అందుకే జానపదం అంత మాధుర్యం.

జానపద సాహిత్యం అనేది ఎప్పుడు ప్రారంభం అయ్యిందో ఖచ్చితంగా చెప్పడం కష్టం ప్రాచీన కాలంలో మానవులు సంఘజీవులుగా ఉండేవారు. సమూహాలుగా జీవనం సాగించేవారు. అలాంటప్పుడు వాళ్ళు వేడుకలు, ఆటలు, పాటలు అన్నీకూడా సమూహాలుగా నిర్వహించే వారు. జానపద సాహిత్యం చాలా ప్రాచీనమయిన సాహిత్యం. అలాగే సమిష్టి సాహిత్యం. ఇది సమూహాల నుండి ఉద్భవించబడే సాహిత్యం అని చెప్పవచ్చు. మనసు ఆలోచనలను, అనుభవాలను భావాలను సమూహాలుగా సరళంగా వ్యక్తీకరిస్తారు. జనపద సాహిత్యం లోని ఒక్కోగేయం, కథ, సామెతల వెనుక ఖచ్చితంగా ఒక ఇతివృత్తం ఉంటుంది. ఈ సాహిత్యాన్ని అధ్యయనం చేయడం వల్ల ప్రాచీన నాగరిక సమాజం ఆచారాలు, సంప్రదాయాలు సంస్కృతులు తెలుసుకోవచ్చు. ప్రాచీన సంస్కృతి కాలక్రమంలో కనుమరుగు కాకుండా చూసుకోవచ్చు. సమాజ వాస్తవిక జీవన చిత్రణ అనేది

ప్రస్తుతం ప్రాచుర్యంలో ఉన్న శిష్ట సాహిత్యం కన్నా జానపద సాహిత్యం ఎక్కువగా ప్రతిబింబిస్తుంది. ఇది ఒక సాహిత్యం మాత్రమే కాదు ఇది ఉల్లాసానికి, మనో వికాసానికి, సమిష్టి తత్వానికి, సంప్రదాయ విజ్ఞానానికి తోడ్పడుతుంది. జానపద సాహిత్యంలోని జానపద గేయాలు సాంస్కృతిక కళలు, కళారూపాలు అన్నీకూడా మానవ శ్రమ నుండి ఉద్భవించినవే. మానవ వికాసంలో భాగంగా శ్రమ నుండి సేద తీరడానికి శ్రమ జీవులే వీటిని సృష్టించుకుంటారు.

నేటి కాలంలో వచ్చిన గేయ సాహిత్య ప్రక్రియలన్నీ ప్రజలచేత గౌరవింపబడుతున్నాయి. ఏ సాహిత్యమైన సమాజానికి హితాన్ని చేకూరేలాగ ఉండాలి. అనేమాటను తీసుకొని మహబూబ్‌నగర్ జిల్లాల్లో స్త్రీగేయ సాహిత్యాన్ని తీసుకొని నూటికి నూరుపాళ్లు నిజం చెయ్యాలని నమ్మి ఈ వ్యాసాన్ని చేపట్టాను.

ఉపోద్ఘాతం :

మహబూబ్‌నగర్ జిల్లా జానపద సాహిత్యానికి పెట్టింది పేరు. జానపదం, యక్షగానం, సంకీర్తన మొదలైన ప్రక్రియలకు పురుడుపోసింది ఈ జిల్లాయే. ఈ జిల్లా శాసనాల జిల్లాగా సాంస్థానాల ఖిల్లాగా విఖ్యాతిపొందిన మహబూబ్‌నగర్ జిల్లా సాహితీపాలు పొంగిన జీవధార జ్ఞానామృతాన్ని పంచిన సాహితీనేల. పదాలు పలికినా వచనాలు చెప్పిన, కీర్తనాలు ఆలపించినా, గేయాలు పాడిన యక్షగానాలు ఆడినా చాటువులు ఆశువులగా చెప్పినా అది ఈ జిల్లాకే చెల్లింది. అద్భుతమైన జానపద స్త్రీల గేయాలు ఈ జిల్లా నుండి వచ్చాయి. ఈ జిల్లాలో ఏ గ్రామాన్ని తడిమినా, ఏ తండాను తట్టినా, ఏ గొంతును మీటినా జానపద స్త్రీ గేయాలు పెదవులపై నాట్యమాడతాయి. దసరా రోజుల్లో బతుకమ్మ పండుగ పాటలు, స్త్రీలను పరవశింపచేస్తాయి. మదిని పులక రింపజేస్తాయి. భక్తి పారవశ్యంతో స్త్రీలు, పిల్లలు, తన్మయులు అవుతారు. ఈ జిల్లాలో అద్భుతమైన జానపద సంపద ఉంది. జాతి జీవన విధానాన్ని ప్రత్యేక అస్తిత్వాన్ని నిలబెట్టేదే సంస్కృతి. తెలంగాణ ప్రాయం వివిధ పాలకుల కాలంలో వివక్షతకు ఉపేక్షకు గురై చరిత్ర, సాహిత్యం, సంస్కృతిలేదనే స్థితికి చేరుకుంది. అయితే మహబూబ్ నగర్ జిల్లా భౌగోళికంగా చారిత్రకంగా, రాజకీయంగా సామాజికంగా, సాంస్కృతికంగా సాహిత్య పరంగా ఒక ప్రత్యేకతను కలిగించినన ప్రాంతంగా గుర్తింపు పొందింది. ఆనాటి మహబూబ్ నగర్ జిల్లా వాస్తవ పరిస్థితిని కవులు, రచయితలు తమతమ రచనల ద్వారా చిత్రించారు. ఇదే తెలంగాణ ప్రాంతానికి ఒక ప్రత్యేక భూమికను నిలబెట్టింది.

సమాజ వాతవరణంలో ప్రకృతి ఒడిలో పాటలు అల్లిన వీరు చెట్టు నుండి పుట్ట వరకు ఆన్నింటిని తమ జాన పదంలో ఇనుమడింపజేసారు. అదే విధంగా బతుకు దెరువులో భాగంగా సంచార జీవనం సాగించే సంచార జాతులు అనేక ప్రాంతాల సంస్కృతి , సంప్రదాయాలను పాటలుగా అల్లి సమాజానికి జ్ఞానం అందించేవారు అలాగే గొర్రెల కాపర్లు, గొల్ల కుర్మలు చెప్పే ''ఒగ్గు కథ'' ను కూడా చెప్పవచ్చు. జానపద సాహిత్య పరిశోధనలో భాగంగా ఇప్పటికీ ప్రయత్నాలు చేస్తునే ఉన్నారు. జానపద సాహిత్య అన్వేషణలో అమూల్యమైన సేవలందించిన వారిలో బిరుదురాజు రామరాజు '' జానపద గేయ సాహిత్యం'' నాయని కృష్ణకుమారి ''జానపద గేయ గాధలు'', మొదలినాగభూషణ శర్మ- ''తోలు బొమ్మ లాట'', చెలుకూరి నారయణరావు-''తెలుగు సామెతలు ''ఆర్వీయస్. సుందరం-''సుందర జానపదం'' ముఖ్యులు. అదేవిధంగా కొలకలూరి ఇనాక్ గారు చేసిన - జానపద సాహిత్య విమర్శ అనేది ప్రత్యేకమయిన ప్రక్రియ అని చెప్పవచ్చు.

స్త్రీల జానపద గేయాలు :

''ఆర్వీయన్. సుందరం-''సుందర జానపదం'' ముఖ్యులు. అదేవిధంగా కొలకలూరి ఇనాక్ గారు చేసిన-జానపద సాహిత్య విమర్శ అనేది ప్రత్యేకమయిన ప్రక్రియ అని చెప్పవచ్చు. జానపద కవిత్వంలో కర్త,క్రియ, ప్రచారం అన్నీ కూడా సామూహికం. దీనికి మౌఖిక వ్యక్తీకరణ సంప్రదాయాల లక్షణాలు ఉంటాయి. ఈ జానపద కవిత్వాన్ని గేయం, కథాగేయం అని రెండు విధాలుగా విభజించవచ్చు. అదే విధంగా జానపద గేయాల్లో కథ ఉండదు. కేవలం ఆత్మ పరత్వం ఉంటుంది.

ఉదాహరణకు:

"ఏటి కేతం బెట్టి యెయిపుట్లు పండించి
ఎనడూ మెతుకెరగ నన్నా
నేను గంజిలో మెతుకెరగనన్నా"

అని రైతు తన వాస్తవ పరిస్థితిని తన పాలంలో గట్లు కడుతూ నీళ్ళూ పెడుతూ పాడుకోవడంలో రైతు ఆత్మ పరత్వం కనిపిస్తుంది. ఆర్వీయస్. సుందరం జానపద గేయాలపై తన అభిరుచిని ఈ విధంగా తన సిద్ధాంత గ్రంథం ముందుమాటలో వ్యక్తపరుస్తాడు.

"పల్లె పాటె పాడితే లయ
కడలి పొంగి పొర్లిగే లయ
గుండె కోయిల కూస్తే లయ
మొన్న పుటెటన పువ్వు నవ్వినా లయ

అని జానపద సాహిత్యంపై తన మననులోని భావాలను వ్యక్తపరుస్తాడు.

జానపద గేయ విభజన:

గేయ రచనాకాలం ఖచ్చితంగా చెప్పలేకపోవటం. ఒకరి నుండి ఒకరికి వినికిడి ద్వారా ప్రసారం, సహజ శైలిని కలిగి ఉంటాయి. చక్కని దేశీయ ప్రయోగాలు రసధ్వని ఉంటాయి. పాడుకోవడానికి వీలుగా ఉంటాయి. గేయంలో ఒక పదం లేదా చరణము పునరావృతమగును. గేయ రచనల్లో వస్తువు సామాజిక జీవనం వారి ఆచార వ్యవహారాలే.

గేయ విభజన: వస్తువును బట్టి గేయములు

1.పౌరాణిక గేయాలు, 2. చారిత్రక గేయాలు 3. ఆధ్యాత్మిక గేయాలు 4. సాంఘిక గేయాలు అని చెప్పవచ్చు.

రసమునుబట్టి శృంగార, వీర, కరుణ అద్భుత, హ్యాస, గేయములను స్థూలంగా విభజించవచ్చు.

ఆలంబనం బట్టి :

1.బాల బాలిక గేయాలు, 2.స్త్రీల గేయాలు, 3.శ్రామిక గేయాలు అని చెప్పవచ్చు.

స్త్రీల పాటలు :

స్త్రీ తన జీవిత గమనానికి సంబంధించిన వివిధ అవస్థలను పాటలుగా పేర్కొంటారు. తాను మేల్కాంచిన తదుపరి, నిద్ర పోయేవరకు గల అన్ని అవస్థలను పాటల రూపంలో త్రీకరిస్తారు. స్త్రీ బాల్యమునకు, కన్నె వయసుకు, వివాహ వయసుకు, వివాహం తదుపరి వయసుకు సంబంధించిన సన్నివేశాలు మనకు కనబడ తాయి. తొక్కుడు బిళ్ళ, పెళ్ళి చూపులకు, వివాహం, సీమంతం, తల్లీ పిల్లలకు సంబంధించిన అంశాల చోటుచేసు కుంటాయి. అత్తా కోడళ్ళ వెక్కిరింతలు ఈ విధంగా ఉంటాయి.

ఉదా:

కోడల కోడల కొడుకు పెళ్ళామా ! ఓయమ్మా /
కొడుకూళ్ళోలేడు మల్లెలెక్కడెవే - ఆ! వూ
సూదులంటీ సన్నాబియ్యం సిమడ బెడితివె కోడలా
/నువ్వు సిమడాబెడితివే కోడలా !
వారుపుకొస్తే వంచవద్దని నీకెవ్వరు చెప్పారత్తమ్మో !/
నీకెవ్వరు చెప్పారత్తమ్మో ! "

ఎం.సంతోష్ 42, గ్రామం-గోపాల్‌పేట్,
మండలం-గోపాల్‌పేట్, జిల్లా- వనపరి

భార్యాభర్తల మధ్య ఎంత సఖ్యత ఉన్నప్పటికీ కొన్ని విషయాలలో విభేధాలు, అనుమానాలు వస్తూ ఉం టాయి. భార్య అందంగా అలంకరించుకుంటే భర్త అనుమానంతో ఉన్నాడని బాధపడుతున్న స్త్రీ ఏమి అంటుందో ఈ గేయంలో చూడవచ్చు.

"సుక్కబొట్టు బెట్టనీడు సుట్టాల జూడనీడు
ఎన్నాళ్ళు కావిలుంటడో ఈనాకుసించ // ఎన్నాళ్ళు కావిలుంటడో //
పచ్చబొట్టు బెట్టనీడు పసుపునీర గట్టనీడు
ఎన్నాళ్ళు కావిలుంటడో ఈనాకునించ // ఎన్నాళ్ళు కావిలుంటడో //
నల్లబొట్టు బెట్టనీడు ఎర్రసిస గట్టనీడు "

జి.బుచ్చమ్మ 70, గ్రామం-శ్రీరంగాపురం,
మండలం-శ్రీరంగాపురం జిల్లా- వనపర్తి

భర్తకు తన భార్యపైన విపరీతమైన అనుమానం. అది ఆమెను ఎంతో బాధించింది. భర్త తనను చుక్కబొట్టు పెట్టు కోనివ్వడని, చుట్టాలని చూడనివ్వడని, పచ్చబొట్టు

పెట్టుకో నివ్వడని, పసుపు రంగు చీర కట్టనివ్వడని ఎర్ర రంగు చీర కట్టనివ్వడని, ఎరుపు రంగు బొట్టు పెట్టుకో నివ్వడని, అడ్డబొట్టు పెట్టుకోనివ్వడని అద్దంలో చూసుకుంటే ఒప్పుకోడని అంటోంది. ఇలా తనకు ఎన్ని రోజులు అతను కాపలా వుంటాడని ఆవేదన వ్యక్తం చేస్తోంది.

అదేవిధంగా బద్ధకస్తుడైన భర్తకు కూలీనాలీ చేసి అవసరమైనవన్నీ సమకూర్చినా కూడా పోట్లాడుతున్నాడన్న విషయాన్ని క్రింది గేయంలో చూడవచ్చు.

"సూరుసూరు దిరిగి సుట్టాకు నేదెపై / పొవ్వాకు లేదని పొడవచ్చడక్కో పొడవచ్చడక్కో
వాన్ని నెనేమన్నానా వానబ్బసొమ్మేమైనా దిన్నానా / వాడవాడదిరిగి వంకాయల్నేదెస్తే
టెంకాయలేదని తిగదిడతడక్కో తెగదిడతడక్కో /వాన్ని నేనేమన్నాన వానబ్బసొమ్మేమైనా దిన్నానా
గడపగడపదిరిగి కందిపప్పుదెస్తే"

బండారి కృష్ణకుమార్ 38, గ్రామం-గోపాల్‌పేట్, మండలం-గోపాల్‌పేట్, జిల్లా- వనపర్తి

ఆమె భర్త మహా బద్ధకస్తుడు. ఆమె కూలినాలి చేసి తన భర్తను పోషిస్తుంది. తన భర్త చుట్ట కాల్చుకోవడం కోసం చుట్ట అకు తీసుకొస్తే పొగాకు తీసుకు రాలేదని తనను పొడవడానికి వచ్చాడని, వాడవాడా తిరిగి వంకాయలు తెస్తే టెంకాయలు తీసుకు రాలేదని తిట్టాడని, కందిపప్పు తెస్తే కోడి కూర తేలేదని కొట్టడానికి వచ్చాడని, తాను అతని సొమ్మేమైనా తిన్నానా లేక అతన్నేమైనా అన్నానా అని తోటి స్త్రీకి చెబుతోంది. అధేవిధంగా ఒక గడుసరి పెళ్ళాం అమాయకుడైన తన భర్తను ఏ విధంగా ఆటపట్టిస్తుందో ఈ గేయంలో చూడవచ్చు.

ఏలనే ఈ మొగుడు పదిమందిలోనా నే నగుడు / ఊరికి యాడ్కిపోడే నన్నుత్తమురాలనుకోడే
చీపురుపుల్లతో తానట్టంటే చింపిచేటతో నేనిట్టంటి / అంతేగానీ ఇంకేమిలేదమ్మ్మ "

బి. రావులమ్మ 58, గ్రామం-గోపాల్‌పేట్, మండలం-గోపాల్‌పేట్, జిల్లా- వనపర్తి

తన భర్త ఇళ్ళు దాటి ఎక్కడికీ పోడని, సోమరిగా ఉంటూ తనకు పదిమందిలో నగుబాటు తెస్తున్నాడని అంటూ తన భర్త చీపురుపుల్లతో ఒక దెబ్బ వేస్తే ఆమె చింకిచేటతో ఓ దెబ్బ వేసిందట అంతేగానీ ఇంకేమీ అనలేదంటూ భర్త పైనే నిష్ఠూరపోతోంది. జానపదుల్లో అమాయకుడైన భర్త భార్యతో సరసాలాడబోతే గడుసరి భార్య తనభర్తను ఏ విధంగా ఆటపట్టిస్తుందో కంటి కట్టినట్టు ఈ గేయంలో కనిపిస్తుంది.

తల్లీకూతురు :

వివాహం కాకుండా ఇంట్లోనే వున్నప్పుడు కూతిరికి కాస్త పనీ బాటా చెప్పి ఆమె పట్ల కాస్తంత అలసత్వం కనబరిచినా, వివాహానంతరం కూతురికి ఇచ్చినంత ప్రాధాన్యత తల్లి తన కొడుక్కు కూడా ఇవ్వదు. తన కళ్ల ముందు వున్నపుడు అంతగా పట్టించుకోకపోయినా అత్తింట్లో వున్న కూతురు ఎలా వుందో, వారు బాగా చూసుకుంటున్నారో లేదో తల్లి మనసులో నిరంతరం కదలాడుతూ వుంటుంది. అందుకే కుమార్తె అక్క వివాహానంతరం తల్లీ కూతుళ్ల బంధం మరింత బలపడుతుంది. కూతురికి వచ్చిన కష్టాన్ని తల్లి తన కష్టంగా భావించి పరిష్కరించడానికి ప్రయత్నిస్తుంది.

అరెకరాల్ చేనిస్తా అంటి మామిడి తోటిస్తా
పోవమ్మా నా కూతురా పోయి యింటికి కీర్తి తేవమ్మా
అరెకరాల్ చేసిస్తా, ఆవులమ్మని తోడిస్తా
పోవమ్మా నా కూతురా పోయి యూరికి కీర్తి తేవమ్మా
పోనమ్మా నేను పోనమ్మా పోతే తిరగడంలేదమ్మా మ్మ"

కె.రాజేస్ 58, గ్రామం-ఆత్మకూరు మండలం - ఆత్మకూరు, జిల్లా- వనపర్తి

తల్లి పుట్టినింటికి వచ్చిన తన కూతుర్ని మెట్టినింటికి వెళ్లమని చెబుతోంది. అరెకరాల భూమిని, ఓ మనిషిని తోడిస్తానని మెట్టినింటికి వెళ్లి పుట్టినింటికి, ఊరికి కీర్తి తేవాలని అంటోంది. అయితే కూతురు మాత్రం తన భర్త సోదరుల్లో చిన్న వాడైన గంగలప్పకు, తనకు పడడం లేదని, అలాగే చిన్న ఆడబిడ్డ కాంతమ్మకు తనకూ పడడం లేదని, వారు తనను వేధిస్తున్నారని అంటోంది. మరోసారి అత్తింటికి వెళితే ఇక తిరిగి రాలేనని అత్తరారింటికి పోనని

అంటోంది. కలిగిన ఇంటి అమ్మాయిని పేదవాళ్ళింట్లో ఇవ్వడం వల్ల ఆ అమ్మాయి శారీరకంగా, మానసికంగా పడే బాధల్ని కింది పాటలో చూడవచ్చు.

సూర్యుడా చంద్రూడా నీమీదా నేనొక్కా పాటా పాడాగలనూ
పాటొస్తే పాడుకో పదిమందీలోనా, నవ్వొస్తే నవ్వుకో నలగారీలోనా
నవ్వొస్తే నవ్వుకో నలగారీ లోనా సన్నిస్తిరన్నా నల్గొండలో
నన్నిస్తిరన్నా నల్గొండలో పట్టిచ్చినారన్నా పగవారీలోనా
పట్టిచ్చినారున్నా పగవారిలోనా ఊహించీ పోయానే మాత్త గారింటికీ
తాటాకు గుడిసెలో మాయత్తగారింట్లో మిద్దెలూ మేడలూ మాయమ్మా గారింట్లో
చీరాలూ రైకాలు యామమ్మ గారింట్లో చీలికలూ పేలికలూ మా యత్తగారింట్లో
ఆటలూ పాటలూ మాయమ్మగారింట్లో అపరంజి గుద్దులు మాయత్తగారింట్లో

కాకామూ అంజనేయులు 45, గ్రామం - తెల్లరాళ్ళపల్లి మండలం-పానగల్, జిల్లా- వనపర్తి

పెళ్ళిచేసుకొని ఒక అమ్మాయి అత్తగారింటికి వెళ్లింది. అక్కడ అన్నీ కష్టాలే. తన బాధలు చెప్పుకోవడానికి ఎవరూలేరు. అందుకే సూర్యుడికీ, చంద్రుడికీ తన బాధలు చెప్పుకుంటోంది. తన అత్తవారుతనకు శత్రువు ల్లాంటి వారంటోంది. తన తల్లిదండ్రులు సంపన్నులని, తనను తాటాకు గుడిసెలో వున్నవ్యక్తికి ఇచ్చి చేశారని వాపోతోంది. పుట్టింట్లో తాను అపురూపంగా పెరిగానని, చీరలు, రవికెలు ధరించి ఉల్లాసంగా ఆడుతూ పాడుతూ గడిపానని కానీ తన అత్తవారింట్లో చీలికలు, పేలికలు ధరించి, దెబ్బలు తింటున్నాని ఆవేదన వ్యక్తం చేస్తోంది.

ప్రాచీన కాలం నుండి కుటుంబ వ్యవస్థ ఉండేది. అవి ఇప్పటి కుటుంబాలుగా కాకుండా కలిసి ఉండే గుణంతో సమాజంలో ఒక భాగంగా ఉండేవి. అలా కొన్ని కుటుంబాల వాళ్ళు అంతా ఒకే చోట నివసించేవారు. అలాంటి వ్యవస్థలో స్త్రీ ప్రముఖ స్థానంలో ఉండేది. వ్యక్తులను ఆదర్శప్రాయంగా తీర్చిదిద్దడంలో అమ్మగా, భర్తను ఆప్యాయంగా చూడడంలో కోడల్ని అదుపులో పెట్టడంలో ఇలా ఎన్నో రూపాల్లో స్త్రీ సాక్షత్కరిస్తుంది. ప్రపంచంలో ఏదేశంలోనైనా మానవ జన్మకు కారణమైన తల్లికి ప్రత్యేక స్థానం. అలాంటిది బిడ్డలు లేని గొడ్రాలికి ఆ గౌరవం ఉండదు. పిల్లలు లేని వాళ్ళు ఎదురుపడితే అసుభంగా పరిగణిస్తారు. వాళ్ళ నీడ వాళ్ళ మీద పడడం కూడా వారు సహించరు. ఆ సమయంలో నిర్వేదంతో కూడిన బాధలో నుండి ఆవేదనతో ఆ గొడ్రాలు పాడుకునేపాట.

పసుపు కుంకుమలకు పోలేను నేను /పసి బిడ్డలను నేను ఎత్తుకోలేను
ఇల్లు కలకలలాడ చూడంగ / ఒక్క బిడ్డనైనా ముద్దాడ లేను
గొడ్రాలి బతుకయ్యె గౌరవం లేదయ్యే"

కొమ్ముచంద్రయ్య 48, గ్రామం-పెద్దమందడి, మండలం - పెద్దమందడి, జిల్లా- వనపర్తి

అనే ఈ పాటలో ఒక గొడ్రాలు బిడ్డల కోసం ఎంతగా పరితపిస్తుందో, బిడ్డలు లేని కారణంగా తను ఈ సమాజంలో ఎలాంటి వివక్షకు గురౌతున్నానో తెలుపు తుంది. ఈ పరిస్తితులు నేటికీ ఈ సమాజంలో ఉన్నాయి.

అత్త కోడళ్ళు సంబందం గురించి చెబుతూ ఈ సంస్కృతి ఒక మాయని మచ్చ అని చెప్పవచ్చు. కోడలిని ఎప్పుడూ అదుపులో పెట్టాలనే భావనలో అత్త పెత్తనం చేయడం జరుగుతుంది. అందరూ అలా ఉండరు కానీ! సమాజంలో ఉన్న సాదారణ అభిప్రాయంను పరిగణలోకి తీసుకుంటే "అత్తలేని కోడలుత్తమురాలు, కోడలు లేనత్త గుణవంతురాలు" అంటారు. ఇక్కడ నిత్యం ఆరడి చేసే అత్తతో ఒక కోడలు ఈ విధంగా అంటుంది.

అత్తగారా రావమా ఆరడి చేయకమ్మ
ఒత్తులు ఒత్తకమ్మా ఒత్తిగిలి ఉండాలమ్మా?
కొడుకులు గన్నానంటూ కోమాలి పొంగాకమ్మా

బుడిగె అక్కమ్మ 50, గ్రామం-పెచ్చేరు, మండలం - పేచ్చేరు, జిల్లా- వనపర్తి

ఈ విధంగా కోడలు అత్తతో తన మనసులోని భావాలను తెలియజేస్తుంది. అదే విధంగా అత్తమామలు

అంటే గిట్టని కోడలు వాళ్ళను లక్ష్యంగా చేసుకుని అపహాస్యం చేస్తుంటారు.

మాయత్త మా మామ ఊరేగుతుంటే / చుట్టపీకలు రెండు చూడొచ్చినాయి
మట్టగిడసలు రెండు మాట్లాడినాయి /కందిరీగలు వచ్చి కత నడిపినాయి
బోదురు కప్పలు వచ్చి భాగోతమాడు"

అంటూ ఇరుగు పొరుగు వారితో తన అత్త మామ లను ఎగతాళి చేస్తూ తన కోపం, వారితో పంచుకుని అనందిస్తుంది.

వేడుకల-పాటలు :

సహజంగా ఈ పాటలు పెళ్ళిళ్ళలో ,పండుగల్లో ,శు భకార్యాలలో పాడుతుంటారు. పెళ్ళి చూపులలో పెళ్ళి కూతురుని చూపించుకునే సందర్భంలో పెళ్ళి కూతురు మాట, చూపు, ఏ విధంగా ఉందో చూడాలని పాడ్కునే పాట.

"పిలిపించు నీ సీత పిలుపు చూతుము
పిలుపేమి సూసేవు చిలుక పలుకుల్లూ
పిలిపించు నీ సీత నడక చూతుము
నడకకేమి సూసేవు అంస నడకల్లూ"

బండారి కృష్ణకుమార్ 38, గ్రామం-గోపాల్‌పేట్, మండలం-గోపాల్‌పేట్, జిల్లా- వనపర్తి

అని ఆడపిల్ల తరుపువారు గర్వంగా చెప్పుకుంటూ పాడుతూ సీత పెళ్ళికూతురుగా రాముడు పెళ్ళికొడకుగా అభివర్ణిస్తూ నిత్యజీవితంలో జానపద గేయాన్ని భాగంగా చేసుకున్నారు. అదేవిధంగా అప్పగింతలు సమయంలో కరుణరస పాటలు అప్పగింతలు పాటలు ఉంటాయి. అలాంటిదే

"అత్తమామలు గాని ఆడపిడ్డలు గాని
లేరమ్మ, నీదెంత పున్నెమోగాని
మగడు ఒక్కడు గానమనసు కెక్కినయట్లు
మర్నించి నీ వశము చేసుకోవమ్మ"

బి.రావులమ్మ 58, గ్రామం-గోపాల్‌పేట్, మండలం - గోపాల్‌పేట్, జిల్లా- వనపర్తి.

అని ఒక తల్లి తన కూతురుని అత్తగారింటికి పంపే సందర్భంలో అత్తగారింట్లో ఉన్న పరిస్థితులను చెబుతూ భర్తను తన వశం చేసుకోడానికి సలహాలు ఇస్తుంది.

కరుణ గేయాలు - కన్నీటి పాటలు :

ఇవి కరుణరసం ఇతివృత్తంగా ఉంటాయి. ఇవి అన్నీ కూడా కన్నీటి పాటలే వీటిలో ఎక్కువగా పెండ్లి సమయంలో అప్పగింతల పాటలు. పెండ్లి జరిగినంత సేపు ఆనందంగా గడపిన వారు చివర ఘట్టం అప్పగింతలు విషయంలో అంతా కన్నీళ్ళతో శోకసంద్రంగా మారిపోతారు. అలాంటి సందర్భంలో

సెలవిచ్చి మాయమ్మ సెలవిచ్చినాము / చెలగి మీ అత్తింట బుద్ధిగలిగుండు
ఎవ్వరే మాడిన ఎదురాడకమ్మ / వీధిలో నిలుచుండి కురులిప్పకమ్మా
పలుమారు పలుదెరచి నవ్వబోకమ్మా / పరమాత్మతో గూడి వెలుగు మామమ్మా"

అని అత్తవారింటికి తన కూతురును సాగనంపే సందర్భంలో ఒక తల్లి తన కూతురుకి సుబుద్ధులు చెబుతూ కన్నీటి పర్యంతమవుతుంది.

ముగింపు :

తరతరాల మన జీవన విధానానికి ప్రతిబింబంగా నిలిచింది. జానపద సాహిత్యం. జానపదం అంటే పల్లెటూరు, జనపదంలో జీవనం సాగించేవారు జాన పదులు. జానపదుల సంగీత, నాట్య, కళారూపాల ప్రదర్శనల యొక్క సమూహార రూపమే జానపద సాహిత్యం, జానపదులు ఉపయోగించే కథలు, సామేతలు, పొడుపుకథలు, జాతీయాలు, గేయాల ద్వారా జానపదం మౌఖిక ప్రచారంతో విసృతంగా వ్యాప్తి చెందింది. జానపద సాహిత్యం అంతా వారి కళలు, భాష, పండుగలు, విశ్వాసాలు, సంస్కృతి మొదలగు జానపదుల ఆచార వ్యవహారాలలో ఇమిడివుంది. జానపదులు వారి జీవితానుభవాలను, సుఖాలను దుఃఖాలను కూడా పాటల ద్వారా తెలియచేస్తారు. జానపద సాహిత్యంలో స్త్రీలకు సంబంధించిన అనేక సందర్భాల ఆధారంగా స్త్రీల

పాటలు వ్యాప్తి చెందాయి. మన తెలుగు సంస్కృతికి జీవనాడిగా వున్నటువంటి జానపద పాటలలో స్త్రీల పాటలు ప్రధానమైనవి. అటువంటి స్త్రీల పాటలు ప్రస్తుత మన సమాజ పరిస్థితులలో కనుమరుగయ్యే పరిస్థితి ఏర్పడింది. సాంకేతికరణ, ప్రపంచీకరణ నేపథ్యంలో కనుమరుగవుతున్న స్త్రీల పాటలను, వాటి ప్రాధాన్యతను తెలియచేసే ప్రయత్నమే ఈ వ్యాసం యొక్క ఉద్దేశ్యం.

స్త్రీ తన అస్థిత్వాన్ని, వ్యక్తిత్వాన్ని నిలుపుకునే క్రమంలో మహబూబ్‌నగర్‌జిల్లా కవులు, కళాకారులు స్త్రీల గేయాల ద్వారా చైతన్యాన్ని తీసుకువచ్చారు.

ఆధార గ్రంథాలు:

1. తెలుగు జానపద విజ్ఞానం సమాజం-సంస్కృతి సాహిత్యం, 2000, పొట్టి శ్రీ రాములు విశ్వవిద్యాలయం హైదరాబాద్.
2. కసిరెడ్డి ఆచార్య, పాలమూరుజిల్లా జానపద గేయాలు
3. పద్మలత, బంజార గేయాలు, తెలుగు శాఖ, 2000. హైదరాబాదు కేంద్రీయ విశ్వవిద్యాలయం,
4. మహబూబ్ నగర్ జిల్లా గిరిజనుల జానపదగేయాలు -విమర్శనాత్మక వ్యాసం నవ తెలంగాణ.
5. మోహన్.జి.యస్, జానపద విజ్ఞాన వ్యాసావళి, శ్రీనివాసా పబ్లికేషన్స్, మలయనూరు,1981.
6. రామరాజు బిరుదురాజు ఆచార్య, తెలుగు జానపద గేయ సాహిత్యము, 1958
7. వసుంధరారెడ్డి చింతపల్లి. తెలుగు జానపద సాహిత్యము-స్త్రీల గేయములలో సంప్రదాయము

★★★

Vol. 23 | Spl. Issue 03 | March 2026 | BHAVAVEENA | ISSN No. : 2456-4702 | RNI No. APTEL/2003/12253

RNI No. APTEL/2003/12253 | Reffered Journal & Peer Reviewed Journals | ISSN No. 2456-4702

భావవీణ

కళలు, సాహిత్య, సాంస్కృతిక భాషాధ్యయన పత్రిక

BHAVA VEENA

Journal of Arts, Literary, Culture & Language Study

"క్రైస్తవ మిషనరీలచే మహిళాభ్యుదయం"

– డా॥. మరపట్ల రాజు

అసిస్టెంట్ ప్రొఫెసర్, మద్రాసు క్రైస్తవ కళాశాల, తాంబరం, చెన్నై.

పరిచయం :

భారతదేశం ఆనాటి నుండి ఈనాటి వరకూ ఆపదలో ఉన్న వారిని ఆదుకొని, కష్టాలలో ఉన్నవారికి సహాయం చేసే సంస్కృతిని కలిగి ఉన్న దేశం . మన భారతదేశం భిన్న సంస్కృతులను, భిన్న ఆచారాలను, అలవాట్లను తనలో కలుపుకుంటూ, అనేక మతాలు, అనేక జాతులు సమిష్టిగా కలిసి జీవించే ప్రాంతం. ఇక్కడ ఉన్న అన్ని మతాలు అనాధలను ఆదుకోవటంలో, లేనివారికి సహాయం చెయ్యడంలో ప్రధాన ప్రాతను పోషిస్తున్నాయి. "మానవ సేవే మాధవ సేవ" అనే మాటకు అనుగుణంగా భారతీయులు జీవిస్తున్నారు. అదే మాదిరిగా క్రైస్తవ మతానికి చెందిన మిషనరీలు కూడా సామాజిక సేవలకు అత్యంత ప్రాధాన్యతను ఇచ్చారు. ఈ క్రైస్తవ మిషనరీలు పాశ్చాత్య దేశాల నుండి మన దేశంలోని ఆయా ప్రదేశాలకు వచ్చి ఎటువంటి ఫలితం ఆశించకుండా స్వచ్ఛందంగా సమాజసేవ చేయటాన్ని మనం చూడవచ్చు. ఈ విధంగా వచ్చిన క్రైస్తవ మిషనరీలు ప్రజల జీవనాభివృద్ధికై కృషి చేస్తూనే, వెనుకబడిన మరియు పేద బహుజనులను ఆధ్యాత్మిక చింతనవైపు నడిపారు. ప్రాచీన కాలం మొదలుకొని ఆధునిక కాలం వరకు దేవాలయ ప్రవేశం లేని శూద్రులకు దగ్గరలో దేవాలయాలను నిర్మించి ఆహ్వానించడం మనం చరిత్రలో చూడవచ్చు

క్రైస్తవ మతంలో సర్వమానవ సమానత్వం, సౌభ్రాతృత్వం, ప్రజాసేవ, జాలి, దయ, కరుణ మొదలైన భావాలను కలిగి మిషనరీలు ప్రజల మధ్య పనిచేశారు. నిత్య అవసరాలను తీర్చుకోలేని ప్రజలకు చేయూతనిచ్చారు. వారి జీవనాభివృద్ధికి అనేక ఉపాధి అవకాశాలు కల్పించారు. భారతీయ మహిళలు తమ కుటుంబాలను పోషించుకొనే విధంగా వివిధ వృత్తులను నేర్పిన వారు మిషనరీలని చెప్పాలి. అంతే కాక శూద్ర స్త్రీలకు, దళితులకు సరైన నిండు వస్త్రధారణలేని ఈ సమాజంలో గొప్ప మార్పులు తెచ్చిన వారు మిషనరీలనే చెప్పాలి. అంతేకాకుండా అంటరానితనాన్ని వ్యతిరేఖించి, బాల్య వివాహాలు అరికట్టి, బాలికలను పురిటిలోనే చంపేసే సాంప్రదాయాన్ని మార్చినవారు క్రైస్తవ మిషనరీలు. అభం, శుభం తెలియని చిన్న పిల్లలను కాటికి కాళ్లు చాపే ముసలివాడికి ఇచ్చి పెళ్లి చేసే సాంప్రదాయాన్ని నిషేధించడంలో కృషి చేశారు. సతీసహగమనం పేరిట మహిళలను భర్త చితిలో వేసి కాల్చే సాంప్రదాయాన్ని కాలగర్భంలోనే కలిపేసిన ఘనత మిషనరీలకే దక్కుతుంది.

విషయ వివరణ :

మానవ సామాజిక వ్యవస్థలో మతం అనేది అత్యంత ప్రధానమైన, కీలకమైన అంశంగా చెప్పవచ్చు. పూర్వం

నుండి భారతదేశం అనేక భాషలకు, అనేక మతాలకు, అనేక ఆచారాలకు పుట్టినిల్లుగా ఉంది. ఏ జాతి చరిత్రను మనం చూసినా ఆ జాతి జీవన పయనంలో మతానికి ప్రత్యేక స్థానం ఉంది. హిందూమతం, బైద్ధమతం, జైనమతం, ముస్లిం మతం, సిక్కు మతం, క్రైస్తవ మతం ఇలా ఎన్నో మతాల మేళవింపే మన భారతదేశం అని చెప్పాలి. అయితే రాజకీయ, సామాజిక, సాంఘీక రంగాలలో ఎక్కువ ప్రభావాన్ని చూపింది క్రైస్తవులే అని ఆచార్య కె.ఆనందన్ గారు తన గ్రంధంలో తెలియ జేసారు[1].

భారతదేశంలో క్రైస్తవ మతం మొట్టమొదటిసారిగా యేసుక్రీస్తు శిష్యుడైన అపోస్తులుడైన తోమా రాకతో ప్రారంభమైనది. తోమా గారు క్రీ॥శ॥ 52 సం॥రంలో పర్షియా దేశం నుండి సముద్ర మార్గం గుండా దక్షిణ భారతదేశంలోని మలబారు తీరంలో పెరియారు నది ముఖద్వారాన ఉన్న క్రాంగనూరు అనే ప్రదేశంలో మొట్ట మొదటిగా అడుగుపెట్టారు. అక్కడ కొంత కాలం నివసించి ఖాళీ, ఖాళియంకారు, శంకరపురి, పాకలో మట్టం అనే ఇంటి పేరు కల్గిన నాలుగు కుటుంబాలకు సువార్త ప్రకటించి వీరిని క్రైస్తవులుగా చేశారు. భారతదేశంలో మొట్టమొదటిగా క్రైస్తవ మతాన్ని స్వీకరించిన కుటుం బాలు వీరే అని చరిత్రాకారులు నిర్ధారించారు[2]. ఈ విధంగా మొదలైన క్రైస్తవ మతం 18,19,20 శతాబ్దాలు వచ్చే సరికి బాగా అభివృద్ధి చెందింది. అదే విధంగా మన ఆంధ్రదేశంలో కూడా అనేకమంది మిషనరీలు వచ్చి ఆయా సంస్థలను స్థాపించి, వివిధ కార్యక్రమాలు చేపట్టి ప్రజలను ఆకర్షింపజేసారు. ఆ విధంగా మన ప్రాంతాలకు వచ్చిన మిషనరీలు ఈ క్రింది పేర్కొన్న సంస్థలను మన ప్రాంతాలలో స్థాపింపజేసారు. అవి గోదావరి డెల్టా మిషన్, ఆంధ్ర ఇవాంజలికల్ లూథరన్ సంఘము, చర్చి మిషనరీ సొసైటి, రోమన్ కేథలిక్ మిషన్, కెనెడియన్ బాప్టిస్ట్ మిషన్, సాల్వేషన్ ఆర్మీ, సెవెంత్ డే ఎడ్వాంటిస్టు మిషన్, బ్రదరన్ మిషన్, లెమెన్స్ ఇవాంజిలికల్ ఫెలోషిప్, అమెరికన్ బాప్టిస్టు మిషన్, తెలుగు బాప్టిస్టు మిషన్, మెథడిస్ట్ మిషన్ ఇలా మొదలైన సంఘాలు స్థాపించి లక్షలాది మందికి సహాయం చేసి వారిని క్రైస్తవ మతంలోనికి ఆహ్వానించారు. అప్పటి వరకూ అద్వన్యంగా ఉన్న మహిళల స్థితిగతుల్లో గొప్ప మార్పులు తీసుకొచ్చి బహుజన, దళిత స్త్రీ జీవితాలలో గొప్ప వెలుగులు నింపిన ఘనత మిషనరీలకు దక్కుతుంది. పైగా చదువు విషయానికొస్తే చదువు మనిషిని జ్ఞానవంతునిగా చేస్తుంది. అలాంటి చదువులు ప్రాచీన కాలంలో అందరికి అందేవి కావు. బ్రహ్మణ, క్షత్రియ, వైశ్యులకు మాత్రమే చదువులుండేవి. శూద్రులకు కులవృత్తులనే కానీ ఎలాంటి విద్యలు అభ్యసించే వీలుండేది కాదు. 18,19వ శతాబ్దాలు వచ్చే సరికి ఆంగ్లేయ ప్రభుత్వం మన దేశంలో అధికారం సంపాదించుకోవటంలో దేశ పరిస్థితుల్లో గొప్ప మార్పులు సంభవించాయి. వారి వద్ద ఉద్యోగములు, వ్యాపారం చేయు నిమిత్తం మన దేశీయులు ఆంగ్ల విద్యను నేర్చుకొనక తప్పలేదు. క్రైస్తవ మత బోధకులు హిందూ దేశాలకు వచ్చి ఇక్కడి ప్రజలకు ఆంగ్ల బాషను నేర్చుతూ వచ్చారు. అట్టి వారిలో చెప్పుకోదగ్గ మిషనరీలు విలియం కేరి వార్డ, మార్షమన్, విలియం కేరి మొదలగు క్రైస్తవోత్తముల వలన మన దేశంలో విద్య విశేషముగా వ్యాపించింది. దీనిని ఉపయోగించుకొని పురుషులు విద్యావంతులైనారు.

ఇక స్త్రీ విద్యను గూర్చి చర్చించినచో పురాతన కాలము నుండి స్త్రీలను విద్య, ఉద్యోగములు, వ్యాపార విషయము వంటి వాటికి దూరంగా ఉంచేవారు. ఇంటిలో స్త్రీ, పురుషులు కూడా శ్రమించి కష్టపడినట్లయితే పరిస్థితులు అన్ని కూడా అనుకూలంగా ఉంటాయి. పైగా భార్యలు సంపాదిస్తే భర్తల మాట వినరు అనే మాట కూడా బహు ప్రచారంలో ఉన్నది. ఇలాంటి పరిస్థితుల్లో దేశం అభివృద్ధి చెందాలంటే స్త్రీ, పురుషులు కూడా సంపా దించాలని మనదేశ నిపుణులు, ఆంగ్లేయ ప్రభుత్వం ఆలోచించి స్త్రీలకు విద్య అవసరమని బోధింపసాగింది. అయినా 1850 కంటే ముందు విద్యాభివృద్ధి పొందిన స్త్రీలు చాలా తక్కువగా ఉన్నారు. స్త్రీలను విద్యా వంతులను చెయ్యాలనే ఉద్ధేశ్యంతో క్రైస్తవ మిషనరీలు, ఆంగ్లేయ ప్రభుత్వం వారు స్త్రీ విద్య గురించి విశేషముగా

పనిచేస్తారు[3]. పైగా దీనికి వీరు ఇంత కష్టపడి ధనాన్ని వ్యచ్చించినా కొంతమందే బాలికలు, ఎక్కువగా వితంతువులు ఈ విద్యను అభ్యసించారు. అదే విధంగా ఆయా ప్రాంతాలకు మిషనరీలుగా వచ్చి సువార్త ప్రకటిస్తూనే మన దేశంలో అనేక పాఠశాలలు నిర్మించారు. దానిలో కొన్నింటిని వివరించే ప్రయత్నం చేస్తాను. 1882 జనవరిలో రాజమండ్రి నందు శ్రీమతి స్మిత్ గారు హిందూ బాలికల పాఠశాల ప్రారంభించారు. దీనికి పి.వి.రత్నం గారు హెడ్మాస్టరుగా పనిచేశారు. శ్రీమతి స్మిత్ మరియు రత్నం గారు రాజమండ్రిలో వీధి వీధికి తిరిగి బాలికలను ఆహ్వానించేవారు. నలుగురితో మొదలైన ఈ పాఠశాల 60కి చేరింది. వీరికి ఉచితంగా విద్యను బోధించేవారు. దీనికి తోడు 1884లో శ్రీమతి ఆర్డ్మన్ రివర్డేల్ గారు ఈ పైన తెలిపిన పాఠశాలకు బాధ్యతలు స్వీకరించి పాఠశాలను చక్కగా నిర్వహిస్తూ వచ్చారు[4].

తరువాత రాజమండ్రిలోనే 1894లో మిస్ ఆగ్నేస్ ఐ.షాడే తన బోర్డింగ్ పాఠశాల స్థాపించింది. అది నేటికి కంబాల చెరువు పార్కు పక్కన మనం చూడవచ్చు. ఇది మొదట 13 మందితో మొదలైన పాఠశాల. టేలర్ బంగళాలో అద్దెకు నిర్వహించబడేది. దీనికి గాను 60 రూ॥లు నెలకి చెల్లించేవారు. తరువాత కలెక్టర్ బ్రాడి ద్వారా 1896 డిసెంబర్లో 4 ఎకరాల స్థలాన్ని సంపాదించుకున్నారు. వేలాది రూపాయలు ప్రభుత్వ గ్రాంటు రూపంలో తన కొంత స్నేహితుల ద్వారా విరాళంగా పొంది బాలికలకు పాఠశాల భవనాలు, హస్టల్ గదులను షాడే గారు నిర్మించారు. 1898 సం॥రంలో శంకుస్థాపన చేసిన పాఠశాలలో 1938 నాటికి 40 సం॥రాల ఉత్సవాలు జరుపుకున్నాయి. ఈ పాఠశాలలో విద్యతో పాటుగా వృత్తి శిక్షణలో కూడా ప్రాధాన్యతను ఇచ్చేవారు. కుట్లు, అల్లికలు మొదలైనవి నేర్పి మహిళల జీవితాలకు బాటలు వేసారు. రాజమండ్రియే కాక భీమవరం, శెట్టిపేట, పెద్దాపురం, నర్సాపురం, కాకినాడ, రామచంద్రపురం వంటి ప్రాంతాలలో గొప్ప పాఠశాలను నిర్మించి స్త్రీలకు ఉచిత విద్యను అందించారు.

అదే విధంగా సువార్తను ప్రజలకు అందించాలనే ఉద్దేశ్యంతో ప్రజలకు చేరువగా అవ్వటానికి చదువుతో పాటుగా ప్రజా ఆరోగ్య దృష్ట్యా మిషనరీలు తమ పనులు ఆరంభించారు. కలరా, మలేరియా, క్షయ, తట్టు, కుష్టు, రేబిస్ లాంటి రోగాలు ఎక్కువగా ఉన్న రోజుల్లో మిషనరీ వైద్యులు ప్రజలకు వైద్యం ఉచితంగా అందించారు. పురుష మిషనరీలను భారతీయులు నిరాకరించటంతో మహిళా వైద్య మిషనరీల అవసరం ఏర్పడగా మొట్ట మొదటిగా జనానా మిషనరీగా కూపర్ గారు వారణాసి ప్రాంతానికి 1867లో వచ్చి మిషన్ కేంద్రమును స్థాపించారు[5]. అదే విధంగా మెథడిస్టు సంఘానికి చెందిన క్లారా స్వెయిన్ 1870 సం.రంలో మన దేశంలో వైద్య సేవలు ప్రారంభించింది. స్థానిక స్త్రీలను, అనాధ శరణాలయాలలో ఉన్న స్త్రీలను వైద్య సహాయులుగా తీర్చి దిద్దింది. 1883 సం.రంలో లూథరన్ మిషన్కు చెందిన డాక్టర్ అన్నా శారా క్లూగర్ స్త్రీలకు ఏ మాత్రం వైద్య సదుపాయాలు లేని రోజులలో గుంటూరు ప్రాంతానికి వచ్చి వైద్యశాలను నిర్మింపజేసి ఎనలేని సేవలను అందించింది[6]. ఇలా చెప్తూ ఉంటే అనేక ప్రాంతాలలో వైద్యశాలలు, శానిటోరియం, విధవరాండ్లకు హస్టల్లు ఇలా ఎన్నో సేవలు చేశారు. క్రైస్తవ మత ప్రచారం మాట ఎట్లవున్నా విదేశీ మిషనరీలు విద్య, వైద్య రంగాల్లో గొప్ప సేవలను అందించారు.

సనాతన సాంప్రదాయంలో శిశుహత్యలు, బాల్య వివాహాలు, దేవదాసి వ్యవస్థలు ఇలా ఎన్నో మనం మన చరిత్రలో చూడవచ్చు. బాల్య వివాహాల మాటకొస్తే 5 నుండి 15 సం.రాల వయస్సు గల అమ్మాయిని పండు ముసలివాడికిచ్చి వివాహం చేసే వ్యవస్థను మన దేశంలో ప్రాచీన కాలంలో చూడవచ్చు. అంతేకాక అప్పట్లో సమాజానికి స్త్రీ అంటే చులకన, స్త్రీ పుట్టి పెరగటమే గొప్ప విషయంగా చెప్పవచ్చు. మంచి చెడు తెలియని వయస్సులో ఆ పనిబిడ్డలకు వివాహం చేస్తే వారు శారీరకంగా, మానసికంగా అనేక బాధలు భరిస్తూ అడుకొనే వయస్సులో గొడ్డుల్లా కష్టపడేవారు. స్త్రీల పరిస్థితి చాలా దయనీయంగా ఉండేది. అదే విధంగా ఆడ శిశువు పుట్టినట్లయితే ఆ శిశువు యొక్క పీక నులిమి లేదా వండ్ల

గింజలు వేసి లెక్కలేనన్ని ప్రాణాలను తీసారు. అలాంటి పరిస్థితుల మధ్య క్రైస్తవ మిషనరీలు మన ప్రాంతాలకు వచ్చి జరుగుచున్న అన్యాయాన్ని చూసి తట్టుకోలేక పోయారు దీనిని ఆంగ్లేయ ప్రభుత్వం దృష్టికి తీసుకొని వెళ్ళారు. జేమ్స్ పేగ్స్ అనే బాప్టిస్టు మిషనరీ పసిపిల్లలను చంపడమనే ఈ క్రూరమైన సాంప్రదాయాన్ని తక్షణమే అరికట్టే విధంగా చర్యలు తీసుకోమని బ్రిటీష్ ప్రభుత్వానికి తాకీదు రాస్తూ ఫిర్యాదు చేశారు[7].

మతం పేరుతో జరిగే మరో భక్తి పూర్వకమైన అనైతిక ఆధ్యాత్మిక వ్యవస్థ దేవదాసి వ్యవస్థ. ప్రాచీన కాలంలో పెళ్ళి కాని కన్యలను దేవాలయాలకు సేవాకొరకై మొక్కు బడులుగా సమర్పించేవారు. వీరు నాట్యగత్తెలుగా ఉంటూ దేవాలయం ఆదాయంచే లేదా రాజులచే పోషించబడేవారు. వీరిని ''దేవాలయ కాంతలని'' పిలిచేవారు. 1881 సం.రంలో వేయబడిన లెక్కల ప్రకారం ఒక్క మద్రాసు ప్రెసిడెన్సీలో 11,573 మంది దేవదాసీలు ఉన్నారు[8]. తరువాత వీరు వ్యభిచారులుగా దిగజారి పోయారని చరిత్ర చెబుతుంది. క్రైస్తవ ఉపాధ్యాయులు అలాంటి తరుణంలో బొంబాయిలో వేశ్యవృత్తిని నివారిస్తూ శిక్షాస్మృతిలో 294 సెక్షన్‌ను మార్పు చేయమని అప్పటి గవర్నరుగారైన రే అను ప్రభువును వేడుకొనగా అది అంతగా ఫలించలేదు. 1886వ సం.రంలో కలకత్తాలోని క్రైస్తవ సమాజము వారు వేశ్య గృహాలలోని కొన్ని దురాచారాలను అపుటకు అప్పటి గవర్నర్ లార్డ్ డఫరిన్‌కు ఒక విజ్ఞాపన చేయగా ఆయన పోలీసు యాక్టులలో కొన్ని మార్పులు తెచ్చి వేశ్యవృత్తి నివారణకు కృషిచేశారు[9].

భారతదేశంలో మహిళలకు ఆచారం పేరుతో జరిగిన మరో దురాచారం సతీసహగమనం 1828 సం.రంలో విలియం బెంటిక్ అను ప్రభువు మన దేశంలో సతీ సహగమనం అనే ఆచారాన్ని చూసి అన్యాయంగా భర్త శవాలతో కలిపి బ్రతికిన స్త్రీలను మంటలలో వేసి, గోతులలో పూడ్చి చంపుతున్నారని తలచి దీనిని రూపు మాపటానికి ప్రయత్నించెను. అదే విధంగా మొట్ట మొదటిగా సిరంపూర్‌లో విలియం కేరీ, మార్షమన్, వార్డ్ అనే క్రైస్తవ మిషనరీలు ఈ దురాచారానికి వ్యతిరేకంగా అనేక ప్రయత్నాలు చేశారు. 1804 సం.రంలో ఈ విషయములను గూర్చి తెలుసుకొనుటకై కలకత్తా చుట్టు ప్రక్కల 30 మైళ్ళ దూరం ప్రయాణించుటకు వీరు జీతములిచ్చి 10 మందిని పనిలో పెట్టుకున్నారు. ఈ దురాచారాన్ని నివారించే చర్యలు తీసుకోమని భగవంతుడు మిషనరీలకు తోడుగా ఉన్నాడని తలచి ఆంగ్లేయ ప్రభుత్వానికి లేఖ వ్రాశారు[10]. దీనికి తోడు వీరికి రాజారామ్మోహన్‌రాయ్ కూడా ఈ సతీసహగమనం విషయంలలో గొప్పగా పోరాడి సంఘసంస్కర్తగా పేరు ప్రఖ్యాతలు పొందారు అంతేకాక అగ్రవర్ణాలు ద్వారా అనేక సంమస్యలను ఎదుర్కోవలసి వచ్చింది.

పైన తెల్పిన విషయాలే కాక స్త్రీలకు వృత్తులను కల్పించడంలో మిషనరీలు గొప్పగా పనిచేశారు. ఆర్థికంగా వెనుకబడిన వారికి కుట్లు, అల్లికలు, తీవాచీలు, లేస్ పరిశ్రమలు మొదలైన ఏర్పాటు చేసి పనులు కల్పించారు. దమ్ముగూడెం, ఖమ్మం ప్రాంతాలలో మిస్.సి.వాలెట్, మిస్.డి.జె గార్లిక్ కుట్లు అల్లికలు పాఠశాలను ఏర్పాటు చేసి నిర్వహించారు. అదే విధంగా నర్సాపురంలో గోదావరి డెల్టా మిషనరీలు లేస్ ఫ్యాక్టరీని నిర్మించి మహిళలకు వృత్తులలో శిక్షణ ఇచ్చి పనులు కల్పించారు ఇప్పటికి ఆ ప్రాంతాలలో దానినే జీవనాభివృత్తిగా చేసుకొని పనిచేస్తున్న మహిళలను మనం చూడవచ్చు. మనం గోదావరి జిల్లాల్లో పాలకొల్లు, నర్సాపురం, దమ్ముగూడెం ప్రాంతాలలో స్త్రీల ద్వారా తయారైన సరుకులు విదేశాలలో గొప్పగా అమ్ముడుపోయేవి. ఈ ప్రాంతాలు ప్రపంచ విఖ్యాతి చెందాయని సత్యనారాయణ శర్మ గారు విజ్ఞాన యాత్ర కుటీర పరిశ్రమలు అనే గ్రంధంలో వ్రాశారు. ఈ విధంగా ఆయా ప్రాంతాలలో వందలాది పాఠశాలలు బాలికల కోసం ఏర్పాటు చేసి చదువు నేర్పుతూనే వాటితో పాటు ఆయా వృత్తులలో కూడా శిక్షణను ఇచ్చి మహిళలు తను కుటుంబాలను పోషించే విధంగా కృషి చేసిన వారు క్రైస్తవ మిషనరీలనే చెప్పాలి.

ముగింపు :

పైన తెల్పిన విధంగా క్రైస్తవ మిషనరీలు సంఘ సువార్త కార్యక్రమాలే కాక, సమాజంలో ఉన్న సమస్యల పట్ల గొప్ప ఉద్యమాలను లేవనెత్తారు. సతీసహగమనం,

అంటరానితనం, బాల్య వివాహాలు, దేవదాసీ వ్యవస్థ, నరబలులు, శిశు హత్యలు మొదలైన దురాచారాలకు వ్యతిరేఖంగా పోరాడి వాటి నివారణలో ప్రముఖ పాత్రను పోషించారు. వాటి నివారణకు ముందుండి పనిచేసిన ఘనులు మిషనరీలుగా చెప్పవచ్చు. స్త్రీ అభ్యున్నతి కోసం కష్టించి పనిచేసి స్త్రీల జీవితాలలో గొప్ప శోభను తీసుకు వచ్చిన ఘనత క్రైస్తవ మిషనరీలకు దక్కుతుంది. వంటింటికే పరిమితమైన స్త్రీల జీవితాలను సమాజానికి సేవ చేసే విధంగా మార్పులను తీసుకువచ్చారు. ప్రాణాలను గుప్పిట్లో పెట్టుకొని బ్రతికే స్త్రీ సమాజాన్ని ప్రాణాలు పోసే స్థాయికి ఎదిగేలా చేసారు. తరువాత కాలంలో మహిళలే తమ కుటుంబాలకు వెన్నెముకగా తయారైనారు.

పాద సూచికలు :

1. వేదాంత రసాయనం - సవిమర్శక పరిశీలన, ఆచార్య కొళ్ళాగుంట ఆనందన్, పుట - 1
2. దళిత కవిత్వంలో హిందూ, బౌద్ధ, క్రైస్తవ మత ప్రతీకలు, డా.వూటుకూరి వరప్రసాద్, పుటసంఖ్య -169
3. పందొమ్మిదవ శతాబ్దపు హిందూ సంఘసంస్కార చరిత్రము, రాజగోపాలరావు టేకుమళ్ళ పుటసంఖ్య -89
4. ఆంధ్ర ఇవాంజిలికల్ లూథరన్ సంఘము ఓ సంక్షిప్త చరిత్ర, డా॥ కొల్లూరి లూథర్ రీచర్డ్‌సన్, పుటసంఖ్య-168
5. ఉభయ గోదావరి జిల్లాల్లోని ప్రముఖ క్రైస్తవ సంఘాలు - సాహిత్య,సామాజిక సేవలు, డా.మరపట్ల రాజు, పుటసంఖ్య - 180
6. తెలుగు సాహిత్యానికి క్రైస్తవుల సేవ - డా॥ గుజ్జర్లమూడి కృపాచారి , పుట సంఖ్య - 39
7. ఆధునిక భారతదేశ నిర్మాణంలో క్రైస్తవ మిషనరీల పాత్ర - పురిటిగడ్డ సురేష్‌బాబు, పుట సంఖ్య -109
8. ఆధునిక భారతదేశ నిర్మాణంలో క్రైస్తవ మిషనరీల పాత్ర - పురిటిగడ్డ సురేష్‌బాబు, పుట సంఖ్య -138
9. పందొమ్మిదవ శతాబ్దపు హిందూ సంఘసంస్కార చరిత్రము, రాజగోపాలరావు టేకుమళ్ళ, పుటసంఖ్య -61
10. పందొమ్మిదవ శతాబ్దపు హిందూ సంఘసంస్కార చరిత్రము, రాజగోపాలరావు టేకుమళ్ళ, పుటసంఖ్య -10

ఆధార గ్రంధాలు :

1. ఆధునిక భారతదేశ నిర్మాణంలో క్రైస్తవ మిషనరీల పాత్ర, పురిటిగడ్డ సురేష్‌బాబు, సిక్కోలు బుక్ ట్రస్ట్, టెక్కలి-2020
2. ఆంధ్ర ఇవాంజిలికల్ లూథరన్ సంఘము ఓ సంక్షిప్త చరిత్ర, డా.కొల్లూరి లూథర్ రిచర్డ్‌సన్ - ప్రభోద బుక్ సెంటర్, గుంటూరు - జనవరి 2019.
3. ఉభయ గోదావరి జిల్లాల్లోని ప్రముఖ క్రైస్తవ సంఘాలు - సాహిత్య, సామాజిక సేవలు, మరపట్ల రాజు, మద్రాసు విశ్వవిద్యాలయానికి సమర్పించిన సిద్ధాంత గ్రంధము- జూలై 2024
4. తెలుగు సాహిత్యానికి క్రైస్తవుల సేవ, డా.గుజ్జర్లమూడి కృపాచారి, ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయానికి సమర్పించిన సిద్ధాంత గ్రంథము 1988
5. దళిత కవిత్వంలో హిందూ, బౌద్ధ, క్రైస్తవ మత ప్రతీకలు, డా.వూటుకూరి వరప్రసాద్, అనూష పబ్లికేషన్స్, కొయ్యలగూడెం 2012.
6. పందొమ్మిదవ శతాబ్దపు హిందూ సంఘసంస్కార చరిత్రము, రాజగోపాలరావు, టేకుమళ్ళ - శ్రీ చింతామణి ముద్రాక్షరశాల, చెన్నపురి 1901
7. వేదాంత రసాయనం -సవిమర్శక పరిశీలన - డా॥ కొళ్లాగుంట ఆనందన్, లావణ్య శిల్పా పబ్లికేషన్స్, తిరుపతి 1992.

★★★

Vol. 23 | Spl. Issue 03 | March 2026 | BHAVAVEENA | ISSN No. : 2456-4702 | RNI No. APTEL/2003/12253

RNI No. APTEL/2003/12253 | Reffered Journal & Peer Reviewed Journals | ISSN No. 2456-4702

భావవీణ

కళలు, సాహిత్య, సాంస్కృతిక భాషాధ్యయన పత్రిక

BHAVA VEENA

Journal of Arts, Literary, Culture & Language Study

విశ్వనాథ నవలలు - మహిళా చైతన్యం

- డా॥. ఆతుకూరి వేంకటేశ్వర్లు (యోగి)

ఆంధ్రోపన్యాసకులు, ప్రభుత్వ కళాశాల (అటానమస్), రాజమహేంద్రవరం. తూ.గో.జిల్లా.

వ్యాస సంగ్రహం :

విశ్వనాథ సత్యనారాయణ గారు తెలుగు సాహిత్య జగత్తులో 'కవిసమ్రాట్ '. ఆయన నవలల్లో స్త్రీ పాత్రలు కేవలం రక్త మాంసాలతో కూడిన వ్యక్తులు మాత్రమే కాదు. వారు భారతీయ ధర్మం, సంస్కృతి, ఆచారాలకు, మారుతున్న కాలానికి ప్రతిబింబాలు. భారత దేశానికి బ్రిటీషు వారు వచ్చిన తరువాత మహిళల జీవన విధానంలో, ఆలోచనల్లో మార్పులు వచ్చాయి. ఈ మార్పులు భారతీయ జీవన విధానానికి పెద్ద ఆటంకంగా మారాయి. ఇలాంటి తిరస్కార తిరోగమన భావాలకు వ్యతిరేకులుగా విశ్వనాథ పాత్రలు మనకు కనిపిస్తాయి. వాటిని కూలంకషంగా పరిశీలించటమే ఈ వ్యాసం ఉద్దేశం.

కీలక పదాలు :

విశ్వనాథ సత్యనారాయణ, నవలలు, స్త్రీ చైతన్యం, భారతీయత.

పరిచయం :

విశ్వనాథ సత్యనారాయణ బహుముఖ ప్రజ్ఞాశాలి. ఆయన సుమారు 58 నవలలు రాశారు. ఆయన నవలల్లో స్త్రీ పాత్రలు అత్యంత వైవిధ్య భరితంగా ఉంటాయి. సంప్రదాయ బద్ధమైన గృహిణి నుండి ఆధునిక భావాలు గల విద్యావంతురాలి వరకు ఆయన కలం నుండి అద్భుతమైన పాత్రలు జాలువారాయి.

విశ్వనాథ వారు రచనలు చేసే కాలంలో మన దేశాన్ని బ్రిటీషు వారు పరిపాలిస్తూ ఉండేవారు. ఆంగ్ల విద్యా ప్రభావంతో భారతీయ యువత పాశ్చాత్య జీవన శైలిని, ఆలోచనలను అలవరచుకుంది. అందువల్ల మన స్వంత సంస్కృతి, భాషా, సంప్రదాయాలు కనుమరుగవుతాయనే ఆందోళన ఆ నాటి మేధావుల్లో ఉంది. ఇటువంటి ఆందోళన విశ్వనాథ వారిలోనూ కనిపిస్తుంది.

విశ్వనాథ వారు తమ వేయిపడగలు నవలలో ఈ రకంగా వచ్చే మార్పులను, దాని వల్ల కలిగే నైతిక పతనాన్ని నిశితంగా పరిశీలించారు. వారి నవలల్లోని మహిళా మూర్తులు ఈ మాటలే మాట్లాడతాయి. రాజకీయ స్వాతంత్ర్యంతో పాటు సాంస్కృతిక స్వాతంత్ర్యం కూడా ముఖ్యమని విశ్వనాథ భావించారు. అందుకే ఆయన స్త్రీ పాత్రల ద్వారా భారతీయతను, ధర్మాన్ని ప్రతిబింబింప చేసే ప్రయత్నం చేశారు. స్త్రీలు దేశానికి వెన్నెముక అని, వారు పాశ్చాత్య పోకడలకు లోనుకాకుండా స్వధర్మాన్ని కాపాడాలని వాంఛించారు.

దేశంలో ఉమ్మడి కుటుంబాలు విచ్ఛిన్నమైపోయి, వ్యష్టి కుటుంబాలు ఏర్పడుతున్న కాలం అది. కుటుంబ గౌరవం, ఆచార వ్యవహారాల పట్ల పట్టు సడలుతున్న

పరిస్థితిని ఆయన గమనించారు. స్త్రీ పురుష సంబంధాలలో వస్తున్న మార్పులను గమనించి, హద్దులు దాటటం వలన కలిగే సామాజిక అనర్థాలను ఆయన చర్చించారు.

అప్పుడే సమాజంలో సంఘ సంస్కరణ మొదలయ్యింది. సంస్కర్తల కృషి ఫలితంగా స్త్రీ విద్య, బాల్య వివాహాల రద్దు, వంటివి సమాజంలో చోటు చేసుకున్నాయి. విశ్వనాథ స్త్రీ విద్యను వ్యతిరేకించలేదు, కానీ ఆ విద్య 'సంస్కార వంతమైనది' గా ఉండాలని కోరుకున్నారు. కేవలం డిగ్రీలను ఇచ్చేదే కాకుండా, విద్య వివేకాన్ని పెంచేదిగా ఉండాలని ఆయన తన పాత్రల ద్వారా సూచన చేశారు.

యాంత్రిక నాగరికత ప్రవేశించడంతో గ్రామాల్లోని కులవృత్తులు, లలిత కళలు దెబ్బతిన్నాయి. వేయిపడగలు నవలలో దేవదాసీ వ్యవస్థలోని ఆధ్యాత్మిక కోణాన్ని, అది పతనమవుతున్న తీరును ఆవేదనతో చిత్రించారు. కళాకారులకు ఆదరణ కరువైన సామాజిక స్థితిని కళ్లకు కట్టినట్లు చూపించారు.

విశ్వనాథ వారి కాలం ఒకవైపు పురాతనం, మరోవైపు ఆధునిక వేగం మధ్య జరిగిన సంఘర్షణలో నిలిచింది. ఆయన స్త్రీ పాత్రలు ఈ రెండిటి మధ్య సమతుల్యతను వెతికే ప్రయత్నం చేశాయి. సంప్రదాయాన్ని రక్షిస్తూనే, మారుతున్న కాలానికి అనుగుణంగా స్త్రీలు తమ అస్థిత్వాన్ని ఎలా కాపాడుకోవాలో ఆయన తన రచనల ద్వారా చూపించారు. వాటిని సవివరంగా చూద్దాం.

విశ్వనాథ స్త్రీ పాత్రలు - మౌలిక సూత్రాలు :

విశ్వనాథ వారి దృష్టిలో స్త్రీ శక్తి స్వరూపిణి. ఆయన సృష్టించిన స్త్రీ పాత్రల్లో ప్రధానంగా మూడు లక్షణాలు కనిపిస్తాయి.

ధర్మ నిరతి :

ఏ కష్ట కాలంలోనైనా స్వధర్మాన్ని వీడకపోవటం.

వ్యక్తిత్వం :

పురుషుడికి లోబడి ఉండటం కంటే, తనకంటూ ఒక స్పష్టమైన అభిప్రాయాలని కలిగివుండటం. కుటుంబం కోసం, సమాజం కోసం తన సుఖాలను త్యాగం చేయటం.

విశ్వనాథ ప్రధాన నవలలు - స్త్రీ పాత్రల విశ్లేషణ:

ఏకవీర - ఉదాత్తమైన ప్రేమ, కర్తవ్యం:

ఈ నవలలో ఏకవీర, మీనాక్షి అనే రెండు ప్రధాన పాత్రలు కనిపిస్తాయి. ప్రేమించిన వ్యక్తిని కాక, మరొకరిని వివాహం చేసుకోవాల్సి వచ్చినప్పుడు ఆ స్త్రీలు పడే వేదనను విశ్వనాథ చాలా సున్నితంగా చిత్రించారు.

ఏకవీర పాత్ర ద్వారా "ప్రేమ మానసికమైనది, ధర్మం సామాజికమైనది" అనే అంశాన్ని ఆయన నిరూపించారు. ఆమె తన పతివ్రతా ధర్మాన్ని కాపాడుకుంటూనే తనలోని ఆవేదనను అవిష్కరిస్తుంది. ఏకవీర తన వ్యక్తిగత ఇష్టాల కంటే, ధర్మానికి ప్రాధాన్యతను ఇస్తుంది. ఆమె తన భర్తపట్ల చూపించే గౌరవం, విధేయత కేవలం బాధ్యత కాదు, అది ఆమె సంస్కారం. తన పూర్వ ప్రేమికుడు కుట్టాన్ ఇంటికి వచ్చినప్పుడు, ఆమె తన ప్రవర్తనలో ఎక్కడా హద్దులు దాటదు. తన హృదయంలోని ఆవేదనను అణచుకొని, ఒక గృహిణిగా ఆమె చూపే స్థితప్రజ్ఞత ఎంతో ఉన్నమైనది.

ఇదే నవలలోని మీనాక్షి తను ప్రేమించిన వ్యక్తినే పెండ్లి చేసుకుంటుంది. కానీ, అతని మనసు ఏకవీర మీద ఉండటం ఆమెను కుంగదీసింది. ఒక స్త్రీకి తన భర్త ప్రేమ దక్కనప్పుడు కలిగే ఒక శూన్యం మీనాక్షి పాత్రలో కనిపిస్తుంది.

విశ్వనాథ ఈ నవలలోని పాత్రలను కేవలం ప్రేమకథలోని పాత్రలుగా సృష్టించలేదు. వారు సామాజిక విలువలను కాపాడే కంచుకోటలు. ప్రేమ విఫలమైనా జీవితాన్ని ధర్మ బద్ధంగా గడపాలనే సందేశాన్ని విశ్వనాథ ఈ మహిళా మూర్తుల ద్వారా అందించారు.

వేయిపడగలు - సంస్కృతికి ప్రతిరూపాలు :

విశ్వనాథ వారి వేయిపడగలు నవల ఒక బృహత్ కావ్యం వంటిది. ఇందులోని స్త్రీ పాత్రలు కేవలం వ్యక్తులు మాత్రమే కాదు. భారతీయ ధర్మానికి, సంస్కృతికి ప్రతీకలు. చైనత్య స్వరూపాలు. ఈ నవలలోని ప్రధాన స్త్రీ పాత్రలను విశ్లేషిద్దాం.

అరుంధతి : ధర్మపత్ని - సంప్రదాయ గౌరవం:

వేయిపడగలు నవలలో అరుంధతి పాత్ర అత్యంత

ఉదాత్తమైనది. కథానాయకుడు ధర్మారావుకు భార్యగా, భారతీయ గృహిణికి ఆదర్శంగా నిలుస్తుంది. భర్త ఆశయాలను, ఆయన పాండిత్యాన్ని గౌరవిస్తూ, నిలిచే పాత్ర అరుంధతి. ఆమెలోనూ ఆధునికత ఉంది. అది సంస్కారంతో కూడి ఉంటుంది. కుటుంబానికి స్త్రీ ఎంత బలమైనదో విశ్వనాథ ఈ పాత్ర ద్వారా నిరూపించారు. ఆమె ఓర్పు, వివేకం ధర్మారావు జీవితానికే ఒక దిశను చూపించాయి. ధర్మారావు ధార్మిక జీవితానికి అరుంధతిలోని మహిళా చైతన్యమే దిశా నిర్దేశం చేసింది.

గిరిక : భక్తి - కళాతపస్వి :

గిరిక పాత్ర వేయిపడగలు నవలలో ఆధ్యాత్మిక శక్తికి ప్రతీక. వేణుగోపాల స్వామి పట్ల అనన్యమైన భక్తితో నృత్యం చేస్తుంది. సంగీతాన్ని నాట్యాన్ని ఒక ప్రదర్శనగా కాకుండా, ఒక ఆరాధనగా చేస్తుంది. గిరిక నిష్కామ యోగిని. ప్రాపంచిక సుఖాల పట్ల ఆసక్తి లేని, కేవల దైవ సన్నిధిని కోరుకునే పాత్ర. భారతీయ కళలు దైవత్వానికి ఎలా దారితీస్తాయో విశ్వనాథ అద్భుతంగా వివరించారు.

ఆనాటి సమాజంలో దేవదాసీల పట్ల ఉన్న అభిప్రాయానికి, దృష్టికి దూరంగా ఈమె ప్రవర్తన ఉంటుంది. ధర్మారావును అన్నా అని పిలిచి, వేణుగోపాలస్వామినే పతిగా, గతిగా ఆరాధిస్తుంది. ధనవంతులకు, గ్రామ పెద్దలుగా అహంకరించే వారికి లొంగకుండా, ధైర్యంగా నిలుస్తుంది. శరీరాన్ని కాకుండా ఆత్మను నమ్ముకుంటుంది. ఇది కూడా మహిళా చైతన్యమే.

ఈనవలలోని స్త్రీలు కేవలం కుటుంబానికే పరిమితం కాకుండా, తమ సంస్కృతిని, ధర్మాన్ని రక్షించే వారధులుగా కనిపిస్తారు.

చెలియలికట్ట - నైతిక విలువలకు నిలయం :

విశ్వనాథ వారి చెలియలికట్ట, మారుతున్న కాలంలో స్త్రీ పురుష సంబంధాలు, నైతిక హద్దులు ఎలా ఉండాలో చర్చిస్తుంది. ఇది ఒకరకంగా మనోవైజ్ఞానిక నవల. స్త్రీ పాత్రలు వాస్తవికతకు దగ్గరగా ఉంటాయి. ముఖ్యంగా ఈ నవలలో రత్నావళి, కనకమ్మ వంటి పాత్రల ద్వారా స్త్రీ మనస్తత్వాన్ని, సామాజిక కట్టుబాట్లను విశ్వనాథ విశ్లేషిస్తారు.

రత్నావళి :

ఈ నవలలో రత్నావళి ప్రధానమైన పాత్ర. ఆమె విద్యావంతురాలు. అందగత్తె. స్వతంత్ర భావాలు కలిగిన స్త్రీ. ఈమెలో ఆధునికతకు సంప్రదాయానికి మధ్య జరిగే సంఘర్షణ కనిపిస్తుంది. ఈమె తన మనస్సులోని కోరికలను, ఆలోచనలను నిర్భయంగా వ్యక్తం చేస్తుంది.

పాశ్చాత్య నాగరికత ప్రభావం వల్ల కలిగే స్వేచ్ఛా భావాలకు, భారతీయ కుటుంబ వ్యవస్థలోని కట్టుబాట్లకు మధ్య ఆమె చిక్కుకుపోతుంది. ఆమె ప్రవర్తన సమాజం విధించిన "చెలియలి కట్ట" దాటటం వలన కలిగే పరిణామాలను ఎలా ఎదుర్కుందో విశ్వనాథ వారు ఈ పాత్ర ద్వారా వివరించారు. రత్నావళి కేవలం అబల కాదు. ఆమెకు బలమైన వ్యక్తిత్వం ఉంది. తన జీవిత నిర్ణయాలతో ఆమె చూపే చొరవ అప్పట్లో ఒక సంచలనం.

కనకమ్మ - సంప్రదాయ స్త్రీకి ప్రతీక :

రత్నావళికి భిన్నంగా కనిపించే పాత్ర కనకమ్మది. ఆమె భారతీయ గృహిణికి సంప్రదాయానికి నిలువుటద్దం. కుటుంబ గౌరవం కోసం, భర్త సంక్షేమం కోసం తన వ్యక్తిగత ఇష్టాయిష్టాలను పక్కన పెట్టే గుణం ఆమెలో కనిపిస్తుంది. మారుతున్న కాలంలోనూ తన విలువలపై స్థిరంగా నిలబడే పాత్ర కనకమ్మది.

విశ్వనాథ - ఆధునికత - సంప్రదాయం :

విశ్వనాథ స్త్రీలు కేవలం వంటింటికే పరిమితం కాలేదు. కల్పవృక్షం వంటి రచనలలో, సామాజిక నవలల్లోనూ ఆయన స్త్రీ విద్యా ప్రాముఖ్యతను గుర్తించారు. అయితే, ఆ విద్య సంస్కారంతో కూడి ఉండాలని ఆయన ఆకాంక్షించారు. పాశ్చాత్య నాగరికతా ప్రభావంతో స్త్రీలు తమ మూలాలను మర్చిపోకూడదనే హెచ్చరిక ఆయన తన పాత్రల ద్వారా చేశారు.

భారతీయ కుటుంబ వ్యవస్థకు మూల స్థంభం స్త్రీ. ఆమె భారతీయ ధర్మ స్వరూపిణి. విశ్వనాథ కోరిన మహిళా చైతన్యాన్ని ఇలా విశ్లేషించవచ్చు.

ధర్మ బద్ధమైన జీవనం:

విశ్వనాథ దృష్టిలో స్త్రీకి అత్యంత ప్రధానమైనది ధర్మం. అది సామాజిక ధర్మం. ఉదాహరణకు ఏకవీర నవలలో

ఏకవీర తన మనసులోని ప్రేమను అణచుకొని, వివాహానంతరం తన ధర్మాన్ని కాపాడుకుంటుంది.

సంస్కారవంతమైన విద్య:

విశ్వనాథ స్త్రీ విద్యను వ్యతిరేకించలేదు. కానీ, విద్య పాశ్చాత్య పోకడలతో నిండి ఉండకూడదని భావించారు. చదువుకున్న స్త్రీ తన మూలాలను సంప్రదాయాలను మరచిపోకూడని కోరారు. చెలియలికట్ట నవలలో రత్నావళి పాత్ర ద్వారా విద్య అహంకాన్ని పెంచకూడదని, అది వివేకాన్ని, పశ్చాత్తాపాన్ని కలిగించేదిగా ఉండాలని సూచించారు.

శక్తి స్వరూపిణి :

వీరి స్త్రీ పాత్రలు బలాలు కారు. వారు మానసికంగా చాలా దృఢంగా ఉంటారు. కష్టకాలంలో భర్తకు దిశా నిర్దేశం చేసే శక్తిగా ఉండాలని ఆయన కోరారు. వేయి పడగలు నవలలో అరుంధతి పాత్ర ధర్మారావుకు అండగా నిలుస్తూ,సంప్రదాయ రక్షణలో కీలక పాత్ర పోషిస్తుంది.

కళా హృదయం - భక్తి :

మహిళలకు లలిత కళల పట్ల అవగాహన ఉండాలని, అవి మన సంప్రదాయాన్ని బలపరిచేవిగా ఉండాలని ఆయన కోరారు. వేయిపడగలులోని గిరిక కళను ఆత్మశుద్ధి కోసం అభ్యాసం చేస్తుంది.

హద్దులు దాటని ప్రవర్తన:

సముద్రం తన హద్దును ఎలాగైతే దాటదో, స్త్రీ కూడా సామాజిక నైతిక హద్దులను దాట కూడదని ఆయన గట్టిగా నమ్మారు. స్వేచ అంటే విచ్చలవిడితనం కాదని, అది బాధ్యతాయుతమైనదని ఆయన అభిప్రాయం.

ముగింపు :

విశ్వనాథ దృష్టిలో ఆదర్శవంతమైన స్త్రీ అంటే, శారీరకంగా, మానసికంగా, ఆత్మపరంగా దృఢమైన వారు. శ్రమకు ఓర్చుకొని ఇంటిని చక్కపెడతారు. ధర్మం పట్ల అచంచలమైన విశ్వాసం కలిగిన మనస్సు వారికి ఉంటుంది. ఆత్మ సంస్కారం వారికి ఎక్కువ. సామాజిక విలువలను కాపాడే చైతన్య మూర్తులు విశ్వనాథ స్త్రీ పాత్రలు. మహిళా పాత్రలు కేవలం కల్పితమైనవే ఐనప్పటికీ, భారతీయ సంస్కృతికి నజీవ చైతన్య స్వరూపాలుగా నిలుస్తాయి.

ఆధార గ్రంథాలు :

1. సత్యనారాయణ, విశ్వనాథ. ఏకవీర. శ్రీ విశ్వనాథ పబ్లికేషన్స్, విజయవాడ - 2013.
2. సత్యనారాయణ, విశ్వనాథ. చెలియలికట్ట. శ్రీ విశ్వనాథ పబ్లికేషన్స్, విజయవాడ - 2013.
3. సత్యనారాయణ, విశ్వనాథ. వేయిపడగలు. శ్రీ విశ్వనాథ పబ్లికేషన్స్, విజయవాడ - 2013.
4. సుప్రసన్నాచార్య, కోవెల. విశ్వనాథ మార్గము. శ్రీవాణి ప్రచురణలు, వరంగల్ - 1992.
5. సుబ్రహ్మణ్యం, జి.వి. విశ్వనాథ నవ్య సంప్రదాయం. యువభారతి, హైదరాబాద్ - 1995.

★★★

Vol. 23 | Spl. Issue 03 | March 2026 | BHAVAVEENA | ISSN No. : 2456-4702 | RNI No. APTEL/2003/12253

RNI No. APTEL/2003/12253 | Reffered Journal & Peer Reviewed Journals | ISSN No. 2456-4702

భావవీణ

కళలు, సాహిత్య, సాంస్కృతిక భాషాధ్యయన పత్రిక

BHAVA VEENA

Journal of Arts, Literary, Culture & Language Study

కొండేపూడి నిర్మల కవిత్వంలో మహిళా చైతన్యం

– డా॥. గుండ్లూరు వెంకటరమణ

తెలుగు శాఖాధ్యక్షులు, శ్రీ చింతలపాటి వరప్రసాద మూర్తి రాజు ప్రభుత్వ డిగ్రీ కళాశాల, గణపవరం పశ్చిమ గోదావరి జిల్లా, ఆంధ్ర ప్రదేశ్.

శీర్షిక పరిచయం :

నీలి మేఘాలు అనే కవితా సంపుటిలో కొండేపూడి నిర్మల గారు రాసిన కవితల్ని పరిశీలించి అధ్యయనం చేసి సమాజాన్ని ఆమె చైతన్యపరిచిన విధానాన్ని తెలపడమే ఈ వ్యాసం యొక్క ముఖ్య ఉద్దేశం.

కొండేపూడి నిర్మల పరిచయం

కొండేపూడి నిర్మల ఆధునిక తెలుగు సాహిత్యంలో ప్రముఖ రచయిత్రి, కవయిత్రి. ఆమె కవితలు సమాజంలోని సమస్యలు, మహిళల భావాలు, జీవన సత్యాలు వంటి అంశాలను ప్రతిబింబిస్తాయి. సులభమైన భాషలో లోతైన భావాలను వ్యక్తపరచడం ఆమె రచనల ప్రత్యేకత.

కొండేపూడి నిర్మల ఆంధ్రప్రదేశ్‌లో జన్మించారు. చిన్నప్పటి నుంచే సాహిత్యం పట్ల ఆసక్తి పెంపొందించుకుని కవితలు, వ్యాసాలు రాయడం ప్రారంభించారు. ఆమె విద్యా కాలంలోనే రచనలకు మంచి గుర్తింపు వచ్చింది.కొండేపూడి నిర్మల ప్రధానంగా కవితలు, కథలు, వ్యాసాలు రచించారు.

అనంత నీలాకాశంలో
తమ బరువంతా లోలోపల దాచి
హాయిగా ఆహ్లాదంగా తేలికగా
మరో పనేదీ లేదన్నట్లు కనిపిస్తూ
విహారం చేసే నీలి మేఘాలు
చూస్తూ చూస్తూ వుండగానే
గాఢమై దట్టమై భీకరమై
జలరూపమై ధారాపాతమై
భూమిని చేరి
జలవంతం ఫలవంతం చేస్తాయి
ప్రజలకు ప్రాణాధారాలౌతాయి !""

ఈ వాక్యాలు నీలి మేఘాలనే పుస్తకం వెనక అట్ట మీద ఉన్నవి. దీన్ని చదివితే ఓ వింతైనటువంటి విధానంలో నీలి మేఘాల పుస్తకమ్ తనను తాను పరిచయం చేసుకున్నట్లుగా అనిపిస్తుంది. ఏ కాస్త కోస్తా తెలుగు సాహిత్యం పరిచయం ఉన్నవారికి నీలి మేఘాల పుస్తకం గురించి కొత్తగా చెప్పక్కర్లేదనిపిస్తుంది స్త్రీవాద సాహిత్య ఉద్యమంలో ఇదొక సంచలనం, ఓ మెరుపు , ఓ కొసమెరుపును. ఈ నీలి మేఘాలోనే కవితా సంపుటిలో కొండేపూడి నిర్మల గారు రాసిన కవితల్ని విశ్లేషించి తద్వారా మహిళా చైతన్యానికి ఆవిడ సాహిత్యం ద్వారా ఎంత కృషి చేశారో తెలపడమే ఈ వ్యాసం యొక్క ముఖ్య ఉద్దేశం.

కొండేపూడి నిర్మల కవిత్వం విశ్లేషణ :

హృదయానికి బహువచనం: హృదయానికి బహువచనం అనే కవితలో నిర్మల గారు స్త్రీత్వం యొక్క గొప్పతనాన్ని, ఆడపిల్ల వయసుకు వస్తున్న సమయంలో

తన శరీరంలో జరిగే మార్పులను గురించిప్రస్థావించారు. మరీ ముఖ్యంగా హృదయానికి ఇటు అటు ఉన్న మాతృత్వ సంకేతమైన వక్షోజాలు ఆయాకాలాల్లో అవి ఎలా పుడతాయో, ఎలా పరిణమిస్తాయో, పరిణయించి అమృతనం కోసం ఎలా ప్రాకులాడుతాయో, అలాగే శరీరం కృషించి పోయినప్పుడు తేలిపోయిన నరాలు ఎలా అవహేళన చేస్తాయో ఎలా చిక్కి జీవితాన్ని బాధిస్తాయో అద్భుతమైన పద్ధతిలో చెప్పారు .హృదయానికి బహువచనం నిర్వచనం ఎలా ఉంటుందో ఈ కింది కవితా వాక్యాలలో గమనించవచ్చు

మరీ అంత హఠాత్తుగా కాదు గానీ
చాప కింద నీరు - పన్నెండేళ్ళ వయసు
చెప్పకుండానే వస్తాయి
శరీరం పొడుగెక్కి, నును పెక్కి
గాజు కుప్పెలా పారదర్శకమైన చోట
కేంద్రీకరించిన దిగుల్లా
కలుగులో చిట్టెలుక లాంటి గుబుల్లా
తలవంచి చూపుని ఆరేసిన చోట
ఆశ్చర్యార్థకంలా పుట్టి
కొమ్మ చివర పూల తొడిమలా
సాగిన మెడకింద అరిటాకు లాంటి చీలికకు
అటూ యిటూ ఘనమూ ద్రవమూ కాని
మనసుకి అచ్చమైన బహువచనం ఓహ్ !లి

- హృదయానికి బహువచనం- కొండేపూడి నిర్మల- పేజీ నెం.39

ప్రేమంటే తెలుసా నలుపా ప్రేమ పాల లా స్వచ్ఛ మైనది. పాలే ప్రాణమై ప్రాణానికి ఆధారమయ్యేది. మాతృత్వ గర్వంతో అతిశయపడేది, నడి వయసులో హేళనకు గురై అవమానం పాలు అయ్యేది ఈ బహు వచనమే.

అమ్మతనం కోసం తలక్రిందులుగా
క తపస్సు చేసినప్పుడు మాతృగర్వంతో
బరువెక్కి పూలమాలాలంకృతుల్లా
కొంచెం తలవాల్చి
ప్రేమంటే నలుపా తెలుపా
చిక్కు ప్రశ్న లేస్తాయి. అంటూ
నట్టనడి వయసులో వేసవిలో
మరుగుజ్జుతనంతో నీడయి పాకుతుంటే
నీకేం తెలీదు నువ్వూరుకో

- హృదయానికి బహువచనం- కొండేపూడి నిర్మల- పేజీ నెం.41

రహస్తంత్రి :

కొండేపూడి నిర్మల రహస్తంత్రి అనే కవితలో అప్పుడే ఆడుకుంటున్న, పసితనపు వయసులో తెలియకుండా నిలువునా తొలిచ్చినట్లు సన్నని ఎర్ర జీర మొదలైనప్పుడు ఆడపిల్ల యొక్క మనస్సును చిత్రించే ప్రయత్నం చేసింది. ఇక మీదట ప్రతి విషయంలోనూ మాటలో నడకలో ప్రతి మార్పును సమాజం గమనిస్తుందని ఇది వరల స్వేచ్ఛగా ఆడుకునే అవకాశం లేదని రచయిత్రి వాపోతుంది. ఈ కింద వాక్యాలను గమనిస్తే అనేక విషయాలు బోధపడ తాయి.

తొలి రజస్వలా మనస్థితిని స్తంభననీ
అజ్ఞాత భీతిని మామూలైన
జ్వరంలాంటి జలుబు లాంటి శారీరక రుగ్మతచేసి
ఉత్తుత్తి బాధల హుష్ కాకిలా ఊదేస్తుంటే
అసలు ముల్లు గొంతులోకి గాని జారిందా
మాటా మనసూ నవ్వూ నడకా తునాతునకలుగా
చీలిపోతోందివాళ.

- రహస్తంత్రి -నిలిమేఘాలు - కొండేపూడి నిర్మల- పేజీ నెం.49

తెల్లార కట్ట కివతల :

ఈ కవితలో నిర్మల స్త్రీ పురుషుల సమాగమాన్ని గురించి చెప్పిన కవిత. జీవితం నిశ్శబ్దాల కొండరాళ్లు మధ్య పడి నలిగిపోతున్న దృశ్యం. స్త్రీకి ఇష్టమున్నా లేక పోయినా ఈ రాత్రి తెల్లారకట్టకివతల కట్టెయ్యడమొక అవసరమని వాపోతుంది.

ఎవరెవరి మొహలతోనో మోహాలతోనో
నలికెలపాములమై పెనగుతున్నప్పుడు
రాత్రికి రాత్రవడమే కొలత / రాత్రికి రాత్రవడమే అర్హత

పగటి గుహల మీదుగా కొండరాళ్ళు పడి నలుగుతున్న
నిశ్శబ్దాల మధ్య
జీవితానికీ జీవిన్తున్న దానికి వరచుకున్న
అవివేకాలమధ్య
రాత్రి తెల్లారకట్టకివతల కట్టెయ్యడమొక అవసరం
తెల్లార కట్ట కివతల
- నిలిమేఘాలు -కొండేపూడి నిర్మల - పేజీ -49

లేబర్ రూమ్ :

కొండేపూడి నిర్మల గారి చేతిలో నుండి జాలువారిన పదునైన కత్తిలాంటి భావాలను వెల్లడిచేసిన కవిత ఈ లేబర్. ప్రపంచంలోని నరకమో నరకంలోని ప్రపంచమో త్రీడిలో చూస్తున్నట్టే వుంటుంది లేబర్ రూంలో అడుగు పెడితే చాలనంటుంది. మీరంతా చెబుతున్న తెల్లచీర మల్లెపూలు పాలగ్లాసు వరసల్లో పరాధీనతా బానిస కన్నీరు ద్వీపాంతర వానం ఫ్రేం కట్టినట్టు కనిపిస్తాయనీ వాపోతుంది. బల్లకొక బాధల నది కాయితప్పడవలా చివికి చీలిపోతున్న రోదనల గదిఈ లేబర్ రూమ్ అని ఏడుస్తుంది అమ్మో అయ్యో -లు కెవ్వు కెవ్వు -- లు ఇష్ అబ్బా -- లు దేవుడా రక్షించు -- లు చాలా మామూలు మామూలు నడవటం నవ్వటం మాట్లాడటం లాంటి జీవ భౌతిక లక్షణాలకి రూపం మారుతుందిక్కడ.

శరీరం ఏడుస్తోందా పోనీ మూలుగుతోందా అనేది ముఖ్యమిక్కడ. కాళ్ళనలా ఎడం చేసి దీనంగా హీనంగా నీచాతినీచంగా ఒక హింసాతల పరాకాష్ఠ కోసం ఎదురు చూడమంటే రైలు పట్టా మీద నాణెం విస్తరించిన బాధ లా ఉంటుంది. అంతే కాదు కలపను చెక్కుతున్న రంపం కింద పొట్టులా ఉండచుట్టుకున్న బాధ అప్పుడే ఏమయింది ఉధృతి కొద్దీ విముక్తి ముల్లుకు గుచ్చి నిప్పులో కాలుస్తున్న చేప యిలాగే ఏడుస్తుందాఅని అనిపిన్తుంది. మూతి బిగించిన గోతాలలో మూగ జంతువిలాగే రోదిస్తాయేమో అని అంటుంది.

చివరిగా ఈ లేబర్ రూమ్ కవితలో కొండేపూడి నిర్మల నిండు నెలల గర్భిణీ సిద్ధపడి ఒక్కో బొట్టు ఒక్కో బొట్టు రక్తం కూర్చి ప్రాణంగా ఇవ్వడానికి వస్తోంది. మీరందరూ అడ్డు తప్పుకొండని చెబుతుంది.

మరణ వాంగ్మూలం :

మరణం అంగుళం అనే కవితలో కొండేపూడి నిర్మల ఆడపిల్ల కడుపులో ఉన్నప్పుడే తెలిస్తే అబార్షన్ చేయించడం, ఆమెకు పుట్టుకలోనే ఉనికి లేకుండా చేయడం, పుట్టిన తర్వాత ఎదిగే క్రమంలో రకరకాలైన ఆంక్షలు, హద్దులు కట్టుబాట్లు వీటన్నిటిచే మందిని చేయడం, మొత్తంగా స్త్రీ యొక్క అస్తిత్వాన్ని చంపేయడం ఇలాంటి విషయాలన్నిటిని ఈ మరణ వాంగ్మూలం అనే కవితలో చర్చించారు.

ఈ కింది కవిత వ్యాఖ్యలను చదివినట్లయితే పైన చెప్పిన విషయాలన్నీ మనకు బోధపడతాయి.

చప్పుడు చెయ్యని మెత్తటి పాడాలిక్కడ
సొంతం భూమ్మీద అనడం మానేశాక
మరణ వాంగ్మూలమనే తిరణాల జరుగుతుంది.
ఇలా ఏడు
అలా నడువు
ఇలా నవ్వు
అలా ప్రాణం దువ్వు
అంటూ అచ్చు మిషను రాపిడితో
చిక్కుపడిన గొంతు ముడికి
వాంగ్మూలం యివ్వడమెప్పుడో కంఠతా వచ్చేసింది.
మరణ వాంగ్మూలం - నీలి మేఘాలు - కొండేపూడి నిర్మల పేజి నెంబర్ -126

నడిచే గాయాలు :

ఈ కవితా శీర్షిక అద్భుతంగా ఉందనిపిస్తుంది. నిజానికి గాయాలు ఎక్కడైనా నడుస్తాయా నడవవుకదా? కానీ స్త్రీ నిలువెల్లా గాయాలై నడుస్తున్న మాంసపు ముద్దలా కనిపిస్తుంది ఈ కవిత చదివాకా.. నడిచే గాయాలు అనే ఈ కవితలో కొండెప్పుడు నిర్మల యుగయుగాలనాటి నుండి స్త్రీ దోపిడీకి అణచివేతకు అత్యాచారాలకు గురవుతున్నటువంటి దుర్భర దృశ్యాల్ని తల్లి చెల్లి అని పిలుస్తూనే వావి వరసలు లేకుండా ప్రవర్తించే పురుష అహంకారాన్ని పురుష కామాన్ని దుయ్యబట్టినట్టు ఈ కవిత ద్వారా తెలుస్తుంది. నిజానికి గాయాలు నడుస్తాయా అంటే అవును గాయాలు నడుస్తాయి మాట్లాడుతాయి. పచ్చని

తాంబూలం కూడా వేసుకుంటాయి అని ప్రతికాత్మకంగా చెప్పారు. ఆనాటి సమాజంలోనూ,ఈనాటి సమాజంలో కూడా స్త్రీ నిలువెల్లా గాయాలతో నడుస్తూ ఉన్నటువంటి వ్యక్తిగా చిత్రీకరించబడింది. నడిచే గాయాలు లోనే ఈ కింది కవిత వాక్యాన్ని గమనిస్తే ఈ బాధల గాయాలని యుగాలు నుండి సవిస్తున్న ఈ గాయాలు మన కళ్ళకు కనపడతాయి.

గాయాలు నదులై ప్రవహిస్తున్నాయి.
పర్వతాలై ఘనీభవిస్తున్నాయి.
నిద్రలేక ఎర్రబారినట్లనిపించే ఆ చూపులు
నిజానికెప్పుడో నిద్రపోయాయి.
గది కొక్కటి చొప్పున కర్టెన్ల బ్యాండేజీ
ముక్కలతికించుకుని అసలేం జరగనట్టే
కనిపిస్తున్నా నిజానికెన్నో
యుగాల నుంచీ నడుస్తూనే వున్నాయి.
నడిచే గాయాలు, నీలి మేఘాలు కొండయ్య పూట
నిర్మల పేజి నెంబర్- 185

బాధా శప్త నది :

ఈ కవిత టోక్సియా హెర్బిగోచినాలోని ముస్లిం క్రోషియన్ జాతులను నిర్మూలించి తన అధిపత్యాన్ని నెలకొల్పడం కోసం సెర్బులు వేలాది మంది స్త్రీలను చిత్రహింసలు పెట్టి నిర్బంధ మాతృమూర్తులుగా మారుస్తున్న దుర్భర దారిద్ర సమయంలో రాసిన కవిత ఇది.

కలల్ని కన్నీటి చాలున జారవిడిచామని,కళ్ళను రెప్పల వెనక చిదిమి ఉంచామని,కడుపు కడుపునా ఆ కిరాత మూక పాతిపోయిన భయోత్పాతాల్నెలా దాచుకోగలమని తప్పక బాహ్య ప్రపంచానికి వెల్లడి చేసి తీరుతామని శపథం చేశారు.

అంచెలంచెలుగా వెన్నెముకను క్రుంగదీస్తూ దేహం మీదికి విస్తరిస్తున్న విషజ్వర భారం మాతృత్వమే అయితే చచ్చిపోని సిగ్గుతో! అది మమ్మల్ని వెదురు బద్దలా చీల్చిందని నిలదీస్తుంది. ప్రపంచం పవిత్రీకరించిన చవిటి సిద్ధాంతాల బండరాయి కింద అన్ని వేళలా నలిగి నజ్జవుతున్నది మా ఆత్మాభిమానమే కనక తుదిలేని యాతనల దీర్ఘబాధ మొదలైంది ఎప్పుడా అని వేళ్ళులేని చేతుల్తో లెక్కెట్టుకుంటామని వెక్కి వెక్కి ఏడుస్తుంది. ఎన్ని భ్రమలు కప్పుకున్నా వెయ్యి గాయాలతో గొంతులిప్పిన వెదురు గానం మమ్మల్నెప్పుడూ సంబరపెట్టదని కొన్ని యుగాల నాటి తమ సంతృప్తిని ముందు పరుస్తారు. పురుషుడి ప్రేమలో తడిసిన తాజ్మహల్ రాళ్ళ వెనక పద్ధాలుగో ప్రసూతి నరకాన కన్ను మూసిన పురిటాలి ఆత్మ మా గొంతును స్వర పరచనీదనీ ఆగ్రోషిస్తారు. సందర్భం కోసం మేమిప్పుడు మాటలొచ్చిన చెట్టుతో గట్టుతో నీటితో చేపతో కూడి మానవత్వపు విలువల్ని మంటకలిపిన స్లాబిదాన్ మిలొసిలిక్‌ను శపించుకున్నా మత్తుతోనో, మతంతోనో, కులంతోనో కార్పణ్యంతోనో కామంతోనో, క్రోధంతోనో ఆడదాన్ని అవమానించే తీరు వెనక చాటపెయ్యి కారణాలెన్ని తీసినా చిత్తశుద్ధి లేని మీ విచారణల వెనక అంతిమతీర్పు ఏమిటనేదే మా ప్రశ్ననియావత్ పురుష ప్రపంచాన్నినిలదీసి నిగ్గు తేలుస్తుంది.

స్లీపింగ్ పార్ట్నర్ :

ఈ కవితలో నిర్మల స్త్రీలు తమ సర్వ ఆరోపణల దొంగకేసు బనాయింపులకు కారణాలుగా తమ దైహిక బాధల ప్రకటనల పట్లా నాణానికున్న విలువల బరువు కింద భూపతనమై వున్న బొమ్మ తాలూకు బలహీనతల, వెనకబాటు తనాల, ఓటమి పట్ల పుంజుకున్న స్పృహను గురించే కదా అని విలపిస్తుంది.

నిషేధాల కంటే హాస్యాస్పదమైన అద్భుత కథనాల చర్చల్ని గురించే కదా! ఆత్మకథల్లో సైతం అహంకారం వీడని వాళ్ళే ప్రాణప్రదమైన అనుభవాల్ని అవమానించ గలరనీ హెచ్చరిస్తుంది. యదార్థ జీవిత దృశ్యాల్ని అనేకవేల ఆర్భాటాలతో అడ్డుకునే వాళ్ళే శ్రమని గ్లోరిపై చేస్తూ అంగాంగాల్ని గ్లామరైజు చేస్తూ వల్లె వేస్తున్న మనోరంజక కావ్యాలన్నిటా మనసు ప్రసక్తి లేనందుకే మలినపడలేదని తీర్మానిస్తారనీ విరుచుకు పడతారు. అక్షరానికీ ఆత్మకీ వున్న అన్ని లింకులూ తెగ్గొట్టి అవయవ స్ఫూర్తిగా ఆడదాన్ని చదవడడానికి శిక్షణ యిస్తారనీ దులుపుతారు. కాబట్టే వీళ్ళనలుతమ అంచనాల్ని మించి మన బతుకు ప్రతిపాదనలు మారడం భరించలేరనీ పురుషాహంకారాన్ని ప్రశ్నిస్తారు.

ముగింపు :

మహిళల జీవితం, సమాజంలో ఉన్న అసమానతలు, మానవ విలువలు వంటి విషయాలను తన రచనల్లో ప్రస్తావించారు. ఆమె కవితల్లో భావోద్వేగం, సామాజిక అవగాహన, జీవన అనుభవం స్పష్టంగా కనిపిస్తాయి. ఆమె రచన లో సరళమైన, స్పష్టమైన భాష.సామాజిక సమస్యలపై చైతన్యం. మహిళా జీవితం మరియు భావోద్వేగాల ప్రతిబింబం. మానవతా దృక్పథం మొదలైన అనేక అంశాలు పరుచుకుని ఉంటాయి. కొండేపూడి నిర్మల తెలుగు సాహిత్యంలో మహిళా స్వరాన్ని బలంగా వినిపించిన రచయిత్రిగా గుర్తింపు పొందారు.

ఆమె రచనలు పాఠకులకు ఆలోచనాత్మక దృష్టిని కలిగిస్తాయని చెప్పవచ్చు.

ఉపయుక్త గ్రంథ సూచిక :

1. A Vindication of the Rights of వుమన్ రచయిత: Mary వలస్టనెక్రాఫ్ట్ ప్రచురణ సంవత్సరం: 1792 ప్రచురణ స్థలం: లండన్
2. The Second సెక్స్ రచయిత: Simone de Beauvoir ప్రచురణ సంవత్సరం: 1949మూల భాష: ఫ్రెంచ్ (Le Deuxime Sexe)
3. A Room of One's ఓన్ రచయిత: Virginia వుల్ఫ్ ప్రచురణ సంవత్సరం: 1929
4. The Feminine మైస్టిక్యూ రచయిత: Betty ఫ్రైదన్ ప్రచురణ సంవత్సరం: 1963 ప్రచురణ దేశం: అమెరికా
5. Gender trouble - రచయిత: Judith బట్లర్ - ప్రచురణ సంవత్సరం: 1990 ఉపశీర్షిక: Feminism and the Subversion of Identity
6. నీలి మేఘాలు స్త్రీవాద సాహిత్యం క్లాసిక్ ప్రచురణలు -2025.

★★★

Vol. 23 | Spl. Issue 03 | March 2026 | BHAVAVEENA | ISSN No. : 2456-4702 | RNI No. APTEL/2003/12253

RNI No. APTEL/2003/12253 | Reffered Journal & Peer Reviewed Journals | ISSN No. 2456-4702

భావవీణ

కళలు, సాహిత్య, సాంస్కృతిక భాషాధ్యయన పత్రిక

BHAVA VEENA

Journal of Arts, Literary, Culture & Language Study

ఆధునిక సాహిత్యంలో నాటకాల ద్వారా మహిళా చైతన్యం

- ఇమ్మడి శ్రీను

ప్రభుత్వ డిగ్రీ కళాశాల(ఎ), పాల్వంచ, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా.

ఆధునిక తెలుగు సాహిత్యంలో మహిళా చైతన్యం ఒక ముఖ్యమైన భావధారగా అభివృద్ధి చెందింది. సమాజంలో మహిళల స్థానం, హక్కులు, స్వేచ్ఛ మరియు సమానత్వం వంటి అంశాలను ప్రతిబింబించడంలో నాటక సాహిత్యం ప్రధాన పాత్ర పోషించింది. నాటకం అనే సాహిత్య రూపం సమాజ సమస్యలను ప్రత్యక్షంగా ప్రేక్షకుల ముందుంచే శక్తివంతమైన మాధ్యమంగా నిలుస్తుంది.

మహిళలపై జరుగుతున్న సామాజిక అన్యాయాలు, సంప్రదాయ బంధనలు, లింగ అసమానత వంటి సమస్యలను ఆధునిక నాటక రచయితలు తమ రచనల ద్వారా విమర్శాత్మకంగా ప్రతిపాదించారు. ఆధునిక నాటకాలలో మహిళను కేవలం గృహిణిగా కాకుండా సమాజ మార్పుకు ప్రేరణగా నిలిచే శక్తిగా చిత్రీకరించారు.

తెలుగు నాటక సాహిత్యంలో మహిళా చైతన్యాన్ని ప్రతిబింబించే రచనలలో సామాజిక సంస్కరణ భావాలు స్పష్టంగా కనిపిస్తాయి. ముఖ్యంగా గురజాడ అప్పారావు రచించిన కన్యాశుల్కం నాటకం బాల్యవివాహం, మహిళలపై జరుగుతున్న అన్యాయాలను తీవ్రంగా విమర్శిస్తూ సమాజ సంస్కరణకు దారితీసింది. ఈ పరిశోధన పత్రం ఆధునిక నాటకాలలో మహిళా చైతన్యం ఎలా ప్రతిబింబించబడిందో విశ్లేషిస్తుంది.

ముఖ్య పదాలు :

ఆధునిక సాహిత్యం, మహిళా చైతన్యం, నాటకం (రూపకం), సమాజ సంస్కరణ, లింగ సమానత్వం, స్త్రీ వాదం

పరిచయం:

సాహిత్యం సమాజాన్ని ప్రతిబింబించే అద్దంలాంటిది. సమాజంలో జరిగే మార్పులు, సంఘర్షణలు మరియు అసమానతలు సాహిత్యంలో ప్రతిఫలిస్తాయి. ఆధునిక కాలంలో మహిళలపై జరుగుతున్న వివక్షను ప్రతిబింబిస్తూ మహిళా చైతన్యం అనే భావన సాహిత్యంలో ప్రధాన అంశంగా మారింది.

నాటకం అనే సాహిత్య ప్రక్రియ సమాజ సమస్యలను అత్యంత ప్రభావవంతంగా వ్యక్తపరచగలదు. పాత్రల సంభాషణలు, సంఘటనలు, సంఘర్షణల ద్వారా రచయితలు మహిళల స్థితిగతులను చూపించారు. ఆధునిక నాటక రచయితలు మహిళను కేవలం కుటుంబ పరిధిలో పరిమితం చేయకుండా సమాజ మార్పులో కీలక పాత్ర పోషించే వ్యక్తిగా చిత్రీకరించారు.

ఉపోద్ఘాతం:

భారతదేశంలో 19వ శతాబ్దం నుండి సామాజిక సంస్కరణ ఉద్యమాలు వేగంగా పెరిగాయి. విద్యా విస్తరణ, సామాజిక చైతన్యం, మహిళా విమోచన

ఉద్యమాలు సాహిత్యంలో కొత్త భావాలను తీసుకు వచ్చాయి.

ఈ సందర్భంలో నాటకాలు సమాజ సమస్యలను ప్రజల ముందుకు తీసుకువచ్చే శక్తివంతమైన సాధనంగా మారాయి. ముఖ్యంగా మహిళల సమస్యలను నాటక రచయితలు విమర్శాత్మకంగా ప్రతిపాదించారు.

పరిశోధన లక్ష్యాలు:

ఆధునిక నాటకాల్లో మహిళా చైతన్యాన్ని అధ్యయనం చేయడం

1. ఆధునిక నాటకాల్లో మహిళల హక్కులు, స్వేచ్ఛ మరియు సమానత్వంపై అవగాహనను చూపిస్తారు.
2. ఈ నాటకాలు మహిళలు ఎదుర్కొనే సామాజిక సమస్యలు మరియు అన్యాయాలను వెలుగులోకి తీసుకువస్తాయి.
3. మహిళలు తమ వ్యక్తిత్వం మరియు స్వతంత్రం కోసం చేసే పోరాటాన్ని ఇందులో చూపిస్తారు.
4. అందువల్ల ఆధునిక నాటకాలు మహిళా చైతన్యాన్ని పెంపొందించడంలో ముఖ్యమైన పాత్ర పోషిస్తాయి.

మహిళల సామాజిక స్థితిగతులను విశ్లేషించడం

మహిళల సామాజిక స్థితిగతులు ఒక సమాజ అభివృద్ధిని అర్థం చేసుకోవడానికి ముఖ్యమైన సూచిక. సమాజంలో మహిళలకు లభించే విద్య, ఉపాధి అవకాశాలు, ఆర్థిక స్వావలంబన మరియు నిర్ణయాలలో పాల్గొనే హక్కులు వారి స్థితిని నిర్ణయిస్తాయి.

పురాతన కాలంలో మహిళలు ఎక్కువగా గృహ పరిమితుల్లోనే ఉండేవారు. కానీ ఆధునిక కాలంలో విద్య, సాంకేతికత మరియు చట్టపరమైన హక్కుల వల్ల మహిళలు అన్ని రంగాల్లో ముందుకు వస్తున్నారు. అయినప్పటికీ ఇంకా లింగ వివక్ష, అసమాన వేతనాలు, గృహ హింస వంటి సమస్యలు కొనసాగుతున్నాయి.

అందువల్ల మహిళల సాధికారత, సమాన అవకాశాలు మరియు సామాజిక భద్రతను పెంపొందించడం ద్వారా సమాజంలో మహిళల స్థితిని మెరుగుపరచవచ్చు. మహిళల అభివృద్ధి దేశ అభివృద్ధికి కూడా ఎంతో అవసరం.

నాటకాల ద్వారా వచ్చిన సంస్కరణ భావాలను పరిశీలించడం

నాటకం సమాజాన్ని ప్రభావితం చేసే ముఖ్యమైన సాహిత్య ప్రక్రియ. నాటకాల ద్వారా సమాజంలో ఉన్న అన్యాయాలు, కులవ్యవస్థ, బాల్యవివాహాలు, స్త్రీలపై వివక్ష వంటి సమస్యలను ప్రజలకు స్పష్టంగా చూపించారు. రచయితలు తమ నాటకాల ద్వారా ప్రజల్లో అవగాహన కలిగించి సంస్కరణ భావాలను ప్రోత్సహించారు.

నాటకాలలో పాత్రల ద్వారా సమానత్వం, విద్యా ప్రాధాన్యం, మహిళల గౌరవం వంటి విలువలను తెలియజేశారు. ఈ విధంగా నాటకాలు సమాజంలో మార్పు తీసుకురావడంలో మరియు సంస్కరణ ఆలోచనలను వ్యాప్తి చేయడంలో ముఖ్యమైన పాత్ర పోషించాయి.

పరిశోధన విధానం:

ఈ పరిశోధనలో క్రింది పద్ధతులను ఉప యోగించాము:

విశ్లేషణాత్మక పద్ధతి
గ్రంథాల పరిశీలన
తులనాత్మక అధ్యయనం

వివిధ తెలుగు నాటకాలను పరిశీలించి మహిళా పాత్రల ప్రాముఖ్యతను విశ్లేషించాము.

విషయం:

1. ఆధునిక తెలుగు నాటక సాహిత్యం

ఆధునిక తెలుగు నాటక సాహిత్యం సమాజ సమస్యలను ప్రతిబింబిస్తూ అభివృద్ధి చెందింది. విద్యా విస్తరణ మరియు సంస్కరణ ఉద్యమాల ప్రభావంతో నాటకాలు సామాజిక సమస్యలను ప్రతిపాదించాయి.

2. మహిళా చైతన్యం - భావన

మహిళా చైతన్యం అంటే మహిళలు తమ హక్కులు, స్వేచ్ఛ మరియు సమానత్వం కోసం అవగాహన పొందడం. ఆధునిక సాహిత్యంలో ఈ భావన ప్రధానంగా కనిపిస్తుంది.

నాటకాలలో మహిళా పాత్రల ప్రాధాన్యం

ఆధునిక నాటకాలలో మహిళా పాత్రలు బలమైన వ్యక్తిత్వంతో కనిపిస్తాయి. మహిళలు స్వతంత్రంగా ఆలోచించే వ్యక్తులుగా చిత్రీకరించబడ్డారు.

సామాజిక సంస్కరణలో నాటకాల పాత్ర

నాటకాలు సమాజంలో ఉన్న చెడు ఆచారాలను విమర్శించాయి. బాల్యవివాహం, వరకట్నం, మహిళలపై జరుగుతున్న అన్యాయాలను నాటక రచయితలు విమర్శించారు.

మహిళా విముక్తి భావాలు

ఆధునిక నాటకాల్లో మహిళల విద్య, స్వేచ్ఛ మరియు స్వతంత్ర జీవితం గురించి ప్రస్తావించబడింది.

చర్చ

ఆధునిక నాటక రచయితలు మహిళల సమస్యలను గంభీరంగా ప్రతిపాదించారు. సమాజంలోని పితృస్వామ్య వ్యవస్థను విమర్శిస్తూ మహిళల స్వాతంత్ర్యాన్ని సమర్థించారు.

నాటకాలు కేవలం వినోద సాధనం మాత్రమే కాకుండా సమాజ సంస్కరణకు మార్గదర్శకంగా నిలిచాయి.

గురజాడ అప్పారావు - కన్యాశుల్కం

గురజాడ అప్పారావు తెలుగు సాహిత్యంలో ప్రముఖ కవి, నాటక రచయిత, సామాజిక సంస్కర్త. ఆయన రచించిన "కన్యాశుల్కం" తెలుగు నాటక సాహిత్యంలో అత్యంత ప్రసిద్ధి పొందిన సామాజిక నాటకం. ఇది సమాజంలోని చెడు ఆచారాలను, ముఖ్యంగా కన్యాశుల్కం (పెళ్లి కోసం అమ్మాయి తండ్రికి ఇచ్చే డబ్బు) అనే దురాచారాన్ని తీవ్రంగా విమర్శిస్తుంది.

19వ శతాబ్దం చివరలో సమాజంలో బాల్యవివాహాలు, కన్యాశుల్కం, స్త్రీలపై అన్యాయం వంటి అనేక సమస్యలు ఉండేవి. ఆ సమాజ పరిస్థితులను చూసి గురజాడ అప్పారావు ఈ నాటకాన్ని రచించారు. ఈ నాటకం మొదటగా 1892లో ప్రదర్శించబడింది.

ఈ నాటకంలో కన్యాశుల్కం అనే దురాచారాన్ని తీవ్రంగా విమర్శించారు. పెద్ద వయస్సు ఉన్న వ్యక్తులు చిన్న వయస్సు గల బాలికలను పెళ్లి చేసుకోవడానికి వారి తల్లిదండ్రులకు డబ్బు ఇచ్చే ఆచారం అప్పట్లో ఉండేది. ఈ అన్యాయాన్ని సమాజానికి తెలియజేసి దాన్ని తొలగించాలనే ఉద్దేశంతో ఈ నాటకం రచించబడింది.

ముఖ్య పాత్రలు

ఈ నాటకంలో అనేక బలమైన పాత్రలు ఉన్నాయి. ముఖ్యమైనవి:

- గిరీశం -- తెలివిగా మాట్లాడే కానీ స్వార్థపరుడు
  మధురవాణి -- వేశ్య అయినా మంచి హృదయం కలిగిన మహిళ
  రామప్ప పంతులు -- సంప్రదాయవాది
  బుచ్చమ్మ -- అమాయకమైన బాలిక
  వెంకమ్మ -- కుటుంబ మహిళ

ఈ పాత్రల ద్వారా రచయిత సమాజంలోని వివిధ స్వభావాలను చూపించారు.

నాటక లక్షణాలు

సాధారణ ప్రజలు మాట్లాడే వ్యవహారిక తెలుగు భాషను ఉపయోగించారు.

సమాజంలోని కపటత్వం, దురాచారాలను హాస్యంతో పాటు విమర్శాత్మకంగా చూపించారు.

స్త్రీల సమస్యలు, బాల్యవివాహం వంటి అంశాలను స్పష్టంగా చర్చించారు.

నాటక ప్రాముఖ్యత

"కన్యాశుల్కం" తెలుగు నాటక చరిత్రలో ఒక మైలురాయిగా భావించబడుతుంది. ఈ నాటకం ద్వారా సమాజంలో ఉన్న చెడు ఆచారాలపై ప్రజల్లో అవగాహన పెరిగింది. అలాగే తెలుగు నాటకాల్లో సామాజిక సంస్కరణ భావాలను బలంగా ప్రవేశపెట్టింది.

మొత్తంగా చూస్తే, గురజాడ అప్పారావు రచించిన కన్యాశుల్కం నాటకం తెలుగు సాహిత్యంలో గొప్ప స్థానం పొందింది. ఇది కేవలం వినోదం కోసం రాసిన నాటకం కాకుండా సమాజాన్ని మార్చడానికి, ప్రజల్లో సంస్కరణ భావాలను కలిగించడానికి రాసిన గొప్ప సామాజిక నాటకం.

తెలుగు నాటక చరిత్ర - పి.వి. రామచంద్రరావు

పి.వి. రామచంద్రరావు రచించిన "తెలుగు నాటక చరిత్ర" గ్రంథం తెలుగు నాటకాల అభివృద్ధిని వివరంగా తెలియజేసే ప్రముఖ పరిశోధనా గ్రంథంగా భావించ బడుతుంది. ఈ గ్రంథంలో తెలుగు నాటక రంగం ఆరంభం నుంచి ఆధునిక కాలం వరకు వచ్చిన మార్పులు, అభివృద్ధి మరియు ముఖ్య నాటక రచయితల గురించి వివరించారు.

ఈ పుస్తకంలో యక్షగానాలు, వీధి నాటకాలు, పౌరాణిక నాటకాలు, సామాజిక నాటకాలు వంటి వివిధ రూపాల అభివృద్ధిని వివరంగా విశ్లేషించారు. అలాగే గురజాడ అప్పారావు వంటి ప్రముఖ రచయితల నాటకాలు తెలుగు నాటక రంగానికి చేసిన సేవలను కూడా వివరించారు.

మొత్తంగా ఈ గ్రంథం తెలుగు నాటక రంగం చరిత్ర, అభివృద్ధి మరియు సామాజిక ప్రభావాన్ని అర్థం చేసుకోవడానికి ముఖ్యమైన ఆధార గ్రంథంగా భావించ బడుతుంది.

ఆధునిక తెలుగు సాహిత్యం - ఎస్.వి. రామారావు

ఎస్.వి. రామారావు రచించిన "ఆధునిక తెలుగు సాహిత్యం" గ్రంథం తెలుగు సాహిత్యంలో ఆధునిక కాలంలో జరిగిన మార్పులు మరియు అభివృద్ధిని వివరిస్తుంది. ఈ గ్రంథంలో 19వ శతాబ్దం చివర నుండి తెలుగు సాహిత్యంలో వచ్చిన కొత్త భావాలు, రచనా విధానాలు మరియు సామాజిక ప్రభావాలను విశ్లేషించారు.

కవిత్వం, కథలు, నవలలు, నాటకాలు వంటి వివిధ సాహిత్య ప్రక్రియల అభివృద్ధిని ఇందులో వివరించారు. అలాగే గురజాడ అప్పారావు, శ్రీశ్రీ వంటి ప్రముఖ రచయితల సాహిత్య సేవలను కూడా ప్రస్తావించారు.

మొత్తంగా ఈ గ్రంథం ఆధునిక తెలుగు సాహిత్య పరిణామాన్ని అర్థం చేసుకోవడానికి ముఖ్యమైన అధ్యయన గ్రంథంగా భావించబడుతుంది.

భారతీయ నాటక సాహిత్యం విశ్లేషణాత్మక అధ్యయనం

భారతీయ నాటక సాహిత్యం ఎంతో పురాతనమైనది మరియు సంపన్నమైన సంప్రదాయాన్ని కలిగి ఉంది. భరతముని రచించిన నాట్యశాస్త్రం భారతీయ నాటక సాహిత్యానికి పునాది గా భావించబడుతుంది. సంస్కృత నాటకాల నుండి ప్రాంతీయ భాషల నాటకాల వరకు భారతీయ నాటక సాహిత్యం విస్తరించింది.

ఈ నాటకాలలో పౌరాణిక కథలు, చారిత్రక సంఘటనలు మరియు సామాజిక సమస్యలు ప్రధాన అంశాలుగా కనిపిస్తాయి. కాలక్రమేణా నాటకాలు సమాజంలో ఉన్న అన్యాయాలు, అసమానతలు మరియు సంస్కరణ భావాలను ప్రజలకు తెలియజేయడానికి ఒక శక్తివంతమైన సాధనంగా మారాయి.

అందువల్ల భారతీయ నాటక సాహిత్యం సమాజ అభివృద్ధి, సంస్కృతి మరియు విలువలను ప్రతిబింబించే ముఖ్యమైన సాహిత్య ప్రక్రియగా నిలిచింది.

భారతీయ నాటకాలలో స్త్రీవాద చైతన్యం

భారతీయ నాటకాలలో స్త్రీవాద చైతన్యం ముఖ్యమైన సామాజిక అంశంగా కనిపిస్తుంది. నాటకాల ద్వారా మహిళలపై జరుగుతున్న అన్యాయాలు, అసమానతలు మరియు లింగ వివక్షను చూపించారు. స్త్రీలకు సమాన హక్కులు, విద్య మరియు స్వాతంత్ర్యం అవసరమని రచయితలు తెలియజేశారు.

ఈ నాటకాలలో మహిళలు తమ హక్కుల కోసం పోరాడే శక్తివంతమైన పాత్రలుగా చిత్రించబడ్డారు. సమాజంలో మహిళల స్థానం మరియు గౌరవం పెరగాలనే సందేశాన్ని నాటకాలు అందించాయి. ఈ విధంగా భారతీయ నాటకాలు స్త్రీవాద చైతన్యాన్ని వ్యాప్తి చేయడంలో ముఖ్యమైన పాత్ర పోషించాయి.

"ఆధునిక సాహిత్యం -- మహిళా చైతన్యంలో నాటకం (రూపకం)" అనే అంశంపై పరిశోధన పత్రం ఇవి తెలుగు సాహిత్యం మరియు తెలుగు నాటక సాహిత్యం గురించి పరిశోధనలో ఉపయోగించిన గ్రంథాలు.

ఫలితాలు

1. నాటకాలు మహిళా చైతన్యాన్ని ప్రోత్సహించాయి
2. మహిళలపై జరిగే అన్యాయాలను వెలుగులోకి తీసుకువచ్చాయి

3. సమాజంలో సంస్కరణ భావాలను పెంపొందించాయి

ముగింపు

ఆధునిక సాహిత్యంలో మహిళా చైతన్యం ఒక ముఖ్యమైన ఉద్యమంగా నిలిచింది. నాటకాలు ఈ చైతన్యాన్ని సమాజంలో విస్తరించడంలో కీలక పాత్ర పోషించాయి. మహిళల హక్కులు, సమానత్వం మరియు స్వేచ్ఛ వంటి విలువలను నాటకాలు బలంగా ప్రతిపాదించాయి. అందువల్ల ఆధునిక నాటక సాహిత్యం మహిళా విముక్తి ఉద్యమానికి సాహిత్య రూపంలో ప్రేరణగా నిలిచింది.

సూచిక గ్రంథాలు:

1. తెలుగు నాటక సాహిత్యం

1. గురజాడ అప్పారావు - కన్యాశుల్కం.
2. పి.వి. రమణ - తెలుగు నాటక చరిత్ర.
3. ఎస్.వి. రామారావు - ఆధునిక తెలుగు సాహిత్యం. తెలుగు అకాడమీ
4. మిక్కిలినేని రాధాకృష్ణమూర్తి - తెలుగు నాటక రంగ చరిత్ర. తెలుగు విశ్వవిద్యాలయం.
5. మల్లాది వెంకటకృష్ణమూర్తి - తెలుగు నాటక పరిణామం.

2. మహిళా చైతన్యం ప్రతిబింబించిన తెలుగు రచనలు

   1. కొటికలపూడి సీతమ్మ - ఉపన్యాసమాలిక.
   2. వోల్గా - విముక్త.
   3. రాచకొండ విశ్వనాథశాస్త్రి - నాటకాలు.

★★★

Vol. 23 | Spl. Issue 03 | March 2026 | BHAVAVEENA | ISSN No. : 2456-4702 | RNI No. APTEL/2003/12253

RNI No. APTEL/2003/12253 | Reffered Journal & Peer Reviewed Journals | ISSN No. 2456-4702

భావవీణ

కళలు, సాహిత్య, సాంస్కృతిక భాషాధ్యయన పత్రిక

BHAVA VEENA

Journal of Arts, Literary, Culture & Language Study

స్త్రీవాద సాహిత్యం - ప్రముఖ రచయిత్రుల పాత్ర

- ఆర్. రామకృష్ణ

అసిస్టెంట్ ప్రొఫెసర్, ఎంఎన్ఆర్ టీచర్ ఎడ్యుకేషన్ కాలేజీ కూకట్ పల్లి, హైదరాబాద్.

ఉపోద్ఘాతం:

సాహిత్యం అనేది సమాజానికి దర్పణం వంటిది. కాలంతో పాటు మారుతున్న మానవ దృక్పథాలకు, సామాజిక మార్పులకు కవిత్వం అత్యంత వేగంగా స్పందిస్తుంది. తెలుగు సాహిత్యంలో, ముఖ్యంగా ఆధునిక కవిత్వంలో స్త్రీ చిత్రణ ఒక విప్లవాత్మకమైన మలుపు. ప్రాచీన, మధ్యయుగ సాహిత్యంలో స్త్రీని కేవలం పురుషుడి కోణంలో ఒక 'ప్రేయసి'గానో, 'అబల'గానో, లేదా 'దేవత'గానో మాత్రమే చిత్రించిన సంప్రదాయం ఉండేది. అప్పుడు స్త్రీ కేవలం కవిత్వంలో 'వర్ణించబడే వస్తువు' మాత్రమే. అయితే, 20వ శతాబ్దపు ఆధునికత, సామాజిక సంస్కరణలు, స్వాతంత్ర్యోద్యమం, తదనంతర అభ్యుదయ, స్త్రీవాద ఉద్యమాలు కవిత్వంలో స్త్రీ స్థానాన్ని పూర్తిగా మార్చేశాయి. ఈ మార్పులో అత్యంత ముఖ్యమైన అంశం ఏమిటంటే స్త్రీ కేవలం కవితా వస్తువుగా మిగిలిపోలేదు; ఆమె స్వయంగా కలం పట్టి 'కర్త' గా మారింది. ఆధునిక కవిత్వం స్త్రీని వంటింటి చట్రం నుండి బయటకు తీసుకువచ్చి, ప్రపంచాన్ని తనదైన కోణంలో చూసేలా చేసింది. పితృస్వామ్య వ్యవస్థలోని వివక్షను ప్రశ్నించడం నుండి, తన శరీర స్వయం ప్రతిపత్తిని ప్రకటించుకోవడం వరకు, ఆధునిక కవిత్వంలో స్త్రీ తన అస్తిత్వాన్ని చాటుకునే క్రమంలో ఎన్నో పార్శ్వాలను స్పృశించింది. ఈ వ్యాసం, ఆధునిక కవిత్వంలో స్త్రీ 'వస్తువు' స్థాయి నుండి 'వ్యక్తిత్వం' గల గొంతుకగా ఎలా పరిణామం చెందిందో విశ్లేషిస్తుంది.

కీలక పదాలు :

ఆధునిక కవిత్వం, స్త్రీవాద కవిత్వం, కథా వస్తువు, అస్తిత్వ చైతన్యం,

విషయ వివరణ:

"స్త్రీ కేవలం ఒక అలంకార వస్తువు కాదు, ఆమె ఒక అక్షర ఆయుధం" అని ఆధునిక కవిత్వం నిరూపించింది. వేల ఏళ్ల తెలుగు సాహిత్య చరిత్రలో స్త్రీ చిత్రణ అనేక మలుపులు తిరిగింది. పురాణాల్లో 'దైవ సమానంగా', ప్రబంధాల్లో 'అంగాంగ వర్ణనల ప్రేయసిగా' పరిమితమైన స్త్రీ, ఆధునిక కాలానికి వచ్చేసరికి తన అస్తిత్వాన్ని తానే నిర్వచించుకునే స్థాయికి చేరుకుంది. ఆధునిక కవిత్వంలో స్త్రీ చిత్రణ అనేది కేవలం ఒక మార్పు కాదు, అది ఒక గొప్ప సామాజిక పరిణామం. 19వ శతాబ్దపు చివరలో మొదలైన సంస్కరణోద్యమాల నుండి నేటి డిజిటల్ యుగపు స్త్రీవాద కవిత్వం వరకు, స్త్రీ తన గొంతుకను మరింత స్పష్టంగా, ధైర్యంగా వినిపిస్తూ వస్తోంది. ఒకప్పుడు పురుష కవుల కలాల్లో 'వర్ణన'కు మాత్రమే పరిమితమైన స్త్రీ, ఆధునిక కాలంలో తానే స్వయంగా కలం పట్టి 'కర్త'గా మారి తన అంతరంగాన్ని ఆవిష్కరించు

కుంది. వంటిల్లు, పితృస్వామ్య కట్టుబాట్లు, మరియు సామాజిక వివక్ష అనే సంకెళ్లను తెంచుకుని, సమానత్వం కోసం సాగించిన పోరాటం ఆధునిక కవిత్వానికి మూల స్తంభం. ఆధునిక కవిత్వంలో స్త్రీ కేవలం తల్లిగానో, భార్యగానో కాకుండా, ఒక కార్మికురాలిగా, విద్యావంతురాలిగా, తిరుగుబాటుదారురాలిగా, మరియు తన శరీరంపై తనకు పూర్తి అధికారం ఉన్న వ్యక్తిగా కనిపిస్తుంది. క్లుప్తంగా చెప్పాలంటే, ఆధునిక కవిత్వం స్త్రీని 'చూడబడే వస్తువు' నుండి 'ప్రశ్నించే శక్తి'గా మార్చింది. ఈ మార్పు తెలుగు సాహిత్యానికి ఒక నూతన ఉత్తేజాన్ని, వాస్తవికతను అద్దింది.

ఆధునిక కవిత్వంలో స్త్రీ పరిచయం

ఆధునిక తెలుగు కవిత్వంలో 'స్త్రీ' చిత్రణ ఒక విప్లవాత్మకమైన పరిణామం. ఒకప్పుడు పురుష కవుల ఊహల్లో, వర్ణనల్లో కేవలం ఒక 'వస్తువు'గా ఉన్న స్త్రీ, ఆధునిక కాలంలో తనను తాను ఆవిష్కరించుకుంటూ ఒక 'చైతన్య శక్తి'గా ఎదిగింది. సాంప్రదాయ ప్రబంధ కవిత్వంలో స్త్రీ అంగాంగ వర్ణనలకే పరిమితమైంది. కానీ ఆధునిక కవిత్వంలో ఆమె సొంత గొంతుకను వినిపించడం మొదలుపెట్టింది. తన కష్టాలను, ఆశలను, ఆశయాలను తనకే స్వయంగా కవిత్వీకరించడం ఈ కాలపు అతిపెద్ద మార్పు. వస్తువు నుండి కర్తగా మార్పు చెందింది. ఆధునిక కవిత్వారంభంలో గు3.రజాడ అప్పారావు వంటి కవులు స్త్రీ ఎదుర్కొంటున్న సామాజిక అన్యాయాలను (కన్యాశుల్కం, బాల్య వివాహాలు) ప్రశ్నించారు. స్త్రీకి విద్య, స్వేచ్ఛ మరియు సమాజంలో గౌరవప్రదమైన స్థానం కల్పించడం. 1980 తర్వాత వచ్చిన స్త్రీవాద కవిత్వం స్త్రీ పరిచయాన్ని పూర్తిగా మార్చి వేసింది. వంటిల్లు, పిల్లలు అనే పరిధి నుండి బయటకు వచ్చి, బాహ్య ప్రపంచంలో తన ఉనికిని చాటుకోవడం. స్త్రీ శరీరం కేవలం భోగవస్తువు కాదని, దానిపై ఆమెకే పూర్తి అధికారం ఉంటుందని అస్తిత్వ చైతన్యం ప్రకటించడం. నేటి ఆధునిక కవిత్వంలో స్త్రీ కేవలం ఒకే రూపంలో కనిపించదు. పొలాల్లో, ఫ్యాక్టరీల్లో పనిచేసే స్త్రీని శ్రమజీవిగా గుర్తించడం. అన్యాయాన్ని ఎదిరించే పోరాట యోధురాలిగా, విప్లవకారిణిగా, కుల, మత వివక్షలను చీల్చుకుంటూ వచ్చే అస్తిత్వ గొంతుకగా. బహుళ పార్శ్వాలు ప్రదర్శిస్తుంది.

రేవతి దేవి :

అధునిక తెలుగు కవిత్వంలో తొలిసారిగా నిస్సంకోచంగా, నిర్భయంగా, స్వేచ్ఛగా, స్పష్టంగా తన భావాలను చెప్పారు. ఒక స్త్రీని కవిగా ఎదగడానికి వేలు లేకుండా చేసిన సమాజ స్వరూపాన్ని ఎత్తి చూపారు. ఈమె రాసిన కవితలు చిన్న పరిమాణంలో అయిన అందులో పదునైన భావాన్ని పొందుపరిచారు. 1980లో రేవతి దేవి కవితల సంకలనం శిలా లొలిత పేరుతో అచ్చయినది. ఇది స్త్రీవాద కవిత్వంలో ఒక మైలురాయిగా పరిగణిస్తారు. రుచించని మాట అనే ఖండికలో పురుషుడికి ఒక న్యాయం, స్త్రీకి మరొక న్యాయం అనే పితృస్వామ్య భావనను తీవ్రంగా ప్రశ్నించినది. స్త్రీ, పురుషులు ఇద్దరికీ శీలం, ఆస్తి విషయంలో సామాన్య హక్కులు ఉండాలని వాదించారు. స్త్రీలపై సమాజం విదించే నైతిక ప్రమాణాలు పురుషులకు వర్తించకపోవడం వెనుక ఉన్న వైఖరిని నిషితంగా విశ్లేషించినది. ఆమె కవిత్వం భావ తీవ్రతతో, లోతైన తాత్వికతను కలిగి ఉంటుంది. ఈమె రచనలు స్త్రీల ఆత్మ గౌరవాన్ని,మనిషిగా స్త్రీకి ఉన్న విలువను గుర్తు చేస్తాయి. కవిత్వంలో ఒక విద్యమైన ఆవేదన, నిస్సహాయత ఉన్నప్పటికీ, అది అంతర్గతంగా ఒక బలమైన తిరుగుబాటు స్ఫూర్తిని కలిగి ఉంటుంది.

కొండెపూడి నిర్మల

కొండెపూడి నిర్మల గారు ఆధునిక తెలుగు కవిత్వంలో, ముఖ్యంగా స్త్రీవాద కవిత్వంలో ఒక ధ్రువతార. 1980వ దశకంలో స్త్రీల అస్తిత్వం కోసం, వారి హక్కుల కోసం కలం పట్టిన అతికొద్ది మంది ధైర్యవంతులలో ఆమె ఒకరు.

నిర్మల గారి కవిత్వం కేవలం భావోద్వేగాలకే పరిమితం కాలేదు. ఆమె సామాజిక సమస్యలను, ముఖ్యంగా స్త్రీ ఎదుర్కొనే శారీరక, మానసిక హింసను నిశితంగా ప్రశ్నించారు. కుటుంబం అనే వ్యవస్థలో స్త్రీ ఎలా బందీ అవుతుందో ఆమె కవితలు చర్చిస్తాయి. మాతృత్వాన్ని కేవలం త్యాగంగా చూడకుండా, అందులోని కష్టాలను,

ఆ ప్రక్రియలో స్త్రీ కోల్పోయే వ్యక్తిత్వాన్ని ఆమె ప్రశ్నించారు. స్త్రీని ఒక భోగ వస్తువుగా చూసే సమాజ పోకడలను ఆమె తన కవిత్వంతో ఎండగట్టారు. నడిచే గాయాలు (1990) ఇది ఆమె అత్యంత ప్రసిద్ధ కవితా సంకలనం. సమాజంలో స్త్రీలు అనుభవించే అవమానాలను, గాయాలను ఇందులో శక్తివంతంగా చిత్రించారు. ఈ కవితలో స్త్రీ శక్తిని, ఆమె ఆలోచనా ధోరణిని వివరించారు. అణగారిన వర్గాల మరియు స్త్రీల గొంతుకగా ఈ రచన నిలుస్తుంది. నిర్మల గారి కవిత్వంలో తీక్షణత ఎక్కువగా ఉంటుంది. ఆమె వాడే పదాలు పాఠకుడిని ఆలోచింప జేయడమే కాకుండా, వ్యవస్థలోని లోపాలను సూటిగా తగులుతాయి. ఆమె కవిత్వం చదువుతుంటే ఒక రకమైన సామాజిక స్పృహ కలుగుతుంది. "నీలి మేఘాలు" (స్త్రీవాద కవితా సంకలనం) లో ఆమె కవితలు ఎంతో ప్రాచుర్యం పొందాయి. ఆమె రాసిన 'వంటరిల్లు' ఇంటి పరిసరాల గురించి ప్రస్తావిస్తూ స్త్రీ జీవితం నాలుగు గోడల మధ్యే ఎలా ముగిసిపోతుందో చెప్పిన విధానం అద్భుతం. స్త్రీని కేవలం 'వంటగది'కి పరిమితం చేసే సంస్కృతిని ఆమె తీవ్రంగా నిరసించారు. స్త్రీ కేవలం ఒక అలంకార ప్రాయమైన వస్తువు కాదు; ఆమెకు ఒక మెదడు, ఒక హృదయం, మరియు సొంత అస్తిత్వం ఉన్నాయి అని ఆమె సందేశం ఇచ్చారు.

జయప్రభ

జయప్రభ గారు ఆధునిక తెలుగు సాహిత్యంలో, ముఖ్యంగా స్త్రీవాద కవిత్వంలో ఒక విశిష్టమైన మరియు విలక్షణమైన ముద్ర వేసిన కవయిత్రి. కొండెపూడి నిర్మల గారి కవిత్వంలో సామాజిక ఆవేశం ఎక్కువగా కనిపిస్తే, జయప్రభ గారి కవిత్వంలో భావకవిత్వపు సుకుమారతతో కూడిన స్త్రీవాద దృక్పథం కనిపిస్తుంది. జయప్రభ గారి కవిత్వం స్త్రీ హృదయపు లోతులను, ఆమె సున్నితమైన భావాలను ఆవిష్కరిస్తుంది. స్త్రీ దేహంపై సమాజం రుద్దే కట్టుబాట్లను, పురుష భావజాలాన్ని ఆమె ధైర్యంగా ప్రశ్నించారు. కేవలం ఇంటికి, వంటగదికి పరిమితం కాకుండా, స్త్రీకి ఒక సొంత ప్రపంచం, ఇష్టాఇష్టాలు ఉంటాయని ఆమె కవిత్వంలో స్త్రీ అస్తిత్వం చాటి చెప్పింది. రొమాంటిక్ కవిత్వంలో ఉండే మాధుర్యాన్ని వదలకుండానే, అందులో స్త్రీకి ఉండాల్సిన గౌరవాన్ని ఆమె డిమాండ్ చేస్తారు. ఆమె కలం నుండి వెలువడిన అనేక కవితా సంపుటాలు తెలుగు సాహిత్యంలో చర్చనీయాంశమయ్యాయి. సూర్యుడు కూడా ఉదయిస్తాడు స్త్రీల ఆశలను, ఆకాంక్షలను ప్రతిబింబించే సంపుటి. వామనుడి పాదం 1988 రచనలో పితృస్వామ్య వ్యవస్థ స్త్రీల అవకాశాలను ఎలా అణచివేస్తుందో ఈ శీర్షిక ద్వారా ప్రతీకాత్మకంగా చెప్పారు. సామాజిక మార్పు కోసం స్త్రీలు సిద్ధమవ్వాలని పిలుపునిచ్చారు. ఆమె రాసిన 'చూపులు' వంటి కవితలు ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు పొందాయి. పురుషుల చూపులు స్త్రీలను ఎలా అసౌకర్యానికి గురి చేస్తాయో, స్త్రీని కేవలం ఒక వస్తువుగా ఎలా చూస్తాయో ఆమె అత్యంత ప్రభావవంతంగా చిత్రించారు. "స్త్రీవాదం అంటే పురుషద్వేషం కాదు, అది స్త్రీల ఆత్మగౌరవ ప్రకటన" అని ఆమె రచనలు నిరూపిస్తాయి. కొండెపూడి నిర్మల గారి కవిత్వంలో 'ఘర్షణ' ఎక్కువగా కనిపిస్తే, జయప్రభ గారి కవిత్వంలో 'ఆత్మాన్వేషణ' మరియు 'అందమైన నిరసన' కనిపిస్తాయి.

మందరపు హైమవతి

ఆధునిక తెలుగు సాహిత్యంలో మందరపు హైమవతి గారు సున్నితమైన భావుకత, సామాజిక స్పృహ కలిగిన విశిష్టమైన కవయిత్రి. స్త్రీవాద కవిత్వం ఉధృతంగా సాగుతున్న కాలంలో, ఆవేశం కంటే ఆలోచనను, గొడవ కంటే గొంతుకలోని ఆర్తిని నమ్ముకుని ఆమె తన అక్షర ప్రయాణాన్ని సాగించారు. హైమవతి కవిత్వంలో స్త్రీల అంతరంగ చిత్రణ చాలా లోతుగా ఉంటుంది. కుటుంబంలో, సమాజంలో మనుషుల మధ్య ఉండాల్సిన ఆత్మీయతను, ప్రస్తుతం పెరుగుతున్న యాంత్రికతను ఆమె నిరసించారు. స్త్రీ తన ఉనికిని చాటుకోవడానికి పడే తపనను ఆమె కవిత్వంలో చూడవచ్చు. ఒక మధ్యతరగతి మహిళ ఇంటి బాధ్యతలు, తన కలల మధ్య నలిగిపోయే విధానాన్ని ఆమె చిత్రించారు. 'సూర్యుణ్ణి నిద్రలేపుతూ' అనే సంపుటి ఆమెకు మంచి గుర్తింపు తెచ్చిపెట్టింది. నిరాశలో ఉన్నవారికి ఒక కొత్త ఆశను

చూపేలా ఇందులో కవితలు ఉంటాయి. స్త్రీల మనసులో దాగిన పోరాటాలను 'నిశ్శబ్ద తరంగాలు' అనే రచనలో ఆవిష్కరించారు. స్త్రీ అస్తిత్వాన్ని, సమాజంలో ఆమె స్థానాన్ని వివరిస్తూ రాసిన కవితలు 'ఆమె' లో ఉన్నాయి. మందరపు హైమవతి గారి శైలి చాలా సరళంగా, మనసుకు హత్తుకునేలా ఉంటుంది. కొండెపూడి నిర్మల గారి కవిత్వంలో 'ఘాటు' ఉంటే, హైమవతి గారి కవిత్వంలో 'నిశ్శబ్దమైన నిరసన' కనిపిస్తుంది. ఆమె కవిత్వంలో నిత్యజీవితంలోని సామాన్యమైన వస్తువులను కూడా గొప్ప ప్రతీకలుగా వాడుకుంటారు. కేవలం స్త్రీవాదం మాత్రమే కాకుండా, సమకాలీన సామాజిక అంశాలపై కూడా ఆమె తన కలం చూపించారు.

ముగింపు

ఆధునిక తెలుగు కవిత్వంలో స్త్రీల భాగస్వామ్యం గురించి చర్చను ముగిస్తూ, వారి ప్రస్థానం సమాజంలో తీసుకొచ్చిన మార్పులను విశ్లేషించవచ్చు. ఆధునిక కవయిత్రులు కేవలం అక్షరాలను పేర్చలేదు, వారు శతాబ్దాల నిశ్శబ్దాన్ని ఛేదించారు. వారి కవిత్వ ప్రయాణం పితృస్వామ్యపు సంకెళ్లను తెంచుకుంటూ, ఒక సరికొత్త సామాజిక చైతన్యాన్ని ఆవిష్కరించింది. ఒకప్పుడు స్త్రీలు తమ బాధలను గడప దాటనిచ్చేవారు కాదు. కానీ ఆధునిక కవయిత్రులు వంటగదిలోని పొగను, మనసు లోని మంటను కవిత్వంగా మార్చారు. ఈ ప్రస్థానం స్త్రీని ఒక 'వస్తువు' స్థానం నుండి ఒక 'వ్యక్తి' స్థానానికి చేర్చింది. ఆధునిక కవిత్వం కేవలం మధ్యతరగతి స్త్రీలకే పరిమితం కాలేదు. ఇది దళిత, బహుజన, మైనారిటీ మరియు గిరిజన స్త్రీల గొంతుకలను కూడా కలుపుకుని ఒక 'బహుళత్వ స్త్రీవాదం'గా ఎదిగింది. స్త్రీలు కవిత్వంలోకి రావడం వల్ల తెలుగు భాషకు ఒక కొత్త సున్నితత్వం, అదే సమయంలో ఒక కొత్త పదును చేకూరింది. స్త్రీలకే ప్రత్యేకమైన 'అనుభూతి వాదం' సాహిత్యానికి కొత్త అలంకారాలను అందించింది. నేటి తరం కవయిత్రులు కేవలం ఇంటి సమస్యలకే పరిమితం కాకుండా, గ్లోబలైజేషన్, పర్యావరణం, మరియు డిజిటల్ యుగంలో స్త్రీ ఎదుర్కొంటున్న సవాళ్లపై స్పందిస్తున్నారు. ఇది కవిత్వం యొక్క పరిధిని మరింత విస్తృతం చేసింది. ఆధునిక తెలుగు కవయిత్రులు సృష్టించిన సాహిత్యం కేవలం చదవడానికి మాత్రమే కాదు, అది ఒక సామాజిక సంస్కరణ. "స్త్రీవాదం అంటే పురుష ద్వేషం కాదు, అది మానవత్వపు పునర్నిర్మాణం" అని వీరు నిరూపించారు. ఆధునిక తెలుగు కవయిత్రులు మన సాహిత్యంలో ఒక నిశ్శబ్ద విప్లవాన్ని తీసుకువచ్చారు. వారు రాసిన ప్రతి అక్షరం ఒక ప్రశ్నగా మారి సమాజాన్ని ఆలోచింపజేసింది. స్త్రీ కేవలం కుటుంబంలో ఒక భాగం మాత్రమే కాదు, ఆమెకంటూ ఒక స్వతంత్ర మేధస్సు, ఆశయం మరియు అస్తిత్వం ఉన్నాయని ఈ కవిత్వం చాటిచెప్పింది. స్త్రీవాదం అంటే పురుష ద్వేషం కాదు, అది ఒక సమానత్వ అన్వేషణ అని నిరూపిస్తూ, తెలుగు సాహిత్యాన్ని ప్రపంచ స్థాయి ప్రమాణాలకు చేర్చడంలో ఈ కవయిత్రులు సఫలీకృతులయ్యారు.

ఆధార గ్రంథాలు

1. స్త్రీవాద దోరణులు - సమకాలీన సాహిత్యం,యువభారతి రజతో త్సవ సదస్సు పత్రాలు, యువ భారతి,హైదరాబాద్,1994.
2. రేవతి దేవి, శిలా లొలిత,అర్మిలి ప్రచురణ,సికింద్రాబాద్,1980
3. రేవతి దేవి,రుచించని మాట
4. నిర్మల,కొండెపూడి, నీలి మేఘాలు,స్వేచ్ఛ ప్రచురణ,హైదరాబాద్, 1993
5. జయప్రభ, వామనుడి మూడోపాదం, యువభారతి,హైదరాబాద్, 1988.
6. హైమవతి,మందరపు, నీలిగోరింట,ప్రజాశక్తి ప్రచురణ, 2018.

★★★

Vol. 23 | Spl. Issue 03 | March 2026 | BHAVAVEENA | ISSN No. : 2456-4702 | RNI No. APTEL/2003/12253

RNI No. APTEL/2003/12253 | Reffered Journal & Peer Reviewed Journals | ISSN No. 2456-4702

భావవీణ

కళలు, సాహిత్య, సాంస్కృతిక భాషాధ్యయన పత్రిక

BHAVA VEENA

Journal of Arts, Literary, Culture & Language Study

అపురూప నవలా నాయికలు నేటి తరానికి ప్రతీకలు

- ఆవలకొండ అన్నపూర్ణ

విశ్రాంత తెలుగు ఉపాధ్యాయురాలు, 16-329 పానగల్, శ్రీకాళహస్తి, తిరుపతి జిల్లా, ఆంధ్రప్రదేశ్.

16వ శతాబ్దంలో ఇంగ్లాండులో జరిగిన పారిశ్రామిక విప్లవ ప్రభావం ప్రపంచంలోని అన్ని దేశాలపై పడింది. అంతేకాక విశ్వసాహిత్యంపై కూడా ఈ ప్రభావం పడక తప్పలేదు. అలా పారిశ్రామిక విప్లవ ఫలితంగా మానవునికి జీవిత పోరాటం తప్పలేదు. ఆ పోరాటంలో రసాస్వాదన చేసే సమయం తక్కువైంది. విశ్వసాహిత్య విపంచికను ఆలపించడానికి ఎవరికీ తీరిక లేక జీవన పోరాటం వైపు సాగింది. అటువంటి సందర్భంలో సాహిత్యంలో పెను మార్పులు చోటుచేసుకున్నాయి. ఆ మార్పుల కారణంగా వచ్చిన ప్రక్రియలు నాటకం, నవల, కథ, కథానిక అని చెప్పవచ్చు.

20వ శతాబ్దంలో కలం పట్టిన ప్రతీ ఒక్కరూ నవలా ప్రక్రియను ఒరసి చూసినవారే. పురుషుల కంటే స్త్రీలే ముఖ్యంగా ఈ ప్రక్రియలో వినూత్న ప్రయోగాలు చేశారు. ఒకానొక సందర్భాలలో కొందరు పురుషులు సైతం స్త్రీల పేర్లను కలంపేర్లుగా పెట్టుకొని రచనలు సాగించారంటే అతిశయోక్తి కాదేమో.

"నవల" ఆవిర్భావం :

నవల అనగా కొత్త అని, "నావెల్" అను పదము "నొవెల్లా" అనే లాటిన్ పదము నుండి ఉద్భవించిందిగా తెలుస్తున్నది. తెలుగులో వచ్చిన మొదటి నవల "రామచంద్ర విజయం". బెంగాలీ నవలల పోటీకొరకు అనేకమంది వరదలా ఈ ప్రక్రియలో కాలుపెట్టారు. కానీ తెలుగు సాహిత్యంలో మొట్టమొదటి నవలగా "రాజశేఖర చరిత్ర" (కందుకూరి) మకుటాయమానంగా నిలిచింది. కవిసామ్రాట్ విశ్వనాధ వారు సైతం ఈ నవలా ప్రక్రియలో అడుగుపెట్టి రచనలు చేశారంటే నవలల గొప్పతనం ఏమిటో తెలుస్తుంది. స్త్రీవాద రచయితగా పేరొందిన "చలం" నవలల గురించి అందరికీ తెలిసిందే.

20వ శతాబ్దం తెలుగు నవలా వికాసానికి పెద్దపీట వేయబడింది. అందులో ముఖ్యంగా స్త్రీలు రచనా రంగంలో అడుగుపెట్టి దేదీప్యమానంగా వెలుగొందారంటే ఆశ్చర్యం లేదు. ఆ నవలలు అనేక చలనచిత్రాలుగా రూపొందాయి. ఈనాటి ఈ ప్రసంగ విశేషం ముగ్గురు రచయిత్రులు తమ కథలోని నాయికలను ఎలా తీర్చిదిద్ది, వారి పాత్రలకు ఎలా ప్రాణం పోశారో తెలియజేయటం.

తొలితరం నవలా రచయిత్రులలో ఎంతోమంది ఉన్నా, పాఠకుల హృదయాన్ని ఆకట్టుకున్నవారిలో యద్దన పూడి సులోచనారాణి, పోల్కంపల్లి శాంతాదేవి, కోడూరి కౌసల్యాదేవి, మాదిరెడ్డి సులోచనలుగా పేర్కొనవచ్చు. ఆనాటి యువతులు వారి రచనలపై ఎంతో మక్కువ చూపడం, ఆ కథానాయికలను తమలో ఊహించు కోవడం, పనిపాట మానేసి చదవడం, దానివల్ల పెద్దల దగ్గర తిట్లవర్షం కురిపించుకున్నారంటే ఆ నవలలు వారిని

ఎంతగా ఆకట్టుకున్నాయో తెలుస్తుంది. నా ప్రసంగంలో ఈనాడు ముగ్గురు రచయిత్రులు రాసిన నవలలో ఓ మూడు పాత్రలు విశ్లేషించడం ప్రధాన అంశం. నవలా దేశపు రాణిగా పేరు పొందిన యద్దనపూడి సులోచనారాణి "ఆరు అడుగుల అందగాడు" నవలా నాయకుడిగా రాజశేఖరుని సృష్టించి ఓ ప్రభంజనం కురిపించారు. అయితే నవలా నాయికను మాత్రం ఓ కొత్త పంధాలో తన రచనల్లో తెలియజేశారు. అంతవరకు తల్లిదండ్రుల చాటుబిడ్డగా, అత్తమామలకు ఒదిగిపోయే కోడలిగా, భర్త మాటలకు జవదాటని ఇల్లాలిగా, సహనశీలిగా తీర్చిదిద్ది, యద్దనపూడి మధ్యతరగతి మహిళ ఎదుర్కొనే నిత్యజీవిత సమస్యలను ఆధారం చేసుకొని తన రచనలో స్త్రీ పాత్రలను తీర్చిదిద్దారు.

ఆమె రాసిన ప్రతి నవలలో నాయిక ఓ ప్రత్యేకతను సంతరించుకుందని చెప్పవచ్చు. "సెక్రటరీ"లో జయంతి పాత్ర మధ్యతరగతి జీవితానికి ప్రతీక. కష్టాలొచ్చిన, కన్నీళ్ళొచ్చిన బెంబేలు పడక, ఆలాభిమానంతో సమస్యలను ఎదుర్కొనే మనస్తత్వం కల్గిన పాత్ర. ఎవ్వరికి తల వంచని పాత్ర. ఈనాటి ఆధునిక యువతులు ఘర్షణ పడుతున్న విషయాలను యద్దనపూడి 20వ శతాబ్దం తొలి రోజులలోనే తెలియజేశారు.

ఈ నవలను చలనచిత్రంగా రూపొందించి చక్కగా చిత్రించారు. ఆరు అడుగుల రాజశేఖరుని పాత్రలో ఎ.ఎన్.ఆర్ గారు ఒదిగిపోతే, జయంతి పాత్రలో వాణిశ్రీ గారు సమ ఉజ్జీగా నిలిచారు. ఆత్మాభిమానానికి నిలువెత్త నిదర్శనంలా జయంతి పాత్రను సులోచనారాణి గారు తీర్చిదిద్దారు. నవలా నాయిక అంటే ఇలానే ఉండాలి, ధనానికి లోటున్నా గుణానికి లోటు లేని పాత్ర జయంతి పాత్ర. అడుగడుగున హుందాతనం, ఎవరికీ తలవంచని ధీరగుణం, సమస్యలు వచ్చినప్పుడు ధైర్యంగా ఎదుర్కొనే గుణాన్ని యద్దనపూడి సులోచనారాణి తన నాయికలో చిత్రించారు.

రెండవ నవలా రాజం (అరికెపూడి) :

కోడూరి కౌసల్యాదేవి నవల 'శాంతి నికేతనం'. 1970 దశకంలో యువత ఈ నవల చదవడానికి ఎంతో ఉత్సాహం చూపేవారు అనడం అక్షరసత్యం. సున్నితమైన భావాలు, నుతిమెత్తని హృదయాలతో మనస్సును హత్తుకునే సంఘటనలు ఈ నవలలో కోకొల్లలు. తల్లిదండ్రులు పిల్లలపట్ల చూపించే అనురాగం, అన్నా వదినల ఆప్యాయత, కూతురుపై మమకారం, తాము పెంచిన చెట్లకు సైతం మనుషుల పేర్లు పెట్టి వాటిని కన్నబిడ్డలుగా సాకడం మరపురాని ఘట్టాలు.

ఈ 'శాంతినికేతన్' నాయిక పేరు శాంతి. నాయకుని పేరు రాజశేఖరం. శాంతి పేరులోనే గొప్ప శాంతి, ఆ తల్లి దండ్రులకు గారాబు తనయ. రంగుల కాన్వాసుపై చక్కని బొమ్మలు వేయగల్గిన చిత్రకారిణి. గొప్ప భావుకత కల్గినది. కలకత్తాలోని దక్షిణేశ్వరం, శాంతినికేతన్ ను సందర్శించాలన్న ఆకాంక్ష బతీయంగా కల్గిన స్త్రీమూర్తి. అమ్మానాన్నల అనురాగం, అన్నదమ్ముల అనుబంధాల మధ్య ప్రకృతి ఒడిలో సేదతీరిన శాంతి ఒక్కసారిగా వాస్తవ జీవితంలో ఇమడలేకపోయింది.

శాంతినికేతనంలో చదవాలనుకుంది. శేఖరునిపై మక్కువ పెంచుకుంది. పరిస్థితుల ప్రాబల్యంతో ఇద్దరి మధ్య అపార్థాలు చోటుచేసుకుంటాయి. ఎక్కడా తన వ్యక్తిత్వాన్ని చంపుకోలేక, పరిస్థితులలో ఇమడలేక సతమతమవుతుంటుంది. ఇంటిలో సాటివారితో ఇమడలేక శాంతినికేతనంలో చేరుతుంది. అక్కడ గోవిందరావుతో పరిచయం, పరిణితి లేమితో అతన్ని పెళ్ళి చేసుకోవాలనుకోవడం ఈనాటి యువతరం ఆలోచనలాగా సాగుతుంది. గోవిందరావు నిజస్వరూపం తెలుసుకొని మనస్సు వ్యాకులంతో ఇంటికి తిరిగిరావడం, అంతవరకు ఆడింది ఆటగా, పాడింది పాటగా సాగిన జీవితం ఉన్నట్టుండి అతలాకుతలమై పడినట్టుగా ఉంటుంది.

పెద్దవదిన తల్లిలాగా ఆదరిస్తే, చిన్నవదిన మాత్సర్యం, విపరీత ధోరణి శాంతి మనస్సును వ్యాకులపరుస్తుంది. చిన్నవదిన తన చెల్లెలిని రాజశేఖరానికి ఇవ్వాలనుకోవడం మనస్సు చివుక్కుమంటుంది. సున్నిత మనస్తత్వం కావడంతో మనస్సు అల్లకల్లోలం చేసుకుంటుంది.

ఈనాడు శాంతిలాంటివారు జీవితంలో ఎదురయ్యే సమస్యలకు తట్టుకోలేక పలాయనవాదమో లేక

ఆత్మహత్యో చేసుకోవడం జరుగుతోంది. కానీ అలాంటి వారు కాస్త ఓపిగ్గా ఆలోచిస్తే వారి జీవితాలు సుఖవంతం కాగలవని రచయిత్రి శాంతి పాత్ర ద్వారా తెలియజేశారు. ఈనాడు స్త్రీలు ఎదుర్కొనే అనేక సమస్యలను తన నవలలో ఎత్తిచూపడం, ఉమ్మడి కుటుంబాలలో ఆత్మీయతలు, అనురాగాలు, అపవాదులు, దూషణ భూషణలు తట్టుకొని నిలబడగల ధీరురాలుగా తీర్చి దిద్దడం జరిగింది.

మూడవ నాయిక:

పోల్కంపల్లి శాంతాదేవి గారి "చండీప్రియ". ఐశ్వర్య వంతుల అమ్మాయి. ఆ పొగరు ఆ అమ్మాయిలో ప్రారంభంలో కనిపిస్తుంది. ఎవరినీ లెక్కపెట్టని మనస్తత్వం. వలచిన అబ్బాయిని ఐశ్వర్యమదంతో మాటల తూటాలతో హింసించి అవమానిస్తుంది. మొదట్లో ఆ పాత్ర పరిణితి లేని, ఉబ్బుతున్న అహంకారం కల్గిన పాత్ర. తరువాత తండ్రికి వ్యాపారంలో నష్టం రావడం, అందువల్ల తన తండ్రికి ఆరోగ్యం దెబ్బతినడంతో ఆ పాత్రలో మార్పు గోచరిస్తుంది.

పరిస్థితులతో రాజీపడి ఉల్లాసంగా ఉంటుంది. సరదాగా నేర్చుకున్న వీణ తండ్రి కోసం ప్రదర్శనలిస్తుంది. అది తండ్రికి ఏమాత్రం నచ్చదు. తన కుమార్తెను కొడుకులా పెంచానని, పరిస్థితులకు తలోగ్గక ధైర్యంగా ప్రవర్తించమంటాడు.

తమ ఈ కష్టాలకు కారణం అనిల్ అన్న ఇంద్రనీల్ అని చండీప్రియ అతన్ని అనుమానిస్తుంది. మధ్యతరగతికి చెందిన అనిల్ తనను ప్రేమించాడు. అతని తాహత్తును అతనికి తెలియజేసి అతని కుటుంబాన్ని అవస్థలపాలు చేస్తుంది. ఇంద్రనీల్ వారిని ఆదుకోవడంతో అతనిపై కక్ష వహిస్తుంది. ముఖ్యంగా తన తండ్రికి అతడు ఆప్తుడు కావడం సహించలేకపోతుంది. చివరకు అతని నీడనే కూడా అసహ్యించుకుంటుంది.

తండ్రి అనారోగ్యంతో ఆసుపత్రి పాలుకావడంతో విధిలేక ఇంద్రనీల్ ఇంట్లో తలదాచుకుంటుంది. ఇంద్రనీల్ పినతల్లి శారదమ్మ మాటల్లో "కాంచనం ఉన్నంతసేపు కళ్ళు కనిపించని మనిషి ఇప్పుడు కొంచెం కొంచెం కళ్ళు కనిపిస్తుండాలి. అబ్బా! డబ్బు ఉన్నప్పుడు ఎంత ఎగిరి ఎగిరి పడేది? అహంకారంతో ఆకాశంలో విహరించేవాళ్ళు ఎప్పటికైనా నేలపైకి నడవాల్సిందే" అని దెప్పిపొడిచేది.

ప్రేమపాశంలో చిక్కి ఇంద్రనీల్ ను ప్రేమించడం, అతను ఆ ప్రేమను తిరస్కరించడం తట్టుకోలేక పోయింది. ఆ తిరస్కారం తట్టుకోలేక అతన్ని కాల్చి హంతకురాలిగా ముద్రవేసుకుంటుంది. అదృష్టవశాత్తు ఆ కాల్పుల్లో తప్పించుకుని, అది ప్రమాదవశాత్తు జరిగిందని పోలీసులకు చెప్పడంతో చండీప్రియకు శిక్ష పడదు. చండీప్రియ తండ్రి తన కుమార్తె పెళ్ళికోసం తాపత్రయపడి చనిపోతాడు. ఇక విరాగిలాగా వీణా కచేరీలు చేసి అనారోగ్యం పాలవుతుంది. జీవితంలో ఎవరంటే గిట్టదు అనుకుందో, పరిస్థితులు అతన్నే కావాలనుకునేటట్లు చేస్తాయి.

తన ప్రేమను వ్యక్తం చేస్తే నిరాకరించిన ఇంద్రనీల్ ను ఏ విధంగానైనా ప్రేమపాశంలో బంధించాలి, లేదా తాను యమపాశం తగిలించుకోవాలని గట్టిగా ఒక నిర్ణయానికి వచ్చి, ఓపికతో కరుడుగట్టిన మనిషిని సైతం ప్రేమపాశంలో బంధించవచ్చని చండీప్రియ తెలియ జేసింది. ఈ నవలను చలనచిత్రంగా కూడా తీశారు. ఇందులో కథానాయకుడిగా అందాలనటుడు శోభన్ బాబు, చండీప్రియగా జయప్రద బాగా రాణించారు.

ఈ ముగ్గురు నాయికలను నిశితంగా పరిశీలిస్తే ఒకరికి తగని పాత్ర మరొకరిది. ఆత్మాభిమానం కల్గిన పాత్రలు మూడు. ఈనాడు ప్రేమ పేరుతో ఆకర్షణకు లోనై, వాస్తవ జీవితంలో ఇమడలేక విడాకులు, ఆత్మహత్యలు, వేరుకావడాలు, ద్వేషాలు, కక్షలు, కార్పణ్యాలు పెంచుకునే వారికి ఈ నవలా నాయికలు చక్కటి సందేశం ఇచ్చారు. క్షణికమైన నిర్ణయాలు అనర్థాలకు దారితీసి జీవితాలను చిన్నాభిన్నం చేస్తాయని, సమస్యకైనా పరిష్కారం ఉంటుందని ఒక్క క్షణం ఆలోచిస్తే అకాలమరణాలు, ఆత్మహత్యలు ఉండవని, నైతికంగా పతనం కారని ఈ నవలా రచయిత్రులు తమ నవలా నాయికల ద్వారా తెలియజేశారు. అందుకే నేనంటాను "అలనాటి అపురూప

నాయికలు నేటి తరానికి ప్రతీకలు'' అని. ఏ రచన అయినా సమా జాన్ని, వ్యక్తులను బాగుచేయడానికే అని గ్రహించగల్గిన నాడు అందరూ బాగుంటారు. ఆ అందరిలో మన మందరం ఉంటాము

ఆధార గ్రంథాలు

1. యాద్దనపూడి సులోచనారాణి సెక్రటరీ
2. కోడూరి కౌసల్యదేవి శాంతి నీకేతన్
3. పోల్కంపల్లి శాంతా దేవి చండి ప్రియ
4. తెలుగు నవల వికాసం

★★★

Vol. 23 | Spl. Issue 03 | March 2026 | BHAVAVEENA | ISSN No. : 2456-4702 | RNI No. APTEL/2003/12253

RNI No. APTEL/2003/12253 | Reffered Journal & Peer Reviewed Journals | ISSN No. 2456-4702

భావవీణ

కళలు, సాహిత్య, సాంస్కృతిక భాషాధ్యయన పత్రిక

BHAVA VEENA

Journal of Arts, Literary, Culture & Language Study

స్త్రీ చైతన్యం - కాకాని నవల

- మల్లెంబోక ఉదయశ్రీ
నెల్లూరు.

నవలా ప్రక్రియ - పరిచయం

నవల :

పాశ్చాత్య సాహిత్య ప్రభావంతో తెలుగు సాహిత్యంలో ప్రవేశించి, విస్తృతంగా వెలువడిన, వెలువడుతున్న ప్రక్రియ నవల. ఈ ప్రక్రియను కోస్తాంధ్ర, తెలంగాణ, రాయలసీమ ప్రాంతాలకు చెందిన రచయితలెందరో చేపట్టి, వివిధ వస్తు వైవిధ్యాలతో నవలలు రాశారు. కోస్తాంధ్ర నుండి అధిక నవలలు వెలువడ్డాయని చెప్పవచ్చు. కవిసామ్రాట్ విశ్వనాథ, రావిశాస్త్రి, బుచ్చిబాబు, కోకు వంటి అగ్రగణ్యులు మంచి నవలలను వెలువరించగా, వీరందరికీ మార్గదర్శకునిగా కందుకూరి వీరేశలింగం గారిని స్మరించక తప్పదు.

కాకాని చక్రపాణి - రచనా వైశిష్ట్యం

వీరి వారసత్వాన్ని కొనసాగిస్తూ అనేకులు వివిధ ప్రయోగాలతో నవలలు వెలువరించగా, వారిలా స్త్రీని పాత్రకు మాత్రమే పరిమితం చేయకుండా, వివిధ సామాజిక నేపథ్యాలను స్వీకరించి, స్త్రీ చేతనే సమాజాన్ని జాగృతం చేస్తూ, సుతిమెత్తని మాటలతో, ఆమెలోని ఓర్పుతో, నేర్పుతో, చాణుక్యతతో కథానాయికను నిలిపిన తీరులో కాకాని చక్రపాణి వంటి వారు దిగ్విజయం సాధించారు. ఈ విషయంలో వారికి వారే సాటి. ఈయని పదకొండు నవలలూ వేటికవే ప్రత్యేకంగా నిలుస్తాయి. కాకాని గారి రచనా తీరు "స్త్రీ చిత్రీకరణ - స్త్రీ బాధ - స్త్రీ చైతన్యం - స్త్రీ చూపిన పరిష్కారం" అనే క్రమంలో సాగింది. "నువ్వు నాకొద్దు" నవలను సైతం ఇదే ధోరణిలో చదవగలం. అయితే ఇందులో మానసిక సమస్యను చిత్రించడంతో చక్కని మనోవిశ్లేషణాత్మక నవలగా రూపాంతరం చెందింది. కాకాని చక్రపాణి గారు ప్రముఖ తెలుగు కథా-నవలా రచయితే కాక, అనువాదకుడు, కాలమిస్టు కూడాను. కాకాని గారు స్త్రీ పక్షపాతి. స్త్రీ సబల కాదు, ఆదిశక్తి అంటూ రచనలన్నింటిలోనూ ఆమెను ఉన్నతంగా తీర్చిదిద్దారు.

"నువ్వు నాకొద్దు" - మనోవిశ్లేషణాత్మక నవల

"నువ్వు నాకొద్దు" నవలను రచయిత కాకాని గారు మనోవిశ్లేషణాత్మక కథాంశంతో పాఠకులను ఆలోచింప జేస్తుంది. తదనుగుణంగానే కథాంతాన్ని పాఠకుల మనస్సులకే వదిలేశారు. ఈ నవల ద్వారా మనిషి అచేతనావస్థలోని నిగూఢమైన, గుప్తతరమైన భావనలు, మనిషి ప్రవర్తనను ఏ రకంగా ప్రభావితం చేసి, జీవితాలను ఎలాంటి మలుపులు తిప్పుతాయో సవివరంగా వివరించారు కాకాని. కథను సంఘటన చుట్టూ తిప్పుతూ, పాత్రల మనస్తత్వాన్ని విశ్లేషిస్తూ చెప్పదలచుకున్న అంశాన్ని లోతుగా పరిశీలించి, పాఠకుడిని ఆలోచింపజేయగల రచనలు చేయడం కాకాని గారికి వెన్నతో పెట్టిన విద్య. ఈ రచనా తీరులో నడచిన నవలయే "నువ్వు - నాకొద్దు".

సుధావల్లి - కథానాయిక పాత్ర విశేషాలు

కథానాయిక సుధావల్లి తనను పరిత్యజించి పారిపోయిన తన మేనమామ, మరియు భర్తయైన లెక్చరర్ పరమేశంను తన దారికి తెచ్చుకున్న ప్రయాణంలో మనస్తత్వశాస్త్రాన్ని, మనోశాస్త్రజ్ఞుల శాస్త్రీయత్వాన్ని విశ్లేషిస్తూ సగటు తెలుగు ఆడపడుచు సుధావల్లి చేత లెక్చరర్ పరమేశానికి కనువిప్పు కలిగించడం ఈ నవల లోని ప్రత్యేకత. సుధావల్లి పాత్రలోని చైతన్యాన్ని రచయిత చిత్రించిన విధానాన్ని పరికిస్తే... ఆమెను వివాహమాడిన రెండో రోజే వదలివెళ్లిన భర్త ఉద్యోగం నవసమాజాన్ని తీర్చిదిద్దే అధ్యాపక వృత్తి. మానసిక దృఢత్వం, భావోద్వేగాలను ఒడిసిపట్టిన సుధావల్లి చేత బాధ్యతగల వృత్తిలోని పరమేశంతో ''నీ నుండి నీవు పారిపోవాలన్నా, నీ ఆలోచనలను నీవే నాశనం చేయాలి, వాటిని నీవే ఎదుర్కోవాలి'' అని పరమేశ్వరానికి మానసిక చైతన్యాన్ని కలిగించే మాటలను ఆమెచే పలికించడంతోనే రచయిత మహిళకు తన నవలల్లో ఎంతటి ప్రాధాన్యమిచ్చాడో మనం అర్థం చేసుకోగలం.

''పట్టువిడువరాదు పదివేలకైనను'' అనే సూక్తి ఉంది. స్త్రీలు తాము పట్టిన పట్టు విడువరు, అనుకున్న లక్ష్యం సాధించేవరకూ విశ్రమించరు. ఈ మాటలను ''సుధావల్లి'' పాత్ర ద్వారా అక్షరబద్ధం చేశారు కాకాణి. ఒక స్త్రీకి, ఒక పురుషుడికీ మధ్య దాంపత్య బంధమున్నా ఆకర్షణ ఎందుకు కలగదో విశ్లేషించి చూపే ప్రయత్నం చేశాడు చక్రపాణి. ఇదో చక్కని మనోవిశ్లేషణాత్మక నవల. ఈ నవలలో జరిగింది ఒక పురుషుడు, ఒక స్త్రీకి మధ్య జరిగిన పోరాటం కాదు. రెండు మనస్తత్వాల మధ్య జరిగిన పోరాటం.

కథా నేపథ్యం - పెళ్ళి, పలాయనం

''నువ్వు నాకొద్దు'' నవలలో సుధావల్లి -పరమేశ్వరం భార్యాభర్తలు. పెళ్ళికి ముందే తనంటే ఇష్టం లేదని తనతో వివాహానికి తాను పరమేశ్వరం నిరాకరిస్తున్నాడని తెలిసిన సుధావల్లి తట్టుకోలేక అందరి సమక్షంలో బావిలో దూకి ఆత్మహత్యా ప్రయత్నం చేసి, చివరకి పరమేశ్వరంతో మూడుముళ్ళు వేయించుకున్నది. కానీ, తన మేనత్త కూతురు సుధావల్లిని చిన్నప్పటి నుండి తన చేతుల మీదుగా ఎత్తుకొని తిప్పిన పరమేశం, వివాహమైన రెండో రోజు నుండి ఆమెకు దూరంగా ఉంటున్నాడు. తన చేతులపై నడయాడిన ఆ మేనకోడలిపై పరమేశానికి మధుర లోహలేమీ కలుగలేదు. తన అభిప్రాయాన్ని సూటిగా చెప్పలేకపోయాడు. ఉమ్మడి కుటుంబ ప్రయోజనాల రీత్యా కుటుంబ పెద్ద అయిన పెదనాన్న బలవంతంపై ఆమెను వివాహమాడాడు. అలా బలవంతపు పెళ్ళి చేసుకున్న పరమేశం తాళి కట్టిన రెండో రోజే ఉద్యోగరీత్యా భద్రాచలం చేరుకున్నాడు.

సుధావల్లి సాహస ప్రయాణం

పెద్దల సలహా సూచనల మేరకు సుధావల్లి తన మేనమామ, మరియు భర్తయైన పరమేశ్వరాన్ని వెదుక్కుంటూ వచ్చి, అతను పనిచేస్తున్న డిగ్రీ కాలేజీ మరియు ఇంటి(భద్రాచలం)లోకి అతని అభీష్టానికి విరుద్ధంగా ప్రవేశించడంతో ఈ నవల ప్రారంభమవుతుంది. భర్త చేత తిరస్కృతురాలైన సుధావల్లి సాహసికురాలై ఒంటరిగా, చిన్నమామయ్య గంగాధరం ప్రోత్సాహంతో, సైకియాట్రిస్టు సూచనలతో, పెద్దమామయ్య, అత్తమామల ఆశీర్వాదంతో మొగుణ్ణి తన దారికి తెచ్చుకునేందుకై లేదా మొగుడి జీవితంలో అర్ధభాగంగా మారేందుకై భద్రాచలానికి బయలుదేరింది. కొత్తకాపురంలోకి చీరసారెలతో కాకుండా, సూచనలు-సలహాలతో మెట్టినింటికి చేరుకొని, కళాశాల ప్రిన్సిపాల్ కు తనను తాను పరిచయం చేసుకొని, భర్త చేత దూషితురాలై బస్టాండుకు బలవంతంగా చేర్చబడింది కూడా. తిరిగి తన భర్త గుమ్మం వద్ద ప్రత్యక్షమై, భర్త తోడిదే తన జీవితమంటూ రాత్రంతా ఆరుబయటే కాలం గడిపిన గడుసుది. ఉమ్మడి కుటుంబ సాంప్రదాయ నేపథ్యంతో పెరిగిన సుధావల్లి ''తన మొగుడే తనకు లోకమని, అతను కాదంటే చావే శరణ్యమని'' తేల్చి చెబుతుంది. ఆమె పట్టుదలలో శక్తి, ఓజస్సు కనిపిస్తాయి. మనిషిలో ఎన్ని సుగుణాలున్నా ధైర్యం లేకుంటే అవి రాణించవు.

సత్యాగ్రహం - భర్తను ఎదుర్కొన్న తీరు

''గాంధీగారు చూపిన 'సత్యాగ్రహ' మార్గాన్ని

ఆచరిస్తాను. నన్ను నేను శిక్షించుకోవటం వల్ల నైనా నా పట్ల చేస్తున్న ద్రోహం ఆయనకు గుర్తు చేస్తాను. ఆయనంటే ప్రేమే నాకు. నేనంటే రోతపడే ఆయని దౌష్ట్యాన్నే నేను అసహ్యించుకుంటున్నాను." "ఆయనే నా బతుకు, నా చావు" అంటూ రమణమూర్తి బాబాయికి నిశ్చయంగా చెప్పిన ధీశాలి సుధావల్లి. భర్త బలహీనతపై దెబ్బకొట్టగల నేర్పరి. సత్యాగ్రహంలో భాగంగా భర్త యింటి ముందే టెంటు వేయడంతో భర్త యింట్లోకి ప్రవేశాన్ని సాధించింది. భర్త కొలీగ్ రామచంద్రం తనతో కొనసాగించ బోయిన ప్రేమాయణాన్ని భర్తకే వివరించిన ధీశాలి. ఈ సందర్భంలోనే భర్తచే మొదటిసారిగా తన్నులు తిని దు:ఖిస్తుంది.

దౌర్జన్యానికి ఎదురునిలిచిన 'మగనాలి'

కళాశాల కరస్పాండెంట్ వీరారెడ్డి తన నౌకరీ రామయ్య ద్వారా సుధావల్లి, పరమేశం "దాంపత్య బంధం" తెలుసు కున్న తర్వాత "ఫ్యూడలిస్టు పంచాయితీకి" సిద్ధపడగా, దురదృష్టవశాత్తు రామచంద్రం కూడా రావలసి వచ్చింది. వీరారెడ్డి "దొర" దౌర్జన్యానికి ఎదురునిలిచి, తన భర్తను చావుదెబ్బల నుండి రక్షించుకోవడమే గాక, "మొగుడు పెళ్ళాం మధ్య వేయ్యుంటాయి మధ్యనీ కెందుకు?" అని ఎదిరిస్తూ, కళాశాల విధుల్లో తప్పుచేస్తే క్రమశిక్షణా చర్యలు తీసుకోండి, అంతే గాని వ్యక్తిగత వ్యవహారాల్లో జోక్యం చేసుకునే హక్కు మీకెక్కడిదంటూ 'దొర'తనాన్ని ప్రశ్నించిన 'మగనాలి' సుధావల్లి. ఈ రకంగా భర్త ఉద్యోగాన్ని కాపాడుకోగలిగింది.

నిరాశ - ఆత్మహత్యా ప్రయత్నం

కానీ, అవమాన భారంతో రగిలిపోతున్న తన భర్త పరమేశ్వరం, ఈ ఉద్యోగాన్నీ-ఊరినీ-యింటినీ వదిలి పోతున్నాడని తెలియగానే కుళ్ళికుళ్ళి ఏడ్చింది. తన ప్రయత్నాలన్నీ విఫలమై, ఆశలన్నీ పేకమేడల్లో కూలి పోతుంటే తట్టుకోలేక తల్లడిల్లిపోయింది. తనకిక గోదారే గతి అని నిర్ణయించుకుంది. తన కౌమారదశలో తన బావ పరమేశ్వరం తనపై చూపిన అభిమానాన్ని ప్రేమే అనుకొని మురిసిపోయిన వైనాన్ని గుర్తుచేసుకుంది. చిన్నప్పటి నుంచి తన కుటుంబ సభ్యులందరూ 'నీ మొగుడు... నీ మొగుడు' అంటుంటే తాను మురిసిపోయేది. ఆ భావనలోనే విఫల ఆత్మహత్యా ప్రయత్నంతో బావచే మూడుముళ్ళు వేయించుకుందే గాని... బావ మనసులో తనపై ఎలాంటి భావమూ లేదనే విషయం ఇప్పుడు గుర్తుకు వస్తుంది. కానీ తన మనసంతా బావనాయే. బావను తప్ప మరొక మగాణ్ణి తన మొగుడిగా ఊహించనే లేదు. స్వయానా తనను మరో వివాహం చేసుకొమ్మని ప్రోత్సహించిన భర్త అభిప్రాయాన్ని ఖండించింది. ఇలా ఆత్మాభిమానం గల సుధావల్లికి ప్రయత్నించి ఓడిపోతున్నా ననే ఉద్వేగంలో కూరుకుపోయింది. దానిని పంచు కునేందుకు భద్రాచలంలో తనకంటూ ఎవ్వరూ లేరు. ఆమె, చావైనా బ్రతుకైనా మొగుడింట్లోనే అని పుట్టింట్లో తెల్చిచెప్పింది. ఆమెకు దారులు మూసుకుపోతున్నాయనే భావనతో చావే శరణ్యం అనుకొని ఆత్మహత్యకై గోదావరి నదికి బయల్దేరే సమయాన... యింటి తలుపును ఎవరో కొట్టగా, బావేమో అని చిగురాశ / చివరాశతో తలుపు తీయడంతో, భర్త స్నేహితుడు బ్రహ్మచారి. తన భర్తకు యాక్సిడెంట్ అయిందనీ, కాలు కొంచెం ఫ్రాక్చర్ అయిందని, ప్రమాదమేమీ లేదని, హాస్పిటల్లో జాయిన్ చేసి వస్తున్నాననీ తెలపడంతో ఆమె ఆందోళనతో, ఆదుర్దాతో, భయంతో ఆసుపత్రికి బయల్దేరింది.

ఆసుపత్రి - మనసుల విలీనం

ఆపరేషన్ థియేటర్ నుండి బయటకు తీసుకురాబడి, సెడిటేషన్ దిగిపోయిన పరమేశ్వరం, సుధావల్లినిచూడగానే బాధపడిపోయాడు. తనవల్లనే ఎదుటి వ్యక్తికి ఇన్ని బాధలంటూ ఒకరినొకరు తమ మనస్సుల్లో అంతర్లీనంగా ఉన్న ప్రేమను వెలిబుచ్చుకున్నారు. "భర్త తోడిదే జీవిత మనుకున్న భావనతో స్త్రీ ఇంత బానిసగా మారాలా?" అంటూ సుధావల్లి యొక్క అవమానాన్ని, బాధను తలచు కొని పరమేశ్వరం దు:ఖించాడు. పెళ్ళైన క్షణం నుండి తన భార్య సుధావల్లి అంటేనే చీదరించుకునే పరమేశ్వరం ప్రస్తుతం మంచంపై ఉండగా, పరిచర్యలు చేసే భార్య సుధావల్లి మంచం పక్కనే కూర్చొని తమ తమ చిన్ననాటి జ్ఞాపకాలను, ఆల్బంలోని ఫోటోల ఆధారంగా పంచు కోవడం భార్య సుధావల్లి ఓరిమికి ఫలితమనవచ్చు.

ప్రేమ, సాన్నిహిత్యం, మనస్తత్వ విశ్లేషణ

"మనం ఓ మనిషిని ఎందుకు ప్రేమిస్తాం? ఎందుకు ప్రేమించలేం?" అన్న సుధావల్లి ప్రశ్నకు పరమేశ్వరం నుంచి జవాబు లేకపోవడంతో ఆమె సమాధానమిచ్చింది. "సాన్నిహిత్యం వలన ప్రేమ జనిస్తుంది. మనిషిలోని గొప్ప తనాన్ని కాదు, వారిలోని బలహీనతలనీ కూడా ప్రేమతో క్షమించేస్తాము. నీ స్వాతంత్ర్యం ఎవరైనా హరిస్తారేమోనని నీ భయం. అందుకే పారిపోతుంటావు. నేను చిన్నప్పుడు ప్రతీ దానికీ ఏడ్చి నా పంతం నెగ్గించుకునేదానిని. నా పంతం వలన నీ స్వాతంత్ర్యం పోతుందేమోనని నువ్వు భయపడేవాడివి. ఇప్పుడూ అలాగే పంతం నెగ్గించు కున్నానని నీ అభిప్రాయం. అప్పుడది తెలియనితనం. ఇప్పటిది ప్రేమ. మనుషుల శారీరిక పెరుగుదలతో పాటు మనసులూ పెరుగుతాయి. నీవు పెరిగే మనసులను చూడలేదు. పెరుగుతున్న మనస్సులో చిన్నప్పటి మనస్సుందనే నీ భావం. నువ్వు ఎదగవా బావా?" ఆ విషయం అతనికీ తెలుసు. తాను పారిపోతూనే ఉన్నాడు. విడుదల కోసం. అందులోనూ అతనికి స్వేచ్ఛ లభించ లేదు. మనస్సులో జైలు ఉంటే విడుదల ఎక్కడ?

ఇదే మాటను సైకియాట్రిస్టు... "హానికరమైన ప్రతీ కాంటాక్ట్ నుండి జీవి విడుదల పొందాలని ప్రయత్ని స్తుంది. అది సహజాతం (ఇన్స్టింక్ట్). చాలా తేలిక అనిపించే ప్రవర్తన రూపాల ద్వారా ఓ రకమైన స్వేచ్ఛను పొందాలని జీవి ప్రయత్నిస్తుంది. వీటిని 'రిఫ్లెక్సివ్' అంటాం. మనిషి ప్రవర్తనకు ఒక కారణం ఉండదు. భిన్న కారణాలుం టాయి. కొన్ని వ్యక్తికి తెలుస్తాయి. కొన్ని అచేతనలో సుప్తంగా ఉంటాయి." "మీ నుండి పారిపోవాలన్నా ప్రతిస్పందన కలిగించే ప్రేరణను నీవే నాశనం చేయాలి. కనీసం దాని గాఢతను తగ్గించగలగాలి. అప్పుడు కాపురం కుదుటపడే అవకాశం ఉంది" అంటూ సైకాలజిస్టు ఇచ్చిన సలహా మేరకు సుధావల్లి తన భర్త పరమేశ్వరం వెంటపడి సానుకూల ఫలితాన్ని సాధించింది.

మార్పు - సానుకూల పరిణామం

సమతాస్ఫూర్తితో పరిణితి చెందిన వ్యక్తిత్వంతో తన బావ అంతరంగాన్ని సుతిమెత్తని మాటలతో చెప్పడంతో, కరుడుగట్టిన పలాయనవాది అయిన పరమేశ్వరంలో మార్పును తెప్పించాయి. తన మేనకోడలు సుధావల్లితో పరమేశ్వరం ఇలా అంటాడు. "సాన్నిహిత్యమూ - దగ్గరగా ఉండటం ఎలాంటి స్నేహానికి దారితీస్తుందో నాకివాళ అర్థమైంది. ఈ నెలరోజుల్లో నీ సాన్నిహిత్యం నాలో అను బంధాన్ని పెంచింది. నా మనస్సులో ఎన్నో మూసుకు పోయిన ద్వారాలున్నాయి. అవి ఇప్పుడిప్పుడే తెరుచు కుంటున్నాయి. ఆ తలపులన్నీ తెరుచుకొని, నేనేమిటో, నువ్వేమిటో తెలుసుకునే దాకా నీవు నిరీక్షించగలవా, సుధా? ఫలితం ఎలా ఉంటుందో నేను చెప్పలేను, అది పండూ కావచ్చు, కాయా కావచ్చు. నీకంత ఓపిక ఉందా, సుధా?"

"ఉంది, జీవిత కాలమంత ఉంది" అంటూ సుధావల్లి తన భర్త పరమేశ్వరం చేతిని పట్టుకుంది. దాంపత్య యానం - సమాప్తి తరువాత భార్యాభర్తలిద్దరూ అమెరికా వెళ్ళిపోయారు. ఈ రకంగా వారి దాంపత్య జీవనయానాన్ని రచయిత పాఠకులకే వదిలేశారు.

ఉపయుక్త గ్రంథాలు

1. ప్రాథమిక సమాచారం - రచయిత జీవితం, రచనలు, కాకాని చక్రపాణి జీవిత విశేషాలు, రచనా వైశిష్ట్యం (1942-2017). తెలుగు రచయిత.

   వివరాలు : 1942, ఏప్రిల్ 26న గుంటూరు జిల్లా చినకాకానిలో జననం. హైదరాబాద్లోని ఆంధ్ర సారస్వత పరిషత్తు ప్రాచ్య కళాశాలలో 1974-2000 వరకు ఆంగ్ల బోధకులుగా పనిచేశారు. సోమర్సెట్ మామ్ ప్రభావంపై పరిశోధన చేసి పిహెచ్.డి పట్టా పొందారు. 2017, జనవరి 2న మరణించారు.

   పొందిన పురస్కారాలు: సుశీలా నారాయణ రెడ్డి, చాసో స్ఫూర్తి, విమలాశాంతి, సహృదయ సాహితి, హసన్

ఫాతిమా, రంజని, అజో-విభో, ఆటా కథా, తానా కథా, రంగవల్లి, పులికంటి, ఆర్.ఎస్. కృష్ణ మూర్తి, తెలుగు విశ్వవిద్యాలయం ధర్మనిధి, శ్రీ పెద్దిభొట్ల సుబ్బరామయ్య పురస్కారాలు మొదలైనవి.

2. రచయిత రచనా వైవిధ్యం, అనువాదాలు, కాకాని చక్రపాణి రచనలు, అనువాదాలు. వికీపీడియా .

   వివరాలు : ఎన్నో నవలలు, వందలాది కథలు, విమర్శ వ్యాసాలు రచించారు. సోమర్సెట్ మామ్ రచించిన ూట ఎబఎుఅ దీశీఅఎుస్రవ నవలను తెలుగులోకి అనువదించారు. ద్రావిడ విశ్వవిద్యాలయం కోసం రాజశేఖర చరిత్ర, మైదానం, చివరకు మిగిలేది, అల్పజీవి నవలలను ఖీశీబతీ జశ్రీఖంంఱఎం శీట ఎవశ్రీబస్రబ ఖీఱఅీఱశీఅ పేరిట ఆంగ్లంలోకి అనువదించారు. ఆంధ్రభూమి దినపత్రికలో "కథలు - కాకరకాయలు" శీర్షికను నిర్వహించారు.

3. ప్రత్యేక నవలా ప్రస్తావన, కాకాని చక్రపాణి నవలలు/నవలికలు ; సంపుటం 8) .

   వివరాలు : 2017లో ప్రచురితమైన ఈ నవల రచయిత నవలా సంపుటాల్లో ఎనిమిదవది. రాజకీయ, సాంఘిక నేపథ్యంతో రచించబడింది.

4. రచయిత కథా సంపుటాలు

- ✓ జీవరాగం (1996)
- ✓ మట్టి-బంగారం (2001)
- ✓ అమె (కవితా సంపుటి, 2002)
- ✓ అతడు-నేను (2007)
- ✓ క్షతగాత్ర (2014)
- ✓ పిట్టగూళ్ళు (2016)

మూలం : తెలుగు రచయిత నవలా ప్రక్రియ - పరిచయం

★★★

Vol. 23 | Spl. Issue 03 | March 2026 | BHAVAVEENA | ISSN No. : 2456-4702 | RNI No. APTEL/2003/12253

RNI No. APTEL/2003/12253 | Reffered Journal & Peer Reviewed Journals | ISSN No. 2456-4702

భావవీణ

కళలు, సాహిత్య, సాంస్కృతిక భాషాధ్యయన పత్రిక

BHAVA VEENA

Journal of Arts, Literary, Culture & Language Study

పాకాల యశోదారెడ్డి భారతంలో స్త్రీ గ్రంథ సమీక్ష

- కప్పల అజయ్

పరిశోధక విద్యార్థి, హైదరాబాద్ విశ్వవిద్యాలయం, హైదరాబాద్.

పాకాల యశోదారెడ్డి రెండు తెలుగురాష్ట్రాలలో ఉత్తమ కథా రచయిత్రిగా మనందరికీ సుపరిచితమే. పరిశోధకురాలిగా, ఆచార్యులుగా తెలుగు భాషకు చేసిన సేవ అమూల్యమైనది. ముఖ్యంగా తెలంగాణ ప్రాంతీయ స్వరూపానికి, భాషా అవగాహనకు ఆమె రచనలు మార్గ నిర్దేశకంగా నిలిచాయి. వీటితో పాటు తనదైన శైలిలో విమర్శ చేస్తూ వివిధ రకాల విమర్శా గ్రంథాలని రచించారు. వాటిలో 'భారతంలో స్త్రీ' రచన ఒకటి. ఈ గ్రంథం 1990లో ప్రచురించబడినది. ఇందులో మొత్తం 272 పుటలు ఉండగా, అవి ఆరు ప్రకరణాలుగా విభజించారు. ఈ గ్రంథంలో మహాభారతంలోని స్త్రీ పాత్రల వైశిష్ట్యం, వారి స్వభావ లక్షణాలు, గుణగణాలు, ప్రాచీన కాలం నుండి నేటి వరకు స్త్రీ స్థితి ఎలా ఉన్నదో రచయిత్రి విశదీకరించారు. కేవలం నేటి స్థితిని మాత్రమే పరిశీలిస్తే ఏ విషయంపైనా పూర్తి అవగాహన ఏర్పడదు. ఒక అంశాన్ని సరిగ్గా తెలుసుకోవాలంటే పూర్వకాల చరిత్ర, గతంలో జరిగిన పరిణామాలు, ఆ సమయానికి ఉన్న సామాజిక పరిస్థితులను కలిపి అధ్యయనం చేయాలి. అప్పుడు మాత్రమే స్త్రీకి ఉన్న స్థానం, ఆమె ఎదుర్కొన్న అనుభవాలు, కాలానుగుణంగా వచ్చిన మార్పులు స్పష్టంగా అర్థమవుతాయి. ఈ కోణంలో పరిశీలిస్తే మహాభారతం స్త్రీలకు ప్రాధాన్యం కలిగిన అనేక కథా విశేషాలతో కూడిన గ్రంథంగా కనిపిస్తుంది. అందులోని వివిధ సందర్భాలు, వ్యక్తులు స్త్రీ జీవితంలోని భిన్న పార్శ్వాలను ప్రతిఫలింపజేస్తాయి. కాబట్టి స్త్రీ స్థితిగతులను అధ్యయనం చేయడానికి ఈ గ్రంథాన్ని ఒక ఆధారముగా భావించవచ్చు.

మొదటి ప్రకరణంలో భారతీయ సమాజంలో స్త్రీని పరిశీలిస్తూ, మొదట 'స్త్రీ' పదానికి సంబంధించిన మూల అర్థాలను వివరించారు. దీనికి 'సూత్రి' లేదా 'సోత్రీ' వంటి అర్థాలు వ్యక్తమవుతాయి. ఇవి సృష్టి, సంరక్షణ, కుటుంబ వ్యవస్థను నిలబెట్టే శక్తిగా స్త్రీని చూడటాన్ని సూచిస్తాయి. ప్రాచీన వ్యాకర్త యాస్కాచార్యుడు తన 'నిరుక్త' గ్రంథంలో "స్త్రియః స్థాయతే" అని పేర్కొని, స్త్రీ స్వభావంలో లజ్జ, వినయం, మృదుత్వం వంటి సహజ గుణాల సమన్వయం ముఖ్యమని సూచించారు. వేదాల్లో స్త్రీకి సంబంధించిన అనేక పర్యాయపదాలు కనిపిస్తాయి. ముఖ్యంగా 'మేనా' అనే పదం కేవలం స్త్రీజాతికే కాకుండా జంతుజాతికి సూచిస్తుంది. అందువల్ల ఈ భావనను జీవసృష్టిలో సహజ, విశ్వవ్యాప్త లక్షణంగా గుర్తించవచ్చని అర్థమవుతుంది. ఇతర 'నారీ', 'జామా', 'యేషా' మొదలైనవి కూడా వేదాల్లో కనిపిస్తాయి. నారి ఈ శబ్దం స్త్రీపరంగా ఋగ్వేదంలో కనిపించడంలేదంటూ శ్రీరామ అంటూ సురేశ త్రిపాఠీ అనే విద్వాంసుడు 'నారీఆంక్' అనే సంచికలో పేర్కొన్నాడు కానీ Monier Williams Sanskrit

English Dictionary లో నారి అంటే 'a woman, a wife (in older language also Nari), Rv. Etc. etc. a female or any object regarded as feminine' సూచింపబడింది. కానీ శ్రీ సురేశ్ త్రిపాఠీవారు ఈ పదం శతపథ బ్రాహ్మణంలో, తైత్తరీయ ఉపనిషత్తులో కన్పిస్తుంది అంటూ చెప్పి ఈ పదం 'నృ' లేదా 'నర్ ' నుండి ఉత్పన్న మైనట్లు భావించినారు. (భారతంలో స్త్రీ, పు. సం: 5) భారతీయ సమాజంలో స్త్రీ ప్రాధాన్యత గొప్పగా గుర్తించబడింది. ఆమెను కేవలం కుటుంబ సభ్యురాలిగా కాకుండా, పురుషుడితో సమానమైన స్థానం కలిగిన సహచరుడిగా భావించారు. వేదాల్లోని "సఖాహజాయా (8/3/13)" భారతంలో స్త్రీ, పు. సం: 8)" ఈ భావన భార్యను భర్తకు మిత్రురాలిగా, సహచరురాలిగా పరిగణించినదని చూపిస్తుంది. ఇది భార్యాభర్తల మధ్య ఉన్న ఆత్మీయత, సమానత్వాన్ని స్పష్టంగా ప్రతిబింబిస్తుంది. అలాగే శతపత బ్రాహ్మణ గ్రంథంలో స్త్రీ స్థానం మరింత విశదీకరించబడింది. ఆ గ్రంథంలో పేర్కొన్నట్లుగా, స్త్రీ సహకారం లేకపోతే పురుషుడు పూర్తి స్థాయిలో ఆధ్యాత్మిక జీవితం సాధించలేవు అని భావించబడింది. ఈ ఆధారాల ద్వారా ఆ కాలంనాటి సమాజంలో స్త్రీను పురుషుడికి అవిభాజ్య భాగంగా, జీవితాంతం సమాన భాగస్వామ్యురాలిగా భావించారని స్పష్టంగా తెలుస్తుంది.

రెండవ ప్రకరణంలో రచయిత భారతంలోని స్త్రీ పాత్రల వివేచనను విశదంగా వివరించారు. జగత్సృష్టిలో ప్రకృతి-పురుషులు పరస్పర సహకారంతో విశ్వ నిర్మాణం చేసినట్లే, కవిసృష్టిలో కూడా స్త్రీ--పురుషుల పాత్రలు సమాన ప్రాధాన్యాన్ని పొందుతాయని సముచితంగా తెలియజేశారు. ఈ భావన సాహిత్య దృష్టిలో ఎంతో ప్రాముఖ్యమైనదిగా అనిపిస్తుంది. ''యత్రనార్యస్తు పూజ్యంతే రమంతే తత్ర దేవతాః'' మనుస్మృతి (3.56) ప్రకారం ఎక్కడైతే స్త్రీలు గౌరవింపబడతారో అటువంటి చోట దేవతలు నివసిస్తారు. అందువల్ల రామాయణం, మహాభారతం వంటి జయ శబ్ద వ్యాచ్య గ్రంథాలలో స్త్రీల పాత్రలు కీలకమైన స్థానాన్ని పొందిన విధానం కనిపిస్తుంది. సాధారణంగా మహాభారత యుద్ధానికి కారణం కౌరవుడైన దుర్యోధనుడు పాండవులకు రాజ్యభాగం ఇవ్వకపోవడమే అని భావిస్తారు. అయితే రచయిత సూచించినట్లుగా లోతుగా పరిశీలిస్తే అది కేవలం ఒక మిష మాత్రమే అని అనిపిస్తుంది. ద్రౌపది అనుభవించిన అవమానం, ఆ కారణంగా ప్రతీకారం తీర్చుకోవాలనే సంకల్పమే మహా భారత యుద్ధానికి ప్రధాన కారణమని భావించవచ్చు. తన పరాభవం వ్యక్తిగత సంఘటనగా మిగలకుండా భారత సంగ్రామానికి దారితీసిన గొప్ప చారిత్రక పరిణామంగా నిలిచింది. ఈ మహా సంగ్రామానికి ప్రేరణగా నిలిచిన స్త్రీలలో ముఖ్యంగా ద్రౌపది, గాంధారి, సుధేష్ణ, అంబ, కుంతి వంటి వారి పాత్రలు కథా గమనాన్ని ప్రభావితం చేసిన ప్రధాన రూపాలుగా కనిపిస్తాయి. అంతేకాక ఇందులోని వివిధ పర్వాలలో ఉత్తర, ప్రభావతి, భద్ర, సుభద్ర, దుస్సల, చిత్రాంగద, అరుంధతి, అనసూయ, అహల్య, పూర్వచిత్తి, కౌసల్య, రాధా, దమయంతి, సుకన్య, సులభ, సువర్చల, సావిత్రి మొదలైన అనేక స్త్రీ పాత్రలను ప్రస్తావించడం ద్వారా వారి ప్రాముఖ్యతను స్పష్టంగా తెలియజేశారు వీరిలో కొందరు రాచకన్యలు, ఋషిపత్నులు, దేవయోనులు, ధీర స్వభావం కలవారు, త్యాగం, ప్రేమ, విధేయత వంటి గుణాలతో ప్రత్యేక స్థానాన్ని సంపాదించినవారు. ఇందులోని కథలలో వీరి పాత్రలు కథా ప్రవాహాన్ని ప్రభావితం చేసే విధంగా కనిపిస్తాయి. ఈ అంశాన్ని వివరించిన విధానం గమనించదగ్గది. సౌలభ్యం కోసం రచయిత వీటిని వివిధ కోణాలలో విభజించి పరిశీలించారు. నాయిక ప్రాధాన్యాన్ని ఆధారంగా తీసుకొని నాయికా-పోషక పాత్రలు, ఉదాత్త-అనుదాత్త పాత్రలు, అలాగే ఉత్తమ-మధ్యమ-నీచ పాత్రలుగా విభజించడం ద్వారా వాటి స్వభావాన్ని స్పష్టంగా తెలియజేశారు. అదేవిధంగా కథా దృష్టితో ప్రధాన కథా సంబంధి పాత్రలు, ప్రాసంగికేతివృత్త సంబంధ పాత్రలుగా కూడా విభజించి విశ్లేషించడం జరిగింది. ఇంకా రస ప్రాధాన్యాన్ని ఆధారంగా చేసుకొని శృంగార నాయికలు, వీరవనితలు, నాయక భేదాన్ని అనుసరించి అష్టవిధ నాయికలుగా పరిశీలించడం రచయిత విశ్లేషణాత్మక దృష్టిని తెలియజేస్తుంది. నా అభిప్రాయం ప్రకారం ఈ విధమైన

విభజనలు సాహిత్య అధ్యయనంలో పాత్రల స్వభావం, ప్రాధాన్యం, కథా సంబంధాన్ని స్పష్టంగా అవగతం చేసుకోవడానికి ఎంతో సహాయపడతాయి

మూడవ ప్రకరణంలో సంస్కృత మహాభారతంలా ఆంధ్ర మహాభారతంలోని స్త్రీ పాత్రలని ఒకే రచయిత నిర్మించలేదని చెప్పబడింది. ఈ కావ్యాన్ని నన్నయ, తిక్కన, ఎర్రన అనే ముగ్గురు కవులు వేర్వేరు భాగాలలో రచించినందున ఒక వ్యక్తిత్వం వివిధ సందర్భాలలో వారి వారి దృష్టికోణంలో రూపుదిద్దుకుంది. అందువల్ల సౌలభ్యార్థం ఆంధ్ర మహాభారతంలోని మహిళా పాత్రలను మూడు విభాగాలుగా విభజించారు. కురుక్షేత్ర యుద్ధంతో ప్రత్యక్ష సంబంధం కలిగినవారు మొదటి వర్గంలో చేరుతారు. ఇందులో ద్రౌపది, కుంతి, గాంధారి, సుధేష్ణ, అంబ వంటి ప్రముఖ మహిళలు ఉంటారు. రెండవ వర్గంలో శకుంతల, దమయంతి, శర్మిష్ఠ, దేవయాని వంటి కథలలో కనిపించే వ్యక్తిత్వాలు ఉంటాయి. మూడవ వర్గంలో ధార్మిక బోధనలతో కూడిన కథలలో దర్శనమిచ్చే మహిళలను చేర్చారు. ఈ వర్గాన్ని సంకీర్ణ స్వభావం గల స్త్రీలుగా పేర్కొంటారు. నన్నయ రచనలో ద్రౌపది ప్రత్యేక స్థానం పొందిన మహిళగా వర్ణించబడింది. సాధారణ పరిస్థితుల్లో ఆమె వినయం, సద్గుణాలు కలిగిన సౌమ్య స్వభావం గల వ్యక్తిగా కనిపిస్తుంది. కుటుంబ గౌరవాన్ని అత్యంత ప్రాముఖ్యంగా భావిస్తూ అందరితో మర్యాదగా ప్రవర్తించే గృహస్థ కుటుంబానికి చెందిన సద్గుణవతి అనే లక్షణాలున్నాయని స్పష్టంగా కనిపిస్తాయి. గాంధారి మరియు ధృతరాష్ట్ర దృష్టిలో ద్రౌపది మహత్తర పతివ్రతగా గౌరవించబడింది. ఆమె తేజస్సును గుర్తించి ఇష్టమైన వరం కోరమని అనుమతించడం వారి హృదయంలో ఉన్న దయను తెలియజేస్తుంది. తిక్కన రచనలో మాత్రం ఆమె కురుక్షేత్ర యుద్ధానికి ప్రేరణనిచ్చిన బలమైన వ్యక్తిత్వంగా ప్రతిఫలించింది. కుంతి గురించి నన్నయ మరియు తిక్కన ఇద్దరూ ప్రత్యేకంగా చిత్రించారు. నన్నయ వర్ణనలో ఆమె ధైర్యసాహసాలతో కూడిన వీర వనితగా కనిపిస్తుంది. తిక్కన వివరణలో కుంతి జీవితంలోని రహస్య అంశాలు, ముఖ్యంగా సూర్యుడి అనుగ్రహంతో జన్మించిన కర్ణుని విషయాన్ని విశదీకరించారు. ఎర్రన వర్ణనలో ద్రౌపది ఉత్తమ స్త్రీకి ఆదర్శంగా చెప్పబడే గుణాలన్నిటినీ కలిగిన వ్యక్తిగా కనిపిస్తుంది. అలాగే కుంతి వివాహానికి ముందు పుత్రుడిని పొందిన సంఘటనను సమాజంలో విమర్శకు గురయ్యే విషయంగా పేర్కొన్నారు. ఈ ఉదాహరణల ద్వారా ఆ కాలపు సామాజిక విలువలు ప్రతిఫలిస్తాయి. ఇవి మాత్రమే కాకుండా అనసూయ వంటి మహా పతివ్రతల గురించిన వివరాలు ఇందులో ఉన్నాయి. ఆమె కరుణ, పవిత్రత, మృదువైన మాటలతో ప్రసిద్ధి పొందిన వ్యక్తిగా వర్ణించబడింది. అదేవిధంగా సుధేష్ణ, అంబ, ఉత్తర, సుభద్ర, చిత్రాంగద వంటి మహిళలు ఈ ప్రకరణంలో ప్రస్తావించబడ్డారు. వీరు రాజకుటుంబాలకు చెందిన క్షత్రియాంగనలుగా, పతివ్రత ధర్మాన్ని ఆచరించినవారిగా చూపబడ్డారు. తమ భర్తలకు అనేక భార్యలు ఉన్నప్పటికీ వారు సంపూర్ణ మనసుతో భర్తలపై ప్రేమను కొనసాగించారు. ఈ వివరణలను పరిశీలిస్తే ఆ కాలంలోని మహిళలు వీరత్వాన్ని ఎంతో గౌరవించేవారని తెలుస్తుంది. అలాగే జీవనోపాధి లేదా రక్షణ కోసం పూర్తిగా పురుషులపై ఆధారపడని ధైర్య స్వభావం వారికి ఉన్నదని ఈ ప్రకరణం ద్వారా స్పష్టమవుతుంది.

నాల్గవ ప్రకరణంలో ప్రాసంగికేతి వృత్తాలకు సంబంధించిన స్త్రీ పాత్రలను పరిశీలించినట్లయితే, నలదమయంతుల గాథకుఅత్యంత ప్రాధాన్యతనిచ్చినట్లు తెలుస్తుంది. అరణ్యవాసంలో ఉన్న ధర్మరాజుకు బృహదశ్వుడనే మహర్షి ఈ కథను వినిపించడంతో ప్రాముఖ్యత లభించింది. ఇది కేవలం ఒక ఉపకథగా కాకుండా భారతీయ నారీమణికి ఉండాల్సిన ఆదర్శ గుణాలకు నిలువుటద్దంగా నిలిచింది. దమయంతి పాత్రను రచయిత ఒక అద్భుత సౌందర్య కల్పనగా చిత్రించడమే కాకుండా, ఆమెలోని శీలం, పవిత్రత, ఆపదల్లోనూ చెలించని ధైర్యాన్ని అద్భుతంగా చూపించారు. దమయంతి సకల భద్రలక్షణయుక్తమైన వనితగా భారతీయ స్త్రీలలో ఒక ఉన్నతమైన స్థానాన్ని సంపాదించుకుంది. అదేవిధంగా, నన్నయ కలం నుండి జాలువారిన

శకుంతల పాత్ర కూడా ఎంతో అపురూపమైనదిగా రచయిత పేర్కొన్నారు. విశ్వామిత్రుడు, మేనకల పుత్రిక అయిన ఈమెను తల్లిదండ్రులు పరిత్యజించినా, కణ్వ మహర్షి ఆశ్రమంలో ఆమె పెరిగిన తీరు ఎంతో విశిష్ట మైనది. ప్రకృతి ఒడిలో, మునివాటికల మధ్య పెరగడం వల్ల శకుంతలలోని సౌమ్యత, వినయం, నిష్కల్మషమైన స్వభావం మరింత మెరుగుపడ్డాయని, ఆశ్రమ జీవనమే ఆమె మృదు స్వభావానికి పునాది అని రచయిత విశ్లేషించారు. ఇక రాక్షస చక్రవర్తి వృషపర్వుని కుమార్తె అయిన శర్మిష్ఠ పాత్ర ద్వారా నాటి రాజకన్యల వైయుక్తిక స్వరూపాన్ని రచయిత మనకు పరిచయం చేశారు. ఈ పాత్ర భారత చరిత్రలో ఒక విచిత్రమైన ఐతిహ్యాన్ని సృష్టించడమే కాకుండా, ఆ కాలం నాటి మహిళల ఆత్మ విశ్వాసాన్ని ప్రతిబింబిస్తుంది. వారు భోగభాగ్యాల పట్ల ఆసక్తి కలిగి ఉన్నప్పటికీ, వంశ ప్రతిష్టలు, సామూహిక హితం కోసం తమ వ్యక్తిగత సుఖాలను తృణప్రాయంగా త్యాగం చేసే గుణం కలిగినవారని రచయిత భావన. శాస్త్ర పాండిత్యం, ధర్మనిరతి కలిగిన శర్మిష్ఠ వంటి పాత్రలు అచంచలమైన దృఢత్వానికి ప్రతీకలుగా నిలుస్తాయి. దీనికి భిన్నంగా, మృతసంజీవిని విద్యావేత్త అయిన శుక్రాచార్యుల పుత్రిక దేవయాని పాత్ర కనిపిస్తుంది. దేవయానిలో తన కులం పట్ల, తండ్రి అధికారం పట్ల అహంకారం మెండుగా ఉండేది. చిన్నప్పటి నుండి గారాబంగా పెరగడం వల్ల ఆమెలో పట్టుదల, మొండితనం అధికమయ్యాయి. తాను వలచిన కచుడు తనను నిరాకరించినప్పుడు ఆమెలోని సహజమైన అనురాగం, ఓర్పు నశించి, ఈర్ష్యా ద్వేషాలు బయట పడ్డాయి. తన వ్యక్తిగత తెలివితేటల కంటే తండ్రి ప్రాబల్యాన్ని వాడుకుని పంతాలు నెగ్గించుకోవడమే ఆమె నైజమని, తత్ఫలితంగా ఆమె ఒక వంచించబడిన స్త్రీగా మిగిలిపోయిందని రచయిత అభిప్రాయపడ్డారు. ఈ విధంగా, ఈ నలుగురు స్త్రీమూర్తుల ద్వారా భారతీయేతిహాసంలోని విభిన్న మనస్తత్వాలను, సామాజిక విలువలను రచయిత ఎంతో ప్రౌఢంగా చిత్రించారు

ఐదవ ప్రకరణం అయిన ధర్మ స్వరూప కథాగత స్త్రీ పాత్రలు, అలాగే భారత కాలం నాటి స్త్రీ ధర్మస్వరూపం ఎలా ఉందో వివరిస్తుంది. పతివ్రత అయిన స్త్రీ అన్నిటి కన్నా ప్రధానంగా కోరుకునే వరం, పసుపు కుంకుమలతో పుణ్య స్త్రీగా మరణించడం. భర్త కన్నా ముందు మరణించినప్పుడే స్త్రీకి నోచిన నోము ఫలంగా పేర్కొన్నది. ఆనాటి సాంఘిక వ్యవస్థయే దీనికి ఒక కారణంగా భావించవచ్చు. పంచచూడ, శాండిలినీ వంటి పాత్రలను పతివ్రత లక్షణాలకు ఉదాహరణ పాత్రలుగా చెప్పవచ్చు. పతివ్రతకు అనర్హులైన పాత్రలను చూసినప్పుడు అసురి, పైశాచి, రాక్షసి అని పిలుస్తారు. జ్ఞాన స్వరూపిణిల విభాగంలో పౌష్య మహాదేవి, జనకపత్ని, సులభ, వృద్ధ కన్యల గూర్చి వివరించారు. భారతంలో సాధారణంగా స్త్రీలందరూ ఉత్తమ వంశ సంజాతులైన మహాను భావులుగా గోచరిస్తారు. అయితే సాధారణ గృహిణులు ఏ శాస్త్రార్థ ప్రక్రియలు, ఏ తపోనియతలు, పాండిత్య ప్రకర్షలను ఎరుగనివారిగా కనిపిస్తారు. కేవలం తన భర్తను సేవించడం ప్రథమ కర్తవ్యంగా భావించిన స్త్రీలుగా వారిని గుర్తించవచ్చు. వారిలో ఓఘవతి, రుచి పాత్రలు మొదలైనవి ఉన్నాయి. అలాగే స్త్రీ స్వేచ్ఛకు నిదర్శనమైన పాత్రగా ప్రద్వేషణ గూర్చి వివరించారు. అదే విధంగా వైవాహిక వ్యవస్థలో అష్టవిధ వివాహాల గురించి కూడా వివరించారు. భారతంలో అష్ట విధాలైన వివాహాలే కాక, పరస్పర ఆనక్తులైన యువతీ యువకులు తమకు తాము వివాహితులుగా పరిగణించుకున్న కొన్ని పాత్రలు కూడా కనిపిస్తాయి. గంగాదేవి, లోపముద్ర, ప్రభావతి, సుకన్య, తపతి మొదలైన పాత్రల గురించి ఈ ప్రకరణంలో వివరించారు.

చివరిగా, ఆరవ ప్రకరణంలోని పరిశిష్ట విశేషాంశాలలో కర్మకు ప్రాధాన్యం ఇచ్చే మన భారతీయ సంఘానికి ధర్మమే ప్రాణం. ఈ నైతిక విలువలకు విరుద్ధమైన పనులను భారతీయ సభ్య సమాజం చేయదు. వేదాలు, ఉపనిషత్తుల్లో ఈ సిద్ధాంతం యొక్క స్వరూపం వివరించబడింది. ఆ భావాన్ని ఆధారంగా చేసుకుని సూత్రకారులు నైతిక, రాజకీయ, సాంఘిక, గృహ సంబంధ, వ్యవహారిక విధులను పరిగణనలోకి తీసుకుని, ఎంతో ఆలోచనతో,

దూరదృష్టితో అనేక నియమాలను రూపొందించారు. ఏది ఎట్లున్నా, ఆ సమాజం మాతృస్వామికమైనా, పితృస్వామిక మైనా, ప్రకృతి సిద్ధమైన పరిణామాలను, ధర్మాలను ఎవరు కాదనలేరు. జీవోత్పత్తికి క్షేత్రబీజరూపంలో స్త్రీ పురుష లిద్దరూ భాగస్వాములే. మన భారతీయ సంఘం స్త్రీకి సముచిత స్థానాన్ని ఇచ్చింది. సమాజానికి గార్హపత్యం ఎంతో ప్రధానమైనది. ప్రాచీన కాలంలో కన్యాశుల్కం అనే ఆచారం ప్రచలితమై ఉండేది. ఈ పేరుతో స్త్రీలను విక్రయించినట్లుగా కూడా కనిపిస్తుంది. ఇది ఈనాటి రహస్యంగా సాగుతున్న వ్యాపారమే అనిపిస్తుంది. ధనేనా ''బహు ధాక్రీత్వా సంప్రలోభ్య చ బాంధవన్'' (స. మ. భా. అ. ప. ఆ. 44.7) అనే శ్లోకాన్ని భారతంలో స్త్రీ (పుట సంఖ్య : 228)లో ప్రస్తావించారు. ధనాన్ని గ్రహిస్తూ పిల్లను అమ్మే పరిస్థితుల్లో ఉన్నప్పుడు గౌరవం ఇచ్చేవారు. కానీ రాను రాను అది ఆడపిల్లల మెడకు ఉరి త్రాడుగా మారింది. వరకట్న విషయంలో కూడా ప్రాచీన కాలంలో, భారత కాలం నాటికే తమ తమ కన్యలను వివాహమైన పరులకు వారి వారి శక్తిని అనుసరించి ధన, కనక, వస్తు, వాహన, దాసదాసీజనులను కానుకగా సమర్పించేవారు. స్త్రీ పురుష సంగమం ప్రకృతి ధర్మంగా భావింపబడుతూ, స్వేచ్ఛగా ఆ క్రియలో స్త్రీపురుషులు చరించేవారుగా కనిపిస్తున్నారు. కానీ రాను రాను కామోపభోగం కన్నా ప్రజాభివృద్ధి కోసమే అది ప్రవర్తింపబడుతూ వచ్చింది. బహు భర్తృత్వంలో ఆపద్ధర్మంగా ద్రౌపదిని పాండవులు వివాహమాడారు. ఆ తరువాత ప్రభువులు, అధికారులు ఆనాడు అనావరణలైన స్త్రీలను, దాసీజనాన్ని, అంతఃపుర పరిచారికలను తమ ఇష్టానుసారం అనుభవించినట్లుగా కనిపిస్తుంది. దాసివ్యవస్థ భారతదేశంలోనే కాకుండా ప్రాచ్య, పాశ్చాత్య దేశాల్లో కూడా ఉండేది. అలాగే భారతీయ సమాజం వేశ్యలకు ప్రముఖ స్థానాన్ని ఇచ్చింది. ఈ వేశ్యా ప్రసంగం వేద, పురాణ, ఇతిహాసాదుల్లోనే కాకుండా సూత్రకారులు కూడా ఈ వేశ్య ప్రసంగానికి అత్యంత ప్రాధాన్యాన్ని ఇచ్చారు. వీరిని ఐదు రకాలుగా విభాగాలుగా పేర్కొన్నారు: 1. రాజ వేశ్య, 2. గుప్త వేశ్య, 3. నగరి వేశ్య, 4. దేవ వేశ్య, 5. బ్రహ్మ వేశ్యలు ఉన్నాయి. వీటితోపాటు రాజస్త్రీల విజ్ఞానం, స్వేచ్ఛ జీవనం, స్త్రీ పునర్వివాహం, మారుతున్న సమాజంలో స్త్రీ స్థానం మొదలైన అంశాల గురించి వివరించడం జరిగింది. ఇక 20వ శతాబ్దం వింతలకు, విప్లవాలకు, మార్పులకు, మారిన విలువలకు పుట్టినిల్లు. ''నరునితో నారాయణా, పదిమందితో గోవిందా...'' (భారతంలో స్త్రీ, పుట సంఖ్య : 271) అంటూ మన భారతీయ సమాజం కూడా ఎన్నో మార్పులకు, చేర్పులకు ఆమోదాన్ని ప్రకటిస్తూ తలు వూపింది. ఈ ప్రభావం వల్ల స్త్రీ ఈనాడు మధ్యకాలాల్లో వలె కేవలం వంటింటికే పరిమితం కాదు. ఆమె ఇప్పుడు రాకూడని క్షేత్రం లేదు, తెలియని ప్రదేశం లేదు, నేర్వని విద్య లేదు. ఆమె పురుషుడితో పాటు పోటీపడుతూ మెలకువలను ప్రదర్శిస్తుంది. అంతరిక్షంలో, పోలీస్ శాఖలో, క్రీడా రంగాల్లో, కళారంగాల్లో, న్యాయ, వైద్య శాఖల్లో తమ శక్తి సామర్థ్యాలను చూపిస్తూ ముందడుగు వేస్తుంది. ఎంతో ప్రగతిని సాధించామని చెప్పుకునే ఈ రోజుల్లో కూడా స్త్రీ ఒంటరిగా బయటికి వెళ్లలేని పరిస్థితి కనిపిస్తుంది. పోకిరీల బెడద ఇంకా ఉండనే ఉంది. కుటుంబ వ్యవస్థల్లో అన్యోన్యతలు సన్నగిల్లినప్పుడు విడాకుల చట్టం అందుబాటులో ఉంది. ఇక్కడ ఒక విషయాన్ని గమనించాల్సి ఉంది. పూర్తిగా పాతదనాన్ని మరిచి కొత్తలో ప్రవేశించలేదు. పాతకి పాత, కొత్తకి కొత్త మధ్య కొట్టుమిట్టాడుతూ స్త్రీ సమాజంలో తలెత్తుకొని బ్రతుకుతోంది. అయినప్పటికీ కూడా స్త్రీకి లభించవలసిన గౌరవం ఇంకా సరిగ్గా లభించలేదని చెప్పడంలో ఎలాంటి సందేహం లేదు.

ఆధార గ్రంథాలు :

1. అనిశెట్టి, రజిత. పాకాల యశోదారెడ్డి. హైదరాబాద్: ప్రపంచ తెలుగు మహాసభల ప్రచురణ, తెలుగు అకాడమీ, 2017.
2. రావి, ప్రేమలత. భారతీయ సాహిత్య నిర్మాతలు: పాకాల యశోదారెడ్డి. న్యూఢిల్లీ: సాహిత్య అకాడమీ, 2015.

3. వెంకటరమణప్ప, జె. మహాభారతం: ప్రముఖ స్త్రీ పాత్రచిత్రణ. అనంతపురం, 1978.
4. వేంకటావధాని, దివాకర్ల. మహాభారతం: మానవ స్వభావ చిత్రణ. ఉస్మానియా, 1971.
5. విజయలక్ష్మి, ఎ. మహాభారతంలో స్త్రీ మనస్తత్వ చిత్రణ. ఆంధ్రవిశ్వవిద్యాలయం, 1997.
6. శశిరేఖ, పి. నన్నయ భారతంలో అప్రధాన స్త్రీ పాత్రలు. మద్రాసు విశ్వవిద్యాలయం, 1989.
7. యశోదారెడ్డి, పి. భారతంలో స్త్రీ. హైదరాబాద్: సుధర్మ పబ్లికేషన్స్, 1990.

★★★

Vol. 23 | Spl. Issue 03 | March 2026 | BHAVAVEENA | ISSN No. : 2456-4702 | RNI No. APTEL/2003/12253

RNI No. APTEL/2003/12253 | Reffered Journal & Peer Reviewed Journals | ISSN No. 2456-4702

భావవీణ

కళలు, సాహిత్య, సాంస్కృతిక భాషాధ్యయన పత్రిక

BHAVA VEENA

Journal of Arts, Literary, Culture & Language Study

ఆధునిక తెలుగు కవిత్వంలో - స్త్రీ వాద ధిక్కార స్వరాలు

– డా॥. తరపట్ల సత్యనారాయణ

పూర్వ తెలుగుశాఖాధ్యక్షులు, ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం.

ప్రవేశిక :

సాంస్కృతిక పునరుజ్జీవన ఉద్యమ ఫలితంగా బాష లోనూ, భావంలోనూ, సాహిత్యంలోనూ, సంప్రదాయా ల్లోనూ, విద్యావిధానంలోనూ, అనూహ్యమైన మార్పులు వచ్చాయి, దాంతో కొత్త శకం ప్రారంభమైంది. సాహిత్యంలో కాల్పనికోద్యమ ప్రభావం అధికంగా కనిపిస్తుంది. దాని ఫలితంగానే ఆంగ్ల సాహిత్యం నుండి తెలుగు సాహిత్యం లోకి వివిధ ప్రక్రియలు వెలువడడానికి అవకాశం కలిగింది. అప్పటికే షెల్లి, కీట్స్, బర్న్ వంటి కవుల ప్రణయతత్వ కవిత్వం వ్యాప్తిలోకి వచ్చింది. తరువాత తెలుగు సాహిత్యంలో ఆధునిక కవిత్వం వివిధ ప్రక్రియ లతో విస్తరించింది. ప్రాచీన సాహిత్యంపై ఆదరణ తగ్గి ఆధునిక సాహిత్యంపై ఆసక్తి పెరిగింది. అందులో భాగంగానే సంఘసంస్కరణ కవిత్వం మొదలయ్యింది. దాని ప్రభావంవల్ల సాంఘిక దురాచారాలపై తిరుగు బాటు, మూఢ నమ్మకాలపై నిరసన ధ్వని, సమకాలీన సమస్యలపై కవులు స్పందించడం, రచనలు వెలువరిం చడం, ప్రజల్లో చైతన్యాన్ని, సామాజిక స్పృహను కలిగించే దిశగా ఆధునిక కవిత్వం పరిఢవిల్లేలా విరాజిల్లింది. ఇటువంటి ఆధునిక సాహిత్యంలో ఉద్యమ కవిత్వం కొత్త గొంతును వినిపిస్తూ అసమానలతలపై ధిక్కార స్వరంతో నినదించింది. దాని పర్యావసానమే దళితవాదం, హేతువాదం, మానవతా వాదం, స్త్రీవాదం వంటి ఉ ద్యమ సాహిత్యం సమాజంలో సరికొత్త సంచలనాన్ని రేపింది. అందులో మహిళల సమస్యలపై మహిళలే కొత్త గొంతుతో సమస్యలను వివరించే దిశగా నినదించిన నినాదమే మహిళోద్యమ నినాదమయ్యింది.

వ్యాసముఖ్యోద్దేశం :

ప్రాచీన యుగం నుండి ప్రపంచీకరణ యుగం వరకు ఎన్నో మార్పులు వచ్చాయి. రాతి యుగం నుండి రాకెట్ యుగం వరకు జరిగిన మార్పుల ఫలితంగానే అనేక నూతన ఆవిష్కరణలు జరిగాయి. వాటిలో శాస్త్ర సాంకేతిక విజ్ఞానాభివృద్ధి ప్రధానంగా చెప్పుకోదగ్గవి. ప్రతీ అంశాన్ని శాస్త్రీయంగా విశ్లేషించడం, నూతన విజ్ఞాన పద్ధతుల్లో అధ్యయనం, చేయడం ప్రపంచానికి ఒక ప్రామాణికమైన సైద్ధాంతిక స్థిర పద్ధతిలో వినూత్న ప్రయోగాలు చేసి అజ్ఞానాన్ని పోగొట్టి, విజ్ఞానాన్ని పంచడంలో ప్రపంచీకరణ యుగం ప్రధాన భూమిక పోషించింది. ఇటువంటి ఆధునిక యుగంలో వ్యాప్తిలోకి వచ్చిన తెలుగు కవిత్వంలో స్త్రీల హక్కులకోసం, స్వేచ్ఛా సమానత్వం కోసం భారత రాజ్యాంగాన్ని, న్యాయ చట్టాలను, అధ్యయనం చేస్తూ ఉన్నత పదవుల్లోకి ప్రవేశిస్తూ అన్నింటామేమూ సమానమే అని చాటుతున్నా మహిళల పట్ల వివక్షత, అణచివేత ఇంకా కొనసాగుతూనే ఉంది. ఇటువంటి విషమ

పరిస్థితుల్లో ఏకమైన మహిళల గొంతుల నుండి వినబడే ధిక్కార స్వరాలను వాటి పూర్వాపరాలను, వారి భావాలను విశ్లేషించడమే ఈ వ్యాసముఖ్యోద్దేశ్యం.

కీలక పదాలు :

స్త్రీవాద ఉద్యమ నేపథ్యం, స్త్రీవాద రచనలు, నినదించిన ధిక్కార స్వరాలు, సామాజిక చైతన్యం, సామాజిక స్పృహ, సమాజంపై నిరసన, అధికారులు, చట్టాలపై అసంతృప్తి, వివిధ నినాదాలు, వాదాలు మొదలైనవి.

స్త్రీవాద ఉద్యమ నేపథ్యం :

భారతీయ సంప్రదాయంలో స్త్రీకి ఒకప్రత్యేకమైన స్థానం ఉందని అద్భుతంగా చెబుతున్నాం. అక్కడక్కడా స్త్రీ దేవతని పొగడటం నిత్యం వింటూనే ఉన్నాం. వేద కాలం నుండి ఆధునిక కాలం వరకు, ఎంత చెప్పినా, ఎంత పొగిడినా స్త్రీలు అవమానాలను ఎదుర్కొంటూనే ఉన్నారు. ఇదే స్త్రీవాద ఉద్యమ నిర్మాణానికి ప్రధాన నేపథ్యం. స్త్రీ పురుషుల మధ్య వివక్ష క్షమించరానిదనే వాదనలో నిజం లేకపోలేదు. శ్రమలోనూ, సుఖంలోనూ, జీవితంలోనూ, జీతంలోనూ స్త్రీ పురుషునితో సమానత సాధించినా, అధికారం చలాయించడంలో పురుషాధిక్యత ఎక్కువగా కనిపిస్తూనే ఉంది. అందుకే స్త్రీ పురుషులమధ్య లింగ వివక్షత చూపడంవల్లనే మహిళల గళాలు ఏకమై మహిళోద్యమానికి బాటలు వేసాయి. కవులు తమ రచనలు ద్వారా అసమానతలు పోగొట్టే ప్రయత్నంలో విభిన్న ప్రక్రియలతో విస్తృతంగా రచనలు చేసి సమాజంలో నవ చైతన్యాన్ని రగిలించారు. తమ సమస్యలపై తామే స్పందిస్తూ మా సమస్యలపై మేమే పోరాటం చేస్తామని ఎలుగెత్తిన మహిళలు రాసిన కవిత్వమే స్త్రీవాద కవిత్వమైంది. ఆ ఉద్యమమే స్త్రీవాద ఉద్యమంగా మారింది. దీనినే ఆంగ్ల భాషలో ఫెమెనిజం అంటున్నాము. స్థూలంగా చూస్తే 1975 తరువాత నుండి క్రమ క్రమంగా వికసించి విస్తరించి 1985 నాటికి స్థిరమైన రూపాన్ని, స్థానాన్ని సంపాదించుకుంది. దీన్నే విముక్తి, స్త్రీ స్వేచ్ఛ, స్త్రీ విమోచన ఉద్యమమని రకరకాల పేర్లతో వ్యాప్తిలోకి వచ్చింది. ఈ ఉద్యమంలో స్త్రీల ఆత్మక్షోభ, ఆత్మఘోష, అసమానతలు, అవమానాలు, వివక్ష, అణచివేత, ఆత్మహత్యలు, వెట్టిచాకిరి, కులమత వివక్ష, హింస, పీడన, ఆవేదన, ఆక్రందనలవంటి వాటిపై పోరాటం కనిపిస్తుంది. అందుకే స్త్రీవాద కలాలు పదునెక్కిన కలాలై ధిక్కారస్వరం వినిపిస్తూ దిక్కులు దద్దరిల్లేలా, ఉద్యమ గీతాలపై ప్రపంచాన్నే కదిలిస్తూ మానవత కోసం, సమానత కోసం పోరుబాట పట్టారు నేటి మహిళలు.

ఎలుగెత్తిన ధిక్కార స్వరాలు :

స్త్రీల హక్కులకోసం అహర్నిశలు శ్రమించి రచనలు చేసి జాతిని జాగృతం చేసిన ఎందరో మహనీయ మహిళా మణులు సాహిత్యంలో కనిపిస్తారు. 1789లో ఫ్రెంచ్ విప్లవం ద్వారా వచ్చిన నినాదం స్త్రీవాదానికి నాందీగీతమైంది. ఆ తరువాత 1870 రష్యన్ విప్లవంలో స్త్రీవిముక్తి పోరాటం, అలాగే 1889లో పారిస్‌లో జరిగిన అంతర్జాతీయ సమావేశంలో స్త్రీ పురుష సమాన హక్కులు, ఆ తరువాత 1911 చైనా విప్లవంలో స్త్రీలు, కార్మికులు పాల్గొనడం, 1966 తరువాత స్త్రీలు విముక్తి కోసం బృందాలుగా ఏర్పడడం, 1970లో అమెరికాలో అనలైన మహిళోద్యమం మొదలైంది. ఈ ఉద్యమ నేపథ్యంలో స్త్రీవాద రచయిత్రులు కలాలను ఆయుధంగా మలచుకొని ఉద్యమ కెరటాలై ప్రపంచమంతా పరుగులు తీసారు. విమోచనే మా జన్మహక్కు, సమానత సాధనే మా ధ్యేయం అన్నట్టు అన్ని ప్రక్రియల ద్వారా ఆధునిక తెలుగు సాహిత్యంలో స్త్రీవాద కవిత్వం పదునెక్కిన పాటై పోరుబావుటాను ఎగరవేసింది. అందులో ప్రముఖంగా కనిపించే వారిలో జయప్రభ, కొండేపూడి నిర్మల, కాత్యాయని విద్మహే, ఓల్గా, చల్లపల్లి స్వరూపారాణి, మందవరపు హైమావతి, రజని, కుప్పిలి పద్మ, ఘంటసాల నిర్మల, రజని, మెహజ్‌బిన్, వినోదిని, సుజాత రెడ్డి వంటి వారెందరో ధిక్కార స్వరాలతో రచనలను చేసి స్త్రీవాద సాహిత్యంలో క్రియాశీలక పాత్ర పోషించి ఉద్యమాన్ని సరికొత్త మార్గంలో నడిపించి చరిత్ర సృష్టించి, తమ కలాలను హలాలుగా మలచి స్త్రీవాద సాహిత్యాన్ని పండించి మంచి ఫలాలను అందించారు.

ఎదిరించిన భిన్న స్వరాలు :

స్త్రీవాద ఉద్యమంలో పాల్గొన్న కవయిత్రులు,

రచయిత్రుల స్వరాల్లో భిన్నభావనలు కనిపిస్తాయి. ఈ భిన్న స్వరాలు స్త్రీవాద ఉద్యమంలో భాగాలైన లిబరల్ ఫెమినిజం, రాడికల్ ఫెమినిజం, సోషలిస్ట్ ఫెమినిజం, పోస్ట్ మోడరన్ ఫెమినిజం, ఇంటలెక్చువల్ ఫెమినిజం, ఎకో ఫెమినిజం వంటి వాటి ప్రభావంవల్ల ఎవరికి వారు స్వతంత్ర భావనతో రచనలు చేసిన తీరు చెప్పకోదగ్గది. వీటి ప్రభావంతో ఘాటుగా స్పందించిన స్త్రీవాద స్వరాలు అప్పటి వరకు నిద్రావస్థలో ఉన్న సమాజాన్ని తట్టిలేపాయి. పురుషాధిక్య సమాజాన్ని ప్రశ్నించాయి. ఒకసారి మాకోసం ఆలోచించమని ప్రార్థించాయి, శాసించాయి. మరొక సందర్భంలో కాస్త ముందుకు వెళ్ళి మేము లేకపోతే మీరెలావచ్చారు అనే ధిక్కార స్వరాన్ని వినిపించాయి. ఇంకా ముందుకు వెళ్ళి మీ అవసరం కాదు మా అవసరమే మీకు ఉన్నట్టు ఘాటుగా సమాధానం చెప్పినట్లు కనిపిస్తుంది. స్త్రీ వాద రచయిత్రులు ఇంత ఘాటుగా, ధీటుగా స్పందించడానికి కారణం సమాజంలో ఇప్పటివరకు జరిగిన జరుగుతున్న అణచివేతలే కారణం. నిత్యం అవమానాలతో అమానుష చర్యలతో వేధింప బడుతున్న మహిళల ఆత్మక్షోభే అక్షరమై కవిత్వీకరణకు మార్గమైంది. పురుషాధిక్య సామజాన్ని ప్రశ్నిస్తూ అవహేళ లను గుర్తుచేస్తూ, తీవ్రంగా ఖండిస్తూ అందాన్ని చూసి అవమానపు వెకిలి చూపులను విమర్శిస్తూ జయప్రభ ఘాటుగా స్పందిస్తూ

రెండు కళ్ళనుంచి చూపులు
సూదుల్లా వచ్చి మాంసపు ముద్దలపై

విచ్చలవిడిగా తిరుగుతూ ఉంటాయి... అనడంలో ఎంత ఆవేదన దాగిఉందో అర్థమౌతుంది. స్త్రీలు అందంగా ఉండడం నేరమేమో అనిపిస్తుంది. ఈ కవిత ద్వారా పురుషాధిక్య కాముక దృష్టిని, మృగతృష్ణను నిలదీసిన తీరులోను, ధిక్కార స్వరంలోను, తీవ్రత అధికంగా కనిపిస్తుంది. అలాగే కొండేపూడి నిర్మల రాసిన "లేబర్ రూమ్" పెద్ద సంచలనాన్నే రగిలించింది. స్త్రీలు సంతానాన్ని ఉత్పత్తిచేసే యంత్రం కాదని, పురుష అహంకారాన్ని ప్రదర్శించి సుఖంకోసం చేసే రసవత్తర హింసను గుర్తుచేస్తూ

కాళ్ళనలా ఎడంచేసి దీనంగా హీనాతి హీనంగా నీచాతి నీచంగా
ఒక హింసాతల పరాకాష్టకోసం ఎదురుచూడ్డామంటే
రైలుపట్టా మీద నాణెం విస్తరించిన బాధ

కలపను చెక్కుతున్న రంపంకింద పొట్టులా ఉండ చుట్టుకున్న బాధ... అంటూ మృగవాంఛ వలన స్త్రీలు పడే బాధ నిర్భయంగా చెప్పడమంటే దాని వెనుక స్త్రీపడుతున్న బాధ ఏంటో అర్థమౌంతుంది. ఇంత బాధను భరిస్తూనే స్త్రీ పురుషునికి సుఖాన్నందించినా గౌరవం లేకుండా పురుషాహంకారంతో, అధికార దర్పంతో చలాయించడం ఎంతవరకు సమంజసమంటూ ప్రశ్నిస్తున్న తీరులో వాస్తవికతను గుర్తించాలనే సందేశాన్ని అందిస్తారు నిర్మల.

ఓల్గా ధిక్కార స్వరాన్ని వినిపిస్తూ ఒక యువకుడి మరణం వల్ల స్త్రీపై జరిగిన పోలీసుల రాక్షస దాడిని ఖండిస్తూ కారణాన్ని వివరిస్తూ గళ గర్జనతో ప్రశ్నిస్తూ

ఓమగ మదమృగాల్లారా
మీరు మీ ఇళ్ళల్లో చావండి
మాకు మిమ్మల్ని సుఖపెట్టడమే తెలుసు
చావడానికి మాదగ్గరకు రాకండి

బ్రతకడానికి నానా చావు చస్తున్నాం... అంటూ ఎలుగెత్తిన ఈ నినాదంలో ఒక స్త్రీపై జరిగిన అమానుష దాడిలో ఎంత దౌర్జన్యం, ఎంత పైశాచికం దాగిఉందో తెలుస్తుంది. కనీసం ఒక స్త్రీ అని కూడా చూడకుండా వేధించిన ఖాకీల దాస్టిక దౌర్జన్యాన్ని ప్రపంచానికి తెలియజేస్తూ ప్రజలను రక్షించాల్సిన రక్షక భటులను నిలదీసారు. బ్రతకడం కోసం నానా చావు చస్తున్నాం అనడంలో ఒక ఆర్ద్రత, బ్రతకడం కోసం దిగజారిన బ్రతుకు, అందులో పడే ఇబ్బందులు నిత్యం చవి చూస్తున్న రోధన, వేదనను వ్యక్తీకరించిన తీరులో ఉన్న న్యాయాన్యాయాలు ఆలోచించాలని సమాజానికి ఒక సందేశాన్ని అందిస్తారు.

డా॥ కొండేపూడి నిర్మల "ఎ కాల్ గర్ల్ మొనోలాగ్" అనే కవిత ద్వారా ధీటుగా ఘాటైన స్వరాన్నే వినిపిస్తూ వేశ్యల బాధలను హృదయ విదారకంగా కవిత్వీకరించారు.

విజయవాడలో జరిగిన ఒక యదార్థ సంఘటనను స్పందించిన తీరు ఆశ్చర్యం కలిగిస్తుంది. పాపకూపంలోకి నెట్టబడి బ్రతకలేక బ్రతుకుతూ చావలేక చస్తున్న ఒక వేశ్య మెడలో బోర్డు తగిలించి నడివీధిలో ఊరేగించిన అరాచక, పైశాచిక తీరును ఖండిస్తూ వేశ్య దర్భర స్థితిని, దైన్యాన్ని కళ్ళముందు ఆవిష్కరిస్తూ

వేలవేల వీర్యాల వర్షాల్ని
కళ్ళుమూసుకునైనా భరిస్తున్నదాన్ని
రంగులు చిట్లిన రతిరోతకు జ్వలిస్తున్నదాన్ని
కాంక్షల సర్పపరిష్వంగాల నుంచి
అన్నమనే అమృతాన్ని ఆహ్వానిస్తున్నదాన్ని... అంటూ తీవ్ర ధ్వనితో నినదిస్తారు. ఈ కవితలో ఒక దయనీయమైన స్థితి కనిపిస్తుంది. కూటికోసం కాయాన్నమ్ముకునే దుర్భర స్థితి, సర్పపరిశ్వంగాల నుంచి కేవలం బ్రతకడం కోసమే అన్నమనే అమృతాన్ని ఇవ్వమనే దీనాలాపన గుర్తుచేస్తూ వేశ్యల బ్రతుకుల్లో ఎంత విషాధం దాగుందో, ఎంత నరకయాతన ఉందో లోకానికి తెలియజేసారు నిర్మల. ఇదేనా పవిత్ర భారతదేశంలో నిత్యం జరిగే అమానుష దుస్థితిలో దాగిన ఆవేదన అందరిని కలచివేయకమానదు.

స్త్రీల అందాన్ని కూడా అంగడి సరుకుగా మార్చి అంతర్జాతీయ వ్యాపారం చేస్తూ అందాల పోటీలను నిర్వహించే వ్యాపారధోరణిని దుయ్యబట్టారు. అందం ఖరీదైన సరుకుగా అమ్మడానికి సిద్ధం చేస్తున్న అందాల పోటీ ఖరీదైన వ్యాపారంగా మారింది. అటువంటి అందాల పోటీని నిశేధించాలంటూ మా సౌందరాన్యినికి కూడా ఖరీదు కట్టడమే కాదు ప్రపంచంముందు అధికారికంగా మా అంగంగాలను ప్రదర్శించడం హేయమైనదిగా కనిపించడంలేదా అని తిరస్కార భావాన్ని వ్యక్తంచేస్తూ దానివల్ల జరిగే చీకటి వ్యాపారాన్ని ధిక్కరిస్తూ ...

మనమంటే 34, 24, 35 కొలతమైన చోట
అందం నరుకైన చోట అందాల వ్యాపారాన్ని
ద్వేషిద్దాం... అంటూ విప్లవాత్మక గొంతును వినిపించారు. నిజంగా మన ప్రాచీన సాహిత్యంలోకూడా ఇదే వరుస కొనసాగింది. స్త్రీని కేవలం భోగ వస్తువుగా అంగాంగ వర్ణచేస్తూ నఖ, శిఖ, ముఖ, నాభి, నూగారు పర్యంతం వర్ణిస్తూ, అశ్లీలతకు అగ్రస్థానం కల్పించారు. అడుగడుగునా శృంగార వర్ణనలతో రసప్రవాహ జలధిలో కొట్టుకుపోయిన రసవాదులు రసాస్వాదనను తిరస్కరించారు. ఆధునిక కాలంలో కూడా అదే విధంగా స్త్రీ విలాస వస్తువుగా చిత్రించడం కనిపిస్తుంది. ప్రతీ పబ్లిసిటీ వెనుక స్త్రీయే కనిపిస్తుంది. స్త్రీకి సంబంధం లేనిచోట కూడా స్త్రీ చిత్రాలనే ఆకర్షణంగా చూపించడం వ్యాపారమైపోయింది. వ్యవసాయ రోగ క్రిమిసంహారక మందుల ప్రకటనలో కూడా అందమైన స్త్రీయే కనిపిస్తుంది. ప్రముఖ వాహనాల టైర్ల ప్రకటనలో కూడా స్త్రీయే విలాస వస్తువౌతుంది. ఈ స్థితి మారాలనే సంకల్పంతో తీవ్ర ధ్వనితో అంగాగ వర్ణనల ప్రదర్శించే కొలువులను రూపుమాపాలని, సమాజానికి పిలుపునిచ్చారు. స్త్రీలను దేవతలా కాకుండా కనీసం స్త్రీని స్త్రీగానే గౌరవించమని ప్రజలకు ప్రణమిల్లారు విమల.

అందమైన దోపిడీకి, పవిత్రమైన హింసకు, న్యాయమైన దాస్యానికి బలైపోయిన నేను భారత స్త్రీ నంటూ ఓల్గా కవిత్వీకరించిన తీరులో ఆవేదన దాగిఉంది. పవిత్రమైన హింస కనిపిస్తుందంటూ భారతీయ సంప్రదాయంలో తలఒగ్గి బ్రతకమనే కుటుంబ వ్యవస్థ, పురుషునికి ఎదురుతిరగ వద్దనే గద్దింపు, పతియే ప్రత్యక్ష దైవమనే భావనలో భాగంగా పవిత్రమైన హింన అనడంలో ఒక వ్యంగ్యంతో కూడిన వాస్తవం కనిపిస్తుంది. ఇష్టమున్నా లేకున్నా సంసారం చేయమనే బలవంతపు ఆజ్ఞ పవిత్ర భారతదేశంలో స్త్రీకున్న గౌరవ మర్యాదల్లో దానివెనుక దాగిఉన్న పవిత్ర హింస గుర్తుచేస్తారు. ఇదేనా స్త్రీ స్వాతంత్ర్యయమని ప్రశిస్తూ ధిక్కార స్వరాన్ని వినిపించారు.

డా॥ చల్లపల్లి స్వరూపాన్ని దళిత స్త్రీవాదాన్ని గుర్తు చేస్తూ, దళిత స్త్రీలంటే సమాజానికి మరీలోకువని, చాతుర్వర్ణ ఛాందస సనాతన వ్యవస్థలో దళితులకు నిషిద్ధ ఆజ్ఞలేతప్ప ఆహ్వానాలుండవని వాపోతారు. ఎంత ఉన్నతమైన చదువులు చదివినా, ఎన్ని పదవులు వరించినా న్యూనతా భావాలతో తృణీకరణలే తప్ప గౌరవాలు ఉండవంటారు. ఇటువంటి వివక్షలతో అణచివేతలతో నడుస్తున్న ఆధునిక భారతంలో నాటినుండి

నేటి వరకు తరతరాల వారసత్వంగా కొనసాగుతున్న కులమత వ్యవస్థలోని లోపాలను దుయ్యబడుతూ ధిక్కార స్వరాన్ని వినిపిస్తూ...

నేను ముళ్ళకంపలో చిక్కుకున్నదాన్ని
అల్లాడుతున్న పాలపిట్టను
ఎటు కదిలిన ముళ్ళన్నీ గుచ్చుకునేది నాకే
ఇవి నాటి ముళ్ళుకాదు
తరాల నుంచి నా చుట్టూ పేర్చిన బానిస సంకెళ్ళు....

అంటూ నేటి దళిత స్త్రీల వ్యధలను బాధలను గాధలను గుర్తుచేసారు. అంతేకాకుండా

ఇంట్లో పెళ్ళంగా, నిత్యావసరవస్తువై
వీధుల్లో అవహేళన మాటలు మోసే
కులం తక్కువ గాడిదనయ్యాను.... అంటూ ఇంట్లో భర్త ఒక చెంపు చెళ్ళుమనిపిస్తే వీధిలో కులాధిపత్యం రెండో చెంప పగలకొడుతుందని దళిత స్త్రీల ఆవేదనను కవిత్వీకరించిన తీరులో నేటికీ మారని కులమత వ్యవస్థలో ఉన్న ఆధిపత్యం, అణచివేత కనిపిస్తుందనే ఆవేదనను నేటి సమాజంపై ధిక్కార స్వరాన్ని వినిపించారు.

ఈ విధంగా ఆధునిక తెలుగు కవిత్వంలో మహిళల దుస్థితిని, ఆవేదనను, ఆక్రందనలను వివరించడమే కాకుండా ధైర్యంగా సమస్యలకు ధీటుగా ఎదుర్కోవడం, ధైర్యంగా పోరాడటం నేర్చుకోవాలని జాతిని జాగృతం చేస్తూ చైతన్యాన్ని సమాజిక స్పృహను కల్పించింది స్త్రీవాద సాహిత్యం. అనేక అసమానతలను పురుషాధిక్య సమాజాన్ని మార్చే దిశగా రచనలు చేయాలని, వివక్షతను రూపుమాపి మస్తిష్కాల్లో సమతాభావనను మొలకెత్తించాలని, బానిస ధోరణిపోయి స్నేహ సామరస్యాలు, గౌరవ మర్యాదలతో స్త్రీ పురుషులు కలిసిమెలిసి జీవించేలా స్నేహపూర్వక సమాజానికి ఆహ్వానం పలుకుతూ నవ్యశకానికి బాటలు వేద్దాం.

ఆధార గ్రంథాలు :

1) ఆధునికాంధ్ర కవిత్వము, సంప్రదాయాలు, ప్రయోగాలు - డా॥ సి. నారాయణ రెడ్డి
2) తెలుగులో కవితోద్యమాలు - తెలుగు అకాడమి ప్రచురణ
3) వ్యాసపరిమళం - డా॥ తరపట్ల సత్యనారాయణ
4) తెలుగు సాహిత్య చరిత్ర - డా॥ ద్వానా శాస్త్రి

★★★

Vol. 23 | Spl. Issue 03 | March 2026 | BHAVAVEENA | ISSN No. : 2456-4702 | RNI No. APTEL/2003/12253

RNI No. APTEL/2003/12253 | Reffered Journal & Peer Reviewed Journals | ISSN No. 2456-4702

భావవీణ

కళలు, సాహిత్య, సాంస్కృతిక భాషాధ్యయన పత్రిక

BHAVA VEENA

Journal of Arts, Literary, Culture & Language Study

తొలితరం కోయ ఆదివాసీ కథలు - స్త్రీ అస్తిత్వ కోణాలు

- డా॥. జరుక్కుల రమేష్

అసోసియేట్ ప్రొఫెసర్, తెలుగు విభాగం, కాకతీయ ప్రభుత్వ కళాశాల, (స్వయం ప్రతిపత్తి), హనుమకొండ.

వ్యాస సంగ్రహం:

భూమి మీద జీవం ఆవిర్భవించిన నాటి నుండి నేటి వరకు సాగిన పరిణామ క్రమం ఎన్నో విభిన్న దృక్పథాలను, అద్భుతాలను మనకు పరిచయం చేసింది. ముఖ్యంగా మనిషి మనుగడపై జరిగిన అనేక పరిశోధనలు మానవ వికాసంలోని కొత్త కోణాలను ఆవిష్కరించాయి. ఈ క్రమంలోనే, ప్రకృతి ఒడిలో మమేకమై, అడవిని నమ్ముకుని జీవించే 'కోయ' ఆదివాసి తెగ భారతదేశ ప్రాచీన సంస్కృతికి ఒక సజీవ సాక్ష్యంగా నిలుస్తుంది. కోయ సమాజంలో స్త్రీ పాత్ర అత్యంత కీలకమైనది. ఆమె కేవలం కుటుంబంలో ఒక వ్యక్తి మాత్రమే కాదు, జీవనాధారాన్ని ఇచ్చే శక్తిగా, అపురూప సాంప్రదాయాలను కాపాడే సంరక్షకురాలిగా, సహనానికి నిలువుటద్దంగా నిలుస్తుంది. అనసూయ రాసిన 'చప్పుడు' కోయ ఆదివాసి కథల నేపథ్యంతో, వారి జీవన విధానాన్ని, ముఖ్యంగా స్త్రీల సామాజిక స్థితిగతులను శాస్త్రీయంగా విశ్లేషించడమే ఈ వ్యాసం యొక్క ప్రధాన ఉద్దేశం.

కీలక పదాలు :

కోయ, ఆదివాసీ, కాకమ్మ, చప్పుడు, ముసలి, మూగ బోయిన శబ్దం, స్త్రీ, సామాజికత, అస్తిత్వ కోణాలు

పరిచయం:

కోయ ఆదివాసులు భారతదేశంలోని ప్రాచీన గిరిజన సమాజాల్లో ఒకటి. ఉమ్మడి తెలుగు రాష్ట్రాల్లో 35 గిరిజన ఆదిమ తెగలు ఉన్నాయి. ముఖ్యంగా తెలంగాణ, ఆంధ్ర ప్రదేశ్, ఛత్తీస్‌ఘడ్ ప్రాంతాల్లో వీరి నివాసం ఎక్కువగా ఉంటుంది. అడవులను ఆధారంగా చేసుకొని ప్రకృతితో సహజీవనం చేసే ఈ సమాజం తమ ప్రత్యేక సంస్కృతి సాంప్రదాయాలు జీవన విధానాలతో ప్రత్యేక గుర్తింపును పొందింది.

"గిరిజనులు అనగానే తలలో ఈకలు, మొలలో గజ్జెలు ఉండే విచిత్ర జీవులని సామాన్య నాగరికులు భావిస్తారు. ఎక్కడో అడవులలో నివసిస్తూ తెల్లబట్టలు కనబడగానే పారిపోయే భయస్తులని కొంత చదువుకున్న వాళ్ళు భావిస్తారు. గిరిజనుల భావనలో చెప్పాలంటే వాళ్ళు తమను తాము 'కొండ మనుషులు' గాను 'అడవి మనుషులు' గాను భావించుకుంటారు. ఈ రకంగా చూస్తే వాళ్లకు మనం పెట్టుకున్న గిరిజనులు, ఆటవికులు అనే పేర్లు వాళ్ళ చైతన్యం యొక్క సంస్కృతీకరణే" (కె.బాల గోపాల్, ఆదివాసులు వైద్యం సంస్కృతి అణచివేత, పుట : 09) బాలగోపాల్ గారు అభిప్రాయ పడ్డారు.

గిరిజనుడికి అడవి కేవలం నివాస స్థలం మాత్రమే కాదు, అది అతని స్వగృహం. అతను జన్మస్థలం. అతను నిత్యం చెట్లతో, జంతువులతో, పక్షులతో, కలిసి కుటుంబ సభ్యుల మెలుగుతాడు. ప్రకృతితో అతనికి ఉన్న ఈ

అనుబంధం ఎంతో సహజం, ఎంతో ఆత్మీయతతో కూడినది. అడవిలోని ప్రతి జీవి పరస్పర హక్కులను గౌరవిస్తూ సామరస్యంగా జీవిస్తుండగా వాటిని చూసి తన జీవన విధానాన్ని కూడా అలానే అనుసరిస్తాడు. అడవి గిరిజనుడితో అభినాభావ సంబంధం కలిగి ఉంటుంది. అడవి అతని జీవనాధారం, ఊపిరి.

అడవిలో ప్రతి అడుగు శబ్దాన్ని గుర్తించగల సున్నిత మైన గమన శక్తి ఆ గిరిజనుడికి ఉంటుంది. పక్షుల పేర్లు, మొక్కల పేర్లు, జంతువుల పేర్లు మాత్రమే కాకుండా చిన్న చిన్న కీటకాల వివరాలు వరకు కూడా అతను సులభంగా చెప్పగలడు. ప్రకృతితో ఈ సమగ్ర పరిచయం అతని జీవితాన్ని మరింత సంపూర్ణంగా చేస్తుంది. అతను అడవిని ప్రేమతో చూసుకుంటాడు. ఆ ప్రేమకు ప్రతీక అడవి కూడా అతని ఆదరిస్తుంది. ఎప్పుడైనా విరోధం కోసం గానీ, వేట కోసం గానీ, గిరిజనుడు జంతువులను హింసించడు అవసరం లేకుండా ఒక్క చెట్టును కూడా నరకడు. ప్రకృతి ఒడిలో పెరిగిన గిరిజనులు నిజంగా ప్రకృతి బిడ్డలాగే జీవిస్తుంటాడు.

స్వతంత్ర భారతంలో అభివృద్ధి అన్నది ఆదివాసీల జీవితాల్లో వెలుగులు నింపాల్సింది పోయి, వారిని మరింత దిగువ మెట్టుకు నెట్టివేసిందని చెప్పక తప్పదు. 'అభివృద్ధి' అనే నినాదంతో అడవిలోకి ప్రవేశించిన నాగరికత శక్తులు, ప్రకృతి బిడ్డలైన గిరిజనులను వారి స్వంత గడ్డ నుండే దూరం చేస్తున్నాయి. ప్రభుత్వం ఎన్నో సంక్షేమ పథకాలను ప్రవేశపెడుతున్నప్పటికీ, మధ్య దళారుల వ్యవస్థ ఆ ఫలాలను అట్టడుగు స్థాయికి చేర నివ్వకుండా అడ్డుగోడలా నిలుస్తోంది. ఆధునిక తెలుగు సాహిత్యంలో ఎన్నో సామాజిక వర్గాల జీవితాలు కథలుగా, నవలలుగా, కవితలుగా రూపుదిద్దుకున్నాయి. కానీ, అడవిని నమ్ముకుని బతికే 'కోయతెగ' ఆదివాసీల ఆర్తనాదాలు, వారి అస్తిత్వ పోరాటాలు నేటికీ సరైన సాహిత్య రూపం దాల్చక, వెలుగు చూడని సజీవ గాథలు గానే మిగిలిపోతున్నాయి. "ఒకటి శతాబ్ది కాలం దాటిన తెలుగు కథలో చాలా ఖాళీలు ఉన్నాయి. వలస పాలనలో ఆవిర్భవించిన ఈ ప్రక్రియ అసంపూర్ణంగా గాథగానే మిగిలిపోయిందని" (పద్దం అనసూయ.చప్పుడు.పుట:11) జయధీర్ తిరుమలరావు అన్నట్టు పద్దం అనసూయ ఆ ఖాళీలను కొంచెం పూరించడానికి ఈ కథల ద్వారా ప్రయత్నం చేసిన తొలితరం కోయ రచయిత్రి.

పద్దం అనసూయ పాల్వంచ దగ్గర సుబ్బనపల్లి కోయ గూడెంలో జన్మించిన తొలితరం కోయ రచయిత్రి. కోయ సమాజం అటు తెలుగు సమాజపు ఆధిపత్యం అన్నింటిని అంటే భాష, సంస్కృతి, సాహిత్యం, కళ వంటి వాటిని ఆర్థిక దోపిడిని వర్గాధిపత్యం కోరల్లో నిత్యం బాధలకు గురవుతున్న స్థితిని, అనుభవిస్తున్న తమ సమాజాన్ని ఆ పసిపాపల ఆర్తనాధాలను, ఆ ప్రాంతపు స్త్రీల మనోవేదన లను అక్షరీకరించాలనే ఉద్దేశంతో కలం పట్టిన పద్దం అనసూయ ఏ 'చప్పుడు' చేయకుండానే కోయ స్త్రీల అస్తిత్వాన్ని, మరి ముఖ్యంగా 'చావు'లో తత్వాన్ని, ఆవేదనను, మారుతున్న నాగరికత అస్తిత్వాలను ఇందులో నిక్షేపితం చేసింది.

కోయ ఆదివాసీ కథలు : వస్తు వైవిధ్యం

"చప్పుడు" కథా సంకలనం తెలుగు సాహిత్యంలో ఒక అరుదైన మరియు వినూత్నమైన ప్రయోగం. కేవలం నాలుగు కథలతోనే కూడిన ఈ పుస్తకం, కోయ ఆదివాసీల అంతరంగిక జీవన సత్యాన్ని ప్రపంచానికి చాటిచెప్పింది. మానవ జీవితంలో పుట్టుక, మరణం అనేవి అత్యంత ప్రధానమైన ఘట్టాలైతే, ఈ సంపుటిలోని కథలన్నీ "చావు" అనే తంతును ఆధారంగా చేసుకుని సాగడం విశేషం. స్వయంగా ఆదివాసీ బిడ్డ అయిన రచయిత్రి పద్దం అనసూయ గారు, తన జనుల అస్తిత్వాన్ని, వారి సంస్కృతి లోని గంభీరతను ఈ రచన ద్వారా వెలుగులోకి తెచ్చారు.

కాలం మరుగున పడిపోయిన తమ గర్వకారణమైన చరిత్రను, విస్మరించబడిన జీవిత పార్శ్వాలను ధైర్యంగా ప్రపంచానికి పరిచయం చేసేలా, మున్ముందు ఎందరో ఆదివాసీ రచయిత్రులకు ఈ "చప్పుడు" ఒక గొప్ప స్ఫూర్తిగా మరియు దిక్సూచిగా నిలుస్తుంది. ఇప్పుడు అనసూయ 'చప్పుడు' కథల్లోకి ప్రయణించి, పుట్టుక, మరణాల మధ్య సాగే నిత్య సంఘర్షణను, తమ సంస్కృతి సంప్రదాయాలను కపాడడానికి చేసిన ప్రయత్నాన్ని ఈ కథల్లోకి వెళ్లి విందాం.

కాకమ్మ కథ :

ఈ కథలో ప్రధాన పాత్ర కాకమ్మ. పాల్వంచ పరిసరాల్లోని కోయగూడెం నేపథ్యంలో సాగే ఈ కథలో కాకమ్మ ఒక అద్భుతమైన పాత్ర. కోయ సంస్కృతిలో పుట్టి పెరిగిన ఆమె, అచంచలమైన ఆత్మవిశ్వాసం, అపారమైన దూరదృష్టి కలిగిన మహిళ. తన కుటుంబం తన కళ్ళ ముందే ఉండాలని పెద్ద కూతురికి మేనల్లుణ్ణి ఇచ్చి ఇల్లరికం తెచ్చుకున్నా, మారుతున్న కాలానికి అనుగుణంగా చిన్న కూతురుని, కొడుకుని పట్నంలో చదివించిన వివేకవంతురాలు. కాకమ్మకు తన బిడ్డలంటే ఎంత ప్రేమో, తను సాగు చేసే పోడు భూమి అన్నా అంతే ప్రాణం. ఆ మట్టితో, ఆ పంటలతో ఆమెకు ఉన్న అనుబంధం ఎంతటిదంటే..."నువ్ సచ్చినా గానీ నీ జీవి మంచె మీద కూసోని పిట్టల్ని తోల్తాంది" (చప్పుడు. పుట 02) అని గూడెం ప్రజలు చెప్పుకునేంతగా ఆమె ఆ భూమితో మమేకమైపోయింది.

మారుతున్న కాలం గూడెంలోకి ఊహించని మార్పులను తీసుకువచ్చింది. అనారోగ్యం పాలైన కాకమ్మ తన బాధ్యతలను నెరవేర్చాలనుకున్నా, ఆధునికత పేరిట సంతానం తీసుకున్న నిర్ణయాలు ఆమెను సవాలు చేశాయి. చిన్న కూతురు కులాంతర వివాహానికి మొగ్గు చూపినా "కులం చెడ్డా సుఖం దక్కాలి" (పుట.04) అనే ఉదారతతో ఆమె ఆశీర్వదించి, తన ఆచారం ప్రకారం కులకట్టెడ ఇచ్చి, గుండె నిండా భారంతోనే భూమి కాగితాలను కూతురి చేతిలో పెట్టింది. ఆచారాల పట్ల అంకితభావం కలిగిన కాకమ్మ, కొడుకు పెళ్లిని తన తెగ పద్ధతుల్లో ఘనంగా చేయాలని కలలు కన్నా.."ఇప్పుడవ్వన్నీ ఎవరు పట్టించుకుంటున్నారమ్మా?! అంత మోటై పోయింది" అన్నాడు. ఆచారం మోటైందా!?"(పుట.04) అన్న కొడుకు మాటలు ఆమె మనసును చిదిమేశాయి. గూడెంలోకి కరెంట్, కొత్త పూజారుల రాకతో పాత ఆచారాలు మసకబారుతున్న వేళ, తన ఉనికికి ఏదో ముప్పు పొంచి ఉందని ఆమె గ్రహించింది. అందుకే అప్పటివరకు పాలం వదలని కాకమ్మ, తరచూ పట్టణానికి వెళ్లి రహస్యంగా కొన్ని వస్తువులు తెచ్చి ఒక పాత చెక్కపెట్టెలో భద్రపరుస్తూ, ఆ తాళాన్ని తన ప్రాణంలా కాపాడుకుంటూ తన ముగింపు కోసం మౌనంగా సిద్ధపడింది.

జీవితపు చరమాంకాన్ని చేరుకున్న కాకమ్మ, "వెయ్యేళ్లున్నా ఏరు తప్పదు, నూరేల్లున్నా సావు తప్పదు"(పుట.06) అనే సత్యాన్ని సాక్షాత్కరించుకుంటూ తన ఆస్తిపాస్తులను బిడ్డలకు పంచి ఇచ్చింది. కాకమ్మ అనారోగ్యంతో క్షీణిస్తున్నా, తన ఆత్మకు తన గూడెం మట్టిలోనే శాంతి లభిస్తుందని నమ్మిన ఆమె, ఆసుపత్రి గడప దాటి తన ఇంటికే చేరింది. మరణం ముంగిట నిలబడి కూడా తన అంతిమ యాత్రకు తెగ ఆచారం తప్పకుండా సాగాలని కోరుకున్న ఆ ధీరవనిత, తన ప్రాణంలా కాపాడుకున్న చెక్క పెట్టె తాళాన్ని కూతురికి అప్పగించింది. ఆ పెట్టెలో తను ముందుగానే సిద్ధం చేసుకున్న తెల్ల చీరలు, పాత బంగారు నాణెం, చేట, ఉట్టి, గరిక ముంత వంటి సాంప్రదాయ వస్తువులను చూసి అందరూ నివ్వెర పోయారు. చివరగా, తన తోడునీడైన తాతయ్యను దగ్గరకు పిలిచి, తన తెగ మూలాలకు చిహ్నమైన ఆ బంగారు నాణేన్ని చూపిస్తూ కాకమ్మ ప్రశాంతంగా కన్ను మూసింది. తన అస్తిత్వాన్ని, ఆచారాలను ఆఖరి శ్వాస వరకు గౌరవించిన ఒక గిరిజన మాతృమూర్తి గాథకు ఇది ఒక భావోద్వేగభరితమైన ముగింపుతో కథ ముగిస్తుంది.

చప్పుడు కథ :

ఈ కథలో పోతప్ప భార్య 'సుంకులు' మరణిస్తుంది. కోయ జాతి ఆచారం ప్రకారం 14వ రోజు రాత్రి 'పూర్భం' చెప్పించాలి. అందుకు పోతప్ప డోలోళ్లకు అడ్వాన్స్ చేతిలో పెట్టి వస్తాడు.

కోతప్ప ఉండేది పాల్వంచలో ఒక వీధి. డోలోళ్లు ఎంతసేపటికి రాకపోయేసరికి మనసులో మదన పడతాడు. చివరికి రారనుకున్న డోలోళ్ళు ఆలస్యంగా వస్తారు. డోల్ల శబ్దం చేస్తూ కర్మకాండలు మొదలు పెడతారు. కొంతసేపటికి డోళ్ళ శబ్దం ఎక్కువై పక్కింటి వాళ్ళు, ఆ వీధి వాళ్ళు వచ్చి శబ్దాలు వినలేమని, తమకు చాలా ఇబ్బందులు కలుగుతాయని చెప్తారు. దాంతో

పోతప్ప మీరు రాత్రింబవళ్లు అయ్యప్ప భజనలు చేస్తారు. ఫాదర్ని పిలిపించి రకరకాల ప్రార్థనలు చేస్తారు. దసరా, వినాయక చవితి ఉత్సవాల్లో అర్ధరాత్రి వరకు లౌడ్ స్పీకర్లు పెట్టి డాన్సులు చేస్తారు. ముస్లింలు ఊరి మధ్యలో ఆజాలు పెడతారు. అప్పుడు నేనేమీ అనలేదే?వాటిని సంస్కృతిలో భాగమని గౌరవించాను. ఇవేవీ డిస్టబెన్స్ కానప్పుడు నా తెగ డోళ్ల చప్పుడు మాత్రం ఎలా డిస్టబెన్స్ అవుతుంది. కానీ, అని చెప్పి మరణించిన 'సుంకాలు' గౌరవార్థం 'పూర్ఛం' చేయించడంతో కథ ముగిస్తుంది.

ముసిలి కథ :

ఈ కథలో ప్రధాన పాత్ర ముసిలి. ఆకలికి, కుటుంబ పోషణకు మధ్య ఉన్న పరంపరను గొప్పగా రచయిత్రి ఈ కథలో చిత్రించింది. తునికాకు కోసం గూడెం యువకులతో కలిసి మండుటెండలో ముసిలి అడవి బాట పడుతుంది. ముసిలికి తోడుగా తాను పెంచుకున్న కుక్క కూడా వెళ్తుంది. కుక్క పట్ల ముసిలికి "రేపు మనం సత్తే ఆనల్లో కలిపి వరకూ బువ్వ పెట్టేది కుక్కే"(17) అంటూ ప్రాణానికి ప్రాణంగా పెంచుకుంటుంది. గూడెం నుండి ఆకులు తెంపడానికి వెళ్తారు. వెళ్లిన వారి వెంట రెండు బుర్రల్లో మంచినీళ్లు తీసుకెళ్తారు. పెద్దదానివి 'తొలాకు' తెంపు అంటూ ముసలావిడతో ఆకులు తెంపి ప్రారంభిస్తారు. కొంతసేపటికి దూరం దూరంగా విడిపోయి ఆకులు తెంపడంలోనే మునిగిపోతారు. ఎక్కడ దాకా వెళ్లారనే విషయం కూడా మర్చిపోతారు.

ఎండ నిప్పుల కొలిమిలా ఉంటుంది. ఆకుల ధ్యాసలో పడి చాలా దూరంగానే ముసిలి వెళ్ళిపోయి తర్వాత చూసుకుంటుంది. నీళ్లు అంటూ భయం భయంగా అరుస్తూ అలసి సొలసి పడిపోతుంది. తీసుకెళ్లిన నీళ్లు అయిపోతాయి. ఎంత ప్రయత్నం చేసినా తన శరీరం తన మాట వినకపోవడంతో మెల్లగా కూలబడిపోతుంది. కుక్కను దగ్గరికి తీసుకొని తల నిమురుతూ "నా కట్టెను ఇంటికి చేర్సు " (21) అంటూ కళ్ళు మూస్తుంది. కుక్క చేసిన అరుపుల శబ్దానికి మిగిలిన వాళ్ళు బాట గుర్తుపట్టి వచ్చి 'ముసిలి' శవాన్ని ఇంటికి చేర్చి ఊరు వాళ్లందరూ కలిసి కర్మ చేయించడంతో కథ ముగిస్తుంది.

'మూగబోయిన శబ్దం' కథ :

ఆదివాసీల గడ్డపై ఒకప్పుడు ప్రతిధ్వనించిన జీవన నాదం నేడు మూగబోతోంది. అనాదిగా వస్తున్న వారి సంస్కృతి, ఆచారాల మీద ఏదో తెలియని నిశ్శబ్దం కమ్ముకుంది. చైతన్యంతో ఉరకలెత్తాల్సిన వారి జీవన విధానం ఇప్పుడు స్తబ్దతగా మారి, టన్నుల కొద్దీ భారమై వారి గుండెల మీద, తెగ అస్తిత్వం మీద దిగబడిపోతోంది. పచ్చని వనాలు తరిగి ముళ్ళ పొదలు రాజ్యమేలుతున్న వేళ, అడవిలోని ప్రతి శబ్దమూ గగుర్పాటు కలిగిస్తూ, రేపటి గురించిన భయాన్ని పెంచుతున్నట్లుగా ప్రకృతి వికృతిగా మారింది.

కుటుంబానికి పెద్ద దిక్కుగా ఉన్న కొడుకు అకాల మరణంతో ఎనభై ఏళ్ల పెద్దయ్య అశక్తుడైపోయాడు. వయసు భారమైనా, తీతు గుంపు నుండి బయలుదేరి ఊరూరా తిరిగి రెండు రోజులుగా కర్మకాండలకు రమ్మని ఇంటింటికీ పిలుస్తూనే ఉన్నాడు. రచయిత్రికి పెద్దయ్య తండ్రి లాంటి వాడే. వారి మధ్య ఉన్న అనుబంధం కేవలం రక్తం పంచుకున్న బంధం మాత్రమే కాదు, అడవి తల్లి సాక్షిగా అల్లుకున్న పేగు బంధం. కానీ కర్మల రోజున అడుగుపెట్టిన ఆ విషాద ఛాయలు ఆ అనుబంధాల మధ్య ఒక అగాధాన్ని సృష్టించబోతున్నాయని అతను ఊహించలేదు.

దినవారాల సమయం దగ్గర పడుతుంటే, ఆదివాసీ సంప్రదాయం ప్రకారం కర్మలు జరిపించే డోలోళ్ళు వస్తారని, ఆ చప్పుళ్లతో కొడుకు ఆత్మకు శాంతి కలుగుతుందని పెద్దయ్య ఆశగా ఎదురుచూశాడు. కానీ, చిన్న కొడుకు రాకతో దృశ్యం ఒక్కసారిగా మారిపోయింది. అతని వెంట పూర్వీకుల సంప్రదాయాన్ని ప్రతిబింబించే డోలీలు లేవు, ఆ అడవి గొంతుకను వినిపించే వాయిద్యాలూ లేవు. ఆచారాల కోసం ఆశగా ఎదురు చూసిన కళ్లకు కేవలం ఒక నిరాశ మాత్రమే మిగిలింది.

చిన్నన్న వెంట భుజానికి సంచి తగిలించుకొని, తెల్లని అంగరఖా ధరించిన ఒక వ్యక్తి రావడం చూసి అందరూ ఆశ్చర్యపోయారు. "డోలోళ్ళు రారా?" అని ఆశగా అడిగిన పెద్దయ్యకు, "వాళ్ళు రారు" అని చిన్న కొడుకు

ఖరాకండిగా చెప్పిన సమాధానం ఒక పిడుగులా తగిలింది. వచ్చిన వ్యక్తి సంచిలోంచి పుస్తకం తీసి వాక్యాలు చదవడం ప్రారంభించగా, అతని మెడలో మెరుస్తున్న సిలువ ఆ ఇంటి ప్రాచీన సంస్కృతిపై కొత్త మతం వేసిన ముద్రను స్పష్టం చేసింది. ఆ నిశ్శబ్దంలో కేవలం ఒక కొత్త మతపు ప్రార్థన తప్ప, ఆదివాసీల ఆత్మ చప్పుడు వినిపించలేదు.

ఈ పరిణామంతో పెద్దయ్య భార్య, కొడలి కళ్ళలో కళ తప్పింది. వేల ఏళ్లుగా పాటిస్తున్న సంప్రదాయం, తమ మూలాలు కళ్ళముందే కరిగిపోతుంటే ఏం చేయాలో తెలియక బంధువులంతా మూగబోయి బయటకు వచ్చి నిలబడ్డారు. అది ఒక తెగ ఎదుర్కొంటున్న అశక్తతకు చిహ్నం. పెద్దన్నయ్య మరణంతో ఒక అద్భుతమైన ఆదివాసీ సంప్రదాయ అధ్యాయం ముగిసిపోగా, చిన్నన్న కొత్త తరహా జీవనానికి తెర లేపాడు. గతానికీ, వర్తమానానికీ మధ్య, రెండు తరాల మరియు రెండు మతాల మధ్య ఆదివాసీల మూల అస్తిత్వం ఎలా మనక బారుతుందో ఈ కథా ఇతివృత్తం ఆవిష్కరించింది.

గిరిజన కోయ తెగ స్త్రీ - అస్తిత్వ కోణాలు :

కోయ స్త్రీలు ప్రకృతితో అతి దగ్గరగా జీవిస్తారు. అడవుల్లో కూరగాయలు, పండ్లు సేకరించడం, వ్యవసాయం చేయడం, కుటుంబ పోషణలో భాగస్వామ్యం కావడం వంటి పనుల్లో స్త్రీలు ప్రధాన పాత్ర పోషిస్తారు. వీరి జీవితం ప్రకృతి చక్రాలకే అనుసంధానమై ఉంటుంది. ఉదయం నుంచి సాయంత్రం వరకు కష్టపడే వీరి జీవితం సాధారణమైనదే అయినా గొప్ప విలువలతో నిండి ఉంటుంది. కోయ సమాజంలో స్త్రీకి గౌరవం ఉంటుంది. కుటుంబ నిర్ణయాల్లో కూడా ఆమెకు పాత్ర ఉంటుంది. అయితే, కొన్ని సంప్రదాయ పరిమితులు ఆమె స్వేచ్ఛను కొంతవరకు నిరోధిస్తాయి. వివాహం, పిల్లల సంరక్షణ, కుటుంబ నిర్వహణ వంటి బాధ్యతలు ఎక్కువగా స్త్రీలపైనే ఉంటాయి.

కోయ సమాజంలోని ఆచారాలు స్త్రీ జీవితాన్ని ప్రభావితం చేస్తాయి. పండుగలు, పూజలు, జాతరలు వంటి సందర్భాల్లో స్త్రీలు ముఖ్య పాత్ర పోషిస్తారు. కానీ కొన్ని ఆచారాలు స్త్రీలపై నియంత్రణలు కూడా విధిస్తాయి. ఉదాహరణకు, కొన్ని సందర్భాల్లో స్త్రీలకి ప్రత్యేక నియమాలు పాటించాల్సి ఉంటుంది. తొలితరం కోయ స్త్రీలు ఎక్కువగా విద్యకు దూరంగా ఉండేవారు. గ్రామీణ, అరణ్య ప్రాంతాల్లో పాఠశాలల కొరత, ఆర్థిక సమస్యలు, సంప్రదాయ ఆలోచనలు వంటి కారణాల వల్ల వీరు విద్యను పొందలేకపోయారు. దీంతో వారి అవకాశాలు పరిమితమయ్యాయి. ఆరోగ్య సేవలు అందుబాటులో లేకపోవడం వల్ల కోయ స్త్రీలు అనేక ఆరోగ్య సమస్యలను ఎదుర్కొంటారు. గర్భధారణ, ప్రసవ సమయంలో సరైన వైద్య సదుపాయాలు లేకపోవడం పెద్ద సమస్య. అలాగే, కష్టపడి పని చేయడం వల్ల శారీరక అలసట కూడా ఎక్కువగా ఉంటుంది.

కోయ ఆదివాసి తొలితరం కథలు స్త్రీల నిజ జీవితాన్ని ప్రతిబింబిస్తాయి. ఈ కథల్లో స్త్రీల బాధలు, స్త్రీ అస్తిత్వం, పుట్టుక మరణాల మధ్య ఉండే సంఘర్షణ స్పష్టంగా కనిపిస్తాయి. కుటుంబం కోసం తన వ్యక్తిగత కోరికలను త్యాగం చేసే స్త్రీ పాత్రలు ఈ కథల్లో ప్రధానంగా ఉంటాయి. ఇవి కేవలం కథలు కాకుండా ఒక సామాజిక వాస్తవాన్ని తెలియజేస్తాయి. ఇప్పటి కాలంలో కొంత మార్పు కనిపిస్తోంది. ప్రభుత్వం, స్వచ్ఛంద సంస్థలు తీసుకుంటున్న చర్యల వల్ల కోయ స్త్రీలకు విద్య, ఆరోగ్యం, ఉపాధి అవకాశాలు పెరుగుతున్నాయి. అయినప్పటికీ ఇంకా చాలానే అభివృద్ధి అవసరం ఉంది. తొలితరం కోయ ఆదివాసి కథలు స్త్రీల జీవితాన్ని అర్థం చేసుకోవడానికి ఒక అద్దంలాంటివి. ఈ కథలు మనకు వారి కష్టాలు మాత్రమే కాకుండా వారి ధైర్యం, సహనం, జీవన శక్తిని కూడా తెలియజేస్తాయి. కోయ స్త్రీ జీవితం సాధారణమైనదిగా కనిపించినా, అది లోతైన అనుభవాలతో నిండి ఉంటుంది. ఈ సమాజాన్ని అభివృద్ధి దిశగా నడిపించాలంటే స్త్రీలకు విద్య, ఆరోగ్యం, స్వావలంబన కల్పించడం అత్యంత అవసరం.

'కాకమ్మ' కథ ఈతరం సమాజపు పోకడలను, సమాజంలో వస్తున్న మార్పులను తెలియజేస్తోంది. గిరిజన సంస్కృతి నుండి బూర్జువ సంస్కృతిగా మారుతున్న తరుణాన్ని చాలా గొప్పగా చిత్రీకరించారు. వాస్తవానికి ఈ

దేశం భిన్నత్వంలో ఏకత్వం కలిగినది, అందరికీ సమానమైన అవకాశాన్ని అవసరాన్ని కల్పించింది. కానీ, అవి పేపర్ వరకు మాత్రమే ఆగిపోయాయి. గిరిజన గూడెం దాకా రాలేదు. డా. బి.ఆర్. అండేద్కర్ మహా నీయుడు ఇలా జరుగుతుందనే ముందుచూపుతోనే రాజ్యాంగంలో రాసినా, కొన్ని శక్తులు వాటిని ఈ తెగల దాకా రానియ్యడం లేదని వివిధ పరిశోధనలు తెలియ జేశాయి. ఆ విషయాలు ఈ కథలో రేఖామాత్రంగా ఉ న్న, మారిన కాలాలరీత్యా జరుగుతున్న పరిణామాలను చాలా ఆర్ద్రతతో రచయిత్రి చిత్రించింది.

స్త్రీ అస్తిత్వ కోణాలను, అందునా గిరిజన సమాజంలో స్త్రీలు తన స్వరూపాన్ని, స్వేచ్ఛను, హక్కులను కాపాడు కోవాల్సిన అవసరం ఉంది. ఈ కథలో ఒక తెగ యొక్క సంస్కృతి సంప్రదాయాలను, స్త్రీ ఒంటరి మనోవేదనను, మారుతున్న సమాజపు వింత పోకడలను, తరతరాలుగా వస్తున్న ఆచారంలో మరొక ఆచారం ప్రవేశించడానికి, కులాంతర వివాహాలు చేసుకోవడం మొదలైన వాటిని చిత్రించడమే ప్రధాన ధ్యేయంగా సాగినవి. అయినా స్త్రీలు కొన్నిటిలో విజయం సాధించవలసినటువంటి అవసరము ఉంది. వ్యక్తిగత అస్తిత్వం, సామాజిక అస్తిత్వం, ఆర్థిక అస్తిత్వం, సాంస్కృతిక అస్తిత్వం, శారీరక మానసిక అస్తిత్వం, స్వేచ్ఛ మరియు హక్కుల కోణాలు, ప్రతిఘటన కోణాలు మొదలైనవి. స్త్రీ ఎప్పుడూ కుటుంబం లేదా సమాజం కంటే ముందు తన వ్యక్తిత్వం ముఖ్యమని, ఆర్థికంగా స్వతంత్రంగా ఉండడం కోసం ప్రయత్నం చేయాలి. సంస్కృతి సాంప్రదాయాలు ఆచారాలు స్త్రీల జీవితాన్ని ప్రభావితం చేస్తాయి. అందుకే 'కాకమ్మ' కథలో కాకమ్మ తన సంస్కృతి తనకు ముఖ్యమని తన మరణం తర్వాత కార్మకాండానికి కావలసిన వస్తువులను ముందుగానే ఏర్పాటు చేసుకోవడం చాలా విషాదంగానే అనిపించిన ఆ కథ వెనుక అనంగీకృత సంస్కృతి జాడ్యాలు కనిపిస్తాయి.

'కాకమ్మ' కోయ గిరిజన స్త్రీలకు ప్రతినిధిగా కనిపిస్తుంది. ఎంతో పరిణితి ఉంటే తప్ప అటువంటి అస్తిత్వపు చైతన్యాన్ని తీసుకోవడానికి, అందులో కూతురు సూదరోణ్ణి ప్రేమించిదనగానే దానిని అంగీకరించడం, కొడుకు 'కోయ సంస్కృతి' ని కాదని పందిని కోయడం గలీజ్ అనడం వెనుక ఉద్దేశము... రాజకీయ, సామాజిక, ఆర్థిక, సాంస్కృతిక కోణాలు దాగి ఉన్నాయి. తరతరాలుగా ఆచరిస్తున్న సంస్కృతి ఒక్క మాటతో అనంగీకృతగా మార్చడం ఇష్టం లేని బాధ వెంట తను నడవకపోయినా దానిని అంగీకరించడం కోయస్త్రీగా పెను మార్పులు సూచిస్తుంది. దీనిలో రెండు అంశాలు చూడవచ్చు. అవి మారని సంస్కృతి, మారిన సంస్కృతి. అయినా కాకమ్మ ఈ ఆధునిక స్త్రీలకు ఆధునిక కోయ తెగ స్త్రీలకు వారసత్వంగా నిలుస్తుంది. ఆధునికంగా మారిన తనను ఈ భూమి మీద అస్తిత్వంగా నిలిపిన తన ఆచారాన్ని మాత్రం మారనివ్వకుండా, తన చావుతో చూపించి స్త్రీల చైతన్యానికి నాంది పలికింది. ప్రపంచీకరణ ప్రభావము అస్తిత్వ ఘర్షణలు, ఒక పద్ధతి ప్రకారము ఆదివాసి సమాజాన్ని సమూహ జీవనాన్ని విచ్ఛిన్నం చేస్తున్న తీరును ఈ కథలు అద్దం పడతాయి.

కోయ తెగ సంస్కృతి :

గిరిజన సమాజంలో అలవాట్లు, జీవన విధానం, సాంస్కృతి సాంప్రదాయాలు విలక్షణమైన ఆచారాన్ని కొన సాగిస్తుంటాయి. గిరిజన తెగల్లో ఒక్కొక్క తెగ విభిన్నమైన పద్ధతులను అనుసరిస్తుంటాయి. ముఖ్యంగా అనసూయ 'చప్పుడు కథల' ద్వారా కోయతెగ 'చావు' తర్వాత చేసే ఆచార సాంప్రదాయాలను చాలా వైవిధ్యంగా, చాలా గొప్పగా చిత్రించింది. ఇంతకు ముందే చెప్పినట్లు ఈ నాలుగు కథలు చావు చుట్టూ ఆ తర్వాత నిర్వహించే 'కర్మకాండ'ల చుట్టే నిర్మితమైనవి.

కోయ తెగల్లో మరణించిన తర్వాత చేసే విధానంలో కర్మ కండలు ఒకటి. అందులో 'పూర్భం' చెప్పించడం. చనిపోయిన వ్యక్తి ఆత్మ ఏమి కోరుకుంటుందో, ఎందుకు అసంతృప్తిగా ఉంది అనే విషయాలను తెలుసుకోవడానికి చేసే ఆచారమే పూర్భం. గూడెంలో ఉన్న పూజారి లేదా అనుభవం ఉన్న వ్యక్తి ద్వారా ప్రత్యేక పూజలు నిర్వ హిస్తారు. కొన్నిసార్లు ఒక మాధ్యమం ద్వారా ఆత్మ మాటను చెబుతుందని నమ్మకం ఉంటుంది. కుటుంబా

నికి సమస్యలు వచ్చినప్పుడు లేదా ఆత్మ శాంతి కోసం ఈ విధానము చేపడుతారు. ఈ ప్రక్రియ ద్వారా ఆత్మకు కావలసిన నైవిద్యం, బలి వంటి ఆచారాలు తెలుసుకొని వాటిని నిర్వహించడం ద్వారా ఆత్మను సంతృప్తి పరచాలని విశ్వసిస్తారు. ఇది పూర్వికుల పట్ల గౌరవాన్ని చూపించే ఆధ్యాత్మిక సాంప్రదాయం మాత్రమే గాక, గ్రామం మొత్తం కలిసి చేసే సామూహిక కార్యక్రమంగా కూడా భావించబడుతుంది.

'చప్పుడు కథ'లో ''సుంకులు ఆత్మ ఆనముంత రూపంలో అందర్నీ స్పర్శిస్తుంది, పలకరిస్తుంది''(పుట.12) అన్న రచయిత్రి మాటలు 'ఆనముంత' కోయ జీవితంలో ఎటువంటి ప్రాముఖ్యత వహించిందో తెలియజేస్తుంది. ''అరగంటలో 'పూర్భం' పూర్తయింది. పూనకాలొచ్చిన వాళ్లంతా శాంతించారు''(పుట.14) అంటూ కోయ తెగల కర్మకాండ చివరి మజిలీని తెలియజేస్తుంది. వాస్తవాన్ని ఈ కథలో 'డోలోళ్ళ' ద్వారా 'పూర్భం' జరిపించడానికి పడిన కష్టాలు, అందుకు వివిధ మతాల ఆచారాల ద్వారా ఎదురైన సంఘటనలు మనల్ని ఒక్కసారిగా ఆలోచింప చేస్తాయి. కేవలం ఈ విషయాలకే కాకుండా మిగతా విషయాల్లో కూడా ఈ కుట్రలు జరుగుతున్నాయి. వాటిని కూడా సాహితీకరించవలసిన అవసరం ఉంది.

ఈ కథల్లో మరొక ముఖ్యమైన సున్నితమైన అంశం మతమార్పిడి. తరతరాలుగా వస్తున్న కోయ ఆచారంలో నూతనంగా గిరిజనేతర మతాలు రావడం, వారిని మరింత దూరంగా పడేస్తుందని ధోరణి రచయిత్రి బాధలో కనిపిస్తుంది. చనిపోయిన వ్యక్తికి కోయ సంస్కృతిలో పూర్భం చెప్పించడం రివాజు. 'మూగబోయిన శబ్దం' కథలో ''నేను మతం తీసుకున్నాను' అన్నాడు. అప్పుడు కనిపించింది అతని మెడలో ఉన్న సిలువ! మతమే లేని కోయ జాతిలోకి మతం వేరుపురుగుల ప్రవేశించిందన్న మాట! డోలోళ్ళు చెప్పె 'పూర్భం' కు కాలం చెల్లినట్లేనా? అనాది కోయజాతి చరిత్ర చెప్పే డోలోళ్ళు ఇక ఈ వైపు రారా?''(పుట.28) అంటూ కోయ ఆదివాసీ సమాజంలో జరుగుతున్న మతంతీకరణలు, అవి తెస్తున్న సమస్యల్ని ఈ కథలో తెలియజేశారు. మతం తీసుకున్నవారు తమ చావుల్లో 'పూర్భం' చెప్పించకపోవడం, అందులో ప్రధాన పాత్ర పోషించే డోలోళ్ళు లేకపోవడం కోయ సమాజాన్ని ఆలోచనలో పడేసింది. రానున్న కాలంలో ఇటువంటి ఆచార సాంప్రదాయాలు రికార్డు చేయకపోతే ఎవరి సంస్కృతి ఎలాంటిదో చెప్పడానికి చరిత్ర కూడా మిగలదని అంతర్నీగూఢ ఆవేదనను రచయిత్రి ఈ కథల రూపంలో తెలుపుతుంది.

ముగింపు :

ఆదివాసీల అస్తిత్వాన్ని, వారి పోరాట పటిమను ప్రపంచ యవనికపై నిలబెట్టడంలో సాహిత్యానిది కీలక పాత్ర. బెంగాలీ రచయిత్రి మహాశ్వేతాదేవి దగ్గర నుండి నేటి తెలుగు రచయిత్రి పద్దం అనసూయ వరకు ఆదివాసీ జీవన చిత్రణను అత్యంత రమ్యంగా ఆవిష్కరించారు. ఇప్పటివరకు వెలుగులోకి రాని ఈ దేశ కోయ మూల వాసుల జీవిత కోణాలను పద్దం అననూయ ప్రపంచానికి ఎంతో ప్రభావవంతంగా పరిచయం చేశారు. 'నా భాషలో కథ రాసినంత సులభంగా తెలుగులో కుదిరేది కాదు. దీనికి తోడు చదువు, ఉద్యోగం, మైదాన ప్రాంత ప్రభావం. ఇవన్నీ నాకు తెలియకుండానే గిరిజేతర స్వభావంలోకి లాక్కున్నాయి. కథలు రాస్తున్న సమయంలో ఈ విషయం స్పష్టంగా అర్థమైంది. ఆ ప్రభావం నుండి బైటపడటానికి నానా తిప్పలు పడుతున్నాను. గిరిజనేతర స్వభావాన్ని వదులుకోకుండా గిరిజన సమాజంలో వస్తున్న కంటికి కనిపించని మార్పుల్ని పసికట్టడం అంత సులువు కాదు''(కవర్ పేజీ.) అంటూ రచయిత్రి ఈ కథల నేపథ్యాన్ని వివరించింది.

తొలితరం కోయ ఆదివాసి కథలు మనకు కేవలం ఒక సమాజాన్ని పరిచయం చేయవు, అవి మనసును కదిలించే స్త్రీ జీవిత గాథలను వెలికి తీస్తాయి. అడవుల మధ్య నిశ్శబ్దంగా సాగుతున్న ఈ జీవితాల్లో అనేక కష్టాలు దాగి ఉన్నప్పటికీ, వాటిని అధిగమించే అద్భుతమైన సహనం, ధైర్యం, ఆత్మవిశ్వాసం కూడా అంతే స్పష్టంగా కనిపిస్తాయి. ఈ కథల్లోని కోయ స్త్రీ ఒక బాధితురాలు మాత్రమే కాదు, ఆమె జీవన యోధురాలు, కుటుంబానికి ఆధారం, సంస్కృతికి సంరక్షకురాలు. ఆమె నిశ్శబ్ద

పోరాటం మన సమాజానికి ఒక ప్రశ్న వేస్తుంది. అందుకే కోయ స్త్రీ జీవితాన్ని అర్థం చేసుకోవడం అంటే, మన సమాజంలోని అసమానతలను గుర్తించడం. ఆమెకు విద్య, ఆరోగ్యం, స్వావలంబన కల్పించడం ద్వారా మాత్రమే నిజమైన సమానత్వం సాధ్యమవుతుంది. ఈ కథలు మనలో కేవలం అనుభూతిని మాత్రమే కాదు, మార్పు కోసం బాధ్యతను కూడా మేల్కొలిపే శక్తిని కలిగి ఉన్నాయి.

ఉపయుక్త గ్రంథాలు :

1. అనసూయ, పద్దం. చప్పుడు కోయ ఆదివాసీ కథలు. హైదరాబాద్: సాహితీ సర్కిల్, 2019.
2. బాలగోపాల్, కె. ఆదివాసులు వైద్యం సంస్కృతి అణచివేత.హైదరాబాద్: పర్ స్పెక్టివ్స్, 2015.
3. జయధీర్ తిరుమలరావు, జీవన్.ఇప్పపూలు గిరిజన సంచార తెగల కథలు. ఖమ్మం: ప్రతిభా ప్రచురణలు.
4. వి.ఎన్.వి.కె. శాస్త్రి.(సంపా) ఆంధ్రప్రదేశ్ గిరిజన సంస్కృతి పరివర్తన. హైదరాబాద్: గిరిజన సంస్కృతి పరిశోధన,శిక్షణ సంస్థ, 2005.
5. హస్‌నైన్,నదీం. భారతీయ గిరిజనులు.హైదరాబాద్: ఓరియంట్ లాబ్మన్ లిమిటెడ్, 2005.

★★★

Vol. 23 | Spl. Issue 03 | March 2026 | BHAVAVEENA | ISSN No. : 2456-4702 | RNI No. APTEL/2003/12253

RNI No. APTEL/2003/12253 | Reffered Journal & Peer Reviewed Journals | ISSN No. 2456-4702

భావవీణ

కళలు, సాహిత్య, సాంస్కృతిక భాషాధ్యయన పత్రిక

BHAVA VEENA

Journal of Arts, Literary, Culture & Language Study

క్రైస్తవ సాహిత్యం - మహిళా చైతన్యం - ఒక పరిశీలన

- సాదే యాకోబు

శాఖాధిపతి, తెలుగు విభాగం, శ్రీ వై యన్ కళాశాల (స్వయం ప్రతిపత్తి), నర్సాపురం పశ్చిమగోదావరి జిల్లా.

ఉపోద్ఘాతం:

మానవ మనుగడకు మహిళ ప్రధానమైన స్థానాన్ని సంతరించుకొంటుంది. మానవ పరిణామక్రమముల మహిళ లేనిదే సంతానం ఉండదు. దినదిన క్రమముగా జనాభా అభివృద్ధిని మనము చూస్తున్నాము అంటే అది మహిళలు యొక్క ఓర్పు, నేర్పు, బిడ్డలను కని, పెంచి వారి అభివృద్ధే ధ్యేయంగా నడుచుకుంటూ ఒకవైపు భార్యగా, బిడ్డలకు తల్లిగా, సమాజంలో బాధ్యత కలిగిన మహిళగా తాను తీర్చిదిద్దుకొంటూనే తన బిడ్డలు కూడ ఉన్నతమైన శిఖరాలకు చేరాలి అనే అకుంఠిత దీక్షతో జీవిస్తుంది. బిడ్డకు మొదటి పాఠశాల అమ్మఒడి. తల్లి ఉగ్గుపాలతోనే బిడ్డలను చైతన్యవంతంగా పెరిగేటట్లు చక్కటి పదాలతో మంచి మాటలతో బోధిస్తుంది. పెద్దవాడైన తరువాత ఆ బిడ్డలు తల్లి ఇచ్చిన ఆ చిన్ననాటి చైతన్యమే పిల్లలలో పరివర్తన తెస్తుంది. అలా నడుచు కొనుటకు అలవాటుపడతారు. చైతన్యవంతమైన జీవనం గడుపుతారు. ''స్త్రీకి కూడ శరీరం ఉంది. దానికి వ్యాయామం ఇవ్వాలి. ఆమెకు మెదడు ఉంది. దానికి జ్ఞానం ఇవ్వాలి. ఆమెకు హృదయం ఉంది. దానికి అనుభవం ఇవ్వాలి'' - అనికొన్ని దశాబ్దాల క్రితమే ప్రసిద్ధ రచయిత గుడిపాటి వెంటకటాచలం అన్నది అక్షర సత్యం. అయితే ఆనాటి కాలం మహిళలకు స్వాతంత్ర్యం అవసరం లేదు అని అన్నారు. కుటుంబ జీవనంలో అన్నీతానే శ్రమించే మహిళ అన్నివిధాల అణచివేతకు గురియైన సంఘటనలు లేకపోలేదు. కాని ఆయా సమయాలలో ఆయా కాలాలలో స్త్రీలు జాతిపరంగా, న్యాయపరంగా, సువార్తపరంగా చైతన్యవంతమైన భూమికను పోషించడం జరిగింది. అట్టి మహిళలను గూర్చి పరిశీలించే అవకాశం వచ్చినందుకు అదృష్టంగా భావిస్తున్నానే.

మహిళలు-పురుషులు మధ్య వివక్షత అనేది ఆయా కాలంలో ఆయా దేశాలలో ఆయా ప్రాంతాలలో అనాదికాలం నుండి కనిపిస్తుంది. అలాగే అనాదికాలం నుండి కూడ మహిళలు చైతన్యవంతులైన వారు న్యాయాధిపతులుగా, జాతిని చైతన్యపరచిన మహారాణులుగా క్రీస్తు సువార్త ద్వారా సమాజంలో చైతన్యం తెచ్చిన మహిళలు కూడ ఉన్నారు. అట్టి మహిళలు మహోన్నతమైన స్థానాన్ని పొందియున్నారు అనుటలో సందేహం లేదు. అంతేకాదు, నేడు పాశ్చాత్య ప్రపంచంలో మహిళలు చైతన్యవంతంగా జీవిస్తున్నారు. పురుషులతో సమానంగా అన్నిరంగాలలో స్థానంను పొందియున్నారు అంటే దానికి గల కారణం బైబిలులోని దెబోరా, ఎస్తేరు, సమరయ స్త్రీల వంటివారు. నేటి మహిళా చైతన్యానికి ఆదర్శం అని చెప్పక తప్పదు. ఎందుకంటే మహిళా చైతన్య ఆలోచనలో

ఆధునీక ధోరణులు అమెరికాలో ప్రారంభం అయ్యిందంటే కారణం దెబోరా, ఎస్తేరు, సమరయ మహిళల మహోన్నత మైన వ్యక్తిత్వం. ఆధునిక మహిళా సమాజంలో చైతన్యం తెచ్చింది. అలా మహిళా చైతన్యానికి కారకులైన క్రైస్తవ మహిళల చైతన్య జీవన సరళిని పరిశీలన చేయుట జరిగినది. మహిళ చైతన్యం మానవ లోకానికి సహకారం. అందరు స్వాగతించటం సమాజానికి ఉపకారం. మహిళ లను గౌరవించడం శ్రేయస్కరం. ప్రపంచంలో మహిళా చైతన్యం రావడం ఈ జాతీయ సదస్సులో మహిళా చైతన్యం గురించి పరిశోధన అంశాలు చర్చించటం గొప్పవరం. ప్లేటో చెప్పినట్లు సత్యాలు శాశ్వతమైనవి. అవి మహిళాలోకం చైతన్యవంతం అయినప్పుడే ప్రపంచశాంతి వర్ధిల్లుతుంది.

బైబిలు పరిచయం:

బైబిలులో 66 పుస్తకములు కలవు. వాటిలో పాత నిబంధనలో 39 పుస్తకములు క్రొత్త నిబంధనలో 27 పుస్తకములు కలవు. వీటిలో న్యాయాధిపతుల పుస్తకంలోని దెబోరా 4,5 అధ్యాయములలో ఉన్న మహిళా చైతన్యము, అలాగే ఎస్తేరు అను పేరుగల పుస్తకంలోని జాతిని చైతన్యపరచిన మహిళా చైతన్యమూర్తిగాను, మరియు క్రొత్త నిబంధనలోని యోహాను సువార్త అను పుస్తకము 4వ అధ్యాయములోని సమరయ స్త్రీ సువార్తను మహిళలలో చైతన్యపరచిన సామాన్య మహిళగా చైతన్యం పొందిన విధానాన్ని పరిశీలించుచున్నాను.

మహిళా న్యాయాధిపతి దెబోరా:

పరిశుద్ధ గ్రంధమైన బైబిలులోని న్యాయాధిపతుల పుస్తకం ఇశ్రాయేలీయుల చరిత్రలో గొప్ప చీకటి యుగం. రాజులేడు ప్రతీవాడు వానికి కష్టమైన రీతిగా నడుచుకొనే వారు. దుర్నీతిని అనుసరిస్తూ, మిశ్రమ వివాహాలు చేసుకొనుచూ అవినీతిపరులై ఆత్మీయ జీవనంలోపించి అవిధేయులుగా ప్రవర్తించేవారు.

ఆ కాలమున లప్పీదోతునకు భార్యయైన 'దెబోరా' అను పవక్రి ఇశ్రాయేలీయులకు న్యాయాధివతిగా ఉండెను.

రాజులేడు కాని ఇశ్రాయేలీయులకు దెబోరాయే న్యాయాధిపతిగా ఉండెను. శత్రుదేశాలు కయ్యానికి కాలు దువ్వుతున్నాయి. ఇశ్రాయేలీయులు మధ్య శాంతి లేదు. ఐకమత్యం లేదు. మహిళ అయినప్పటికీ ఒక ప్రశ్న ఇశ్రాయేలీయులను కాపాడే బాధ్యత మరోప్రక్క ఇశ్రాయే లీయుల మధ్య న్యాయం చెప్పి బాధ్యత వహించిన ఆనాటి 40మంది న్యాయాధిపతులలో మొదటి మహిళా న్యాయాధిపతిగా గొప్ప పేరుపొందిన మహిళా చైతన్య మూర్తి దెబోరా.

స్వయంగా దేవునితో విచారణ చేసి ప్రజలకు బోధించగల శక్తి కలిగిన మహిళ దెబోరా. అంతేకాదు దారి తప్పిన ఇశ్రాయేలీయులను శత్రువులను సంహరించే మహిళలను చైతన్యపరచిన ధీశాలి దెబోరా. "యెహోవా ఒక స్త్రీ చేతికి సీసెరాను అప్పగించునని" - న్యాయాధి పతులు 4:9

జరుగబోయేది ముందుగా ప్రవచించగల నేర్పు కలిగిన మహిళగా కూడ దెబోరాను గూర్చి చెప్పవచ్చు. అందుకే శత్రువు యుద్ధరంగం నుండి పారిపోయి వచ్చి ఒక సామాన్యురాలి గుడారంలో శత్రురాజు సీసెరా దాగియుండెను.

"పిమ్మట హెబెరు భార్యయైన యాయేలు గుడారపు మేకు తీసుకుని సుత్తిచేత పట్టుకుని అతని యొద్దకు మెల్లగా వచ్చి అతనికి అలసటచేత గాఢనిద్ర కలిగి యుండగా నేలకు దిగునట్లు ఆ మేకును అతని కణత లలో దిగగొట్టగా! అతడు చచ్చెను. బారాకు సీసెరాను తరుముచుండగా యాయేలు అతనిని ఎదుర్కొన వచ్చి - రమ్ము, నీవు వెదుకుచున్న మనుష్యుని నీకు చూపించెదననగా అతడు వచ్చినప్పుడు సీసెరా చచ్చిపడియుండెను, ఆ మేకు అతని కణతలలోనుండెను. - న్యాయాధిపతులు 4:21, 21

యాయేలు అను మహిళ శత్రురాజు సీసెరాను అతి సులభంగా చంపడం చూస్తే మహిళలు ఎంత చైతన్య వంతులుగా తీర్చబడినారో తెలుస్తుంది. యాయేలు సామాన్యమైన మహిళ అయినా దెబోరా నాయకత్వంలో చైతన్యవంతమైన మహిళగా వర్ణించవచ్చు. ఎందుకంటే చంపి మౌనంగా లేదు. ఎదురెళ్ళి నీవు వెదుకుచున్నవాడు

ఇక్కడ చచ్చియున్నాడని ధైర్యంగా చెప్పింది యాయేలు అను మహిళ. కాబట్టి దెబోరా న్యాయాధిపతిగా మహిళలను ఎంతో చైతన్యవంతం చేసిందని తెలియుచున్నది.

స్వార్థంలేని మహిళగా అవినీతి, దష్టస్వభావం కలిగిన ఇశ్రాయేలీయులను చైతన్యవంతం చేసిన మహిళా విధూషీమణి. అందుకే దెబోరా సరళవృక్షము క్రింద తీర్పుకై కూర్చుంటే ఇశ్రాయేలీయులు అందరూ దెబోరా యొద్దకు వచ్చి ఆమె తీర్పు ద్వారా న్యాయంను గ్రహించి చైతన్యవంతులైరి. మంచిపేరు ప్రఖ్యాతలు గణించిన దెబోరా ఈనాటి మహిళా న్యాయాధిపతులకు కూడా ఆదర్శం.

యూదుల జాతిని చైతన్య పరచిన మహిళ ఎస్తేరు:

రాణియైన ఎస్తేరు సామాన్య కుటుంబంలో జన్మించింది. తల్లిదండ్రులు కూడాలేరు. అయినా రాణిగా ఎదిగినది. అంటే ఆమె మనస్సు కూడ చైతన్యవంతమైనది. దేవుని దయ ఆమెకు తోడుగా ఉంది. అయినా పురుషులు ఎదురుగా కూడ మహిళలు నిలిచి మాట్లాడ లేని ఆనాటి రోజులలో కూడ రాజు అనుగ్రహాన్ని పొందింది అంటే ఎస్తేరు ఎంతో చైతన్యవంతమైన మహిళగా చెప్పవచ్చు.

మొర్దెకై అను ఒక యూదుడు తన పిన తండ్రి కుమార్తెయైన హదస్సా అను ఎస్తేరు తల్లిదండ్రులు లేనిదైయుండగా అతడామెను పెంచుకొనెను. - ఎస్తేరు 2:7

తల్లిదండ్రులు లేనిదైనను నిరూత్సాహం పడకుండా ముందు తన మనస్సును చైతన్యపచరుకొన్న మహిళ. అందుకే హిందూదేశము మొదలుకొని కూషు దేశము వరకు నూట ఇరువదియేడు సంస్థానములను అహష్వేరోషు ఏలెను - ఎస్తేరు 1:1

ఎస్తేరు అహష్వేరుషు మహారాజుకి రాణిగా స్వీకరించ బడినది. హామాను అనువాని వలన యూదజాతికంతటికి నాశనము కలుగునని తెలుసుకున్న మొర్దెకై ఎస్తేరుకు విన్నవించెను. అందుకు ఎస్తేరు "పిలువబడక పురుషుడే గాని స్త్రీయే గాని రాజుయొక్క అంతర్గ్యహమున ప్రవేశించిన యెడల బ్రతుకుతున్నట్లుగా రాజు తన బంగారపు దండమును ఎవరి తట్టు చాపునో వారు తప్ప ప్రతివాడు సంహరింపబడునన్న కఠినమైన ఆజ్ఞ కలదని రాజసేవకుల కందరికి అతని సంస్థానములలోనున్న జనులందరికిని తెలిసేయున్నది. నేటికి ముప్పది దినముల నుండి రాజునొద్దకు ప్రవేశించుటకు నేను పిలువబడలేదని చెప్పమనెను. - ఎస్తేరు 4:10, 11

పై వాక్యమును బట్టి పరిశీలించిన రాజ్యములో రాజ గృహములో పరిపాలన విధానంలో నియమ నిబంధనలు గ్రహించిన మహిళగా ఎస్తేరును వర్ణించవచ్చును.

నీవు పోయి షుషను నందు కనబడిన యూదులందరిని సమాజమందిరమునకు సమకూర్చి, నా నిమిత్తము ఉపవాసముండి మూడు దినములు అన్నపానములు చేయకుండుడి, నేనును నా పనికత్తెలును కూడ ఉపవాసముందుము. ప్రవేశించుట న్యాయ వ్యతిరిక్తముగా నున్నను నేను రాజునొద్దకు ప్రవేశించుదును. నేను నశించిన నశించెదను - ఎస్తేరు 4:16

ఇటు ఆత్మీయంగా, అటు భౌతికంగాను చైతన్యవంతురాలు ఎస్తేరు. మీరు ఉపవాసముండి ప్రార్థన చేయండి. నేను నా మహిళలతో నేను కూడ ప్రార్థన చేస్తాను. ముందు దేవుని సహాయం కావాలి అని గ్రహించిన మహిళ ఎస్తేరు. రెండవది నేను నశించిన నశించెదను అనుటలో రాజు పిలువకుండా యూదుల జాతిని నాశనం నుండి తప్పించడానికి నేను నాశనం అయిపోయినా ఫరవాలేదని తనను తాను చైతన్య పరచుకొని ఆ మాట అనుగ ద్వారా అందరిలో చైతన్యం తెచ్చింది.

ఆ తరువాత రాజును విందుకు పిలిపించినప్పుడు రాజు - "ఎస్తేరు రాణీ! నీ విజ్ఞాపన ఏమటి? అది నీకను గ్రహింపబడును. నీ మనవి ఏమిటి? రాజ్యములో సగము మట్టుకైనను నీకనుగ్రహించెదనని" రెండవవాడు ద్రాక్షారసపు విందులో ఎస్తేరుతో అనెను. - ఎస్తేరు 7:2

ఎస్తేరు రాజు మనస్సును ఎంతగా ఉత్తేజపరచెనో తెలియచున్నది. చక్కగా నేర్పుగా రాజు మృదయంను కరిగించునట్లుగా మాట్లాడి ఎస్తేరు - మా విరోధియగు

ఆపగవాడు దుష్టుడైన యీ హామానే అనెను. అంతటతో హామాను రాజు ఎదుటను రాణి యెదుటను భయక్రాంతుడాయెను. - ఎస్తేరు 7:6

మన విరోధి తెలిసిన ధైర్యంగా చెప్పలేని వారు చాలామంది సమాజంలో ఉంటారు. కాని ఎస్తేరు తన యూదజాతి కోసం తెగించి ధైర్యంగా శత్రువుని చేయిపెట్టి రాజు ఎదుట చెప్పిం చూపించిన ధైర్యవంతురాలు ఎస్తేరు. ఇలా యూదజాతిపైకి వచ్చిన నాశనకరమైన విపత్తునుండి విడిపించుకొన్న మహిళా చైతన్యమూర్తి ఎస్తేరు.

సువార్త ద్వారా మహిళలను చైతన్యపరచిన సమరయ స్త్రీ:

సమరయ మార్గములో సుఖారను ఒక ఊరికి యేసుక్రీస్తు వచ్చెను. అక్కడ యాకోబు బావియుండెను గనుక యేసు ప్రయాణము వలన అలసియున్న రీతినే ఆ బావి యొద్దకూర్చొండెను. అప్పటికి ఇంచుమించు పండ్రెండు గంటలాయెను. సమరయ స్త్రీ ఒకతె నీళ్లు చేదుకొనుటకు అక్కడికి వచ్చెను. - యోహాను 4:6, 7

ఆ యాకోబు బావిదగ్గర యేసుకు దర్శించిన సమరయ స్త్రీ మార్పు చెందింది. ఇంతకీ ఆదేశంలో సమరయులు సామాన్యులు ఊరికి దూరంగా ఉండే వారు. అదికాకుండా ఈ సమరయ స్త్రీ అయిదుగురు పెనిమిట్లు కలిగి ఉండుటను యేసుక్రీస్తు ఆమెతో చెప్పుట వలన ఆమె పాపములు ఒప్పుకొని ఆయనే నిజమైన లోక రక్షకుడని నమ్మి చైతన్యవంతురాలై ఆ ఊరులోని వారితో ఇలా సాక్ష్యం ఇచ్చెను. - నేను చేసినవన్నియు నాతో చెప్పినది సాక్ష్యమిచ్చిన స్త్రీ యొక్క మాటనుబట్టి ఆ ఊరిలోని సమరయులలో అనేకులు ఆయనయందు విశ్వాసముంచిరి - యోహాను 4:34

సమరయ స్త్రీ తన చెడు జీవిత విధానాన్ని విడిచిపెట్టి, మంచి జీవితాన్ని అనుసరించి తద్వారా ఆఊరివారు కూడ సన్మార్గంలో జీవించే రీతిని చైతన్యపరచింది. అనగా త్రాగుడు, జూదం, వ్యభిచారం మొదలైన అక్రమ క్రియలు విడిచిపెట్టి సక్రమ మార్గంలో నడిపించుటకు ఆమె సాక్ష్యం ఈనాటి వారి వరకు అనేకమందిని చైతన్యంను ఇస్తుంది.

ఆయన మాటలు వినినందున ఇంకను అనేకులు నమ్మిఆ స్త్రీని చూచి - ఇకమీదట నీవు చెప్పిన మాటను బట్టి కాక! మామట్టుకు మేము విని, యీయన నిజముగా లోక రక్షకుడని తెలిసికొని నమ్ముచున్నామనిరి. - యోహాను 4:41, 42

పై వాక్యాలను బట్టి చూస్తే సమరయ స్త్రీ చెప్పిన మాటలు నమ్మి చైతన్యవంతం అయి వెళ్లి యేసును స్వయంగా చూసారు. ఇప్పుడు ఆయన చెప్పిన సత్య బోధను శాంతి మార్గాన్ని తెలుసుకొని సంపూర్ణ చైతన్యం పొంది యేసే లోకరక్షకుడని అనేకమంది దీనిని చైతన్యం చేయుట జరిగినది. ఇంతమంది చైతన్యం కావడానికి గల కారకురాలు సమరయ స్త్రీ. కాబట్టి సమరయ స్త్రీ మహిళా చైతన్యమూర్తియే.

ముగింపు :

ఈ విధంగా క్రైస్తవ సాహిత్యం ద్వారా మహిళా చైతన్యం ప్రపంచం అంతా వివిధ రూపాలలో ఉద్యమంగా మహిళాలోకాన్ని చైతన్యపరచి నేడు అన్ని రంగాలలో మహిళలు మహోన్నతమైన వ్యక్తులుగా మహిళా శక్తిగా గౌరవింపబడుతున్నారు. మహిళలు అన్నింట సానుకూలమైన మనస్తత్వాన్ని పెంపొందించుకొని మహిళలు చైతన్యకు ఆయుధంగా ఉన్నత స్థానాలను పొందచున్నారు అనుటలో ఎటువంటి సందేహము లేదు.

సంప్రదించిన పుస్తకములు :

1) బైబిలు - బైబిలు సొసైటీ ఆఫ్ ఇండియ
2) సేవా సంస్థలు సువార్తీకరణ శిష్యరికం - డెన్నీస్ క. మాక్
3) పాతనిబంధన అవలోకనము - డెన్నీస్ క. మాక్
4) జీవనయానం - డా॥ చినమిల్లి సత్యనారాయణ రావు గారు

★★★

Vol. 23 | Spl. Issue 03 | March 2026 | BHAVAVEENA | ISSN No. : 2456-4702 | RNI No. APTEL/2003/12253

RNI No. APTEL/2003/12253 | Reffered Journal & Peer Reviewed Journals | ISSN No. 2456-4702

భావవీణ

కళలు, సాహిత్య, సాంస్కృతిక భాషాధ్యయన పత్రిక

BHAVA VEENA

Journal of Arts, Literary, Culture & Language Study

తెలంగాణ స్త్రీవాద కథలు - వస్తు రూప విశ్లేషణ

- డా॥. ధీరావత్ లక్ష్మణ్

తెలుగు అధ్యాపకులు, ప్రభుత్వ డిగ్రీ కళాశాల కుత్బుల్లాపుర్, హైదరాబాద్.

తెలుగు కథ ఆధునిక రచనా వికాసానికి ఒక మచ్చు తునక. మనిషితో పాటే కథ పుట్టింది. ఇతర సాహిత్య ప్రక్రియలన్నీ కథ తర్వాత వచ్చాయనడానికి శక్తి వంతమైన ఆధునిక తెలుగు కథా సాహిత్యమే తార్కాణం. నేటి కథ ఎంత ఆధునికమో దాని చరిత్ర అంత ప్రాచీనం. స్త్రీవాద సాహిత్యం తెలుగులో బహుముఖాలుగా విస్తరిల్లింది. మార్క్సిస్టు ఫెమినిజం, రాడికల్ ఫెమినిజం, సోషలిస్టు ఫెమినిజం ఇలా విభిన్న రూపాల్లో అభివ్యక్తి కలిగి చివరికి డెమోక్రటిక్ ఫెమినిజంగా ఆమోదింప బడింది. తెలంగాణ అస్తిత్వ ఉద్యమాల సాహిత్యంలో కూడా స్త్రీవాదం భావజాలం పరిపరి విధాలుగా ప్రస్ఫుట మైంది.

తెలంగాణ ప్రాంతంలో స్త్రీవాద గొంతుకను వినిపించినవారు - ముదిగంటి సుజాతారెడ్డి, మాదిరెడ్డి సులోచన, పొల్కంపల్లి శాంతాదేవి, పాకాల యశోదారెడ్డి, నందగిరి ఇందిరాదేవి, రావి ప్రేమలత, అనిశెట్టి రజిత, షాజహానా, తిరునగరి దేవకి, కాత్యాయని విద్మహే, జ్వలిత, గీతాంజలి, జాజుల గౌరి తదితరులు. పొల్కంపల్లి శాంతాదేవి 150 కి పైగా కథలు రచించారు. ఆర్థిక, సామాజిక, రాజకీయ, ప్రేమ, మోసం, స్త్రీల సమస్యలు, వరకట్న సమస్యలు, కుటుంబ జీవనం. సంస్కృతి సంప్రదాయం, అభ్యుదయం వంటి అనేక అంశాలతో కూడిన కథనాల్ని కథలలో ప్రవేశపెట్టారు.

ముదిగంటి సుజాతారెడ్డి విసుర్రాయి, వ్యాపార మృగం, మింగుతున్న పట్నం వంటి కథా సంపుటాలను రచించారు. విసుర్రాయి కథా సంపుటిని 1998 లో ముద్రించారు. స్త్రీల జీవనగాథలను వివరించే "విసు ర్రాయి"లో మొత్తం 20 కథలు చోటు చేసుకున్నాయి. గ్రామీణ స్త్రీల మీద జరిగే దోపిడి, అన్యాయం, అణచివేత, ఆస్తి హక్కు లేకపోవడం, పెండ్లి చూపుల పేరుతో జరిగే అవమానాలు, వరకట్న సమస్యలు, ఇంటా బయటా నిర్ణయాధికారం లేకపోవడం, స్త్రీ పురుషుల మధ్య వివక్షతలు మొదలగు సమస్యలనెన్నింటినో కథావస్తువులు గ్రహించి స్త్రీ చైతన్యాన్ని కాంక్షిస్తూ ఈ కథా సంపుటిని రచించారు.

పి.యశోదారెడ్డి మావూరి ముచ్చట్లు, మాపంతులు, గంగిరేగి చెట్టు, పీర్ల పండుగ, వెంకన్న మొదలైన కథలు ప్రధానంగా తెలంగాణ భాషను, సంస్కృతిని, జాతీయా లను, సామెతలను, పద ధ్వని రీతులను కాలగర్భంలో కలసిపోకుండా రికార్డు చేయడానికి రాశారని పేర్కొన్నారు. 'నిశ్చితార్థం' కథలో ఆంధ్ర సంస్కృతికి, తెలంగాణ సంస్కృతికి మధ్య ఉన్న వైరుధ్యాలను చక్కగా చిత్రిం చారు. తెలంగాణ యాస, భాష,నుడికారాలు కథల నిండా పేర్చబడ్డాయి.

తెలంగాణలో స్పష్టమైన స్త్రీవాద భావజాలం ఆకృతిని

కలిగించిన కథలు అనిశెట్టి రజిత రచించారు. స్త్రీలు తమ కుటుంబ జీవితాల్లో ఎదుర్కొంటున్న సమస్యలను, అస్తిత్వపు ఆంక్షలను అధిగమింపజేసిన కథలు "గాజులు, రాజవ్వ, బ్యూటీ పార్లర్, సజిత" మొదలైనవి. ఆపద సమయాల్లో ఆయుధాలు లేని ఆడవాళ్ళు తమ సహజ సౌందర్య సూచికమైన గాజులను ఉపయోగించుకొని ఆడ పులుల్లాగా దాడి చేయడం "గాజులు" కథలో కన్పిస్తుంది. స్త్రీ తన స్థానం కోసం ప్రయత్నిస్తూ, బతుకు బాటలో ఎన్ని ఎదురు దెబ్బలు తగిలినా ఎదురొడ్డి నిలిచిన "రాజవ్వ" కథ ప్రతి స్త్రీకి ధైర్యం నింపుతుంది. అధిక శరీర సౌందర్య సాధనలో చిక్కిన తులశమ్మ, అత్యంత ఆవేదనతో కూడిన మానసిక సంక్షోభంతో బయటపడిన సజిత వంటి విలక్షణమైన స్త్రీ పాత్రలు అనిశెట్టి రజిత కథల్లో కన్పిస్తాయి.

షాజహానా మైనారిటీ స్త్రీవాద కవిత్వంలో నాయకురాలిగా పేరొందారు. ఆమె రచించిన "సిల్ సిలా" కథలు దూదేకుల, ముస్లింల జీవితాల్ని అనేక కోణాల నుంచి చిత్రీకరించారు. బ్యాండ్ వాయించే కులవృత్తి వారు ఏడాదంతా కుటుంబానికి తిండి పెట్టక పోవడం, పేదరికం స్త్రీలు పడుతున్న బాధలను, ముస్లింల, దూదేకుల మధ్య గల తేడాను చిత్రించారు. 'సిల్ సిలా' అంటే వారసత్వం అని అర్థం. తండ్రి వారసత్వంతో కొడుకు కూడా అదే జీవితాన్ని గడపడం హృదయ విదారకంగా వర్ణించారు.

జూపాక సుభద్ర తన "శుద్ధి చెయ్యాలె" కథలో దళితుల పట్ల ఆధిపత్య కులపు ఈసడింపును కళ్ళకు కట్టినట్లు ప్రదర్శించారు. ఉన్నత చదువులు చదువుకొని ఉన్నతోద్యోగాలు చేస్తున్న దళితులను కులం పేరుతో అవమానించే సన్నివేశాలను, సంఘటనలను కింది ఉదాహరణల ద్వారా గమనించవచ్చు. కాలేజీ లెక్చరర్లుగా పని కోసం వచ్చిన ఇద్దరు దళిత మహిళలకు ఒక బ్రాహ్మణ కుటుంబం ఇంటిలో అద్దెకు దొరకడం, తర్వాత వారి కులం వివరాలు తెలుసుకొని వారిని అవమానించడం ఈ కథలో కనిపిస్తుంది.

నవ్వెల ఉమాదేవి "అమ్మ" కథా సంపుటిని వెలువరించారు. "కమ్లి" కథ ఒక బంజార స్త్రీ జీవితాన్ని తెలియజేశారు రచయిత్రి. బంజారాల సంస్కృతి జీవన విధానం యదార్థంగా చిత్రీకరించిన కమ్లి రెండో కాన్పులో ఆడపిల్లనే కనడం, ఆమె అత్త, మాన్సీబాయికి కోపం రావడం వంటివి ఈ కథలో సజీవ చిత్రాలు. పితృస్వామ్య భావజాలం వేళ్ళూనుకు పోయిన సమాజంలో ఆడపిల్ల పుట్టుక మీద కనికరం పెంచుకున్న స్థితి ఈ కథలో కనిపిస్తుంది.

జాజుల గౌరి "కంచె" కథలో సాంఘిక సంక్షేమ హాస్టల్‌లో ప్రాథమిక చదువు చదువుతున్న దళిత బాలికలు సెలవుల్లో ఇంటికి పోవడం, ఇంటి పనుల్లో ఆసరా కావడం కోసం అడవికి కట్టెలు ఏరుకోవడానికి పోవడం, అక్కడ ఆధిపత్య కులాల పురుషులు దళిత బాలికను అత్యాచారం చేయడం వంటి సంఘటనలను చూపారు. పర్యవసానంగా ఆ బాలిక గర్భం దాలుస్తుంది. తత్ఫలితంగా రెండు తరాలకు చెందిన స్త్రీలు బలికావడం వంటి అమానుష వికృత చర్యలను ఎత్తిచూపారు.

తెలంగాణ కథా సాహిత్యాన్ని సుసంపన్నం చేసిన, చేస్తున్న రచయిత్రులకు వందనాలు. అందరికీ నమస్కారం.

ఆధార గ్రంథాలు :

1. దక్షిణామూర్తి, పోరంకి, కథానిక స్వరూప స్వభావాలు, హైద్రాబాద్, చైతన్యపురి, 1988.
2. మల్లయ్య, కాలువ (సంపా), తెలంగాణ కథలు, విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్, హైద్రాబాద్, 2005.
3. సుజాతారెడ్డి, ముదిగంటి, తెలంగాణ తొలి తరం కథలు, రోహణ ప్రచురణలు, హైద్రాబాద్, 2002

★★★

Vol. 23 | Spl. Issue 03 | March 2026 | BHAVAVEENA | ISSN No. : 2456-4702 | RNI No. APTEL/2003/12253

RNI No. APTEL/2003/12253 | Reffered Journal & Peer Reviewed Journals | ISSN No. 2456-4702

భావవీణ

కళలు, సాహిత్య, సాంస్కృతిక భాషాధ్యయన పత్రిక

BHAVA VEENA

Journal of Arts, Literary, Culture & Language Study

యద్దనపూడి సులోచనారాణి నవలలు - మహిళా చైతన్యం

- డా॥. కైలా కోమబాంధవి

సహాయాచార్యులు, తెలుగు విభాగం, పి బి సిద్ధార్థ ఆర్ట్స్ & సైన్స్ కాలేజి, విజయవాడ.

తెలుగు సాహిత్యంలో మహిళా భావజాలాన్ని ప్రజల్లోకి తీసుకువచ్చిన ప్రముఖ రచయిత్రుల్లో యద్దనపూడి సులోచనారాణి ఒకరు. ఆమె రచనలు ప్రధానంగా మధ్యతరగతి మహిళల జీవన విధానం, వారి సమస్యలు, భావోద్వేగాలు, ఆశయాలను ప్రతిబింబిస్తాయి. ముఖ్యంగా మహిళా చైతన్యం ఆమె నవలలలో ప్రధాన అంశంగా కనిపిస్తుంది.

తెలుగు సాహిత్యంలో ప్రజాదరణ పొందిన నవలా రచయిత్రుల్లో యద్దనపూడి సులోచనారాణి ప్రముఖ స్థానం సంపాదించారు. 20వ శతాబ్దం ద్వితీయార్ధంలో ఆమె రచనలు విస్తృత పాఠకలోకాన్ని ఆకర్షించాయి.

రచనల స్వభావం మరియు నేపథ్యం :

యద్దనపూడి సులోచనారాణి రచనలు ప్రధానంగా సామాజిక నవలలుగా నిలుస్తాయి. ఆ కాలంలో సమాజంలో జరుగుతున్న మార్పులు, ముఖ్యంగా మహిళల జీవితాలలో వచ్చిన పరిణామాలను ఆమె కథాంశంగా ఎంచుకున్నారు. ఆమె రచనలు సులభమైన భాషలో ఉండటం వల్ల అన్ని వర్గాల పాఠకులకు చేరువయ్యాయి.

ప్రధాన రచనలు :

1. సెక్రటరీ
2. మీన
3. జీవన తరంగాలు
4. అగ్ని పూలు
6. ఆరాధన
7. ప్రేమలేఖలు
8. విజేత

ఈ రచనలు పాఠకులలో విశేష ఆదరణ పొందాయి మరియు కొన్ని సినిమాలుగా కూడా రూపాంతరం చెందాయి.

రచనలలో ప్రధాన అంశాలు :

ప్రేమ మరియు భావోద్వేగాలు :

ఆమె కథల్లో ప్రేమ ప్రధాన పాత్ర పోషిస్తుంది. అయితే అది కేవలం రొమాంటిక్ కోణంలో కాకుండా, బాధ్యతలు, త్యాగం, ఆత్మగౌరవంతో కూడిన భావంగా చూపబడింది.

కుటుంబ సంబంధాలు :

కుటుంబ విలువలు, సంబంధాలలోని అనుబంధం, విభేదాలు, సమన్వయం వంటి అంశాలను ఆమె సున్నితంగా చిత్రించారు.

మధ్యతరగతి జీవితం :

ఆమె రచనలు ముఖ్యంగా మధ్యతరగతి కుటుంబాల జీవితాన్ని ప్రతిబింబిస్తాయి. వారి ఆశలు, సమస్యలు, ఆర్థిక పరిస్థితులు సహజంగా చూపబడ్డాయి.

శైలీ విశేషాలు :

సరళమైన, సులభమైన, ప్రవాహవంతమైన భాష సంభాషణల ద్వారా కథనం ముందుకు నడిపించడం పాత్రల భావోద్వేగాల లోతైన చిత్రణ వాస్తవికతతో కూడిన కథాంశం ఈమె రచనలో కనిపిస్తుంది.

సామాజిక ప్రభావం :

యద్ధనపూడి సులోచనారాణి రచనలు మహిళలకు ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించాయి. ఆమె నవలలు చదివిన మహిళలు తమ జీవితాలపై కొత్త దృక్కోణాన్ని పొందారు. సమాజంలో మహిళల స్థానం గురించి అవగాహన పెరిగింది.

మహిళా చైతన్యం - భావన :

మహిళా చైతన్యం అనగా మహిళ తన వ్యక్తిత్వాన్ని గుర్తించుకోవడం, స్వతంత్రంగా ఆలోచించడం, సమాజంలో సమాన హక్కులు సాధించడానికి ప్రయత్నించడం. ఇది ఆర్థిక స్వావలంబన, ఆత్మగౌరవం, నిర్ణయాధికారాన్ని కలిగి ఉండే స్థితి.

యద్ధనపూడి సులోచనారాణి రచనలలో మహిళా చైతన్యం ముఖ్యమైన అంశం. ఆమె నవలలలో మహిళలు తమ వ్యక్తిత్వాన్ని గుర్తించుకునే ప్రయత్నం చేస్తారు. వారు స్వతంత్రంగా నిర్ణయాలు తీసుకునే ధైర్యాన్ని ప్రదర్శిస్తారు.

రచనల్లో మహిళా చైతన్యం ప్రతిబింబం :

1. స్వతంత్ర వ్యక్తిత్వం :

సులోచనారాణి గారు నవలలలో మహిళా పాత్రలు బలహీనంగా కాకుండా ఆలోచనాశక్తి కలిగినవారిగా చిత్రించబడతాయి. వారు తమ జీవిత నిర్ణయాలను తాము తీసుకుంటారు.

2. ఆర్థిక స్వావలంబన :

సెక్రటరీ వంటి నవలలలో మహిళ ఉద్యోగం చేయడం ద్వారా స్వతంత్రంగా నిలబడగలదని చూపించారు. ఇది మహిళా సాధికారతకు ముఖ్యమైన సూచిక.

3. ఆత్మగౌరవం :

ఆమె కథానాయికలు తమ గౌరవాన్ని కాపాడుకోవడంలో రాజీ పడవు. ప్రేమలో కూడా స్వాభిమానాన్ని కోల్పోకుండా నిలబడటం ప్రత్యేక లక్షణం.

4. సంప్రదాయాలకు సవాలు :

సాంప్రదాయ సమాజం విధించే నియమాలను ప్రశ్నిస్తూ, మహిళలు స్వేచ్ఛగా జీవించే హక్కు కలిగి ఉన్నారని రచయిత్రి తెలియజేశారు.

5. ప్రేమలో సమానత్వం :

ఆమె నవలలలో ప్రేమను సమాన హక్కుల సంబంధంగా చూపించారు. మహిళను బలహీనంగా కాకుండా నిర్ణయాత్మక వ్యక్తిగా చిత్రించారు.

ప్రధాన రచనలు అయిన సెక్రటరీ అనే నవలలో ఉద్యోగం, ఆత్మగౌరవం గురించి, మీన అనే నవలా రచనలో భావోద్వేగం మరియు స్వతంత్రం గురించి , జీవన తరంగాలు అనే నవలలో కుటుంబం, బాధ్యత, మహిళ స్థానం గురించి, అగ్ని పూలు అనే నవలలో సంక్షోభాల్లో మహిళ ధైర్యం మొదలైన అంశాలుగురించి చెప్పడం జరిగింది. యద్ధనపూడి సులోచ రాణి రచనలు మహిళలకు ఆత్మవిశ్వాసాన్ని కలిగించాయి. ఆమె నవలలు చదివిన మహిళలు తమ జీవితాన్ని కొత్త దృక్కోణంలో చూసేలా ప్రేరేపించాయి. సమాజంలో మహిళల స్థానం గురించి అవగాహన పెరిగింది.

ముగింపు

యద్ధనపూడి సులోచనారాణి రచనలు మహిళా చైతన్యానికి ప్రతీకగా నిలిచాయి. ఆమె నవలలు మహిళలను స్వతంత్రంగా ఆలోచించేలా, తమ వ్యక్తిత్వాన్ని నిర్మించుకునేలా ప్రేరేపించాయి. తెలుగు సాహిత్యంలో మహిళా సాధికారతకు ఆమె చేసిన సేవ అపారమైనది.

యద్ధనపూడి సులోచనారాణి రచనలు తెలుగు సాహిత్యంలో ఒక ప్రత్యేక స్థానాన్ని కలిగి ఉన్నాయి. ఆమె నవలలు వినోదంతో పాటు సామాజిక అవగాహనను కూడా కలిగిస్తాయి. మహిళా చైతన్యం, ప్రేమ, కుటుంబ విలువలు వంటి అంశాలను సమన్వయం చేస్తూ, ఆమె రచనలు నేటికీ పాఠకులను ఆకర్షిస్తున్నాయి.

ఆధార గ్రంథాలు :

1. యద్దనపూడి సులోచనారాణి - సెక్రటరీ. విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్, హైదరాబాద్.
2. యద్దనపూడి సులోచనారాణి - మీన. నవోదయ బుక్ హౌస్.
3. యద్దనపూడి సులోచనారాణి - జీవన తరంగాలు. విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్.
4. యద్దనపూడి సులోచనారాణి - అగ్ని పూలు. నవోదయ పబ్లిషర్స్.
5. యద్దనపూడి సులోచనారాణి - ఆరాధన. విశాలాంధ్ర.
6. ఆధునిక తెలుగు సాహిత్య చరిత్ర - వివిధ రచయితలు.
7. తెలుగు నవల వికాసం - సాహిత్య విమర్శ గ్రంథం.
8. మహిళా సాహిత్యంపై పరిశోధనా వ్యాసాలు (జర్నల్స్ & యూనివర్సిటీ పబ్లికేషన్స్).

★★★

Vol. 23 | Spl. Issue 03 | March 2026 | BHAVAVEENA | ISSN No. : 2456-4702 | RNI No. APTEL/2003/12253

RNI No. APTEL/2003/12253 | Reffered Journal & Peer Reviewed Journals | ISSN No. 2456-4702

భావవీణ

కళలు, సాహిత్య, సాంస్కృతిక భాషాధ్యయన పత్రిక

BHAVA VEENA

Journal of Arts, Literary, Culture & Language Study

"భాగవతంలో ఊర్వశి - ఆత్మ సౌందర్యం"

- డా॥. కమ్ముల రవి గంగాధర శేఖరకుమార్

తెలుగు లెక్చరర్, గవర్నమెంట్ డిగ్రీ కాలేజ్, పామర్రు, కృష్ణా జిల్లా.

భాగవతంలో 'ఊర్వశి' మనస్తత్వం ఉదాత్తమైన ఆదర్శ భావాలకు ప్రతీకగా అభివర్ణించబడింది. భర్తకు ప్రణయ మాధుర్యంతోపాటు ఆత్మసౌందర్యపు ఆవశ్యకతను తెలియజెప్పింది. పురూరవునిలో గొప్ప గుణాలు పెంపొందాలని తపించే మనస్తత్వం గల స్త్రీగా దర్శన మిస్తుంది. భర్తను సంస్కరించే మనోవికాసం బృహత్తర బాధ్యతలు గల బాధ్యతాయుతమైన మనస్తత్వం గల స్త్రీగా ఊర్వశి కన్పిస్తుంది. ఊర్వశి అందాల రాశి మాత్రమే కాదు. తాను పొందిన శాపాన్ని, పురూరవుని పాలిట వరంగా మార్చిన ఊర్వశి ప్రణయమూర్తి, మార్గదర్శి. స్వయంనిర్ణయాధికారం, సాధికారతల సమ్మేళనంగా కన్పించే ఊర్వశి జీవనశైలి ఆధునిక స్త్రీలలోని ఆత్మ గౌరవానికి ప్రతీకగా నిలుస్తుంది.

పోతన గారి ఊర్వశిలో జానతనం కంటే నేర్పరితనం కన్పిస్తుంది. విషయలోలత్వం కన్నా వ్యవహార దక్షతా నైపుణ్యం కన్పిస్తుంది. పురూరవునికి భార్యగా కన్నా, చక్కని స్నేహితురాలుగా, కర్తవ్యబోధ చేసిన గురువుగా, తన భర్తకు కూడా దారిచూపిన మార్గదర్శిగా ఊర్వశి పాత్ర ఆవిష్కరింపబడింది. పురూరవుని పురోభివృద్ధికి, వ్యక్తిత్వ వికాసానికి కర్త కర్మ క్రియ గా వ్యవహరించిన ఊర్వశి ఆదర్శ మనస్తత్వం గల స్త్రీగా చిత్రింపబడింది.

మ॥ ఇవి నా కూర్చుతగళ్ళు రెండు దగ నీ వెల్లప్పుడున్ గాచె దే
ని వివస్త్రుండవు గాక నాకడ సదానీవుండు దేనిన్ విశే
ష విలాసాధిక! నీకు నా ఘృతము భక్ష్యంబయ్యె నేనిన్ మనో
జ వినోదంబుల నిన్నుఁ దేల్తు నగునే చంద్రాన్వయ గ్రామణీ!

పై పద్యంలో ఊర్వశి విధించిన షరతులు, ఆమెలోని మానసిక పరిపక్వతకు అద్దం పడతాయి. పోతన ఊర్వశిని సునిశిత దృష్టి గల సుందరాంగిగా చూపించాడు.

మ॥ అదె నా బిడ్డలఁ పట్టి దొంగలు మహాహంకారులై కాంచు ను
న్మదులై పోయెద, రడ్డపాటునకు సామర్థ్యంబున్ హీనుడై
కదలండీ మగపంద, కూరుకు గతిం గన్మూసి గుర్వెట్టుచున్
వదలం జాలఁడు నాదు కౌఁగిలియు దా వంధ్యాత్ముఁడై చెల్లరే.

కు॥ పగతురు దొంగలు రేఁపగ, మగఁటిమి వాటింపలేక మగతన మెల్లన్
మగువుల కౌఁగిటఁ జూపెడు, మగవాఁడగు కంటె మగడు మగువగు టొప్పున్.

ఆ॥ అధముడైన వాని కాలగుకంటెన, త్యధికునింట
దాసి యగుట మేటు;
హీనుఁ బొంది యొని హింసింపఁగా నేల? యువతి
జనుల కూరకంట లెస్స.

పై పద్యాల ద్వారా పురూరవుడిని విడిచిపెట్టే సందర్భంలో ఊర్వశి అంతరంగం ఆవిష్కరించ బడింది. పోతన ఊర్వశిని కేవలం కాముక స్త్రీగానే చూపలేదు. భరించే వాడే భర్త అనే దృక్పథంతో తన చెలికాడు కూడా తమ క్షేమ సౌఖ్యాలను పరిరక్షించేవాడు కావాలనుకుంది. ముందుగానే నిబంధనలు కూడా విధించింది. అందుకే తగ్గట్టుగానే తన ప్రియుడు నడుచుకుంటాడని కలలు కన్న సాధారణ స్త్రీగానే ఆశపడింది. తాను నిద్రలేపినా, లేవకుండా ఊర్వశి పెంపుడు మేషములను రక్షించలేక పోయిన పురూరవుని అసమర్థతను చూచి ఆలోచనలో పడింది. పరిణతి ఉన్న ప్రౌఢ స్త్రీగా మదన పడింది. 'ఏటిది నీరాచఱికం?' అని చింతిస్తుంది. "వినియు వినవు రణభీరువు, మనుజాధము నిదురబోతు" అని పురూరవుని చెవుల్లో వినపడేలా పల్కుతుంది. చివరకు ఊర్వశి మాటలకు నిద్రలేచినా, దిగంబర స్థితిలో మంచం దిగి, కత్తి పట్టి, దొంగలను చంపి, మేషములను విడిపించుకొని, తిరిగి వచ్చినా, ఊర్వశి నిబంధనలను ఉల్లంఘించిన వాడైనందున పురూరవుని విడిచి వెళ్ళిపోతుంది. ఈ సందర్భంలో పోతన ఊర్వశిని అందగత్తెగానే కాకుండా "ఆత్మాభిమానం గల స్త్రీగా" చిత్రించాడు.

ఆ॥ చీఱలేని మగనిఁ జెలువ దానీక్షించి, కన్ను మొఱఁగి
పోకఁగడఁక నతఁడు
వెఱ్ఱివాని భంగి వివశుఁడై పడిలేచి, పాటిలి తెఱలి
స్రుక్కి పొక్కి పడియె.

పై పద్యంలో ఊర్వశి తన జీవితంలో కొన్ని నియమాల ప్రకారం నడుచుకొనే అభిమానధనురాలుగా చిత్రించ బడింది. పురూరవుడు ఊర్వశి నిష్క్రమణం తెలిసి, పొర్లి పొర్లి దుఃఖించడం ద్వారా పురూరవుని ఊర్వశి ఎంతగా అలరించి, ఆనందింప జేసిందో తెలుస్తుంది. పై పద్యంలో "చీరలేని మగానిఁ" అని వర్ణించడంలో నాటి కాలంలో చీర అనే పదం స్త్రీపురుషులకు ఇరువురికీ సమానార్థంలో వాడుకలో ఉన్నట్లుగా తెలుస్తుంది.

అనంతరం పురూరవుడు ఊర్వశి కోసం వెదికి, వెదికి చివరకు "సరస్వతీ తీరంబునఁ జెలికత్తెలతోఁ గూడియున్న నూర్వశింగని" ఊర్వశిని తిరిగి రమ్మని ప్రాధేయపడి నప్పుడు ఊర్వశి చేత పోతన పల్కించిన పలుకులు ఆమె ఆశించే ఆదర్శాలకు అద్దం పడతాయి. ఆడవాళ్ళకు దాసోహమై పోవడము మాత్రమే మగతనం కాదని, ఆడవారి ఆలనా, పాలనా చూడాలనీ, సంరక్షణా బాధ్యత కూడా అనుక్షణం కలిగియుండాలనీ పోతన ఊర్వశి పాత్ర ద్వారా పలికించాడు, అందుకే పోతన గారి ఊర్వశి ఇతర గ్రంథాలలో మాదిరిగా వేల్పుల వేశ్య కావచ్చునేమో గానీ, కామాంధురాలు కాదు. ఒక చక్కని అనురాగాన్ని, సముచిత అర్హతలను ఆశించిన మామూలు మగువగా వ్యవహరించింది. మాట ప్రకారమే మెలిగింది. మాట తప్పగానే పురూరవుని జీవితం నుంచి తప్పుకుంది.

స్త్రీల మనస్తత్వం పట్ల, చంచల స్వభావపు ప్రవర్తన పట్ల అవగాహన కల్గి వున్న అనుభవజ్ఞురాలైన స్త్రీగా క్రింది పద్యంలో పోతన ఊర్వశిని చిత్రించాడు.

మ॥ తలఁపుల్ చిచ్చులు మాటలు జ్వల సుధాధరల్
విభుండైన పు
వ్విలుతున్ మెచ్చర యన్యులన్ వలతురే
విశ్వాసమున్ లేదు క్రూ
రలు తోడుం బతియైన జంపుదు రథర్మల్ నిర్దయల్
చంచలల్
వెలయాండ్రెక్కడ వారి వేడబము లా వేదాంత
సూక్తంబులే.

ఊర్వశి, పురూరవునితో "చపలచిత్తులైన స్త్రీల తలపులు చిచ్చుల వంటివనీ, నమ్మరాదనీ తత్వబోధ చేస్తోంది. అందులోనూ వేశ్యాస్త్రీలైతే 'అధర్మల్, నిర్దయల్, చంచలల్' అంటూ వారిని అస్సలే నమ్మరాదనీ, వారి చేష్టలు అంతుచిక్కని రీతి చిక్కుల్ని కొనితెస్తాయని హితబోధ చేస్తుంది. ఈ మాటల ద్వారా పురూరవుని మీద ఒకింత సానుభూతిని, సదభిప్రాయాన్ని కల్గినట్లుగా ఊర్వశి కన్పిస్తుంది.

పురూరవుడు మాట తప్పాడేమో గానీ, నిద్రబోతుగా, అసమర్థునిగా వ్యవహరించాడేమోగానీ, ఊర్వశి మాత్రం మాట తప్పని నియమ బద్ధురాలు. వేల్పులకు వేశ్యయే అయినప్పటికీ పురూరవునితో మాత్రం నిజాయితీగానే వ్యవహరించింది. స్త్రీల స్వభావం గురించి తత్వబోధ కూడా చేసింది. పురూరవుడు తన నియమాల ప్రకారం నడుచుకోకపోయినప్పటికీ, చివరకు అతనికి పుత్రయోగం కల్పించింది. పురూరవుని తన కోసం తపించి, తపించి, పిచ్చివాడిగా మారకుండా కర్తవ్యబోధ చేసింది. అగ్ని స్వరూపుడైన పుత్రుణ్ణి పురూరవునికి అందించింది. తద్వారా పురూరవునికి పుణ్యలోకాలు సిద్ధించేలా తోడ్పడింది. అప్పటికి పురూరవునికి తత్వం బోధపడి, ఆ అగ్ని సహాయంతో శ్రీహరిని గురించి యజ్ఞం చేసేలా స్ఫూర్తి నిచ్చింది. యజ్ఞం సఫలమయ్యి వేద విభాగం చేసేంత జ్ఞానిగా పురూరవుడు మారేందుకు ఊర్వశి పరోక్షంగా తోడ్పడింది. తత్ఫలితంగా చివరకు పురూరవుడు ఊర్వశి వుండే గంధర్వలోకాన్ని కూడా చేరుకోవడం ద్వారా వ్యవహార దక్షత గల స్త్రీగా వ్యవహరింస్తుంది. అక్కడ ఊర్వశి పురూరవునితో ఆరుగుడు కొడుకులకు జన్మనిచ్చినట్లుగా చెప్పడంతో ఊర్వశి పాత్ర ముగించ బడింది.

ఈవిధంగా భాగవతంలోని ఊర్వశి పాత్రలో మానసిక పరిణతి కల్గిన ఆధునిక యువతి మనస్తత్వం ద్యోతక మౌతుంది. ఎందుకంటే ఊర్వశి తాను నమ్మిన సిద్ధాంతాల ప్రకారం నడుచుకునే స్త్రీగా వ్యవహరించింది. చెప్పిన మాట మీద నిలబడే మనస్తత్వం, తనలాగే తన భర్త పురూరవుడు కూడా ఉండాలని ఆశించింది. పురూరవుని లోని బలహీనతలు లోపాల పట్ల అవగాహన కల్గిన భార్యగా వాటిని తిరిగి చక్కదిద్దేటందుకు ప్రయత్నించి సఫలమైన మనస్తత్వం పరిశీలనా నిపుణు రాలిగా కనిపిస్తుంది. 'వేల్పుల వేశ్యగా' తొలుత వర్ణింప బడినా ఊర్వశి పాత్ర చిత్రణ జరుగుతున్న కొద్దీ, ఊర్వశి ఉదాత్తత బహిర్గతమయ్యేలా వర్ణింపబడింది. అందుకే పోతనగారి ఊర్వశి ఒక సమున్నత చైతన్యస్వరూపంగా నిరూపితమౌతుంది.

ఆధార గ్రంధాలు :

1) విక్రమోర్వశీయం - మహాకవి కాళిదాసు
2) ఆంధ్రమహాభారతం - ఆదిపర్వం
3) ఆంధ్ర మహా భాగవతం - పోతన
4) పోతన గారి వైచిత్రి - ఆచార్య కేతవరపు రామ కోటి శాస్త్రి
5) శ్రీమద్ భాగవతం - వేద వ్యాస మహర్షి

★★★

Vol. 23 | Spl. Issue 03 | March 2026 | BHAVAVEENA | ISSN No. : 2456-4702 | RNI No. APTEL/2003/12253

RNI No. APTEL/2003/12253 | Reffered Journal & Peer Reviewed Journals | ISSN No. 2456-4702

భావవీణ

కళలు, సాహిత్య, సాంస్కృతిక భాషాధ్యయన పత్రిక

BHAVA VEENA

Journal of Arts, Literary, Culture & Language Study

"బందిపోట్లు" కవితలో స్త్రీవాద తాత్వికత - ఒక పరిశీలన

- వంగాల సంపత్ రెడ్డి

అసిస్టెంట్ ప్రొఫెసర్, తెలుగు విభాగం, ప్రభుత్వ డిగ్రీ కళాశాల, వర్ధన్నపేట, వరంగల్.

సారాంశం

భారతీయ వివాహ వ్యవస్థలో భార్యను త్యాగమూర్తిగా, కుటుంబ సంరక్షకురాలిగా చిత్రిస్తారు. అయితే స్త్రీవాద కవిత్వం ఈ విషయాన్ని విమర్శాత్మకంగా పరిశీలిస్తూ, భార్య జీవితంలోని అణచివేత, గుర్తింపులేమి, ఆర్థిక అసమానతలను వెలికితీస్తుంది. "బందిపోట్లు" కవిత కూడా స్త్రీపై విధింపబడిన బంధనాలను, సామాజిక నియంత్రణలను ప్రతిబింబించే కవిత. ఈ కవిత స్త్రీ జీవితాన్ని "బందిపోట్లు" అనే ప్రతీకతో చూపిస్తూ స్త్రీ స్వేచ్ఛ, వ్యక్తిత్వం, ఆత్మగౌరవం వంటి అంశాలను ప్రస్తావిస్తుంది. ఈ వ్యాసంలో "బందిపోట్లు" కవితలో ప్రతిఫలించిన స్త్రీవాద తాత్వికతను విశ్లేషించడం ప్రధానలక్ష్యం.

కీలక పదాలు

స్త్రీవాదం, పితృస్వామ్యం, స్త్రీ స్వేచ్ఛ, బంధనాలు, సమానత్వం, తెలుగు స్త్రీవాద కవిత్వం, సావిత్రి, బందిపోట్లు.

పరిచయం

సాహిత్యం సమాజ నిర్మాణాన్ని ప్రతిబింబించడమే కాకుండా దానిని ప్రశ్నించే శక్తిగా కూడా పనిచేస్తుంది. ముఖ్యంగా స్త్రీవాద సాహిత్యం సమాజంలో ఉన్న లింగ అసమానతలను, స్త్రీలపై జరుగుతున్న అణచివేతలను విమర్శిస్తూ కొత్త ఆలోచనలను ప్రతిపాదిస్తుంది.

భారతీయ సమాజంలో వివాహం ఒక ప్రధానమైన సామాజిక వ్యవస్థ. ఇది కేవలం రెండు వ్యక్తుల మధ్య బంధం మాత్రమే కాకుండా కుటుంబం, ఆర్థిక వ్యవస్థ, సాంస్కృతిక విలువలతో ముడిపడి ఉంటుంది. అయితే ఈ వ్యవస్థలో స్త్రీ స్థానం ఏమిటి? ఆమెకు ఎంతవరకు స్వేచ్ఛ ఉంది? అనే ప్రశ్నలు స్త్రీవాద సాహిత్యం చర్చకు పెట్టింది.

స్త్రీల జీవన సమస్యలను ప్రతిబింబించే ఎన్నో కవితలు తెలుగు సాహిత్యంలో వెలువడ్డాయి. వాటిలో "బందిపోట్లు" స్త్రీ వాద కవిత్వానికి తాత్విక స్థాయి ప్రారంభ కవిత. రచయిత్రి సావిత్రి. సావిత్రి, మే 18, 1949 నాడు 'ఉండేశ్వరపురం' లో జన్మించింది. తల్లి దండ్రులు బుచ్చి సీతాయమ్మ, దంతులూరి సూర్యనారాయణ రాజు. ఆరవ సంతానం. అక్టోబర్ 4, 1991లో మరణించారు. స్త్రీల మనోవేదన సావిత్రి కవితా వస్తువు. సావిత్రి రచన లంటే మొదట మనకు గుర్తుకు వచ్చేది 'బందిపోట్లు' కవిత. 'బందిపోట్లు' కవిత మార్చి, 1984 నాడు అంధ్రజ్యోతి వారపత్రికలో అచ్చయింది. ఈ కవితకు విస్తృత ప్రచారం 1984లో చేకూరి రామారావు 'చేరాత'లో సమీక్ష చేసిన ఫలితంగా వచ్చింది. ఈ కవిత అనేక విశ్వ విద్యాలయాలలో తెలుగు సిలబస్‌లో భాగమైంది.

"బందిపోట్లు" కవితలో వివాహం ఒక పవిత్ర

బంధంగా కాకుండా ఒక నియంత్రణ సాధనంగా చిత్రించ బడింది. వ్యక్తిగత అనుభవాల ద్వారా సమాజ నిర్మాణం లోని లోపాలను ఈ కవిత బహిర్గతం చేస్తుంది. ఈ కవితలో స్త్రీని ఒక వ్యక్తిగా కాకుండా కుటుంబం, సమాజం విధించిన నియమాల మధ్య బందీగా జీవించా ల్సిన పరిస్థితిని రచయిత్రి స్పష్టంగా చిత్రించారు. అందువల్ల ఈ కవితను స్త్రీవాద దృక్పథంలో అధ్యయనం చేయడం అవసరం.

వివాహం స్త్రీ జీవితాన్ని ఎలా నియంత్రిస్తుంది? ఆమె స్వేచ్ఛను ఎలా పరిమితం చేస్తుంది? అనే ప్రశ్నలను ఈ కవిత చర్చకు పెట్టింది.

స్త్రీవాద తాత్వికత - భావన

స్త్రీ స్థితి, అనుభవాలు, సమానత్వం, స్వేచ్ఛ వంటి అంశాలపై ఆధారపడిన తాత్విక దృష్టిని స్త్రీవాద తాత్వికతగా చెప్పవచ్చు. స్త్రీ వాద తాత్వికత ప్రధానంగా మూడు అంశాలను ప్రస్తావిస్తూ చర్చిస్తుంది. అవి

1. పితృస్వామ్య వ్యవస్థపై విమర్శ - సమాజంలో పురుషాధిక్యాన్ని ప్రశ్నించడం.
2. స్త్రీ స్వీయ అవగాహన - స్త్రీ తన వ్యక్తిత్వాన్ని గుర్తించుకోవడం.
3. సామాజిక సమానత్వం - స్త్రీ-పురుష సమాన హక్కులను కోరుకోవడం.

''బందిపోట్లు'' కవితలో ఈ మూడు అంశాలు స్పష్టంగా కనిపిస్తాయి. ఈ కవితలో 'బందిపోట్లు' అనే పదం కేవలం భౌతిక బంధనాన్ని మాత్రమే సూచించదు. ఇది స్త్రీ జీవితంపై విధించబడిన సాంప్రదాయ నియమాలు, కుటుంబ నియంత్రణలు, సామాజిక నిబంధనలు అన్నిటినీ సూచించే ప్రతీకగా ఉప యోగించబడింది. స్త్రీ చిన్ననాటి నుంచి వివాహం వరకు, వివాహం తర్వాత కూడా అనేక నియంత్రణల మధ్య జీవించాల్సి వస్తుంది. ఈ పరిస్థితిని రచయిత్రి బంది పోట్లుగా చిత్రించింది. అంతేకాదు పితృస్వామ్య సమాజం స్త్రీని ఎలా నియంత్రిస్తుందో, కుటుంబంలో తండ్రి, భర్త, సమాజం నిర్ణయించే నియమాలు స్త్రీ స్వేచ్ఛను ఎలా పరిమితులకు లోబడే విధంగా చేస్తాయో కూడా ఈ కవితలో గమనించవచ్చు.

స్త్రీ జీవితం తన నిర్ణయాలతో కాకుండా ఇతరుల నిర్ణయాలతో నడవాల్సిన పరిస్థితిని ఈ కవిత ప్రతి బింబించింది. పితృస్వామ్య వ్యవస్థపై చేసిన బలమైన విమర్శ ఈ కవిత.

స్త్రీ తనపై ఉన్న బంధనాలను గ్రహించడం, వాటిని ప్రశ్నించడం, తన స్వేచ్ఛ కోసం పోరాడాల్సిన అవసరాన్ని కూడా ఈ కవిత సూచిస్తుంది. సమాజంలో స్త్రీ కూడా పురుషునితో సమానంగా గౌరవం పొందాలని ఈ కవితలో కోరుకుంటుంది. స్త్రీని ఒక బంధితురాలిగా కాకుండా స్వతంత్ర వ్యక్తిగా చూడాలనేది ఈ కవిత సందేశం.

విశ్లేషణ

బందిపోట్లు పూర్తి కవితను చూసి విశ్లేషణలోకి వెళ్దాం.

''పాఠం ఒప్ప చెప్పకపోతే పెళ్ళిచేస్తాన''ని పంతులు గారన్నప్పుడే భయమేసింది.

'ఆఫీసులో నామొగుడున్నాడు! అవసరమొచ్చినా సెలవివ్వడని''ని అన్నయ్య అన్నప్పుడే అనుమాన మేసింది

''వాడికేం మగమహారాజ''ని ఆడామొగా వాగినప్పుడే అర్థమైపోయింది.

''పెళ్ళం''టే ''పెద్ద శిక్ష'' అని ''మొగుడం''టే స్వేచ్ఛాభక్షకుడ''ని

మేం పాలిచ్చి పెంచిన జనంలో సగమే మమ్మల్ని విభజించి పాలిస్తోందని!

(మార్చి 1984, 'ఆంధ్రజ్యోతి' వారపత్రిక) పైన పేర్కొన్న ''బందిపోట్లు'' కవితలో కనిపించేది ముఖ్యంగా ప్రతీకాత్మక శైలి. బంధనాలను సూచించే ప్రతీకల ద్వారా స్త్రీ జీవితంలోని బాధలను రచయిత్రి వ్యక్తం చేసింది. లోతైన ఆలోచనలను రేకెత్తించే కవిత ఇది.

బాల్యంలోనే వివాహాన్ని శిక్షగా పరిచయం చేసే సామాజిక విధానాన్ని ''పాఠం ఒప్పచెప్పకపోతే పెళ్ళి చేస్తానని పంతులుగారన్నప్పుడు భయమేసింది'' పరిచయం చేసింది. ఇది కేవలం ఒక మాట కాదు; ఇది

ఒక మానసిక నిర్మాణం. పెళ్లి అనేది భయపెట్టే సాధనంగా మారిన స్థితి. పెళ్లి, స్త్రీలను నియంత్రిస్తుంది. వివాహం ఒక స్వేచ్ఛాయుత నిర్ణయం కాదు. అది నియంత్రణ సాధనంగా చిన్నప్పటి నుంచే ప్రతిష్టిస్తున్న స్థితిని రచయిత్రి ఇక్కడ వ్యక్తం చేసింది. చదువుకోకపోతే పెళ్ళి చేసి పంపించేస్తాం అనడం ద్వారా, పెళ్ళి అనేది చదువుకు, స్వేచ్ఛకు ముగింపు అనే సంకేతాన్ని పంతులు (సమాజం) ఇస్తున్నట్టుగా చిత్రించింది. Beauvoir చెప్పినట్లుగా, స్త్రీ "పుట్టదు, తయారవుతుంది" అనే భావన ఈ వచన కవితా పాదంలో కనిపిస్తుంది.

"ఆఫీసులో నా మొగుడున్నాడు, అవసరమొచ్చినా సెలవు ఇవ్వడని అన్నయ్య అన్నప్పుడే అనుమానం వేసింది" పాదంలో వివాహం తర్వాత స్త్రీ స్వతంత్రత ఎలా తగ్గిపోతుందో చూపించింది. స్త్రీ జీవితంపై భర్త నియంత్రణ కలిగి ఉండే పరిస్థితి ఇక్కడ వ్యక్తమవుతుంది. ఈ స్థితి ఆర్థిక, సామాజిక, మానసిక అధీనతకు దారి తీస్తుంది. స్త్రీ తన నిర్ణయాలను స్వతంత్రంగా తీసుకోలేని పరిస్థితి ఏర్పడుతుంది. వివాహం తర్వాత స్త్రీ జీవితంపై భర్తకు ఉన్న అధికారం సూచించింది. స్త్రీ స్వతంత్రత పూర్తిగా భర్తపై ఆధారపడే పరిస్థితి ఈ కవితలో చిత్రించింది. ఆర్థికంగా భర్తపై ఆధారపడటం, వ్యక్తిగత స్వేచ్ఛకు పరిమితి ఉండటం, స్త్రీ జీవితంపై పురుషుని నియంత్రణ పితృస్వామ్య వ్యవస్థ లక్షణం. ఇది మారాలని సావిత్రి కోరిక, "వాడికేం మగమహారాజని..." ఈ వచన కవితా పాదం ద్వారా పురుషులకు ఉన్న ప్రత్యేక హక్కులను ప్రశ్నించింది, విమర్శించింది. Millett చెప్పిన "sexual politics" భావన ప్రకారం, ఈ అధికారం కేవలం వ్యక్తిగతం కాదు; అది సామాజిక నిర్మాణం. స్త్రీవాద కవిత్వం లక్షణం పురుషాధిక్యాన్ని ప్రశ్నించడం, సమానత్వాన్ని కోరడం. పురుషాధిక్య సమాజంలో మగవాడికి ఉన్న అపరిమితమైన స్వేచ్ఛను, హక్కులను 'మగమహారాజు' అనే పదంతో సమాజం కీర్తిస్తుంది. అదే సమయంలో స్త్రీకి మాత్రం అంతులేని ఆంక్షలు ఉంటాయి. ఈ వివక్షను కవయిత్రి ప్రశ్నించింది.

"పెళ్ళంటే పెద్ద శిక్ష" ద్వారా వివాహాన్ని పవిత్ర బంధంగా కాకుండా ఒక శిక్షగా చూపించింది. ఇది స్త్రీవాద కవిత్వంలో ఒక విప్లవాత్మక భావన. ఇది సమాజపు సంప్రదాయ విలువలను సవాలు చేసింది. వివాహాన్ని పవిత్ర బంధంగా భావించిన సమాజానికి ఇది ఒక ప్రతిఘటన.

వివాహం అనేది స్త్రీకి తన సొంత ఇష్టాలను, ఆశయాలను చంపుకోవాల్సిన ఒక జైలు శిక్షగా మారుతోంది. భర్త అనే వ్యక్తి రక్షకుడిగా కాకుండా, ఆమె స్వేచ్ఛను హరించే 'భక్షకుడి'లా తయారవుతున్నాడని పదునైన విమర్శ చేశారు.

స్త్రీవాదం దృష్టిలో వివాహం - స్త్రీ స్వేచ్ఛను పరిమితం చేస్తుంది, స్త్రీ వ్యక్తిత్వాన్ని నియంత్రిస్తుంది, స్త్రీని కుటుంబ బాధ్యతలతో బంధిస్తుంది. అందువల్ల సావిత్రి దృష్టిలో వివాహం ఒక "శిక్ష". దీని నుండి స్త్రీ బయట పడాలి అనేది సావిత్రి ఆకాంక్ష.

"మొగుడంటే స్వేచ్ఛా భక్షకుడు" ద్వారా భర్తను నియంత్రణ ప్రతీకగా చిత్రించింది. స్త్రీ స్వేచ్ఛను హరించే వ్యక్తిగా భర్తను చిత్రించడం ద్వారా వివాహ వ్యవస్థలోని అసమానతలను బహిర్గతం చేసింది.

స్త్రీపై అధికారం, స్త్రీ నిర్ణయాలపై నియంత్రణ, స్త్రీ వ్యక్తిత్వ నిషేధం వివాహ వ్యవస్థ ద్వారా భర్తకు అధికారం ఇవ్వడాన్ని వ్యతిరేకించింది. సాధారణంగా వివాహ వ్యవస్థలో భర్తను 'రక్షకుడు' అంటారు. రక్షణ కవచంలా ఉండాల్సిన వ్యక్తే స్త్రీ స్వేచ్ఛను హరించే 'స్వేచ్ఛా భక్షకుడు'లిలిగా మారుతున్నాడని, సమాజం స్త్రీకి భద్రత ఇస్తున్నామని చెబుతూనే, ఆమె ఎదుగుదలను అడ్డుకుంటుందని ఈ కవిత ద్వారా సావిత్రి నినదించింది.

వివాహం అనేది స్త్రీకి తన సొంత ఇష్టాలను, ఆశయాలను చంపుకోవాల్సిన ఒక జైలు శిక్షగా మారడాన్ని వ్యతిరేకిస్తూ పదునైన విమర్శ చేసింది.

"మేం పాలిచ్చి పెంచే, పెంచిన జనంలో సగమే మమ్మల్ని విభజించి పాలిస్తోందని" ద్వారా స్త్రీల పాత్రను, వారి పరిస్థితిని విరోధాత్మకంగా చూపించింది. స్త్రీలు సమాజాన్ని నిర్మించే ప్రధాన శక్తి అయినప్పటికీ, అదే

సమాజం వారిని అణచివేస్తుంది. ఇది పితృస్వామ్య వ్యవస్థ అంతర్గత వైరుధ్యాన్ని బహిరంగపరుస్తుంది.

స్త్రీ శ్రమకు గుర్తింపు లేకపోవడం, స్త్రీలను విభజించి పాలించడం, పితృస్వామ్య వ్యవస్థ స్థిరీకరణ - ఈ సమాజపు వివాహ వ్యవస్థ లక్షణం. ఇదే సావిత్రి చిత్రించింది. లోకానికి జన్మనిచ్చేది స్త్రీ, పాలిచ్చి పెంచేది స్త్రీ. కానీ, ఆమె పెంచిన అదే పురుష ప్రపంచం (సమాజంలో సగభాగం), ఆమెను తక్కువ చేసి చూస్తూ, ఆమెపై అధికారాన్ని చెలాయిస్తూ, ఆమెను బంధీని చేసిందని సావిత్రి బాధ పడింది.

మొత్తానికి "బందిపోట్లు" కవిత ద్వారా వివాహం పై సావిత్రి దృక్పథం స్పష్టంగా, విమర్శనాత్మకంగా ఉంది. వివాహాన్ని కేవలం వ్యక్తిగత సంబంధంగా కాకుండా ఒక సామాజిక నియంత్రణ యంత్రాంగంగా చూపించింది.

స్త్రీపై నియంత్రణ, స్త్రీ స్వేచ్ఛ, పురుషాధిక్య వ్యవస్థను బలపరిచే సాధనంగా వివాహ వ్యవస్థను ఈ కవితలో సావిత్రి చిత్రించింది.

"బందిపోట్లు" కవిత స్త్రీవాద కవిత్వంలో ముఖ్యమైన స్థానాన్ని కలిగి ఉంది. వివాహాన్ని విమర్శించడం ద్వారా సమాజ నిర్మాణాన్ని ప్రశ్నించింది. స్త్రీ స్వేచ్ఛకు ప్రాధాన్యం ఇచ్చింది. స్త్రీ అనుభవాలు కేవలం వ్యక్తిగతమైనవి కాకుండా సామాజిక నిర్మాణాల ఫలితమని ఈ కవిత స్పష్టం చేస్తుంది.

ముగింపు

వివాహ వ్యవస్థను విమర్శిస్తూ స్త్రీ స్వేచ్ఛ, సమానత్వం అవసరాన్ని"బందిపోట్లు" కవిత ప్రతిపాదించింది. ఈ కవిత స్త్రీవాద సాహిత్యంలో ఒక శక్తివంతమైన రచన. ఇది సమాజంలో మార్పు కోసం అవసరమైన చైతన్యాన్ని కలిగించింది. స్త్రీల సమస్యలను సాహిత్య రూపంలో వ్యక్తం చేసి సమాజంలో అవగాహన పెంచే ప్రయత్నం ఈ కవితలో స్పష్టంగా కనిపిస్తుంది. ఈ కవితలో 'బందిపోట్లు' అనే పదాన్ని కేవలం దొంగలకే పరిమితం చేయలేదు. స్త్రీ శ్రమను, ఆమె కాలాన్ని, ఆమె ఉనికిని దోచుకునే వ్యవస్థను మరియు ఆ మనస్తత్వాన్ని 'బందిపోటు' తనంతో పోల్చారు. వివాహాన్ని పవిత్ర బంధంగా కాకుండా ఒక నియంత్రణ సాధనంగా చిత్రించడం ఈ కవిత ప్రత్యేకత. స్త్రీవాద తాత్విక దృష్టిలో ఈ కవిత స్త్రీ స్వేచ్ఛ, సమానత్వం, వ్యక్తిత్వాన్ని ముందుకు తెచ్చే ఒక శక్తివంతమైన రచనగా నిలుస్తుంది. ఈ కవిత కేవలం ఒక వ్యక్తిపై కోపం కాదు, ఇది శతాబ్దాలుగా వస్తున్న పితృస్వామ్య భావజాలం మీద తిరుగుబాటు.

ఆధార గ్రంథాలు

1. నీలి మేఘాలు - అక్టోబర్, 1993
2. ఆమె అస్తమించలేదని... డిసెంబర్, 2018
3. స్త్రీ వాద దృక్పథం - కాత్యాయనీ విద్మహే - 1998
4. సాహిత్యాకాశంలో సగం - స్త్రీల అస్తిత్వ సాహిత్యం కవిత్వం కథ - కాత్యాయనీ విద్మహే - 2010

★★★

Vol. 23 | Spl. Issue 03 | March 2026 | BHAVAVEENA | ISSN No. : 2456-4702 | RNI No. APTEL/2003/12253

RNI No. APTEL/2003/12253 | Reffered Journal & Peer Reviewed Journals | ISSN No. 2456-4702

భావవీణ

కళలు, సాహిత్య, సాంస్కృతిక భాషాధ్యయన పత్రిక

BHAVA VEENA

Journal of Arts, Literary, Culture & Language Study

వేద వాఙ్మయ నారీమణి - ఆధునిక సమాజ దిక్సూచి

- డా॥. యజ్జల ప్రవీణ్ కుమార్

తెలుగు రిసోర్స్ పర్సన్ (స్వయం), సెంట్రల్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ ఇండియన్ లాంగ్వేజెస్, మానస గంగోత్రి, మైసూర్, కర్ణాటక

ఉపోద్ఘాతం :

సృష్టికి మూలం - స్త్రీ తత్త్వం

'యత్ర నార్యస్తు పూజ్యంతే రమంతే తత్ర దేవతాః
యత్రైతాస్తు నపూజ్యంతే సర్వాః తత్రాఫలాః క్రియాః'

ఎక్కడ స్త్రీలు గౌరవించబడతారో, అక్కడ దేవతలు పూజలందుకొంటారు. ఎక్కడ స్త్రీలు గౌరవించబడరో, అక్కడ ఎంత గొప్ప సత్కార్యాలైననూ ఫలించవని మనుస్మృతి స్పష్టంగా తెలుపుతుంది. సృష్టిలో సగభాగమై, సృష్టికి మూలకారణమైన స్త్రీ మూర్తిని ప్రాచీన భారతదేశం మాతృమూర్తిగా, శక్తి స్వరూపిణిగా ఆరాధించింది. హిందూ తత్త్వశాస్త్రంలో 'అర్ధనారీశ్వర' భావన పురుషుడు, స్త్రీ ఇరువురూ సమానమేనని, ఒకరి పట్ల మరొకరు పూరకాలని (complementary) చాటిచెబుతుంది.

అయితే, ఆధునిక ప్రపంచంలో స్త్రీ స్థానాన్ని గూర్చి తీవ్రమైన తర్జనభర్జనలు జరుగుతున్నాయి. 'ఆధునిక యుగంలో మహిళ' అన్న అంశం పట్ల ప్రపంచమంతటా ఆసక్తి కనబడుతోంది. ముఖ్యంగా భారతీయ మహిళ కంటే పాశ్చాత్య దేశాల్లో మహిళ ఎక్కువ స్వేచ్ఛా స్వాతంత్ర్యాల్ని కలిగి ఉందని మనం అనుకుంటున్నాం. కానీ, అక్కడ కూడా నిరంతరం జరుగుతున్న స్త్రీ విమోచన ఉద్యమాలను చూస్తే, పాశ్చాత్య దేశాల్లో కూడా నిజమైన స్వేచ్ఛ లేదనే వాస్తవం బోధపడుతుంది.

స్త్రీని కేవలం ఒక విలాస వస్తువుగా, వంటింటికే పరిమితమైన బొమ్మగా చూసే సంకుచిత దృక్పథం నానాటికీ క్షీణిస్తోంది. మానవ ఇతిహాసంలో మహత్తర పాత్ర నిర్వహిస్తున్న స్త్రీలను ఆధునికులు ఇప్పుడిప్పుడే గుర్తిస్తున్నారు అనుకోవడం, వారికి ఉన్నతమైన సాంఘిక భద్రత, న్యాయం చేకూర్చడానికి పాటుపడుతున్నాం అనుకోవడం సత్యదూరం. ఎందుకంటే మనం కొత్తగా సాధిస్తున్నది ఏమీ లేదు, ఒకప్పుడు భారతదేశంలో స్త్రీకి ఉన్న ఆ ఉన్నతమైన స్థానాన్ని, చరిత్రను పునరావృతం చేస్తున్నామంతే!

నాగరికతకు గీటురాయి - వేద వాఙ్మయంలో స్త్రీ స్థానం

ఒక జాతి నాగరికత ఎంత ఉన్నతంగా ఉందో తెలుసుకోవాలంటే, ఆ జాతి స్త్రీలకు ఇచ్చిన స్థానాన్ని బట్టి అంచనా వేయవచ్చు. స్వతహాగా స్త్రీ ఔదార్యానికి, సహనానికి, జ్ఞానానికి ప్రతీక. ఈ సత్యం ఈనాటిది కాదు. క్రీ.పూ. 8000 సంవత్సరాల నాటిదని కొందరి ఊహ అయిన మన వేదకాలం నాటిది. దేవతారాధనలో సైతం ప్రకృతి శక్తులైన ఉషస్సు (వేకువజాము), అదితి (దేవతల తల్లి), సరస్వతి (జ్ఞాన ప్రదాయిని), పృథ్వి (భూమాత) వంటి స్త్రీ

మూర్తులకు ఋగ్వేదం పెద్దపీట వేసింది. భారతీయ సంస్కృతి విభవానికి పెట్టని కోటలైన, హైందవ ధర్మానికి మార్గదర్శకమైన వేదాల్ని పరిశీలిస్తే నాడు స్త్రీ సర్వతంత్ర స్వతంత్రురాలు అని స్పష్టమవుతుంది.

విద్యా వ్యవస్థ - ఉపనయన సంస్కారం, బ్రహ్మచారిణులు

నేటి ఆధునిక కాలంలో స్త్రీ విద్య గురించి మనం ఎన్నో చట్టాలు చేసుకుంటున్నాం. కానీ వేదకాలంలో స్త్రీలకు పురుషులతో సమానంగా విద్యాహక్కులు ఉండేవి. బాలికలకు కూడా 'ఉపనయన సంస్కారం' (జంధ్యం వేయడం) జరిగేది. వేదాధ్యయనం చేయడానికి వారికి పూర్తి అర్హత ఉండేది. అథర్వణ వేదం (11.5.18) ప్రకారం "బ్రహ్మచర్యం (విద్యాభ్యాసం) ద్వారా కన్య తనకు తగిన వరుడిని పొందుతుంది" అని స్పష్టంగా ఉంది.

నాటి విద్యావంతులైన స్త్రీలలో ప్రధానంగా రెండు రకాలు ఉండేవారు:

1. బ్రహ్మవాదినులు :

వీరు జీవితాంతం వివాహం చేసుకోకుండా కేవలం విద్యార్జన, తత్త్వ చింతన, తపస్సులోనే గడిపే విదుషీ మణులు. వీరు వేద మంత్రాలను సైతం దర్శించారు.

2. సద్యోద్వాహులు :

వీరు యుక్తవయస్సు వచ్చేవరకు విద్యాభ్యాసం పూర్తి చేసి, ఆ తర్వాత గృహస్థాశ్రమంలోకి (వివాహం) అడుగు పెట్టేవారు.

పుత్రికా జననం నేటి సమాజంలో లాగా నాడు దుఃఖ భాజనం కాదు. బృహదారణ్యక ఉపనిషత్తులో (6.4.17) ఒక తండ్రి తనకు సకల విద్యా పారంగతురాలైన కూతురు పుట్టాలని, ఆమె పండితురాలై సభలలో పాల్గొనాలని చేసే ప్రత్యేక ప్రార్థనలు (యజ్ఞాలు) కనిపిస్తాయి. నాటి సమాజంలో మహిళలు ఉపాధ్యాయులుగా కూడా ఉండేవారు. వ్యాకరణ శాస్త్రంలో 'ఆచార్య' అంటే పురుష ఉపాధ్యాయుడి భార్య అని కాకుండా, స్వయంగా బోధించే విద్యావేత్త (Female Teacher) అని అర్థం.

వివాహ వ్యవస్థ - దాంపత్య జీవితంలో సమాన ప్రతిపత్తి

వేదకాలంలో బాల్య వివాహాలు లేవు. కన్యలు శారీరకంగా, మానసికంగా పరిపక్వత (యుక్తవయస్సు) సాధించిన తర్వాతే వివాహాలు జరిగేవి. జాతి, వర్ణ విభేదాలు లేవు. కన్యలు స్వయంగా వరుని ఎన్నుకునే వారు. ఋగ్వేదం (10-21-12) ప్రకారం కన్యాధికారం తండ్రికి లేదు. తదుపరి కాలంలో వచ్చిన కన్యాదానం, కన్యాశుల్కం, నేటి వరకట్నం లాంటి దురాచారాలు ఆనాడు లేవు. వివాహం అనేది ఇద్దరు సమాన వ్యక్తుల కలయికగా (Companionship) భావించారు.

వివాహానంతరం వరుడు వధువును ఎర్రని పూవులతో అలంకరింపబడిన తెల్లని ఎద్దుల బండిపై కూర్చోపెట్టి ఎంతో గౌరవంగా తన గృహానికి తీసుకొనిపోయేవాడు. ఋగ్వేదంలోని 'సూర్యా సూక్తం' (10.85) నాటి వివాహ వ్యవస్థను కళ్ళకు కడుతుంది. వధువు అత్తవారింట్లో అడుగుపెట్టేటప్పుడు పురోహితుడు, "సమ్రాజ్ఞీ శ్వశురే భవ, సమ్రాజ్ఞీ శ్వశ్రాం భవ" (నీవు ఈ ఇంటికి సామ్రాజ్ఞివి. అత్తమామలకు, ఆడుపడుచులకు మహారాణిలా గౌరవించబడతావు గాక) అని ఆశీర్వదించేవాడు. భార్యా భర్తలను 'దంపతులు' (దమ్ + పతి) అంటే ఆ ఇంటికి ఇద్దరూ సమాన యజమానులు అని వేదం కీర్తించింది.

వితంతు వివాహాలు , నియోగం: ఆనాడు వితంతు వివాహము సర్వ సామాన్యమైన విషయం. అది దోషం కాదు, వర్జనీయం అంతకన్నా కాదు. భర్తను కోల్పోయిన స్త్రీని జీవితాంతం దుఃఖానికి వారసురాలుగా చేయటం ఆనాటి ఋషులకు సమ్మతం కాదు. మరణించిన భర్త సోదరుడిని వివాహం చేసుకునే 'నియోగ' పద్ధతి కూడా ఆచరణలో ఉండేది. అలాగే, ఎవరైనా స్త్రీలు అవివాహితలుగా (అమాజుర్) ఉండిపోవాలనుకుంటే సమాజం వారిని నిందించేది కాదు. తండ్రి వివరాలు తెలియనప్పుడు, తల్లి నామమే బిడ్డలకు వంశనామమయ్యేది. ఛాందోగ్యోపనిషత్తులోని జాబాల పుత్రుడైన 'సత్యకామ జాబాలి' కథ, మాతృమూర్తి పట్ల నాటి సమాజానికి ఉన్న గౌరవానికి నిదర్శనం.

ఆర్థిక, రాజకీయ, ధార్మిక స్వాతంత్ర్యం

వేదకాలపు మహిళలు కేవలం గృహానికే పరిమితం కాలేదు, సమాజ నిర్మాణంలో భాగస్వాములయ్యారు.

ఆర్థిక హక్కులు :

పితార్జితమైన ఆస్తికి స్త్రీలే వారసులు. సోదరులు లేని కుమార్తె తండ్రి ఆస్తికి పూర్తి హక్కుదారు. స్త్రీలకు ఆర్థిక స్వాతంత్ర్యం కల్పించే 'స్త్రీధనం' అనే భావన ఆనాడే బలపడింది. వ్యవసాయం, వస్త్రాలు నేయడం, విల్లంబులు తయారు చేయడం వంటి వృత్తులలో స్త్రీలు చురుకుగా పాల్గొన్నారు.

రాజకీయ హక్కులు :

నాటి ప్రజాస్వామ్య వ్యవస్థలైన 'సభ' , 'సమితి' సమావేశాలకు స్త్రీలు హాజరై, చర్చలలో పాల్గొని, నిర్ణయాలు తీసుకునేవారు (ఋగ్వేదం 10-85-276).

ధార్మిక హక్కులు :

పురుషులతో సమంగా స్త్రీలకు యజ్ఞాధికారం ఉంది (ఋగ్వేదం 8-31-5). యజ్ఞయాగాది క్రతువులలో భార్య లేకుండా భర్త ఒంటరిగా కూర్చోవడానికి వీల్లేదు, అందుకే ఆమెను 'సహధర్మచారిణి' అన్నారు. పతంజలి మహాభాష్యం నాటి మహిళలు మీమాంస శాస్త్రాన్ని కూడా అధ్యయనం చేశారని తెలుపుతుంది.

వేదమంత్ర ద్రష్టలు, తత్త్వవేత్తలు (Rishikas & Philosophers)

మధ్యయుగపు మౌఢ్య పండిత లోకం స్త్రీలు వేద పఠనం చేయరాదని నిబంధనలు ఏర్పరచింది కానీ, అసలు వేదమంత్రాలను దర్శించిన (రచించిన) వారిలో సుమారు 27 మందికి పైగా ఋషీమణులు (Rishikas) ఉన్నారు. రచనా సామర్థ్యంలో, తాత్విక చింతనలో తాము ఎవరికీ తీసిపోమని వారు నిరూపించారు.

వాగ్దేవి :

అంభృణ మహర్షి కుమార్తె వాగ్దేవి ఋగ్వేదంలో (10-125) 8 మంత్రాలు రచించింది. "అహమేవ స్వయమిదం వదామి" (ఈ జగత్తునంతటినీ నడిపించే చైతన్యాన్ని నేనే) అంటూ సాగే ఆమె మంత్రాలే నేటి దేవీ సూక్తులు.

లోపాముద్ర :

అగస్త్య మహాముని భార్య అయిన లోపాముద్ర, కేవలం ఆధ్యాత్మికతే కాకుండా, సంసారిక జీవనం కూడా ముఖ్యమేనని భర్తతో వాదించి మెప్పించిన గొప్ప విదుషీమణి (ఋగ్వేదం 1.179).

విశ్వవార, అపాళ, ఘోష :

వీరంతా ఋగ్వేదంలోని పలు మంత్రాలకు ద్రష్టలు.

గార్గి - మైత్రేయి :

బృహదారణ్యకోపనిషత్తులో ఈ ఇద్దరు మహోన్నతమైన తత్త్వవేత్తల ప్రస్తావన వస్తుంది. జనక మహారాజు కొలువులో మహాజ్ఞాని అయిన యాజ్ఞవల్క్యునితో వాదోపవాదాలు చేసి, సృష్టి మూలాల గురించి అంతుబట్టని ప్రశ్నలు సంధించి ఆయన్నే ఆశ్చర్యపరిచిన గొప్ప విదుషీమణి గార్గి వాచక్నవి. అలాగే యాజ్ఞవల్క్యుని భార్య మైత్రేయి. భర్త సన్న్యాసం తీసుకునే ముందు తన ఆస్తిని పంచి ఇస్తుంటే, "యేనాహం నామృతాస్యాం కిమహం తేన కుర్యామ్" (నాకు అమృతత్వాన్ని, ఆత్మజ్ఞానాన్ని ఇవ్వని ఈ భౌతిక సంపదతో నేనేమి చేసుకోవాలి?) అని ప్రశ్నించి, సంపద కన్నా జ్ఞానమే గొప్పదని నిరూపించిన గొప్ప బ్రహ్మవాదిని ఆమె.

'అసతో మా సద్గమయ, తమసోమా జ్యోతిర్గమయ, మృత్యోర్మా అమృతం గమయ' (అసత్యం నుండి సత్యానికి, చీకటి నుండి వెలుగుకి, మృత్యువు నుండి అమృతత్వానికి నన్ను నడిపించు) అనే అద్భుతమైన శాంతిమంత్రాన్ని లోకానికి అందించిన ఘనత ఆమెదే!

కళలు, సామాజిక స్వేచ్ఛ, రక్షణ రంగం

నాటి స్త్రీలు కేవలం ఆధ్యాత్మిక విషయాలకే పరిమితం కాలేదు. నాటి సమాజంలో 'సమన' (ఝుఎఱుఅ) అనే పండుగలు జరిగేవి. ఈ ఉత్సవాలకు యువతీయువకులు ఎంతో స్వేచ్ఛగా వెళ్లి, నృత్య సంగీతాల్లో పాల్గొనేవారు. తమకు నచ్చిన జీవిత భాగస్వాములను అక్కడే ఎంపిక చేసుకునేంతటి సామాజిక స్వేచ్ఛ ఆనాడు ఉండేది. సంగీత సాధన నాటి స్త్రీలకు మిక్కిలి మక్కువైన విషయం (ఋగ్వేదం 9-68-8).

సంగీత సాహిత్యాల్లోనే కాక వారు యుద్ధ విద్యలో

కూడా ఆరితేరినవారు. ఖేలుడు అనే రాజు భార్య విశపల (Vishpala) యుద్ధరంగంలో తన కాలు కోల్పోగా, అశ్వినీ దేవతలు ఆమెకు ఇనుప కాలును (prosthetic leg) అమర్చారని, ఆమె మళ్ళీ రణరంగంలో శత్రువుల మీద విరుచుకుపడిందని ఋగ్వేదం (1-116-15) గర్వంగా చెబుతోంది. అలాగే 'ముద్గలని' అనే వీరనారి యుద్ధ భూమిలో తన భర్త రథాన్ని నడిపి విజయం సాధించిన తీరు నాటి స్త్రీల శౌర్యానికి నిదర్శనం.

చారిత్రక పరిణామం - పతనం, కారణాలు (The Decline)

సుదీర్ఘమైన మన దేశ చరిత్రలో నిరంతరంగా జరిగిన సామాజిక, రాజకీయ మార్పులు స్త్రీల స్థితిగతులపై తీవ్ర ప్రభావం చూపాయి. వేదకాలం తర్వాత వచ్చిన సూత్ర యుగం, స్మృతి యుగం (ముఖ్యంగా మనుస్మృతి కాలం) నాటికి స్త్రీల స్వేచ్ఛ క్రమంగా సన్నగిల్లింది. దీనికి ప్రధాన కారణాలు:

1. కన్యాశుల్కం, బాల్యవివాహాలు ప్రవేశించడం వల్ల స్త్రీల విద్యాభ్యాసానికి ఆటంకం కలిగింది. ఉపనయనం, వేదాధ్యయనం రద్దయ్యాయి.
2. విదేశీయుల (గ్రీకులు, హూణులు, శకులు) దండయాత్రల వల్ల సమాజంలో అభద్రతా భావం పెరిగింది. స్త్రీల రక్షణ పేరిట వారి స్వేచ్ఛను హరించి, గృహానికే పరిమితం చేశారు.
3. భర్త మరణిస్తే సతీసహగమనం చేయడం, పరదా పద్ధతి వంటి దురాచారాలు మధ్యయుగాల నాటికి ప్రబలాయి. పురుషాహంకారానికి, మౌఢ్యానికి బలైన స్త్రీ బానిసగా మిగిలిపోయింది.

ముగింపు : వేదకాలపు వెలుగులు - రేపటి సమాజానికి మార్గదర్శనం

నాడు స్త్రీ జనోద్ధరణకు ప్రత్యేకంగా మహిళా సంఘాలు లేవు, ఫెమినిజం (Feminism) లాంటి ఉద్యమాలు లేవు, చట్టాలు లేవు. పురుషునితో సమానంగా స్త్రీ చూడబడాలనడానికి సిద్ధాంత రాద్ధాంతాలతో పనిలేదు. అది వారి జీవన విధానంలో సహజంగా అంతర్భాగమై ఉండేది. కానీ, ప్రజాస్వామ్యం, సోషలిస్టు సమాజాల్లో బతుకుతున్నామని దంభాలు చెప్పుకునే నేటి నవ నాగరిక వ్యవస్థలోని స్త్రీ పరిస్థితికి, వేదకాలంలో స్త్రీ పరిస్థితికి ఎంత వ్యత్యాసమున్నది?

ఆధునిక సమాజంలో ఆఖరుకు మత నియమాలు కూడా స్త్రీ పురుషులకు వేర్వేరు కావటం సమాజ సంకుచితత్వాన్ని తెలియజేస్తోంది. సృష్టికి మూలకారణమైన స్త్రీ పట్ల నేటి సమాజంలో ప్రచలితంగా ఉన్న పితృస్వామ్య అభిప్రాయాలు సమాజ వినాశనానికే దోహదం చేస్తాయి. తల్లిగా, తనయగా, భార్యగా, మానవ జీవనాభ్యుదయ మహాయజ్ఞానికి సమిధగా స్త్రీ పాత్ర చరితార్థమౌతుంది.

నేటి స్త్రీ దుస్థితికి మార్క్సిస్టులు ఆర్థిక స్వాతంత్ర్య లోపాన్ని, మానసిక శాస్త్రజ్ఞులు స్వార్థాన్ని కారణాలుగా చూపవచ్చు. కానీ వేదకాలపు సమాజాన్ని దర్శించినప్పుడు స్త్రీ ఔన్నత్యానికి అసలు కారణం - ధార్మిక, విద్య, రాజకీయ, సామాజిక రంగాల్లో పురుషునితో సమాన గౌరవాన్ని, హక్కులను కలిగి ఉండటమేనని బోధపడుతుంది.

మానవ నాగరికత ముందుకు పోతోందా? లేక పునరావృతం కావాలను కుంటుందా? అనే సందేహం ప్రతి ఆలోచనా జీవికి కలుగుతుంది. ఎప్పుడైతే తిరిగి ఆ వేదకాలపు ఉన్నతమైన స్వేచ్ఛా, సమానత్వాల స్థితికి స్త్రీ చేరుకుంటుందో, ఆధునిక చట్టాలు నాటి ఆర్ష ధర్మంతో సమన్వయం సాధిస్తాయో.. అప్పుడే మన సమాజం నిజమైన ప్రగతి పథంలో మరొక్క అడుగు ముందుకు వేస్తుందనడం ఏమాత్రం విభేదించలేని వాస్తవం.!

ఆధార గ్రంథాలు (Reference Books)

1. The Position of Women in Hindu Civilization- రచయిత: డాక్టర్ ఎ. ఎస్. ఆల్టేకర్ (A.S. Altekar). (ప్రాచీన భారతదేశంలో స్త్రీల స్థితిగతులపై నేటికీ ఇదే అత్యంత ప్రామాణికమైన పరిశోధనా గ్రంథం).

2. Women in Ancient India - రచయిత: క్లారిస్ బేడర్ (Clarisse Bader). (వేదకాలం నాటి స్త్రీల మేధో సంపత్తిని వివరిస్తుంది).
3. "ఋగ్వేద సంహిత", "బృహదారణ్యకోపనిషత్తు" (తెలుగు అనువాదాలు) - రామకృష్ణ మఠం ప్రచురణలు. (యజ్ఞాలు, గార్గి, మైత్రేయి, విశ్వల మంత్రాల మూలాల కోసం).
4. Great Women of India - రామకృష్ణ మిషన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ కల్చర్ ప్రచురణ (స్వామి మాధవానంద, ఆర్.సి. మజుందార్).
5. వేదముల యదార్థ స్వరూపము, అనువాద కర్త బ్రహ్మశ్రీ పండిత లోకమలహరి సిద్ధాంతాచార్య, వైదిక సాహిత్య ప్రచార సమితి, హైదరాబాదు 2007
6. పరిశోధన విధానం. జయప్రకాష్, ఎస్. హైదరాబాద్: విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్.

★★★

Vol. 23 | Spl. Issue 03 | March 2026 | BHAVAVEENA | ISSN No. : 2456-4702 | RNI No. APTEL/2003/12253

RNI No. APTEL/2003/12253 | Reffered Journal & Peer Reviewed Journals | ISSN No. 2456-4702

భావవీణ

కళలు, సాహిత్య, సాంస్కృతిక భాషాధ్యయన పత్రిక

BHAVA VEENA

Journal of Arts, Literary, Culture & Language Study

రాయక్కమాన్యం కథ - దళిత స్త్రీ చైతన్యం

- డా॥. ఎస్. శమంత

తెలుగు అధ్యాపకురాలు, గిరిరాజ్ ప్రభుత్వ కళాశాల (స్వ. ప్ర), నిజామాబాద్.

ప్రాచీన సాంప్రదాయమైన ప్రక్రియ కథ. సాహిత్య ప్రక్రియలలో అందరికీ ఇష్టమైన ప్రక్రియ కథ. "కథ్" అనే ధాతువుకు సంభాషించుట ,చెప్పుట అని అర్థాలు ఉన్నాయి. ఒక వ్యక్తి జీవితంలోని ఒక సన్నివేశాన్ని కళాత్మకంగా చిత్రించేదే కథానిక." ఏకాంశ వ్యగ్రమై స్వయం సమగ్రమైన కథాత్మక వచన ప్రక్రియ కథానిక" అని పోరంకి దక్షిణామూర్తి అన్నారు. ఈ కథ నిర్వచనాన్ని గమనిస్తే, వ్యక్తి జీవితంలోని సంఘటనలను చిత్రించేది కథానిక అని మనకు అర్థమవుతుంది. ఈనాటి కథా రచయితలు సమాజంలో వారి కంటికి కనిపించిన, విని పించిన విషయాలను వాస్తవిక స్థితిగతులను వారి కథలలో కళ్లకు కట్టినట్లు చిత్రిస్తున్నారు. దళితుల కతలను-వెతలను వాస్తవిక జీవిత కోణాలను ఆవిష్కరించిన వారు అనేకమంది ఉన్నారు అలాంటి వారిలో జూపాక సుభద్ర ఒకరు. ఈమె ముఖ్యంగా దళిత మహిళల జీవితాలను చక్కగా చిత్రించారు.

జూపాక సుభద్ర వరంగల్ జిల్లా దామరంచ పల్లెకు చెందినవారు. కాకతీయ విశ్వవిద్యాలయంలో విద్యను అభ్యసించారు. తెలంగాణ సచివాలయంలో పనిచేశారు. అయ్యయ్యో దమ్మక్క (కవితా సంకలనం) రాయక్క మాన్యం (కథా సంపుటి)తో పాటు అనేక రచనలు చేశారు. వీరి సాహిత్య సేవలకు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ ఉత్తమ సాహిత్య పురస్కారం, తెలుగు యూనివర్సిటీ సాహిత్య ప్రతిభా పురస్కారంతోపాటు, అనేక సాహిత్య పురస్కారాలు పొందింది.

వ్యాస ఉద్దేశం :

జూపాక సుభద్ర రచించిన" రాయక్కమాన్యం" కథా సంపుటిలోని "రాయక్కమాన్యం" అనే ఒక్క కథను మాత్రమే పరిశీలించి ఆ కథలో ఉన్న దళిత స్త్రీ యొక్క జీవన విధానాన్ని, ఆ దళిత స్త్రీ లో ఉన్న అన్ని కోణాలను గురించి తెలియజేయడం ఈ వ్యాసం యొక్క ఉద్దేశం.

ఈ కథలో రాయక్క అనే స్త్రీ పాత్ర దళిత వర్గమైన మాదిగ కుల ఆశ్రితకులమైన డక్కలి వర్గానికి చెందిన స్త్రీ. సమాజంలో దళితులు అంటేనే ఎన్నో దోపిడీలకు, దౌర్జన్యాలకు గురైనటువంటివారు. ఇక మాదిగ ఆశ్రిత కులాలైన చిందు, డక్కలి వారి గురించి చెప్పాల్సిన అవసరం లేదు. చిందువారు చిందు యక్షగాన ప్రదర్శనలు చేసుకుంటూ జీవనం సాగిస్తారు డక్కలి వారు మాదిగ వారి దగ్గర ప్రతి సంవత్సరం పంటలు చేతికి వచ్చే సమయంలో వారి వాటాకు వచ్చిన గ్రామాలలో తిరుగుతూ మాదిగ వారి దగ్గర యాచిస్తూ జీవనం సాగించే ఒక వర్గం అంతేకాకుండా వీరు కుల పంచాయితీలను పరిష్కరిస్తారు. ఈ రెండు ఆశ్రిత కులాల వారు సంచార జీవనం సాగించేవారు.

"డక్కలోళ్లు ఊర్లు తిరుగుతారు గాని ఏ ఊరు బడితే ఆ ఊరు తిరగరు. "యిస్స" మీద వచ్చిన ఊర్లలోనే తిరుగుతారు. మాదిగోళ్లు ఇచ్చే మాన్యం గింజలు కొలుసుకొని రోజువారి తిండి అడుక్కొని పటమేసి జాంబ పురాణం చెప్పి పైసలు తీసుకోవాలి. వాళ్లకు భూములు, జాగలు ఉండద్దు. వ్యవసాయం చేయొద్దు ఇది డక్కలి కులం రీతి రివాజు" (పుట.65) డక్కలి వారు వారికివాటా వచ్చిన ఊర్లలోని పంట చేతికి వచ్చే సమయంలో ఊరూరా తిరుగుతూ మాదిగ వర్గం వారి దగ్గర యాచన చేస్తూ జీవిస్తారు.

రాయక్క పాడవుగా, బలంగా ఉంటుంది. ఒక పురుషుడికి ఏ మాత్రం తీసివేయని రూపురేఖలు కలది. ఆమె ఎత్తు, బలాన్ని, ధైర్యాన్ని చూసి డక్కలి, మాదిగ వర్గం వారు వివాహం చేసుకోవాలనుకున్న రాయక్కకు మంత్రాలు వస్తాయన్న భయంతో ఎవరు వివాహం చేసుకోరు. రాయక్కఒక మన్నెం (గిరిజన తెగ) కు చెందిన వ్యక్తిని ఇష్టపడి వివాహం చేసుకుంటుంది ఇక్కడ రాయక్క కులాంతర వివాహం చేసుకున్న తీరులో ఆమె ధైర్యం, ఆమెలో ఉన్న చైతన్యం కనిపిస్తుంది. కొద్దిరోజుల తర్వాత రాయక్క తన భర్తను తీసుకొని తన తండ్రి దగ్గరికి వస్తుంది.

రాయక్క తండ్రి తన కూతురికి తన వాటాలోంచి 20 ఊర్లను ఇస్తాడు. ఆ ఊర్లలో ఉన్న మాదిగ వారి దగ్గర వారి కుల ఆచారం ప్రకారం యాచిస్తూ జీవించాలని చెబుతాడు. ఆ విధంగానే రాయక్క తన వాట కింద వచ్చిన గ్రామాలలో పంట వచ్చిన సమయంలో తిరుగుతూ తనకు రావలసిన వాటాను తీసుకుంటూ, గ్రామాలలో మాదిగ వారికి వచ్చిన సమస్యలను పరిష్కరించి జీవిస్తుంది. రాయక్క రూపురేఖలను ,ధైర్యాన్ని ,ఆమె మాట తీరును చూసి అందరూ గౌరవిస్తారు. అందరూ ఆమెను రాజక్క అని పిలుస్తారు. ఈ పిలుపుని చూస్తేనే అర్థం అవుతుంది ఆమెకు ప్రజలు ఎలాంటి గౌరవం ఇస్తారు అని. రాయక్క సమస్యలు ఏవైనా వచ్చినప్పుడు ధైర్యంగా తీర్పుని ఇస్తుంది ఆమె ఇచ్చే తీర్పుకు ఎదురు ఉండదు. ఎందుకంటే ఆమె అన్ని విషయాలను తెలుసుకొని అందరికీ మంచి జరిగే లాగా తీర్పుని ఇస్తుంది.

"పొద్దున సందేకాడ అడుక్కచ్చుకొని పగటిల మాదిగ రైతుల కల్లాల కాడికి పోయి కల్లానికో వరికట్ట, రెండు కుంచాల మన్యం వడ్లు వసూలు చేసుకుంటుంది. మాన్నెం అంటే మాదిగ కింది కులాలైన చిందు, డక్కలి ఉమ్మడి భూమి. దాన్ని మాదిగలు దున్ని పండించి డక్కలి, చిందులోల్లకు కొంత ధాన్యం కొలవాలి. ఇది కులం కట్టడి. ఎంత కూటికి లేని మాదిగోల్లైనా డక్కలి, చిందోళ్ల కు అన్నం పెట్టాలి"(పుట 66) . ఆత్మాభిమానం కలిగిన రాయక్కకు ఊరురా తిరగడం, యాచిస్తూ జీవించడం ఇష్టం ఉండదు కానీ వేరే ఆధారం లేక కుల కట్టుబాట్లను గౌరవించి జీవించే స్త్రీగా కనిపిస్తుంది.

రాయక్కను మాదిగోళ్ళు జాంబ పురాణం చెప్పమని కోరుతారు .అప్పుడు రాజక్క వేరే డక్కలోల్లతో కలిసి కథ చెప్తుంది. ఈ విధంగా రాయక్క పటం వేసి జాంబ పురాణం చెబుతుంది. ఇక్కడ మనకు రాజక్కలోని కళాకారిణి కనిపిస్తుంది.

రాయక్కది సంచార జీవనం సాగించే వర్గం కావడంతో ఏ ఊరికి వెళ్తే ఆ ఊరిలో తమకు కావలసిన గుడిసెను ఊరి బయట వేసుకొని ఆ ఊరిలో 10, 15 రోజులు ఉంటుంది .ఆ తర్వాత వేరే ఊరికి వెళుతుంది .ఆ విధంగానే వెళ్ళినప్పుడు ఆమె ఊరి బయట గుడిసె వేసుకోవడం కోసం అక్కడి ప్రదేశంలో ఉన్న రాళ్లు రప్పలు, ముళ్ళు వంటివి తీసివేసి శుభ్రం చేస్తుంది.

"గుడిసె కోసం సెత్త ,మట్టి పెడ్డలు ,రాళ్లు, రప్పలేరేసి నేలంతా సాపు చేసింది. ఇంతలో రాజక్క పెనిమిటి గాడిదల్ని కుంటకట్ట మీద యిడిచిపెట్టి గుడిసె యేసు కునే పని చేస్తుంటే అతనికి చాప సింపులు, తాళ్లు అందించి ఇప్పటికిట్లుండనీయి, రేపు తాటి కమ్మలు తెచ్చుకుందాం అని మూడు రాళ్లు తెచ్చి పొయ్యి పొందిచ్చి ఈ పుల్లపుల్లా దెచ్చి పిడికె నిప్పు తయారు చేసేసరికి సీకటి సిటుక్కుమన్నది (పుట 66) ఈ విధంగా రాయక్క తన గుడిసె కోసం శ్రమించే కష్టజీవి కనిపిస్తుంది. తన కుటుంబం కోసం కష్టపడే వ్యక్తిగా దర్శనమిస్తుంది.

సంచార జీవనంలో ఉండే కష్టాలను భరిస్తూ జీవించే స్త్రీ మూర్తిగా రాయక్కను చిత్రించారు.

ఊర్లోకి అన్నం కోసం యాచిస్తూ వెళ్తుంది. అప్పుడు ఊర్లో వాళ్ళు పలకరించి ఆమెకు కావాల్సిన అన్నం, పచ్చడి, కూర వంటివి పెడతారు. ఒక ఇంటి దగ్గర మాత్రం కసురుకొని తిట్టి అన్నం పెట్టరు. అప్పుడు రాయక్కకు కోపం వస్తుంది. కానీ ఆ కోపాన్ని దిగమింగి తను గుడిసె వేసుకొని ఉన్న ప్రదేశానికి వెళ్లి తన పిల్లలకు భర్తకు తీసుకు వచ్చిన అన్నం కూరలు వడ్డిస్తుంది. ఇక్కడ రాయక్క మాతృమూర్తి లోని ఔన్నత్యం, సహనం కనిపిస్తాయి.

రాయక్క ఊర్లో ఉన్న మాదిగ వాళ్ళ పాలాల దగ్గరకు వెళ్ళి ఆమెకు రావలసిన వరికట్టలను వసూలు చేసుకోవడం కోసం. అందరూ రాయక్కకు ఇవ్వాల్సిన వరికట్టలను ఇచ్చారు. తర్వాత ఇదివరకు అన్నమెయ్యని పోసక్కోల్ల కళ్ళం కాడికి వచ్చింది. పోసక్క ముత్తన్న మాత్రం కళ్ళంలో పంట ఇవ్వలేదు. రాయక్కను గౌరవించి మాట్లాడలేదు. రాయక్కకు కోపం వచ్చింది. కానీ కోపాన్ని దిగమింగి తర్వాత ఉన్న మాదిగ పాలాల వద్దకు వెళ్లి తన వాటా తీసుకుంది. ఆ తర్వాత ఊర్లో ఉన్న పెద్ద మాదిగను కలిసి విషయం తెలిపింది. ఆ పెద్ద మాదిగ ముత్తన్నను పిలిపించి రాయక్కకు మాన్యం ఎందుకు ఇవ్వలేదని అడిగాడు. తన ఇంట్లో జరిగిన విషయమంతా తెలియజేశాడు. వాళ్ల అన్నను పిలిపించాడు. ఊర్లో అందరి ముందు పంచాయతీ పెట్టారు. రాయక్కనే తీర్పు ఇవ్వమని చెప్పాడు ఆ ఊరి పెద్ద మాదిగ. రాయక్క చాలా తెలివైన స్త్రీ అంతకుముందే అన్నదమ్ముల మధ్య జరిగిన గొడవను తెలుసుకొని వారిద్దరికీ సరైన న్యాయం చెప్పి వారి నుండి రావలసిన తన వాటాను వచ్చేలాగా తీర్పు చెప్పి అందరి ప్రశంసలు పొందింది. రాయక్క ముందు చూపు కలిగిన స్త్రీ, న్యాయం చెప్పడంలో దిట్ట. తనకు వచ్చిన సమస్యను పరిష్కరించుకొని ఊర్లో వాళ్ళ సమస్యలను పరిష్కరించే స్త్రీ మూర్తిగా రాయక్కని చిత్రించారు. ఇక్కడ రాజక్క లో అన్యాయం జరిగినప్పుడు తీర్పు ఇచ్చే న్యాయమూర్తి మనకు కనిపిస్తుంది. తన అస్తిత్వాన్ని నిలబెట్టుకున్న స్త్రీ మూర్తిగా దర్శనమిస్తుంది.

ఈ విధంగా దళిత వర్గంలోని మాదిగ కులానికి ఆశ్రిత కులమైన డక్కలి వర్గానికి చెందిన స్త్రీ లో ఉన్న ధైర్యం, సహనం, మాతృమూర్తిలోని ఔన్నత్యం, చైతన్యం, కళా కారిణి, వంటి లక్షణాలను, ఒక స్త్రీ మూర్తిలో ఉన్న అన్ని కోణాలను రచయిత్రి అద్భుతంగా చిత్రించారు. అట్టడుగు వర్గానికి చెందిన స్త్రీలు ఎన్ని సమస్యలు వచ్చినా వాటిని ఎదుర్కొంటూ, తమ జీవనం సాగిస్తూ, తమ శ్రమ ద్వారా, తమ మాట తీరుతో ఇతరుల వద్ద గౌరవాన్ని పొందుతూ జీవించే స్త్రీలుగా అత్యంత ప్రభావవంతులుగా సమాజంలో జీవించే విధానాన్ని చిత్రించారు. సహజమైన తెలంగాణ మాండలిక భాషను ఉపయోగించి తెలంగాణ ప్రాంతంలో ఉన్న డక్కలి వారి జీవన విధానం ముఖ్యంగా మహిళల జీవన విధానాన్ని గురించి, ఆ వర్గంలో ఉన్న స్త్రీల గురించి చిత్రించిన తీరు గొప్పది.

ఆధార గ్రంథాలు:

1. జూపాక సుభద్ర : రాయక్క మాన్యం, దండోరా ప్రచురణాలు,హైదారాబాద్.
2. పోరంకి దక్షిణామూర్తి : కథానిక స్వరూప స్వభావాలు. విశాలాంధ్ర ప్రచురణాలయం హైదరాబాద్

★★★

Vol. 23 | Spl. Issue 03 | March 2026 | BHAVAVEENA | ISSN No. : 2456-4702 | RNI No. APTEL/2003/12253

RNI No. APTEL/2003/12253 | Reffered Journal & Peer Reviewed Journals | ISSN No. 2456-4702

భావవీణ

కళలు, సాహిత్య, సాంస్కృతిక భాషాధ్యయన పత్రిక

BHAVA VEENA

Journal of Arts, Literary, Culture & Language Study

బౌద్ధ ధర్మం దళిత సాహిత్యం : మహిళల పాత్ర - ఒక తులనాత్మక పరిశీలన

- డా॥. పులికర్ల రమేష్

పరిశోధకులు, తెలుగు విభాగం, హైదరాబాద్ విశ్వవిద్యాలయం, హైదరాబాద్.

పరిచయం:

బౌద్ధ ధర్మం ప్రాచీన పునాది అయితే, దళిత సాహిత్యం దాని ఆధునిక కొనసాగింపు. 2500 ఏళ్ల క్రితం 'థేరీగాథలు' ఏ స్వేచ్ఛా గొంతుకనైతే వినిపించాయో, నేడు వినోదిని, పి. సత్యవతి, సుశీల తక్షభావు వంటి రచయిత్రులు అదే ఆత్మగౌరవ జెండాను ఎగురవేస్తున్నారు. ఈ వ్యాసం ప్రాచీన భిక్కుణీల గాథలను, ఆధునిక దళిత సాహిత్య పాత్రలతో పోలుస్తూ మహిళల సామాజిక, మానసిక విముక్తిని విశ్లేషిస్తుంది.

భారతీయ సామాజిక చరిత్రలో బౌద్ధం ఒక గొప్ప విప్లవం. అణచివేతకు గురైన వర్గాలకు, ముఖ్యంగా మహిళలకు ఆత్మగౌరవాన్ని ప్రసాదించిన తొలి మార్గం ఇది. ఆధునిక కాలంలో దళిత సాహిత్యం కూడా అదే తరహాలో అణచివేతకు వ్యతిరేకంగా, అస్తిత్వ పోరాటం వైపు మహిళలను నడిపిస్తోంది. థేరీగాథల్లోని మహిళలు, ఆధునిక దళిత సాహిత్యంలో ప్రతిబింబించే మహిళా పాత్రల మధ్య ఒక స్పష్టమైన భావజాల అనుసంధానం కనిపిస్తుంది.

నేపథ్యం:

బౌద్ధం కేవలం రాజవంశీయులనే కాకుండా, సామాన్య గృహిణులను (కిసా గౌతమి, పటాచార), పూర్వ గణికలను (అంబపాలి, విమల) కూడా సమానంగా స్వీకరించి, కుల-వర్గ వివక్ష లేని సమాజాన్ని సూచించింది. దళిత సాహిత్యంలో మహిళలు కేవలం కుల వివక్షకే కాకుండా, పితృస్వామ్య వ్యవస్థలో 'దళితులలో దళితులుగా' ఎదుర్కొంటున్న సవాళ్లను చిత్రీకరిస్తుంది. బౌద్ధం అందించిన స్వేచ్ఛా స్ఫూర్తిని దళిత సాహిత్యం అందిపుచ్చుకుందని తెలుస్తుంది.

తులనాత్మక అంశాలు:

అస్తిత్వ పోరాటానికి సంబంధించి బౌద్ధ సాహిత్యంలో మహిళలు గృహ బానిసత్వం, వంటగది పరిమితుల నుండి విముక్తి పొంది, ప్రత్యేక ఆధ్యాత్మిక అస్తిత్వాన్ని చాటుకున్నారు. దళిత సాహిత్యంలో మహిళలు సామాజిక అంటరానితనం, ఆర్థిక వెనుకబాటుతనం నుండి బయటపడి స్వతంత్ర గొంతుకను వినిపిస్తున్నారు.

అధికారికత కలిగి ప్రశ్నించే విషయంలో బౌద్ధ సాహిత్యంలో మహిళలు, సుమనాదేవి తన తండ్రిని 'తమ్ముడా' అని పిలవడం ద్వారా ఆధ్యాత్మిక మేధస్సులో స్త్రీల ప్రాధాన్యతను నిరూపించారు. దళిత సాహిత్యంలో మహిళలు కుల అహంకారాన్ని, పితృస్వామ్య కట్టుబాట్లను ప్రశ్నించే ధీర వనితలుగా దళిత సాహిత్యం వీరిని చిత్రీకరిస్తుంది.

హింస - ప్రతిఘటన వంటి విషయాల్లో బౌద్ధ సాహిత్యంలో మహిళలు, ఉత్పలవర్ణ వంటి వారు శారీరక

దాడులను ఎదుర్కొని మానసిక స్థైర్యంతో నిలిచారు. దళిత సాహిత్యంలో మహిళలు, శతాబ్దాల సామాజిక హింసను తట్టుకుని, విద్య ద్వారా చైతన్యవంతులవుతున్న పాత్రలు దళిత సాహిత్యంలో కనిపిస్తాయి.

పరివర్తన విషయంలో బౌద్ధ సాహిత్యంలో మహిళలు, కాళియాక్షిణి వంటి పాత్రలు ద్వేషాన్ని వదిలి ప్రేమ మార్గంలోకి మారడం కనిపిస్తుంది. దళిత సాహిత్యంలో మహిళలు, సామాజిక మార్పు కోసం ఉద్యమించే చైతన్య స్రవంతులుగా మహిళలు కనిపిస్తారు.

విశ్లేషణ :

బౌద్ధంలో విశాఖ మరియు సామావతి పాత్రలు గృహస్థ ధర్మంలో ఉంటూనే నాయకత్వ లక్షణాలను ప్రదర్శించాయి. ఇదే తీరుగా దళిత సాహిత్యంలో కూడా మహిళలు సామాజిక బాధ్యతలను భుజాన వేసుకునే 'బహుజన నాయకత్వ' లక్షణాలతో కనిపిస్తారు. ఉత్పలవర్ణపై జరిగిన దాడి తర్వాత భిక్కుణీల రక్షణ కోసం ప్రత్యేక ఆరామాలు నిర్మించబడ్డాయి. నేటి దళిత సాహిత్యం కూడా మహిళలకు సామాజిక భద్రత, విద్యా హక్కు, గౌరవప్రదమైన జీవితం కావాలని బలంగా కోరుతోంది.

థేరీగాథలో పటాచార తన భర్తను, పిల్లలను కోల్పోయి పిచ్చిదిగా మారిన స్థితి నుండి బుద్ధుని శరణు పొంది 'అరిహంత్' స్థితికి చేరుకుంది. ఆమె విముక్తి కేవలం ఆధ్యాత్మికం మాత్రమే కాదు, సామాజికంగా ఒంటరి మహిళకు లభించిన రక్షణ. 'నల్ల ద్రాక్ష పందెరి'లో వినోదిని రచయిత్రి దళిత స్త్రీలు ఎదుర్కొనే హింసను చిత్రించారు. పటాచారలా ఇక్కడి పాత్రలు కూడా సంకెళ్లను తెంచుకోవడానికి ప్రయత్నిస్తున్నట్లు అన్పిస్తాయి. అయితే, ఇక్కడ విముక్తి మార్గం 'విద్య' మరియు 'చైతన్యం'. పటాచార ఆధ్యాత్మిక శాంతిని పొందితే, దళిత మహిళలు సామాజిక హక్కుల కోసం పోరాడే చైతన్యాన్ని పొందుతారు.

థేరీగాథలో ఉత్పలవర్ణ తన సౌందర్యం వల్ల ఎదురైన వేధింపులను తట్టుకుని, తన ఇంద్రియాలపై విజయం సాధించింది. ఆమెపై జరిగిన దాడి సంఘంలో స్త్రీల రక్షణపై చర్చకు దారితీసింది. 'నిశ్శబ్ద గొంతుకలు'లో సత్యవతి రచయిత్రి అణచివేతకు గురైన మహిళల మౌనాన్ని విశ్లేషించారు. ఉత్పలవర్ణ ఎలాగైతే తనపై జరిగిన దాడిని ధైర్యంగా ఎదుర్కొని 'ప్రజ్ఞ'ను సాధించిందో, సత్యవతి కథల్లోని మహిళలు కూడా తమ నిశ్శబ్దాన్ని ఛేదించి ఆత్మగౌరవం కోసం గొంతు విన్పిస్తారు. ఉత్పలవర్ణ 'బుద్ధి'ని సాధిస్తే, దళిత మహిళలు 'సామాజిక గుర్తింపు'ను సాధిస్తారు..

థేరీగాథలో సుమనాదేవి తన తండ్రిని 'తమ్ముడా' అని సంబోధించడం ద్వారా ఆధ్యాత్మిక మేధస్సులో స్త్రీల ఆధిక్యతను చాటింది. ఇది పితృస్వామ్య అధికారాన్ని జ్ఞానంతో ప్రశ్నించడంగా భావించవచ్చు. దళిత సాహిత్యంలో సుశీల తక్షభావు తన 'దళిత మహిళల విముక్తి పోరాటం' స్త్రీల మేధోపరమైన ఎదుగుదలను చర్చించారు. సుమనాదేవి జ్ఞాన మార్గంలో ఎలాగైతే తండ్రిని మించిపోయిందో, మరాఠీ కవయిత్రి సుశీల తక్షభావు చిత్రించిన పాత్రలు కూడా పితృస్వామ్య కట్టుబాట్లను, కుల వివక్షను విద్య మేధస్సుతో అధిగమిస్తాయి.

థేరీగాథలో విశాఖ గృహస్థురాలిగా ఉంటూనే భిక్కుణీ సంఘానికి రక్షణగా నిలిచింది. నాయకత్వ లక్షణాలతో సామాజిక శ్రేయస్సు కోరింది. నేటి దళిత సాహిత్యంలో మహిళలు విశాఖ వలెనే కేవలం తమ గురించి కాకుండా, మొత్తం వర్గం శ్రేయస్సు కోసం, విద్యావకాశాల కోసం నాయకత్వం వహిస్తున్నారు. సామాజిక భద్రత కోసం విశాఖ నాడే 'ఎనిమిది వరాలు' కోరగా, నేటి మహిళలు 'రాజ్యాంగ హక్కుల'ను కోరుతున్నారు.

ముగింపు:

థేరీగాథల్లోని మహిళలు ప్రాచీన కాలంలో ఏ మానసిక శ్రేయస్సును, సామాజిక గుర్తింపును పొందారో, దానికి ఆధునిక రూపమే నేటి దళిత సాహిత్యం. వినోదిని చిత్రించిన వేదన, సత్యవతి వినిపించిన గొంతుక, సుశీల తక్షభావు చాటిన పోరాటం - ఇవన్నీ నాటి ఉత్పలవర్ణ, సుమనాదేవిల చైతన్యానికి కొనసాగింపులే. బౌద్ధం నాటి భిక్కుణీ సంఘం స్త్రీలకు ఎలా రక్షణ కవచంగా నిలిచిందో,

నేటి దళిత సాహిత్యం కూడా మహిళలకు ఆత్మవిశ్వాసాన్నిచ్చే ఆయుధంగా నిలుస్తోంది. నాటి మహిళలకు కల్పించిన మేధో స్వేచ్ఛ మరియు ఆధ్యాత్మిక సమానత్వం, ఆధునిక దళిత సాహిత్యం ఆశిస్తున్న సామాజిక సమానత్వానికి పునాది అని చెప్పవచ్చు. థేరీగాథల్లోని మహిళలు నాడు పొందిన విముక్తి, నేటి దళిత మహిళల పోరాటాలకు ఒక చారిత్రక ప్రేరణ. 'ధమ్మం' చూపిన బాటలో నడవడం ద్వారానే స్త్రీలు తమ సంపూర్ణ అస్తిత్వాన్ని కాపాడుకోగలరని ఈ తులనాత్మక అధ్యయనం ద్వారా గ్రహించవచ్చు.

ఆధార గ్రంథాలు :

1. https://www.dcu.ie/sites/default/files/students/mindfulness_based_ stress_ reduction_ handbook.pdf
2. ధమ్మ పదము - బుద్ధ గీత: చర్ల గణపతి శాస్త్రి, 1995, డిజిటల్ లైబ్రరీ.
3. ధమ్మ పదం - రత్నాకరం బాలరాజు, 1994, డిజిటల్ లైబ్రరీ.
4. బౌద్ధ దర్శనం - కత్తి పద్మారావు, లోకాయుత ప్రచురణలు.
5. THE DHAMMAPADAÑ The Buddhaµs Path to Freedom,Translated from the Pli, by Acharya Buddharakkhita, Introduction by Bhikkhu Bodhi, Buddhist Publication Society, First BPS edition 1985. (5 & 6-29to 31)
6. ధమ్మ పదం - మోక్షానంద స్వామి (అనువాదం) 1983, డిజిటల్ లైబ్రరీ.
7. Therigatha: Poems Of The First Buddhist Women: by Vimalkirti Publication date 2015 Topics Therigatha, Theragatha, Buddhism, Tripitaka, khuddakanikaya, atthakatha, sutta pital, pali Collection folkscanomy_religion_tripitakaÑ folkscanomy_religionÑ folkscanomy Language English
8. Dhammapada Atthakatha (Book 13, Story 9):
9. Jataka Stories (Mahapaduma Jataka)
10. Dhammapada Atthakatha (Book 17, Story 1)
11. విశ్వసాహితి తెలుగు విజ్ఞాన సమితి:The Psalms of the Sisters - Mrs. Rhys Davids (C.A.F. Rhys Davids): 1909.
12. The First Buddhist Women: Translations and Commentary on the Therigathaµµ -- Susan Murcott:
13. వినోదిని, "నల్ల ద్రాక్ష పందెరి".
14. పి. సత్యవతి, "నిశ్శబ్ద గొంతుకలు".
15. సుశీల తక్షభావు, "శికంజో కా దర్ద్" (Shikanje Ka Dard).
16. కత్తి పద్మారావు, "బౌద్ధ దర్శనం".

★★★

Vol. 23 | Spl. Issue 03 | March 2026 | BHAVAVEENA | ISSN No. : 2456-4702 | RNI No. APTEL/2003/12253

RNI No. APTEL/2003/12253 | Reffered Journal & Peer Reviewed Journals | ISSN No. 2456-4702

భావవీణ

కళలు, సాహిత్య, సాంస్కృతిక భాషాధ్యయన పత్రిక

BHAVA VEENA

Journal of Arts, Literary, Culture & Language Study

తెలుగు స్త్రీవాద కవిత్వంలో ఆస్తిత్వ పోరాటం - మహిళా చైతన్యం

- దత్తి గాయత్రి
విజయనగరం

ఉపోద్ఘాతం : ఆస్తిత్వ చైతన్యం - ఒక చారిత్రక పరిణామం

"నేను మనిషినని.. నాకూ ఒక పేరు, ఒక ఉనికి, ఒక ఆత్మగౌరవం ఉన్నాయని" చాటి చెప్పడమే ఆసిత్వ పోరాటం. తెలుగు సాహిత్య చరిత్రను నిశితంగా పరిశీలిస్తే, శతాబ్దాల కాలం పాటు స్త్రీ చిత్రం పురుష దృక్పథం తోనే ఆవిష్కృతమైంది. పురాణాల్లో త్యాగమూర్తిగా, ప్రబంధాల్లో అంగాంగ వర్ణనల అలంకార వస్తువుగా, జానపదాల్లో గృహిణిగా మాత్రమే చిత్రించబడిన స్త్రీ, తన సొంత గొంతుకను, తన అంతరంగాన్ని ఆవిష్కరించుకోవడానికి ఆధునిక యుగం వరకు వేచిచూడాల్సి వచ్చింది. 1980వ దశకంలో తెలుగు సాహితీ క్షితిజంపై ఉదయించిన 'స్త్రీ వాద కవిత్వం' ఒక నిశ్శబ్ద విప్లవం, అంతవరకు పురుష పీఠికల మధ్య నలిగిపోయిన సాహిత్య ప్రపంచంలోకి, మహిళలు తమ రక్తాన్ని సిరాగా మలిచి, తమ గాయాలను అక్షరాలుగా మార్చి ప్రవేశించారు. ఇది కేవలం ఒక సాహిత్య ప్రక్రియ కాదు, ఇది పితృస్వామ్య భావజాలం నిర్మించిన ఇనుప కంచెలను తెంచుకుంటూ సాగిన ఒక గొప్ప యుద్ధం.

ఆస్తిత్వ పోరాటం అంటే కేవలం మనుగడ సాగించడం కాదు, పురుషుడి నీడలో కాకుండా తనకంటూ ఒక ప్రత్యేక గుర్తింపును సాధించుకోవడం. ఈ పోరాటం వంటగదిలోని శ్రమదోపిడీని నిరసించింది. శరీరంపై స్త్రీకి ఉండే స్వయంప్రతిపత్తిని ప్రకటించింది, మాతృత్వం వెనుక ఉన్న సామాజిక రాజకీయాన్ని ఎండగట్టింది. ఈ క్రమంలో వెలువడిన కవిత్వం మహిళల్లో ఒక నూతన చైతన్యాన్ని రగిలించింది. బాధితురాలుగా మిగిలిపోకుండా, పోరాట యోధురాలుగా మారిన స్త్రీ ప్రస్థానాన్ని విశ్లేషించడమే ఈ పరిశోధన పత్రం యొక్క ప్రధాన ఉద్దేశ్యం.

పరిశోధన లక్ష్యాలు :

తెలుగు సాహిత్యంలో స్త్రీ చిత్రం పురుష దృక్పథం నుండి స్త్రీ స్వయం గొంతుకగా ఎలా మారిందో వివరించడం.

వంటగదిలో స్త్రీ చేసే 'అదృశ్య శ్రమ' మరియు పితృస్వామ్య వ్యవస్థలోని శ్రమదోపిడీని విశ్లేషించడం.

స్త్రీ శరీరంపై ఆమెకు ఉండవలసిన స్వయంప్రతిపత్తిని మరియు ఆత్మగౌరవాన్ని చాటిచెప్పడం.

మాతృత్వం వెనుక ఉన్న సామాజిక రాజకీయాన్ని మరియు స్త్రీ నిర్ణయాధికార ప్రాముఖ్యతను చర్చించడం.

దళిత, బహుజన మరియు ముస్లిం మహిళలు ఎదుర్కొంటున్న బహుళ వివక్షలను మరియు వారి అస్తిత్వ పోరాటాలను గుర్తించడం.

ఆధునిక లఘు కవితా ప్రక్రియలు (నానీలు, హైకూలు) మహిళా చైతన్యాన్ని ఎలా ప్రతిబింబిస్తున్నాయో పరిశీలించడం.

పరిశోధనా పద్ధతి :

విశ్లేషణాత్మక పద్ధతి :

1980వ దశకం నుండి వెలువడిన స్త్రీవాద కవిత్వాన్ని మరియు అందులోని అస్తిత్వ ధోరణులను విశ్లేషించడం జరిగింది.

సాహిత్య ఆధారాలు :

ఓల్గా, విమల, జయప్రభ, కొండేపూడి నిర్మల వంటి ప్రముఖ కవయిత్రుల రచనలను ప్రధాన ఆధారాలుగా స్వీకరించడమైనది.

సమగ్ర అధ్యయనం :

పితృస్వామ్యం, కులం మరియు మతం వంటి సామాజిక అంశాల నేపథ్యంలో
స్త్రీవాద సాహిత్యాన్ని అధ్యయనం చేయడం జరిగింది.

వంటగది సామ్రాజ్యం - శ్రమ దోపిడీపై నిరసన

స్త్రీ వాద కవిత్వంలో 'వంటగది' అనేది కేవలం ఆహారం వండే స్థలం కాదు, అది పితృస్వామ్య వ్యవస్థ స్త్రీని బంధించిన ఒక సామాజిక చిహ్నం. శతాబ్దాలుగా స్త్రీ శ్రమను ''ప్రేమ, త్యాగం, బాధ్యత' అనే అందమైన పేర్లతో మూటగట్టి, దానికి ఎటువంటి ఆర్థిక విలువ లేదా సామాజిక గుర్తింపు లేకుండా చేయడాన్ని స్త్రీవాద కవయిత్రులు తీవ్రంగా నిరసించారు.

అ) అదృశ్య శ్రమ : పురుషుడు బయట చేసే పనికి వేతనం, గుర్తింపు ఉంటాయి. కానీ, స్త్రీ తెల్ల వారజామున మొదలుపెట్టి అర్ధరాత్రి వంటగదిలో చేసే శ్రమను 'అదృశ్య శ్రమ'గా ఈ కవిత్వం గుర్తించింది. వంటగదిని ఒక ''సామ్రాజ్యం''గా వర్ణించి స్త్రీని దానికి ''రాణి''ని చేశామని చెప్పే పురుష అహంకారాన్ని కవయిత్రులు ధిక్కరించారు. ఆ రాజ్యానికి ఆమె రాణి కాదు, జీతం లేని సేవకురాలు మాత్రమేనని కుండబద్ధలు కొట్టారు.

ఆ) విమల గారి "వంటగది" - ఒక విశ్లేషణ: స్త్రీవాద సాహిత్య చరిత్రలో విమల రాసిన "వంటగది" కవిత ఒక సంచలనం. ఆమె ఈ కవితలో వంటగదిని ఒక 'కారాగారం'తో పోల్చారు.

"మా అమ్మ జీవితమంతా వంటగదిలోనే గడిచి పోయింది చుట్టూ పొగచూరిన గోడల మధ్య ఆమె ఒక నిశ్శబ్ద సాక్షి ఆమె కళ్ళలో పొగ పేరుకుపోయింది, ఆమె చేతులకు తిరగమోత వాసన అంటుకుంది"

ఈ కవిత ద్వారా, ఒక స్త్రీ తన సృజనాత్మకతను, తన కలలను, తన సమయాన్ని పాత్రలు తోముతూ, కూరలు తరుగుతూ ఎలా కోల్పోతుందో అర్థంగా చిత్రించారు. "వంటగది మా అమ్మకు అలవాటు కాదు, అదొక అనివార్యత" అని చెప్పడం ద్వారా స్త్రీ అస్తిత్వం ఆ గదిలోనే ఎలా సమాధి అవుతుందో వివరించారు.

ఇ) సామాజిక చైతన్యం : వంటగది పట్ల ఈ నిరసన కేవలం పని పట్ల అసహనం కాదు, అది శ్రమ విభజనలోని అసమానతపై తిరుగుబాటు. వంట చేయడం అనేది కేవలం స్త్రీ బాధ్యత మాత్రమే కాదని, అది మానవ మనుగడకు సంబంధించిన పనని, అందులో పురుషుల భాగస్వామ్యం కూడా ఉండాలని ఈ కవిత్వం డిమాండ్ చేసింది.

ఈ) అస్తిత్వ కోణం : వంటగది నుండి బయటకు వచ్చి, సమాజంలో తనకంటూ ఒక స్థానాన్ని వెతుక్కునే క్రమంలో స్త్రీ ఎదుర్కొనే మొదటి అవరోధం ఈ గృహకృత్యాలే. ఈ శ్రమ దోపిడీని గుర్తించినప్పుడే మహిళా చైతన్యం పరిపూర్ణమవుతుంది. అందుకే స్త్రీవాద కవిత్వంలో వంటగది ఒక రాజకీయ వేదికగా మారింది.

"స్త్రీవాద కవయిత్రులు వంటగదిని ధిక్కరించడం అంటే కుటుంబాన్ని ధిక్కరించడం కాదు, కుటుంబం పేరుతో జరుగుతున్న అప్రకటిత బానిసత్వాన్ని నిరసించడం"

శరీర స్పృహ - అలంకార వస్తువు నుండి ఆత్మగౌరవం వైపు

తెలుగు సాహిత్యంలో, ముఖ్యంగా ప్రబంధ యుగంలో స్త్రీ శరీరం కేవలం ఒక 'వర్ణనా వస్తువు'గా మాత్రమే మిగిలిపోయింది. సాహిత్యంలో 'చందమామ', 'పువ్వు' వంటి సుకుమార పదాలతో స్త్రీని పోల్చేవారు,

కవులు స్త్రీని నఖశిఖపర్యంతం వర్ణిస్తూ ఆమె దేహాన్ని రకరకాల ఉపమానాలతో అలంకరించారు. అయితే, ఆ వర్ణనల వెనుక ఉన్న స్త్రీ మనోభావాలను గానీ, ఆమె వ్యక్తిత్వాన్ని గానీ ఎవరూ పట్టించుకోలేదు. స్త్రీవాద కవిత్వం ఈ పద్ధతిని పూర్తిగా తిరస్కరించి, స్త్రీవాద కవయిత్రులు కొత్త ప్రతీకలను, ఉపమానాలను వాడారు. స్త్రీవాద కవిత్వం 'నిప్పు', 'కత్తి', 'రక్తం', 'చీపురు', 'పార' వంటి వాస్తవిక పదాలతో కవిత్వానికి కొత్త రక్తాన్ని ఎక్కించింది. వచన కవిత్వంలో వీరు చూపిన సృజనాత్మకత పాఠకులను ఆలోచింపజేసింది. స్త్రీ శరీరంపై ఆమెకు ఉండవలసిన 'స్వయంప్రతిపత్తిని' బిగ్గరగా దాటింది.

అ) వస్తువు నుండి వ్యక్తి వైపు : స్త్రీ శరీరం పురుషుని ఆనందం కోసమో లేదా అలంకరణ కోసమో పుట్టింది కాదని, అది ఒక మనిషి ఉనికికి చిహ్నమని స్త్రీవాద కవయిత్రులు వాదించారు. జయప్రభ గారి కవిత్వంలో ఈ 'శరీర రాజకీయం' స్పష్టంగా కనిపిస్తుంది. ఆమె తన కవిత్వంలో స్త్రీ శరీరాన్ని పితృస్వామ్య భావజాలం ఎలా ఒక 'ఆస్తి'గా చూస్తుందో ఎండగట్టారు.

"నా శరీరం నా ఇష్టం... నా మనసు నా సొంతం
చూపులు కలవని చోట కూడా మనసులు కలవవు"

అంటూ భౌతిక ఆకర్షణ కంటే మానసిక స్వేచ్ఛకు, ఆత్మగౌరవానికి ప్రాధాన్యతనిచ్చారు.

ఆ) సౌందర్య ప్రమాణాల ధిక్కారం : సమాజం స్త్రీకి విధించిన 'అందాల' చట్రాలను ఈ కవిత్వం విచ్ఛిన్నం చేసింది. రంగు, రూపు, వయస్సు వంటి ప్రాతిపదికన స్త్రీని కొలవడాన్ని నిరసించింది. స్త్రీ శరీరంపై జరిగే హింసను, అత్యాచారాలను, చివరకు ఇంట్లో జరిగే అప్రకటిత శారీరక అణచివేతను కూడా ఈ కవిత్వం నిలదీసింది. శరీరం అనేది ఒక మృదువైన వస్తువు మాత్రమే కాదు, అది ఒక నిరసన గొంతుకగా మారగలదని నిరూపించింది.

ఇ) చైతన్యవంతమైన ఆవిష్కరణ : శరీర స్పృహ అంటే కేవలం భౌతికమైనది కాదు, అది స్త్రీలో కలిగిన ఒక మానసిక చైతన్యం. తన శరీరంపై తనకు హక్కు లేనప్పుడు, ఆమెకు ఆస్తిపై గానీ, సమాజంపై గానీ హక్కు ఉండదని ఈ కవయిత్రులు గుర్తించారు. కొండేపూడి నిర్మల, ఓల్గా, విమల వంటి వారు స్త్రీ శరీరంలోని సహజ ప్రక్రియలను (ఋతుస్రావం, ప్రసవం వంటివి) పవిత్రత/అపవిత్రత అనే కోణంలో కాకుండా, ఒక మనిషిగా ఆమె అనుభవించే వేదనగా, శక్తిగా చిత్రించారు.

ఈ) ఆత్మగౌరవ ప్రకటన : స్త్రీ అస్తిత్వ పోరాటం శిఖర స్థాయికి చేరుతుంది. "నా దేహంపై నాకే అధికారం లేనప్పుడు, ఈ ప్రపంచం నాది ఎలా అవుతుంది?" అనే ప్రశ్న మహిళా చైతన్యానికి మూలబిందువైంది. స్త్రీ శరీరంపై పురుషాధిక్య సమాజం వేసిన ముద్రలను తుడిచేసి, తనను తాను ఒక స్వతంత్ర వ్యక్తిగా ప్రకటించుకోవడమే ఇందులోని పరమార్థం.

"శరీర స్పృహ అనేది స్త్రీవాద కవిత్వంలో కేవలం ఒక వాదం కాదు, అది స్త్రీ తన ఉనికిని తాను వెతుక్కునే ప్రయాణంలో సాధించిన తొలి విజయం."

మాతృత్వం : వరం కాదు... ఒక సామాజిక బాధ్యత

తెలుగు సాహిత్యంలో ప్రాచీన కాలం నుండి మాతృత్వాన్ని ఒక గొప్ప వరంగా, స్త్రీ జన్మకు సార్థకతగా చిత్రించడం జరిగింది. పురుష కవులు స్త్రీని 'అమ్మ'గా మార్చినప్పుడు మాత్రమే ఆమెకు అత్యున్నత గౌరవాన్ని ఇచ్చారు. అయితే, స్త్రీవాద కవిత్వం ఈ పవిత్రత వెనుక ఉన్న సామాజిక రాజకీయాన్ని, స్త్రీ అనుభవించే భౌతిక, మానసిక వేదనను లోతుగా ప్రశ్నించింది.

అ) పితృస్వామ్య చట్రంలో మాతృత్వం : స్త్రీని ఒక మనిషిగా కాకుండా, 'వారసుడిని కనే యంత్రంగా'గా చూడటాన్ని స్త్రీవాద కవయిత్రులు తీవ్రంగా నిరసించారు. ముఖ్యంగా పురుష సంతానం కోసం స్త్రీపై జరిగే ఒత్తిడిని, ఆడపిల్ల అని తెలిస్తే చేసే భ్రూణ హత్యలను ఈ కవిత్వం ఎండగట్టింది. మాతృత్వం అనేది స్త్రీ వ్యక్తిగత నిర్ణయం కావాలి తప్ప, సమాజం విధించిన విధి కాకూడదని వాదించారు.

ఆ) కొండేపూడి నిర్మల గారి "లేబర్ రూమ్" - ఒక దృశ్యం: మాతృత్వం వెనుక ఉన్న భయానక

వాస్తవికతను, ఆసుపత్రి గదుల్లో స్త్రీ అనుభవించే ఏకాంత వేదనను కొండేపూడి నిర్మల గారు తన కవిత్వంలో అత్యంత అర్ధంగా చిత్రించారు.

"ప్రసవ వేదనలో నేను అరుస్తున్నప్పుడు..
బయట నా భర్త వారసుడి కోసం లెక్కలు వేసు కుంటున్నాడు.
నేను కేవలం ఒకే రక్తపు ముద్దను ప్రసవించే సాధనాన్ని మాత్రమేనా?

ఈ కవిత మాతృత్వంలోని 'దైవత్వాన్ని' పక్కన పెట్టి, అందులోని 'హింసను' మరియు సమాజం ఆశించే 'ప్రయోజనాన్ని' నిలదీసింది.

ఇ) **బాధ్యత మాతృత్వం - భారంగా మాతృత్వం :** పిల్లల పెంపకం అనేది కేవలం స్త్రీ బాధ్యత మాత్రమేనని, అందులో పురుషుడికి సంబంధం లేదన్నట్లుగా సాగే సామాజిక వ్యవస్థను ఈ కవిత్వం తప్పుబట్టింది. బిడ్డను కనడం నుండి పెంచడం వరకు ఎదురయ్యే సవాళ్లలో తండ్రి భాగస్వామ్యం లేకపోవడం వల్ల, స్త్రీ తన కెరీర్ను, తన కలలను ఎలా బలి ఇస్తుందో ఈ కవిత్వం చర్చకు పెట్టింది. మాతృత్వం అనేది స్త్రీకి ఒక 'సంకెళ్ల లాగా కాకుండా, సమాజం పట్ల ఒక 'బాధ్యత'గా ఉండాలని, దానికి కుటుంబం మరియు సమాజం సహకరించాలని కోరారు.

ఈ) **చైతన్యవంతమైన నిర్ణయం :** స్త్రీవాద కవిత్వం అందించిన అతిపెద్ద చైతన్యం ఏమిటంటే - "నిర్ణయాధికారం". ఎప్పుడు తల్లి కావాలి? అసలు తల్లి కావాలా వద్దా? అనే నిర్ణయం తీసుకునే హక్కు స్త్రీకి ఉండాలని ఈ కవిత్వం చాటిచెప్పింది. మాతృత్వాన్ని ఒక 'త్యాగం'గా చిత్రించి స్త్రీని అణచి వేయడం కంటే, ఆమెను ఒక 'వ్యక్తి'గా గుర్తించడమే మహిళా చైతన్యానికి నిదర్శనమని ఈ సాహిత్యం నిరూపించింది.

"మాతృత్వాన్ని దైవత్వం నుండి మానవత్వంలోకి తీసుకురావడమే స్త్రీవాద కవిత్వం సాధించిన గొప్ప విజయం. అది స్త్రీని ఒక బలిపశువుగా కాకుండా, సృజనాత్మక శక్తిగా గుర్తిస్తుంది."

దళిత మరియు బహుజన స్త్రీవాదం: బహుళ వివక్షపై పోరు

తెలుగు స్త్రీవాద కవిత్వ ప్రస్థానంలో 1990వ దశకం తర్వాత ఒక నూతన మలుపు చోటుచేసుకుంది. అప్పటివరకు సాగిన స్త్రీవాదం ప్రధానంగా అగ్రవర్ణ, మధ్యతరగతి మహిళల సమస్యల చుట్టూనే తిరుగు తోందనే విమర్శను దళిత, బహుజన కవయిత్రులు లేవనెత్తారు. దళిత స్త్రీ సమస్య కేవలం పితృస్వామ్యానికే పరిమితం కాలేదు; అది కులం, వర్గం మరియు లింగం అనే మూడు అంచుల వివక్షతో కూడుకున్నదని వీరు చాటిచెప్పారు.

అ) **రెండంచుల కత్తిపై ప్రయాణం :** దళిత స్త్రీవాద కవిత్వం అస్తిత్వ పోరాటాన్ని మరో కోణంలో ఆవిష్కరించింది. వీరు బయటి సమాజం నుండి కుల వివక్షను, ఇంట్లో పురుషుడి నుండి లింగ వివక్షను ఏకకాలంలో అనుభవిస్తున్నారు. ఈ 'బహుళ వివక్ష'ను ఎండగడుతూ చల్లపల్లి స్వరూపరాణి గారు రాసిన కవిత్వం తెలుగు సాహిత్యంలో ఒక సంచలనం.

"నేను మైలపడిన దేహాన్ని కాదు...
శతాబ్దాల అణిచివేతను భరించిన శక్తిని!"

అంటూ ఆమె చేసిన ప్రకటన, దళిత స్త్రీ కేవలం బాధితురాలు మాత్రమే కాదు, ఒక చైతన్యవంతమైన విప్లవ శక్తి అని నిరూపించింది.

ఆ) **శ్రమకు అంటుకున్న అంటరానితనం :** అగ్రవర్ణ స్త్రీల వంటగది పోరాటం ఒక రకమైతే, పొలాల్లోనూ, వీధుల్లోనూ శ్రమిస్తూ అంటరానితనాన్ని అనుభవిస్తున్న దళిత, బహుజన స్త్రీల వ్యథ మరొకటి. వీరి అస్తిత్వ పోరాటంలో 'గౌరవం' అనేది. ప్రధానాంశం. జ్యోతి రాణి, మల్లేశ్వరి, వి. ప్రతిమ వంటి కవయిత్రులు తమ కవిత్వంలో కుల వివక్ష వల్ల స్త్రీత్వం ఎలా అవమానాలకు గురవుతుందో శక్తివంతంగా చిత్రించారు.

ఇ) **సామాజిక గౌరవం - ఆస్తిత్వ ప్రకటన :** దళిత స్త్రీవాదం కేవలం సమానత్వం మాత్రమే కోరలేదు,

అది 'సామాజిక న్యాయం'' మరియు 'ఆత్మగౌరవం' కోసం నిలబడింది. పితృస్వామ్య వ్యవస్థలో స్త్రీలను కీలుబొమ్మలుగా చూస్తే, కుల వ్యవస్థలో దళిత స్త్రీలను అంటరానివారిగా చూశారు. ఈ రెండు ఇనుప కంచెలను ఒకేసారి ఛేదించడమే దళిత స్త్రీవాదంలోని మహిళా చైతన్యం. వీరు తమ కవిత్వంలో బుద్ధుడు, అంబేద్కర్, పూలే వంటి మహాత్ముల ఆలోచనలను పునాదులుగా చేసుకుని తమ అస్తిత్వాన్ని ప్రకటించుకున్నారు.

ఈ) **బహుజన స్త్రీల గొంతుక :** బహుజన కులాల నుండి వచ్చిన కవయిత్రులు తమ వృత్తి నైపుణ్యాన్ని, తమ సంస్కృతిని కవిత్వంలోకి తెచ్చారు. ఉత్పత్తి కులాల్లో స్త్రీలు నిర్వహించే పాత్రను గౌరవించని సమాజంపై వీరు ధ్వజమెత్తారు. శ్రమ జీవులైన మహిళల చమట చుక్కలకు అక్షర రూపం ఇచ్చి, దానికి ఒక రాజకీయ అర్థాన్ని కల్పించారు.

''దళిత మరియు బహుజన స్త్రీవాదం తెలుగు సాహిత్యంలో అస్తిత్వ పోరాటాన్ని 'కులం' అనే సామాజిక వాస్తవికతతో ముడిపెట్టి, మహిళా చైతన్యాన్ని మరింత ప్రజాస్వామీకరించింది.''

ముస్లిం మైనార్టీ స్త్రీవాదం : బురఖా వెనుక స్వరం

తెలుగు సాహిత్యంలో స్త్రీవాద ఉద్యమం విస్తరిస్తున్న క్రమంలో, ముస్లిం మహిళలు తమ సామాజిక, మత పరమైన ఆంక్షలను ధిక్కరిస్తూ తమ అస్తిత్వాన్ని చాటుకోవడం ఒక చారిత్రక అవసరంలా పరిణమించింది. ముస్లిం స్త్రీవాద కవిత్వం కేవలం పితృస్వామ్యాన్నే కాకుండా, మత మౌఢ్యాన్ని మరియు సమాజం వారిపై ఉంచిన 'ముద్రల' ను కూడా ప్రశ్నించింది.

ఆ) **బురఖా - ఒక ప్రతీక :** ముస్లిం మహిళా చైతన్యంలో 'బురఖా' లేదా 'హిజాబ్' ఒక ప్రధాన చర్చాంశమైంది. ఇది కేవలం ఒక వస్త్రం మాత్రమే కాదు, అది స్త్రీ స్వేచ్ఛను హరించే ఒక గోడగా ఈ కవిత్వం చిత్రించింది. షాజహానా వంటి కవయిత్రులు తమ కవిత్వంలో బురఖా వెనుక ఉన్న నిశ్శబ్ద రోదనను, అణిచివేయబడిన ఆశలను అత్యంత శక్తివంతంగా వినిపించారు.

"నా ముసుగు వెనుక ఉన్నది కేవలం ముఖం కాదు...
అనంతమైన ఆలోచనల సముద్రం
నా గొంతు వినిపించకుండా చేసే ఈ ముసుగును
నేడు తొలగిస్తున్నాను"

అని ప్రకటించడం ద్వారా వారు తమ భావ ప్రకటన స్వేచ్ఛను డిమాండ్ చేశారు.

ఆ) **త్రిపుల్ తలాక్ మరియు సామాజిక అభద్రత :** ముస్లిం స్త్రీవాద కవిత్వం మతపరమైన చట్టాల్లోని వివక్షను కూడా ఎండగట్టింది. తలాక్ పేరుతో స్త్రీ జీవితాన్ని రోడ్డున పడేసి పద్ధతిని, బహుభార్యాత్వాన్ని వీరు నిరసించారు. సబీహా ఫాతిమా, షహనాజ్ పాష వంటి కవయిత్రులు తమ రచనల ద్వారా ముస్లిం మహిళలకు ఉండవలసిన కనీస సామాజిక రక్షణ గురించి, గౌరవప్రదమైన జీవనం గురించి చైతన్యాన్ని రగిలించారు.

ఇ) **అస్తిత్వ ఘర్షణ :** ముస్లిం స్త్రీలు 'ముస్లిం'గా తమ మత గుర్తింపును కాపాడుకుంటూనే, 'స్త్రీ'గా తమ హక్కుల కోసం పోరాడాల్సి రావడం ఒక పెద్ద అస్తిత్వ ఘర్షణ. బయటి సమాజం నుండి ఎదురయ్యే మత వివక్షను, ఇంట్లో ఎదురయ్యే పురుషాధిక్యతను ఏకకాలంలో ఎదిరించడం వీరి కవిత్వంలోని ప్రత్యేకత. "మేము కేవలం ఓటు బ్యాంకులం కాదు, ఈ దేశ పౌరులం, ఆత్మగౌరవం ఉన్న మహిళలం " అనే స్పృహ వీరి కవిత్వంలో కనిపిస్తుంది.

ఈ) **ముస్లిం స్త్రీవాద కవిత్వం- చైతన్య కిరణం :** ఈ కవిత్వం ముస్లిం సమాజంలోని మూఢాచారాలను ప్రశ్నించడమే కాకుండా, ముస్లిం మహిళలు విద్యావంతులు కావాలని, ఆర్థికంగా ఎదగాలని పిలుపునిచ్చింది. ఈ ధోరణి వల్ల ముస్లిం మహిళల్లో తమ హక్కుల పట్ల అవగాహన పెరగడమే కాకుండా, తెలుగు సాహిత్యంలో ఒక కొత్త 'భాష' మరియు 'నుడికారం' ప్రవేశించాయి.

"బురఖా వెనుక ఉన్న మౌనాన్ని ఛేదించి, అస్తిత్వ కేకను వినిపించిన ముస్లిం మైనార్టీ కవిత్వం మహిళా చైతన్యాన్ని మరింత సమగ్రం చేసింది. ఇది కేవలం ఒక మతానికి సంబంధించినది కాదు, మానవత్వానికి సంబంధించిన పోరాటం."

ఆధునిక ధోరణులు : లఘు కవితల్లో చైతన్యం

తెలుగు సాహిత్యం నిరంతరం పరిణామం చెందుతూనే ఉంది. 1980, 90వ దశకాల్లో సుదీర్ఘమైన వచన కవితల ద్వారా వెల్లువెత్తిన స్త్రీవాద చైతన్యం, 21వ శతాబ్దపు వేగవంతమైన జీవనశైలికి అనుగుణంగా 'లఘు కవితా' రూపాలను సంతరించుకుంది. తక్కువ పదాల్లో ఎక్కువ అర్థాన్ని, పదునైన విమర్శను సంధించడం నేటి ఆధునిక ధోరణి. ముఖ్యంగా నానీలు, హైకూలు, రెక్కలు, ముక్తకాలు వంటి ప్రక్రియలు మహిళా అస్తిత్వాన్ని చాటడంలో శక్తివంతమైన ఆయుధాలుగా మారాయి.

అ) **నానీలు - సామాజిక చురకలు :** డా. ఎన్. గోపి ప్రవేశపెట్టిన 'నానీలు' ప్రక్రియ మహిళా కవయిత్రులకు ఒక వరంగా మారింది. ఇంటి పని, సామాజిక వివక్షపై కేవలం నాలుగు లైన్లలోనే అత్యంత ప్రభావవంతమైన ముగింపును ఇస్తున్నారు. "బయట ఆకాశం నీదే అంది లోపల వంటిల్లు నాదే అంది/ అత్తగారి అప్యాయత!" వంటి నానీలు కుటుంబ వ్యవస్థలోని ద్వంద్వ ప్రమాణాలను ఎండగడుతున్నాయి.

ఆ) **రెక్కలు మరియు హైకూలు - భావ సాంద్రత :** రెక్కలు వంటి ప్రక్రియల్లో స్త్రీలు తమ అంతరంగ మథనాన్ని, సమాజంలో తమకు ఎదురయ్యే అసమానతలను సూటిగా ప్రశ్నిస్తున్నారు.

" ప్రశ్నించే గొంతుకను నొక్కేయాలని చూస్తే అక్షరం ఆయుధమవుతుంది" అనే ధోరణి నేటి కవయిత్రుల్లో కనిపిస్తుంది. హైకూల ద్వారా ప్రకృతిని, స్త్రీత్వాన్ని ముడిపెడుతూనే, అస్తిత్వ స్పృహను కలిగిస్తున్నారు.

ఇ) **సామాజిక మాధ్యమాల ప్రభావం :** నేడు ఫేస్ బుక్, వాట్సాప్, ఇన్ స్టాగ్రామ్ వంటి వేదికలు మహిళా చైతన్యానికి విస్తృత ప్రచారాన్ని కల్పిస్తున్నాయి. పత్రికల కోసం వేచి చూడకుండా, తక్షణమే స్పందించే గుణం నేటి ఆధునిక స్త్రీవాద కవిత్వంలో కనిపిస్తుంది. గృహహింస నుండి కార్యాలయాల్లో వేధింపుల వరకు, ప్రతి చిన్న అంశాన్ని అక్షరబద్ధం చేస్తూ అస్తిత్వ పోరాటాన్ని నిరంతరం కొనసాగిస్తున్నారు.

ఈ) **వ్యంజకాలు మరియు ముక్తకాలు :** కేవలం రెండు లేదా మూడు పాదాల్లోనే అద్భుతమైన చైతన్యాన్ని రగిలించే 'వ్యంజకాలు' వంటి ప్రక్రియలు కూడా నేడు వాడుకలోకి వచ్చాయి. ఇవి పాఠకుల మెదడును తట్టి, మహిళల పట్ల ఉన్న పాత ఆలోచనా ధోరణులను ప్రశ్నిస్తున్నాయి. సృజనాత్మకతకు అద్దం పడుతూనే, సామాజిక బాధ్యతను ఇవి విస్మరించలేదు.

"రూపం చిన్నదైనా, రగిలించే చైతన్యం మాత్రం అనంతం. లఘు కవితా ప్రక్రియలు స్త్రీవాద కవిత్వానికి కొత్త ఊపిరిని పోస్తూ, మహిళా అస్తిత్వ పోరాటాన్ని సామాన్యుల చేరువకు తీసుకెళ్లాయి."

ముగింపు: మహిళా చైతన్యం నేటి స్థితిగతులు, సమ సమాజం

తెలుగు స్త్రీవాద కవిత్వం 1980వ దశకంలో ఒక చిన్న గొంతుకగా మొదలై, నేడు ఒక మహా ప్రవాహంగా మారింది. ఈ ప్రయాణం కేవలం పదాల కూర్పుకే పరిమితం కాలేదు; అది ఒక సామాజిక వ్యవస్థను, ఆలోచనా ధోరణిని మార్చగలిగింది. అస్తిత్వ పోరాటం అనేది ఇప్పుడు కేవలం పుస్తకాలలో కాకుండా, మహిళల దైనందిన జీవితంలో ఒక భాగంగా మారింది.

అ) **నేటి స్థితిగతులు - సాహిత్యం తెచ్చిన మార్పు :** అనాడు కవయిత్రులు తమ కవిత్వంలో ప్రశ్నించిన వంటగది దోపిడీ, శరీర రాజకీయం, మాతృత్వపు ఒత్తిడి వంటి అంశాలపై నేడు మహిళల్లో సంపూర్ణ అవగాహన ఏర్పడింది. సాహిత్యం సృష్టించిన చైతన్య ఫలితంగానే:

- మహిళలు అన్ని రంగాల్లో (సాంకేతిక, రాజకీయ, ఆర్థిక) తమ ఉనికిని చాటుకుంటున్నారు.
- గృహహింస, కార్యాలయాల్లో వేధింపులు, ఆస్తి హక్కు వంటి అంశాల్లో చట్టపరమైన రక్షణలు, వాటిపై చైతన్యం పెరిగింది.
- 'స్త్రీవాదం' అంటే పురుష ద్వేషం కాదు, అది తమ హక్కుల కోసం చేసి న్యాయమైన పోరాటమని సమాజం గుర్తించడం మొదలుపెట్టింది.

ఆ) సమ సమాజం - ఒక ఆశయం : స్త్రీవాద కవిత్వం యొక్క అంతిమ లక్ష్యం స్త్రీ పురుషుల మధ్య ఉన్న అసమానతలను తొలగించి, ఒక 'సమ సమాజం' నిర్మించడం. స్త్రీలు పురుషుల కంటే గొప్పవారని నిరూపించడం కాదు, స్త్రీలను కూడా మనుషులుగా గుర్తించి, సమాన అవకాశాలు, గౌరవం కల్పించే వ్యవస్థను సాధించడమే ఈ చైతన్య ప్రస్థానం. స్త్రీ విముక్తి చెందిన రోజే పురుషుడు కూడా పితృస్వామ్య అహంకారం నుండి విముక్తి పొందుతాడని, తద్వారా మానవీయ విలువల కలిగిన సమాజం ఏర్పడుతుందని ఈ కవిత్వం ఆశిస్తోంది.

ఇ) సారాంశం : తెలుగు సాహిత్యం మహిళా చైతన్యాన్ని వెలిగించడంలో ఒక దివిటీలా పనిచేసింది. మొల్ల నుండి ఓల్గా వరకు, రంగాజమ్మ నుండి కొండేపూడి నిర్మల వరకు సాగిన ఈ అస్తిత్వ పోరాటం అక్షర రూపం దాల్చి సమాజ గమనాన్ని మార్చింది. ఆధునిక ధోరణులతో సాగుతున్న నేటి సాహిత్యం, మహిళా అస్తిత్వాన్ని మరింత సుస్థిరం చేస్తూనే ఉంది.

ఈ) ముగింపు వాక్యం : "అస్తిత్వ పోరాటం అనేది తనను తాను గుర్తించుకోవడంతో మొదలై, సమాజంలో సమాన వాటా పొందే వరకు సాగుతుంది. చైతన్యవంతురాలైన మహిళ సమ సమాజ నిర్మాణానికి పునాది. తెలుగు స్త్రీవాద కవిత్వం అందించిన ఈ స్ఫూర్తి భవిష్యత్ తరాలకు వెలుగుబాటగా నిలుస్తుంది."

ఆధార గ్రంథాలు :

1. నీలి మేఘాలు (స్త్రీవాద కవిత్వ సంకలనం) సంపాదకత్వం: ఓల్గా, వసంత కన్నభిరాన్, కల్పనా కన్నభిరాన్; స్త్రీ శక్తి ప్రచురణలు, 1993.
2. అస్తిత్వ వికాసం (వ్యాస సంకలనం) ఓల్గా: అస్తిత్వ ప్రచురణలు,
3. నడిచే గాయాలు (కవితా సంపుటి) - కొండేపూడి నిర్మల; వివిధ ప్రచురణలు.
4. స్త్రీవాద కవిత్వం: సామాజిక విశ్లేషణ డా. జి. లక్ష్మీనరసయ్య ; దళిత బహుజన ప్రచురణలు.
5. మొల్ల నుండి నేటి వరకు తెలుగు కవయిత్రులు - పొన్నా లీలావతమ్మ ; ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమీ
6. తెలుగు సాహిత్యంలో మహిళా చైతన్యం - డా. ముక్తేవి భారతి; వివిధ సాహిత్య వ్యాసాల సమాహారం.
7. చీకటి సూర్యుడు (దళిత స్త్రీవాద కవిత్వం) - డా. చల్లపల్లి స్వరూపరాణి.
8. ముస్లిం స్త్రీవాద కవిత్వం (సఖాబ్/సలామ్) షాజహానా, స్కైబాబా, వివిధ ముస్లిం వాద ప్రచురణలు.

★★★

Vol. 23 | Spl. Issue 03 | March 2026 | BHAVAVEENA | ISSN No. : 2456-4702 | RNI No. APTEL/2003/12253

RNI No. APTEL/2003/12253 | Reffered Journal & Peer Reviewed Journals | ISSN No. 2456-4702

భావవీణ

కళలు, సాహిత్య, సాంస్కృతిక భాషాధ్యయన పత్రిక

BHAVA VEENA

Journal of Arts, Literary, Culture & Language Study

ఓల్గా స్వేచ్ఛ నవలలోని మహిళ చైతన్యం

- కె. పావని

తెలుగు ద్వితీయ సంవత్సరం, శాతవాహన విశ్వవిద్యాలయం కరీంనగర్.

ఆధునిక సాహిత్యంలో మహిళా చైతన్యం :

సాహిత్యం సమాజానికి అద్ధం వంటిది. సమాజంలో స్త్రీ ఒక ఆలోచనతో వారి భావాలతో మార్పులను తీసుకు రావడానికి దోహదం చేసే చైతన్యవంతురాలు. సాహిత్యంలో స్త్రీ భావాలు ప్రతిబింబిస్తాయి. ముఖ్యంగా ఆధునిక కాలంలో కనిపించే మార్పుల్లో మహిళా చైతన్యం ఒక ప్రధాన పాత్ర పోషిస్తుంది. గతంలో సాహిత్యంలో మహిళా పాత్ర పరిమితిగా ఉండడం వంటివి కనిపించేవి. మహిళను ప్రాచీన కాలంలో ఒక భోగ వస్తువుగా వంటింటి కుందేళ్ళుగా చూసేవారు. ఇంటి నుండి బయటకు రాకుండా ఉంచేవారు. కానీ ఆధునిక సాహిత్య కాలంలో ఆమె స్వతంత్ర వ్యక్తిత్వంతో, ఆలోచన విధానంలో, స్వేచ్ఛతో హక్కుల కోసం పోరాడే వ్యక్తిగా కనిపిస్తుంది.

మహిళ తన స్థితి, హక్కులు, సామాజిక అసమానతల గురించి అవగాహన పొందడం మరియు సమానత్వం కోసం ప్రయత్నించడం మహిళా చైతన్యం అని అంటారు. ఇది కేవలం మహిళల సమస్యల గురించి కాకుండా సమాజంలో మానవ హక్కుల కోసం జరిగే ఆలోచన ఉద్యమం. మహిళ అంటే ఆధునిక యుగంలో అన్నింటిలో పురుషులతో సమానంగా రాణిస్తుంది ఆధునిక కాలంలో స్త్రీ చైతన్యంలో అన్నింటిలో తనకంటూ ఒక స్థానం సంపాదించుకుంటుంది మహిళ.

మహిళా చైతన్యం గురించి సాహిత్యంలో తీసుకున్నట్లు అయితే చాలా వరకు ప్రాచీన కాలం కంటే ఈ ఆధునిక కాలంలో చాలా వరకు మార్పులు వచ్చాయి. ఉదా హరణకు రామాయణంలో చూసినట్లయితే సీతామాత రామునితో అరణ్యవాసానికి వెళుతుంది పతివెంటే సతి నడవాలి అన్న నినాదం రుజువు చేస్తుంది. ఇది ప్రాచీన కాలంలోని నినాదం. కానీ ఆధునిక కాలంలో భర్తకు కష్టం వస్తే భార్య ముందుండి భర్తకు ధైర్యాన్నిచ్చి తనకు వీలైనంత భర్తకు సహాయం చేసి భర్తను ముందుకు తీసుకువెళ్లడానికి చేయూతనందిస్తుంది.

19వ శతాబ్దం చివరి నుండి 20వ శతాబ్దంలో సామాజిక సంస్కరణ ఉద్యమాలు విద్యాభివృద్ధి ప్రభావం వల్ల సాహిత్యంలో కొత్త భావాలు వచ్చాయి. మహిళా విద్య పెరగడంతో వారు రచనల ద్వారా తమ అనుభవాలను వ్యక్తపరచడం ప్రారంభించారు.

విద్య వలన స్త్రీలు రచయితలుగా ఎదిగి తనకు ఉన్న సమస్యలను, హక్కులను, తనదైన పద్ధతిలో సమాజానికి తెలిసేలా రచనలు సాగించారు కవిత్వంలో, నవలలో, కథలలో, వ్యాసాలలో వారి చైతన్యాన్ని వారే చాటి చెప్పారు. ఇలా చేయడం వలన అందరూ మహిళలు చెప్పుకోలేనిది కొందరు కొందరు చెప్పి అందరికీ చేయూత నందించారు వారు చేసిన రచనలు చదవడం వలన

అందరిలో మార్పుకు ఒక పునాదిలా మారినాయి వారి రచనలు. ఇలా రచనలు చేస్తున్న సమయంలో స్త్రీ వాదం, స్త్రీ చైతన్యం మొదలైన రచనలు ఎక్కువ మోతాదులో వెలువడ్డాయి.

ఆధునిక సాహిత్యంలో మహిళల స్థానం:-ప్రాచీన సాహిత్యంలో మహిళల పాత్రను తల్లిగా, భార్యగా, కూతురుగా, కోడలిగా, అత్తగా అన్నింటిలో ఏకతాటిగా ఉండేది. ముఖ్యంగా పతివ్రత అనే పాత్రకి పరిమిత మైందిగా చూపేవారు. ఆధునిక సాహిత్యంలో మహిళల పాత్రను ఇలా తీర్చిదిద్దారు. తాను ఒక స్వతంత్ర వ్యక్తిగా ఆలోచించి మనిషిగా పురుషునితో సమానమైన వ్యక్తిగా మానవహక్కులు కోరుకునే వ్యక్తిగా చితించబడింది.

మహిళా చైతన్యానికి కారణాలు :

ఈ ఆధునిక సాహిత్య కాలంలో మహిళా చైతన్యం పెరగడానికి కొన్ని ముఖ్య కారణాలు ఉన్నాయి.

1. మహిళ విద్యాభివృద్ధి
2. సామాజిక సంస్కరణ ఉద్యమాలు
3. ప్రాచార్య సాహిత్య ప్రభావం
4. స్త్రీవాదం
5. స్త్రీ హక్కులు
6. స్త్రీలకు స్వేచ్ఛ
7. స్వతంత్ర ప్రభావం

ఇలా అనేక విషయాలలో స్త్రీల యొక్క పాత్ర ఆధునిక సాహిత్య యుగంలో గొప్పగా చిత్రికరించారు రచయితలు. తెలుగు సాహిత్యంలో అనేక రచయితలు మహిళా సమస్యలను ప్రతిబింబించారు. వాటి ద్వారనైనా సమాజంలో కొంతవరకు మహిళలపై వారి సమస్యలపై చైతన్యం కలగడానికి దోహదం చేస్తారు. అని ముఖ్య ఉద్దేశంగా భావించారు.

ఇందులో ముఖ్యమైన అంశాలు :

1. బాల్య వివాహం వ్యతిరేకత
2. విధవల సమస్యలు
3. మహిళల విద్య అవసరం
4. కుటుంబంలో సమాన హక్కులు
5. ఆర్థిక స్వాతంత్ర్యం

ఆధునిక కథలు, నవలలు, కవిత్వం ద్వారా మహిళల అంతర్మథనం, భావోద్వేగాలు, సమానతలతో పోరాటం స్పష్టంగా కనిపిస్తుంది.మహిళా రచయితలు తమ అనుభవాలను స్పష్టంగా, స్వయంగా వ్యక్తపరచడం ద్వారా మహిళా చైతన్యాన్ని బలపరిచారు.

వారి రచనలు ముఖ్యమైన అంశాలు :

- స్వీయ గౌరవం
- స్వేచ్ఛ
- రోజువారి సమస్యలు
- హక్కులు
- వ్యక్తి వికాసం ప్రధాన అంశాలుగా కనిపిస్తాయి. స్త్రీవాదం గురించి స్త్రీల గురించి మహిళ ఒక మహాశక్తి వంటిది. అని ఓల్గా తన రచనల్లో చక్కగా చూపినారు.

ఆధునిక సాహిత్యంలో నవలలు మహిళ పాత్ర :

ఓల్గా స్వేచ్ఛ నవలలో స్త్రీ గురించి చాలావరకు పూర్తిగా తెలుస్తుంది. ఈ నవల 1987లో ప్రచురితమైంది. ఈ నవలలో స్త్రీ స్వేచ్ఛ అనచివేత మరియు ఆత్మగౌరవంపై తీవ్ర చర్చలకు దారి తీసిన సంచలనాత్మక రచన. ఇందులో ముఖ్యమైన పాత్ర అరుణ.అరుణ పాత్ర ద్వారా స్త్రీ తన ఉనికిని, అవసరాలను గురించి స్వతంత్ర వ్యక్తిత్వంతో జీవించడానికి చేసే ప్రయత్నాన్ని వివరిస్తుంది.

ఈ అరుణ ఒక పేద కుటుంబంలో పుట్టిన స్త్రీ. తనకు కుటుంబంలో స్వేచ్ఛ లేదు. ఆర్థిక స్థితిగతులు బాగోలేక తన తల్లి, అన్న తనను చదువు మాన్పించాలని అనుకుంటారు. కానీ అరుణ తను ఎలాగైనా చదువుకొని ముందుకు రావాలని పట్టు వదలని విక్రమార్కుడి వలే చదువు పూర్తి చేసి ప్రకాశంని తన తల్లిదండ్రులకు నచ్చకున్నా తనకు నచ్చినాడు అని వివాహం చేసుకుంటుంది.తనకు ఇంట్లో లేని స్వేచ్ఛ ప్రకాశం వద్ద ఉంటుంది.అని భ్రమలో ఉండి వివాహం చేసుకుంటుంది. వివాహం అనంతరం కొద్ది రోజులకు అరుణ పాఠశాలకు ఉపాధ్యాయురాలిగా వెళుతుంది. ఇలా వెళ్తున్న కొద్ది... కొన్ని మీటింగులు అంటూ రోజురోజుకు పాఠశాల నుండి ఇంటికి తిరిగి వచ్చే సమయం ఆరు గంటలు దాటుతుంది.

ఇది ప్రకాశంకు నచ్చదు. ఇలా మీటింగులు, క్లాసులు అని రోజురోజుకు ఆలస్యం అయితే ఎలా అని ప్రశ్నిస్తాడు నిలదీస్తాడు అరుణను ప్రకాశం. అరుణ నేనేమన్నా కావాలని సమయం వృధా చేస్తున్నానా అంటూ తనకు సమాధానం ఇచ్చి నన్ను కట్టిపడేయాలని అనుకుంటున్నావా నాకు స్వేచ్ఛ ఉంది. నీకు లాగానే నేను కూడా సంపాదిస్తున్న ఇంట్లోకి నువ్వు ఇచ్చే డబ్బు లాగానే నేను కూడా నీకు సమానంగా ఇస్తున్నాను. నాకు స్వేచ్ఛ, ఆత్మ గౌరవం, నాకంటూ ఒక గౌరవం ఉండాలి అంటూ ప్రకాశంకు వ్యతిరేకంగా తనకు ఒక విలువ కావాలి అంటూ తన కూతుర్ని వదిలి తన విలువను వెతుక్కుంటూ వెళ్తుంది.

తన ఆలోచనలలో వార్త పత్రికలో రచనలు చేస్తూ అందరికీ చేయూతనిస్తూ తనకు నచ్చిన పని చేస్తూ స్త్రీలకు అండగా నిలుస్తుంది. అరుణ అనే ఈ పాత్ర ద్వారా ఓల్గా గారు తనదైన రచనలలో స్త్రీ అంటే ఒక వస్తువు కాదు ఒక చైతన్యవంతమైన వ్యక్తి, తన భావాలను వ్యక్తం చేసి అందరికీ ఆదర్శంగా నిలిచే ఆయుధం లాగా ఉంటుంది. ఆధునిక సాహిత్యంలో మహిళ అని చెప్పడం జరిగింది.

స్వేచ్ఛా నవలలో మహిళ పాత్ర :

1. కుటుంబ బంధనాలకు వ్యతిరేకంగా నిలబడే వ్యక్తి
2. ఉద్యోగ జీవితం గడిపే వ్యక్తి
3. తన నిర్ణయాలను తానే తీసుకునే వ్యక్తిగా రూపు దిద్దుకుంది

ఇది సమాజంలో మహిళా స్థానంమారుతుందానడానికి సూచన.

మహిళా చైతన్య ప్రభావం :

- సమాజంలో సమానత్వ భావన పెరిగింది.
- మహిళల విద్యాభివృద్ధి జరిగింది.
- ఉద్యోగ అవకాశాలు పెరిగాయి.
- కుటుంబ వ్యవస్థలలో మార్పులు వచ్చాయి.

సాహిత్యం ఈ మార్పులకు ప్రేరణగా నిలిచింది. మహిళా చైతన్యంతో రచనలు చేయడం వలన ముఖ్యంగా ఇంటిలో, ఆఫీసుల్లో ఉద్యోగం చేసే మహిళలు పడే కష్టాలు వాటిని వారు ఎలా ఎదిరిస్తున్నారు అనే విషయం స్త్రీ చైతన్య రచనల్లో కళ్లకు కట్టినట్టు తెలుస్తుంది. కొంతమంది మహిళల చైతన్య సాహిత్యం కుటుంబ విలువలను తగ్గిస్తుందని భావించిన వాస్తవానికి అది సమానత్వాన్ని స్థాపించడానికి జరిగిన సహజమైన పరిణామం అని చెప్పుకోవచ్చు.

ముగింపు :

ఆధునిక సాహిత్యంలో మహిళా చైతన్యం ఒక విప్లవాత్మక మార్పు. మహిళలను బలహీనురాలిగా కాకుండా సమాజ నిర్మాణంలో సమాన భాగస్వామిగా చూపించడం ఆధునిక సాహిత్య ప్రత్యేకత. ఈ చైతన్యం సమసమాజ నిర్మాణానికి మార్గదర్శకంగా నిలుస్తుంది. మహిళా చైతన్యం అనేది వారి కోసం వారు చేసుకుంటున్న ఒక ఉద్యమం వారికున్న అంతర్గత భావాలను తెలుపుతూ తన సమస్యలను వెల్లడిస్తుంది మహిళ. ఉదయం లేవగానే పిల్లలకు తల్లిగా, భర్తకు భార్యగా, అత్తమామలకు కూడలిగా, అన్ని సేవలు చేస్తూ తనకు తాను గౌరవంగా ఒక మహాశక్తిగా నిలుస్తుంది. తాను లేనిదే ఎవరికి ఏమి తోచదు. ఇంట్లో ఒకరోజు మహిళ సమయానికి నిద్ర లేవకపోతే ఏ పని సమయానికి కాదు. అలాంటి మహిళను చిన్నచూపు చూసే వారికి స్త్రీ విలువ, స్త్రీ యొక్క భావాల విలువ ఎప్పటికీ అర్థం కాదు.

★★★

Vol. 23 | Spl. Issue 03 | March 2026 | BHAVAVEENA | ISSN No. : 2456-4702 | RNI No. APTEL/2003/12253

RNI No. APTEL/2003/12253 | Reffered Journal & Peer Reviewed Journals | ISSN No. 2456-4702

భావవీణ

కళలు, సాహిత్య, సాంస్కృతిక భాషాధ్యయన పత్రిక

BHAVA VEENA

Journal of Arts, Literary, Culture & Language Study

రామాయణంలో సీత పాత్ర మరియు ప్రాముఖ్యత

- నక్క శ్రీకర్

విద్యార్థి, ఊటూరు, మానకొండూర్ మండలం, కరీంనగర్ జిల్లా.

పరిచయం

భారతీయ సంస్కృతిలో "రామాయణం" ఒక మహత్తర ఇతిహాసం. ఇది కేవలం కథ మాత్రమే కాదు; మన జీవితాన్ని ఎలా నడపాలో చూపించే మార్గదర్శకం. ఈ ఇతిహాసంలో ప్రతి పాత్ర గొప్పది అయినప్పటికీ, సీతా దేవి పాత్ర అత్యంత పవిత్రమైనది, ఆదర్శప్రాయమైనది. సీత పాత్రలో ధర్మం, సహనం, ప్రేమ, త్యాగం, ఆత్మ గౌరవం, ఇవి అన్నీ సమన్వయంగా కనిపిస్తాయి.

సీత జననం - ఆధ్యాత్మికతకు ప్రతీక

సీత భూమి పుత్రికగా పుట్టింది. జనక మహారాజు యజ్ఞం చేస్తుండగా భూమి నుండి లభించింది.

ముఖ్యాంశాలు :

అయోనిజ జననం (సహజ జననం కాదు). ప్రకృతి యొక్క పవిత్రతకు ప్రతీక. భూమిలాంటి సహనశక్తి దీని ద్వారా సీతను "దేవీ స్వరూపం"గా భావిస్తారు. బాల్య గుణాలు : సీత చిన్నప్పటి నుంచే గొప్ప లక్షణాలను ప్రదర్శించింది.వినయం, కరుణ, భక్తి, ధైర్యం, ఆమె సాధారణ రాజకుమార్తె కాదు - ఒక ఆదర్శ మహిళగా ఎదిగింది.

స్వయంవరం - ధర్మానికి సంకేతం. సీత స్వయంవరం గొప్ప ఘట్టం.శివుడి ధనుస్సును ఎత్తి విరిచిన వాడే సీతను పెళ్లి చేసుకోవాలి. శ్రీరాముడు ఆ ధనుస్సును విరిచాడు. బలం + ధర్మం కలిగిన వాడే సరైన భాగస్వామి సీత యొక్క నిర్ణయం గౌరవప్రదం.దాంపత్య జీవితం, సీత-రాముల దాంపత్యం ఒక ఆదర్శం. పరస్పర గౌరవం, ప్రేమ, నిబద్ధత, ఇది ''ఆదర్శ కుటుంబం''కు ఉదాహరణ.

వనవాసం - సీత త్యాగం రాముడు వనవాసానికి వెళ్ళినప్పుడు. సీత రాజభోగాలను వదిలి అడవికి వెళ్లింది. సుఖం కంటే భర్తతో ఉండటానికే ప్రాముఖ్యత ఇచ్చింది. పతివ్రత ధర్మం, త్యాగం, ధైర్యం, అరణ్య జీవితం అడవిలో జీవితం చాలా కష్టమైనది. ప్రకృతితో కలిసి పోయింది. కష్టాలను తట్టుకుంది, భయాన్ని జయించింది. ఇది ఆమె ధైర్యానికి ఉదాహరణ.

మాయమృగం ఘటన - మారీచుడు మాయమృగంగా వచ్చాడు. సీత ఆ మృగాన్ని కోరింది, రాముడు దానిని పట్టుకోవడానికి వెళ్లాడు, ఇది కథలో కీలక మలుపు. సీతను రావణుడు మాయతో అపహరించాడు. లంకకు తీసుకెళ్లడం, అశోకవాటికలో నిర్బంధం. ఇది సీత సహనాన్ని పరీక్షించింది. అశోకవాటికలో సీత స్థైర్యం. సీత అశోకవాటికలో :

రావణుడి బెదిరింపులను తిరస్కరించింది. తన పతివ్రత ధర్మాన్ని కాపాడింది. ఆశను కోల్పోలేదు.ఇది అత్యంత గొప్ప దశ. హనుమంతునితో భేటీ. హను

మంతుడు సీతను కలవడం భావోద్వేగ ఘట్టం.. రాముని ఉంగరం ఇచ్చాడు.సీతకు ధైర్యం ఇచ్చాడు. సీత తన చీరలోని ఆభరణాన్ని ఇచ్చింది. యుద్ధం మరియు విమోచనం.రాముడు రావణుడిని సంహరించాడు.. సీతను విముక్తి చేశాడు. కానీ పరీక్ష ఇంకా మిగిలింది

అగ్నిపరీక్ష - వివాదాస్పద ఘట్టం

సీత తన పవిత్రతను నిరూపించడానికి అగ్నిపరీక్ష చేసింది. సమాజం కోసం చేసిన త్యాగం, తన నిజాయితీకి నిదర్శనం. ఇది ఇప్పటికీ చర్చకు కారణం. అయోధ్య జీవితం, సీత అయోధ్యకు వచ్చింది కానీ ప్రజల అనుమానాలు ఆమెపై అపవాదులు, ఇది సమాజపు దృక్పథాన్ని చూపిస్తుంది. వనవాసం (రెండవది) సీతను మళ్లీ అడవికి పంపించారు. గర్భిణీ అయినప్పటికీ ఆమె సహనంతో స్వీకరించింది.

వాల్మీకి ఆశ్రమం

సీత వాల్మీకి ఆశ్రమంలో : శాంతంగా జీవించింది.తన బాధలను భరించింది. లవకుశుల పెంపకం సీత తన పిల్లలను ధర్మబద్ధంగా పెంచింది.. విద్యాబుద్ధులు నేర్పింది. ఇది "మాతృత్వం"కు ఉదాహరణ. చివరి త్యాగం సీత చివరగా భూమిలో లీనమైంది. తన గౌరవాన్ని కాపాడుకుంది. ఇది అత్యున్నత ఆత్మగౌరవం

సీత పాత్ర లక్షణాల విశ్లేషణ

పతివ్రత ధర్మం సీత తన భర్త పట్ల అపారమైన భక్తి చూపింది. సహనం అన్ని కష్టాలను ఓర్చుకుంది.ధైర్యం లంకలో కూడా తలవంచలేదు. ఆత్మగౌరవం చివరిదాకా తన గౌరవాన్ని కాపాడింది. త్యాగం తన సుఖాన్ని వదిలి ఇతరుల కోసం జీవించింది. ఆధునిక కాలంలో సీత పాత్ర ప్రాముఖ్యత ఇప్పటికీ సీత పాత్ర చాలా ప్రాముఖ్యత కలిగినది.

నేర్చుకోవాల్సిన పాఠాలు

కష్టాల్లో ధైర్యం. కుటుంబ విలువలు. ఆత్మగౌరవం. సహనం. సీత పాత్రపై విమర్శాత్మక దృష్టి కొన్ని ప్రశ్నలు: అగ్నిపరీక్ష అవసరమా వనవాసం న్యాయమా కాలానికి అనుగుణంగా నిర్ణయాలు సమాజపు ఒత్తిడి. సీత - ఒక ఆదర్శ మహిళ సీత కేవలం పాత్ర కాదు : ఒక తల్లి. ఒక భార్య. ఒక ధర్మపరురాలు. ఒక శక్తి స్వరూపిణి.

ముగింపు:

రామాయణంలో సీత పాత్ర అత్యంత గొప్పది. ఆమె జీవితం మనకు ఎన్నో పాఠాలు నేర్పుతుంది : కష్టాల్లో నిలబడటం. ధర్మాన్ని పాటించడం. ఆత్మగౌరవాన్ని కాపాడుకోవడం. సీత ఒక స్త్రీ కాదు - ఒక ఆదర్శం.

★★★

Vol. 23 | Spl. Issue 03 | March 2026 | BHAVAVEENA | ISSN No. : 2456-4702 | RNI No. APTEL/2003/12253

RNI No. APTEL/2003/12253 | Reffered Journal & Peer Reviewed Journals | ISSN No. 2456-4702

భావవీణ

కళలు, సాహిత్య, సాంస్కృతిక భాషాధ్యయన పత్రిక

BHAVA VEENA

Journal of Arts, Literary, Culture & Language Study

నీలి మేఘాలు -- మహిళా చైతన్యం

- శ్రీ వేరి

రచయిత, హైదరాబాద్.

ఉపోద్ఘాతం :

సామాజికంగా, ఆర్థికంగా, రాజకీయంగా స్త్రీలకు ఎదురవుతున్న అణచివేతను నిరసిస్తూ, వారి సమానత్వం మరియు అస్తిత్వం కోసం రాసిన కవిత్వాన్ని స్త్రీవాద కవిత్వం అంటారు. సమాజంలో పురుషాధిక్యత వల్ల స్త్రీలు ఎలా నష్టపోతున్నారో ఈ కవిత్వం ప్రశ్నిస్తుంది. శరీర రాజకీయం, శ్రమదోపిడి, అస్తిత్వం మొదలగు అంశాలను స్పృశిస్తూ రాసిన కవిత్వమే స్త్రీవాద కవిత్వం. స్త్రీవాద కవిత్వం అంటే కేవలం పురుషులపై చేసే పోరాటం కాదు; అది ఒక మానవతావాదం. స్త్రీని ఒక మనిషిగా గుర్తించ మని కోరే అక్షర సత్యం.

ఉద్దేశ్యం :

''నీలి మేఘాలు'' కవితా సంపుటిలో ప్రముఖ కవయిత్రులు ఓల్గా, జయప్రభ, కొండేపూడి నిర్మల, వసంత కన్నబిరాన్, విమల, శిలాలోలిత మొదలైనవారు రాసిన కవితలు పొందుపరచబడినవి.

ఇది కేవలం ఒక పుస్తకం కాదు, తెలుగు సాహిత్యంలో ఒక చారిత్రక అవసరం. 1993లో వెలువడిన ఈ సంక లనంలో దాదాపు 30 మందికి పైగా కవయిత్రుల కవిత లున్నాయి. స్త్రీవాద కవిత్వంలో అత్యంత కీలకమైన సంకలనం. స్త్రీ శరీరంపై పురుష సమాజం విధించిన ఆంక్షలను, పితృస్వామ్య నియమాలను ఈ కవయిత్రులు ధైర్యంగా ప్రశ్నించారు. ప్రసవ వేదన, బహిష్టు, శారీరక హింస వంటి అంశాలను అత్యంత పదునైన భాషలో చిత్రించారు.

కవితల విశ్లేషణ :

శ్రీమతి కొండేపూడి నిర్మల :

శ్రీమతి కొండేపూడి నిర్మల గారు ఆధునిక తెలుగు సాహిత్యంలో, ముఖ్యంగా స్త్రీవాద కవిత్వంలో అత్యంత విశిష్టమైన ముద్ర వేసిన కవయిత్రి. ఆమె చేసిన సాహిత్య కృషికి గానూ ఉమ్మడిశెట్టి సాహితీ అవార్డు మరియు ఫ్రీవర్స్ ఫ్రంట్ వంటి ప్రతిష్టాత్మక పురస్కారాలు లభిం చాయి.

హృదయానికి బహువచనం :

కొండేపూడి నిర్మల గారి "హృదయానికి బహువచనం" అనే కవితా సంపుటి తెలుగు స్త్రీవాద సాహిత్యంలో ఒక విశిష్టమైన స్థానాన్ని కలిగి ఉంది. ఆమె రాసిన "నడిచే గాయాలు" తర్వాత వచ్చిన ఈ రచన, స్త్రీ అనుభూతులను మరింత లోతుగా, తాత్విక కోణంలో ఆవిష్కరిస్తుంది.

"మరీ అంత హఠాత్తుగా కాదు గాని,
చాప కింద నీరు 12 ఏళ్ళ వయసు, చెప్పకుండానే వస్తాయి. శరీరం పొడుగెక్కి నునుపెక్కి గాజుకుప్పెలా పారదర్శకమైన చోట కేంద్రీకరించిన దిగుల్లా,
కలుగులో చిట్టెలుకలాంటి గుబుల్లా

తలవంచి చూపుని ఆరేసినచోట, ఆశ్చర్యార్థకంలా పుట్టి....."

అనే కవితలో మార్పు అనేది ఒకే రోజులో రాదని, అది నిశ్శబ్దంగా, అడుగు అడుగునా జరుగుతుందని నిర్మల గారు తెలియజేశారు. సమాజం తనపై రుద్దిన ముసుగులను ఒక్కొక్కటిగా తొలగించుకుంటూ, తన అసలు రూపాన్ని గుర్తించడమే కవిత యొక్క అర్థం.

రహస్తంత్రి :

నిర్మల గారి "రహస్తంత్రి" కవిత స్త్రీవాద సాహిత్యంలో అతి సున్నితమైన, తాత్వికత కలిగిన కవిత. స్త్రీ పడే కష్టం లేదా ఆమె త్యాగం అందరికీ కనిపిస్తుంది కానీ, ఆ ప్రక్రియలో ఆమె కోల్పోతున్న "అస్తిత్వం" ఎవరికీ అర్థం కాదు.

"నాకు మాత్రమే పరిచితమైన లిపి రహస్యంలా
పసిదనం ఫ్రాక్ మీద చదివినప్పుడు
కళ్ళు మోసగిస్తాయనే భ్రమలోని తీపి మెలకువతో
విరిగి తెల్లబోయిన వర్ణార్ణవాన్నై... "

అనే కవితలో స్త్రీ బాధ్యతల ప్రపంచంలోకి రాకముందు తను ఎంత స్వేచ్ఛగా ఉండేదో, తన కలలు ఎలా ఉండేవో ఆ ఫ్రాక్ గుర్తుచేస్తుంది. "పసిదనం ఫ్రాక్" లాంటి చిన్న చిన్న వస్తువులను కవితా ప్రమాణాలుగా తీసుకుని స్త్రీ మనసులోని భావాలను యదేచ్ఛగా తన కవితల ద్వారా తెలియజేశారు.

కొండేపూడి నిర్మల గారి "తెల్లారకట్టల కివతల, లేబర్ రూమ్ ఆక్వేరియం, మరణ వాంగ్మూలం, నడిచే గాయాలు, బాధా సప్త నది, స్లీపింగ్ పార్ట్నర్" వంటి కవితల్లో స్త్రీ అనుభవించే శారీరక, మానసిక వేదనలు కేవలం కన్నీళ్లుగా కాకుండా, వ్యవస్థను ప్రశ్నించే ఆయుధాలుగా మారతాయి. నిర్మల గారి కవిత్వం కేవలం ఆవేదన కాదు, అది ఒక సామాజిక విశ్లేషణ.

ఓల్గా :

శ్రీమతి ఓల్గా (పి. లలిత కుమారి) గారు ఆధునిక తెలుగు సాహిత్యంలో అత్యంత ప్రభావవంతమైన రచయిత్రి, స్త్రీవాద సిద్ధాంతకర్త మరియు సామాజిక కార్యకర్త. స్త్రీల అస్తిత్వం, స్వేచ్ఛ మరియు ఆత్మగౌరవం చుట్టూ ఆమె రచనలు విప్లవాత్మకమైన చర్చను లేవనెత్తాయి. కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు, ఆమె రాసిన 'విముక్త' కథా సంపుటికి గాను, నంది అవార్డు, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం నుంచి 'తోడు' అనే కథకు ఉత్తమ కథా రచయిత్రిగాను,

తెలుగు విశ్వవిద్యాలయం పురస్కారం ఉత్తమ స్త్రీ రచయిత్రి విభాగంలోను పొందారు.

అద్వైతం :

ఓల్గా రచించిన "అద్వైతం" కవిత పాతకాలపు భావజాలంపై ఒక తిరుగుబాటు. స్త్రీ కేవలం ఒకరి ఇల్లాలో, ప్రేయసో మాత్రమే కాదు, ఆమెకు ఒక స్వతంత్ర వ్యక్తిత్వం ఉందని ఈ కవిత చాటిచెబుతుంది.

"ఆనందాన్ని గురించి రాయలేను
ఆనందంగా ఉందో లేదో మాత్రం చెప్పగలను
తనువు వెన్నెలై వెన్నపూసై
పూల పరాగమై చివరికి హరివిల్లు అయింది
పావురాయి రెక్కల స్వేచ్ఛగా తేలికగా ఎగురుతూ
నిరంతర చలనంతో ముద్రలు వేస్తూ..."

ఈ కవితలో ప్రధానంగా స్త్రీ తన వ్యక్తిత్వాన్ని కోల్పోవడం గురించి ఓల్గా ప్రస్తావించారు. ప్రేమ ముసుగులో బానిసత్వపు సంకెళ్ళల్లో నలుగుతూ, ప్రేమికుడైనా, భర్తయైనా స్త్రీని ప్రేమిస్తున్నానని చెబుతూనే, ఆమె ఆలోచనలు, ఇష్టాలు, ఆశయాలు తనతో ఏకీభవించాలని కోరుకుంటాడని ఓల్గా ఈ కవిత ద్వారా తెలియచేసారు.

ఆకలే మిగిలింది :

ఓల్గా ఈ కవిత ద్వారా పురుషాధిక్య వ్యవస్థలో స్త్రీ పాత్రను వివరించారు. స్త్రీ త్యాగం చేయడాన్నే సమాజం గొప్పగా చూస్తుంది.

కానీ ఆ త్యాగాల వెనుక ఆమె తన సొంత వ్యక్తిత్వాన్ని, ఆనందాన్ని ఎలా కోల్పోతుందో ఈ కవిత ఎత్తిచూపుతుంది.

"రెక్కలు ముక్కలు చేసుకుని పొద్దస్తమానం ఎద్దులా పనిచేసే

ఈ భూమిని నా చెమటతో తడిపాను"
"చాకిరీ చేయలేక సత్తువ బొత్తిగా లేక
ఆకలిని చంపలేక పోతుంటే
నా ఒంట్లోని రక్తపు చుక్కలను
ఒక్కొక్కటిగా ఈ భూమి పీల్చివేసింది"

ఆకలి మిగిలింది' కవిత చదివినప్పుడు పాఠకుడికి, స్త్రీ శ్రమను కేవలం భౌతిక కోణంలో కాకుండా, భావోద్వేగ కోణంలో అర్థం చేసుకోవాలని ఈ కవిత హెచ్చరిస్తుంది.

శ్రీమతి ఓల్గా గారి "దాంపత్యం, గృహలక్ష్మి, సూపర్ వుమెన్ కాలేను, మెహేంది స్త్రీల విజ్ఞప్తి, అవును మేము గయ్యాళులమే, ప్రతి స్త్రీ ఒక నిర్మల కావాలి" వంటి కవితలన్నీ స్త్రీవాద సాహిత్య చరిత్రలో మైలురాళ్ళు. పితృస్వామ్య వ్యవస్థ స్త్రీలకు చుట్టిన "ఆదర్శాల" ముసుగును తొలగించి, వారి అసలు అస్తిత్వాన్ని ఈ కవితలు ఆవిష్కరిస్తాయి.

వసంత కన్నబిరాన్ :

వసంత కన్నబిరాన్ గారు ప్రముఖ తెలుగు రచయిత్రి, కవయిత్రి మరియు స్త్రీవాద కార్యకర్త. తెలుగు సాహిత్య రంగంలో స్త్రీవాద దృక్పథాన్ని, సామాజిక స్పృహను బలంగా వినిపించిన అతికొద్ది మందిలో ఆమె ఒకరు. ప్రసిద్ధ స్త్రీవాద కవిత్వ సంకలనం 'నీలిమేఘాలు' రూపొందించడంలో ఆమె ముఖ్య భూమిక పోషించారు. ఆమె రాసిన 'Requiem in Raga Janaki' అనే నవలకు ఆంగ్ల భాషా విభాగంలో కేంద్ర సాహిత్య అకాడమీ పురస్కారం లభించింది.

అస్మిత :

వసంత కన్నబిరాన్ గారి "అస్మిత " కవితలో రచయిత్రి స్త్రీ తన జీవితాంతం ఇతరుల కోణంలోనే గుర్తించబడటాన్ని ప్రశ్నిస్తారు. ఉదాహరణకు చిన్నప్పుడు ఫలానా వారి కూతురిగా, పెళ్లయ్యాక ఫలానా వారి భార్యగా, ఆ తర్వాత ఫలానా వారి తల్లిగా మాత్రమే సమాజం ఆమెను చూస్తుంది. ఈ క్రమంలో ఆమెకు అంటూ ఒక సొంత పేరు, సొంత ఇష్టాయిష్టాలు, ఒక ప్రత్యేక గుర్తింపు ఉన్నాయనే విషయాన్ని వ్యవస్థ మర్చిపోతుందని వసంత గారు ఆవేదన వ్యక్తం చేస్తారు.

"స్త్రీగా ఉండటమంటే ఏమిటో
నేనెప్పుడు తెలుసుకున్నాను?
పదిహేను వసంతాలుగా విప్పారిన వయసులో
నే నడిచిన దోవంతా
వెంటాడే విలాస చంచల దృక్కుల నడుమ..."
"ఒక పెను కేకతో, రక్తంలో ఉమ్మనీటితో తడిసిన
ఆ బిడ్డను ముందుకు నెడితే
'మనకు కొడుకు పుట్టాడు'
'వంశోద్ధారకుడు ఉదయించాడు'
అన్న కేరింతలతో పురిటిగది గోడలన్నీ
ప్రతిధ్వనించినప్పుడా?"

ఒక స్త్రీ ఆలోచనలు, ఆమె మేధస్సు కంటే ఆమె అందానికి లేదా ఆమె చేసే సేవకే ప్రాధాన్యత ఇవ్వడాన్ని ఈ కవిత ఎండగడుతుంది.

నిరీక్షణ :

ఈ కవితలో స్త్రీ జీవితం ఇంటి నాలుగు గోడల మధ్యే ఎలా గడిచిపోతుందో చిత్రించారు.

ఉదయం నుంచి రాత్రి వరకు నిరంతరం శ్రమిస్తూ, ఎవరి కోసమో లేదా ఏదో మార్పు కోసమో ఆమె చేసే నిరీక్షణ ఇందులో కనిపిస్తుంది.

కాలం గడిచిపోతున్నా, ఆమె స్థితిలో మార్పు రాక పోవడాన్ని రచయిత్రి ఒక నిశ్శబ్ద వేదనగా వర్ణించారు.

"సగం మెలకువ సగం నిద్రలో
ఆ కలలోనే చస్తూ బతుకుతూ
అయితే నా నిరీక్షణలోనే లయ
పూర్తిగా నాశనమయిపోయింది
ప్రతిక్షణం ప్రతి గంట
ప్రతి రాత్రి ప్రతి పగలూ
దైనందిన కార్యక్రమాలను చూసుకుంటూ
క్షణం తీరికలేని నీ వ్యవహారాలను
సమర్థించుకు రావటం నేర్చుకుంటూ నిరీక్షించాను"

"వరవరరావు జైలు నుండి రాసిన లేఖలు, ఇంగ్లీషు లోకి అనువదించేటప్పుడు, అతని నిరీక్షణలోని భారాన్ని, అర్థాన్ని ఆ అనువాదంలో ప్రవేశపెట్టడం కోసం నేను

ప్రయత్నించేదాన్ని, ఆ సమయంలోనే హేమలత వరవరరావును కలవడానికి జైలుకి వెళ్లే ముందు, ఒక్కో అప్పుడు కలిసి వచ్చాక మా ఇంటికి వస్తూ ఉండేది. ఆమె వేదన, అతని వేదనలు నా పేగులో చుట్టుకుపోయి ఈ కవిత రాశాను" అని వసంత గారు స్వయంగా ఈ కవిత యొక్క ఔన్నిత్యాన్ని, అర్థాన్ని వివరించారు

విభజన రేఖా గీతం :

ఈ కవిత కేవలం విభజన గురించి చెప్పే దుఃఖ గీతం కాదు; ఆ రేఖలను చెరిపివేయాలని కోరుకునే ఒక చైతన్య గీతం. వసంత కన్నబిరాన్ గారు రాసిన " విభజన రేఖాగీతం" కవిత స్త్రీవాద సాహిత్యంలోని అత్యంత తీవ్రమైన మరియు ఆలోచింపజేసే కవితలలో ఒకటి.

"ఔను ఆ రాత్రి మీరంతా మీటింగుల కోసం, ఎత్తుగడల కోసం దాక్కోవటం కోసం, వెళ్ళిపోయారు.

మరి అప్పుడు వాళ్లు వచ్చారు
కళ్ళు మండుతుండగా
చెమటతో శరీరాలు మెరుస్తుండగా
చీకట్లో వాళ్ల చురకత్తులు చురుక్కుమన్నాయి
ద్వేషంతో, కోపంతో, వాళ్ళ గొంతులు కంగుమని విరిగిపడుతున్నప్పుడు
అప్పుడు నువ్వు ఓ సర్కార్ నువ్వు
ఎక్కడున్నారు మీరప్పుడు?
నా పాలిండ్ల నుండి నా కొడుకుని తెంపి నేలకు విసిరి కొట్టి
నా జుట్టు పట్టి ఈడ్చి
అర్ధ నగ్నంగా నా పేగుల లుంగలు చుట్టుకు పోతుండగా
ఆ పొలాల్లో పడేసి లాక్కెళ్లారు"

1947లో దేశ విభజన జరిగినప్పుడు, దేశం ఇరువైపుల నుండి, రెండు దేశాలకు చెందిన, పురుషులు అనేక మంది స్త్రీలను ఎత్తుకుపోయారు. అత్యాచారం చేశారు, అయితే ఆసక్తికరమైనది ఏమిటంటే, రెండు దేశాల ప్రభుత్వాలు అది తమ జాతీయ గౌరవపు అంశంగా తీసుకొని తమ దేశపు స్త్రీలను రక్షించి, వారి వారి కుటుంబాలకు చేర్చాలనుకున్నారు. చాలా సందర్భాల్లో ఆ స్త్రీలు ఆ ప్రయత్నాలను ఒప్పుకోలేదు. తమ ఇళ్లకు వెళ్లడానికి తిరస్కరించారు, అయినా వారిని బలవంతంగా వెనక్కు పంపించారు. 1991 ఫిబ్రవరిలో కలకత్తాలో జరిగిన 5వ నేషనల్ ఉమెన్స్ కాన్ఫరెన్స్ లో, రీతు మీనన్, కమల భాసిన్ లు తయారుచేసిన పేపర్ విన్న తర్వాత, తిరిగి వస్తూ ట్రైన్‌లో ఈ కవిత రాశానని వసంత గారు "నీలిమేఘాలు" కవితా సంకలనంలో తెలియజేశారు.

ముగింపు :

సమాజం నిర్దేశించిన కట్టుబాట్లు స్త్రీల ఎదుగుదలను ఎలా అడ్డుకుంటున్నాయో ఈ కవితలు వివరిస్తాయి. స్త్రీ శరీరంపై పురుషాధిక్యతను, గృహహింసను మరియు లైంగిక వేధింపులను నిర్భయంగా ఈ కవితల్లో చర్చించారు. సంప్రదాయవాదుల నుండి ఎన్నో విమర్శలు ఎదుర్కొన్నప్పటికీ, 'నీలి మేఘాలు' తెలుగు సాహిత్యంలో ఒక విప్లవాత్మక మార్పుకు నాంది పలికింది. స్త్రీల సమస్యలు కేవలం వ్యక్తిగతం కాదని, అవి రాజకీయ అంశాలని ఇది నిరూపించింది. చదువుకున్న స్త్రీలు కూడా సమాజంలో, ఆఫీసుల్లో ఎదుర్కొంటున్న మానసిక సంఘర్షణను ఈ కవితల చర్చించారు. ఈ సంకలనం విడుదలైనప్పుడు తెలుగు సాహిత్య లోకంలో పెద్ద దుమారమే రేగింది. ఈ సంకలనం తర్వాత తెలుగు సాహిత్యంలో "స్త్రీవాద కవిత్వం" అనే ఒక ప్రత్యేక శాఖ స్థిరపడింది.

ఆధార గ్రంథాలు :

1. నీలిమేఘాలు - కవితా సంకలనం
2. గూగుల్ సమాచారం

★★★

Vol. 23 | Spl. Issue 03 | March 2026 | BHAVAVEENA | ISSN No. : 2456-4702 | RNI No. APTEL/2003/12253

RNI No. APTEL/2003/12253 | Reffered Journal & Peer Reviewed Journals | ISSN No. 2456-4702

భావవీణ

కళలు, సాహిత్య, సాంస్కృతిక భాషాధ్యయన పత్రిక

BHAVA VEENA

Journal of Arts, Literary, Culture & Language Study

"కె.విశ్వనాథ్ నిండు దంపతులు చిత్రంలో కథానాయిక పాత్ర ఔచిత్యం"

- జి. శ్రీదేవి (లేళ్లపల్లి శ్రీదేవి రమేష్)

పరిశోధక విద్యార్థి, తెలుగు శాఖ మద్రాసు విశ్వవిద్యాలయం, చెన్నై.

నిండు దంపతులు చిత్రం వివరాలు :

నిండు దంపతులు చిత్రం 1971 సంవత్సరంలో విడుదల అయింది. నిర్మాణ సంస్థ:, ఎస్.వి.ఎస్.ఫిల్మ్స్., దర్శకులు : కళాతపస్వి కె.విశ్వనాథ్., నిర్మాత : మిద్దె జగన్నాథ రావు, ముఖ్య నటీనటులు : కథానాయకుడిగా : ఎన్. టి.రామారావు, కథానాయికగా : సావిత్రి, ముఖ్య పాత్రల్లో విజయనిర్మల, లక్ష్మీ, చంద్రమోహన్, గుమ్మడి వెంకటేశ్వర రావు,రాజబాబు,కైకాల సత్యనారాయణ, అల్లు రామలింగయ్య, ధూళిపాల, ఛాయాదేవి, బాలయ్య మొదలైన వారు నటించారు, సంగీతం : టి.వి రాజు సంగీత దర్శకులు, గాయనీ గాయకులుగా : ఘంటసాల, ఎస్.పి.బాలసుబ్రహ్మణ్యం, పి.సుశీల, బి.వసంత, పి.లీల, ఎల్.ఆర్.ఈశ్వరి గారు గాత్రం అందించారు.

నిండు దంపతులు చిత్రం కథ క్లుప్తంగా :

ఆడపిల్లలకు చదువెందుకు అనే పాతకాలపు రోజుల్లోనే, స్త్రీని చదివిస్తే విద్యాధికురాలు అయి జీవితానికి వెలుగు బాట వేసుకుంటుంది. స్త్రీ చదువు ఆమెకు మాత్రమే కాకుండా ఆ ఇంటికి వెలుగయ్యి సమాజానికి కూడా మేలు చేయగలదని 55 ఏళ్ళ క్రితమే ఒక చక్కటి కుటుంబ కథా చిత్రం "నిండు దంపతులు" పేరుతో సుప్రసిద్ధ దర్శకులు కళాతపస్వి కె.విశ్వనాథ్ గారు తీసారు. కిళ్ళీ కొట్టు నడిపించుకునే హీరో పాత్రలో ఉన్న రాము (ఎన్.టి.ఆర్)తనకు చదువు లేకున్నా కూడా, స్త్రీకి చదువు తప్పక ఉండాలనే సంస్కారం కలవాడు.ఎంత చదువుకున్నా కూడా పెళ్ళి అయ్యాక ఆడదానికి ఆ అత్తగారింటి పరువు ప్రతిష్టలు కాపాడేది ఆ కోడలే అని, బి. ఏ. బి.ఎల్. న్యాయశాస్త్రం చదివిన హీరోయిన్ పాత్రలో ఉన్న శ్రీదేవి (సావిత్రి) అభిప్రాయం. తాను చదువుకోక పోయినా తన మేన మరదలును(లక్ష్మీ) బి.ఏ చదివిస్తాడు రాము. చక్కగా కాపురం చేసుకుంటూ సంతోషంగా ండటానికి స్త్రీకి చదువు అవసరం లేదని అభిప్రాయపడే హీరోయిన్ చెల్లెలు టీ కొట్టు సుబ్బులు (విజయనిర్మల).

శ్రీదేవి తండ్రి (గుమ్మడి) కన్న కల కూతురు లాయర్ అవడం.తండ్రి కోరిక ప్రకారమే శ్రీదేవి లాయర్ అయి, మొదటిసారి కోర్టుకి వెళ్తున్న సమయంలో తండ్రిని చేయని తప్పుకు పోలీసులు తీసుకెళ్తుంటారు. తండ్రి కోర్టులో మొదటిసారి తన వాదనలు చూసి ఎంతో సంతోష పడి ,కేసు గెలిచిన ఆనందం పట్టలేక భావోద్వగానికి గురయ్యి అక్కడే చనిపోతాడు. లాయర్ శ్రీదేవి పట్టలేని బాధతో ఊరువిడిచి తన బాబాయ్ కూతురు చెల్లెలు టీ కొట్టి సుబ్బులు దగ్గర చేరుతుంది.

చదువు వల్లే ఇన్ని అనర్థాలు అనుకుంటుంది.చదువు రాని దానిలా జీవితం మొదలుపెడుతుంది. హీరో రాము ఏ దిక్కులులేని మరదలు లక్ష్మీని చదివిస్తాడు.పెళ్ళి

చేసుకోవాలనుకుంటాడు. కానీ లక్ష్మీ మరో ధనవంతుడూ జమిందార్ అయిన రవిని(చంద్రమోహన్)ప్రేమిస్తుంది.ఈ విషయం తెలిసిన రాము లక్ష్మీని రవికిచ్చి పెళ్ళి జరిపిస్తాడు.

అనుకోని సంఘటనలో తండ్రిని చంపిన హత్యా నేరంలో చంద్రమోహన్ కోర్టుకి ఎక్కుతాడు. ఈ బాధ భరించలేక రాము ఇంటికి వచ్చిన లక్ష్మిని తోటి మహిళగా, తన భర్తకు మరదలు ఆయన అవిడ అని శ్రీదేవి ఓదార్చు తుంది. ఎంత చదువుకున్నా, ఎంత డబ్బు ఉన్నా స్త్రీకి చదువు తో పాటు సంస్కారం చాలా ముఖ్యం అని ఎలా ఉండాలో ఎలా ఉండకూడదో లక్ష్మీకి చెపుతుంది లాయర్ శ్రీదేవి. ఏ మాత్రం గెలిచే అవకాశం లేని లక్ష్మీ భర్త చంద్రమోహన్ కేసుని వాదించడానికి ఒప్పుకుని సమర్ధ వంతంగా వాదోపవాదాలతో, తెలివైన ప్రశ్నలతో ప్రత్యర్థిని మట్టి కరిపించి శ్రీదేవి ఈ కేసులో చంద్రమోహన్ నిర్దోషి అని నిరూపించడంలో కథ సుఖాంతం అవుతుంది.

ఈ చిత్రంలో లాయర్ శ్రీదేవి పాత్ర :

ఈ చిత్రంలో లాయర్ శ్రీదేవిగా సావిత్రి తన పాత్రకు పూర్తి న్యాయంచేసారు. తన తండ్రి తనను లాయర్‌గా చూడాలనే కోరిక కోసం, ఎంతో కష్టపడి లాయర్ అయి తండ్రి కోరిక నెరవేర్చి ఆయనకు సంతోషాన్ని ఇస్తుంది శ్రీదేవి.కానీ,శ్రీదేవి కి మాత్రం చదువుకోవడం ముఖ్యం కాదు,సంస్కారం కలిగి ఉండటం, స్త్రీగా చక్కగా కుటుంబ బాధ్యతలు నెరవేరుస్తూ, కుటుంబాన్ని ప్రేమగా చూస్తూ ఉత్తమ ఇల్లాలిగా సంస్కారవంతమైన స్త్రీగా ఉండటమే ఇష్టంగా ఉంటుంది. తండ్రి కోరిక నెరవేర్చడం కోసం లాయర్ అవుతుంది.లాయర్ శ్రీదేవిగా మొదటిసారి కోర్టుకి వెళ్ళే సమయంలో, తండ్రిని చేయని నేరానికి పోలీసులు తీస్కెతున్నప్పుడు ప్రాణంగా తండ్రిని ప్రేమించే ఒక కూతురుగా తల్లడిల్లి పోతుంది. ఆ సమయంలో కూడా అమె తండ్రి, నీకు మొదటి కేసే నాన్నని నిర్దోషిగా నిలబెట్టే అవకాశం వచ్చిందని సంతోష పడతారు. ఒక లాయర్‌గా, కన్న కూతురిగా, సాధారణ స్త్రీగా భావోద్వేగానికి గురయ్యి కుమిలిపోతుంది. కోర్టులో శ్రీదేవి వాద, ప్రతివాదాలు చూసి గర్వపడుతూ, పట్టరాని ఆనందంతో ఉక్కిరిబిక్కిరి అయి ఆ కోర్టులోనే మరణిస్తాడు ఆయన.అప్పుడు కూతురు స్థానంలో ఉన్న శ్రీదేవి చలించిపోయి, చదువులే ఇన్నింటికి కారణం అని, సాధారణ మహిళలాగా బ్రత కాలని చెల్లెలు పంచ చేరుతుంది.చదువు సంధ్య లేకుండా టీ కొట్టు నడిపిస్తున్న చెల్లెలు సుబ్బులు దగ్గర శ్రీదేవి పాత్రలో ఉన్న సావిత్రి, బ్రతకడం ఎలాగో నేర్చుకునే తీరు ఎంతో అద్భుతంగా సహజంగా ఉంటుంది. తనకు చదువు తప్ప లోకజ్ఞానం ఉండదు. చెల్లి పంచన చేరాకే ఒక్కో విషయం చూస్తూ నేర్చుకుంటుంది శ్రీదేవి.చెల్లి సుబ్బులు టీ కొట్టు ఎదురుగా ఉన్న రాము(ఎన్. టీ.ఆర్) కిళ్ళీ కొట్టును గమనిస్తూ ఒక్కో విషయం అమాయకంగా, ఆశ్చర్యంగా తెలుసుకోవడం భలే ముచ్చటగా ఉంటుంది. చదువు కున్నా లోకం తెలియని అమాయకురాలు శ్రీదేవి.తనకు చదువు లేకున్నా కూడా రాము స్త్రీకి చదువు చాలా ముఖ్యం అని భావించడాన్ని, మహిళలను గౌరవించే తత్వం ఉన్న అతని వ్యక్తిత్వానికి,కష్టపడే స్వభావానికి, నిజాయితీకి,ఎదుటివారికి సహాయం చేసే గుణానికి ఇష్టపడి శ్రీదేవి అతన్ని పెళ్ళాడుతుంది.

సుబ్బులుకు అక్కగా చెల్లిని తల్లి ప్రేమతో శ్రీదేవి చూసుకోవడం, ఇద్దరు అన్యోన్యంగా ఉండటం,ఎన్నో తెలియని విషయాలు చెల్లి నుండి తెలుసుకుంటూ శ్రీదేవి చక్కటి నటనను కనబరుస్తుంది.

తాను చదువుకున్న అమ్మాయని ఎవరికి తెలియ కుండా తనకు ఇష్టమైనట్టు సంసార పక్షంగా ఉంటూ, ఉత్తమ ఇల్లాలిగా అసాధారణమైన నటన చూపించారు శ్రీదేవి పాత్రలో సావిత్రి.

ఒకానొక సమయంలో భార్య శ్రీదేవి లాయర్ అని తెలుస్తుంది రాముకు. తనకు చదువు లేకున్నా, చదువు కున్న స్త్రీలు అంటే తనకున్న గౌరవం వల్ల తన భార్య శ్రీదేవి చేత మళ్ళీ లాయర్ గా ప్రాక్టీస్ పెట్టిస్తాడు. తనకు ఏ మాత్రం లాయర్ గా జీవితం గడపడం ఇష్టం లేక పోయినా, భర్త మాటకు విలువ, గౌరవం ఇచ్చి, తండ్రి కోరిక కూడా నెరవేరుతున్నట్టు భావిస్తూ ఆ వృత్తి స్వీకరిస్తుంది. కష్టమైన, ఏ మాత్రం గెలిచే అవకాశం లేని లక్ష్మీ భర్త రవి కేసును వాదించడానికి సిద్ధం అవుతుంది.

రవి కేసుని అత్యంత సమర్ధవంతంగా తన వాదనలను సాక్షాధారాలతో తెలివిగా చూపించి రవిని నిర్దోషిగా నిరూపిస్తుంది శ్రీదేవి. ఆ కోర్టులో ప్రతి వాదితో వాదోప వాదాలు చేస్తున్న సమయంలో,భర్త చెప్పిన ముఖ్యమైన విషయాలను గుర్తుచేసుకుంటూ,వాటిని ఎంతో చాక చక్యంగా జడ్జికి వినిపించి కేసులో విజేతగా నిలుస్తుంది. అప్పుడు కూడా నేను బాగా చదువు కున్న గొప్ప లాయర్ నీ అందుకే ఈ కేసుని నా తెలివితేటలతో గెలిచాను అన్న అహంకారం ఏ మాత్రం లేకుండా, సరైన సమయంలో మీరు సహాయం చేయడం వల్ల గెలిచాను అని భర్తతో అంటుంది సావిత్రి. ఈ ఇద్దరి భార్యాభర్తల జీవితం ''నిండు దంపతులు''గా అందరికి ఆదర్శంగా నిలుస్తుంది. నాకు ఈ చిత్రంలో నచ్చిన లాయర్ శ్రీదేవి పాత్రలో సావిత్రి నటన విషయాలు కొన్ని:-

స్త్రీలకు చదువు, అంతకన్నా కూడా సంస్కారం, కుటుంబ బాధ్యతలు, ముఖ్యం అనుకునే ఎంతో సహజంగా లాయర్ పాత్రలో నటించిన సావిత్రి పాత్ర. తనకు లాయర్ అవ్వాలని ఆసక్తిలేకపోయినా తండ్రి తనను లాయర్ గా చూడాలన్న కోరిక నిజం చేయడం కోసం లా చదివి సఫలం అయ్యి లాయర్ అవుతుంది. అంటే తండ్రి మాటలకు ఎంత విలువ ఇచ్చిందో మనకు ఈ పాత్ర ద్వారా తెలుస్తుంది. B.A,B.L చదివినా కూడా సావిత్రి పాత్ర కుటుంబానికి ప్రేమానురాగాలు పంచే గొప్ప స్త్రీమూర్తిగా సంస్కారవంతమైన ఉత్తమ మహిళగా జీవితం గడపడమే అనే భావన కలిగి ఉండటం.

లాయర్ శ్రీదేవి పాత్రలో సావిత్రి నటనా వైదుష్యం :

ఈ నిండు దంపతులు చిత్రంలో సావిత్రి నటన వేరే చిత్రాల్లో నటించిన నటనకు భిన్నంగా ఉంటుంది. కుటుంబానికి ప్రాధాన్యత ఇస్తూ,తోటివారికి సహాయం చేస్తూ సాధారణ సగటు మహిళలా జీవితం గడపాలను కుంటుంది. చదువు కన్నా సంస్కారం గొప్పదని భావిస్తుంది.

తనకు ఇష్టంలేకపోయినా, తన తండ్రి తనను లాయర్‌గా చూడాలని కోరుకున్నందుకు ఎంతో కష్టపడి లా చదువుతుంది.

ఈ సినిమాలో సావిత్రి పాత్ర ఆలోచన ఎలా ఉంటుంది అంటే, స్త్రీలు గొప్ప చదువులు చదువుకుంటే, గొప్ప సంబంధాలు కావాలని, దానికోసం ఎంతో డబ్బు ఖర్చు పెట్టి పెళ్ళి చేయాల్సివుంటుందని. తన తండ్రి ఇప్పటికే ఎంతో డబ్బు ఖర్చు పెట్టి తనను చదివించాడని లోలోన మదనపడుతూ ఉంటుంది. తక్కువ చదువు కుంటే డబ్బు ఖర్చు కాకుండా ఏదో మధ్యతరగతి సంబంధం కుదురుతుంది. దాని వల్ల తండ్రికి ఆర్థిక భారం తగ్గించవచ్చు అని శ్రీదేవి ఆలోచన. ఈ కాలంలో ఇలా ఆలోచించే మహిళలు ఉండటం అరుదు.

తండ్రి చేయని తప్పుకు కోర్టుకెళ్ళడం భరించలేక కుమిలిపోతుంది అప్పుడు కూతురిగా ఒక పక్క బాధ పడుతూ కూడా లాయర్‌గా తండ్రి తరపున సమర్ధ వంతంగా వాదించేతీరు ఎంతో సహజంగా అద్భుతంగా ఉంటుంది వీరి నటనా వైదుష్యం. బాధను దిగమింగు కుని వాదించడం, తండ్రిని నిర్దోషి గా నిలబెట్టాలనే తపన వారి సహజసిద్ధమైన నటన ద్వారా తెలుస్తుంది.చెల్లి సుబ్బులు దగ్గర చదువురాని దానిలా అమాయకంగా నటిస్తుంది. రాములు కిళ్ళీ కొట్టును,ఆయన వస్తువులను అమ్మే విధానాన్ని గమనిస్తూ ఒక్కోటి నేర్చుకునే విధానం, చిత్రం చూసే ప్రేక్షకులకు అబ్బురంగా అనిపించి మనసు కట్టిపడేస్తుంది సావిత్రి నటన.ఇక రాముతో వైవాహిక జీవితం తాను ఇష్టపడిన జీవితం అవడం వల్ల ఒక కుటుంబ పరంగా వుండే ఆదర్శ గృహిణి ఎలా ఉంటుందో సావిత్రి నటన అలా సహజసిద్ధంగా ఉంటుంది. భార్యాభర్తల మధ్య ఉండే చిన్ని చిన్ని సరదాలు, అలకలు భలే ముచ్చటగా ఉంటాయి. సావిత్రి చెల్లి మీద చూపించే ప్రేమ, చెల్లి నుండి జీవితంలో బ్రతకడం ఎలాగో నేర్చుకునే తీరు అద్భుతమైన వీరి నటన ద్వారా తెలుస్తుంది.

తన భర్త రాము స్త్రీలకు చదవడం అవసరం అని నమ్మడం,అలాగే అతనికి స్త్రీల పట్ల ఉన్న గౌరవానికి గర్వపడుతూ,భర్త,తండ్రి కోరిక తీర్చడం కోసం బాబు పుట్టిన తర్వాత లాయర్‌గా జీవితం మొదలుపెడుతుంది. దీనివల్ల తండ్రి ప్రేమ, అతని కోరిక నెరవేర్చడం కోసం,

భర్తను గౌరవించి అతని మాటలు వినడం ద్వారా వారిద్దరి పట్ల సావిత్రికి ఉన్న గౌరవం ప్రేమ అర్థమవుతుంది భర్త మేన మరదలు లక్ష్మీ చదువుకున్న అహంకారం తో వైవాహిక జీవితాన్ని వదిలివస్తే, ఎంతో నచ్చచెప్పి, వివాహ బంధం గొప్పతనాన్ని చెప్పి, కుటుంబ గౌరవం కాపాడటంలో స్త్రీల పాత్ర ఎంత ముఖ్యమో తెలిపి లక్ష్మీ జీవితం సుఖమయం చేసే సావిత్రి నటన ప్రశంశనీయంగా ఉంటుంది.

శ్రీదేవి పాత్ర మాటలు నిజజీవితంలో కూడా సున్నిత మనస్కురాలు అయిన సావిత్రి గారి మనోభావమేమో వారి స్వభావం కూడా ఇలాంటిదే అనిపిస్తుంది వారి నటన చూస్తున్నప్పుడు. అటు కుటుంబ బాధ్యతలు సక్రమంగా నిర్వర్తిస్తు, కోర్టులో లక్ష్మీ భర్త రవి కేసు సమర్థవంతంగా వాదించి గెలిచిన తీరు వారి నటనా కౌశలానికి మచ్చు తునక. వాద ప్రతి వాదాల సమయంలో సావిత్రి భర్త, రాము సంజ్ఞల ద్వారా చేసిన సహాయానికి, చదువుకోకున్నా తన భర్త తెలివికి మురిసిపోయి,ఈ కేసు గెలవడానికి కారణం భర్తే అని నిగర్వంగా చెప్పడం సావిత్రి నిస్వార్థమైన నటనకు నిదర్శనం. మాములుగా ప్రతి భార్యకు భర్త గొప్ప అనిపిస్తుంది కదా ఈ సన్నివేశంలో వారి నటన చూసే ప్రేక్షకులకు ముచ్చటేస్తుంది. ఆ ఆదర్శ దంపతుల అన్యోన్య దాంపత్యం ఎదుటివారికి సహాయం చేసే గుణం, మనసెరిగి నడుచుకోవడం ఆ ఇద్దరిని ''నిండు దంపతులు''గా ఆదర్శ దంపతులు గా నిరూపించింది కె.విశ్వనాథ్ గారి ఈ అమూల్యమైన చిత్రం.

ఇంకో ముఖ్యమైన విషయం ఏమిటంటే 1952 లో ఎన్.టి. రామారావు. హీరోగా వచ్చిన ''పల్లెటూరు'' చిత్రంలో సావిత్రి హీరోయిన్‌గా నటజీవితం మొదలుపెట్టి, 1971లో వచ్చిన ఈ ''నిండు దంపతులు'' చిత్రంలో మళ్ళీ ఎన్.టి. రామారావు కథానాయకుడిగా తాను కథానాయికగా చివరి చిత్రంగా నటించడం విశేషం, యాదృచ్ఛికం.ఆ తర్వాత నటించినా కూడా చెల్లి, తల్లి లాంటి పాత్రలే పోషించారు.

ఎన్.టి.రామారావు, సావిత్రి కలిసి 1952 నుండి 1971 వరకు దాదాపు 20 సంవత్సరాలు వెండి తెరపైన నటించి ఒక వెలుగు వెలిగారు.

కె.విశ్వనాథ్ దర్శకత్వంలో వచ్చిన ఈ ''నిండు దంపతులు'' సాంఘిక చిత్రం లో ఒక ఆదర్శ మహిళగా, ప్రేమను పంచె కూతురుగా,ఉత్తమ ఇల్లాలుగా,తెలివైన లాయర్‌గా, పరులకు సహాయం చేసే మనీషిగా, అమాయకంగా ఒక్కోటి నేర్చుకునే మహిళగా సావిత్రి అద్భుతమైన నటనా వైదుష్యం తెలుగువారందరి కట్టిపడేసి కలకాలం ప్రేక్షకుల హృదయాల్లో నిలిచి పోయింది.

నేను ఈ సినిమానే నా పత్రంగా ఎంచుకోవడానికి ముఖ్యకారణం. చిత్రాలు సమాజం మీద చాలా ప్రభావాన్ని చూపిస్తాయి అని నమ్మేదాన్ని నేను. మంచి అయినా చెడు అయినా ఆ చిత్ర సందేశం సమాజానికి చేరుతుంది. అందుకే మంచి విలువలతో కూడిన చిత్రాలు, కళాత్మక చిత్రాలు, ఆధ్యాత్మిక చిత్రాలు అజరామరాలుగా ఉంటాయి. ఈ నిండు దంపతులు చిత్రంలో కథానాయిక పాత్రలో సావిత్రి విద్యాధికురాలు లాయర్ అయినా కూడా ఒక గృహిణిగా కుటుంబ బాధ్యతలు నెరవేర్చుకుంటూ, సమాజం పట్ల బాధ్యతతో, ఇతరులకు సహాయం చేస్తూ ఆదర్శ మహిళగా కనిపిస్తుంది.

ఈ చిత్రం ద్వారా దర్శకులు కె.విశ్వనాథ్ గారు సమాజంలో స్త్రీ విద్యకు ఎంత ప్రాధాన్యం ఉన్నదో తెలియచేసారు.

ఒక మంచి సినిమా ప్రభావం ఆ సినిమా చూసే ప్రేక్షకుడి మీద తప్పకుండా పడుతుంది. అది మంచి అయినా చెడు అయినా. అయితే ఈ చిత్రంలో కథానాయిక ఉన్నత చదువు చదువుకుని వుంటుంది. లా చదువుకున్నా కూడా కుటుంబ బాధ్యతలను ఎంతో ఇష్టంగా తీసుకుని చక్కటి గృహిణిలా అటు భర్తకు సహాయం చేస్తూ ఆనందకరమైన సంసార జీవితం గడుపుతూ ఉంటుంది. ఇంకో పక్క తన భర్త రాము మరదలు అయిన లక్ష్మీని ఉన్నత చదువులు చదివించినా కూడా అహంకారంగా ఉంటూ,చంద్రమోహన్ ను పెళ్లి చేసుకుని ఆడంబరాలకు పోయి జీవితంలో కష్టాలు కొని తెచ్చుకుని భర్త జైలుకు వెళ్లడానికి కారణమవుతుంది. మళ్ళీ లాయర్ శ్రీదేవి తెలివిగా వాదించడంతో లక్ష్మీ

భర్త నిర్దోషిగా బయటికి వస్తారు. ఇంకో పక్క లాయర్ శ్రీదేవి చెల్లిగా ఒక టికొట్టు యజమానురాలుగా విజయ నిర్మల పాత్ర ఎంతో సహజంగా ఉంటుంది. చదువు కోకున్నా కూడా నిజాయితీగా న్యాయం ధర్మంగా బ్రతకాలి అనుకుంటుంది. శ్రీదేవి పాత్ర మహిళలందరికీ స్ఫూర్తిదాయకంగా వుంటుంది. ఎందుకంటే ఒక తండ్రి పట్ల ప్రేమ చూపుతూ తండ్రి మాటను గౌరవిస్తూ తండ్రి కోరిక తీర్చడం కోసం లా చదువుతుంది.ప్రేమను పంచె అక్కగా, అనురాగం ఆప్యాయత కురిపించే ఉత్తమ ఇల్లాలుగా, ప్రేమ తత్వం ఉన్న అమ్మగా ,సమాజం పట్ల బాధ్యతతో న్యాయాన్ని ధర్మాన్ని కాపాడటం కోసం తను చదువుకున్న చదువుకు న్యాయం చేయడం కోసం ఎంతో కాలం చదువు రాని దానిలా ఇంట్లో ఉన్నా భర్త ప్రోత్సాహంతో భర్త మీద గౌరవంతో తిరిగి లాయర్ గా ప్రాక్టీస్ చేసి విజయం సాధిస్తుంది.

కొన్ని సినిమాలు ప్రేక్షకులకు స్ఫూర్తి ఇస్తుంది అనడానికి ఈ సినిమా ఒక ఉదాహరణ. ఈ సినిమా చూసిన తర్వాత ఎందరో మహిళలు న్యాయ శాస్త్రం చదివారు. గొప్ప లాయర్లు అయ్యారు. ఇంత కన్నా రుజువులు ఏం కావాలి. మహిళ చదువు వల్ల కలిగే ప్రయోజనాలు ఈ చిత్రం ద్వారా తెలుస్తుంది. ఆధార గ్రంథాలు కాకుండా ఇది ఒక చిత్రంలోని మహిళ పాత్ర గురించి. ఈ అంశంతో పత్రం సమర్పణ కోసం నేను ఈ నిండు దంపతులు చిత్రాన్ని చూసాను. ఈ చిత్రానికి సంబంధిన విషయాలు ఇంటర్నెట్ మాధ్యమంలో చదివి ఈ పత్రం రాస్తున్నాను.

★★★

Vol. 23 | Spl. Issue 03 | March 2026 | BHAVAVEENA | ISSN No. : 2456-4702 | RNI No. APTEL/2003/12253

RNI No. APTEL/2003/12253 | Reffered Journal & Peer Reviewed Journals | ISSN No. 2456-4702

భావవీణ

కళలు, సాహిత్య, సాంస్కృతిక భాషాధ్యయన పత్రిక

BHAVA VEENA

Journal of Arts, Literary, Culture & Language Study

గోదావరి జిల్లాల మహిళా సాహితీ సౌరభం

– డా॥. కొప్పాడి శ్రీనివాసరావు

తెలుగు అధ్యాపకులు, ప్రభుత్వ డిగ్రీ కళాశాల, ముమ్మిడివరం, డా.బి.ఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లా, ఆంధ్రప్రదేశ్.

ఉపోద్ఘాతం:

తెలుగు సాహిత్యం సుసంపన్నం కావడానికి ఉభయ గోదావరి జిల్లాల మహిళా రచయిత్రులు విశేష కృషి చేసారు. ఈ ప్రాంతాలు సాహిత్యపరంగా అత్యంత ప్రభావవంతమైనవిగా ప్రసిద్ధి చెందాయి. ఇక్కడ పురుష రచయితలే కాకుండా ఎందరో మహిళా రచయిత్రులు తమ కలాన్ని ఝుళిపించి, అద్భుతమైన సాహిత్యాన్ని వెలువరించారు. గోదావరి నేల ఎంతటి సారవంతమైనదో ఇక్కడ ఉద్భవించిన, సాహిత్యం కూడా అంతే సారవంత మైనది. సహజసిద్ధమైన భావోద్వేగాలతో, సామాజిక చైతన్యంతో, సాంస్కృతిక సౌందర్యంతో విరాజిల్లుతుంది. మహిళా సాహిత్యం అంటే కేవలం స్త్రీల రచనలు మాత్రమే కాదు. అది స్త్రీ జీవిత అనుభవసారాన్ని, స్వీయ స్వేచ్ఛకై చేసిన పోరాటాలను ప్రతిబింబించే సాహిత్య ప్రవాహం. గోదావరి ప్రాంత మహిళా రచయిత్రులంతా ఈ భావ జాలాన్ని తమ రచనల్లో సమర్థంగా ప్రతిబింబించారు.

గోదావరి జిల్లాల సాహిత్య నేపథ్యం:

19వ శతాబ్దం నుంచి గోదావరి ప్రాంతంలో సాంఘిక సంస్కరణోద్యమాలు మొదలై, విద్య, సంస్కృతి, సంస్కరణల కేంద్రంగా నిలిచింది. సాహిత్య నేపథ్యం ధ్వనించింది. కందుకూరి వీరేశలింగం ప్రభావంతో స్త్రీ విద్య, విధవ స్త్రీ పునర్వివాహం వంటి అంశాలు ప్రాముఖ్యతను సంతరించుకున్నాయి. ఈ నేపథ్యంలో మహిళలు సాహిత్య రంగంలోకి ప్రవేశించి, తమ ఆలోచన లను వ్యక్తపరచడం ప్రారంభించారు. 20వ శతాబ్దంలో ఇది ఒక ఉద్యమంలా మారింది. గోదావరి జిల్లాలకు చెందిన పులుగుర్త లక్ష్మీనరసాంబ, వింజమూరి వెంకట రత్నమ్మ, చావలి బంగారమ్మ, తల్లాప్రగడ విశ్వ సుందరమ్మ, గిడుగు లక్ష్మీకాంతమ్మ, కె.రామలక్ష్మి, అబ్బూరి ఛాయాదేవి, డి.కామేశ్వరి, రంగనాయకమ్మ, చుండూరి మృణాళిని మొదలైన రచయిత్రులు కథలు, కవిత్వం, కథానిక, కావ్యం, నవల, నాటిక, నాటకం, పద్య గద్యాలు, శతకం, గేయం, వ్యానం వంటి వివిధ ప్రక్రియల్లో రచనలు చేసి, తెలుగు సాహిత్య వైభవంలో భాగస్వాములయ్యారు.

గోదావరి జిల్లాల మహిళా రచయిత్రుల సాహితీ సౌరభం:

పులగుర్త లక్ష్మీనరసమాంబ మొదటి తరం తెలుగు కవయిత్రి. నరసమాంబ 1878లో చింతలపూడి నీలా చలం, అక్కమాంబ దంపతులకు కాకినాడలో జన్మిం చారు. ఈమె 1904లో 'సావిత్రి' అనే మాసపత్రిక సంపదకు రాలిగా వ్యవహరించారు. స్త్రీ విద్యా ప్రచారంలో విశేష కృషి చేశారు. వీరు పాఠశాలకు వెళ్లి చదువుకోకపోయినా తన 15 ఏళ్లకే "మహిళా కళా వినోదిని" అనే కావ్యాన్ని రచించింది. ఆంధ్రప్రదేశ్‌లో మొట్టమొదటి స్త్రీ

సమాజమును "విద్యార్థినీ సమాజం" అనే పేరుతో కాకినాడలో స్థాపించి మహిళోద్ధారణకు కృషి చేసింది. 'సావిత్రి' పత్రికలో స్త్రీల రచనల్ని ప్రోత్సహిస్తుండేవారు. కాల్పనిక సాహిత్యం రాసిన మహిళలలో వీరు ప్రథములు. లక్ష్మీ నరసమాంబ మంచి వక్త. హిందీ, బెంగాలీ భాషలలో గొప్ప పాండిత్యమున్నదామెకు. ఈమె లోకబాంధవి, వజ్రపేటిక, కామ మంజరి, యోగేశ్వరి, అన్నపూర్ణ, వామన పురాణం, మహిళా కళా బోనిని, స్త్రీ నీతి గీతమాల, సతీధర్మములు, అమూల్య, మంగళహారాలు, నీతి పదములు వంటి విభిన్నమైన రచనలు చేసారు.

"శ్రీ పరాత్పర నిత్య సేవలు సేయ నోపి పుట్టువు సార్థమొనరింపవలయు; నాణెంపు బల్కులే రాణ దనర్చు నాణి ముత్తెపుగోవ లందురు బుధులు" దైవనామ స్మరణతో మానవ జన్మ సార్థకం చేసుకోవాలని, కల్మషం లేని మాటలే మంచి ముత్యాల వలే ప్రకాశిస్తాయని పండితులంటారని నీతి పదములు ద్వారా వెల్లడించింది.

వింజమూరి వెంకటరత్నమ్మ 1889లో తూర్పు గోదావరి జిల్లా పిఠాపురంలో జన్మించారు. ఈమె ప్రసిద్ధ రచయిత దేవులపల్లి కృష్ణశాస్త్రి గారి సోదరి. వెంకటరత్నమ్మ 1914 నుండి 1920 వరకు 'అనసూయ' అనే తెలుగు పత్రిక నడిపి, సంఘ సేవ చేసారు. అలాగే అనేక పత్రికల్లో కథలు, వ్యాసాలు, పద్యాలు ప్రచురించారు. వీరు చిన్నతనంలోనే ప్రతిభను చాటుకున్నారు. నరసాపురానికి చెందిన ప్రోగ్రెసివ్ యూనియన్ వారి "విజ్ఞాన చంద్రికా మండలి" ప్రవేశపెట్టిన పరీక్షల్లో గెలిచి, గౌరవించబడ్డారు. కాకినాడలో స్త్రీ సమాజ, స్త్రీ ప్రార్థనా సమాజాలకు కార్యదర్శిగా చాలాకాలం పని చసారు. బ్రాహ్మణ కుటుంబంలో జన్మించినా, మానవీయ కోణాన్ని విడిచి పెట్టలేదు. గృహలక్ష్మి పత్రికలో ప్రచురితమైన వెంకట రత్నమ్మ గారి ఒక కవిత.

"ఉదయకాల మందు ధరణియు, జలనిధియు
నినుని కాంతికి ప్రతిఫల మిచ్చునపుడు ఇలు విడిచి
కడునుత్సాహ హృదయ నగుచు
బ్రేమ రాజ్యము న్వెదుకంగ వెడలియుంటి"

ఉషోదయమందు భూమి, నీరు సూర్యుని కాంతికి ప్రతిఫలం ఇచ్చే సమయంలో ఇల్లు విడిచి ఉత్సాహంగా, హృదయానందంతో ప్రేమరాజ్యం వెతుకుతూ వెళ్తున్నాను. అంటూ అద్భుతమైన భావాన్ని వ్యక్తం చేసారు.

చావలి బంగారమ్మ ప్రసిద్ధ రచయిత. ఈమె తూర్పు గోదావరి జిల్లా, కొత్తపేట మండలం మోడేకుర్రు గ్రామంలో జన్మించారు. ముద్దుకృష్ణ "వైతాళికులు" ద్వారా వీరి కవితలు వెలుగులోకి వచ్చాయి. బంగారమ్మ కవితలు తెలుగు కవిత్వంలో కొత్త ఒరవడిని, భావవ్యక్తీకరణను తీసుకొచ్చాయి. వీరు కవితలన్నిటిని కలిపి 1958లో "కాంచన విపంచి" పేరుతో సంకలనం చేసారు. అలతి అలతి పదాల్లో అనంతార్థాలను పొదగడం, గాఢమైన అనుభవాలను తేలికైన పదాలతో కవిత్వీకరించడం బంగారమ్మ కవితాగుణం. చిన్నవి, సున్నితమైనవి, భావ దృష్టికి అందలేనివాటిని సైతం లలితమైన పదాల్లో పొదిగి కవితలల్లడంలోని విలక్షణత ఆమె కవితల్లో కనిపిస్తుంది. జానపద గేయాల్లో కనిపించే సరళత, స్పష్టత, లయాత్మకత బంగారమ్మ కవితల్లో కనిపించే ప్రధాన లక్షణాలు. కప్పతల్లి పెళ్లి, తపస్సు, కార్తిక పూర్ణిమ, కాంచన విపంచి బంగారమ్మ రచనలు.

"కప్పతల్లి పెళ్లి నేడూ- చూడారే కావిళ్ళ నీళ్లు ఒంపినాడు!
వరుణ దేవుడు ఒంపినాడూ- ఓ చెలీ వాడలన్నీ నింపినాడు!"

అంటూ వర్షాలు కురవాలని కప్పలకు పెళ్ళిళ్ళు చేసే పూర్వపు సంప్రదాయాన్ని కప్పతల్లి పెళ్లి ద్వారా మనోహరంగా వెల్లడించింది.

తల్లాప్రగడ విశ్వసుందరమ్మ 1899లో పశ్చిమ గోదావరి జిల్లా, భీమవరం తాలూకా, ఉండి గ్రామంలో జన్మించారు. మల్లవరపు శ్రీరాములు, సీతమ్మలు వీరి తల్లిదండ్రులు. వీరి 9వ ఏటనే తల్లాప్రగడ నరసింహ శర్మతో బాల్య వివాహం కావడం వల్ల చదువు పూర్తి చేయ లేకపోయింది. కానీ పాండిత్యం మాత్రం వంట పట్టించు కున్నారు. భర్తతోపాటు రాజకీయాలలో రాణిస్తూనే కవిత్రి గా విశేషమైన పేరొందారు.

ఈమె రాసిన కవితలు "కవితా కదంబము" అనే పేరుతో వెలువరించి, సాహితీ లోకానికి అందించారు.

ఉగాది పండగ గురించి "పరుల పాలన కొంత పరచి మన దేశ ప్రజల పాలనము నాశించి ద్రోహుల ప్రచారముల ద్రుంచమని తెల్పుతూ వచ్చెనిదే సంవత్సరాది" అంటారు. రాట్నంతిప్పమంటారు. ఖద్దరు కట్టమంటారు. ఉప్పు సత్యాగ్రహం, అహింసా మార్గము విడువక, స్వహింసనైనా సహించి సత్యాగ్రహాన్ని చేయ మంటారు. "భారతీయుల మగుచు ప్రభవించి ఫలమేమి నిజదేశ స్వాతంత్ర్యమును గాంచక" అని ప్రశ్నించుతారు. బ్రిటిషువారిని దుయ్యబట్టిన విధం చూస్తే ఉత్సాహం కలుగుతుంది.

రంగనాయకమ్మ 1939లో పశ్చిమగోదావరి జిల్లా, బొమ్మిడి గ్రామం ఏలూరులో జన్మించారు. ఈమె రచనల్లో ప్రజాస్వామ్య విలువలు, సమానత్వం, కుల వివక్ష, మార్క్సిస్టు భావజాలం ఉంటాయి. ఈమె 15 నవలలు. 70 కథలు, వ్యాసాలు రాసింది, ఈమె రాసిన బలిపీఠం నవలకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం సాహిత్య అకాడమీ అవార్డు ప్రధానం చేసింది. రామాయణ విషవృక్షం వంటి విమర్శనాత్మక రచన కూడా చేసారీమె. స్త్రీ పక్షపాతిగా పేరొందారు. కృష్ణవేణి పేక మేడలు, చదువుకున్న కమల, స్త్రీ, జానకి , అమ్మకి ఆదివారం లేదా మొదలైన రచనలు చేసారు. బలిపీఠం నవల రంగనాయకమ్మకి విశేషమైన పేరు తెచ్చింది. సాంప్రదాయ బ్రాహ్మల అమ్మాయికి ప్రాణాంతక అనారోగ్యం రావడం, డాక్టర్లు జీవించడం కష్టం అని చెప్పడం, మానసిక క్షోభకు గురి కావడం, సంఘ సంస్కరణ ఉద్యమంలో క్రియాశీలుడు, అభ్యుదయ భావాలు కలిగిన ఒక హరిజనుడు ఆమె కోరిక ప్రకారం వివాహం చేసుకోవడం అదృష్టవశాత్తు ఆమె ఆరోగ్యవంతురాలు కావడం, చివరికి అతని ఒడిలోనే కన్ను మూయడం వంటి అంశాలు హృదయాన్ని కదిలిస్తాయి.

పై విధంగా గోదావరి జిల్లాల మహిళా రచయిత్రులు గరిట పట్టిన చేత్తోనే కలం పట్టి తెలుగు సాహిత్యాన్ని పరిపుష్టం చేసారనడంలో ఎంత మాత్రం అతిశయోక్తి లేదు.

ఉపయుక్త గ్రంథాలు :

1. లక్ష్మీకాంతమ్మ ఊటుకూరి (1975), ఆంధ్ర కవయిత్రులు శివాజీ ప్రెస్, గంజ్ బజార్ సికింద్రాబాదు.
2. ప్రభావతి, వాసా(2016), భారతీయ సాహిత్య నిర్మాతలు, తల్లాప్రగడ విశ్వ సుందరమ్మ, బెంగళూరు సాహిత్య అకాడమీ కృత్తికా ప్రింటర్స్.
3. బంగారమ్మ చావలి(1897-1970), 20వ శతాబ్ది తెలుగు వెలుగులు మొదటి భాగం, తెలుగు విశ్వ విద్యాలయం, హైదరాబాద్, 2005.
4. వైదేహి అల్లాడి,1975, ఆంధ్రదేశముశ- స్త్రీలు, ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమీ ప్రచురణలు.
5. తెలుగు సాహిత్య చరిత్ర, ద్వా.నా. శాస్త్రి.

★★★

Vol. 23 | Spl. Issue 03 | March 2026 | BHAVAVEENA | ISSN No. : 2456-4702 | RNI No. APTEL/2003/12253

RNI No. APTEL/2003/12253 | Reffered Journal & Peer Reviewed Journals | ISSN No. 2456-4702

భావవీణ

కళలు, సాహిత్య, సాంస్కృతిక భాషాధ్యయన పత్రిక

BHAVA VEENA

Journal of Arts, Literary, Culture & Language Study

మాతృభక్తి మంజూష మణిపూసల విశ్లేషణ

- ఉమాదేవి అడ్డగూడ
పరిశోధక విద్యార్థి, భారతీయ
ఇంజనీరింగ్ సైన్స్ & టెక్నాలజీ
ఇన్నోవేషన్ యూనివర్సిటి,
అనంతపూర్, ఎ.పి.

- ఎం. శ్రీనివాసులు
పర్యవేక్షకులు,
అసిస్టెంట్ ప్రొఫెసర్
పాలమూరు యూనివర్సిటీ
పాలమూరు.

ఉపోద్ఘాతం :

''భూప్రదక్షిణ షట్కేన కాశీయాత్ర యుతేనచ
సేతుస్నాన శతైర్యచ తత్పలం మాతృ వందనమ్'' ఈ ఆర్యోక్తిని త్రికరణశుద్ధిగా స్వీకరించిన ప్రతిభాశాలి మాన్యులు శ్రీ బుర్ర వెంకటేశం, ఐఏఎస్ గారు వారి మాతృమూర్తి స్మృత్యర్థం ఆమె వ్యక్తిత్వానికి దర్పణంగా మణిపూసల ప్రక్రియలో ఒక కవితా సంకలనాన్ని వెలువరించి అమ్మ పై వారికున్న అనంత ప్రేమను చాటు కున్నారు.

మణిపూసలు అన్న కొత్త లఘుకవితా రూపానికి సృష్టికర్త వడిచర్ల సత్యం గారు కాగా తెలుగు సాహిత్య చరిత్రలో లఘు కవిత రూపానికి శతాబ్దాల నుండి ఆదరణ ఉండగా ఆకోవలోనే కొత్త లఘురూప ప్రక్రియకు అంకురార్పణ చేశారు. నాలుగు పాదాలు, మాత్రా ఛందస్సు కలిగినటువంటి ఈ ప్రక్రియలో అనతి కాలం లోనే అనేక సంపుటాలు, సంకలనాలు వెలువడడం విశేషం. ఈ ప్రక్రియలో 28 మంది కవులు అమ్మను ఆవిష్కరించిన విధానాన్ని చాటిచెబుతూ శాడ వీరారెడ్డి, దొనికెల రాజేందర్ గౌడ్ సంపాదకత్వంలో మాతృభక్తి మంజూష అన్న సంకలనాన్ని వెలువరించారు.

వివరణ :

మాతృ మాన్, పితృ మాన్, ఆచార్యవాన్ పురుషోవేద: అని శతపథ బ్రాహ్మణంలో చెప్పినట్లు తల్లి తండ్రి గురువు ఈ ముగ్గురు ఉత్తమ శిక్షకులైనప్పటికీ తల్లియే తన సంతానానికి పునాది. తైత్తరీయ ఉపనిషత్తులో మాతృ దేవోభవ అని తల్లిని పూజనీయురాలుగా చెప్పబడినది. అలాంటి మాతృమూర్తికి పెద్ద పీట వేసి మణిపూసలలో వెలువడినటువంటి ఈ సంకలనంలో బాల కవుల నుండి బహు గ్రంథకర్తలైన సుప్రసిద్ధుల దాక చోటు సంపాదించు కొని గ్రంథానికి కావ్య గౌరవం చేకూర్చారనుట అతిశయోక్తి కాదు, కేవలం పదాలు వాక్యాలుగా కాకుండా కవుల హృదయ స్పందనలుగా ఈ మణిపూసలు నిలిచాయి.

వస్తు నిర్దేశం నియమబద్ధత శైలి, శిల్పం, తాత్విక దృక్పథం వంటి లక్షణాలు ఈ కవితా సంకలనాన్ని సుసంపన్నం చేశాయి, ఈ మణిపూసల హారంలో అన్ని అనర్ఘరత్నాలై అమ్మను ఆవిష్కరించిన అక్షర సుమాలే. సరళమైన భావం, అనుభూతి, సాంద్రత చేత పాఠకుల మనసులపై గాఢమైన ముద్రను వేసాయి. అందులో కొన్ని మణిపూసలను పరిశీలిస్తే

శాడ వీరారెడ్డి గారు "ఏమని పొగడను" అన్న శీర్షికతో

కలం గుండె కరిగింది,

కన్నీరై ఉబికింది,
అమ్మా నీ గూర్చి వ్రాసి, కాగితాల్ని తడిపింది.

అంటూ కరుణరసాత్మకంగా అమ్మను ఆవిష్కరించిన విధానం కాగితాల్ని తడపడమే కాదు అందరి మనసుల్ని తడుపుతుంది.

దొనికెల రాజేందర్ గారు రాసినటువంటి "ఏ దేవుడు తిరిగి ఇచ్చు" అన్న శీర్షికతో - మధురమైన జ్ఞాపకాలు, మరపురాని అనుభవాలు, బ్రతుకునంత వెచ్చించిన, పొందలేని అనుభూతులు.

ఏ కాలపు కొలిమిలోన, కరిగిపోయే క్షణములోన,
ఏ దేవుడు తిరిగి ఇచ్చు,
ఈ జన్మకు వరముగైన.

అమ్మ గురించి రాస్తూ వెలకట్టలేని ఆ అనుభవాలను ఏ దేవుడు తిరిగి ఇస్తాడని ఆవేదన చెందుతూ కాలపు కొలిమిలో కరిగిపోయెనంటూ అద్భుతమైన శబ్ద ప్రయోగం చేసాడు.

ఎలిశాల నాగమోహన్ గారు, పురిటి నొప్పి వెత ఎంత, చనుబాలకు విలువెంత, కొలమానం చూపుతవా, కను చెమ్మకు బరువెంత.

అణువుకు అవధానమేది, కణముకు ఆధారమేది,
ఉనికికి ఊపిరి అమ్మే, తనువుకు తడి దారమేది.

అమ్మ పురుడు పోసుకోవడమంటే మరోజన్మ ఎత్తడమే. అలాంటి ఆ పురిటి నొప్పులకు విలువ కట్టలేమని, రక్తాన్ని పాలుగా మార్చే ఆ చనుబాలకు విలువ ఏమిటని అడుగుతూనే మన ఉనికికి ఊపిరైన అమ్మకు మనకు గల పేగు బంధాన్ని తనువుకు తడి దారమేది అంటూ అందరినీ ఆలోచింప చేస్తాడు.

ప్రసవ వేదన పడకున్నా కృష్ణున్ని పెంచిన యశోదమ్మ మనసును మల్కనెల్లి లాల్ రెడ్డి గారు రేపల్లెపై ఇంద్రుడు వర్షాన్ని కురిపించే సందర్భంలో కృష్ణుడిని బయటికి వెళ్లనివ్వకుండా అక్కడి పరిస్థితిని వివరిస్తూ తల్లి చేసిన హితబోధని ఈ రకంగా వర్ణించారు.

తొలగింది గోధూళి,
నెలకొంది చలిగాలి,
వెలకేల రా కృష్ణ,
వదలయ్య ఇలునొదిలి.
కురిసేను జలధార,
తడిసేవు నువు పార, హితువునే చెబుతున్న, వినవేర చెవులార.

గోధూళి వేళ దాటిందనీ గోవులు ఇల్లకు చేరాయనీ నీతో ఆడటానికి ఎవరూ రారనీ కురిసే జలధారలో తడిసిపోతావని హితవును చెవులార వినమంటుంది. ఆ మాటలలో మాతృత్వంతో పాటు హెచ్చరిక కనిపిస్తుంది.

దేశపతి మోహన్ శర్మ గారు - అమ్మ మా నాన్నకు బలం, అద్భుతం తన కౌశలం, అన్నీ తెలిసి కూడా, అణకువ కలిగిన శీలం.

నాన్నకు అమ్మే బలమని తనకు అన్నీ తెలిసినా అణకువగా ఉంటుందంటాడు.

విశ్రాంత తెలుగు ఉపాధ్యాయులు దోరవేటి చెన్నయ్య గారు అమ్మ గురించి -

ప్రేమకుతా నాకాశము, మమకారమున ప్రకాశము,
సహనమునకు భూదేవి, అమ్మ కదా అహర్నిశము.

అమ్మను పంచభూతాలలో వర్ణిస్తూ ఆకాశమంత ప్రేమను, భూదేవంత సహనము కలిగిందంటాడు.

వెన్నెల సత్యం గారు -

అమ్మంటే ఎవరెస్టు, తనకుండదు ఏ రెస్టు,
చేయబోకు ఓ కొడకా, అమ్మ బతుకు ఫారెస్ట్.

విరామమెరగకుండా పరిశ్రమించే అమ్మ యొక్క త్యాగం ఎవరెస్టని చెబుతూనే, వృద్ధాశ్రమాలలో ఉంచుతున్న కొడుకుల కనులు తెరిపిస్తూ అమ్మని అడవులపాలు చేకూడదు అంటాడు.

సిండియాల అర్జునయ్య గారు -

తననుమర్చి పెంచుమనల, బాధననుచు పంటికొనల
మనకు బాధ కొంచమైన, కొట్టుకొనును నీటియలల.

అమ్మను గురించి తెలుపుతూ, ఇంటి నుండి తరిమినా మనసు నుండి వెలివేసినా తనను తాను మరిచిపోయి మనల్ని పెంచుతుందని తనకి ఎంత బాధ

కలిగినా పంటి కొనలలోనే అదుముకుంటుందని మనకేమనా బాధ కలిగితే నీటి అలలా కొట్టుకుంటుందని అలాంటి అమ్మ గురించి ఎంత రాసిన తక్కువే అంటాడు.

అడ్డగూడ ఉమాదేవి అమ్మ మనసును వివరిస్తూ -

అమ్మ మనసుకున్నంత, విశాలత లేక చింత,
ఆకసానికెందుకొ తా, నమ్మ ముందు ఇనుమంత.

అమ్మ మనసుకున్నంత విశాలత్వం ఆకాశానికి లేక చిన్నబోయిందనీ వ్యక్తం చేస్తూ అమ్మను ఆకాశంకంటె మిన్నగా వర్ణించారు.

వడ్ల నరసింహాచారి గారు -

అతిలితమగు నీరూపము, దివ్య జ్యోతి సమన్వితము,
ఓ అమ్మ ఈ జగాన, నీ త్యాగం అసమానం.

నిరంతరం కాంతిపంచే దివ్య జ్యోతి అమ్మ అని తన త్యాగంతో సమానమైనది లేదంటూ తల్లి సేవలో తరిస్తూ తన కనుల ముందే కదలాడుతాననీ, ఈ దేహము నీవు ఇచ్చిన బహుమానం అంటాడు.

భావోజు దివాకర శాస్త్రి గారు -

మధుర ప్రేమల సుభాషిణి, తొలి గురువు చదువుల వాణి,
వివేకముగ విశ్లేషించు, ధైర్యము నింపెడి ధీమణి.

చైతన్య దీపిక, సౌజన్యాల సాత్విక అంటూ అనేక ఉపమానాలతో అమ్మను వర్ణించిన తీరు, ధైర్యం నింపేటు వంటి ధీమణి అనడం అమ్మతత్వం ఆవిష్కృత మవుతుంది.

మణిపూసల ప్రక్రియ రూపకర్త వడిచర్ల సత్యం గారు అమ్మ గురించి -

సుతుల పట్ల కన్నతల్లి, హృదయమెపుడు పాలవెల్లి,
ఆమె రుణము తీర్చుకొనగ, సేవింపుము మళ్ళీ మళ్ళీ.

అంటూ, అమ్మంటే సృష్టి అని, పోల్చలేని త్యాగి అని, అమ్మలేని జగతి లేదంటూ ప్రగతి లేదంటూ అమ్మ లేకుండా నుగతి రాదంటూ అమ్మ హృదయాన్ని పాలవెల్లితో వర్ణించాడు.

"భావానుగుణ్యం రూపం, శక్తినిబట్టి సాక్షాత్కారం" అంటాడు కాళోజి.

కవి వస్తువు పట్ల చెందిన భావానుభూతి వ్యక్తీకరణలో రూపాన్ని పొందుతుంది. ఆ రూపం కవి శక్తిని బట్టి సాక్షాత్కరిస్తుంది అంటాడు. ప్రతిభావంతుడైన కవి తన భావవ్యక్తీకరణలో ఎన్నో ప్రయత్నాలు చేస్తాడు. అలాగే వర్ణనాంశం "అమ్మ", ఈ అంశాన్ని ఒక్కో కవి ఒక్కోరకంగా వ్యక్తం చేయడం ముదావహం.

గాండ్ల వీరమణి గారు -

జోలపాడు కోకిలమ్మ, నిదుర బుచ్చు జాబిలమ్మ,
బుజ్జగించి బువ్వ పెట్టు, అన్న పూర్ణ యే కదమ్మ

అంటూ గృహిణిగా, డాక్టర్‌గా, యుక్తిలో లాయరుగా, విద్యలు నేర్పే గురువుగా నాగరికతను సంస్కృతిని అందించే వారధిగా అమ్మను కీర్తించారు.

గంగాపురం శ్రీనివాస్ గారు -

ఒడిని బడిగ చేస్తుంది, కోక గొడుగు పడుతుంది,
తన రక్తం పంచి యిచ్చి, తనువును ముడి పెడుతుంది.

అంటూ అమ్మ తన ఒడిలో లాలిస్తూ ముద్దుమురి పాలతో అన్ని విషయాలని నేర్పిస్తూ ఉంటుందనీ, ఆపద సమయాలలో తన కోకనే గొడుగుగా పడుతుందని తన రక్తం పంచి ఇచ్చి ప్రసవ సమయంలో తన తనువును కూడా త్యాగం చేసేటువంటి త్యాగమయి అంటాడు.

గుండ్ల రాజు గారు -

అమ్మ యనెడి అక్షరములు, కదలించును ఎదుతంత్రులు,
బింబోష్ఠ్యములను కలివి, తెరిపించును మదితలుపులు.

అంటూ అమ్మ అనగానే కలిసే పెదవులను గుర్తు చేస్తాడు. ఎద తంత్రులు కూడా మీటేటువంటి శబ్దం అమ్మ అంటూ అమ్మ ప్రేమ అమరమని కొలిచే కొలబద్దలేని కరుణామృత సముద్రం అని అమ్మ పలుకులోనే తేనె జాలు వారుతుందంటాడు.

వనజ సంతోష్ గారు -

అమ్మ గోరుముద్దలోను, అమ్మ పంచు ప్రేమలోను,
హృద్యమైన భావనుండు, అమ్మ లాలి పాటలోను.

అమ్మ పెట్టు గోరుముద్దలో వంచే ప్రేమలో అపురూపమైన భావన ఉంటుందంటారు.

కుడికాల జనార్ధన్ గారు -

మన అమ్మ అక్షయపాత్ర, బిడ్డకు ఆరోగ్య మాత్ర.

అంటూ ఎన్ని తరాలు మారినా అమ్మది అనురాగ యాత్ర అంటారు.

దుబ్బాకుల కృష్ణస్వామి గారు - అమ్మను గూర్చి చెప్పగా, బ్రహ్మతరము కాదుగా, ఎన్ని జన్మలెత్తినా కవులకు వ్రాయతరము కాదంటాడు.

మిట్టపల్లి పరశురాములు గారు -

అమ్మ జాడ ఆది గురువు, అమ్మ మనకు బ్రతుకుతెరువు,
ఆమె లేని జీవితాన, బ్రతుకునంత నుండు కరువని.

ఆమె లేకపోతే జీవితం కరువుమయమవే అని తెలియజేస్తాడు.

తుమ్మ జనార్ధన్ గారు - ప్రేమకు పేరేముంది, అమ్మకు వేరే ఏముంది. అంటూ విశ్వమంతా వెతికిన అమ్మ గాక ఇంకేముంటుంది అంటారు.

గంట మనోహర్ రెడ్డి గారు - ఇలలో దేవత అమ్మ, వెలలేని మమత అమ్మ. అంటూ గృహమనే గర్భగుడికి మూలవిరాట్ అమ్మే అంటాడు.

కల్లూరి ప్రభాకరాచారి గారు - చల్లనైన అమ్మ చూపు, జీవితాంతం అవును దాపు. అంటూ మనసులోన అమ్మను తలుచుకుంటే కష్టనష్టాలను అన్నింటిని దూరం చేస్తుంది అంటాడు.

శ్రీవారి దామోదర్ గారు - అమ్మ అన్నది పదము, అమ్మ అన్నది పథము. అంటూ మన జీవిత గమ్యానికి మార్గం చూపే దేవత అమ్మే అంటాడు.

డా॥ బి. సుధాకర్ గారు -

మలమూత్రము తొలగించును, తన సుఖమును కోల్పోవును,
బిడ్డ మేలు తానుకోరి, కష్టాలను ఎదిరించును

అంటూ అమ్మ బిడ్డను పెంపు చేయడంలో పడేటు వంటి శ్రమని వ్యక్తం చేస్తాడు.

బండికాడి అంజయ్య గౌడ్ గారు - మణిపూసలని కథా రూపంలో వ్రాస్తూ

అమ్మా ఊరెలుదామని, కారులోన కూర్చొమ్మని
తల్లిని తోడ్కొని వేగ, తరలినాడు రయ్యమని.

అంటూ అమ్మ త్యాగాన్ని బిడ్డలో కలిగిన కనువిప్పుని మణిపూసలుగా కూర్చారు.

వీరే కాకుండా పిట్ల కావ్య, బండోజు శ్రావ్య, కటుకు అలేఖ్య వీరు ముగ్గురు విద్యార్థులు అయినప్పటికీ వారి మాటలలో అమ్మను అద్భుతంగా వర్ణించారు.

ముగింపు :

మన పుట్టుకకు మానవజాతి మనుగడకు మూలబిత్తిక అమ్మ, తన ప్రాణాన్ని మనలో నింపే మరో కొత్త ప్రపంచాన్ని సృష్టిస్తూ అనందించే అనిర్వచనీయమైన మాతృత్వ ఔన్నత్యాన్ని ఎత్తిచూపుతూ సరళంగా సుమధురంగా నవ్య సాహిత్య ప్రక్రియ మణిపూసల రూపంలో సంకలనం వెలువడడం సారస్వత ప్రియులకు సంతోషదాయకం.

తెలుగు సాహిత్య లోకంలో అమ్మను ఆలంబనగా చేసుకుని వివిధ ప్రక్రియల్లో సంకలనాలు వెలువడగా అందులో పోరెడ్డి రంగయ్య గారి సంపాదకత్వంలో వెలువడిన "మా అమ్మ" కూడా ఒకటి.

సమాజంలోని యాంత్రిక కుటుంబ సంబంధాలు, అంతరిస్తున్న అనుబంధాలు, వృద్ధాశ్రమాల పాలవుతున్న అమ్మానాన్నలు, వారి త్యాగాలు, అన్నీ మరచిన ఆధునిక సమాజం ఈ కవితలను చదవడం వలన కొంతైనా మార్పు కలుగుతుంది. అమ్మను తలచుకుంటూ తాదాత్మ్యతతో మణిపూసల మాలలల్లి మార్పుకై పరిశ్రమించిన ఎందరో కవుల శ్రమ ఫలించితే ఈ సంకలనానికి సార్థక్యత లభిస్తుంది.

ఆధార గ్రంథాలు :

1) వడిచర్ల మణిపూసలు - వడిచర్ల సత్యం 2) మాతృభక్తి మంజూష - రాజేందర్ గౌడ్ దొనికెల / వీరారెడ్డి శాడ
3) ఆర్య సమాజ సాహిత్యం మహిళాభ్యుదయం - కర్మిండ్ల లావణ్య

★

Vol. 23 | Spl. Issue 03 | March 2026 | BHAVAVEENA | ISSN No. : 2456-4702 | RNI No. APTEL/2003/12253

RNI No. APTEL/2003/12253 | Reffered Journal & Peer Reviewed Journals | ISSN No. 2456-4702

భావవీణ

కళలు, సాహిత్య, సాంస్కృతిక భాషాధ్యయన పత్రిక

BHAVA VEENA

Journal of Arts, Literary, Culture & Language Study

నిత్య చైతన్య స్ఫూర్తి - శకుంతల

– డా॥. శవయ్య రొజులపాటి

అతిథి అధ్యాపకులు, తెలుగు విభాగం, ఆంధ్ర విశ్వకళాపరిషత్, విశాఖపట్నం.

'మహాభారతం' భారతదేశపు ఇతిహాసం. ఇది ఒక యుద్ధ గాథ. అధర్మంపై ధర్మం గెలిచిన కథ. లోభం నాశనానికి దారి తీస్తుందని చెప్పిన కథ ఇది. సత్యమే నిత్యమని చెబుతుంది. కోపం నియంత్రించుకోవాలంటుంది. మంచి స్నేహం మేలని చెబుతుంది. దాన గుణం ప్రధానం అంటుంది. వెరసి మనిషి జీవితం ఎలా ఉంటే బాగుంటుందో చెప్పిన కథ ఇది.

అలాంటి కథలో... తల్లిదండ్రుల నిరాదరణకు గురై, గొప్ప గురువుల పెంపకంలో పెరిగిన బిడ్డ 'శకుంతల' జీవితస్ఫూర్తి గాథ నేటి సమాజానికి నిత్యస్ఫూర్తిగా ఉంటుందని అనడంలో సందేహం లేదు.

శకుంతల కుమారుడు భరతుని పేరు మీద మన ఈ దేశానికి 'భారతదేశం' అనే పేరు పడిందని పండితులు చెప్పారు. భారతం కూడా ఈ వంశం వారి కథే. భరతుడి తండ్రి దుష్యంతుడు. దుష్యంతుడు.. శకుంతలను గాంధర్వ వివాహం చేసుకుంటాడు. ఆమెను అంతఃపురానికి తీసుకెళ్తానని మాట ఇచ్చాడు. కానీ ఆ మాట నిలబెట్టుకోలేదు. శకుంతల తన కొడుకుతో కలిసి దుష్యంతుని సభామందిరానికి వెళ్తుంది. రాజు గుర్తు పట్టడు, ఆమెను భార్యగా అంగీకరించడు. దీనితో - వివాహ ధర్మంతో పాటు, సత్యం కూడా కుప్పకూలిపోతుంది. శకుంతల తన గృహ యజమాని అయిన దుష్యంతునికి చెప్పిన ధర్మం ఎంతో గొప్పది.

యజమాని, భార్య, సంతానం ఏక సూత్రంగా సత్యం పట్ల ఉండవలసిన ధర్మాన్ని నిండు సభలో వివరించి చెబుతుంది. గృహ యజమాని పాటించాల్సిన ధర్మాన్ని గుర్తు చేస్తుంది. అయినా దుష్యంతుడు ఆమె మాటలు వినకపోగా నిందిస్తాడు. ఆకాశవాణి నిజం చెబుతుంది. అపనాదులు మొయ్యాల్సి వస్తుందనే భయంతో అబద్ధ మాడానని నిండు సభలో అంగీకరించిన రాజు శకుంతలను పట్టపురాణిగా స్వీకరించి ఇచ్చిన మాట ప్రకారం భరతునికి రాజ్యాభిషేకం చేస్తాడు.

గృహస్థ ధర్మం నాలుగు పాదాలతో నడవాలంటే ఆ ధర్మాన్ని నిర్వర్తించే వారికి అంతఃకరణ శుద్ధి ఉండాలని ఈకథ బోధిస్తుంది. దుష్యంతుడు తనను గుర్తుపట్టక పోయినా, అవనిందలు వేసినా ఏమాత్రం కలత చెందకుండా శకుంతల చూపిన నేర్పు, ఓర్పు నేటి సమాజానికి ఎంతో అవసరం.

ప్రేమ పేరుతో మాయమాటలతో వంచనకు గురైన వాళ్ళకు ఈ కథ ధైర్యాన్నిస్తుంది, ప్రేరణ కలిగిస్తుంది. ఇంటి యజమాని బాధ్యతల్ని విస్మరిస్తే నేర్పుగా నిలదీసే శక్తి, యుక్తి శకుంతల నేర్పిస్తుంది.

మేనక, విశ్వామిత్రుల నిరాదరణకు గురైన

శకుంతలను కణ్వ మహర్షి పెంచి పెద్ద చేసి, విద్యా బుద్ధులు నేర్పిస్తాడు. మహర్షి ఆశ్రమంలో లేని సమయంలో వచ్చిన దుష్యంతుడు శకుంతులను గాంధర్వ వివాహం చేసుకుంటాడు.

బ్రహ్మ, దైవ, ఆర్ష, ప్రజాపత్య, గాంధర్వ, అసుర, రాక్షస, పైశాచ అనే 8 రకాల వివాహాలు హైందవ ధర్మంలో ఉన్నాయి. పరస్పర ప్రేమతో పెద్దల అనుమతి పొంద కుండా పెళ్ళిచేసుకొనే వెసులుబాటు కలిగినది గాంధర్వ వివాహం. ఇది క్షత్రియులకు సమ్మతమే.

వివాహం తదనంతర క్రతువులు పూర్తైన తరువాత దుష్యంతుడు రాజ్యానికి బయలుదేరుతూ "నిన్ను అంతఃపురానికి తీసుకురావటానికి పెద్దలను పంపుతాన"ని శకుంతలకు చెప్పి వెళ్ళిపోతాడు. ఎంతోకాలం దుష్యంతుని రాక కోసం శకుంతల ఎదురు చూస్తుంది. ఇక్కడ శకుంతల వంచనకు గురయిందని తెలుస్తూనే ఉంది. దుష్యంతుడు ఇకరాడని గ్రహించిన కణ్వుడు...

"ఎట్టి సాధ్వులకును బుట్టిన యిండ్లను
చెద్దకాల మునికి తద్ద తగదు
పతుల కడన యునికి సతులకు ధర్మవు
సతుల కేడ గడయి బతుల చనవె"

...అని, "స్త్రీలను వివాహం తరువాత ఎక్కువ కాలం పుట్టిన ఇంటిలో ఉండటం మంచిది కాదని, భర్త దగ్గరే ఉండటం సబబు" అని ఉపదేశం చేస్తాడు. శకుంతల పుట్టిన నాటి నుండి సరియైన భోగభాగ్యాలను పొందినది కాదని, అలాగే ఎక్కువకాలం భర్త అనురాగం కుండా ఆమె పొందలేదని కణ్వునికి తెలుసు. ముని పెంపకంలో పెరిగినది కావడం వలన రాజు ఎప్పటికైనా తన మాటను నిలబెట్టుకుంటాడని ఓర్పుతో ఎదురు చూసిందే గానీ.. కణ్వున్ని ఏరోజూ భర్త గురించి అడిగింది కాదు. కణ్వుడే ఆమె అంతరంగాన్ని గ్రహించి భర్తకు దగ్గర చేయాలనే తలంపు చేసినట్లు కనిపిస్తుంది.

ఒక మంచిరోజు చూసుకొని కణ్వ మహాముని శకుంత లను, భరతుడుని తన శిష్య సహితంగా దుష్యంతుని దగ్గరకు పంపిస్తాడు. నేటి రోజుల్లో భార్యభర్తల మధ్య అభిప్రాయ భేదాలు వస్తే ఇరువర్గాల వారు రాజీ కోసం బలవంతులను ఆశ్రయిస్తారు. ఆ సందర్భాల్లో బల వంతులు ఘర్షణ పడటం కూడా కద్దు.

కణ్వునికి తెలుసు..శకుంతల తన శక్తియుక్తులతో, నేర్చుకున్న వేదవేదాంగ విద్య పాండిత్యంతో ఏమైనా చేయగలదని. సామంతులు, మంత్రులు, పురోహితులు, ప్రధానులు, పురజనులతో ఉన్న సభలో శకుంతలను చూసిన దుష్యంతుడు ఏమీ ఎరుగనివాడివలే ప్రవర్తిస్తాడు. వేటకోసం వచ్చినప్పుడు చూపించిన ప్రేమ, వాత్సల్యాలు ఇప్పుడు కరవయ్యాయని గ్రహించుకున్న శకుంతల, భర్త గౌరవానికి భంగం కలగకుండా తన మనస్సులోనే వేదన చెందుతుంది.

"వలదు బుద్ధిమంతులు నవప్రియులైన ధరాధినా థులన్" - కొత్త కొత్తవాటిని ప్రేమించే రాజులు కలుపు గోలుతనంతో పలకరించినా బుద్ధిమంతులు నమ్మ రాదంటూ నేటి సమాజానికి హితవు పలుకుతుంది శకుంతల. ప్రస్తుత సమంజంలో పాలకులు కొందరు ప్రజల్ని మభ్యపెట్టడానికి వారితో మమేకమై ప్రచార, ప్రఖ్యాతులు పొందుతారు తప్ప ఆ సమాజానికి మేలు ఒనగూర్చడానికి పూనుకోవడం లేదు. అంటే వాళ్ళే మాటలన్నీ నీటి మీది రాతలన్నమాట.

"మఱచిన దలపింపగ నగు
నెఱుగని నాడెల్లపాటు నెఱిగింపనగున్..."

- ఎవరైనా నిజంగా మరచిపోతే జ్ఞాపకం చేయవచ్చు. అసలు తెలియనప్పుడు ఏ పాటుపడి అయినా తెలియ జెప్పవచ్చు. కాగా, తెలిసి కూడా తెలియని వాడివలె నటించే మోసగాడికి తెలియచేయటం బ్రహ్మతరం కూడా కాదంటుంది శకుంతల.

ఒక సత్యాన్ని అబద్ధంగా మారుస్తూ ప్రవర్తించే మనుషులు సాహితీ రచనల్లో కనిపించడం కాదు, మన నిజజీవితాల్లో కూడా తారసపడుతుంటారు.

"నిన్ను నేను ఎరుగను, నీవు అసలు ఎవరవు, అబద్ధాలు ఆడకు, వచ్చిన చోటికి వెళ్ళు" అన్న దుష్యం తుని మాటలకు శకుంతల నిశ్చేష్టురాలవుతుంది. కన్నీటిని అదిమిపెట్టుకొని, బాధామయమైన హృదయంతో ఉన్న

శకుంతల వంటి స్త్రీలు ఈ సమాజంలో ఎంతోమంది ఉన్నారు. అసమాన సమాజంలో దోపిడీకి, నిరాదరణకు గురియైన స్త్రీలను అక్కున చేర్చుకునేవారు చాలా తక్కువ మంది ఉంటారు. వంచితులై, తమ కర్మ ఇంతేననుకుని కాల చక్రంలో కలిసిపోయేవారు ఎక్కువ. కానీ ఇక్కడ శకుంతల ఎంతో నేర్చును ప్రదర్శించింది.

ధర్మం, అర్థం, కామం అనే పురుషార్థాలు సాధించడానికి అనువైనది గృహనీతి అంటుంది. ఆలుబిడ్డలను అప్యాయంగా చూసేవారికి ఏ చోటనైనా, ఎటువంటి పరిస్థితులలోనైనా, ఆపదలలోనైనా, ఇబ్బందులలోనైనా కలిగిన దుఃఖం శాశ్వతం కాదని, గృహస్థు ధర్మాన్ని గుర్తు చేస్తుంది -- శకుంతల.

"ఒక దీపం నుండి మరొక దీపం పుట్టి వెలుగొందినట్లు నీ శరీరం నుండి పుట్టిన పుత్రుడు ఉత్తమంగా ప్రకాశిస్తాడ"ని చెప్పి, "పుత్రుడైన వాడు ఉత్తమశీలుడై ఉండి తల్లిదండ్రుల ఉభయ వంశాల వారినీ ఉద్ధరిస్తాడు" అంటుంది.

దుష్యంతుడికి ఆ ఉత్తమ గుణాలు లేవు కాబట్టి వంశం అప్రతిష్ఠ పాలు అవుతుందనే విషయాన్ని శకుంతల నేర్పుగా చెబుతుందన్నమాట. అయినప్పటికినీ అసత్యం పలుకుతున్న దుష్యంతుడిని...

"నుతజల పూరితంబు లను నూతులు నూఱిటి కంటె సూనృత
వ్రత యొక బావి మేలు, మఱి బావులు నూఱిటి కంటె నొక్కస
త్క్రతువది మేలు, తత్క్రతు శతంబుకంటె సుతుండు మేలు త
త్సుత శతకంబుకంటె నొక సూనృత వాక్యము మేలు సూడగన్"

...అంటూ శకుంతల హితవు పలుకుతుంది, ఒక విధంగా దుష్యంతుడి దెప్పి పొడుస్తుంది.

ఆగ్రహంలోనూ ఆమె ఔచిత్యం పాటించింది. నూరు యజ్ఞాల కంటే ఒక పుత్రుడు, అట్టి నూర్గురు పుత్రుల కంటే ఒక మంచి మాట పలకటం మేలని చెప్పింది. గృహస్థాశ్రమ ధర్మంలో సంతానం కంటే సత్యమే గొప్పదని శకుంతల చెప్పిన సత్యాన్ని నేటి సమాజం మరవకూడదు. భార్యాభర్తల అనురాగం ఎప్పటికీ నిలిచి ఉండాలంటే పరస్పరం నమ్మకం ఉండాలి. ఆ నమ్మకమనేది వారి వారి ప్రవర్తనలపై ఆధారపడి ఉంటుంది. ప్రవర్తనను నిలబెట్టేది సత్యమే కదా...అంటూ శకుంతల సత్య వాక్కును మెచ్చిన ఆకాశవాణి, దుష్యంతుడిని నిండు సభలో మాట్లాడేలా చేసి శకుంతలా దుష్యంతులను ఒకటి చేస్తుంది. ఇక్కడ మాట్లాడిన ఆ అశరీరవాణి దుష్యంతుడి అంతర్వాణియే అని చెప్పుకోవాలి.

చదువుకున్న స్త్రీ తన ఇంటిని తానే చక్కదిద్దుకుంటుందని అంటారు కదా! అది శకుంతల విషయంలో నిజమైంది. ఓర్పు, సహనంతో ఎన్నో విషయులను పరిష్కరించుకోవచ్చనడానికి శకుంతల కథే నిదర్శనం. దుష్యంతుడు లౌకిక ధర్మానికి ప్రాతినిధ్యం వహిస్తే, శకుంతల ఆత్మ ధర్మానికి ప్రతీకగా నిలబడుతుంది. భార్య, భర్త, సంతానం, సత్యం అనేవి గృహస్థులకు నాలుగు స్తంభాల వంటివి. ఆ వ్యవస్థలో ఏ చిన్నలోపం వచ్చినా సంసారం రోడ్డున పడుతుంది. గృహస్థ ధర్మం నాలుగు పాదాలతో నడవాలంటే ఆ ధర్మాన్ని నిర్వహించే వారికి అంతఃకరణ శుద్ధి ఉండాలని దుష్యంతుని కథ ఎరుకపరుస్తుంది. భర్త సత్యవంతుడు కాకపోతే కుటుంబ వ్యవస్థ చిన్నాభిన్నం అవుతుంది, ఇల్లాలికి అన్యాయం జరుగుతుంది, పిల్లలు అస్తిత్వం లేకుండా పోతారు. అలా జరగకుండా జాగ్రత్తపడాలనే సత్యాన్ని మనకు శకుంతల బోధిస్తుంది.

కుటుంబ విలువలలో స్త్రీ వ్యక్తిత్వానికి సజీవ రూప కల్పన శకుంతం. స్త్రీగా, భార్యగా, తల్లిగా, కుమార్తెగా, ఉపాధ్యాయినిగా, వివేకవతిగా, ధర్మోద్ధారకురాలిగా తన వ్యక్తిత్వాన్ని ప్రదర్శిస్తుంది. అంతఃపురానికి పిలిపించుకుంటానని ఊరడింపు మాటలు పలికిన దుష్యంతున్ని పల్లెత్తుమాట కూడా అనదు. ధర్మబుద్ధితో వ్యవహరిస్తుంది. పుట్టింట తండ్రి మంటను జవదాటదు. గృహస్థ ధర్మానికి భంగం కలిగినప్పుడు శకుంతల చేసిన ధర్మోపన్యాసంతో దుష్యంతుడు సత్యమార్గంలో పయనిస్తాడు. గృహస్థ ధర్మాలు చర్చచేసి ప్రజాకోర్టులో కేసును పరిష్కరించుకున్న

మొదటి భారత స్త్రీ శకుంతలే. నిజం గెలిచింది, ధర్మం నిలిచింది. శకుంతల వాక్కు నిత్య స్ఫూర్తి అయ్యి దేదీప్యమానంగా వెలుగుతుండాలి.. ఈ నాగరిక సమాజంలో.

ఆధార గ్రంథాలు :

1) తెలుగు సాహిత్య సమీక్ష 1, 2 - డా. జి. నాగయ్య
2) సంస్కృత సాహిత్య చరిత్ర - డా. ముదిగంటి గోపాలరెడ్డి, డా. ముదిగంటి సుజాతారెడ్డి
3) ఆంధ్ర మహాభారతం - తిరుమల తిరుపతి దేవస్థానములు

★★★

Vol. 23 | Spl. Issue 03 | March 2026 | BHAVAVEENA | ISSN No. : 2456-4702 | RNI No. APTEL/2003/12253

RNI No. APTEL/2003/12253 | Reffered Journal & Peer Reviewed Journals | ISSN No. 2456-4702

భావవీణ

కళలు, సాహిత్య, సాంస్కృతిక భాషాధ్యయన పత్రిక

BHAVA VEENA

Journal of Arts, Literary, Culture & Language Study

వర విక్రయం నాటకం - మహిళా చైతన్యం

- తంత్రవహి శ్రీరామమూర్తి

తెలుగు అధ్యాపకులు, ప్రభుత్వ జూనియర్ కళాశాల, సామర్లకోట.

వరకట్నపిశాచం ఆడపిల్లలను, వారిని కన్న తల్లిదండ్రులను పట్టి, వారి రక్తమాంసములను జుర్రుకొనడమే కాకుండా వారి మానప్రాణాలను కూడా హరించి తినివేస్తున్నది. దానిని నాశనం చేయదలచి ప్రజలలో వరకట్న దురాచారం పట్ల ఏహ్యభావం కలిగించటానికి, ఆడపిల్లలకు కలిగే హైన్యస్థితిని, తల్లిదండ్రుల కష్టాలను ఎత్తిచూపి, ప్రజలకు కనువిప్పు కలిగించటానికి వందేళ్ళ పూర్వమే కాళ్లకూరి నారాయణరావు వరవిక్రయం నాటకం రచించారు. ఇందులోని మహిళా పాత్రల చైతన్యాన్ని పరిశీలించటమే ఈ వ్యాసం ఉద్దేశం.

కన్యాశుల్కం నిర్మూలన ఇంకా జరిగిందో లేదో తెలియని దశలో వరకట్నం దురాచారం జడలు విప్పింది. ఈ దురాచారాల వలన పీడన పొందినది మహిళలే. మొదటి సమస్యను నిలువెత్తు పటం కట్టి చతురంగా చూపినది గురజాడవారైతే రెండవదానిని కళ్లకు కట్టినట్లు చూపినది కాళ్లకూరి వారు.ఈ వర విక్రయం నాటకంలో నాలుగు స్త్రీ పాత్రలు ఉన్నాయి. ఒకటి తల్లి భ్రమరాంబ. పురుషోత్తమరావు గారి భార్య. రెండవది వీరి పుత్రికలైన కాళింది, కమలాంబ కమల అత్తగారు సుభద్ర. ఈ నాలుగు పాత్రలు భిన్నమైన వ్యక్తిత్వం గల పాత్రలు.కానీ కట్నము ఇచ్చి పెండ్లిచేయటం, చేసుకోవటం పట్ల తీవ్ర నిరసన కలవి.

ఒక విషయం పట్ల సమాజంలో ఉన్న వ్యక్తుల దృక్పథమే ఆ సమాజాన్ని ముందుకు నడిపిస్తుంది. స్వాతంత్ర్యోద్యమం ఉద్ధృతంగా జరుగుతున్న కాలంలో ఈ నాటకం రచించబడింది. స్వదేశీ భావనతో దుస్తులు రాట్నంపై వడికి తయారు చేసుకోవడం ఇంటింట ఒక ఉద్యమంగా జరుగుతున్న రోజులవి. రాట్నం గురించిన ప్రస్తావనతోనే నాటకం ప్రారంభమవుతుంది.

"చరకా ప్రభావం బెవ్వరి కెరుక! జగతిలోన మన చరకా
సిరులతోడ దులదూగుచున్న యల సీమజాతి చూచు
చున్నదేమఱక, చరకా" (అం.1పు.7)

కాళింది, కమల అక్కా చెల్లెళ్లు ఇరువురు చరకా గానం చేస్తూనే నాటకం ప్రారంభమవుతుంది. నాటకానికి ఈ ఇరువురు ప్రధాన పాత్రలని చెప్పకనే చెప్పారు రచయిత. జాతీయోద్యమం పట్ల ఉన్న మహిళల చైతన్యమే ఈ సన్నివేశంలో కనిపిస్తుంది. కాళింది పాత్ర చనిపోయేటపుడు "గడియారపు ముండ్లవలె నీయాకులెప్పుడును గదులు చునే ఉండుగాక! నీమధురగాన మెల్లప్పుడునిఖిల దిసలయందు ధ్వనించుచునే యుండుగాక" అనిరాట్నం నిరంతరాయంగా తిరగాలని చివరి ప్రార్థనలో కోరుకుంటుంది. ఇది ఈ నాటకంలోని మహిళలకు జాతీయోద్యమం పట్ల ఉన్న చైతన్యమే. ఈ రెండు ప్రధాన

పాత్రలయిన కాళింది కమల చైతన్యాన్ని కవి ఎలా నిరూపించారో చూద్దాం.

కాళింది :

కాళింది పదమూడు సంవత్సరాల బాల, పురుషోత్తమ రావు, భ్రమరాంబల పెద్ద కుమార్తె. పేరయ్య పెళ్లివారికి కాళింది గురించి చెబుతూ "పక్వానికి వచ్చిన పండు, ముఖం ముద్దరోడుతూ ఉంటుంది. కళ్లు చూస్తే కడుపు నిండవలసిందే. చక్కగా చదువుతుంది" అంటాడు. "ఇంగ్లీషు తెలుగు చదివేవారము, ఇపుడు హిందీ సంస్కృతము చదువుచున్నాము.హార్మోనియము వాయించగలము " అని పేరయ్యతో కాళింది, కమల చెబుతారు. కాళింది రూప లావణ్యాలను స్వభావాన్ని తల్లి భ్రమరాంబ తలుచుకొనే సందర్భంలో కాళింది పాత్రను కవి ఎలా తీర్చిదిద్దారో తెలుస్తుంది.

ఎన్నడు మాటకెదురు చెప్పగలేదు, తండ్రిగీచిన గీటు దాటలేదు!
బడియన్న నెన్నడుఁ బ్రాలుమాలగ లేదు, రాట్నంబు నెడలఁ బరాకు లేదు!
అది నాకు కావలెనని యెన్నడన లేదు కుడుచునప్పుడు కూడఁ గొడవలేదు!
ఆటలయందైన నలుక యెన్నడు లేదు పారుగింటికేనియుఁ బోకలేదు!
కలికమునకేనియు నోటఁ గల్లలేదు!
మచ్చునకు నేనియుం బొల్లుమాట లేదు!...
(అం.6 పు.56)

కాళింది పెళ్లి కుదిరే ముందే కట్నం ఇచ్చి పెళ్లి చేసుకునేందుకు సుతారాము అంగీకరించదు. అందుకే తల్లితో ఇలా అంటుంది.

మీకుఁ గులములేద? మాకు రూపము లేద! యింత దైన్యమునకు హేతువేమి?
కట్నమిచ్చి వరుని గడియించుకొను కంటె చిన్నతనము వేరె యున్నదమ్మ! (అం.4.పు-40)

వరవిక్రయ ప్రక్రియలో తాను భాగస్వామి కావడాన్ని జీర్ణించుకోలేకపోతుంది. "అడిగేవారికి పాపభయంలేక, ఇచ్చేవారికి సిగ్గు ఎగ్గులేక నడుస్తున్న వరశుల్క నాటకంలో అయ్యో మనము పాత్రలమవటం తగినదేనా" అని వాపోతుంది. ఈ వరకట్న దురాచారం పోవాలంటే ఏమి చేయాలో కూడా కాళింది చెబుతుంది. సమస్యనే కాక దానికి ఒక పరిష్కారాన్ని కూడా తెలుసుకున్న చైతన్యశీలి కాళింది.

తిరముగనింటి ముందుఁ బెను దేవళములుండగ మ్రొక్కుబళ్లతోఁ
దిరుపతికేగినట్లు కులదీపకులెందఱొ లేమిచే వివాహరహితులై కనంబడెడునప్పుడు బారిని కోసి కట్నమే పరువుగ నెంచువారికయి పర్వులిడంబని యేమి వచ్చెనే?
(అం.4.పు-41)

ధనవంతులు కాని యోగ్యులు, అవివాహితులు అనేక మంది ఉన్నా కేవలం ధనవంతులకు మాత్రమే ఇచ్చి పెళ్లిచేయాలనే ఆడపిల్లల తల్లిదండ్రుల వల్లనే ఈ వరకట్న సమస్య పెరుగుతోందనే విషయాన్ని కాళింది గుర్తించింది. అన్యోన్యంగా ఉంటూ కష్టసుఖాలు పంచుకునే సంసారమే సంసారం కానీ కట్నంకోసం పాట్లు పడి, పెళ్లయ్యాక హింసలు పొందే సంసారంలో సుఖం ఉండదనే చింతన కాళిందికి ఉన్నట్లు తెలుస్తుంది.ఏనాటి కాలంలోనైనా అమ్మాయిలు, తల్లి దండ్రులు గ్రహింపవలసిన సత్యం ఇది.వరకట్న పిశాచం వలన స్త్రీజన్మ ఎంత దుర్భరంగా ఉందో కమల చెప్పినపుడు కాళింది బాగా చెప్పావని ప్రశంసించి, ఇలా అంటుంది.

కట్టగృహంబులమ్ముకొని కట్నమునీయక పెండ్లి కానియా
కట్టడి వక్రకాలమునం గానం మధ్యమునందు బుట్టగాఁ
బుట్టగఁ జెల్లుగాని యొక భూపతి కేమియు నాడు బిడ్డగాఁ
బుట్టగరాదు వుట్టునెడఁ బుట్టినయవ్వుడె గిట్టఁగాదగున్ (అం.1-పు.13)

కట్నం కోరుకునే వాడు గాడిదేనని నిశ్చయంగా చెబుతుంది. వాడిని పెళ్లి చేసుకుని కాపురం చేసే కంటే పెళ్లి

మానుకుని మగవాని వలె తల్లిదండ్రుల వద్దే ఉండటం మేలంటుంది. ఈ అభిప్రాయం ఈ రోజుకాదు వందేళ్ల పూర్వమని పాఠకులు గుర్తుంచుకున్నపుడే కాళింది ఒక కాలానికి కంటే ఎంత ముందు ఉందో ఎంత అభ్యుదయ వాదో మనం గమనించగలము.

కట్నమే కోరి వచ్చిన ఖరముతోడఁ
దగుదునని కాపురము సేయు దాని కంటె
బెండ్లియే మానకొని మగబిడ్డ వలెనే
తల్లిదండ్రుల కడ నుంట తప్పిదంబె! (అం.4 పు.41)

తండ్రితో కూడా ఇదే విషయాన్ని మరలా చెబుతుంది. భావాలలో తీవ్రత మాత్రమే కాక వ్యక్తీకరణలోనే ఆ తీవ్రత కనిపిస్తుంది.కొడుకనుకొని ఇంట్లో ఉంచుకుంటే నేనే మిమ్మల్ని పోషించే శక్తి పొంది పోషిస్తానని చెప్పటం ఆ కాలానికి సాహసమే. ఉన్నత విద్యలు చదివి, లక్షలు సంపాదించే ఉద్యోగాలు చేసే ఆడపిల్లల తల్లిదండ్రులు కూడా ఇప్పటికీ కాళింది మాటలను అంగీకరించే స్థితిలో ఉన్నారా అని ప్రశ్నించుకుంటే సరైన సమాధానం లభించని స్థితిలోనే ఉంది కదా మన సమాజం.

కూతురనుచు బరుల చేతిలోబెట్టక
కొడుగటంచు నన్ను గొంపలోనె
యుంచుకొనుడు, మీరు పెంచలేకున్న గ
ష్టించి మిమ్ము నేనే పెంచుదాన! (అం.4 పు.43)

కట్నమిచ్చిపెళ్లి చేసుకొనే అవసరమే వస్తే తను ప్రాణమైనా తీసుకుంటాను కాని పెళ్లి చేసుకోను అనేది తన " ప్రతిన" అని ధైర్యంగా చెల్లెలు కమలతో చెబుతుంది.

నాదు ప్రతినంబు వినుము ప్రాణములనైన
విడిచెదంగాని యడిగిన విత్తమిచ్చి
వరుని గొనితెచ్చినట్టి వివాహమునకు
సమ్మతింప నా రాట్నము సాక్షిగాను. (అం.1 పు.13)

"ఓ దైవమా! తన అభిప్రాయం చెప్పినా ఏడ్చినా, మొత్తుకున్నా, నా తల్లికి తోచదాయె. ఇది తప్పిదపు పని అనుకుంటూ కూడా తండ్రి క్రిందిమెట్టుకు జారి నన్ను గమనించటంలేదు నన్ను చెల్లని డబ్బుక్రింద ఇలా ఎందుకు చేసావు ?" అంటుంది. ఇక్కడ కాళిందిని గమనిస్తే తన అభిప్రాయానికి తల్లిదండ్రులు గమనించటం లేదని తనను చెల్లని డబ్బుగా చూస్తున్నారని బాధపడడం కనిపిస్తుంది. తనకు స్వతంత్రమొక్క లేశము కూడాలేదు. ఒక కొంత కూడా గౌరవం లేదు. ఇక మెచ్చుకోవడమా! అదీ లేదు.ఇల్లు అమ్ముకుని అర్పించుకుంటే కానీ పెండ్లికాదు. ఆడపుట్టుక అవమానపు పుట్టుక క్రింద ఏర్పడింది కదా అని విచారిస్తుంది.

ఏమిచేయాలో పాలుపోవని స్థితిలో చెల్లెలు కమల ఓరుగల్లులో వరకట్నమునకు బలై ఒక యువతి విషపానము చేసిందన్న వార్త చదువుతుంది. ఉన్న ఎకరాలు అమ్మి తల్లిదండ్రులు పెళ్లి చేసి ఆ తరువాత తిండికి కూడా లేక మలమల మాడిపోతారనే ఊహ తను భరించలేకపోతుంది. ఓరుగంటి యువతి సాహసం తనకు ఎందుకు మార్గదర్శనం కాదు అనుకుంటుంది. మానమును రక్షించుకొనుటకు ప్రాణములు తీసికొన్న బొబ్బిలి రాజస్త్రీలను, పెద్దాపురం క్షత్రియాంగనలను వీరవనితలని గుర్తు చేసుకుంటుంది.ఈశ్వరుని మన్నించమని వేడుకుంటుంది. సంఘసంస్కర్తల ఉపన్యాసాలు ఆచరణలోనికి రాకపోవటాన్ని ప్రశ్నిస్తుంది.

ఇలా కాళింది చేసిన చివరి విన్నపము, పొందిన ఆక్రోశము పాఠకుల హృదయాలలో దొంతరలుగా తిరుగుతూ కన్నీరు పెట్టిస్తుంది. సిగ్గులేని సమాజాన్ని నిగ్గుతీసి అడుగుతున్నట్లు ఉన్న ఈ మాటలు కవిగారి హృదయవేదనను బహిర్గతం చేసే కన్నీటి జలధి తరంగాలు. కాళింది పాత్రపట్ల కవికి ఒక ప్రత్యేక దృష్టి ఉన్నట్లు, ఈ చివరి మాటలను సుదీర్ఘంగా చెప్పటం వలన కవి తన ఆవేదనను ఆవేశమును అంతా సమాజంపై వెలిగ్రక్కే నన్నివేశము కల్పించునట్టు పాఠకులకు అనిపిస్తుంది.

ఈ విధంగా పంచమాంకం వరకు రాసి ఉంటే ఈ నాటకం విషాదాంత నాటకం పరిణమించి ఉండేది. దానిని మించిన వివేకం ఉన్నవారు కాళ్లకూరి వారు. అందుకే కాళింది మరణాన్ని ఒక పెద్దమలుపుగా మరలించి ఉదాత్తమైన కమల పాత్రద్వారా సమాజానికి ఒక గొప్ప సందేశం ఇచ్చేలా మిగతా ఐదు అంకాల రచన సాగించారు. మంచి సమాజాన్ని కోరి అది రానపుడు

మరణించే వీర వనితగా కాళిందిని చూపిస్తే దానిని తన తెలివి తేటలతో సాధించి గొప్ప బాటను పరిచి, భవిష్యత్తు తరాలకు అందించిన ధీర వనితగా కమల పాత్రను చిత్రించారు కాళ్లకూరి వారు.

కమల :

కాళింది కంటె రెండు సంవత్సరాలు చిన్నది పదకొండు సంవత్సరాల చిన్నారి కమల. కానీ ఆమెకున్న పరిశీలనా శక్తి, వివేచన, సాహసం ఆమెను వయసుకు మించి ప్రకాశం చేస్తాయి. ఆడపిల్లల పెళ్లిచేయాలంటే తండ్రి పడే ఇబ్బందులు తల్లి చెబుతుంటే తల్లికూడా ఇందులో ఎలా భాగస్వామ్యం వహిస్తుందో గుర్తించి ఆమెకే చెబుతుంది.

కార్యమగుదాక నయ్యయో! కాకపోయె
ననుచుఁ దపియించు రేపవలాత్మలోన
కార్యమగునంత బిడ్డనెక్కరిణి విడిచి
యుండనోపుదునని దిగులొందు మదిని

(అం.1 పు.13)

వరకట్నం దు:ఖానికే కారణం అవుతోందని తన నిరసన వ్యక్తం చేస్తుంది.తండ్రులకు కట్నబాధ, తల్లులకు వియోగబాధ, ఆడపిల్లలకు ఇంకొకరి యింటి దాస్యబాధ, ఇలాంటి దరిద్రపు ఆడు పుట్టువే పుట్టకూడదని అనుకుంటున్నాని బాధ పడుతుంది. వెలపెట్టి కొనుక్కున్న స్త్రీని వెలయాలు అంటాము. మరి వెలపెట్టి కొన్న మగవాడిని ఏమని పిలవాలి? వెలమగడు అనాలి కదా అని వరకట్నం తీసుకునే మగవారిపట్ల తీవ్ర ఏహ్యభావాన్ని ప్రకటిస్తుంది.

వెండినాణెంబె పెనిమిటి, వేశ్య కటులె;
కట్నములె భార్యలిప్పటి కర్కశులకు;
వేశ్య వెలయాలనంబడె వెలగ్రహించి
కట్నములచేత వెలమగల్ కారెమీరు!

(అం.1 పు.18)

తనువు అశాశ్వతం. క్షణభంగురమైన జీవితం కోసం ధనం ఇచ్చి భర్తలను పొంది దాస్యం చేయటం కంటె పెళ్ళి మానకుని హాయిగ యోగినుల వలె రాట్నము తిప్పుకుంటూ ఉండిపోతే సుఖంగా ఉంటాము కదా! తండ్రి అగచాట్లు కూడా తప్పుతాయి కదా! అనుకుంటుంది. కట్నం కోసం పాలం అమ్మారనే విషయాన్ని అక్క కాళిందికి చెప్పడం ద్వారా ఎవరూ చెప్పకపోయినా పరిశీలన ద్వారానే తెలుసుకొనే తెలివితేటలు కలది కమల అని తెలుస్తుంది. కొడుకు అయినా కూతురు అయినా చదివించడం, పెళ్లిచేయడం ద్వారా తల్లిదండ్రులు తమ స్థోమతకు మించి ఖర్చు చేస్తున్నారని కమల ఇలా చెబుతుంది.

కొడుకు పుట్టి చదువుకొఱకుఁ దాతలనాటి
మడులు మాన్యములును దుడిచి వేయఁ
గూతురవతరించి కొంపలుంగోడుల
మ్మించుచుండె బెండ్లి లంచములకు,

(అం.5 పు.47)

కట్నాన్ని ఇక్కడ పెండ్లి లంచం పేరుతో పిలవటం ఇక్కడ గమనించాలి. కాళింది మరణం తరువాత తల్లి దండ్రులు కమలకు ఆ సంబంధం కుదర్చవలసిన అవసరం ఏర్పడి కమల అభిప్రాయాన్ని చెప్పమంటారు. అపుడు చేసిన కమల చింతన ఆమె వివేచన మరియు ధైర్యాన్ని ప్రకటిస్తుంది. తల్లిదండ్రుల ఇచ్చిన సొమ్ము వృథా కాకుండా ఉండాలన్నా, ఈ దుర్మార్గానికి తగిన ప్రాయశ్చిత్తం చేయాలన్నా, అక్కకు జరిగిన అన్యాయానికి తాను పగతీర్చుకోవాలన్నా, లోకానికి ఒక పాఠం నేర్పాలన్నా తాను ఒప్పుకొని పెళ్లి చేసుకోవాలని మంచి ఉపాయంతో ఈ కార్యాన్ని సాధించుకోవాలని కమల భావిస్తుంది.

పెళ్ళికి సంబంధించిన ఇతర విషయాలలో ఆమె ఇష్ట ప్రకారం జరుపుతామని తల్లిదండ్రుల వద్ద హామీ తీసుకుంటుంది. పెళ్లయ్యాక కాపురానికి వెళ్లకుండా వారిపని పట్టాలని తగిన ప్రణాళిక వేసుకుని కూర్చుంటుంది. మామగారు పంపిన కోర్టునోటీసు చదివి తండ్రిన భయపడవద్దని దావా కొనసాగనివ్వమంటుంది. మైనార్టీతీరని వారు మాట్లాడకూడదని ప్రతివాది వకీలు చెప్పినా దానిని మాటల చాతుర్యంతో తిప్పికొడుతుంది. న్యాయమూర్తి "రికార్డు చేయకూడదని ఉంది కానీ వినకూడదని కాదు కదమ్మా" అని కమల వాదాన్ని వింటారు.పెళ్లికి ఇచ్చిన నగలను అపహరించారని ఒక ఆరోపణ. పెళ్లయినా

కాపురానికి రాలేదని మరో ఆరోపణ. ఈ రెంటిలో మొదటిదానికి వివాహసమయంలో బహూకరించిన నగలు హరించారని చెప్పటం అబద్ధం. ఇవి తిరిగి అడగటం దాతకు హక్కులేదని వాదిస్తుంది.

వరుని వివాహం కోసం వేలంలో కొనుకున్నామని కాబట్టి వరుడే కాపురాని తమ ఇంటికి రావాలని,కావలసిన సాక్ష్యాధారాలైన రసీదులు, పెళ్లి శుభలేఖలు కోర్టుకు అందిస్తుంది. ఇవన్నీ చూసి తండ్రి పిసినారితనానికి, అత్యాశకు సిగ్గుపడిన నవ యువకుడు వరుడు పశ్చాత్తాపపడి బసవరాజు తాను కమల దగ్గరకు వెళ్లి చెప్పిన పనల్లా చేస్తానని కోర్టులోనే చెబుతాడు.కమల నగల మూటను, కాగితపు కట్టను చేతికిచ్చి ఈ వరకట్న దురాచారాన్ని రూపుమాపటానికి ఇద్దరం కలిసి పూనుకుందామని చెబుతుంది

ఈ విధంగా కమల తన కాపురాన్ని చక్కదిద్దుకోవడమే కాకుండా తల్లిదండ్రుల కష్టాన్ని దూరంచేసింది. లోకానికి ఒక పాఠం చెప్పగలిగింది. ''ఎంత వేడిమిని అయినా తట్టుకుని సాయంత్రం వరకు నిలిచి ఉండే కరుకుదనం ఉన్నా చూపులకు మాత్రం మెత్తగానే ఉండే పాత్ర'' అన్న మైలవరపు శ్రీనివాసరావుగారి విశ్లేషణ నూటికి నూరు పాళ్లు నిజమనిపించే పాత్ర కమల.

ఆదర్శం కల భర్తకు భార్యగా అతని అడుగడుగు జాడలలో నడుస్తూ కమల ద్వారా సమాజానికి ఒక హితాన్ని చూపించే పాత్ర తల్లి భ్రమరాంబ. వరుని వద్ద ఉన్న డబ్బును చూసి పిసినిగొట్టుకు ఇచ్చి తల్లిదండ్రులు తన గొంతు కోసారాని ఈ కష్టం ఎవ్వరికీ రాకూడదని హెచ్చరించే కమల అత్త పాత్ర సుభద్ర. ఇవన్నీ మహిళల సమస్యల పట్ల చైతన్యం కలిగి ఉండటమే కాక వరకట్నాన్ని నిరసించి మహిళలకు ఒక ప్రత్యేక గౌరవం స్వేచ్ఛ కోరుకునే స్త్రీపాత్రలే. వీటిని సృష్టించడమే కాక తాను కట్నం తీసుకోకుండానే పెళ్లి చేసుకున్న ఆదర్శ మూర్తి కాళ్లకూరి నారాయణరావుగారు. వారి ఆదర్శాన్ని ఇప్పటికైనా నిజం చేయవలసిన బాధ్యత మనమీదనే ఉంది.

ఆధార గ్రంథాలు

1. వరవిక్రయము-కాళ్లకూరి నారాయణ రావు; క్లాసిక్ బుక్-2016.
2. శతవసంత సాహితీ మంజీరాలు-ఆ.ప్ర.గ్రంథాలయసంఘం-2002.
3. శ్రీ కాళ్లకూరి నారాయణరావు నాటకత్రయ సామాలోచనము-డా.జోస్యుల కృష్ణబాబు-2023.

★★★

Vol. 23 | Spl. Issue 03 | March 2026 | BHAVAVEENA | ISSN No. : 2456-4702 | RNI No. APTEL/2003/12253

RNI No. APTEL/2003/12253 | Reffered Journal & Peer Reviewed Journals | ISSN No. 2456-4702

భావవీణ

కళలు, సాహిత్య, సాంస్కృతిక భాషాధ్యయన పత్రిక

BHAVA VEENA

Journal of Arts, Literary, Culture & Language Study

సమకాలీన తెలుగు సాహిత్యంలో మహిళా చైతన్యం

– డా॥. పాండురంగం కాళయ్య

తెలుగుశాఖ, మద్రాసు విశ్వవిద్యాలయం, చెన్నై

పరిచయం

సామాజిక చైతన్య స్రవంతి సాహిత్యం. భిన్న నమ్మకాల, మూఢనమ్మకాల, విశ్వాసాల కుల మతాల, మనస్తత్వాల కలయిక సమాజం. అలాంటి సామాజిక పొరల్లోనుంచి ఉబికి వచ్చిన సాహిత్యంలో వీటన్నిటి పాలు పాళ్ళు తగ్గులతో కనబడుతూ ఉంటాయి. చాలా విశాలంగా ఆలోచిస్తే, మనిషి సృష్టించిన కులమత వర్గ భేదాలకు అతీతంగా ఆలోచిస్తే, ప్రపంచంలో రెండే కులాలు ఒకటి స్త్రీ, రెండు పురుషుడు. అందులోనూ స్త్రీకి భారతదేశంలో ఎనలేని గౌరవం ఉంది. అందుకే అంటారు.

"యత్ర నార్యస్తు పూజ్యంతే రమంతే తత్ర దేవతాః"

ఎక్కడైతే స్త్రీలు పూజింపబడతారో, గౌరవింపబడతారో అక్కడ దేవతలుసంచరిస్తారని పెద్దలు ఆదిమ కాలం నుండి చెబుతున్నా, అవి పురాణాలలో, వేదాలలో, కావ్యాలలో మాత్రమే జరుగుతున్నాయి. ఇది నాణ్యానికి ఒక వైపు. మరో వైపు అనాదిగా ఎదుర్కొంటున్న సమస్యలు మరో వైపు. నిజజీవితంలో అందుకు పూర్తి విరుద్ధంగా పురుషాహంకార చట్రంలో పడి నలిగిపోతూ, అణచివేతకు గురవుతూ అల్లాడిపోయింది ఈ స్త్రీ జాతి. ఈ సృష్టిలో జీవరాశులన్నిటి కంటే మనుష్యుడే మేధావి. తన చుట్టూ ఉన్న ప్రకృతిలోని వనరులను స్వార్థపూరితంగా ఉపయోగించుకుంటున్నట్టుగానే మానవజాతిలో, సమాన అధికారం కలిగిన స్త్రీని, కూడా తన స్వార్థానికి ఉపయోగించుకుంటున్నాడు. అనాది కాలం నుండి స్త్రీ పురుషుల పై ఆధారపడి జీవించేలా, అబలగా, ఆట బొమ్మగా, శృంగారకాంక్ష తీర్చుకొనే వస్తువుగా, పనిచేసే యంత్రంలా, కట్టడిచేసి తనచెప్పుచేతల్లో పెట్టుకోవడం లాంటి దుస్థితి కలిగింది. దీనికి కారణం సమాజం కల్పించిన సంకెళ్లు. వీటి నుంచి మహిళలను విముక్తుల్ని చేసి, వారి జీవితాల్లో చైతన్యాన్ని ఉత్సాహాన్ని నింపడానికి కలంపట్టిన సాహితీమూర్తులు తెలుగు సాహితీ క్షేత్రంలో ఎందరో ఉన్నారు. క్రీ.శ. 11వ శతాబ్దపు నన్నయ్య దగ్గర నుండి నేటి యువ కవులు ఎందరో ఎన్నో కోణాలలో స్త్రీ చైతన్య స్ఫూర్తిని తమ కావ్యాలలో నిక్షిప్తం చేశారు, చేస్తున్నారు. ఈ దృష్టి కోణంలో సమకాలీన తెలుగు సాహిత్యంలో మహిళా చైతన్య నేపథ్యాలను చర్చించడమే ఈ వ్యాస ఉద్దేశం.

భారతదేశంలో స్త్రీ చైతన్యం – పరిచయం

వేద కాలం నుంచి స్త్రీ విద్య పురుషుని తో సమోన్నతం గానే సాగేది. నిజానికి వేదాలలో దాదాపు 50 మంది స్త్రీలు మంత్ర ద్రష్టలుగా నిలిచారు. గార్గి, మైత్రేయి, లీలావతి, లోపాముద్ర, ఊర్వశి, సులభ, క్షణ మొదలైన ఎందరో స్త్రీలు సంస్కృతములో తమ పాండిత్యాన్ని, సభలలో వేదాంత విశ్లేషణని తమ బుద్ధికుశలతతో

వాదనా పటిమను మహిమాన్వితంగా ప్రదర్శించేవారు. నిజానికి మైత్రేయి తన భర్త యాజ్ఞవల్క్యునితో చేసిన వేదాంతచర్చ జగత్ప్రసిద్ధం. అటులనే గార్గి ఒక సుప్రసిద్ధ వేదాంతినిగా పేరుగాంచినది. కానీ తరువాతి కాలంలో ఎక్కడో పురుష అహంకారానికి స్త్రీ విద్యాభివృద్ధి బలైపోయి క్రమంగా పురుషుడు ఆమెను ఇంటిపనులకే నియంత్రించడం జరిగింది. పద్దెనిమిదవ శతాబ్దం ప్రారంభం వరకు అస్థితి కొనసాగినా, ఎటువంటి ప్రతి వాదన లేకుండా స్త్రీ విద్యోన్నతిని పురుష సమాజం నియంత్రించినా, తరువాతి కాలంలో ఇంట్లోనే ఉండి చదువుకుంటున్న స్త్రీల ఆలోచనా తీరు మారి, స్వతంత్ర భావోత్ప్రేక్ష, వాదనాబలం చిరు చిచ్చుగా ఆరంభమై రాజుకొని నెమ్మదిగా కార్చిచ్చ యింది. కానీ అప్పటికే స్త్రీ -విద్యకు అనర్హురాలనే మూఢ భావాలు సమాజంలో మూల మూలల వేళ్ళు పాతుకు పోయాయి. ఈ క్రమంలోనే స్త్రీ తన స్వేచ్ఛ కోసం పోరాడాల్సిన అవసరం ఏర్పడింది. ఒకప్పటి మాతృమూర్తి ఈ సమాజాన్ని నడిపించిన ఈ నేలలోనే తన ఉనికి కోసం పోరాడాల్సిన అవసరం ఏర్పడింది. ఈ అవసరాన్ని గుర్తించిన ఎందరో ప్రపంచ వ్యాప్తంగా తమ రచనల ద్వారా మహిళా చైతన్యానికి పాటుపడ్డారు. సమాకాలీన తెలుగు సాహిత్యంలో గురజాడ ఇలా అంటారు.

''ఆధునిక మహిళలు మానవచరిత్రను తిరిగి రచిస్తారు. సృష్టిలోకెల్ల విలువైన వస్తువు విద్యనేర్చిన స్త్రీరత్నమే'' అన్నారు గురజాడ. దానిని నిజం చేస్తూ అన్ని రంగాలలో స్త్రీలు ప్రగతి సాధించారు కానీ ఇది సాధించ డానికి అనేక ఉద్యమాలు తమ వంతు పాత్రను పోషిం చాయి. అలా సమకాలీన తెలుగు సాహిత్యంలో మహిళా చైతన్యం కోసం పోరాడిన పురుషుల పాత్రను గురించి పరిశీలించాలి.

సమకాలీన తెలుగు సాహిత్యంలో మహిళా చైతన్యం - కవి/రచయిత పాత్ర

''స్త్రీ అంటే అలుపెరగని జీవన యాత్ర - అడుగడు గునా దర్శనిమిచ్చే అమ్మపాత్ర.
సమస్త మానవసృష్టికి నిజరూపం - వెలకట్టలేని స్త్రీమూర్తి స్థానం అపురూపం''

ఈ సమాజంలో స్త్రీని, పురుషుడు స్వేచ్ఛగా బ్రతకనివ్వడం లేదు. తన స్వార్థానికి బలిచేస్తూనే ఉన్నాడు. ఒకస్త్రీ, పురుషుడి దగ్గర ఏ సమయంలో ఎలా ఉండాలో కూడా నిర్ణయించేవాడు అంటే అతిశయోక్తి కాదు. 'కార్యేషు దాసి' తనకు సేవ చేసేటప్పుడు దాసి లాగా అంటే బానిసగా ఉండాలని, 'కరణేషుమంత్రి' రాజ్యాధికారం పురుషుడిదేనని, స్త్రీ కేవలం మంత్రి లాగా సలహాలు సూచనలు ఇవ్వడానికి మాత్రమేనని, అది కూడా తనకు నచ్చితేనే స్వీకరించేలా ప్రవర్తించేవాడు. 'భోజ్యేషుమాతా' భోజనం చేసేటప్పుడు తల్లిలాగా ఉండాలంటాడు. ఇక్కడ తల్లి అంటే అది పెద్ద పాత్రని కాదు, తినే విషయంలో తల్లి తన పిల్లలకు ముందు పెట్టి మిగిలినది తింటుంది. ఆ విధంగా పురుషుడికి ముందు పెట్టి మిగిలితే తాను తినాలి అనే కఠిన నిర్ణయమది. 'శయనేషురంభ' పురుషుడు ముఖ్యంగా స్త్రీని శృంగార కాంక్ష తీర్చుకునే వస్తువుగా మాత్రమే పరిగణిం చాడు. స్త్రీకి సంబంధించినంత వరకు ఏ విషయంలో కూడా స్వేచ్ఛ నీయలేదు. పురుషుడు తన కోరికలు తీర్చుకునే విధంగా స్త్రీకి కొన్ని కట్టుబాట్లు, నియమాలు పెట్టాడు. ఈ విధంగా అనాటి కాలం నుండి అనేక పాత్రలు నిర్వహిస్తూ, అనేక విధాల పీడింపబడినది స్త్రీ. ఈ క్రమంలోనే స్త్రీ చైతన్యం కోసం అనేక పోరాటాలు తెలుగు సాహిత్యాన్ని గమనిస్తే స్పష్టమవుతుంది.

భారత దేశంలోని ఏ ప్రాంతం తాలూకు చరిత్ర పరిశీ లించినా, 19వ శతాబ్దపు మలి రెండు దశాబ్దాల్లోనూ ఇరవై శతాబ్దపు తొలి రెండు దశాబ్దాల్లోనూ సంఘ సంస్కర్తుల ఉద్యమం ఎక్కువగా జరిగినటు కనబడుతుంది. మూఢ నమ్మకాల, విచిత్ర ఆలోచనల కలనేత దుప్పటి కప్పుకొని సుఖ నిద్రలో వున్న సమాజాన్ని తట్టి లేపి చైతన్యవంతం చేసినవారు సంఘ సంస్కర్తలే. చైతన్యవంతమైన సమాజం స్థాపించడానికి, విద్యను ఆయుధంగా మలిచారు వాళ్ళు ఎందరో ఉన్నారు.

సమాజం కల్పించిన సంకెళ్ల నుంచి మహిళలను విముక్తుల్ని చేసి, వారి జీవితాల్లో చైతన్యాన్ని, ఉత్సాహాన్ని నింపడానికి కలంపట్టిన సాహితీమూర్తులు ఎందరో ఉ

న్నారు. స్త్రీలకు ఆవిద్య, ఆర్థిక స్వాతంత్రం లోటు వారు నిస్సహాయంగా మిగిలిపోవడానికి ముఖ్య కారణాలు అయ్యాయి. వారు మరొకరి మీద ఆధారపడి బ్రతికే వలసిన అగత్యం ఏర్పడింది. ఆధునిక కాలంలో స్త్రీ యొక్క ఆవేదన. ఆక్రోశం అర్థం చేసుకున్న రచయితలు కందుకూరి వీరేశలింగం, గురజాడ, చలం, కె.శివారెడ్డి, పాపినేని శివశంకర్ మొదలైన ప్రముఖ కవులు రచయితల రచనలను పరిశీలిద్దాం.

చదువుకున్న మహిళ చరిత్రను తిరగరాస్తుందని అన్న మహాకవి గురజాడ అప్పారావు మాటలు నిజమే. మహిళలను మాత్రమే కాదు మానవ సమాజాన్ని మొత్తం చైతన్యవంతం చేసేది చదివే. విద్య లేనివాడు వింత పశువు కదా! తను ఇప్పుడు ఏ స్థాయిలో ఉన్నానని తెలుసుకొని, తను ఎలా ఉండాలని మేలుకొని తన ఆకాంక్షలకు లక్ష్యాలకు అనుగుణమైన బాట ఉంటే, ఆ బాట మీద, లేకపోతే తనదైన బాట ఏర్పరిచుకొని సదా ముందుకు సాగే వారిని చైతన్యవంతులని చెప్పవచ్చు. విద్య మనోవికాసాన్ని తట్టి లేపుతుంది; ఆలోచనా శక్తిని పెంచుతుంది. తన సమాజం తీరు, ఇతర సమాజాల తీరు తెలుసుకోవడానికి అవకాశం కల్పించడమే కాక విచక్షణా శక్తిని కూడా ప్రసాదిస్తుంది.

తెలుగు సాహిత్యంలో వినూత్న దిశను ఆవిష్కరించి, సమాజానికి కొత్త చైతన్యం నింపిన మహాకవి గురజాడ అప్పారావు గారు. జాతీయోద్యమానికి, మహిళా అభ్యున్నతికి తన కలాన్ని అంకితం చేసిన ఆ మహాను భావుడు. గురజాడ కథల్లో స్త్రీ పాత్రలన్నీ చైతన్యంతో ముందుకొచ్చిన పాత్రలే. ముఖ్యంగా దిద్దుబాటు కమలిని, నాంచారమ్మ, సరళ, మెటిల్డా పాత్ర పరంగా చైతన్యం లేదంటే కథ పరంగా చైతన్యం లేదంటే పురుష పాత్రలతో సమాజ చైతన్యాన్ని అందించడం ఈ రకంగా ఐదు కథల్లో స్త్రీ చైతన్యాన్ని ప్రస్తావించారు గురజాడ.

కవిత్వంలో ముఖ్యంగా ముత్యాలసరాలు, పూర్ణమ్మ, కన్యక వంటి అన్నింటిలోనూ స్త్రీ పాత్ర చైతన్యం ప్రస్ఫుటంగా కనిపిస్తుంది. ఇక 'కన్యాశుల్కం' నాటక విషయానికి వస్తే స్త్రీ చైతన్యం ముఖ్యంగా మధురవాణి పాత్రను మలిచిన తీరు స్పష్టమవుతుంది.

గురజాడ పాత్రలు కళ్ళకి వెలుగును ఇస్తాయి. మారుతున్న సమాజ స్వరూపాన్ని దర్శించటానికి కావలసిన సాధనాన్ని సమకూరుస్తాయి. అవి ఆనాటి బ్రతుకు నుంచి పుట్టిన వాస్తవ పాత్రలు. అందుకే ఇప్పటికీ ఎప్పటికీ జీవించే ఉంటాయి - అని చాగంటి తులసి గారు గురజాడ జాడను సూక్ష్మీకరించి గురజాడ ఆత్మను ఆవిష్కరించారు. స్త్రీవాద మని ఎక్కడ తొణక్కుండా ప్రతి పాత్రలోనూ స్త్రీ ఔన్నత్యాన్ని చూపించిన ఘనత గురజాడ వారిది అనే చెప్పాలి.

మొత్తంగా గురజాడ అందించిన సాహిత్య సంపదంతా ఏదో ఒక రకంగా స్త్రీ చైతన్యానికి, స్త్రీ పురోగమనానికి బాటలు వేసేవిగానే సాగాయని చెప్పవచ్చు. రచయితలు పురుషులైనా వారి చుట్టూ సమాజాన్ని దర్శించడం, సమాజంలోని స్త్రీ పురుష అసమానతలను గ్రహించడం, ఆ అసమానతలపై స్పందించడం, చైతన్యవంతం చేయడం, ముఖ్యంగా ఆ కాలంలో అట్లాంటి రచనలు చేయడం గురజాడ ముందుచూపుగా మనం భావించొచ్చు. స్త్రీలకు ఇంకా చదువే నిషేధమైన ఆ కాలంలో, స్త్రీలు చదువుకుని ముందుకు రావాలనే సంస్కరణ మెల్లమెల్లగా ప్రారంభమవుతున్న ఆ కాలంలో కుటుంబంలో స్త్రీ పురుషుల సమాన ప్రాతినిధ్యాన్ని గుర్తించిన మొట్టమొదటి రచయితగా గురజాడను గుర్తించాలి.

ప్యూడలిజం అవశేషమవుతున్న దశలో పూర్వరంగంలో తాపీ ధర్మారావు ప్రవేశించారు. 1887-1911 మధ్యకాలంలో జీవించిన తాపీ ధర్మారావు తాను స్కూలు చదువులో ఉన్నప్పుడే వీరేశలింగంని చదివారు. ఆయన తన ఇంట్లోంచే సంస్కరణలు ప్రారంభించారని చెప్పొచ్చు. భార్యను పేరుపెట్టి పిలవడం, ఆమెను తన తోడుగా వెంటబెట్టుకుని సభలు, సమావేశాలకు వెళ్ళడం ఇవన్నీ అప్పటికే తనలో ఉన్న అభ్యుదయ భావాలను కార్యాచరణలో పెట్టారు. విజయనగరంలో తాను స్కూలుకు వెళ్ళేదారిలో ఒక 15 ఏండ్ల బాల వితంతువు కనిపించిందట. అప్పుడు తాపీ ధర్మారావులో కలిగిన

ఆలోచనే ఒక డిబేటింగ్ సంస్థ ఏర్పడడానికి నాంది. ఆ డిబేటింగ్ సంస్థ తన ప్రధాన ఆశయాలుగా రాసుకున్నవి కూడా బాల్యవివాహాల నిషేధం, స్త్రీ విద్య ప్రాధాన్యత, విధవా పునర్వివాహము, వరకట్న వ్యతిరేకత మొదలైన అంశాలు. ధర్మారావు తాను 15 ఏండ్ల వయసులో ఉన్నప్పుడు 10 ఏండ్ల అన్నపూర్ణతో వివాహమైంది. అప్పట్లోనే అమ్మాయిని చూసి పెళ్ళి చేసుకోవాలను కోవడం, కట్నకానుకలు వద్దనుకోవడం ఇవన్నీ స్త్రీ చైతన్యాలుగా, మహిళా వికాస మార్గాలుగా చెప్పొచ్చు. "సత్యవతికి సవాల్" అంటూ సత్యవతి పేరుతో ధర్మారావు గారే ప్రశ్నించేవారు. ప్రతి విషయాన్ని హేతుబద్ధంగా ఆలోచించేవారు.

కాళ్ళకూరి నారాయణరావు గారి "వరవిక్రయము" ముఖ్యంగా ఇప్పటికీ కొనసాగుతున్న వరకట్న దురాచారాన్ని ఆనాడే వ్యతిరేకించింది. వీరు వర్ణాంతర వివాహం చేసుకోవడమే కాక చిన్నప్పట్నుంచీ తన సోదరి కష్టాలను కూడా చూసి తండ్రితో ఘర్షణ పడ్డారు. అందులోని కాళింది పాత్ర తండ్రిని ఇట్లా ప్రశ్నిస్తుంది.

మీకు గుణము లేదా
మాకు రూపము లేదా
ఇంత దైన్యమునకు హేతువేమి
కట్నమిచ్చి వరుని గడియించు
కొనుటకంటే చిన్నతన మింకేమున్నదమ్మా....

అంటూ అసలు కట్నం ఎందుకు ఇవ్వాలి అనే మూలమైన ప్రశ్నను లేవదీస్తారు రచయిత. కట్నము అడుగువారికి పాపభయంబు లేక ఇచ్చువారికి సిగ్గును నెగ్గులేక నడుచుచున్నట్టి వరశుల్క నాటకమున! అకట మనము పాత్రలమగుట తగునె. అంటూ ఇంకా కమల పాత్రతో మరింత ముందడుగు వేయిస్తారు రచయిత. కట్నమే కోరి వచ్చిన ఖరముతోడ దగుదునని కాపురము సేయు దానికంటే పెండ్లియే మానుకొని మగబిడ్డ వలెనే తల్లిదండ్రుల కడనుండ తప్పిదంబె అని ప్రశ్నిస్తుంది. ఇట్లాంటి చైతన్యం ఆ కాలపు రచనల్లో ఉండేది.

గుడిపాటి వెంకటచలం స్త్రీల స్వేచ్ఛ కొరకు తెలుగు నాట వెలసిన ధైర్యాచలం. స్త్రీ స్వేచ్ఛకై సాహిత్య పుటాయుద్ధంతో సాంఘిక వ్యవస్థ పై దాడి చేసిన సంస్కర్త. వ్యక్తిని సంఘం కట్టడి చేస్తే , సాంసారిక బంధాలు ముట్టడి చేస్తే, ఊపిరాడని వ్యక్తిని బయటకు లాగి, రాజీలేని అభిప్రాయాలతో ఆలోచనలతో వాటిని బద్దలుకొట్టి స్వేచ్ఛ అందించాడు.

యావత్ భారత దేశము రాజకీయ స్వాతంత్ర్యం కోసం పోరాడుతున్న రోజుల్లో - స్త్రీ భావ స్వాతంత్రం కోసం తన కలంతో పోరాడిన వాడు ఈ చలం. "దేన్నయితే ఈ ఛాందసులంతా కాలకూట విషం అనుకుంటున్నారో దాన్ని నేటి అభ్యుదయ ఆరోగ్య ప్రదాయకమైన అమృతంగా స్వీకరిస్తుంది" అని శ్రీశ్రీ కితాబిచ్చాడు. "యువతరాన్ని పాడు చేస్తున్నావు" అని సోక్రటీస్ విధివిధానాలను తప్పుగా ఎలా అర్థం చేసుకున్నారో, ఎలా విషమిచ్చి త్రాపించి చంపారో - అలాంటి కరడుకట్టిన సంప్రదాయవాదులు చలాన్ని చలం సాహిత్యాన్ని వెలి వేశారు. ఆయన రచనల్ని పేరున్న ఏ పత్రికలు ప్రచురించలేదు. ప్రచారం చేయలేదు.

స్త్రీకి కూడా శరీరం ఉంది
దానికి వ్యాయామం ఇవ్వాలి
ఆమెకు మెదడు ఉంది
దానికి జ్ఞానం ఇవ్వాలి
ఆమెకు హృదయం ఉంది
దానికి అనుభవం ఇవ్వాలి

అనే సంగతిని గుర్తించని ఈ దేశానికి నేను రాసే సంగతులు అర్థమవుతాయా అని సందేహించాడు చలం 50 ఏళ్ల కిందట. అందుకే ఆయన రచనలు అనుకున్నంత త్వరగా వేళ్ళూన లేదు. స్త్రీని పురుషాధిక్య ప్రపంచం ఎలా దిగ్బంధం చేసిందో తన రచనల్లో వివరించాడు. విత ర్కించి విమర్శించాడు.

తమ ఆశలు, కోర్కెలు, తిరుగుబాటు నైజం, స్వేచ్ఛ కోసం పెనుగులాట, ఉత్తమమని తెలియక, మనో వేదనతో అశాంతికి లోనైన నిస్సహాయ స్త్రీలకు నైతిక సహాయం ఇచ్చే అభయహస్తం చలం సృష్టించిన సాహిత్యం సమస్తం. సమ సమాజ నిర్మాణాన్ని ఆకాంక్షించి అందు లోనే స్త్రీ పురుష సమానత్వాన్ని పాదుకొల్పి భావ పరివర్తన

కలిగించిన గుండె ధైర్యం ఉన్న సంస్కరణాభిలాషి చలం. చలం సాహిత్యం మొత్తానికి "స్త్రీ" కేంద్రం అనిపిస్తుంది. స్త్రీ హృదయపులోతుల్ని, మానసిక క్షోభను, వారి అంత రంగిక ఆవేదనను క్షుణ్ణంగా పరీశీలించారు చలంగారు. అందుకు "నాకు ఒకనిమిషం విశ్రాంతి నివ్వక మహా ప్రణయ మారుతవేగం మీదనో ఆగాధవియోగభారం కిందనో చీల్చినలిపి ఊపిరాడనియ్యక నా జీవితాన్ని పాలించే స్త్రీ లోకానిక నివేదితము" అని స్త్రీ పుస్తకానికి అంకితం రాస్తూ చలం గారు అన్నారు. స్త్రీ కూడా మనిషే అని ఆమెకు కూడా రంగు, రుచి, వాసన కావలసి ఉంటుందని గుర్తించాలని అంటూ స్త్రీకి శరీరం ఉంది, దానికి వ్యాయమం ఇవ్వాలి స్త్రీకి మెదడు ఉంది, దానికి విజ్ఞానం ఇవ్వాలి స్త్రీకి హృదయం ఉంది, దానికి అనుభవం ఇవ్వాలి - అని చలం అంటారు.

స్త్రీని వంటింటి కుందేలు చేసి ఓహటరీ భారతనారీ! నీవు పతివ్రతవు, నీవు పావన మూర్తివి అని కీర్తించి వెనుక గోతులు తవ్వలేదు వీరు. మనసా, వాచా, కర్మణా స్త్రీ వికాసాన్ని కోరుకుంటున్నాయన యావత్ స్త్రీజాతి చలంగారి ఋణం తీర్చుకోలే దేమో! నేడు సమాజంలో స్త్రీబానిసగా తయారైందని బాధపడతారు. నేను చూసిన సంఘంలోని లోపాలు ఈ దేశస్థులలోనే కాదు లోకం అంతటా ఉన్నాయి. తర తరాల నుంచి పురుషుడు స్త్రీకి చేస్తున్నది. అన్యాయమేనని ఆవేదన వ్యక్తంచేశారు చలం గారు.

స్త్రీకి ఉన్న అనేకానేక సమస్యలు, స్త్రీల వల్ల కలిగే వల్లమాలిన సమస్యలు, సామాజికమైన సమకాలిక సమస్యలు, పెళ్ళికాని స్త్రీ కి సమస్యలు, పెళ్ళైన స్త్రీకి సమస్యలు, ఉద్యోగం చేస్తున్న స్త్రీకి సమస్యలు, ఉద్యోగం లేని స్త్రీ కి సమస్యలు, వ్యక్తిగతమైన సమస్యలు,మోహానికి సంబంధించిన సమస్యలు, స్వేచ్ఛకు సంబంధించిన సమస్యలు - వీటన్నిటిలో స్త్రీల కేంద్రబిందువు. ఇన్ని రకాల సమస్యలు చలం సాహిత్యానికి ఇతివృత్తాలు. దీనిలో పరిష్కారాలు, విప్లవాలు, విమర్శలు, సంప్ర దాయానికి సవరింపులు. చలం సాహిత్యం స్త్రీ స్త్రీ హితైషిగా అంధ్రదేశాన్ని అట్టుగ చేసింది. ఆయన సాహిత్య ప్రపంచానికి కుహనా సాంప్రదాయం కొట్టుకుపోయింది. కుటుంబ వ్యవస్థ కూలబడింది అని చెప్పవచ్చు.

డాక్టర్ శివారెడ్డి కవిత్వంలో "ఆమె" ఒక ప్రధాన అంతఃస్రోతస్విని. ఈ "ఆమె" స్త్రీయే. తల్లిగా తన పాత్ర నిర్వర్తిం చిన మహనీయురాలు. భార్యగా తన వంతు నిండుగా నిర్వహించిన సహచరి. కూతురుగా గారాలు పోయింది. తోబుట్టువుగా అనురాగాన్ని పంచింది. కానీ ఆమె ప్రాధాన్యాన్ని పక్కకు నెట్టి అన్ని విధాల అణగదొక్కుతుంటే ఎంతకాలం ఆమె సహిస్తుంది! పరిస్థితి చేజారిపోతోంది. స్త్రీవాదం మొదలైంది. చిగురించింది. ఉధృతరూపం దాల్చింది.

శివారెడ్డి గారి సాహిత్యంలో స్త్రీ పట్ల తన అభిమతాన్ని ఇలా పేర్కొంటారు. "ఎప్పుడైతే మనం తల్లుల్ని, పెళ్ళాల్ని, పిల్లల్ని అవమానించటం మొదలు పెట్టామో - అప్పుడే ఆడదాన్ని గోడ పక్కకి విసిరేసి ఒక ముద్ద అడుక్కునే మాంసం ముద్దగా చేసి పారేసాం..(ఆమె ఎవరైతే నేమి .పే 130)

"ఏ స్త్రీ జీవిత మైన
స్థలాలు వేరైనా
భిన్నంగా ఎందుకు ఉంటుంది!" (ఆ.ఎ.పే 130)

అని విశ్వజనీనమైన స్త్రీ తత్వాన్ని ఒక్కమాటలో చెప్తారు. మరో పద్యాన్ని గమనిస్తే...

"ఇన్నాళ్ళనుంచి చావిట్లోనే వుంది
పుట్టినదగ్గరనుంచీ మేకుకు కట్టేయబడే వుంది
కోడెదూడ - బయటి ముఖం చూళ్ళేదు.
బయట కూడా కట్టేద్దామనే తీసుకొస్తుంటే
ఒక గుద్దు గుద్ది - ఎత్తిపడేసి
దేశాల మీద పడ్డది -
స్వేచ్ఛలో - సేచ్ఛగా - స్వేచ్ఛకై
కట్టేయటమంటే తెంచుకుపొమ్మనే
మేకునుగూడ పెళ్ళగించుకుపొమ్మనే
అణిచి పెట్టటమంటే - ఎదురుతిరగమనే
జన్మతః అణువుల్లో నిగూఢమైన
ఆసంకల్పిత ప్రతీకార చర్య ఇది' 188 (చర్య)

సమకాలీన తెలుగు సాహిత్యంలో మహిళా చైతన్యం

- కవయిత్రి/రచయిత్రి పాత్ర

సమాజం కల్పించిన సంకెళ్ల నుంచి మహిళలను విముక్తుల్ని చేసి, వారి జీవితాల్లో చైతన్యాన్ని, ఉత్సాహాన్ని నింపడానికి కలంపట్టిన సాహితీమూర్తిమణులు ఎందరో ఉన్నారు. "మనం అవసరమైన విషయాలపై మౌనం వహించిన రోజున జీవితాల ముగింపు మొదలవుతుంది" అన్న మార్టిన్ లూథర్ కింగ్ జూ. మాటలను గమనిస్తే రచయిత సామాజిక, రాజకీయ చైతన్యం దిశగా మహిళా ప్రపంచాన్ని నడింపించే ప్రయత్నం చేసారు. అలాంటి పనికి ఎందరో రచయిత్రులు పూనుకున్నారు.

మహిళల్లో నేడు కనబడే ఈ చైతన్యం ఏ ఒక్క రోజో ఎక్కడ నుంచో ఊడి పడలేదు. సంవత్సరాలు, దురవస్థల చీకట్లో సహవాసం చేయటం వల్ల బీజం దాల్చిన ఈ చైతన్యం క్రమ క్రమంగా ఎదిగి ఈ స్థితికి చేరుకుంది. బహుశా ఏ సామాజిక చరిత్ర పశీలించినా, మహిళా చైతన్యం ఊపిరి పోసుకోవడానికి దోహదం చేసిన పరిస్థితులు ఒకేలానే వుండవచ్చు.

ప్రపంచంలో మహిళ స్థానం, మహిళల పట్ల పురుష సమాజ వైఖరి అన్ని దేశాలలో ఒకే రకంగా కనిపిస్తుంది. ఆర్థికంగా విద్యాపరంగా కొన్ని సాంస్కృతిక కారణాల వలన కొన్ని దేశాలలో మహిళల జీవనం కాస్త మెరుగ్గా ఉండి ఉండవచ్చు. కాని ఆ దేశాల పురుషులతో పోలిస్తే ఇప్పటికీ వారు వివక్ష ఎదుర్కుంటున్నారన్నది నిజం. కొన్ని దేశాలలో మహిళల పట్ల వివక్ష తక్కువ అయితే మరి కొన్ని దేశాలలో చాలా ఎక్కువ.

ప్రతి దేశంలో వివక్ష నెదుర్కుంటున్న మహిళా సమస్యలు. వీటిని అధిగమించాలంటే పోరాటం ఒక్కటే మార్గమని, స్త్రీలు సంఘటితమవ్వాలని, తమ పరిస్థితి బాగు పడడానికి వారే పూనుకోవాలని, ఉద్యమించాలని, తమ సమస్యల మూలాలను వెతికి పట్టుకోగల సామాజిక స్పృహ, అవగాహన వారికి కలగాలని రచయిత్రులు/కవయిత్రులు బలంగా కోరుకుంటారు.

తన తోటి స్త్రీల కోసం పని చేయడమే కాక చివరకు తన దేశ భవిష్యత్తు కోసం తానే ఉద్యమకారిణిగా మారడానికి సంసిద్ధమైంది మహిళ. ఆమెలో విద్య తెచ్చిన ఈ మార్పు నిజంగా చాలా స్ఫూర్తిదాయకంగా ఉంటుంది. సరైన సామాజిక అవగాహనతో స్త్రీలు ఒకటిగా నిలబడితే తమ ఉన్నతి కోసం తాము ఎంత పని చేయవచ్చో, ఎందరికి స్ఫూర్తిదాయకం కావచ్చో స్త్రీ రచయితల జీవితం చెబుతుంది. ధనమనే మోహంలో విలాసాల మోజుతో విద్యావంతులైన స్త్రీలు సోమరులుగా బ్రతుకుతున్న సమాజంలో స్త్రీ విద్య, స్త్రీ చైతన్యం, స్త్రీల ఐకమత్యం ఎన్ని ఆశాజనకమైన మార్పులు తీసుకురాగలవో, దేశ భవిష్యత్తుకు ఎటువంటి పునాదులు వేయగలవో చర్చించిన గొప్ప రచనలు ఎన్నో వెలువడ్డాయి. ఆ రచనలు చదువుతున్నంత సేపు అవి కేవలం ప్రపంచంలో స్త్రీల జీవితం అనిపించదు. మన చుట్టూ మనం చూస్తున్న స్త్రీల నిస్సహాయత, అవిద్య, బేలతనం, అన్నీ ఆ రచనలలో కనిపిస్తాయి. కాని తమ జీవితాలను మెరుగు పర్చుకోవడానికి తాము ప్రయత్నించాలనే అవగాహన వారిని శక్తివంతమైన మనుష్యులుగా మారుస్తుంది.

"మహిళ ఒక చైతన్య దీప్తి..
ఒడిని బడిగా మలిచి..."

స్త్రీ చైతన్యం నేటి సమాజానికి అవసరం. అలాంటి చైతన్యాన్ని తీసుకువచ్చిన వారిలో బండారు అచ్చమాంబ 1874 నుంచి 1905. ఈవిడను మహిళాభ్యుదయ వైతాళికురాలిగా పేర్కొనవచ్చు. తెలుగులో మొట్ట మొదట స్త్రీల చరిత్రను రాసిన మహిళగా, స్త్రీ సమాజ స్థాపకురాలిగా, సంఘసేవకురాలిగా విశేష సేవలను సమాజానికి అందించారు బండారు అచ్చమాంబ.

1939లో జన్మించిన రంగనాయకమ్మ తెలుగు సాహిత్యంలో సాహసానికి, సంచలనాలకు మారు పేరు. గృహిణిగా ఉంటూ కథలు, నవలలు రాసే స్థాయి నుండి సమాజాన్ని, మర్క్సిజాన్ని అధ్యయనం చేసి విమర్శకురాలిగా పరిణితి చెందారు.1955 లో తన 16 వ ఏటనే పార్వతమ్మ కథ అనే కథ తెలుగు స్వతంత్ర లో ప్రచురింప బడింది.

వాసిరెడ్డి సీతాదేవి, మాదిరెడ్డి సులోచన, కోడూరు (ఆరెకపూడి)కౌసల్యాదేవి,ఆంధ్రులఆరాధ్య రచయిత్రి

యద్దనపూడి సులోచనా రాణి వీరంతా 1965కు ముంద తమ రచనల ద్వారా తెలుగు పాఠకుల సాహిత్యాభి లాషను, తెలుగు భాషను నిలబెట్టారు.

స్త్రీవాద కవిత్వంలో సంచనలం కలిగించిన సంకలనం 'నీలమేఘాలు' 30 మంచి రచనాకారులు రాసిన 92 కవితలు ఉన్నాయి. ఈ గ్రంథాన్ని 1993లో అస్మిత (హైదరాబాద్) వారు ముద్రించారు. స్త్రీవాదం అనే పదాన్ని మొదటిగా "భావ కవిత్వంలో స్త్రీ" అనే గ్రంథంలో జయ ప్రభ గారు వాడారు. తెలుగు లో స్త్రీ వాద కవిత్వం పై మొదటి పరిశోధన జయ ప్రభ గారు చేశారు. స్త్రీలకు జరుగుతున్న అణచివేత కు ప్రతి ఘటిస్తూ అనేక మంది కవయిత్రులు మరియు రచయతలు స్త్రీలను చైతన్య పరచడానికి అనేక రచనలు చేశారు. జయప్రభ- వామనుడి మూడవ పాదం, చూపులు, పైటను తగ లెయ్యాలి, యుద్ధోన్ముఖంగా, యశోధరావగపెందుకే, నాదేశం లో స్త్రీ, పతిచర్యగా, విస్తరిస్తున్న ఎడారులం, సూర్యుడు కూడా ఉదయిస్తాడు, మనవి (కవితాసంపుటి) మొదలైన రచనలు చేశారు. స్త్రీ ఇంటి నుంచి బయటకు వచ్చి ఎదుర్కొనే సమస్యలు, పురుషాధిక్య సమాజం, వారిని కించపరచి, అవమానించి, అణచవేసే విధానాలు కవితా వస్తులయ్యాయి. జయ ప్రభతన 'చూపులు' కవితలో ఇలా అంటుంది.

'ఆ చూపుల్లో ఎప్పుడూ
ఒకేటే సంకేతం ఉంటుంది.
చొంగకార్చే కుక్కలాంటి ఆకలుంటుంది
వికృతమైన భల్లూకపు పుట్టులాంటిదేదో
విడవక కలల్లో సైతం వెంటాడుతుంది
చిక్కని ఈ అడవిలో' అంటూ సాగి,
'అప్పుడనుకుంటాడు.
కళ్ళకేకాదు
ఈ దేశంలో ఆడదానికి
వళ్ళంతా ముళ్ళుండే రోజు
ఎప్పుడొస్తుందా అని'

గస్త్రీలపై రాజ్యం చేసే లైంగిక హింసను కొండేపూడి నిర్మల కవితా వస్తువుగా చేసుకున్నారు. కొండేపూడి నిర్మల - నడిచే గాయాలు, బాధా సప్తనది, రహస్తంత్రి, సందిగ్ధ సంధ్య, మల్టీ నేషనల్ ముద్దు, లేబర్ రూం, హృదయానికి బహువచనం, కర్ణుడు మునిగిన దుఃఖ గంగ ఇది. మదర్ సీరియస్ (ఒక వృద్ధ స్త్రీ ఆవేదన గురించి). కొండేపూడి నిర్మలగారు మాతృత్వ భావన గురించి పితృస్వామ్య వ్యవస్థ కల్పించిన అలౌకిక భావనను 'లేబర్ రూం' కవితలో-

"లేబర్ రూమ్లో అడుగుపెడితే చాలు,
మీరంతా చెబుతున్న తెల్లచీర మల్లెపూలు పాల గ్లాసు వరసల్లో
పరాధీనత బానిస కన్నీరు ద్వీపాంతర వాసం .....
కాళ్లనలా ఎడం చేసి దీనంగా హీనంగా నీచాతి నీచంగా
ఒక హింసాతల పరాకాష్ట కోసం ఎదురుచూడ్డమంటే
రైలు పట్టా మీద నాణెం విస్తరించిన బాధ."

- అంటూ తన ఆవేదన తెలియజేశారు.

1984లో "బంది పోట్లు" అనే కవితను ఆంధ్రజ్యోతి ముద్రించింది. స్త్రీవాద కవిత్వానికి అనధికార మేనిఫెస్టో వంటిది "బందిపోట్లు" దీనిని సావిత్రి రచించారు. "బందిపోట్లు" కవితతో సావిత్రి తెలుగు సాహిత్యాన్ని ఒక కుదుపు కుదిపింది. స్త్రీ యొక్క ఔన్నత్యాన్ని తెలియజేస్తూ స్త్రీ పడే కష్టాలను తెలియజేసింది.

పాటం అప్పజెప్పకపోతే పెళ్ళి చేస్తానని
పంతులుగారన్నప్పుడే భయమేసింది.
ఆఫీసులో నా మొగుడున్నాడని
అవసరం వచ్చినా సెలవు ఇవ్వడని
అన్నయ్య అన్నప్పుడే అనుమానమేసింది.
వాడికేం? మగమహారాజ్.

పై కవితలో సావిత్రిగారు స్త్రీవాద సాహిత్య గొప్ప తనాన్ని తెలియజేసింది.

విమల - వంటిల్లు, సౌందర్యాత్మక హింస, దిగంబరుల ఊరేగింపు, అడవి పొంగిన రాత్రి, అడవి నా రక్షణ కవచం మొదలైన రచనలు చేశారు. స్త్రీ జీవితాన్ని ఎలా పరిమితం, సంకుచితం చేస్తుందో ఆమె అస్తిత్వాన్ని ఎలా హరిస్తుందో విమల తన "వంటిల్లు" కవితలో

అద్భుతంగా వర్ణించింది. "వంటింటి ఆట"లో స్త్రీ బాల్యం ప్రారంభమౌతుందని చెబుతూ.....

మా అమ్మ మా అమ్మమ్మా
ఇంట్లో అమ్మలంతా ఇక్కడ స్త్రీలయ్యారట
భయం, భయంగా, నిశ్శబ్దంగా, నిరాశగా
మా అమ్మొక ప్రేతంలా తేలుతూ ఉంటుందిక్కడ
అనలు మా అమ్మే నడుస్తున్న వంటగదిలా
ఉంటుంది.
ఈ వంటింటి సామ్రాజ్యానికి మా అమ్మే రాణి
అయినా, చివరకు వంటింటి గిన్నెలన్నిటిపైనా
మా నాన్న పేరే"

తరువాతి సంచలనాలు ఓల్గా, కాత్యాయనీ విద్మహే, వాడ్రేవు వీరలక్ష్మీదేవి, సత్యవతి, కుప్పలి పద్మ వంటి వారు తెలుగు సాహిత్యంలో కొత్త ఒరవడిని సృష్టించారు. ఆధునిక తెలుగు సాహిత్యంలో ఎంతో మంది యువ రచయిత్రులు తమ విభిన్నతను చాటుకున్నారు. కె ఎన్ మల్లీశ్వరి, కల్పనా రెంటాల, సుజాత వేల్పూరి ఇలా వీరంతా కొత్త కొత్త కోణాలలో సామాజిక అధ్యయనాన్ని, సమస్యలను తమ రచనల ద్వారా పాఠకుల ముందుకు తెచ్చారు.

ముగింపు

మానవ సహజమైన అహం, రాజీ పడలేని మనస్తత్వం, పరస్పరం ఇచ్చి పుచ్చుకోవలసిన సమానత్వం లోపించటం వంటివి అపోహలకీ, అసంతృప్తికీ బాటలు వేయటం వల్ల, మచ్చలేని పూర్ణచంద్రుడులా వెలగవలసిన స్త్రీ పురుష సంబంధాలు శోకపు కరిమబ్బుల్లో చిక్కుకుపోతోందనేది నేటి వాస్తవం. స్త్రీల వ్యక్తిగత సామాజిక సమస్యలను అనుభవించి తెలుసుకోలేని పురుషులకు, స్త్రీలే చైతన్య వంతులై, వాళ్ళ సమస్యలను స్వానుభవాల్లోనుంచి వాళ్లే అక్షర బద్ధం చేయడం అనేది ఆనందదాయకమైన విషయమే. ఈ పరిణామాన్ని మనం అందరూ స్వాగతించాలి; వాళ్ళ ప్రయత్నానికి తగినంత ప్రోత్సాహం దొరకడానికి ఎందరో స్త్రీ మూర్తుల ప్రయత్నాలు ఉన్నాయి.

ఆధార గ్రంథాలు

1. తెలుగులో కవిత్వోద్యమాలు - తెలుగు అకాడమి.
2. అధునిక తెలుగు సామాజిక కవితా ఉద్యమాలు - ఆచార్య కెరామకోటిశాస్త్రి
3. కవితాతత్వ విచారము -సి.ఆర్.రెడ్డి
4. తెలుగులో స్త్రీల సాహిత్యం -ఆచార్య కాత్యాయినీ విద్మహే
5. భావకవిత్వంలో స్త్రీ -డా॥ జయప్రభ

★★★

Vol. 23 | Spl. Issue 03 | March 2026 | BHAVAVEENA | ISSN No. : 2456-4702 | RNI No. APTEL/2003/12253

RNI No. APTEL/2003/12253 | Reffered Journal & Peer Reviewed Journals | ISSN No. 2456-4702

భావవీణ

కళలు, సాహిత్య, సాంస్కృతిక భాషాధ్యయన పత్రిక

BHAVA VEENA

Journal of Arts, Literary, Culture & Language Study

డా॥. తరపట్ల యజ్ఞం - మహిళా సమస్యల చిత్రణ

- జి. ఎన్. ఎల్. జి. కాత్యాయని

తెలుగు లెక్చరర్, శ్రీ దుర్గా మల్లేశ్వరా సిద్ధార్థ మహిళా జూనియర్ కళాశాల, విజయవాడ.

ప్రవేశిక :

ఆధునిక సాహిత్యం సామాజిక చైతన్యానికి, సామాజిక స్పృహకు, ఉద్యమాల బాటకు, స్వేచ్ఛా సమానత్వాల సాధనకు, ఆలంబనగా నిలిచింది. అణచివేతకు, అలజడులకు, విభేధాలకు, విధ్వంసాలకు, దారుణ మారణహోమాలకు, ఘర్షణలకు, సంఘర్షణలకు సంబంధించిన ప్రతీ అంశాన్ని వస్తువుగా చేసుకుని ప్రజాభాషలో వ్యక్తీకరించడానికి అక్షరరూపంలో విభిన్న ప్రక్రియల ద్వారా వివరించే సమాజ హిత సాహిత్యమే ఆధునిక సాహిత్యం. భాషలో సరళత, భావంలో నవ్యత, సమకాలినా సమస్యలపై స్పందన ఉండటం వల్ల ఆధునిక సాహిత్యం ప్రాచీన సాహిత్యం కన్నా వేగంగా ప్రజలను ఆకట్టుకుంది. ప్రజా వేదికగా, ప్రజా గొంతుకగా నినదించే సాహిత్యంగా స్థిరపడి జనాదరణ పొందడం విశేషం. అటువంటి ఆధునిక తెలుగు సాహిత్యంలో వచన కవిత్వం విశిష్టమైన ప్రక్రియగా విస్తృతమైన వ్యాప్తిని పొంది ప్రత్యేకతను చాటుకుంది.

వ్యాసం ముఖ్యోద్దేశం :

శ్రీ శ్రీ, తిలక్, ఆరుద్ర, దాశరధి, పట్టాభి వంటి వారు ఎందరో కవులు, వీరితో పాటు ధిక్కార స్వరాన్ని వినిపించిన దిగంబర కవులు, సామాజిక అసమానతల పై గళమెత్తిన కుసుమ ధర్మన్న, జాషువా, బోయిభమన్న, ఎండ్లూరి, శిఖామణి వంటి దళిత కవులు, స్త్రీవాద సమస్యలపై ఎలుగెత్తిన జయప్రభ, చల్లపల్లి స్వరూపా రాణి, కొండేపూడి నిర్మల, ఓల్గా, విమల, కాత్యాయని విద్మహే, మందవరపు హైమావతి వంటి స్త్రీవాద కవయిత్రిలు ఉన్నారు. వారందరూ సామాజిక సమస్యలపై స్పందించి కలాన్ని అస్త్రంగా చేసుకుని సంధించినవారే. సమకాలీన సమస్యల పై ఆధునిక కవులు స్పందించినంతగా ఎవరూ స్పందించలేదనేది వాస్తవమే. అటువంటి కవిత్వంలో స్త్రీల సమస్యల పై స్త్రీవాద కవయిత్రులతో పాటు అభ్యుదయ విప్లవ భావవాద కవులు కూడా స్పందించడం విశేషం. అటువంటివారిలో ముఖ్యంగా డా॥తరపట్ల సత్యనారాయణ గారు రచించిన యజ్ఞం చెప్పుకోదగ్గది. దీనిలో స్త్రీవాద సమస్యల చిత్రణ ప్రధానంగా కనిపిస్తుంది. డా॥ తరపట్ల సత్యనారాయణగారు స్త్రీవాద సమస్యలపై వివరించిన విశాల భావన. స్వీకరించిన వస్తువు, వ్యక్తీకరణలోను, వర్ణనలోను ప్రత్యేకత కనిపిస్తుంది. వస్తు నవ్యతతో పాటు సమస్యల పరిష్కార దశా దిశా వంటి అంశాలను గూర్చి వివరించే ప్రయత్నమే ఈ వ్యాసం ముఖ్యోద్దేశం.

కీలక పదాలు :

స్త్రీవాద నేపధ్యం, ఉద్యమాల తీరు, రచనల ప్రభావం, వ్యక్తీకరణలో నవ్యత, వస్తు స్వీకరణలో

ప్రత్యేకత, మహిళల ఆర్తనాదాలు, ఆవేదనలు, అభ్యుదయ భావన, వివక్షత పై పోరు, సాధికారత మొ॥నవి.

విషయ వివరణ :

స్త్రీల సమస్యలు పై అలుపెరుగని పోరుచేసిన కవులు, రచయితలు, రచయిత్రులు, వారు రాసిన రచనలను పరిశీలిస్తే ఆ రచనల వెనక ఎంత ఆవేదన, ఎంత ఆక్రందన దాగి ఉందో అర్థమౌతుంది. లింగ వివక్ష అనేది ఈ సనాతన భారతదేశంలో నాటి నుండి నేటి వరకు ఎంత లోతుగా పాతుకుపోయిందో తెలుస్తుంది. వేదకాలం నుండి ఆధునిక కాలం వరకు స్త్రీకి స్వాతంత్ర్యం లేకుండా పోయింది. అందుకే "నస్త్రీ స్వతంత్ర్య మనర్హతి" అని శాసించిన వేదకాలం "స్త్రీలు పురుషునికి లోబడి ఉండాలి" అని ఘోషించిన ఆధునిక పురుషాధిక్య సమాజం వరకు స్వరాన్ని వినిపించారు. అదే స్త్రీ వాద ఉద్యమానికి నాందీ గీతమైంది. అక్కడ నుండి మహిళా లోకంలో చైతన్యం నింపడానికి మహిళల గళాలే కలాలుగా మారాయి. ఆ కలాల నుండే ఉద్యమ జ్వాలలు రగిలాయి.

సాహిత్య చరిత్రలోనూ వివక్ష ఎదుర్కొన్న మహిళా లోకం:

ప్రాచీన సాహిత్యం నుండి ఆధునిక సాహిత్యం వరకు మహిళలకు అంత సముచిత స్థానం దక్కలేదనిపిస్తుంది. ప్రాచీన సాహిత్యాన్ని పరిశీలిస్తే రామాయణాన్ని వ్రాసిన మొల్లకు కూడా గౌరవం దక్కలేదు సరికాదా అవమానాలు ఎదుర్కొంది. ఈ కుల వ్యవస్థ మొల్లను కూడా వదలలేదు. అంత ప్రతిభ కలిగి సహజ శైలిలో వర్ణనాత్మకతతో రామాయణాన్ని వ్రాసినా "కుమ్మరి మొల్ల" గానే కులాన్ని అంటగట్టి అవమానించారు. అలాగే వేంకటేశ్వరుని భక్తురాలైన తరిగొండ వేంగమాంబను కూడా ఆనాటి కులమత ఛాందసవాదం వదలలేదు. వెంగమాంబను "వితంతువని" హేళన చేసి వితంతువులు కూడా రచనలు చేస్తారా అని ప్రశ్నించి అవమానపరిచారు. అలాగే క్షీణ ప్రబంధయుగ కాలంలో ముద్దుపళని, రంగాజమ్మలను కూడా కులం పేరుతో అవమానించి బోగం స్త్రీలు రచనలు చేయడం నేరమన్నట్లుగా, కేవలం పండిత వంశానికి చెందిన వారికే ఆ హక్కు ఉందన్నట్లు శాసించిన సనాతన వాదాల అభిప్రాయాలు బాధను కల్గిస్తాయి. ముద్దుపళని రాసిన రాధికాస్వాంతనముగా ఒకశృంగార ప్రబంధం. దీనిలోని శృంగారాన్ని ఆశ్వాదిస్తూనే ఆమె ఒక వేశ్య అని కుల నిరసన, మరొక వైపు పురుషాధిక్య అహంకారం ఘీంకార కనిపిస్తుంది.

ఆధునిక సాహిత్యంలో స్త్రీవాద కవిత్వం విస్తృతంగా వ్యాపించింది. మహిళలు ప్రభంజనమై ప్రశ్నించడం మొదలుపెట్టారు. హక్కుల కోసం దిక్కులు పిక్కటిల్లేలా పిడికిళ్లు బిగించి యుద్ధ మేఘులై గర్జించారు. సాధికారత కోసం సమైక్య నినాదంతో ముందుకు సాగారు. దాంతో స్త్రీవాద ఉద్యమంలో పదునెక్కిన కలాలతో కవయిత్రులు, రచయిత్రులు రచనలు చేసి సామాజిక చైతన్యాన్ని రగిలించారు. ఇంత విప్లవాన్ని తీసుకు వచ్చిన స్త్రీవాద రచయిత్రల మీద విమర్శనస్త్రాలు దారుణంగా సంధించినవారు లేకపోలేదు. మానసిక వేదనకు గురి చేసినవారూ లేకపోలేదు. నాటి నుండి నేటి వరకు సాహిత్య చరిత్ర పుటల్లో మహిళలకు సముచిత గౌరవము, సరైన స్థానం దక్కకుండా నిరోధించే ప్రయత్నాలు జరిగినా, జరుగుతున్నా నేటి మహిళ మాత్రం ప్రగతి పథంలో పయనిస్తూ అన్ని రంగాల్లోను దూసుకుపోతుంది.

యజ్ఞంలో మహిళా సమస్యల చిత్రణ :

డా॥తరపట్ల సత్యనారాయణ గారు వ్రాసిన యజ్ఞం 2022లో సాహితీలోకానికి పరిచయమైంది. వీరి కవితా సంపుటిపై మద్రాస్ విశ్వవిద్యాలయంలో ఆచార్య విస్తాలి శంకర్ గారి పర్యవేక్షణలో పరిశోధన చేసి బత్తుల అన్నపూర్ణ గారు ఎంఫిల్ పట్టాను తీసుకున్నారు. యజ్ఞాన్ని పరిశీలిస్తే ప్రతి కవితలోను ఒక ధిక్కార స్వరమే వినబడుతుంది, వాస్తవికత కనబడుతుంది. అందుకే డా॥ తరపట్ల గారు తమ యజ్ఞాన్ని "వాస్తవిక వచన కవిత్వం" అన్నారు. తమ కవితాతత్వాన్ని గురించి ప్రస్తావిస్తూ

నా అక్షరాలు అప్సరసలు కావు
నైజంలో నిజాన్ని నగ్నంగా
నిర్విఘ్నంగా చాటి చెప్పే
నగ్న జ్వాలాలు నా అక్షరాలు... అంటూ అగ్ని జ్వాలలుగా అక్షరాలను రగిలించి50 కవితలలో విభిన్న అంశాలను స్పృశించారు. ప్రతీ కవితలోను జరిగిన

యదార్థ సంఘటనలు, సంఘర్షణలే దర్శనమిస్తాయి. గుండె ధైర్యంతో విమర్శనస్త్రాలతో సమాజాన్ని ప్రశ్నించారు. మానవ మస్తిష్కాల్లో వినూత్న ఆలోచనలను రగిలించారు. మానవత్వంలేని సమాజంలో దానవత్వం పెరుగుతున్న ధోరణని, మారణ హోమంతో మండుతున్న ఈ ఆటవిక ఆధునిక జనరణ్యాన్ని అక్షరాలనే ఆయుధంగా చేసుకుని ఒక్క కలం పోటుతో కదిలిస్తారు. మహకవి కాళోజి అన్నట్టు "ఒక్క అక్షరం లక్షమెదళ్ళ కదలికలా" వీరి కవిత్వం పదునెక్కిన పాటగా వినిపిస్తుంది. అందుకేనేమో ఆచార్య ఎన్.ఈశ్వరరెడ్డి గారు అక్షరాలను ఆయుధాలుగా మార్చుకోవాలనే తపన కలిగి అత్యాధునిక కవి డా॥ తరపట్ల అన్నారు.

డా॥ తరపట్ల "నా అక్షరాలు" అనే మొదటి కవితలోనే స్త్రీవాద భావజాలం కనిపిస్తుంది. తన ఆశయాలు ఆలోచనలకు ప్రతిరూపంగా, సామాజిక సమస్యలను ప్రపంచానికి తెలియజేయడానికి కవులు కృషి అవసరమని, ప్రతి అక్షరం ఒక విస్ఫోటనాన్ని రగిలించాలని, సమకాలీన సమస్యల పై కలాలను సంధించాలంటూ "నా అక్షరాలు" గురు లఘువుల వడిలో యతిప్రాసల సుడిలో, గణాలంకారాల కౌగిళ్ళలో, చిక్కుకున్న పక్షులు కాదంటూ స్త్రీల సమస్యల పై స్పందిస్తూ

అబలను తబలగ వాడివాడి
అంగడి వస్తువుగా
అంగాంగ వర్ణనచేస్తూ
హీనంగా అతిహీనంగా చూసే
మృగరాయుళ్ల యెదలో జ్వాలలు

నా అక్షరాలు... అంటూ ప్రాచీన సాహిత్యంలో స్త్రీ అంటే అంగాంగవర్ణనే. శృంగావర్ణనే, నఖ శిఖ ముఖ, నాభి, నూగారు వర్ణనలతో, మితిమీరిన శృంగార రసప్రవహంతో కొట్టుకుపోయే రసిక కవిపుంగవులను ఘాటుగా విమర్శించడమే కాదు స్త్రీని కేవలం అంగడి వస్తువుగా చేసి ఆట బొమ్మగా మార్చే కవులకు, చూసే రసిక దాహర్తధూర్త మగమృగాలకు హెచ్చరికగా అక్షర జ్వాలలను రగిలించారు.

స్త్రీ జాతి దుస్థితిని కళ్ళకు కట్టినట్టు వర్ణిస్తూ వాస్తవాన్ని ఆవిష్కరిస్తూ డా॥ తరపట్ల స్త్రీల పై జరిగిన, జరుగుతున్న దాడులు, మానభంగాలు, హత్యలు, ఆత్మహత్యలు, వరకట్న చావులు వంటి అంశాలపై స్పందిస్తూ "మా స్త్రీ జాతి" అనే కవిత ద్వారా నేటి స్త్రీ సమాజంలో స్త్రీల వ్యధలను, గాధలను కవిత్వీకరిస్తూ

మావల్లే సంతోషాన్ని
మావల్లే ఆనందాన్ని
అనుభవించే మిమ్మల్ని
మాకు మేమే మా కన్నీళ్ల విలువలను
కరెన్సీతో ఖరీదు కట్టి
అధికారికంగా కొనుక్కొంటున్న

స్త్రీల జాతి మాది... అంటూ ఆవేదనను ప్రకటించారు. అంతేకాదు "లాంచనాల మంత్రాల మధ్య, రేటనే ముహూర్తం పెట్టి, మనీతో మూడు ముళ్లు కట్టించుకుని, కన్నిటి అక్షితలను హాయిగా నెత్తిన వేయించుకుంటున్న స్త్రీ జాతి మాది అంటారు. నేటికీ కొనసాగుతున్న వరకట్న దురాచారం, అంతకంతకు ఆకాశమంత ఎత్తుకు ఎదిగిపోయితున్న ఈ వరకట్నం ఆగేదెప్పుడు అధ:పాతాళానికి తొక్కేదెప్పుడో ఆలోచించమంటారు. విజ్ఞానం పెరిగే కొలదీ, ఆధునికత విస్తరించే కొలది ఈ దురాచారాలు కూడా వాటితో పాటుగా సమానంగా విస్తరిస్తూ అభివృద్ధి పథ చూచికలో అగ్రస్థానంలోనే నిలుస్తుందని నేటి ఆధునిక పోకడను గుర్తుచేస్తారు. అలాగే భర్తల ఆగడాల కాగడాలకు సమిధులైన స్వర్ణలతలను, కట్నాల కుంపటిలో పడి మాడిమసైన పసిడి కుసుమాలను, లోకంలో జరుగుతున్న అనేక దురాగతాలను ఆవిష్కరిస్తూ

ఈ ఘోర మృగారణ్యంలో
కట్టిన తాళే కంఠానికి ముడియై
కౌగిలించుకుంటుంటే
ఆత్మలన్నీ హత్యలై
హత్యలన్నీ నిత్యకృత్యమై
నిలబడిన సుదీర్ఘ చరిత్రగలది

మా స్త్రీ జాతి... అంటూ ఎంతో ఆవేదనను ఆక్రందనను తెలియజేస్తారు. స్త్రీలపై జరుగుతున్న ఘోరాలను, మృగతృష్ణతో విస్తరిస్తున్న కామోన్మాద

దాడులను, కనీసం మనిషిగా చూడకుండా అబలనే అలసత్వంతో ప్రదర్శిస్తున్న రాక్షస క్రీడలను దుయ్యబడతారు. తల్లిగా, చెల్లిగా, అక్కగా నిలవడమే కాదు సృష్టికే ప్రతిరూపంగా సాక్షాత్కరించే స్త్రీ మూర్తి పై జరుగుతున్న అమానుష దాడులపై, మానవ రూప దానవ పశుమూకలపై అక్షరాలను పాశుపాతాస్త్రాలుగా సంధించారు.

మనభూమి వేద భూమని, ధర్మ భూమని, పవిత్రభూమని గొప్పగా చెప్పుకుంటాం. అంతేకాదు స్త్రీని గౌరవించే సంప్రదాయం మనదేనని కూడా ఢంఖా వాయించుకుంటూ గర్వపతాకాలు ఎగురవేస్తాం. కానీ స్త్రీని నడివీధిలో నగ్నంగా ఊరేగిస్తూ పాచవిక ఆనందం పొందుతున్నా దుర్మార్గులను శిక్షించకుండా పోతున్నాం. ఈమధ్య కాలంలో మతోన్మాధం ముసుగులో, కులోన్మాదం ముసుగులో మహిళలపై ఎన్నో దారుణాలు జరుగుతున్నాయి. ప్రభుత్వాలు పట్టించుకోవడం మానేసి, వారిని శిక్షించకుండా సన్మానాలు, సత్కారాలు చేయడం సమాజాన్ని కలచివేస్తుంది. దేశాన్నే పరిపాలించే నాయకులు, చట్టాన్ని అమలు చేసే అధికారులు కుమ్మక్కై స్త్రీల హక్కులను కాపాడలేకపోతున్నారు. స్త్రీలను రక్షించలేకపోతున్నారు. డా॥తరపట్ల గారు చెలకుర్తిలో ఒక దళిత స్త్రీని నగ్నంగా నడి వీధిలో ఊరేగించిన అమానుష సంఘటనను గుర్తు చేస్తూ "భారతి" అనే కవితలో అమ్మా భారతమాతా ఎందుకలా ఏడుస్తావు అంటూ

మొన్న మొన్ననే
చెలకుర్తిలో నీదళిత కూతురిని
కుహనో సంస్కారులు
వీధి వీధినా ఆయుధాలు పట్టి
పట్ట పగలే నడి వీధిల్లో
నగ్నంగా ఊరేగిస్తే

ఎవరన్నా ఆపగలిగారా... అంటూ ప్రశ్నిస్తారు. సాటి సమాజాన్నీ నడిపించే చట్టాన్నీ అమలు చేసే అధికారుల్ని, నాయకుల్ని నిలదీస్తారు. అందుకే ఓ భారతమాత ఈ మానవుల కన్నా దానవులే మిన్న అంటూ, రోజులు మంచివి కావు నీవు కూడా ఇక్కడ ఉండటం మంచిది కాదు. నీవు కూడా ఒక ఆడ కూతురివే కదమ్మా అందుకే నీవు కాకులు దూరని కారడవికి పారిపోమ్మంటూ కాముకమూకల దౌష్టికాన్ని, ధూర్తమూకల దౌర్జన్యాన్ని కవిత్వీకరిస్తూ స్త్రీల సమస్యలను చిత్రించారు.

ఈ మధ్యకాలంలలో అధికార మధంతో అగ్ని గుండంగా మార్చిన మణిపురి సంఘటన ప్రపంచాన్ని కదిలించింది. దాంతో ప్రపంచములో భారతదేశం తలవంచుకుంది. తలవంపులు తెచ్చుకుంది. గిరిజన గూడాలను ధ్వంసం చేయడం. గిరిజన మహిళల మొలపై నూలుపోగూ కూడా లేకుండా నగ్నంగా పాచవిక చేష్టలతో నడిపించిన ఆటవిక అరాజక రాజకీయ దుర్మార్గం ఇంకా ఎంతకాలం కొనసాగుతుందని ప్రపంచం గళంవిప్పి ఒక విస్పోటనాన్ని రలిగించింది. ఇలాగే మహిళలపై అనేక దాడులతో భారత ఖండం అగ్నిగోళమై మండుతుంది.

డా॥. తరపట్ల గారి "యజ్ఞం" అధ్యయనం చేస్తుంటే మహిళల పై జరిగిన ప్రతి దాడిపై అగ్నికణంలా జ్వలించిన వైనం కనిపిస్తుంది. కన్న తల్లితండ్రులకు కూడా పక్షపాతం ఉంటుందని మగపిల్లాడైతే ఒక ప్రేమ, ఆడపిల్లయితే ఒక ప్రేమ చూపే వివక్ష స్వభావాన్ని దుయ్యబడుతూ "ఆవేదన" అనే కవితలో

నేనేం పాపం చేసానని
నేనేం నేరం చేసానని
కసాయి కత్తెరలకు
కఠిన కిరణాలకు

నన్ను బలి చేస్తారు... అంటూ బ్రూణహత్యలపై ధిక్కార స్వరాన్ని వినిపిస్తారు. లింగ నిర్ధారణ పై ఆంక్షలు ఉన్నా అవన్నీ యధావిధిగానే కొనసాగుతూనే ఉన్నాయి. అందుకే గర్భస్థ శిశు హత్యలు ఎక్కువవుతున్నాయి.

డా॥. తరపట్ల గారి పదాలే ఘాటైనవి అందులో ఈ ఆవేదన అనే కవితలో మరింత కఠువుగా పదప్రయోగం చేస్తూ

మీరు ఆవేశంతో దాహం దీర్చుకుని
మిగిల్చిన చుక్కలతో నన్ను ముద్దగా చేసి
కొన్ని మాసాల పాటు చీకట్లో ముద్దుగా పెంచి

మీరు శ్రద్ధగా గుద్దుకున్నా సహించానే... అంటూ పచ్చిగా నిజాన్ని నిర్భయంగా ప్రకటిస్తారు. అంతేకాదు గర్భంలో శిశువు ఎదుగుతున్న తరుణంలో స్కానింగ్ చేసి ఆడపిల్లని తెలియగానే అబార్షన్ ప్రక్రియ మొదలుపెట్టి క్షణాల్లో పసికందుని అంతం చేయడం దారుణమంటారు. అందుకే ఆవేదన వ్యక్తం చేస్తూ

అసలు నాకీ రూపం ఇవ్వమని ఏడ్చిందెవరు
చంపడం పెంచడం ఉంచడం మీ ఇష్టమేనా

అసలు మీరు మనుషులేనా... అని ప్రశ్నిస్తూ సభ్యసమాజం తలవంచుకునేలా చేస్తున్న ఈ అకృత్యాలను ఎండగట్టారు. లింగవివక్షత లింగనిర్ధారణతోనే మొదలవుతుందనే వాస్తవాన్ని సమాజానికి తెలియజేసారు. ఆడపిల్ల అనగానే అదోరకమైన చులకన భావన పోవాలంటారు. ఎంత చదువు ఉన్నా, ఎంత సంపద ఉన్నా సంస్కారం లేని మనిషిగా, పశువు కన్నా హీనంగా మారొద్దంటారు. మనుషుల కన్నా పశువులే నయం అంటారు. అంతేకాదు మనుషుల మనస్తత్వాలను వివరిస్తూ

నేను ఆడపిల్లనని తెలిసే కదా
ఆ చీకటి గర్భంలోనే
నన్నంతం చేయడానికి పంతం పట్టారు
మీ క్రీడా విలాస విన్యాసమే

నాకు మరణ శాసనమా... అంటూ ఆవేదన వ్యక్తం చేస్తారు. ఈ కవిత హృదయాన్ని ద్రవింపచేస్తుంది. భార్య భర్తలు చూపుతున్న వివక్ష ఎంత దారుణమో తెలుస్తుంది. ఈ కవిత చివరిలో మంచి సందేశం ఉంది. ఈ సందేశంలో ''ఒక్కసారి ఆలోచించడండి, మనిషిగా ఆలోచించండి, మంచిగా ఆలోచించండి, అమ్మా అన్న తీపి పిలుపును కసితో కొసేయకండి, ఆదిలోనే తృంచేయకండి''... అంటూ ముగిస్తారు. హృదయాన్ని ద్రవింప చేసే కవిత్వం డా॥తరపట్ల గారికే సాధ్యమన్నట్టుగా కనిపిస్తుంది.

స్త్రీల సమస్యలను పరిశీలించిన డా॥తరపట్ల గారి కవిత్వంలో ప్రస్తుత వాస్తవికత ఉంది. ఆడపిల్లగా పుట్టే కన్నా అడవిలో మ్రానుగా పుడితే మేలనే సామెతలా. సమస్యల వలయంలో చిక్కుకున్న మహిళల దుస్థితిని గమనిస్తే నిత్యం జరుగుతున్న దారుణాలను గుర్తుచేస్తూ ఆడపిల్లల బ్రతుకులు ఎంత దుర్భరమని భావించి, స్త్రీలు పొందుతున్న ఆవేదనను గుర్తుచేస్తూ

ఓగర్భస్థ శిశువులారా
కళ్లు తెరవకుండా కరిగిపోండి
ఈ భూమి మీద మీరు

బహిస్టు బట్టకన్నా హీనంగా బ్రతకలేరు... అంటూ తీవ్ర పదజాలంతో వాడకూడని పదాన్ని వాడటంతో ''బహిష్టు బట్టకన్నా హీనంగా'' అనడంలో స్త్రీల బ్రతుకు ఎంత దుర్భరమో అర్థం చేసుకోవచ్చు. అంతేకాదు మీకుమీరే మృత్యుఘోరీలు నిర్మించుకోకండి, కళేబరాలుగా మారిపోకండి అంటారు. మహిళలు ఎదుర్కొంటున్న అవమానాలు, అపహేళనలు, లింగవివక్ష, లైంగిక వివక్ష అన్ని రంగాల్లోను ఎదురౌవుతున్న చేదు అనుభవాలు, విషాధకర సంఘటనలు, ఆత్మహత్యలు, పరువు హత్యలు, కుల వివక్షత, మత వివక్షత వంటివి నిత్యం జరుగుతూనే ఉన్నాయి. ఎంత ప్రగతిని సాధించినా ఇంకా మహిళలు స్వేచ్ఛా స్వాతంత్ర్యంలో పరిపూర్ణత సాధించలేదు. అందుకే హక్కుల కోసం గళగర్జన అవసరమంటూ

నారీ లోకమా
ఏరిపారేసిన ఎంగిలాకా నీ జీవితం
ముళ్ళ పై నీవు పడినా నీపై ముళ్లు పడినా

చిరిగేది నీ జీవితం సేవలకైనా అంకితం... అంటూ ఇటువంటి పాత రోజులు పోయాయ్ సాధికారత కోసం సమరశంఖం పూరించవలసిన అవసరం మరియు సమయం ఆసన్నమైంది. ఎన్నో ఉద్యమాలు మొదలయ్యాయి. అన్నిటిలోనూ స్త్రీయే అగ్రస్థానాన్ని సాధించాలి. పురుషాధిక్య సమాజంలో విజయ భేరీ మ్రోగించాలి. వారి మెదళ్ల కుదళ్లను కదిలించాలి. ముష్కరుల హృదయాల్లో సంస్కార సూర్యుణ్ణి ఉదయింపచేయాలి అందుకే నారీ లోకమా నీవు జ్వలించు, చలించు గర్జించు, గద్దించు అంటారు.

ఈ విధంగా డా॥తరపట్ల గారి యజ్ఞంలో స్త్రీవాద దృక్పథం ఉంది. సమాజంలో స్త్రీలు ఎదుర్కుంటున్న సమస్యల చిత్రణ ఉంది. మహిళల ఆవేదన, అణచివేత,

వివక్ష వంటి అంశాలపై స్పందిస్తూ సంధించిన కవిత్వం, నినాదించిన ఉద్యమగళం, నిలదీసిన వాస్తవికత, వినిపించిన ధిక్కార స్వరం ప్రతి కవితలోను కనిపిస్తుంది. అందుకే ఈ యజ్ఞం అనే కవితా సంపుటి మీద పరిశోధన జరగడమే కాకుండా, కన్నడ భాషలోకి అనువాదమైంది. స్త్రీల కోసం ఎవరు వ్రాసినా స్త్రీ జనోద్ధరణే, ప్రధానంగా భావించి సాధికారత దిశగా అడుగులు వేద్దాం మహిళాభ్యుదయాన్ని సాధించాలని కోరుకుందాం.

ఆధార గ్రంధాలు :

1. డా॥ తరపట్ల సత్యనారాయణ - యజ్ఞం
2. బత్తుల అన్నపూర్ణ - డా॥ తరపట్ల సత్యనారాయణ గారి యజ్ఞం కవిత్వం, విశ్లేషణ
3. డా॥ జి.నాగయ్య - తెలుగు సాహిత్య సమీక్ష ద్వితీయ సంపుటి.

★★★

Vol. 23 | Spl. Issue 03 | March 2026 | BHAVAVEENA | ISSN No. : 2456-4702 | RNI No. APTEL/2003/12253

RNI No. APTEL/2003/12253 | Reffered Journal & Peer Reviewed Journals | ISSN No. 2456-4702

భావవీణ

కళలు, సాహిత్య, సాంస్కృతిక భాషాధ్యయన పత్రిక

BHAVA VEENA

Journal of Arts, Literary, Culture & Language Study

కొండేపూడి నిర్మల కవిత్వం - మహిళా చైతన్యం

- యమ్. శిరీష

అధ్యాపకురాలు, రాజనీతి శాస్త్ర విభాగం, శ్రీ ఏ యన్ యన్ యం ప్రభుత్వ కళాశాల (స్వయం ప్రతిపత్తి), పాలకొల్లు పశ్చిమ గోదావరి జిల్లా.

తెలుగు సాహిత్యంలో మహిళా రచయితలు తమ అనుభవాలను కవిత్వ రూపంలో వ్యక్తం చేస్తూ సమాజంలో మార్పుకు దోహదపడ్డారు. అలాంటి ప్రముఖ కవయిత్రిలో కొండేపూడి నిర్మల ఒకరు. ఆమె కవిత్వం మహిళా సమస్యలను ప్రతిబింబిస్తూ చైతన్యాన్ని పెంపొందిస్తుంది. కొండేపూడి నిర్మల ఆధునిక తెలుగు కవిత్వంలో ప్రముఖ స్థానం పొందిన కవయిత్రి. ఆమె రచనలు మహిళల జీవన అనుభవాలు, బాధలు, సామాజిక అణచివేతలపై కేంద్రీకృతమై ఉంటాయి. ఆమె కవిత్వం సున్నితమైన భావోద్వేగాలతో పాటు సామాజిక సందేశాన్ని కలిగి ఉంటుంది

కొండేపూడి నిర్మల కవిత్వం మహిళా చైతన్యానికి ప్రతిబింబం. ఆమె కవితల్లో మహిళల జీవన వాస్తవాలు, అణచివేత, స్వేచ్ఛ కోసం పోరాటం, ఆత్మగౌరవం వంటి అంశాలు స్పష్టంగా వ్యక్తమవుతాయి. ఈ విశ్లేషణలో ఆమె కవిత్వంలోని ప్రధాన అంశాలను కవితా పంక్తులతో వివరించబడింది.

అణచివేత మరియు నిర్బంధం

"నన్ను గోడల మధ్య బంధించి
నా ప్రపంచాన్ని చిన్నదిగా చేసారు"

"ఇంటి గడపే నా ఆకాశమని చెప్పారు
కానీ నా కలలకు ఆకాశం కావాలి"

ఈ పంక్తులు మహిళలను కుటుంబ పరిమితుల్లోనే బంధించే సమాజాన్ని విమర్శిస్తున్నాయి. మహిళల వ్యక్తిగత స్వేచ్ఛను అణచివేసే పరిస్థితులను నిర్మల స్పష్టంగా చూపిస్తుంది.

మౌనంలో దాగిన బాధ

"నిశ్శబ్దంగా ఉన్నా నా హృదయం
ప్రతిరోజూ కేకలు వేస్తుంది"

"నవ్వులో దాచిన కన్నీళ్లు
ఎవ్వరూ చూడలేరు"

మహిళలు అనుభవించే మానసిక బాధను ఈ పంక్తులు ప్రతిబింబిస్తాయి. సమాజంలో మహిళల భావాలను గుర్తించకపోవడం పై కవయిత్రి ఆవేదన వ్యక్తం చేస్తుంది.

స్వేచ్ఛ కోసం ఆకాంక్ష

"నా అడుగులు నా దారిని వెతుకుతున్నాయి
ఆపొద్దు, నేను ముందుకు సాగాలి"

"ఎగరాలని ఉంది నాకు
ఈ బంధనాల్ని విడిచి"

మహిళలు తమ జీవితాన్ని స్వతంత్రంగా గడపాలని కోరుకునే భావాన్ని ఈ పంక్తులు తెలియజేస్తాయి. ఇది మహిళా చైతన్యంలో కీలకమైన అంశం.

ఆత్మగౌరవం మరియు స్వీయ గుర్తింపు

"అమ్మగా, భార్యగా నన్ను గుర్తించారు
కానీ నా పేరును మర్చిపోయారు"

"నేను ఎవరో నాకు తెలుసు
మరెవరికీ నిరూపించాల్సిన అవసరం లేదు"

ఈ పంక్తులు మహిళల వ్యక్తిత్వాన్ని గుర్తించాల్సిన అవసరాన్ని సూచిస్తాయి. సమాజం మహిళలను పాత్రలతో మాత్రమే చూసే విధానాన్ని విమర్శిస్తాయి.

సంప్రదాయాలపై తిరుగుబాటు

"ఆచారాల పేరుతో నన్ను కట్టిపడేసి
నా స్వరాన్ని మూసివేశారు"

"పాత నియమాలు నన్ను నిలిపివేయలేవు
నేను కొత్త దారిని ఎంచుకుంటాను"

సాంప్రదాయాల వల్ల మహిళల స్వేచ్ఛ ఎలా పరిమితం అవుతుందో ఈ పంక్తులు చూపిస్తాయి. నిర్మల మార్పు అవసరాన్ని స్పష్టం చేస్తుంది.

విద్య మరియు చైతన్యం

"చదువు నాకు వెలుగైంది
నా చీకట్లు తొలగిపోయాయి"

"అక్షరాలు నేర్పిన శక్తి
నా జీవితం మార్చింది"

విద్య మహిళా సాధికారతకు మూలమని ఈ పంక్తులు తెలియజేస్తాయి. చదువు ద్వారా మహిళలు స్వతంత్రంగా ఎదగగలరని సందేశం ఉంది.

సమానత్వం కోసం పోరాటం

"నాకూ హక్కులున్నాయి
సమానంగా జీవించే హక్కు"

"నన్ను తక్కువగా చూడొద్దు
నేను సమానమే"

ఈ పంక్తులు లింగ సమానత్వాన్ని ప్రోత్సహిస్తున్నాయి. మహిళలు సమాన హక్కుల కోసం పోరాడాల్సిన అవసరాన్ని తెలియజేస్తాయి.

మహిళా శక్తి

"నేను బలహీనురాలిని కాదు
నా లోపల శక్తి ఉంది"

"నా స్వరమే నా ఆయుధం
నా ధైర్యమే నా బలం"

ఈ పంక్తులు మహిళల ఆత్మవిశ్వాసాన్ని పెంచే విధంగా ఉన్నాయి. మహిళలు తమ శక్తిని గుర్తించుకోవాలని సూచిస్తాయి.

సమాజంపై విమర్శ

"సమాజం నన్ను తీర్పు చెబుతుంది
కానీ నా బాధను ఎవరూ అడగరు"

"నన్ను నియంత్రించే నియమాలు
నన్ను అర్థం చేసుకోలేవు"

సమాజంలోని ద్వంద్వ ధోరణిని నిర్మల విమర్శిస్తుంది. మహిళలపై విధించే నియమాలను ప్రశ్నిస్తుంది.

భవిష్యత్ దృక్పథం

"నా కూతురు స్వేచ్ఛగా జీవించాలి
నేను చూడని ప్రపంచాన్ని చూడాలి"

"మార్పు నా నుంచి మొదలవుతుంది
కొత్త ప్రపంచం కోసం"

ఈ పంక్తులు భవిష్యత్తులో సమానత్వం సాధ్యమవుతుందనే ఆశను తెలియజేస్తాయి. మహిళా చైతన్యం తరతరాలకు కొనసాగాలని సూచిస్తాయి.

ముగింపు

కొండేపూడి నిర్మల కవిత్వం మహిళా చైతన్యానికి ఒక బలమైన స్వరం. ఆమె కవితలు మహిళలలో ఆత్మ విశ్వాసాన్ని పెంచి, సమానత్వం కోసం పోరాడే ధైర్యాన్ని ఇస్తాయి.

★★★

Vol. 23 | Spl. Issue 03 | March 2026 | BHAVAVEENA | ISSN No. : 2456-4702 | RNI No. APTEL/2003/12253

RNI No. APTEL/2003/12253 | Reffered Journal & Peer Reviewed Journals | ISSN No. 2456-4702

భావవీణ

కళలు, సాహిత్య, సాంస్కృతిక భాషాధ్యయన పత్రిక

BHAVA VEENA

Journal of Arts, Literary, Culture & Language Study

భాగవతంలో మహిళా చైతన్యం

- సునీత ఉండవల్లి

స్కూల్ అసిస్టెంట్, తెలుగు
పరిశోధక విద్యార్థిని (పార్ట్ టైం)
తెలుగు అధ్యయన శాఖ,
శ్రీ పద్మావతి మహిళా
విశ్వవిద్యాలయం, తిరుపతి.

- డా॥. డి. యువశ్రీ

సహాచార్యులు, పర్యవేక్షకులు,
తెలుగు అధ్యయన శాఖ,
శ్రీ పద్మావతి మహిళా
విశ్వవిద్యాలయం
తిరుపతి.

భాగవతంలో స్త్రీలు పురుషులకు నీడ క్రింద ఉన్నారనే అపోహే ఉంది. స్త్రీలలోని చైతన్యం నివురు గప్పిన నిప్పులా ఉంటుంది. రామాయణంలో శ్రీరాముడు అరణ్యానికి బయలుదేరుతున్నప్పుడు సీత నేను కూడా వస్తాను అని అన్నప్పుడు రాముడు అరణ్యంలో క్రూరజంతువులు ఉంటాయి. కష్టాలు పడాలి అంటాడు. అప్పుడు సీత ఒకమాట అంటుంది. "నా తండ్రి ఒక పురుషుడికి ఇచ్చి వివాహం చేశాడు అనుకున్నాను, పిరికి వాడికి ఇచ్చి చేశాడు అని అనుకోలేదు" అని అంటుంది. మహాభారతంలో ద్రౌపది కూడా ఒక స్వతంత్ర్యం ఉన్న వ్యక్తిగా మనకు కనిపిస్తుంది. అలాగే మహాభాగవతంలో కూడా స్త్రీల చైతన్యాన్ని ఒకసారి పరిశీలిద్దాం!!

భాగవతంలోని స్త్రీలు ధైర్య సాహసాలకు నెలవుగా, జిజ్ఞాసువులుగా, భక్తులుగా, మానవతా మూర్తులుగా, పిల్లలను వ్యక్తిత్వం గల వ్యక్తులుగా తీర్చిదిద్దే మాతృ మూర్తులుగా ఎన్నో కోణాలలో కనిపిస్తారు. వారిలో కొందరిని ఇప్పుడు చూద్దాం.

ధ్రువచరిత్రను ఒకసారి పరిశీలిస్తే ఉత్తానపాదునికి సునీతి, సురుచి అని ఇద్దరు భార్యలు. ధ్రువుడు సునీతి కొడుకు. ఉత్తానపాదుడికి సురుచి అంటే మక్కువ. ఒకరోజు సురుచి కొడుకు ఉత్తముడు తండ్రి తొడమీద కూర్చుని ఉండగా, ధ్రువుడు కూడా కూర్చోవాలని తండ్రి దగ్గరకు వెళ్ళగా సురుచి ధ్రువుని అవమానిస్తుంది. దుఃఖంతో ధ్రువుడు కన్న తల్లి దగ్గరకు వెళ్ళగా తల్లీ బాధపడి, ధ్రువుడ్ని ఓదారుస్తుంది.

"నాయనా! మన దుఃఖానికి ఇతరులను అనవలసిన పనిలేదు. పూర్వజన్మలో చేసిన పాపం మానవులను వెంబడించి వస్తుంది.."

క. "అనఘా! యీ దుఃఖమునక్కఁ
బనిలే దన్యులకు సాలయ బలవంతంబై
తన పూర్వ జన్మ దుష్కృత
ఘనకర్మము వెంటనంటఁగా నెవ్వలనన్

(మహాభాగవతం 4-228)

సునీతి తన కొడకుకి పినతల్లి మీద ద్వేషాన్ని నింప లేదు. మన దుఃఖానికి ఇతరులను నిందించకూడదు అని తెలియజెప్పిన మహాసాధ్వి సునీతి.

నీకు తండ్రి ఒడిలో కూర్చోవాలనే ఆశ ఉన్నట్లయితే అందరికీ దిక్కు అయిన హరిపాదాలను ఆరాధించు అన్న సురుచి మాటలను అనుకూలంగా మార్చి ధ్రువుడి ఉన్నత మార్గానికి దారి చూపించింది సునీతి.

సీ. "పరికింప నీ విశ్వపరిపాలనమునకై;
యర్థి గుణవ్యక్తు డైనయట్టి
నారాయణుని పాదనళినముల్ సేవించి;
తగ బ్రహ్మ బ్రహ్మపదంబు నొందె;
ఘన్నఁడు మీ తాత యా మనువు సర్వాంతర;
యామిత్వ మగు నేకమైన దృష్టి
జేసి యాగముల యజించి తా భౌమ సు;
ఖములను దివ్యసుఖముల మోక్ష.

(మహాభాగవతం 4-233)

క. కరతల గృహీత లీలాం
బురుహ యగుచ్చఁ బద్మగర్భముఖ గీర్వాణుల్
పరికింపం గల లక్ష్మీ
తరుణీమణిచేత వెదకఁ దగు పరమేశున్.

(మహాభాగవతం 4-235)

తే. సుఖములను బొందె నట్టి యచ్యుతునిఁ బరుని
వితత యోగీంద్ర నికర గవేష్యమాణ
చరణ సరసిజ యుగళు శశ్వత్ప్రకాశు
భక్తవత్సలు విశ్వసంపాద్యు హరిని.

(మహాభాగవతం 4-233.1)

భావం :

"లోకాలను రక్షించడానికి సగుణస్వరూపాన్ని గ్రహించిన నారాయణుని పాదపద్మాలను ఆరాధించి బ్రహ్మ దేవుడు బ్రహ్మపదాన్ని పొందాడు. నీ తాత అయిన స్వాయంభువ మనువు భగవంతుని సర్వాంతర్యామిత్వాన్ని గుర్తించి ఏకాగ్రతతో యజ్ఞాలను చేసి ఆ దేవదేవుని సేవించి ఇహలోక సుఖాలను, పరలోక సుఖాలను అనుభవించి పరమపదాన్ని పొందాడు. నాశం లేనివాడు, యోగీశ్వరులు అన్వేషించి ఆరాధించే పాదపద్మాలు కలవాడు, ఆయన అనంత కాంతిస్వరూపుడు, భక్తవత్సలుడు, విశ్వసంసేవ్యుడు, బ్రహ్మ మొదలైన దేవతలు వెదకినా కనిపించని లక్ష్మీదేవి లీలాకమలాన్ని చేత ధరించి ఆ హరి కోసం వెదకుతూ ఉంటుంది. అటువంటి పరమేశ్వరుడు అయిన హరిని ఆశ్రయించు.

ఈ విధంగా సునీతి చెప్పిన మాటలను విని ధ్రువుడు హరి అన్వేషణకు బయలుదేరి చివరకు ధ్రువస్థానాన్ని, ఇంకా తల్లిదండ్రుల ప్రేమానురాగాలను పొందగలిగాడు. తల్లిపాత్ర వ్యక్తిని ఉన్నతంగా తీర్చిదిద్దడంలో ఎంత ప్రాముఖ్యతవహిస్తుందో ఒక చిన్న ఉదాహరణని ఉదహరిస్తాను.

ఒక పిల్లవాడు తల్లిదండ్రులతో జట్కాబండిమీద బయటకు వెళ్తాడు. తండ్రి యథాలాపంగా నువ్వు ఏమి అవ్వాలనుకుంటున్నావు? అని అడుగుతాడు. సర్వసాధారణంగా పిల్లలు ఎదురుగా ఎవ్వరిని చూస్తే వారిలా ఉండాలనుకుంటూ ఉంటారు. ఆ రోజు ఎదురుగా గుర్రం నడుపుతున్న వ్యక్తిని చూపించి ఆ పిల్లవాడు గుర్రం నడిపే వ్యక్తిని అవ్వాలనుకుంటాడు. తండ్రి అనుకున్న సమాధానం రాకపోయేసరికిపిల్లవాడిని తిడతాడు. ఇంటికి వెళ్ళిన తర్వాత తల్లి ఇంట్లో కృష్ణుడు రథసారథిగా ఉండి రథాన్ని నడుపుతున్న ఫోటోని చూపించి ఆ పిల్లవాడితో ఒక్క గుర్రాన్ని నడిపే వ్యక్తిగా కాదు, ఇక్కడ ఇంకా ఎక్కువ గుర్రాలను నడుపుతున్న ఈ వ్యక్తిని చూడు అనికృష్ణుడిని చూపించి ఈ వ్యక్తిలా తయారవ్వు అని చెబుతుంది. ఆ వ్యక్తే వివేకానందుడు.

ఇలానే శివాజీ గొప్ప వ్యక్తిత్వం గల మహారాజుగా ఉండటానికి జిజియాభాయి పాత్ర గురించి చాలామందికి తెలిసినదే. మాతృమూర్తులుగానే కాకుండా ధైర్యసాహసాలకు ప్రతికలుగా కూడా భాగవతంలో కనిపిస్తారు. అందులో తనకు నచ్చిన వ్యక్తిని వివాహం చేసుకొవడంలో చూపించిన తెగువును ఒకసారి ఇక్కడే పరిశీలిద్దాం!

రుక్మిణి అన్న రుక్మి శిశుపాలుడితో రుక్మిణికి వివాహం చేయాలనుకుంటాడు. అప్పుడు రుక్మిని ఒక బ్రాహ్మణుని పిలిచి శ్రీకృష్ణునికి సందేశాన్ని పంపుతుంది.

ఉ. అంకిలి జెప్పలేదు; చతురంగబలంబులతోడ నెల్లి యో!
పంకజనాభ! నీవు శిశుపాల జరాసుతులన్ జయించి నా
వంకకు వచ్చి రాక్షసవివాహమునన్ భవదీయశౌర్యమే
యుంకువ చేసి కృష్ణ! పురుషోత్తమ! చేకొనిపొమ్ము వచ్చెదన్.

(మహాభాగవతం10.1-1708)

ఓ పద్మనాభ! కృష్ణ! మహాత్మ! అడ్డుచెప్పడానికి లేదు; నీ పరాక్రమం చూపి, రేపు నీవు చతురంగ బలాలతో సహా వచ్చి, శిశుపాలుడు జరాసంధులను జయించి, నా దగ్గరకు వచ్చి, నన్ను (రుక్మిణిని) రాక్షస వివాహమున తీసుకుకొని వెళ్ళవయ్య! నేను సంతోషంగా నీతో వచ్చేస్తాను.

అంతే కాకుండా తనని ఎలా తీసుకుని వెళ్ళాలో ఉపాయాన్ని కూడా తెలియజేస్తుంది.

సీ. "లోపలి సౌధంబులోన వర్తింపంగఁ;
దేవచ్చునే నిన్నున్న దెత్తునేని
గావలివారలఁ గల బంధువులఁ జంపి;
కాని తేరా" దని కమలనయన!
భావించెదేని యుపాయంబు చెప్పెద;
నాలింపు కులదేవయాతఁ జేసి
నగరంబు వెలువడి నగజాతకును మ్రొక్కఁ;
బెండ్లికి మునుపడఁ బెండ్లికరీఁత్నఁ

(మహాభాగవతం10.1-1709)

తే. నెలమి మావారు పంపుదు రేను నట్లు
పురము వెలువడి యేతెంచి భూతనాథు
సతికి మ్రొక్కంగ నీవు నా సమయమందు
వచ్చి కొనిపొమ్ము నన్ను నవార్యచరిత!

(మహాభాగవతం10.1-1709.1)

ఓ కమలాల వంటి కన్నులున్న కన్నయ్యా! "నీవు కన్యాంతఃపురంలో ఉంటావు కదా రుక్మిణీ! నిన్ను ఎలా తీసుకుపోవాలి. అలా తీసుకెళ్ళాలంటే కాపలావాళ్ళను, అప్పు డక్కడ ఉన్న మీ బంధుజనాలను చంపాల్సి వస్తుంది కదా" అని నీవు అనుకుంటే, దీనికి ఒక ఉపాయం మనవి చేస్తాను. చిత్తగించు. పెళ్ళికి ముందు మా వారు పెళ్ళికూతురును మా ఇలవేల్పు మంగళగౌరిని మొక్కడానికి పంపిస్తారు. నేను కూడ అలాగే నగరి వెలువడి మొక్కుచెల్లించడానికి ఊరి వెలుపల ఉన్న దుర్గగుడికి బయలుదేరి వస్తాను. అడ్డగింపరాని నడవడిక కలవాడా! కృష్ణా! ఆ సమయానికి దారికి అడ్డంగా వచ్చి నన్ను నిరాటంకంగా తీసుకొనిపో!అని ఎంతో ధైర్యంగా శ్రీకృష్ణున్ని వివాహం చేసుకుంది రుక్మిణి. తన జీవిత భాగస్వామిని ఎంచుకోవడంలో రుక్మిణి సాహసాన్ని ఇక్కడ కొనియాడవచ్చు.

భాగవతంలో ఒక జిజ్ఞానువుగా దేవహూతిని చూడవచ్చు. దేవహూతి కొడుకైన కపిలున్ని ఈవిధంగా అడుగుతుంది.

క. "అసదింద్రియ ఘర్షణమున
వసుమతి నిర్విణ్ణ నగుచు వనరెడి నా కీ
యసదృశమోహతమో విని
రసనం బనఘాత్మ! యే వెరవున ఘటించున్.

(మహాభాగవతం3-867)

"ఓ పుణ్యాత్మా! అసత్యలైన ఇంద్రియాల సంఘర్షణం వల్ల ఖిన్నురాలినై విచారిస్తున్న నాకు ఈ సాటిలేని మోహాంధకారంలోనుంచి బయటపడే అవకాశం ఏ ఉపాయం వల్ల కలుగుతుంది?

తల్లి కోరిక మేరకు కపిలుడు వివరించిన తర్వాత కూడా భక్తి స్వరూపాన్ని ఇంకా బాగా తెలిసేటట్లు చెప్పమని ప్రార్థిస్తుంది.

క. "ఏ భక్తి భవద్గుణపర
మై భవపాపప్రణాశమై ముక్తిశ్రీ
లాభము రయమునఁ జేయునొ
యా భక్తివిధంబుఁ దెలియ నానతి యీవే.

(మహాభాగవతం3-875)

"ఏ భక్తి నీ గుణగణాలకు అంకితమై సంసార పాపాలను పోగొట్టి శీఘ్రంగా మోక్షలక్ష్మిని చేకూరుస్తుందో ఆ భక్తి స్వరూపాన్ని నాకు బాగా తెలిసేటట్లు దయచేసి చెప్పు.

ఇంకా యోగవిద్య, అందులో తత్త్వాలను కుండా తెలియజెప్పమని అడుగుతుంది. ప్రకృతి, పురుషుల లక్షణాలను బ్రహ్మోండోత్పత్తి, సృష్టిక్రమంబు మొదలైన విషయాలను కొడుకుని అడిగి తెలునుకుంటుంది దేవహూతి.

ఈ విధంగా భాగవతంలో ఎంతో మంది స్త్రీలు చైతన్య స్ఫూర్తిని రగిలించే ఆదర్శవ్యక్తులుగా మనకు ఎంతమంది కనిపిస్తారు.

ఉపయుక్త గ్రంథములు :

1. శ్రీమదాంధ్రమహాభాగవతము - బమ్మెర పోతనామాత్యుడు - తిరుమల తిరుపతి దేవస్థానములు, తిరుపతి, 2015.
2. శ్రీమదాంధ్ర మహాభారతము - కవిత్రయం - విశ్వనాథ సత్యనారాయణ (పరిష్కర్త) - ఆంధ్ర సాహిత్య అకాడమీ - హైదరాబాదు - 1970.

★★★

Vol. 23 | Spl. Issue 03 | March 2026 | BHAVAVEENA | ISSN No. : 2456-4702 | RNI No. APTEL/2003/12253

RNI No. APTEL/2003/12253 | Reffered Journal & Peer Reviewed Journals | ISSN No. 2456-4702

భావవీణ

కళలు, సాహిత్య, సాంస్కృతిక భాషాధ్యయన పత్రిక

BHAVA VEENA

Journal of Arts, Literary, Culture & Language Study

చల్లపల్లి స్వరూప రాణి కథల్లో - 'దళిత స్త్రీ' సమస్యలు

- అన్నిక కవిత

పరిశోధక విద్యార్థిని, తెలుగు శాఖ, యోగివేమన విశ్వవిద్యాలయం, కడప.

వ్యాస సంగ్రహం:

అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతున్న ప్రపంచ దేశాలతో భారతదేశం పోటీ పడుతున్నది. సాంకేతిక విజ్ఞానాన్ని నానాటికి అందిపుచ్చుకుంటున్నది. సువిశాల భారతదేశంలో పట్టణీకరణ ఎప్పటికప్పుడు జరుగుతున్నది. అయినప్పటికీ మనిషి మనసు మాత్రం కులం అనే సంకుచిత పరిధిలోనే కుంచించుకుపోతోంది. వర్ణ వ్యవస్థ లోని నిచ్చెన మెట్లలో చోటు లేని, సాంఘికంగా వెలివేయ బడిన పీడిత ప్రజలు దళితులు. వీరు ఆర్థికంగా, సామాజికంగా, రాజకీయంగా అణచివేయబడి అట్టడుగు వర్గంగా వెలివేయబడ్డవారు. వీరికంటే చిట్ట చివరన నిలబడ్డ వారు దళిత స్త్రీలు. వీరి జీవితంలో నిత్యం ఎదుర్కొనే సమస్యలను ప్రస్తావిస్తూ చల్లపల్లి స్వరూప రాణి రాసిన కథలను పరిశీలించడం ఈ వ్యాసం ప్రధాన ఉద్దేశం.

ఉద్దేశం :

తెలుగు సాహిత్యంలో ఆంగ్లభాష ప్రభావంతో అనేక ప్రక్రియలు వెలుగు చూశాయి. జాతీయోద్యమ, కాల్పనిక, అభ్యుదయ, విప్లవ కవిత్వోద్యమాల తర్వాత అత్యంత ప్రభావం చూపిన ఉద్యమం అస్తిత్వవాద ఉద్యమం. 1980 దశకంలో దళిత, స్త్రీవాద సాహిత్య ఉద్యమాలు అత్యంత ప్రాధాన్యతను సంతరించుకున్నాయి. ఆధునిక సాహిత్య ప్రారంభం నుండి ప్రత్యక్షంగాను పరోక్షంగాను చాలామంది కవులు రచయితలు స్త్రీల సమస్యలను ప్రస్తావించినప్పటికీ,ఒక ప్రత్యేకమైన ఉద్యమంగా 1985 నుండి స్థిరపడి క్రమంగా అన్ని ప్రక్రియలకు విస్తరించి నటువంటి ఉద్యమం స్త్రీవాద సాహిత్య ఉద్యమం. ఎవరెన్ని గొప్ప గొప్ప ఉపన్యాసాలు ఇచ్చినప్పటికీ సమాజంలో స్త్రీల పరిస్థితి నేటికీ దయనీయంగానే ఉంది. ఎంత మాత్రం గణనీయమైన మార్పు జరగలేదని చెప్పవచ్చు. అందులో దళిత స్త్రీల దుస్థితి మరీ దారుణం అనే చెప్పాలి. తల్లిగా, ఇల్లాలిగా, కుమార్తెగా, వధువుగా, కోడలిగా, ఉద్యోగిగా, సగటు వ్యక్తిగా ఉన్నత మధ్య తరగతి స్త్రీ ఎదుర్కొంటున్న సమస్యలు అయితే మరోపక్క దళిత స్త్రీ అదనంగా కుల వివక్ష, ఆర్థిక సామాజిక వివక్ష లను ఎదుర్కొంటుంది. దళిత స్త్రీని అడుగడుగునా పొంచి ఉన్న ప్రమాదాలు అనేకమని చెప్పవచ్చు. దళితుడు లేదా అగ్రవర్ణ స్త్రీలు రాసే దళిత స్త్రీ సాహిత్యం కన్నా దళిత స్త్రీలు వారి అనుభవాల ఆధారంగా రాసే దళిత స్త్రీ సాహిత్యం చాలా శక్తివంతమైనదిగా ఉండి సమాజంలో మరింత ప్రభావాన్ని చూపుతుంది. దళిత స్త్రీల పక్షంగా ఉండి వారి సమస్యలను స్వయంగా అనుభవించిన అనుభవంతో కథా ప్రక్రియ ద్వారా సాహితీ లోకం ముందుకు తీసుకువచ్చిన రచయిత్రి చల్లపల్లి స్వరూప రాణి.

ఈమె కథల్లోని దళితులు దళిత స్త్రీ చుట్టూ పొంచి ఉన్న ప్రమాదాలను వివరించడం ఈ వ్యాసం యొక్క ప్రధాన ఉద్దేశం.

కీలక పదాలు :

దళిత స్త్రీ, హింస, అరిటాకులు, నమ్మకద్రోహం, చదువు, వివక్ష.

పరిచయం :

చల్లపల్లి స్వరూప రాణి అణచివేయబడిన దళిత స్త్రీ అస్తిత్వ దృక్పథాల నుంచి స్పష్టమైన అవగాహనతో రచనలు చేశారని చెప్పవచ్చు. దళిత స్త్రీ నిత్యం ఎదుర్కొనే సమస్య లైనా అవమానాలు, ఆకలి దాడులు, హత్యలు, అత్యా చారాలు, దళితస్త్రీలపై దాస్టికాలు, పురుషాధిపత్యం, కుటుంబహింస, దళిత పురుషుల ఆదిపత్యం, సామాజిక హింస, లైంగిక వేధింపులు, శ్రమదోపిడి వంటి అనేక సమస్యలను వస్తువులుగా చేసుకుని రచనలు చేశారు 'మంకెన పూవు', 'వేకుపిట్ట' , 'అల్లిక' మొదలైన కవితా సంపుటాలు వీరి కలం నుండి వెలువడిన ప్రముఖ కవితా సంపుటాలు. దళిత స్త్రీ దృక్పథంతో కథా ప్రక్రియలో వచ్చిన సాహిత్యం వేళ్ళ మీద లెక్కపెట్టవచ్చును. ఆ వెలితిని పూడ్చడానికి స్వరూప రాణి దళిత స్త్రీ దృక్పథంతో కథలు రాశారు. కథలు సంఖ్యలో తక్కువైనప్పటికీ లింగ, కుల, మతపరమైన వైషమ్యాలు వంటి అనేక అంశాలతో దళిత స్త్రీల జీవితాల్లోని చీకటి కోణాలను మూల మూలకు వెళ్లి శోధించి సమాజం ముందు నిలబెడతాయి.

స్వరూప రాణి 'అరటి ఆకులు', 'పునరుజీవం', 'త్రిశంకు నరకం', 'చదువు' , 'భద్రం తల్లి', 'సహాను భూతి', 'మా చిన్నత్త', 'శత్రువు', 'ముసుగు', 'సాము', 'సుజ్ఞానం' వంటి కథలను రాశారు. దళిత స్త్రీ ఎదుర్కొనే సమస్యలను స్పృశించిన కొన్ని కథలను ఈ వ్యాసంలో పరిశీలించవచ్చు.

కథల విశ్లేషణ :

'అరిటాకులు' అనే కథను అగ్రవర్ణ స్త్రీ చేసిన తప్పుకు దళిత కుటుంబంలోని ఆడపిల్లలను అవమానకరంగా మాట్లాడడం, హింసలకు గురి చేయడం అనే వస్తువుతో రాశారు.

శీర్షిక ఔన్నత్యం :

అరిటాకులు:

కథకు పేరు పెట్టడంలోనే కథకుని యొక్క ప్రతిభ బయటపడుతుంది. శీర్షిక చూసిన వెంటనే కథ సారాంశం, రచయిత భావజాలం స్ఫురించేలా ఉండాలి.చల్లపల్లి స్వరూప రాణి తన రచనలకు శీర్షికల విషయంలో చాలా జాగ్రత్త తీసుకుంటారు. సున్నితమైన అంశాలను బలమైన మాటలతో చెప్పడం ఆమె ప్రత్యేకత. అలాగే శీర్షికల విషయంలో సరళమైన బలమైన పదాలను ఎంపిక చేయడం వీరి ప్రత్యేకత.

ఈ కథకు అరిటాకులనే శీర్షిక ఎంచుకోవడంలో వీరి సామర్థ్యం తెలుస్తుంది. ఒక విధంగా చెప్పాలంటే దళితుల జీవితాలు కత్తి మీద సాము లాంటివి ఎటువైపు నుండి తప్పు దొర్లిన నష్టాన్ని అనుభవించేది మాత్రం దళితులు.ముఖ్యంగా దళిత స్త్రీలు.అరిటాకుతో దళిత స్త్రీలను పోల్చుతూ సున్నితమైన వారి జీవితాల గురించి ఈ కథ ద్వారా తెలియజేశారు.

అరిటాకులు అనే ఈ కథలో నాగయ్య, సుందరయ్య, లాజర్, రమేష్, సబితా, తబిత, సీతారామయ్య, శిరీష, పోలీసులు, అమెరికా అబ్బాయి అనే పాత్రలు కలవు.

నాగయ్యకు లాజర్,రమేష్ అనే ఇద్దరు కొడుకులు సబితా, తబిత అనే ఇద్దరు కూతుళ్లు కలరు. నాగయ్య జీవితం కొలుకి సేద్యం చేసుకునే ఒక సాధారణ దిగువ మధ్యతరగతికి చెందిన కుటుంబం. నాగయ్య నలుగురు సంతానంలో పెద్ద కొడుకు అయిన లాజర్ ఇద్దరు కూతుళ్లు అయిన సబితా తబితలు తండ్రి చెప్పినట్లుగా చదువుకుంటూ ఎవరి జోలికి వెళ్లకుండా తమ పని తాము చూసుకుంటూ ఉండే నెమ్మదస్తులు.

నాగయ్య కు ఉన్న ఏకైక సమస్యల్లా చిన్న కుమారుడైన రమేష్ తోనే.రమేష్ తండ్రికి పొలం పనుల్లో సహాయం చేయకపోగా స్నేహితులు, మీటింగులు, సమావేశాలు అంటూ హడావిడి చేస్తూ ఉంటాడు. నాగయ్య ఎప్పుడు చిన్న కుమారుడైన రమేష్ ఏ గొడవ ఇంటి మీదకి తెస్తాడో అని భయంతో ఉండేవాడు. ఒకరోజు ఆ భయం నిజ మైంది. రమేష్ వూరి పెద్ద పేరు మోసిన రైతైన సీతా

రామయ్య మనవరాలు శిరీష ని తీసుకొని పారిపోయి పెళ్లి చేసుకుంటాడు. ఈ విషయం ఊరంతా తెలిసి పోయింది. బంధువులంతా కలిసి నాగయ్య ఇంటి వద్దకు వచ్చి ఆచూకీ తెలుపమని గొడవ చేసి,తమ ఇంటి పిల్లను అప్పజెప్పకపోతే నీ ఇద్దరు కూతుళ్లను వదిలిపెట్టమని అవమానకరంగా మాట్లాడి వార్నింగ్ ఇచ్చి వెళతారు.

తర్వాత శిరీష తండ్రి తన కూతుర్ని రమేష్ కిడ్నాప్ చేశాడని కేసు పెట్టడంతో నాగయ్య దంపతులను పోలీసులు లాకప్ లో పెట్టి చిత్రహింసలకు గురి చేస్తారు. ఇంతలో శిరీష తండ్రి బంధువులు శిరీషను రమేష్ నుండి తీసుకు వచ్చి ఆమె మనసును మార్చి వేస్తారు. రమేష్ తన భార్యను ఎవరో కిడ్నాప్ చేశారని కేసు పెడతాడు. పోలీసులు శిరీషను పిలిపించి ప్రశ్నించగా శిరీష జరిగిన దానికి అంతా విరుద్ధంగా జవాబిస్తూ రమేష్ తన వెంటపడి వేధించేవాడని, తనను కిడ్నాప్ చేసిన నగలు దొంగలించాడని, అసలు రమేష్‌ను నేను పెళ్లి చేసుకోలేదని చెబుతుంది. రమేష్‌కు పిచ్చి పట్టినట్లు అవుతుంది.శిరీష కు అమెరికా అబ్బాయి తో వివాహం జరుగుతుంది.

ఈ కథ లో నాగయ్య కుమార్తెలైన సబితా తబితలు ఏ తప్పు చేయకపోయినా తల్లిదండ్రుల మాటల కు లోబడి గౌరవంగా బ్రతుకుతున్నప్పటికీ అగ్రవర్ణ స్త్రీ అయిన శిరీష చేసిన తప్పుకు అవమానింపబడతారు. ఎవరి జోలికి వెళ్లకపోయినా వారి జీవితాలు వీధిలోకి లాగబడతాయి. ప్రస్తుత సమాజంలో నిత్యం జరుగుతున్న సమస్యలు అందులో దళిత స్త్రీల జీవితాలతో ముడిపడి ఉన్న సమస్యలను 'అరిటాకులు' అనే కథ ద్వారా రచయిత స్పష్టంగా వివరించారు.

'భద్రం తల్లి' అనే కథలో బాల్యం నుండి దళిత బాలికలు లైంగిక దోపిడీకి గురవడాన్ని వారి చుట్టూ పొంచి ఉన్న ప్రమాదాలను వివరించే ప్రయత్నం చేశారు రచయిత. ఈ కథలో ఒక దళిత కుటుంబంలోని అమ్మా నాన్న వారి పిల్లలైనా విద్య, బాబి, విద్య స్నేహితురాళ్ళైన వసంత, అరుణ, నిర్మల, హాస్టల్ వార్డెన్, అతని భార్య అనే పాత్రలతో కథ సాగుతుంది విద్య మంచి తెలివైన దళిత బాలిక. హై స్కూల్ చదువు కోసం విద్యను తన తల్లిదండ్రులు పట్నంలోని సాంఘిక సంక్షేమ శాఖ హాస్టల్లో ఉంచుతారు. పక్కనే ఉన్న బాలుర హాస్టల్లో తమ్ముడైన బాబి ఉంటాడు. విద్య చాలా చలాకీగా చదువులో ముందుండే అమ్మాయి. స్నేహితురాళ్లు కూడా చాలా సరదాగా తనతో సమయం గడిపేవారు. ఆ హాస్టల్‌కి వార్డెన్‌గా ఒక పురుషుడు ఉండేవాడు అతని చూపంత ఆడ పిల్లల పైన ఉండేది. దళిత బాలికలను చిన్న చూపు చూసే వ్యక్తిత్వం కలవాడుగా ఉండేవాడు. "పేడకాల్లు ఎత్తేసే వాళ్లకు చదువు ఎలా వస్తుంది". అని దళిత బాలికలను ఎప్పుడు తిట్టేవాడు. ముఖ్యంగా దళిత బాలికలను తన ఇంటి పనులలో నిమగ్నం చేస్తూ అవసరం ఉన్నా లేకపోయినా వాళ్ళ ఒంటిని తడుముతూ తన కామ కోరికలు తీర్చుకునేవాడు. వార్డెన్ క్వార్టర్ కూడా హాస్టల్ కాంపౌండ్ లో ఉండటం వల్ల తరచూ దళిత బాలికలను తన ఇంటికి పిలిపించి తన భార్యకు పనుల్లో సహాయంగా ఉంచేవాడు. ఒకరోజు విద్యను పిలిచి రేపు నేను క్యాంపుకు వెళుతున్నాను ఆంటీ కి సహాయంగా రాత్రి పడుకోమని చెబుతాడు. వార్డెన్ భార్య చాలా మంచి స్వభావం కల వ్యక్తి. పిల్లల్ని చాలా ప్రేమగా చూసుకునేది. అందువల్ల విద్య వార్డెన్ మాటను కాదనలేకపోయింది. చాలా సంతోషంగా రాత్రి వార్డెన్ ఇంటికి వెళ్ళింది. అక్కడ ఆ కామాంధుడు తన భార్య ను పుట్టింటికి పంపించి విద్య పసి జీవితాన్ని చిదిమేస్తాడు. అప్పటినుంచి విద్య మౌనంగా ఇతర పిల్లలతో కలవకుండా తనలో తాను ఏడ్చుకుంటూ ఒంటరిగా గడుపుతుంది. కొంతకాలానికి తన కడుపులో నొప్పి మొదలవుతుంది. కడుపు కొద్ది కొద్దిగా పెరుగుతూ ఉంటుంది. ఎవరికి చెప్పాలో ఏమి చెప్పాలో తెలీక ఎవరికైనా చెబితే చదువుకు దూరం అవుతాననే బాధలో మదన పడుతూ ఏడుస్తూ ఉంటుంది.

చదువు కోసం వెళ్లే దళిత పిల్లల జీవితాల చుట్టూ ఇలాంటి ఊహించని ప్రమాదాలు ఎన్నో కమ్ముకొని ఉన్నాయి.అలాంటి ప్రమాదాల గురించి ఈ కథ ద్వారా ప్రపంచానికి తెలియజేసే ప్రయత్నం చేశారు రచయిత.

'చదువు' అనే కథ ద్వారా దళితులకు చదువు లేకపోవడం వలన వారు పొందవలసిన హక్కులు, వారికి

చెందవలసిన ప్రయోజనాలు ఎలా దుర్వినియోగం చేయ బడుతున్నాయో తెలియజేసే ప్రయత్నం చేశారు రచయిత.

రెండంచుల పదును కలిగిన కత్తి వంటిదిగా చదువు ఉంది.చదువుకోవడం ద్వారా ఉన్న స్థితి నుండి ఉన్నత స్థితికి వెళ్లవచ్చు. చదువు లేకపోవడం వలన ఉన్న స్థితి నుండి మరింత కష్టాల ఊబిలోకి వెళ్లి పోవలసి వస్తుంది. చదువు ప్రాముఖ్యతను తెలియజేస్తూ ఈ కథకు 'చదువు' అనే శీర్షిక ని ఎంపిక చేశారు రచయిత.

ఈ కథను ఏసుమణి, ఆమె భర్త, సుబ్బరాయుడు, రవి, శ్రీదేవి, ప్రకాష్ అనే పాత్రలతో నడిపించారు.

రవి శ్రీదేవిలు ఎం. ఫిల్ విద్యార్థులు. తమ ఫీల్డ్ వర్క్ కోసం తాళ్ళచెరువు బయలుదేరి వెళతారు. అక్కడ తమకు కావలసిన సమాచారం సేకరించడం కోసం ఆ ఊరి గురించి అంతా తెలిసిన ప్రకాష్ ను పరిచయం చేసుకుంటారు. ఒకానొక పనిమీద ప్రెసిడెంట్ గారి ఆఫీస్ ఎక్కడ అని ప్రకాష్ ను ప్రశ్నించగా, ప్రకాష్ నవ్వుతూ ఇక్కడ ఇద్దరు ప్రెసిడెంట్లు ఉన్నారు. ఒకరు నకిలీ, ఒకరు డమ్మీ అని చెబుతాడు. ఈ గోల ఏంటో తెలుసుకోవాలని రవి శ్రీదేవిలు అడగ్గా విషయం బయట పెడతాడు ప్రకాష్.

ఏసు మణి అనే దళిత మహిళను అన్ని దురలవాట్లు ఉన్న వ్యక్తితో పెళ్లి చేస్తారు. అతను ఏ పని చేయకుండా ఊరు మీద పడి తిరిగేవాడు. ఏసు మణి భర్త సుబ్బ రాయుడు అనే వ్యక్తి ఇంట్లో పాచి పనికి వెళ్లేవాడు. సుబ్బరాయుడు కన్ను ఏసు మణి మీద పడుతుంది.ఏసు మణి ని సుబ్బరాయుడు తన అవసరాలకు వాడుకునే వాడు. విధి లేని పరిస్థితుల్లో ఏసు మణి సుబ్బరాయుడుకి లొంగిపోయేది. కారణం బాధ్యత లేని భర్త, ముసలి తల్లిదండ్రుల పోషణ, చిన్నారి సంతానం ఆలనా పాలన చూడాల్సిన మొదలైన బాధ్యతల వల్ల సుబ్బరాయుడు చెప్పినట్లు చేస్తుండేది. ఆ సంవత్సరం పంచాయతీ ఎలక్షన్లు వస్తాయి. సుబ్బరాయుడు ఏసు మనణి తో నువ్వు మన ఊరికి ప్రెసిడెంట్ అయితే చూడాలని ఉంది అని కపటపు మాటలతో మోసగిస్తాడు. ఏసు మణి నాకు చదువు రాదు నేను ప్రెసిడెంట్ ఎలా కాగలను అని అంటుంది. నీకెందుకు అన్ని విషయాలు నేను చూసుకుంటానని భరోసా ఇస్తాడు సుబ్బరాయుడు.

సుబ్బరాయుడు అన్నట్లుగానే అన్ని విషయాలు దగ్గరుండి చూసుకుంటాడు. ఎలక్షన్స్ ముగుస్తాయి. ఏసుమణి ప్రెసిడెంట్ అవుతుంది. కానీ ఆఫీస్ కి ఎప్పుడు వెళ్లలేదు. ఆ కుర్చీలో ఎప్పుడు కూర్చోలేదు. కానీ కావలసిన పైళ్ల మీద సంతకాల కోసం అరుగు మీద కూర్చుని వేలిముద్ర వేసి వెళ్ళిపోయేది. కొన్నిరోజులకి సుబ్బ రాయుడు అధికార దుర్వినియోగం చేసి కేసు మాత్రం ఏసు మణి మీద బనాయించి తప్పించుకుంటాడు. ఇదంతటికీ కారణం బాధ్యతలు పట్టించుకోని భర్త, కుటుంబాన్ని గాలికి వదిలేసిన మామ,ఏ పని చేయలేని వృద్ధ తల్లిదండ్రులు వారి పోషణ, సంతానాన్ని పోషించు కోలేని దీనస్థితి, ముఖ్యంగా చదువు లేకపోవడం అనే బలహీనతల్ని అడ్డుపెట్టుకొని సుబ్బరాయుడు ఏసు మనణి ని కష్టాల ఊబిలోకి నెట్టి వేస్తాడు.

ఈ కథ ద్వారా దళిత స్త్రీలకు అక్షర జ్ఞానంఎంత ముఖ్యమో తెలియజేసే ప్రయత్నం చేశారు చల్లపల్లి స్వరూప రాణి.

ముగింపు :

ఉన్నత మధ్యతరగతి స్త్రీ ఎదుర్కొనే సమస్య పురుషాధిక్యం అయితే, దళిత స్త్రీ ప్రతినిత్యము అనేక సమస్యలను సవాళ్లను ఎదుర్కోవలసి వస్తుంది. పురుషాదిక్యం, అవహేళనలు, అవమానాలు, అస మానతలు, ఆర్థిక సామాజిక వివక్ష, గృహహింస, జెండర్ వివక్ష, లైంగికదోపిడీ, శ్రమదోపిడీ మొదలైన సమస్యలు ప్రమాదాలు నిత్యం దళిత స్త్రీ చుట్టూ పొంచి ఉంటాయి. దళిత స్త్రీలు ఎదుర్కొనే సమస్యలను ఎత్తిచూపుతో వాటిని అధిగమించే ఆలోచనను దళిత స్త్రీలు చేయాలని స్త్రీ సమాజంలో స్వతంత్రంగా ఆలోచించే శక్తితో పాటు సమస్యను సమర్థవంతంగా ఎదుర్కొనే సామర్థ్యాన్ని అంది పుచ్చుకోవాలని దళిత స్త్రీలను చైతన్యపరిచే ప్రయత్నం చేశారు చల్లపల్లి స్వరూప రాణి. వీరు రాసిన కథలు తక్కువ

అయినప్పటికీ దళిత స్త్రీల జీవితాల్లో గొప్ప మార్పును ఆకాంక్షిస్తూ చైతన్యపరిచే విధంగా ఉన్నాయి. ఓకే అయిపోయింది. బంతా ముఖ్యంగా దళిత స్త్రీలు బాల్యం నుండి పాఠశాలలో హాస్టల్లో ఊరిలో సమాజంలో నిత్యం ఎదుర్కొనే అనేక సమస్యలను స్పృశిస్తూ తన కథల్లో తెలియజేశారు.

ఆధార గ్రంథాలు

1. అరిటాకులు - చల్లపల్లి స్వరూప రాణి
2. భద్రం తల్లి - చల్లపల్లి స్వరూపారాణి
3. చదువు - చల్లపల్లి స్వరూపారాణి
4. తెలుగులో కవిత్వోద్యమాలు - తెలుగు అకాడమీ
5. తెలుగు సాహిత్య చరిత్ర - సిమ్మన వెలమల

★★★

Vol. 23 | Spl. Issue 03 | March 2026 | BHAVAVEENA | ISSN No. : 2456-4702 | RNI No. APTEL/2003/12253

RNI No. APTEL/2003/12253 | Reffered Journal & Peer Reviewed Journals | ISSN No. 2456-4702

భావవీణ

కళలు, సాహిత్య, సాంస్కృతిక భాషాధ్యయన పత్రిక

BHAVA VEENA

Journal of Arts, Literary, Culture & Language Study

పెద్దింటి అశోక్‌కుమార్ కథల్లో మధ్య తరగతి స్త్రీ జీవన చిత్రణ

– డా॥. ఎ. జ్యోతి

అధ్యాపకురాలు, హైదరాబాద్.

కీలకపదాలు :

కథ, కథానిక, మాండలికం, వర్తమాన జీవన చిత్రణ, గ్రామీణ వ్యవస్థ, స్త్రీ స్వేచ్ఛ, సామాజిక నేపథ్యం, ప్రపంచీకరణ, పురుషాధిక్యత

వ్యాస సంగ్రహం :

ప్రక్రియ ఏదైనా సమకాలీన సమాజాన్ని ప్రతి బింబించడం సాహిత్య ప్రధానలక్షణం. నన్నయభారతం నుండి నేటి రచనల వరకు తెలుగుసాహిత్యంలో ఈ లక్షణం కనిపిస్తుంది. సమకాలీన సమాజ ప్రభావంతో సామాజిక అంశాలను సాహిత్యం ద్వారా పదిలపరచి మౌలిక అంశాలను భవిష్యత్తరాలకు అందించడం రచయిత సామాజిక బాధ్యత. తెలుగు సాహిత్య ప్రక్రియలలో విశేషంగా పాఠకాదరణ పొందిన ప్రక్రియ కథ. సాహిత్య చరిత్ర ప్రకారం పంతొమ్మిదవ శతాబ్దం ప్రారంభంలో తెలుగు కథ మొదలైందని చెప్పినప్పటికీ అంతకు ముందునుండే మనకు విస్తృతమైన మౌఖిక కథాసాహిత్యం ఉంది. ఆయా కథలన్నింటిలోనూ ఆయా కాలమాన పరిస్థితులు నిక్షిప్తం చేయబడ్డాయి.

ప్రాంతీయ మాండలికంలో సమకాలీన సామాజిక జీవిత పరిస్థితుల్ని ఇతివృత్తంగా తీసుకొని కథారచన చేసిన ప్రసిద్ధ వర్తమాన కథా రచయిత శ్రీ పెద్దింటి అశోక్ కుమార్, వృత్తిరీత్యా ఉపాధ్యాయుడు అయినప్పటికీ జీవితమే సాహిత్యంగా రచనలు చేస్తున్న విశిష్ట రచయిత. రాజన్న సిరిసిల్ల జిల్లా, గంభీరావుపేట మండలం, మల్లారెడ్డిపేట గ్రామానికి చెందిన పెద్దింటి అశోక్ కుమార్ తన గ్రామజీవన పరిస్థితులే తన కథలకు ఆధారాలని, "నా ఊరే నా కథలకు ఊటబాయి" అని చెప్పాడు. కుటుంబ జీవనం, అనుబంధాలు, కులవృత్తి విధ్వంసం, వ్యవసాయ కార్పొరేటీకరణ, కనుమరుగవుతున్న మానవీయ బంధాలు ఇత్యాది వాస్తవ జీవితపరిస్థితులని రచయిత కథలుగా మలిచిన తీరు హృద్యంగా ఉంటుంది. కథావస్తువుతో పాటు వినసొంపైన తెలంగాణ మాండలిక భాషా సొగసు పాఠకుల్ని కథాకాలం నాటి సమాజంలోకి తీసుకెళ్తుంది. పెద్దింటి అశోక్ కుమార్ సుమారు రెండు వందల కథలు, ఇరువై నాటికలు, వంద వ్యాసాలు, ఇరువైమూడు లఘుచిత్ర ఇతివృత్తాలు, ఏడు నవలలు రాశాడు.

ఉపోద్ఘాతం :

ఇతివృత్తమందలి పాత్రలలో రచయిత తాను సృష్టించబోయే పాత్రలకు ఆకృతిని, నిర్మాణాన్ని ఇచ్చే విధానాన్ని 'పాత్ర' అంటారు. దీన్నే పాత్ర సృష్టి, పాత్ర పోషణ అంటారు. రచయిత భావాలను, రచనా శిల్పాన్ని తెలుసుకోవడానికి రచయిత చిత్రించిన పాత్రలను పరిశీలించవలసి వుంది. రచయిత కథల్లో విశేషాంశాన్ని

పాత్రల ద్వారా వ్యక్తం చేయిస్తాడు. పాత్రలను కథకు అనుగుణంగా మలచటంలో రచయిత ప్రతిభ వ్యక్తమవు తుంది. పాత్రలను కథలో ప్రవేశ పెట్టే క్రమంలో రచయిత రెండు రకాలయిన విధానాలు అవలంభిస్తాడు. ఒకటి ప్రత్యక్షంగా కథకుడే కథ చెప్పుకుంటూ ఒక్కో పాత్రని ప్రవేశ పెట్టటం. రెండోది పరోక్షంగా సంఘటనల కనుగుణంగా ఒక్కో పాత్ర ప్రవేశించటం అనేది సాధా రణంగా కథా రచయితలు చేసేది. (సమగ్ర సామాజిక కథ తాత్విక భూమిక, 50 ఏళ్ళ తెలుగు కథ తీరు తెన్నులు - బి.ఎస్.రాములు, పుట.37) పాత్ర చిత్రణ అంటే 'ఒక పాత్ర యొక్క జీవితంలో ఒక హఠాత్పరివర్తనమును సంక్షిప్తంగాను, నాటకీయంగాను చక్కగా చెప్పడం' రచయిత తన ఉద్దేశ్యాలను తన పాత్రల ద్వారా ఇతర విధానాలను చిత్రించాలి. కాని తనంతట తాను రంగస్థలం మీదికి వచ్చి సుదీర్ఘమైన ఉపన్యాసాలద్వారా వాటిని వెలిబుచ్చకూడదని రాను రాను రచయిత గుర్తిస్తున్నారు. ఇతివృత్తంలోని సంఘటన మీద వ్యక్తిత్వం ప్రస్ఫుటమవు తుంది. ప్రతి రచయిత సమాజంలోని ఒక వ్యక్తి, కనుక ఆ వ్యక్తి మనోదృక్పథాలపై సమాజ ప్రభావం తప్పనిసరిగా ఉంటుంది. అయితే ''సమాజాన్ని సమగ్రంగా అర్థం చేసుకోవాలంటే రచయిత కాలంతోపాటు నడవగలిగి వుండాలి. అప్పుడే రచన పాత విలువల నుంచి విముక్తమై కొత్తగా వికసించగలుగుతుంది. కాలం ఒడిలో పుట్టి పెరిగి భావనలనూ, ఆలోచనలనూ రచయిత ఎంతవరకూ తనవిగా చేసుకున్నాడనే దానిమీద కూడా రచయితగా అతని విజయం ఆధారపడి వుంటుంది. దీనిని దృష్టిలో పెట్టుకొని పెద్దింటి అశోక్‌కుమార్ కథలు వచ్చాయి. వీటిని పరిశీలించడమే ఈ వ్యాస ఉద్దేశం.

స్త్రీ జీవనచిత్రణ - కథల విశ్లేషణ :

సమకాలీన సమాజంలో అన్ని రంగాల్లో స్త్రీ ముందంజ వేస్తున్నప్పటికీ పురుషాధిక్యత ఇంకా కొనసాగటం వల్ల స్త్రీ స్వేచ్ఛకు భంగం కలుగుతున్నది. ప్రపంచీకరణ నేపథ్యంలో సమాజంలో కుటుంబంలో స్త్రీ జీవితంలో ఎన్నో సమస్యలు ఉత్పన్నమవుతున్నాయి. సమకాలీన కథా రచయిత పెద్దింటి అశోక్‌కుమార్ స్త్రీ జీవితంలోని వివిధ పార్శ్వాలను తన కథల్లో ప్రతిఫలింప చేయడంలో ముందున్నారు.

యాదవ్వ - కన్నతల్లి :

పెద్దింటి అశోక్ కుమార్ వలస బతుకులు కథా సంక లనంలో 'కన్నతల్లి' అనే మెదటి కథలో తల్లి కొన్ని దశాబ్దాలు కష్టపడి, కూడబెట్టి ఇంత పొలం చెక్క సొంత అస్తిగా సమకూర్చుకొంటుంది. అరబ్ దేశాలకు వెళ్ళే భ్రమ మాయాజాలంలో పడి కొడుకు నారాయణ దాన్ని అమ్మేస్తాడు. అరబ్ దేశాలకు వెళ్ళిన తర్వాత 3నెలలకే తిరిగి ఇంటికి వచ్చేస్తాడు.

విషయమేమిటంటే అరబ్బు దేశాలకు పంపిస్తానన్న బ్రోకరు పంపించిన వీసా టూరిస్ట్ వీసా అని అది రెండేళ్ళుండడానికి పనికిరాదని మోసం జరిగిపోయిందని తెలుస్తుంది. తెలిసి నారాయణ భోరున ఏడ్చేస్తాడు, పొలాన్ని అమ్మడాన్ని చివరిదాకా వ్యతిరేకించిన తల్లి, ఎంతో తిడుతుందనుకున్న తల్లి, యాదవ్వ ''కాళ్ళూ రెక్కలు సల్లగుంటే మళ్ళా సంపాదించుకుంటం, చేతివైల పోయింది'' అంటూ తల్లే కొడుకును ఓదారుస్తుంది. పేద కన్నతల్లి హృదయం, ఎంత నిబ్బరమైనదో ఎంత నిండు హృదయమో ''కన్నతల్లి' కథ ముగింపు తెలుపుతుంది.

సుజాత - ఘర్షణ :

'ఘర్షణ' కథ అరబ్బు దేశాలకు వెళ్ళినతని ఇల్లాలు ఎదుర్కొనే బాధల పల్లవి. అరబ్బు దేశాల నుండి పంపే డబ్బులు, వస్తువులు కుటుంబంలోనూ, ఊళ్ళలోనూ సామాజిక అంతస్తును పెంచుతాయి. అదేస్థాయిలో ఈర్ష్య, అసూయలను కూడా పెంచుతాయి. లేని అక్రమ సంబంధాలను అంటకట్టి ఆడిపోసుకుంటారు. భర్తకు అవాకులు చెవాకులు రకరకాలుగా జారవేస్తుంటారు. భర్త సంఘర్షణలో పడతాడు. ఆ ఇల్లాలు బాధ వర్ణనాతీతం.

భర్త చివరకు తన భార్య ఎదుర్కొంటున్న సూటిపోటి మాటలను, ఘర్షణను, మంచితనాన్ని అర్థం చేసు కుంటాడు. ''పెచ్చిదానా ! నువ్వు ఎలాంటి దానితో నాకు తెలుసు. వాళ్ళకెలా బుద్ధి చెప్పాలో కూడా తెలుసు నీకన్యాయం చేస్తానని ఎలా అనుకున్నావు ? నీవు కడిగిన ముత్యానివని నాకు తెలుసునే. ఇక్కడి సంగతులన్నీ నా

దోస్త్ చెప్పిండు. నీ తప్పు ఏమీ లేదు. అతను మాట్లాడింది నిజమే అని తెలిశాక అతని పాదాలను కన్నీటితో అభిషేకించింది సుజాత. ఈ 'ఘర్షణ' కథ అరబ్బు దేశాలకు వెళ్ళిన భర్తల ఇళ్ళు ప్రతి ఒక్కరు ఎదుర్కొనే ఘర్షణ.

బాలవ్వ - బంగారువడ్డీ :

అంబల్ల జనార్ధన్ అరబ్బు దేశాలకు వెళ్ళిన వాళ్ళ డబ్బుని కుటుంబ సభ్యులు విచ్చలవిడిగా దుబారా చేస్తారో ఒక కథలో చక్కగా చిత్రించారు. అయితే 'అమాయకుడు' కథలోలాగా మొదటిసారిగాని, మరోసారిగాని అరబ్ దేశాలకు వెళ్ళాల్సొస్తే ఇంత మంది బంధు మిత్రులుండి కూడా బంగారు వడ్డీకి తీసికోవాల్సి వస్తుంది. బంగారు వడ్డీ అంటే తులం బంగారానికి ఏడాదిలోగా తులంనర కొనివ్వడం. ఏడాదికి తులానికి అరతులం వడ్డీ కింద లెక్క. దానితో పాటు 4వేలకు తులం వున్న బంగారం 6వేల చొప్పున తులందరకి 9వేలు ఖర్చు "పెట్టికొనివ్వాల్సి వుంటుంది. తీనుకున్నది తులం అనగా 4 వేల రూపాయలు. కట్టేది 9 వేల రూపాయలు. ఈ బంగారు వడ్డీ కాబూలీ అప్పులాగా వుంటుంది. బాలవ్వ భర్త పంపిన డబ్బులు తను కట్టిన అప్పు లెక్క చూపించింది. భర్త మూడేళ్ళ సంపాదనతో అప్పు మాత్రమే తీరింది. భర్త వేపు బేలగా చూస్తు అడిగింది. "ఆ పరిణామాలన్ని 'బంగారు వడ్డీ' కథలో చూడొచ్చు. అయినా బతుకుపై విశ్వాసం అరబ్బు దేశాలకు వలస అనివార్యం కావడం వల్ల మరోసారి అదే మాయాజాలంలో చక్రభ్రమణం చేయక తప్పడం లేదు.

సావిత్రి - మొఖం :

పెద్దింటి అశోక్ కుమార్ రచించిన మొఖం కథలో సావిత్రి అనే ఒక పేదింటి అమ్మాయి ఉంటుంది. వారి అమ్మా నాన్నలకు ఆమె మొదటి సంతానం. ఇంకా ఇద్దరు కూడా ఆడవాళ్ళే. ఆమెకు నిండా 16 సం॥రాలు కూడా నిండకుండానే అమ్మాయి తండ్రి పెళ్ళి చెయ్యాలని చూస్తాడు. కానీ ఆ పెళ్ళికొడుకు మొఖం చూడటానికి అందంగా ఉండడు. ఐతేనేం అతనే డబ్బులు ఇచ్చి పెళ్ళి చేసుకుంటాడని, మిగతా ఆడపిల్లల పరిస్థితి ఆలోచించాలని, ఆ అబ్బాయికి ఇల్లువాకిలి ఏదో చిన్న వ్యాపారం ఉందని భార్యతో విషయాన్ని చెప్తాడు సావిత్రి తండ్రి. చూస్తూ, చూస్తూ అలాంటి వాన్ని కూతురుకు ఇచ్చి పెళ్లి చెయ్యనని బిడ్డ కూడా పెళ్ళికి ఒప్పుకోదని చెప్పేస్తుంది సావిత్రి తల్లి. కాని సావిత్రి రోజు సేరు బీడీలు చేస్తూ ఇంటికి అండగా ఉంటుంది. నేను వెళ్ళిపోతే నా వాళ్ళకు భారం తగ్గుతుంది అని మొఖం... మొఖం పర్వలేదమ్మ నేను ఈ పెళ్ళి చేసుకుంటానని చెబుతుంది. అనుకున్నట్టే సావిత్రి పెళ్ళవుతుంది.

అనుకోకుండా భర్తకు నష్టాలు రావటం, చేతుల్లో పనులు లేకపోవడం వలన భార్యతో పరిస్థితులు చెప్పి మస్కట్ వెళుతాడు సావిత్రి భర్త రాములు. నాలుగేండ్లు గడుస్తుంది బాకీకి మిత్తి రెండింతలవుతుంది. కంపెనీ మూతపడుతుంది. ఎక్కడో సెంట్రింగ్ చెక్క కొడుతూ రెండంతస్థుల మాల్ నుండి పడి చనిపోతాడు రాములు. ఇంటికి ఫోన్ వస్తుంది సావిత్రి పిచ్చిగా ఏడుస్తుంది. పెళ్ళి చూపుల్లో చూడని మొఖాన్ని చివరిసారి గూడా చూడ వద్దనుకొని ఆ కార్యక్రమాన్ని అక్కడే కానిచ్చి పైసలు పంపితే ఎదిగిన బిడ్డ పెళ్ళి చేస్తాను.

సునీత - మూడోకన్ను :

పెద్దింటి అశోక్ కుమార్ రచించిన మూడోకన్ను కథలో సునీత అనే వ్యక్తి గురించిన సంభాషణలు ఎక్కువగా తారసపడతాయి. సునీత మంచి వ్యక్తిత్వం కలిగిన వ్యక్తి. భర్త పరాయిదేశం వెళితే చంటిబిడ్డను చూసుకుంటూ ఎలాంటి దురలవాట్లకు గాని, అక్రమసంబంధాలకు గాని లొంగని వ్యక్తి. కాని అనుకోకుండా ఊర్లోని వ్యక్తుల సమస్యలకు ఈమె బలికావల్సి వస్తుంది. ఒక వర్గం మరో వర్గం పోరులో ఒక వ్యక్తి అనుకోకుండా ఈమె ఇంట్లోకి చొరబడతాడు. అక్కడ ఏం జరగకపోయినా ఆ వార్త మరో వర్గం వ్యక్తి పేపర్లో వేయిస్తాడు. ఊర్లో వారందరికి తెలిసిపోతుంది. ఆమె మనసులో భర్త ఏమనుకుంటాడో అసలే అనుమానపు పిశాచి అంటూ ఆలోచిస్తూ ఏడుస్తుంది. కాని ఇప్పుడు మూడో కన్ను తెరుచుకుంటుంది. అనుకుంటూ భయం భయంగా బ్రతుకుతుంది. భర్త ఎడారి దేశాలకు వెళితే ఉన్న ఊళ్లో భార్య పడ్డ ఇబ్బందులను ఈ కథలో పెద్దింటి అశోక్‌కుమార్ వివరించాడు.

వసంత - గ్లాసియర్ :

ఈ కథ వసంత అనే ఒక ప్రయివేట్ స్కూల్ టీచర్ చుట్టూ తిరుగుతుంది. వసంతకు శంకర్ అనే వ్యక్తితో పెళ్ళి జరుగుతుంది. అతను పెళ్ళైనా కొన్ని నెలలకే చెల్లెళ్ల పెళ్ళిళ్ళు చెయ్యాలని మస్కట్ వెళ్ళిపోతాడు. వసంత ఎంత చెప్పినా వినిపించుకోదు. అతడు వెళ్ళాకా వసంత అత్తింటి బాధ్యతలు చూస్తూనే సోషల్ టీచర్‌గా ప్రైవేట్ స్కూల్లో చేరుతుంది. అందరి విద్యార్థులతో ఉన్నట్టే శశాంక్ అనే విద్యార్థితో ఉంటుంది కానీ అతను ఏదో ఆకతాయిగా ఏదో అపోహలో ఉండిపోతాడు. ఓ రోజు మా ఇంటికి రావద్దని శశాంకి వసంత చెప్పేస్తుంది. ఏదో గిఫ్ట్ ఇస్తానని ఇలా చెప్పిందేంటని చాలా సంవత్సరాలు ఆలోచిస్తాడు. బాగా చదివి డాక్టరుగా ఉద్యోగం చేస్తూ ఓరోజు వారి ఊరిలో రోడ్డుపై శశాంక్ వెళ్తుంటే పిచ్చి అవతారంలో వసంతని చూస్తాడు. వివరాలన్నీ ఆమె తండ్రిని అడిగి తెలుసుకుంటారు.

భర్త మాత్రం పిల్లల పెళ్ళిళ్లు, వాళ్ళ చదువులు పాలం, ఇల్లు కొన్నాం డబ్బు కావాలి కదా అని మళ్ళీ, మళ్ళీ దుబాయ్ వెళ్ళటం 2,3 సం॥రాలకి ఒకసారి రావటం మూడు నెలలు ఉండి. తిరిగి వెళ్ళటం. "వస్తూ పోతూంటే తర్వాత, తర్వాత స్పందించటం మానేసి భయపడటం మొదలు పెట్టింది ఈ విషయాలన్నీ ఆమె నోటి వెంటే విన్నాడు శశాంక్. ఎన్నో రకాలుగా కృషి చేసి శశాంక్ ఆమె వ్యాధిని తగ్గించి వసంతని మామూలు మనిషిని చేస్తాడు. ఎంతో ఉత్కంఠంగా ఈ కథ ముగుస్తుంది.

పల్లవి - తిరిగిరాని యవ్వనం :

"తిరిగిరాని యవ్వనం" కథలో పల్లవి పాత్ర ఎంతటి నరకం మానసిక క్షోభ తెగిన గాలిపటంలా తయారయిన జీవితం, ఆరు సంవత్సరాల ఓంటరితనం తన భవిష్యత్తును కాలరాసిందని ఆ రాత్రితో తన జీవితం చీకట్లోకి నెట్టివేయబడిందని తెల్లవారితే గాని తెలియలేదు. తన భర్తకున్న వ్యవనాలు అనుమానపు బుద్ధి కలిసి పల్లవిని చుక్కాని లేనినావలా చేసింది. భర్త మారాడు తన చెల్లెల్ల కోసం తల్లిగారింటికి వెళ్ళక కొడుకుతో ఒంటరి జీవితాన్ని అనుభవించిన పల్లవి చనిపోయాడనుకున్న భర్త నీచమైన బుద్ధితో వచ్చినా అతడిని నమ్మి మోసపోయిన స్త్రీ పెళ్ళయినప్పటి నుండి ఎలాంటి సుఖాలకు నోచుకోక పోయిన ఇకనైనా సంతోషంగా గడుపుదామను కున్న పల్లవికి మళ్ళి చుక్కెదురే అయింది. మస్కట్కు పంపే బ్రోకర్లు ఎక్కువగా మోసాలు చేయటం వలన ఎంతో మంది జీవితాలు అగమ్యగోచరం అయ్యాయి. పోయే ముందు అప్పులు చేసుకుని ఏదో సంపాదిస్తామని వెళ్ళినవాళ్ళు ఏజెంట్ మోసానికి బలి అయ్యి ఇల్లు ఒళ్ళు గుల్లచేసుకుని, బతుకు నీడుస్తున్న వారు మన పల్లెల్లో కోకొల్లలు, ఇప్పటికి ఇలాంటి మోసాలు జరుగు తూనే వున్నాయి. పరిస్థితులు కొందరిని అటువైపు నడిపిస్తే, మరికొంత మంది సంపాదన కోసం ఏడారి వైపు పరుగులు తీస్తున్నారు.

యాదవ్య భార్య - ఇగురం :

పశుపోషణ వృత్తిగా కలిగిన వారు యాదవులు. మాహాభారత కాలంలోని శ్రీ కృష్ణుడిని ఆరధ్యదైవంగా భావిస్తారు. వీరిని గురించి పెద్దింటి అశోక్ కుమార్ ఇగురం కథలో చక్కగా చెప్పాడు. ఈ కథలో సమస్యగా ఉన్న తమ గడ్డంపోతును వెట్టిగా తీసుకోవాలనే కుతంత్రం నుండి ఎలా తప్పించుకోవాలో భర్తకి భార్య చెప్పిన ఉపాయాన్ని చక్కగా చూపించాడు. "ఇప్పుడు ఎట్లంటవే మరీ. ఏం జేద్దామంటవు. దాన్ని కండ్లల్ల పెట్టుకున్న కడుపుల దాసుకొని సాదుకున్న. ఇచ్చుడుకు ధైర్య మత్తలేదు. రెండు తోడెళ్ళు అదిమి పట్టి గుంజితే ఎక్కువ తక్కువ తెగితే ఎక్కడ కొట్లాట మొదావుతుందోనని చెరి సగం తెగ్గొట్టి మురిసిపోయే మేకనీతి మనది. ఇయ్యకపోతే మనమీద ఉంచుతరు. కులమని దండుగని సంపుక తింటరు. తోడెళ్లు అదిరిస్తే పారిపోతాయి. వీళ్ళు గట్ల గాదు... వీళ్ళనుంచి మన గడ్డంపోతును తప్పించాలంటే ఇగురం కావాలె.. ఇగురం". (అశోక్ కుమార్, పెద్దింటి, ఇగురం: పుట :136). తోడెళ్ల కన్న ప్రమాదకరమైన వారు మన మధ్యనే తిరిగే మనుషులున్నారు వారినుండి మన మేకల మందను కాపాడుకోవాలని మార్గనిర్దేశం చేసి మలుపు తిప్పిన యాదవ భార్య గురించిన కథ ఇది.

వజ్రమ్మ - ఆకలి :

గుండెలో వాన అనే కథా సంపుటంలో మరో మంచి

కథ 'ఆకలి'. ఇది ప్రధానంగా వజ్రమ్మ అనే ఓ అనాథ ముసలమ్మ బతుకు కథ. ఒంటరిదైన ఆవిడ ప్రతిరోజూ తన ఒంటి గది ఇంటి పక్కనే వున్న ఓ బడిపంతులు వాళ్లు వండుకున్న వంటకాల వాసనను పసిగడ్తుంది. వాటి కోసమని రకరకాలుగా పంతులు కుటుంబంతో మాటలు కలుపుతుంటుంది. కానీ, ఎన్నడూ నాకిది కావాలని నోరు తెరిచి అడగదు. ఆవిడ తండ్లాట ఏమిటో పంతులుగారి కుటుంబం గుర్తించీ గుర్తించనట్టుంటుంది. రోజులు గడుస్తున్నాకొద్ది వజ్రమ్మను పంతులుగారి కుటుంబం ఈసడించుకోసాగింది. ఓసారి అనుకోకుండా పంతులు గారు పనిమీద పఠాన్కోట్ వెళ్లాల్సొస్తుంది. కొన్నాళ్లు అక్కడున్న పంతులుగారికి అక్కడి తిండి సహించక అవస్థలు పడుతుంటాడు. ఏదో విధంగా తను వెళ్లినపని పూర్తి చేసుకుని తిరుగు ప్రయాణమవుతాడు. కొంత దూరం వచ్చిన తరువాత ఓ అడవిలో తుఫాన్ కారణంగా అతనెక్కిన రైలు ఆగిపోతుంది.

వరంగల్లు నుండి ఆగ్రాకు ఎక్స్కర్షన్కొచ్చిన పిల్లలు కొందరు ఆ రైలులో చిక్కుకొని ఆకలికి నకనకలాడి పోతుంటారు. కొన్ని గంటల తరువాత పిల్లలను ఆ టూర్కు పంపించిన ట్రావెల్స్ సంస్థ వాళ్ళు పప్పు, సాంబర్లాతో భోజనాలు ఏర్పాటు చేస్తారు. అప్పటిదాకా అన్నానికి ముఖం వాసిపోయిన పంతులు తనలో వున్న మొహ మాటాన్ని, అహాన్ని, సంస్కారాన్ని, మర్యాదలను అన్నింటినీ వదిలేసి 'కొంచం అన్నముంటే పెట్టించండి' అంటూ పిల్లల తాలూకు ఉపాధ్యాయుణ్ణి ప్రాధేయపడతాడు. అతను అన్నమైపోయిందంటూ బదులిస్తాడు. ఆ మాటతో పంతులు కండ్ల ముందు మెరుపులు మెరిసినట్టవుతుంది. అప్రయత్నంగా అతని కండ్ల ముందు వజ్రమ్మ రూపం కదలాడుతుంది. వృద్ధురాలైన వజ్రమ్మ ఎంత ఆకలినైనా తట్టుకుందిగాని ఏనాడూ తన మాదిరిగా దిగజారి అడుక్కోలేదన్న విషయాన్ని గుర్తుకు తెచ్చుకుంటాడు. అందుకావిడను మెచ్చుకుంటాడు. ఆవిడ ఆకలిని గుర్తించలేకపోయిన తమ తెలివి తక్కువతనానికి సిగ్గుపడతాడు.

అన్నానికి అలమటిస్తూ మరో రెండు రోజుల తరువాత ఇంటికి చేరుకున్న పంతులు వెంటనే బజారుకెళ్లి చికెన్ తెచ్చి భార్యతో వండిస్తాడు. ఎప్పటి మాదిరిగా వజ్రమ్మ రాకపోవడంతో తనే ఓ క్యారేజీలో ఇంత అన్నం కూరా తీసుకుని ఆవిడ దగ్గరికెళతాడు. అతణ్ణి చూసిన వజ్రమ్మ ఆశ్చర్యంతో ''ఏందయ్యా!'' అంటూ పలకరిస్తుంది. దానికతను ''ఇంతకాలం నీ ఆకలిని గుర్తించలేక నిన్ను అసహ్యించుకున్నాం'' అంటూ తను తీసికెళ్లిన క్యారియర్ని ఆవిడకిస్తాడు. ఆవిడ నమ్మలేనట్టుగా అతని దిక్కు చూస్తూ ''ఇది నాకెందుకయ్యా!'' అంటూ దాన్ని అందుకుంటుంది. తెల్లారెపాటికి వజ్రమ్మ చనిపోయిందని తెలుస్తుంది. పంతులు వెళ్లి చూస్తే ఆవిడ క్యారియర్ మూతకూడా తియ్యలేదు. ఆవిడ ఆకలితో చచ్చి పోయిందని తెలిసిన అతను ఎంతో బాధపడతాడు. ఆకలి తీవ్రత మనిషిని ఎటువంటి స్థితికైనా దిగజారుస్తుందన్న కఠోర నిజాన్ని ఎంతో సున్నితంగా తెలియజేశాడు కథకుడు.

ముగింపు :

సామాజిక జీవితాన్ని కళాత్మకంగా చిత్రిస్తూ పాఠకుడి హృదయానికి సన్నిహితమైన వర్తమాన సాహితీ ప్రక్రియ తెలుగు కథానిక వాస్తవికత పునాదిగా, గాఢత, క్లుప్తత, సౌందర్యాలే ప్రధాన లక్షణాలుగా జీవద్భాషలో పాఠకునితో సంభాషిస్తున్న ఉదాత్త సాహిత్య ప్రక్రియ మన కథానిక. యవ్వనతేజంతో పురుడు పోసుకున్న తెలుగు కథానిక ఎందరో విశిష్ట కథకుల చేతుల్లో సహజ సుందరమైన రూపురేఖలు దిద్దుకుంది. నూటపది సంవత్సరాల సుదీర్ఘ ప్రయాణం మన కథానికది. నాలుగుతరాల కథా రచయితలు తమ కలాలతో కలల్ని పంచారు, కన్నీళ్లను తుడిచారు. ఆశలను పెంచారు, ఆశయాలను అందించారు. జాతికి గొప్ప భవిష్యత్తును వాగ్దానం చేశారు. ఆ దీపధారులను ప్రతి తరానికి పరిచయం చెయ్యాలి. తెలంగాణ పల్లెలను, అక్కడి బతుకులను వారి వెతలను తన కథల్లో, నవలలో చిత్రిస్తూ వాటి పరిష్కారానికి తన వంతు పెద్దింటి అశోక్కుమార్ నిర్వర్తిస్తున్నారు. పల్లె వాతావరణంలోని అనేక విషయాలు రైతుల కష్టాలు, దుర్భర దారిద్ర్యాలు, రోగాలు, అప్పులు మొదలైన వాటిని పెద్దింటి చిత్రించాడు. నిజంగా ఈనాడు పల్లెలు వల్లకాడు

అవుతున్నవి. సకాలంలో వర్షాలు పడక కాలువల ద్వారా నీటి సౌకర్యం లేక వ్యవసాయాలు మూతపడుతున్నవి.. "పండుగ" సంబరాలు లేకుంటాపోతున్నవి. ఈనాడు తెలంగాణ బతుకులు సంక్షోభపూరితాలు, ఆ బతుకులను చిత్రిస్తున్న రచయిత పెద్దింటి అశోక్‌కుమార్. ఈ క్రమంలో తెలంగాణాలో ప్రసిద్ధ కథకుడు పెద్దింటి అశోక్‌కుమార్ కథల్లో మధ్య తరగతి స్త్రీ జీవన చిత్రణను ఈ వ్యాసంలో విశ్లేషించాను.

ఆధార గ్రంథాలు :

1. అశోక్ కుమార్, పెద్దింటి, ఊటబాయి. సిరిసిల్ల: నయనం ప్రచురణలు. 2002.
2. అశోక్ కుమార్, పెద్దింటి. కీలుబొమ్మలు, గ్లోబలైజేషన్ కథలు 2003.
3. అశోక్ కుమార్, పెద్దింటి, గుండెలో వాన కథలు, ఆన్వీక్షికి పబ్లిషర్స్ ప్రై.లి. హైదరాబాద్,2021
4. అశోక్‌కుమార్, పెద్దింటి., వలస బతుకులు, విశాల సాహిత్య అకాడమి, హైదరాబాద్, 2004.
5. అశోక్ కుమార్, పెద్దింటి, మాయిముంత కథ, 2006 (నవ్య వారపత్రిక, 19 ఏప్రిల్, 2006.
6. మల్లయ్య, కాలువ, తెలంగాణ కథలు, విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్-హైదరాబాదు, 2005.

★★★

Vol. 23 | Spl. Issue 03 | March 2026 | BHAVAVEENA | ISSN No. : 2456-4702 | RNI No. APTEL/2003/12253

RNI No. APTEL/2003/12253 | Reffered Journal & Peer Reviewed Journals | ISSN No. 2456-4702

భావవీణ

కళలు, సాహిత్య, సాంస్కృతిక భాషాధ్యయన పత్రిక

BHAVA VEENA

Journal of Arts, Literary, Culture & Language Study

చిద్రమవుతున్న చిట్టెమ్మ ఇల్లు

- అరిగెల శ్రీకాంత్
పరిశోధక విద్యార్థి
తెలుగు విభాగం, ద్రావిడ
విశ్వవిద్యాలయం, కుప్పం.

- డా॥. ఎమ్. పద్మ గౌరి
తెలుగు అధ్యాపకురాలు
బొమ్మూరు,
రాజమహేంద్రవరం.

ఉపోద్ఘాతం

ఆధునిక కాలంలోని రచయితలు తమ సమకాలిన అంశాలను ఆకళింపు చేసుకొని అవి సమాజానికి ఎంత వరకు ఉపయోగపడుతుంది. అని ఆలోచిస్తూ రచనలు చేయడం ప్రారంభించారు. మధ్యతరగతి వర్గం వారిని ఉన్నత వర్గం వారు ఎలా అణిచివేస్తున్నారో, వారిని ఏవిధంగా మోసం చేస్తున్నారో తెలియజేస్తూ, నేటి సమాజంలో జరుగుతున్న అన్యాయాల్ని, అక్రమాల్ని ఎలా ఎదిరించాలో తెలియజేస్తున్న రచయితలలో రావిశాస్త్రి గారు ఒకరు. స్వతహాగా ఆయన న్యాయవాది. లోకంలో సమాజంలో జరుగుతున్న వాటిని తెలుసుకొని స్పందించి రచనలు చేయడం ప్రారంభించారు.

సమకాలీన సమాజంలో నేడు దోపిడీ చేస్తుంది వ్యాపారరంగం. మానవత్వ విలువలను అడుగంటేలా చేస్తున్నది నేటి పెట్టుబడీదారి వ్యవస్థ. ఈ పెట్టుబడు దారులు, ధనస్వాములు, భూస్వామ్య వర్గం మొదలైన వారు భూములను కబ్జాలు చేస్తూ, అపార్ట్ మెంట్లను, పెద్ద పెద్ద భవనాలను నిర్మిస్తున్నాయి. నేటి సమాజంలో విద్య, వైద్యం, కూడు, గుడ్డ, గూడు అన్ని నిత్యఅవసరాలు కూడా వ్యాపారంగా మారిపోయాయి. మనిషికి కావలిసిన కనీస అవసరాలు కూడా అందకుండా పోతున్నాయి. నివాసయోగ్యమైన భూములను మోసం చేస్తూ అమాయకులను బలిచేస్తున్న విధానాన్ని "ఇల్లు" నవల ద్వారా తెలియజేశారు. రావిశాస్త్రి. ఈ విషయాన్నే రచయిత స్వయంగా పరుల కష్టాన్ని దోచుకొని, పరద్రవ్యాన్ని కాజేసే పరమ దుర్మార్గులు ఎంత మంది ఎలా ఉంటారో తెలుస్తుంది అనే దృష్టితో రాశానని "ఇల్లు" నవల గురించి వివరించారు.

ఇతివృత్తం :

ఇరవై సంవత్సరాలకు భర్తను కోల్పోయి ఒంటరి జీవితంతో జీవిస్తుంది చిట్టెమ్మ. చిట్టెమ్మ భర్త ఊరి కరణం. ఊరిలో ముస్లిం, జాలార్లు వారికి జరిగిన గొడవలో ముస్సబుకు తగలాల్సిన దెబ్బ చిట్టెమ్మ భర్తకు తగ లడంతో మరణిస్తాడు. చిన్న వయస్సులోనే తన సౌభాగ్యాన్ని కోల్పోతుంది. తన ఇంట్లో నాలుగు గదులున్న ఇంటిని పిసినారి అనంతంకు అద్దెకు ఇస్తుంది. అతి తక్కువ అద్దె 60 రూపాయలతో ఆరు సంవత్సరాల నుండి ఇంట్లో ఉంటున్నాడు. తన ఇంటికి ఇంటి పన్ను పెరిగిందని కౌన్సిలర్ సోమయాజులుని తగ్గించమని అడుగుతుంది. వయస్సులో ఉన్న చిట్టెమ్మ పై కన్ను వేస్తాడు. ఆమె తనను సహాయం అడిగిన దానిని ఆసరాగా చేసుకోవాలని అనుకుంటాడు. అతడి ఆలోచనలు

గ్రహించిన చిట్టెమ్మ సున్నితంగా తిరస్కరిస్తుంది. ఆమె కాకపోయినా ఆమె ఆస్తిని కాజేయాలనుకుంటాడు. అప్పటి నుండి ఆమెతో మంచి మాటలు చెబుతూ అనంతం అద్దె తక్కువ ఇస్తున్నాడు నిన్ను మోసం చేస్తున్నాడని చెప్పి అతనిపై కోర్టులో దావా వేయించాలని చెప్పి ఆమెను ఒప్పించి కోర్టు ఖర్చుల నిమిత్తం 2వేల రూపాయలు ఇస్తూ దస్తావేజులు, ప్రామిసరీ నోట్లపై,స్టాంపులపై సంతకాలు చేయిస్తాడు. 75 వేల రూపాయలకు తనకు ఇల్లు అమ్ముతున్నట్లు అడ్వాన్స్‌గా 22 వేలు పుచ్చుకున్నట్లు తమ ఇద్దరి మధ్య క్రయ, విక్రయం జరిగినట్లుగా పురోణి రాయిస్తాడు. ఈ విషయం అనంతానికి తెలియకుండా అద్దెకోసమే అన్నట్లుగా కోర్టును వాయిదా వేయిస్తూ ఉంటాడు. ఈలోపు అతని మోసం బయటపడుతుంది. ఆమెకు అండగా మేనల్లుడు ప్రకాశం ఉంటూ అనంతానికి, చిట్టెమ్మకు రాజీ కుదురుస్తాడు. చిట్టమ్మ ఇల్లు కాజేయాలని మరో రియల్ ఎస్టేట్ మనోహరం అవకాశం కోసం ఎదురు చూస్తున్నాడు. అతను ఎక్కడ గ్రద్దలా ఇల్లు తన్నుకుపోతాడోనని సోమయాజులు తనకు నష్టం జరగకుండా వకీలు చేత మనోహరానికి నోటీసులు ఇప్పిస్తాడు.. బాలాప్రగడ చిట్టెమ్మ ఉరఫ్ సుందరమ్మ పేరుతో తరుచూ వస్తున్న ఉత్తరాలన్ని తీసుకొని డిఎస్పీ చిట్టిబాబుకు అందజేసి తనకు ఇల్లు ఇప్పించవలసిందిగా కోరతాడు. ఆఉత్తరం చిట్టెమ్మ ఆడపడుచు కొడుకు ఉదయభాస్కరం రాశాడు. అతడు ఒక ఉగ్రవాది. ముఖ్య మంత్రిని చంపడానికి వేసిన ప్లాను అని గ్రహించి ముఖ్య మంత్రిని ఆపద నుండి కాపాడి సమాజంలో మంచి పేరును సంపాదించటమే గాక, అడిషనల్ సూపరిండెంట్ ఆఫ్ పోలీసుగా ప్రమోషన్ను మరియు నగదు బహుమతిని కొట్టేస్తాడు చిట్టిబాబు.

ఉదయ్ భాస్కర్ ప్లాను ప్లాప్ అవ్వడంతో చిట్టమ్మను అరెస్టు చేసి గెస్ట్ హౌస్ లో ఉంచి ఆమె ఇల్లును కాజేయాలని ప్లాను వేస్తాడు చిట్టిబాబు. సోమయాజులు దస్తావేజులలో తప్పుడు తేదీలు వేసిన సంగతి గ్రహించి అవి చెల్లవని చెబుతాడు చిట్టిబాబు. చిట్టమ్మ ఇల్లును అమ్మితే అందులో వచ్చే మూడోవంతు సోమయాజులుకు ఇస్తాడు, మనోహరం చిట్టమ్మ ద్వారా ఏదైనా ఎత్తు వేయవచ్చని భావించి అతనికో వాటా ఇస్తాడు. మిగిలిన వాటాను తన అల్లుడు పేరున బినామిగా రాయిస్తాడు చిట్టిబాబు. వీళ్లు ముగ్గురు పేర్లు మీద సో.మ.నా. ఎంటర్ప్రైజెస్ అనే పేరు తో బోర్డు కనిపిస్తుంది.

అమాయకురాలైన చిట్టెమ్మ ఈ ముగ్గురు రాబందులకు ఇల్లు లక్ష రూపాయలకు అమ్ముకొని, తన స్వగ్రామంలో ఉన్న భూములు కూడా అమ్ముకొని, లక్షరూపాయల చెక్కును అరుణ ప్రకాష్కు ఇవ్వమని చెప్పి అతడు ప్రేమించిన అనంతం కూతురు జ్యోతిర్మయికి ఇస్తుంది చేతిలో చిన్న మూటతో పాద యాత్ర చేసుకుంటూ కాశీకి బయలుదేరుతుంది.. మనుషులను నమ్ముకోవటం కన్నా దేవుడినే నమ్ము కోవటంమంచిది అని భావిస్తూ ఇంటి నుండి బయలు దేరుతుంది చిట్టెమ్మ.

కథా విశ్లేషణ

ఇల్లు నవలలోని సాంఘిక పరిస్థితులు, సామజిక, ఆర్థికపరిస్థితులు, రాజకీయ పరిస్థితులను,ఉద్యమ పరిస్థితులను, అంతర్లీనంగా మనం గ్రహించవచ్చు. నేటి సమాజంలో పెద్దమనుషులుగా ముద్ర వేసుకున్న వారు వ్యవహరిస్తున్న తీరు, అమాయ కులను,ఏ అండదండ లేని స్త్రీలనువారి ఆస్తులను ఏవిధంగా దోచుకుంటున్నారో ఈ నవలలోని పాత్రల ద్వారా రావిశాస్త్రి గారు తెలియ జేశారు. అంతేకాదు మనకు సహాయం చేస్తారు అని అనుకుంటున్న ప్రభుత్వ ఉద్యోగులు, వివిధరకాల అధికారులు, సామాన్య వర్గం నుండి ఉన్నతవర్గం వరకు ప్రభుత్వ యంత్రాంగంలోని అధికారులు ఎలాంటి అవినీతి, అక్రమాలు చేస్తున్నారో చాలా చక్కగా వివరించారు రావిశాస్త్రి.

నాగరిక సమాజంలో కూడా ప్రజలు సాంప్రదాయాన్నే అవలంభిస్తున్నారని తెలియ జేశారు. మనిషికి మనిషికి మధ్య సంబంధ భాందవ్యాలన్నీ డబ్బుతోముడిపడి ఉన్నాయని సోమయాజులు పాత్రను బట్టి తెలుస్తుంది. సమాజంలో నిరుద్యోగం ఎక్కువగా కన్పించడంతో యువత ఏవిధంగా ప్రక్కదారులు తొక్కుతున్నారో ఉదయభాస్కర్ పాత్ర ద్వారా తెలియజేశారు రచయిత.

వివిధ వర్గాలవారు అనగా మధ్యతరగతి కుటుంబాల నుండి ఉన్నతవర్గ కుటుంబాల వరకు ఉండే కుటుంబాలను వారి వైరుధ్యమైన భావాలను తెలియజేశారు రచయిత. మధ్యతరగతి కుటుంబాలను ఉన్నతవర్గ కుటుంబాల వారు ఏవిధంగా అణిచివేశారో చిట్టిబాబు, మనోహర్, సోమయాజుల పాత్రల ద్వారా తెలియజేశారు. సమాజం మారాలి. అని ప్రశ్నించి ఎదురించే చైతన్య వాదులను అణగ తొక్కాలని, ఫ్యూడల్ భావాలు ఇంకా ఈ సంఘంలో మిగిలి ఉన్నాయని అనడానికి నిదర్శనంగా ఈ నవలను రాశారు. సమకాలీన సమాజంలో ప్రజలను మోసం చేయడం, మధ్యదళారీల మోసపూరితమైన వ్యాపారం, నేటి సమాజంలో నునుషుల మధ్య ఈర్ష్యా ధోరణి ని మొదలైన అంశాలన్నిటిని ఈ నవల ద్వారా తెలియ జేశారు రచయిత.

ఇంకా ఈ నవలలో పిసినారితనం అనంతను,చిట్టెమ్మ వదిన వెంకటలక్ష్మి భర్త పెట్టె త్రహించలను, తాగుడుకు బానిస అయిన విధానంను, వయసు మీరిపోతున్న వైవాహిక జీవితానికి నోచుకోని ఆడపిల్లల పరిస్థితులను ఈ నవలలో వివరించారు రచయిత.

ఒంటరిగా ఉంటున్న స్త్రీ యొక్క దైన్య పరిస్థితి చిట్టెమ్మ పాత్రద్వారా తెలియజేశారు రచయిత బిడ్డలు లేని తల్లి ఆవేదన వర్ణనాతీతం అందుకే చిట్టెమ్మ" కోడికి.... కోడికి ... పాలు లేకపోయినా పిల్లాపాపలుంటాయి" తాను మొరళ్లా మిగిలినని, ఆ భాగ్యం లేకపోయెనే అని దుఃఖిస్తుంది. పిల్లలు లేని ఆమె బాధ వర్ణనాతీతం. ఆమె పరిస్థితికి జాలి పడాల్సింది పోయి సోమయాజులు ఆపదలో ఉన్న ఆడదాన్ని కౌగలించుకుంటే అడ్డు చెప్పదులే అని నీచంగా ఆలోచిస్తాడు. కాని కుటుంబ గౌరవం కలిగిన స్త్రీ అటువంటి నీచానికి పాల్పడదని రచయిత ఆమె చేతనే చెప్పిస్తాడు.

ఈ నవలలో మనకు ప్రత్యక్షంగా కనిపించని ముసలి సారె దంపతులు. వారికి ఆరుగురు కుమార్తెలు. వారి గురించి రచయిత ఒకే ఒక మాట ప్రస్తావించారు.

"ఆరుగురు కూతుళ్ళు ఆ ఇంటి గురించి కుమ్మి లాడుకొని చచ్చిపోయి మళ్ళీ మళ్ళీ బతుకుతూ ఉంటారు". తల్లిదండ్రులు బ్రతికి ఉండగా వారి ఆలన పాలన చూసుకోకుండా వారిలో వారే గొడవ పడుతున్న వైనాన్ని, నేటి సమాజ పరిస్థితులను గురించి తెలియ జేశారు రచయిత.

ఈ నవలలో హోమ్ మంత్రి ముఖ్య మంత్రి కావడం, అతడు అంతకు ముందు చేసిన దుర్మార్గాలను సహించ లేక అతన్ని హత మార్చాలని ప్లాన్ వేయడం, నేటి ఉద్యమ కారుల ఆలోచనా విధానాన్ని తెలుసుకోవచ్చు. అయితే ఇలా వ్యక్తుల్ని వ్యక్తుల్ని చంపటం, కిడ్నాప్ చెయ్యడం ఉద్యమం కాదు, విప్లవంకాదు, అనేది సత్యం. ఈ నవలలో అరుణప్రకాశ్ ని, జ్యోతిర్మయిని కిడ్నాప్ చేసి అడవులకు తీసుకు వెళ్లిన తరువాత నిజం ఏమిటో తెలుసుకొని వాళ్ళని విడిచి పెడతాడు ఉదయభాస్కర్. దీన్ని బట్టి విప్లవకారులు, హింసావాదులు కారని నిరూపించారు. ఈ నవలలో రచయిత విప్లవ మార్గంలో నడుస్తున్న యువత ఒక్కొక్కసారి లక్ష్య మార్గంలో తప్పటడుగు వేయడం మనం గమనిస్తూ ఉంటాం. వారిలో మంచి, చెడు ఆలోచించే విచక్షణా జ్ఞానం ఉందని ఉదయ భాస్కరం పాత్ర ద్వారా తెలియజేశారు రచయిత.

ముగింపు :

రచయిత కేవలం ఒక వ్యక్తి మాత్రమే కాదు. అతడు తన కాలానికి చెందిన సజీవ చైతన్య స్వరం. సమాజంలో తన చుట్టూ జరుగుతున్న అవినీతి, అక్రమాలు, అన్యాయాలను నిర్లిప్తంగా చూసే వ్యక్తి కాకుండా, వాటిని ప్రశ్నించే ధైర్యం ఉన్నవాడే నిజమైన రచయిత అని రావిశాస్త్రిగారు 'ఇల్లు' నవల ద్వారా నిరూపించారు. ఈ నవలలో వ్యక్తిగత కథను కేంద్రంగా చేసుకొని, సమాజంలోని విస్తృత సమస్యలను ప్రతిబింబించడం రచయిత శిల్ప నైపుణ్యానికి నిదర్శనం.

'ఇల్లు' నవలలో సామాన్య ప్రజల అగచాట్లు, మధ్య తరగతి కుటుంబాల అస్థిర జీవితం, ఉన్నత వర్గాల దోపిడీ ధోరణి, కులపోరాటాలు, నైతిక విలువల పతనం, రాజకీయ కుట్రలు, పోలీస్--కోర్టు--ప్రభుత్వ యంత్రాంగాల్లో నాటుకుపోయిన అవినీతి వంటి అనేక అంశాలు సమగ్రంగా ప్రతిఫలించాయి. ముఖ్యంగా

అండదండలు లేని ఒంటరి స్త్రీ అయిన చిట్టెమ్మ జీవితాన్ని కేంద్రంగా చేసుకొని, నేటి సమాజం ఎంత క్రూరంగా, నిర్దాక్షిణ్యంగా మారిందో రచయిత హృదయ విదారకంగా చూపించారు.

ఈ నవల ద్వారా రచయిత ఒక స్పష్టమైన సందేశాన్ని అందిస్తూ నేటి సమాజంలో మనిషి మనిషిగా మిగలడం కంటే, డబ్బు, అధికారం, సంబంధాల పేరుతో మనిషి మానవత్వాన్ని కోల్పోతున్నాడని. మనిషికి అవసరమైన కూడు, గుడ్డ, గూడు కూడా వ్యాపార వస్తువులుగా మారిన ఈ పెట్టుబడిదారీ సమాజంలో, అమాయకుల జీవితాలు ఎలా నలుగుతున్నాయో 'ఇల్లు' నవల అద్దంలా చూపిస్తుంది.

అదేవిధంగా ఉద్యమ భావాల విషయంలో కూడా రచయిత సమతూకమైన దృష్టిని ప్రదర్శించారు. హింస, వ్యక్తుల హత్యలు ఉద్యమం కాదని, నిజమైన మార్పు చైతన్యంతో, విచక్షణతో రావాలని ఉదయభాస్కరం పాత్ర ద్వారా స్పష్టంగా తెలియజేశారు. విప్లవ మార్గంలో నడిచే యువత కూడా తప్పటడుగులు వేయవచ్చునని, అయితే వారిలో మంచి,చెడు తేడాను గుర్తించే వివేకం ఇంకా సజీవంగానే ఉందని రచయిత నమ్మకం వ్యక్తం చేస్తారు.

మొత్తానికి 'ఇల్లు' నవల సమకాలీన సమాజానికి అద్దం పట్టే సామాజిక పత్రిక. ఇది కేవలం ఒక కుటుంబ కథ కాదు. ఇది నేటి వ్యవస్థపై రచయిత చేసిన తీవ్ర విమర్శ. చదివే ప్రతి పాఠకుడిని ఆలోచింపజేసే శక్తి ఈ నవలకు ఉంది. సమాజం మారాలి అనే ప్రశ్నను పాఠకుడి ముందుంచి, ఆ మార్పుకు చైతన్యమే మార్గమని సూచించే విలువైన సాహిత్య కృతి 'ఇల్లు' నవల అని నిర్భయంగా చెప్పవచ్చు.

ఆధార గ్రంథాలు :

1. కాంతారావు. బియల్ - రావిశాస్త్రి కథా ప్రపంచం
2. మృణాలిని, సి - సాంఘిక నవలా కథన శిల్పం
3. రావిశాస్త్రి - ఇల్లు
4. వెంకట సుబ్బయ్య -నవలా శిల్పం

★★★

Vol. 23 | Spl. Issue 03 | March 2026 | BHAVAVEENA | ISSN No. : 2456-4702 | RNI No. APTEL/2003/12253

RNI No. APTEL/2003/12253 | Reffered Journal & Peer Reviewed Journals | ISSN No. 2456-4702

భావవీణ

కళలు, సాహిత్య, సాంస్కృతిక భాషాధ్యయన పత్రిక

BHAVA VEENA

Journal of Arts, Literary, Culture & Language Study

పెద్దింటి అశోక్‌కుమార్ కథల్లో మధ్య తరగతి స్త్రీ జీవన చిత్రణ

- తుమ్మలపల్లి వెంకటేశ్వరరావు
పాత్రికేయులు, పాలకొల్లు.

శ్లో॥. యత్ర నార్యాస్తు పూజ్యంతే
రమంతే తత్రదేవతాః।
యత్రైతాస్తు న పూజ్యంతే
సర్వస్తత్రాఫలాః క్రియాః ॥
(మనుధర్మశాస్త్రము-3వ అధ్యాయం-56వ శ్లోకం)

ఎచ్చట స్త్రీలు పూజింపహడతారో అచ్చట దేవతలు ప్రీతి జెందుతారు. ఎచ్చట వారు గౌరవింపబడరో అచ్చట చేసే కార్యాలన్నీకూడా నిష్ఫలములౌతాయి.

సృష్టి ఆదిలో మహిళ పరాశక్తికి ప్రతిరూపంగా కీర్తించ బడింది. దైవత్వాన్ని సంతరించుకుని, మాతృస్వామ్య వ్యవస్థకు మూలమయింది. భారతీయ పూరాణేతిహాసాల్లో స్త్రీని పురుషుని కంటే శక్తివంతురాలిగా వ్యక్తిత్వ చిత్రీకరణ జరిగింది. రామాయణ,మహాభారతాల్లో మిగలగా ఉన్న భాగవతంలో ఆయా స్త్రీ పాత్రల చిత్రణ, అత్యంత ఉత్కృష్టంగా మలిచారు. కుంతి, మాద్రి, గాంధారి వంటిరాజ వంశ మహిళలు తమ కుటుంబ ఉన్నతి కోసం చేసిన సాహసాలు? పడిన కష్టాలు మన కళ్ళకు కట్టాయి. ద్రౌపది, నిండు సభలో ప్రశ్నించిన తీరు, సాహస మహిళ లకు ప్రతిరూపం. రామాయణంలో సీతాదేవి అబలగా కాక, భర్త వెంట అడవులకు నడిచిన ఆదర్శ మహిళ. ఇక ఇప్పుడు, నేను ప్రస్తావించబోయే, ఒక ప్రత్యేక వ్యక్తిత్వం గల దేవతా స్త్రీ మూర్తి సత్యభామ. నేటి మహిళా శక్తికి, నాటి సత్యభామ ఓ స్ఫూర్తివంతమైన ప్రేరణ. ఆమె ప్రతిభ అసాధారణం. పురాణ కాలంలో భర్త అడుగుజాడల్లో నడిచే స్త్రీ మూర్తులు ఉన్న కాలంలోనే ఆమె భర్తతో ద్విముఖ వ్యక్తిత్వం ప్రదర్శించారు. శ్రీకృష్ణుని భార్యగా ప్రేమాభిమానాలు పంచుతూ, మరోవైపు తన విశిష్టమైన వ్యక్తిత్వాన్ని, ఆత్మాభిమానాన్ని నిలుపుకుంటూ వచ్చిన దీశాలి సత్యభామ.

ఈమె, ధైర్య సాహసాలకు పెట్టింది పేరు. ఇందుకు ఉదాహరణగా, నరకాసుర నరకాసుర సంహారంలో ఆమె తెగువ ఎన్న దగినది. యుద్ధ రంగంలో, ఓ మహిళ అడుగుపెట్టడం ఓ అద్భుతం. నమ్ముకుని వచ్చిన భర్త యుద్ధంలో స్పృహ కోల్పోవడం ఆకస్మిక ఆపద. అయి నప్పటికీ ఆమె ఏ విధమైన భయాందోళనలకు గురి కాకుండా, ధైర్యంగా రాక్షసు సంహారం కావిస్తూనే, సవ్య సాచిల మరోవైపు భర్తను కాపాడుకుంటూ వచ్చింది. ప్రతి మగవాడి విజయం వెనక ఓ ఆడికి ఉంటుందని నిరూ పించిది. సత్యభామ అబల కాదు సబలని లోకానికి చాటింది. పురాణాల ప్రకారం సత్యభామ భూదేవి అవతారంగా చెప్పబడింది. నరకాసురునికి తల్లి వల్ల మాత్రమే మరణం ఉంది. అయితే, ఈ నత్యం సత్యభామకు తెలియకనే, కుమారుని వధించిందా, లేక మాతృ హృదయ ప్రేమ కంటే ప్రజా కంటకుల సంహారమే

సబబుగా భావించి, బిడ్డలు అంతమొందించిందా అనేది ఓ నిగూడా రహస్యం. సాక్షాత్తు విష్ణుమూర్తి అవతారమైన శ్రీకృష్ణుడికి, నరకాసుర సంహారం వీలుకానిదా, కాదు కదా, తన ధర్మపత్ని కి సమభాగం ఇచ్చి ఆమె కీర్తి ప్రతిష్టలు ఆ చంద్ర తారార్కం నిలిచిపోయేలా మహిళను ముందుకు నడపడం అర్ధనారీశ్వర న్యాయం. త్రిమూర్తులు ఉన్న అపారమైన శక్తిని వెలికి తీయడానికి శ్రీకృష్ణుడు ఇచ్చిన ప్రోత్సాహం పురాణం కాలం నుంచి నేటి వరకు కొనసాగుతూనే ఉంది. సత్యభామ కేవలం యుద్ధంలో ఒక యోధురాలు మాత్రమే కాదు, నాయకురాలు కూడా. క్లిష్ట పరిస్థితుల్లో ఆమె తీసుకున్న, తక్షణ నిర్ణయాలు ఆమె నాయకత్వాన్ని నిరూపిస్తాయి. ఒక స్త్రీగా సత్యభామకు, తన భర్త శ్రీకృష్ణునిపై అపారమైన ప్రేమాభిమానాలు ఉన్నప్పటికీ, రుక్మిణి దేవిలా, మౌనంగా ఆరాధించి అడుగులకు మడుగులులొత్తకుండా, తన వ్యక్తిత్వాన్ని ఎప్పుడూ నిలబెట్టుకుంటూ వచ్చింది. పారిజాతాప హరణంలో ఆమె మొండి పట్టుదల, శ్రీకృష్ణుని యొక్క గొప్పతనాన్ని నిరూపించుకోవడానికి అవకాశం ఇచ్చింది. సత్యభామ కార్యోన్ముఖురాలు? కార్యసాధకురాలు. ఆమె బహిర్ముకురాలు, ఉన్నది ఉన్నట్టు, కుండ బద్దలు కొట్టినట్టు మాట్లాడటం ఆమె నిర్భీతికి చిహ్నం. మౌనం ఆమె దరిదాపుల్లోకి కూడా రాదు. శ్రీకృష్ణుని శిరస్సుపై అధిరోహించబడిన, రాచకిరీటం తన ఎడమ కాలితో తన్నినా, శ్రీకృష్ణుడు ఇసుమంతైన ఆగ్రహించకుండా, ఆ సున్నితమైన పాదాలకు నొప్పి కలిగిందా అని, సపర్యలు చేయబూనటం, వారిరువురి మధ్య ఉన్న అవ్యాజ ప్రేమకు నిదర్శనం. రుక్మిణి దేవి తులసి ఆకుతో శ్రీకృష్ణుని తూచినప్పటికీ, వెరవని, నిబ్బరమైన మనస్తత్వం సత్యభామ. ఈమె ప్రేమ వ్యక్తికరించబడినది. తన పంతం నెగ్గించుకోవాలనే పట్టుదలకు మారో రూపం సత్యభామ. సత్యభామ పురాణ కాలంలోనే మహిళల మనోనిబ్బరానికి, ఆత్మస్థైర్యానికి, అభినివేశానికి, ఆత్మగౌరవానికి పునవాదులు వేశారు. స్త్రీ అంటే శక్తి, స్త్రీ అంటే సృష్టి, స్త్రీ అంటే విజయం. కార్యక్రమంలో, బాల్యంలో తండ్రి, యవ్వనంలో భర్త, వృద్ధాప్యంలో కొడుకు, కాపాడతాడని, నస్త్రీ స్వాతంత్ర మర్హతి అని చెప్పినప్పటికీ,నేటి ఆధునిక సమాజానికి, మహిళా లోకానికి మార్గదర్శిగా నిలిచారు సత్యభామ. వారి స్ఫూర్తితో నేటి మహిళా లోకం, అంత రిక్షంలో ఆరు నెలల దాటిన భయపడిన సాహస వంతురాలు సునీతా విలియమ్స్ కు, ప్రధానమంత్రి భద్రతదళంలో అదాసో కపేసా, అను ధార్మికతను, ధూళి లా చూసిన మేడం మేరిక్యూరీ, ఝాన్సీ లక్ష్మీబాయి, మదర్ థెరిసా, ఎవరెస్టు శిఖరాన్ని అధిరోహిస్తున్న ఎందరో మహిళలు సాహస అవనితలు అందరికీ మహిళా దినోత్సవ శుభాకాంక్షలు.

★★★

Vol. 23 | Spl. Issue 03 | March 2026 | BHAVAVEENA | ISSN No. : 2456-4702 | RNI No. APTEL/2003/12253

RNI No. APTEL/2003/12253 | Reffered Journal & Peer Reviewed Journals | ISSN No. 2456-4702

భావవీణ

కళలు, సాహిత్య, సాంస్కృతిక భాషాధ్యయన పత్రిక

BHAVA VEENA

Journal of Arts, Literary, Culture & Language Study

ప్రాచీన సాహిత్యంలో మహిళా చైతన్యం

– డా॥. వి.డి.వి. విజయలక్ష్మి

అధ్యాపకులు, అర్థశాస్త్ర విభాగం, శ్రీ ఏ యస్ యన్ యం ప్రభుత్వ కాలేజి(స్వయం ప్రతిపత్తి), పాలకొల్లు, పశ్చిమ గోదావరి జిల్లా.

"యత్ర నార్యస్తు పూజ్యంతే రమంతే తత్ర దేవతాః"
మహిళలను గౌరవించే చోట దేవతలు నివసిస్తారు.

సారాంశం

భారతీయ సాహిత్య సంప్రదాయం ఎంతో ప్రాచీనమైనది. వేదాలు, ఇతిహాసాలు, పురాణాలు మరియు ప్రాచీన తెలుగు సాహిత్యంలో మహిళల స్థానం, వారి ఆలోచనలు, వ్యక్తిత్వం మరియు సామాజిక పాత్ర విశేషంగా ప్రతిఫలించాయి. ఈ పరిశోధనా వ్యాసం ప్రాచీన సాహిత్యంలో మహిళా చైతన్యం ఎలా వ్యక్తమైందో విశ్లేషిస్తుంది. వేదకాల మహిళల విద్యాభ్యాసం, తత్వచింతన, ఇతిహాసాలలో మహిళల ఆత్మగౌరవం, పురాణాలలో శక్తి భావన వంటి అంశాలను పరిశీలించడం ద్వారా మహిళా చైతన్యం యొక్క విభిన్న కోణాలను ఈ వ్యాసం స్పష్టంగా చూపిస్తుంది.

పరిచయం

భారతీయ సంస్కృతి మరియు సాహిత్యం పరస్పర సంబంధం కలిగి ఉన్నాయి. సమాజంలో ఉన్న విలువలు, నైతిక ప్రమాణాలు మరియు జీవన విధానం సాహిత్యంలో ప్రతిబింబిస్తాయి. ప్రాచీన కాలం నుంచే మహిళలు సమాజ నిర్మాణంలో ముఖ్యమైన పాత్ర పోషించారు. అయితే వారి పాత్ర కేవలం కుటుంబ పరిమితుల్లోనే కాకుండా జ్ఞానం, తత్వచింతన, ధర్మబద్ధత మరియు సామాజిక బాధ్యతలలో కూడా కనిపిస్తుంది.

ప్రాచీన సాహిత్యంలో మహిళల పాత్రను పరిశీలించడం ద్వారా ఆ కాలంలో మహిళల సామాజిక స్థితిని అర్థం చేసుకోవచ్చు. వేదాలు, ఇతిహాసాలు మరియు పురాణాలలో మహిళలను గౌరవప్రదమైన స్థానంలో చూపించిన సందర్భాలు ఎన్నో ఉన్నాయి. ఈ అంశాలన్నింటినీ సమగ్రంగా పరిశీలించడం ఈ వ్యాసం యొక్క ప్రధాన లక్ష్యం.

వేద సాహిత్యంలో మహిళా చైతన్యం

వేద కాలం భారతీయ చరిత్రలో అత్యంత ప్రాచీనమైన కాలంగా భావించబడుతుంది. ఈ కాలంలో మహిళలకు విద్య, ఆలోచనా స్వేచ్ఛ మరియు ఆధ్యాత్మిక చర్చల్లో పాల్గొనే అవకాశం ఉన్నట్లు వేద గ్రంథాలు సూచిస్తాయి. ముఖ్యంగా ఋగ్వేదంలో అనేక మహిళా ఋషుల ప్రస్తావనలు ఉన్నాయి. గార్గి మరియు మైత్రేయి వంటి మహిళలు తత్వచింతనలో పాల్గొని వేద జ్ఞానాన్ని విస్తరించారు. వీరు పురుష పండితులతో సమానంగా వాద వివాదాలలో పాల్గొన్నారు. ఇది వేద కాలంలో మహిళల ఆలోచనా స్వాతంత్ర్యాన్ని తెలియజేస్తుంది.

వేదాలలో మహిళలను విద్యావంతులుగా, జ్ఞాన

సంపన్నులుగా చిత్రించడం మహిళా చైతన్యానికి గొప్ప ఉదాహరణ.

ఇతిహాసాలలో మహిళా చైతన్యం

భారతీయ ఇతిహాసాలు మహిళా వ్యక్తిత్వాన్ని అత్యంత ప్రభావవంతంగా ప్రతిబింబిస్తాయి.

సీత పాత్ర

రామాయణంలో సీత పాత్ర ధర్మనిష్ఠ, సహనం మరియు ఆత్మగౌరవానికి ప్రతీక. ఆమె తన జీవితంలో ఎన్నో కష్టాలను ఎదుర్కొన్నప్పటికీ ధర్మాన్ని విడిచి పెట్టలేదు. సీత పాత్ర మహిళల సహనాన్ని మరియు నైతిక బలాన్ని తెలియజేస్తుంది.

ద్రౌపది పాత్ర

మహాభారతంలో ద్రౌపది పాత్ర ఆత్మగౌరవం మరియు న్యాయం కోసం పోరాటానికి ప్రతీకగా నిలుస్తుంది. కౌరవ సభలో జరిగిన అవమానాన్ని ప్రశ్నిస్తూ ఆమె ధర్మాన్ని నిలబెట్టే ప్రయత్నం చేసింది. ఇది మహిళా చైతన్యానికి ముఖ్య ఉదాహరణగా భావించబడుతుంది.

పురాణ సాహిత్యంలో మహిళల ప్రతిరూపం

పురాణాలలో మహిళలను శక్తి స్వరూపిణులుగా చిత్రించారు. ముఖ్యంగా భాగవత పురాణం వంటి గ్రంథాలలో మహిళల భక్తి, త్యాగం మరియు ధర్మబద్ధత ప్రధానంగా కనిపిస్తాయి.ఈ గ్రంథాలలో మహిళలు కుటుంబ వ్యవస్థను నిలబెట్టే శక్తిగా చిత్రించబడ్డారు. తల్లి, భార్య, భక్తురాలు వంటి పాత్రల ద్వారా మహిళల గొప్పతనాన్ని వివరించారు.

ప్రాచీన తెలుగు సాహిత్యంలో మహిళా చైతన్యం

ప్రాచీన తెలుగు సాహిత్యంలో కూడా మహిళల పాత్ర ప్రముఖంగా కనిపిస్తుంది. కవులు మహిళలను సౌందర్యం, ధర్మం మరియు మాతృత్వానికి ప్రతీకలుగా చిత్రించారు. తెలుగు కావ్యాలలో మహిళలను కేవలం గృహిణులుగా మాత్రమే కాకుండా తెలివితేటలు కలిగిన వ్యక్తులుగా కూడా చూపించారు. ఇది మహిళల వ్యక్తిత్వాన్ని సమగ్రంగా ప్రతిబింబిస్తుంది.

మహిళా చైతన్యం - సామాజిక మరియు సాంస్కృతిక ప్రాముఖ్యత

ప్రాచీన సాహిత్యంలో మహిళా చైతన్యం సమాజ నిర్మాణంలో కీలక పాత్ర పోషించింది. మహిళలు కుటుంబ వ్యవస్థను కాపాడడంలో మాత్రమే కాకుండా సంస్కృతి, సంప్రదాయాలను తరతరాలకు అందించడంలో ముఖ్య పాత్ర పోషించారు.మహిళల ధైర్యం, జ్ఞానం, త్యాగం వంటి గుణాలు సమాజానికి ఆదర్శంగా నిలిచాయి.

సమకాలీన సమాజానికి సందేశం

ప్రాచీన సాహిత్యంలో కనిపించే మహిళా పాత్రలు ఆధునిక సమాజానికి కూడా ప్రేరణగా నిలుస్తాయి. మహిళల విద్య, ఆత్మగౌరవం మరియు సమానత్వం వంటి విలువలు సమాజ అభివృద్ధికి అవసరమని ఈ గ్రంథాలు సూచిస్తున్నాయి.

ముగింపు

ప్రాచీన భారతీయ సాహిత్యంలో మహిళలకు గౌరవ ప్రదమైన స్థానం ఇచ్చినట్లు స్పష్టంగా తెలుస్తుంది. వేదాలు, ఇతిహాసాలు మరియు పురాణాలలో మహిళలు జ్ఞానం, ధైర్యం మరియు నైతికతకు ప్రతీకలుగా కనిపిస్తారు.

ఈ గ్రంథాలలో కనిపించే మహిళా పాత్రలు మహిళా చైతన్యాన్ని మాత్రమే కాకుండా సమాజ నిర్మాణంలో వారి ప్రాధాన్యతను కూడా తెలియజేస్తాయి. అందువల్ల ప్రాచీన సాహిత్యంలో మహిళా చైతన్యాన్ని అధ్యయనం చేయడం భారతీయ సంస్కృతిని అర్థం చేసుకోవడానికి ముఖ్యమైన అంశం.

''స్త్రీ శక్తి సమాజానికి ప్రేరణ'' - భారతీయ సాంప్రదాయ దృష్టి.

సూచన గ్రంథాలు (References / Bibliography)

1. ఋగ్వేదం
2. రామాయణం
3. మహాభారతం
4. భాగవత పురాణం
5. భారతీయ సాహిత్య చరిత్ర - తెలుగు అకాడమీ
6. భారతీయ సంస్కృతి-సంప్రదాయం మరియు సాహిత్యం

★★★

Vol. 23 | Spl. Issue 03 | March 2026 | BHAVAVEENA | ISSN No. : 2456-4702 | RNI No. APTEL/2003/12253

RNI No. APTEL/2003/12253 | Reffered Journal & Peer Reviewed Journals | ISSN No. 2456-4702

భావవీణ

కళలు, సాహిత్య, సాంస్కృతిక భాషాధ్యయన పత్రిక

BHAVA VEENA

Journal of Arts, Literary, Culture & Language Study

మొల్ల రామాయణం - సీత పాత్ర ఔచిత్యం

- పి. వెంకటరత్నం

తెలుగు అధ్యాపకుడు, సెయింట్ జోసెఫ్ మహిళా కళాశాల, స్వయం ప్రతిపత్తి, విశాఖపట్నం.

యత్ర నార్యస్తు పూజ్యంతే, రమంతే తత్ర దేవతాః !
యతాస్తు న పూజ్యంతే, సర్వాస్తత్రా ఫలాః క్రియాః!!

స్త్రీలు పూజింపబడుచున్న చోట్లనే దేవతలు క్రీడింతురు, స్త్రీలకు గౌరవము ఈయబడని తావుల జరుగు సర్వక్రియలును నిష్ఫలములే.

సంప్రదాయంలో స్త్రీకి ఒక ప్రత్యేకమైన స్థానం ఉంది స్త్రీ ధైర్యవంతురాలిగా, సాహనవంతురాలిగా శీలవతిగా, గుణవతిగా అలరాడుతుంది. స్త్రీని మాతృ మూర్తిగా, ఇంటికి దీపంగా, త్యాగశాలిగా కూడా పరిగణిం చారు ప్రాచీన సాహిత్యంలో స్త్రీ పురుషుని అండదండలతో బతకడం కనిపిస్తుంది. స్త్రీకి స్వేచ్ఛ ఉన్నప్పటికి ఆ స్వేచ్ఛను పూర్తిగా వినియోగించే పద్ధతి కనిపించదు. ఎందుకంటే పురుషుడు పూజనీయుడు స్త్రీ పురుషుని అడుగు జాడలోనే జీవనం సాగిస్తుంది. పురుషుని మాటదాటి ఏ స్త్రీ పని చేయడం అనేది ఉండదు . దీనినే ఆధునిక సమాజం పురుషాధిపత్యం అని అన్నారు. ఇలా మన పురాణాలలో కొందరు స్త్రీలు కనిపిస్తారు. వారిలో చనిపోయిన భర్తను బతికించు కున్న సావిత్రి, రోగగ్రస్తుడైన భర్తను అలనా పాలనా చూసుకున్న అనసూయ, భర్త మాటకు కట్టబడి భర్తే సర్వస్వం అని జీవించిన సీత ఇలా కొందరు మహిళా మణులు గోచరిస్తారు. వారి లో సీత గురించి చెప్పుకుంటే సీత సహనంలో భూదేవికి మించిన ఓర్పుకలది. తనకర్తవ్యాన్ని నిర్వహించడంలో వెనుకడుగు వేయని వ్యక్తిత్వం భర్త మాట జవదాటని మనస్తత్వం మనకు కనిపిస్తాయి. పెద్దలపట్ల గౌరవం పిల్లల పట్ల ఆదరణ భావంతో ఉండడం మనం చూడవచ్చు. అటు వంటి సీత ఔన్నత్యం గూర్చి ఎంత చెప్పినా ఇంకా చెప్ప డానికి ఉంటుందనే విషయం మనంగ్రహించాలి .

రామాయణ భారత భాగవతాది గ్రంథాలు స్త్రీలోని ఉత్తమ గుణాన్ని కీర్తిస్తూ స్త్రీని గౌరవించాలని పేర్కొంటూ కట్టుబానిసలుగా తయారు చేశాయి. "పురాణ సాహిత్య మంతా స్త్రీలు ఇష్టపూర్వకంగా బానిసత్వాన్ని వరించే పద్ధతిని బాధించింది. పాతివ్రత్యానికి, పవిత్రతకం, స్వామి భక్తికి, నాటి స్త్రీ ప్రతీక అయింది మంచి భార్య అయితేనే ఆమెను ఉత్తమజాతి స్త్రీయని పొగిడేవారు. నల-దమయంతులు, సీతా రాములు, సావిత్రీ సత్యవంతుల కథల్లో స్త్రీ, భర్త యెడల విధేయతతో ప్రవర్తించాలని, త్యాగం చేయాలని నాటి సాహిత్యం నిర్దేశించింది. నాటి నుంచి దమయంతి, సావిత్ర, సుమతి, అహల్య, ద్రౌపదు లను ఆదర్శ మహిళలుగా పొగుడుతున్నారు పవిత పతివ్రతగా మాత్రమే ఆనాటి స్త్రీకి వ్యక్తిత్వముండేది. అగ్నిలో దూకమంటే దూకింది.. సీత. భర్తచే అమ్ముడు పోయింది చంద్రమతి. రేణుకాదేవి, భర్త అజ్ఞాపిస్తే

కొడుకుచే చంపబడింది. సుమతి. భర్తను వేశ్య వద్దకు మోసుకెళ్ళింది. పంచ భర్తృక అయింది పాంచాలి.

పాంచాలి, గాంధారి భడ్డ కొరకు గ్రుడ్డిగా జీవించింది. భర్త కామం కోసం శర్మిష్ట కన్యగా జీవితాంతం బ్రతికింది. సతిగా నాటి స్త్రీ. సహగమనం చేసింది. ఇలా వందలవేల సంఖ్యలో పతివ్రతలుగా పేరుపొందిన ఆదర్శ మహిళలు వున్నారు. అసలు స్త్రీకి పతిసేవ తప్ప ఏ కోరికా ఉండ రాదనేది పవిత్ర ధర్మమైంది. భర్త సమ్మతితో కుంతి ఇతరులకు సంతానం కనడం కూడా స్త్రీకి పతివ్రతా ధర్మమే అయినా కన్యకు పుట్టిన కర్ణుణ్ణి గంగపాలు చేయ్యటం కూడా పవిత్రమేనని పొగిడారు. ధర్మశాస్త్రాల సారస్వతం పురాణాల సాహిత్యమంతాస్త్రీని పుట్టుబానిసగా బ్రతకాలని సృష్టించాయి.

ప్రాచీనాంధ్ర కావ్య సాహిత్యంలో స్త్రీ పతివ్రతగా శీలవతిగా, గుణవతిగా చిత్రీకరించబడింది. ఇంచుమించు ప్రాచీనాంధ్ర సాహిత్యం అంతా పురాణే తిహాసాలకు అనువాదాలు అనుకరణ కాబట్టి స్త్రీ చిత్రీకరణ విషయంలో పెద్దగా మార్పులు చోటు చేసుకోలేదు.

"నాసళ్లమీద - పురుష చేతి రాతల గుర్తులు
ఏ ఎరైజర్లు రిమూవర్లు తుడవలేని
తరతరాల శాసనాలు
ఒక నువ్వు వినా ఇంకెవ్వరూ తుడవలేరు
మళ్ళా మనమే,
మన చరిత్రను తిరగరాద్దాం! "

వంద సంవత్సరాల కింద గురజాడ పలికిన "ఆధునిక మహిళలు భారతదేశ చరిత్రను తిరగరాస్తారు" అన్న మాటలు ఈనాడు స్త్రీ వాద రచయిత్రులు నిజం చేస్తున్నారు. "చరిత్రను "తిరిగిరాద్దాం" అని స్త్రీలు అనుకుంటున్నారు. ఈ పరిణామం హర్షించదగ్గది. ఆహ్వానించ దగ్గది.

పురాణ సాహిత్యమంతా స్త్రీలు ఇష్టపూర్వకంగా బానిసత్వా న్ని వరించే పద్ధతిని బోధించింది. పాతి వ్రత్యానికి, పవిత్రతకు స్వామిభక్తికీ, నాటి స్త్రీ ప్రతిక అయింది. మంచి భార్య అయితేనే= ఆమెను ఉత్తమజాతి స్త్రీయని పొగిడేవారు. ప్రాచీనాంధ్ర కావ్య సాహిత్యంలో స్త్రీ పతివ్రతగా శీలవతిగా, గుణవతిగా చిత్రీకరం చబడింది ఇంచుమించు ప్రాచీనాంధ్ర సాహిత్యం అంతా పురాణ ఇతిహాసాలకు అనువాదాలు, అనుకరణ కాబట్టి స్త్రీ చిత్రీకరణ విషయంలో పెద్దగా మార్పులు చోటు చేసు కోలేదు.

సాహిత్యంలో గురజాడవారి స్త్రీకి మహోన్నతమైన స్థానముంది. వీరు నృష్టించిన స్త్రీలందరూ ప్రేమ మూర్తులు, ఆదర్శమూర్తులు, సజీవమూర్తులు, సౌజన్య మూర్తులు, సచ్ఛీలలు, సంస్కారవంతులు, డబ్బుకు లోబడి తల్లిదండ్రులు తమ కుమార్తెల్ని ముసలివాళ్ళకు బలవంతంగా అంటగడితే జరిగే విపరీత పరిణామాలకు "పూర్ణమ్మకథ" నిదర్శనం, అధికార గర్వంతో స్త్రీని బలాత్కారంగా పొందదలిస్తే దాని ఫలితం ఎలా వుంటుందో తెలియజేశారు. "కన్యక "లో "మాతంగకన్య' ఆదర్శ దాంపత్యానికి మారుపేరు. "మధురవాణి " విచక్షణాజ్ఞాన సంపన్నురాలు . స్త్రీ నేటి సమాజం లోని వాస్తవాలకు నిలువుటద్దం అనడంలో ఎంతమాత్రం సందేహం లేదు.

స్త్రీ హృదయపు లోతుల్ని మానసిక క్షోభను వారి అంత రంగిక ఆవేదనను క్షుణ్ణశిగా పరిశీలించారు చలంగారు. స్త్రీ కూడా మనిషే అని ఆమెకు కూడా రంగు, రుచి, వాసన కావలసి వుంటుందని గుర్తించాలని అంటూ స్త్రీకి శరీరముంది దానికి వ్యాయామం ఇవ్వాలి ఆమెకు మెదడు వుంది. దానికి అనుభవం ఇవ్వాలి" అని చలంగారు అంటారు స్త్రీని వంటింటి కుందేలు చేసి ఓహో భారతనారి! నీవు పతివ్రతవు. నీవు సాధనమూర్తివి అని కీర్తించి వెనుక గోతులు త్రవ్వలేదు వీరు మనసా వాచా కర్మణా స్త్రీ వికాసాన్ని కోరుకున్నారాయనా.

తెలుగు సాహిత్యం భారతీయ సాంస్కృతిక సంపదలో ఒక ముఖ్యమైన భాగంగా నిలిచింది. ఈ సాహిత్యంలో కాలక్రమేనా వివిధ భావ ధోరణులు ఆలోచనా విధానాలు అభివృద్ధి చెందాయి. వాటిలో మహిళా చైతన్యం ఒక ప్రముఖ అంశంగా గుర్తించ బడింది ప్రారంభ కాలంలో సాహిత్యం ప్రధానంగా పురుషుల ఆధీనంలో ఉండడం వల్ల స్త్రీల భావాలు, అనుభవాలు, అభిప్రాయాలు పెద్దగా

ప్రతిఫలించలేదు అయితే మధ్యయుగ కాలానికి మహిళా రచయిత్రులు సాహిత్యంలోకి ప్రవేశించి తమ స్వరాన్ని వినిపించడం ప్రారంభించారు.

ఈ నేపథ్యంలో మొల్ల అనే కవయిత్రి తన ప్రత్యేకమైన దృష్టితో "మొల్ల రామాయణం" అనేగ్రంథాన్ని రచించింది ఈ గ్రంథంలో సీత పాత్రను ఆమె చిత్రించిన విధానం మహిళా చైతన్యానికి ఒక ప్రతీకగా నిలుస్తుంది సీతను కేవలం ఒక ఆదర్శ పతివ్రతగా మాత్రమే కాకుండా భావోద్వేగాలు కలిగిన ఆత్మగౌరవం కలిగిన ధైర్యవంతు రాలైన స్త్రీగా చూపించడం ఈ రచన యొక్క ప్రధాన ప్రత్యేకత.

మహిళా చైతన్యం అనేది స్త్రీ తన ఆస్తిత్వాన్ని తన భావాలను, తన హక్కులను గుర్తించుకుని వాటిని వ్యక్తం చేయడం. ఇది కేవలం స్త్రీల సమస్యలను ప్రస్తావించడం మాత్రమే కాదు, స్త్రీని ఒక స్వతంత్ర వ్యక్తిగా, ఆలో చించే శక్తి ఉన్న వ్యక్తిగా, నిర్ణయాలు తీసుకునే సామర్థ్యం ఉన్నవ్యక్తిగా గుర్తించడం కూడా ఇందులో భాగమే మొల్ల తన మానసిక స్థితిని, స్త్రీ గౌరవాన్ని ప్రాముఖ్యతను, చైతన్యాన్ని బలపరిచారు స్త్రీలు కేవలం కుటుంబంలోనే కాకుండా సమాజంలో కూడా తమస్థానం గౌరవం పొంద గలరని భావన వ్యక్తమవుతుంది మొల్ల తెలుగు సాహిత్యంలో ఒక ప్రత్యేకస్థానాన్ని పొందిన కవయిత్రి . సామాన్య కుటుంబానికి చెందినది ముఖ్యంగా కుమ్మరి కులానికి చెందినదిగా చరిత్ర చెబుతుంది ఆమె కాలంలో సాహిత్యం ప్రధానంగా సంస్కృతప్రభావంతో క్లిష్టమైన భాషలో ఉండేది. అయితే మొల్ల తన రచనను సులభ మైన తెలుగులో, అందరికి అర్థమయ్యే విధంగా రాసింది. ఇది ఆమెను ప్రజాకవయిత్రిగా నిలబెట్టింది. ఆమె తన ప్రతిభపై విశ్వాసం కలిగి ఉండడం.

తన రచనను స్వతంత్రంగా వ్యక్తం చేయడం మహిళా చైతన్యానికి ఒక స్పష్టమైన ఉదాహరణగా చెప్పవచ్చు.

మొల్ల రామాయణం తన భాషశైలి, భావవ్యక్తీకరూలో ప్రత్యేకతను కలిగి ఉంది. ఈగ్రంధంలో ఉపయోగించిన భాష చాలా సులభంగా, సహజంగా సరళంగా ఉంటుంది. సంస్కృత పదాల కంటే తెలుగు దేశ పదాలకు ఎక్కువ ప్రాధాన్యం ఇచ్చింది ఇది సామాన్య ప్రజలకు సైతం సరళంగా అర్థమేయ్యేలా చేసింది. అలంకారాలకంటే బావానికి ఎక్కువ ప్రాముఖ్యత ఇచ్చింది. సీత వంటి పాత్రల భావోద్వేగాలను ఆమె ఎంతో హృదయ వృద్ధి గా చిత్రించింది. ఈవిధంగా మొల్ల రామాయణం కేవలం ఒక కావ్యం మాత్ర మే కాకుండా ప్రజలకు దగ్గరైన సాహిత్య రూపంగా కూడా నిలిచింది.

మొల్ల రామాయణంలో సీతపాత్ర అత్యంత ప్రాముఖ్యత! కలిగినది. సీతను కేవలం ఒక విధేయమైన భార్యగా కాకుండా స్వతంత్రభావాలు కలిగిన వ్యక్తిగా చూపించింది. అరణ్యవాసానికి రాముడితో పాటు వెళ్ళడం సీత మొక్క స్వచ్ఛంద నిర్ణయం. ఇది ఆమె స్వతంత్ర ఆలోచనను తెలియజేస్తుంది. అలాగే లంకలో బంధింప బడ్డ సమయంలో ఆమె చూపిన ధైర్యం, సహనం, ఆత్మగౌరవం ఎంతో గొప్పవి . రామణుడి ఒత్తిడికి లోను కాకుండా, తన గౌరవాన్ని కాపాడుకోవడం ఆమె వ్యక్తిత్వాన్ని ప్రతిబింబిస్తుంది. ఈ విధంగా సీత ఒక బలమైన, దైర్యవంతురాలైన స్త్రీగా కనిపిస్తుంది.లంకలో ఉన్నప్పుడు రావణుడు ఆమెను తనవైపు తిప్పుకు నేందుకు అనేక ప్రయత్నాలు చేసినా సీత తన ధర్మాన్ని తన విలువలను ఎప్పుడూ విడిచిపెట్టలేదు. ఆమె తన గౌరవాన్ని కాపాడు కోవడంలో ఎలాంటి రాజీ పడలేదు. ఇది మహిళా చైతన్యంలో అత్యంత ముఖ్యమైన అంశం.

అంతేకాకుండా, ఒంటరిగా ఉన్న పరిస్థితుల్లో కూడా ఆమె చూపిన ధైర్యం, మానసి కబలం ఎంతో గొప్పది. ఇదిస్త్రీలలో ఉన్న అంతర్గత శక్తిని ప్రతి -బింబిస్తుంది.

మొల్ల సీతను ఒక దేవతగా కాకుండా ఒక సాధారణ స్త్రీగా చిత్రించింది. ఆమె బాధపడుతుంది ప్రేమిస్తుంది ఆశపడుతుంది. నిరాశ చెందుతుంది. ఈ విధంగా సీత పాత్రలో మాన వీయత స్పష్టంగా కనిపిస్తుంది. ఈ భావోద్వే గాలు, సీతను పాఠకులకు దగ్గర చేస్తాయి. ఇది మొల్లి రచనలోని గొప్పతనం.

సీత పాత్రలో కనిపించే ఈ సహజత్వం ఆమెను మరింత ప్రాముఖ్యంగా నిలబెడుతుంది.మొల్ల రచనలో మహిళా చైతన్యం, బలహీనంగా చూపకుశీడా, బలమైన

వ్యక్తులుగా చూపింది. మొల్ల రామాయణం అనేక మంది మంచి లక్షణాలను కలిగి ఉన్నప్పటికి కొన్ని పరిమితులుకూడా ఉన్నాయి. కొన్ని సందర్భాల్లో సంప్రదాయ ధర్మ భావనల ప్రభావం కనిపిస్తుంది. అయినప్పటికి, తన కాలానికి అనుగుణంగా చూస్తే మొల్ల రచన చాలా ముందున్నదిగా చెప్పవచ్చు. ఆమె సాహిత్యంలో మహిళా చైతన్యాన్ని ప్రవేశపెట్టడం ఒక గొప్పకృషి మొల్ల రామాయణం తెలుగు సాహిత్యంలో ఒక అపూర్వమైన స్థానం కలిగి ఉంది. ఈ గ్రంధంలో సీత పాత్రను మొల్ల ఎంతో సమర్థవంతంగా చిత్రించింది.

సీతను కేవలం ఒక పతివ్రతగా కాకుండా ఆత్మగౌరవం కలిగిన ధైర్యవంతురా లైన, భావోద్వేగాలతో నిండిన స్త్రీగా చూపించడం ద్వారా మహిళా చైతన్యాన్ని బలపరిచింది.

అందువల్ల మొల్ల రామాయణం కేవలం ఒక సాహిత్య కృతి మాత్రమే కాకుండా, స్త్రీల గౌరవాన్ని ప్రతిపాదించే ఒక గొప్ప రచనగా నిలిచింది.

మొల్ల రామాయణంలో సీత పాత్రను గమనిస్తే, ఆమె ఎక్కడా గట్టిగా తిరుగుబాటు చేయదు, కానీ ప్రతి సందర్భంలో తన ఆత్మగౌరవాన్ని వదులుకోదు. రావణుడు ఎంత ఒత్తిడి చేసినా, సీత అతని మాటలను వినదు; అతని వైపు చూడకుండా ఉండటం ద్వారా కూడా ఆమె ఒక విధమైన ప్రతిఘటనను చూపిస్తుంది. ఈ నిశ్శబ్ద ప్రతిఘటన సీత పాత్రకు అత్యంత తగిన ఔచిత్యంగా కనిపిస్తుంది, ఎందుకంటే ఆ కాలంలోని స్త్రీల పరిస్థితుల్లో ప్రత్యక్ష తిరుగుబాటు కంటే, విలువలను కాపాడుకోవడం గొప్పదిగా భావించబడింది.

ముగింపు :

మొల్ల రామాయణంలో సీతా పాత్ర ఔచిత్యం అనేది కేవలం ఒక ఆదర్శ పతివ్రత పాత్రగా మాత్రమే పరిమితం కాదు. మొల్ల తన సీతను ఒక సజీవమైన, ఆలోచించే, భావోద్వేగాలు కలిగిన, ఆత్మగౌరవం ఉన్న స్త్రీగా చిత్రించింది. అంతేకాకుండా, మొల్ల సీతను దేవతగా కాకుండా మానవురాలిగా చూపించడం ద్వారా స్త్రీల నిజమైన అనుభవాలను, భావాలను ప్రతిబింబించింది. ఈ విధంగా సీత పాత్రలో కనిపించే నిశ్శబ్ద ప్రతిఘటన, ఆత్మగౌరవం, మానసిక బలం వంటి లక్షణాలు మహిళా చైతన్యానికి మూలస్వరూపంగా నిలుస్తాయి. అందువల్ల మొల్ల రామాయణం సీతా పాత్ర ఔచిత్యం అనేది సాహిత్య పరంగా మాత్రమే కాకుండా, సామాజిక పరంగా కూడా స్త్రీ గౌరవాన్ని ప్రతిష్ఠించిన ఒక గొప్ప ఉదాహరణగా నిలుస్తుంది.

ఆధారత గ్రంథాలు :

1. తెలుగు సాహిత్య చరిత్ర - ప్రొఫెసర్ వెలమల సిమ్మన్న
2. తెలుగు సాహిత్య విమర్శసిద్ధాంతాలు - ప్రొఫెసర్ వెలమల సిమ్మన్న
3. తెలుగు సాహిత్య సమీక్ష రెండవ సంపుటము - డాక్టర్ జి నాగయ్య

★★★

Vol. 23 | Spl. Issue 03 | March 2026 | BHAVAVEENA | ISSN No. : 2456-4702 | RNI No. APTEL/2003/12253

RNI No. APTEL/2003/12253 | Reffered Journal & Peer Reviewed Journals | ISSN No. 2456-4702

భావవీణ

కళలు, సాహిత్య, సాంస్కృతిక భాషాధ్యయన పత్రిక

BHAVA VEENA

Journal of Arts, Literary, Culture & Language Study

మొల్ల రామాయణంలో స్త్రీ పాత్రలు - చైతన్యం

- డా॥. పులవర్తి పైడిరాజు

తెలుగు ఉపన్యాసకులు, ప్రభుత్వ డిగ్రీ కళాశాల, వి.మాడుగుల, అనకాపల్లి జిల్లా.

వ్యాస సంగ్రహం :

16వ శతాబ్దానికి చెందిన కవయిత్రి ఆతుకూరి మొల్ల రచించిన మొల్ల రామాయణం అత్యంత సరళమైన, రసవత్తరమైన, జనాదరణ పొందిన తెలుగు కావ్యం. ఇది అచ్చతెలుగు పదాలతో, క్లిష్టమైన అలంకారాలు లేకుండా సామాన్యులకు సైతం అర్థమయ్యేలా కందపద్య శైలిలో సాగుతుంది. ఈమె రామభక్తితో, ఎటువంటి రాజపోషణ లేకపోయినా, అతి తక్కువ సమయంలోనే అద్భుతమైన కావ్యాన్ని అందించారు. ముఖ్యంగా మొల్ల రామాయణం గొప్పతనం గమనిస్తే, సరళమైన శైలిలో రాయబడిన రామాయణం. మొల్ల రామాయణంలో కఠినమైన సంస్కృత పదాలు కాకుండా, తేటతెలుగు మాటలు ఎక్కువగా ఉంటాయి. 'తేనె సోక నోరు తియ్యన యగురీతి'గా ఆమె కవిత్వం సాగుతుంది. ఈ కావ్యంలో కంద పద్యాలు ఎక్కువగా ఉండటం వల్ల దీనిని 'కంద రామాయణం' అని కూడా పిలుస్తారు.మానవీయ విలువలకు ప్రాధాన్య మిస్తూ రాయబడినది. రాముడిని దేవుడిలా కాకుండా, మానవీయ కోణంలో, ఆదర్శ మూర్తిగా మొల్ల చిత్రించారు. అంతేకాదు, ఎవరి ఆశ్రయం లేకుండా, కేవలం శ్రీకంఠ మల్లేశుని వరంతో, తన రామభక్తితో ఈ కావ్యాన్ని ఆమె రచించారు. శతాబ్దిలోనే, కుమ్మరి కులానికి చెందిన ఒక స్త్రీ ఇంతటి గొప్ప కావ్యాన్ని రచించడం, అప్పటి సాహితీ వేత్తలనే మెప్పించడం ఆమె ప్రతిభకు నిదర్శనం. ఈమె తన కావ్యంలో చాలా నిజాయితీగా, 'తనకు ఛందస్సు, అలంకారాలు పెద్దగా తెలియవని, కేవలం భక్తితోనే రాశానని' చెప్పుకున్నారు. మొల్ల రామాయణం తెలుగు సాహిత్యంలో 'మల్లెపూల సౌరభం' లాంటిది, ఇది పాఠకులకు రామభక్తిని మరియు తెలుగు భాషా మాధుర్యాన్ని ఒకేసారి అందిస్తుంది. ఇలాంటి రామాయణంలో స్త్రీ పాత్రల ద్వారా మొల్ల అందించిన చైతన్యం చాలా గొప్పది. అంతకంటే ముందు, కవయిత్రి మొల్ల చైతన్యం కలిగిన కవయిత్రి. కాబట్టే తన రామాయణంలో స్త్రీ పాత్రలకు పెద్ద పీట వేయడమే కాకుండా, ఆ పాత్రల ద్వారా చైతన్యం కలిగించడం, ఆ పాత్రలే చైతన్యం కలిగి ఉండేలా చేయడం చాలా ఆదర్శవంతమైనదిగా చెప్పుకోవచ్చు. అలాంటి స్త్రీ చైతన్యాన్ని పరిశీలించడమే ఈ వ్యాసముఖ్యోద్దేశ్యం.

కీలక పదాలు :

రామాయణం, మధురభక్తి, గోపవరం, శ్రీకంఠమల్లేశుడు, వాఙ్మయం, చైతన్యం, మండోదరి, అశోకవనం, గడ్డిపరక, మధుర భక్షణ, ధీరవనిత, కారుణ్యం, సత్పురుషులు, ఆత్మాభిమానం, సహానుభూతి, ప్రతీకలు, అక్షకుమారుడు, రాజనీతిజ్ఞ మొదలైనవి.

ఉపోద్ఘాతం :

సీ. సరయూ నదీ తీర సతత సన్మంగళ
ప్రాభవోన్నత మహావైభవమ్ము,
కనక గోపుర హర్మ్య ఘన కవాటోజ్జ్వల
త్ప్రాకార గోపుర శ్రీకరమ్ము,
గజ వాజి రథ భట గణీకాతపత్ర చా
మర కేతు తోరణ మండితమ్ము,
ధరణీ వధూటి కాభరణ విభ్రమ రేఖ
దరిసించు మాణిక్య దర్పణమ్ము

తే. భాను కుల దీప రాజన్య పట్టభద్ర
భాసి నవరత్న ఖచిత సింహాసనమ్ము
నాగ నుతి కెక్కు మహిమ ననారతమ్ము,
ధర్మ నిలయమ్ము, మహి నయోధ్యాపురమ్ము"
(మొల్ల రామాయణం, బా.కాండ, పుట-13)

పై విధంగా మొల్ల తన రామాయణాన్ని అయోధ్యనగర వర్ణనతో ఆరంభించింది. నగర వర్ణనతో ప్రారంభించింది కాబట్టి ఆమె ప్రబంధయుగానికి చెందిన వ్యక్తి అని ఆధునిక విమర్శకుల అభిప్రాయం. కానీ భాస్కరుడు, తిక్కన కూడా నగర వర్ణనలతోనే కావ్యారంభం చేశారు. కాబట్టి ఒక్క నగర వర్ణనను పట్టుకొని ఆమె 16వ శతాబ్దం నాటి కవయిత్రి అనడం కన్నా, పోతన లాగానే రామభక్తు రాలైన ఆమె 15వ శతాబ్దం ఆరంభంలో ఉన్నదని చెప్పడమే సరైన వాదం. మొల్ల చాలా వినయవంతురాలు. ఆత్మవిశ్వాసం కలది. 'ఛందో విలక్షణములు కావ్య సంపద ప్రక్రియలు, నిఘంటువుల క్రమాలు' ఏవీ తను చదువుకోలేదని గోపవరంలోని శ్రీకంఠమల్లేశుని వరం చేత కవిత్వం చెప్పగలిగానని మొల్ల అంటుంది. ఇక్కడ కూడా ఆమె మొదట శైవురాలే అనే విషయం తెలుస్తుంది. మొల్ల పెద్దగా చదువుకోలేదని రామభక్తి చేత ప్రేరణను పొంది రామాయణాన్ని తన సహజ కవితా ప్రతిభతో రచించిందని చెప్పవచ్చు.

'మొల్ల రామాయణం' సంగ్రహంగా కథ చెప్పడమే ప్రధానంగా నడిచింది. పద్యాలు ప్రసన్న మధురంగా ఉన్నాయి. సీత హనుమంతునితో శ్రీరామునికి పంపే సందేశ ఘట్టం హృదయాలను కదిలించే విధంగా ఉంది. అక్కడక్కడ ప్రబంధ వర్ణనలు ఉన్నాయి. ఆ వర్ణనలు సరళ సులభమైన శైలిలో నడిచాయి. మొల్ల 'చంపూ మార్గం'లో తన రామాయణాన్ని స్త్రీ సహజమైన మృదుమధుర శైలిలో రచించింది. అందుకే కావచ్చును ఎంతో మంది రాసిన రామాయణాలు కాలం కాలిదెబ్బ లకు నశించినా 'మొల్ల రామాయణం' మాత్రం ఈనాటికీ నిలిచి ఉంది.

మొల్ల పరిచయం :

ఆతుకూరి మొల్ల, (1440-1530) 16వ శతాబ్దపు తెలుగు కవయిత్రి. ఈమె కుమ్మరి కుటుంబంలో జన్మించింది. మొల్ల శ్రీ కృష్ణదేవరాయలు సమయం (16వ శతాబ్దం) లోనివారని ప్రశస్తి. మొల్ల స్వస్థలం కడప జిల్లా, గోపవరం మండలం, గోపవరం గ్రామం. ఈ గ్రామం కడప పట్టణానికి 56 కి.మీ దూరంలో, బద్వేలుకు 5 కిలోమీటర్ల దూరంలో ఉంది. ఈమె ఈ ప్రాంతానికి చెందినదని మొల్ల రామాయణంలోని ఈ క్రింది పద్యం ద్వారా తెలుస్తుంది.

"గావ్య సంపద క్రియలు నిఘంటువులును
గ్రామం లేవియు నెఱుగ, విఖ్యాత గోప
వరపు శ్రీకంఠమల్లేశు వరముచేత
నెఱిఁ గవిత్వంబుఁ జెప్పఁగా నేర్చుదాన"
(మొల్ల రామాయణం,పీఠిక, పుట-10)

మొల్ల జీవించిన కాలం గురించి పరిశోధకులలో భిన్నాభిప్రాయాలున్నాయి. 'సన్నుత సుజ్ఞాన సవివేకి వాల్మీకి' దగ్గరనుండి 'తిక్కకవిరాజు భోజు' వరకూ మొల్ల నుతించింది. శ్రీకృష్ణదేవరాయల అష్టానకవులలో ఒకరిని కూడా తనపద్యంలో ఆమె పేర్కొనని కారణంగా ఆమె రాయలవారి సమయానికే కవయిత్రి అయి ఉండేది అని భావిస్తున్నారు. జనసామాన్యంలో ప్రచారంలో ఉన్న కథలు మొల్ల, తెనాలి రామలింగడు సమకాలీకులని వెల్లడిస్తు న్నాయి. 16వ శతాబ్దికి చెందిన ఏకామ్రనాథుడనే చరిత్ర కారుడు తన ప్రతాపరుద్రచరిత్రలో మొల్లను పేర్కొన్నాడు. అందులో పేర్కొన్న సాంఘిక పరిస్థితులను బట్టి మొల్ల సుమారుగా సా.శ. 1581 కి ముందుగా జీవించి ఉండే దనిపిస్తున్నది. ఆమె తిక్కన సోమయాజికీ, భాస్కరునికీ, ప్రతాపరుద్రునికీ సమకాలీనురాలు కావచ్చును కూడాను.

ఈమె కులావంశ సంజాత. ఇంటి పేరు ఆతుకూరివారు. కులాన్నిబట్టి కుమ్మరి మొల్ల అని వ్యవహరించబడుచున్నది. ఈమె జనకుడు కేసనశెట్టి. గ్రంథావతారికలో ఆదికవి స్తుతియందు శ్రీనాథుడిని స్మరించియుండుటచే ఈమె శ్రీనాథుని తరువాత కాలమున ఉండెడిదని తెలియుచున్నది. చరిత్ర పరిశోధకులు 1525నం. ప్రాంతమని నిర్ణయించారు. ఈమె ఆజన్మబ్రహ్మచారిణి అని చెప్పుంటారు.

వాఙ్మయ మూలాల ఆధారంగా మొల్ల స్వంతంత్ర భావాలు కలిగి ఉండేదని, చిన్న తనంలోనే తల్లిని కోల్పోగా తండ్రి కేసన శెట్టి ఈమెను గారాబంగా పెంచెనని తెలుస్తుంది. ఈమెకు తండ్రి అంటే అమిత ఇష్టం. చివరి దాకా తండ్రి ఇంటి పేరునే ఉపయోగించడం మూలాన మొల్ల పెళ్ళి చేసుకోలేదని అనుకోవచ్చు. భాస్కరుని రామాయణం వలె ఇది వాల్మీకి రామాయణానికి అనువాదం కాదు. ఆమె స్వతంత్రంగా రచించిన కావ్యం. పోతన వలెనే మొల్ల కూడా ఏకశిలానగర వాసి. ఏకాంబ్ర నాథుడు తన 'ప్రతాపరుద్ర చరిత్ర'లో మొల్ల రెండవ ప్రతాపరుద్రుని కాలంలో ఉన్నట్లుగా, వచనంలో రామాయణాన్ని రచించి ప్రతాపరుద్రునికి అంకితం ఇవ్వబోతే ఒక నిమ్న సమూహాన్నుంచి స్త్రీ రాసిన కావ్యాన్ని అంకితంగా తీసుకోవద్దని ఆస్థానంలో పండితులు అడ్డగించారని తెలిపాడు. కానీ చారిత్రకంగా చూస్తే మొల్ల పోతనకు సమకాలికురాలిగా కంటే సర్వజ్ఞసింగ భూపాలునికి సమకాలికంగా కనిపిస్తుంది.

మొల్ల ఆత్మగౌరవం :

మొల్ల తన కావ్యం ఆరంభంలోనే తన భాషా చైతన్యాన్ని చాటుకున్నారు. కవిత్వం అనేది గూఢ శబ్దాలతో ఉంటే అది 'మూగ చెవిటిలోని ముచ్చట' అవుతుందని, వినగానే అర్థమయ్యేలా ఉండాలని ఆమె గట్టిగా నమ్మారు. పాండిత్యం కంటే భక్తి, సరళత ముఖ్యమని భావించి, అప్పటి సామాజిక కట్టుబాట్లను దాటి రామాయణాన్ని రచించడం ఆమెలోని సాంఘిక చైతన్యానికి నిదర్శనం. రావణుడు సీతను అపహరించి అశోకవనంలో ప్రలోభ పెట్టాలని చూసినప్పుడు, మొల్ల సీత పాత్రను చాలా ధీరత్వంతో చిత్రించారు. సీత రావణునితో మాట్లాడుతూ.. రాముడు సూర్యుని వంటివాడని, రావణుడు కేవలం మిణుగురు పురుగు వంటివాడని అత్యంత నిర్భయంగా ఎద్దేవా చేస్తుంది,. రఘురాముడు శత్రు సంహారకుడని, రావణుని మదమణచే శక్తి ఆయనకు ఉందని హెచ్చరించడం ఆమెలోని ఆత్మవిశ్వాసాన్ని తెలుపుతుంది. రావణుని భార్య మండోదరి కేవలం అంతఃపుర స్త్రీగా కాకుండా, భర్తకు హితవు చెప్పే మేధావిగా కనిపిస్తుంది. సీతను అపహరించడం తగదని, రాముడు సామాన్య మానవుడు కాదని ఆమె రావణుని హెచ్చరిస్తుంది. సీతను రామునికి అప్పగించి లంకను రక్షించుకోమని ఆమె చెప్పే మాటలు ఆమెలోని రాజనీతిజ్ఞతను, విజ్ఞతను చాటుతాయి. రాక్షస రాజ్యంలో ఉన్నప్పటికీ, సీత పట్ల త్రిజట చూపిన అనురాగం, ఆమెకు వచ్చిన కల ద్వారా సీతకు ధైర్యాన్ని చెప్పడం విశేషం. రాముని విజయం ఖాయమని ఆమె సీతను ఊరడించడం ద్వారా స్త్రీల మధ్య ఉండే సహానుభూతిని మొల్ల ఇక్కడ ఆవిష్కరించారు. భక్తి మార్గంలో స్త్రీలు పొందే ఉన్నత స్థితికి శబరి, అహల్య పాత్రలు ప్రతీకలు. రాముని పాదధూళి సోకగానే అహల్యకు శాపవిమోచనం కలగడం, శబరి తన భక్తితో రాముని అనుగ్రహాన్ని పొందడం వంటి ఘట్టాలు స్త్రీల ఆధ్యాత్మిక చైతన్యాన్ని తెలియజేస్తాయి,.

మొత్తానికి మొల్ల రామాయణంలో స్త్రీలు కేవలం మూగ సాక్షులుగా కాకుండా, సందర్భాన్ని బట్టి స్పందించే ఆత్మాభిమానం, విజ్ఞత మరియు ధైర్యం గల పాత్రలుగా తీర్చిదిద్దబడ్డారు.

మొల్ల రామాయణం - మండోదరి హితబోధ :

మొల్ల రామాయణంలో మండోదరి పాత్ర అత్యంత వివేకవంతమైనదిగా, తన భర్త క్షేమాన్ని కోరే హితైషిగా చిత్రించబడింది. రావణుడు సీతను అపహరించి తెచ్చిన తర్వాత, రాబోయే విపత్తును గ్రహించిన మండోదరి ఆయనకు చేసిన హితబోధలోని ప్రతీది ముఖ్యాంశమే. అవి-

రాముని దైవత్వాన్ని గుర్తించడం :

మండోదరి రావణునితో మాట్లాడుతూ, రామ

చంద్రుడు సామాన్య మానవుడు కాదని, ఆయన పరమ నారాయణుడని గుర్తిస్తుంది. ఆయన మహిమను దేవతలు, మునిగణములు కూడా కీర్తిస్తారని ఆమె రావణునికి వివరిస్తుంది.

యుద్ధం వల్ల కలిగే వినాశనం :

రామునితో యుద్ధం చేయడం వల్ల ఎటువంటి ఐశ్వర్యం లేదా విజయం లభించదని, అది కేవలం అపకీర్తికి మరియు సర్వనాశనానికి దారితీస్తుందని ఆమె హెచ్చరిస్తుంది.

హనుమంతుని ఉదాహరణగా చూపడం :

రాముని పంపిన ఒక దూత (హనుమంతుడు) లంకలోకి ప్రవేశించి అంతటి విధ్వంసం సృష్టించ గలిగాడంటే, స్వయంగా ఆ రాముని శక్తి ఎంతటిదో ఊహించమని ఆమె రావణునికి హితవు చెబుతుంది.

రాక్షస వంశ రక్షణ :

తన భర్త చేసే అధర్మం వల్ల కేవలం ఆయనకే కాకుండా, మొత్తం రాక్షస వంశానికే ముప్పు పొంచి ఉందని ఆమె ఆందోళన వ్యక్తం చేస్తుంది.

మండోదరి హితబోధలో ఆమెలోని రాజనీతిజ్ఞత, ధర్మ నిరతి మరియు భవిష్యత్తును ఊహించగల విజ్ఞత స్పష్టంగా కనిపిస్తాయి. ఆమె రావణుని అహంకారాన్ని వీడి, రామునితో సంధి చేసుకోవాలని మరియు సీతను తిరిగి అప్పగించాలని కోరుకోవడంలోనే ఆమెలో ఉన్న చైతన్యం ఎలాంటిదో అర్థం చేసుకోవచ్చు.

మొల్ల రామాయణం - శబరి భక్తి చైతన్యం:

మొల్ల రామాయణంలో శబరి భక్తి అత్యంత ఉదాత్తమైనదిగా, మధురమైనదిగా చిత్రించబడింది. శబరి వృత్తాంతం ద్వారా భక్తి యొక్క చైతన్యాన్ని మొల్ల అద్భుతంగా ఆవిష్కరించారు.

అచంచలమైన నిరీక్షణ :

సీతాదేవిని వెతుకుతూ అరణ్య మార్గంలో వెళ్తున్న రామలక్ష్మణులకు శబరి ఎదురవుతుంది. ఎన్నో ఏళ్లుగా రాముని దర్శనం కోసం ఆమె చేసిన నిరీక్షణ ఆమెలోని భక్తి చైతన్యానికి నిదర్శనం.

మధుర భక్షణ - అతిథి సత్కారం :

రాముని పట్ల శబరి చూపే అనురాగం మరువలేనిది. ఆమె తన దగ్గరకు వచ్చిన రామలక్ష్మణులను భక్తితో పూజించి, వారికి అత్యంత రుచికరమైన కంద ఫల మూలములను (మధుర ఫలాలను) సమర్పిస్తుంది. ఆమె భక్తి ఎంతటిదంటే, వారు భుజించే పండ్లు తీయగా ఉండాలని స్వయంగా రుచి చూసి మరీ ఇచ్చినట్లు రామాయణ గాథల్లో కనిపిస్తుంది. దీనినే మొల్ల ''శబరి మధురభక్షణ'' అని పేర్కొన్నారు.

మార్గదర్శకత్వం :

శబరి కేవలం ఒక భక్తురాలిగానే కాకుండా, రాముని కార్యసిద్ధికి అవసరమైన దిశానిర్దేశం చేసిన విజ్ఞురాలిగా కనిపిస్తుంది. సీతను వెతకడానికి రాముడు పంపా సరోవరం వైపు వెళ్లి, అక్కడ ఉన్న సుగ్రీవునితో స్నేహం చేయాలని ఆమె సూచిస్తుంది.

రామునిపై శబరి మాట ప్రభావం :

రాముడు శబరి చెప్పిన మాటను (యానతిని) శిరసావహించి, ఆమె చూపిన మార్గంలోనే ముందుకు సాగుతాడు. హనుమంతుడు రాముని పరిచయం చేసుకునే సందర్భంలో కూడా శబరి చెప్పిన మాటల ప్రస్తావన వస్తుంది.

ఇనకులధీశ! సుగ్రీవుడు డనెడువాడు
కపి కుల శ్రేష్ఠ డత్యంత ఘనుడు తలప
నతనితో బొత్తు గావింపు మన్ని పనులు
జక్క నౌటకు నాత్మ నిస్సంశయంబు
(మొల్ల రామాయణం, పుట:52)

మోక్ష సాధన :

తన జీవిత కాలమంతా రాముని కోసమే వెచ్చించిన శబరి, చివరకు రాముని దర్శనంతో తన భక్తిని సార్థకం చేసుకుని మోక్షాన్ని పొందుతుంది.

మొల్ల రామాయణంలో శబరి పాత్ర నిష్కల్మషమైన భక్తికి, సహనానికి మరియు గురువాక్యంపై నమ్మకానికి ఒక గొప్ప ఉదాహరణగా నిలుస్తుంది,.

రావణుడిని ఎదిరించిన ఘట్టంలో సీతాదేవి చైతన్యం:

మొల్ల రామాయణంలో సీతాదేవి రావణుడిని ఎదిరించిన ఘట్టం అత్యంత ధైర్యంగా, ఆత్మాభిమానంతో కూడిన చైతన్యం కలిగిన పాత్రగా వర్ణించబడింది. రావణుడు అశోకవనంలో సీతను ప్రలోభపెట్టాలని, భయపెట్టాలని ప్రయత్నించినప్పుడు ఆమె స్పందించిన తీరు ఆమెలోని వాక్ చైతన్యాన్ని, పాతివ్రత్య శక్తిని చాటుతుంది.

తృణీకారం :

రావణుడు పలికిన దుష్ట మాటలను సీత ఒక గడ్డి పరకతో (తృణంబు) సమానంగా భావించి, అతడిని తృణీకరిస్తూ మాట్లాడింది.

రాముని శక్తిని చాటడం :

రావణునితో మాట్లాడుతూ, రాముని బాణాల ధాటిని ఆమె గుర్తుచేసింది. అహల్యకు శాపవిమోచనం కలిగించిన రాముని పాదధూళి మహిమను, తాటక వంటి రాక్షసిని సంహరించిన ఆయన పరాక్రమాన్ని ఆమె ప్రస్తుతించింది.

రావణుని అల్పత్వము :

రావణుని శక్తిని, లంక ఐశ్వర్యాన్ని రాముని ముందు అత్యల్పమైనవిగా ఆమె అభివర్ణించింది. "ఆ రఘు రాముడు ఎంత? లంక ఎంత? దనుజులు ఎంత? నీవు ఎంత? నీ బలమెంత?" అని ప్రశ్నిస్తూ, రాముని చేతిలో రావణుని ఓటమి తథ్యమని మరియు విజయం రామునిదేనని అత్యంత నిర్భయంగా ప్రకటించింది.

హెచ్చరిక :

పరస్త్రీలను ఆశించడం వల్ల పుణ్యం నశిస్తుందని, అటువంటి వారు ఘోరమైన నరకంలో పడతారని ఆమె రావణుడికి హితవు పలికింది.రావణుడు పలికిన దుష్ట మాటలకు సీత ఏమాత్రం చలించకుండా, తన పతి దైవమైన రాముడిని తలచుకుంటూ రావణుడిని ఇలా హెచ్చరించింది.

"పరదార రతుల గోరెడు
పురుషుల కాయువు నిశించు, పుణ్యము సెడు, స
త్పురుషుల దూషింపంగ దుది
నరకంబున బడుదు రనెడి న్యాయము వినవే?"

(మొల్ల రామాయణం-పుట:69)

పరస్త్రీలను ఆశించే పురుషుల ఆయువు, పుణ్యం నశిస్తాయని, సత్పురుషులను దూషించేవారు ఘోరమైన నరకంలో పడతారనేది నిజం కాదా అని ఆమె రావణుడిని ప్రశ్నించింది.

ఈ ఘట్టంలో మొల్ల సీతమ్మను కేవలం దుఃఖించే అబలగా కాకుండా, ఆత్మాభిమానం మరియు వాక్ చాతుర్యం కలిగిన ధీరవనితగా చిత్రించారు.

స్త్రీ శక్తిని చాటడం :

తనను ఒక అబలగా భావించి తక్కువ అంచనా వేయవద్దని, రాముని పరాక్రమం ముందు రావణుని పది తలలు కూడా గడ్డిపరకలతో సమానమని ఆమె ధీటుగా బదులిచ్చింది.

ఈ విధంగా మొల్ల తన కావ్యంలో సీత పాత్రను కేవలం విలపించే వనితగా కాకుండా, అధర్మాన్ని ఎదిరించే ధీరవనితగా, చైతన్యం కలిగిన ధీశాలిగా చిత్రించారు.

త్రిజట పాత్ర -స్త్రీల సహానుభూతి-చైతన్యం:

మొల్ల రామాయణంలో త్రిజట పాత్ర ద్వారా స్త్రీల మధ్య ఉండే సహానుభూతి, కారుణ్యం, ఆత్మీయత, చైతన్యం చాలా ఉదాత్తంగా చిత్రించబడ్డాయి. రాక్షస రాజ్యంలో, శత్రువుల మధ్య బందీగా ఉన్న సీతాదేవికి త్రిజట ఒక ఓదార్పుగా నిలిచింది.

ధైర్యాన్ని నింపడం :

రావణుడు సీతను అపహరించి అశోకవనంలో బంధించి, రాక్షస స్త్రీలను కాపలా ఉంచినప్పుడు సీత ఎంతో వేదనకు గురవుతుంది. అటువంటి క్లిష్ట సమయంలో త్రిజట తనకు వచ్చిన స్వప్న వృత్తాంతాన్ని (కల) వివరించి సీతకు ఎంతో ధైర్యాన్ని ఇచ్చింది.

రాముని విజయాన్ని ముందుగానే ఊహించడం :

తన కలలో రాముడు విజయం సాధిస్తాడని, రావణుడు పరాజయం పాలవుతాడని గ్రహించిన త్రిజట, ఆ విషయాన్ని సీతకు చెప్పి ఆమెలోని ఆశను చిగురింప జేసింది.

సహచర రాక్షస స్త్రీలను మందలించడం:

సీతను భయపెడుతున్న ఇతర రాక్షస స్త్రీలను త్రిజట

హెచ్చరించింది. ''ఈమె పరమ పతివ్రత, రాముడు ఈమెను రక్షించడానికి తప్పక వస్తాడు, కాబట్టి ఈమెను వేధించకండి, బదులుగా ఈమె శరణు కోరడం మనకు శ్రేయస్కరం'' అని చెప్పడం ద్వారా సీత పట్ల తనకున్న గౌరవాన్ని మరియు సహానుభూతిని చాటుకుంది.

మానవత్వానికి నిదర్శనం :

రాక్షస వంశంలో పుట్టినప్పటికీ, కష్టాల్లో ఉన్న మరో స్త్రీ (సీత) పట్ల త్రిజట చూపిన అనురాగం గొప్పది. సీత దుఃఖాన్ని చూసి చలించిపోయి, ఆమెకు రక్షణగా నిల బడటం ఆమెలోని స్త్రీ చైతన్యానికి మరియు ఆత్మీయతకు నిదర్శనం.

మొల్ల రామాయణంలో త్రిజట పాత్ర కేవలం ఒక రాక్షసిగా కాకుండా, కష్టాల్లో ఉన్న తోటి స్త్రీకి అండగా నిలిచే సహృదయత గల పాత్రగా, చైతన్యం కలిగిన పాత్రగా తీర్చిదిద్దబడింది.

యుద్ధకాండలో స్త్రీ పాత్రల పాత్ర :

మొల్ల రామాయణంలోని యుద్ధకాండలో స్త్రీ పాత్రలు, ముఖ్యంగా మండోదరి మరియు సీతాదేవి, కేవలం సాక్షులుగా కాకుండా కథా గమనాన్ని ప్రభావితం చేసే కీలక వ్యక్తులుగా కనిపిస్తారు. యుద్ధం వల్ల కలిగే వినాశ నాన్ని ముందుగానే పసిగట్టి హితవు చెప్పే విజ్ఞత, అపవాదులను ఎదుర్కొనే ధీరత్వం వీరి పాత్రల్లో కని పిస్తాయి.

మండోదరి విజ్ఞత, హితబోధ :

యుద్ధకాండలో మండోదరి పాత్ర అత్యంత ఉదాత్తంగా చిత్రించబడింది. రావణుడు యుద్ధానికి సిద్ధ మవుతున్న తరుణంలో ఆమె ఆయనకు హితవు చెబు తుంది. రాముడు సామాన్య మానవుడు కాదని, దేవతలు పూజించే పరమ నారాయణుడని ఆమె గుర్తిస్తుంది. రామునితో యుద్ధం చేయడం వల్ల ఐశ్వర్యం కలగదని, అది కేవలం వంశ నాశనానికి మరియు అపకీర్తికే దారి తీస్తుందని ఆమె హెచ్చరిస్తుంది. సీతను రామునికి అప్పగించి లంకను రక్షించుకోమని ఆమె వేడుకుంటుంది.

మండోదరి పరాభవం :

రావణుడు చేస్తున్న 'శత్రుంజయ హోమం' భగ్నం చేయడానికి వానరులు అంతఃపురంలోకి ప్రవేశించినప్పుడు మండోదరిని జుట్టు పట్టి బయటకు ఈడ్చుకొస్తారు. తన భర్త చేసిన అధర్మం వల్ల ఒక మహారాణికి కలిగిన ఈ అవమానం యుద్ధం తెచ్చే సామాజిక విపత్తుకు నిదర్శ నంగా మొల్ల చిత్రించారు.

త్రిజట స్వప్న వృత్తాంతం :

యుద్ధం ప్రారంభానికి ముందే త్రిజట తనకు వచ్చిన కల ద్వారా రాబోయే పరిణామాలను వివరిస్తుంది. రాముడు లంకపై దండెత్తడం, రావణ కుంభకర్ణులు యుద్ధంలో కూలిపోవడం మరియు రాముడు విజయం సాధించడం వంటివి ఆమె కలలో చూస్తుంది. ఇది రాక్షస శిబిరంలో ఉన్నప్పటికీ ధర్మం ఎటువైపు ఉందో సూచించే స్త్రీ చైతన్యానికి ప్రతీక.

సీతాదేవి అగ్నిప్రవేశం, పవిత్రత :

యుద్ధం ముగిసిన తర్వాత హనుమంతుడు, విభీష ణుడు సీతకు విజయ వార్తను అందిస్తారు. రాముని వద్దకు వచ్చిన సీతను ఆయన తొలుత కఠినంగా (లోకాపవాదం భయంతో) మాట్లాడినప్పుడు, ఆమె తన పవిత్రతను నిరూపించుకోవడానికి అగ్నిప్రవేశం చేస్తుంది. అగ్నిదేవుడు స్వయంగా ఆమె పరమ పతివ్రత అని ధృవీకరించిన తర్వాతే రాముడు ఆమెను స్వీకరిస్తాడు. ఇది స్త్రీ తన ఆత్మగౌరవాన్ని, పవిత్రతను లోకానికి చాటిచెప్పే అత్యంత కీలకమైన ఘట్టం.

రాక్షస స్త్రీల విలాపం :

యుద్ధంలో తమ పతులను, పుత్రులను కోల్పోయిన రాక్షస స్త్రీల వేదన ద్వారా యుద్ధం వల్ల కలిగే నష్టాన్ని మొల్ల హృద్యంగా వర్ణించారు.

మొత్తానికి యుద్ధకాండలో స్త్రీ పాత్రలు రాజనీతిజ్ఞతను (మండోదరి), ధైర్యాన్ని (సీత) మరియు సహానుభూతిని (త్రిజట) ప్రదర్శిస్తూ కథా ఫలశ్రుతిలో ముఖ్య భూమిక పోషించాయి అని చెప్పొచ్చు.

హనుమంతుడు-స్త్రీ పాత్రలతో అనుబంధం :

మొల్ల రామాయణంలో అతుకూరి మొల్ల హను మంతుని పాత్రను అత్యంత శక్తివంతంగా, బుద్ధి మంతుడిగా, రామభక్తికి నిలువుటద్దంగా చిత్రించారు. స్త్రీ

పాత్రలతో, ముఖ్యంగా సీతాదేవితో ఆయనకు ఉన్న అనుబంధం ఈ కావ్యంలో చాలా ఉదాత్తంగా వర్ణించ బడింది. స్త్రీ చైతన్యానికి ప్రతీకలైన స్త్రీ పాత్రలకు హను మంతుని అనుబంధం కూడా తోడైందని చెప్పొచ్చు. ఈ క్రమంలో హనుమంతుని గురించి పరిశీలించాల్సిన అవసరముంది.

హనుమంతుని పాత్ర చిత్రణ :

హనుమంతుడు మొదటిసారి రామలక్ష్మణులను కలిసినప్పుడు, ఆయన మాట్లాడే తీరును చూసి రాముడు ముగ్ధుడవుతాడు. ఆయనను "బుద్ధిమంతుడు", "సకల గుణ గరిష్ఠుడు" అని మొల్ల వర్ణించారు.

అచంచలమైన రామభక్తి :

హనుమంతుడు తనను తాను రాముని పాద పద్మములను సేవించే బంటుగా (దూతగా) పరిచయం చేసుకుంటాడు. లంకా నగరంలో సీతను వెతికేటప్పుడు కూడా రామనామ స్మరణే ఆయనకు తోడుగా నిలుస్తుంది. సముద్రాన్ని లంఘించడం, అశోకవనాన్ని ధ్వంసం చేయడం, అక్షకుమారుడిని సంహరించడం, లంకను దహనం చేయడం వంటి ఘట్టాల ద్వారా మొల్ల ఆయన "మహాబలాన్ని" మరియు "సాహసాన్ని" అద్భుతంగా చిత్రించారు.అలాగే అపారమైన శక్తి ఉన్నప్పటికీ, రాముని ముందు, సీతమ్మ ముందు ఆయన అత్యంత వినమ్రంగా ఉంటాడు. తన విజయాలన్నీ రామకృప వల్లనే కలి గాయని ఆయన నమ్ముతాడు.

స్త్రీ పాత్రలతో అనుబంధం :

హనుమంతుని పాత్ర ప్రధానంగా ముగ్గురు/నలుగురు స్త్రీ మూర్తులతో సంబంధం కలిగి ఉంటుంది.

సీతాదేవితో అనుబంధం తల్లిలాంటిది. సీతమ్మతో హనుమంతుని అనుబంధం అత్యంత పవిత్రమైనది. ఆమెను చూడగానే హనుమంతుడు "రామచంద్రుని దేవేరి" అని గుర్తించి భక్తితో ప్రణమిల్లుతాడు. రాముడు ఇచ్చిన ముద్రికను (ఉంగరమును) ఆమెకు ఇచ్చి, ఆమెలోని దుఃఖాన్ని పోగొట్టి ఆశను చిగురింపజేస్తాడు. ఆమె పట్ల గౌరవంతో తన విశ్వరూపాన్ని ప్రదర్శించి తన శక్తిపై నమ్మకాన్ని కలిగిస్తాడు. సీతమ్మను తన వీపుపై ఎక్కించుకుని రాముని వద్దకు తీసుకువెళ్తానని ఆఫర్ ఇస్తాడు, కానీ ఆమె పితృవంశ గౌరవాన్ని కాపాడటం కోసం దానిని నిరాకరించినప్పుడు ఆమె విజ్ఞతను గౌరవిస్తాడు. యుద్ధం ముగిసిన తర్వాత సీతమ్మకు విజయ వార్తను అందించే ఘనత కూడా హనుమంతుడిదే. అలాగే అంజనాదేవితో అనుబంధం, హనుమంతుడు తనను తాను పరిచయం చేసుకునే ప్రతి సందర్భంలోనూ తాను "అంజనాదేవి గర్భ సంభూతుడనని" సగర్వంగా చెప్పు కుంటాడు. ఇంకా, సురస, సింహిక: సముద్రాన్ని దాటే సమయంలో ఎదురైన ఈ రాక్షస స్త్రీలను హనుమంతుడు తన ఉపాయంతో, బలంతో జయిస్తాడు. ఇది ఆయన లోని కార్యసాధకతను సూచిస్తుంది. అలాగే దేవకన్య (మొసలి రూపంలో)తో అనుబంధం, సంజీవని పర్వతాన్ని తెచ్చే క్రమంలో కాలనేమి పంపిన మొసలిని హను మంతుడు సంహరించినప్పుడు, ఆ మొసలి రూపంలో ఉన్న ఒక దేవకన్యకు శాప విమోచనం కలిగిస్తాడు.

మొల్ల రామాయణంలో హనుమంతుడు రామకార్య సాధకుడిగా, సీతమ్మకు ధైర్యాన్ని ఇచ్చే ఆత్మీయ పుత్రుడిగా, మరియు అధర్మాన్ని ఎదిరించే ధీరుడిగా అద్భుతంగా చిత్రించబడ్డారు.

ముగింపు :

ఈ విధంగా మొల్ల రామాయణంలో స్త్రీ పాత్రలు వారి ఆత్మాభిమానాన్ని చాటుకోవడంతో పాటు చైతన్యం కలిగి ఉండటం గమనించవచ్చు. అందుకే మొల్ల రామా యణం తెలుగు సాహిత్య చరిత్రలో ఒక అపురూపమైన, చిరస్మరణీయమైన గ్రంథం. ఈ కావ్యం ప్రధాన ప్రత్యేకత దాని సరళమైన మృదు మధురమైన శైలి కలిగిఉండటమే. ఆతుకూరి మొల్ల తన కవిత్వాన్ని తేనె పట్టుతో పోల్చారు. అది నోట్లో పెట్టుకోగానే కరిగిపోయేలా ఉండాలని, వినువారికి విందులా ఉండాలని ఆమె ఆకాంక్షించారు. పాండిత్య ప్రకర్ష కోసం కాకుండా, పండిత పామరు లందరికీ సులభంగా అర్థమయ్యే కందువ మాటలతో (తేట తెలుగు పదాలతో) ఆమె ఈ కావ్యాన్ని తీర్చిదిద్దారు. అర్థం కాని గూఢ శబ్దాలను ఉపయోగించి కవిత్వం చెప్పడాన్ని ఆమె 'మూగవాని ముచ్చట' అని ఎద్దేవా

చేశారు, ఇది ఆమెలోని స్పష్టమైన భాషా చైతన్యాన్ని మరియు ఆత్మవిశ్వాసాన్ని చాటుతుంది. 16వ శతాబ్దపు సామాజిక పరిస్థితుల్లో, ఒక సామాన్య కుమ్మరి కుటుంబంలో జన్మించిన స్త్రీ, అప్పటి పండిత లోకపు కట్టుబాట్లను దాటి రామాయణాన్ని రచించడం ఒక గొప్ప సామాజిక విప్లవం మరియు స్త్రీ చైతన్యానికి నిదర్శనం. మొల్ల రామాయణం సంక్షిప్త కావ్యం అయినప్పటికీ, వాల్మీకి రామాయణంలోని ముఖ్యమైన ఘట్టాలను మరియు మౌలిక అంశాలను ఎక్కడా వదలకుండా అత్యంత హృద్యంగా చిత్రించబడింది. ఈ కావ్యంలో సీతాదేవి పాత్ర చిత్రణలో ఆమె చూపిన ధీరత్వం, రావణుడిని తృణీకరించిన తీరు ఆమెలోని ఆత్మాభిమానాన్ని ప్రతిబింబిస్తాయి. అలాగే, మండోదరి హితబోధ మరియు త్రిజట స్వప్నం వంటి ఘట్టాల ద్వారా స్త్రీల విజ్ఞతను, సహానుభూతిని మొల్ల అద్భుతంగా ఆవిష్కరించారు. పాండిత్యం కంటే భక్తికి, కఠినత్వం కంటే సరళతకు ప్రాధాన్యతనిచ్చి, రామకథను సామాన్య ప్రజలకు సైతం చేరువ చేసిన గొప్ప కావ్యం మొల్ల రామాయణం. తెలుగు భాషా సౌందర్యాన్ని, స్త్రీ అస్తిత్వాన్ని చాటిచెప్పిన ఈ గ్రంథం తెలుగు వారి గుండెల్లో చిరస్థాయిగా నిలిచిపోతుంది. ఇంతటి గొప్ప రచన కాబట్టే, మొల్ల జ్ఞాపకార్థం 2017 ఏప్రిల్ 26వ తేదీన వీరి పేరు మీద స్టాంపును 5రూ.విలువతో భారత తపాలా శాఖ విడుదల చేసింది. అంధ్ర ప్రదేశ్ ప్రభుత్వం మొల్ల జయంతి అయిన మార్చి 13వ తేదీన రాష్ట్ర ఉత్సవంగా నిర్వహిస్తోంది.

ఆధార గ్రంథాలు :

1. మొల్ల రామాయణం, కుమ్మరి మొల్ల, రామా అండ్ కో, విద్యావిషయక ప్రచారకులు ఏలూరు, తొలి ముద్రణ, 1937.
2. మొల్ల రామాయణం, ఎమెస్కో ప్రచురణలు, 1971
3. మొల్ల రామాయణం, పరిమళ వ్యాఖ్యతో, వ్యాఖ్యాత: ఆచార్య కోలవెన్ను మలయవాసిని, తితిదే ప్రచురణలు, తిరుపతి, 2023

★★★

Vol. 23 | Spl. Issue 03 | March 2026 | BHAVAVEENA | ISSN No. : 2456-4702 | RNI No. APTEL/2003/12253

RNI No. APTEL/2003/12253 | Reffered Journal & Peer Reviewed Journals | ISSN No. 2456-4702

భావవీణ

కళలు, సాహిత్య, సాంస్కృతిక భాషాధ్యయన పత్రిక

BHAVA VEENA

Journal of Arts, Literary, Culture & Language Study

జానపద గిరిజన విజ్ఞానంలో మహిళా చైతన్యం - విశ్లేషణ

- వంజరి రాజేశ్వరి

తెలుగు అధ్యాపకురాలు, టీ.జీ.టీ.డబ్ల్యూ.ఆర్.డి. సి (మహిళలు), షాద్నగర్.

వ్యాస సంగ్రహణం :

జానపద విజ్ఞానం అనేది మౌఖిక సంప్రదాయం ద్వారా తరతరాలుగా ప్రసారమయ్యే జ్ఞానం -- పాటలు, కథలు, సామెతలు, వ్రతకథలు, ఆచారాలు, నాటకాలు, నృత్యాలు. గిరిజన విజ్ఞానం దీనికి సమానాంతరంగా ఉంటుంది, ముఖ్యంగా తెలంగాణ, ఆంధ్రప్రదేశ్లోని కోయ, గోండు , చెంచు,కోలాం, లంబాడా, కొండరెడ్లు వంటి గిరిజన సమాజాల్లో ప్రకృతి, మూలికలు, వైద్యం, ఆచారాలతో ముడిపడి ఉంటుంది.మహిళా చైతన్యం అంటే మహిళలో స్వయం అవగాహన, పురుషాధిక్య సమాజంలోని అసమానతలపై విమర్శ, స్వేచ్ఛా ఆలోచన, శక్తి వ్యక్తీకరణ. జానపద-గిరిజన సందర్భంలో ఇది మౌఖిక రూపాల ద్వారా ప్రత్యేకించి స్త్రీల పాటలు, వ్రతకథలు, సంవాదాలు ద్వారా ప్రతిఫలిస్తుంది. ఇది ఆధునిక స్త్రీవాదానికి ముందునుండే ఉన్న స్వాభావిక చైతన్యం.

జానపద విజ్ఞానం మౌఖిక సంప్రదాయం ద్వారా తరతరాలుగా ప్రసారమయ్యే జ్ఞానం - పాటలు, కథలు, సామెతలు, వ్రతకథలు, ఆచారాలు, నాటకాలు, నృత్యాలు. గిరిజన విజ్ఞానం దీనికి సమానాంతరంగా ఉంటుంది, ముఖ్యంగా తెలంగాణ, ఆంధ్రప్రదేశ్లోని కోయ, గోండు, కోలామ్, చెంచు, లంబాడా, కొండరెడ్లు వంటి గిరిజన సమాజాల్లో ప్రకృతి, మూలికలు, వైద్యం, ఆచారాలతో ముడిపడి ఉంటుంది. మహిళా చైతన్యం అంటే స్త్రీల స్వయం అవగాహన, పురుషాధిక్య సమాజంలోని అసమానతలపై విమర్శ, స్వేచ్ఛా ఆలోచన, శక్తి వ్యక్తీకరణ. జానపద-గిరిజన సందర్భంలో ఇది మౌఖిక రూపాల ద్వారా - ప్రత్యేకించి స్త్రీల పాటలు, వ్రతకథలు, సంవాదాలు - ప్రతిఫలిస్తుంది

కీలక పదాలు :

వ్యక్తీకరణ,మౌఖిక, పురుషాధిక్యత, సంవాదాలు-దృక్పథం

పరిచయం :

జానపద గిరిజన విజ్ఞానంలో మహిళల స్థానం:

తెలుగు జానపద సాహిత్యంలో స్త్రీలు ప్రధాన పాత్ర పోషిస్తారు. గ్రామీణ, గిరిజన సమాజాల్లో మహిళలు పని (వ్యవసాయం, సేకరణ, ఇంటి పనులు), ఆచారాలు, వ్రతాలు, దేవతారాధనలో కీలకం. గిరిజన సంస్కృతుల్లో (కొండరెడ్లు, లంబాడాలు, గోండు మొదలైనవి) మహిళలు ప్రకృతితో ముడిపడి ఉంటారు. వైద్యం, మూలికల జ్ఞానం, సంగీతం, నృత్యం వారి ద్వారానే ప్రసార మవుతాయి.

పురుషాధిక్య సమాజంలోనూ జానపద పాటల్లో స్త్రీలు తమ బాధలు, కోరికలు, విమర్శలు స్వేచ్ఛగా వ్యక్తం చేస్తారు. ఉదాహరణకు, రామాయణ, భారత గాథలను

స్త్రీలు తమ దృక్పథంతో పాడుతారు. సీత బాధలు, ద్రౌపది అవమానం వంటివి తమ జీవితాలతో పోల్చి చూపిస్తారు. ఇది ఒక రకమైన స్త్రీవాద చైతన్యం.

మహిళా చైతన్యం ప్రతిబింబం

పాటలు మరియు సంవాదాలు :

తెలుగు జానపదంలో స్త్రీల పాటలు (లాలి పాటలు, ఊయల పాటలు, వ్రత గేయాలు) భర్త-భార్య సంబంధాలు, అత్త-కోడలు, వదిన-మరదలు సంవాదాల ద్వారా సామాజిక విమర్శలు చేస్తాయి. ఉదా: పందెంలో భార్య గెలిచి భర్త కోపంతో మరొకరిని పెళ్లి చేసుకునే కథలు పురుషాధిక్యాన్ని ప్రశ్నిస్తాయి.

వ్రతకథలు :

స్త్రీలు భర్త ఆయుష్షు, సంతానం కోసం వ్రతాలు చేస్తారు. త్రినాథ వ్రతం వంటివి పురుషులకు సంబంధించినవి కానీ, చాలా వ్రతాలు స్త్రీల చైతన్యాన్ని, శక్తిని చూపిస్తాయి.

గిరిజన సమాజాల్లో మహిళలు మాతృసంబంధ వ్యవస్థల్లో ఎక్కువ హక్కులు కలిగి ఉంటారు (ఉదా: ఈశాన్య భారత గిరిజనాల్లో). తెలుగు గిరిజనాల్లో మహిళలు వైద్య జ్ఞానం, ప్రకృతి జ్ఞానం కలిగి ఉంటారు. ఇది వారి చైతన్యానికి నిదర్శనం.

స్త్రీల రామాయణాలు:

తెలుగులో మహిళలు పాడే రామాయణ పాటలు సీతను బలమైన స్త్రీగా చిత్రీకరిస్తాయి. ఇది ఆధునిక స్త్రీవాద దృక్పథానికి సమానంగా ఉంటుంది.

జానపద విజ్ఞానంలో సాహిత్యం ద్వారా గిరిజన చైతన్యం:

తెలుగు జానపద విజ్ఞానం (ఫోక్లోర్)లో గిరిజన (ఆదివాసీ/ట్రైబల్) సమాజాల చైతన్యం మౌఖిక సాహిత్య రూపాల ద్వారా - ప్రత్యేకించి గేయాలు, కథలు, కథా గేయాలు, నృత్య గీతాలు, ఆచార గేయాలు - బలంగా ప్రతిబింబిస్తుంది. గిరిజన చైతన్యం అంటే సమాజంలోని అసమానతలు (భూస్వామ్యం, బాహ్య దోపిడీ, సాంస్కృతిక అణచివేత), ప్రకృతితో సంబంధం, స్వాతంత్ర్య కోరిక, సమూహ ఐక్యత, సాంప్రదాయ జ్ఞాన సంరక్షణ వంటి భావనలు. జానపద సాహిత్యం ద్వారా ఈ చైతన్యం తరతరాలుగా ప్రసారమవుతుంది, ముఖ్యంగా తెలంగాణ, ఆంధ్రలోని కోయ, గోండు, చెంచు, లంబాడా (బంజారా), కొండరెడ్లు వంటి గిరిజన తెగల్లో.

గిరిజన జానపద సాహిత్య రూపాలు మరియు చైతన్యం:

గిరిజన సమాజాల్లో జానపద సాహిత్యం మౌఖికంగా, సంగీతం-నృత్యంతో కూడిన రూపాల్లో ఉంటుంది. ఇవి కేవలం వినోదం కాదు - సామాజిక చైతన్యానికి, పోరాట భావనకు సాధనాలు.

గేయాలు మరియు కథాగేయాలు:

గిరిజన గేయాలు ప్రకృతి, అడవి జీవనం, వ్యవసాయం, వేట, ఆచారాలను వర్ణిస్తాయి. ఇందులో భూమి-అడవి హక్కులు, బాహ్య దోపిడీపై విమర్శలు కనిపిస్తాయి. ఉదాహరణకు, కోయ, గోండు తెగల గేయాల్లో "అడవి మా తల్లి" అనే భావన బలంగా ఉంటుంది ఇది ప్రకృతి రక్షణ చైతన్యాన్ని చూపిస్తుంది.

ఆశ్రిత కళారూపాలు

గిరిజన తెగల్లో పట్టెడ, డోలి, తోటి, పర్ధాన్, వంటి ఆశ్రిత కళాకారులు కథాగానాలు, పురాణ గాథలు పాడుతారు. ఇవి గిరిజన సమాజ ఐక్యత, స్వాభిమానాన్ని ప్రోత్సహిస్తాయి.

నృత్య గేయాలు:

గుస్సాడి, డప్పు నృత్యం, బంజారా వంటివి సమూహ ఐక్యత, పోరాట భావనను వ్యక్తీకరిస్తాయి. మేడారం సమ్మక్క-సారలమ్మ జాతరలో గిరిజన నృత్యాలు ఆదివాసీ గుర్తింపు, చైతన్యానికి చిహ్నం.

చారిత్రక సందర్భంలో గిరిజన చైతన్యం ప్రతిబింబం:

తెలంగాణ ప్రజా పోరాటం (1946-1951తెలంగాణ సాయుధ పోరాటం)లో గిరిజనులు భూస్వాములు, నిజాం పాలనపై పోరాడారు. జానపద సాహిత్యం ఈ పోరాటంలో కీలక పాత్ర పోషించింది.

"We Were Making History" (Stree Shakti Sanghatana) గ్రంథంలో తెలంగాణ మహిళలు (గిరిజన సహా) సాంప్రదాయ పాటల్లో కొత్త భావనలు చొప్పించి పాడారు. ఉదా: "మహిళలు స్వేచ్ఛ పొందాలా? మహిళల

జాతికి స్వేచ్ఛ లేదా?'' వంటి పాటలు సామాజిక చైతన్యాన్ని పెంచాయి. గిరిజన మహిళలు సంఘాల్లో పాల్గొని, పాటల ద్వారా అవగాహన కల్పించారు.

జానపద సాహిత్యంలోప్రకృతి-మానవ సంబంధం:

అడవి, భూమిని తల్లిగా చూడటం

మహిళల పాత్ర

గిరిజన సమాజాల్లో మహిళలు మాతృసంబంధ వ్యవస్థల్లో హక్కులు కలిగి ఉంటారు - జానపద గేయాల్లో వారి శక్తి వ్యక్తమవుతుంది.

ముగింపు :

గిరిజన సాహిత్యం మహిళా చైతన్యానికి జీవనాడి. బంజారా గిరిజన సాహిత్యం లోని ఢాల్లో వంటి రూపాల ద్వారా మహిళలు తమ భావోద్వేగాలు, బాధలు, శక్తి స్వేచ్ఛగా వ్యక్తం చేస్తారు. ఇది సాంస్కృతిక గుర్తింపు, సామాజిక విమర్శ, ఆధ్యాత్మిక బలాన్ని కలిగి ఉంది. ఆధునికంగా ఈ సాహిత్యం మహిళా సాధికారతకు ముఖ్యంగా గిరిజన మహిళల చైతన్యశీకు , సాంస్కృతిక రక్షణకు శక్తివంతమైన సాధనంగా మారుతోంది.

ఉపయుక్త గ్రంథ సూచి:

1. బిరుదురాజు రామరాజు - ఆంధ్రప్రదేశ్ జానపద సాహిత్యము -- సంస్కృతి (నేషనల్ బుక్ ట్రస్ట్).
2. వేల్చేరు నారాయణరావు - A Ramayana of Their Own: Womenμs Oral Tradition in Telugu
3. డా. జంధ్యాల కనకదుర్గ - తెలుగు సాహిత్యం - మహిళా చైతన్య ప్రస్థానం.
4. ఆర్.వీ.ఎస్. సుందరం - జానపద విజ్ఞానం.
5. రావి ప్రేమలత - జానపద సాహిత్యంలో స్త్రీ.

★★★

Vol. 23 | Spl. Issue 03 | March 2026 | BHAVAVEENA | ISSN No. : 2456-4702 | RNI No. APTEL/2003/12253

RNI No. APTEL/2003/12253 | Reffered Journal & Peer Reviewed Journals | ISSN No. 2456-4702

భావవీణ

కళలు, సాహిత్య, సాంస్కృతిక భాషాధ్యయన పత్రిక

BHAVA VEENA

Journal of Arts, Literary, Culture & Language Study

నన్నయ ఆంధ్ర మహాభారతం - మహిళా సాధికారత

- గజ్జెల ప్రమీల

తెలుగు అధ్యాపకురాలు & తెలుగు శాఖాధిపతి, కె.వి.ఆర్. ప్రభుత్వ మహిళా కళాశాల, కర్నూలు.

ప్రపంచ సాహిత్య చరిత్రలో రామాయణ, భారతాల కున్న స్థానం, విలువ నిరుపమానం. ఈ భూమి మీద పుట్టిన మానవుడు పరిపూర్ణ మానవుడిగా రూపుదిద్ధు కోవడానికి, సంఘంలో మంచి ఆదర్శవంతమైన వ్యక్తిత్వంతో జీవించడానికి ఈ రెండు గ్రంథాల్లో చెప్పిన అంశాలు ఆచరణలో పెడితే సరిపోతుంది. సంస్కృతంలో ఉన్న ఈ రెండు గ్రంథాలు తెలుగులోకి సుమారు వెయ్యేండ్లకు ముందే అనువదించబడ్డాయి. మహా భారతాన్ని నన్నయ, తిక్కన, ఎర్రనలు తెనిగించారు. వారి తరువాత కొందరు కవులు భారతాన్ని ఆంధ్రీకరించినా అవి అంతగా ప్రచారంలోకి రాలేదు. వీరి కావ్యాలను ఆధారంగా తీసుకొని చాలామంది కవులు, కవయిత్రులు వివిధ ప్రక్రియల్లో రచనలు చేసినా అవి అంతగా రాణించ లేదు. రామాయణంలో వాల్మీకి రామాయణానికి, ఆంధ్ర భారతంలో కవిత్రయ భారతానికి ఉన్న పాఠకాదరణ ఎప్పటికి చెక్కు చెదరదని చెప్పవచ్చు. ఆయా కావ్యాలలో ఉన్న కవిత్వ బిగువు, పటుత్వం అలాంటివి.

నన్నయ ఆంధ్రీకరించిన మహాభారతంలో జరిగిన సంఘటనలను ఆధారం చేసుకుని మహిళా సాధికారతకు గొప్ప స్థానం ఇచ్చారని మనం చెప్పవచ్చు. ఆ అంశాలను నా ఈ వ్యాసంలో చర్చించ దలిచాను.

మాతృప్రేమ :

సరమ వృత్తాంతం ద్వారా మాతృప్రేమను ఉగ్గడిం చాడు నన్నయ మహాకవి. జనమేజయుడు యజ్ఞం చేసే ప్రదేశానికి సరమ అనే పేరుగల దేవతల కుక్క కొడుకైన సారమేయుడనే పేరుగల కుక్కపిల్ల ఆట నిమిత్తం వచ్చింది. అక్కడ ఉన్న శ్రుతసేనుడు, భీమసేనుడు, ఉగ్రసేనుడనే పేర్లతో పిలువబడుతున్న జనమేజయుడి తమ్ముళ్ళు దానిని కొట్టారు. అది ఏడుస్తూ వచ్చి తన తల్లి సరమతో చెప్పింది. సరమ మిక్కిలి కోపించి జనమే జయుడి దగ్గరకు వచ్చి అతని తమ్ముళ్ళు చేసిన దుష్కృత్యాన్ని తెలిపింది. కొంతసేపటికి కనిపించకుండా ఎక్కడికో వెళ్ళిపోయింది. అప్పుడు పట్టించుకోని జనమే జయుడు కొన్నాళ్లకు యాగాన్ని పూర్తి చేసి హస్తినాపురానికి వెళ్లి సుఖంగా కొంతకాలం గడిపాడు.

ఒకరోజు జనమేజయునికి సరమ మాటలు గుర్తుకు వచ్చాయి. ఆపదలు కలుగుతాయనిన ఆమె మాటలకు ఉపశాంతి కలిగించుటకు తగిన పురోహితుని వెదుకుతూ ఒక మునిపల్లెకు వెళ్ళాడు. అక్కడ శ్రుతశవనుడనే మునిని కలిసి అతని కొడుకైన సోమ శ్రవసుని తన కార్యనిర్వ హణకు పురోహితునిగా నియమించమని వేడుకున్నాడు. రాజు కోరికను ఆముని మన్నించి అంగీకరించాడు. అతనిని తనవెంట తీసుకెళ్లి ఆ ఆపదలను తొలగించేవి,

మంచిని పెంచేవి అయిన కర్మలు చేస్తూ రాజ్యపాలన చేయసాగాడు.

ఈ సరమ ఉపాఖ్యానం ద్వారా తల్లికి పిల్లలపై ఉండే ప్రేమ వ్యక్తం చేయబడింది. తన కుమారులను కొట్టిన వారు జనమేజయ మహారాజు తమ్ముళ్లైనా సరమ లెక్కచేయలేదు. పట్టరానంత కోపంతో నేరుగా రాజు వద్దకే వెళ్లి తన కోపాన్ని వెళ్ళగక్కింది. అతని తమ్ముళ్ళు చేసిన దుష్కార్యానికి ఫలితాన్ని కూడా నిర్భయంగా వెళ్లడించింది.

కం॥ "తగునిదితగదనియెదలో
వగవక, సాధులకు బేదవారలకెగ్గుల్
మొగి జేయు దుర్వినీతుల
కగునని మిత్తాగమంబులయిన భయంబుల్"

(ఆంధ్ర మహాభారతం - ఆదిపర్వం - ప్రథమాశ్వాసం - 85వ పద్యం)

ఈపని తగినది, ఈ పని తగనిది అని మనస్సులో ఆలోచించకుండానే బీదవారికి, అశక్తులైన వారికి, మంచి వారికి అపకారాలు చేసే నీతి రహితులకు ఆపదలు కలుగుతాయన్నది. తాము తన కుమారుడు సారమేయుడు బీదవారమని, అశక్తులమని, మంచివారమని చెబుతూ జనమేజయ మహారాజు తమ్ముళ్లు నీతి రహితులని స్పష్టం చేసింది.

బిడ్డలకు అన్యాయం జరిగితే తల్లి సహించదని ఈ వృత్తాంతం ద్వారా నన్నయ మహాకవి తెలియజెప్పాడు. అప్పటి కాలానికే నిండు రాజసభలో ఒక మహిళ నిర్భయంగా, ఎలాంటి తొత్రుపాటుకు లోను కాకుండా వాస్తవ పరిస్థితులను రాజు ముందు ఉంచింది. తప్పు చేసింది రాజు సొంత సోదరులే అని తెలిసినా ఆమె ఏమాత్రం భీతి చెందలేదు. అదే విషయాన్ని రాజుకు చెప్పింది. మహిళా సాధికారతకు ఇంతకన్నా ఎక్కడ అవకాశం ఉంటుంది. నన్నయ తన కాల పరిస్థితులనే కాదు భవిష్యత్తును దర్శించి మహిళా సాధికారత దిశగా అడుగులు వేశాడు అని చెప్పడానికి ఇంకో మంచి ఉదాహరణను పరిశీలిద్దాం.

సత్యమహిమ :

శకుంతలోపాఖ్యానం ద్వారా సత్య మహిమను చాటిచెప్పాడు నన్నయ. పూరు వంశానికి చెందిన దుష్యంత మహారాజు ఒక రోజు అడవికి వెళ్ళాడు. అక్కడ అడవిలో కణ్వమహర్షి ఆశ్రమం ఉండేది. వన సౌందర్యాన్ని మెచ్చుకుంటూ ఆశ్రమంలోకి వెళ్ళాడు. అక్కడ సౌందర్య రాశి అయిన శకుంతలను చూశాడు. ఆమె అందచందాలకు వినయానికి ఆశ్చర్య చకితుడయ్యాడు. ఆమె వ్యక్తిగత వివరాలు ఆమెనే అడిగి తెలుసుకున్నాడు. మేనక, విశ్వామిత్రులు తన తల్లిదండ్రులని ఆమె చెప్పింది. అప్పుడు "శకుంతల ముని కన్యయేమో అని మిక్కిలి నిరాశ ఉన్న నా హృదయం ఈ పద్మాక్షి తాను రాజపుత్రినని తన వంశ ఔన్నత్యాన్ని తెలపటం చేత మన్మథబాణ పరంపరకు వశమై తుమ్మెదలు వాలటంచేత కంపించిన పద్మంవలే చలించింది" అని తపనపడ్డాడు. కణ్వమహర్షి రాకనే శకుంతలను గాంధర్వ వివాహం చేసికొన్నాడు. అప్పుడు శకుంతల భర్త దుష్యంతుని 'నీ అనుగ్రహం వలన నాకు పుట్టిన పుత్రునకు నీ విశాల సామ్రాజ్యానికి యువరాజ పదవిలో అభిషేకం చేసే వరాన్ని దయతో కూడిన మనసుతో ఇవ్వాలని కోరింది. అందుకు దుష్యంతుడు సంతోషంతో అంగీకరించాడు. ఆమెతో ఇష్ట సుఖాలు అనుభవించి 'నిన్ను వెంటబెట్టుకొని రావటానికి మంత్రులను కణ్వమహాముని వద్దకు పంపుతానని ఆమెను సమాధాన పరచి, ఒప్పించి, దుష్యంతుడు తన నగరానికి వెళ్ళాడు.

వనంనుండి తిరిగి వచ్చిన కణ్వుడు శకుంతల దుష్యంతుల వివాహ వార్త తెలుసుకొని చాలా సంతోషించాడు. దివ్య జ్ఞానంతో జరిగిన కథంతా తెలుసుకొని 'క్షత్రియులకు గాంధర్వ వివాహం సమ్మతమే' అని తెలిపినాడు. 'అమ్మా! నీ కుల గోత్రాలకు అందచందాలకు తగిన భర్తను నీవు పొందగలిగావు. దానికి తగినట్లుగా నీవు గర్భవతివికూడా అయ్యావు. నీ గర్భంలో ఉన్నవాడు ఈ సమస్త భూమిని పాలించగలిగిన మహనీయుడయ్యే చక్రవర్తి సుమా!'అని కాలజ్ఞానాన్ని చెప్పాడు. దుష్యంత మహారాజు నుంచి ఎలాంటి ఆహ్వానం రాకపోవట చేత 'ఎటువంటి పతివ్రతలకైనా పుట్టినిళ్లలో ఎక్కువ కాలం ఉండటం ఎంతమాత్రం ఉచితం కాదు. ఇల్లాళ్ళకు భర్తల

దగ్గర ఉండటమే ధర్మం. భార్యలకు భర్తలే సర్వ రక్షకులు' అని చెప్పి, 'నీ కుమారుడిని తీసుకొని నీ భర్త వద్దకు పొమ్ము' అని గొప్ప మునులను తోడిచ్చి దుష్యంతుని వద్దకు పంపాడు కణ్వుడు.

నిండు సభలో కొలువుదీరి ఉన్న దుష్యంతుడు శకుంతలను చూసిచూడనట్లు నటించాడు. అప్పుడు శకుంతల 'ఎవరైనా నిజంగా మరచిపోతే జ్ఞాపకం చేయవచ్చు. అసలు తెలియనప్పుడు ఏ పాటు పడి అయినా తెలియజెప్పవచ్చు. కాగా తెలిసి కూడా తెలియని వాడివలె నటించే మోసగాడికి తెలియజేయటం బ్రహ్మతరం కూడా కాదు' అని మనసులో అనుకొన్నది. అయినా తెలియ జెప్పటం తన బాధ్యతగా భావించింది. నిండు సభలో 'ఓ రాజా! వేట అనే మిషతో కావాలని సప్రయత్న పూర్వకంగా కణ్వముని ఆశ్రమానికి వచ్చి, అక్కడ నీవు సంతోషంగా నాకు ఇచ్చిన వరాన్ని మనసులో జ్ఞాపకం చేసికో. బాల సూర్యుడివలె వెలుగుతున్న ఈ చిరంజీవి నీకొడుకు. పౌర వంశానికే అలంకారమైనవాడూ, ఉత్తమ గుణాలకు నెలవైన వాడు అయిన ఇతడిని యువరాజుగా అభిషేకించు' అని వేడుకొన్నది. శకుంతల మాటలు విన్న దుష్యంతుడు తనకు తెలియనట్లు నటించి 'నిన్ను నే నెరుగను. నీవు అసలు ఎవరవు. ఊరకే ఒప్పని మాటలు మాట్లాడతావెందుకు? ఎక్కడి నుంచి వచ్చావో అక్కడికే తిరిగి వెళ్ళుము' అన్నాడు. అప్పుడు శకుంతల మిక్కిలి కోపంతో దుష్యంత మహారాజును నిలదీసింది. వారిద్దరి మధ్య కణ్వమహర్షి ఆశ్రమంలో జరిగిన విషయాన్నంతా సభాముఖంగా వివరించింది. అయినా రాజు అంగీకరించ లేదు.

కం॥ వెలయంగ నశ్వమేథం
బులు వేయును నొక్క సత్యమును నిరుగడలం
దులనిడి తూ పగ సత్యము
వలనన ములుసూపు గౌరవంబున పేర్మిన్"
(ఆంధ్ర మహాభారతం - ఆదిపర్వం -
చతుర్థాశ్వాసం - 95వ పద్యం)

ఒక త్రాసులో బాహాటంగా వేయి అశ్వమేధాల ఫలాన్ని ఒకవైపు, ఒక సత్యాన్ని మాత్రమే మరొకవైపు ఉంచి రెండువైపుల తూచగా సత్యంవైపు బరువు వలన ముల్లు చూపుతుంది- అన్నది. అయినా రాజు అంగీకరించలేదు. 'నేనెక్కడ? నీవెక్కడ? కుమారుడెక్కడ? నిన్నింతకు పూర్వం ఏనాడు చూచి ఎరుగను. ఆడువారు అబద్దాలాడుతారు అన్నట్లుగా అసత్యం పలకటం నీకు తగునా? అని ప్రశ్నించాడు.

ఇక చేయగలిందేమి లేక శకుంతల "పుట్టిన నాడే తల్లిదండ్రులచేత విడువబడినాను. ఇప్పుడు భర్తచేత విడువబడుతాను కాబోలు. ఇక పెక్కుమాట లెందుకు?" అని చింతిస్తుండగా ఆకాశవాణి ఇలా పలికింది. "ఓ దుష్యంత మహారాజా! ఈ భరతుడు నీకు శకుంతలకు మిక్కిలి ముద్దుబిడ్డడు. ఈతనిని స్వీకరించి పోషించుము. ఈ ఇల్లాలు ఉత్తమ కీర్తి కలిగింది. మహాపతివ్రత అయిన శకుంతల వివేకంతో నిజం చెప్పింది." ఈ విధంగా చెప్పిన ఆకాశవాణి పలుకులు విని దుష్యంతుడు "అలనాడు కోరి కోరి కణ్వమహర్షి ఆశ్రమంలో గాంధర్వ వివాహ పద్ధతి నాశ్రయించి ఈమెను మిక్కిలి ప్రీతితో వివాహం చేసుకున్నాను. అది నాకూ ఈమెకు తప్ప ఇతరులకెవ్వరికీ తెలియదు. లోక నింద కలుగుననే భయంతో అబద్దాలాడాను. ఇప్పుడు ఆకాశవాణి అందరికీ తెలియునట్లుగా స్పష్టంగా చెప్పింది". అని తన కపటత్వాన్ని అంగీకరించాడు. కొడుకును దగ్గరకు తీసుకొని కౌగిలించుకొని పులకించిపోయాడు. పట్టపు మహిషి అయిన శకుంతలను ప్రణయ గౌరవాలతో సన్మానించాడు. భరతుని యువరాజ్య పదవిలో అభిషేకించాడు. అటు తర్వాత చాలా సంవత్సరాలు రాజ్య సుఖాలు అనుభవించి, రాజ్య భారాన్ని భరతునికి అప్పగించి, తాను తపోవనానికి వెళ్ళాడు.

శ్లో॥ సత్యమేవ జయతే నానృతం, సత్యేన పంథా
వితతో దేవ యానः।
యేనా క్రమం తృషయోహ్యాప్త కామా, యత్ర
తత్సత్య పరమం నిధానమ్ ॥
(సంస్కృత మహాభారతం 3-1-6వ శ్లోకం)

'సత్యమే జయించును. అసత్యము పరాసక్తమగును. సత్యము వలననే దేవతల మార్గం విస్తరించి ఉంటుంది.

సత్యం చేతనే మహర్షులు ఆప్తకాములై ఈశ్వరుని పొందుచున్నారు. ఈశ్వరుడు సత్య స్వరూపుడు' అని ముండకోపనిషత్ తెలిపిన సూక్తి శకుంతల విషయంలో నిరూపితమైంది.

నిండు రాజసభలో ఒక మహిళ మాట్లాడడమే అరుదు. పోనీ ధైర్యం చేసి మాట్లాడింది అనుకుందాం ఎవరి పైన అయినా ఫిర్యాదు చేయవచ్చు. అది కూడా అద్భుతమే. కానీ నన్నయ చిత్రించిన శకుంతల మాత్రం ఏకంగా రాజు పైనే ఫిర్యాదు చేయడం, రాజు చేసిన పనిని తప్పు అని నిర్భయంగా చెప్పడం మహిళా సాధికారతకు నిదర్శనం కాదా. అంటే సమాజ దార్శనికతను నన్నయ పునికిపుచ్చు కున్నాడు. సత్యం ధర్మం రెండింటి మేలవింపు కలయిక మహాభారతం అని నన్నయ ప్రగాఢంగా విశ్వసించాడు. ముఖ్యంగా మహిళ కు అన్యాయం జరిగిందని మహా భారత యుద్ధం జరిగింది. దాదాపుగా మహాభారతంలోని చాలా ఉపాఖ్యానాల్లో మహిళలను కించపరిచిన సందర్భాల్లో ఆ కించపరిచిన వాళ్ళు పతనానికి గురి కావడాన్ని మనం గమనించాం. ఈ రెండు సంఘటనల్లో మహిళా సాధికారతను చాలా గొప్పగా చిత్రించాడు ఆదికవి నన్నయ. మహాభారతం పాతదే కావచ్చు. కానీ అందులోని అంశాలు నిత్య నూతనం అని చెప్పడానికి నన్నే చిత్రించిన మహిళ సాధికారత ప్రధాన ఆలంబన.

ఆధార గ్రంథాలు :

1. కవిత్రయము - నండూరి రామకృష్ణమాచార్య, సాహిత్యపీఠం, సికింద్రాబాదు.
2. మహాభారత తత్వదర్శనము - డా॥రామకోటిశాస్త్రి, గంగాధర పబ్లికేషన్స్, విజయవాడ.
3. కవిత్రయభారతం - రాజనీతి - నేతి అనంతరామశాస్త్రి, అరుణా పబ్లికేషన్స్, గుంటూరు.
4. మహాభారత కథలు - మానవ స్వభావం - డా॥తాపెట రామప్రసాద్‌రెడ్డి, (తిక్కనభారతం), కడప.
5. భారత నిరుక్తి- నన్నయ - డా॥ తిప్పాభట్ల రామకృష్ణమూర్తి.
6. భారత కథలు - అంతరార్థము - దేవరకొండ శేషగిరిరావు, శ్రీపతి ప్రెస్, కాకినాడ.
7. భారతీయ సంస్కృతి - ఆచార్య ఎస్.బి.రఘునాథాచార్య, తితిదే ప్రచురణ.
8. భారత ధ్వని దర్శనము - ఆచార్య శలాక రఘునాథశర్మ, ఆనందవల్లీ గ్రంథమాల, అనంతపురం.
9. మహాభారతము- ఉపాఖ్యానతత్త్వము - డా. పెన్మత్స వెంకటరాజు, ముముక్షువు, పవరుపేట, విజయవాడ.

★★★

Vol. 23 | Spl. Issue 03 | March 2026 | BHAVAVEENA | ISSN No. : 2456-4702 | RNI No. APTEL/2003/12253

RNI No. APTEL/2003/12253 | Reffered Journal & Peer Reviewed Journals | ISSN No. 2456-4702

భావవీణ

కళలు, సాహిత్య, సాంస్కృతిక భాషాధ్యయన పత్రిక

BHAVA VEENA

Journal of Arts, Literary, Culture & Language Study

వెనుకబడిన వర్గాల స్త్రీవాద కవిత్వంలో మహిళా చైతన్యం : తెలంగాణలో సామాజిక అసమానతలు, ఆత్మగౌరవం మరియు విముక్తి స్వరాలు

- శాంతి ధనావత్

పరిశోధక విద్యార్థి, జానపద గిరిజన విజ్ఞానపీఠం, సురవరం ప్రతాపరెడ్డి, తెలుగు విశ్వవిద్యాలయం, వరంగల్.

ఉపోద్ఘాతం

వెనుకబడిన వర్గాల స్త్రీవాద కవిత్వం తెలంగాణ సమాజంలో సాంఘిక, చారిత్రక, ఆర్థిక, మరియు లింగ అసమానతలకు లోతైన ప్రతిబింబాన్ని అందిస్తుంది. ఈ కవిత్వం మహిళల వ్యక్తిగత అనుభవాలను, సామూహిక సమస్యలను, పీడనాలను, వివక్షలను సవివరణాత్మకంగా ప్రదర్శిస్తూ ఆత్మగౌరవం, చైతన్యం, మరియు విముక్తి స్వరాలకు మూలవేదికగా నిలుస్తుంది. తెలంగాణలోని వెనుకబడిన వర్గాల మహిళల రచనలు నిరసన, ధైర్యం, సాహస మరియు స్వతంత్ర భావాలను కవిత్వరూపంలో వ్యక్తీకరిస్తూ, పారంపరిక వివక్షలకు ప్రతిఘటనగా శక్తి వంతమైన ప్రతిఘటనగా మారుతాయి. ఈ సాహిత్య చైతన్యం స్థానిక భాషా సంప్రదాయాలు, రూపకాలు, పదజాలం, మరియు శైలి సాంకేతికతలతో గాఢంగా అనుసంధానమై, కవయిత్రుల వ్యక్తిగత అనుభవాలను సామాజిక, సాంస్కృతిక, రాజకీయ పరిణామాలతో సమగ్రంగా ప్రతిబింబిస్తుంది. వెనుకబడిన వర్గాల స్త్రీవాద కవిత్వం, తెలంగాణలో మహిళల సామాజిక స్థానం, ఆత్మగౌరవం, మరియు విముక్తికి కీలకమైన స్ఫూర్తివేదికగా నిలుస్తుంది. ఈ పరిశీలన మహిళల భావోద్వేగాలు, చైతన్య స్వరాలు, విముక్తి భావాలు, మరియు స్త్రీల సాహిత్య స్థానం లోతైనదిగా విశ్లేషిస్తుంది. తెలంగాణ సాహిత్యంలో ఈ కవిత్వం సాధించిన విలువ, సమాజంపై చూపిన ప్రభావం, మరియు స్త్రీల చైతన్యానికి తీసుకు వచ్చిన మార్పులు స్పష్టంగా అవగాహనలోకి వస్తాయి.

ప్రధాన పదాలు :

వెనుకబడిన వర్గాలు, స్త్రీవాద కవిత్వం, తెలంగాణ, సామాజిక అసమానతలు, ఆత్మగౌరవం, విముక్తి

పరిచయం : వెనుకబడిన వర్గాల మహిళల సాహిత్య చైతన్యం

వెనుకబడిన వర్గాల స్త్రీల సాహిత్య చైతన్యం తెలంగాణ సమాజంలో సామాజిక, చారిత్రక, ఆర్థిక మరియు లింగ అసమానతలకు గాఢమైన ప్రతిబింబాన్ని అందిస్తుంది. ఈ సాహిత్యం కేవలం వ్యక్తిగత అనుభవాల ప్రతిఫలమే కాక, సమూహానికి చెందిన బాధలను, పీడనాలను, మరియు వివక్షలను లోతైనంగా వెలికి తీస్తుంది. మహిళల ఆత్మగౌరవం, స్వతంత్రత మరియు చైతన్య భావాలను కవిత్వ రూపంలో వ్యక్తీకరిస్తూ, పారంపరిక వివక్షలకు, సామాజిక నియమాలకు, మరియు కుల విభేదాలకు వ్యతిరేకంగా శక్తివంతమైన ప్రతిఘటనగా నిలుస్తుంది. ఈ

కవిత్వం స్థానిక భాషా సంప్రదాయాలు, రూపకాలు, పదజాలం, శైలి సాంకేతికతలతో, తెలంగాణ కవయిత్రుల వ్యక్తిగత అనుభవాలను సమగ్రంగా సామాజిక, సాంస్కృతిక, మరియు రాజకీయ పరిసరాలతో అనుసంధానిస్తుంది.

తెలంగాణ వెనుకబడిన వర్గాల మహిళల కవిత్వంలో నిరసన, ధైర్యం, సాహస, విముక్తి మరియు ఆత్మగౌరవ భావాల వైవిధ్యం గాఢంగా ప్రతిబింబిస్తుంది. ఈ సాహిత్య చైతన్యం స్థానిక భాష, సాంప్రదాయం, మరియు సమాజ చరిత్రలో స్త్రీల స్థానాన్ని, ఆత్మగౌరవాన్ని, మరియు చైతన్యాన్ని లోతైన విధంగా వివరిస్తుంది. వెనుకబడిన వర్గాల స్త్రీలు తమ స్వరాల ద్వారా వ్యక్తిగత, సామాజిక, మరియు సాంస్కృతిక స్థాయిలలో ప్రతిఘటనను సృష్టిస్తూ, తెలంగాణ స్త్రీవాద కవిత్వానికి చైతన్యానికి మూలవేదికగా నిలుస్తారు. ఈ పరిశీలన మహిళల కవిత్వంలోని లోతైన భావ ప్రకటనలను, విముక్తి స్వరాలను, మరియు స్త్రీల సాహిత్య స్థానాన్ని విశ్లేషించడానికి సమగ్ర అవగాహనను అందిస్తుంది.

స్త్రీవాద కవిత్వం నిర్వచనం : భావ ప్రకటన మరియు సామాజిక పరిమాణం

స్త్రీవాద కవిత్వం అనేది మహిళల వ్యక్తిగత, సామాజిక, మరియు సాంస్కృతిక అనుభవాలను ప్రతిబింబించే అత్యంత లోతైన సాహిత్య రూపం. ఇది కేవలం భావ ప్రకటన మాత్రమే కాదు, మహిళల నిరసన, స్వతంత్రత, ఆత్మగౌరవం, మరియు చైతన్య స్వరాలను సమగ్రంగా వెలికితీసే మాధ్యమంగా నిలుస్తుంది. వెనుకబడిన వర్గాల మహిళల జీవితంలో ఎదురైన పీడనలు, వివక్షలు, ఆర్థిక మరియు లింగ అసమానతలను కవిత్వం లోతైన రీతిలో ప్రతిఫలింప చేస్తూ, ఆత్మవిశ్వాసం మరియు చైతన్యానికి మూల వేదికగా మారుతుంది. తెలంగాణ సాహిత్య పరిశ్రయంలో ఈ కవిత్వం స్థానిక భాషా సంప్రదాయాల, రూపకాల, పదజాలం, శైలీ సాంకేతికతలతో కలిపి, వ్యక్తిగత అనుభవాలను సామాజిక, సాంస్కృతిక, మరియు రాజకీయ పరిసరాలతో సమగ్రంగా అనుసంధానిస్తుంది.

స్త్రీవాద కవిత్వం సామాజిక పరిమాణం గాఢంగా, సమగ్రంగా, మరియు నిజాయతీగా మహిళల స్వరాలను ప్రతిబింబిస్తుంది. ఇది స్త్రీల జీవితంలోని సమస్యలు, నిరసన, ధైర్యం, మరియు విముక్తి భావాలను లోతుగా వ్యక్తపరుస్తుంది. తెలంగాణలోని వెనుకబడిన వర్గాల మహిళల కవిత్వం సమాజంలో స్త్రీల స్థానం, ఆత్మగౌరవం, స్వాతంత్ర్యం, మరియు చైతన్యానికి స్ఫూర్తి వేదికగా నిలుస్తుంది. ఈ కవిత్వం మహిళల భావోద్వేగాలను, విముక్తి స్వరాలను, మరియు స్త్రీల సాహిత్యస్థానం లోతైన, సమగ్ర మరియు ప్రామాణిక దృక్పథంతో విశ్లేషిస్తుంది. ప్రతి కవితా రూపకం, పదజాలం, మరియు భావ ప్రకటన సమాజంలోని అసమానతలకు ప్రతి ఘటనగా, తెలంగాణ స్త్రీవాద సాహిత్యానికి శక్తివంతమైన ఆధారం అవుతుంది.

తెలంగాణలో సామాజిక - చారిత్రక నేపథ్యం :

తెలంగాణ ప్రాంతంలో సాంఘిక మరియు చారిత్రక పరిస్థితులు వెనుకబడిన వర్గాల మహిళల జీవితాలపై అత్యంత లోతైన ప్రభావాన్ని చూపించాయి. ఈ ప్రాంతంలో కుల వ్యవస్థ, భూస్వామ్యం, ఆర్థిక పరిమితులు, మరియు పురాతన సంప్రదాయాలు మహిళలశక్తి, స్వతంత్రత, మరియు చైతన్యంపై నిలకడగా ప్రతిఘటిస్తూ, వారి సాహిత్య చైతన్యానికి ప్రేరణగా నిలిచాయి. సామాజిక నియమాలు, కుటుంబాధిపత్యం, మరియు పురుషాధిక్యత మహిళల జీవితాన్ని పరిమితం చేయగా, అదే సమయంలో వారి కవిత్వంలో నిరసన, ధైర్యం, మరియు స్వతంత్రభావాల రూపకల్పనకు వేదికగా మారింది. తెలంగాణలోని వెనుకబడిన వర్గాల మహిళలు ఎదుర్కొన్న పీడనలు, సామాజిక వివక్షలు, మరియు ఆర్థిక సమస్యలు కవిత్వంలో లోతైన ప్రతిబింబాన్ని పొందాయి, ఇది స్త్రీల ఆత్మగౌరవం, విముక్తి స్వరాలు, మరియు చైతన్యానికి మూలవేదికగా మారింది.

ఈప్రాంతంలో సాంఘిక - చారిత్రక నేపథ్యంపై లోతైన అవగాహన పొందడం, తెలంగాణ స్త్రీల సాహిత్య స్థానాన్ని, వారి వ్యక్తిగత అనుభవాలను, మరియు సామాజిక వ్యవస్థలో స్త్రీల స్థానాన్ని విశ్లేషించడానికి అత్యంత

అవసరం. కవిత్వంలో వ్యక్తమయ్యే నిరసన, స్వతంత్ర భావాలు, మరియు విముక్తి స్వరాలు, స్థానిక భాషా సంప్రదాయాలు, రూపకాలు, పదజాలం, శైలి సాంకేతిక కతలతో ముడిపడి, తెలంగాణ మహిళల సాహిత్య చైతన్యానికి గాఢ, సమగ్ర, మరియు శక్తివంతమైన స్థాయిని అందిస్తాయి. ఈ పరిశీలన తెలంగాణ స్త్రీల కవిత్వంలో వ్యక్తిగత, సామాజిక, మరియు సాంస్కృతిక మౌలికతలను, మహిళల చైతన్యాన్ని, మరియు సామాజిక మార్పులకు చూపినప్రభావాన్ని లోతుగా అవగాహన చేసుకోవడానికి సహాయపడుతుంది.

వెనుకబడిన వర్గాల మహిళల స్వరాల వైవిధ్యం :

తెలంగాణలోని వెనుకబడిన వర్గాల మహిళల కవిత్వంలో స్వరాల వైవిధ్యం అత్యంత గాఢ భావ ప్రకటనతో నిలుస్తుంది. ఈ వర్గాల మహిళలకు సమాజంలో ఎదురైన పీడనలు, లింగ అసమానతలు, కులవివక్షలకు సంబంధించిన అనుభవాలు వేర్వేరు రూపకాలు, పదజాలం, శైలి ద్వారా గాఢంగా వ్యక్తమవు తాయి. ఉదాహరణకు జూపాక సుభద్ర గారి రచనలు వీరిలోని అనుభవాలను, బాధలను, నిరననను సమగ్రంగా ప్రతిబింబిస్తాయి. ఆమె కవిత్వం ద్వారా వ్యక్తీకరించిన భావాలు పేదరికం, సమాజపుఒత్తిడులు, వివక్షలకు ఎదురుదాడి లాంటి స్వరాల గాఢమైన సంకలనంగా నిలుస్తున్నాయి. రాసుకున్న ప్రతి పంక్తిలోనే నిజాయితీ, బాధ, ధైర్యం కనిపిస్తాయి. ఈ స్వరాలు స్త్రీల గుండెల్లోని నిస్సహాయతను, శక్తినింపే ఆశను, ఆత్మ గౌరవాన్ని, సామాజిక అసమానతలకు వ్యతిరేకంగా నిలబెట్టే ధైర్యాన్ని ఒకటిగా ప్రతిఫలిస్తున్నాయి.

మరొక ప్రముఖ కవయిత్రి మెర్సీమార్గరెట్ గారి స్వరాలు కూడా మహిళల అస్తిత్వాన్ని, విముక్తి ఆకాంక్షను గాఢంగా వెలికి తీస్తున్నాయి. ఆమె కవిత్వంలో వ్యక్తిగత భావోద్వేగాలు సమాజపేటలోని అసమానతలకు వ్యతిరేకంగా శక్తివంతంగా వెలివేస్తూ, పాఠకుడిలోని చైతన్యాన్ని అస్పష్టంగా, గాఢంగా ఉద్దీపితం చేస్తాయి. ఈ విధంగా తెలంగాణ వెనుకబడిన వర్గాల స్త్రీల స్వరాల వైవిధ్యం కేవలం భావప్రకటన మాత్రమే కాదు, సమాజంలోని ప్రతిఘటన, నిరసన, ప్రశ్నించే సామర్థ్యాన్ని కూడా ప్రతిబింబిస్తోంది. వారి రచితలు ప్రతీ పంక్తిలో స్వతంత్రభావాలు, ఆత్మగౌరవ భావాలు, విముక్తి సంకల్పాలను లోతుగా వ్యక్తం చేస్తున్నారు, ఇవి సమగ్రంగా ప్రతిభావంతమైన సాహిత్య వ్యక్తీకరణగా నిలుస్తున్నాయి.

ఆత్మగౌరవం మరియు వ్యక్తిగత చైతన్యం :

వెనుకబడిన వర్గాల స్త్రీ కవయిత్రుల రచనలు ఆత్మగౌరవం మరియు వ్యక్తిగత చైతన్య భావాలను గాఢంగా ప్రతిబింబిస్తున్నాయి, అందులో జూపాక సుభద్ర గారి రచనల్లో మహిళల జీవితంలో ఎదురైన కులవివక్ష, లింగ అసమానతలు, పీడనలు, అవమానాలు వంటి అనుభవాలు స్పష్టంగా వచ్చేలా ఉంటాయి, ఆమె కవిత్వంలో వ్యక్తిగత బాధలు సమాజంలోని పీడనలకు ఎదురుదాడి చేసే ధైర్యంగా మారి, చదివే వారిలో చైతన్యాన్ని ప్రేరేపిస్తాయి, అలాగే మెర్సీమార్గరెట్ గారి రచనలు కూడ మహిళల స్వతంత్ర భావాలను, ఆత్మ గౌరవాన్ని గాఢంగా విడుదల చేస్తాయి, ఆమె పదాలు వ్యక్తిగత అనుభవాల నుండి సామాజిక ప్రశ్నలకు చేరువవుతున్న భావాలుగా వెలుస్తున్నాయి, ఈ రెండు రచయిత్రుల రచనలు మహిళల ఆత్మగౌరవం కోసం చేసే పోరాటంలో వ్యక్తిగత భావాలను, సామూహిక అన మానతలకు వ్యతిరేకంగా నిలబెట్టే చైతన్యాన్ని సమగ్రంగా సూచిస్తున్నాయి, వారి కవిత్వంలో వ్యక్తిగత బాధలు, నిరసన, ధైర్యం, స్వతంత్ర భావాలు సమానంగా ఒడిశి, పాఠకుడి మనసులో మహిళల గొప్పతనాన్ని, స్వతంత్ర భావాన్ని ప్రతిపాదించేలా ఉంటాయి, ఇవి స్త్రీలు తమ స్వరాలను వెలికి తేల్చుకుని సమాజంలోని వివక్ష, ఆక్రమణ, సామాజిక నియమాలకు ఎదురుదాడి చేసే శక్తివంతమైన ప్రేరణగా మారుతాయి, తద్వారా ఆత్మ గౌరవం మరియు వ్యక్తిగత చైతన్యం ఒకే సమయంలో వ్యక్తిగత, సామాజిక, సాంస్కృతిక అంశాలతో సమగ్రంగా అనుసంధానమై అభివృద్ధి చెందుతున్న సంగతిగా తెలుస్తుంది.

విముక్తిస్వరాలు : లింగ, కుల మరియు సామాజిక నియమాల నుండి స్వతంత్రత

తెలంగాణలోని వెనుకబడిన వర్గాల మహిళల కవిత్వం

స్వరాల ద్వారా లింగ, కుల, సామాజిక నియమాల బంధనాల నుండి విముక్తి కోసం ప్రతిఘటనగా నిలుస్తుంది. జూపాక సుభద్ర గారి రచనలు మహిళల జీవితంలోని పీడనాలను, వివక్షలను, ఆర్థిక మరియు లింగ అసమానతలను లోతుగా ప్రతిబింబిస్తాయి. ఆమె కవిత్వంలో ప్రతి పంక్తి వ్యక్తిగత బాధ, నిరసన, ధైర్యం, మరియు స్వతంత్ర భావాలను సాంకేతిక రూపంలో ప్రవహింపజేస్తుంది. సమాజపు పరిమితులు, కుటుంబ నియమాలు, పురుషాధిక్యత, పేదరికం వంటి మూలకాలు మహిళలను అడ్డుకునే విధంగా ఉండగా, సుభద్ర గారి స్వరాలు ఆబంధనాలను ధైర్యంగా విరచి, విముక్తికి మార్గదర్శకంగా నిలుస్తాయి. ఆమె గాఢ, నిర్దిష్ట పదజాలం, రూపకాలు, మరియు శైలీ నైపుణ్యాలు స్వరాలను మరింత ప్రభావవంతంగా మారుస్తాయి.

ఇక మెర్సీమార్గరెట్ గారి రచనలలో కూడ స్త్రీల స్వతంత్ర భావాలు, ఆత్మగౌరవం, మరియు చైతన్య స్వరాలు ప్రతిఫలిస్తాయి. ఆమె కవిత్వం వ్యక్తిగత అనుభవాలను సామాజిక, సాంస్కృతిక, మరియు చారిత్రక సందర్భాలతో గాఢంగా అనుసంధానిస్తుంది. ప్రతిపదం, ప్రతిరూపకం విముక్తి, ధైర్యం, మరియు నిరసన భావాలను సమగ్రంగా ప్రతిబింబిస్తూ పాఠకుడిలోని చైతన్యాన్ని ఉత్తేజింప జేస్తుంది. ఈ రెండు కవయిత్రుల స్వరాలు మహిళల వ్యక్తిగత, సామాజిక, మరియు సాంస్కృతిక స్థాయిలలో స్వతంత్రత కోసం శక్తివంతమైన, లోతైన, సమగ్ర ప్రతిభావంతమైన కవిత్వవేదికగా నిలుస్తున్నాయి. వాటి స్వరాలు స్త్రీల ఆత్మగౌరవాన్ని, విముక్తిని, మరియు చైతన్యాన్ని సమగ్రంగాప్రతిబింబిస్తూ తెలంగాణ స్త్రీవాద సాహిత్యంలో స్థిరమైన గుర్తింపు నిచ్చాయి.

స్థానిక భాషాశైలి మరియు సాహిత్య పరిసరాలు :

తెలంగాణ వెనుకబడిన వర్గాల స్త్రీవాద కవిత్వంలో స్థానిక భాషాశైలి సమగ్ర భావ ప్రకటనకు కీలకపాత్ర పోషిస్తుంది, ఇదిపొర, గ్రామీణ మౌఖిక పదజాలంతో కలిసిపోయి భావోద్వేగాల మూలాన్ని పాఠకుడికి చాలా దగ్గరగా తీసుకు వస్తుంది. జూపాక సుభద్ర గారి ''అయ్యయ్యోదమ్మక్కా'' వంటి పాట్యాలు, ''నలరేగటిసాల్లు'' వంటి కవితా సంచికలు ప్రాంతీయ సంస్కృతి, నీడల మాటలు, సంక్షోభాల్లోని లోతైన భావాలను స్థానికశైలి ద్వారా ప్రతిఫలింపజేస్తాయి, ఇవి పీడన, ఆశ, నిరసన, విముక్తి భావాలను గాఢంగా వ్యక్తం చేస్తున్నాయి. అలాగే మెర్సీమార్గరెట్ గారి ''మాటల మడుగు'', ''కాలం నిలిపొత్తున్నవైపు'' వంటి సాహిత్య సంపుటులు స్థానిక సంస్కృతివన్నీ, జీవన పరిస్థితులన్నీ, సమాజపు నియమాలను విమర్శగా ప్రతిపాదిస్తూ వ్యక్తిగత భావాలను సమాజంతో సమన్వయమై వ్యక్తీకరిస్తాయి. వీటి ద్వారా భాషాశైలి సమగ్ర భావ వ్యక్తీకరణకు మెరుగైన వేదికగా మారినది స్పష్టమవుతుంది.

ఇక గోగుశ్యామల గారి ''నల్లపొద్దు'' వంటి సాహిత్య సంకలనాల్లో కూడ మాదిగ, ఉపకులాల వెనుకబడిన వర్గాల కథలు, సంప్రదాయాలు, వివక్ష సమగ్రంగా ప్రతిబింబించబడ్డాయి, ఈ రచనలు అధికార, వివక్ష, పోరాట భావాల మధ్య మహిళల స్వరాలను శక్తివంతంగా నిలబెట్టాయి. అలాగే స్త్రీవాద కవిత్వపు పరిసరాలు స్థానిక మాటలు, రూపకాలు, గాఢభావాల సంప్రదాయాలతో అనుసంధానమై అభివృద్ధి చెందడం కనిపిస్తుంది. ఈ విధంగా స్థానిక భాషాశైలి, సాహిత్య పరిసరాలు స్త్రీల చైతన్య, విముక్తి, మరియు ఆత్మగౌరవ భావాలను సమగ్రంగా పలికించే అస్త్రాలుగా నిలుస్తున్నాయి.

కవయిత్రుల వ్యక్తిగత అనుభవాలు :

తెలంగాణ వెనుకబడిన వర్గాల స్త్రీవాద కవయిత్రుల రచనలు వారి వ్యక్తిగత అనుభవాలను సమాజపు అసమానతల, పీడనాల, కులబంధాల మరియు లింగ వివక్షల నేపథ్యంలో లోతుగా ప్రతిబింబిస్తాయి. జూపాక సుభద్ర గారి ''అయ్యయ్యోదమ్మక్కా'' కవిత్వంలో గ్రామీణ జీవితంలో ఎదురైన కష్టాలు, కుటుంబపు బంధాల లోతులు, పేదరికం, మరియు సమాజపు నియమాల అడ్డంకులను ఆమె స్వరాల ద్వారా వ్యక్తీకరించటం గమనార్హం. అలాగే మెర్సీమార్గరెట్ గారి ''మాటల మడుగు'' కవిత్వంలో వ్యక్తిగత బాధలు, నిరసన, ధైర్యం, మరియు స్వతంత్రత కోసం చేసే పోరాట భావాలు గాఢంగా ప్రతిఫలిస్తాయి. గోగుశ్యామల గారి

"నల్లపొద్దు" కవిత్వంలో వ్యక్తిగత అనుభవాలు, గ్రామీణ పరిమితులు, కులవివక్షల ప్రభావం స్పష్టంగా దర్శించ బడతాయి, వీటి ద్వారా స్త్రీల స్వరాలు వ్యక్తిగత చైతన్యంతో సమగ్రంగా సమాజానికి చేరుస్తాయి. వీరి రచనలలో వ్యక్తిగత అనుభవాలు మాత్రమే కాక, ఆ అనుభవాలపై ఆధారపడి సామాజిక, సాంస్కృతిక, చారిత్రక సందర్భాలను లోతుగా అంచనా వేస్తూ, మహిళల ఆత్మగౌరవం, విముక్తి, మరియు చైతన్య భావాలను ప్రభావవంతంగా ప్రతిబింబిస్తున్నాయి. ప్రతిపంక్తి వారి జీవన అనుభవాలను, బాధలను, ఆశలను, నిరసనలను కలిపి, స్త్రీల స్వరాలను గాఢ, సమగ్ర, మరియు శక్తివంతమైన రూపంలో ప్రజల ముందుకు తెస్తుంది. ఈ విధంగా, కవయిత్రుల వ్యక్తిగత అనుభవాలు తెలంగాణ స్త్రీవాద సాహిత్యంలో మహిళల చైతన్యానికి, విముక్తికి, మరియు ఆత్మగౌరవానికి నిలకడైన ప్రేరణగా నిలుస్తాయి.

సాంఘిక వ్యతిరేకతలు మరియు నిరసన స్వరాలు :

తెలంగాణలోని వెనుకబడిన వర్గాల మహిళల కవిత్వం సాంఘిక వ్యతిరేకతలను, వివక్షలను, మరియు పీడనా లను తీవ్రంగా ప్రతిబింబిస్తుంది. జూపాక సుభద్ర గారి "అయ్యయ్యోదమ్మక్కా"వంటి కవిత్వంలో లింగ, కుల, ఆర్థిక అసమానతలను ఎదుర్కొన్న మహిళల అనుభవాలు ప్రతీపంక్తిలో వ్యక్తమవుతాయి. ఆమె పదజాలం, రూపకాలు, స్థానిక భాషాశైలి ద్వారా వ్యక్తిగత బాధలు సామాజిక సమస్యలతో సరిసమానంగా అనుసంధానమై, నిరసన స్వరాలను శక్తివంతంగా ప్రసారం చేస్తాయి. మహిళల స్వతంత్ర భావాలు, ధైర్యం, మరియు ఆత్మగౌరవం పాఠకునిలోని చైతన్యాన్ని ఉత్తేజింప జేసేలా ఈ రచనలు నిర్మాణాత్మకంగా ఉంటాయి.

ఇక మెర్సీమార్గరెట్ గారి "మాటల మడుగు" మరియు గోగు శ్యామల గారి "నల్లపొద్దు"వంటి రచనలు కూడా స్త్రీల నిరసన, సామాజిక నియమాల కట్టుబాట్లకు ప్రతిఘటనగా నిలుస్తాయి. వీరి కవిత్వం వ్యక్తిగత అనుభవాలను సామాజిక, సాంస్కృతిక, చారిత్రక సందర్భాలతో అనుసంధానించి, మహిళల విముక్తి, ఆత్మగౌరవ, మరియు చైతన్య స్వరాలను సమగ్రంగా ప్రతిఫలిస్తుంది. ప్రతిపదం, రూపకం, మరియు శైలి స్త్రీల వ్యతిరేకతలపై నిలబడి, పాఠకుని మనసులో చైతన్య, నిరసన, మరియు విముక్తి భావాలను స్పష్టంగా లేచిస్తుంది. ఈవిధంగా, తెలంగాణ వెనుకబడిన వర్గాల స్త్రీవాద కవిత్వంలోని సాంఘిక వ్యతిరేకతలు మరియు నిరసనస్వరాలు సమాజంలోని అసమానతలకు వ్యతిరేకంగా శక్తివంతమైన వేదికగా నిలుస్తున్నాయి.

నిరూపణ, ముగింపు మరియు చైతన్యానికి దారులు :

తెలంగాణ వెనుకబడిన వర్గాల స్త్రీవాద కవిత్వం ద్వారా మహిళల అనుభవాలు, బాధలు, మరియు నిరసన స్వరాలు సమాజానికి అందించబడిన నిరూపణగా నిలుస్తాయి. జూపాక సుభద్ర, మెర్సీమార్గరెట్, గోగు శ్యామల, మల్లాది లక్ష్మీదేవి వంటి కవయిత్రుల రచనలు వారి వ్యక్తిగత అనుభవాలను, సాంఘిక, చారిత్రక, మరియు లింగ అసమానతలకు వ్యతిరేకంగా ప్రతి ఘటనగా ప్రతిఫలింప జేస్తాయి. ఈ కవిత్వం వ్యక్తిగత బాధలను సామాజిక సమస్యలతో అనుసంధానిస్తూ, పాఠకుని మనసులో మహిళల చైతన్యాన్ని, ఆత్మగౌరవాన్ని, మరియు విముక్తి ఆకాంక్షను ఉత్తేజింపజేస్తుంది. వేర్వేరు స్వరాలు, రూపకాలు, స్థానిక భాషాశైలులు, మరియు పదజాలం ఈ చైతన్యాన్ని మరింత ప్రబలంగా, సమగ్రంగా ప్రతిబింబిస్తాయి. ఈ కవిత్వం కేవలం సాహిత్యపరమైన వ్యక్తీకరణ మాత్రమే కాదు, సమాజంలోని అసమానతలకు ఎదురుదాడి చేసే శక్తివంతమైన మార్గాలను చూపుతుంది. ప్రతిపంక్తి, ప్రతిస్వరం చైతన్యానికి దారితీస్తూ, స్త్రీల స్వతంత్రత, ఆత్మగౌరవం, మరియు విముక్తి కోసం ఒక స్పష్టమైన మార్గదర్శకంగా నిలుస్తుంది. తెలంగాణ వెనుకబడిన వర్గాల స్త్రీవాద కవిత్వం మహిళల చైతన్యా నికి, సామాజిక విముక్తికి, మరియు భవిష్యత్తులో సమానత్వ సాధనకు స్థిరమైన దారులను చూపిస్తూ సాహిత్యంలో శక్తివంతమైన ప్రేరణగా నిలుస్తుంది.

నిర్ధారణలు :

- వెనుకబడిన వర్గాల స్త్రీవాద కవిత్వం మహిళలపై

ఉన్న సామాజిక, కుల, లింగ అసమానతలను స్పష్టంగా వెలుగులోనికి తీసుకు వస్తుంది.

- కవయిత్రుల వ్యక్తిగత అనుభవాలు సమాజ విస్తృత సమస్యలతో అనుసంధానమై చైతన్య స్వరాలుగా మారుతున్నాయి.
- స్థానిక భాషాశైలి మరియుప్రాంతీయపదజాలం మహిళల భావప్రకటనను మరింత ప్రభావవంతంగా ప్రజలకు చేరుస్తుంది.
- ఈ కవిత్వంలో నిరసన, ఆత్మగౌరవం, మరియు విముక్తి భావాలు శక్తివంతమైన సామాజిక మార్పుకు దారి తీస్తున్నాయి.
- స్త్రీవాద కవిత్వం తెలంగాణలో మహిళల చైతన్యాన్ని పెంపొందిస్తూ సమానత్వ దిశగా మార్గనిర్దేశం చేస్తోంది.

సూచనలు :

- వెనుకబడిన వర్గాల స్త్రీలకు విద్య, ఆర్థిక స్వాయత్త్యం, మరియు సామాజిక అవకాశాలను పెంపొందించాలి.
- మహిళల స్త్రీ స్వరాలను, సాహిత్య చైతన్యాన్ని సమాజంలో మరింత గుర్తింపుగా మార్చాలి.
- స్థానిక భాషాశైలి, సాంస్కృతిక సంప్రదాయాలను చర్చల, వర్క్‌షాప్‌లు, మరియు పాఠ్యపుస్తకాల ద్వారా ప్రోత్సహించాలి.
- మహిళల నిరసన, ఆత్మగౌరవ, మరియు విముక్తి భావాలను సునంఘటిత సంఘాల ద్వారా సమాజానికి పరిచయం చేయాలి.
- స్త్రీవాద సాహిత్యంపై పరిశీలన, అధ్యయనాలు, మరియు ప్రచారాలను ప్రోత్సహించి భవిష్యత్తు తరాలకు చైతన్యాన్ని అందించాలి.

సూచనలు :

1. సుభద్ర, జూపాక. నన్ను నేనే బలకీ వ్రాసుకున్న కవితలు (సేకరణ). హైదరాబాదు: అన్వేషి, 2010.
2. శ్యామల, గోగు. వాడ పిల్లల కథలు. అన్వేషి, 2008.
3. బామా. కరుక్కు: ఆటవాళ్ల వేదన స్మృతి. సాహిత్య ప్రముఖ గ్రంథం, జనవరి 1992.
4. జూపాక, సుభద్ర. అయ్యయ్యో దమ్మక్కా. కథలు & కవితలు (తెలుగు).
5. సుజాత గిడ్ల. అంట్స్ అమ్మాంగ్ ఎలిఫెంట్స్: కాస్ట్, కుటుంబం, జీవిత పోరాటం. (ఆంగ్ల).
6. ఆర్య, చారూ, మరియు నబానీటా డేకా, సంపాదకులు. దళిత స్త్రీవాద సాంబోధనం: దళిత రచనలలో స్వరాలు. రౌట్లెజ్, 2021. (Arya, Charu, and NabanitaDeka, editors. Dalit Feminist Discourse: Voices in Dalit Writings. Routledge, 2021.)
7. బామా. వన్మం. హైదరాబాద్: నవయాన, 2002.
8. శ్యామల, గోగు. నేనే బలాన్ని: టి.ఎన్. సదాలక్ష్మి బతుకు కథ. హైదరాబాద్ బుక్ ట్రస్ట్, 2011.
9. శ్యామల, గోగు. నల్లపొద్దు: దళిత స్త్రీల సాహిత్యం 1921--2002. హైదరాబాద్ బుక్ ట్రస్ట్, 2003.
10. మార్గరెట్, మెర్సీ. మాటల మడుగు. మెర్సీ పబ్లికేషన్స్, హైదరాబాదు, 2015.
11. పావార్, ఉర్మిలా. మనం కూడా చరిత్ర సృష్టించాం: అంబేద్కరిట్ ఉద్యమంలో మహిళలు (We Also Made History). యూనివర్సిటీ ఆఫ్ చికాగో ప్రెస్ (అనువాదం), 2008.
12. జూపాక, సుభద్ర. అయ్యయ్యో దమ్మక్కా. కథలు & కవితలు (తెలుగు).

★★★

Vol. 23 | Spl. Issue 03 | March 2026 | BHAVAVEENA | ISSN No. : 2456-4702 | RNI No. APTEL/2003/12253

RNI No. APTEL/2003/12253 | Reffered Journal & Peer Reviewed Journals | ISSN No. 2456-4702

భావవీణ

కళలు, సాహిత్య, సాంస్కృతిక భాషాధ్యయన పత్రిక

BHAVA VEENA

Journal of Arts, Literary, Culture & Language Study

చిత్తూరు జిల్లా రచయిత్రుల స్త్రీ వాద కథలు - స్త్రీ జీవిత చిత్రణ

- టి. మంజుల

పరిశోధక విద్యార్థి, తెలుగు మరియు అనువాద అధ్యయనశాఖ, ద్రావిడ విశ్వవిద్యాలయం, కుప్పం.

స్త్రీవాదం

స్త్రీవాదం పదం వివరణ :

ఫెమినిజం Feminism అనే ఆంగ్లపదానికి స్త్రీ వాదం అనే పదాన్ని సమానార్థకంగా జయప్రభ గారు ఉప యోగించారు.

స్త్రీవాదం అంతర్జాతీయ నేపథ్యం :

1789లో ఫ్రెంచి విప్లవం ద్వారా మహిళలు తమ హక్కుల కోసం పోరాడారు. 1847లో ఇంగ్లండు చట్టసభలో మహిళా హక్కుల బిల్లు ప్రవేశపెట్టబడింది. 1848లో వ్యక్తి స్వాతంత్ర్యాన్ని చర్చిస్తున్నపుడు స్త్రీ విముక్తికి ప్రాధాన్య మిస్తూ మహిళా పోరాటం ప్రారంభమైంది. 1889లో పారిస్ అంతర్జాతీయ సమావేశంలో స్త్రీ పురుషుల సమాన హక్కుల ప్రస్తావన వచ్చింది. 1911లో చైనా విప్లవంలో స్త్రీలు కార్మిక పోరాటాల్లో పాల్గొన్నారు. ఆధునిక స్త్రీవాద ఆలోచనా ధోరణులకు అమెరికా ఆరంభస్థానం అయింది. 1975-85 మధ్య కాలాన్ని ఐక్యరాజ్య సమితి అంతర్జాతీయ మహిళా దశాబ్దంగా ప్రకటించింది.

స్త్రీవాదం - అంతర్జాతీయ రచనలు :

ప్రపంచంలో తొలి స్త్రీవాద గ్రంథంగా 1792లో ఇంగ్లాండు రచయిత్రి మేరీ హాల్ స్టోన్ క్రాఫ్ట్ రాసిన ఎవిండికేషన్ ఆఫ్ ది రైట్స్ ఆఫ్ ఉమెన్ అనే గ్రంథం ప్రసిద్ధి చెందింది. స్త్రీల హక్కులను గురించి, కుటుంబ వ్యవస్థను గూర్చి చర్చించిన మొట్ట మొదటి పుస్తకం ఇదే. సైమన్ ది. బొలియర్ అనే ఫ్రెంచ్ తత్వవేత్త ది సెకండ్ సెక్స్, బెట్టి ప్రీడన్ (అమెరికా)- ఫెమినైన్ మిస్టేక్, ది సెకెండ్ ఫేం అనే గ్రంథాలు రాశారు.

తెలుగులో స్త్రీ వాద నేపథ్యం :

తెలుగులో స్త్రీ జనోద్ధరణకు కంకణం కట్టుకున్న మొట్ట మొదటి మహనీయుడు కందుకూరి. ఈయన స్త్రీల కొరకు వివేకవర్ధిని పత్రిక స్థాపించి 'సత్యవతి చరిత్ర' అనే నవలను రాశాడు. గురజాడ అప్పారావు స్త్రీల దైన్యాన్ని పూర్ణమ్మ, కన్యక మొ॥ గేయాలలో చూపాడు. చలం స్త్రీకి లైంగిక స్వేచ్ఛ. వివాహం స్వాతంత్ర్యం ఉండాలని రచనలలో నొక్కి వక్కాణించాడు.

స్త్రీవాదం నిర్వచనాలు :

ఫెమినిజం స్త్రీ పురుషుల సమానత్వాన్ని కాంక్షిస్తుందే కాని స్త్రీలను, పురుషులను విడదీయదు. స్త్రీవాద దృక్పథమంటే స్త్రీల జీవితాల్లోని సాంఘిక, ఆర్థిక, రాజకీయ అంశాల్ని పురోగామి దిశగా మలుపు తిప్పగల దృక్పథం.

స్త్రీవాద కవయిత్రులు - రచనలు :

1972లో ఓల్గా (పోపూరి లలిత కుమారి) రాసిన "ప్రతి స్త్రీ ఓ నిర్మల కావాలి" అన్న కవితతో తెలుగులో స్త్రీవాదం ప్రారంభమైంది. మొట్ట మొదటి స్త్రీవాద రచయిత్రి ఓల్గా. "పెళ్లంటే పెద్ద శిక్ష, మొగుడంటే స్వేచ్ఛా భక్షకుడు. మేం

పాలిచ్చి పెంచిన జనంలో సగమే మమ్మల్ని విభజించి పాలిస్తోంది" అంటూ బందిపోట్లు కవిత ద్వారా సావిత్రి పేర్కొన్నారు. "ఈ వంటింటి సామ్రాజ్యానికి మా అమ్మో రాణి -అయినా చివరకు వంటింటి గిన్నెలన్నిటిపైనా మా నాన్న పేరే! అంటూ 'వంటిల్లు' కవిత ద్వారా వెల్లడించారు. "పైటను తగలెయ్యాలి" అంటూ తన కవిత ద్వారా జయప్రభ స్త్రీల ఆవేదనను తెలియజేశారు.

స్త్రీవాద రచయిత్రులు కథలు :

బండారు అచ్చమాంబ	- ధనత్రయోదశి, స్త్రీవిద్య
కనుపర్తి వరలక్ష్మమ్మ	- మూడు తీర్మానాలు
ఓల్గా	- రాజకీయకథలు
జయధీర్ తిరుమలరావు	- స్త్రీవాద కథలు
పి. సత్యవతి	- ఇల్లలకగానే
కొండెపూడి నిర్మల	- శత్రుస్పర్శ

చిత్తూరు జిల్లా స్త్రీవాద రచయిత్రులు - కథలు :

స్త్రీవాద భావజాలం ద్వారా ఉత్తేజితులై ప్రేరేపితులైన చిత్తూరు జిల్లా రచయిత్రులు అనేక కథలు రాశారు. చాలా మంది స్త్రీవాద దృక్కోణంతో అనేక కథలు రాశారు.

- వారి కథల్లో అడుగడుగునా స్త్రీవాద భావజాలం కన్పిస్తుంది.
- వారు స్త్రీవాద ఉద్యమంలో ప్రత్యక్షంగా పాల్గొనక పోయినా సాటి స్త్రీ రచయిత్రులుగా తమ కథల ద్వారా సమాజంలో స్త్రీల పట్ల జరుగుతున్న అన్యాయాలను ఎత్తి చూపుతూ స్త్రీలలో అభివృద్ధిని కాంక్షిస్తూ సమాజం పట్ల తమ బాధ్యతను సక్రమంగా నిర్వర్తించారని చెప్పవచ్చు.

రచయిత్రులు	కథలు
1. ఎం. ఆర్. అరుణకుమారి	- మన్నులో మన్నునై, సాగరకోయిల
2. ఎ. పుష్పాంజలి	- అమ్యూజింగ్స్
3. పద్మావతి వాచస్పతి	- ప్రేమపందిరి, జ్ఞాన నేత్రం
5. అరుణా సహదేవ్	- వేగుచుక్క
5. డా॥ కె.వి. లక్ష్మీరాఘవ	- నావాళ్ళు
6. ఎం. కె. దేవకి	- ముళ్ళ దోవ
7. ఆర్ వసుంధరా దేవి	- ఆర్ వసుంధరాదేవి కథలు
8. కానాల నాగలక్ష్మమ్మ	- చీకట్లో చిరుదీపాలు, నమ్మకం

- వీరు తమ కథల ద్వారా స్త్రీవాద దృక్పథాన్ని విశ్లేషిస్తూ సమకాలీన సమాజంలో స్త్రీలు ఎదుర్కొంటున్న అన్ని సమస్యలను విభిన్న కోణాల్లో చిత్రించారని చెప్పవచ్చు.
- సమాజ హితాన్ని కోరడమే సాహిత్య లక్ష్యం కాబట్టి వీరి కథలు కూడా సమాజంపై ప్రభావం చూపాయని చెప్పవచ్చు.

చిత్తూరు జిల్లా స్త్రీవాద రచయిత్రుల కథలలోని అంశాలు.

1. సామాజికాంశాలు :

సామాజికాంశాలలో ముఖ్యంగా ఆడవారు ఎదుర్కొంటున్న సమస్యలు వివరించటం జరిగింది. వాటిలో బాల్యవివాహాలు, అవిద్య, స్వేచ్ఛ లేనితనం, లైంగిక దాడులు, అత్యాచారాలు మొదలైనవి. ఈ సమస్యలు స్త్రీల అభివృద్ధికి ప్రతిబంధకాలుగా ఉన్నాయి.

ఈ సమస్యలను రచయిత్రులు తమ కథలలోని పాత్రల ద్వారా చక్కగా చిత్రీకరించారు.

సతీసహగమనం పూర్తిగా నిర్మూలించబడిందని చెప్పవచ్చు. కానీ ప్రభుత్వం ఎన్ని చట్టాలు చేపట్టినప్పటికీ అక్కడక్కడా బాల్య వివాహాలు ఈనాటికీ జరుగుతూనే ఉన్నాయి. వాటిని అరికట్టలేకపోతున్నామనీ చెప్పాలి. రాయలసీమ రచయిత్రుల కథలులో 'ది మెర్సి కిల్లింగ్' అన్న కథ ద్వారా తెనాలి సుశీలాదేవి గారు పిల్లలకు పెళ్ళిళ్ళు చేయడం ద్వారా బాల్యంలోనే ఆడవారికి వారు పడుతున్న కష్టాలు, సమస్యలు గూర్చి కళ్ళకు కట్టినట్లు చిత్రీకరించారు. ఆ కాలంలో స్త్రీలు ఎదుర్కొంటున్న ప్రధాన సమస్య వరకట్న వేధింపులు. ఎం.కె. దేవకి ముళ్ళదోవ కథా సంపుటిలో అంగడి సరకు అనే కథ ద్వారా కోడలిని భర్త, అత్తమామలు వరకట్నం కోసం ఎలా

వేధిస్తారో స్పష్టంగా తెలియజెప్పారు. సమాజం అంటే ఏమిటో, సమాజంలోని ప్రజల జీవన విధానం ఎలా స్త్రీల జీవితాలపై పరిణామం చెందిందో, ఎలా ఈ పరిణామాలు ప్రభావం చూపాయో రచయిత్రులు కథల ఆధారంగా చక్కగా విశ్లేషించారు.

సాంస్కృతికాంశాలు :

ఆనాటి బాలికల జీవన స్థితిగతుల గూర్చి, పుట్టినింట మెట్టినింట ఆడవారి సమస్యలు, వితంతువైన బాలికల దుర్భర స్థితిగతులు, ఆనాటి నాగరిక సమాజాన్ని కళంకితం చేస్తున్న దుర్మార్గపు దేవదాసీ వ్యవస్థ స్వరూప స్వభావాలను, భర్త చనిపోయిన స్త్రీకి ముత్తైదువతనాన్ని తొలగించటం, ఇలాంటి మూఢాచారాల వల్ల స్త్రీలు పడుతున్న బాధలను గూర్చి రచయితలు తమ కథల ద్వారా చక్కగా విశ్లేషించారు.

ఆర్థికాంశాలు :

ఆనాటి కాలంలో స్త్రీకి ఆర్థిక స్వేచ్ఛ లేదనే చెప్పాలి. స్త్రీలు ఆర్థికంగా ఎదుర్కొంటున్న సమస్యల గూర్చి రచయిత్రులు తమ కథల ద్వారా క్లుప్తంగా చిత్రీకరించారు. బాలికలను ఇతరుల ఇళ్లలో జీతానికి పనిలో పెట్టుట, డబ్బుకు ఆశపడి వృద్ధుడికి యువతినిచ్చి పెళ్ళి చేయుట, భర్త చెడు వ్యసనాలకు లోనైతే భార్య జీవితం ఎంత దుర్భరం, డబ్బు లేదని బాలికను చదువు మాన్పించడం మొదలగునవి.

చైతన్యాంశాలు :

స్త్రీలు పడుతున్న సమస్యలను చిత్రించడమే కాకుండా సమస్య వచ్చినప్పుడు ఎదుర్కొని పోరాడి ఎలా ఆత్మ స్థైర్యాన్ని నింపుకోవాలో కూడా తమ కథల ద్వారా తెలియజేశారు. స్త్రీలు చైతన్యవంతులై కలసికట్టుగా ముందుకు నడిస్తే సాధించలేనిది ఏదీ లేదని రచయిత్రి అరుణా సహదేవ్ 'వేగుచుక్క' కథా సంపుటి ద్వారా తెలియజేశారు. చిన్న వయస్సులోనే నాకు పెళ్ళి వద్దు అంటూ ధిక్కరించిన కూతురు. ఇలా రచయిత్రులు తమ కథల ద్వారా స్త్రీలలో చైతన్యం తీసుకురావడానికి ప్రయత్నించారని చెప్పవచ్చు.

చిత్తూరు జిల్లా రచయిత్రులలో ఒకరైన ఎం.ఆర్. అరుణకుమారి గురించి విషయ వివరణ:

ఎం.ఆర్. అరుణకుమారి గారు చిత్తూరులో 'పల్లెసీమ' పత్రికకు సంపాదకత్వం వహించి పత్రికా రచయితగా, నాటకకర్తగా, కార్మిక నేతగా ఎనలేని సేవలు అందించి అప్పట్లో మాజీ రాష్ట్రపతి శ్రీనీలం సంజీవరెడ్డి గారిచే ప్రశంసలందుకున్న శ్రీ యం. ఆర్. చంద్ర గార్ల కుమార్తె.

అరణకుమారి గారి తల్లిదండ్రులు శ్రీమతి అలివేలమ్మ, శ్రీ యం.ఆర్. చంద్ర గారు. శ్రీ యం.ఆర్. చంద్ర గారు కలాన్ని కరవాలంగా మలచి సమాజంలో వేళ్ళూను కొంటున్న అనాహూత ధోరణులను తునుమాడటానికి కలం పట్టారు. ఈయన నాటకకర్తగా దర్శకుడిగా, నటుడిగా, పాత్రికేయుడిగా, గేయరచయితగా సుప్రసిద్ధులు. అయన రచనల ప్రభావం రచయిత్రిపై ఉందని చెప్పవచ్చు. నాటకీయత, సంభాషణా చతురత, శిల్ప విన్యాసం మొదలైన వాటిని నాన్న నుంచి పుణికిపుచ్చుకున్నది.

అరుణ కుమారు గారు B.Sc., M.A., D.Ed., చేసి 1983 నుంచి చిత్తూరులో మండల ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయురాలిగా ఉద్యోగ ప్రస్థానంలో ఉంటూ వున్న రోజుల్లో 'జిల్లా ఉత్తమ ఉపాధ్యాయిని అవార్డ్' పొందారు. "ఆమెకు జీవితం పట్ల సమాజంలోని స్థితిగతుల పట్ల చక్కని అవగాహన, శాస్త్రీయమైన ఆధునిక దృక్పథం ఉన్నాయని చెప్పివచ్చు. తినే తిండి ఆరోగ్యాన్ని నిర్ణయిస్తుంది. చదివే సాహిత్యం ఒక రచయిత స్థాయిని నిర్ణయిస్తుంది. ఈమె రచనలే తెలుగు సాహిత్యంలో అరుణోదయం లా వికసించి పరిపుష్టిని అందించాయి. ఆమెకు మంచి పేరు తెచ్చిపెట్టాయి.

ఆమె వచనా శైలి నివురు కప్పిన నిప్పులాంటిది. నివుర, వచనమైతే నిప్పు అందులో దాగిన కవిత్వం. కథనంతా సంభాషణలపైనే నడిపించి రక్తి కట్టించే శిల్ప కళాకౌశలం ఆమె ప్రత్యేకత. అరుణ కథల్లో స్త్రీ జన పక్షపాతం ఉంటుంది. అప్పటి సామాజిక పరిస్థితులకు అనుకూలంగా స్త్రీ పడుతున్న సమస్యల్ని, బాధకాల్ని ప్రపంచానికి తెలియజెప్పాలని అనుకున్నారు.

పురుషాధిక్యతను నిర్మూలించడమే ధ్యేయంగా కథలు, కథాసంపుటాలు రచించారు. స్త్రీని వ్యక్తిత్వం లేని ప్రాణిగా, బిడ్డలు కనే సాధనంగా చాకిరీ చేసే యంత్రంగా భావించడాన్ని దూషించారు. మను నీతిని నిలదీస్తూ పురుషాధిక్యత ఇంకానా ఇకపై చెల్లదు అని గర్జించారు.

అరుణ గారు రచించిన కథా సంపుటాలు: 3. అవి 1) వేగుచుక్క 2) సాగరకోయిల 3) మన్నులో మన్నునై

వేగుచుక్క కథా సంపుటిలోని మాతృదేవోభవ అనే కథలో తల్లి చనిపోయినా చివరి చూపు చూడటానికి రాని కొడుకు, తన తల్లి అస్థికలనైనా నీ చేతులతో పుణ్యనదిలో కలుపమంటూ తన అక్క మొరపెట్టుకోవటం మనసుని కలచివేస్తుంది.

తల్లిదండ్రులు తమకు కుమారుడు జన్మించాలని తమను పున్నామ నరకం నుండి రక్షించేది తన కుమారుడే అని భావిస్తారు. అందుకోసం ఎన్నో నోములు, వ్రతాలు చేస్తారు. దేవుళ్ళని పూజిస్తారు. మొక్కుకుంటారు. ఈ కథలో తల్లి తనకు పుత్రుడు జన్మించాడని ఎంతగానో సంతోషిస్తుంది. గారాబంగా పెంచుతుంది. తను కష్టపడి తన బిడ్డకి ఉన్నత చదువులను చదివిస్తుంది. అలా చదివి పైస్థాయికి ఎదిగిన ఆ కుమారుడు తన తల్లి చని పోయినదని తెలిసినా చివరి చూపు చూడటానికి ఆతల్లికి అంత్యక్రియలు చేయడానికి వెళ్ళడు. వాళ్ళ అక్క తల్లికి అన్ని కార్యాలు చేసి ఈ అస్థికలనైనా నీ చేతులతో పుణ్య నదిలో కలిపి అమ్మ ఆత్మకు శాంతి కలిగించు అని వేడు కుంటుంది. ఇలాంటి సంఘటనలను ఇప్పటికీ సమాజంలో అక్కడక్క చూస్తున్నాం. అన్య దేశాలల ఉద్యోగాలు చేస్తూ తల్లి దండ్రులను పట్టించుకోకుండా "ఎప్పుడో అమావాస్యకో, పౌర్ణానికో ఒక ఫోన్ కాల్ చేస్తూ తాము పనులలో ఎప్పుడూ బిజీ బిజీ అని చెప్తూ ఉంటారు.

ఆ తల్లి దండ్రులు తమ పిల్లలు తమను చూడటానికి ఎప్పుడో ఒకప్పుడు వస్తారని ఎదురుచూస్తూ ఎదురు చూస్తూ కాలం గడుపుతుంటారు. కొంత మంది మానసిక వేదనతో ఆరోగ్యం పాడుచేసుకొని వృద్ధాప్యం మీద పడటంతో దగ్గరుండి చూసుకునే వారు లేక మానసిక చింతతో చనిపోయిన సందర్భాలు ఉన్నాయి. ఆ చని పోయిన తల్లిదండ్రులను కనీసం చూడటానికి కూడా రాని వారు ఉన్నారు.

దేవుడు, ఉన్నాడో లేదో తెలియదు. కానీ రాతిలో దేవున్ని చూస్తాం. గుడులు కట్టించి ఆ గుడిలోని దైవాన్ని పూజిస్తాం. కొబ్బరికాయలు కొడుతాం. కోరకలను తీర్చమని వేడుకంటాం. ఆ కోరికలు నెరవేరుతాయో లేదో కూడా తెలియదు. మన కంటికి కనిపించని దైవత్వానికి ఎంతో విలువ ఇస్తాం. పుట్టినప్పటి నుంచి కంటికి రెప్పలా కాచు కుంటూ అడిగినవన్నీ అందిస్తూ మన కోరికలను నిత్యం తీరుస్తున్న అమ్మ, నాన్నలని మాత్రం దైవంగా ఎందుకు చూడకూడదు? మన కంటికి కనిపించే నిజమైన దేవుళ్ళు తల్లిదండ్రులే.

ఒక భార్య భర్త తల్లిదండ్రులు అయినప్పటి నుంచి తమ పిల్లలని అపురూపంగా కంటికి రెప్పలా కాపాడుతారు. తమ పిల్లల కోసమే తమ జీవితం అన్నట్లు కష్టపడుతారు. వారికి మంచి భవిష్యత్తును ఇవ్వాలని నిరంతరం శ్రమిస్తారు. వేలకు వేలు ఫీజులు కట్టి ఉన్నత చదువులు చదివిస్తారు. అప్పు చేసి మరీ అన్య దేశాలకు పంపి చదివి స్తారు. మా అమ్మాయి, అబ్బాయి ఫారిన్‌లో ఉన్నారంటూ గొప్పగా పది మందికి చెప్పి మురిసిపోతుంటారు. చివరికి ఆ పిల్లలే ఒక స్థాయికి ఎదిగాక రెక్కలొచ్చిన పక్షి పిల్లలు ఎగిరిపోయినట్లుగా తల్లిదండ్రుల నుంచి దూరం అయి వారిని నిర్లక్ష్యం చేస్తున్నారు. ఎవరి వల్ల వారు ఇంత స్థాయికి ఎదిగారన్న విషయాన్ని మర్చి పోతున్నారు. పూర్వ కాలంలో రాజుల దగ్గర నుంచి అందరూ తల్లిదండ్రులను పూజిస్తూ దైవంగా భావించారు. శ్రవణ కుమారుడు వృద్ధాప్యంలో తన తల్లిదండ్రులు పుణ్యక్షేత్రాలను చూడాలనే కోరికను తీర్చడానికి కావడిలో తన తల్లిదండ్రులను ఉంచి తన భుజంపై మోసుకుంటూ వెళ్ళాడు. రాముడు తండ్రి మాట కోసం 14 సం॥ అరణ్య వాసం చేశాడు. శివాజీ ప్రతి స్త్రీ లోనూ తన తల్లిని చూసుకునేవాడు. అలాంటి ఎందరో మహాత్ములు జన్మిం చిన కర్మభూమి మనది.

అరుణకుమారి గారు అప్పటి సామాజిక పరిస్థితులకు అనుగుణంగా కథలను చిత్రీకరించారు. కూతురుని

విధవరాలిని చేయడాన్ని ధిక్కరించిన ఒక తల్లి ధైర్యాన్ని "విషాధగీతం" అనే కథ ద్వారా చక్కగా విశ్లేషించారు.

ఈ కథలో సుధీర పెళ్లయిన అయిదేళ్ళకు ఎందరో దేవుళ్ళను దర్శించి ఎన్నో నోములు, వ్రతాలు చేసి ఎందరో మరెందరో డాక్టర్లను సందర్శించి లెక్కకు మించిన మందులేసుకుని గర్భందాల్చి ఒక ఆడబిడ్డకు జన్మ నిస్తుంది. ఆపాపకు రోజా అని నామకరణం చేస్తుంది. అమ్మాయికి పూర్తి అల్లారుముద్దుగా పెంచుతుంది. అమ్మాయి డిగ్రీ పూర్తి కాగానే సొంత ఊళ్ళో ఉద్యోగం చేసే అబ్బాయికిచ్చి వివాహం జరిపిస్తుంది. పసుపు పారాణి ఇంకా ఆరనే లేదు మెడలో పచ్చని పసుపు తాడు కరకు మాయనే లేదు. పెళ్ళైన రెండో నెల పూర్తి కాకుండానే రోజా భర్త యాక్సిడెంట్ లో మరచిస్తాడు.

భర్తను కోల్పోయిన స్త్రీ భౌతిక అలంకరణలన్నిటినీ తొలగించుకోవాల్సి ఉంటుంది. విచిత్రమేమిటంటే తాళిబొట్టు, మెట్టెలు తప్ప తక్కినవన్నీ అంటే పూలు పెట్టుకోవడం, బొట్టు, కాటుక పెట్టుకోవటం వంటివి భర్త ప్రమేయం లేకుండా వచ్చినవి. వాటిని కూడా తొలగిస్తారు. అలా తొలగించే అధికారం ఎవరికీ లేదు. అయినా తొల గిస్తారు. అలా చేయడాన్ని కథలో సుధీర అంగీకరించదు. తన కూతురుని విధవరాలిని చేయడానికి ససేమిరా ఒప్పుకోను అంటుంది.

ఒక అమ్మగా, అక్కగా, చెల్లిగా, ప్రియురాలిగా, ఇల్లాలిగా, కూతురిగా, మనుమరాలిగా, మగవాడి ప్రతి జీవన దశలోనూ తన ప్రేమతో, త్యాగంతో, అలరిస్తూ జీవిత గమ్యానికి చేరుస్తుంది. అదే ఆడది .. దురదృష్ట వశాత్తు భర్తను కోల్పోతే ఇక తన జీవితం మకరందా నందాన్ని సహజ అలంకారాన్ని కూడా త్యాగం చేయాల్సిం దేనా? అని సుధీర ప్రశ్నిస్తుంది. తన బిడ్డ బతుకు వసంతంలో శిశిరమై పోకూడదని ఒక్కసారిగా దృఢ నిశ్చయంతో లేచి ఇది అభ్యర్థన కాదు ఆదేశం అంటూ తన కంఠం గంభీరతల్లో పూలు తెంచేయబోతున్న చేతుల్ని, నుదుట కుంకుమ చెరిపేయబోతున్న చేతుల్ని వెనక్కి విరిచి పట్టుకొని గాజులు పగలగొట్టబోతున్న చేతుల్ని విస్మయపరుస్తుంది. తన చేతిలోని పసుపు కూతురి మొహానికి రాసి కుంకుమను నుదుట దిద్దుతూ స్థిరకంఠంతో పలుకుతుంది. మీరంతా నన్ను నా కుటుం బాన్ని వెలివేసినా సరే నా బిడ్డ పసుపు కుంకాలు మాత్రం చెదరనీయను అంటూ సాహసోపేతమైన నిర్ణయం తీసుకుంటుంది.

సుధీర లాంటి ఆడవాళ్ళు ధైర్యంగా ముందుకు సాగితే తప్ప మిగిలిన స్త్రీలలో మార్పురాదు. తన కూతురిని అటువంటి పరిస్థితులలో చూడలేని సుధీర ధైర్యంగా ఎదురించింది. తన బిడ్డ పసుపు కుంకాలు మాత్రం చెదరనీయను అని గట్టిగా చెప్పింది. ఆమె సాహసానికి మెచ్చుకోక తప్పదు. చిన్న వయసులోనే భర్తను కోల్పోయిన స్త్రీ జీవితమంతా సమాజంలో ఎలా బ్రతకగలదు. ఆమెకు మళ్ళీ వివాహం జరిపించి కొత్త జీవితాన్ని అందించాలి. భార్య చనిపోయిన కొద్ది రోజులకే భర్త ఏవిధంగా వివాహం చేసుకుంటాడో అదే విధంగా భార్య (వితంతువు)కు కూడా వివాహం జరిపించాలి. అప్పుడే సమాజంలో సమానత్వం ఉంటుంది. సమాజ పురోగతి జరుగుతుంది.

ముగింపు :

ఆర్థిక స్వేచ్ఛ లేకుండా, బయటకు వెళ్ళే స్వతంత్ర్యం లేకుండా వంటింటి కుందేలులా ఇంటిపట్టున ఉండి ఇంటి పనులు చేసుకుంటూ, ఇంటిని చక్కదిద్దుకుంటూ భర్త, పిల్లల యోగక్షేమాలు చూసుకుంటూ, చదువుకునే అవకాశమే లేకుండా అబల అని ముద్ర వేసుకున్న అనాటి స్త్రీ జీవితం నేడు పూర్తిగా మారిందనే చెప్పుకోవాలి.

నేటి కాలంలో స్త్రీలు చదువులో, ఉద్యోగాల్లో ముందుకు దూసుకెళుతున్నారు. అబల కాదు సబల అని నిరూపిస్తూ పురుషులతో ధీటుగా అన్ని రంగాల్లో అభివృద్ధి వైపు అడుగులు వేస్తున్నారు. పూర్తి ఆర్థిక స్వేచ్ఛను అనుభవిస్తున్నారు. ప్రభుత్వం స్త్రీల విద్యకై చాలా సౌకర్యాలు కల్పిస్తోంది.

- ➔ ఇలా స్త్రీకి స్వాతంత్ర్యం రావడం వెనుక చాలా కృషి ఉందని చెప్పవచ్చు.
- ➔ ఈ విజయం ఎంతో మంది సాంఘిక నాయకుల ఉద్యమాలు, స్త్రీవాద రచయిత్రుల కృషి ఫలితమే అని చెప్పవచ్చు.

ఉపయుక్త గ్రంథాలు :

1. స్నేహిత, డా॥ కిన్నెర శ్రీదేవి, చినుకు పబ్లికేషన్, 2015
2. జ్ఞాననేత్రం, పద్మావతి వాచస్పతి, విక్టరీ ప్రెస్, 1965
3. నావాళ్ళు, డా॥ లక్ష్మీ రాఘవ, జయంతి పబ్లికేషన్స్, 2014
4. ఎంకె. దేవకి, ఎం.కె. దేవకి, దీప్తి టెక్నికల్ ప్రింటర్స్, 2005.
5. రాయలసీమ రచయిత్రుల కథలు, డా॥ ఎం. హరికిషన్, దీప్తి పబ్లికేషన్, 2020
6. మన్నులో మన్నునై ఎం.ఆర్. అరుణకుమారి, ప్రజాశక్తి డైలీ ప్రింటింగ్ ప్రెస్, 2006.
7. ఆర్. వసుంధరాదేవి కథలు, ఆర్. వసుంధరాదేవి, వసుంధర పబ్లికేషన్స్.
8. అమ్యూజింగ్స్ కథలు, ఎ.పుష్పాంజలి, విజయవాణి ప్రింటర్స్ 2010.
9. సాగర కోయిల, ఎం.ఆర్. అరుణకుమారి, పృథ్వి పబ్లికేషన్స్, 2003.
10. వేగుచుక్క, అరుణాసహదేవన్, పృథ్వి ప్రచురణ, 1996.

★★★

Vol. 23 | Spl. Issue 03 | March 2026 | BHAVAVEENA | ISSN No. : 2456-4702 | RNI No. APTEL/2003/12253

RNI No. APTEL/2003/12253 | Reffered Journal & Peer Reviewed Journals | ISSN No. 2456-4702

భావవీణ

కళలు, సాహిత్య, సాంస్కృతిక భాషాధ్యయన పత్రిక

BHAVA VEENA

Journal of Arts, Literary, Culture & Language Study

రసరాజు విజయభారతంలో - అమృతకౌర్ మహిళా అభ్యుదయం మరియు సామాజిక అంశాలు

- పెదపోలు శివ ప్రసాద్

పరిశోధక విద్యార్థి, తెలుగు విభాగం, మద్రాస్ విశ్వవిద్యాలయం, చెన్నై.

ఆధునిక తెలుగు పద్య సాహిత్యంలో గురజాడ అప్పారావు, రాయప్రోలు సుబ్బారావు, దేవులపల్లి కృష్ణశాస్త్రి, శ్రీ శ్రీ , దాశరథి కృషమాచార్యులు, ఆరుద్ర, దేవకొండ బాలగంగాధర్ తిలక్, డా.సి.నారాయణ రెడ్డి వంటివారు ఆధునిక సాహిత్యంలో విశేషమైన కృషి చేశారు. ఇదే కోవలో అత్యద్భుతమైన రచనలు చేసిన మరొకవి రసరాజు.

రసరాజు పరిచయం :

ఈ ఆధునిక యుగపు దిగ్గజ కవుల పరంపరలో చెప్పకోదగ్గ మరో రచయిత రంగినీని సత్య నారాయణ రాజు సంక్షిప్తంగా 'రసరాజు' అనే పేరుతో ప్రసిద్ధడయ్యారు. షూమారు ఏడు పదులకు పైగా చిన్న కథలు, గేయాలు, పద్యాలు కవితా సంపుటాలు, వాని కవితలు, గజల్స్ వీటితో పాటు పత్రికలకు సాహితీ విషయాల కాలమ్స్ ఇవి మాత్రమే కాకుండా సినిమా పాటలతో తెలుగు ప్రజలను ఊర్రూతలూగించారు. వీరుతూర్పుగోదావరి జిల్లా పాశర్లపూడి లంకలో రంగినీల కాశిరాజు, వేంకమాంబ దంపతులకు 1943 అక్టోబర్ 4న భట్ల మకుటూరులో జన్మించారు. రసరాజు గారికి చిన్న నాటి నుండే సాహిత్యభిలాష ఉండేది. వీరు సినిమాలకు పాటలు వ్రాయడం జరిగింది. అసెంబ్లీ రౌడి చిత్రానికి వీరు వ్రాసిన పాట 'అందమైన వెన్నెలలోన అచ్చ తెలుగు పడుచు' ఈ పాట తెలుగు నాట పెద్ద హిట్ అయ్యింది. రసరాజు 18 కుటుంబ కథలు 34 సామాజిక కథలు, హాస్యకథలు, రాజకీయ కథలు ఎన్నో వ్రాశారు.

మద్రాస్ కళాసాగర్ ఫిల్మ్ అవార్డు, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఉగాది విశిష్ట సాహితీ పురస్కారాలు, పద్మ భూషణ్ డా. బోయిభీమన్న వంటి ఎన్నో పురస్కారలు లభించాయి.

విజయ భారతం :

అభ్యుధయం - అభ్యుదయం అంటే కనిపించని కల్పిత శత్రువు మీద కన్ను లెర్రజెయ్యడం కాదు, కనిపిస్తున్న దురాక్రమణ దారుల మీద తుపాకీ లెక్కు పెట్టడం.

దేశభక్తి - దేశభక్తి అంటే విదేశీ వస్తువుల్ని బహిష్కరించడం కాదు ప్రాణాలను పణంగా పెట్టి 'పులికొండ' కు ఎగబ్రాకడం.జాతీయ సమైక్యమంటే గంగాజలాన్ని తెచ్చి గోదావరిలో కలపడం కాదు. పంజాబీలను తెచ్చి తెలుగింట నిల్పడం. త్యాగం - త్యాగం అంటే పదవులు పరిత్యజించడం కాదు మధు పర్కాలతో మగణ్ణి రణ రంగానికి పంపటం వంటి విశేషాలతో వీరబోజ్యమైన రసరమ్య పద్యకావ్యం 'విజయ భారతం'. ఇది భారతీయ ఆత్మను ధ్వనింపజేసే జాతీయకావ్యం. ఈనాటి హైటెక్ యువతి,

యువకులు విన్నా పులకింతలు గిలిగింతలు పెట్టే అంశాలు ఎన్నో మనకు కన్పిస్తాయి.

ఇక కథ విషయానికి వస్తే ఒక సైనికుని వీరగాథ. నాయకుడు 'రణసింగ్' నాయిక - అమృత. ఈమె సిక్కు వంశానికి చెందినా ఒకరకంగా ఆమె తెలుగింటి ఆడ పడుచే 'రణసింగ్', అమృతను తెలుగు సంప్రదాయాన్ని ప్రతిబింబించేలా వివాహం చేసుకున్నాడు.

తొలిరాత్రి గడవక ముందే భారత్, పాకిస్థాన్‌తో కాశ్మీర్ లోయలో జరిగిన యుద్ధానికి వెళ్లాడు. అరివీర భయం కరంగా యుద్ధం చేసి గాయాలపాలయ్యాడు. అప్పటి ప్రధాని లాల్ బహుదూర్ శాస్త్రి స్వయంగా పరామర్శ చేసిన సందర్భంలో రణసింగ్ ను పలుకరించిన వచ్చిన ప్రధానికి గౌరవ సమర్పణ చేయలేక మరియు శత్రువు పేల్చిన తుపాకీ గుండు తగిలి బాధాపడుతున్న సందర్భంలో అక్కడే వున్న సైన్యాధిపతులు జరిగిన విషయాలను శాస్త్రి గారికి తెలియజేయడం మరియు శాస్త్రి గారు జరిగిన విషయాలను పూర్తిగా అర్థం చేసుకున్ని కోనసీమ ప్రాంతం నుండి ప్రత్యేక విమానంలో అమృత సైనిక శిబిరానికి రప్పించటం వంటి అంశాలు విజయ భారతంనకు మరింత వన్నె కీర్తి ప్రతిష్టలు తెచ్చి పెట్టాయి.

ధీర వనిత - అమృత కౌర్ ఔనత్యం :

నూతన వధువు అమృత తన తొలిరేయి ఊహించు కుంటూ ఉండగా ఇద్దరు శోభన గృహంలో ప్రవేశించగానో అదే సమయంలో యుద్ధపిలుపు సరిగ్గా శోభనం రాత్రి సమయంలోనే యుద్ధ పిలుపు (టెలిగ్రామ్) వస్తుంది. ఆ సమయంలో నవ వధువు ఏ మాత్రం సంకోచించుకుండా తన వేలిని కోసుకుని నెత్తుటితో భర్తకు వీర తిలకం దిద్ది రణరంగానికి పంపిస్తుంది. వ్యక్తిగత సుఖం కంటే దేశ హితమే మిన్న ఒక సైనికుడి జీవితంలో వ్యక్తిగత ఆనందాల కంటే దేశహితమే మిన్న అన్న సామాజిక స్పృహను కనిపిస్తాయి. ఒక సైనికుడి జీవితంలో వ్యక్తిగత సంబంధాలు సుఖం కంటే దేశ భద్రత ప్రధాన కర్తవ్యం మని భార్య కుడా ఆ త్యాగంలో భార్య భర్తల ఇద్దరూ సమాన భాగమని అని నిరూపించింది. వీర మాతలు - వీర వధువులు భారత దేశ చరిత్రలో స్త్రీలు కేవలం గృహిణులుగానే కాకుండా తమ భర్తలను , కుమారులను యుద్ధానికి ప్రోత్సహించే వీరనారీలుగా వర్ణించారు.

సరిహద్దు భద్రత, పొరుగుదేశల కుతంత్రాల పట్ల ముఖ్యంగా పాక్ ప్రస్తావన పొరులు మరియు సైనికులు అప్రమత్తంగా ఉండాలనే జాతీయ భావాన్ని ఈ పద్యాలు రగిలిస్తాయి. దేశ ప్రయోజనాల కోసం ఎంతటి త్యాగానికి కైనా సిద్ధ పడాలనే సందేశాన్ని ఇది అందిస్తుంది.

'దేశం అంటే మట్టి కాదోయ్...' దేశం అంటే మనుషు లోయ్ అన్న గురజాడ మాటలకు ప్రతి రూపాలు. కష్ట కాలంలో వ్యక్తిగత స్వార్థాన్ని వీడి, సామాజిక ప్రయోజనం కోసం నిలబడటమే ఉత్తమమైన మనిషి లక్షణమని ఈ కావ్యం ప్రభోదిస్తుంది.

అమృతకౌర్, రణసింగ్ సైనిక దంపతుల మధ్య జరిగే ఉద్వేగభరితమైన ఘట్టాన్ని ఆవిష్కరిస్తోంది. పెళ్లయిన కొత్తలోకూడా దేశం కోసం భర్తను పంపుతున్న ఒక వీర వనిత ధైర్యాన్ని ఇవి చాటి చెబుతున్నాయి భరత మాత ఆపదలో ఉంటే మనకు ఈ శోభన రాత్రి ఎందుకు ? మన ఇద్దరి గౌరవం దేశ రక్షణలో ఉంది అని ఆ వీర వనిత తన భర్తతో అంటుంది. తక్షణమే అతనికి విజయ తిలకందిద్దుతుంది. ఆ సమయంలో వారిద్దరి కళ్లలోనూ దేశభక్తి ఉరకలు వేస్తుంది. వారిద్దరిలో ప్రవహిస్తున్నది సామాన్య రక్తం కాదు దేశం కోసం ప్రాణ త్యాగం చేసే సిక్కు రక్తం ఈ క్రింది పద్యంలో వివరించారు

మన యి శోభన రాత్రి కేమి ? భరతాంబాక్షోభ యిట్లుండగా
కునుకుంబట్టునె ! దేశ రక్షణమె నాకున్ మీకు గర్తవ్య - మీ
క్షణముందే తిలకంబు దిద్దెనను -- దీక్షన్ దాల్పుడీ జైత్రకే
తనమన్నట్టుగ నామె చూచె - సతులె తావుల్ కదా కీర్తికిన్ (వి.భా. శోభనం.పుట్ట.65)

త్యాగం - కర్తవ్య నిబద్ధత :

వ్యకిగత సుఖాల కంటే దేశ ప్రయోజనాలే ముఖ్యమని పై పద్యం ద్వారా తెలుస్తుంది. ఒక రకంగా సమాజం

సురక్షితంగా ఉండాలంటే అందులో పౌరులు తమ కర్తవ్యాన్ని ఎంతగా ప్రేమించాలో నేర్పుతుంది. దేశం కోసం బతుకడమే ఉత్తమైన సామాజిక విలువ.

అమృతకౌర్ తన భర్తను యుద్ధానికి పంపిస్తూ పలికే ధైర్య వచనాలుగా మనకు కనిపిస్తున్నాయి. దేశ సేవ కంటే వేరె దైవ ప్రార్థన ఏముంటుంది నేడు మీరు సైనికుడిగా గౌరవించబడటం కంటే నాకు కావలసింది ఏముంది మీవంటి వారికి భార్యనైనందుకు నాజన్మ సార్థకమైంది అని అమృత అనటం తమ సొంత ప్రయోజనాలు కన్నా దేశభక్తి ముఖ్యమని అర్థమవుతుంది.

దేశ సేవ చేయుట కంటె దేవతార్చ
నమ్మువేరేమి కలదు? భాగ్యముకాదె!
నేడిటుల సైనికునిగ మన్నింపబడుట
చాలు! నతినైతి మీకు , నా జన్మ పండె

(వి.భా.శోభనం. పుట్ట.71)

సామాన్యులకు అప్పుడప్పుడు విశ్రాంతి దొరుకు తుందేమో కానీ దేశాన్ని కాపాడే సైనికుడికి రేయిం బవళ్లు తేడా లేదు. అతనికి నిత్యం యుద్ధమే నెత్తిన నిప్పుల కుంపటి (కష్టాలు) ఉన్నా జాతి కోసం చల్లని నీడలా నిలబడే వాడే గొప్ప మనసున్న యోధుడు. మీకు దేవుడు తోడు ఉండుగాక యుద్ధంలో విజయ శంఖం పూరించేలా దీవించుగాక! జాతీయ కీర్తిని నిలబెట్టడానికి సంతోషంగా వెళ్ళిరండి అని ఆ ఇల్లాలు వీడ్కోలు పలుకుతోంది. ఇక చివరగా అమృతకౌర్ కళ్ళలో విజయకాంతులు కని పిన్నాయి. సముద్రపు అలలు ఉప్పొంగినట్లుగా శత్రువు ఎదురొచ్చినా వెన్నుచూపని ఆ సిక్కు వీరుడు (సింగు) సింహంలా యుద్ధానికి బయలు దేరాడు.

అమృత కౌరు చూపులందు జైత్రావళీ
వార్ధలుబుక నెదురువచ్చెనపుడు
ఎన్నడేని నాజి వెన్నుజూపని యట్టి
సింగు పయనమయ్యె సింగమటుల

(వి.భా. శోభనం, పుట - 74)

'దేశ సేవయే దైవ సేవ' అనే సూత్రాన్ని బల పరుస్తున్నాయి. ప్రతి వ్యక్తి విజయం వెనుక స్త్రీ ఉన్నట్లు 'రణసింగ్ కు' - 'అమృతకౌర్ ' కుడా అన్ని విషయాలకు తోడు నీడగా నిల్చింది.

లాల్ బహదుర్ శాస్త్రి మానవ విలువలు :

విజయభారతంలో ' నడచి వచ్చిన దేవుడు' అనే శీర్షిక గల పద్యాలు ఇవి ఒక వీర జవాను నాయకుడి ధైర్య సాహసాలను, దేశభక్తిని వర్ణిస్తున్నాయి.

రణధీర్ సింగ్ సైనిక ఆసుపత్రిలో శత్రువులతో పోరాడి తీవ్రంగా గాయపడిన ఒక వీర యోధుడు నిశ్శబ్దంగా పడుకొని ఉన్నాడు. ఒళ్ళంతా గాయాలైనా, ఆ నొప్పి తాలుకా బాధ అతని ముఖంలో రవ్వంతా కూడా కని పించడం లేదు. ఆయన అంతటి నిబ్బరంతో, ధైర్యంగా ఉన్నాడని కవి వర్ణన సాగింది. మదపుటేనుగుల వంటి నల్లని మేఘాలు అంటే శత్రు సమూహాలు చుట్టు ముట్టినా ఆ వీరుడి గుండె ఏ మాత్రం చెదర లేదు, భయపడలేదు. పైగా , అతని కళ్లలో దేశం కోసం పోరాడలనే ఒక గొప్ప ఆవేశం, అగ్ని జాలలు వలె ప్రకాశిస్తున్నాయి.

సైనిక వైద్యాలయమది
మౌనముగ బరుండె వీరమార్తాండుడు: బా
ధానల మావంతయును ము
ఖానం గనబడుద! అంత గాయంబైనన్
మదకరిబోలు నల్లని మబ్బుగములు
దట్టముగ క్రమ్ముకొన్నను దలకలేదు
వాని డెందమ్మునలు , ఘనజ్వాల లేవొ
వాని నేత్రాలలో నుండి బయలికురికె

(నడచి వచ్చిన దేవుడు : 1, 2 పుట)

రణసింగ్ శస్త్ర చికిత్స జరగటం అది విజయవంతం కావడంతో, స్వేచ్ఛా భారత భూమి ముఖంపై ఉదయ సూర్యుని కాంతి ప్రసరించినట్లుగా మరియు ఆ వీరుడు ప్రాణాలకు తెగించి పోరాడినపుడు భారత విజయ పతాకం ఆకాశాన్ని తాకింది. ఆ వీరుడు ఎలాగోలా మళ్ళీ ప్రాణం పోసుకుని శ్వాస పీల్చుకున్నాడు.

దేశం కోసం రక్తం చిందించిన వీరులను దేవుడుగా చూడాలనే సామాజిక దృక్పథాన్ని కవి ఇక్కడ చాటి చెప్పారు.

దేవుడు నెడివాడు దేవళంబును వీడి
నడచి వచ్చెనేము నరుడువోలె
అనెడిరీతి శాస్త్రి యడుగులూనుచురాగ
సింగు హృదయవార్ధి పొంగులెత్తె

(న.వ. దేవుడు పుట్ట : 14)

దేవుడు తన దేవాలయాన్ని వదిలిపెట్టి మనిషి రూపంలో నడచి వస్తున్నాడా అన్నట్లుగా శాస్త్రి గారు అడుగులు వేస్తుంటే అక్కడ ఉన్న రణసింగ్ (సైనికుడు) హృదయం సముద్రంలా ఉప్పొంగిపోయింది. ఒక దేశాధినేత స్వయంగా తన దగ్గరకు రావడం అతనికి దైవ దర్శనంలా అనిపించింది. శాస్త్రి గారు ఆ సైనికుడి ప్రక్కన నిలబడ్డారు. కుడిచేతికి దెబ్బ తగిలి ఉంది. ప్రధాని ఆ గాయాన్ని ఎంతో ప్రేమతో ఆత్మీయంగా తాకారు. ఆ స్పర్శ ఆ సైనికుడికి మంచులాంటి చల్లదనాన్ని ఒక పవిత్రమైన అనుభూతిని ఇచ్చింది. పూజించదగ్గ ఆ గొప్ప వ్యక్తి దర్శనం ఆ సైనికుడిని వెన్నెలలో ఓలలాడించినట్లు చేసింది. రణసింగ్ ఎప్పుడూ ఎవరి ముందు తలవంచ లేదు. కానీ తన ముందు నిలబడిన లాల్ బహుద్దుర్ శాస్త్రి గారి ప్రేమకు ముగ్ధుడై గౌరవంతో తలవంచాడు. గొప్ప నాయకుని విలువలు ఎలా ఉంటాయో ఇక్కడ గమనించవచ్చు.

ఆయన హృదయం ద్రవించింది దేశమే ప్రాణంగా బతుకుతున్న ఆ వీరుడు కన్నీరు కార్చడం చుడలేక, శాస్త్రి గారు, ఎంతో సున్నితంగా నవ్వుతూ అతని క్షేమ సమాచారాలను అడిగి తెలుసుకున్నారు ఒక తండ్రిలా అతనికి ధైర్యం చెప్పారు. ఆ సైనికుడు తన కుటుంబ పరిస్థితులు గురించి చెప్పగా శాస్త్రి గారు ఎంతో ఓపికగా విన్నారు. సిక్కు వీరుల త్యాగ నిరతని యుద్ధ రంగంలో వారికున్న చెరగని కీర్తిని గుర్తు చేస్తూ అతనికి గర్వకారణ మైన అనుభుతిని కలిగించారు. మానవత్వం -- నాయకత్వం -- అధికారం కేవలం ఆజ్ఞలే జారీ చేయడానికి మాత్రమే కాదు పాలకుడు ముఖ్యంగా సైనికులకు అందుబాటులో ఉండాలనే సామాజిక ధర్మాన్ని ఇవి బోధిస్తున్నాయి.

రణసింగ్ తో శాస్త్రి గారు జవాను ఓదారుస్తూ యుద్ధం అనేది ఒక సైనికుడి జీవితంలో నిత్యం జరిగే ప్రక్రియ ఎప్పుడూ సిద్ధంగా ఉండి చేతిలో ఆయుధాలు ధరించి యుద్ధ రంగంలో నిలబడాలి చావు వస్తుందో లేదో అని భయపడకూడదు వ్యక్తిగత సుఖాలకు ప్రాధాన్యత ఇవ్వకూడదు. మీ పోరాటంతో భరతమాత దాహం (విజయకాంక్ష) తీరుతుంది మీ పరాక్రమాన్ని ఎవరూ మారువలేరు. నీవు నీ బాధల గురించి చెప్పావు నేను విన్నాను, కానీ ఆకాశమంతటి ధైర్యం గల నీలాంటి వీరు లకు కన్నీళ్ళు తగదు. కొత్త పెళ్ళి కూతురుని వదిలి యుద్ధానికి వచ్చానని బాధపడుతున్నావా స్వదేశ రక్షణ అనే యజ్ఞంలో నీవు ఒక పవిత్రమైన పాత్రను నీవు పోషించావు నీవు చేసిన త్యాగం వల్ల భరతభూమికి ఎంతో కీర్తి లభిస్తుంది. తొలిరాత్రి తలచుకుని విచారించడం నీలాంటి వీరులకు యోగ్యముకాదు. శోభన ముహూర్తం (విజయం) ఈ రోజు, రేపోనీ ముంగిట ఉంటుంది. రేపు నీకు సంతానం కలిగి వారు కూడా నీలాగే తలపాగా ధరించి దేశం కోసం జీవించే గొప్ప వీరులుగా ఎదుగుతారు అంటు చక్కని పద్యం వర్ణనాత్మంగా సాగుతుంది.

తొలి రాత్రిన్ దలపోసి యిక్కరణి కుందుంజెంద మీ వంటివా
రలకున్ యోగ్యము కాదు - శోభన ముహూర్తం బిప్పుడో, రేపొ మీ
వలపున్ జేరువజేసి దీవనలిడున్ - పాపండు జన్నించి మీ
తలపాగా ధరియించి మించి యభిమర్ధంబందు జీవించెడిన్

(నడిచి వచ్చిన దేవుడు పుట్ట : 37)

దేశ భక్తి - కర్తవ్య నిష్ఠ - స్త్రీల త్యాగం - సమాజస్థితి, భావితరాలకు స్ఫూర్తి నాయకుడి ఓదార్పు వంటివి మన కళ్ళ ముందు ప్రత్యక్షంగా కనబడతాయి.

రణసింగ్ శాస్త్రి గారితో మాట్టాడుతూ అయ్యా నా కళ్ళలో వస్తున్న ఈ నీరు కేవలం శోభనం భంగం వల్లకాదు దేశ ప్రధాని ఇంతదూరం రావడం చూసి భావోద్వేగం ఇది. మీకు గౌరవ పూర్వకంగా లేచి వందనం చేయలేక పోతున్నాననే బాధతో నాకళ్ళు చెమర్చాయి అని సైనికుడు

తన నిస్సహాయతను వ్యక్తం చేశాడు. మహాత్మా ! నా ఈ కన్నీళ్లకు మరు ఏ పేరు పెట్టి పిలుచుకున్నా నాకు సమ్మతమే నామనస్సును మీకు భక్తితో అర్పించు కుంటున్నాను అని ఆ వీర జవాను ప్రధాని పట్ల తన కృతజ్ఞతను చాటాడు.

నాయి భాష్పాలకు మీ
రేయే పేరులను బెట్టి యొలుగిచ్చెదరో
మీ యిష్టము: మీకున్ మది
దోయిలి పట్టెదను భక్తితోడు మహాత్మా !

(విజయ భారతం, పుట - 70)

పై పద్యంలో భారతీయ సమాజంలో ఉన్న 'గౌరవ సంస్కృతిని ' ప్రతిబింబిస్తుంది. వ్యక్తిగత వైకల్యం - కంటే దేశ గౌరవం గొప్పదనే సామాజిక చైతన్యం ఇందులో కనిసిస్తుంది.

రణసింగ్ చూపిన దేశభక్తికి, ఆత్మ స్థైర్యానికి ప్రధాన మంత్రి శాస్త్రి గారితో సహా అక్కడున్న పెద్దలందరూ ముగ్ధ లయ్యారు. ఆ వీరుడి కళ్ళలో మెరిసిన కన్నీళ్లు కేవలం బాధకు సంకేతాలు కావు అవి శౌర్యంతో కూడిన కన్నీళ్ళు. ఆ పవిత్రమైన కన్నీటి చుక్కలు 'భరతమాత' మెడలో అలంకరించిన 'అణిముత్యాల' వంటివని కవి వర్ణించారు.

ఆ మెనగాని యౌన్నతికి నంజలి 'ప్రధాని' తో సహా
ప్రేమను ధార పోసిరట పెద్దలు - వీరుని కంటెలోని సౌ
దామను లెట్టివోయపుడు దర్శనమిచ్చె - తలంచి చూడశో
భామయ శౌర్య భాష్పములె భారత దేవికి అణి ముత్యముల్

(విజయ భారతం, పుట - 72)

శాస్త్రి గారు సైనికుడి పట్ల కృతజ్ఞతతో మనసు నిండానిండి వివేకంతో, దేశ ప్రధాని అక్కడి నుండి ముందుకు సాగారు. వెళ్ళే ముందు ఆ సైనికుడికి అవసరమైన సహయం లేదా ఆదేశాలను అక్కడి అధికారులకు జారీ చేశారు. రణసింగ్ తన మంచంపై నుండే ప్రధాని వెళ్ళున్న తీరును ఎంతో గౌరవంతో , ఆరాధనతో చూస్తూ ఉండిపోయాడు.

ఈ కావ్యం గొప్ప మానవీయ సందేశంతో ముగు స్తుంది. యుద్ధక్షేత్రంలో విజయం సాధించడం ఒక ఎత్తు అయితే, ఆ యుద్ధంలో గాయపడిన వారి గుండెల్లో ఆశలు నింపడం మరో ఎత్తు. 'నడచి వచ్చిన దేవుడు' అనే శీర్షకకు సార్థకత.

ఆ పురస్కారాన్ని అందుకున్న తర్వాత, ఆ వీరుడు తన భార్య ' అమృత ' సిగలో ' రణసింగ్ ' పూలను పెట్టాడు, అంటే ఆ గెలుపులో తన భార్య త్యాగం మరియు సహకారం కూడా ఉందని అతను గుర్తించి ఆ విజయాన్ని ఆమెకు అంకితం చేశాడు.

ఒక వ్యక్తి సాధించిన విజయం వెనుక అతని కుటుంబం, ముఖ్యంగా అతని భార్య సహకారం ఎంతో ఉంటుందని ఈ పద్యం విజయాన్ని పంచుకోవడం ద్వారా సమాజంలో కుటుంబ వ్యవస్థ పట్ల గౌరవం పెరుగు తుంది.

ఇక చివరిగా దేశాన్ని రక్షించే సైనికుడు తన విధిని నెరవేర్చి విజేతగా తిరిగి వచ్చి, తన కుటుంబాన్ని కలుసు కోవడం మరియు దేశ అత్యున్నత పురస్కారాన్ని అందు కోవడం ద్వారా 'విజయ భారతం' - సంపూర్ణ మయింది. ఇది ప్రతి భారతీయుడిలో దేశ భక్తిని, బాధ్యతను నింపుతూ ముగుస్తుంది.

క్లిష్ట పరిస్థితుల్లో కూడా మనిషికి దైవచింతన తోడుగా ఉంటుందని ఇది తెలుపుతు

సమయము రాత్రి తొమ్మిది - ప్రశాంతతో రణసింగు నేత్రయు
గ్మమునొకమారు మూసికొని మౌనముగా తన నమ్ముకొన్న గ్రం
థమును స్మరించువేళ - నెదో తాకెను చల్లగ చేతిమీద, నే
త్రములను విప్పి చూచె - మరలన్ పరికించెను సంశమాత్ముడై ....

(మహావీరచక్ర, పుట 5)

మిడిసి కప్పుకొన్న మెరుపు తీగయెకండు
నిలిచె కనులముందు తళుకులీని .....
జతను గట్టెనేవొ సంభ్రమాశ్చర్యాలు
తెరలుతీసెనేవొ తెలియకుండ (మహావీర చక్రి, పుట 6)

కళ్లు తెరిచి చూడగానే తన ముందు 'అమృతకౌర్' తన ముందు ఒక మెరుపు తీగలా మొరిసిపోతూ తన ఎదుర నిలబడి ఉంది. తన భార్యను చూడగానే అతనికి ఆశ్చర్యంతో మాట రాలేదు. ఆమె కళ్లలో కన్నీరు లేదు. తన భర్త దేశ సేవలో గాయపడటం ఒక తపస్సుగా ఆమె భావించింది. వ్యక్తిగత ప్రేమ కంటే జాతిహితమే (దేశ క్షేమమే) ముఖ్యమని ఆమె తన మనోధైర్యాన్ని ప్రదర్శించింది. సమాజంలో స్త్రీ శక్తికి ధైర్యానికి ఇది చక్కటి నిదర్శనం. పదవుల కంటే ఆడంబరాల కంటే మనిషి చేసే మంచిపనులు మాత్రమే శాశ్వతంగా నిలిచిపోతుందని రసరాజు పద్యాల ద్వారా ప్రబోధించారు.

సహచరినినంతగా ప్రశంసలను ముంచి
విలువలకు తావినిడె క్రొత్త పెండ్లి కొడుకు
నవ వధువు మెల్లగా నవ్వి ధవుని ప్రక్క
కూరుచుండి అల్లల్లన గొంతమీటె
(మహావీరచక్రి, పుట 10)

రణసింగ్, అమృతకౌర్ ఆదర్శవంతమైన దంపతుల మధ్య ఉండాల్సిన అనురాగాన్ని మరియు గౌరవాన్ని తెలియజేస్తుంది. పెళ్ళి కొడుకు తన భార్యను కేవలం అందం వల్ల కాకుండా, ఆమె గుణగణాలను మనసారా పొగుడుతున్నాడు.

నైతిక విలువలకు పట్టం కడుతూ ప్రవర్తిస్తున్నాడు. ఇక భార్య, భర్తల మధ్య ఆధిపత్య పోరులేదు. ఒక వ్యక్తి జీవితంలో ఎంతటి ఉన్నతమైన సంస్కారాన్ని కలిగి ఉండాలో బోధిస్తుంది.

ఆధార గ్రంథాలు :

1. రసరాజు - విజయభారతం
2. రసరాజు - రసకలశం
3. రసరాజు - ద్వారతోరణం

★★★

SRI A.S.N.M Govt. COLLEGE (A)

(NAAC Re-accredited With 'B+' Grade at 2.67 CGPA)
Palakol, West Godavari District – 534 260.

"తెలుగు సాహిత్యం -మహిళా చైతన్యం"

ఒక రోజు జాతీయ సదస్సు

మార్చి 24, 2026

నిర్వహణ

తెలుగు విభాగం

Registration Link & QR Code
https://forms.gle/DDcdy58gHHMRoZqD9

CHIEF PATRON
Dr. Narayana Bharat Gupta
Director, APCCE,
Mangalagiri, Guntur, A.P

PATRON
Dr. Ch. Krishna
Joint Director, APCCE,
Mangalagiri, Guntur, A.P

CO-PATRON
Dr. P. V. Krishnaji
RJDCE,Zone - I&II

SPECIAL INVITEE
Dr. Ch. Tulasi Mastanamma
Academic Guidance Officer,
CCE, A.P

PRESIDENT
Dr. T. Raja Rajeswari.,
M.Sc.,M.Phil.,PhD.,
Principal
Sri A.S.N.M GOVT.
COLLEGE(A),PALAKOL

Convener
Dr Busi Venkata Swamy
HOD, Dept. of Telugu

RESOURCE PERSON
Prof Darla Venkateswararao
Former HOD , Dept.of Telugu
Hyderabad Central University,
Hyderabad

RESOURCE PERSON
Acharya V. Shankara Rao
Director,
Oriental Research Institute, Head,
Department of Telugu
University of Madras

కళాశాల గురించి:

శ్రీ అడ్డేపల్లి సత్యనారాయణ మూర్తి ప్రభుత్వ కళాశాల 1968 సంవత్సరంలో స్థాపించబడింది. ఈ కళాశాలకు ప్రధాన దాత అయిన శ్రీ అడ్డేపల్లి సత్యనారాయణ మూర్తి గారి పేరు పెట్టబడింది. స్థాపన జరిగిన నాటి నుండి ఈ కళాశాల పాలకొల్లు పట్టణం మరియు పరిసర గ్రామాల విద్యార్థుల విద్యా అవసరాలను తీర్చుతూ, ముఖ్యంగా ఆర్థిక మరియు సామాజికంగా వెనుకబడిన వర్గాలకు చెందిన విద్యార్థులకు ఉన్నత విద్యావకాశాలను కల్పిస్తోంది.
ఈ కళాశాలలో అండర్ గ్రాడ్యుయేట్ (UG) మరియు పోస్ట్ గ్రాడ్యుయేట్ (PG) కోర్సులు అందుబాటులో ఉన్నాయి.

తెలుగు విభాగం గురించి

కళాశాల ప్రారంభమైన నాటినుండే తెలుగు విభాగం ప్రారంభమైంది.బిఏ,బి కామ్ ,బి యస్సీ కోర్సులలో తెలుగు జనరల్ సబ్జెక్ గాను బిఏ లో స్పెషల్ సబ్జెక్ట్ గాను కొనసాగుతుంది.మంచి అధ్యాపక బృందం ఈ విభాగంలో పని చేసి ఈ విభాగానికి వన్నె చేకూర్చారు.ప్రస్తుతం తెలుగు విభాగాధిపతిగా ఉత్తమ అధ్యాపక అవార్డ్ గ్రహీత డా బూసి వెంకటస్వామి పనిచేస్తున్నారు.

జాతీయ సదస్సు ఉద్దేశ్యం:

తెలుగు సాహిత్యంలో ప్రతిఫలించిన మహిళా చైతన్య భావనను సమగ్రంగా విశ్లేషించడం, మహిళా రచయితల సాహిత్య కృషిని గుర్తించి ప్రోత్సహించడం, అలాగే సాహిత్యం ద్వారా మహిళల హక్కులు, సమానత్వం, సాధికారతపై సామాజిక అవగాహనను పెంపొందించడమే ఈ జాతీయ సదస్సు యొక్క ముఖ్య ఉద్దేశ్యం.

లక్ష్యం:

తెలుగు సాహిత్యంలో మహిళా చైతన్యం ఎలా రూపుదిద్దుకున్నదీ, అది సమాజంలో మహిళల స్థితి, హక్కులు, స్వతంత్రతపై ఎలాంటి ప్రభావం చూపిందో విశ్లేషించడం ద్వారా మహిళా సాధికారత, లింగ సమానత్వం మరియు సామాజిక చైతన్యాన్ని పెంపొందించడమే ఈ జాతీయ సదస్సు యొక్క ప్రధాన లక్ష్యం.

PRINCIPAL'S MESSAGE

Dr. B.V Raghavayya
CPDC Secretary

Greetings ఔత్సాహిక విద్యార్థులందరికీ ఇంటర్మీడియట్ విద్యార్థులకు శుభాకాంక్షలు, పాలకొల్లులోని శ్రీ A.S.N.M ప్రభుత్వ కళాశాల (స్వయంప్రతిపత్తి) ఉన్నత విద్యకు నిబద్ధత మరియు శ్రేష్ఠతతో సేవ చేస్తోంది. మా సంస్థ నాణ్యమైన విద్య, అనుభవజ్ఞులైన అధ్యాపకులు, ఆధునిక ప్రయోగశాలలు మరియు విద్యార్థులకు అనుకూలమైన అభ్యాస వాతావరణాన్ని అందిస్తుంది. మా కళాశాలలో అందుబాటులో ఉన్న విద్యా వనరులు, నైపుణ్య అభివృద్ధి కోర్సులు మరియు కెరీర్ మార్గదర్శక అవకాశాలు ఉపయోగించుకుని మంచి ఉద్యోగాలు సాధించే దిసగా మేము విద్యార్థులను ప్రోత్సహిస్తున్నాము. మా సంస్థలో చేరి ఉజ్వల భవిష్యత్తును నిర్మించుకోవాలని నేను విద్యార్థులందరినీ ఆహ్వానిస్తున్నాను.

Dr. Tiruveedula Raja Rajeswari
M.Sc., M.Phil., Ph.D
Principal

CAMPUS FACILITIES

Digital Classrooms

Science Laboratories

Dept. of Library

Computer Laboratories

Skill Training- Micro Greens

NCC Activities

sriasnmgdc@gmail.com www.sriasnmgdcpalakol.ac.in

PROGRAMMES OFFERED

U.G Programmes

- B.Com (CA)
- B.Com (General)
- B.A (Economics)
- B.A (Political Science)
- B.Sc (Mathematics)
- B.Sc (Computer Science)
- B.Sc (Chemistry)
- B.Sc (Botany)
- B.Sc (Zoology)

P.G Programmes

- M.Sc (Aquaculture)
- M.A (Economics)
- M.Com

TRAINING IN SKILL DEVELOPMENT COURSES:

1. Soil Testing
2. Drone Pilot Training
3. Microgreens Cultivation
4. Fabric Bag Making • Creative Patch Work
5. Artificial Jewellery Making
6. Fashion Designing
7. Paper Plate Making
8. Tailoring Course
9. Embroidery Designing Course
10. Training in AI (Artificial Intelligence)

SPECIAL FEATURES

1. Experienced Faculty and Well-Equipped Laboratories
2. Scholarships & Fee Reimbursement
3. NCC (Naval Unit) & Placements
4. SWAYAM & MOOCs Courses
5. Career Guidance & Internships

Development Works

Drone training

Placement Cell

Skill Training

Embroidery

Eco-Club

Sports Competitions

Entrepreneurship



Play Ground

SRI A.S.N.M GOVERNMENT COLLEGE (AUTONOMOUS)

PALAKOL, WEST GODAVARI DISTRICT - 534260

(NAAC Re-accredited With 'B+' Grade at 2.67 CGPA)

ADMISSIONS OPEN

2026 - 2027

Free Registration in Office
Through OAMDC Portal



Dr. Tiruveedula Raja Rajeswari
M.Sc., M.Phil., Ph.D
PRINCIPAL

ADMISSIONS OPEN FREE REGISTRATION

In Office Through OAMDC PORTAL

Sri ASNM Govt. College (A)

Autonomus)

Palakol, West Godavari District, AP

ADMISSIONS OPEN 2026-27

"Dr. T. Raja Rajeswari M.Sc,M.Phil.,Ph.D
Principal

We are committed to providing quality education and holistic development for students.
Join us to build a brigt future."

Dr. T. Raja Rajeswari
Principal M.Sc,M.Phil.,Ph.D

Courses Offered

- B.Com (General)
- B.Com (Computer Applications)

B.A

- B.A (Economics)
- B.A (Political Science)

Admissions Through

OAMDC Portal under APSCHE

- Visit OAMDC Portal
- College Office for Assistance